VICTORY

విక్టరీ

శ్రీ బ్రహ్మ మహాపురాణం

(వచనం)

పురాణభారతి
ప్రచురణలు - 4

శ్రీ బ్రహ్మ మహాపురాణం

(వచనం)

వేదవ్యాస మహర్షికృతం

అనుసరణ
ఆవంచ సత్యనారాయణ

సౌజన్యం :

ఇమ్మడిశెట్టి అక్కేశ్వరరావు ఛారిటబుల్ ట్రస్ట్

డోర్ నెం. 11-16-32ఎ, సింగరాజువారి వీధి, కొత్తపేట,
విజయవాడ - 520001. ఫోన్ : 2565038.

విభజన చేసి వానికి పౌరుషేయ రూపాన్ని ఇచ్చాడు. భారతీయ జీవన విధానము, భక్తి మార్గం లేక కర్మయోగం మొదలైనవాని చక్కని సమన్వయం ఈ అష్టాదశ పురాణాలలోనే లభిస్తుంది.

ఇలాంటి అనేక విషయాలచేత పరిపుష్టమైన పురాణాలలో ఏమి ఉన్నదో తెలుసు కొనడం విద్యావంతులైనవారి అందరి కర్తవ్యం. అందుకే మేము అష్టాదశ పురాణాలను తేట తెలుగు వచనంలో అందరికి అందుబాటులోకి తీసుకొని రావాలని భావించాం. వీలైనంత వరకు క్లుప్తీకరణ లేకుండా మొత్తం పురాణాన్ని తెలుగు వచనంలో ఇవ్వాలని మా భావన. ముందుగా విషయంలో గహనమైనవైనా ఆకారంలో చిన్నవైన పురాణాలను తీసుకొని రావాలని మా సంకల్పం. ఇప్పటికే శ్రీకూర్మ, శ్రీ వామన, శ్రీ మత్స్య మహా పురాణాలు మొదటగా ఈ క్రమంలో వెలువడ్డాయి. ఇది నాల్గవదైన శ్రీబ్రహ్మ మహాపురాణం. తెలుగువారు ఈ పురాణాలను ఆదరించి, అష్టాదశ పురాణాలను అందరికి అందుబాటులోకి తెచ్చే అవకాశం కలిగించ వలసిందిగా ప్రార్థిస్తున్నాను.

కీర్తిశేషులైన మా అన్నగారు శ్రీ ఇమ్మడిశెట్టి అక్కేశ్వరరావుగారి పేరు మీదగల ధర్మ సంస్థ అక్కేశ్వరరావు ఛారిటబుల్ ట్రస్టు ద్వారా ఈ పురాణాలను వెలువరించడం నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ పురాణాలను ప్రచురించడం ద్వారా వారి ఆత్మకు సద్గతులను కల్పించాలని ఆ పరమేశ్వరుని ప్రార్థిస్తున్నాను.

తెలుగువారి ప్రతి ఇంటిని ఈ పురాణాలు అలంకరించాలని మా ఆకాంక్ష. అది నెరవేరగలదని భావిస్తూ .....

ఇట్లు

Lion. **ఇమ్మడిశెట్టి రామకుమార్** PMJF
మేనేజింగ్ ట్రస్టీ
ఇమ్మడిశెట్టి అక్కేశ్వరరావు ఛారిటబుల్ ట్రస్ట్
విజయవాడ.

విజయవాడ-1
తేదీ. 09. 02. 2007.

పురాణ పరిచయం

జియతిపరాశరసూనుః సత్యవతీ హృదయానందనో వ్యాసః
యస్యాస్య కమలకోశే వాఙ్మయ మమృతం జగత్ పిబతి

(వాయుపురాణం : 1-2)

సత్యవతీ హృదయానందకరుడు, పరాశర మహాముని కుమారుడు, తన ముఖమనే కమలంలో సమస్త వాఙ్మయామృతాన్ని దాచుకొని ప్రపంచం చేత త్రాగిస్తున్నవాడు అయిన వ్యాసునికి నమస్కారము అని ఎవనిచేత రచింపబడిందో ఆవాయు పురాణం ఆ మహానుభావునికి నతమస్తకం అవుతుండగా

అచతుర్వదనో బ్రహ్మో ద్విబాహు రపరోహరిః
అఫాలలోచనః శంభుర్భగవాన్ బాదరాయణః *(మహాభారతం-ఆదిపర్వం)*

నాలుగు ముఖాలు లేని బ్రహ్మ, రెండు చేతులతో ఉన్న విష్ణువు, ఫాలభాగంలో కన్నులేని శివుడు బాదరాయణ వ్యాసుడని, తన జన్మకు కారణభూతుడైన కృష్ణ ద్వైపాయనునికి ప్రణతులర్పిస్తున్నది మహాభారతం.

అలాంటి వ్యాసమహాముని చేతిలో అష్టాదశ (18) పురాణాలు రూపు దాల్చాయని భారతీయుల విశ్వాసం. పురాణ శ్రవణం బహుకాలంగా ఈ దేశంలో సంప్రదాయమనే నదికి కాలువలు తీస్తున్నదే. అందుకే

యథా పాపాని పూయంతే గంగావారి విగాహనాత్
తథా పురాణ శ్రవణాద్ దురితానాం వినాశనమ్

(వామనపురాణం - 95-86)

గంగానదిలో స్నానం చేయటం చేత పాపాలు నశిస్తాయి. అలాగే పురాణ శ్రవణం చేత కష్టాలు దూరం అవుతాయి అని భారతీయుల నమ్మకం.

పురాణాల ప్రాముఖ్యత

భారతీయ సంస్కృతికి అవిచ్ఛిన్నంగా కొన్నివేల సంవత్సరాల నుంచి మూలాధారాలుగా నిలుస్తున్నవి వేదాలు. ఎన్ని విదేశీ దండయాత్రలు జరిగినా, ఎన్ని సాంస్కృతిక దౌష్ట్యాలు చోటు చేసుకొన్నా మన సనాతన ఆర్షసంస్కృతి ఈనాటికీ నిలిచి ఉన్నది అంటే అందుకు కారణం వేదాలేనని చెప్పుకోవాలి. ఈ వేదాల యెడల మనకు గల భక్తి గౌరవాల కారణంగానే మనం ఐహిక సుఖాలనే కాకుండా ఆముష్మిక ఉన్నతికి మార్గాలు వేసుకోగలుగుతున్నాము. వేదాల ద్వారానే మనం జీవితంలో తప్పకుండా ఆచరించవలసిన కర్తవ్యాలను, విధులను తెలుసుకొని ఆచరించగలుగుతున్నాము. 'పుమాన్ పుమాంసం పరిపాతు విశ్వతః -అనే వేదమంత్రం ఒక మనిషి తన తోటిమనిషికి సహాయం చేసి దాని ద్వారా తన జన్మను సఫలం చేసుకోమని బోధిస్తున్నది. అలాగే "మిత్రస్యాహం చక్షుషా సర్వాణి భూతాని" అనే మంత్రం సమస్త ప్రాణులను మిత్రభావంతో చూడాలని నిర్దేశిస్తున్నది. 'కృణ్మో బ్రహ్మవో గృహే సంజ్ఞానాం పురుషేభ్యః' అనే మంత్రం - ఓ ప్రజలారా మనమందరం కలసి మానవులలో సద్భావం కొరకు, సద్భావనకోసం దైవాన్ని ప్రార్థిద్దామనే కర్తవ్యాన్ని బోధిస్తున్నది. ఇలా మానవుడు తన జన్మను సార్థకం చేసుకోవడానికి వేదాలు సన్మార్గాన్ని ఉపదేశిస్తున్నాయి, కర్తవ్యాన్ని ప్రబోధిస్తున్నాయి. వేదాలలో చెప్పబడిన అంశాలు చాలా వరకు నిగూఢంగా ఉంటాయి. సామాన్యునికి కూడా అర్థం అయ్యే విధంగా ఉపదేశం చేయడానికి పురాణాలు ఉద్భవించాయి. అందుకే ఋగ్యజుస్సామ అథర్వణ వేదాలనేవి నాలుగైతే, ఆ వేదాలతో సమానంగా 'పురాణం పంచమోవేదః' అని అయిదవ వేదంగా కీర్తించబడుతున్నది. భారతీయ సంస్కృతియొక్క స్వరూప స్వభావాలను సమగ్రంగా తెలుసుకోవాలంటే పురాణ అధ్యయనం చాలా ముఖ్యం. పురాణాలు భారతీయ సంస్కృతికి కొలదండాలవంటివి. ఆ పురాణాల మీద ఆధారపడే, ఆధునిక భారతీయ సమాజం తన నీతి నియమాలను నిర్దేశించుకొంటున్నది. పురాణాల్లో లేని విషయాలు ఏమీ లేవు. దేవతలు, ఋషుల వృత్తాంతాలు, సదాచారాలు, పదునాలుగు విద్యలు, మానవ కర్తవ్యాలు అన్నింటిని తనలో ఇముడ్చుకున్న ఈ పురాణ ప్రక్రియయే ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించు కొన్నది. అందుకే పురాణాలను గురించి కొంతైనా తెలుసుకొనటం ప్రతి భారతీయునికి అవశ్యకర్తవ్యం. భారతీయఇతిహాస దృష్టితో చూస్తే పురాణాలకు మహత్తరమైన స్థానం ఉన్నది. ప్రతి హిందువుకు పురాణ అధ్యయనం ఏదో విధంగా అనివార్యం అవుతున్నది. అందుకే భారతీయులపై పురాణ సాహిత్యం నెరిపినంత గాఢ ప్రభావం మరి ఏ సాహిత్యం చూపలేకపోయింది.

పురాణం అంటే ఏమిటి?

'పురాణ' శబ్దం యొక్క వ్యుత్పత్తి పాణిని అష్టాధ్యాయిలోను, యాస్కుని నిరుక్తంలోను, పురాణాలలో కూడా కనిపిస్తుంది. పాణిని చెప్పిన ప్రకారం 'పురాభవమ్' (ప్రాచీనకాలంలో జరిగినది) అనే అర్థంలో 'సాయంచిరం పాహ్ణే ప్రగే అవ్యయే భ్యష్టచ్ట్యుట్చ్యు లౌతృట్చ' (4-3-23) అనే సూత్రం ద్వారా 'పురా' శబ్దానికి 'టుచ్' ప్రత్యయంచేరి, తరువాత దానిపై 'తుట్ 'ఆగమంగా వచ్చినందువలన పురాతన శబ్దం ఏర్పడుతుంది. ఇంతేకాకుండా పాణిని రచించిన "పూర్వకాలైక సర్వజరత్పురాణనవకేవలాః సమానాధి కరణేన" (2-1-49), "పురాప్రోక్తేషు బ్రాహ్మణ కల్పేషు" (4-3-105)అనే ఇంకో రెండు సూత్రాలలో పురాణశబ్దాన్ని ఉపయోగించాడు. యాస్కుని నిరుక్తం ప్రకారం 'పురాణం' పురానవం భవతి (3-4-19) అనే ఇంకో రెండుసూత్రాలలో పురాణ శబ్దాన్ని నిర్వచించాడు. అంటే ప్రాచీనమైనదైనా క్రొత్తదిగా ఉండేదానిని 'పురాణం' అంటారని భావం. వాయు పురాణంలో 'పురాఅనతి' అని పురాణానికి వ్యుత్పత్తి చెప్పబడింది. అంటే ప్రాచీన కాలంలో జీవించి ఉన్నదానిని పురాణం అంటారు అని బ్రహ్మాండపురాణం (1-1-1-173) 'పురా ఏతద్ అభూత్' అంటే ప్రాచీన కాలంలో ఈ విధంగా జరిగింది అనే దానిని తెలియజేసే శాస్త్రమే పురాణం అని వివరిస్తున్నది. ఈ వ్యుత్పత్తులను పరిశీలిస్తే, పురాణం అనేది ప్రాచీన కాలానికి సంబంధించిందని తెలుస్తుంది. ఆర్యజాతి యొక్క వైదిక సాహిత్యానికి చెందిన జ్ఞానానికి, విజ్ఞానానికి అక్షయ నిధి పురాణం, ఇప్పటివరకు ప్రపంచంలో జ్ఞానులు, శాస్త్రవేత్తలు చెప్పిన విషయాలన్నీ పురాణాలలో ఉన్నాయని (కొందరి) భావన. మొత్తంమీద ప్రాచీన కాలంలో జరిగిన విషయాలను ఇప్పుడు జరుగుతున్నవానివలె ధర్మోపదేశకంగా తెలిపేవి పురాణాలు అని చెప్పవచ్చు.

పురాణాల పాత్ర ఏమిటి ?

పురాణం అంటేనే ప్రాచీనమైనదని అర్థం. సృష్టికి ప్రారంభంలో జ్ఞానరాశి సామాన్య శబ్దాలలోను, వాక్యాలలోను, చెప్పటానికి వీలుకాని సమయంలో పురాణాలను దేవతలు సేకరించారు. ఆ ప్రాచీన కాలపు ఆలోచనాధార, భావనాధార, జ్ఞానధారలు విస్తారంగా పురాణాలను కూర్చటంలో ప్రతిఫలించింది. దీనివలన వేదార్థాన్ని సరియైన పద్ధతిలో, సరిగా అవగాహన చేసుకొనే వీలుకలిగింది. అదే 'పురాణ ఉపబృంహకత' అని పిలువబడింది. ఈ విధంగా భారతీయ సంస్కృతి సనాతన ధర్మాలలోని తులలేని రత్నాలు పురాణాలలో పొదగబడ్డాయి. వానిని సూక్ష్మంగా, తులనాత్మకంగా పరిశీలించి అవగాహన చేసుకొనకపోతే వేదార్థం సరియైన పద్ధతిలో అవగాహనకాదు. ఈ విశ్వంలో పరమాత్ముడు ఒకడే. అయితే ఆయా స్థలాలలో, ఆయా పురాణ ఖండాలలో వివిధ దేవ

తల ఉపాసనను తెలిపిన కథలలో దేవతలు, ఋషులు, తపస్వులు, మునులు, విప్రులు, పర్వతాలు, సముద్రాలు, తీర్థాలు, వృక్షాలు, పశుపక్ష్యాదులు – అన్నీ ఆ విషయాన్ని ప్రతిపాదించేవిగానే పురాణాల్లో చెప్పబడ్డాయి. అన్నీ కూడా పరమాత్ముని దివ్య చైతన్య స్ఫూర్తిని ఒకదానికి ఒకటి సహకారకంగా వివరించేవే. ఈ విధంగా సమగ్ర జీవన విధా నంలో సమగ్ర బ్రహ్మాండ విషయాలలో, భావనలో ఒకే ఒక పరమాత్ముని సాక్షాత్కారం చేసుకొనే విధానాన్నే పురాణాలు ప్రతిపాదించాయి. అందుకు అవసరమైనంత సమర్థవంతంగా రూపుదిద్దుకున్నాయి. ఈ విషయాలనే పురాణ విద్య అన్నారు. అది మహర్షులకు సర్వ స్వంగా నిలిచింది. ఎన్ని రకాలైన దరిద్రాలకు భారతదేశం గురి అయినా, ఆ నిధే తర తరాలుగా ఈ దేశ సాంస్కృతిక వైభవాన్ని నిలబెట్టింది. ఇదే చరిత్రలో పురాణాలు నిర్వ హించిన పాత్ర.

పురాణాలు - జయము అనే పేరు

నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్
దేవీం సరస్వతీం వ్యాసంతతో జయ ముదీరయేత్

అని మహాభారతము చెప్పుతున్నది. అందుచేత మహాభారతానికి జయము అనే పేరు ఉన్నట్లు తెలుస్తున్నది. 'జ' అంటే సంస్కృత సంఖ్యా పరిగణనాన్ని బట్టి 8. 'య' అంటే 1 అనగా 81.

'అంకానాం వామతో గతిః' అనే నుడిని బట్టి ఇది 18 అవుతుంది. 18 పర్వాలు గలది, 18 అధ్యాయాల భగవద్గీత కలది, 18 రోజుల కురుక్షేత్ర సంగ్రామం గలది, యుద్ధంలో పాల్గొన్న 18 అక్షౌహిణుల సైన్యం గలది, మహాభారతం – అందుకే ఆ మహాగ్రంథం 'జయం'.

అలాగే పురాణాలకు కూడా 'జయము' అనే పేరున్నది. అసలు పవిత్రమైన హిందూ గ్రంథాలకు 'జయము' అనే పేరు ఉన్నట్లున్నది. చూడండి.

అష్టాదశ పురాణాని రామస్య చరిత్రం తథా
కార్ష్ణం వేదం పంచమం, యన్మహా భారతం విదుః
తథైవ విష్ణు ధర్మాశ్చ, శివధర్మాశ్చ శాశ్వతాః
జయేతి నామతేషాం, చ ప్రవదంతి మనీషిణః – భవిష్యత్పురాణం.

అని అష్టాదశ పురాణాలకు, రామాయణానికి, మహాభారతానికి, విష్ణుపురాణం, శివధర్మ పురాణం, శారీరక సూత్ర భాష్యాలకు జయం అనే పేరు ఉన్నదని తెలుస్తున్నది.

జయం జయత్యనేన సంసారమితి జయో గ్రంథః

ధర్మార్థ కామమోక్ష ప్రతిపాదకమై సంసార జయమునకు అనగా ఈ లోకము నందు విజయము పొందుటకు సాధకములైన గ్రంథాలను జయము అంటారని తెలుస్తున్నది.

పురాణాల ఆవిర్భావం

పురాణాలు ఎలా ఆవిర్భవించాయి అనే విషయాన్ని గురించి ప్రాచీన వాఙ్మయంలో అనేక విషయాలు చెప్పబడ్డాయి. పురాణాల ఆవిర్భావంలో రెండు ధారలు కన్పిస్తాయి. 1. వ్యాసునికి పూర్వపు సంప్రదాయం 2. వ్యాసోత్తర సంప్రదాయం. వ్యాసునికి ముందు 'పురాణం' అనే పదానికి లోకంలో బాగా ప్రచారంలో ఉండి, అవ్యవస్థితంగా ఇక్కడ అక్కడా చెల్లాచెదురుగా ఉన్న లోకవృత్తాత్మకమైన విద్య అని మాత్రమే అర్థం. దీనికి ప్రమాణంగా ప్రాచీన గ్రంథాలలో 'పురాణము' అని ఉన్నదేగానీ, పురాణ సంహిత అని లేక పోవడమే. అంటే దీనివలన ఏదీ గ్రంథంగా గాక విద్యావిశేషమనే దానిని భావించాలి.

పురాణాల తత్వాన్ని గురించి స్కాందపురాణంలోని రేవాఖండంలోను, పద్మ పురాణం (సృష్టిఖండం), మత్స్యపురాణంలోను 'కల్పాంతరంలో పురాణం ఒకటిగానే ఉండేదని, అది త్రివర్ణాలైన ధర్మ అర్థ కామాలకు సాధనంగా ఉండేదని, అది చాలా పెద్దగా శతకోటి శ్లోక విస్తారంగా ఉండేదని, ఆ పురాణం దేవలోకంలో ఉండేదని, కాలాంతరంలో క్షీణబుద్ధు లైన మానవులు దానిని గ్రహించలేనందువలన, శ్రీమహావిష్ణువు మానవుల క్షేమం కోసం దానని నాలుగు లక్షల శ్లోకాలకు వ్యాసునిగా అవతరించి పరిమితం చేశాడని చెప్తున్నాయి. అందువలన మనుష్యలోకంలో పురాణాలు చతుర్లక్ష శ్లోకాలకు పరిమితం అయింది. ఆ చతుర్లక్ష శ్లోకాలనే 18 పురాణాలుగా వేదవ్యాసుడు చేశాడు. అవే ఈనాడు లభ్యం అవు తున్నాయని ఆ పురాణాలు ఘోషిస్తున్నాయి. కొందరు ఇది చతుర్లక్షాత్మకమైన ఒకే పురా ణంగా ఉండేదని దానినే బ్రహ్మాండ పురాణమని పిలిచేవారని అదే 18 విభాగాలుగా చేయబడిందని తెలుపు తున్నారు. ఏదైనా ఈ 18 పురాణాలను వేదవ్యాసుడు రచించాడని ఈ యుగంలో భావించడం సరియైనదే.

ఒకానొక కాలంలో ఒకటే పురాణం ఉండేదా ?

పురాణ వాఙ్మయం విస్తృతంగా పెరిగి నాలుగు లక్షల శ్లోకాల పరిమితికి చేరిన నేడు ఈ విషయాన్ని నిర్ధారించటానికి అంతగా అవకాశంలేదుగానీ పండితులు అనేకులు 'ఆరంభంలో పద్దెనిమిది కాదని తెలుపుతున్నారు. మొదట శ్లోకాత్మకమైన పురాణం ఒకటే ఉన్నట్లు అది క్రమంగా వేదోపబృంహణం చేయటం అనే అంశం ఆధారంగా క్రమంగా

పెరిగినట్లుగా, దాని గ్రంథసంఖ్య మొదట కొద్దిగా ఉండి తరువాత పెరుగుతూ పోయి, వేఱువేఱు కాలాలలో పెరిగిన కూర్పులు బయలు దేఱినట్లుగా చెప్పటానికి పురాణాలలోనే కొన్ని సూచనలు ఉన్నాయని తెలుపుతున్నారు.

జాక్సన్ అనే ఐరోపీయ పరిశోధకుడు "వైదికయుగం చివరి భాగం నుంచి క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దం వరకు ఇతిహాసాలకు అనుబంధంగా పురాణం ఒకటి ఉండినట్లుగా అందులో సర్గము, ప్రతి సర్గము, వంశము, వంశాను చరితము, మన్వంతరమ అనేవి వర్ణీకరింపబడినట్లు హిందువుల వ్రాతలవలననే తెలియవస్తున్నది. స్టీఫెన్ కాలం వఱకు వేఱువేఱు మఠాలలో వ్రాయబడుతూ వచ్చిన శాక్టన్ వృత్తాంతా (శాక్టన్ క్రానికల్)ల వంటివే ఈ పురాణాలు. నార్మనుల దండయాత్ర తరువాత పరస్పర సంబంధంలేని భాగాలు ఆ వృత్తాంతంలో చేరిపోతూ వచ్చినట్లే హిందూ సామ్రాజ్య కేంద్ర ప్రభుత్వం అంతరించిన పిదప పండిత సమావేశాలు అంతకుపూర్వం కంటే కష్టతరమైనా అప్పటి నుంచి ఆయా పుణ్యక్షేత్రాలలోని పండితులు తమ దగ్గరగల శ్లోకాత్మకమైన మూలపురాణ ప్రతులలో అక్కడక్కడా మార్చటం, కొన్నిచోట్ల స్థానిక విషయాలను చేర్చి గ్రంథాన్ని పెంచడం సంభవించి ఉండాలి. మూల గ్రంథమైన ఆది పురాణం నుంచి ఈ విధంగా బ్రహ్మపురాణం ఒరిస్సాలోను, పద్మపురాణం పుష్కర క్షేత్రంలోను, అగ్నిపురాణం గయలోను, వరాహపురాణం మధురలోను, వామన పురాణం స్థానేశ్వరంలోను, కూర్మపురాణం వారణాసిలోను, మత్స్యపురాణం నర్మదా ప్రాంతంలోను పుట్టాయి" అని వ్రాశాడు.

మూలపురాణంలోని శ్లోకాలు ఎన్ని?

దేశకాలాలను బట్టి పురాణాలు చాలా మార్పులను పొందాయి. ఇప్పుడు స్పష్టంగా ఆ మూల పురాణ రూపాన్ని కనుక్కోలేకపోయినా కొన్ని ఆధారాలనుబట్టి ఒకపాటి నిర్ణయానికి రావచ్చు. భవిష్యత్పురాణంలోని "సర్వాఙ్యేవ పురాణాని సంజ్ఞేయాని నరర్షభద్వాదశైవ సహస్రాణి ప్రోక్తానాం మనీషిభిః" అనే శ్లోకంవలన పురాణాలు అన్నీ కలిపి మొదట 12,000 శ్లోకాలకు పరిమితమేనని తెలుస్తున్నది. అలాగే 'పునర్వృద్ధింగతా నీహ ఆఖ్యానైర్వివిధైర్నృప, యథాస్కాందంతథాభేదం భవిష్యం కురునందన" (ఓ రాజోత్తమా పురాణాలు అన్నీ కలిపి మొదట 12,000 గ్రంథంగా ఉండేది. కాల క్రమంలో అనేక వ్యాఖ్యానాలు చేరి అది వృద్ధి చెందింది అని చెప్తూ, ఇంకా స్కాందం శత సహస్రంతు లోకానాం జ్ఞాతమేవహి, భవిష్యమేతదృషిణా లక్షార్ధ సంఖ్యయాకృతం' స్కాందం లక్షగ్రంథాల పరిమాణం భవిష్య పురాణం యాభైవేల గ్రంథంగా పెరిగిందని లోకులందరికీ తెలుసు అని తెలుపుతున్నది.

మొదటలో ఉన్న ఆది పురాణం పేరు ఏమిటి?

ఒక్క పురాణం నుంచి పెక్కు పురాణాలు పుట్టాయనటానికి విష్ణుపురాణమే ఒక దృష్టాంతము. విష్ణు పురాణం పురాణాలకే ఆదర్శమైనదని, పురాణాలలో పురాతనమైనదని పరిశోధకుల భావన. కానీ ఈ విష్ణుపురాణం కూడా స్వతంత్రం కాదు, ఒకప్పుడిది బ్రహ్మాండపురాణం అనే సర్వసమగ్ర పురాణం యొక్క భాగంగా ఉండేది. తరువాత కాలంలో దాని నుంచి చీలి, స్వతంత్ర పురాణం అయింది. 16వ శతాబ్దంవాడైన వెన్నెల కంటి సూరన విష్ణుపురాణాన్ని తెలుగులోకి అనువదించాడు. అందులో షష్ఠ్యంతాలైన తరువాత "అభ్యుదయ పరంపరాభివృద్ధిగా నా యొనర్పంబూనిన బ్రహ్మాండపురాణంబు నందలి పరాశరసంహితయైన శ్రీవిష్ణుపురాణంబునకు కథాక్రమంబెట్టిదనిన' అని చెప్పాడు. ఇంతేకాక ప్రతి అశ్వాసం చివర గద్యలోను ఇలాగే వ్రాశాడు. దీనిని బట్టి 16వ శతాబ్దంలోని సంస్కృత విష్ణుపురాణ ప్రతిలో అది బ్రహ్మాండపురాణంలోని పరాశర సంహిత అనబడే భాగమని వ్రాసి ఉండాలని నిశ్చయంగా తెలుసుకొనవచ్చు. అయితే ఎందుకు ఈ విషయం ప్రస్తుత ముద్రిత సంస్కృత విష్ణు పురాణంలో చెప్పబడలేదంటే ఇది స్వతంత్ర పురాణం కాక ఒక మహాపురాణంలోని భాగం అంటే దాని గౌరవం తగ్గిపోతుందనే భయం వలన కావచ్చును. ఇటీవలివారు సంస్కృత లిఖిత ప్రతులు వ్రాసుకొనే సమయంలో ఈ మాటను ఎత్తివేసి ఉండవచ్చు. అయితే కొన్నింటిలో మాత్రం పరాశర సంహిత అని ఉన్నది.

అయితే 11వ శతాబ్దంనాటి ఆల్‌బెరూనీ అనే పండితుడు భారతదేశం వచ్చి మన గ్రంథాలను కొంత పరిశీలించటం జరిగింది. ఆయన ఇచ్చిన పురాణాల పట్టికలో విష్ణుపురాణం, బ్రహ్మాండ పురాణాలు వేర్వేరుగా పేర్కొనబడ్డాయి. అందువలన పదకొండవ శతాబ్దానికి ముందే బ్రహ్మాండపురాణం నుంచి విష్ణుపురాణం విడిపోయిందన్నమాట. భారతదేశంలో వైష్ణవమతం బాగా ప్రచారంలోకి వచ్చిన తరువాత విష్ణుపురాణం బ్రహ్మాండపురాణ భాగమని పేర్కొనడం ఆగిపోయి ఉండవచ్చు.

మొత్తంమీద మొదట బ్రహ్మాండమనే పురాణం ఒకటే ఉండేదని, అది అనేక సంహితలుగా ఉండేదని, విష్ణుపురాణం ఆ సంహితలలో ఒకటని చెప్పవచ్చు.

ఇక వాయుపురాణాన్ని పరిశీలించగా అందరు పండితులు వాయుపురాణాన్ని ప్రాచీన పురాణంగా అంగీకరిస్తున్నారు. ఇది హర్షచరిత్రంలోను, బాణుని కాదంబరిలోను పేర్కొనబడింది. ప్రస్తుతం బ్రహ్మాండపురాణంగా ముద్రితం అయిన గ్రంథంలో దాదాపు రెండువంతులు అంటే పరశురామ సర్గ వృత్తాంతము, లలితోపాఖ్యానం తప్ప మిగిలిన భాగం 78 అధ్యాయాలు, శ్లోకాలతో సహా మారకుండా వాయుపురాణంలో యథాశ్లోకంగా ఉన్నాయి. కాబట్టి వాయుపురాణం అసలు వాయుపురాణం కాదని గయాక్షేత్రమాహాత్మ్యం

కూడా కలిసి ఉన్న బ్రహ్మాండపురాణంలోని ఒక భాగమని భావించవచ్చు. అనగా బ్రహ్మాండపురాణంలోని వాయు సంహితను వాయు పురాణంగా పరివర్థితం చేసి ఉండ వచ్చుని భావించటంలో ఎలాంటి అసంగతము ఉండదు. ఇందుకు బలంగా నారదపురాణంలోని ఒక కథలో దీనికి సూచన ఉన్నది. అందులో "నాలుగు పాదాలతోను బ్రహ్మాండపురాణాన్ని వర్ణించి ఉన్నాను. ఇది పదునెనిమిదవది, అనుపమానమైనది. సారాతీతమైనది. బ్రహ్మాండపురాణం నుండి పారాశర్యమహాముని దీనినే అందరికీ పదెనెనిమిది విధాలుగా చెప్పి ఉన్నాడు. ఆ మహాముని నావలన పురాణాలను విని, మననముచేసికొని ధర్మశీలురును, దీనానుగ్రహకరులైన మునులకు తెలియచెప్పి వానిని లోకమున వ్యాపింపచేసెను. (నారదపురాణం 100-29-35) అని చెప్పబడింది.

దీనినిబట్టి బ్రహ్మాండపురాణమే అన్ని పురాణాలకు మూలాధారమని ఒక పురాణ గాథ ఉన్నట్లు తెలుస్తున్నదిగదా. ఇంకొక ఆధారం మన భారతీయ హిందువులు క్రీ.శ. 5వ శతాబ్దానికంటే ముందే బలిద్వీపానికి వలస పోయారు. వెళ్లేటప్పుడు వారు తమతో తమ గ్రంథాలను కూడా కొన్నింటిని తీసుకొని వెళ్ళారు. అవి ఆ దేశ భాష అయిన 'కవి' భాషలోనికి అనువదించబడ్డాయి. ఆ గ్రంథాలలో సంస్కృతమూలాలతో సహా ఋగ్వ జుస్సామఅధర్వవేదాలు, రామాయణ మహాభారతములు కూడా ఉన్నాయి. పురాణాలలో ఆ బలిద్వీపవాసులు ఒక్క బ్రహ్మాండాన్నే గానీ, మిగిలిన వాటిపేర్లను కూడా ఎరగరు. అంటే మిగిలిన వాటి పేర్లను కూడా తెలియనంతగా ఉన్నారంటే ఆనాటికి ఒక్క పురాణమే ఉండేదని భావించవచ్చుగదా. పైగా బలిద్వీపంలో ఒకతెగ శైవులు ఉన్నారు. .వారు బ్రహ్మాండపురాణన్నే తమ పురాణంగా అంగీకరిస్తారు. అందువలన హిందువులు వలస పోయినప్పుడు ఒకటే పురాణం ఉండేదని భావించవచ్చు. అలాగే నేటి బ్రహ్మ పురా ణంలో చాలా భాగాలు మక్కికి మక్కి విష్ణుపురాణంలోని భాగాలే భాగవతంలోని కథలు అన్నీ విష్ణుపురాణాన్ని అనుసరించి వ్రాయబడినవే. అలాగే అనేక పురాణాలలో ఉన్న శ్రాద్ధకల్ప విషయాలు దాదాపు ఏకరీతిగా ఉన్నాయి. అందువలన మొత్తంమీద క్రీస్తుశకం మూడు నాలుగు శతాబ్దాల వరకు పురాణం అనే పేరుతో ఒకే గ్రంథం ఉండేదని, దానికే అప్పుడుకానీ, అటుతరువాత కానీ బ్రహ్మాండపురాణం అనే పేరుండేదని దానిలో పన్నెండు వేల శ్లోకాలకంటే ఎక్కువగా ఉండేవి కావని, ఆ పురాణంలోని భాగాలు క్రమంగా దాని నుంచే వేరుపడి ప్రత్యేక పురాణాలు అయినాయని, ఈ విధంగా తఱిగి పోవటం వలన మూల పురాణం క్రమంగా సన్నగిల్లి, కేవలం పేరుకు మాత్రం మిగిలిందని, మూల పురాణ భాగాలన్నింటిలోకి గొప్పవి, మొట్టమొదట చీలిపోయినవి విష్ణు వాయు పురాణాలు కావచ్చునని, కొంతకాలం వరకు ఏయే భాగాలు ఏయే మూల గ్రంథ భాగాలో తెలుప

బడుతూ ఉండేవని, కాని క్రమంగా మతము మీది అభిమానము ఎక్కువైన కొద్దీ గౌరవ భంగం అని తలచి కావచ్చు మూలగ్రంథపు పేరును జారవిడిచి స్వతంత్రాలైన ప్రత్యేక పురాణాలుగా వాటిని ప్రకటించడం మొదలైందని నిర్ణయించవచ్చు.

పురాణం లౌకిక శాస్త్రం. ఇది వేదం కంటే భిన్నమైనది. కానీ వేదానికి అనుకూల మైనట్టిది. ఇదే వేదోపబృంహణం. ఇది ఎప్పుడూ స్థిర రూపాన్ని కలిగి ఉండదు. ఇది కాలాన్ని అనుసరించి, పరివర్తన శీలకమైనట్టిది. కాల ప్రభావంచేత మార్పులను పొందుతుం టుంది. అందుకే తంత్రవార్తికమనే గ్రంథం వేదం అకృత్రిమమైనదని, పురాణం కృత్రిమ మైనదని చెప్తున్నది. అందుకే నిరుక్తం 'పురాపి నవం భవతి' పాతది అయినా కొత్తగానే ఉంటుంది అని చెప్పింది. అంటే కాలాంతరం ఉత్పన్నమయ్యే మార్పులను పురాణం తనలో లీనం చేసుకొంటుందని దీని భావం.

వేదాలు పురాణాలను గురించి ఏమి అంటున్నాయి?

వైదిక కాలం నుంచి నేటివరకు వేదాలకు పురాణాలకు గల సంబంధం రక రకాలుగా వ్యక్తపరచబడింది. వేద పురాణాలు రెండూ ఒకరకంగా అవినాభావ సంబంధం గలవే, భారతీయతత్త్వం ప్రకారం వేదాలు అపౌరుషేయాలు అంటే మానవులు ఎవరూ వాటిని వ్రాయలేదు. భగవంతుడు వాటిని రచించలేదు. అవి నిత్యాలు, అనాదులు అని భారతీయుల విశ్వాసం. ప్రాచీనులు శబ్దాన్ని ధ్వనిని వేరువేరుగా భావించారు. వేద ధ్వని నిత్యం (వాచా విరూప నిత్యయా - ఋగ్వేదం-8-75-6) అంటే ఉచ్చరించటం చేతనే అది వినపడుతుందని, కానీ వేదశబ్దం నిత్యమని, ఉచ్చరించకపోయినా అది నిలిచే ఉంటుందని వారి విశ్వాసం. ప్రళయ కాలంలో వేదశబ్ద రాశి అంతా భగవంతునిలో నిక్షిప్తం చేయబడుతుంది. సృష్టి జరిగే సమయంలో పరమేశ్వరుని ద్వారానే వేదపురాణాలు వెలువడ్డాయి. వేదాలలోని గూఢమైన అర్థాలను తపస్సుద్వారానే అవగాహన చేసుకొనే వీలుంటుంది. వేదాలు ఈ నిగూఢమైన అర్థాలను గురించే భగవద్గీతలో భగవంతుడు 'వేదాంతకృద్వేద వివేద చాహమ్' (11-15) అని తెలిపాడు. ఈ విధంగా వేదాలలో నిక్షిప్తమైన గూఢార్థాలను గ్రహించటానికి సరళమైన భాష అవసరం. అందుకు పురాణాలు రామాయణ మహాభారతాలు రచింపబడ్డాయి. వేదాలు, పురాణాలు, రామాయణం, భారతం ఇవి అన్నీ కూడా ఒకే ఒక అఖండ ధర్మాన్ని ప్రతిపాదిస్తున్నాయి. ఈ విధంగా వేదాలలో భాగమైన ఉపనిషత్తులలోని నిగూఢతత్త్వం పురాణాలలో విపులంగా విశదంగా చెప్పబడింది.

నారదపురాణం, వేదాలకంటే పురాణాలకు ఉన్నత స్థానాన్ని కల్పిస్తున్నది. వేదాలు సమగ్రంగా పురాణాలలోనే ప్రతిష్ఠితాలుగా ఉన్నాయి అని ఇంకా ('న వేదే గ్రహ సంచారో

నశుద్ధిః కాలబోధినీ' – (నారద పురాణం – 2 – 24 – 19) అంటే వేదాలలో జ్యోతిష్యానికి సంబంధించిన గ్రహ సంచారం, ఇతర వ్యావహారిక విషయాలు ఎక్కడా లేవు అంటుంది. ఒక ఉదాహరణను చూద్దాం. పురాణాలలో చంద్రగ్రహణ సమయంలో రాహువు చంద్రుడిని కబళిస్తాడని పురాణాలు చెప్తున్నాయి. కానీ ఆధునిక విజ్ఞాన శాస్త్రం చంద్రుడు భూమి యొక్క నీడ (ఛాయ)లోనికి ప్రవేశిస్తాడని చెప్తుంది. కాబట్టి పురాణంలో చెప్పబడింది అభూత కల్పన అని భావించటం జరుగుతుంది. చంద్రుడు భూమి యొక్క ఛాయలోనికి ప్రవేశించినప్పుడు ఆ ఛాయలో ఒక చేతన శక్తి ఉంటుందనేది అందరికీ తెలిసిన సత్యమే – ఆ చేతన శక్తే పూర్ణచంద్రుడిని కనపడకుండా చేసి కొంత సమయం పాటు చంద్రుడి తేజం కానరాకుండా చేస్తుంది. అందువలన అది ఆసురీశక్తిగా భావింపబడుతుంది. దీనినే మనం రాహువు రాక్షస శక్తి అని అంటున్నాం. ప్రకృతిలో జరిగే అన్ని సంఘటనల లోను ఈ చేతన శక్తి యొక్క ప్రమేయం పైకి కనిపించకుండానే ఉంటుంది.

దేవీ భాగవతం 'శృతిస్మృతీ, ఉభేనేత్రం పురాణం హృదయం స్మృతమ్ ఏతత్త్రయోక్త ఏవ స్యాద్ధర్మోవా ఒ అన్యత్ర కుత్రచిత్' (11-1-21) అంటుంది. అనగా ధర్మ పురుషుడికి శృతులు, స్మృతులు రెండు కళ్ళైతే పురాణాలు హృదయం అవుతాయి. పురాణాలలో ఆరెండింటిలో (శృతులు, స్మృతులలో) చెప్పిన ధర్మాలు ఉంటాయి. వేరే ఎక్కడా ఉండవు అంటుంది.

ఋగ్వేదంలో అనేక మంత్రాలలో పురాణ శబ్దం ఉపయోగించబడింది. (ఋగ్వేదం 3-5-4-9, 3-58-6, 10-130-6) కానీ ఆ సందర్భాలలో ఆ పురాణ శబ్దానికి అర్థం కేవలం 'ప్రాచీనమైన'ది అనేదే. అథర్వణ వేదంలో పురాణ శబ్దం రెండు స్థానాలలో ఉపయోగించబడింది. (ఋచః సామాని ఛందాంసి పురాణం యజుషాసహ, ఉచ్ఛిష్టజజ్ఞిరే సర్వేదివి దేవా దివిశ్రితాః-11-7-24, తమితిహాసశ్చపురాణంచ -15-6-11) దీనివలన అథర్వవేద కాలానికి పురాణాలు రూపాన్ని సంతరించుకొన్నాయని నిశ్చయంగా చెప్పవచ్చు. కాబట్టి పురాణం నిగమ ఆగమాలనే మూలంగా గ్రహించినదనే విషయం స్పష్టం. ఇప్పుడు మనం సనాతన ధర్మం అని పిలుస్తున్నది వ్యవహారతయా పురాణ ప్రధానమే. ఇందులో సందేహం లేదు. వైదిక వాఙ్మయంలో సంహితలు మాత్రమే కాకుండా బ్రాహ్మణకాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు కూడా భాగాలే – వీటిలో పురాణాలను స్పష్టంగా విపులంగా పేర్కొనటం జరిగింది. శతపథ బ్రాహ్మణం అనేది యజుర్వేదంలోని ఒక భాగం. అందులో పురాణం యొక్క పుట్టుకే విశేషమైన గాథగా చెప్పబడింది. (మధ్వా హృత యోహవా ఏ ఇతా దివాం[illegible] యదనుశాసనాని విద్యావాకో వాక్యమితిహాస పురాణం గాథా నారాశంస్య (శ.బ్రా. 11-5-6-8) ఇక్కడ 'ఇతిహాస పురాణమ్' అనేవి కలిసిపోయిన రూపంలో ఒక సమస్త పదం ద్వారా నిర్దేశింపబడింది. అయితే అథర్వణ వేదంలోని గోపథ బ్రాహ్మణంలో

(ఏవమిమే సర్వే వేదా నిర్మితాః ససంకల్పాః సరహస్యాః సబ్రహ్మణాః సోపనిషత్కాః సేతిహాసాః సాన్వాఖ్యానాః సపురాణాః (గో. బ్రా 1-2-10) అని పురాణము ఇతిహాసములను వేరువేరుగా పేర్కొని ఆరెండింటి విభిన్నతను తెలుపుతున్నది.

ఆరణ్యకాలు, ఉపనిషత్తులు బ్రాహ్మణక సాహిత్యం యొక్క అంతిమ స్వరూపాలు. బ్రాహ్మణక గ్రంథాల పరివర్థితరూపాలుగా ఆరణ్యకాలు, ఉపనిషత్తులు విలసిల్లుతున్నాయి. వీటిల్లో పురాణ ప్రసక్తి అనేక మార్లు కనిపిస్తుంది. తైత్తిరీయ ఆరణ్యకంలో పురాణ శబ్దం కనిపిస్తున్నది. అందులో 'పురాణాని' అనే బహువచన రూపము (బ్రహ్మ యజ్ఞ ప్రకరణేయద్ బ్రాహ్మణానీతిహాసాన్ పురాణాని కల్పాన్ గాథా నారాశంసీ భేదాహృతయో దేవానామ భవన్ (తై.ఆ. 2-9) అని కనిపిస్తుంది. దీనితో ముందు చెప్పబడిన 'ఆఖ్యానాల బహుత్వం తెలుస్తుంది. అలాగే బృహదారణ్య కోపనిషత్ పురాణాన్ని వేదంతో సమానంగా (అస్య మహతో భూతస్యనిశ్వసిత మేతద్ యద్ ఋగ్వేదో యజుర్వేదః సామవేదో అథర్వాఙ్గిరస ఇతిహాసః పురాణమ్' (బృ. ఉ. 2-4-10) పరిగణిస్తున్నది. అంటే ఇతిహాస పురాణాలు మహాభూతేశ్వరుడైన పరమేశ్వరుని శ్వాస రూపాలని తెలుపుతున్నది. అలాగే ఛాందోగ్యోపనిషత్తులో (అథర్వణ చతుర్థమితిహాసపురాణం పఞ్చమం వేదానాం వేదమ్ – ఛా.ఉ. 7-1-1) సనత్కుమారుని వద్ద బ్రహ్మ విద్యను నేర్చుకొనే సమయంలో నారదుడు తాను క్షుణ్ణంగా నేర్చుకొన్న విద్యలలో వేదాలతోపాటుగా ఇతిహాస పురాణాలను కూడా నేర్చుకొన్నానని స్పష్టంగా పేర్కొన్నాడు. ఇక్కడ ఉపయోగించిన పఞ్చమం అనే పదం పురాణాలను పంచమ వేదాలుగా భావించబడుతుండేదని చెప్పటానికి స్పష్టమైన ఉదాహరణ. పంచమ వేదమనే భావనలో స్థిరపడిన పురాణ విద్య వేదాలతో సమానంగా అతిప్రాచీన కాలం నుంచే భావించబడేదనే విషయం నిశ్చితం. అందువలన ఇతిహాస పురాణాలు పంచమ వేదాలుగా ప్రసిద్ధి చెందాయి.

పురాణాలు - వేదోప బృంహణము

పురాణాలన్నీ వేదాలకు ఉపబృంహకాలే. ఉపబృంహకం అంటే ఏమిటి ? ఏ విషయం వేదంలో సూచింపబడిందో లేక సంక్షేపంగా చెప్పబడిందో ఆ విషయాన్ని విస్తారంగా నిరూపణగా వివరించటమే ఉపబృంహకత. పురాణాలు వేదాల ప్రామాణిక తలను అన్నిటికంటె ఎక్కువగా వివరిస్తున్నాయి. మహాభారతం కూడా ఇదే విషయాన్ని పురాణ రూపంలోని పూర్ణ చంద్రుడు శృతి (వేదం) అనే వెన్నెలను కాస్తాడు అని ధృవీకరిస్తున్నది. కూర్మ (1-2-19) వాయు (1-201) పద్మ (5-2-51-52) బ్రహ్మాండ (1-1-1-27) మొదలైన పురాణాలు ఇదే విషయాన్ని నొక్కి చెప్తున్నాయి. ఉపబృంహణ

పదంలోని 'బృహి' లేక 'బృహ్' అనే ధాతువుకు వర్ధనము, పెంచు అని అర్థం. అంటే వేదంలోని మంత్రాల ద్వారా ప్రతిపాదించబడిన అర్థం, సిద్ధాంతం లేక కథానకాలను విస్తరించి, వాటిని పోషించ టమే పురాణాల ద్వారా చేయబడిన వర్ధనం. దీని వలన సమస్త పురాణాలు భారతాది ఇతిహాసాలు ఏదో ఒక రూపంలో వేదార్థాన్ని ఉపబృంహణం చేస్తున్నాయి అని తెలుస్తుంది.

వేదాలను అధ్యయనం చేసేవారు వానిని సాంగోపాంగంగా అర్థాన్ని కూడా తెలుసుకోవాలని మనువు చెప్పాడు. వాయు పురాణం నాలుగు వేదాలను, వాని అంగాలైన ఆరు శాస్త్రాలను, ఉపనిషత్తులను అధ్యయనం చేసిన వ్యక్తి అయినా, పురాణాలను కూడా అతడు క్షుణ్ణంగా అధ్యయనం చేస్తేనే విచక్షణుడు కాగలడుకానీ లేకపోతే ఆ వేదాధ్యయనం విచక్షణారహితం అవుతుందని ఘోషిస్తున్నది. ఉదాహరణకు ఉపనిషత్తులలో ఒకే బ్రహ్మ చేసిన ఆకాశం యొక్క సృష్టిని గురించి కేవలం అతి సంక్షేపంగా సంకేతంగా మాత్రం (తైత్తిరీయ ఉపనిషత్తు-2-1) ఉన్నది. ఇదే విషయం అగ్ని (ఛాందోగ్యోపనిషత్తు 6-23) నీరు (ఛాందోగ్యోపనిషత్తు 6-2-4)ల సృష్టి విషయంలో కూడా ఇలాగే సూచనగా ఉండగా, పురాణాలలో దీనినే విస్తరించి ఈ తత్త్వాల ఉత్పత్తి, నాశనముల వివరణ (వాయు 4-2) (బ్రహ్మ (2-3)) బ్రహ్మాండ 2-36) కూర్మ (1-2,4,7,8) పురాణాలలో సంపూర్తిగా ఇవ్వ బడింది. ఐతరేయ బ్రాహ్మణంలోను కఠోపనిషత్తులోను చెప్పబడిన హరిశ్చంద్ర నచికేత కథలు బ్రహ్మపురాణం (104వ 105వ అధ్యాయం) భారత సభాపర్వం (అధ్యాయం 12) అనుశాసన పర్వం (అధ్యాయం 91)లలో పర్యాప్త విస్తారంగా వివరించటం జరిగింది. ఋగ్వేదంలోని ఋచవృత్తాంతం పురూరవ ఊర్వశీ వృత్తాంతాలు విష్ణు పురాణం (4-6-64)లో విపులంగా చెప్పబడ్డాయి.

పురాణాలలో వేదార్థ ఉప బృంహణం నాలుగు రకాలుగా జరిగింది.

1. వైదిక మంత్రాలలోని విశిష్ట పదాలకు అర్థాలు వివరించటం.
2. వైదిక మంత్రాలను వ్యాఖ్యానించటం
3. వైదిక ఆఖ్యానాల (కథల)ను విస్తరించటం
4. వైదిక ప్రతీకలను వ్యాఖ్యానించటం.

ఈ విధంగా పురాణాలు వేదార్థాన్ని అనేక విధాలుగా ఉపబృంహణం చేయటం జరుగుతున్నది. అందుకే గోస్వామి అనే పండితుడు పురాణ పదానికి 'పూరణాత్ పురాణమ్' అని వ్యుత్పత్తిని చెప్పటం చాలా సమంజసంగా ఉన్నది. వేదార్థాన్ని పూర్తి చేసేదే పురాణమని దీని అర్థం.

వ్యాసపరంపర

కృష్ణ ద్వైపాయనుడనే వ్యాస భగవానుడు పురాణ సంహితను కూర్చి పురాణాలను సువ్యవస్థిత రూపంలో ప్రతిష్ఠింప చేయటంలో పురాణ వికాసంలో కొత్త యుగం ప్రారంభం అయింది. పురాణాలలో చెప్పబడిన విషయాల ప్రకారం వ్యాసుడు విష్ణువు యొక్క అపరాంశ సంభూతుడు కాబట్టి ఆయనకు కృష్ణద్వైపాయనుడు అనే పేరు కూడా ఉన్నది. అయితే వాయుపురాణం వ్యాసుడిని బ్రహ్మ అవతారం అని చెప్తుంటే, కూర్మ పురాణం శివుని అవతారం అని ప్రకటిస్తున్నది. ద్వైపాయనుడు అనే పేరు ఆయన యమునా నది యొక్క ఒక సైకత ద్వీపంలో పుట్టినందువలన ఏర్పడింది. కృష్ణుడు అనే పేరు ఆయన శరీర వర్ణం నల్లగా ఉన్నందువలన ఏర్పడింది. ఆయన తల్లి సత్యవతి, తండ్రి పరాశర మహాముని. ఆయన వేదాలను నాలుగు భాగాలుగా విభజించి వాటికి ఒక సువ్యస్థను ఏర్పాటు చేసిన వాడు. అందుకే ఆయనకు వేదవ్యాసుడని పేరు వచ్చింది. వేదవ్యాసుడు నాలుగు వేదాలను పైల, వైశంపాయన, జైమిని, సుమంతులనే నలుగురు శిష్యులకు బోధించాడు. వీళ్లు నలుగురు అనగా - పైలుడు ఋగ్వేదాన్ని, వైశంపాయనుడు యజుర్వేదాన్ని, జైమిని సామవేదాన్ని, సుమంతుడు అథర్వణ వేదాన్ని అభ్యసించి వేద పారంగతులైనారు. ఆయనకు అయిదవ శిష్యుడు కూడా ఉన్నాడు. అతడే సూతుడైన రోమహర్షణుడు. వేదవ్యాసుడు ఆ సూత రోమహర్షణునికి ఇతిహాస పురాణాలను బోధించాడు. సూతుని పుత్రుడు సౌతి. పద్మ పురాణం ఈ సౌతి పేరు ఉగ్రశ్రవుడని చెప్తున్నది. ఈయనే నైమిశారణ్యంలో శౌనకాది మహామునులకు మహాభారతాన్ని వినిపించాడు. ధర్మానికి హాని కలిగినప్పుడు, మానవ క్షేమానికి వ్యాసుడు అవతారం ఎత్తుతాడని పలువురు ధర్మరక్షకుల విశ్వాసం.

మన పద్దెనిమిది పురాణాలను వ్యాసుడే వ్రాశాడు (కూర్చాడు) అని భారతీయుల విశ్వాసం. కొందరు పండితులు కొన్ని శాస్త్రీయ ప్రమాణాలను ఆధారంగా తీసుకొని ఈ పద్దెనిమిది పురాణాలను అనేకులు ఋషులు, మునులు కలసి రచించారని తెలుపుతున్నారు. మేధాతిథి అనే మనుధర్మశాస్త్ర వ్యాఖ్యానకర్త ఉద్దేశ్యంలో 'పురాణాని వ్యాసాది ప్రణీతాని' (మను-3-222) అన్నదానిలో ఆదిపదాన్ని అనుసరించి పురాణాలు కేవలం వ్యాసుడు మాత్రమే రచించినవి కాదని ఋషులు మునుల రచనా భాగస్వామ్యం వాటిల్లో ఉన్నదని అభిప్రాయ పడ్డాడు. ఇలాగే మార్కండేయ పురాణంలో కూడా 'బహులాఽపరమర్షయః' అని చెప్పిన విషయం కూడా ఆలోచించవలసినదే. బ్రహ్మముఖం నుంచి పురాణం (ఇక్కడ ఏకవచనం - ప్రత్యేకంగా గమనించాలి) వెలువడింది. ఆ తరువాత ఎందరో బ్రహ్మర్షులు పురాణ సంహితను కూర్చారు. అంటే బ్రహ్మముఖం నుంచి పురాణం విద్యారూపంలో వెలువడగా తరువాత మహర్షులు పురాణాలన్నీ గ్రంథరూపంలో సమకూర్చారన్నమాట.

కూర్మపురాణం కూడా 'వ్యాసాద్యైః' అని వ్యాసుడు మొదలైనవారు అని చెప్తున్నది. అంటే వేదవ్యాసుడు రెండు సంహితలను సమకూర్చాడన్నమాట మొదటిది ఇతిహాస విషయకమైన జయసంహిత (ఇది మహాభారత సంహితకు మూలరూపం) రెండవది పురాణ విషయక పురాణ సంహిత. తరువాత ఆయన శిష్యుడైన రో (లో) మహర్షణుడు, ఆయన ముగ్గురు శిష్యులు – అకృతవ్రణ, సావర్ణి, శాంశపాయనులు మొత్తం నాలుగు పురాణ సంహితలను విస్తరించగా మొత్తం పద్దెనిమిది పురాణాలుగా క్రమపరిణామం చెందాయి. ఇందులో మూల కృషి వేద వ్యాసునిదే. పురాణ సంహితలను పద్దెనిమిదిగా విస్తరింపచేయటం ఆయన కృషి ఫలితమే. అందువలనే వేదవ్యాసుడే పద్దెనిమిది పురాణాల కర్త అని చెప్ప బడుతున్నది. బ్రహ్మాండ పురాణంలో "బృహస్పతిశ్చ శుక్రశ్చ వ్యాసః సారస్వతస్తథా, వ్యాసాః శాస్త్ర ప్రణయన వేదవ్యాస ఇతి స్మృతః"అని చెప్పటం కూడా ఈ విషయాన్ని బలపరుస్తుంది.

వ్యాసుడు యజ్ఞకర్మల నిష్పాదనం కోసం నాలుగు సంహితలుగా విభజించినప్పుడే పురాణ సంహితను ఏర్పాటు చేశాడని చెప్పబడింది. దానిని నలుగురు విశిష్ట శిష్యులకు బోధించి, వారిచే వాటిని అధ్యయనం చేయించి ప్రచార బాధ్యతను నిర్దిష్ట పరిచాడు. రోమహర్షణుడు కూడా వ్యాసుడు తనతో చర్చించిన పురాణ సంహితపై ఆధారపడిన తన పురాణ సంహితను ఏర్పరచుకొని ఈ సంహితను తన ఆరుగురు శిష్యులకు బోధించాడు. ఈ శిష్యుల పేర్లు మనకు వాయు పురాణం నుంచి తెలుస్తున్నాయి. ప్రాచీనకాలంలో వ్యక్తుల పేర్లు, వారి స్వంత నామాలతో పాటు గోత్రకర్తల పేర్లు కూడా జోడింపబడి ఉండేవి. అందుకే ఈ ఆరుగురిపేర్లు వాయు పురాణంలో రెండు విధాలుగా కనిపిస్తున్నాయి. ఒకటి వారి వైయక్తిక నామం రెండవది గోత్రజనామం. ఈ క్రమం ఇలా ఉంటుంది.

కృష్ణద్వైపాయన వ్యాసుడు

(కలియుగంలో పురాణ సంహితను మొదటగా కూర్చిన మహర్షి)

రోమహర్షణ సూతుడు

(వ్యాసుని నుంచి పురాణ సంహిత మొదట గ్రహించిన ముని)

1. సుమతిఆత్రేయుడు 2. ఆకృతివ్రణకాశ్యప 3. అగ్నివర్చాభారద్వాజ

4. మిత్రాయువాశిష్ఠ 5. సోమదత్తసాకర్ణ 6. సుశర్మాశాంశపాయన

(విష్ణుపురాణం)

ఈ ఆరుగురు శిష్యులలో ముగ్గురు ఆకృతివ్రణ కాశ్యపుడు, సోమదత్త సావర్ణి, సుశర్మాశాంశపాయనులు తాము మరల కొత్త పురాణ సంహితను తయారుచేసుకొన్నారు. ఈ విధంగా మొత్తం నాలుగు పురాణసంహితలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఈ నాలుగు సంహితలు వేరువేరుగా భావించకూడదు. అవి అన్నీ ఒక అర్థాన్ని లేక భావాన్ని తెలియ జేసేవే. కేవలం కొన్ని సందర్భాలలో పాఠాంతరాలు మాత్రమే కనిపిస్తాయి. ప్రస్తుతం లభ్యం అవుతున్న పురాణాలలో ఒక్క విష్ణుపురాణమే పరాశరమహాముని కృతంగా కనిపిస్తుంది. మిగిలిన అన్ని పురాణాలు వ్యాసుడు రచించినట్లే తెలుస్తున్నది. అయితే శ్రీకృష్ణ భగవానుడి మంగళ చరిత్రగల శ్రీమద్భాగవతం మాత్రం వ్యాసుని కుమారుడైన శుకమహర్షిచేత మొదటగా ప్రవచనం చేయబడింది. ఇదే పరంపరగా ఇప్పటి వరకు కొనసాగుతున్నది.

పురాణ సాహిత్య పరంపర వ్యాసుని పారివారిక పరంపర ఈ విధంగా ఉంటుంది.

వ్యాసం వశిష్ఠ నప్తారం శక్తేః పౌత్రమకల్మషం
పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్

వ్యాసుడు వశిష్ఠునికి ప్రపౌత్రుడు, శక్తికి పౌత్రుడు, పరాశరుని పుత్రుడు, శుకునికి తండ్రి. అప్పుడు వారి వంశ క్రమం ఇది.

బ్రహ్మ
|
వశిష్ఠుడు
|
శక్తి
|
పరాశరుడు
|
కృష్ణద్వైపాయన వ్యాసుడు
|
శుకమహర్షి

ఇది ఇప్పటి వ్యాసుని వంశక్రమం. వ్యాసుడు అనేది ఒక వ్యక్తిపేరు కాదు అది ఒక పదవి. ఈ విషయాన్ని దేవీభాగవతం స్పష్టంగా పేర్కొంది. అతడు ప్రతి ద్వాపర యుగములోను ప్రభవిస్తాడు. ప్రపంచ క్షేమంకోసం ఒక వేదాన్ని నాలుగు వేదాలుగా, ఒక పురాణ సంహితను 18 పురాణాలుగా (వ్యాసిస్తాడు) విభజిస్తాడు. వేదాలను విభజించిన కారణంగా అయన వేదవ్యాసుడు అని పిలువబడతాడు.

పురాణాల సంఖ్య

అష్టాదశ సంఖ్య ప్రత్యేకత. ప్రాచీనకాలంలో భారతదేశంలో ముఖ్యంగా సంస్కృత

వాఙ్మయంలో 18 సంఖ్యకు చాలా ప్రత్యేకత ఉన్నది. పద్దెనిమిది సంఖ్యను పవిత్రమైనదిగా భావించేవారు. అందుచేత కూడా దీనికి విస్తృత ప్రాచుర్యం వచ్చింది. పంచమ వేదంగా భావించే వ్యాసమహాభారతంలో ప్రధాన పర్వాల సంఖ్య 18. అందులో శ్రీ కృష్ణపరమాత్ముడు ప్రవచించిన భగవద్గీతలో అధ్యాయాల సంఖ్య 18. పాండవ కౌరవ పక్షాల మొత్తం సైన్యం సంఖ్య 18 అక్షాహిణులు. కురు పాండవ యుద్ధం జరిగిన రోజుల సంఖ్య 18. అలాగే మహాభాగవతంలోని శ్లోకాల సంఖ్య 18 వేలు. అలాగే మహా పురాణాల సంఖ్య 18. ఉప పురాణాల సంఖ్య 18. ఔపపురాణాల సంఖ్య 18. ఏయే పురాణాలు మహా పురాణాలు అనే దాంట్లో కొద్దిపాటి మతభేదం ఉన్నా పురాణాల సంఖ్య మాత్రం 18 అని ఏకగ్రీవంగా అందరూ అంగీకరించే విషయమే. ఈ 18 సంఖ్య ఏదో కారణం లేకుండా నిర్హేతుకంగా పెట్టింది కాదని అది సహేతుకమేనని సాభిప్రాయమని పండితుల భావన.

వ్యాసులు

అష్టాదశ పురాణాలను వ్యాసుడు రచించాడని చెప్పబడుతున్నది. వ్యాసుడు ఒక వ్యక్తి కాదు అనేకులని కొందరి అభిప్రాయం. కొందరు ఇంద్రుడు మొదలైన శబ్దాలలాగానే వ్యాస శబ్దం కూడా బిరుదవాచకం. కృత, త్రేతా, ద్వాపర, కలి యుగాలు నాలుగు కలసి ఒక మహాయుగం అని పిలువబడుతుంది. వీనిలో

యుగ గణనం

		దేవవర్షము	మానుషవర్షములు
1.	కృతయుగం	4800	17,28,000
2.	త్రేతాయుగం	3600	12,96,000
3.	ద్వాపరయుగం	2400	8,64,000
4.	కలియుగం	1200	4,32,000
	మొత్తం	**12,000**	**43,20,00**

ఈ మహాయుగాలలో ప్రతి ద్వాపరయుగాంతంలోను ఒక్కొక్క తపోనిధి వేద విభాగం, అష్టాదశ పురాణ రచనము, అష్టాదశ విద్యా వ్యాపనము చేసి 'వ్యాసుడు' అనే బిరుదు పొందుతాడు అని చెప్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న వైవస్వత మన్వంతరంలో ఇప్పటికి ఇరవై ఎనిమిది ద్వాపర యుగాలు గడచిపోయాయి. ఆయుగాలలో అవతారం దాల్చిన వ్యాసులు వీరు. 1. బ్రహ్మ 2. ప్రజాపతి (మనువు) 3. ఉశనుడు 4. బృహస్పతి 5. సవిత 6. మాత్యువు 7. ఇంద్రుడు 8. వశిష్ఠుడు 9. సారస్వతుడు 10. త్రిధాముడు 11. త్రివృషుడు 12. భరద్వాజుడు 13. అంతరిక్షుడు 14. ధర్ముడు 15. త్రయ్యారుణి

16. ధనంజయుడు 17. మేధాతిథి 18. వ్రతి 19. అత్రి 20. గౌతముడు 21. ఉత్తముడు (హర్యాత్మ) 22. వేనుడు (వాజిశ్రవుడు) 23. సోముడు (ఆముష్యాయణుడు) 24. తృణ బిందువు 25. భార్గవుడు 26. శక్తి 27. పరాశరుడు 28. కృష్ణ ద్వైపాయనుడు.

రాబోయే ద్వాపరయుగంలో అశ్వత్థామ వ్యాసుడు కాగలడు. పై 27 వ్యాసుల పేర్లలో కొన్ని పురాణాలలో తేడా కనిపిస్తున్నది. వ్యాసనామాలలో కూర్మపురాణంలో కూడా కొంత భేదం కనిపిస్తుంది. అవి కల్పభేదాన్ని బట్టి ఏర్పడినవేనని భావించాలి.

పురాణము, వ్యాసుడు, సూతుల స్థానం

పురాణ పరిశోధన చేసిన కొందరు విద్వాంసులు ప్రాచీన కాలంలో పురాణానికి సంబంధించిన రెండు విధాన పరంపరలు ఉండేవని భావిస్తున్నారు. 1. సూతపరంపర 2. వ్యాస పరంపర. ఈ రెండు విధాన పరంపరలను గురించి తెలుసుకొనేముందు సూతుడు ఎవరు ? వ్యాసుడు ఎవరు అనే విషయం మనం తెలుసుకోవటం అవసరం. మహాభారతంలోనూ పురాణాలలోను సూతుని వ్యక్తిత్వం ఒక ప్రహేళిక (చిక్కు ప్రశ్న) లాంటిది. సూతుడిని రోమహర్షణుడు లేక లోమ హర్షణుడంటారు. అంటే తన వాక్పటిమ చేత శ్రోతల రోమాలు నిక్కపొడుచుకొనేటట్లు చేసేవాడు అని దాని అర్థం. (లోమాని హర్షయాఞ్చక్రిశ్రోత్వంణాంయత్ సుభాషితైః, కర్మణా ప్రథితస్తేన లోకే ఽస్మిం ల్లోమహర్షణః (వా.పు 1-16) కూర్మపురాణం కూడా 'తస్యతే సర్వరోమాణి వచసా హర్షితాని యత్, ద్వైపాయనస్య భగవాంస్తతో వే రోమహర్షణః (కూ.పు. 1-1-4) అని చెప్తుండగా స్కాంద పురాణం ప్రభాసఖండంలో (1-6) పురాణంలో భగవంతుని విషయాలను గురించి వ్యాసుడు వివరిస్తున్నప్పుడు స్వయంగా సూతుని వెండ్రుకలే నిక్కపొడుచుకొనేవి కాబట్టి, ఆయనకు సూతుడనే పేరు వచ్చిందని తెలుపుతున్నది. కూర్మపురాణం ఈ రెండు జరుగుతాయి కాబట్టి ఆయనకు రోమహర్షణుడనే పేరు వచ్చిందని తెలుపుతున్నది. సూతుడు అంటే రథసారథి అని అర్థం. ప్రతిలోమ వివాహం వలన జన్మించినవాడని ఇంకొక అర్థం. ప్రతిలోమ వివాహం అంటే ఎక్కువ కులపు స్త్రీని తక్కువ కులానికి చెందిన పురుషుడు వివాహమాడటం. బ్రాహ్మణ స్త్రీకి క్షత్రియ పురుషుని యందు జన్మించిన వ్యక్తి సూతుడు అనబడతాడు. 'సూతులు' అనే ప్రతిలోమజాతి గౌతమ ధర్మ సూత్రాలలో పేర్కొనబడింది. అయితే పురాణాలలో వర్ణించిన సూతుడు ఈ రకం పుట్టుకగల వ్యక్తి కాదు. అంటే ఆయన ప్రతిలోమ జాతికి చెందినవాడు కాదు. బ్రాహ్మణ క్షత్రియ జాతుల కంటె భిన్నుడు. పౌరాణిక సూతుడు గొప్ప లేక తక్కువ స్థాయికి చెందిన మునిగా కనిపిస్తున్నాడు. అతడు అర్ధ దైవీశక్తి గల వ్యక్తిగా గౌరవింపబడతాడు.

వాయు, బ్రహ్మాండ, విష్ణుపురాణాలు – పితామహుడు బ్రహ్మచేస్తున్న యజ్ఞంలో సోమరసాన్ని తీసే రోజున విష్ణ్వంశతో సూతుడు అవతరించాడని చెప్తున్నాయి. కూర్మ పురాణం (1-1-6) కూడా ఈ విషయాన్ని ధృవీకరిస్తున్నది. సూతులు రెండు రకాల వారు ఉన్నారు. ఒకరు సంకరజాతివారు, రెండవరకం పురాణ ప్రవక్తలు. పురాణ ప్రవక్తలైన సూతులు బ్రాహ్మణ జాతికి చెందినవారు.

కూర్మ పురాణం ప్రారంభంలోనే (1-11-3-6) ఇతిహాస పురాణాల అధ్యయనం కోసం సూతుడు వ్యాసుని శిష్యరికం చేశాడని, స్వాయంభువ మనువు చేసిన యజ్ఞంలో 'సుత్యాహ దినం' నాడు ఈయన ఉత్పత్తి జరిగిందని చెప్పబడింది. ఇంతేకాకుండా అదే కూర్మపురాణంలో (1-13-12-17) వేన పుత్రుడు పృథువుచేత చేయబడిన పైతామహయజ్ఞంలో స్వయంగా శ్రీమహావిష్ణువు పౌరాణిక సూతుడుగా సోమరసాన్ని ఆహుతి ఇచ్చే సమయంలో జన్మించాడని చెప్పబడింది. ఆహుతి ఇచ్చే సమయంలో దేవ గురువు బృహస్పతికి ఇవ్వవలసిన ఆహుతి దేవరాజైన ఇంద్రునికి, ఇంద్రునికి ఇవ్వవలసినది బృహస్పతికి ఇవ్వబడింది. ఈ ఆహుతి ఇచ్చే సమయంలో ఉచ్చరించిన మంత్రాలలో వర్ణ విపర్యయం అంటే అక్షరాలు పలకటంలో తారుమారు జరిగింది. దీన్నే వర్ణసంకరం అంటారు. వర్ణము అంటే అక్షరము అని కూడా అర్థం ఉన్నది కదా. అంటే ధర్మ శాస్త్రాలలో బ్రాహ్మణ స్త్రీకి క్షత్రియ వీర్యం వలన పుట్టిన వ్యక్తి అని పిలువబడ్డాడు అనీ, అదేవిధంగా ఇక్కడ సూతునికి కూడా వర్ణ విపర్యయం జరిగింది. ఇతడికి కేవలం పురాణ ప్రవచనం చేసే అధికారం ఇవ్వబడింది. వేదాధ్యయనం చేసే అధికారం అయితే లేదు. వాయు పురాణం మొదలైన ఇతర పురాణాలలోలేని ఈ విశేషం ఒక్క కూర్మ పురాణంలోనే స్పష్టంగా సూతులకు వేదాధ్యయనాధికారం లేదని చెప్పబడింది.

సూతుల యొక్క వృత్తేమిటి ?

దేవతలు, మునులు, రాజుల వంశాల మీద దృష్టినిలిపి, వారిని సచేతనులుగా ఉంచటం అంటే సత్కార్యాలయెడ, ధర్మంపట్ల ప్రజలను అనురక్తులను చేసి సమాజాన్ని చైతన్యశీలంగా ఉంచటం. సూతులకు వృత్తి అని చెప్పబడుతున్నది. ఇందుకు వారికి ఆధారాలు ఏమిటంటే అప్పటివరకు ఇతిహాస పురాణాలలో చెప్పబడిన ఆయా దేవతల, మునుల, రాజుల వంశాను చరిత్రలే. వీరు కాకుండా ఉన్న ఇంకొక సూతశాఖవారు క్షత్రియ ధర్మాన్ని అవలంబించటం లేకపోతే కనీసం రథాలను తోలి ఏనుగులు, గుఱ్ఱాలకు చికిత్స చేస్తూ తమ పొట్టపోసుకుంటారు. దీనికి ఉదాహరణగా మనం మహాభారతంలో కర్ణుని పెంచిన తండ్రి యొక్క చరిత్రను తీసుకొనవచ్చు. ఆయా సందర్భాలలో తగినట్లుగా

పురాణ ఇతిహాసాలలో సూతుల పుట్టుకతో పాటు మాగధుల (రాజాస్థానాల్లో రాజును స్తుతించటం రాజు రాకను తెలియజేయటం మొదలైన పనులు చేసేవారు) జన్మ వృత్తాంతం కూడా చెప్పబడింది. దాని ప్రకారం పృథువేనుడిని స్తుతించటానికి, ఈ సూతులే నియమింప బడ్డారని చెప్పబడింది. సూతుల ఈ జన్మ వృత్తాంతం విష్ణుపురాణం, బ్రహ్మాండపురాణము, వాయుపురాణాలలో కాస్త విస్తృతంగానే కనిపిస్తున్నది.

మార్కండేయ పురాణంలోని ఆరవ అధ్యాయంలో శ్రీకృష్ణుని అన్న బలరాముడు ఒక సూతుని వధించగా అందువలన కలిగిన బ్రహ్మహత్యాపాతకానికి ప్రాయశ్చిత్తంగా బలరాముడు తీర్థ యాత్రలు చేసినట్లు చెప్పబడింది. దీనిని బట్టి కూడా పౌరాణిక సూతులు బ్రాహ్మణులని తెలుపుతున్నది. కూర్మ పురాణం కూడా (1-23-15) సూతుని నోటి ద్వారా స్వయంగా తన కులానికి చెందినవారు వేద వర్జితులని చెప్పినట్లుగా వివరిస్తున్నది. శౌనకాది మహామునులు సూతుని నుంచే పురాణ విద్యను గ్రహించారు. సూతుల దైవిక ఉత్పత్తిని ఎవరూ సరైందిగా స్వీకరించకపోయినా అతి ప్రాచీన కాలంలోనే ఎటువంటి కించపడకుండా బ్రాహ్మణులు సూతుని నుంచే గాథలు, ఆఖ్యానాలు మొదలుగా గల పురాణ విద్యను గ్రహించారనేది సత్యం. ఇదే పరంపరగా ఉపనిషత్తులలో కూడా మనకు కని పిస్తుంది. ఆయా ఉపనిషత్ గాథల్లో బ్రాహ్మణులు కేవలం క్షత్రియుల నుంచే కాదు శూద్రుల నుంచి కూడా ఎటువంటి శంక సంకోచాలు లేకుండా విద్యను గ్రహించే వారు అంటే జ్ఞాన ప్రాప్తిని పొందేవారన్నమాట. రైక్వ, జానశ్రుతి, సత్యకామ, జాబాలి ఇంకా ఇతరుల గురించి ఐతరేయము మొదలైన గ్రంథాలలోని గాథలు ఈ విషయాన్ని నిరూపిస్తాయి.

రెండు ప్రాచీన వాఙ్మయాల ప్రవాహాలు

అతి ప్రాచీన కాలం నుంచి మనకు బ్రహ్మ నుంచి ఆవిర్భవించిన వాఙ్మయ ప్రవాహాలు పరస్పర ఉపకారకాలుగా ఉండి, రెండు మార్గాలలో ప్రవహిస్తున్నాయి. వాటిలో మొదటిది వేదవాఙ్మయ ప్రవాహము. రెండవది పురాణవాఙ్మయ ప్రవాహము. వేదవాఙ్మయ ప్రవాహం కర్మ ప్రధానమైనది. పురాణ వాఙ్మయ ప్రవాహం కర్తృ ప్రధానమైనది. మొదటిదైన వేద వాఙ్మయ ప్రవాహాన్ని మునులు స్వీకరించి ప్రచారం చేశారు. అందుచేత ఈ రెండు సమాన ప్రమాణ్యంగలవే. కృష్ణద్వైపాయన వ్యాసుడు ఒకటే వేదంగా ఉన్నదానిని నాలుగుగా విభజించాడు. అలాగే ఒకటే పురాణ సంహితను అష్టాదశ పురాణాలుగా విభజించాడు. విభజించినవాడు కాబట్టి ఆయన వ్యాసుడైనాడు. ఇది ఇంతకుముందే వివరించబడింది.

రాణాలు ఏవి?

వ్యాసుడు రచించిన పద్దెనిమిది పురాణాలను తేలికగా గుర్తుంచుకొనటానికి
్మపురాణంలో ఒక సూత్రం ఉన్నది. అది

'మ'ద్వయం 'భ'ద్వయం చైవ 'బ్ర'త్రయం 'వ' చతుష్టయం
'అ' 'నా' 'ప' 'లింగ' 'కూ' 'స్కా'ని పురాణాని పృథక్ పృథక్

(దేవీ భాగవతం 1-3-21)

అంటే ఆయా పురాణాల పేర్లను అనుసరించి 'మ'తో ప్రారంభమయ్యేవి రెండు
మత్స్య, మార్కండేయ పురాణాలు; 'భ' తో ప్రారంభయ్యేవి రెండు – భాగవత, భవిష్య
ాణాలు; 'బ్ర'తో ప్రారంభమయ్యేవి మూడు – బ్రహ్మ, బ్రహ్మవైవర్త, బ్రహ్మాండ పురాణాలు.
తో ప్రారంభమయ్యేవి నాలుగు – వరాహ, వామన, వాయు, విష్ణు పురాణాలు. 'అ'
ప్రారంభమయ్యేది అగ్నిపురాణం, 'నా'తో ప్రారంభమయ్యేది నారదపురాణం, 'ప'తో
రంభమయ్యేది పద్మపురాణం; లింగ – అంటే లింగపురాణం, 'కూ'తో ప్రారంభమయ్యేది
ర్మపురాణం, 'స్కా' తో ప్రారంభం అయ్యేది స్కాందపురాణం. భాగవతం అని చెప్పే
నిలో అది దేవీభాగవతమా లేక విష్ణు భాగవతమా అని పండితుల మధ్య విస్తృతమైన
్ర జరిగింది. అలాగే వాయుపురాణం స్థానంలో కొందరు శివ పురాణాన్ని చేరుస్తున్నారు.
్కువ మంది పండితులు విష్ణు భాగవతమే అష్టాదశ పురాణాలలో ఒకటని అలాగే
యు పురాణాన్నే శివపురాణమని ఒకప్పుడు వ్యవహరించేవారని, అందుచేత వాయు
ాణమే అష్టాదశ పురాణాంతర్గతమని సమర్థిస్తున్నారు.

రాణాల ప్రాచీనత

ఎందరో ఋషులు మహర్షుల ద్వారా ప్రచలితమైన సంస్కృత సాహిత్యం యొక్క
ధ శాఖలను పరిశీలిస్తే వేదాలు, పురాణాలు భారతీయ సంస్కృతీ పరిరక్షక సహో
లనే విషయం అవగతమౌతుంది. వేదకాలంనుంచే ఎందరో మహర్షులు తమ తమ
్యాత గ్రంథాలలో పురాణాల యొక్క విశిష్టతను చాటుతూనే ఉన్నారు. పురాణాలలో
్పబడిన ఇహలౌకిక, పారలౌకిక అభ్యుదయ సాధక ఉపదేశాల బలం ఆధారంగానే
ందు సమాజం సృష్టి కాలం నుంచి నేటివరకు, అజరామరంగా విలసిల్లుతూ ఈ
్రత్ర భారతభూమిని సభ్యనాగరిక దేశాలలో అగ్రశ్రేణిలో నిలబడేటట్లు చేసింది.

పురాణాల ప్రాచీనతను నిరూపించాలంటే వేదకాలం నుంచి నేటి వరకు నిర్మితం
ుతున్న సంస్కృత సాహిత్యంలోని విశిష్ట గ్రంథాల ఆధారంగా నిరూపణ జరుగుతుంది.

అథర్వణ వేదం

ఋచః సామాని ఛందాంసి పురాణం యజుషాసహ
ఉచ్ఛిష్టా జజ్ఞిరే సర్వేదివిదేవా దివిశ్రితాః – అని తెలుపుతున్నది.

(ఋగ్వేదము, సామవేదము, ఛందము, యజుర్వేదాలతోపాటు పురాణము దేవలోకంలో ఉండే నక్షత్రమండలం ఆ ఉచ్ఛిష్టము అనగా ప్రపంచాన్ని పాలించే పరమాత్మ నుంచే ఉద్భవించినవి). అంతేగాకుండా, అదే అథర్వణవేదం

యంత్ర స్కంభః ప్రజనయన్ పురాణం వ్యవర్తయత్
ఏకం తదంగం స్కంభస్య పురాణమను సంవిదుః – అంటున్నది.

(వ్యాసరూపంలో ఉద్భవించి సర్వరక్షకుడైన ఈశ్వరుడు గురుశిష్య పరంపరతో వ్యాపించిన పురాణాలను రచనా బద్ధం చేయగా, వేదం యొక్క ఒక ప్రధాన అంగమైన పురాణాలు పరమాత్మను తెలిపేవేనని గ్రహించవలెను)

ఇక ఋగ్వేదం 'సనాపురాణ మధ్యేరాత్ (ఇప్పుడు నేను సనాతన పురాణములను అధ్యయనము చేయుదును) అనియు

'పురాణమోకః సఖ్యం శివమ్ వామ్' (ఓ అశ్వినీ కుమారులారా! మీ ఇద్దరి స్థానము పురాణమే ఎందుకనగా పురాణాల ద్వారా మీ ఇద్దరి స్థానము తెలియగలదు. మీ ఇద్దరి సఖ్యముచేత ఎంతో శుభము కలుగగలదు) అంటుంది. ఇంకా శథపథ బ్రాహ్మణం "అథ నవమేఽహని కించిత్పురాణమాచక్షేత్" (యజ్ఞము చేయునప్పుడు తొమ్మిదవ రోజున పురాణ పఠనము చేయవలెను. ఇతిహాస పురాణాలను ప్రతి దినము పఠనము చేయవలెను. ఇంకా ఇతిహాస పురాణాలను ప్రతి దినము ఎవరు పఠనము చేయుదురో అతడు దేవతలను తృప్తి పరచగలడు అని కూడా చెప్తున్నది. అంతేగాకుండా ఆదే శతపథ బ్రాహ్మణం 'ఈవిధంగా కల్పము, రహస్యము, బ్రాహ్మణము, ఉపనిషత్తు, ఇతిహాసము పురాణములతోనే వేదము నిర్మింపబడిన'దని చెప్తుంది. ఛాందోగ్యోపనిషత్తులో ఒక కథ ఉన్నది. ఆ కథ ప్రకారం దేవర్షియైన నారదుడు విద్యాధ్యయనం కోసం సనత్కుమారుని వద్దకు వెళ్ళగా, అప్పుడు సనత్కుమారుడు, నారదుని ఇంతకు ముందు ఇక్కడకు రావటానికి పూర్వం నీవు ఏమేమి చదివావని ప్రశ్నించాడట. అప్పుడు నారదుడు 'ఋగ్వేదం భగవోఽధ్యేమి యజుర్వేదం సామవేద మాథర్వాణం చతుర్థమితిహాస పురాణం పంచమం వేదానాం వేదమ్' (భగవంతుడా లేక పూజ్యుడా! నేను ఋగ్వేదమును, యజుర్వేదమును, సామవేదమును, అథర్వణ వేదమును ఇంకా ఐదవది వేదాలకు వేదమైన ఇతిహాస పురాణాలను అధ్యయనం చేశాను) అని తెలిపాడు. దీనిని బట్టి వేదాలతో సమాన స్థానము పురాణాలకు ఉన్నదని తెలుస్తున్నది.

మనకు ఒక సందేహం కలగవచ్చు. అసలు ఈ సృష్టి జరిగి ఎంతకాలం అయింది అని. ఈ ప్రశ్నకు జవాబుగా మనం పురాణాలనుంచే వివరణ పొందవచ్చు. ఎందుకంటే హిందువులు చేసే ప్రతి పని ఈ తత్త్వాన్ని తెలుసుకొనే ప్రారంభించడం జరుగుతుంది. హిందువులు ప్రతిరోజు తమ నిత్యనైమిత్తిక కామ్య కర్మలను అనుష్ఠించేటప్పుడు నియమాను సారం అద్యబ్రహ్మణోద్వితీయ పరార్ధే శ్వేత వరాహ కల్పే వైవస్వత మన్వంతరే అష్టావింశతమే కలిగయుగే ప్రథమ పాదే ..... (ఫలాని కర్మలేక పనిని) కరిష్యే' అని సంకల్పం పఠించి సృష్టి గణనను తెలుసుకొంటున్నాడు. దీని అర్థం బ్రహ్మయొక్క ఆయుష్షు 50 సంవత్సరాలు గడచిన తరువాత ద్వితీయ పరార్ధ సమయంలో శ్వేత వరాహ కల్పంలోని వైవస్వతుడనే ఏడవ మనువు కాలంలో 18వదైన కలియుగ ప్రథమ భాగంలో ఫలానా ధర్మకార్యం నెరవేరుస్తున్నాను అనేదే. గణితశాస్త్రాన్ని అనుసరించి దీనిని లెక్కిస్తే సృష్టి ఆరంభం నుంచి విక్రమశకం 2015 వరకు (దీనికి 58 తీసివేయగా ఇంగ్లీషు సంవత్సరం వచ్చును. అనగా 1957 వరకు). మనుష్య సంవత్సరంలో ఒక వంద తొంభై ఏడుకోట్ల ఇరవై తొమ్మిది లక్షల నలభై తొమ్మిదివేల యాభై తొమ్మిది సంవత్సరాలు గడిచిపోయినాయి.

దీన్ని లెక్కగడదాము :

1. గత ఆరు మనువుల కాలం అంటే అమన్వంతర కాలం =	184,03,20,000
2. గత ఆరు మన్వంతరాల సంధ్యాకాలం =	1,20,96,000
3. ఏడవ మన్వంతరంలో గతించిన 27 చతుర్యుగాల కాలం =	11,66,40,000
4. 28వ చతుర్యుగంలో గడచిన సంవత్సరాల కాలం =	38,93,059
మొత్తం	**197,29,49,059**

ఇది క్రీ.శ. 1957 వ సంవత్సరం వరకు గణించిన గత సంవత్సరాలు. భారతీయ పురాణ పండితులను అనుసరించి ప్రస్తుత విజ్ఞానశాస్త్రజ్ఞులు 5, 6 వేల సంవత్సరాల కాలం నుంచి 30 కోట్ల సంవత్సరాల కాలం వరకు మాత్రమే అంచనాలు కడుతున్నారు. కానీ పురాణాలు, తెలిపిన సృష్టికాలం దాదాపు 200 కోట్ల సంవత్సరాల నాటి నుంచి గణిస్తున్నాయి. ఆధునిక విజ్ఞానం ఇంకా విస్తరించి క్రమంగా ఇంకా ప్రాచీన చరిత్రవైపు పోగలిగితే పురాణాలు లెక్కగట్టిన ఈ కాలం వరకు చేరుకొనగలుగుతుంది.

పురాణల క్రమంలోని అర్థం

పద్దెనిమిది మహా పురాణాలను చెప్పేటప్పుడు ఇది ఇన్నవ పురాణమని, క్రమ సంఖ్యలు ఇవ్వబడ్డాయి. ఈ క్రమం అనుసరించవలసినదేనా అంటే, పురాణవేత్తలు అయిన

పండితులు ఇది సాభిప్రాయమని, ఈ క్రమం చారిత్రక కారణాలవల్ల ఏర్పడింది కాదని, ఆయా పురాణాలలో ప్రతిపాదించబడిన, వర్ణించబడిన విషయాలను బట్టి ఏర్పడిందని తెలుపుతున్నారు. అష్టాదశ పురాణాలలోను ఎన్నో విషయాలు వివరించ బడ్డాయి. కానీ ఒక్కొక్క పురాణంలో ఒక్కొక్క విషయం ప్రముఖంగా, ప్రాధాన్యతతో వివరించబడ్డది. ప్రాధాన్యతను బట్టి పేర్లు ఏర్పడటం (ప్రాధాన్యేన వ్యపదేశాభవంతి) అనేది లోకరీతిగా ఉన్నదే.

పురాణాల ప్రధానమైన లక్ష్యం ఈ సృష్టిని గురించి వివరంగా తెలపటం. మూల తత్త్వం నుంచి సృష్టి ఎలా ప్రారంభం అయింది? అది ఏ విధంగా జరిగింది? ఏయే పరిణామాలను పొందింది? ప్రధాన వంశాలు ఎలా ఏర్పడ్డాయి. అందలి కీర్తి వంతులు ఎలాంటి జీవితాలను గడిపి ఆ కీర్తిని సంపాదించారు? చివరకు తిరిగి ఈ సృష్టి మూల తత్త్వంలో ఎలా విలీనం అవుతుంది? ఇదే సృష్టి ప్రవాహధార విశ్వసర్గంతో ప్రారంభమై ప్రతి సర్గంతో అంతం అవుతున్నది అనే ఈ ఆద్యంతాల మధ్యన ఉన్నవే మన్వంతర వంశ వంశాను చరితలు. అనే ధారాప్రవాహాలు. పురాణ పంచలక్షణాల వివరణ అంతర్యం ఇదే. ఈ పంచలక్షణ స్వారస్యము, సమన్వయము ఇదే. ఇలా సృష్టితత్త్వ ప్రతిపాదనం పురాణ తాత్పర్యం అయినందున పురాణ క్రమంలో ఔచిత్యం తేటతెల్లం అవుతుంది.

1. సృష్టిని గురించి అవగాహన చేసుకొనేటప్పుడు ఈ బ్రహ్మాండాన్ని ఎవరు సృష్టించారు అనే సందేహం కలగటం సహజం. సకలాతీతుడైన పరమాత్మ లేక పరబ్రహ్మ సృజించాడని తెలుస్తుంది. సృష్టిని బ్రహ్మ చేశాడని పురాణాలు చెప్పుతున్నాయి. 'తైత్తిరీయ సంహిత' 'బ్రహ్మ బ్రహ్మ భవత్ స్వయమ్' అంటే పరబ్రహ్మమే బ్రహ్మ అయినదని తెలుపుతున్నది. కాబట్టి సృష్టికర్త అయిన బ్రహ్మ గురించి తెలియచేసేది బ్రహ్మపురాణం.
2. సృష్టికార్యం నిర్వర్తించే బ్రహ్మ ఎలా జన్మించాడు అనేది తరువాత వచ్చే ప్రశ్న. ఈ ప్రశ్నకు జవాబు చెప్పేది పద్మపురాణం. పద్మం నుండి బ్రహ్మపుట్టాడు కనుక పద్మ పురాణం రెండవది.
3. సృష్టికి కారణభూతుడైన బ్రహ్మ పుట్టింది పద్మం నుంచి అయితే ఆ పద్మానికి మూలం ఏది? అది విష్ణువు నాభినుంచి పుట్టింది. అందులోనుంచే బ్రహ్మ ఉద్భవించి, తపస్సు చేసి సృష్టి చేశాడు. ఆ విష్ణుతత్త్వాన్ని ప్రతిపాదించేది విష్ణు పురాణం. కాబట్టి అది మూడవ పురాణం.
4. విష్ణువు వాసస్థానం ఏది? ఆయన శేషశయ్యపై పవళించి ఉంటాడు. ఆ శేషునికి ఆధారం వాయువు. ఆశేషశయ్యను నిరూపించేది వాయుపురాణం. అది నాల్గవ పురాణం.

5. శేషుడు క్షీరసాగరంలో ఉంటాడు. ఆ సముద్ర రహస్యాల్ని వివరించే పురాణం కనుక శ్రీమద్భాగవతం ఐదవ పురాణం.
6. విష్ణు భగవానుని నిరంతరం సేవిస్తూ తన మధురవీణాగానంతో కీర్తిస్తుండే నారదుని పేరనున్న నారదపురాణం – ఆరవ పురాణం.
7. ఈ సృష్టిచక్రాన్ని ఈ విధంగా తిప్పేదెవరు అనే ప్రశ్నకు చాలా సమాధానాలు ఉన్నా కానీ వానిలో 'దేవి' అన్న సమాధానం ఒకటి. ఆమెను గురించి తెలిపేది మార్కండేయపురాణం.
8. ఘటంలో ప్రాణంవలెనే బ్రహ్మాండంలో శక్తి ఉన్నది. ఆశక్తి అగ్ని రూపంలో ఉండి క్రియాశీలమైన వస్తువులకు మూలప్రేరణ ఇస్తూంటుంది అనేది ఒక అభిప్రాయం. దీనిని ప్రతిపాదించే అగ్ని పురాణం – ఎనిమిదవ పురాణం.
9. అగ్నితత్త్వం సూర్యునిపై ఆధారపడి ఉన్నది. అందువలన సూర్యుడే క్రియాశీల వస్తువులకు ప్రేరణ శక్తి. అందువలననే వేదం సూర్యుడే స్థావర జంగమ సృష్టికి ఆత్మ అని తెలుపుతున్నది. ఈ విధంగా సృష్టికి ఉత్ప్రేరకం 'ఉత్పాదకుడైన సూర్యుడి మహిమ విశిష్టమైనది. ఆయన మహిమను ప్రతిపాదించేది భవిష్యపురాణం. తొమ్మిదవ పురాణం.
10. బ్రహ్మం నుంచే జగత్ సృష్టి జరుగుతున్నది. ఈ జగత్తంతా బ్రహ్మం యొక్క వివర్తం. వికారం–వివర్తం. ఈ రెండింటికి తేడా ఉన్నది. నిజంగా మారటం వికారం. నిజంగా మారకున్నా, మారినట్టు కనిపించడం వివర్తం. జగత్తు బ్రహ్మం వల్ల కలిగినదే. కానీ ఈ జగత్తు సత్యంకాదు. ఇది మాయికం. ఇది బ్రహ్మవైవర్తం. కనుక బ్రహ్మవైవర్తం అనే పేరుతోనే విశ్వానికి మూల కారణం బ్రహ్మమనీ, విశ్వం బ్రహ్మవివర్తమనీ తెలిపే బ్రహ్మవైవర్త పురాణం – పదవ పురాణం.
11. బ్రహ్మం నిర్గుణము. సగుణరూపంలో దానిని కనిపెట్టి, జీవుడు దానిని ఊహించాలి. అందుకు మార్గాన్ని సూచిస్తూ, సమాధానం ఇచ్చేవి మిగిలిన పురాణాలు. శివ విష్ణు రూపాలు బ్రహ్మంయొక్క సగుణ రూపాలుగా ప్రసిద్ధి చెందినవి. ఇందులో శివుని గురించి చెప్పేది లింగపురాణం – పదకొండవ పురాణం.
12. బ్రహ్మం యొక్క సగుణరూపంగా ప్రసిద్ధి చెందిన రూపాలలో శివుడుగల వివిధ తీర్థ క్షేత్రాలను, వ్రతాలను తెలిపేది స్కాందపురాణం – పన్నెండవ పురాణం.
13. బ్రహ్మంయొక్క సగుణ రూపంగా ప్రసిద్ధి చెందిన రూపం విష్ణు రూపం. ఆయన అవతారాలు ధరించి, భూమిపైకి దిగివచ్చి భక్తుల కష్టాలు తొలగించి వారికి ముక్తి పొందే ఉపాయాలను కూడా ఉపదేశిస్తాడు. అవతార ప్రయోజనం కేవలం రాక్షస సంహారమే కాకుండా జీవునికి సంసార జంబాలం నుంచి విముక్తిని కలిగించి

ఆనందమయ ముక్తి పొందే విధానం కూడా నేర్పటం భగవానుడు మర్త్యరూపం ధరించడంలోని ప్రయోజనం అని భాగవతం తెలుపుతున్నది. కనుక అవతార రూపధారుడైన విష్ణుమూర్తి అవతారాలను తెలియజేసే వరాహపురాణం – పదమూడవ పురాణం.
14. అలాగే విష్ణువు యొక్క వామనావతార వృత్తాంతాన్ని తెలిపే వామన పురాణం పద్నాలుగవ పురాణం.
15. విష్ణువు యొక్క కూర్మావతార వృత్తాంతాన్ని తెలిపే కూర్మపురాణం పదిహేనవ పురాణం.
16. శ్రీమహావిష్ణువు యొక్క మత్స్యావతార వృత్తాంతాన్ని తెలిపే మత్స్యపురాణం పదహారవ పురాణం.
17. జ్ఞానంవలన, ఉపాసన వలన జీవులకు కలిగే గతులూ, మరణానంతరం జీవుని స్థితి, అతడు ఏమి అవుతాడనే ప్రశ్నలకు జవాబులు గరుడ పురాణంలో లభ్యం అవుతాయి. అందువలన గరుడ పురాణం పదిహేడవ పురాణం.
18. జీవుని సమస్త గతులను గురించి విపులంగా చెప్పే బ్రహ్మాండపురాణం 18వ పురాణం.

హిందూ ధార్మికసారం జీవులు తమ కర్మఫలాన్ని అనసరించి ఈ బ్రహ్మాండంలో సుఖదుఃఖాలను అనుసరిస్తూ తిరుగుతూ ఉంటారనేదే.

ఈ విధంగా సృష్టివిద్యకు సంబంధించిన విషయాలను వివరిస్తూ జ్ఞాన, కర్మలను తెలియజేయటంలో అష్టాదశ మహాపురాణాలు దిశా నిర్దేశకాలుగా ఎంతో ఉపయోగకరమైనవిగా భావించబడుతున్నాయి. అందుకే వాని వరుస క్రమానికి కూడా సార్థకత ఉన్నదని మొదటే చెప్పబడింది.

పురాణ రచనా క్రమము

అష్టాదశ పురాణాలలో పద్మ పురాణాన్నే మొదట కృష్ణద్వైపాయన వ్యాసుడు రచించాడని, తరువాత సర్వ పురాణాల నుంచి సారాన్ని ఆకర్షించి భాగవతం రచించాడని పద్మ పురాణం తెలుపుతున్నది.

తత్ర పద్మ పురాణంతు, ప్రథమంచ ప్రణీతవాన్
తతో ఽన్యాని పురాణాని కృత్వా షోడశతు క్రమాత్
అష్టాదశం భాగవతం, సారమాకృష్య సర్వతః
కృతవాన్ భగవాన్ వ్యాసః శుక మధ్యాపయసత్స్యయమ్

(పద్మ పురాణాన్ని ముందుగా రచించి, తరువాత ఇంకొక పదహారు పురాణాలను క్రమంగా కూర్చాడని 18వదైన భాగవతాన్ని ఈ 17 పురాణాల యొక్క సారభూతంగా వ్యాసుడు కూర్చాడని తెలుస్తున్నది)

వ్యాసుడే శుకునికి భాగవతాన్ని స్వయంగా బోధించాడు.

పురాణ సంహిత

విష్ణు పురాణం, వ్యాసుడు పురాణాలను సమకూర్చిన విధానాన్ని తెలుపుతూ

ఆఖ్యానైశ్చాప్యుపాఖ్యానై, ర్గాథాభిः కల్ప శుద్ధిభిः
పురాణ సంహితాం చక్రే, పురాణార్థ విశారదः అని తెలుపుతున్నది.

ఆఖ్యానము, ఉపాఖ్యానము, గాథ, కల్ప శుద్ధులతో కూడిన రచనయే పురాణ సంహిత అని పురాణార్థ విశారదులు తెలుపుతున్నారు. అయితే ఈ ఆఖ్యాన, ఉపాఖ్యానాదులకు అర్థం ఏమిటి అనే సందేహం వస్తే,

స్వయం దృష్టార్థకథనం, ప్రాహురాఖ్యానం బుధాः
శ్రుత స్యార్థ కథనముపాఖ్యానం ప్రచక్షతే – అని వివరించబడింది.

అనగా పురాణకర్త స్వయంగా చూసి చెప్పినది ఆఖ్యానము. ఉదా : భారత కథ మొదలైనవి.

వేదము వలన విని చెప్పినది ఉపాఖ్యానము. ఉదా : హరిశ్చంద్ర కథ మొదలైనవి.

పితృగీతలు, పృథివీ గీతలు మొదలైనవి గాథలు –

శ్వేత వరాహము, నీలలోహితము మొదలైనవి కల్పాలు. నిర్ణయము కల్పశుద్ధి.

పురాణ శబ్దము మహాపురాణ పరంగా కూడా అన్ని పురాణాలలోను వాడబడింది.

పురాణ సంహితకు సహాయకాలు

వ్యాస మహర్షి ఆఖ్యాన, ఉపాఖ్యాన, గాథా, కల్పశుద్ధులు అనే నాలుగు ఉపకరణాలను తీసుకొని, తన పురాణాన్ని కూర్చాడు.

ఆఖ్యానైశ్చాప్యుపాఖ్యానైర్గాథాభిः కల్పశుద్ధిభిः
పురాణ సంహితాం చక్రే పురాణార్థ విశారదాः *(విష్ణు పు. 3-6-15)*

'స్వయం దృష్టార్థ కథనం ఆఖ్యానం' అనగా వక్త తాను స్వయంగా చూసి చెప్పిన విషయము అని అర్థం. దీనికి వ్యతిరేకార్థమే ఉపాఖ్యానము. వేరొకని ద్వారా పరంపరాగతంగా తాను వినిన విషయాన్ని వివరించటమే ఉపాఖ్యానము అని చెప్పుకొనవచ్చు. ఈ వివరణ ద్వారా రామ, నచికేత, యయాతి వృత్తాంతము మొదలైన కథలు పరంపరాగతముగా వచ్చునట్టివి. రామోపాఖ్యానం, నచికేతోపాఖ్యానం, యయాత్యుపాఖ్యానం పేర్లతో అవి ప్రచారంలో ఉన్నాయి. అందువలన ఇవి ఉపాఖ్యానాలు. అయితే కొందరు ఆయా వృత్తాంతాల పరిమాణాన్ని బట్టి విభజన చేస్తున్నారు వివరిస్తున్నారు. ఆకారంలో పెద్దవిగా

అంటే దీర్ఘంగా ఉండే వృత్తాంతాలు ఆఖ్యానాలని, కొద్దిపాటి వృత్తాంతంగలవి లేక చిన్నకథగలవి ఉపాఖ్యానాలని చెప్పబడుతున్నాయి. ఈ వివరణ ప్రకారం రామాయణం సుదీర్ఘమైన కథగలది కాబట్టి రామాఖ్యానం కాగా, రామకథలో భాగంగా ఉండి కొద్దిపాటి కథగల సుగ్రీవ వృత్తాంతం మొదలైనవి 'సుగ్రీవోపాఖ్యానం' అని చెప్పవచ్చు. దీనికి సమర్థనగా మహాభారతం తనను గురించి తాను 'ఇతిహాస'మని 'ఇతహాసోత్తమ'మని చెప్పుకొన్నా ఆఖ్యానమని కూడా (ఇదం కవివరైः సర్వైరాఖ్యాన ముపజీవ్యతే –ఆదిపర్వం) చెప్పుకొన్నది.

గాథ : ప్రాచీన సాహిత్యంలో వేద, బ్రాహ్మణ, ఉపనిషద్, పురాణాలలో అనేక ప్రాచీన స్తుతులు, గీతాలు వంటివి ఉన్నాయి. వీటి కర్త ఎవరో తెలియదు. ఇది చాలావరకు ఒక గొప్ప చక్రవర్తిని స్తుతిస్తూనో ఒక మహాదాత దాతృత్వాన్ని ప్రశంసించేవిగానో అసామాన్య శౌర్యవంతుని శౌర్యాన్ని ప్రస్తుతించేవిగానో ఉంటాయి. ఋగ్వేద సంహితలో ఇలాంటి గాథలను "నారాశంసి" అనే పేరుతో ఉన్నాయి. ఐతరేయ బ్రాహ్మణంలో కూడా అష్టమ పంచికలో ఇంద్రుని మహాభిషేక సందర్భంలో ప్రాచీన చక్రవర్తులైన రాజుల పట్టాభిషేకములు, వానివలన వారు ఆర్జించిన యోగముల వివరణ చేయబడింది. ఆ సందర్భంలో అనేక ప్రాచీన గాథలు ఈ సందర్భంలో ఉద్ధరించబడ్డాయి. వీటిల్లో చాలా పురాణాల్లో ఈ గాథలు రాజుల వర్ణనలలోను, ముఖ్యంగా భాగవత నవమ స్కంధంలో ఉద్ధరించబడ్డాయి. గృహ్యసూత్రాలు కూడా వివాహ సందర్భాలలో గాథలను పాడటం నిర్దేశిస్తున్నాయి. అంటే గాథలు ఆయా రాజులకు సంబంధించి ప్రఖ్యాతమైనవే. ప్రజల నాల్కలపై అవి సజీవంగానే ఉన్నాయి. వాటిని వ్రాసిన వారెవరో తెలియదు. ఈ లోకప్రియమైన అజ్ఞాతకర్తృకమైన శ్లోకాలనే 'గాథ'లు అని పిలుస్తారు. వీటిని కూడా పురాణాలు సంహితల నిర్మాణంలో వ్యాసుడు సమకూర్చుకొని ఉపయోగించుకొన్నాడు. ఈ గాథలకు శ్లోకాలనే పేరు కూడా ఉన్నది. (తదప్యేతే శ్లోకా అభిగీతా (ఐతరేయ బ్రాహ్మణం – అధ్యాయం 39) ఐతరేయ బ్రాహ్మణంలోని 39వ అధ్యాయంలోగల గాథలే కొద్ది తేడాతో భాగవతం నవమ స్కంధంలో కనిపిస్తున్నాయి.

కల్పశుద్ధి : దీనికి బదులుగా కల్పజోక్తి అని బ్రహ్మాండ పురాణంలోను, కులకర్మభిः అని వాయుపురాణంలోను ఉన్నదని ఇంతకుముందు చెప్పబడింది. కల్పశుద్ధి అనే పదానికి చాల అర్థభేదాలు ఉన్నాయి. కల్పజోక్తి అనే పదానికి వివిధ కల్పాలలో పుట్టిన విషయములు లేక పదార్థాలు అని ఒక అర్థం అయితే శ్రీధరస్వామి కల్పశుద్ధి అంటే 'శ్రాద్ధకల్ప'మని చెప్పాడు. ఈ పదాన్ని గురించి పురాణాలు ఏమీ చెప్పడం లేదు. మరికొందరు పండితులు దీనికి ధర్మశాస్త్రయుక్తంగా ఏవో అర్థాలు చెప్పారు. కానీ దీనికి వివిధ కల్పాలలో జరిగిన విషయములు అనగా పంచలక్షణాలు అందలి అంశాలైన వంశమన్వంతరాలని చెప్పుకొన

వచ్చు. అయితే ఇది ఇప్పటికీ ఏ పండితుడు నిర్ధారించని అంశం. ఇక్కడగల కల్పశుద్ధిభిః అనే పదానికి బ్రహ్మాండపురాణంలోని కల్పజోక్తిభిః అనీ, వాయు పురాణంలో 'కులకర్మభిః' అని పాఠాంతరాలున్నాయి.

ప్రాచీన వాఙ్మయంలో మనకు 'పురాణము' 'పురాణ సంహిత' అనే రెండు పదాలు వినిపిస్తాయి. ఇంతకుముందే పురాణం అనే పదానికి లోకంలో బాగా ప్రచారంలో ఉండి అవ్యవస్థితంగా, ఇక్కడా అక్కడా చెల్లాచెదరుగా ఉన్న లోకవృత్తాత్మకమైన విషయంగల విద్య' అని తెలుసుకొన్నాం.

దీనినే అన్ని శాస్త్రాలు పురాణాలు వేదాల కంటే పురాణమే ముందు బ్రహ్మ నోటి నుండి వెలువడ్డాయని, తరువాత వేదాలు పుట్టాయని తెలుపుతున్నాయి.

పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణాకృతమ్
అనంతరంచ వక్త్రేభ్యో వేదాస్తస్య వినిర్గతాః – అని చెప్పింది ఇదే విషయాన్ని.

ఈ విధంగా పురాణాలు అవ్యవస్థిత రూపంలో చెల్లాచెదరుగా ఉండగా, వ్యాసుడు వాటికి ఒక వ్యవస్థను ఏర్పాటుచేశాడు. చెల్లాచెదురుగా ఉన్న ఆ విషయాలన్నింటినీ, గ్రంథరూపంలో క్రోడీకరించాడు. ఇదే పురాణ సంహిత. వ్యాసుడే పురాణ సంహితను రచించి రోమహర్షణ సూతునికి దానిని బోధించాడని, దానిని ప్రచారంలోకి తెచ్చే విధానం కూడా ఆయన సూతునికి తెలిపాడని తెలుపుతున్నారు.

పురాణ ప్రతిపాదిత విషయాలు

సామాన్య దృష్టితో చూచి పురాణాలలో ప్రతిపాదితమైన విషయాలను ఈ విధంగా సంగ్రహంగా భావించవచ్చు.

ఋషిదేశ మహావీర చరితాన్యవతారకాః
లాజావిధిర్వ్రతా, స్తీర్థానామ్నాం సాహస్ర మేవచ
ఋషి రాజ్ఞాం వంశసూచీ, యుగాస్సృష్టిశ్చ ద్వాదశ
సామాన్యతః పురాణేషు, విషయాః ప్రతిపాదితా.

ఋషులు, దేశాలు, మహావీరుల చరిత్రలు, అవతార కథలు, యజ్ఞాలు ఆచరింప వలసిన విధులు, వ్రతాలు, తీర్థాలు, ఋషుల రాజుల వంశాదికాలు, యుగాలు, సృష్టి క్రమము అనే పన్నెండు విషయాల వర్ణన సామాన్య దృష్టితో చూడగా పురాణాలలో ఉండాలని పెద్దలు తెలుపుతున్నారు.

పురాణవేత్తకు సర్వజ్ఞ బిరుదము

'సర్వజ్ఞుండను నామము శర్వునకె' అని శివుడు ఒక్కడే సర్వజ్ఞ పదానికి అర్హుడని పెద్దల వాక్యం కానీ, సర్వవిషయ సమన్వితమైన పురాణాలనుపుక్కిట పట్టినవాడు కూడా సర్వజ్ఞుడు కాగలడుగదా. అందుకే

యేత్వేతాని సమస్తాని పురాణానిచ జానతే
భారతంచ మహాబాహో; తే సర్వజ్ఞా మతానృణామ్

(మహాభారతము, అష్టాదశ పురాణాలను తెలుసుకొనినవాడు సర్వజ్ఞుడని అనవచ్చునని దీనివలన తెలుస్తున్నది)

యోవిద్యాచ్చతురో, వేదాన్, సాంగోపనిషదోద్విజః
నచేత్పురాణం సంవిద్యా, న్నైవ సస్యాద్విచక్షణః

(నాలుగే వేదాలు, ఉపనిషత్తులు, షడంగాలు తెలుసుకొన్నా బాగా పురాణాలను తెలుసుకొనకపోతే విచక్షణుడు కాదు అని బ్రహ్మాండపురాణం వ్యతిరేక మార్గంలో తెలుపుతున్నది)

పురాణము - అల్బెరూనీ

అల్బెరూని మధ్య ఆసియా ప్రాంతానికి చెందిన పారశీక భాషలో మహాపండితుడు. ఇతని కాలం పదకొండవ శతాబ్ది ఉత్తరార్ధం. ఇతడు దాదాపుగా మన తెలుగుకవి నన్నయ భట్టుకు సమకాలికుడని చెప్పవచ్చు. భారతదేశం మీదకు గజనీ మహమ్మదు దండెత్తి వచ్చేటప్పుడు తన వెంట ఎందరో పండితులు, కవులను తీసుకొని వచ్చాడని చరిత్రకారులు చెపుతున్నారు. వారిలో ఒకడు అల్బెరూని. ఇతడు మంచి పండితుడు. అనేక విద్యలమీద ఆసక్తి ఉన్నవాడు. భారతదేశం వచ్చిన తరువాత అతడు ఇచ్చట సంస్కృత పండితుల సహాయంతో మన దేశాన్ని గుఱించిన ఎన్నో విషయాలను తెలుసుకొన్నాడు. జ్యోతిషశాస్త్రం, దర్శనాలు ఇతనికి అభిమానపాత్రమైన విషయాలు. అందుకే ఆ రెండిటిల్లోను భారతీయ విజ్ఞానాన్ని మథించాడు. భారతదేశాన్ని గుఱించి అతడు రచించిన గ్రంథంలోని 12వ పరిచ్ఛేదంలో భారతీయుల ప్రాచీన సాహిత్యం గుఱించి విస్తృతంగా వివరించాడు. ఈ గ్రంథం రచనాకాలం క్రీ.శ. 1067 ప్రాంతం. ఆ సందర్భంలోనే అతడు అష్టాదశ పురాణాల పట్టికను ఇచ్చాడు. అయితే ఇతను రెండు రకాల పట్టికలను తన గ్రంథంలో ఇచ్చాడు. ఒక పట్టికను విష్ణుపురాణాన్ని అనుసరించి ఇచ్చాడు. దీని ప్రకారం ఇప్పుడు ఎక్కువగా వ్యాప్తిలో ఉన్న పురాణాల పేర్లు తెలిపే సూచికే ఇది అని చెప్పవచ్చు. రెండవ పట్టికలో ఇచ్చిన పేర్లలో కొన్ని ఉపపురాణాలు కూడా చేరాయి. ఈ రెండో పట్టిక ప్రకారం అతడు పేర్కొనిన 18 పురాణాలు ఇవి. 1. ఆదిపురాణం 2. మత్స్యపురాణం 3. కూర్మపురాణం

4. వరాహ పురాణం 5. నరసింహపురాణం 6. వామన పురాణం 7. వాయు పురాణం 8. నందీ పురాణం 9. స్కాందపురాణం 10. ఆదిత్యపురాణం 11. సోమపురాణం 12. సాంబ పురాణం 13. బ్రహ్మపురాణం 14. మార్కండేయపురాణం 15. తార్క్ష్య(గరుడ) పురాణం 16. విష్ణుపురాణం 17. బ్రహ్మాండపురాణం 18. భవిష్య పురాణం.

ఈ పట్టికను విశ్లేషణ చేస్తే

1. ఆల్బెరూనీ కాలానికే మహాపురాణ, ఉపపురాణాలు కలసి పోతూ ఉన్నాయి. ప్రజల దృష్టిలో వానికి అంతా తేడా లేదు.
2. ఉప పురాణాలు ఆరువరకు రచింపబడి ఉన్నాయి. అవి పురాణాలుగానే పరిగణింప బడుతున్నాయి. అవి 1. ఆదిపురాణం 2. నరసింహపురాణం 3. నందీపురాణం 4. ఆదిత్యపురాణం 5. సోమపురాణం 6. సాంబపురాణం.
3. ఆదిపురాణం వేరు. బ్రహ్మపురాణం వేరు. కొన్ని పురాణాలలో ఆది బ్రాహ్మ్యం అని బ్రహ్మ పురాణం చెప్పబడింది.
4. ప్రస్తుత కాలంలో సౌర పురాణం అనే పేరుతో సూర్యుని గురించి చెప్పే పురాణం ఆనాడు లేదని ఆనాడు ఆదిత్య పురాణం ఉన్నదని చెప్పవచ్చు. అది నేడు అనుపలభ్యం. కానీ దాని తెలుగు అనువాదం ఉన్నది. దానిని గురించి ఇంకా లోతుగా అధ్యయనం చేయవలసిన అవసరం ఉన్నది.
5. నేటి కాలంలో సాంబపురాణం ఉన్నది. ఆదిత్యుని విషయంతో జోడింపబడిన చంద్రుని గురించి తెలిపే సోమపురాణం ఆనాడు ప్రచారంలో ఉండేది. ఇప్పుడు లేదు.

ఆల్బెరూనీ తాను ఈ అష్టాదశ పురాణాలలో కేవలం ఆదిత్య, మత్స్య, వాయు పురాణాలలోని కొన్ని అంశాలు మాత్రమే చదివినట్లుగా తెలుపుతున్నాడు. అతడు విష్ణు పురాణము, విష్ణుధర్మోత్తరాల నుంచే భౌగోళిక సంబంధమైన అనేక అంశాల వివరాలను తన గ్రంథంలో ఇచ్చాడు. దీనివలన నాటికి ఈ రెండు పురాణాలు అత్యంత ప్రచారంలో ఉన్నట్లు గ్రహించవచ్చు. ఇలా ఆల్బెరూనీ పురాణాల నుంచి, వాటిని గుఱించి విలువైన సమాచారం అందచేశాడు.

బల్లాలసేనుని దానసాగరము - పురాణము

క్రీ.శ. 1169లో వంగదేశపు చివరి స్వతంత్ర పరిపాలకుడు, లక్ష్మణసేను (1160-1210)ని తండ్రి బల్లాలసేనుడు. బల్లాల సేనుడు హేమంతసేనుని పౌత్రుడు. విజయసేనుని కుమారుడు. బల్లాల సేనుని కుమారుడైన లక్ష్మణసేనుడు యుగకర్త. అతనిపేరుమీద లక్ష్మణ సంవత్సరము లేక లక్ష్మణ శకము అనే కాలగణన ప్రారంభం అయింది. ఇతని ఆస్థానంలోనే జయదేవుడు, గోవర్ధనాచార్యుడు మొదలైన విఖ్యాత సంస్కృత కవులు

ఉండేవారు. బల్లాలసేనుడు 'సాగరము' అని చివర వచ్చే అయిదు విశిష్ట గ్రంథాలను రచించాడు. అవి 1. అద్భుత సాగరము 2. దాన సాగరము 3. ప్రతిష్ఠా సాగరము 4. ఆచార సాగరము 5. వ్రత సాగరము. ఇందులో అద్భుత సాగరం, దానసాగరాలు మాత్రమే ముద్రితం. దానసాగరంలో వ్రత సాగరం పేర్కొనబడింది. అద్భుత సాగరం క్రీ.శ. 1167లో ప్రారంభించబడి అతని కుమారుడైన లక్ష్మణసేనునిచేత పూర్తి చేయబడింది. దానసాగరం క్రీ.శ. 1169లో రచింపబడింది. బల్లాలసేనుని సాహిత్య జీవనం క్రీ.శ. 1155 నుండి 1180 వరకు అని చెప్పవచ్చు.

దానసాగరం ప్రారంభంలో బల్లాలసేనుడు పురాణ స్వరూపాన్ని వివరించాడు. ఈతడు తాను ఏయే పురాణాల నుంచి ఏయే విషయాలను సేకరించాడో కొన్నింటిని ఎందుకు వదలివేశాడో తెలిపిన విషయాలు చాలా ప్రామాణికమైనవి. ఆ రోజుల్లో ఇంత ప్రామాణిక ఆలోచన ఉన్నవారే చాలా ఆరుదని చెప్పవచ్చు.

దానసాగర పురాణము ధర్మశాస్త్ర గ్రంథాల నుంచి దాన విషయకమైన సర్వ విషయాలను సంగ్రహించి కూర్చిన గ్రంథం. ఆయన తన దానసాగరంలో బ్రహ్మ, వరాహ, ఆగ్నేయ, భవిష్య, మత్స్య, వామన, వాయు, మార్కండేయ, విష్ణు, శివ, స్కంద, పద్మ (అనే పురాణాలు), సాంబపురాణం, కాలికా పురాణం, నందిపురాణం, ఆదిత్య, నరసింహ, మార్కండేయ, విష్ణుధర్మోత్తర, విష్ణుధర్మాలనే ఉపపురాణాలు, గోపథ బ్రాహ్మణ, రామాయణం నుంచి మహాభారతం నుంచీ, మను, వశిష్ఠ సంవర్త మొదలైన స్మృతుల నుంచి ఉదాహరించాడు. పైన పేర్కొన్న 12 పురాణాలు తప్ప ఇతర పురాణాల నుంచి పేర్కొన లేదు. వాటి అప్రామాణ్య ప్రామాణ్యతల గుఱించి బల్లాల సేనుడు వెలిబుచ్చిన అభిప్రాయం చాలా విలువైనది. అతడు

భాగవతంచ పురాణం బ్రహ్మాండంచైవ నారదేయంచ
దానవిధి శూన్యమేతత్ త్రయమపి నిబద్ధమవధార్య"

(దానసాగరం - ఉపక్రమణిక 57)

అని భాగవతము, బ్రహ్మాండపురాణం, నారదీయ పురాణాలలో దాన సంబంధమైన విషయాలేమీ లేవు కాబట్టి వాటిని తాను స్పృశించలేదని చెప్పాడు. ఇలాగే ఇంకా మిగిలిన అనేక గ్రంథాల గుఱించి అతడు సహేతుకమైన కారణాలిచ్చాడు. మత్స్య పురాణంలో చెప్పబడిన మహాదానముల యొక్క సారమే లింగపురాణంలో కూడా చెప్పబడడం వల్ల దానిని ప్రమాణంగా తీసుకొనలేదని చెప్పాడు. భవిష్యత్పురాణంలో సప్తమి తిథుల వరకు మాత్రమే సంగ్రహంగా చెప్పబడింది. పైగా పాఖండులైన బౌద్ధులు దానిని ఖండించడం చేతను, శివరహస్యము, విష్ణు రహస్యాలనేవి ప్రజలలో ప్రచారంలో ఉన్నా దాన

విషయకమైన వృత్తాంతాలు వాటిల్లో సంగ్రహంగా ఉన్నందువల్లనూ ఇవి మౌలిక గ్రంథాలుగా బల్లాల సేనుడు గ్రహించలేదు. భవిష్యోత్తర పురాణంలో ఆచార వర్ణన మొదలైన విషయాలున్నా దీనిలో ప్రామాణికంగా తీసుకోదగిన ఆధారాలు లేవని అతని ఉద్దేశ్యం. స్కాందపురాణంలోని మూడు ఖండాలు - కాశీ, రేవా, అవంతీ ఖండాలు కేవలం కథల మీదనే ఆశ్రితాలు. గరుడ, బ్రహ్మ, ఆగ్నేయ పురాణాలు. ఇరవైమూడు వేల శ్లోకాలున్న విష్ణుపురాణం, ఆరు వేల శ్లోకాలున్న రెండో లింగపురాణంలో దీక్ష, ప్రతిష్ఠ, నాస్తికుల (పాఖండికుల) యుక్తులు, రత్నపరీక్ష, మిథ్యావంశానుచరితం, కోశ - వ్యాకరణాది విషయాలు ఉండడం, అసంగతమైన కథలతో ఉండడం, పరస్పరం విరోధం కలిగిన విషయాలుండడం, మన్మథుని గుఱించిన కథలు, భంధ, ధూర్త, పాఖండ (బౌద్ధులు), లింగి (సన్యాసి, పాశుపత - పంచ రాత్రులకు చెందినవాడు) అనే విషయాల ద్వారా ప్రపంచానికి ఉపకారం చేయని విషయాలున్నందువల్ల ఈ పురాణ ఉప పురాణాలన్నీ నిరాకరించబడ్డాయి. దేవీ భాగవతం కూడా ఇందులోకి చేరుతుంది. ఇందుకు కారణం ఇది పురాణ ఉపపురాణాలలో చేర్చబడ లేదు. రెండవది దీనిలో నిందిత కర్మలైన మారణ, మోహనాది కర్మలు వివరించబడి నందువల్లనూ, పాఖండ, తంత్రశాస్త్ర విషయాలు చెప్పబడి వానిని అనుసరిస్తున్నందు వలన ఇది కూడా నిరాకరించబడింది. కాబట్టి ఈ గ్రంథాల నుంచి శ్లోకాలు ఉద్ధరింప బడలేదు.

పై విషయాలనుబట్టి బల్లాలసేనుని దానసాగరమనే గ్రంథం ద్వారా క్రీ.శ. 12వ శతాబ్దానికి చెందిన పురాణాల గురించి తెలుసుకొన కలిగిన విషయాలు.

1. మహాపురాణాలలో విష్ణు భాగవతమే పరిగణింపబడెడిది. దేవీ భాగవతము కాదు.
2. వాయుపురాణం, శివపురాణం రెండూ మహాపురాణాలలోనివిగా పరిగణింపబడేవి.
3. స్కాందపురాణంలోని సంహితాత్మక భాగంలోని శివరహస్య ఖండం కూడా స్కాందంగానే పరిగణింపబడేది. కానీ ఈ విషయం ఇంకా లోతుగా ఆలోచించ వలసి ఉన్నది.
4. బ్రహ్మ, ఆగ్నేయ, లింగ, విష్ణు పురాణాలు ఆ రోజులలో రెండు విధాలుగా లభ్యం అవుతుండేవి. 23 వేల శ్లోకాలుండే విష్ణుపురాణం, ఆరువేల శ్లోకాలుండే లింగ పురాణం ఆ కాలంలో ప్రామాణికంగా తీసుకొనబడలేదు. కూర్మపురాణంలో చెప్పినట్లుగా (1-17-20) ఉప పురాణాలుగా స్కంద, వామన, బ్రహ్మాండ, నారదీయ పురాణాలు ఆరోజులలో ఉండేవి. ఇవే పేర్లతో మహా పురాణాలు ఉండేవి.

దీనివల్ల చాలా పురాణాలే సంక్షేప రూపంలో ఉపపురాణాలుగా ఆ రోజుల్లో ఉండేవని నిర్ణయించవచ్చు. కానీ ఆయా మహాపురాణాల పేర్లతోనే ప్రచారంలో ఉండేవని చెప్పగలం.

5. ఆ రోజులలో ప్రజలు తంత్ర విధానాలను సమర్థించేవారు కాదు. అందువలననే దేవీ భాగవతం ప్రామాణికంగా తీసుకొనబడలేదు. ఇలాగే స్కాందంలోని కొన్ని భాగాలు కూడా వదలివేయబడ్డాయి.
6. గరుడ పురాణాన్ని బల్లాలసేనుడు పైన చెప్పిన అనేక కారణాల వల్ల ప్రామాణికంగా తీసుకొనలేదు.

ఇలా బల్లాలసేనుని ఈ కథనం ద్వారా 12వ శతాబ్దికి చెందిన పురాణాలను గురించిన అనేక విషయాలను మనం గ్రహించుకొనవచ్చు.

పురాణ పరిచయం

వేలకొలది శ్లోకాలు, వందల కొలది వృత్తాంతాలు ఉన్న ఒక్కొక్క పురాణం ఒకే విభాగంగా ఉండటం కుదరనిపని. అందుకే ఇవి భాగ, ఖండ, అంశ, స్కంధ, పాద, పర్వ, సంహిత అధ్యాయాలనే విభాగాలుగా చేయడ్డాయి. దీని అర్థం అన్ని విభాగాలు ఒకే పురాణంలో ఉంటాయని కాదు. కొన్నింటిలో కొన్ని కొన్ని ఉండవచ్చు. అలాగే భాగ, అంశ, ఖండాలలో కూడా అనేక అధ్యాయాలు ఉండవచ్చు. ఆ విధంగా అన్ని పురాణాల లోను అధ్యాయాలనే విభాగం ఉంటుంది. కానీ భాగ, ఖండ, అంశాలు వేటికవి ప్రత్యేకంగా కొన్ని కొన్ని పురాణాల లోనే ఉంటాయి. ఇక్కడ ఏయే పురాణాలు ఏయే విభాగాలుగా చేయబడిందో కూడా తెలుపబడింది.

అష్టాదశ పురాణాల గురించి చాలా విషయాలు ఇంతకుముందే తెలియజేయ బడ్డవి కదా. ఇక ఇప్పుడు వానిలో చెప్పబడిన విషయాలను గురించి తెలుసుకొందాం.

1. బ్రహ్మపురాణం :

ఈ పురాణానికి 'ఆదిబ్రాహ్మ్యం' అనే పేరు కూడా వ్యాప్తిలో ఉన్నది. పురాణాలలో ఉండవలసినవిగా చెప్పబడే సమస్త విషయాలు ఇందులో ఉన్నాయి. సృష్టి వివరణ తరువాత సూర్యవంశం, చంద్రవంశ రాజుల వృత్తాంతం అతి సంక్షిప్తంగా ఉన్నది. పార్వతీ వృత్తాంతం చాలా ఎక్కువగా దాదాపు పది (30 నుంచి40 వరకు) అధ్యాయాలలో వర్ణించబడింది. మార్కండేయాఖ్యానం తరువాత గౌతమీ, గంగ, కృత్తికా తీర్థం, చక్రతీర్థం, పుత్రతీర్థం, యమతీర్థం, ఆపస్తంబ తీర్థం మొదలైన అనేక ప్రాచీన తీర్థ విశేషాలు గౌతమీ మాహాత్మ్యంలో భాగంగా (అధ్యాయాలు 70 నుండి 175) వివరించ బడ్డాయి. శ్రీకృష్ణ భగవానుడి చరిత్ర 180 నుంచి 212వ అధ్యాయం వరకు 326 అధ్యాయాలలో విస్తృతంగా వర్ణించబడింది. శ్రీకృష్ణనిచరిత్ర అంతా భాగవతం దశమ స్కంధంలో చెప్పినట్లే ఉన్నది. భేదం ఏమాత్రం లేదు. ఇంతేకాకుండా ఈ పురాణంలో జీవుడు మరణించిన తరువాత పొందే వివిధ అవస్థల వర్ణనకూడా అనేక అధ్యాయాలలో కన్పిస్తుంది. అయితే

పురాణాలలో మనకు సహజంగా కనపబడే భూగోళ వర్ణన అంత ఎక్కువగా దీనిలో కనిపించదు. కానీ ప్రస్తుత ఒరిస్సా రాష్ట్రంలో ఉన్న కోణాదిత్య (కోణార్క) అనే పేరుగల తీర్థ వివరణ దానికి సంబంధించిన సూర్య ఆరాధన గురించి వివరణ ఈ పురాణంలోని ప్రత్యేకత. సూర్యమహిమ, ఆయన ప్రసరించే శక్తిని గురించిన వివరణ ఆరు అధ్యాయాలలో ఉన్నది.

ఈ పురాణంలో దాదాపు పది అధ్యాయాలలో సాంఖ్యయోగ వివరణ చాలా విస్తృతంగా (234 నుండి 244) ఉన్నది. కరాళజనకుడు ప్రశ్నించటం వలన వశిష్ఠ మహర్షి చేత మహిమాన్వితమైన సాంఖ్యయోగ సిద్ధాంతాలు వివరించబడ్డాయి. ఇక్కడ గమనించవలసిన ముఖ్య విషయం ఒకటి ఉన్నది. తరువాత కాలంలో ప్రచారంలోకి వచ్చిన సాంఖ్య యోగ విషయాలు అనేకం ఇందులో చెప్పబడిన ముఖ్య సాంఖ్య విషయా లతో విభేదిస్తున్నాయి. అంతకుపూర్వపు సాంఖ్యంలో తత్త్వాలు 25 అని చెప్పబడగా, ఇందులో మూర్ధస్థానీయంగా 26వ తత్త్వం యొక్క వివరణ ఉన్నది. పౌరాణిక సాంఖ్యంలో నిరీశ్వర వాదం ప్రతిపాదితంకాదు. ఇందులో జ్ఞానంతోపాటు భక్తికి కూడా విశిష్టమైన స్థానం ఇవ్వబడింది. ఈ పురాణంలోని ఇంకొక విశేషమేమంటే ఇందులోని కొన్ని అధ్యా యాలు వ్యాస మహాభారతంలోని పన్నెండవదైన శాంతిపర్వంలోని కొన్ని అధ్యాయాలతో అక్షరం అక్షరం ఏకీభవిస్తున్నవి. ధర్మమే పరమ పురుషార్థమని ఈ పురాణం ఉద్ఘోషిస్తున్నది.

ధర్మేమతిర్భవతు వः పురుషోత్తమానాం
సహ్యేక ఏవ పరలోకగతస్య బంధుः
అర్థాः స్త్రియశ్చ నిపుణైరపి సేవ్యమానా
నైవ ప్రభావ ముపయంతి న చ స్థిరత్వమ్ *(బ్ర.పు. 255-35)*

పురుషోత్తములైన వారి కందరకు ధర్మమునందే బుద్ధి స్థిరమగుగాక. పరలోకమునకు పోయినప్పుడు అది ఒక్కటియే బంధువు కాగలదు. అర్థకామములను రెండింటిని ఎంత జాగ్రత్తగలవారుగా సేవించినను వాని వలన లభించు ఫలము స్థిరములు కావు. అవి ఎట్టి సత్ఫలములను చూపలేవు.

ఇది రెండు భాగాలుగా చేయబడింది. 1. పూర్వభాగం, 2. ఉత్తర భాగం. రెండు భాగాలలోనూ కలిపి 245 అధ్యాయాలున్నాయి. నారదపురాణాన్ని అనుసరించి ఇందులో పదివేల శ్లోకాలు ఉండగా మత్స్యపురాణానుసారము 13,000 శ్లోకాలు ఉన్నాయి.

2. పద్మపురాణము

ఈ పురాణం విస్తృతిలో స్కాందపురాణానికి తరువాతదిగా ఉండి, మిగిలిన 16 పురాణాలకంటె పెద్దది. దీనిలోని శ్లోక సంఖ్య అర్థలక్ష (యాభైవేలు). అంటే లక్ష శ్లోకాల

విస్తృతిగల మహాభారతంలో సగము, భాగవతానికి దాదాపు మూడురెట్లు పెద్దదైన పురాణం ఇది. ఈ పురాణం రెండు రకాలైన పాఠాలతో లభిస్తున్నది. వంగదేశ పాఠం ఒకటి. ఇది ఇప్పటికీ ముద్రితం కాలేదు. వ్రాతప్రతిగానే ఉన్నది. రెండవది ఆనందాశ్రమ పాఠ ప్రతి. ఇది ఆరుఖండాలు అనగా... 1) ఆదిఖండం, 2) భూమిఖండం, 3) బ్రహ్మఖండం, 4) పాతాళఖండం 5, సృష్టిఖండం, 6) ఉత్తరఖండం అనే ఆరు భాగాలుగా ముద్రితమైంది. ఇందులోని 125వ అధ్యాయంలోని శ్లో.48-49 శ్లోకాల ప్రకారం ఈ ఖండ విభజన అనంతర కాలంలో జరిగినట్లు తెలుస్తున్నది. మూలంలో ఐదు ఖండాలు మాత్రమే ఉన్నాయని అముద్రిత వంగప్రతిలో అదే రకమైన విభజన ఉన్నదని పురాణపండితులు తెలుపుతున్నారు. దీనికే

ప్రథమం సృష్టిఖండం హి భూమిఖండం ద్వితీయకమ్
తృతీయం స్వర్గఖండంచ పాతాలశ్చ చతుర్థకమ్
పంచమంచోత్తరంఖండం సర్వపాప ప్రణాశనమ్ - అని తెలుపుతున్నది.

1. సృష్టిఖండం : దీనిలో 82 అధ్యాయాలున్నాయి. ఇందులోని ప్రథమ అధ్యాయం వలన ఈ పురాణంలో 55,000 శ్లోకాలున్నాయని, ఈ పురాణం అయిదు పర్వాలతో విభజింపబడిందని తెలుస్తున్నది. అవి 1) పౌష్కర పర్వం - ఇందులో దేవతలు, మునులు, పితరులు, మనుష్యుల వంటి తొమ్మిది రకాల సృష్టిని గురించిన విపులవర్ణన ఉన్నది. 2) తీర్థపర్వం : ఇందులో పర్వత, ద్వీప, సప్తసాగర వర్ణన ఉన్నది. 3) తృతీయ పర్వం: దీనిలో ఎక్కువగా దక్షిణలను ఇచ్చే రాజుల వర్ణన ఉన్నది. 4) చతుర్థపర్వం : రాజుల వంశాను కీర్తనం ఉన్నది. 5) మోక్షపర్వం : మోక్షము దాని సాధన మార్గాల గురించిన వివరణ ఉన్నది. ఈ ఖండంలోనే సముద్రమథనం, పృథుజననం పుష్కర తీర్థవాసుల ధర్మవృత్తాంతం, వృత్రాసుర సంగ్రామం, వామనావతారము, మార్కండేయముని ఉత్పత్తి, కార్తికేయజననం, శ్రీరామచరిత్రం, తారకాసుర వధ మొదలైన వృత్తాంతాలు విస్తారంగా వర్ణింపబడ్డాయి.

2. భూమి ఖండం : ఈ ఖండం మొదట్లోనే శివశర్మ అనే పేరుగల బ్రాహ్మణుడు పితృ భక్తి చేత స్వర్గాన్ని పొందటం, పృథుమహారాజు పుట్టుక, చరిత్ర వర్ణనము, ఒక మాయా వేషధారి యొక్క బోధల ద్వారా జైన ధర్మ విషయాలు విని వేనుడు చెడుమార్గాన్ని ప్రవేశించడం, అప్పుడు సప్తర్షులవలన అతడి భుజమథనం జరిగి, పృథువు జన్మించడం, అనేక విధాలైన నైమిత్తిక, ఆభ్యుదాయక దానాల తరువాత, సతీసుకళ యొక్క పాతివ్రత్య సూచక కథలు చాలా విపులంగా వివరించబడ్డాయి. యయాతి, మాతలుల ఆధ్యాత్మిక విషయ సంవాదాలు, పాపపుణ్య ఫలవివరణలు, విష్ణుభక్తి ప్రశంస తెలుపబడ్డాయి. చ్యవన మహర్షి వృత్తాంతం సుదీర్ఘంగా తెలుపబడింది. పద్మపురాణం ముఖ్యంగా విష్ణుభక్తికి ప్రతిపాదితము. కానీ ఇందులో ఇతర దేవీ, దేవతల యొక్క అనాదరభావ ప్రకటన లేదు. ఇందులో

శివకేశవ అభేదత్వమే ప్రకటించబడింది. ఈ తత్త్వమే

శైవం చ వైష్ణవం లోకమేకరూపం నరోత్తమ
ద్వయోశ్చాప్యనంతరం నాస్తిఏకరూపం మహాత్మనోః
శివాయ విష్ణురూపాయ విష్ణవే శివరూపిణే
శివశ్చహృదయే విష్ణుః విష్ణోశ్చహృదయే శివః
ఏకమూర్తిస్త్రయోదేవాః బ్రహ్మవిష్ణు మహేశ్వరాః
త్రయాణామంతరంనాస్తి, గుణభేదాః ప్రకీర్తితా

అనే శ్లోకం ద్వారా తెలుపబడింది.

3. స్వర్గఖండం : ఈ ఖండంలో దేవ, గంధర్వ, అప్సర, యక్షాదిలోకాల విస్తృతవర్ణన వున్నది. ఈ ఖండంలోనే శకుంతలోపాఖ్యానం కూడా ఉన్నది. ఇది మహాభారతంలోని శకుంతలోపాఖ్యానంతో పూర్తిగా విభేదిస్తున్నది. కానీ కాళిదాసు అభిజ్ఞానశాకుంతల కథతో పూర్తిగా ఏకీభవిస్తున్నది. అందుకే కొందరు పండితులు కాళిదాసు అభిజ్ఞాన శాకుంతల కథేతిహాసం మహాభారతం నుంచి కాక ఈ పద్మపురాణం నుంచి గ్రహించాడని తెలుపుతున్నారు. విక్రమోర్వశీయం గురించి కూడా ఇలాంటి వాదమే ఉన్నది.

4. పాతాళఖండం : ఈ ఖండంలో నాగలోకం యొక్క విస్తృత వర్ణన ఉన్నది. ప్రసంగతః రావణ విషయం వచ్చినప్పుడు మొత్తం రామాయణకథ ఇందులో చెప్పబడింది. ఇందులోని ఇంకొక ప్రత్యేకత ఏమిటంటే కాళిదాసు తన రఘువంశంలో చెప్పిన రామకథతో ఇందలి వృత్తాంతం పూర్తిగా సరిపోలుతూ ఉన్నది. రావణవధానంతరం సీతాపరిత్యాగం, కుశలవ జననం, రామాశ్వమేధవృత్తాంతాలు కూడా ఇందులో చెప్పబడ్డాయి. ఈ వృత్తాంతం అంతా భవభూతి రచించిన ఉత్తర రామచరిత కథావృత్తాంతంతో ఏకీభవిస్తున్నది. ఈ పురాణంలో వ్యాసుడు అష్టాదశ పురాణాలను రచించిన విషయం తెల్పి అందులో భాగవతపురాణం యొక్క మహిమ విస్తృతంగా వివరించబడింది.

5. ఉత్తర ఖండం : ఈ అయిదవదైన ఉత్తరఖండంలో వివిధ రకాలైన ఆఖ్యానాల సంక్షిప్త వర్ణనం ఉన్నది. ఈ ఖండంలోనే విష్ణుభక్తిని గురించిన ప్రశంస విస్తృతంగా కనిపిస్తుంది. దీనికి పరిశిష్ట అంశంగా 'క్రియాయోగసారం' అనే భాగం కూడా లభిస్తున్నది. ఇందులో వ్రతాలు, తీర్థసేవనం మొదలైన విషయాలతో శ్రీమహావిష్ణువు విశేషంగా ప్రసన్నుడై కోరికలు తీరుస్తాడని చెప్పబడింది.

పద్మపురాణం విష్ణుభక్తి ప్రతిపాదక పురాణాలలో ముందుగా నిలిచే గ్రంథం. భగవంతుని నామ గుణగానం ఎన్ని విధాలుగా చక్కగా చేయవచ్చునో, ఎన్ని పేర్లు

అపరాధ యుక్తాలైనవో మొదలైన విషయాలకు సమాధానం చాలా ప్రామాణికంగా ఈ పురాణంలో లభిస్తాయి. అందువలననే తరువాతకాలంలో వచ్చిన వైష్ణవ సంప్రదాయక గ్రంథాలు ఈ పురాణాన్ని విశేషంగా స్తుతించి ప్రామాణికంగా స్వీకరించాయి. సాహిత్య దృష్టితో చూచినా ఈ పురాణ శైలి బహుసుందరంగా ఉంటుంది. సామాన్యంగా పురాణరచనలో అనుష్టుప్ఛందం విశేషంగా ఉపయోగపడుతుండగా ఇందులో అనుష్టుప్ ఛందమేగాక ఇతర దీర్ఘ ఛందాలు కూడా విశేషంగా ఉపయోగించబడ్డాయి. ఉదాహరణకు ఈ శ్లోకం చూడండి :

సంసారసాగరమతీ్వ గభీరపారం, దుఃఖోర్మిభిర్వివిధ మోహమయైస్తరంగైః
సంపూర్ణమస్తి నిజదోషగుణైస్తుప్రాప్తం, తస్మాత్ సముద్ధర జనార్దన మాంసుదీనం

ఇలాంటి చక్కని రచనా శైలితో ఉన్న పురాణం ఇది.

ఇందులో సృష్టి ఖండంలో 82 అధ్యాయాలు, భూ ఖండంలో 125 అధ్యాయాలు స్వర్గ ఖండంలో 39 అధ్యాయాలు, పాతాళ ఖండంలో 113 అధ్యాయాలు, చివరిదైన ఉత్తర ఖండంలో 282 అధ్యాయాలు ఉన్నాయి. మొత్తంమీద ఈ గ్రంథంలో 641 అధ్యాయాలలో 55,000 శ్లోకాలు ఉన్నాయి.

3. విష్ణుపురాణం :

దార్శనిక ప్రభావ దృష్టితో చూస్తే విష్ణుభాగవతం, ప్రథమ గ్రంథంగా నిలిస్తే, ద్వితీయ స్థానాన్ని విష్ణుపురాణం ఆక్రమిస్తుంది. వైష్ణవ దర్శనానికి మూలాలంబనం విష్ణు పురాణమే. అందువలననే వైష్ణవ మత ప్రతిపాదకులు శ్రీమద్రామానుజులవారు తమ శ్రీభాష్యంలో దీనినే ప్రమాణంగా తీసుకొని, ఎన్నో సందర్భాలలో దీనిలోని భాగాలను ఉద్ధరించారు. పరిమాణంలో ఇది చిన్న పురాణమే. కానీ ప్రభావంలో మాత్రం చాలా గొప్ప గ్రంథం. దీనిలోని భాగాలను 'అంశాలు' అంటారు. దీనిలో ఆరంశాలు ఉన్నాయి. ఈ ఆరు అంశాలు 126 అధ్యాయాలుగా విభజించబడ్డాయి. విస్తృతిలో ఇది శ్రీమద్భాగ వతంలో మూడవవంతు మాత్రమే.

ఇందులోని ప్రథమ అంశంలో సృష్టివర్ణన ఉన్నది. (11వ అధ్యాయం నుంచి 20 వరకు) ద్వితీయ అంశంలో భూగోళం యొక్క సాంగోపాంగ వివరణ విస్తృతంగా ఉన్నది. తృతీయాంశంలో వివిధాశ్రమ సంబంధమైన కర్తవ్యాల విధులు చెప్పబడ్డాయి. ఈ అంశంలోనే మూడు అధ్యాయాలలో (4,5,6) వేదముల యొక్క వివిధ శాఖల విశిష్టమైన వర్ణనము ఉన్నది. ఇది వేదాధ్యయనం చేసేవారికి వేద విజ్ఞాన జిజ్ఞాసువులకు చాలా అవసరమైన విషయము. నాల్గవ అంశం ముఖ్యంగా ఐతిహాసిక లేక చారిత్రక విషయాలకు సంబంధించినది. ఇందులో చంద్రవంశానికి చెందిన యయాతి చరిత్ర చెప్పబడింది.

యదు, తుర్వసు, ద్రుహ్య, అను, పురులనే ఈ అయిదు ప్రసిద్ధ క్షత్రియ వంశాలను గురించిన విషయాల వర్ణన వివిధ అధ్యాయాలలో ఉన్నది. పంచమాంశం 37వ అధ్యాయంలో శ్రీకృష్ణ భగవానుని అలౌకిక చరిత్ర, వైష్ణవభక్తుల వృత్తాంతము ఉన్నది. ఈ అంశంలో భాగవతంలోని దశమ స్కంధంవలె శ్రీకృష్ణ చరిత్ర సంపూర్తిగా వర్ణించబడింది. కానీ ఈ చరిత్ర లోని వృత్తాంతాలు సంగ్రహంగానే ఉన్నాయి. షష్ఠాంశంలో కేవలం ఆరు అధ్యాయాలు మాత్రమే ఉన్నాయి. ఇందులో ప్రళయము గురించి, భక్తి వివేచన గురించి వివరించబడి ఉన్నది.

సాహిత్యదృష్టితో చూస్తే విష్ణుపురాణం చాలా రామణీయకమైన గ్రంథం. వృత్తాంతాలను సరసంగా, సుందరంగా వివరించిన పురాణం ఇది. దీని నాల్గవ అంశంలో ప్రాచీన గద్యరూపాలకు విశిష్ట ఉదాహరణలు లభిస్తాయి. జ్ఞానంతోపాటు భక్తియొక్క సామంజస్యం ఈ పురాణంలో చాలా హృద్యంగా ప్రదర్శింపబడింది. ప్రధానంగా ఇది విష్ణుపారమ్యంగా రచింపబడిన పురాణం అయినా, ఇందులో సంప్రదాయక వైష్ణవేతర న్యూనత సుతరాము కనిపించదు. శ్రీకృష్ణ భగవానుడే స్వయంగా తాను శివుడు అభిన్నులమని శ్రీముఖునితో చెప్పిన ఈ విషయం ద్వారా తెలుస్తుంది.

యోఽహం సత్వం జగచ్చేదం సదేవాసుర రమానుషం
మత్తో నాన్య దశేషం యత్, తత్తంజ్ఞాతుమిహార్హసి
అతిద్యామోహితాత్మానః పురుషాభిన్న దర్శినః
వదంతి భేదం పశ్యంతి, చావే యోరంతరంహర.

అంతేగాకుండా మనుష్యులు మాట్లాడాలి. ఆ మాట్లాడేది సుందరంగా ఉండాలని ఈ పురాణం తెలుపుతున్నది చూడండి.

హితం, మితం, ప్రియంకాలే వశ్యాత్మా యోఽభిభాషతే
సయాతి, లోకానాహ్లాదహేతు భూతాన్ నృపాక్షయాన్.

పురాణాల మిత్రసమ్మితంగా విషయాన్ని వివరిస్తుందనేది విష్ణుపురాణం ద్వారా ప్రతి అక్షరంలోనూ నిరూపించబడుతుంది.

ఇది రెండు భాగాలు. పూర్వభాగం, ఉత్తర భాగం అనేవే. ఇప్పుడు కేవలం పూర్వ భాగమే లభ్యం అవుతున్నది. ఈ పూర్వభాగం ఆరు అంశాలుగా విభజించబడింది. ప్రథమాంశంలో 22, ద్వితీయాంశంలో 16, తృతీయాంశంలో 28 చతుర్థాంశంలో 24 పంచమాంశంలో 38. షష్ఠాంశలో 8 అధ్యాయాలు ఉన్నాయి. మొత్తం ఆరు అంశాలలోని 12 అధ్యాయాలలో 23 వేల శ్లోకాలు ఉండగా ఉత్తర భాగం లభ్యం కావటం లేదు. అయితే కొందరు విష్ణు ధర్మోత్తరమనే పురాణాన్ని విష్ణుపురాణ ఉత్తర భాగంగా భావిస్తున్నారు. విష్ణు ధర్మోత్తరాన్ని కలుపుకొంటే ఇంతకు ముందు చెప్పిన 23 వేల శ్లోక సంఖ్య సంపూర్ణం అవుతుంది.

5. వాయు పురాణం :

ఇది అన్ని పురాణాలలోకి చారిత్రకదృష్టితో చూస్తే ప్రాచీనమైన పురాణం. మహాకవి బాణభట్టు తన కాదంబరి గద్యకావ్యంలో 'పురాణేవాయు ప్రలపితమ్' అని దీనిని పేర్కొన్నాడు. అందువలన దీని రచనము బాణభట్టు కంటే చాలా పూర్వమే జరిగి ఉండాలని చెప్పవచ్చు. మిగిలిన వానితో పోలిస్తే ఇది పరిమాణంలో చిన్నదే. ఇందులో కేవలం 112 అధ్యాయాలున్నాయి. శ్లోకాల సంఖ్య దాదాపు పదకొండువేలు. ఈ పురాణం నాలుగు పాదాలుగా విభజించబడింది. వీటిని పాదాలు అంటున్నారు. అవి. 1) ప్రక్రియాపాదం, 2) అనుషంగపాదం, 3) ఉపోద్ఘాత పాదం, 4) ఉపసంహార పాదం అనేవి. దీని మొదటి ప్రక్రియాపాదంలో సృష్టిక్రమాన్ని గురించి చాలా విపులంగా అనేక అధ్యాయాలలో వర్ణించ బడింది. తరువాత చతురాశ్రమ విధానాల వివరణ ఉన్నది. ప్రాచీన భౌగోళిక విషయాల అధ్యయనం కోసం ఈ పురాణం చాలా ఉపయోగకరమైన గ్రంథం. ఇందులో జంబూ ద్వీపవర్ణన విస్తృతంగా ఉన్నది. అలాగే ఇతర ద్వీపాల విషయం కూడా చక్కని శైలిలో 6 అధ్యాయాలలో (34 నుంచి 39 వరకు) వివరించబడింది. ఖగోళవర్ణన కూడా ఈ పురాణంలో విస్తృతంగా చేయబడింది. (50 నుంచి 53 అధ్యాయాలు) అనేక అధ్యాయాలలో యుగ, యజ్ఞ, ఋషి, తీర్థవర్ణనలు విస్తృతంగా లభ్యం అవుతున్నాయి. 60వ అధ్యాయంలో నాలుగు వేదాలలోని వివిధ శాఖల వివరణ విస్తృతంగా ఉన్నది. సాహిత్య దృష్టితో ఈ పురాణం విస్తృతంగా అధ్యయనం చేయవలసిన అవసరం చాలా ఉన్నది. ప్రజాపతి వంశవర్ణన (అధ్యయం 61-65) కశ్యపీయ ప్రజ్ఞాసర్గ (66-69 అధ్యాయాలు), ఋషివంశ వర్ణన (70వ అధ్యాయం), ప్రాచీన బ్రాహ్మణ వంశాల చరిత్రను తెలుసుకొనటానికి ఈ వివరాలు చాలా వరకు ఉపయోగపడతాయి. శ్రాద్ధవర్ణన కూడా అనేక అధ్యాయాలలో ఉన్నది. 86వ అధ్యాయం87వ అధ్యాయం వరకు సంగీత విషయాలను గురించిన ప్రత్యేక వివరాలు ఉన్నాయి. 99వ అధ్యాయాల ప్రాచీన రాజుల చరిత్రను విస్తృతంగా వివరించింది. అందుచేత చారిత్రక దృష్టితో పరిశీలిస్తే ఇది చాలా ముఖ్యమైన పురాణం.

ఈ పురాణం యొక్క ముఖ్యవైశిష్ట్యం శివచరిత్రాన్ని విస్తృతంగా వర్ణించటం. కానీ ఇది సంప్రదాయిక దృష్టికోణంతో చూస్తే నిందార్హమైనదికాదు. చాలా అధ్యాయాలలో ఇందులో విష్ణువర్ణన కూడా ఉన్నది. విష్ణుమాహాత్మ్యము, ఆయన అవతారాల వర్ణన చాలా అధ్యాయాలలో కనిపిస్తుంది. పశుపతి ఆరాధనను తెలిపే పాశుపతయోగం ఈ పురాణంలో చాలా ప్రత్యేకంగా నిరూపించబడింది. అలాగే ఆ పాశుపతయోగ ప్రక్రియ చాలా విస్తృతంగా 11-15 అధ్యాయాలలో వివరించబడింది. ఈ విషయం ప్రాచీనయోగ శాస్త్ర అధ్యయనానికి చాలా అవసరమైనది. 24వ అధ్యాయంలో చెప్పబడిన శౌర్యస్తవం

సాహిత్యదృష్టితో పరిశీలించటానికి చాలా ప్రభావవంతమైనది. 30వ అధ్యాయంలో దక్షప్రజాపతి చేసినట్లుగా చెప్పబడే శివస్తుతి చాలా సుందరమైన రచనగలది. ఇవి వేదంలోని రుద్రాధ్యాయస్తుతులకు పౌరాణికరూపాలుగా చెప్పవచ్చు, చూడండి :

నమఃపురాణప్రభవే, యుగస్య ప్రభవేనమః
చతుర్విధస్య సర్గస్య, ప్రభవేఽనంత చక్షుషే,
విద్యానాం ప్రభవేచైవ, విద్యానాం పతయేనమః
నమోవ్రతానాంపతయే, మంత్రాణాం పతయేనమః

దీని నాలుగు పాదాలలో మొదటిదైన ప్రక్రియా పాదంలో 1-6 అధ్యాయాలు, రెండవదైన ఉపోద్ఘాత పాదంలో 7-64 అధ్యాయాలు మూడవదైన అనుషంగ పాదంలో 65-99 అధ్యాయాలు నాల్గవదైన ఉపసంహార పాదంలో 100-112 అధ్యాయాలు వెరసి 112 అధ్యాయాలు ఉన్నాయి.

శివ పురాణమా, వాయు పురాణమా ? ఏది మహా పురాణం అనే మీమాంస పురాణ పండితులలో ఉన్నదన్న విషయం ఇంతకుముందే చెప్పబడింది గదా. ఇక్కడ ఆ రెండింటిని గురించి పరిశీలిద్దాం :

శివ పురాణం ఏడు సంహితలుగా విభజించబడింది. 1.విద్యేశ్వర సంహిత 2. రుద్ర సంహిత, 3. శతరుద్ర సంహిత 4. కోటి రుద్ర సంహిత 5. ఉమా సంహిత 6. కైలాస సంహిత 7. వాయవీయ సంహిత అనేవి ఆ ఏడు విభాగాలు. ఇందులో రెండవదైన రుద్ర సంహిత 1. సృష్టి ఖండం 2. సతీ ఖండం, 3. పార్వతీ ఖండం 4. కుమార ఖండం 5. యుద్ధ ఖండాలనే అయిదు ఖండాలుగా విభజించబడింది. అలాగే ఏడవదైన వాయవీయ సంహిత పూర్వార్ధ ఉత్తరార్ధాలనే రెండు భాగాలుగా చేయబడింది. ఈ విధంగా మొదటిదైన విద్యేశ్వర సంహితలో 25 అధ్యాయాలు, రెండవదైన రుద్ర సంహితలో (20 + 43 + 55 + 20 + 19) 197 అధ్యాయాలు మూడవదైన శతరుద్ర సంహితలో 42, నాల్గవదైన కోటిరుద్ర సంహితలో 43, ఐదవదైన ఉమాసంహితలో 57 అధ్యాయాలు ఆరవదైన కైలాస సహింతలో 23, ఏడవదైన వాయవీయ సంహితలో (35 + 41 = 75) అధ్యాయాలు వెరసి 464 అధ్యాయాలు 24 వేలశ్లోకాలు ఉన్నాయి.

5. శ్రీమద్భాగవతం :

భాగవతం భక్తి శాస్త్ర సర్వస్వంగా పండితులు భావిస్తారు. వైష్ణవ ఆచార్యులు ప్రస్థానత్రయంతోపాటు భాగవతాన్ని కూడా తమ ఉపజీవ్య గ్రంథంగా భావిస్తారు. వైష్ణవంలో శాఖలైన వల్లభ సంప్రదాయం, చైతన్య సంప్రదాయ అనుయాయులపై భాగవత తత్త్వ

ప్రభావం చాలా ఎక్కువ. భాగవతమునందలి తత్త్వ గూఢార్థాలను వివరించటానికి వివిధ వైష్ణవ సంప్రదాయ అనుయాయులు, తమతమ తత్త్వవాదాలను అనుసరించి దీనికి ప్రత్యేక వ్యాఖ్యానాలు రచించారు. రామానుజమతానుసారం సుదర్శన సూరి రచించిన శుకపక్షేయము, వీరరాఘవాచార్యుని భాగవతచంద్రచంద్రిక, మధ్వమతాను సారం విజయా ధ్వజుని పదరత్నావళి, నింబార్క మతానుసారం రచించిన శుకదేవాచార్యుని సిద్ధాంత ప్రదీపము, వల్లభమతానుసారం స్వయంగా వల్లభుడే రచించిన సుబోధిని ఇలాంటివి ఇంకా లెక్కకు మిక్కిలిగా అనేక వ్యాఖ్యానాలు ఉన్నాయి అంటే, భాగవతం యొక్క విశిష్టతను తెలుసుకొనవచ్చు. అద్వైతమతానుసారం శ్రీధరస్వామి రచించిన శ్రీధరీయ వ్యాఖ్య విశేష ప్రచారంలో ఉన్న వ్యాఖ్య. ఆయా సంప్రదాయాల మౌలికమైన ఆధ్యాత్మిక కల్పనల ఆధారంగా నిలిచిన గ్రంథం, ఈ పద్దెనిమిది వేల శ్లోకాలు కలిగిన భగవంతుని స్వరూపమైన భాగవతం. వివిధ వైష్ణవ సంప్రదాయాలకు చెందినవారు తమ తమ సంప్రదాయాలకు అనుగుణంగా వ్యాఖ్యలు వ్రాసినా, భాగవతంలో అద్వైత తత్త్వానికి మాత్రమే సరిగా సమన్వయం అయ్యే ఘట్టాలు చాలా ఉన్నాయి. ఇందుకు కారణం భక్తికి అద్వైతానికీ వైరుధ్యం లేకపోవటమే. భాగవతంలో

అహమే వాసమేవాగ్రే, నాన్యద్యత్సరసత్పరమ్
పశ్చాదహం యదేతచ్చయోన, శిష్యేతసోఽస్మ్యహమ్ (2-9-32)

(సృష్టికి పూర్వం నేనే ఉన్నాను. అప్పుడు స్థూల ప్రపంచంగాని, తత్కారణంగానీ లేదు. తర్వాత ఆవిర్భవించిన ప్రపంచమూ నేనే. ప్రళయానంతరం మిగిలేదీ నేనే) - వంటి అద్వైత తత్త్వ ప్రతీకాలైన అనేక శ్లోకాలను ఉద్ధరించవచ్చు.

అద్వితీయ జ్ఞాన రూపమైన పరబ్రహ్మనే అనేక నామాలతో పిలుస్తూ ఉంటారు.

ప్రదన్తి తత్తత్త్వ విదస్తత్త్వం యద్ జ్ఞానమద్వయమ్
బ్రహ్మేతి పరమాత్మేతి భగవానితి శబ్దతే
జ్ఞానం విశుద్ధం పరమార్థమేకమనంతరం త్వ బహిర్బ్రహ్మసత్యం
ప్రత్యక్ ప్రశాన్తం భగవచ్ఛబ్ద సంజ్ఞం యద్యాసుదేవం క్వయోవదన్తి *(5-12-11)*

అని చెప్పబడింది. అలాంటి పరబ్రహ్మతత్త్వాన్ని కనుగొనటానికి ఉత్తమ సాధనంగా భక్తిని ఉపదేశించటం భాగవతం యొక్క వైశిష్ట్యము.

భాగవతంలోని భాగాలను స్కంధాలంటారు. మొత్తం భాగవతం 12 స్కంధాలుగా విభజించబడింది. ఇందులో ప్రథమ స్కంధంలో 19, ద్వితీయ స్కంధంలో 10 తృతీయ

స్కంధంలో 33, చతుర్థ స్కంధంలో 31, పంచమ స్కంధంలో 26, షష్ఠ స్కంధంలో 19, అష్టమ స్కంధంలో 15, నవమ స్కంధంలో 24, దశమ స్కంధంలో 90, ఏకాదశ స్కంధంలో 31 ద్వాదశ స్కంధంలో 13 వెరసి 335 అధ్యాయాలున్నాయి. ఇందులోని మొత్తం శ్లోకాల సంఖ్య 18,000. పురాణాలను గురించి తెలుపుతూ భాగవతం పురాణానికి దశ లక్షణాలుండాలని నిర్దేశించింది. పురాణం పంచ లక్షణం అని చెప్పిన నిర్వచనం ప్రకారం ఈ గ్రంథానికి పంచలక్షణాలే గాక తాను స్వయంగా పురాణ లక్షణాలుగా చెప్పిన దశ లక్షణాలు కూడా దీనికి సమన్వయిస్తాయి. భాగవత రచన క్రీ.శ. 6వ శతాబ్దానికి ముందే జరిగి ఉండాలి. ఇందులో దక్షిణ దేశంలోని నదులు, పర్వతాలు, తీర్థక్షేత్ర ప్రశంసలు ఎక్కువగా కనిపిస్తాయి. ఈ గ్రంథం ద్రవిడ దేశంలో విష్ణు భక్తి ఎక్కువగా ఉండగలదని చెప్తున్నది. ఆ కారణంచేత ఇందుకు దక్షిణ దేశంలో జన్మించిన ఆళ్వారు (వైష్ణవభక్తు)ల సూచనలు ఉండి ఉండవచ్చని భావించటం జరిగింది. ఈ పురాణం దక్షిణదేశంలో అందులోనూ ద్రవిడ దేశంలో రచింపబడి ఉంటుందని పురాణ విమర్శకుల అభిప్రాయం.

అయిదవ మహాపురాణమైన భాగవతం పరిగణనలోను విష్ణు భాగవతమే మహా పురాణమని దేవీ భాగవతం ఉప పురాణమని కొందరు భావిస్తుండగా శాక్తేయులు కాదు దేవీ భాగవతమే మహా పురాణమని వాదిస్తున్నారు. ఎవరి వాదాన్ని బలపరిచే ఉపపత్తులు వారికి ఉన్నాయి.

దేవీ భాగవతం కూడా పన్నెండు విభాగాలుగానే విభజించటం జరిగింది. ఒక్కొక్క విభాగం పేరు స్కంధం. ఇందులో వరుసగా 20, 12, 30, 25, 35, 31, 40, 24, 50, 13, 24, 24. అధ్యాయాలు వెరసి 328 అధ్యాయాలు ఉన్నాయి. ఈ పురాణంలోను శ్లోకాల సంఖ్య 18,000 లే.

6. నారదపురాణం :

నారదపురాణము, మహాపురాణ రూపమున ఉపపురాణ రూపమున కూడా లభ్యం అవుతున్నది. అందువలన ఈ రెండింటిని వేరు వేరుగా పేర్కొనటానికి కొందరు నారదీయపురాణము అని పిలుస్తున్నారు. హెచ్.హెచ్.విల్సన్ వంటి కొందరు పండితులు ఇది సాధారణ వైష్ణవ భక్తి గ్రంథమని, 16వ శతాబ్దంలో రచింపబడిందని తెలుపుతున్నా ఇది అంతగా పరిగణించవలసిన విషయం కాదు. 12వ శతాబ్దంవాడైన బల్లాల సేనుడు తన దానసాగరం అనే గ్రంథంలో ఈ పురాణంలోని శ్లోకాలను ఉద్ధరించాడు. 11వ శతాబ్దంవాడైన ఆల్బెరూని కూడా తన యాత్రా విశేషాల గ్రంథంలో దీనిని పేర్కొన్నాడు. అందువలన ఈ పురాణం ఈ యిరువురి కాలం కంటే ప్రాచీనమైనదని చెప్పవచ్చు. ఈ గ్రంథం పూర్వభాగంలోని 24–25 అధ్యాయాలలో వర్ణాశ్రమాచారాలు, 28వ అధ్యాయంలో

శ్రాద్ధవిధి ప్రాయశ్చిత్తము మొదలైనవి వర్ణించబడ్డాయి. దీని తరువాత వ్యాకరణం, నిరుక్తం, జ్యోతిషం ఛందస్సు, మొదలైన వివిధ శాస్త్రాల విషయాలు వివిధ అధ్యాయాలలో వివరించ బడ్డాయి. అనేక అధ్యాయాలలో విష్ణువు, రాముడు, ఆంజనేయ, కృష్ణ, కాళి, మహేశ్వరుల మంత్రాల వివిధ విధులు నిరూపించబడ్డాయి. ఇందులో మోక్షం సాధించటానికి విష్ణు భక్తియే పరమసాధనంగా చెప్పబడింది. ఈ అంశాన్నే స్వీకరించి ద్వితీయ భాగంలో 7–37 అధ్యాయాలలో పరమవిష్ణుభక్తుడైన రుక్మాంగదమహారాజ చరిత్ర వర్ణింపబడింది.

ఐతిహాసిక దృష్టితో చూచినా ఈ పురాణానికి చాలా ప్రత్యేకత ఉన్నది. అష్టాదశ పురాణాలలో చెప్పబడిన విషయానుక్రమణిక పూర్వభాగంలోని 92 నుంచి 109 అధ్యాయాలలో ఇవ్వబడింది. అన్ని పురాణాలలోను చెప్పబడిన విషయాలను తెలుసు కొనటానికి ఈ అనుక్రమణిక చాలా ఎక్కువగా ఉపయోగపడుతుంది. దీని ఆధారంగా ప్రస్తుతం లభ్యం అవుతున్న పురాణాలమూల రూపము, ప్రక్షిప్త అంశాలను మనం తేలికగా తెలుసుకొనవచ్చు. దీనిలో విష్ణుభక్తికి ప్రాధాన్యత ఉన్నా ఈ పురాణంలో పురాణ పంచ లక్షణాలు కూడా ఉన్నాయి. నారద పురాణం విష్ణు పారమ్యాన్ని బోధించే పురాణం మాత్రమే కాదు. పాంచరాత్ర విధాన వర్ణనం కూడా ఈ పురాణంలో కనిపిస్తుంది. ఇది అనేక వైష్ణవ ఆగమాలను పేర్కొంటున్నది. ఈ పురాణంలో బౌద్ధుల నింద చాలా ఎక్కువగా కనిపిస్తుంది. అలాగే వైష్ణవులకు ముఖ్యదినమైన ఏకాదశీ వ్రతమాహాత్మ్య వర్ణనం అతి విస్తృతంగా కనిపిస్తుంది. వైష్ణవ భక్తుడైన రుక్మాంగదుని ఉపాఖ్యానంలో తన రాజ్యంలోని 8 నుంచి 80 సంవత్సరాల వయస్సు ఉన్నవారివరకు ఏకాదశీ వ్రతం చేయాలని, అలా చేయని పక్షంలో వారు వధ్యులు–దండ్యులు ఔతారని ఆజ్ఞ ఇచ్చాడని ఈ పురాణం తెలుపుతున్నది.

ఈ పురాణం క్రీ.శ. 700–800 ల మధ్య రచింపబడి ఉండాలని పండితుల భావన. నారద పురాణం రెండు భాగాలుగా చేయబడింది. అవి పూర్వ భాగం, ఉత్తర భాగాలుగా పిలువబడుతున్నాయి. వీటిలో పూర్వ భాగంలో నాలుగు పాదాలు ఉన్నాయి. ఈ నాలుగు పాదాలలోను ఉండగా, 125 అధ్యాయాలు ఉత్తర భాగంలో 82 అధ్యాయాలు మొత్తం 207 అధ్యాయాలుగా విభజించబడి ఉన్నది. దీనిలోని మొత్తం శ్లోకాల సంఖ్య 25,000 లు.

7. మార్కండేయ పురాణం :

మార్కండేయ మహామునిచేత చెప్పబడిన పురాణం కాబట్టి దీనికి మార్కండేయ పురాణమనే పేరువచ్చింది. విస్తృతిలో ఈ పురాణం చిన్నదేనని చెప్పాలి. ఈ పురాణం

జర్మన్ భాషలోకి కూడా అనువదించబడ్డాయి. ఆ భాగంలో మరణానంతరం జీవుని స్థితి చెప్ప బడింది. పశ్చిమదేశీయ పండితుల అభిప్రాయం ప్రకారం ఈ పురాణం అతి ప్రాచీన మైనది. వారి దృష్టిలో ఇది చాలా ప్రజాదరణ గలది. అందరూ అవశ్యం అధ్యయనం చేయ దగింది. నిజానికి హరిభావన సరియైనదే. ప్రాచీనకాలానికి చెందిన ప్రసిద్ధ బ్రహ్మవాదిని మహర్షిణి మదాలస పవిత్ర చరిత్ర ఈ గ్రంథంలో బాగా విస్తరించి వివరించబడింది. మదాలస తన పుత్రుడైన అలర్కునికి చిన్నతనం నుంచే బ్రహ్మజ్ఞానాన్ని ఉపదేశించి నందు వలన అతడు మహారాజు అయిన తరువాత గూడా జ్ఞాన యోగకర్మయోగాలను సమన్వయించి చూపించి పరిపాలన సాగించాడు. ఇందులో చెప్పబడిన దుర్గాసప్తశతి చాలా ప్రత్యేకత గలది. ఇందులో దేవీ భక్తులకు సర్వస్వరూపిణియైన దుర్గ యొక్క పవిత్ర చరిత్ర చాలా విస్తారంగా వర్ణించబడింది. దుర్గాసప్తశతి మహాకాళి-మహాలక్ష్మి-మహాసరస్వతీ రూపురాలైన దేవి యొక్క మాహాత్మ్యాన్ని ప్రతిపాదిస్తూ 136 అధ్యాయాలలో విస్తరించింది. మన్వంతర వర్ణనం కూడా విస్తృతంగా కలిగిన పురాణం ఇది. కొన్ని వైదిక కర్మల ద్వారా అభీష్టఫలాలను ఏ విధంగా పొందవచ్చునో కొన్ని ఉపాఖ్యానాల ద్వారా విశదీకరించ బడింది. అనేక విష యాలు మార్కండేయపురాణం నుంచి దేవీ భాగవతంలోనికి స్వీకరింపబడ్డాయి. ఈ పురాణ రచనాకాలం క్రీ.శ. 400-500 మధ్యకాలం అని పురాణ విమర్శకుల అభిప్రాయం.

మార్కండేయ పురాణంలో 136 అధ్యాయాలు ఉన్నాయి. దీని శ్లోక సంఖ్య 9,000లు కానీ ఇప్పుడు లభ్యమవుతున్న మార్కండేయ పురాణంలో కేవలం 6,900 శ్లోకాలు మాత్రమే ఉన్నాయి.

8. అగ్నిపురాణం :

అందులో చెప్పబడిన విషయాల వైచిత్ర్యంవల్ల అష్టాదశ పురాణాలలో అగ్ని పురాణానికి చాలా ప్రత్యేకత ఉన్నది. ప్రస్తుతం లభ్యం అవుతున్న అగ్నిపురాణంలో నారద పురాణం చెప్పిన విషయానుక్రమణిక యథాతథంగా ఉన్నది. కానీ నారదపురాణం 'ఇది ఈశానుకల్పంలో జరిగిన వృత్తాంతం' అని చెప్పిన విషయం మాత్రం లభ్యం కావటం లేదు. ఇందులోని రెండవ అధ్యాయంలో 'ప్రాప్తే కల్పేతువారాహే కూర్మరూపోఽ అభవద్ధరిః' అని చెప్పబడటం చేత ఇది వరాహకల్పవృత్తాంతం అని తెలుసుకొనవచ్చు. పైగా 'వసిష్ఠాయాఽ అనలో అబ్రవత్' అనగా వసిష్ఠునిచేత చెప్పబడిన అగ్నివృత్తాంతం కూడా లేదు. బ్రహ్మ మానసపుత్రుడైన మరీచిమహాముని ద్వాదశ వార్షిక సత్రయాగంలో అగ్నికి ధర్మానుష్ఠానాన్ని గురించి చేసిన ఉపదేశం మీద ఆధారపడి ఈ పురాణం ఆరంభం అవుతున్నది. స్కాంద పురాణంలోని శివరహస్య ఖండంలో ఈ పురాణం అగ్నిదేవుని

మహాత్మ్య ప్రతిపాదనం ఈ పురాణ ప్రధాన లక్ష్యం అని పేర్కొంటున్నా, ఇలాంటి వృత్తాం తాలు అగ్ని పురాణంలో లేనేలేవు. ప్రస్తుతం అగ్ని పురాణమని, వహ్ని పురాణమని రెండు పురాణాలు లభ్యం అవుతున్నాయి. రెండింటిలో చెప్పబడిన విషయాలలోను కొంత ఐక్యత ఉన్నది. బల్లాలసేనుడు అగ్ని పురాణంలోనివిగా ఉద్ధరించిన కొన్ని శ్లోకాలు ప్రస్తుత అగ్ని పురాణంలో లభ్యం కావటం లేదు. అగ్ని పురాణంలోని చాలా విషయాలు, వహ్ని పురా ణంలో కూడా ఉన్నాయి.

దీని వక్త అగ్ని. శ్రోత వశిష్ఠుడు. ఇందులో ఈశానుకల్ప వృత్తాంతం ఉన్నది. ఆధునికులు అగ్ని పురాణాన్ని భారతీయుల సమస్త విజ్ఞానకోశం అంటున్నారు. దీనిని జాగ్రత్తగా పరిశీలిస్తే పురాణాల ముఖ్య ఉద్దేశ్యం భారతీయ విద్యలను జనసామాన్యం చేరువలోనికి తీసుకొనిరావటమే అనిపిస్తుంది. ఇందులోని 383 అధ్యాయాలలో అనేక విషయాలు వివరించటం ఆశ్చర్యం అనిపిస్తుంది. ఇందులో అవతారతత్త్వంతోపాటు రామాయణ మహాభారత హరివంశ కథలసారం ఇవ్వబడింది. అనేక విధాలైన దేవాలయాల నిర్మాణ కళను వివరించటంతోపాటు విగ్రహప్రతిష్ఠ పూజావిధానం మొదలైన వాటిని గురించి విస్తృతంగా వివరించబడింది. నాలుగు ఉపవేదాలు, వేదాంగాలు, తాత్త్విక, దార్శనిక విషయాలు మాత్రమే గాకుండా పశుచికిత్స, ధర్మశాస్త్ర, రాజనీతి, ఆయుర్వేదం మొదలైన శాస్త్రాల విషయాలు ప్రత్యేకంగా వివరించటం జరిగింది. చివరలో కావ్య సౌందర్య విషయాలతోపాటు అలంకార శాస్త్ర విషయాలు కూడా ఇందులో చెప్పబడ్డాయి. ఛందశ్శాస్త్రం 8 అధ్యాయాలలో వివరించబడింది. వ్యాకరణశాస్త్ర క్లుప్తీకరణ చాలా ప్రత్యే కంగా చెప్పబడింది, కౌమార వ్యాకరణం అనే పేరుతో ఒక చిన్న వ్యాకరణము, ఏకాక్షర కోశము, నామలింగానుశాసనము, యోగశాస్త్ర అంగాల వివేచనము అద్వైత వేదాంత సారము ఇందులో సమకూర్చబడ్డాయి. ఈ విధంగా అగ్ని పురాణంలో భారతీయ సాహిత్యము, సంస్కృతులకు సంబంధించిన అన్ని విషయాలు సంక్షిప్త రూపంలో సంకలనం చేయ బడ్డాయి. అందువలననే 'ఆగ్నేయేహి పురాణేఽస్మిన్ సర్వావిద్యాః ప్రదర్శితాః' అని చెప్పబడింది. ఇందులో ఆయుర్వేదము, గాంధర్వవేదము, అర్థశాస్త్రంవంటి వేదాంగాలకు సంబంధించిన విషయాల వర్ణన ఉన్నది. ఇందులో పురాణ పంచలక్షణాలతోబాటు హిందూ సంస్కృతి, సాహిత్యాల అన్ని విషయాల వివరణ ఉన్నది.

బ్రహ్మజ్ఞానం తతఃపశ్చాత్ పురాణ శ్రవణే ఫలమ్
ఏతదాగ్నేయకం విప్ర పురాణం ప్రకీర్తితమ్.

ఈ పురాణ శ్రవణం లేక మననం ద్వారా బ్రహ్మజ్ఞానం లభిస్తుందనటంలో అతిశయోక్తి లేదు. ఈ పురాణ రచన క్రీ.శ. 7-11 శతాబ్దాల మధ్య జరిగి ఉండవచ్చు.

దీని సంస్కరణ క్రీ.శ. 13వ శతాబ్దిలో జరిగి ఉండవచ్చు. అగ్ని పురాణంలో అనేక తాంత్రిక అనుష్ఠాన విధానాలు ప్రతిపాదించబడ్డాయి. వీనిలోని కొన్ని ప్రత్యేక అనుష్ఠానాలు ఈనాటికి వంగదేశంలో ప్రచారంలో ఉన్నాయి. అందువలన ఇది వంగ దేశంలో రచింపబడి ఉండాలని భావించబడుతున్నది.

అగ్ని పురాణంలో 383 అధ్యాయాలు ఉన్నాయి. అందులో నారద పురాణానుసారం 25,000 శ్లోకాలు, మత్స్యపురాణాను సారం 13,000 శ్లోకాలు ఉండాలి. కానీ వాస్తవంలో నేడు లభ్యం అవుతున్న అగ్నిపురాణంలో 12,000 శ్లోకాలు ఉన్నాయి.

9.భవిష్యపురాణం :

ఈ పురాణ విషయంలో పండితులలో ఉన్నంత గందరగోళం వేరు ఏ పురాణం విషయంలో కూడా లేదు. రాబోయేకాలంలో జరుగబోయే వృత్తాంతాలను వివరించదలచిన పురాణం కాబట్టి దీనికి ఈ పేరు వచ్చింది. ఇందువలన ఈ పేరును సార్థకం చేయటానికి ఆయా కాలాలలో పండితులు రాబోయే చరిత్ర అంటూ అనేక అర్వాచీన విషయాలను చేర్చటం జరిగింది. తత్ఫలితంగా 'ఇంగ్రేజ' అనే పేరుతో ఇంగ్లీషువారు భారతదేశం రావటం కూడా చెప్పబడింది. జ్వాలాప్రసాద్‌మిశ్రా అనే పండితుడు తమ దగ్గర నాలుగు భవిష్య పురాణ లిఖిత ప్రతులున్నట్లు, ఒకదానితో మరొకదానికి అంతగా సంబంధం లేనట్లు తెలిపారట. ఇవి అన్నీ కలిపివేయగా ఏర్పడిన పురాణం ఈనాడు భవిష్యపురాణంగా ప్రచారంలో ఉన్నది. ఈ పురాణాన్ని నారద, అగ్ని, మత్స్య, వాయు పురాణాలు పేర్కొంటున్నవి. అందుచేత ఇది ప్రాచీన పురాణమేనని చెప్పటంలో ఏమాత్రం సందేహించవలసిన అవసరం లేదు. నారద పురాణాన్ని అనుసరించి ఇందులో అయిదు పర్వాలున్నాయి. ఈ పురాణంలో సూర్యోపాసన విస్తృతంగా వర్ణించబడింది. శ్రీకృష్ణుని పుత్రుడైన సాంబునికి కుష్ఠురోగం సంప్రాప్తించగా దాని నివారణకోసం గరుత్మంతుడు శాకద్వీపం నుంచి బ్రాహ్మణులను తీసుకొనిరాగా వారు సూర్యోపాసనా విధానంచేత ఆ వ్యాధిని నయం చేశారని ఈ పురాణం తెలుపుతున్నది. సూర్యోపాసన రహస్యాలు, కలియుగంలో ఆవిర్భవించిన అనేక రాజుల వంశవర్ణన కూడా ఈ పురాణంలో విస్తృతంగా ఉన్నది. ఆ రాజుల చరిత్రను అధ్యయనం చేయటానికి ఈ భాగ అధ్యయనం చాలా ముఖ్యం.

సృష్టి, స్థితి, లయలకు సంబంధించిన విషయాలు, ఆదిత్య చరిత్ర వర్ణన, పుస్తకములు వ్రాయుట లేక రచయితల లక్షణాలు, అన్ని సంస్కారాలు లేక కల్పాల వర్ణన, బ్రహ్మ, విష్ణు, శివుల మహిమ వర్ణన, ధర్మ, అర్థ, కామ, మోక్షాలనే పురుషార్థాల చతుష్టయ వివరణ ఈ పురాణంలో ఉన్నది.

భవిష్య పురాణం ఐదు పర్వాలుగా విభజించబడింది. అవి 1. బ్రహ్మ పర్వం 2. వైష్ణవ పర్వం 3. శైవ పర్వం 4. సౌరపర్వం 5. ప్రతి సర్గ పర్వం – ఈ మొత్తం అయిదు పర్వాలలోను 605 అధ్యాయాలు ఉన్నాయి. నారద పురాణానుసారం 14 వేల శ్లోకాలు, మత్స్యపురాణానుసారం 14,500 శ్లోకాలు ఇందులో ఉన్నాయి.

10. బ్రహ్మవైవర్తపురాణం :

ఈ పురాణంలో పద్దెనిమిదివేల శ్లోకాలున్నాయి. అంటే భాగవతంతో సమాన విస్తృతి కలిగిన పురాణమన్నమాట. దీనిలో నాలుగు ఖండాలున్నాయి. 1) బ్రహ్మఖండం, 2) ప్రకృతి ఖండం, 3) గణేశఖండం, 4) కృష్ణజన్మఖండం. ఈ నాలుగు ఖండాలలోను కృష్ణజన్మఖండం పురాణంలో దాదాపు సగంకంటే పైభాగమే ఉన్నది. ఈ ఖండంలో 133 అధ్యాయాలున్నాయి. శ్రీ కృష్ణచరిత్రాన్ని విస్తృతంగా వర్ణించడం ఈ పురాణ ప్రధాన లక్ష్యం అనిపిస్తుంది. రాధ కృష్ణుని యొక్క శక్తి అని అందువలన రాధయొక్క వృత్తాంతం సాంగోపాంగంగా వర్ణించిన పురాణం ఇది. ఈ రాధావృత్తాంతం వల్లనే పలువురు పురాణ తత్త్వజ్ఞులు దీనిని చాలా ఆధునిక పురాణం అని భావిస్తున్నారు. కానీ వాస్తవానికి రాధ యొక్క కల్పన ప్రాచీనమైనదే. మహాకవి భాసుడు తన బాలచరిత్ర నాటకంలో శ్రీకృష్ణుని బాల్య క్రీడలు, రాధవర్ణన విస్తృతంగానే చేశాడనే విషయం మరువరాదు. భాసుడు క్రీ.శ. తృతీయ శతాబ్దంవాడు. అందువలన ఈ పురాణ రచనాకాలం మూడవ శతాబ్దానికి ముందే జరిగి ఉంటుందని భావించాలి. భాగవత దశమస్కంధంలోనూ ఈ పురాణంలో తప్ప వేరెక్కడా శ్రీకృష్ణచరిత్రం ఇంత విస్తృతంగా వర్ణించటం కనిపించదు.

1) బ్రహ్మఖండం : ఇందులో కేవలం ముప్పై అధ్యాయాలు మాత్రమే ఉన్నాయి. ఈ భాగంలో శ్రీకృష్ణుని ద్వారా జరిగిన జగత్సృష్టి వర్ణించబడింది. దీని 16వ అధ్యాయంలో ఆయుర్వేదశాస్త్ర విషయాలు చెప్పబడ్డాయి.

2) ప్రకృతి ఖండం : ఇందులో శ్రీకృష్ణుని ఆదేశానుసారం ప్రకృతి దుర్గ, లక్ష్మీసరస్వతి సావిత్రి, రాధల రూపంలో అప్పుడప్పుడు ఆవిర్భవించిన విషయాలు వర్ణించబడ్డాయి. ఈ ఖండంలో సావిత్రి, తులసిల కథలు విస్తృతంగా చెప్పబడ్డాయి.

3) గణేశఖండం : ఇందులో గణేశుని ఉత్పత్తి ఆయన చరిత్రలు వర్ణింపబడ్డాయి. గణేశుడు శ్రీకృష్ణుని అవతారమని ప్రతిపాదించబడింది.

వివృతం బ్రహ్మకార్త్స్న్యేన, కృష్ణేన యత్రశౌనక
బ్రహ్మవైవర్తకంతేన, ప్రవదంతి పురావిదః – 1-1-10

కృష్ణుడు బ్రహ్మను వివరించటం చేత దీనిని బ్రహ్మ వైవర్తకమనే పేరు వచ్చిందని ఇందులో చెప్పబడింది. దీనికే బ్రహ్మ కైవర్త పురాణమని ఇంకొక పేరు ఉన్నది. ఈ పేరు ఎందుకు వచ్చిందో అంత స్పష్టంగా తెలియటంలేదు. దాక్షిణాత్యులలో బ్రహ్మ కైవర్త మనే పేరే ఎక్కువ ప్రచారంలో ఉన్నది. నారదపురాణంలో ఉన్న ఈ పురాణ విషయాను క్రమణిక ప్రస్తుతం లభ్యం అవుతున్న బ్రహ్మవైవర్త పురాణంలో చెప్పబడిన విషయాలతో పూర్తిగా ఏకీభవిస్తున్నది. శ్రీకృష్ణ పారమ్యాన్ని ప్రతిపాదించటం చేత కృష్ణభక్తులైన వైష్ణవులు ఈ పురాణానికి చాలా ప్రాముఖ్యతనిస్తున్నారు. ముఖ్యంగా గౌడీయవైష్ణవులు ఈ పురాణంపై హెచ్చుగా ఆదరణ చూపిస్తారు.

4) కృష్ణజన్మఖండం : సృష్టి ప్రకరణంలో నారద బ్రహ్మల సంవాదం, నారద శివలోక గమనము, తరువాత జ్ఞానలాభము, సావర్ణి, నారదుల శ్రీకృష్ణమాహత్మ్య విషయక సంవాదము, ప్రకృతి అంశభూత కళల మాహాత్మ్యవర్ణనము గణేశ జన్మకథ, కార్తవీర్యచరిత్ర, పరశురామ గణేశ సంవాదము, శ్రీకృష్ణజననము, శ్రీకృష్ణుని వివిధ బాల్యలీలలు, కంసాది దుష్టుల హననము ద్వారకకు తిరిగివచ్చుట ఇందులో వర్ణింపబడ్డాయి.

బ్రహ్మవైవర్త పురాణం బ్రహ్మపారమ్యాన్ని బోధించే పురాణమని, అందుచేత ఇది రాజస పురాణాలలో చేరుతుందని అనేక పురాణాలలో చెప్పబడి ఉన్నది. మనకు లభ్యం అవుతున్న ఈ పురాణంలో శ్రీకృష్ణపారమ్యం చెప్పబడింది. అక్కడక్కడ బ్రహ్మనింద కూడా ఉన్నది. శ్రీకృష్ణుడే పరాత్పర బ్రహ్మ అనీ, ఆయన నివాసం గోలోకంలో అనీ, ఆయన భార్య రాధ అనీ, ప్రతిపాదించే బ్రహ్మవైవర్తం ప్రాచీన బ్రహ్మవైవర్తాన్ని వైష్ణవులు మార్చి వేయగా ఏర్పడినది. తంత్రశాస్త్రానికి సంబంధించిన విషయాలు పురాణాలలో తొమ్మిది, పదవ శతాబ్దాలలో ప్రవేశించాయి కాబట్టి, ఈ పురాణంలోని ప్రకృతి ఖండ, గణేశ ఖండాలలో తంత్రశాస్త్ర ప్రభావం అత్యధికంగా కనిపిస్తున్నందువలన ఈనాడు లభ్యం అవుతున్న బ్రహ్మవైవర్తపురాణం తొమ్మిదవ శతాబ్దం కంటె ప్రాచీనం కాదని, రాధాకృష్ణ సంప్రదాయం వర్ణింపబడి ఉండటం చేత ఇది 15వ శతాబ్దం ప్రాంతానికి చెంది ఉండవచ్చునని కొందరు పండితుల అభిప్రాయం.

ఈ పురాణంలో ముస్లిములను పేర్కొనటం జరిగింది. సంకర జాతులను వర్ణించే సందర్భంలో స్త్రీయందు మ్లేచ్ఛునివలన 'జోలా' జాతి పుట్టిందని తెలియజేయబడింది. "మ్లేచ్ఛాత్కువిందర కన్యాయాం జలా జాతిర్బభూవహ" (10-121) హిందీలోని 'జులాహా' (సాలెవాడు) వంగభాషలో 'జోలా' అయింది. అశ్వినీ కుమారుల వీర్యంవలన బ్రాహ్మణ కన్యయందు 'వైద్యుడు' పుట్టినాడని (10-123) తెలియజేయబడింది. ఈ ప్రసిద్ధి బెంగాల్‌లో

ఉన్నది. అందుచేతనే బెంగాల్‌లో బ్రాహ్మణులలో 'వైద్యుల'ను తక్కువచూపు చూస్తారట. ఇందులో నేటికీ బెంగాల్ ప్రాంతంలో ప్రచారంలో వున్న ఆరాధనాపద్ధతులు, వివిధ దేవతా పూజా విధానాలు చెప్పబడినాయి. రాధా వల్లభ సంప్రదాయానికి బెంగాల్ ఆవాసము. అందుచేత వీనినన్నింటినీ పరిశీలిస్తే ప్రస్తుతం లభ్యం అవుతున్న బ్రహ్మవైవర్త పురాణం బెంగాల్ ప్రాంతంలో రచింపబడిందని, ఇది ప్రాచీన బ్రహ్మ వైవర్త పురాణం కంటే వేరైనదని పండితులు, పురాణ విమర్శకులు భావిస్తున్నారు.

బ్రహ్మవైవర్త పురాణం 1. పూర్వ భాగ 2. ఉత్తర భాగాలనే రెండు భాగాలుగా చేయబడింది. ఇందులో మొదటిదైన బ్రహ్మ ఖండంలో 30, రెండవదైన ప్రకృతి ఖండంలో 57 మూడవదైన గణేశ ఖండంలో 46, నాల్గవదైన శ్రీకృష్ణ జన్మఖండం పూర్వ ఉత్తర భాగాలు కలిపి 133 అధ్యాయాలతో వెరసి 266 అధ్యాయాలు ఉన్నాయి. దీనిలో కూడా 18 వేల శ్లోకాలు ఉన్నాయి.

11. లింగపురాణం :

శివలింగచరిత్రం గురించి వివరించటం జరిగింది (లింగస్య చరిత్రోక్తత్వాత్ పురాణం లింగముచ్యతే) కాబట్టి దీనిపేరు లింగపురాణం అయిందని శివపురాణం పేర్కొంటున్నది. వివిధ పురాణాలలో లింగోద్భవం గురించి చెప్పిన విషయాలన్నీ ఇందులో ఉన్నాయి. ఈశానుకల్ప వృత్తాంత ప్రసంగం బ్రహ్మచేత చెప్పబడిందని ఈ పురాణంలో ఉన్నదని స్వయంగా లింగపురాణమే తెల్పుతున్నది. కానీ మత్స్య , నారద పురాణాలను అనుసరించి అగ్నికల్పంలోని కథావృత్తాంతం లింగపురాణంలో చోటుచేసుకోవాలి. ఈశానుకల్ప వృత్తాం తాలు అగ్నిపురాణంలో ఉన్నాయి. ఇందులో శివకేశవుల వృత్తాంతాలు వర్ణింప బడినా, ఎక్కడా అన్యదేవతా నింద కనిపించదు.

లింగపురాణంలో శివలింగపూజా వర్ణన హృదయంగమంగా చెప్పబడింది. శివుని ద్వారా సృష్టి ఆవిర్భావం చెందిందని, శివుని 28 అవతారాల వృత్తాంతము, శివసంబంధ మైన అనేక వ్రతాలు, తీర్థాలకు సంబంధించిన విశేషాలు ఇందులో ఉన్నాయి. ఇందులో శైవ దర్శనాలకు అనుకూలమైన పశు, పాశ అలాగే పశుపతి శబ్దాల వివేచనాత్మక వ్యాఖ్య కనిపిస్తుంది. లింగోపాసనయొక్క ఆవిర్భావము చాలా చక్కగా విశకరించబడింది. శివతత్త్వమీమాంస అధ్యేతలకు చాలా ఉపయోగకరమైనది ఈ పురాణం.

స్కాందపురాణంలోని రేవాఖండం, భాగవతం, మత్స్య నారదపురాణాలు, బ్రహ్మ వైవర్త పురాణానుసారం ఇది పురాణాలలో 11వ స్థానాన్ని ఆక్రమిస్తుంది. దీనిలో పదకొండు వేల శ్లోకాలున్నాయి. హలాయుధుడు తన ఒక గ్రంథంలో బ్రహ్మ

నుంచి ఒకవచనాన్ని ఉద్ధరించాడు. కానీ అలాంటి పురాణమేదీ లభించలేదు. ఇదికాకుండా వసిష్ఠ లింగపురాణం ఒకటి లభిస్తున్నది. ఈ పురాణంలో శివుడిని లింగరూపంలో ఆరాధించే విధానాలు చెప్పబడ్డాయి. ఇందులో శైవదర్శనానికి ముఖ్యంగా పాశుపత సిద్ధాంతానికి సంబంధించిన అనేక విషయాలు ప్రతిపాదించబడ్డాయి. అష్టమూర్తియైన శివునికి ఎనిమిది మూర్తులకూ ఎనిమిది వైదిక నామధేయాలు చెప్పబడ్డాయి. అవి : పృథ్వీమూర్తి – శర్వుడు; జలమూర్తి = భవుడు; అగ్నిమూర్తి = పశుపతి; వాయుమూర్తి = ఈశానుడు; ఆకాశమూర్తి = భీముడు; సూర్యమూర్తి = రుద్రుడు; సోమమూర్తి = మహా దేవుడు; యజమానమూర్తి = ఉగ్రుడు అనేవి. ప్రత్యేకమూర్తికి భార్యా, ఒక పుత్రుడు చెప్పబడ్డారు.

బౌద్ధధర్మ ప్రాబల్యం తగ్గి, బ్రాహ్మణధర్మం అభివృద్ధి పొందుతున్న సమయంలో ఈ పురాణం కొంత సంస్కారం జరిగినట్లు భావించటానికి అవకాశం ఉన్నది. అప్పుడు అగ్ని పురాణంలో చెప్పినట్లు ఈశాన కల్పవృత్తాంతం ఇందులో చేరి ఉంటుందని భావించటానికి అవకాశం ఉన్నది. ఈ లింగపురాణంలో అగ్నికల్ప వృత్తాంతం అని స్పష్టంగా లేకపోయినప్పటికీ, ఇందులో ప్రతిపాదించిన విషయాలతోపాటు అగ్నిమయ లింగ వివరణ కూడా ఉన్నందువలన అలా భావించవలసివస్తున్నది.

సంప్రదాయజ్ఞుల చేతివాటంతో ఇందులో కొన్ని ప్రక్షిప్తాలుగా చేరిన శ్లోకాలను తీసివేసినట్లైతే లింగపురాణ ప్రాచీన రూపం కంటికి కట్టకలదు. ఇందులో ఉండే వివిధ వృత్తాంతాలను విడివిడిగా మార్చి అరుణాచల మాహాత్మ్యం, పంచాక్షర మాహాత్మ్యం, రుద్రాక్ష మాహాత్మ్యం, రామసహస్రనామం వంటి విడి పుస్తకాలుగా కూర్చడం జరిగింది. అనేక బాహ్య ఆంతరంగిక ప్రమాణాలను బట్టి ఈ పురాణం అష్టమ నవమ శతాబ్దాలకు సంబంధించి ఉంటుందని విమర్శకుల అభిప్రాయం. దానసాగరం అనే ఇంకొక స్మృతి గ్రంథాన్నిబట్టి ఆరువేల శ్లోకాలుగల ఇంకొక లింగ పురాణం ఉన్నట్లు తెలుస్తున్నది. ఇదే వసిష్ఠలింగ పురాణమేమో.

లింగ పురాణం 1. పూర్వభాగం 2. ఉత్తరభాగమనే రెండు విభాగాలుగా చేయ బడింది. అందులో పూర్వభాగంలో 108 అధ్యాయాలు, ఉత్తర భాగంలో 55 అధ్యాయాలు మొత్తం163 అధ్యాయాలు ఉన్నాయి. దీనిలోని మొత్తం శ్లోకాల సంఖ్య 11 వేలు.

12. వరాహ పురాణం :

విష్ణువు వరాహావతారాన్ని ధరించి భూదేవిని పాతాళలోకం నుంచి ఉద్ధరించిన వృత్తాంతం గల కథ ప్రధానంగా కలది కాబట్టి ఈ పురాణానికి వరాహ పురాణమనే

పేరువచ్చింది. మత్స్యపురాణంలో చెప్పబడిన దానిని అనుసరించి ఈ పురాణంలో మానవ కల్పంలోని వృత్తాంతాన్ని పృథ్వీసమక్షంలో విష్ణువుద్వారా మహావరాహమూర్తి యొక్క మాహాత్మ్యం వర్ణించబడింది, కాబట్టి ఇది వరాహపురాణం అయింది. దీనిలోని శ్లోకసంఖ్య 24,000. అధ్యాయాల సంఖ్య 218. ఉపలబ్ధం అవుతున్న వరాహ పురాణాన్ని అనుసరించి నారదపురాణంలో చెప్పబడినట్లు మానవకల్ప వృత్తాంతం కానీ, మహా వరాహమాహాత్మ్య ప్రతిపాదనము ఏమీ ఇందులో కనిపించటం లేదు. ఇది గౌడదేశ పాఠము, దాక్షిణాత్య పాఠము అని రెండు విభిన్న రూపాలలో లభ్యం అవుతున్నది. రెండింటికి అధ్యాయాల సంఖ్య, శ్లోక సంఖ్యలలో కూడా మార్పులు ఉన్నాయి. ప్రస్తుతం లభ్యం అవుతున్న వరాహ పురాణంలో పదకొండువేల శ్లోకాలు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం గౌడదేశ పాఠమే ప్రచారంలో ఉన్నది. కానీ కలకత్తాలో అచ్చయిన ప్రతిలో కేవలం పదివేల ఏడువందల శ్లోకాలే ఉన్నాయి. అంటే ఇందులో చాలా భాగం ఇప్పటివరకు లభించలేదన్నమాట. ఈ పురాణంలో విష్ణువుకు సంబంధించిన అనేక వ్రతాలు వివరించబడ్డాయి. ప్రస్తుతం లభ్యం అవుతున్న వరాహ పురాణం భవిష్యోత్తరపురాణం లాగా, అనేక పురాణాలనుంచి తీసుకొన్న విషయ సమాహారమేమో అనిపిస్తుంది. విష్ణు సంబంధమైన ద్వాదశీవ్రతమాహాత్మ్యం ఇందులో విస్తృతంగా చెప్పబడింది. పదకొండు నెలలలో ఉన్న పదకొండు ద్వాదశులకు పదకొండు విష్ణురూపాలతో సంబంధం ఉన్నట్లుగా చెప్పబడింది. ఇలా మార్గశిర శుక్ల ద్వాదశి-మత్స్యద్వాదశ, పుష్యద్వాదశి-కూర్మద్వాదశి, మాఘద్వాదశి, వరాహ ద్వాదశి, ఫాల్గుణ ద్వాదశి – నరసింహద్వాదశి, చైత్ర ద్వాదశి-వామన ద్వాదశి, వైశాఖ ద్వాదశి – పరశు రామద్వాదశి, జ్యేష్ఠ ద్వాదశి-రామద్వాదశి, ఆషాఢ ద్వాదశి-కృష్ణద్వాదశి- శ్రావణ ద్వాదశి-బుద్ధ ద్వాదశి, భాద్రపద ద్వాదశి-కల్కి ద్వాదశి, ఆశ్వయుజ ద్వాదశి-పద్మనాభ ద్వాదశి.

ఇందులో చెప్పబడిన బుద్ధద్వాదశిని పరిశీలిస్తే హిందూ సమాజం బుద్ధుని ఒక అవతారంగా స్వీకరించిన తరువాతనే ఈ పురాణ రచన జరిగి ఉండవచ్చని భావించే అవకాశం ఉన్నది. ఆస్తికులు కొందరు వ్యాస మహాముని క్రాంతదర్శి కాబట్టి తనతర్వాత రాబోయే కాలంలో పుట్టబోయే బుద్ధుడిని పేర్కొని ఉంటాడని భావిస్తారు. ఇందులోని ఉత్తర భాగంలో పులస్త్య – కురురాజ సంవాదంలో చాలా విస్తరించి వివిధ వ్రతాలు, తీర్థాలు వాని మాహాత్మ్యాలు అనేక ధర్మ ప్రసంగ కథలు చెప్పబడ్డాయి. వీటిలో ఎక్కువ భాగం విష్ణువ్రతాలే. అయితే వీటిలో రెండు విషయాలకు చాలా ప్రత్యేకత ఉన్నది. ఒకటి మధురా మాహాత్మ్యం. మధురకు సంబంధించిన అనేక తీర్థాల విస్తృత ప్రసంగం ఇందులో ఉన్నది. రెండవది నచికేతోపాఖ్యానము. ఇందులో యమ నచికేతుల కథలో ప్రసంగవశాత్తు స్వర్గనరకలోకాల విస్తృతవర్ణన ఉన్నది. కఠోపనిషత్తులో చెప్పిన కథతో

ఈ కథ ఏకీభవిస్తున్నా, అందులో చెప్పిన ఆధ్యాత్మిక విషయాలు ఇందులో ఏమీ లేవు. నారద పురాణంలో చెప్పిన శ్లోక సంఖ్య ఇప్పుడు లభ్యం కావటం లేదు. శ్లోకాల్లో చాలా తక్కువే ఉన్నాయి. ఇది వరాహపురాణ పూర్వార్ధం మాత్రమే అని భావించే అవకాశం ఉన్నది. నారదపురాణంలో పూర్వార్ధ ఉత్తరార్ధాలనే రెండు ఖండాలు చెప్పబడ్డాయి. దీనిలోని చాలా భాగాలు వేరేపురాణాలుగా లభ్యం అవుతూ అయినా ఉండాలి లేకపోతే పూర్తిగా దొరక కుండా పోయి అయినా ఉండాలి. ఇంతకు మించి ఇప్పుడు నిర్ణయించి చెప్పే అవకాశం లేదు.

లభ్యం అవుతున్న గౌడీయ, దాక్షిణాత్య పాఠాలు ఒక విషయంపైన ఉన్నవానిలో కూడా శ్లోకాలలో తేడా ఉండి వేరు వేరు గ్రంథాలుగాను, భిన్నకర్తృకాలుగానున్నట్లు తెలుస్తున్నది. జర్మనీలోని బెర్లిన్ గ్రంథాలయంలో ఉన్న రెండు ప్రతులను పరిశీలిస్తే ఈ విషయాలు స్పష్టం అవుతాయి. పదమూడవ శతాబ్దానికి చెందిన చతుర్వర్గ చింతామణి రచయిత హేమాద్రి వరాహ పురాణంలోని బుద్ధద్వాదశిని పేర్కొనడం, 12వ శతాబ్దికి చెందిన గౌడచక్రవర్తి బల్లాలసేనుడు వ్రాసిన దానసాగరంలో దీని నుంచి అనేక శ్లోకాలను ఉద్ధరించటంచేత ఇది 10వ శతాబ్దానికి ముందు కాలానికి చెందినదిగా భావించవచ్చు.

ఇందులో చాతుర్మాస్య మాహాత్మ్యం, గీతామాహాత్మ్యం, వేంకటశైలమాహాత్మ్యం, విష్ణుమాహాత్మ్యం, అంబికా మాహాత్మ్యం మొదలైనవానిని అనేక విడి పుస్తకాలుగా చేయ వచ్చు. రామానుజీయ వైష్ణవ మతానికి చెందిన అనేక విషయాలు ఇందులో చేర్చబడ్డాయి. నారాయణుడే ఆది దేవుడని స్థాపించటం, జ్ఞానవర్గ సముచ్చయం, శ్రాద్ధవర్జ్య పదార్థాలు, ద్వాదశి నాటి విష్ణు పూజా విధానం, వివిధ లోహాలతో భగవత్ ప్రతిమా నిర్మాణం, వాటి ప్రతిష్ఠ, పాంచరాత్రాగమ ప్రామాణ్యం మొదలైనవెన్నో రామానుజ సంప్రదాయం వారిచే యథాతథంగా గ్రహించబడ్డాయి.

వరాహ పురాణంలో రెండు భాగాలు ఉన్నాయి. ఒకటి పూర్వ భాగం రెండు ఉత్తర భాగం మొత్తం రెండు భాగాలలోను 218 అధ్యాయాలు 24 వేల శ్లోకాలు ఉన్నాయి. ఇప్పుడు సంపూర్తిగా ఈ పురాణాం లభ్యం కావడం లేదు.

13. స్కాందపురాణం :

ఈ పురాణంలో, స్కందుడు అంటే కుమారస్వామి శైవతత్త్వాలను నిరూపణం చేశాడు కాబట్టి దీనికి స్కాందపురాణమనే పేరు వచ్చింది. పురాణాలు అన్నింటిలోకి అతిపెద్దదైన పురాణం ఇది. దీనిలో శ్లోక సంఖ్య 81,000లు. అంటే ఇది భాగవతం కంటే అయిదు రెట్లు పెద్దది. లక్ష శ్లోకాలున్న మహాభారతం కంటే అయిదవ వంతు చిన్నదన్నమాట. ఈ పురాణంలో సంహితలు, వాటిలో ఖండాలు, వాటిలో మాహాత్మ్యాలు

ఇలా అంతర విభాగాలున్నాయి. ఈ పురాణంలో ఒకటైన సూత సంహిత (అధ్యాయం 20-12) ప్రకారం దీనిలో ఆరు సంహితాలు ఉన్నాయి. అవి.

1) సనత్కుమార సంహిత -	36,000	శ్లోకాలు
2) సూతసంహిత -	6,000	శ్లోకాలు
3) శంకర సంహిత -	30,000	శ్లోకాలు
4) వైష్ణవ సంహిత -	5,000	శ్లోకాలు
5) బ్రాహ్మసంహిత -	3,000	శ్లోకాలు
6) సౌరసంహిత -	1,000	శ్లోకాలు
మొత్తం -	**81,000**	**శ్లోకాలు**

ఈ సంహితలలో చెప్పబడిన విషయాలను గురించి నారదపురాణం విస్తృతంగా తెలుపుతున్నది. స్కాందపురాణానికి మరొకరకంగా కూడా ఖండరూపంలో విభజన ఉన్నది.

1) మాహేశ్వర ఖండం -	174	అధ్యాయాలు
2) వైష్ణవ ఖండం -	153	అధ్యాయాలు
3) బ్రహ్మ ఖండం -	87	అధ్యాయాలు
4) కాశీఖండం -	100	అధ్యాయాలు
5) అవంతీ ఖండం -	367	అధ్యాయాలు
6) నాగరఖండం -	178	అధ్యాయాలు
7) ప్రభాసఖండం -	414	అధ్యాయాలు
మొత్తం	**1471**	**అధ్యాయాలు**

ఈ విధానం ప్రకారం 81,000 శ్లోకాలు ఉన్నాయి. అందువలన ఒక్కొక్క ఖండం దాదాపు పన్నెండువేల శ్లోకాల పరిమాణంతో ఉంటుందని భావించవచ్చు. అలాగే స్కాందపురాణంలోని శంకర సంహితలోగల హాలాస్య మాహాత్మ్యం, దీనిలో ఆరు సంహితలు 50 ఖండాలు ఉన్నాయని తెలుపుతున్నది. సంహితలలో సూత సంహిత శివోపాసన విషయంలో అద్వితీయమైనది. ఈ సంహితలో వైదిక, తాంత్రిక విధానాలు రెండింటిలోను శివారాధనను విస్తృతంగా వర్ణించింది. ఈ సంహితలోని ఈ విలక్షణత వలననే విజయనగర సామ్రాజ్యంలో మంత్రి సాయణుని సోదరుడు మాధవుడు దీనిచే ఆకర్షితుడై తాత్పర్యదీపిక అనే అతి ప్రామాణికము విస్తృతమైన వ్యాఖ్యానాన్ని రచించాడు. ఈ సూత సంహితలో ఆరు ఖండాలు ఉన్నాయి 1) మొదటిది శివమాహాత్మ్య ఖండం. ఇందులో

13 అధ్యాయాలలో శివమాహాత్మ్యం విశేషంగా ప్రతిపాదించడం జరిగింది. 2) రెండవది జ్ఞానయోగ ఖండం - దీనిలో 20 అధ్యాయాలున్నాయి. ఇందులో ఆచార ధర్మాలు వర్ణించిన తరువాత హఠయోగ ప్రక్రియ సాంగోపాంగంగా వివేచించబడింది. 3) మూడవది ముక్తి ఖండం. దీనిలో 9 అధ్యాయా లున్నాయి. ముక్తి సాధన మార్గాలు వివరించబడ్డాయి. 4) నాల్గవది యజ్ఞ వైభవ ఖండం. ఇది అన్ని ఖండాలలోనికి పెద్దది. ఇది తిరిగి రెండు భాగాలు చేయబడింది. 1) పూర్వభాగం, 2) ఉత్తర భాగం. పూర్వ భాగంలో 47 అధ్యాయాలున్నాయి. వీనిలో అద్వైత వేదాంతం శైవభక్తితో జోడించి చాలా ప్రావీణ్యంతో ఆధ్యాత్మికతత్త్వ వివేచన చేయబడింది. దార్శనిక దృష్టితో చూస్తే ఈ ఖండం చాలా విలువగలది. తత్త్వవివేచన లోతుగా చేయటానికి అవ కాశం కల్పించేదిగా ఉంటుంది. దీని ఉత్తరభాగంలో రెండు గీతలు చేరి ఉన్నాయి. 1) బ్రహ్మ గీత, 2) ఇంకొకటి సూతగీత. బ్రహ్మగీతలో 12 అధ్యాయాలున్నాయి. రెండవదైన సూత గీతలో ఎనిమిది అధ్యాయాలున్నాయి. ఇవి కూడా ఆధ్యాత్మిక విషయశోభితాలు. ఆత్మ స్వరూప వివేచనము, దాని సాక్షాత్కార ఉపాయాలు చాలా చక్కగా ఇందులో ప్రతిపాదించ బడ్డాయి. ఇందులో శివప్రసాదం వలననే సర్వకర్మ సమకూరగలవని ప్రతిపాదించబడింది.

శంకర సంహిత : ఇది కూడా అనేక ఖండాలుగా విభజించబడింది. ఇందులోని మొదటి ఖండమే శివరహస్య ఖండము. మొత్తం శంకర సంహితలో ఈ ఖండమే సగం వరకు ఉన్నది. ఈ శంకర ఖండంలో 13,000 శ్లోకాలు ఉన్నాయి. 7 కాండాలుగా విభజించ బడింది. ఆ ఏడుకాండలు : 1) సంభవకాండ, 2) ఆసురకాండ, 3) మాహేంద్రకాండ, 4) యుద్ధకాండ, 5) దేవకాండ, 6) దక్షకాండ, 7) ఉపదేశకాండ.

ఆరవ సంహిత సౌర సంహిత : ఇందులో శివ పూజా సంబంధమైన అనేక విషయాలు విపులంగా వర్ణించబడ్డాయి. మొదటిదైన సనత్కుమార సంహిత, ఇది షుమారు 20, 22 అధ్యాయాలుగల చిన్నసంహిత, ఇవి తప్ప మిగిలిన సంహితలు నేడు లభ్యంకావటం లేదు.

ఖండాత్మకమైన స్కాందపురాణం వివరాలు పరిశీలించగా.

1. మాహేశ్వరఖండం : ఈ ఖండంలో తిరిగి రెండు చిన్నఖండాలు ఉన్నాయి. 1) కేదార ఖండము, 2) కుమారికా ఖండం. ఈ రెండు ఖండాలలోను శివపార్వతుల అనేక విధాలైన చిత్రవిచిత్ర లీలలు సుందరంగా వర్ణించబడ్డాయి.

2. వైష్ణవ ఖండం : ఈ ఖండంలో భాగంగా ఉత్కళ ఖండం ఉన్నది. ఉత్కళ ఖండంలో ప్రస్తుత ఒరిస్సా రాష్ట్రంలోగల పూరీలోని జగన్నాథ మందిర విశేషాలు, పూజా విధానము, ప్రతిష్ఠ ఇంకా దానికి సంబంధించిన అనేక ఉపాఖ్యానాల వర్ణన ఉన్నది. ఇంద్రద్యుమ్న

మహారాజు నారదుని ఉపదేశంతో జగన్నాథుడు ఉన్న స్థానాన్ని కనుక్కొన్న విశేషాలు, మొదలైన విషయాలు విస్తృతంగా ఈ ఖండంలో చెప్పబడ్డాయి. ఈ విధంగా పూరీ జగన్నాథ క్షేత్ర ప్రాచీన చరిత్ర తెలుసుకొనటానికి ఈ ఖండం అత్యంత ఉపయోగకారి.

3. బ్రహ్మ ఖండం : ఇందులో రెండు ఖండాలున్నాయి. 1) బ్రహ్మారణ్య ఖండము, 2) బ్రహ్మోత్తర ఖండం. బ్రహ్మారణ్య ఖండంలో ధర్మారణ్యం అనే ప్రదేశం యొక్క మాహాత్మ్యం విశదంగా తెలుపబడింది. అదే ఖండంలో ఉజ్జయినీ మహాకాళేశ్వరుని పూజా ప్రతిష్ఠా నాదులు తెలుపబడ్డాయి. రెండవదైన బ్రహ్మోత్తర ఖండం 22 అధ్యాయాలుగా విభజించ బడింది. ఇందులో శివభక్తి, శివమాహాత్మ్యం, శివవ్రతం, రుద్రాక్ష, విభూతి మాహాత్మ్యం మొదలైన శివారాధనకు సంబంధించిన అనేక విషయాలున్నాయి. ఈ బ్రహ్మోత్తర ఖండం ఆంధ్రదేశంలో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. 17వ శతాబ్దంలో బ్రహ్మోత్తర ఖండం కూడా అష్టాదశ పురాణాలలో ఒకటిగా ప్రజలు భావించేవారని అయ్యలరాజు నారాయణామాత్యుని హంసవింశతి ద్వారా తెలుస్తున్నది. దీనికి తెలుగులో అయిదు ప్రబంధశైలి అనువాదాలు, రెండు ద్విపద అనువాదాలు, మూడు వచన అనువాదాలు, ఒక్కొక్క మాహాత్మ్యం ఒక్కొక్క కావ్యంగా వచ్చాయంటే దీని ప్రభావం తెలుగునాట ఎంత ఉన్నదో గ్రహించవచ్చు.

4. కాశీఖండం : ఇందులో కాశీ క్షేత్ర మహిమ వర్ణించబడింది. కాశీలోని సమస్తదేవతలు, శివలింగాల ఆవిర్భావము, మాహాత్మ్యము విశేషంగా ఇందులో ప్రతిపాదింపబడ్డాయి. కాశీ యొక్క ప్రాచీన భూగోళ వివరాలు తెలుసుకోటానికి ఇది బహుళోపయోగకారి.

5. రేవా ఖండం : రేవానది అంటే నర్మదానది అని అర్థం. నర్మదానది ఉత్పత్తి దాని తీరంపైగల తీర్థ క్షేత్రాల విస్తృతవర్ణన ఇందులో ఉన్నది. సత్యనారాయణవ్రతం చేసుకొనే టప్పుడు చెప్పే కథ ఈ రేవాఖండంలోనే ఉన్నది.

6. అవంతీ ఖండం : అవంతీ నగరమే ఉజ్జయినీ నగరం. అక్కడ గల భిన్న భిన్న శివ లింగాల ఉత్పత్తి మాహాత్మ్యము ఈ ఖండంలో వివరించబడింది. ప్రాచీన అవంతీ దేశ ధార్మిక స్థితి యొక్క పూర్తి దిగ్దర్శనం ఈ ఖండంలో కనిపిస్తుంది.

7. తాపీ ఖండం : ఇందులో నర్మదకు ఉపనది అయిన తాపీనది ఒడ్డునగల నానా తీర్థక్షేత్ర వర్ణన ఉన్నది. నారద పురాణానుసారం దీని ఆరవ ఖండం పేరు నాగర ఖండం. ప్రస్తుతం లభిస్తున్న నాగర ఖండంలో మూడు భాగాలున్నాయి. 1.విశ్వకర్మ ఉపాఖ్యానం 2. విశ్వకర్మ వంశాఖ్యానం 3. హాటకేశ్వర మాహాత్మ్యం అనేవి అవి. ఈ మూడవ ఖండంలో నాగర బ్రాహ్మణుల ఉత్పత్తి చెప్పబడింది. భారతదేశీయ సామాజిక స్థితిని తెలుసుకొనటానికి

8. ప్రభాసఖండం : ఇందులో ప్రభాస క్షేత్రవర్ణన చేయబడింది. ద్వారకానగర పరిసర ప్రాంతాలను గురించి తెలుసుకొనటానికి ఇది ఉపయోగపడుతుంది.

స్కాంద పురాణం ముఖ్యంగా శైవపురాణం. ఇందులో దేశంలోని అనేక మూలలలో గల తీర్థక్షేత్ర మాహాత్మ్యాల వర్ణన ఉన్నది. అలాగే ప్రాచీన భారతదేశ భౌగోళిక స్థితిని తెలుసుకొనటానికి ఇది ఉత్తమ ఆధార గ్రంథం. అందువలన వాటిని గురించిన అనేక అద్భుత గాథలు ఉపాఖ్యానాలు ఇందులో చోటు చేసుకున్నాయి. ఇందులో అనేక కథలు అనేక పర్యాయాలు అనేక స్థలాలలో భిన్న భిన్న రూపాలలో మరల మరల వస్తుంటాయి. ఇది అతి ప్రాచీనకాలంనాటి పురాణం అనేదాంట్లో సందేహం లేదు. ఎందుకంటే క్రీ.శ. 1000 నాటి వ్రాతప్రతి కలకత్తాలో లభ్యం అయింది. అదే ఆశ్చర్యం అనుకొంటే అంతకంటే వింతగా స్కాందపురాణం వ్రాతప్రతి నేపాలు రాజప్రాసాద గ్రంథాలయంలో క్రీ.శ. 7వ శతాబ్దానికి చెందిన ప్రతి ఉన్నదని పండితులు తెలుపుతున్నారు. దీని మూలరూపం ఏమిటి ? అది ఎలా ఇంత బృహద్రూపాన్ని సంతరించుకొన్నది అనే విషయం భవిష్యత్తులో పురాణ పండితులు తేల్చాలి.

స్కాంద పురాణం ఏడు ఖండాలుగా విభజించబడింది. 1. మహేశ్వర ఖండం, 2. వైష్ణవ ఖండం 3. బ్రహ్మ ఖండం, 4. కాశీఖండం, 5. అవంతీ ఖండం 6. నాగర ఖండం 7. ప్రభాస ఖండము. ఒక్కొక్క ఖండం ఇంకా అనేక అవాంతర ఖండాలుగా కూడా విభజింపబడింది. ఇందులోని మాహేశ్వర ఖండంలో 174 అధ్యాయాలు వైష్ణవ ఖండంలో 156 బ్రహ్మ ఖండంలో 87 కాశీఖండంలో 100 అధ్యాయాలు అవంతీ ఖండంలో 387 నాగర ఖండంలో 279 అధ్యాయాలు ప్రభాస ఖండంలో 421 అధ్యాయాలు వెరసి 1671 అధ్యాయాలు ఉన్నాయి. నారద పురాణం ప్రకారం 81,000 శ్లోకాలు ఉండాలి. మత్స్య పురాణానుసారం 81,102 శ్లోకాలు ఉండాలి. స్కాందపురాణం ప్రస్తుతం సంహితాత్మకంగాను, ఖండాత్మకంగాను కూడా రెండు భిన్నభిన్న రచనలు లభ్యం అవుతున్నాయి.

14. వామన పురాణం :

మత్స్య పురాణంలో చెప్పిన ప్రకారం, బ్రహ్మ వామన అవతారాన్ని, మాహాత్మ్యాన్ని ఆధారంగా చేసుకొని, త్రివర్గాలకు సంబంధించిన విషయాలను వివరించిన పురాణం కాబట్టి దీనికి వామన పురాణం అని పేరు వచ్చింది. దీనిలోని శ్లోక సంఖ్య పదివేలు. ఇందులో 95 అధ్యాయాలున్నాయి. ఇది 1) పూర్వ, 2) ఉత్తర భాగాలుగా విభజించబడి ఉన్నది. ఉత్తర భాగానికే ఇంకొక పేరు బృహద్వామన పురాణం. ఇందులో నాలుగు

సంహితలున్నాయి. 1) మాహేశ్వరీ సంహిత, 2) భాగవతీ సంహిత, 3) సౌర సంహిత, 4) గణేశ్వరీ సంహిత. ప్రతి సంహితలోను దాదాపు వేయి వేయి శ్లోకాలున్నాయి. మాహేశ్వరీ సంహితలో శ్రీకృష్ణ చరిత్రము ఆయన భక్తుల వృత్తాంతాలు ఉన్నాయి. భాగవతీ సంహితలో జగదాంబ పార్వతి యొక్క అవతార కథ ఉన్నది. సౌర సంహితలో సర్వసాక్షి సూర్య భగవానుని మాహాత్మ్యం వర్ణించబడింది. గణేశ్వరీ సంహితలో గణపతి యొక్క మాహాత్మ్యం వివరించి ఉన్నది. పులస్త్యుడు మొదటిసారిగా దీనిని నారద మహాముని‌కి వివరించగా నారదుడు వ్యాసునికి చెప్పినట్లు, ఆయన రోమహర్షణ సూతునికి తెలుపగా ఆయన నైమిశారణ్యంలో ఋషులకు ఈ పురాణాన్ని వివరించినట్లు వక్తృశ్రోతృపరంపర తెలుపుతున్నది. వామన పురాణంలోని భిన్న విభిన్న కథలతోపాటు వామనావతార కథ విస్తృతంగా వర్ణించబడింది. ఇందులో శివ, శివమాహాత్మ్య, శివతీర్థ, శివశివా వివాహ, గణేశోత్పత్తి, కార్తికేయ జననం మొదలైన వృత్తాంతాలు కావ్యకళా దృష్టితో వర్ణించబడ్డాయి. అంతేగాకుండా అనేక తీర్థాలు, వనాలు, వాని మాహాత్మ్యం, సృష్టివర్ణన, ధర్మ నిరూపణం మొదలైనవి కూడా సుందరంగా వర్ణించబడ్డాయి.

ఇప్పుడు వామన పురాణ ఉత్తర ఖండం లభ్యం కావటం లేదు. కేవలం పూర్వ భాగం మాత్రమే లభిస్తున్నది. ఇందులో మొత్తం 95 అధ్యాయాలున్నాయి. అందువల్లనే దీనిని అసంపూర్ణ పురాణం అనవచ్చు. ప్రస్తుతం ఋమారు ఆరు వేల శ్లోకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి. ఇది మొదట్లో వైష్ణవ పురాణమే అయినా కాలక్రమంలో శైవ ప్రభావం చేత దీనిలో శివచరిత్ర కూడా ప్రవేశపెట్టబడి ఉండవచ్చు. ఇది కురుక్షేత్రంలో వ్రాయబడి ఉంటుంది. ఈ పురాణంలో కాళిదాసు రచనలతో అనేకమైన సామ్యాలు ఉన్నాయి. ఇందులో శైవవైష్ణవ చరిత్రల అందమైన కలయిక కనబడుతుంది. ఈ పురాణం బహుశః క్రీ.శ. ఏడవ-పదవ శతాబ్దం మధ్యన రచింపబడి ఉంటుందని ఒక ఊహ. దీనిలో నుంచి అనేక ప్రత్యేక గ్రంథాలను వెలువరించవచ్చు. వాటిలో నరకచతుర్థీ కథ, గంగా మాహాత్మ్యం, గంగా మానసిక స్నానం, వారాహ మాహాత్మ్యం, వెంకటగిరి మాహాత్మ్యం మొదలైనవి కొన్ని మాత్రమే. దీని నాలుగు సంహితలలో మొత్తం 95 అధ్యాయాలుండగా ఇందులో మొత్తం పదివేల శ్లోకాలు ఉన్నాయి. ఇందులో రెండవదైన ఉత్తరభాగం ప్రస్తుతం లభ్యంకావటం లేదు.

15. కూర్మపురాణం :

కూర్మరూపుడైన జనార్దనుడు పాతాళలోకంలో ధర్మ, అర్థ, కామ మోక్షాలనే చతుర్విధ పురుషార్థ సాధన గురించి విష్ణు భక్తుడైన ఇంద్రద్యుమ్ననికి, ఇంద్రుడు మహర్షుల సమక్షంలో తెలుపుతూ చేసిన వివరణ అని ఈ పురాణం ద్వారా తెలుస్తున్నది. ఇందులో

లక్ష్మీకల్పంలోని వృత్తాంతం కలదని తెలుపబడింది. దీనిలోని శ్లోకాల సంఖ్య 17 వేలు. కూర్మపురాణం రెండు భాగాలుగా ఉన్నది. పూర్వభాగం, ఉత్తర భాగం. పూర్వభాగంలో 53, ఉత్తర భాగంలో 46 మొత్తం 99 అధ్యాయాలున్న పురాణం ఇది. కూర్మపురాణం నాలుగు సంహితలుగా విభజించబడింది. 1) బ్రాహ్మీసంహిత, 2) భాగవతీసంహిత, 3) సౌరీసంహిత, 4) వైష్ణవీ సంహిత. ఈ బ్రాహ్మీ సంహిత తిరిగి పూర్వార్ధం, ఉత్తరార్ధాలుగా విభజించబడింది. ఇందులో పూర్వార్ధంలో 53, ఉత్తరార్ధంలో 46 వెరసి 99 అధ్యాయాలున్నాయి. ఈ బ్రాహ్మీ సంహితలో మొత్తం ఆరువేల శ్లోకాలు ఉన్నాయి. నారద పురాణాను సారం నాలుగు సంహితలలోను కలిపి 17 వేల శ్లోకాలు, మత్స్యపురాణానుసారం 18 వేల శ్లోకాలు ఉన్నట్లు తెలుస్తున్నది. తంత్రశాస్త్రానికి సంబంధించిన ఎన్నో విషయాలు ఇందులో ఉన్నాయి. అయితే ప్రస్తుతం లభ్యం అవుతున్న కూర్మపురాణంలో కేవలం ఆరు వేల శ్లోకాలే ఉన్నాయి. అంటే దాదాపుగా మూడింట రెండువంతులు లభ్యం కాకుండా పోయిందన్నమాట. ఇందులో పురాణమంతటా శివుని ప్రాధాన్యమే చెప్పబడింది. అలాగే అనేక సందర్భాలలో బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు భేదంలేదని ప్రకటించబడింది. ఈ ముగ్గురు పరబ్రహ్మ యొక్క వివిధ రూపాలని చెప్ప బడింది. ఇందులో శక్తి పూజకు కూడా చాలా ప్రాధాన్యత ఉన్నది. శక్తి యొక్క సహస్ర నామస్తోత్రం (1-12) దీనిలో ఉన్నది. విష్ణు శివులు లక్ష్మీ గౌరిల ప్రతిరూపాలని చెప్ప బడింది. శివపారమ్యం ఎంత ఎక్కువగా ప్రతిపాదించబడిందంటే విష్ణు స్వరూపుడైన శ్రీకృష్ణుడు శివుని ప్రసాదం చేతనే జాంబవతి యందు సాంబుడనే పుత్రుడిని పొందగలిగాడని విపులంగా తెలుపుతున్నది.

ఇందులోని పూర్వభాగంలోని సృష్టి ప్రకరణం తరువాత, పార్వతి తపస్సు, ఆమె సహస్రనామాలు వర్ణించబడ్డాయి. ఇక్కడే కాశీ ప్రయాగ క్షేత్రమాహాత్మ్యం తెలుపబడింది. ఉత్తర భాగంలో ఈశ్వర గీత, వ్యాసగీత అనే రెండు గీతలు ఉన్నాయి. ఈశ్వరగీతలో భగవద్గీతలో తెలిపిన విధానంలోనే ధ్యానయోగం ద్వారా శివసాక్షాత్కారం లభిస్తుందని చెప్పబడింది. వ్యాసగీతలో నాటి ఆశ్రమాల కర్తవ్యము, ఆచరింపవలసిన కర్మలు, వ్యాస మహర్షి ద్వారా బోధింపబడ్డాయి. ప్రస్తుతం ఇందులోని నాలుగు సంహితాలలోను కేవలం బ్రాహ్మీ సంహిత మాత్రమే లభిస్తున్నది. మిగిలిన సంహితలు అలభ్యాలు.

దీనిలో తాంత్రిక గ్రంథాలలోని చాలా విషయాలు కలిసిపోయినట్లుగా తెలుస్తున్నది. నారద పురాణం ప్రకారం ఈ పురాణంలో చెప్పబడిన విషయాలు డామర, యామలాది తంత్ర గ్రంథాలలో ఉన్న విషయాలే. ఇందులో చాలా స్తోత్రాలు, మాహాత్మ్యాలు ప్రత్యేకంగా పరిగణన పొందుతున్నాయి. మహేశ్వరునికి శాంతి విద్యపై నాలుగు విధాలైన శక్తులున్నాయని, అందుచేతనే పరమేశ్వరుడు చతుర్వ్యూహుడనీ ఇందులో చెప్పబడింది.

ఇది పాంచరాత్రాగమాల నుంచి గ్రహించిన పద్ధతి. వాస్తవంలో ఇది మొదట పాంచరాత్ర మతాన్ని ప్రతిపాదించే పురాణమని, కాలక్రమంలో పాశుపతులు దీనిలో పాశుపత ప్రక్రియను ప్రవేశపెట్టారని పండితుల అభిప్రాయం. ఈ పురాణం 5,6 శతాబ్దాలలో రచింపబడి ఉండాలి.

16. మత్స్యపురాణం :

ఇది కూడా విస్తృతపురాణాలలో ఒకటి. ఇందులో 290 అధ్యాయాలున్నాయి. మొత్తం 15 వేల శ్లోకాలు ఉన్నాయి. మత్స్య రూపంలోని శ్రీమహా విష్ణువు కల్పాదియందు శ్రుతి అర్థమును నరసింహ వర్ణన సందర్భంలో ఏడుకల్పాల విషయ వివరణ చేసినట్టిదే మత్స్యపురాణమని స్వయంగా ఇందులో చెప్పబడి ఉన్నది. ప్రారంభంలో మన్వంతరాల గుఱించి సంక్షిప్తమైన వివరణ చేసిన తరువాత పితృదేవగణాల వర్ణన విస్తృతంగా ఉన్నది. అనేక రకాల వ్రతాలను గురించిన సుందరమైన వర్ణన ఇందులో కనిపిస్తుంది. తీర్థాలలో శ్రేష్ఠమైన ప్రయాగక్షేత్ర భౌగోళిక వివరణ, మాహాత్మ్యము చాలా విపులంగా ఉన్నది. రాజవంశ వర్ణనలలో సోమవంశ వర్ణన చాలా విపులంగా ఉన్నది. పరమేశ్వరుని త్రిపురాసుర యుద్ధము సంహారము సవివరంగా విపులంగా చెప్పబడింది. తారకాసుర వధకూడా ఇందులో విస్తృతంగా చెప్పబడింది. మత్స్యావతార కథ ప్రధానంగా ఉండడంచేత దీనికి మత్స్య పురాణం అనే పేరు సార్థకం అవుతున్నది. కాశీ ప్రయాగక్షేత్రాలు, నర్మదా నదీ ప్రాంతంలో ఉన్న క్షేత్రాలను గురించిన విపుల వర్ణన ఉన్నది. ఋషివంశాల వర్ణనం, 25 అధ్యాయాలలో రాజధర్మ ప్రతిపాదనము వివిధ దేవతామూర్తుల ప్రతిమ, నిర్మాణాదుల విస్తృత వర్ణనం ఈ పురాణంలో ప్రధానంగా ప్రతిపాదించబడిన విశేషం.

మత్స్య పురాణంలోని 53వ అధ్యాయంలో అష్టాదశ పురాణాల యొక్క లక్షణాలు, దానిలో చెప్పబడిన అంశాలు, శ్లోక సంఖ్య మొదలైనవి విపులంగా తెలియజేయబడ్డాయి. ఇది మిగిలిన పురాణాల ప్రస్తుత స్థితిని ఊహించటానికి ప్రముఖంగా పనికివస్తున్నది. మత్స్యమూర్తి, మనువులకు ప్రళయ విషయాన్ని గురించిన సంభాషణ, మానసిక సృష్టి తర్వాత, మైథున సృష్టి ఆరంభం, బ్రహ్మ సరస్వతుల చరిత్ర, పృథు చరిత్ర, సూర్య సోమవంశ వర్ణనము యయాతి చరిత్ర, సప్త సంతానాల ప్రతిష్ఠ అనేక వ్రత విధానాలు, దానఫల ప్రతిపాదనము, వివిధ నదీ పర్వత వర్ణనము, శాకము మొదలైన ద్వీపాల వృత్తాంతము, యుగవివరణ తారకోపాఖ్యానం, దేవాసుర సంగ్రామ వర్ణనం, నర్మదా మాహాత్మ్యము, సావిత్ర్యుపాఖ్యానం, రాజవంశవర్ణనము, శమనజ్ఞానము, గృహ నిర్మాణం మొదలైన అనేక విషయాలు ఇందులో వర్ణించబడ్డాయి.

ప్రళయ కాలంలో అన్ని నదులూ నశించినా, నర్మదానది మాత్రం నశించదని చెపుతూ నర్మదా నదికి గంగ కంటె కూడా ఎక్కువ వైశిష్ట్యాన్ని అంగీకరించడం నర్మదా నదీతీరాన్ని అనుసరించి ఉన్న చిన్న చిన్న తీర్థాలను కూడా వర్ణించటం మొదలైన ఆధారాలను బట్టి ఈ పురాణం నర్మదా నదీ తీరంలో రచింపబడి ఉండవచ్చని ఊహించవచ్చును.

కాళిదాసుని విక్రమోర్వశీయంలో ఉన్న కథకు ఈ పురాణంలోని ఊర్వశీ ఉపాఖ్యానానికి అత్యంత సామ్యం ఉండడంచేత ఇది కాళిదాసుకు అనంతరం రచింపబడి ఉంటుందని కొందరి ఊహ. నారద పురాణంలో చెప్పబడినట్లుగానే ఇందులోని, అధ్యాయ సంఖ్య శ్లోకసంఖ్య ఉన్నది. అందువలన పురాణ విమర్శకులందరూ దీని వాస్తవికతను ప్రామాణికతను, ఏకగ్రీవంగా అంగీకరిస్తున్నారు. ఇది 16వ పురాణం అయినా దేవీ భాగవతాన్ని అనుసరించి ఇది మొదటి పురాణం కావాలి. స్మృతిరఘునందనుడనే పండితుడు రచించిన 'వృషోత్సర్గతత్త్వం' అనే గ్రంథంలో 'స్వల్పమత్స్య పురాణమనే చిన్న గ్రంథం ఒకటి పేర్కొనబడినా, అసలు దాని ఉనికే ఏమాత్రం నేడు తెలియటంలేదు.

ఈ పురాణం కొన్ని ప్రత్యేకలను కలిగి ఉన్నది. మొదటిది ఇందులో 53వ అధ్యాయంలో చెప్పిన అన్ని పురాణాల విషయానుక్రమణిక. దీనివలన అన్ని పురాణాల క్రమానుగత వికాసం తెలుసుకొనే అవకాశం కలుగుతుంది. శ్రేష్ఠమైన ఋషిగణం యొక్క వంశ వర్ణనం ఇందులో ఇంకొక ప్రత్యేకత. భృగు, ఆంగీరస, అత్రి, విశ్వామిత్ర, కశ్యప, వసిష్ఠ పరాశర, అగస్త్యాది మహాఋషుల వంశాల వర్ణన 195వ అధ్యాయం నుంచి 202వ అధ్యాయం వరకు చక్కగా చేయబడింది. ఇక మూడవది రాజ ధర్మాల విశిష్ట వివరణ. ఇది 215వ అధ్యాయం నుంచి 243 అధ్యాయం వరకు, దైవ, పురుషకార, సామ, దామ, దండ, భేద, దుర్గ, యాత్ర, సహాయసంపత్తి, తులాదానం వంటి వాని వివరణ, రాజనీతికి సంబంధించిన విశిష్టతలను నిరూపిస్తున్నది. ఈ రాజధర్మంలో ఒక భాగంగా శాంతిఖండాన్ని కూడా చేర్చడం అద్భుతమైన విషయం. (అధ్యాయం 228 నుంచి 238) ఇందులో విషయాలు చాలా నవీనంగా ఉంటాయి. నాల్గవ ప్రత్యేకత ఇందులో చెప్పబడిన ప్రతిమా లక్షణాలు. రకరకాల దేవతలు, దేవుళ్ల విగ్రహాల కొలతలు, తయారుచేయటం చెప్పబడింది. మన ప్రతిమాశాస్త్రం, శాస్త్రీయ పద్ధతులపై ఆధారపడి ఉన్నది. విభిన్న దేవతల విగ్రహాలు కొలతల ప్రకారమే జరగాలి. వాటి ప్రతిష్ఠ, పీఠ నిర్మాణం కూడా ఒక విశిష్ఠ శైలిపై ఆధారపడి ఉంటుంది. ఈ విషయాలన్నింటి వివరణ ఈ పురాణం (257-270)లో చాలా ప్రామాణికంగా చెప్పబడింది. రాజు తన శత్రువుల మీద దండెత్తి పోయేటప్పుడు ఏ ఏ విషయాలపై దృష్టి కేంద్రీకరించాలి వంటి విషయాలు, రాజధర్మాలు మొదలైనవి విపులంగా వివరించబడ్డాయి.

మత్స్యపురాణం కేవలం అధ్యాయాలుగా మాత్రమే విభజించబడింది. ఇందులో 290 అధ్యాయాలున్నాయి. ఈ 290 అధ్యాయాలలో 14 వేల శ్లోకాలున్నాయి. కానీ నారద పురాణానుసారం ఇందులోని శ్లోకాల సంఖ్య 15 వేలు.

17. గరుడ పురాణము :

శ్రీమహావిష్ణువు గరుడ కల్పంలో గరుడుడు ఉద్భవించిన విషయ వివరణ చేస్తూ బ్రహ్మాండ ఆరంభం దగ్గర నుంచి గరుడునికి వివరించిన పురాణం కాబట్టి దీనికి గరుడ పురాణమనే పేరువచ్చింది. ఇందులో 264 అధ్యాయాలు 18వేల శ్లోకాలు ఉన్నాయని నారదపురాణం తెలుపుతున్నది. ఇది రెండు ఖండాలుగా ఉన్న పురాణం. పూర్వఖండంలో లౌకిక ఉపయోగానికి అవసరమైన సమస్త విద్యల వివరణ విస్తృతంగా ఉన్నది. పురాణ ప్రారంభం లోనే విష్ణువు ఆయన అవతారాల మాహాత్మ్యం గురించి తెలియజేయబడింది. దీనిలోని ఒక అంశంతో అనేక రకాల రత్నాల పరీక్ష, అలాగే ముత్యము (69 అధ్యాయం) పద్మరాగం (70వ అధ్యాయం) మరకత, ఇంద్రనీల, వైడూర్య, పుష్పరాగ, కరకేతన, భీష్మరత్న, పులక, రుధిరాఖ్య రత్నాలు, స్ఫటికము, విద్రుమ పరీక్షలు (71 నుంచి 80 అధ్యాయాల వరకు) తెలుపబడ్డాయి. ఇందులో రాజనీతి (108-115 అధ్యాయాల వరకు) కూడా బాగా విస్తృతంగా వివరించబడింది. ఆయుర్వేదము యొక్క ఆవశ్యకత, రోగనిధానము, చికిత్సా విధానములను గురించి (15 నుండి 181 అధ్యాయాల వరకు) అనేక అధ్యాయాలలో వివరించబడింది. అనేక రకాల రోగాలను పోగొట్టటానికి ఔషధ విధానం (170-196వ అధ్యాయం వరకు) చెప్పబడింది. ఇది చాలా ప్రశంసనీయ విషయం. ఇంకొక అధ్యాయం (199) మనస్సును నిర్మలంగా ఉంచుకొనటానికి ఔషధాలను నిర్దేశించింది. ఆయుర్వేదాన్ని ప్రతిపాదించే ఈ 50 అధ్యాయాలు వేరు పుస్తకంగా ప్రకటించి, ఇతర ఆయుర్వేద గ్రంథాలలాగా దీనిని కూడా పరిశీలించవలసిన అవసరం ఉన్నది. ఛందశాస్త్ర విషయాలు (211-216) అధ్యాయాలు ఇందులో ఉన్నాయి. సాంఖ్య యోగాన్ని గురించి విపులంగా 14 (230 - 243) అధ్యాయాలలో వివరించబడింది. ఒక అధ్యాయం (242)లో గీతాసారాంశం ఉన్నది. ఈ విధంగా గరుడపురాణం ఈ పూర్వాంశం అగ్ని పురాణం వలెనే సమస్త విద్యలకు విజ్ఞాన కోశంగా చెప్పవచ్చును.

ఈ పురాణం యొక్క ఉత్తర ఖండానికి, 'ప్రేతకల్పం' అని పేరున్నది. ఇందులో 45 అధ్యాయాలున్నాయి. జీవి మరణించిన తరువాత మనుష్యునికి ఏ స్థితి కలుగుతుంది. అతడు ఏ యోని యందు తిరిగి పుట్టగలడు ఏఏ భోగాలను అనుభవిస్తాడు మొదలైన విషయాలు అక్కడక్కడా ఇతర పురాణాలలో ఉన్నా, ఈ పురాణంలో అత్యంత విస్తృతంగా సాంగోపాంగమైన వర్ణన ఉన్నది. ఇంత విస్తృతంగా వేరు పురాణాలలో లేదు. ఇందులో

గర్భావస్థ, నరకము, యమ నగరమునకు మార్గము, ప్రేత గణముల వాసస్థానము ప్రేత యోని నుంచి ముక్తి, ప్రేతముల రూపము, మనుష్యుల ఆయుర్దాయము, యమలోక వివరణము, సపిండులైనందున చేయవలసిన విధులు, వృషోత్సర్గ విధానము మొదలైన విషయాలు ఆయా అధ్యాయాలలో విస్తృతంగా ఆసక్తికరంగా వివరించబడ్డాయి. ఒక వ్యక్తి మరణించివప్పుడు అశౌచకాలంలో ఈ ఉత్తరఖండం పురాణంగా చెప్పటం, దానిని ప్రేతబంధువులు వినటం సంప్రదాయంగా హిందువులలో ఉన్న విషయమే. ఈ ప్రేతకల్ప భాగం జర్మన్ భాషలోకి కూడా అనువదించబడింది.

నారదపురాణం, మత్స్యపురాణాలలో గరుడ పురాణ విషయాలుగా చెప్పబడినవి. యథాతథంగా లభ్యం అవుతున్నాయి. ప్రస్తుతం లభ్యం అవుతున్న గరుడ పురాణంలో ఏడువేల శ్లోకాలు ఉన్నాయి. లభ్యం అవుతున్న గరుడ పురాణంలో శ్లోకసంఖ్య తక్కువగా ఉన్నా, చెప్పబడిన విషయాలు మాత్రం కొరత లేదు. ఇందులోని భవిష్య రాజవంశాఖ్యానాన్ని చదివితే ఇది జనమేజయుని కాలంలో సంకలింపబడినట్లు తెలుస్తుంది. మత్స్య, విష్ణు పురాణాలలోని భవిష్యరాజ వంశాఖ్యాన వృత్తాంతాలలో ఆంధ్ర, గుప్త రాజవంశాలు పేర్కొనబడ్డాయి. కానీ ఇందులో ఆ వృత్తాంతాలు లోపించటంవలన, ఇది ఆ పురాణాలకంటే ప్రాచీనమని భావించటం సమంజసంగా ఉంటుంది.

శూద్రక మహారాజు కాలంలో బౌద్ధ హిందూ ధర్మాలు కలసిపోయాయి. ఆ సమయంలో బౌద్ధమతము, బుద్ధుని ఆరాధన మనదేశంలో ఎక్కువగా ఉండేది. అందువలననే బుద్ధుడు విష్ణువు యొక్క 21వ అవతారంగా పేర్కొనబడ్డాడు. ఇందులో బుద్ధుని తండ్రి ఆయన వంశం (శుద్ధోధకో రాహులశ్చ సేనజత్ శూద్రక్తసథా) స్పష్టంగా చెప్పబడ్డాయి.

ఇందులోని వృత్తాంతం తార్క్ష్యకల్పం నాటిది అని చెప్పబడింది. తార్క్ష్యుడు గరుడుడే. అదే గరుడ కల్పవృత్తాంతం. ఇందులో గయామాహాత్మ్యం చాలా విపులంగా చెప్ప బడినందున గయ క్రీ.శ. 6,7 శతాబ్దాలలో విస్తృత ప్రచారంలోకి బౌద్ధమత పతనం తరువాత వచ్చినందున ఇది ఎనిమిదవ శతాబ్దం కాలంనాటి పురాణంగా భావించ వచ్చు. మిథిలా ప్రాంతంలో దీని రచన జరిగి ఉండవచ్చని భావించబడుతున్నది. దీని నుండి ప్రత్యేకంగా త్రివేణీస్తోత్రము, పంచపర్వమాహాత్మ్యము, విష్ణు ధర్మోత్తరము, వేంకటగిరి మాహాత్మ్యము, శ్రీరంగనాథ మాహాత్మ్యము, సుందరపుర మాహాత్మ్యము మొదలైనవానిని ప్రత్యేక గ్రంథములుగా ఏర్పాటు చేయవచ్చును.

గరుడ పురాణం రెండు ఖండాలుగా విభజించబడింది. పూర్వ ఖండం, ఉత్తర ఖండం. దీనిలోని ఉత్తర ఖండానికే ప్రేత కల్పమనే ఇంకొక పేరు ఉన్నది. ఈ పురాణంలో

పూర్వఖండంలో 240, ఉత్తర ఖండం ((ప్రేత కల్పం)లో 78 అధ్యాయాలు మొత్తం 318 అధ్యాయాలు ఉన్నాయి. దీనిలో నారదపురాణానుసారం 19 వేల శ్లోకాలు మత్స్య పురాణాను సారం 18 వేల శ్లోకాలు ఉన్నాయి.

18. బ్రహ్మాండ పురాణము :

సమస్త బ్రహ్మాండాన్ని ఆధారంగా తీసుకొని బ్రహ్మచేత భవిష్యకల్పవృత్తాంతంగా చెప్పబడిన పురాణం కాబట్టి దీనిపేరు బ్రహ్మాండపురాణం అయ్యింది. ఇందులోని శ్లోక సంఖ్య 12,200 భువన కోశం లేక ఈ సకల చరాచర బ్రహ్మాండ వర్ణన అన్ని పురాణాలలోను ఉంటుంది. కానీ ఈ పురాణం ఈ బ్రహ్మాండం (విశ్వం) అంతటిని సాంగోపాంగంగా వరిస్తుంది. నారదపురాణాన్ని అనుసరించి దీనిలో 161 అధ్యాయాలు, 12,000 శ్లోకాలు ఉన్నాయి. ఇప్పుడు పురాణంలో ఉన్న విషయానుక్రమణి నారద పురాణంలో చెప్పబడిన విషయానుక్రమణికతో సరిపోతున్నది. కూర్మపురాణం చెప్పిన పురాణపు పేర్లలో ఇది వాయవీయ బ్రహ్మాండపురాణం అని పేర్కొంటున్నది. ఈ విషయాన్ని అనుసరించి మన పురాణాలపై పరిశోధన చేసిన పాశ్చాత్య పురాణ పండితులు ఇది వాయుపురాణము యొక్క విస్తృత రూపమని, దీనికి మూలం వాయు పురాణమేనని భావించారు. కానీ ఇది సరియైన అభిప్రాయం కాదు. నారదపురాణాన్ని అనుసరించి వాయుదేవుడు వ్యాసునికి ఈ పురాణాన్ని బోధించాడని తెలుస్తున్నది. అందువలననే సరిగా ఇది వాయుప్రోక్త బ్రహ్మాండపురాణమని చెప్పబడింది.

ఈ పురాణ ప్రథమ ఖండంలో విశ్వభూగోళ వర్ణన విస్తృతంగా చేయబడింది. జంబూద్వీపము, అందులోని పర్వత, నదీ నద వర్ణన అనే అధ్యాయాలలో '66-72 వరకు) చేయబడింది. భద్రాశ్వ, కేతుమాల, చంద్రద్వీప, కింపురుషవర్ష, కైలాస, శాల్మిల ద్వీప, కుశద్వీప, క్రౌంచద్వీప, శాకద్వీప, పుష్కరద్వీపము వంటి అనేక వర్షములు, దీపముల వర్ణన విభిన్న అధ్యాయాలలో, ఆకర్షణీయంగా సమగ్రంగా లభ్యం అవుతున్నది. ఈ పురాణపు తృతీయ పాదంలో భారతదేశంలోని ప్రసిద్ధులైన క్షత్రియ వంశ వివరణ చారిత్రక దృష్టితో చాలా విలువగల భాగము.

ఈ పురాణాన్ని గురించిన ఇంకొక ప్రత్యేకత ఏమంటే క్రీ.శ. 5వ శతాబ్దంలో బ్రాహ్మణులు ఈ పురాణాన్ని జ్వాలా(బలి)ద్వీపానికి తీసుకొనిపోయారు. అక్కడ ఇది ప్రాచీన జావాభాష అయిన 'కలిభాష'లోకి అనువదించబడింది. ఆ అనువాదం ఈ రోజుకు ఉపలబ్ధం అవుతున్నది. అందువలన ఈ పురాణం చాలా ప్రాచీన కాలానికి చెందినదిగా భావించవచ్చును. ఈ పురాణము యొక్క 16, 17, 18 అధ్యాయాలలోని భవిష్య

కల్పవృత్తాంతం విస్తారంగా వర్ణితమైంది. ఈ రకమైన విస్తృతకల్పవర్ణనం మిగిలిన ఇతర పురాణాలలో లభించదు. అందువలన లభ్యం అవుతున్న బ్రహ్మాండపురాణ అస్తిత్వం, మౌలికత, మహాపురాణత్వాన్ని గురించి ఎటువంటి సందేహాలు పెట్టుకొనవలసిన అవసరం లేదు. బ్రహ్మాండపురాణం అష్టాదశ పురాణాలు అన్నింటిలోను ప్రాచీనతమమైనదని పురాణతత్త్వజ్ఞుల భావన. స్కాందపురాణంలాగానే దీనిలో కూడా అనేక మాహాత్మ్యాలు వర్ణింపబడ్డాయి.

దీని ప్రథమ ఖండంలో నదులు తీర్థాల వర్ణనతరువాత నక్షత్రమండలము యుగములు, మన్వంతరాల విపుల వివరణ ఉన్నది. విశ్వ విఖ్యాతులైన క్షత్రియ ప్రభువుల వంశ వర్ణనము చారిత్రకంగా విలువైనట్టిది. నారదపురాణ సూచికను అనుసరించి అధ్యాత్మ రామాయణము ఇందులోని భాగమే. కానీ ప్రస్తుతం ఉపలబ్ధం అవుతున్న బ్రహ్మాండ పురాణంలో అధ్యాత్మ రామాయణం లభ్యంకావటం లేదు. ఈ అధ్యాత్మరామాయణము శ్రీరామ చరిత్రను ఆధ్యాత్మికముగా వ్యాఖ్యానించిన గ్రంథము. దీనిని అనుసరించి రాముడు పురుషుడు. సీత ప్రకృతి. శ్రీరాముడు పరబ్రహ్మము, సీత ఆయన యొక్క అనిర్వచనీయమైన మాయ. ఈ ఇద్దరి లీలా విలాసమే ఈ సర్వప్రపంచము. బ్రహ్మ, మాయతో కూడా భారాన్ని తగ్గించడంకోసం పరబ్రహ్మమైన రాముని కోరగా ఆయన ఈ భూలోకములో శ్రీరామునిగా అవతరించి తన లీలలను విస్తారంగా ప్రదర్శించాడు.

బ్రహ్మాండ పురాణం నుంచి రామాయణకథ విడిపోయి అధ్యాత్మ రామాయణంగా ప్రసిద్ధి చెందిందని పండితుల విశ్వాసం. లేకపోతే రామాయణ కథ దాదాపు అన్ని ఇతర పురాణాలలోను ఉన్నదే. కానీ అధ్యాత్మ రామాయణంలో అది బాగా విస్తరించబడింది. నారదపురాణంలో చెప్పబడిన బ్రహ్మాండ పురాణ విషయానుక్రమణికలో రామాయణ ప్రసక్తి లేదు. చెప్పబడుతున్న శ్లోకాల సంఖ్య అధ్యాత్మ రామాయణము, లలితోపాఖ్యానము కలవనిదే పూర్తికాదు. ఈ రెండు విడి గ్రంథాలే గాక బ్రహ్మాండ పురాణం నుంచి ఇంకా గణేశ కవచం, తులసీకవచం హనుమత్కవచం, సిద్ధ లక్ష్మీస్తోత్రం, సీతాస్తోత్రం, లలితా సహస్రనామస్తోత్రం, లలితోపాఖ్యానం, సరస్వతీస్తోత్రం వంటివి వేరుగా విడదీయవచ్చును.

ఈ పురాణంలో పరశురామచరిత్ర కూడా సవిస్తరంగా చెప్పబడింది. పరశురామునితో దృఢ సంబంధం ఉండటం చేతను, సహ్యపర్వత గోదావరీ ప్రాంతాలను అధికంగా వర్ణించటం చేతను, ఈ పురాణం ఆ ప్రాంతాలలో రచింపబడి ఉంటుందని, దీనిలోని కొన్నిభాగాలు ప్రాచీనమైనవని అందువలన ఇది క్రీ.పూ. 1,2 శతాబ్దాలలోనే రచితం

అయి 600-900 సంవత్సరాలలో పరిపూర్ణం అయి ఉంటుందని పండితుల అభిప్రాయం.

మహా పురాణాలలో చివరి స్థానాన్ని ఆక్రమిస్తున్న బ్రహ్మాండ పురాణం వాయు పురాణంలాగానే నాలుగు పాదాలుగా విభజించటం జరిగింది. 1. ప్రక్రియాపాదము 2. అనుషంగ పాదము, 3. ఉపోద్ఘాత పాదము, 4. ఉపసంహార పాదము.

ఇందులో మొదటి రెండు పాదాలైన ప్రక్రియ, అనుషంగాలను పూర్వ భాగమని తరువాత తృతీయ పాదమైన అనుషంగ పాదాన్ని మధ్యభాగమని నాల్గవదైన ఉపసంహార పాదాన్ని ఉత్తర భాగమని పిలుస్తారు. వీనిలో మొత్తం 161 అధ్యాయాలు ఉన్నాయి. ఈ పురాణంలో నారద పురాణానుసారం 12 వేల శ్లోకాలు మత్స్య పురాణానుసారం 12 వేల రెండువందల శ్లోకాలు ఉన్నాయి.

పురాణాలలోని విషయ ఐక్యత

మొత్తం మీద పరిశీలించగా కొన్ని పురాణాలలో ఒక కథ విస్తృతంగా వర్ణించబడి ఉంటే ఇంకొక దాంట్లో అతి సంక్షిప్తంగా ఉండవచ్చు. కొన్ని ఉదాహరణలను పరిశీలిద్దాం. వాయుపురాణంలో గయామాహాత్మ్యం విస్తృతంగా 56 శ్లోకాలలో ఉంటే అగ్ని పురాణంలో సంక్షిప్తంగా 23 శ్లోకాలలోనే చెప్పబడింది. అలాగే మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామనావతార కథలు వాయుపురాణంలో అతి సంక్షేపంగా ఉన్నాయి. రామాయణంలోని ఏడుకాండల కథ అగ్ని పురాణంలో ఏడు అధ్యాయాలలో చెప్పబడింది. కానీ గరుడ పురాణంలో ఒక అధ్యాయంలోనే సరిపెట్టబడింది. అలాగే మహాభారత కథ అగ్ని పురాణంలో మూడు అధ్యాయాలలో ఉంటే గరుడ పురాణంలో ఒక అధ్యాయంలో ముగించ బడింది. హరివంశం మొత్తం కేవలం 55 శ్లోకాలలో గరుడ పురాణంలో ముగించ బడింది.

ఆయుర్వేదాన్ని గురించి గరుడ పురాణంలో 57 శ్లోకాలలో ఉంటే అగ్ని పురాణంలో అది 200 శ్లోకాలుగా ఉన్నది. అగ్ని పురాణం, గరుడ పురాణం రెండింటిలోను కార్తికేయుని మొదలుకొని కాత్యాయనుడి వరకు వ్యాకరణ విషయాలు వచ్చాయి. కానీ పాణిని గురించిన ఊసేలేదు. అగ్ని పురాణంలో 'విద్య' కు సంబంధించిన విషయాలు చెప్పబడినను గరుడ నారద పురాణాలలో కనీసం దానిని పేర్కొనలేదు. అదేవిధంగా గరుడ పురాణంలో నాట్యశాస్త్రానికి సంబంధించిన చర్చ, ఆనందవర్ధనాచార్యుని ద్వారా చెప్పబడిన 'ధ్వని' యొక్క వికాసవర్ణన చక్కగా ఉన్నా, గరుడ పురాణంలో కనిపించదు. ఇలాంటివి అనేక భేదసాదృశ్యాలు పురాణాల గురించి చెప్పతగినవి ఎన్నో ఉన్నాయి.

వివిధ పురాణాల ఆది శ్లోక - వక్త

ఇక్కడ చెప్పబడినవి ఆయా పురాణాలను మొదటగా చెప్పిన వక్తలు వారి నుండి మొదటిసారి విన్న శ్రోతలు, తరువాత ఒక్కొక్క పురాణానికి వక్త్రా శ్రోత్రపరంపర ఉండవచ్చును.

సం.	పురాణం	ఏకల్పవృత్తాంతం	వక్త్ర(శ్రోతలు
1.	బ్రహ్మ పురాణాన్ని	బ్రహ్మ కల్పంలో	బ్రహ్మ మరీచి మహామునికి బోధించాడు
2.	పద్మ పురాణాన్ని	పద్మ కల్పంలో	స్వయంభువమనువు బ్రహ్మకు బోధించాడు
3.	విష్ణు పురాణాన్ని	వరాహ కల్పంలో	పరాశరుడు బ్రహ్మకు బోధించాడు
4.	శివ (వాయు) పురాణాన్ని	శ్వేత కల్పంలో	శివుడు వాయువుకు బోధించాడు
5.	భాగవత పురాణాన్ని	సారస్వత కల్పంలో	విష్ణువు బ్రహ్మకు బోధించాడు
6.	నారద పురాణాన్ని	బృహత్ కల్పంలో	పూర్వ భాగాన్ని - సనకాదులు నారదునికి బోధించారు. ఉత్తరభాగాన్ని - వశిష్ఠుడు మాంధాతకు బోధించాడు
7.	మార్కండేయ పురాణాన్ని	శ్వేత వారాహకల్పంలో	మార్కండేయుడు జైమినికి బోధించాడు
8.	అగ్ని పురాణాన్ని	ఈశాన కల్పంలో	అగ్నిదేవుడు వశిష్ఠునికి బోధించాడు
9.	భవిష్య పురాణాన్ని	అఘోర కల్పంలో	బ్రహ్మ మనువుకు బోధించాడు
10.	బ్రహ్మ వైవర్త పురాణాన్ని	రథంతర కల్పంలో	సావర్ణి నారదునికి బోధించాడు
11.	లింగ పురాణాన్ని	కల్పాంతకల్పంలో	పరమశివుడు నారదునికి బోధించాడు
12.	వరాహ పురాణాన్ని	మనుకల్పంలో	విష్ణువు పృథ్వికి బోధించాడు
13.	స్కాంద పురాణాన్ని	తత్పురుషకల్పంలో	స్కందుడు భూమికి బోధించాడు
14.	వామన పురాణాన్ని	కూర్మ కల్పంలో	బ్రహ్మ పులస్త్య మహామునికి బోధించాడు
15.	కూర్మ పురాణాన్ని	లక్ష్మీ కల్పంలో	విష్ణువు పులస్త్య మహామునికి బోధించాడు
16.	మత్స్య పురాణాన్ని	నర కల్పంలో	విష్ణువు మనువుకు బోధించాడు
17.	గరుడ పురాణాన్ని	గరుడ కల్పంలో	విష్ణువు మనువుకు బోధించాడు
18.	బ్రహ్మాండ పురాణాన్ని	భవిష్య కల్పంలో	బ్రహ్మ మనువుకు బోధించాడు

వివిధ పురాణాలలోని శ్లోక సంఖ్య

పురాణం పేరు	అగ్నిపురాణం ప్రకారం 272 అధ్యాయం	మత్స్యపురాణం ప్రకారం (53) అధ్యాయం	నారద పురాణం ప్రకారం	భాగవతంప్రకారం (12 - 13)	దేవీభాగవతం ప్రకారం (1 - 3)
1. బ్రహ్మ పురాణం	25,000	13,000	10,000	10,000	10,000
2. పద్మ పురాణం		55,000	55,000	55,000	55,000
3. విష్ణు పురాణం	23,000	23,000	23,000	23,000	23,000
4. శివ పురాణం	14,000 (వాయు)	24,000 (వాయు)	24,000	24,000	24,6000 (వాయు)
5. భాగవతం	18,000	18,000	18,000	18,000	18,000
6. నారద పురాణం	25,000	25,000	25,000	25,000	25,000
7. మార్కండేయ పురాణం	9,000	9,000	9,000	6,000	6,000
8. అగ్ని పురాణం	12,000	16,000	15,000	15,400	16,000
9. భవిష్య పురాణం	14,000	14,500	14,000	14,5000	14,500
10. బ్రహ్మ వైవర్త పురాణం	18,000	18,000	18,000	18,000	18,000
11. లింగ పురాణం	11,000	11,000	11,000	11,000	11,000
12. వరాహ పురాణం	14,000	24,000	24,000	24,000	24,000
13. స్కాంధ పురాణం	84,000	81,000	81,000	81000	81,000
14. వామన పురాణం	10,000	10,000	10,000	10,000	10,000
15. కూర్మ పురాణం	8,000	18,000	17,000	17,000	17,000
16. మత్స్య పురాణం	13,000	14,000	15,000	14,000	14,000
17. గరుడ పురాణం	8,000	18,000	19,000	19,000	19,000
18. బ్రహ్మాండ పురాణం	12,000	12,200	12,000	12,000	12,000

జైన సాహిత్యంలో పురాణాలు

అతిప్రాచీన కాలంలోనే అంటే క్రీ.పూ. 600 సంవత్సరాల ప్రాంతంలోనే హిందూ మతం నుంచి వేరై విరోధ భావనలతో ఏర్పడిన మతం జైనం. అయినా హిందూ ధర్మం యొక్క బలమైన ప్రభావం వలన పెద్దగా హిందూమతంతో వేరుపడలేకపోయింది జైనం. కాబట్టి హిందువుల యొక్క వేద వేదాంగాలు అంటే వైదిక సాహిత్యం, పురాణ వాఙ్మయం మొదలైనవాటివలెనే జైనమతానుయాయులు కూడా తమవైన ధర్మ గ్రంథాలు, దర్శన గ్రంథాలు వంటి వానితో పాటు పురాణ సాహిత్యాన్ని కూడా ఏర్పాటు చేసుకొన్నారు. ఇతర ధర్మాలకు చెందిన గ్రంథాలపై హిందూ పురాణాల ప్రభావం ఎలా ఉన్నదో అలాగే జైన ధార్మిక వాఙ్మయంపైన హిందూ పురాణాల ప్రభావం ఎక్కువగానే ఉన్నది.

మధ్య యుగాలలో భారతీయ దర్శన శాస్త్రాలలో న్యాయగ్రంథాలను రచించినవారు జైనులు బౌద్ధులే. అయితే బౌద్ధ జైనులు వేదాలను ప్రామాణికంగా అంగీకరించనందువలన వారి దర్శనాలను నాస్తిక దర్శనాలనటం మొదలైంది. ఆస్తిక దర్శనాలు న్యాయ, వైశేషిక, సాంఖ్య, యోగ, మీమాంసలనే ఆరని మనకు తెలిసినదే. అలాగే నాస్తిక దర్శనాలనే వేద ప్రామాణ్యాన్ని అంగీకరించని దర్శనాలు ఆరు భాగాలుగా ఉన్నాయి. అవి : చార్వాక దర్శన, జైనదర్శన, బౌద్ధ దర్శనాలు అనేవి. మళ్ళీ బౌద్ధ దర్శనాలు సంప్రదాయ భేదాలతో నాలుగు భాగాలుగా విభజించబడ్డాయి. అవి : 1. మాధ్యమిక, 2. యోగాచార, 3. సౌత్రాంతిక వైభాషికభాగాలు, ఎవరో తెలీదు కానీ ఈ నాలుగు విధాల బౌద్ధ సంప్రదాయాన్ని ముఖ్య లక్షణాలన్నింటినీ ఒక్క శ్లోకంలో ఎంత బాగా చెప్పాడో చూడండి.

ముఖ్యోమాధ్యమికో వివర్తమఖిలం శూన్యస్యమేనేజగత్
యోగాచారమతేతు సంతి మతయస్తానాం వివర్తో ఽఖిలః
అర్థోస్తి క్షణికస్త్వసావనుమితో బుద్ధ్యేతి సౌత్రాంతికః
ప్రత్యక్షం క్షణ భంగురంచ సకలంవై భాషికో భాషతే

నాస్తిక దర్శనాల చారిత్రక ప్రభావంచేత ఆస్తిక దర్శనాలు ఆరూ ప్రభావితమైనాయి. యథార్థానికి బౌద్ధ జైనాలు రెండూ విశాల హిందూజాతికి అంగాలే. హిందువులపై తమ ధర్మము, దర్శనాల ప్రభావం ఉన్నట్లుగానే జైనులపైగూడా వారి పురాణముల ప్రభావం ఉన్నది.

బ్రాహ్మణకపురాణాలలో అష్టాదశ పురాణాలు, ఉపపురాణాలు ఉన్నట్లుగానే జైన ధర్మంలో కూడా 24 పురాణాలు ఉన్నాయి. ఈ 24 పురాణ గ్రంథాలలో జైన ధర్మానికి చెందిన 24 మంది తీర్థంకరులైన మహాపురుషుల మాహాత్మ్యం చెప్పబడింది. అయితే

బ్రాహ్మణ మతానికి చెందిన అష్టాదశ పురాణాలు పంచ లక్షణ సమన్వితాలు. కానీ జైన పురాణాలకు ఈ పంచలక్షణాలు ఉండవు. పైగా పురాతనం పురాణం 'స్యాత్తన్మహన్మహదాశ్రయాత్' అని చెప్పటం చేత తమజిన ధర్మానికి చెందిన ప్రాచీన మహాపురుషుల కథా ప్రతిపాదకాత్మకాలుగా ఉంటాయి. జైనుల ఇరవై నాలుగు పురాణాలలోను వరుసగా 24 మంది జైనతీర్థంకరుల మాహాత్మ్య కథలు చెప్పబడి ఉంటాయి. ఈ పురాణాలలో

1. ఆదిపురాణం
2. అజితనాథపురాణం
3. సంభవనాథ పురాణం
4. అభినందపురాణం
5. సుమితనాథపురాణం
6. పద్మ ప్రభ పురాణం
7. సుపార్శ్వ పురాణం
8. చంద్రప్రభపురాణం
9. పుష్పదంత పురాణం
10. శీతలనాథ పురాణం
11. శ్రేయాంస పురాణం
12. వాసుపూజ్య పురాణం
13. విమలనాథ పురాణం
14. అనంతజీత పురాణం
15. ధర్మనాథ పురాణం
16. శాంతినాథ పురాణం
17. కుంథనాథ పురాణం
18. అమరనాథ పురాణం
19. మల్లినాథ పురాణం
20. ముని సువ్రత పురాణం
21. నేమినాథ పురాణం
22. అరిష్టనేమి పురాణం
23. పార్శ్వనాథ పురాణం
24. సమ్మతి పురాణం అనేవి.

ఈ ఇరవై నాలుగు జైన పురాణాలలో బాగా ప్రసిద్ధి గలవి ఆది పురాణం, పద్మప్రభ పురాణం, అరిష్టనేమి పురాణం (దీనికే ఇంకొక పేరు హరివంశపురాణం) ఉత్తరపురాణాలే. మళ్ళీ వీటిల్లో ఆదిపురాణం, ఉత్తర పురాణాలు అనే వాటికి విశేష ప్రభావం ఉన్నది.

ఆదిపురాణం

జినధర్మంలో మొదటి తీర్థంకరుడైన ఋషభదేవుని కథలు ఈ పురాణంలో వర్ణించబడ్డాయి. ఈ పురాణం ప్రకారము, జైన సంప్రదాయం ప్రకారం పరంపరగా వస్తున్న వినికిడిని అనుసరించి ఈ ఋషభ దేవుడు సర్వార్థ సిద్ధియోగంలో ఉత్తరాషాఢ నక్షత్రం ధనూరాశిలో ఉన్నప్పుడు చైత్రమాసం కృష్ణాష్టమీ రోజు ఇక్ష్వాకు వంశరాజు నాభి అతని భార్య మరుదేవి గర్భంలో, వినీత మనే నగరంలో జన్మించాడు. ఆయన చతుర్యుగాల సమాప్తి పర్యంతం అంటే ఎనభై నాలుగు లక్షల సంవత్సరాల పాటు జీవించి

మోక్షప్రాప్తి చెందగలరని జైనమత సంప్రదాయం తెలుపుతున్నది. భాగవతంలో ఈ తీర్థంకరుని వర్ణన హృదయంగమంగా ఉంటుంది. భాగవతంలో కూడా ఈ తీర్థంకరుని తల్లిదండ్రుల పేర్లు మరుదేవి, నాభి అనే చెప్పబడింది. ఈయన భగవద్గుణ సంపన్నుడని భాగవతం వర్ణిస్తున్నది. ఈయన భార్యపేరు జయంతి అని, ఆమె ఇంద్రుని కుమార్తె అని, ఆమె ద్వారా ఆయనకు ధర్మాత్ములు, వేదజ్ఞులు, భాగవత ధర్మానుయాయులైన భర తుడు కుశావర్తుడు మొదలైన నూర్గురు పుత్రులు జన్మించారని అదే గ్రంథం వివరిస్తున్నది. భాగవతంలో చెప్పబడిన భగవంతుని అవతారాలలో ఎనిమిదవది ఈ ఋషభ దేవుని అవతారము.

ఈ పురాణంలో 47 పర్వాలు ఉన్నాయి. మహాభారతంలో గూడా గ్రంథాంతర విభాగాల పేరు పర్వాలే గదా. ఈ గ్రంథ రచయిత జనసేనుడు ఈ గ్రంథంలో సిద్ధసేనుడు, వాదీంద్ర చూడామణి, సమంత భద్రుడు, దేవముని మొదలైన వారి పేర్లను పేర్కొన్నాడు. ఇందువలన గ్రంథ రచనా కాలం సుగమం అయింది. రచయితకు వీరందరి సహాయం లభించినట్లు తెలుస్తున్నది. ఈ గ్రంథంలో సృష్టి తత్త్వ విచారణకు సంబంధించి వ్యక్తీక రించిన భావాలను పరిశీలిస్తే రచయిత రాబోయే కాలంలో ఆచార్య శంకరుల వారి అద్వైత మత సిద్ధాంత బ్రహ్మసంబంధ వాదాలను ఖండించటానికే చెప్పబడిందా అన్నట్లు ఉంటుంది.

ఉత్తర పురాణం

ఇది ఆది పురాణానికి ఉత్తర భాగం. ఆదిపురాణకర్త జిన సేనాచార్యుడు. అందులో 44 సర్గలు వ్రాసిన తరువాత పరమపదం చెందాడు. తరువాత 45వ సర్గ నుండి 47వ సర్గ వరకు వ్రాసి ముగించి చివరలో జినసేనుని చరిత్రను కూడా కలిపి రచించి జినసేనుని శిష్యుడైన గుణభద్రుడు ఆదిపురాణ ఉత్తర భాగాన్ని సమాప్తం చేశాడు. గ్రంథం చివరి భాగంలో సమస్త శాస్త్రాలకు సారభూతమైన ఈ పురాణం ధర్మపరులైన, శ్రేష్ఠులచేత శకం 820, పింగళ సంవత్సర ఆశ్వయుజమాస శుక్ల పక్ష పంచమి బృహస్పతి వారంనాడు పూర్తిచేయబడ్డది అని పేర్కొనబడింది. ఈ కాలం విశ్వవిఖ్యాత కీర్తిశాలి, సర్వశత్రు వినాశకుడు అకాలవర్ష చక్రవర్తి రాజ్యాధిరోహణం చేసిన సంవత్సరానికి సరిపోతుంది.

వస్తుతః ఉత్తర పురాణం జైనుల చతుర్వింశతి (ఇరవై నాలుగు) పురాణాలకు సారభూతమైన కోశం లాంటిది. ఇందులో అన్ని జైన పురాణాల సారము ఇమిడి ఉన్నది. ఇది 48వ పర్వంతో మొదలు అవుతుంది. రెండవ జైనతీర్థంకరుడు అజితనాథుని నుంచి 24వ తీర్థంకరుడైన మహావీరస్వామి వరకు గల అందరు తీర్థంకరుల చరిత్రలు ఇందులో

ఉన్నాయి. ఆదిపురాణం ఉత్తర పురాణాలలో తీర్థంకరుల జీవిత చరిత్ర చిత్రణకు ముందుగా చక్రవర్తులు, రాజుల చరిత్రలు ఉన్నాయి. జైన పురాణాలను అనుసరించి పూర్వజన్మలో ఈ రాజులు, చక్రవర్తులే మరుజన్మలో తీర్థంకరులుగా జన్మనెత్తారు. ఈ రెండు పురాణాల తోను కలిపి ఇరవై నాలుగు మంది తీర్థంకరులు, పన్నెండు మంది చక్రవర్తులు, తొమ్మిది మంది వాసుదేవులు తొమ్మిది మంది శుక్లబలులు, తొమ్మిది మంది విష్ణుద్విసులు మొత్తం అరవై మూడు మంది మహాత్ముల చరిత్రలు వివరించబడ్డాయి. అందుకే దీనిని 'త్రిషష్ట్య యవి' అని కూడా అంటారు.

బౌద్ధ సాహిత్యంలో పురాణాలు

బౌద్ధ పురాణాలనే త్రిపిటకాలంటారు. హిందూ ధర్మంలో పురాణాలకు ఎంత వైశిష్ట్యం ఉన్నదో బౌద్ధ ధర్మంలో త్రిపిటకాలకు అంతే విశిష్టత ఉన్నది. బుద్ధ భగవానుడు జ్ఞానోదయం కలిగి బుద్ధత్వాన్ని పొందిన తరువాత ఆయన మహాపరినిర్వాణం (స్వర్గా రోహణం) పొందేంతవరకు ఉన్న మధ్యకాలంలో ఆయన ఉపదేశించిన విషయాలు సమ స్తమూ సంగ్రహంగా త్రిపిటకాలలో సంకలించబడ్డాయి. త్రిపిటకాల (అంటే మూడు గంపలు)లో బోధిసత్త్వుడు అయిన బుద్ధ భగవానుని బోధనలు అన్నీ పొందుపరచబడి ఉన్నాయి.

1. సుత్త పిటకం, 2. వినయ పిటకం, 3. అభిధర్మ పిటకం అనేవి ఆ మూడు బౌద్ధ పిటక గ్రంథాలు.

1. స్తుతపిటకం లేక సూత్ర సమూహము అనే మొదటి గ్రంథంలో బౌద్ధులు అనుసరించవలసిన ఉపదేశాలు సూత్ర రూపంలో సంగ్రహించబడ్డాయి.
2. వినయ పిటకం అనే రెండవ గ్రంథంలో సంక్షేమ విషయాలను తెలిపే బోధనలు సంకలించబడ్డాయి.
3. అభిధమ్మ పిటకం అనే మూడవ గ్రంథంలో నైతిక, మనోవైజ్ఞానిక ధర్మాలు విశ్లేషించ బడ్డాయి. ఇవి దార్శనికత ఆధారంగా శిలలపై చెక్కించబడిన, వాటి ఆధారంగా నిలిచి ఉన్నందుకు ఏమి కారణమో తెలియకుండా ఉన్నది.

తథాగత బుద్ధుని అనుయాయులైన విద్వాంసులు ఈ త్రిపిటకాలను సంపాదించి సంకలనం చేశారు. ఈ గ్రంథాల ఆధారంగానే బౌద్ధ ధర్మానికి చెందిన ధార్మిక, ఆధ్యాత్మిక, భౌతిక, తాత్త్విక విషయాలను, వానిని ఆచరించవలసిన విధానాలను గురించి తెలుసుకొనే వీలుకలుగుతున్నది. వీటి ద్వారా శీలము, సమాధి, బుద్ధి అనే మూడు గుణాలతో సుసంప

న్నుడైన వ్యక్తి మాత్రమే ఈ భవసాగరబంధనాలనుంచి విముక్తుడు కాగలడని బుద్ధ భగవానుని ఉపదేశాల సారమని గ్రహించవచ్చు.

పురాణ పురుషుడు నారాయణుడు

అష్టాదశ పురాణాలు నారాయణుడైన శ్రీమహావిష్ణువు యొక్క శరీరముగనే భావింపబడింది. నారాయణుడు పురాణపురుషుడు అని భావించటం సమర్థనీయమే కదా. అందుచేత ఆ పురాణ పురుషుని అష్టాదశ పురాణ మూలమూర్తిగా భావించటం జరిగింది. ఈ విషయం పద్మపురాణం ఆదిఖండంలో చెప్పబడింది. విష్ణువు యొక్క వివిధ అవయవాలు వివిధ పురాణాలుగా భావించబడ్డాయి. అప్పుడు మొత్తం అష్టాదశ పురాణాలు ఆయన స్వరూపమే అవుతుంది.

సీ. పాద్మము హృదయంబు బ్రాహ్మము మూర్ధంబు
మజ్జగారుడము వామనము త్వచము.
భాగవతము దొడల్ బ్రహ్మాండమస్థులు
మాత్స్యము మెదడు కౌర్మంబు వెన్ను
లైంగవారాహముల్ దక్షిణ వామ గు
ల్ఫంబులు నారదీయంబు నాభి
రోమముల్ స్కాందము వామ దక్షిణ భుజ
ద్వంద్వంబు శైవంబు వైష్ణవంబు

గీ. వామపాద మాగ్నేయంబు వామజాను
తలము బ్రహ్మవైవర్తంబు దక్షిణోరు
పర్వము భవిష్య మపసవ్య భావమొంది
నట్టి పదము మార్కండేయ మచ్యుతునకు.

(ఆంధ్రపద్మ పురాణం. ఆది ఖం. 828)

అని పద్మ పురాణం తెలుపుతున్నది. దీనిని అనుసరించి పురాణ పురుషుడైన నారాయణుని అవయవములతో వివిధ పురాణములు ఏకీభవిస్తాయి.



(పద్మపురాణం - ఆదిఖండము)

పురాణపురుషుడు

1.	పద్మ పురాణము	–	హృదయము
2.	బ్రహ్మ పురాణము	–	శిరస్సు
3.	గరుడ పురాణము	–	మజ్జ
4.	వామన పురాణము	–	చర్మము
5.	భాగవత పురాణము	–	తొడలు
6.	బ్రహ్మాండ పురాణము	–	ఎముకలు
7.	మత్స్య పురాణము	–	మెదడు
8.	కూర్మ పురాణము	–	వెన్ను (పృష్ఠము)
9.	లింగపురాణము	–	కుడిచీలమండ
10.	వరాహ పురాణము	–	ఎడమ చీలమండ
11.	నారద పురాణము	–	బొడ్డు
12.	స్కాందపురాణము	–	వెంట్రుకలు
13.	శివపురాణము	–	ఎడమ భుజము
14.	విష్ణుపురాణము	–	కుడి భుజము
15.	అగ్ని పురాణము	–	ఎడమ పాదము
16.	మార్కండేయ పురాణము	–	కుడి పాదము
17.	బ్రహ్మవైవర్త పురాణం	–	ఎడమ మోకాలు
18.	భవిష్య పురాణం	–	కుడి మోకాలు.

పురాణ లక్షణాలు

ప్రపంచంలో ప్రతివస్తువుకు ధర్మాలు లేక లక్షణాలు అనేవి ఉంటాయి. అలాగే పురాణమంటే ఏమిటి అని చాలామందికి సందేహం కలుగుతుంటుంది. తేలికగా 'పురాణం పంచ లక్షణం' అని పెద్దలు చెప్తుంటారు. అంటే అయిదు లక్షణాలు గలది పురాణం అని ఆ అయిదు లక్షణాలేవి అంటే

సర్గశ్చ ప్రతి సర్గశ్చ వంశో మన్వంతరాణిచ
వంశాను చరితం చేతి పురాణం పంచ లక్షణమ్ *(మత్స్యపు - 53 - 64)*

అంటే 1. సర్గము, 2. ప్రతి సర్గము 3. వంశం 4. మన్వంతరం 5. వంశాను చరితమనే అయిదు లక్షణాలు గలది పురాణము. ఈ శ్లోకం దాదాపు అన్ని పురాణాలలోను,

సంస్కృత నిఘంటువు అమరకోశంలోను కనిపిస్తుంది. ఈ పంచ లక్షణాలు సర్వేసర్వత్ర పరిగణింప బడే పరంపరాగత విషయంగా భావించవచ్చు. పురాణాలకు భాగవతం వంటి కొన్ని పురాణాలు దశ లక్షణాలను నిర్దేశిస్తున్నాయి. అయితే పంచలక్షణాలే ప్రాచీన మైనవిగా భావించబడుతున్నాయి.

ఈ అయిదు లక్షణాలు అన్ని పురాణలలోనూ కొంత సమన్యూనాధిక రూపంలో వర్ణించబడినవే. కొన్నింటిలో ఒక లక్షణం గురించి అధికంగా, కొన్ని లక్షణాలు అల్పంగా చెప్పబడి ఉండవచ్చు. కొన్ని పురాణాలలో ఒక విషయమే చాలా విస్తృతంగా వర్ణించిన సందర్భాలు ఉన్నాయి. ఉదాహరణకు మార్కండేయపురాణంలో కేవలం మన్వంతర విషయాన్ని గురించే విపుల వివరణ ఉండగా, భాగవతంలో వంశాను చరితం మాత్రమే ప్రధానం చేయబడింది. విష్ణుపురాణంలో సర్గ అంటే సృష్టి విషయాన్ని గురించిన విపుల వర్ణన ఉన్నది. ఆయా పురాణాలలో ఒక విషయం యొక్క ఆధిక్యత ఇంకొక విషయం యొక్క న్యూనత కనిపిస్తుంది. అందువలన పురాణాలలోని రహస్యాలను తెలుసుకొనాలంటే అన్ని పురాణాల సవిమర్శనాత్మక అధ్యయనం అవసరం. అప్పుడు పురాణ రహస్యాల యథార్థ జ్ఞానం కలుగుతుంది.

1. **సర్గం :** ఈ సర్వ ప్రపంచము అందులోని నానా పదార్థాల ఉత్పత్తి అనగా సృష్టినే సర్గ అంటారు. సర్వానికి మూలమైన ప్రకృతిలో మూల గుణాలు క్షుబ్ధం అయిపోయినప్పుడు మహతత్త్వం ఉద్భవిస్తుంది. ఈ మహత్తత్వం నుంచి సత్వరజస్తమోగుణాలనే మూడు గుణాలు అహంకారాలు అవుతాయి. ఈ త్రివిధాలైన అహంకారాల నుంచి పంచతన్మాత్రలు (భూతములు మాత్రం) ఇంద్రియాలు, అలాగే (పంచ) భూతాలు పుడతాయి. ఈ ఉత్పత్తి క్రమ విధానమే సర్గము అని పిలువబడుతుంది.

దీని ముఖ్య వర్ణన పురాణాల ద్వారానే లభ్యం అవుతున్నది. శ్రీమద్భాగవతంలో (12-7-11)

అవ్యాకృత గుణక్షోభాన్ మహతస్త్రివృత్తోఽహమ్
భూతమాత్రేంద్రియార్థానాం సంభవః సర్గ ఉచ్యతే

అని సర్గ యొక్క లక్షణం తెలుపబడింది.

అంటే ఈ జగత్తు అందలి నానా పదార్థాల ఉత్పత్తి లేక సృష్టి సర్గ అని చెప్పబడుతుంది. ఈ సృష్టిలో శాశ్వతుడు పరమాత్మయైన భగవంతుడు. ఆయనలో నిక్షిప్తంగా ఉండే ప్రకృతితత్త్వం యొక్క సత్త్వ, రజస్తమోగుణాల క్షోభ్యతచేత మహత్తత్త్వము జనించి

దాని నుంచి అహంకార తత్త్వము, ఆ అహంకార తత్త్వం నుంచి పంచతన్మాత్రలు, ఏకాదశ ఇంద్రియాలు పంచమహాభూతాలు, వీనికి అధిష్ఠాతలైన దేవతల ఉత్పత్తిని లేక సృష్టిని సర్గ అంటారు.

2. ప్రతి సర్గము : సర్గం అనే పదానికి వ్యతిరేకమైనది ప్రతిసర్గం.అంటే సమస్త ప్రపంచం యొక్క ప్రళయం. విష్ణుపురాణంలో ప్రతి నర్గము అనే లక్షణానికి బదులుగా 'ప్రతి సంచరము' అని చెప్పబడింది. ఈ బ్రహ్మాండం స్వభావరీత్యానే ప్రళయకారి. ఈ ప్రళయం నాలుగు విధాలు. నైమిత్తికము ప్రాకృతికము, నిత్యము, ఆత్యంతికములనేవే ఆ నాలుగు.

3. వంశం : 'రాజ్ఞాం బ్రహ్మప్రసూతానాం వంశం స్రైకాలికో ఒన్వయః అంటుంది భాగవతం. అంటే బ్రహ్మ ద్వారా ఎందరు రాజులు సృష్టించబడ్డారో వారి యొక్క భూత, భవిష్యవర్తమాన కాలంలో గల సంతాన పరంపరను వంశము అని అంటారు. వాస్తవానికి పురాణాలలో రాజవంశాల వర్ణన మాత్రమే కాక ఋషులవంశాల వర్ణనకూడా చేయబడింది.

4. మన్వంతరం : పురాణాలలో చెప్పబడిన ప్రకారం ఈ పదానికి అర్థం విభిన్న కాలాలలో జరిగిన సంఘటనలకు గుర్తుగా ఉండే కాల గణనం. పురాణాలను అనుసరించి మొత్తం 14 మన్వంతరాలు ఉన్నాయి. ప్రతి మన్వంతరానికి ఒక అధిపతి ఉంటాడు. ఆయన ఒక మనువు. ఆ మనువు సహాయం వలననే పంచ పదార్థాలు ఇంకా అనేక విభజనలుగా ఉత్పత్తిని పొందుతాయి. దేవతలు, మను పుత్రులు, ఇంద్రుడు, సప్తర్షులు, భగవంతుని యొక్క అవతారాలు అనే ఆరు విశేషాలతో కూడిన కాలాన్నే మన్వంతరం అని అంటారు.

5. వంశాను చరితము : 'వంశాను చరితం తేషాం వృత్తం వంశ ధరాశ్చయే' అంటుంది భాగవతం (12 -7-16). ఇంతకుముందు తెల్పినట్లుగా చక్రవర్తుల, ఋషుల వంశాలలో ఉత్పన్నం చెంది, ఆయా వంశాలకు మూల పురుషులైన రాజుల విశిష్ట వర్ణనమే వంశాను చరితం అనబడుతుంది. ఇందులోనే మనుష్య సంతతిగా వివిధ వంశాలలో జన్మించిన మహర్షులు రాజుల చరిత్ర కూడా చేర్చబడి ఉంటుంది. మహర్షుల చరిత్రలను తెలుపుతూ వివిధ రాజ వంశాల చరిత్రను కూడా ప్రత్యేకంగా పురాణాలు వివరించాయి.

కానీ ప్రాచీన రాజనీతి శాస్త్రాలలో 'పురాణం పంచ లక్షణమ్' అనే పంచ లక్షణాలకు ఒక కొత్త విశ్లేషణ కనిపిస్తుంది. ఇది ఇంతకుముందు చెప్పిన అయిదు లక్షణాలతో పూర్తిగా విభేదిస్తున్నది. కౌటిల్యుని అర్థశాస్త్రానికి చేసిన వ్యాఖ్య (1-5)లో జయమంగళుడు ఒక ప్రాచీన గ్రంథం నుంచి ఉద్ధరించిన.

సృష్టి - ప్రవృత్తి - సంహార - ధర్మ, మోక్ష ప్రయోజనమ్
బ్రహ్మాభిర్వివిధైః ప్రోక్తం పురాణం పంచ లక్షణమ్

అనే శ్లోకం ద్వారా ఈ భేదం తెలుస్తున్నది. ఇందులో ముఖ్యంగా చెప్పుకొన వలసినది ధర్మ విషయం. మొదటి నుంచి 'ధర్మం' అనే అంశం పురాణాలకు అవిభాజ్య విషయం అనేది సర్వాంగీకారమైనదే. అంటే దీనిని బట్టి పురాణాలలో మూల భూతమైన విషయం ధార్మిక విషయాల సమాహారం. అందువలననే కాలం గడిచే కొద్దీ ధర్మ సంబంధ విషయాల వివరణలో సహకాలీన వృత్తాంతాలు, విషయాలు కూడా చోటుచేసుకొని విస్తృతి పొందాయి. ఆధునిక పురాణ విమర్శకులు కూడా అందరూ ఈ విషయాన్ని అంగీకరిస్తున్నారు.

పురాణ దశ లక్షణాలు :

పురాణాల పంచ లక్షణాలను సర్వేసర్వత్ర అంగీకరించినా కాలం గడిచేకొద్దీ ఈ పంచ లక్షణాలనే మరికొంత విస్తృత పరచి దశ లక్షణాలు కలిగినది మహాపురాణమని, కేవలం పంచ లక్షణాలున్నది పురాణమనే వాదం ఒకటి బయలుదేరింది. శ్రీమదాగ్భవతంలో రెండు స్థలాలలోను (2-10-1-7, 12-79) బ్రహ్మవైవర్త పురాణం లోను దశ లక్షణాలతో ఉండేది మహాపురాణమనే నిర్ణయం చేయబడింది. అలాగే కేవలం ఐదు లక్షణాలు గలది సామాన్య పురాణంగా పరిగణించబడింది. భాగవతంలో రెండు స్థలాలలోను చెప్పిన దశ లక్షణాలలోను కొంత విభేదం ఉన్నా, మూలతః అవి ఒకటే. భాగవతంలోని ద్వాదశ స్కంధంలో చెప్పిన దశలక్షణాలు ఇవి :

1. సర్గ 2. విసర్గ 3. వృత్తి 4. రక్షణ 5. అంతరములు 6. వంశము
7. వంశాను చరితము 8. సంస్థా 9. హేతువు 10. అపాశ్రయము.

1. సర్గ : ఇంతకుముందు చెప్పిన సర్గ లక్షణానికి దీనికి భేదం ఏమీ లేదు.

2. విసర్గ : దీని అర్థం జీవుల సృష్టి. పరబ్రహ్మ యొక్క అనుమతితో సృష్టించగలిగిన శక్తిని పొందిన బ్రహ్మ మహత్తత్వము మొదలైన పూర్వ కర్మలను అనుసరించి మంచి చెడు వాసనల ప్రాముఖ్యాన్ని అనుసరించి ఈ చరాచర శరీరాలతో ప్రత్యేక జీవులను సృష్టించిన విధాన వర్ణనమే విసర్గం అనబడుతుంది.

3. వృత్తి : జీవుల జీవన యాత్ర కోసం ఉద్దేశించిన సామాగ్రి అంటే చరముల కోసం అచర వస్తువుల సృష్టి వృత్తి. అంటే జీవులు జీవయాత్రను సాగించటం కోసం ఏవస్తువులను మనుష్యుడు ఉపయోగించుకొంటాడో అదే అతడి వృత్తి. అంటే మనుష్యుడు బ్రతకటానికి

తినే బియ్యం, గోధుమలు మొదలైనవి వృత్తి క్రిందకే వస్తాయి. కొన్ని వృత్తులు అతడు తాను తన ఇచ్ఛ చేత ఏర్పరచుకొన్నవైతే మరికొన్ని జీవునికి ధర్మశాస్త్ర విధి ప్రకారం ఆచరించవలసినవి. కానీ ఏదైనా మానవ జీవనము, రక్షణ కోసం ఉద్దేశించినవే.

4. రక్షణ : ఇది భగవంతునికి సంబంధించినది. యుగయుగాలలోను భగవంతుడు పశు, పక్షి, మనుష్య, ఋషి, దేవుడు మొదలైన రూపాలుగా అవతారం ధరించి అనేక లీలలను ప్రదర్శిస్తాడు. ఈ అవతారాల ద్వారా వేదాలను, వేదధర్మాలను రక్షించి, వాటిని విరోధించే వారిని శిక్షిస్తాడు. సంహరిస్తాడు. అందువలన భగవంతుని అవతార లీలలు విశ్వ రక్షణకు జరిపినట్టివి. అందుకే ఇది రక్షణ అని చెప్పబడుతున్నది.

5. అంతరములు : ఇవే మన్వంతరములని పంచ లక్షణాలో చెప్పబడినట్టివి.

6. వంశము : వివిధ, రాజ, ఋషి వంశాల పుట్టుకను, వృద్ధిని వర్ణించేది.

7. వంశాను చరితము : రాజ, ఋషి వంశాల క్రమాన్ని తరతరాల చరిత్రను తెలిపేవి వంశాను చరితలు. ఇవి కూడా పంచ లక్షణములలో చెప్పిన ధర్మాలు కలవే.

8. సంస్థ : ప్రతి సర్గము అని పంచ లక్షణాలలో చెప్పిన దానికి దీనికి భేదం లేదు.

9. హేతువు : అంటే జీవుడు అనే అర్థాన్ని గ్రహించాలి ఇక్కడ. జీవుడు అవిద్య ద్వారా తాను చేసే, ఆచరించే పనులకు కర్త అవుతున్నాడు. ప్రపంచ సృష్టిలో జీవుడికి ఏం ప్రమేయం ఉందంటే, జీవుని అదృష్టం ద్వారా జరిగే కర్మల వలన సర్గం అంటే సృష్టి విసర్గం అంటే నాశనం జరుగుతున్నాయి. అందుకే ఈ సృష్టి ప్రళయాలకు కారణం లేక హేతువుగా జీవుడు పరిగణింపబడుతున్నాడు. అందువలన పురాణాలలో చెప్పబడిన ఈ విషయానికి సంబంధించిన విస్తృతినే హేతువు అంటున్నారు.

10. అపాశ్రయము : పరబ్రహ్మకే ఇంకొక పేరు. జీవునికి మూడు వృత్తులు లేక అవస్థలు ఉన్నాయి. జాగ్రదవస్థ స్వప్నము సుషుప్తి అనేవి ఆమూడు అవస్థలు. ఈ మూడు దశలలోను జీవునిలో చైతన్యం ఉంటుంది. ఈ చైతన్యమే విశ్వము, తేజస్సు, ప్రజ్ఞా అనేపేర్లతో పిలువబడుతుంది. ఈ మాయామయ వృత్తులలో సాక్షిరూపంగా ఎల్లప్పుడు జీవునిలో ఉండే మహాశక్తే అధిష్ఠాన రూపంలోని అపాశ్రయతత్త్వం. ఆ మహాశక్తే పర బ్రహ్మము లేక అపాశ్రయము అని పిలువబడుతుంది. జీవుని అన్నిస్థితులలోనూ ఈ అపాశ్రయశక్తి ఉంటుంది. ఆశక్తి నామరూపాత్మక పదార్థాలతోపాటుగా ఒకప్పుడు యుతంగా (ప్రత్యక్షంగా) మరొకప్పుడు అయుతంగా (అంటే కనిపించకుండా) ఉండవచ్చు. ఈ అపాశ్రయతత్వాన్ని వివరించటం పురాణం నిర్వర్తించవలసిన పదవ లక్షణము.

భాగవతం ద్వితీయ స్కంధంలో చెప్పిన దశ లక్షణాలు ఇవి.

1. సర్గ 2. ప్రతిసర్గ 3. స్థానం 4. పోషణం 5. ఊతయము
6. మన్వంతరమ్ 7. ఈశానుకథ 8. నిరోధము 9. ముక్తి 10. ఆశ్రయము.

పై వాని శబ్దార్థ, తత్త్వార్థాలను నిశితంగా పరిశీలిస్తే ఇంతకుముందు చెప్పిన – అంటే ద్వాదశ స్కంధంలోని దశలక్షణాలకు వీటికి పెద్దగా భేదం లేదు.

మొత్తం మీద పంచ లక్షణాలైనా, దశ లక్షణాలైనా ఒకదాని కొకటి పరస్పర సంబంధం కలవి. ఒకటి రెండవ దానిలో ఐక్యం చెందేవే. పురాణ సాహిత్యం విస్తృతి చెందటంతో సమగ్ర లక్షణం కల్పించాలనే భావనతో పంచ లక్షణాలు దశ లక్షణాలుగా వికాసం చెందాయని భావించటం సముచితం.

పురాణ వర్గీకరణం

మొత్తం అష్టాదశ పురాణాలు రకరకాల వర్గీకరణ చేయబడ్డాయి. ఆవర్గీకరణ వివిధ పురాణాలలో చెప్పబడిన విషయ ప్రధానంగా ఉన్నది. కానీ ఇవి అంతగా శాస్త్రీయం కాదు.

మొదటి వర్గీకరణ పురాణాలు సత్త్వరజస్తమో పురాణాలని అవి ప్రతిపాదించే గుణాలను ఆధారం చేసుకొని మూడు రకాలుగా విభజించడ్డాయి. వీటిలో

1. విష్ణు, నారదీయ, భాగవత, గరుడ పద్మ వరాహపురాణాలు సత్త్వ గుణం కలవి (విష్ణువు యొక్క పారమ్య కారణమైన సాత్త్విక అంశాలు కలవి) కాబట్టి ఈ ఆరు సాత్త్విక పురాణాలు.
2. మత్స్య, కూర్మ, లింగ, శివస్కంద, అగ్నిపురాణాలు తామస గుణప్రధానం కలవి (పరమ శివుని సంహారక తామస అంశాన్ని అనుసరించి) కాబట్టి ఈ ఆరు తామస పురాణాలు.
3. బ్రహ్మ, బ్రహ్మాండ, బ్రహ్మ వైవర్త, మార్కండేయ, భవిష్య, వామన పురాణాలు రజోగుణ ప్రాధాన్యం కలవి. (బ్రహ్మ ప్రపంచ సృష్టిని చేయటానికి అవసరమైన రజో గుణం కలవి) కాబట్టి ఈ ఆరు రాజస పురాణాలు. వీటిల్లో మొదటి ఆరు విష్ణు పారమ్యాన్ని బోధించేవి అంటే వైష్ణవ మత ప్రతిపాదకాలు రెండవ ఆరు శక్తి శివుని పారమ్యాన్ని బోధించేవి అంటే శైవ, శాక్తేయ ప్రతిపాదకాలు. చివరి ఆరు బ్రహ్మకు ప్రాధాన్యత ఇవ్వబడినవి. బ్రహ్మపారమ్యాలు. అందుచేత అవి బ్రహ్మసంబంధాలు.

ఈ వర్గీకరణ ఇలాగే చేసినా మత్స్య, పద్మ గరుడ పురాణాలలో పురాణాలను పేర్కొనటంలో కొంత భేదాలు ఉన్నాయి. గరుడపురాణంలో, కూర్మపురాణం సాత్త్విక పురాణంగా చేర్చబడింది. గరుడపురాణం సాత్త్విక పురాణాలను తిరిగి మూడు భాగాలుగా

సాత్త్విక ఉత్తమ (విష్ణు, భాగవత గరుడపురాణాలు) సాత్త్విక మధ్యమ – (వాయుపురాణం) సాత్త్విక అధమ (మత్స్యకూర్మ పురాణాలుగా) పేర్కొంటున్నది. ఏదైనా ఈ రకమైన విభాగం ప్రాచీనమేకానీ, అంతశాస్త్రీయం కాదు. స్కాందపురాణం, పురాణాలలో పది శివుడిని, నాల్గింటిలో బ్రహ్మను రెండింటిలో దేవి, రెండింటిలో విష్ణు ఉపాసన చెప్పబడిందని వర్గీకరించింది. దీని ప్రకారం. 1. శివప్రధానం-10 2. బ్రహ్మపారమ్యం-4 3.దేవీ పారమ్యం-2 4.విష్ణు పారమ్యం-2

ఇదే స్కాంద పురాణం శివరహస్య ఖండంలోని సంభవ కాండలో (2-30-38) ఇంకొక వర్గీకరణ కనిపిస్తుంది.

1. శైవ (శివ విషయక పురాణం) శివ, భవిష్య, మార్కండేయ, లింగ, వరాహ, స్కంధ, మత్స్య, కూర్మ వామన బ్రహ్మాండ	–	10
2. వైష్ణవ (విష్ణు విషయక పురాణాలు) విష్ణు, భాగవత, నారదగరుడ	–	4
3. బ్రహ్మ (బ్రహ్మ విషయక పురాణాలు) బ్రహ్మ, పద్మ	–	2
4. సవిత్రు (సూర్య విషయక పురాణాలు) బ్రహ్మ వైవర్త	–	1
5. ఆగ్నేయ (అగ్ని విషయక పురాణం) అగ్ని	–	1
	మొత్తం	18

ఆధునికులు కొందరు ఈ అష్టాదశ పురాణాలను వేరొక విధంగా వర్గీకరించారు.

1. విజ్ఞాన కోశీయ పురాణాలు – అగ్ని, గరుడ, నారద పురాణాలు
2. తీర్థ సంబంధ పురాణాలు – పద్మ, స్కంద, భవిష్య పురాణాలు
3. సాంప్రదాయిక విషయ పురాణాలు – లింగ, వామన, మార్కండేయ పురాణాలు
4. ఐతిహాసిక విషయ పురాణాలు – వాయు, బ్రహ్మాండపురాణాలు

ఈ సందర్భంలో వాయు, బ్రహ్మాండ మత్స్య విష్ణు పురాణాలు ఉన్న వాటిలో అతి ప్రాచీనాలని గుర్తుంచుకోవాలి. వీటిలో మొదటి రకానికి చెందినవానిలో విజ్ఞాన సర్వస్వం అంటే మానవ సమాజానికి ఉపయోగపడే సమస్త విద్యలు (ఆధ్యాత్మిక భౌతిక విద్యలు) అన్నింటి సారాంశం ఉన్నది. వీటిల్లో ప్రాచీన కాలంలో వర్తించిన విద్యలు సంక్షేపంగా, చక్కని విధానంలో తెలుపబడ్డాయి.

రెండవ రకానికి చెందిన వానిలో తీర్థాలు, వ్రతాలు, వాని మాహాత్మ్యాలు మొదలైనవి తెలియజేయబడ్డాయి. పద్మ స్కాంద పురాణాలు ఈ కోవకు చెందినవి. వీటిని 'ప్రాధాన్యే వ్యపదేశాభవన్తి' అనే న్యాయంగా అర్థం చేసుకోవాలి.

మూడవ వర్గంలోకి, బ్రహ్మ, బ్రహ్మ వైవర్త, భాగవత పురాణాలు వస్తాయి. ప్రాచీన హైందవ సంప్రదాయిక విషయాలెన్నో వీనిలో ఉంటాయి. ఇవి రెండుసార్లు మార్పులను పొందాయని, దాని కేంద్రంగా ఉన్న భాగమే మూలభాగమని పండితుల నమ్మకం.

చతుర్థ విభాగంలో ఐతిహాసిక విషయాలు చెప్పబడిన పురాణాలు వస్తాయి. అంటే ఆయా పురాణాలలో కలియుగ వంశరాజుల చరిత్రలను, చారిత్రక దృష్టితో చెప్పిన అంశాలు వీటిలో ఉంటాయి. వీటి ఆధారంగానే భారతదేశ చరిత్ర రచింపబడిందనే విషయాన్ని మనం విస్మరించగూడదు. ఈ రకమైన పురాణాల్లో వాయు, బ్రహ్మాండ పురాణాలు ఎక్కువగాను, విష్ణు, మార్కండేయ పురాణాలు కొంతవరకు ఉపయోగిస్తాయి.

ఏ విధంగా వర్గీకరణ చేసినా, అది పూర్తిగా సమర్థనీయంగా చేయటం కుదిరేది కాదు. ఒకే పురాణంలో అనేక విషయాలు కలగాపులగంగా ఉంటాయి గదా. కేవలం దానిని ఒక సూచనగా మాత్రమే గ్రహించాలి.

పురాణ సాహిత్యం - మరోవర్గీకరణ :

కాలక్రమేణా పురాణ సాహిత్యం వృద్ధి పొందిందని భావించటంలో ఎలాంటి అభిప్రాయ భేదము లేదు. అనంతర కాలంలో వివిధ స్థలాలలో దైవ తీర్థ క్షేత్ర ప్రశస్తిని ఇనుమడింపచేయటానికి అష్టాదశ పురాణాలను అనుకరిస్తూ కొన్ని పురాణ ఖండాలు రచింపబడ్డాయి. ఈ రచనలలో అష్టాదశ పురాణాలను అనుకరిస్తూ కొన్ని చోట్ల అందులోని తీర్థక్షేత్ర దైవ మాహాత్మ్యాలను పెంచి కొన్ని సందర్భాలలో హ్రస్వీకరించి, ఏవో కొన్ని కారణాలతో కొంతమార్చి పురాణాలు రచింపబడ్డాయి. వీటినే ఉప పురాణాలన్నారు. ఈ ఉప పురాణాలు కూడా పద్దెనిమిదని చెప్పి వాటికి ప్రామాణ్యతను కల్పించారు.

మహాపురాణాన్యేతానిహ్యష్టా దశమహామునే
తథాచోప పురాణాని మునిభ్యాం కథితానిచ *(వి.పు. 3-624)*

అని అష్టాదశ మహాపురాణ ఉప పురాణాలను మునులే రచించారని విష్ణుపురాణం తెలుపుతున్నది. అయితే మత్స్యపురాణం

అష్టాదశభ్యస్తుపృథక్ పురాణం తత్ర్పదృశ్యతే
విజానీధ్వంద్విజ శ్రేష్ఠాస్తథాతేభ్యో వినిర్గతమ్ **(53-63)**

అని ఈ అష్టాదశ మహాపురాణాలే కాక ఇంకా ఉన్న పురాణాలు వాటి నుండే ఆవిర్భవించాయి అని కూడా తెలుపుతున్నది. ఈ ఉపపురాణాల నుంచి వాటికి మూలాలైన

అసలు పురాణాలను వేరుగా తెలియజేయటానికే అసలైన మూలపురాణాలకు 'మహా' అనే విశేషణం చేర్చి మహాపురాణాలంటున్నారు. అయితే కొన్ని ఉపపురాణాలు కూడా తమ పేర్లకు ముందు 'మహా' చేర్చుకొని ఈ వర్గీకరణనంతా గజిబిజి చేశాయనేది అసలు విషయం. మహాపురాణాల ప్రామాణికతను శంకించ వలసినపనిలేదు. అయితే ఈ ఉప పురాణాల ప్రామాణికత ఎంతఅంటే (అన్యాశ్చ సంహితాః సర్వా మరీచిక పిలాదయః సర్వత్ర ధర్మకథనే తుల్యసామర్థ్యముచ్యతే) మహా పురాణాలకు ధర్మ విషయాలలో ఎంత ప్రామాణికత ఉన్నదో ఉపపురాణాలకు కూడా సమానమైన ప్రామాణ్యత ఉన్నదని చెప్పబడింది.

నిజానికి లభ్యమవుతున్న ఉపపురాణాలు, సంఖ్యలో కొంత ఎక్కువగానే ఉన్నా, వాటి సంఖ్య కూడా పద్దెనిమిదే - అష్టాదశ పురాణా నామేవ విదుర్బుధాః, ఏవంచో ఏ పురాణానామష్టాదశ ప్రకీర్తితాః (131-22) అని బ్రహ్మ వైవర్త పురాణం తెలుపుతున్నది. స్కాంద పురాణం కూడా పారాశరం భాగవతం క్రౌంచ మష్టాదశమ్ మతమ్ (స్కాంద - రేవాఖండం - 1 - 55) అని ఈ విషయాన్ని బలపరుస్తున్నది. ఉపపురాణాలు :

1. ఆదిపురాణం	2. నరసింహ పురాణం	3. స్కాంద పురాణం.
4. శివ ధర్మ పురాణం	5. దూర్వాస పురాణం	6. నారదీయ పురాణం
7. కపిల పురాణం	8. వామన పురాణం	9. ఔశసన పురాణం
10. బ్రహ్మాండ పురాణం	11. వరుణ పురాణం	12. కాళికా పురాణం
13. మాహేశ్వర పురాణం	14. శాంబపురాణం	15. సౌర పురాణము
16. పారాశర పురాణము	17. మారీచ పురాణము	18. భాస్కర పురాణం

ఈ పురాణాల వరుస ఎవరెవరు ఎవరికి చెప్పారనే విషయాన్ని కూర్మ పురాణం (పూ.అ. 1-17-20)

ఆద్యంసనత్కుమారోక్తం నారసింహ మధాపరమ్
తృతీయం స్కాందముద్దిష్టం కుమారేణచ భాషితమ్
చతుర్థం శివధర్మాఖ్యం సాక్షాన్నందీశ భాషితమ్
దూర్వాస సోక్త మాశ్చర్యం నారదీయమతః పరమ్
కపిలం వామనంచైవ తథైవోశన సేరితమ్
బ్రహ్మాండం వారుణం చాథ కాపిలాహ్వ యమేవచ
మాహేశ్వరం తథా శాంబం సౌరం సర్వార్థ సంచయమ్
పరాశరోక్తమపరం మారీచం భాస్కరాహ్వయమ్

అని ధృవీకరిస్తున్నది. పై సూచికను పరిశీలిస్తే స్కాందపురాణం, బ్రహ్మాండ పురాణం, వామన పురాణం, నారద పురాణం మహాపురాణాలలోను ఉన్నాయి. అలాగే భాగవతాలు దేవీభాగవతం, విష్ణుభాగవతాలు ఈ సూచికలో లేకపోయినా ఏది మహాపురాణం అనే దానిలో కొంత అభిప్రాయ భేదం ఉన్నది. మహాపురాణాల జాపితాలో ఉన్నది శివపురాణమా వాయుపురాణమా అనేది కూడా సందిగ్ధాంశమే. చాలామంది పండితులు శివపురాణ దేవీ భాగవతాలు ఉపపురాణాలనే వాదాన్ని అంగీకరిస్తున్నారు కానీ ఈ ఉపపురాణాల జాపితాలో అసలు భాగవత ప్రస్తావనే లేదు. అప్పుడు దేవీ భాగవతం ఏ శాఖ క్రిందకు రావాలి ? కానీ ఔప పురాణాలని ఉన్న ఒక శాఖలో భాగవతం ఉన్నది. అదే దేవీభాగవతం అయి ఉండాలి.

అష్టాదశ మహాపురాణాలు, అష్టాదశ ఉపపురాణాలు ఉన్నట్లే అష్టాదశ ఔపపురాణాలు ఉన్నాయి. బృహద్వివేకము అనే గ్రంథం వాటిని గురించి

ఆద్యం సనత్కు మారంచ నారదీయం బృహచ్చయత్
ఆదిత్యం భావనం ప్రోక్తం నందికేశ్వర మేవచ
కౌర్మ భాగవతం జ్ఞేయం వాసిష్ఠ భార్గవం తథా
ముద్గలం కల్కిదేవ్యాచ మహా భాగవతం తతః
బృహద్ధర్మం పరానన్దం వహ్నిం పశుపతిం తథా
హరివంశం తతోజ్ఞేతు మిదమౌపపురాణకమ్

అని చెప్పాడు. అప్పుడు అష్టాదశ ఔప పురాణాలు ఇవి :

1. సనత్కుమార	2. బృహన్నారదీయ
3. ఆదిత్య	4. సౌర (సూర్య)
5. నందికేశ్వర	6. కౌర్మ
7. భాగవత	8. వాసిష్ఠ
9. భార్గవ	10. ముద్గల
11. కల్కి	12. దేవీ
13. మహాభాగవత	14. బృహద్ధర్మ
15. పరానంద	16. వహ్ని
17. పశుపతి	18. హరివంశ పురాణాలు

ఈ జాబితాలోవి కూడా కొన్ని మహాపురాణాలలో ఉన్నాయి. కొన్ని ఉప పురాణాలలో ఉన్నాయి. భారతానికి ఖిలపర్వంగా చెప్పబడే హరివంశం ఇందులో పురాణస్థాయికి చేర్చబడింది. ధర్మ కల్పద్రుమం అనే గ్రంథంలో జ్ఞానానంద సరస్వతి ఇంకా పురాణాలు ఉన్నాయని తెలిపి ఆ పురాణాలను అయిదు విధాలుగా వర్గీకరించాడు. 1. మహాపురాణాలు 2. ఉపపురాణాలు 3. ఔపపురాణాలు 4. ఉపోప పురాణాలు 5. ఉపౌప పురాణాలు

ఇలా రక రకాల అవాంతర భేదాలు పురాణాలలో ఉండగా వీనిని గుర్తించకుండానే కొందరు ముఖ్యంగా మన తెలుగు కవులు కొంత గందరగోళానికి లోనైనారు. ఇది ఆధునిక కాలంలోనే కాదు. ప్రాచీన కాలంలోనే జరిగింది. శ్రీనాథకవి సార్వభౌముడు మహాపురాణాలలోని స్కాందంలో భాగమైన కాశీ ఖండాన్ని తెలుగులోనికి అనువదించేటప్పుడు సప్తఖండాత్మక స్కాందమన్నాడు. గోదావరి ఖండంలోని భీమఖండాన్ని రచిస్తూ పంచాశత్ఖండ మండితస్కాందం అన్నాడు. మహాపురాణమైన స్కాందంలో ఉన్నవే ఏడు ఖండాలు. వాటిల్లో గోదావరీ ఖండం లేనే లేదు. పంచాశత్ఖండమండితమైన స్కాందంలోను గోదావరి ఖండం ఒకటిగాలేదు. ద్రాక్షారామ భీమేశ్వరునికి ప్రసిద్ధి కల్పించటానికి సంస్కృత భీమఖండాన్ని శ్రీనాథుడే రచించాడని ఒక ప్రతీతి. యథార్థం భీమేశ్వరునికే ఎరుక. ఇక పద్దెనిమిదవ శతాబ్దం ప్రథమ పాదానికి చెందిన హంసవింశతి కర్త అయ్యలరాజు నారాయణామాత్యుడు తన హంసవింశతిలో అష్టాదశ పురాణాలను తెలుపుతూ బ్రహ్మోత్తర ఖండం వాటిలో ఒకటి అని తెల్పాడు. నిజానికి సప్తఖండాత్మకమైన స్కాందపురాణంలో మూడవ ఖండమైన బ్రహ్మ ఖండంలో ఉత్తర భాగమే బ్రహ్మోత్తర ఖండం. ఇది తెలుగు దేశంలో విస్తృత ప్రచారం పొందిన స్కాందంలోని భాగం. ప్రాచీన కాలంలోనే దీనికి ఐదు పద్యానువాదాలు వచ్చాయంటే దాని ప్రసిద్ధి అర్థం చేసుకోవచ్చు. అందుకే అయ్యలరాజు నారాయణకవి పొరపాటు పడినట్లున్నాడు.

మహా పురాణాలలో అనేక విషయాలు కలగాపులగంగా ఉన్నాయి. ముఖ్యంగా శివ, విష్ణు, దేవీ, అగ్ని మొదలైన దైవతాల పారమ్యాన్ని తెలిపే విషయంలో ఏ పురాణమూ పూర్తిగా ఒక పక్షమే వహించదు. అసలు హిందూ ధర్మమే అందుకు వ్యతిరేకం గదా. కానీ కాలంగడిచే కొద్దీ ఈ పారమ్య భావం ఎక్కువై ఒక్కొక్క దైవపారమ్యంగా ప్రత్యేక పురాణాలే కనిపిస్తున్నాయి. అందువలననే ఈ ఉపపురాణాలలో కూడా శైవ, వైష్ణవ, సౌర, శాక్తాది భేదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పండితులు పురాణ రచనా కాలాలను గురించి చాలా చర్చలు చేశారు. వారి చర్చల సారాంశం ఇవి అన్నీ ఒక కాలంలో రచించటం జరగలేదని మాత్రమే కాకుండా, ఒక పురాణంలోని వివిధ భాగాలు వివిధ కాలాలలో రచింపబడ్డాయనేదే. ఏదైనా ఉపపురాణౌప పురాణాదులలో చాలా వరకు క్రీ.శ. పదవ

శతాబ్దానికి ముందు కాలంలోనే రచించటం జరిగిందనేది ఒక ఊహ. కొన్ని ఉప పురాణాలు. క్రీస్తుకు పూర్వమే పంచమ శతాబ్దంలోనే ఉన్నాయని మరికొన్ని క్రీ.శ. షష్ఠ శతాబ్దం ప్రాంతానికి చెందినవని మరి కొందరు పండితుల అభిప్రాయం. ఇలా పురాణ సాహిత్యం విస్తృతిని పొంది మహాపురాణ ఉపపురాణ ఔపపురాణ ఔపోప పురాణ భేదాలతో విలసిస్తూ వట వృక్షంలాగా విస్తరించి జాతి జీవనంలో నరనరాలా జీర్ణించుకొనిపోయింది. ఇది ఎంత విస్తృతమైనదో దానిని అధ్యయనం చేసినవారికే తప్ప ఇతరులకు ఊహైక గమ్యము.

పురాణాలకు కల్ప సంబంధం

ఇంతకుముందు ఏ పురాణం ఏ కల్పాలలో జరిగిన విషయాలను తెలుపుతున్నదో ఆయా పురాణాలలోని విషయాలను తెలిపేటప్పుడు తెలియజేయబడింది. ఇక్కడ ఆ వివరాలు పట్టికలో ఇవ్వబడ్డాయి చూడండి.

1.	బ్రహ్మపురాణం	బ్రహ్మకల్పం	10,000 శ్లోకాలు
2.	పద్మపురాణం	పద్మకల్పం	55,000 శ్లోకాలు
3.	విష్ణుపురాణం	వరాహ కల్పం	8,000 శ్లోకాలు
4.	శివ/వాయు పురాణం	శ్వేత కల్పం	24,000 శ్లోకాలు
5.	భాగవత పురాణం	సారస్వత కల్పం	18,000 శ్లోకాలు
6.	భవిష్య పురాణం	అఘోరకల్పం	31,000 శ్లోకాలు
7.	నారదపురాణం	బృహత్ కల్పం	25,000 శ్లోకాలు
8.	మార్కండేయ పురాణం	మధురకల్పం	9,000 శ్లోకాలు
9.	అగ్నిపురాణం	ఈశాన కల్పం	8,000 శ్లోకాలు
10.	బ్రహ్మవైవర్తపురాణం	రథంతర కల్పం	12,000 శ్లోకాలు
11.	లింగపురాణం	అగ్నికల్పం	11,000 శ్లోకాలు
12.	వామనపురాణం	కూర్మకల్పం	14,000 శ్లోకాలు
13.	స్కాందపురాణం	తత్పురుష కల్పం	1,00,000 శ్లోకాలు
14.	మత్స్యపురాణం	సత్యకల్పం	6,000 శ్లోకాలు
15.	కూర్మపురాణం	లక్ష్మీకల్పం	24,000 శ్లోకాలు
16.	వరాహపురాణం	మానవ కల్పం	24,000 శ్లోకాలు
17.	గరుడ పురాణం	గారుడ కల్పం	19,000 శ్లోకాలు
18.	బ్రహ్మాండపురాణం	భవిష్యకల్పం	12,000 శ్లోకాలు
		మొత్తం	**4,00,000 శ్లోకాలు**

ఇంతకుముందు చెప్పిన శ్లోక సంఖ్యపైన చూపిన శ్లోక సంఖ్యతో కొంత భేదించవచ్చు. అది సంహితా భేదం మొదలైన కారణాల వలన కావచ్చునని విష్ణుచిత్తీయ వ్యాఖ్య తెల్పుతున్నది. అలాగే ఆయా పురాణాలలో తరువాత చొరబడిన ప్రక్షిప్తాలు, దొరకని భాగాలు వీటి అన్నింటి కారణాల చేత ఈ భేదం ఏర్పడి ఉండవచ్చు. కానీ వ్యాస ప్రోక్తమైన పద్ధెనిమిది పురాణాలలోని మొత్తం శ్లోక సంఖ్య నాలుగు లక్షలని అన్ని పురాణాలు ముక్తకంఠంతో ఘోషిస్తున్నాయి.

మన్వంతరము

ఒక్కొక్క మన్వంతర కాలమున ఒక్కొక్క మనువు పాలన చేస్తాడు. ఈ మన్వంతరాలు 14. మొత్తం వానికి అధిపతులైన మనువులు 14 మంది. వారు 1. స్వాయంభువుడు 2. స్వారోచిషుడు 3. ఉత్తముడు 4. తామసుడు 5. రైవతుడు 6. చాక్షుషుడు-ఇక్కడి వరకు మన్వంతరములు గడిచిపోయినవి. ప్రస్తుతము ఏడవదైన వైవస్వతమన్వంతరము జరుగుతున్నందువలన 7. వైవస్వతుడు (ఇతడు ఇప్పటి మనువు) 8. సావర్ణి 9. దక్ష సావర్ణి 10. బ్రహ్మసావర్ణి 11. ధర్మసావర్ణి 12. రుద్రసావర్ణి 13. దేవసావర్ణి 14. ఇంద్రసావర్ణి (వీరంతా రాబోయే మనువులు). వివిధ పురాణాల్లో ఈ మనువుల పేర్లతో కూడా కొన్ని భేదాలు కనిపిస్తున్నాయి. అది కల్పభేదముచేత కలిగినదని పురాణ పండితుల ఉద్దేశ్యము.

మన్వంతరాలు, కల్పాల స్వరూపం

చారిత్రక గణనంలో మన్వంతరం చాలా ముఖ్యమైనది. లేకపోతే సృష్టి నుంచి ప్రళయం వరకు సాగే ఈ మహత్తరమైన అంతులేని కాలంలో కనీసం కొండ గుర్తులుగానైనా ఏది ఎప్పుడు జరిగిందో గుర్తించడం ఎలా. అందుకే భాగవతం

మన్వంతరం మనుర్దేవా మనుపుత్రా సురేశ్వరః
ఋషయోఽశాంవతారాశ్చ హరేః షడ్విధముచ్యతే

అనగా మనువు, మనుపుత్రులు, దేవతలు, ఋషులు, అంశావతారాల, ప్రసిద్ధ సంఘటనలు జరిగిన విషయాలు చెప్పినప్పుడు దానిని మన్వంతరం అంటారు.

స్వాయంభువమనువు యొక్క కాలం ఏ ఏ ఋషులు, మహర్షులు, రాజులు ఉన్నారు, స్వారోచిష మనువు కాలంలో ఆయనకు సహాయంగా ఉన్న మహాపురుషులెవరు, ఉత్తమ మనువు కాలంలో ఏయే పురాణాల ప్రాముఖ్యత ఉన్నది, లేకపోతే రైవతక మనువు కాలంలో ఎటువంటి సంఘ నిర్మాణం ఉన్నది. ఇలాంటి విషయాలన్నింటని గురించి తెలుసుకొనటానికి పురాణాలలో తప్పితే వేరు ఆధారభూతమైనవి ఏమున్నాయి.

అలాగే మన్వంతర జ్ఞానం లేకుండా ఏ రాజు యొక్క వంశము యొక్క సరియైన జ్ఞానము, అవగాహనలు అవసరము కదా. ఒక కల్పంలో పధ్నాలుగా మంది మనువులుంటారు. మనుష్య మానానికి కొద్ది ఎక్కువగా ఉండే 71 మహాయుగాలకు అంటే 30,85,71,428 సంవత్సరాల 6 నెలల 25 రోజుల 42 గడియల కాలాన్ని ఒక మన్వంతరం అంటారు. ఇలాంటి మన్వంతరాలు 14 అంటే 432 కోట్ల మనుష్య సంవత్సరాలు – బ్రహ్మదేవునికి ఒక పగలు. దీనికి 'ఉదయ కల్పం' అని పేరు. ఇందులో బ్రహ్మాదుల సృష్టి జరుగుతుంది. తిరిగి ఇంతేకాలం బ్రహ్మదేవునికి రాత్రి. దీనికి 'క్షయ కల్పము' అని పేరు. ఈ సమయంలో సంకర్షణ అగ్ని చేత భూర్భువస్సువర్మహర్లోకాలు దగ్ధం అవుతాయి. దీనిన నైమిత్తిక ప్రళయం అంటారు. ఉదయ కల్పం, క్షయకల్పం రెండూ కలిస్తే బ్రహ్మకు ఒక అహోరాత్రం అవుతుంది. దీనికే కల్పం అని పేరు. 360 కల్పాలు ఇలాంటివి బ్రహ్మదేవునికి ఒక సంవత్సరం. ఇలాంటి సంవత్సరాలు నూరు బ్రహ్మదేవునికి పరమ ఆయుర్దాయము. దీనికి ఒక మహా కల్పం అని పేరు. ఈ మహాకల్పం తరువాత వచ్చే ప్రళయాన్ని ప్రాకృతిక ప్రళయము అంటారు.

ఈ కల్పాలు అనంతం. కొన్ని పేర్లను మాత్రం తెలుసుకొందాం.

1. శ్వేత వరాహ 2. నీలలోహిత 3. వామదేవ 4. వథంతర 5. రౌరవ 6. ప్రాణ(దేవ) 7. బృహత్ 8. కందర్ప 9. సత్య 10. ఈశాన 11. ధాన (తమః) 12. సారస్వత 13. ఉదాన 14. గరుడ 15. కలార్మ 16. నారసింహ 17. సమాధి 18. ఆగ్నేయ 19. విష్ణుజ 20. సౌర 21. సోమ 22. భావన 23. సుప్తమాలి 24. వైకుంఠ 25. ఆర్చిష 26. వల్మీక 27. వైరాజ 28. గేరీ 29. మాహేశ్వర 30. పిత్ర 31. మానవ 32. తత్పురుష 33. వైకుంఠ 34. లక్ష్మీ 35. సావిత్రీ 36. అఘోర 37. పద్మకల్పం మొదలైనవి. ఈ కల్పాలు అనంతాలు.

పురాణాలలో కథలలో తేడాలు ఎందుకుంటున్నాయి

వివిధ పురాణాలను పరిశీలిస్తే, కొన్ని కథలు ఒక పురాణంలో ఒక విధంగాను, ఇంకొక పురాణంలో ఇంకొక విధంగాను కనిపిస్తున్నాయి. మన పురాణాలపై అంతగా గురిలేనివారు పురాణాలకు ఐక్యతలేదని, పరస్పర విరుద్ధాలని అందుచేత అవి అప్రమాణాలని తీవ్రంగా నిందాపూర్వక విమర్శలు చేస్తున్నారు. ఇలాంటి వారికి వ్యాసుడు ఏకార్థాని పురాణాని వేదాశ్చైకార్థ సమ్మితాః అని మహాభారతంలో వివరించాడు. అలాగే

క్వచిత్క్వచిత్పురాణేషు, విరోధో యది దృశ్యతే
కల్పభేదాది భిస్తత్ర, వ్యవస్థాసద్భిరిష్యతే – (పద్మ పురాణం)

అని పద్మ పురాణంలో చెప్పబడింది. అనగా ప్రతికల్పంలోను సృష్టి జరుగుతుంది. ఈ జరిగే సృష్టిలో రాముడు, కృష్ణుడు మొదలైన అవతారాల, ఇతర మహాపురుషుల సృష్టి జరుగుతుంది. ఆ గాథలలో కల్పభేద ప్రయుక్తాలైన కొద్దిపాటి భేదాలు కలుగవచ్చును. అది దోషం కాదు. అలాంటి విషయాలను కూడా పురాణాలు వదలకుండా తెలియచేస్తాయి అని అర్థం. ఈ విషయం పద్మపురాణం పాతాళఖండంలో పూర్వకల్ప రామాయణ కథ సమ యంలో తెలియజేయబడింది. అందువలననే ప్రతి పురాణంలోనూ, ఈ పురాణం ఈ కల్ప వృత్తాంతాన్ని తెలుపుతుంది అని వ్యాసుడు తెలుపుతున్నాడు.

చివరగా చెప్పాలంటే పురాణంలో స్పృశించని, స్పృశించకూడని విషయాలు ఏమీ ఉండవని చెప్పవచ్చు. ఎందుకంటే ఏ విషయమైనా పురాణ పంచలక్షణాలలోనికి అంతర్భవిస్తాయనటం సరియైనదే. తొమ్మిది రకాల సృష్టులు, నాల్గువిధాల ప్రళయాలు, పద్నాలుగు మన్వంతరాల విశేషాలు, కాలగణనం, వ్రతదాన తీర్థ ధర్మశాస్త్ర విషయాలు, అశ్వ, రత్న, గజవాస్తు జ్యోతిస్సాముద్రిక శాస్త్రాలు, ఆయుర్వేద, ధనుర్వేదాలు, అనులేపన స్వేచ్ఛారూప ధారణాది బహువిచిత్ర విద్యలు, సప్తద్వీప బహునదీనద కులపర్వత సముద్రాది అనేక భౌగోళిక విషయాలు, లోకాంతర గ్రహాంతర బ్రహ్మాండాంతర విశేషాలు, తాంత్రిక విద్య, ఇక్ష్వాకు చంద్ర కలి వంశ వర్ణనలు, భగవత్తత్వం, భక్తకర్మజ్ఞాన వైరాగ్యా ధ్యాత్మిక విషయాలు. వివిధ దేవీ దేవతాతత్త్వస్తోత్ర పూజావతారాది వర్ణనలు, మహిమలు, నీతులు, ప్రపంచ రీతులు, ధర్మాలు, అలంకారం, వ్యాకరణం. ఈ విధంగా పురాణాలలో లేనిది లేదు. అవి విజ్ఞాన సర్వస్వాలు. కనుకనే

యో విద్యాచ్చతురోవేదాన్ సాంగోపనిషదో ద్విజః
న చేత్పురాణం సంవిద్యాన్నైవ సస్యాద్విచక్షణ ః *(వాయుపురాణం 1.1.180)*

(నాల్గు వేదాలు, ఆరు శాస్త్రాలు, అన్ని ఉపనిషత్తులు చదివినా పురాణం తెలియని వాడు విచక్షుణుడు కాడు" అని తెలుపుతున్నది)

ఇదే విషయాన్ని నారదపురాణం **'యాస్మిన్ జ్ఞాతే భవేద్జ్ఞాతం వాఙ్మయం స చరాచరమ్** (1.92.21) పురాణం తెలుసుకొంటే సమస్త వాఙ్మయం తెలుసుకొన్నట్టే అని తెలుపుతుంది.

అందుకే అలాంటి పురాణాలలోని విషయాల గురించి ఇక్కడ తెలుసుకొందాం.

శ్రీ బ్రహ్మ మహాపురాణ విశేషాలు

శ్రీ బ్రహ్మ మహా పురాణము

'ఆద్యం సర్వ పురాణానాం పురాణం బ్రహ్మముచ్యతే' అని అష్టాదశ పురాణాలలోను మొట్టమొదటి పురాణం బ్రహ్మపురాణం అని చెప్పబడింది.

పురాణాని దశాష్టౌ చ సాంప్రతం తదిహోచ్యతే
నామతస్తాని వక్ష్యామి శృణధ్వం మునిసత్తమాः
బ్రహ్మణాభిహితం పూర్వం యావన్మాత్రం మరీచయే
బ్రాహ్మం త్రిదశ సాహస్రం పురాణం పరికీర్త్యతే *(మత్స్య - 53 అధ్యాయం)*

పద్దెనిమిది పురాణాల పేర్లను ఇకముందు తెలుపుతున్నాను. పూర్వకాలంలో బ్రహ్మచేత మరీచునికి ఉపదేశింపబడిన ఈ పురాణంలో పదమూడు వేల శ్లోకాలు ఉన్నాయి. అని మత్స్య పురాణం తెలుపుతుండగా

బ్రాహ్మంపురాణం తత్రాదౌ సర్వలోక హితాయవై
వ్యాసేన వేదవిదుషా సమాఖ్యాతం మహాత్మనా
తద్వై సర్వ పురాణాగ్ర్యం ధర్మ కామార్థ మోక్షదమ్
నానాఖ్యానేతిహాసాఢ్యం దశ సాహస్రముచ్యతే *(నారద -92 అధ్యాయం)*

సర్వ లోకహితం కొఱకు వ్యాసునిచేత రచింపబడిన ఈ పురాణం మొదటిదిగా సర్వ పురాణాల లోను నిలిచి ధర్మ కామ అర్థ మోక్షాలను ప్రసాదిస్తుంది. దీనిలో పదివేల శ్లోకాలు ఉన్నాయని నారద పురాణము తెలుపుతున్నది.

భారతదేశంలోని వివిధ పుణ్యప్రదేశాలు, తీర్థక్షేత్ర మాహాత్మ్యాలను వర్ణించే సందర్భంలో అనేక వైదిక ఉపాఖ్యానాలు, అంటే వేదాలలో పేర్కొనబడిన ఉపాఖ్యానాలు

సందర్భోచితంగా, విస్తృతంగా బ్రహ్మ పురాణంలో వివరించబడ్డాయి. ఈ అఖ్యానో పాఖ్యానాల వాస్తవిక అర్థాలను వివరించటం సాధారణ పౌరాణికులకు అంతగా సాధ్యం కాని విషయం. అయినా ఈ పురాణంలో అవి వివరించబడి, వేదోపబృంహణం చేయబడింది. ఒక పద్ధతి ప్రకారం లేదా శాస్త్రఅధ్యయనం చేయనివారికి, ఈ ఆఖ్యానోపాఖ్యాలను వివరించటం. వాస్తవిక అర్థాన్ని తెలపటం అసాధ్యమైన పని, ఇంతే గాకుండా ఈ పురాణంలో ప్రాచీన సంస్కృత ఆర్ష ప్రయోగాలు అనేకం ఉన్నాయి.

మిత్రాక్షరకు వ్యాఖ్యానాన్ని వ్రాసిన బాలమభట్టు దీనికి ఆదిపురాణమని లేక ప్రథమ పురాణమనే పేరు ఉన్నది అని తెలిపాడు. ఈ పురాణాన్ని ఆది బ్రాహ్మం అని కూడా పిలుస్తారు. ఇందులో మరీచికి బ్రహ్మవక్తగా ఈ పురాణాన్ని బోధించినట్లు ఉన్నది. (బ్రహ్మణాభిహితం పూర్వం యావన్మాత్రం మరీచయే। బ్రాహ్మం తు దశ సాహస్రం పురాణం పరికీర్తితం) అనే పద్మపురాణ సూచనవలన ఇదే ప్రథమ పురాణంగా భావించ బడేదని నిశ్చితంగా చెప్పవచ్చు. ఇది సర్వపురాణాలలోను ప్రథమం అని భావించటం వల్లనే, దీనిని 'ఆదిబ్రహ్మ' అని కూడా పిలుస్తున్నారు. కొందరు విమర్శకులు ఇందులో విస్తృతంగా సూర్యారాధన చెప్పబడింది. కాబట్టి దీనిని సౌరపురాణం అనికూడా అంటారని తెలుపుతున్నారు. కానీ సౌరపురాణం, ఆదిపురాణం అనేవి ఉపపురాణాలలో ఉన్నవే. అవివేరు. అవి ఇది కాదు, బ్రహ్మపురాణంలోని ఉత్తర భాగాన్ని బ్రహ్మోత్తర పురాణం అని అంటారు.

పురాణాలలో బ్రహ్మ పురాణ స్థానం

విష్ణుపురాణాన్ని అనుసరించి అష్టాదశ పురాణాలలో బ్రహ్మపురాణము మొట్ట మొదటిది.

ఆద్యం సర్వపురాణానాం పురాణం బ్రహ్మముచ్యతే
అష్టాదశ పురాణాని పురాణజ్ఞాః ప్రచక్షతే *(విష్ణుపురాణం)*

అని పురాణాలు తెలుపుతున్నాయి.

దేవీ భాగవతం ప్రకారం ఇది అయిదవ పురాణము.

('మ' ద్వయం, భద్వయం చైవ బ్ర త్రయం వ చ తుష్టయం
అనాప లింగ కూస్కాని పురాణాని పృథక్ పృథక్) అనే శ్లోకం ప్రకారం.

'మ'కారంతో ప్రారంభమయ్యేవి రెండు	మత్స్య, మార్కండేయ పురాణాలు
'భ'కారంతో ప్రారంభం అయ్యేవి రెండు	భాగవత, భవిష్యత్పురాణాలు

'బ్ర'కారంతో ప్రారంభం అయ్యేవి మూడు	బ్రహ్మ, బ్రహ్మవైవర్త, బ్రహ్మాండ పురాణాలు
'వ'తో ప్రారంభం అయ్యేవి నాలుగు	వరాహ, వాయు, వామన, విష్ణు పురాణాలు
'అ'తో ప్రారంభం అయ్యే పురాణం	అగ్ని పురాణం
'నా'తో ప్రారంభం అయ్యే పురాణం	నారద పురాణం
'ప'తో ప్రారంభం అయ్యే పురాణం	పద్మ పురాణం
'లిం'తో ప్రారంభం అయ్యే పురాణం	లింగ పురాణం
'గ'తో ప్రారంభం అయ్యే పురాణం	గరుడ పురాణం
'కూ'తో ప్రారంభం అయ్యే పురాణం	కూర్మ పురాణం
'స్కా'తో ప్రారంభం అయ్యే పురాణం	స్కాంద పురాణం

పురాణానుక్రమణికను తెలియజేసే సందర్భంలో నారదపురాణంలో

'బ్రాహ్మం పురాణం తత్రాదౌ సర్వ లోకహితాయవై
వ్యాసేన వేదవిదుషా సమాఖ్యాతం' అని తెలిపింది.

విష్ణు అవయవాలలో బ్రహ్మపురాణం

అష్టాదశ పురాణములు శ్రీమహావిష్ణువు శరీరావయవములుగా వ్యాసునిచే కల్పన చేయబడినవి. పురాణ పురుషుడైన విష్ణువు శరీర అవయవాలుగా అష్టాదశ పురాణాలను పేర్కొంటున్నది పద్మపురాణం.

బ్రాహ్మం మూర్ధా హరే రేవ హృదయం పద్మ సంజ్ఞితమ్
వైష్ణవం దక్షిణో బహుః శైవం వామో మహేశితుః (పద్మ 62-2)

అని చెప్పటం చేత విష్ణువు శిరస్సుగా ఈ పురాణం భావించబడింది.

పురాణాల గణనం దాదాపు అన్ని పురాణాలలోను ఉన్నదే. వరుసక్రమం స్థానాల క్రమంలో ఆయా పురాణాలలో కొంత మత భేదం ఉన్నా, సృష్టికి మూలమైన బ్రహ్మ, ఆయన చెప్పిన బ్రహ్మపురాణం మొదట, చివరలో బ్రహ్మాండ పురాణం, మధ్యన బ్రహ్మవైవర్త పురాణం ఉండటం సముచితమే కావచ్చు. చివరగా ప్రళయంలో సృష్టి కలిసిపోవటం, అలాగే బ్రహ్మ సృష్టిలో ఆవిర్భవించిన ప్రతిదీ, బ్రహ్మ సృష్టిలోనిదే అనే బ్రహ్మవైవర్తం మధ్యలో ఉండటం కూడా సముచితమే. ఈ పురాణాలు బ్రహ్మతో ప్రారంభమైన పరిజ్ఞానం బ్రహ్మద్వారా పెరిగి ఆ బ్రహ్మలోనే లీనం కావటాన్ని సూచిస్తుంది.

బ్రహ్మపురాణంలో ఏమి చెప్పబడింది

ఇది వైష్ణవ పురాణంగా పరిగణింపబడుతున్నది. దీనిలో శ్రీమహావిష్ణువు యొక్క అవతార ప్రశస్తి, ప్రస్తుత ఉత్కళ (ఒరిస్సా) ప్రాంతంలోని పూరీలోగల ప్రసిద్ధ జగన్నాథ మాహాత్మ్యం విస్తృతంగా వర్ణించబడింది. అలాగే ఒరిస్సాలోని కోణాదిత్య లేక కోణార్క దేవాలయానికి సంబంధించిన సూర్యపూజ (ఆరాధన) విశేషంగా వివరించబడింది. ఈ భాగంలో సూర్యమహిమ, ఆయన ప్రభావము చక్కగా వర్ణించబడింది. మృత్యువు తరువాత జీవిపొందే వివిధ అవస్థలు వివరించటమే కాకుండా సాంఖ్యయోగ వివరణ కూడా విస్తృతంగా చక్కని శైలిలో చేయబడింది. జ్ఞానంతో పాటు భక్తికి కూడా ఈ వివరణలో సముచిత స్థానం ఇవ్వబడింది.

ఈ పురాణంలోని చాలా అధ్యాయాలు మహాభారతంలోని శాంతి పర్వంలోగల చాలా అధ్యాయాలతో అక్షరశః ఏకీభవిస్తున్నాయి. కలియుగ ధర్మాలను గురించి వివరించేటప్పుడు నేటి అనేక దుస్సంఘటనలు వాస్తవాలు కంటికి అద్దంలో ప్రతిబింబం కనిపించినట్లే వివరించటం జరిగింది.

బ్రహ్మపురాణం, విష్ణుపురాణం, నారదపురాణాల కంటే ముందే ఉన్నదని అందువలననే ఈ రెండు పురాణాలతో పాటు అనేక ఇతర పురాణాలు కూడా దీనిని అన్నింటి కంటే ప్రథమంగా అంటే ప్రాచీనమైనదిగా పరిగణిస్తున్నాయి.

మహాభారతం అనుశాసనిక పర్వంలో ఈ పురాణం నుంచి అనేక శ్లోకాలు గ్రహించ బడ్డాయి. వేదాలలోని ధర్మాన్ని ప్రకటీకృతం చేయటం పురాణాల ముఖ్యోద్దేశం. ఇదే వేదోప బృంహణం. అందుకే బ్రహ్మ పురాణంలో కూడా "పురాణం వర్తతే యత్రవేదశృతి సమాహితమ్" అని చెప్పబడింది.

ఇంకా బలివామనోపాఖ్యానము, అహల్యోపాఖ్యానము, పురూరవోర్వశీ సంవాదము, హరిశ్చంద్ర, శునశ్శేప ఉపాఖ్యానము, కథోపాఖ్యానము, శర్యాతి చరిత్రము, అజీగర్తో పాఖ్యానము, ఆంగిరస, శాకల్యోపాఖ్యానాలవంటి వానిని అధ్యయనం చేయటం వలన, ఋగ్వేదము, ఐతరేయ బ్రాహ్మణము వంటి వైదిక గ్రంథాలలో సంగ్రహంగా చెప్పబడిన ఆఖ్యానాలు తరువాత ఈ పురాణంలోను మరికొన్ని ఇతర పురాణాలలో విస్తృతంగా వివరింపబడ్డాయని తెలుస్తుంది. అంతేకాక ఐతరేయ బ్రాహ్మణము, శాంకాయన బ్రాహ్మణాలలో రోహితుడు అనబడే శునశ్శేపుని కథ ఎలా ఉన్నదో అదే విధంగా బ్రహ్మపురాణంలో విస్తరించి ఉన్నది. ఈ రెండిలోను ఉన్న కథా ఐక్యత ఇతర పురాణాలలో కనిపించదు.

పూర్వ ఉత్తర ఖండాలుగా విభజింపబడిన ఈ పురాణంలో 1 నుంచి 14 అధ్యాయాల వరకు పూర్వ భాగంగాను తరువాత-నుంచి 245 (246)వ అధ్యాయంవరకు ఉత్తర భాగంగాను చెప్పబడింది. అయితే ఈ భాగాల ప్రసక్తి ప్రస్తుతం తెలుగు లిపిలో ముద్రితమైన ప్రతిలో లేనేలేదు.

పురాణ ప్రథమంలో లోమహర్షణ సూతుడు శౌనకాది మహామునులకు నైమిశారణ్యంలో ఈపురాణ వృత్తాంతాన్ని వివరించటంతో కథాప్రారంభం జరుగుతుంది. అయితే బ్రహ్మ, పితృదేవులలో ఒకడైన దక్షునికి ఈ భాగం చెప్పినట్లుగా ఋషులకు లోమహర్షణుడు తెలిపినట్లు ఉన్నది. కానీ మత్స్యపురాణంలో చెప్పినట్లు మరీచుని ప్రసక్తి ఇందులో కనిపించదు. బ్రహ్మ చెప్పిన పురాణం కాబట్టి ఇది బ్రహ్మపురాణం అయింది కానీ బ్రహ్మను గురించి తెలిపిన పురాణం అయినందు వలన కాదు.

బ్రహ్మపురాణంలోని ఉత్తర ఖండం దాదాపు ఒక మాహాత్మ్యం లేక క్షేత్ర ప్రశస్తి గుణాలు ఉన్నభాగం. ఈభాగంలో బలజా నదీ వృత్తాంతం ఉన్నది. ఇది ప్రస్తుతం రాజస్థాన్‌లోని మార్వారు ప్రాంతంలోగల బనా నది వృత్తాంతం అనిపిస్తుంది. కానీ ఈ వృత్తాంతం వలన దీని రచనా కాలాన్ని గురించి దీనివలన తెలిసి వచ్చే విషయాలేమీ లేవు.

ఇందులోని పూర్వ భాగంలో సృష్టి కథనం తరువాత దక్షాది ప్రజాపతుల ఉత్పత్తి, దేవాసుర సంగ్రామము సూర్య సోమ వంశాల అనుకీర్తనము. అత్యంత సంక్షిప్తంగా ఉన్నది. చతుర్వ్యూహావతారుడైన శ్రీరామచంద్రుని వృత్తాంతము, తరువాత సోమవంశ వర్ణనలో ఆనందకందుడు, సచ్చిదానందుడైన శ్రీకృష్ణభగవానుని కథావృత్తాంతము, పార్వతి జననము, ఉమా కళ్యాణము మొదలైన విషయాలు చెప్పబడ్డాయి.

ఉత్తర భాగంలో రామావతార కృష్ణావతారాల విస్తృత కథాకథనం, వర్ణాశ్రమ ధర్మాలు, విష్ణువు బోధించిన ధర్మములు సాంఖ్యయోగం మొదలైన దర్శనాల ప్రతిపాదన ఉన్నది.

పార్వతీఆఖ్యానం చాలా విస్తారంగా 5 అధ్యాయాలలో (35వ అధ్యాయం నుంచి 40వ అధ్యాయం వరకు) సమకూర్చబడింది. మార్కండేయాఖ్యానం తరువాత (52వ అధ్యాయం నుంచి 56 వరకు) గౌతమీ గంగా, కృత్తినా తీర్థం, చక్ర తీర్థం, పుత్ర తీర్థం, యమ తీర్థం, ఆపస్తంబ తీర్థం వంటి అనేక ప్రాచీన తీర్థాల మాహాత్మ్యం గౌతమీ మాహాత్మ్యంలో భాగంగా ఇవ్వబడింది. గౌతమీ (గోదావరి) మాహాత్మ్యం 70వ అధ్యాయం నుంచి 175వ అధ్యాయం వరకు దాదాపు 106 అధ్యాయాలలో విస్తృతంగా వివరించ బడింది. (అయితే ఆ భాగం గ్రంథ విస్తర భీతిచేత ప్రస్తుతం ఈ పురాణంలో కూడా

చేర్చలేదు) శ్రీకృష్ణ భగవానుడి చరిత్ర కూడా 180వ అధ్యాయం నుంచి 212వ అధ్యాయం వరకు అంటే 32 అధ్యాయాలలో చాలావిస్తారంగా చెప్పబడింది. ఈ సందర్భంలోని కథంతా భాగవతం లోని దశమ స్కంధం కథవలెనే ఉన్నది. ఇందులో భూగోళ విశేషాలు అంత ఎక్కువ విస్తృతిని సంతరించుకొనలేదు. ఒరిస్సాలోని కోణాదిత్య (కోణార్క) తీర్థం లేక దాని సంబంధ సూర్యపూజా వర్ణనం విశేషంగా వర్ణించబడింది. 28 నుంచి-33 అధ్యాయాల వరకు ఉన్న భాగంలో సూర్యమహిమ, ఆయన ప్రభావము మొదలైన విష యాలు ఆరు అధ్యాయాలలో చెప్పబడ్డాయి.

బ్రహ్మపురాణ అంతర్భాగాలుగా ఋషి పంచమీ వ్రతకథ, కర్మవిపాక సంహిత, చంపా షష్ఠీవ్రతము, నాసికేతోపాఖ్యానము, ప్రయాగ మాహాత్మ్యము, మాయాపురీ మాహాత్మ్యము, వేంకటగిరి మాహాత్మ్యము, శ్రీరంగ మాహాత్మ్యము ఉండేవని ఒకప్రచారం ఉన్నది.

బ్రహ్మ పురాణంలో సర్గము-ప్రతిసర్గము, వంశము, మన్వంతరములు, భూమ్రాది సంస్థానము అనగా భూమి, ద్వీప, పర్వత, నదీ, సముద్ర పుణ్యతీర్థ క్షేత్రాది స్థానాలు-ఇదే భువన కోశ వర్ణనము అని పిలువబడుతుంది. విశదంగా వివరించబడ్డాయి. ఆ విధంగా ఇందులో పురాణ పంచ లక్షణాలు సుష్ఠుగా చెప్పబడ్డాయి.

ఈ పవిత్ర భారతదేశాన్ని గురించి తెలుపుతూ

పృథివ్యాం భారతం వర్షం దండకం తత్రపుణ్యదం
తస్మిన్ క్షేత్రే కృతం కర్మ భుక్తి-ముక్తి ప్రదం నృణామ్

అని సమస్త భూ మండలంలో భారతవర్షం సర్వశ్రేష్ఠ మైనదని అందునా దండకారణ్యం పుణ్యదాయకమని ఆ పుణ్యక్షేత్రంలో జరిపే కర్మలు భుక్తిముక్తి ప్రదాలని చెప్పుతున్నది. అంతేకాకుండా

తీర్థానాం గౌతమ్ - గంగాశ్రేష్ఠా ముక్తి ప్రదానృణమ్
తత్ర యజ్ఞేన దానేన భోగాన్ముక్తి రవాప్యతి - అని

ఈ దేశంలో ప్రవహించే పవిత్ర నదులలో గౌతమీ (గోదావరి), గంగలు పరమ శ్రేష్ఠాలనీ, ప్రముఖమైనవి అనే ముక్తి ప్రదాలనీ చెప్పి అక్కడ చేసే దానాలు యజ్ఞాలు భోగాలను ముక్తిని కూడా కలిగిస్తాయని ఈ పురాణంచెప్తున్నది. ఆ సమయంలోనే నదులను వర్ణిస్తూ మొత్తం 106 అధ్యాయాలలో శ్రీగౌతమీ మాహాత్మ్యాన్ని తెలియజేస్తున్నది.

సృష్టి క్రమ ప్రతిపాదనంతో ఆరంభించబడిన ఈ పురాణం నైమిత్తిక, ప్రాకృత-ఆత్యంతికరూప త్రివిధ ప్రళయా (ప్రతిసంచరా)ల క్రమాన్ని ప్రతిపాదించటంతో ముగింప

బడింది. అందువలన పురాణ ఉపక్రమ ఉపసంహారాలకు చక్కని సమన్వయం చక్కగా కుదురుతున్నది.

ప్రపంచానికి, మనుష్యునికి ఉత్పత్తి, వినాశనాలు స్వాభావికాలు. ఈ అనాది సంసారంలో పుట్టటం గిట్టటం అనే వానిలో జీవుడు చక్రనేమి క్రమంగా తిరుగుతుంటాడని తెలుసుకోటమే పురుషార్థ సిద్ధికాదు. పురుషార్థసిద్ధి ఎలాకలుగుతుందో గమనించి, పరమ పురుషార్థ సాధనంగా 235వ అధ్యాయం నుంచి 245వ అధ్యాయం వరకు 116 అధ్యాయాలలో యోగసాధనం ప్రతిపాదించబడింది. అది కూడా మునులు

ఇదానీం బ్రూహి యోగంచ దుఃఖ సంయోగ భేషజం
యంవిదిత్వా ఽ వ్యయం తత్ర యం జామః పురుషోత్తమమ్ (235-1)

అని ఇప్పుడు మాకు దుఃఖప్రాప్తి నివారణకు తగిన ఔషధమైన యోగమును చెప్పు. దానిని తెలుసుకొని అవ్యయుడైన పురుషోత్తముని చేరగలము అని అడిగిన తరువాత ఈ యోగం చెప్పబడింది. ఈ విధంగా పరమ పురుషార్థ సాధన ప్రతిపాదనంతో ఈ పురాణం ముగుస్తున్నది. యోగం తెలుపుతున్న 11 అధ్యాయాలలో యోగము సాంఖ్యాలను పరస్పరం సమన్వయంతో సమన్వయించిన విధానం చాలా ప్రశంసనీయంగా యుక్తి యుక్తంగా ఉన్నది.

శ్రీ పురీ జగన్నాథ క్షేత్రమూర్తి భగవంతుడు పురుషోత్తముడు మన దేహక్షేత్రగత క్షేత్రజ్ఞుడు కూడా, ఆ భగవంతుడే గదా. అందువలననే పురుషోత్తమ తత్త్వం భగవద్గీతలో విస్పష్టంగా ప్రతిపాదించబడింది. పరమాత్మ సర్వ క్షేత్రాలలోను ప్రవేశించినట్లుగా ఉండికూడా, ఆదోషస్పర్శ లేనివాడై నందున ఆయన ఉత్తముడే. ఆ మహాపురుషుడు పురుషోత్తముడే. ఇలా క్షరాక్షర వివేచన పూర్వకంగా పురుషోత్తమ తత్త్వాన్ని, తత్సాధనాలను బోధించే ఈ బ్రహ్మపురాణం పురాణ రాజం అనగా మహాపురాణమే అవుతుంది.

హైందవ ధర్మానుసారము ఈ దృశ్య ప్రపంచమంతా అగ్నీషోమాత్మకము. యజ్ఞాలలో దేవతలను అగ్నిద్వారమున ఆరాధించటం వలన, తత్ఫలితంగా మేఘుడు వర్షించగా, చంద్రునిద్వారా ఓషధులు ఫలించగా, లభించిన అన్నంచేతనే ప్రాణులు ఉత్పన్నాలై వృద్ధి చెందుతాయని, శ్రుతులు శాస్త్రాలు తెలుపుతున్నాయి. ఇదే విషయం ఈ పురాణంలో సృష్టి క్రమ ప్రతిపాదన సమయంలో చెప్పబడింది.

ప్రజాపతి పరంపరలోని వారైన ప్రాచేతసులు, తాము రాజులైనా, ప్రజాపరిపాలనాన్ని వర్జించి తీవ్ర తపస్సు చేయసాగారు. ఆ తపోగ్నిచేత, ఓషధీతతులు మాడగా, ప్రజలకు

అన్నం లేకుండా పోయింది. దానిని చూచి సోముడు తన కన్య అయిన మారిషను ప్రచేతులకు ఇచ్చి వివాహం చేశాడు. ఆ ప్రాచేతనులకు మారిషకు జన్మించినవాడే దక్షుడు. ఇచ్చట ప్రచేతులు అగ్నిఅంశము. మారిషసోమాంశము వారి కుమారుడు దక్షుడు. అతని నుండి ప్రజావృద్ధి జరిగింది. ఈ క్రమము అన్ని పురాణాలలోను చెప్పబడిందే. అలాగే ఇందులోనూ ఉన్నది.

అగ్ని సోముల సమాహార (కలసిన) రూపమే ఆదిత్యుడు. అతడు ప్రకాశించు పగటి కాలంలో అగ్ని, సోముడు తమ ప్రకాశాన్ని చూపలేరు. కాని సూర్యుడు తనలోని అగ్న్యంశముచేత భూతకోటికి ప్రాణశక్తిని అందిస్తాడు. అందుచేత భూతములకు శ్రమ, తాపము కలుగుతుంది. రాత్రులందు సోముడు భూతముల శ్రమను, తాపాన్ని తొలగించి జీవశక్తినిచ్చి పోషిస్తున్నాడు. అగ్ని, సోముడు రాత్రులలో తమ ప్రకాశాన్ని బాగా చూప గలగడం ప్రత్యక్షమే కదా. కాబట్టియే ఆదిత్యుడిని పరమాత్మునిగా ఉపాసించటం భారతీయుల సంప్రదాయం. ఈ సూర్యుడే ప్రాణుల దేహంలో ముఖ్య ప్రాణతత్త్వంగా ఉన్నాడని ఛాందగ్యోపనిషత్తు ప్రథమాధ్యాయంలో చెప్పబడింది. ఇవే అంశాలు బ్రహ్మ పురాణం 32, 179అధ్యాయాలలో చెప్పబడింది. ఇదేవిషయం ఋగ్వేదం 1వ మండలంలో 164వ 'అస్యకామస్య' అనే సూక్తంలో ప్రతిపాదించబడింది. ఈ విధంగా బ్రహ్మపురాణం వేదోపబృంహణం చేస్తున్నది. పురాణ ముఖ్య తత్త్వం ఇదే కదా!

వేరొక బ్రహ్మపురాణం

పైన చెప్పిన విషయాలతో గాక సుమారు 8 వేల శ్లోకాలతో ఇంకొక బ్రహ్మపురాణం ఉన్నదని, అది దాదాపు ఈ పురాణ విషయాలతో ఏకీభవిస్తున్నదని తెలుస్తున్నది. అయితే అది ఇది కాదు. కానీ ఉపపురాణాలలో ఒక ఆదిపురాణం పేర్కొనబడింది. తెలుగులో సర్వ దేవుని ఆదిపురాణం నుంచి అని ప్రబంధ రత్నాకరంలో ఒక పద్యంకూడా లభిస్తున్నది. ఈ తెలుగు ఆదిపురాణం అలభ్యం.

బ్రహ్మపురాణం ఎటువంటి పురాణం

బ్రహ్మ పురాణం అనగానే ఈ పురాణంలో త్రిమూర్తులలో ఒకడైన బ్రహ్మదేవునికి సంబంధించిన విషయాలు ఇందులో ఉంటాయని ఈ పురాణం భావించటం జరుగుతుంది కానీ వాస్తవానికి ఇది మహావిష్ణువు యొక్క మాహాత్మ్యాన్ని తెలియజేస్తున్నది. అందుకే పురాణ వర్గీకరణంలో కూడా ఇది వైష్ణవ పురాణశాఖలో చేర్చబడింది.

ఇది బ్రహ్మ మాహాత్మ్య ప్రతిపాదక పురాణమని చెప్పబడినా వాస్తవానికి త్రిమూర్తులలోని బ్రహ్మ మాహాత్మ్యాన్ని తెలిపే అంశం ఏదీ ఇందులో లేదు. బ్రహ్మమాహాత్మ్య ప్రతిపాదకమని స్కందపురాణం తెలుపుతున్నా ఇందులోని 245వ అధ్యాయంలో

పురాణం వైష్ణవం త్వేతత్సర్వం కిల్బిషనాశనమ్
విశిష్టం సర్వశాస్త్రేభ్యః పురుషార్థోప పాదకమ్ (246 -20)

అని స్వయంగా తెలుపుకుంటున్నది.

ఈపురాణం విష్ణు పారమ్యాన్ని ప్రతిపాదిస్తూ ధర్మార్థకామమోక్షాలనే పురుషార్థ చతుష్టయాన్ని ప్రతిపాదిస్తుందని అందుచే అని తానే స్వయంగా చెప్పుకొంటున్నందున ఇది వైష్ణవ పురాణంగానే పరిగణింప బడుతున్నది.

బ్రహ్మ పురాణం ప్రారంభంలోనే (1-1, 2, 3) హరి అనబడే విష్ణువును స్తుతిస్తూ ఉన్న శ్లోకాలను అనుసరించి ఇది వైష్ణవ పురాణమని చెప్ప వచ్చును. కానీ పద్మపురాణంచేసిన వైష్ణవ, శైవ, శక్తి విభాగాలలో ఇదివైష్ణవ పురాణ మని చెప్పటంలేదు. పైగా ఇది శాక్తపురాణమని చెప్పబడింది. పైగా ఇది రాజస గుణ ప్రధాన పురాణమని పేర్కొంటున్నది.

వ్యాసుడు గ్రంథకర్త

బ్రహ్మపురాణంలో హరిశ్చంద్ర వరుణ సంవాదంలో **'నిదర్శే పునరభ్యేత్య యజస్వేత్యాహతం నృపమ్'** అని ఉంటే ఐతరేయ బ్రాహ్మణంలో కూడా **'తం హోవాచ నిర్దేశో అనృభూద్ యజస్వ మానేనేతి'** అని ఉన్నది. సాయణ భాష్యం ప్రకారం దీని అర్థం పద సంఖ్యగల నిర్దేశించబడిన అశౌచదినములు పశువులకు వలెనే, చెప్పవలెను అని చెప్తున్నది. వీటి అన్ని ఆధారాలను బట్టి వ్యాసుడే దీనిని సర్వ ప్రథమ పురాణంగా నిర్మించాడనుట నిశ్చయము.

బ్రహ్మపురాణం ఏ వర్గీకరణ క్రిందకు వస్తుంది?

బ్రహ్మపురాణ వర్గీకరణము : పురాణాలను మూడు విధాలుగా వర్గీకరించే విధానం ఒకటి ప్రచారంలో ఉన్నది.

మత్స్యపురాణంలో

సాత్త్వికేషు పురాణేషు మాహాత్మ్యమధికం హరేః
రాజసేషు చ మాహాత్మ్యమధికం బ్రహ్మణో విదుః

తద్వదగ్నేశ్చ మాహాత్మ్యం తామసేషు శివస్యచ
సంకీర్ణేషు సమస్వత్యాః పితృణాంనిగద్యతే - మత్స్య అ. 53-67,68.

సాత్త్విక రాజస తామస భేదంచే పురాణాలు మూడు విధాలు : సాత్వికాలలో విష్ణు మహాత్మ్యము, రాజసాలలో బ్రహ్మగ్నుల మాహాత్మ్యము, తామసాలలో శివమాహాత్మ్యము అధికంగా వర్ణింపబడింది. సరస్వతి పితృగణములు-వీరి మాహాత్మ్యం నాలుగవ సంకీర్ణ పురాణాలలో అధికం.

పద్మ పురాణం

మాత్స్యం కార్మింతథా లైంగం వైశం స్కాందం తథ్యైవచ
ఆగ్నేయం చషడేతాని తామసాని నిబోధమే
వైష్ణవం నారదీయంచ తథా భాగవతం శుభం
గారుడంచతథా పాద్మం వారాహం శుభదర్శనే
సాత్త్వికాని పురాణాని విజ్ఞేయాని శుభానివై
బ్రహ్మాండం, బ్రహ్మవైవర్తం, మార్కండేయం తథైవచ
భవిష్యం, వామనం, బ్రహ్మం రాజసాని నిభోధయే. *(పద్మ-ఉత్తర-263-81 నుంచి 84)*

పై ఆధారం ప్రకారం విష్ణు, నారద, భాగవత, గరుడ, పద్మ, వరాహ పురాణాలు సాత్త్వికాలు, బ్రహ్మాండ, బ్రహ్మవైవర్త, మార్కండేయ, భవిష్య, వామన బ్రహ్మపురాణాలు రాజసపురాణాలు. మత్స్య కూర్మ లింగ శివ స్కంద అగ్ని పురాణాలు తామస పురాణాలు.

అయితే ఈ విభజనను సర్వపురాణాలు తమకు సమ్మతంగా స్వీకరించడం లేదు.

శివభక్తి ప్రతిపాదితమైన వాయుపురాణం సాత్త్వికమని గరుడపురాణం చెప్పుతున్నది.

స్కాందపురాణం కేదార ఖండంలో

అష్టాదశ పురాణేషు దశభిర్గీయతే శివః
చతుర్భిర్భగవాన్ బ్రహ్మాద్వాభ్యాం దేవతథా హరిః అని చెప్పబడింది.

దీని ప్రకారం శివ పురాణాలు పది, బ్రహ్మవి నాల్గు, దేవివి రెండు, హరివి రెండని చెప్పబడింది కాని అవి ఏవో ప్రత్యేకంగా వివరించలేదు.

ఇదే స్కాందం శివరహస్య ఖండంలోని సంభవకాండలో (2-30-38) ఇంకొక రకమైన పురాణ విభజన ఉన్నది. అవి.

1. **శైవ పురాణాలు :** శివ విషయకములు. పది : శివ, భవిష్య, మార్కండేయ, లింగ, వరాహ, స్కంద, మత్స్య, కూర్మ, వామన బ్రహ్మాండ పురాణాలు.
2. **వైష్ణవ పురాణాలు :** విష్ణు విషయకములు : నాలుగు - విష్ణు భాగవతం, నారదీయ గరుడ పురాణాలు.
3. **బ్రహ్మ పురాణాలు :** బ్రహ్మ విషయకములు రెండు - బ్రహ్మ, పద్మ పురాణములు.
4. **ఆగ్నేయపురాణం :** అగ్ని విషయకం ఒకటి - అగ్ని పురాణం.
5. **సావిత్రి పురాణం :** సూర్య విషయకం, ఒకటి - బ్రహ్మవైవర్త పురాణం.

ఇవి గాక మరో రకం వర్గీకరణం ఉన్నది. పురాణ పంచ లక్షణాలను బట్టి పురాణాలను ప్రాచీన, ప్రాచీనోత్తరాలు అని విభజింపవచ్చును.

వాయు, బ్రహ్మాండ, మత్స్య, విష్ణుపురాణాలు ప్రాచీనాలు. వీటిల్లో సృష్టి, ప్రళయం, వంశం, మన్వంతరం, వంశానుచరితం అన్న పంచలక్షణాలు సముచితంగా ఉన్నాయి. ఇతరాలు ప్రాచీనోత్తరాలు. ఇందులోనే బ్రహ్మపురాణం చేరుతుంది.

తమిళ గ్రంథాలలో పురాణాలు ఐదు వర్గాలుగా విభజింపబడ్డాయి. ఆ ప్రకారం

1. **బ్రహ్మాలు :** బ్రహ్మకు సంబంధించినవి - బ్రహ్మ పద్మ పురాణాలు.
2. **సౌరాలు :** సూర్య సంబంధాలు - బ్రహ్మవైవర్తం.
3. **అగ్న్యాలు :** అగ్ని సంబంధాలు - అగ్నిపురాణం.
4. **శైవాలు :** శివ సంబంధమైనవి - శివ, స్కంద, లింగ, కూర్మ, వామన, వరాహ, భవిష్య, మత్స్య, మార్కండేయ, బ్రహ్మాండాలు.
5. **వైష్ణవాలు :** విష్ణు సంబంధమైనవి - నారద, భాగవత, గరుడ, విష్ణుపురాణాలు.

ఆధునిక విమర్శకులు వేరొక పురాణవర్గీకరణం చేస్తున్నారు. ఈ వర్గీకరణం పురాణంలో చెప్పడిన విషయాన్ని అనుసరించి ప్రధానంగా చేసినది. అది.

1. **విశ్వకోశవర్గం :** ఈ వర్గంలోని పురాణాలలో మానవ సమాజానికి ఉపయోగించే ఆధ్యాత్మిక, భౌతిక, సమస్త విద్యల సారాంశం ఉంటుంది. ఇవి నేటి విజ్ఞాన కోశాలు లేక సర్వస్వాలవంటివి. అగ్ని, గరుడ, నారదీయ పురాణాలు ఈ వర్గానికి చెందినవి.
2. **తీర్థవ్రత ప్రధాన వర్గం :** ఈ వర్గంలోని పురాణాలలో తీర్థాలను, వ్రతాలను వర్ణించే పురాణాలు వస్తాయి. అయితే ఇవి అన్ని పురాణాలలోనూ కొద్దో గొప్పో ఉన్నాయి.

అయినా, ప్రాధాన్యం బట్టి పేరు అనే నిర్ణయం ప్రకారం ఆయా విషయాలు అధికంగా చెప్పినవిగా భావించాలి. పద్మ, స్కంద, భవిష్య పురాణాలు ఈ వర్గంలోకి వస్తాయి.

3. **రెండేసి సంస్కరణలు పొందిన వర్గం :** ఈ వర్గంలో రెండేసిమార్లు సంస్కరణలు పొందిన పురాణాలు వస్తాయి. ఇందులోని పురాణ కేంద్ర భాగాలు ప్రాచీనమైనవే అయినా వాటి తరువాత సంస్కరణ జరిగి, ముందూ వెనుకా కొన్ని భాగాలు చేర్చబడినట్లు భావించ బడుతున్నవి. బ్రహ్మ, భాగవత, బ్రహ్మవైవర్త పురాణాలు ఈ వర్గం క్రిందికి వస్తాయి.
4. **చారిత్రక విషయ వర్గం :** ఈ వర్గంలో కలియుగంలోని రాజుల చరిత్రలు విశేషంగా ఉన్న పురాణాలు వస్తాయి. అవి వాయు, బ్రహ్మాండ పురాణాలు. ఇవి రెండూ ఒకప్పుడు ఒకటిగానే ఉండేవి అనే అభిప్రాయం కూడా ఉన్నది.
5. **సంప్రదాయిక పురాణ వర్గం :** పురాణ సంప్రదాయాన్ని పూర్తిగా అనుసరించేవి ఈ పురాణాలు. లింగ, వామన, మార్కండేయ పురాణాలు.
6. **ప్రథమ స్వరూప భిన్న వర్గం :** తొలుతటి స్వరూపం పూర్తిగా మారిపోయిన పురాణాలు ఈ వర్గంలోకి వస్తాయి. వరాహ, కూర్మ, మత్స్య పురాణాలు.

వాస్తవంలో అనేక భిన్న విషయ సమాకలితాలైన పురాణాలను సర్వాంగీకారంగా వర్గీకరించడం వీలుకానిపని.

బ్రహ్మపురాణం - శ్లోక సంఖ్య

నారద, మార్కండేయ, దేవీ భాగవతములను అనుసరించి దీనిలో పదివేల శ్లోకములే ఉన్నాయి. కానీ లింగ, వారాహ, కూర్మ పురాణము మొదలైన ప్రకారము దీనిలోని శ్లోక సంఖ్య పదమూడు వేలు. 1984లో శ్రీ వేంకటేశ్వర ఆర్షభారతి ట్రస్టు, హైదరాబాద్ వారిచే మూలము తెలుగు తాత్పర్యముతో తెలుగు అక్షరములు ముద్రింపబడిన (తాత్పర్య కర్తలు 1-223 అధ్యాయాలు-శ్రీ కల్లూరి వేంకట సుబ్రహ్మణ్య దీక్షితులు, 224 నుంచి 246 అధ్యాయాలు శ్రీ పాతూరి సీతారామాంజనేయులు గారు) బ్రహ్మపురాణంలో మొత్తం 13,783 శ్లోకాలున్నట్లుగా నిర్ధారింపబడింది. ఆనందాశ్రమ సంస్కృత ప్రతికూడా ఈ సంఖ్యను నిర్ధారిస్తున్నది. కొన్ని ప్రతులలో పదివేల ఏడు వందల శ్లోకాలే ఉన్నాయి. అందరు ప్రకటన కర్తలు, పండితులు దీనిలో 245 అధ్యాయాలున్నాయని చెబుతుండగా ఈ తెలుగు అక్షరములుగల ప్రతిలో శ్రవణ, పఠన కర్తల ఫల ప్రాప్తి కథనము అనే 246వ అధ్యాయం ఉన్నది.

'నానాఖ్యానేతి హాసాఢ్యం దశసాహస్ర ముచ్యతే', నారదపురాణం చెప్పిన దానిని అనుసరించి ఈ పురాణంలో పదివేల శ్లోకాలు ఉన్నాయి. ఈ శ్లోక సంఖ్యనే విష్ణు, శివ, స్కంద పురాణంలోని రేవాఖండం, బ్రహ్మవైవర్త భాగవత, మార్కండేయ పురాణాలు బలపరుస్తున్నాయి. దేవీ భాగవతం కూడా **'తథాచ అయుత సంఖ్యాకం పురాణం బ్రహ్మ సంజ్ఞికం'** (2-3-5) అని తెలుపుతున్నది. ఆ యుతం అంటే పదివేలు అని అర్థం. ఈ సంఖ్య కొన్ని బ్రహ్మ పురాణ ప్రతులతో దాదాపుగా ఏకీభవిస్తున్నది.

ఈ పురాణము **(ఏతద్ బ్రహ్మ పురాణం తు భాగద్వయ సమాచితమ్)** నందు రెండు విభాగములు కలవు. పూర్వభాగము, ఉత్తర భాగము. రెండింటి యందు కలిపి 245 అధ్యాయములు గలవు.

దీనిలో 25,000 శ్లోకాలున్నాయనే అగ్ని పురాణవచనం వేరెవ్వరిచేత పేర్కొనబడ లేదు. అయితే వేంకటేశ్వర ఆర్షభారతీ ట్రస్టు వారు తెలుగు లిపి తాత్పర్యంతో ప్రచురించిన అగ్ని పురాణంలో (272వ అధ్యాయం 1, 2)

బ్రహ్మణాభిహితం పూర్వం యావన్మాత్రం మరీచయే
లక్షార్ధంతు తబ్రాహ్మం లిఖిత్వా సంప్రదాపయేత్

అని 'మరీచికి చెప్పిన ఏబది వేల శ్లోకములుగల బ్రహ్మ పురాణము వ్రాసి' అని చెప్పినందువలన ఇందులో యాభై వేల శ్లోకాలు ఉండాలని ఇదే సందర్భంలో **'పాద్మం ద్వాదశ సాహస్రం'** అని యాభైవేల శ్లోకాలు ఉండవలసిన పద్మ పురాణాన్ని పన్నెండు వేల శ్లోకాలే అని తెలుపుతున్నది. ఇది లేఖక ప్రమాదం కావచ్చు.

కానీ మత్స్యపురాణం.....

బ్రాహ్మంత్రిదశసాహస్రం పురాణం పరికీర్త్యతే (ప్రాచీన కాలంలో బ్రహ్మ మరీచికి చెప్పిన ప్రపంచ వృత్తాంతమంతా బ్రహ్మపురాణం ఇందులో పదమూడు వేల శ్లోకాలు ఉన్నాయి.) అని తెలుపుతున్నది. లింగ, వారాహ, కూర్మ, పద్మ పురాణాలు బ్రహ్మపురాణంలో పదమూడు వేల శ్లోకాలనే సంఖ్యను నిర్ధారిస్తున్నాయి. ముద్రితాలైన కొన్ని బ్రహ్మపురాణ ప్రతులలో ఈ సంఖ్యలో శ్లోకాలు లేవు. కాలాంతరంలో ఈ పురాణంలో అనేక మార్పులు చేర్పులు ప్రక్షిప్తాలు చోటు చేసుకున్నాయని కొందరు పండితులు భావిస్తున్నారు. అందువలననే దాదాపు అన్ని పురాణాలలోను శ్లోక సంఖ్యలలో మార్పు ఉన్నదని భావించ బడుతున్నది. పురాణాలలో కనిపిస్తున్న ఈ న్యూనాధిక శ్లోక సంఖ్యా వ్యత్యాసాలు లేఖక

ప్రమాదాలవలన జరిగినవా లేక ఎక్కువ అభిమానంవలన సాంప్రదాయికవాదుల చేతి చొరవ వలన జరిగిందా అనే విషయాన్ని నిర్ధారించటం అంత తేలికైన విషయం కాదు.

పూర్వ భాగంలోని ముఖ్య విషయాలు :

దేవా నా మసురాణాఞ్చ యత్రోత్పత్తిః ప్రకీర్తితా
ప్రజాపతీ నాఞ్చ తథాదక్షాదీనాం మునీశ్వర
తతో లోకేశ్వర స్యాత్ర సూర్యస్య పరమాత్మనః
వంశానుకీర్తనం పుణ్యం మహాపాతకనాశనమ్
తత్రావతారః కథితః పరమానన్ద రూపిణః
శ్రీమతో రామచంద్రస్య చతుర్వ్యూహావతారిణః
తతశ్చ సోమవంశస్య కీర్తనం యత్ర వర్ణితమ్
కృష్ణస్య జగదీశస్య చరితం కల్మషాపహమ్
ద్వీపానాఞ్చైవ సింధూనాం వర్షాణాఞ్చాప్య శేషతః
వర్ణనం యత్ర పాతాళ స్వర్గాణాఞ్చ ప్రదృశ్యతే
నరకాణాం సమాఖ్యాతే సూర్యస్థితి కథానకమ్
పార్వతాశ్చత థాజన్మ వివాహశ్చ నిగద్యతే
దక్షాఖ్యానం తతః ప్రోక్తమేకామ్ర క్షేత్రవర్ణనమ్
పూర్వభాగోఽ య ముదితః పురాణస్యాస్య మానదః

అంటే స్పష్టంగా చెప్పబడపోయినా, మొదటినుంచి నలుబది ఒకటవ అధ్యాయము వరకు పూర్వభాగం అని చెప్పవచ్చును. ఇక

ఉత్తర భాగంలోని ప్రధాన విషయాలు :

అస్యోత్తరే విభాగే తు పురుషోత్తమ వర్ణనమ్
విస్తరేణ సమాఖ్యాతం తీర్థయాత్రా విధానతః
అత్రైవ కృష్ణచరితం విస్తరాత్ సముదీరితమ్
వర్ణనం మమ లోకస్య పితృశ్రాద్ధ విధిస్తథా
వర్ణాశ్రమాణాం ధర్మాశ్చ కీర్తితాయత్ర విస్తరాత్
విష్ణుధర్మయుగాఖ్యానం ప్రళయస్యచ వర్ణనమ్
యోగానాం చ సమాఖ్యానం సాంఖ్యానా ఞ్చాఽ పి వర్ణనమ్
బ్రహ్మవాద సముద్దేశః పురాణస్య చ సంశనమ్

ఏతద్ బ్రహ్మ పురాణన్తు భాగద్వయ సమాచితమ్
వర్ణితం సర్వపాపఘ్నం సర్వ సౌఖ్యప్రదాయనమ్

అని 42వ అధ్యాయయం నుంచి 240వ అధ్యాయం వరకు అంటే సాంఖ్య విధి నిరూపణం వరకు పై సూచనలు పేర్కొంటున్నాయి. అంటే దాదాపు ప్రస్తుతం లభిస్తున్న బ్రహ్మ పురాణం పూర్తిగా చెప్పబడిందన్న మాట.

బ్రహ్మపురాణ శ్లోక సంఖ్య సమన్వయం :

బ్రహ్మణాభిహితం పూర్వం యావద్మాతం మరీచయే
బ్రాహ్మం త్రిదశ సాహస్రం పురాణం పరికీర్త్యతే (మత్స్య 53-13)

వేదకాలంలో గురు శిష్య సంప్రదాయం ద్వారా వచ్చిన ఈ పురాణంలో పదమూడు వేల శ్లోకాలు ఉండి ఉంటాయి. కానీ వేదవ్యాసుడు బ్రహ్మపురాణాన్ని సంకలనం చేసినప్పుడు కేవలం అర్థప్రాధాన్యం దృష్ట్యా అదే పురాణం పదివేల శ్లోకాలలో ఇమిడిపోయి ఉండవచ్చు. అందు వలననే మత్స్యపురాణం ద్వారా స్పష్టంగా బ్రహ్మ-మరీచుల సంవాదాత్మకంగా ఈపురాణం వివరించబడిందని తెలుస్తున్నా పూర్వం ఉన్న శ్లోక సంఖ్యే ఇవ్వబడింది. అయితే దేవీభాగవత రచనా కాలానికి వేదవ్యాసుని ద్వారా సంకలితం అయినందు వలన పదివేల శ్లోకాలే ఉన్నాయి. అందువలన కాలభేదం వలన ఈ రెండు సంఖ్యలలోని ప్రతిపత్తిలేదు అని పండిత మాధవాచార్యశాస్త్రి తెలుపుతున్నారు. కానీ ఉపలబ్ధం అవుతున్న బ్రహ్మపురాణంలో ఏడువందల శ్లోకాలు అధికంగా ఉన్నాయని అవి తరువాత ప్రక్షిప్తం అయి ఉండవచ్చని మాధవాచార్యశాస్త్రి భావన కావచ్చు. వాయు, భాగవత, నారద, బ్రహ్మవైవర్త, దేవీ భాగవత పురాణాలను అనుసరించి బ్రహ్మ పురాణంలో పదివేల శ్లోకాలే ఉండాలి. కానీ మత్స్యపురాణాన్ని అనుసరించి ఇందులో పదమూడు వేల శ్లోకాలు ఉన్నాయి. అగ్ని పురాణాన్ని అనుసరించి 25,000 శ్లోకాలు ఉన్నాయి. ఇంకొక పాఠాన్ని అనుసరించి దేవీభాగవతం, మత్స్యపురాణంలో పదివేల ఏడువందల శ్లోకాలు ఉన్నాయని చెప్పిందట అయితే ఇది సరియైన సంఖ్య కాదని పురాణజ్ఞుల భావన. ఆనందాశ్రమ ప్రతిని అనుసరించి ఇందులో 13,761 శ్లోకాలు ఉన్నాయి. ఈ ఆనందాశ్రమ ప్రతిలో బ్రహ్మ, దక్షులు కథా ప్రాసంగీకులుగా (వక్త్ర, శ్రోతలు) ఉన్నది. కానీ నారదపురాణాన్ని అనుసరించి వీరు సూత, శౌనకాది మహర్షులు అలాగే మత్స్య, అగ్ని, స్కాంద పురాణాలను అనుసరించి వక్త్ర శ్రోతలు బ్రహ్మ-మరీచులు. లభ్యం అవుతున్న వివాదాస్పద బ్రహ్మపురాణంలో శ్రీరాముని కథావృత్తాంతం లేదు కానీ నారద పురాణం ఇది ఉన్నట్లుగా తెలుపుతున్నది.

అలాగే నారద పురాణంలో 106 అధ్యాయాలలో (70 నుంచి 175 అధ్యాయాల వరకు) చెప్పబడిన గౌతమీ మాహాత్మ్యం బ్రహ్మ పురాణంలోని భాగమని చెప్పలేదు. ఈ విధంగా ప్రస్తుతం లభ్యం అవుతున్న బ్రహ్మ పురాణానికి నారద పురాణంలో చెప్పబడిన బ్రహ్మపురాణానికి చాలా భేదాలు ఉన్నాయి. మొత్తం మీద ఈ పురాణంలోని శ్లోక సంఖ్య మీద కొంత గందరగోళం ఉన్నది.

బ్రహ్మపురాణం వక్త, శ్రోత పరంపర

నారద పురాణంలో బ్రహ్మపురాణానికి సంబంధించిన విషయాలు 92 నుంచి 109 అధ్యాయాలలో ఉన్నాయి. ఆయా పురాణాలలోని విషయాలను వర్ణిస్తూ, అందులో చెప్పబడిన విషయాలు కూడా తెలియజేయబడ్డాయి.

18 పురాణాల కర్తృత్వం వ్యాసునిదే అని పురాణాలు దాదాపుగా (మత్స్య, స్కంద, భవిష్య, శివ) ఘోషిస్తున్నా, భవిష్య పురాణంలో మాత్రం వివిధ పురాణ కర్తలను గురించి ఒక సందర్భంలో కొంత తేడా కనిపిస్తున్నది. దాని ప్రకారం

విష్ణు పురాణం	పరాశరునిచేత
స్కంద పురాణం	శివునిచేత
పద్మ పురాణం, బ్రహ్మ పురాణం	ఈ రెండూ బ్రహ్మచేత
గరుడ పురాణం	విష్ణువుచేత
భాగవతం	శుకునిచేత
మత్స్య, కూర్మ, నృసింహ, వామన, శివ, వాయు పురాణాలు	వ్యాసునిచేత
మార్కండేయ, వరాహ పురాణాలు	మార్కండేయునిచేత
ఆగ్నేయ లేక అగ్ని పురాణం	ఆంగీరసునిచేత
లింగ, బ్రహ్మాండ పురాణాలు	తండిమహర్షిచేత
భవిష్య పురాణం	మహాదేవునిచేత

కూర్చబడినట్లు తెలుపుతున్నది (భవిష్య – ప్రతిసర్గ పర్వం – III 28.10-15)

నారద పురాణం పురాణాల పేర్లను చెప్పటమేగాక, ఆయా పురాణాలలో చెప్పిన విషయాలను కూడా కొంతవరకు తెలుపుతున్నది.

వక్త శ్రోతలలో బ్రహ్మ దక్షునికి ఈపురాణం వివరించినట్లు, కొన్నింటిలోను బ్రహ్మ మరీచికి వినిపించినట్లు మరికొన్నింటిలోను చెప్పబడింది. కొందరు ఈ రెండు వేరువేరు బ్రహ్మ పురాణాలని భావిస్తున్నారు. కానీ ఈపురాణం 26వ అధ్యాయంలోని 36వ శ్లోకంలో

మరీచ్యాద్యాస్తదాదేవం ప్రణిపత్య పితామహమ్
ఇమమర్థ మృషివరా! పప్రచ్ఛుః పితరం ద్విజాః అని చెప్పిన విషయాన్ని

అనుసరించి మరీచుడు కూడా బ్రహ్మపుత్రుడే అని ఆ బ్రహ్మ చెప్పినదే నేను తెలుపుతున్నానని అనటంచేత తెలుసుకొనవచ్చు.

అలాగే ధ్యాన శ్లోకాలు అయిన తరువాత శౌనకాది మహామునులు నైమిశారణ్యంలో ఉండగా, అచ్చటికి వ్యాస శిష్యుడైన లోమహర్షణ సూతుడు వచ్చాడని, ఋషులు ఆయనను, ఈ సమస్త ప్రపంచపు ఉత్పత్తి, ఉనికి, మొదలైన విషయాలను తెలుపమని ప్రార్థించగా వ్యాసునివలన సమస్త పురాణాలను అధ్యయనంచేసి ఉన్న లోమహర్షణుడు వారికి (బ్రహ్మ పురాణాన్ని దక్షునికి, ఇతర పితృ దేవతలకు ఒకానొకప్పుడు బ్రహ్మ ఉపదేశించిన పురాణాన్ని తాను వారికి తెలుపుతున్నానని చెప్పాడు.

ఇక్కడే మనకు వక్తృ శ్రోత్వ పరంపరలో మత్స్య పురాణం నుంచి విభేదించటం కనిపిస్తుంది. మత్స్యపురాణంలో బ్రహ్మ మరీచికి ఈ పురాణాన్ని బోధించినట్లు చెప్పబడింది. ఈ మరీచి పితృ దేవతలలో ఒకడైనా దక్షుని కంటే భిన్నుడు గదా!

ఈ పురాణంలో రెండు స్థలాలలో వరాహపురాణం పేర్కొనబడింది. ఇలా ఒక పురాణంలో మిగిలిన పురాణాలను పేర్కొనటం పురాణ వాఙ్మయములో సర్వ సాధారణమే.

బ్రహ్మపురాణం ఉత్తర ఖండంలో 37 అధ్యాయాల భాగానికి వక్తృ శ్రోతలు శౌనకుడు-శతానీకుడు తరువాత వారు అగస్త్యుడు-సుప్రతీకుడు.

వేదాలలో బ్రహ్మపురాణ ప్రశంస

వేదాలలో బ్రహ్మపురాణ ప్రశంస కనిపిస్తున్నది.

1. బ్రహ్మజ జ్ఞానం ప్రథమమ్ (యజు : 13-3)
2. తేనిచి కుర్బ్రహ్మ పురాణ మగ్ర్యయమ్ (బృహదారణ్యకోపనిషత్తు 6-3-18) అనగా ప్రథమమైన లేక ప్రథమపురాణం పేరు బ్రహ్మపురాణం. ఆ బ్రహ్మపురాణమే మొదటి పురాణమని ఆ ఋషులు తెలిపియే ఉన్నారు.

ఈ విషయం వేదకాలం నాటికే బ్రహ్మపురాణం రచింపబడిందని తెలుపుతుంది.

బ్రహ్మపురాణంలో వేదోప బృంహణం

'పురాణ పూర్ణచంద్రేణ శ్రుతిజ్యోత్స్నాః ప్రకాశితాః' (మహాభారతం)

వేదం అనే వెన్నెల పురాణం అనే పూర్ణచంద్రుని వలననే ప్రకాశింపబడుతుంది. దీనిని బట్టి ఇతిహాస పురాణాల ద్వారానే వేదార్థము యొక్క ఉపబృంహణం జరుగుతుంది. ఆ విధిని బ్రహ్మపురాణం కూడా సంపూర్ణంగా నెరవేర్చింది. వేదంలోని ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలు పురాణాల ద్వారా ప్రచారంలోకి రావటమే కాదు. వేదమంత్రాలు కూడా సందర్భోచితంగా ఉపయోగించుకోబడ్డాయి.

పురాణాలలో వైదికానుష్ఠానం ప్రతిపాదించబడుతుంది. ఈ వైదికానుష్ఠానం సామాన్య ప్రజాజీవితానికి సంబంధించినది. యజ్ఞాలు 1. శ్రౌత యజ్ఞాలని; 2.గృహ్య యజ్ఞాలని రెండు విధాలు. శ్రౌత యజ్ఞాలు నేడు అప్రస్తుతం అయిపోయినందు వలన, గృహ్య యజ్ఞాలే నిర్వహించ బడుతున్నాయి. గృహ్య యజ్ఞాలలో దేవ బలులు, పూజలకు, సంబంధించిన విషయాలే ఎక్కువగా లభ్యం అవుతున్నాయి. అందువలన ఆయా విషయాలను అనుకరించేటప్పుడు వైదిక మంత్రాలు పురాణాలలో ఉపయోగించ బడతాయి. ఈ మంత్రాలు కొన్ని ప్రతీక రూపంగా ఉండగా కొన్ని పూర్తి రూపాలతో పేర్కొనబడి ఉంటాయి. అలాగే అక్కడక్కడ తీర్థాల వర్ణనలో పవిత్రతను సూచించటానికి ప్రాచీన వైదిక ఆఖ్యానాలను కూడా వివరించడం జరుగుతుంది. అందువలన వానిలో వైదిక మంత్రాలు కూడా పేర్కొనబడతాయి. ఇవి వైదిక సంహితలతో ఆయా సందర్భాలలో వివిధ దేవతామూర్తుల వర్ణనలో పేర్కొనబడినట్లే ఉంటాయి. ఇలాంటి వైదిక మంత్రాలను ఉపయోగించటం బ్రహ్మపురాణంలో చాలా సందర్భాలలో కనిపిస్తుంది.

పురాణములు వేదోపబృంహణార్థము ఉద్భవించినవని అందరికి తెలిసినదే. కావుననే వేదమూలకములైన అనేక విషయములు పురాణములందు చెప్పబడినవి. ఇట్లే వేదములందలి అనేకమంత్రములు యథాతథముగను, సంక్షిప్తముగను, సూచన ప్రాయముగను పురాణములలో చోటు చేసుకొనినవి. బ్రహ్మపురాణమున వివిధ వేదముల నుండి గైకొనబడిన భాగము వివరములు ఈ క్రింద ఈయబడినవి.

1. గోదావరి (గౌతమి) నదికి సంబంధించిన ఆత్రేయతీర్థ ప్రసంగ సందర్భంలో ఇంద్రుని స్వరూపాన్ని గుఱించిన వర్ణన ఉన్నది. 'యోజాత ఏవ ప్రథమో మనస్వాన్' (బ్రహ్మ-అధ్యాయం-140/22-23 అనే పూర్తి శ్లోకం ఉద్ధరించబడినది. ఇది ఋగ్వేదంలో ప్రఖ్యాతమైన 'సజనాస' అనే సూక్తంలో మొదటి మంత్రమే (ఋగ్వేదం-2-12-1)

2. బ్రహ్మపురాణంలోని ఇంద్ర స్తుతిలో (174-24 నుండి 27) ఋగ్వేద మందలి (9-114-3, 4, 2 నుండి 9-112-3) నాలుగు మంత్రములు పూర్తిగా ఉద్ధరించ బడ్డాయి. ఈ నాలుగు మంత్రాలలోను 'చంద్రుని నుంచి ఇంద్రునికి చేరవలసినది' అనే స్తుతి ఉన్నది. ఈ మంత్రాలన్నింటికీ చివర 'ఇంద్రా యేన్దో పరిస్రవ' అని వస్తుంది.
3. బ్రహ్మపురాణంలో చంద్రుడు బృహస్పతి భార్య తారను అపహరించిన వృత్తాంతం చెప్పబడింది. ఈ సందర్భంలో బ్రహ్మపురాణంలోని 152వ అధ్యాయం 34వ శ్లోకంలో 'పునర్వే దేవా అద్దుః' అనే మంత్రం సంపూర్తిగా ఉద్ధరించబడింది. ఇది ఋగ్వేదంలోని 10-109-6లోని మంత్రమే.
4. బ్రహ్మపురాణము నందలి 233-62లో 'ద్వే విద్యే వైవేదితవ్యే' అనే చాథర్వణీ శ్రుతి' అంటే అథర్వవేద ప్రతీక మంత్రం చెప్పబడింది. ఇది ముండకోపనిషత్తులోని 1-1-4 అనే మంత్రం 'అథర్వణీ శ్రుతిః' అనేపదంలో చాలా మాహాత్మ్యము ఉన్నది. దీనివలన పురాణకర్త దృష్టిలో బ్రాహ్మణాలు కూడా శ్రుతులుగానే పరిగణింప బడ్డాయని చెప్పవచ్చు. దీనినిబట్టి ఉపనిషత్తులు బ్రాహ్మణాలకు చివరి భాగాలని ఈ ప్రమాణాన్ని బట్టి సంహిత మాత్రమే వేదాంతర్గతమని, బ్రాహ్మణాలు శ్రుతుల నుంచి వెలువడినవనే ఆధునికుల భావన పరాస్తం అవుతున్నది.
5. బ్రహ్మపురాణంలోని అనేక స్థలాలలో వైదిక మంత్ర భాగాలు పేర్కొనబడ్డాయి. అర్థోజాయా ఇతి శ్రుతేః (బ్రహ్మ-129-62) దీనికి తైత్తిరీయ సంహిత 6-1-9-5, శతపథ బ్రాహ్మణం 5-2-1-10లలోని 'అర్థోహ కా.ఏష ఆత్మనోయజ్జాయా' అనే భాగమే ఆధారం.
6. బ్రహ్మపురాణంలోని 151 అధ్యాయంలో చెప్పబడిన ఊర్వశీ, పురూరవులు వృత్తాంతం, ఋగ్వేదంలో చెప్పబడినట్లు యథాతథంగా స్వీకరింపబడింది. ఇందులోని 4, 12 శ్లోకాలు ఋగ్వేదంలోని 10-95-16, 15 అనే మంత్రాలకు యథారూపాలే.
7. ఈ పురాణంలో 129వ అధ్యాయం 27వ శ్లోకంలో ఇంద్రుడు మిత్రుడు, అగ్ని అనే పేర్లతో ప్రఖ్యాతుడైన దేవపురుషుడు శివుడేనని చెప్తూ

   ఏక ఏకాద్యయుః శంభు రింద్ర మిత్రాగ్ని నామభిః
   వదన్తి బహుధా విప్రా భ్రాన్తో పకృతిహేతవే

   అనే శ్లోకం ఋగ్వేదంలోని 1-164-46లో చెప్పబడిన

   ఇంద్రం మిత్రం వరుణ మగ్ని మాహర్
   ఏకం సద్ విప్రా బహుధా వదన్తి

   అనే శ్లోకానికి పరివర్తిత రూపమే.

8. బ్రహ్మ పురాణం 161వ అధ్యాయమున పురుషసూక్తము (ఋగ్వేదం 10-90) నందలి అనేక మంత్రములు యథాతథంగా తీసుకొనబడ్డాయి. ఇంకా ప్రత్యేకంగా బ్రహ్మ పురాణంలోని శ్లోకాలు 161 – 35, 37, 47 నుంచి 49 సంఖ్యగలవి ఈ ప్రఖ్యాతమైన మంత్రాలలోని శబ్దాలను యథాతథంగా స్వీకరించి చెప్పబడినవే.

9. హరిశ్చంద్ర తీర్థంగుఱించి చెప్పేటప్పుడు ఈపురాణంలో హరిశ్చంద్ర, శునశేపుల వృత్తాంతం 104వ అధ్యాయంలో చెప్పబడింది. ఇది ఐతరేయ బ్రాహ్మణంలోని 33వ అధ్యాయంలోని కథను యథాతథంగా తీసుకొనబడిందే.

'నా పుత్రస్య పరో లోకో విద్యితే నృపసత్తమ' (6.104-7) అనే భాగం **'నా పుత్రస్య లోకేఽస్తి తత్ సర్వేపశవో విదుః"** అనే ఐతరేయ బ్రాహ్మణ కథనానికి ఛాయయే. ఇలా ఇంకా ఎన్నో వేద నుడులు ఈ పురాణంలో ఉన్నాయి.

బ్రహ్మపురాణం - విష్ణు దశావతారాలు

'ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే' అని భగవంతుడు తన అవతార ఉద్దేశ్యాన్ని ఒక్క ముక్కలో ప్రకటించాడు. అయితే ఆయన ఎన్ని అవతారాలు దాల్చాడనే దాన్లో ఏకాభిప్రాయం లేదు. శ్రీమద్భాగవతం (ప్రథమ స్కంధం – తృతీయ అధ్యాయం)లో భగవంతుని అవతారాలు 22 అని చెప్పబడింది అవి :

1.కౌమార సర్గము (అనగా సనక, సనందన, సనాతన, సనత్కుమారులు అనే నలుగురు); 2.వరాహ; 3.నారద; 4.నర-నారాయణ; 5.కపిల; 6.దత్తాత్రేయ; 7.యజ్ఞ; 8.ఋషభదేవ; 9.పృథు; 10.మత్స్య; 11.కచ్ఛప; 12.ధన్వంతరి; 13.మోహిని; 14.నరసింహ; 15.వామన; 16.పరశురామ; 17.వేదవ్యాస; 18.రామచంద్ర; 19.బలరామ; 20.కృష్ణ; 21.బుద్ధ; 22.కల్కి. అనేవి కానీ సాధారణంగా భగవంతుడు 24 అవతారాలు దాల్చాడని ప్రసిద్ధి. ఇందులో 23.గజేంద్ర మోక్షదాత; 24.హంస అనే అవతారాలనుచేర్చారు. అలాగే హయగ్రీవుడుకూడా ఒకచోట చెప్పబడ్డాడు. ఏద్రైనా భాగవతం 'అవతారాహ్యఽ సంఖ్యే యాహరేః' అన్నది సత్యం. కానీ ప్రచారంలో ప్రసిద్ధంగా

మత్స్యః కూర్మోవరాహశ్చ నరసింహోఽథ వామనః
రామోరామశ్చ కృష్ణశ్చ బుద్ధః కల్కిశ్చతే దశ

అని చెప్పబడింది. అయితే బ్రహ్మపురాణంలో బుద్ధావతారం చెప్పలేదు పైగా దత్తాత్రేయుని అవతార కథనం చేయబడింది. బుద్ధావతారం క్రీ.శ. 4వ శతాబ్దంలో నుంచే

పురాణాలలోనికి ఎక్కింది. పైగా ఆయన అవతారానికి కొన్ని పురాణాలు సముచిత స్థానం, అవసరం కల్పించలేదు. అందువల్లనేనేమో బ్రహ్మపురాణంలో ఈ అవతారాన్ని ప్రస్తావించలేదు. అందువలన ఈ భాగం బహుశః క్రీ.శ.4వ శతాబ్దానికి ముందే రచింపబడి ఉండాలి.

బ్రహ్మపురాణం - రచనా కాలం- స్థలం

బ్రహ్మ పురాణం వివిధ దేశాలను గురించి తెలుపుతూ, పృథ్వీతలంలోని అన్ని దేశాలలోను భారతదేశమే సర్వశ్రేష్ఠ దేశమని, ఆ భారతదేశంలో కూడా సర్వశ్రేష్ఠ ప్రదేశం దండకారణ్య మని తెలుపుతున్నది. ఈ దండకారణ్యంలోనే గౌతమి లేక గోదావరినది ప్రవహిస్తున్నది. నదులలో గోదావరి ముఖ్యమైనదని తెలుపుతున్నది. ఈ నదీతీరంలోని తీర్థాల మహాత్మ్యా లను సూక్ష్మ వివరాలతో మొత్తం 106 అధ్యాయాలలో (69వ అధ్యాయం నుంచి 175వ అధ్యాయం వరకు) వివరిస్తున్నది. ఈ వివరాలను పరిశీలించగా పురాణ కర్తకు దండకారణ్యంగురించి ముఖ్యంగాగోదావరీనది పరివాహక ప్రాంతంగురించి విశేషంగా పరిచయం ఉన్నట్లు తెలుస్తున్నది. ఆ కారణంచేత ఈ భాగం కల అధ్యాయాల రచన తప్పక గోదావరి లేక గౌతమీ నదీ ప్రాంతంలోనే జరిగి ఉండాలి. దీనిని బలపరచే

పృథివ్యాం భారతం వర్షం దండకం తత్ర పుణ్యదమ్
తస్మిన్ క్షేత్రే కృతం కర్మం భుక్తి ముక్తి ప్రదం నృణామ్
తీర్థానం గౌతమీ గంగా శ్రేష్ఠాముక్తి ప్రదానృణామ్ (88-28, 29)

ఈ భూమిపైగల ప్రదేశములలో భారతదేశము, ఆ దేశములో దండకారణ్య ప్రాంతము పుణ్యమును ఇచ్చునట్టివి. ఆ ప్రదేశంలో ఆచరింపబడిన కర్మలు అన్నియు భుక్తిని ముక్తిని కలిగించును. తీర్థములలో గంగానది వంటి గౌతమీ అతి శ్రేష్ఠమైనది.

శ్రూయతే దండకారణ్యే సరిత్ శ్రేష్ఠాస్తి గౌతమీ
అశేషాఘ ప్రశమనీ సర్వాభీష్ట ప్రదాయినీ (129వ అధ్యాయం)

దండకారణ్యంలో ప్రవహించే నదులు అన్నింటిలో గౌతమీ నది శ్రేష్ఠమైనది. ఇంకను అది సర్వ పాపములను పోగొట్టి సమస్త కోరికలను తీర్చునట్టిది అని చెప్పబడింది. అందువలన ఈపురాణంలోని అధికభాగం గోదావరి నది ఒడ్డున రచింపబడిందని భావించవచ్చు. కానీ దీనిలో కొంతభాగం (మొదటి నుంచి 69వ అధ్యాయం వరకు) ఉత్కళ దేశంలో రచింపబడినట్లు భావించవచ్చు. అందుకు కారణం 28వ అధ్యాయం నుంచి 69వ అధ్యాయంవరకు ఉన్న 41 అధ్యాయాలలోను, పురుషోత్తమ క్షేత్రం (జగన్నాథ

క్షేత్రం)లోని చిన్నచిన్న తీర్థాలకు చెందిన ప్రదేశాలు అన్నింటిని మించి సర్వశ్రేష్ఠాలని చెప్పబడ్డాయి. 69వ అధ్యాయంలో పూరీజగన్నాథ లేక పురుషోత్తమ క్షేత్రమే అన్ని తీర్థాల కంటే మూర్ధన్య స్థానాన్ని ఆక్రమిస్తున్నదని తెలుపబడింది. 28వ అధ్యాయంలో కోణాదిత్య లేక ఆధునిక కాలంలో చెప్పబడుతున్న విధంగా కోణార్క క్షేత్రంయొక్క మాహాత్మ్యం విశేషంగా ప్రశంసించబడింది. అలాగే అక్కడ ప్రతిష్ఠించబడిన భాస్కరుని స్వరూపము ఆరాధనలను గురించి ఆరు అధ్యాయాలలో (29వ అధ్యాయం నుంచి, 34వ అధ్యాయం వరకు) వర్ణించబడింది. 66వ అధ్యాయంలో 'గుడివా' యాత్ర, అక్కడి దైవ మాహాత్మ్యం విశిష్ట ఫలప్రదాయకం అని వర్ణించబడింది. 'గుడివా' లేక 'గుండివా' యొక్క సరియైన రూపం 'గుండిచా'. జగన్నాథుడు తన అన్న సంకర్షణుడు, సోదరి సుభద్రలతో ఆషాఢశుక్ల విదియనాడు రథమెక్కి చేసే రథయాత్రే 'గుండిచా' యాత్ర అనే పేరుతో ఉత్కళ దేశంలో ప్రసిద్ధమైన సంఘటన. ఇది నాడేకాదు నేడు కూడా చాలా గొప్ప సంఘటనగా భావించ బడుతున్నది. స్థానికమైన ఈ ఒరియా భాషాపదం, గ్రంథకర్తకు ఈ ప్రదేశంతో గల గాఢ పరిచయానికి చిహ్నం. అందువలన బ్రహ్మపురాణంయొక్క ఈ భాగ రచనా ప్రదేశం ఉత్కళ దేశంగా భావించబడుతున్నది.

పాశ్చాత్య విద్వాంసులు కొందరు బ్రహ్మపురాణంలో పురాణ పంచ లక్షణాలు ఏమీ లేవంటున్నారు. కానీ ఈ అభిప్రాయం చాలా అప్రమాణికం, అనాలోచితం అని చెప్పవచ్చు. బ్రహ్మపురాణాన్ని విమర్శాత్మకంగా అధ్యయనం చేస్తే దీనిలో పురాణ పంచలక్షణాలు స్పష్టంగా ద్యోతకమవుతాయి. మొదటి నాలుగు అధ్యాయాలలోనే, సర్గ ప్రతిసర్గ వివరణ, అయిదవ అధ్యాయంలో మన్వంతర కథనం, తరువాతగల దాదాపు వంద అధ్యాయాల పైగా కల విభాగంలో వంశ, వంశాను చరితలు చెప్పబడ్డాయి. అందువలన ఇందులో పురాణ పంచ లక్షణాలు లేవని సందేహించాల్సిన అవసరమే లేదు.

డా॥ హెచ్. హెచ్. విల్సన్ మొదలైన పాశ్చాత్య విద్వాంసులు ఆయన అనుయాయులు కొందరు ఈ పురాణం పదమూడు, పదునాలుగు శతాబ్దాలలో సంకలింపబడిందని అంటున్నారు. కానీ 11వ శతాబ్దిలో రచింపబడిన బల్లాల సేనుని దానసాగరంలోనూ, అదే సమయంలో రచింపబడిన హలాయుధుడు రచించిన బ్రాహ్మణ సర్వస్వం, హేమాద్రి రచిత పరిశేష ఖండంలోనూ, దానికి ముందుకాలంలో రచింపబడిన మరికొన్ని గ్రంథాలలో ఈ పురాణంనుంచి విస్తృతంగా శ్లోకాలు తీసుకొనబడ్డాయి. అందువలన పాశ్చాత్య విద్వాంసుల ఈ అభిప్రాయం స్వీకారార్హం కాదని చెప్పవచ్చు.

ఈ పురాణం 176వ అధ్యాయంలో వర్ణింపబడిన ఉత్కళ ప్రాంతంలోని ప్రసిద్ధ భువనేశ్వర క్షేత్రంనందలి అనంత వాసుదేవ మాహాత్మ్యాన్ని పఠించి, క్రీ.శ. 11వ శతాబ్దంలో ఆ ప్రాంతాన్ని పాలించిన భవదేవభట్ట అనంత వాసుదేవ మందిర నిర్మాణం చేశాడు. అందువలన 11వ శతాబ్దం తరువాతే ఈ పురాణం సంకలించ బడిందే అభిప్రాయం ఉన్నది. బ్రహ్మపురాణంలో అనంత వాసుదేవమూర్తి యొక్క ఉద్భవం, మాహాత్మ్యం వర్ణించ బడింది. కానీ పురాణంలో దేవాలయ నిర్మాణ విషయమే లేదు. మందిర నిర్మాణం తరువాతే పురాణరచన జరిగితే ఆదేవాలయాన్ని కూడా వర్ణించి ఉండటం జరిగేదేమోకదా ! పురుషోత్తమ మాహాత్మ్యంలో కూడా వర్ణించిన మందిర ప్రాసాదం నేడు ఉన్న మందిరం భవనం కాదు. అందులో గాంగేయ పదం అని ఉన్నది. ఇప్పటి మందిరం గాంగేశ్వర చోడుని ద్వారా నిర్మితం జరిగింది. ఈ గాంగేశ్వర చోడుడు క్రీ.శ. 1077వ సంవత్సరంలో కళింగ దేవ సింహాసనాన్ని అధిష్ఠించాడు. దీనికి ముప్పై, ముప్పై అయిదు సంవత్సరాల ముందు ఆయన ఉత్కళదేశం మీద దండయాత్ర చేశాడు. అందువలన ఆయనచేత క్రీ.శ. 1107 నుంచి క్రీ.శ. 1112 లోపుగా పురుషోత్తమ ప్రాసాదం నిర్మాణం జరిగి ఉండాలి. కానీ భగవంతుని విగ్రహం, క్షేత్ర మాహాత్మ్యం అంతకు చాలా ముందు కాలానికి చెందినవై ఉండాలి. మందిరం మాత్రం కొత్తదై ఉండవచ్చును. దానసాగరం రచించిన వల్లాలసేనుడు, గాంగేశ్వర చోడుడు సమకాలీనులు. ఆయన దానసాగరంలో బ్రహ్మ పురాణం నుంచి అనేక శ్లోకాలను ఉద్ధరించాడు. అందువలన ఆ కాలంకంటే బ్రహ్మ పురాణం చాలా ప్రాచీనమైనదని చెప్పవచ్చు. అంతకు ముందు ఉన్న సేన రాజు లక్షణుని శిలాశాసనంలో పురుషోత్తమ క్షేత్రం పేర్కొనబడింది. క్రీ.శ. 7వశతాబ్దికి చెందిన హ్యుయాన్‌త్సాంగ్ అనే చీనా యాత్రికుడు చిత్రోత్పలం అంటే ప్రస్తుత పూరీ వచ్చి ఐదు భాగాల ఎత్తుగల గోపురాన్ని దర్శించాడు. అందులో పురుషోత్తమ ప్రాసాదం ఒకటి.

మొత్తంమీద ఈ క్షేత్రమే కాదు, క్షేత్ర మాహాత్మ్యాన్ని వర్ణించిన బ్రహ్మపురాణం కూడా చాలా ప్రాచీన కాలానికి చెందిన దనటంలో ఎటువంటి అసంగతం ఉండదు. ఎంత ప్రాచీనం అంటే నిర్ధారించటానికి తగిన ఆధారాలు లేవు. బ్రహ్మ పురాణంలోని కృష్ణ చరిత్ర, విష్ణు పురాణంలోని కృష్ణ చరిత్ర, ఇందులోని పురుషోత్తమ క్షేత్ర మాహాత్మ్యం నారద పురాణంలోని పురుషోత్తమ మాహాత్మ్యం పోల్చిచూస్తే బ్రహ్మ పురాణంలోని శ్లోకాలే పరివర్ధితాలై ఆ పురాణాలలో చేర్చబడ్డాయి అని తెలుస్తుంది.

అంతఃపరిశీలనచేత ఇందలి మొదటి 175 అధ్యాయాలు అతి ప్రాచీనములని, 176వ అధ్యాయం నుంచి 245వ అధ్యాయం వరకు గల 71 అధ్యాయాలు అనంతర కాలంలో

ప్రక్షిప్తం చేయబడినవని గ్రహింపవచ్చును. జీమూత వాహన, బల్లాలసేన, కృష్ణదేవ భట్టారకులు పేర్కొనిన బ్రహ్మపురాణ భాగములు నేడు లభించుచున్న బ్రహ్మ పురాణమున కన్పించటంలేదు. ఈ పురాణంలో, శ్రీమహాభారతము, విష్ణు, వాయు, మార్కండేయ పురాణములలోగలవి అనేక అధ్యాయములే ప్రస్తుతము కలసి పోయి ఉన్నవి. అందువలన ఇది మూలపురాణముగాక కాలానుగుణ్యముగా చేరిన ప్రక్షిప్త పురాణమని చెప్పవచ్చును. శ్రీ హెచ్.హెచ్.విల్సన్ పండితుడు మొదలగు వారు ఈ పురాణము క్రీ.శ. పదమూడవ శతాబ్దమున రచింప బడినదని తెలుపుచున్నారు. కానీ ఇది అంతకంటే ముందు కాలమునాటిదే కావలయును. దీని నుండి అనేకమంది స్మృతి వ్యాఖ్యాకారులు ప్రమాణములను ఉద్ధరించిరి.

ఈ పురాణంలో తీర్థక్షేత్ర ప్రశంసలు, మాహాత్మ్యాలు చాలా సుందరంగా, విస్తారంగా ఉన్నాయి. మాహాత్మ్యాలను గురించి చెప్పేటప్పుడు, తీర్థ సంబంధమైన ప్రాచీన కథలకు కూడా సముచిత స్థానం సమకూర్చబడింది. డా॥హజ్రా వ్రాతల ఆధారంగా జీమూతవాహన బల్లాలసేన, దేవణభల్లులు తమ రచనలలో ఉద్ధరించిన శ్లోకాలు ఇప్పుడు లభ్యం అవుతున్న బ్రహ్మపురాణంలో లభించటంలేదు. ఈ పురాణంలో మహాభారతం నుంచే కాక, ప్రస్తుత విష్ణు, వాయు, మార్కండేయ పురాణాల నుంచి అనేక అధ్యాయాలు అక్షరం పొల్లు పోకుండా స్వీకరించిందని తెలుపుతున్నారు. అందువలన ఈ బ్రహ్మపురాణం మూల బ్రహ్మపురాణం కాక, కాలాంతరంలో రచింపబడిన ప్రక్షేప విశిష్ట బ్రహ్మపురాణంగా కొందరు భావిస్తున్నారు. ఈ ప్రక్షేపాలను పోల్చిచూడ వచ్చును. ఈ పురాణం మూల రూపంగా 175వ అధ్యాయంతో సమాప్తం అవుతున్న (ఇక్కడితో గౌతమీ గంగా మాహాత్మ్యంయొక్క విశద భాగంపూర్తి అవుతున్నది) ఆ అధ్యాయం చివరనే 88-90 శ్లోకాలు. ఈ పురాణ శ్రవణ, దాన మాహాత్మ్యం కూడా వర్ణించబడు తున్నది. ఈ శ్రవణ ఫలం, దాన ఫలం సాధారణంగా పురాణం చివర మాత్రమే ఉంటుంది. అందువలన 176వ అధ్యాయం నుంచి చివరి 245వ అధ్యాయం వరకు అనంతర కాలంలో చేర్చబడి ఉండాలని భావించటం జరుగుతున్నది. అనేక నిబంధ గ్రంథకారులు ఈ పురాణంనుంచి అనేక శ్లోకాలను ఉద్ధరించినా, అది అంతగా ప్రచారంలోనికి రాలేదు. కల్పతరువు దీనిలోనుంచి దాదాపు పదిహేను వందల శ్లోకాలను ఉద్ధరించింది. అయితే ఇన్ని శ్లోకాలలోను దాని సంపాదకులు కేవలం తొమ్మిది శ్లోకాలను మాత్రం గుర్తించ గలిగారు. శ్రాద్ధ సంబంధ విషయాల వివరణలో వందల కొలదీ శ్లోకాలు ఉద్ధరించ బడ్డాయి. కల్పతరువులో అన్ని నిబంధ గ్రంథాలకంటే దీనినుంచి ఉద్ధరింపబడిన శ్లోకాలు ఎక్కువ ఉన్నాయి. వాయు,

మత్స్యపురాణాల నుంచి ఉద్ధరించబడినవి దీనిలోని శ్లోకాల సంఖ్యకంటే తక్కువే. కానీ ఈ శ్లోకాలు ప్రస్తుతం లభిస్తున్న బ్రహ్మపురాణంలో లభ్యం కానందువలన దీని ప్రస్తుత రూపం అధికంగా ప్రక్షిప్త విశిష్టంగా భావించబడుతున్నది. ఈ అభిప్రాయం పూర్తిగా అసమంజసం కూడా కాదు. అయితే ప్రస్తుతం ప్రచారంలో ఉన్న ముద్రితమైన బ్రహ్మ పురాణం నుంచి తీర్థ విషయానికి సంబంధించిన అనేక శ్లోకాలు (46వ అధ్యాయం నుంచి తరువాత అధ్యాయంకు సంబంధించినది) తీర్థచింతామణి అనే గ్రంథంలో ఉద్ధరించ బడ్డాయి. ఈ తీర్థచింతామణి రచయిత వాచస్పతి. ఆయన క్రీ.శ. 1425-1490 కాలానికి చెందినవాడు. అంటే 15వశతాబ్దికి ఉత్తరార్థానికి చెందినవాడు. అంటే ప్రస్తుత బ్రహ్మ పురాణం కాలానికి ముందు అంటే 13వ శతాబ్దం ప్రాంతంలో రచింప బడిందని కొందరు విమర్శకుల వాదం. మరికొందరు ఈ వాదాన్ని సుతరాము ఒప్పుకోటం లేదు.

బ్రహ్మ పురాణం ప్రత్యేకత

పురాణగణనము నందు మొట్టమొదటగా పరిగణింపబడునది బ్రహ్మపురాణము. "విష్ణుపురాణమున" (విష్ణుపురాణము (3-6-20)

ఆద్యం సర్వ పురాణానాం పురాణం బ్రహ్మముచ్యతే
అష్టాదశ పురాణాని పురాణజ్ఞాః ప్రచక్షతే

అని కంఠాపధంగా ఇది మొదటి పురాణమని పేర్కొనినది. బ్రహ్మ పాద్మం వైష్ణవంచ శైవం భాగవతం తధా అనియు, ఆద్యం సర్వపురాణానాం పురానాం పురాణం బ్రాహ్మ ముచ్చతే అనియు, నారదీయ పురాణము (నారదీయపురాణము 62-1) నందు 'బ్రాహ్మం పాద్మం వైష్ణవంచ వాయవీయం తథైవచ' అనియు, భాగవతము (భాగవతం 12-6-23) నందు "బ్రహ్మణం పాద్మం వైష్ణవంచ శైవం లింగం సగరుడమ్' అనియు చెప్పబడుటచే పలు పురాణములు బ్రహ్మపురాణమే అష్టాదశ పురాణములలో మొట్ట మొదటిదని చెప్పు చున్నవని భావింపవచ్చును. అందువలననే దీనిని ఆది బ్రాహ్మమని కూడా పిలుచుట గలదు. కానీ మత్స్యపురాణానుసారమైనది. ఐదవ పురాణము బ్రహ్మ పురాణము తనను గుఱించి 'తేపిశృత్వా మునిశ్రేష్ఠాః పురాణం వేదసంమితమ్ ఆద్యం బ్రహ్మేభిధానం చ సర్వాజ్ఞా ఫలప్రదమ్ (245-4)' అని మొట్టమొదటి పురాణముగా ప్రకటించుకొన్నది. అష్టాదశ పురాణగణనంలోను మొదటిగా బ్రహ్మపురాణము, మధ్యమంగా బ్రహ్మవైవర్త పురాణము, చివరలో బ్రహ్మాండ పురాణము ఉన్నట్లుగా అనేక పురాణములు అంగీకరిస్తు న్నాము. దీనిని బట్టి సృష్ట్యాదియందు బ్రహ్మనుంచి వినిర్గతమైన ఈ సకల చరాచర

ప్రపంచము సృష్ట్యంతమున ఆ బ్రహ్మమందే లీనమగునని సూచించుటయే బ్రహ్మ పురాణముతో ప్రారంభమైన పురాణగణనము బ్రహ్మాండ పురాణముతో అంతమగుచున్నది. ఈ బ్రహ్మసృష్టియే ఇదిఅంతా అని తెలుపుటకే బ్రహ్మవైవర్త పురాణము మధ్యన నిలిచి సమ్యక్ సృష్టి జ్ఞానమును కల్గించుచున్నదని పరిశీలకుల భావన.

ఈ పురాణ పఠనముచే

ఇదంహి శ్రద్ధ యానిత్యం పురాణం వేద సమ్మితమ్
యః పఠేచ్ఛృణు యా న్మర్త్యః సయాతి భవనం హరేః (బ్రహ్మపురాణం 245-27)

నిత్యము శ్రద్ధగా పఠించువానికి విష్ణు సాయుజ్యము కలుగునని చెప్పబడినది.

ఈ పురాణము నందు విష్ణ్వవతార వర్ణనము విశేషముగా గలదు. గౌతమీగంగా మాహాత్మ్యము తత్తీరమందలి అనేక తీర్థ క్షేత్ర వివరణము గలదు. శ్రీకృష్ణావతారము వర్ణింపబడినది. ఈ భాగము మనోహరమైన రచనముతో నుండును. ఈ భాగము శ్రీమద్భాగవతంలోని దశమ స్కంధమును ఎక్కువగా పోలియున్నది. ఇంతేగాక ప్రస్తుత ఉత్కళ రాష్ట్రము నందలి కోణార్క సూర్యదేవాలయము, సూర్యారాధనము విస్తారముగా వర్ణింపబడినది. పార్వతీ స్వయంవరము, శివపార్వతుల కల్యాణము మనోహరముగా చెప్పబడినది. ఈ సందర్భముననే ప్రకృతిని స్వాభావికమైన ఋతువర్ణన చేయబడినది. ఇది కడు రమ్యముగానుండును. వీనియందు కావ్యగతమైన చమత్కారము సౌందర్యము కాన్పించును. ఇంతేగాక ఈ పురాణమునందు 234వ అధ్యాయము నుంచి 243వ అధ్యాయము వఱకు గల పది అధ్యాయములందును సాంఖ్యయోగ విస్తృతముగా వివరింప బడినది. ఈ సాంఖ్య వివరణమున జ్ఞానముతో బాటు భక్తికి గూడా ప్రాధాన్యము ఒసగ బడినది. పైగా సాధారణముగా సాంఖ్యతత్త్వములు 25 అని చెప్పబడుచుండగా ఇందు 26 సాంఖ్య తత్త్వముల వివరణముగలదు. ఇచ్చట వివరింపబడినది. నిరీశ్వర సాంఖ్యము గాక జ్ఞానతత్త్వముతో కలసిన భక్తితత్త్వము గల సేశ్వరసాంఖ్యము ఇందు వర్ణితము.

ఇందు సృష్టి వర్ణనానంతరము చంద్రవంశ, సూర్యవంశ రాజవర్ణనము, పార్వతీ యాఖ్యానము, మార్కండేయ చరితము గంగా, గౌతమీ మొదలైన పుణ్యనదీవర్ణన, చక్రతీర్థ, పుత్రతీర్థ, యమతీర్థముల మాహాత్మ్యము శ్రీకృష్ణ చరిత్రములు వర్ణింపబడినవి.

ఇందు 28 నుంచి 69 వరకుగల 41 అధ్యాయములలో శ్రీజగన్నాథ క్షేత్ర మాహాత్మ్యము అతి విపులముగా చేయబడినది. అచ్చట ప్రతి సంవత్సరము జరుగు రథ యాత్రను దర్శించుటచేత విష్ణులోక ప్రాప్తి కలుగునని చెప్పబడినది. ఇందలి తీర్థయాత్రా ప్రసంగ

సందర్భమునందు అనేక వైదికోపాఖ్యానములను కథ సందర్భమును అనుసరించి చేసిన వివరణములు చక్కగా నుండును ఈ సందర్భమునందే అనేక ఆర్ష ప్రయోగములు లభ్యములగును. పురాణ పంచలక్షణములు సమ్యక దృష్టితో వివరింపబడిన గ్రంథమిది. ఇందలి మొదటి నాలుగు అధ్యాయములందు సర్గ, ప్రతిసర్గ వర్ణనము గలదు. పంచమ అధ్యాయమున మన్వంతర చరిత్రగలదు. తదుపరి అధ్యాయములందు వంశ, వంశాను చరితములు కీర్తింపబడినవి.

బ్రహ్మపురాణం విదేశీ భాషలలో అనువాదం

1. బ్రహ్మపురాణము నందలి కందుముని వృత్తాంతము (178వ అధ్యాయము) ఎ.డబ్ల్యు.వాన్ షెగెల్ (ఇన్‌డిఫి, బిబ్లియోథెకె, 1822) చేత జర్మన్ భాషలోనికి పరివర్తించ బడినది.
2. అట్లే ఇదే కందుముని వృత్తాంతము 1822వ సంవత్సరమున ఎ.ఎల్.చెజీ చేత ఫ్రెంచి భాషలోనికి అనువాదము చేయబడినది.

బ్రహ్మపురాణం - తెలుగు సాహిత్యం

ప్రాచీన కవులు ఎవ్వరూ బ్రహ్మపురాణాన్ని తెలుగులోనికి అనువాదం చేసినట్లుగా కనిపించదు. ఆధునికులలో శ్రీ జనమంచి శేషాద్రి శర్మగారు ఈ పురాణాన్ని సంపూర్తిగా చంపూ గ్రంథంగా అనువదించారు. ఇందులో ఆశ్వాసాది విభజనతోపాటు అధ్యాయాలుగా కూడా విభజించటం జరిగింది. మొదటి ముప్పదిమూడు అధ్యాయాలు ప్రథమాశ్వాసం, 64తో ద్వితీయాశ్వాసం సంపూర్ణం, 92వ అధ్యాయముతో తృతీయాశ్వాసము పూర్తి అయినది. 119లో నాల్గవ ఆశ్వాసం పూర్తి అవుతున్నది. 120 నుంచి చివరి వరకు మొత్తం అయిదు ఆశ్వాసాల గ్రంథం. అయితే ఆశ్వాస విభజనలో శ్రీ శేషాద్రి శర్మగారు అనుసరించిన శాస్త్రీయ విధానం ఏమీ కనిపించదు. ఈ గ్రంథం శ్రీ తిరుమల శ్రీవేంకటేశ్వరునికి అంకితము శ్రీ శర్మగారి ఆంధ్రీకరణము చాలావఱకు మూలవిధేయంగానే ఉన్నా అధ్యాయాలను యథాతథంగా వారు అనువాదం చేయలేదు. సంస్కృత బ్రహ్మపురాణంలో మొత్తము 245 అధ్యాయాలున్నా ఆంధ్ర బ్రహ్మపురాణములో కేవలం 135 అధ్యాయములు మాత్రమే గలదు. వీనిలో వీరు 70వ అధ్యాయము నుంచి 175వ అధ్యాయము వఱకుగల దాదాపు 101 అధ్యాయము గల గ్రంథ భాగంలో ఉండే వివిధ తీర్థక్షేత్ర మహాత్మ్యాలను, వృత్తాంతాలను అనువాదం చేయకుండా వదలివేశారు. అనువాదం చేయకుండా వదలిన

భాగాలలో గంగోత్పత్తి, మన్మథుడు శివునిపైకి దండయాత్రకు వెళ్ళటం, హిమమద్వర్ణనం, గంగ భూమిపైకి రావటం వామనావతారం, గౌతమీ మాహాత్మ్యం, గౌతమీ తీరంలో ఉన్న అనేక తీర్థాల వివరాలు మొదలైనవి ఉన్నాయి. వాస్తవానికి ఈ తీర్థాలన్నీ ఇప్పుడు ఎక్కడా గుర్తించటానికి వీలు అయ్యేవి కావు. వానిలో ప్రత్యేకతా ఏదీ ఉండదు. పైగా వీటన్నింటి మాహాత్మ్యాన్నీ వర్ణించుకుంటూ పోవటం కవితా కళకు మసిబూసినట్లే కాగలదు. కారణం ఊరకే చెప్పింది చెప్పుకొంటూ పోవలసి రావటమే. సంప్రదాయం మీద అత్యంత భక్తి శ్రద్ధలున్న శర్మగారే వీనిని వదలివేశారంటే వీని అప్రాముఖ్యతను తెలుసుకొనవచ్చు. వీటిని వదలటం వల్ల ఈ పురాణ అనువాదానికి ఎలాంటి నష్టమూ కలగలేదని చెప్పవచ్చు. పైగావారు కవితాకళ ప్రదర్శించటానికి అవసరమైనశ్రీకృష్ణలీలలు, శివపార్వతుల కల్యాణం, మొదలైన విషయాలను యథాతథంగా వదలకుండా అనువాదం చేశారు.

ప్రాచీన కవులైన మారన, వెన్నెలకంటి సూరన మొదలైన పురాణ ఆంధ్రీకర్తల అనువాద శైలికి శ్రీశర్మగారి అనువాదశైలికి విశేష భేదం ఉన్నది. 19, 20వ శతాబ్దాలలో పురాణాలను యథాతథంగా అనువాదం చేయాలనే భావం కవులలో కలిగిన మార్పుకు ఉదాహరణగా శర్మగారి అనువాదాన్ని గ్రహించవచ్చు. అయితే పురాణానువాదాలు యథాతథంగా ఉండాలనే, కళువె వీరరాజు అతని కుమారుడు కళువె నంజరాజు, తుపాకుల అనంత భూపాలుని రచనా విధానం ఒకరకంగా సాగింది. మారనాదులు కేవలం భావాను వాదాలతో పురాణాలను అనువదించారు. అనంత భూపాలుడు, నంజరాజు మొదలైన వారు యథానువాదాలతో అనువదించారు. ఈ యథానువాదాలలో కుదింపు మొదలైనవి ఏమీ లేవు. శర్మగారు ఈ రెండు పద్ధతులూ గాక విలక్షణమైన శైలిలో అనవసరము అనిపించిన భాగాలను వదలి వేస్తూ మిగిలిన వానిని అవసరమైన చోట్ల విస్తృతపరుస్తూ, అధ్యాయ వర్గీకరణను మార్చి, పూర్వ ఉత్తరభాగాల ప్రసక్తి ఎత్తుకొనక, కొన్ని అధ్యాయాలను కలిపి ఒక ఆశ్వాసంగా చేస్తూ రచన సాగించారు. అయితే కవితా కళలో శర్మగారి రచన ప్రాచీన కవుల రచనల ముందు సూర్యుని ముందు దీపంలా వెలవెల బోయేదేనని చెప్పవచ్చు. యథానువాదమే చేసినా తుపాకుల అనంత భూపాలుడు, నంజరాజుల రచనా విన్యాసం కూడా శర్మగారి అనువాదాలలో కన్పించదు అచ్చులచ్చట మూలంలో పాఠభేదములున్న యెడల వీరు రెండు పాఠములకు అనువాదమును చూపారు. వివరణము అవసరమను కొనిన ఎడల అచ్చట మూలమును అధోజ్ఞాపిక ద్వారా వివరించారు. శ్రీకృష్ణలీలలు వర్ణించు పట్టున పోతన ప్రభావముగానీ, శివపార్వతుల కళ్యాణమును వర్ణించుపట్టున, శ్రీనాథ, కాళిదాసుల ప్రభావముగానీ లేక రచన యథా మూలముగానే

ఉండుట ఈ అనువాదపు విశిష్టత అని చెప్పలేము కానీ ప్రత్యేకత అని చెప్పవచ్చును. ఈ బ్రహ్మపురాణ అనువాదమును గుఱించి ఇంకను పూర్తిగా పరిశోధన జరుగుట అవసరము. అప్పుడుగానీ దీని పూర్తి స్వరూపము అవగాహన అయ్యే వీలులేదు.

జనమంచివారు తమ ఆంధ్ర బ్రహ్మపురాణం అనువదించకుండా వదలిన అధ్యాయాలలోని వృత్తాంతాలు – అధ్యాయాల సంఖ్య : (ఇదే భాగం ప్రస్తుత బ్రహ్మపురాణంలో కూడా వదలివేయబడింది).

70. బ్రహ్మను తీర్థసంఖ్యల గురించి నారదుని ప్రశ్న, చతుర్విధ తీర్థ లక్షణముల వివరణ.
71. గంగోత్పత్తి కథా ప్రారంభం, తారకునిచేత భయపెట్టబడిన దేవతల స్థితి.
72. హిమవత్పర్వత వర్ణనం, శంభు వివాహవిధి కథనమ్
73. బలిప్రశంస, దేవతలుచేసిన విష్ణుస్తుతి, బలి వామనునికి భూమిని దానమిచ్చుట, మహేశ్వరుని జడలలోనికి గంగ ప్రవేశము.
74. గంగ యొక్క ద్విరూప వర్ణనము, గౌతమాశ్రమ వర్ణనము, గౌతమాశ్రమమునకు వినాయక ప్రయాణము, గౌతమ, వినాయక సంవాదము.
75. గౌతముడు చేసిన ఉమామహేశ్వర స్తవనము, గౌతమునికి ఉమామహేశ్వరులు దర్శనము ఇచ్చుట. గంగా ప్రశంస, గౌతమ ముని వచ్చుట.
76. స్వర్గము నుంచి, పంచాదశముగా గంగవచ్చుట.
77. గౌతమ మహాత్మ్య వర్ణనం.
78. సగరాఖ్యాన వర్ణనము.
79. వరాహతీర్థ వర్ణనము
80. కపోతతీర్థ వర్ణనము
81. కుమారతీర్థ వర్ణనము
82. కృత్తికాతీర్థ వర్ణనము
83. దశాశ్వమేధ తీర్థ వర్ణనము
84. పైశాచతీర్థ వర్ణనము
85. క్షుధాతీర్థ వర్ణనము
86. చక్రతీర్థ వర్ణనము
87. అహల్యా సంగమేంద్ర తీర్థ వర్ణనము

88. జనస్థాన తీర్థ వర్ణనము
89. అరుణా వరుణా సంగమ అశ్వ భాను తీర్థ వర్ణనము
90. గరుడ తీర్థ వర్ణనము
91. గోవర్ధన తీర్థ వర్ణనము
92. పాపప్రణాశన తీర్థ వర్ణనము
93. విశ్వామిత్ర తీర్థ వర్ణనము
94. శ్వేత తీర్థ వర్ణనము
95. శుక్ర తీర్థ వర్ణనము
96. పుణ్యాసిక్తా సంగమేంద్ర తీర్థాది సప్త సహస్ర తీర్థ వర్ణనము
97. పౌలస్త్య తీర్థ వర్ణనము
98. అగ్ని తీర్థ వర్ణనము
99. ఋణప్రమోచన తీర్థ వర్ణనము
100. కద్రు సుపర్ణ తీర్థ వర్ణనము
101. సరస్వతీ సంగమ, పురూరవ, సబ్రహ్మతీర్థ, సిద్ధేశ్వరతీర్థ వర్ణనము
102. పంచతీర్థ మహాత్మ్య వర్ణనము
103. శమ్యాది తీర్థ వర్ణనము
104. విశ్వామిత్రాది ద్వావింశతి సహస్ర తీర్థ వర్ణనము
105. సోమ తీర్థ వర్ణనము
106. దేవదానవుల మేరు పర్వతము పొందుటకు మంత్రాంగము
107. వృద్ధా సంగమ తీర్థ వర్ణనము, వృద్ధ గౌతమాఖ్యానము
108. ఇలా తీర్థ వర్ణనము -ఇలో పాఖ్యానం
109. చక్ర తీర్థ వర్ణనము
110. పిప్పల తీర్థ వర్ణనము దధీచ ఉపాఖ్యానము
111. నాగ తీర్థ వర్ణనము
112. మాతృ తీర్థ వర్ణనము
113. బ్రహ్మ తీర్థ వర్ణనము
114. అవిఘ్న తీర్థ వర్ణనము
115. శేష తీర్థ వర్ణనము
116. వడువాది సహస్ర తీర్థ వర్ణనము
117. ఆత్మ తీర్థ వర్ణనము
118. అశ్వత్థాది తీర్థ వర్ణనము
119. సోమ తీర్థ వర్ణనము
120. ధాన్య తీర్థ వర్ణనము
121. విదర్భా సంగమ, రేవతీ సంగమతీర్థ వర్ణనము
122. పూర్ణాది తీర్థ వర్ణనము
123. రామతీర్థ వర్ణనము, దశరథ చరిత్ర వర్ణనము, రామకృత శివస్తోత్రం
124. పుత్రతీర్థ వర్ణనము, భరుత్తుని జన్మ కథనము
125. యమతీర్థ వర్ణనము
126. తపస్తీర్థ వర్ణనము
127. దేవతీర్థ వర్ణనము
128. తపోవనాది తీర్థ వర్ణనము
129. ఇంద్ర తీర్థ వర్ణనము
130. ఆపస్తంబ తీర్థ వర్ణనము, ఆపస్తంబోపాఖ్యానం, ఆపస్తంబకృత శివస్తుతి

131. యమతీర్థ వర్ణనము, పరమా ఖ్యానము
132. యక్షిణీ సంగమ మాహాత్మ్య కథనము
133. శుక్లతీర్థ వర్ణనము
134. చక్రతీర్థ వర్ణనము
135. వాణీ సంగమతీర్థ వర్ణనము
136. విష్ణుతీర్థ వర్ణనము
137. లక్ష్మీతీర్థ వర్ణనము
138. మన్వాది త్రిసహస్రతీర్థ వర్ణనము - భానుతీర్థ వర్ణనము
139. ఖడ్గతీర్థ వర్ణనము
140. ఆత్రేయతీర్థ వర్ణనము
141. కపిలా సంగమాఖ్యతీర్థ వర్ణనము
142. దేవస్థానాఖ్యతీర్థ వర్ణనము
143. సిద్ధతీర్థ వర్ణనము
144. పురుష్ణీ సంగమతీర్థ వర్ణనము
145. మార్కండేయతీర్థ వర్ణనము
146. కాలంజరతీర్థ వర్ణనము
147. అప్సరోయుగ సంగమతీర్థ వర్ణనము
148. కోటితీర్థ వర్ణనము
149. నరసింహతీర్థ వర్ణనము
150. పైశాచతీర్థ వర్ణనము
151. నిమ్నభేదతీర్థ వర్ణనము
152. ఆనందతీర్థ వర్ణనము
153. భావతీర్థ వర్ణనము
154. సహస్ర కుండలతీర్థ వర్ణనము
155. కపిలాతీర్థ వర్ణనము
156. శఖహ్రదతీర్థ వర్ణనము
157. కిష్కింధాతీర్థ వర్ణనము
158. వ్యాసతీర్థ వర్ణనము
159. బజరా సంగమతీర్థ వర్ణనము
160. దేవాగమతీర్థ వర్ణనము
161. కుశతర్పణతీర్థ వర్ణనము
162. మన్యుతీర్థ వర్ణనము
163. సారస్వతతీర్థ వర్ణనము, బ్రహ్మ రూపధారి పశునామక రక్షస ఉపాఖ్యానము
164. చిచ్చిక్తీర్థ వర్ణనము
165. భద్రతీర్థ వర్ణనము
166. పతత్రితీర్థ వర్ణనము
167. విప్రతీర్థ వర్ణనము
168. భానుతీర్థ వర్ణనము
169. మిల్లతీర్థ వర్ణనము
170. చక్షుతీర్థ వర్ణనము
171. ఊర్వశీతీర్థ వర్ణనము
172. సముద్రతీర్థ వర్ణనము
173. భీమేశ్వరతీర్థ వర్ణనము
174. గంగాసాగర సంగమ వర్ణనము, సోమతీర్థ వర్ణనము
175. చతుర్విద్యాది తీర్థ వివరణము.

తరువాత వచ్చే 'అనంత వాసుదేవ మాహాత్మ్య వర్ణనము' నుంచి తెలుగు అనువాదం శేషాద్రి శర్మగారి బ్రహ్మపురాణంలో చేయబడింది. ఈ భాగం తప్పితే మిగిలిన ప్రతి అంశాన్ని ఏ మాత్రం వదలకుండా ఈ పురాణం శర్మగారిచేత ఆంధ్రీకరించబడింది.

బ్రహ్మ పురాణము వచనం – నడకుదిటి వీరరాజు పంతులు : ఆధునికులలో వచన కావ్యంగా బ్రహ్మపురాణాన్ని అనువదించిన ఏకైక రచయిత శ్రీ నడకుదుటి వీరరాజు పంతులుగారు. వీరు పిఠాపురంలో ఉంటూ పురాణ గ్రంథమాల అని స్థాపించి దాని ద్వారా నాలుగు భాగాలుగా శివ పురాణ అనువాదాన్ని ప్రకటించిన తరువాత బ్రహ్మపురాణం ఒక భాగాన్ని ప్రకటించారు. ఇది క్రీ.శ.1932లో జరిగింది. ఇది చాలాసంగ్రహంగా యథానువాదంగా సాగిన గ్రాంథిక వచన రచన. కేవలం బ్రహ్మ పురాణంలోని కొంత భాగానికి మాత్రమే ఇది అనువాదంగా కనిపిస్తున్నది. తెలుగులోనికి వచన రూపంలో వచ్చిన బ్రహ్మ పురాణమని సంతోషించాల్సిందేగానీ ఈ వచనాను వాదంలో ప్రత్యేకత ఏమీ లేదు.

వల్లభాభ్యుదయం : శ్రీనాథుడు, పెదపాటి జగ్గన ప్రబంధరత్నావళిలో శ్రీనాథుని వల్లభాభ్యుదయంలోని దని

రజనీ వధూ కర్ణ రజత తాటంకంబు
వలరాజు ధవళోష్ణ వారణంబు
ప్రోషిత యువతి హృత్పుటభేద దాత్రంబు
బహుచకోర కుటుంబ పానపాత్ర
మధుకైట భాసురమథను దాపటి కన్ను
చక్రవాకమ్ముల చల్లచేపు
దుగ్ధ పాథోరాశి తొలిచూలిసంతతి
రోహిణీదేవి తారుణ్యఫలము
చంద్రకాంత శిలాను నిల నృపీట
నిర్జరాంధో వ్యధా మోక్షనియమ వైద్యు
డంధకారచ్ఛటా హలాహల హరుండు
చంద్రుడొప్పారె గాంతి నిస్తంద్రుడగుచు (ప్రబంధరత్నావళి - 464)

అనే చంద్రవర్ణన పద్యం పేర్కొనబడింది. భట్లపెనుమర్తి కోదండరామకవి వ్రాసిన వల్లభాభ్యుదయాన్ని అనుసరించి వల్లభాభ్యుదయం శ్రీకాకుళ ఆంధ్ర విష్ణువు కథే అయి ఉండాలి. భట్లపెనుమర్తి కోదండరామకవి తన వల్లభాభ్యుదయంలో ఈ కథ బ్రహ్మ పురాణంలో నుంచి తీసుకొన్నాని చెప్పాడు. భట్లుపెనుమర్తి కోదండ రామయ్యకు దేవుడు స్వయంగా కనపడి అతనికి ఒక సంస్కృతకోశం ఇచ్చి దానిని తెలిగించమన్నాడట. అందువలన ఈ ఊహచేయబడింది. ఒకచోట ఈ కథ బ్రహ్మాండ పురాణంలోని ఉత్తర ఖండం నుంచి తీసుకొనబడిందని ఒక ప్రముఖ సాహిత్య చరిత్రకారుడు చెప్పారు. వేరొక

చోట బ్రహ్మపురాణంలో శ్రీకాకుళ మహాత్మ్య కథలు లేవు అని ఇది బ్రహ్మాండ పురాణంలో నుంచి తీసుకొనబడినదని కవిచెప్పినట్లుగా అర్థం వచ్చేటట్లు వ్రాశారు. కానీ బ్రహ్మాండ పురాణంలో ఉత్తరఖండం అసలు లేదు.

ఇక బ్రహ్మపురాణంలో పూర్వ ఉత్తర భాగాలు ఉన్నాయి కానీ ఖండాలులేవు. దీనిలో ఎక్కడా శ్రీకాకుళాంధ్ర దేవుని కథ లేదు. ఈ విషయమై ఇంకా పరిశోధన చేయవలసిన అవసరం ఉన్నది.

రసికజన మనోభిరామం కూచిమంచి తిమ్మకవి (క్రీ.శ. 1740) : ఇది క్రీ.శ. 1750లో రచింపబడింది. దీనినే తిమ్మన

రహిమీర బ్రహ్మపురాణోక్త మగుచు గో
దావరీ ఖండం బుఁదనరు నందు
వృద్ధ స్రవంతీ సరిత్వతీ సంగమ
మాహాత్మ్య సన్మమహిమ మదియె
రసిక జనమనోభిరామం బనెడు పేరఁ
దెనుగునఁ శాలివాహన శకాబ్ద
ములఁ గర, గిరి, రస, భూ సంఖ్యఁ దద్దయు
వలలు ప్రమోదూత వత్సరమున
నీ ప్రబంధంబు రచించి నీకొసఁ గితి
నిందు శేఖర నీ కృప నిది ధరిత్రి
నా సుధా కరతారార్క మగుచుఁ గవిజ
నోత్తముల ఇండ్లనే ప్రొద్దు నుండుఁ గాత (6-207)

అని కావ్యరచనా కాలమును తెలిపాడు.

బహుశః చిరకాలం నుంచి దేశంలో వ్యత్యస్తంగా వ్యాప్తిలో ఉన్న కథలను స్థల మాహాత్మ్యాన్ని గూర్చిన గాథలనన్నిటికి ప్రోగుచేసి ఇతడే ఒక ప్రణాళిక ఏర్పాటు చేసుకొని రచించి ఉంటాడని పండితులు అభిప్రాయపడుతున్నారు.

ఈ కవి ఆరాశ్వాల శృంగార ప్రబంధం ఇది. తిమ్మకవి ఈ కథను బ్రహ్మపురాణం 107వ అధ్యాయంలో ఉన్న చిన్నకథను తీసుకొన్నాడు. మూలంలో కేవలం 69 శ్లోకాలలో ఉన్నకథ ఇది. ఇప్పుడు ప్రకటింపబడిన బ్రహ్మపురాణంలో గోదావరి ఖండమనే ఖండ

విభజనలేదు. కేవలం అధ్యాయవిభజనే ఉన్నది. ఇందులోమొదటి 41 అధ్యాయాలను పూర్వ భాగం అంటున్నారు. తరువాతి 204 అధ్యాయాలను ఉత్తర భాగం అంటున్నారు. అచ్చైన ప్రతులలో ఈ విభాగంకూడా కనిపించటంలేదు. బ్రహ్మ పురాణంలోని (బ్రహ్మ పురాణం-ఇతి శ్రీబ్రహ్మమహాపురాణే స్వయం భ్వృషి సంవాదే తీర్థమాహాత్మ్యే తీర్థ భేదవర్ణనం నామ సప్తతి తమోధ్యాయః గౌతమీ మాహాత్మ్యే ప్రథమోధ్యాయః' అని 70వ అధ్యాయం నుంచి గౌతమీ మాహాత్మ్యం అని చెప్పబడింది. ఇదే కూచిమంచి తిమ్మకవి చెప్పిన గోదావరీఖండం ఏమో. ఈ అధ్యాయం నుంచే వింధ్యకు దక్షిణంగా ఉన్న నదులు, తీర్థాల మాహాత్మ్యం చెప్పబడింది. శ్రీ జనమంచి శేషాద్రి శర్మగారు ఈ ఏమాత్రం అనువాదం చేయకుండా వదలివేసిన భాగం ఇదే ఈ భాగం బ్రహ్మ నారద సంవాదంగా కొనసాగింది. ఈ గౌతమీ మాహాత్మ్యం 175వ అధ్యాయం వఱకు కొనసాగింది. ఇది మొత్తం 106 అధ్యాయాలు. తిమ్మకవి కాలంలో ఇది ఖండాలుగా విభజితమేమో మూలంలో ఈ అధ్యాయానికి 'వృద్ధ సంగమ తీర్థమాహాత్మ్య వర్ణన' అనేపేరుఉన్నది.

ఇందులోని ఆరవ ఆశ్వాసం 126 నుంచి 186 వరకు గల 60 పద్యాలు మాత్రమే బ్రహ్మపురాణం 170వ అధ్యాయంలో ఉన్న గోదావరి మాహాత్మ్యంలోని (38వ అధ్యాయంలోని) 'వృద్ధా సంగమ తీర్థ వర్ణనమ్' అనే వృత్తాంతం సరియైన మూలం.

ఉదాహరణకు రెండు శ్లోకాలకు తిమ్మన అనువాదం క్రింద ఇవ్వబడింది.

ఏతావతా బ్రాహ్మణత్వమ్ గౌతమస్యా భవమ్మనే
ఉపాసత్వాంగ్నిమ్ విధివద్గాయత్రీమ్చ మహాత్మనః
తోస్యా యుం ల్వబ్దే పుత్ర గౌతమస్య చిరాయుషః
నదార సంగ్రహమ్ వైభవైవ దాతాస్తి కన్యకామ్

(170వ అధ్యాయం బ్రహ్మపురాణం - 9, 10 శ్లోకాలు)

గాయత్ర్యభ్యసనం బును
వాయు సభోపాసనంబు వదలక యెపుడున్
జే యుచునుండె ద్విజోత్తముc
డా యు ర్వర్ధన మెసంగ నతనికి మిగులన్

తే. అగ్ని కార్యంబు వలన గాయత్రి వలన
బ్రాహ్మణుండను నాకు మాత్రం బుc బెరసెc
గాని విద్యా వధూ పరిగ్రహములబ్ధ
వయ్యె నమ్మేది నీ నిర్జరాన్యయము.

వృద్ధ గౌతముడు అనే ముని ఉండేవాడు. అతనికి ముక్కులేకుండా ఒక కుమారుడు జన్మించాడు. అతడు గౌతముడే. అతడిని బాలగౌతముడనే వారు. ముక్కులేకుండా కురూపిగా జన్మించినందువలన అతడు విద్యా, వేదాధ్యయనం లేకుండా ఉండేవాడు. అయితే ఉపనయనం అయినందువలన నిత్యం అగ్నిహోత్రారాధన చేస్తుండేవాడు. అతడు వేదాధ్యయనం లేకపోయినా యజ్ఞోపవీతం, అగ్ని ఆరాధన ఈ రెండింటిచేతనే బ్రాహ్మణుడుగా చెప్పబడవలసి వచ్చేది. అతడు సొంత ఊరు విడిచి దేశాలు పట్టిపోయాడు. క్రమంగా అతని వయస్సు పెరిగింది. ఎవరూ అతనికి పిల్లనివ్వటానికి రాలేదు. వృద్ధ బ్రహ్మచారిగా మిగిలిపోయాడు. దేశాలుపట్టి తిరుగుతూ తిరుగుతూ ఒకసారి హిమాలయ పర్వతాలకు చేరాడు. అక్కడ ఒక గుహలో ఒక బ్రహ్మచారిణిని చూచాడు. ఆమె చాలా ముదుసలిగా ఉన్నది. ఒంటరిగా ఆమె తపస్సు చేసుకొంటున్నది. ఆమెను చూడగానే వృద్ధ గౌతముడు నమస్కరించాడు. ఆమె నీవు నా భర్తవు నాకు నమస్కరించగూడదన్నది. అప్పుడు చేతులు జోడించి ఆమెను కారణం అడిగాడు. ఆమె తన కథ చెప్పింది.

ఆమె తండ్రి ఋతధ్వజ మహారాజు. గొప్ప వీరుడు. ధర్మపరుడు ఒకసారి ఆయన వేటకోసం వచ్చి ఆ బ్రహ్మచారిణి ఉన్న గుహలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకొని ఉన్నాడు అతనిని గంధర్వరాజ కన్య సుశ్వాను చూసి ప్రేమించింది. వారిద్దరు గాంధర్వ వివాహం చేసుకొన్నారు. రాజుకోరిక తీరిన తరువాత తన రాజ్యానికి వెళ్ళిపోయాడు. అప్పుడు ఆమెకు పుట్టింది. ఆ అప్సరస బిడ్డతో అమ్మ ఈ గుహలో తపస్సు చేసుకొంటుండగా ఎవరు ఈ గుహలో మొదటిసారిగా ప్రవేశిస్తారో అతడే నీ బిడ్డ అని చెప్పింది. అప్పటివరకు కొన్నివేల సంవత్సరాల నుంచి ఆమె

తపస్సు చేసుకొంటున్నది. ఋతధ్వజ మహారాజు ఎనభైవేల సంవత్సరాలు రాజ్యం పాలించాడు. అతని తరువాత అతని కుమారుడు పదివేల సంవత్సరాలు పాలించాడు. ఆమె అదృష్టంకొద్ది అన్ని సంవత్సరాల తరువాత గౌతముడు వచ్చాడు. ఆమె తనను పెళ్లిచేసుకొమ్మంది. పైగా తాను తల్లి దండ్రులు లేని స్వతంత్రురాలనని పలికింది. అతడూ వేయి సంవత్సరాలవాడే. ఆమె తొంభైవేల సంవత్సరాల వృద్ధ స్త్రీ ఆమె కోరికను అతడు తిరస్కరిస్తూ నాకు విద్యలేదు. ముక్కూలేదు. సురూపము లేదు, విద్య లభిస్తేనే గాని పెళ్లి చేసుకోనన్నాడు. అవి రెండు చేతనైతే తనకు కలిగించమన్నాడు. ఆ వృద్ధ కన్య ఈ మాటలు విని సూర్యుడిని ఆరాధించింది. సూర్యుడు ఆమె కోరికను తీర్చి అతనికి చక్కని రూపం, విద్య కలిగేటట్లు చేశాడు. వారు వివాహం చేసుకొని ఆనందంగా కాలం గడుపుతున్నారు. అయితే ఒకసారి కొందరు ఋషులు వారి ఇంటికి వచ్చి ఆతిథ్యం స్వీకరించారు.

కానీ వారి దాంపత్యాన్ని చూచి ఎగతాళిచేశారు. వారు చాలా దుఃఖించి అగస్త్య మహాముని దగ్గఱకు పోయి తమకు తమ రూపాలు చక్కనివి లభ్యం అయ్యే తీర్థంగానీ, క్షేత్రంగానీ చెప్పమని ప్రార్థించారు. అగస్త్యుని వచనం మీద వారు పరమ పవిత్రమైన గౌతమీ నది వద్దకు వెళ్లి ఘోర తపస్సు చేశారు. వారు శివుని, విష్ణువును, గంగను ప్రసన్ననిగా చేసుకొన్నారు. వారికి గంగ ప్రత్యక్షం అయింది. వారితో "మీ మంత్రోచ్చారణ వలన స్థాపనచేసి ఈ కలశంలోని నా జలాన్ని ఒకరిమీద ఒకరు చల్లుకొనండి" అని ఆజ్ఞ ఇచ్చింది. వారు అలా చేయగానే ఆమె చక్కని రూపాన్ని పొందింది. అతడు సుందరమైన పురుషాకారం దాల్చాడు. అభిషేకం చేసిన ఆ జలం నుంచే ఒక నది ఉద్భవించింది. ఆ వృద్ధ స్త్రీ గౌతముల పేరు మీద ఆ నది వృద్ధ గౌతమీ నది అని పిలువబడుతున్నది. అది గంగతో సంగమం అయినట్లుగానే దాని సంగమ స్థానం పరమ పవిత్రంగా గంగచేత వరం ఈయబడింది అక్కడ గౌతమునిచే ప్రతిష్ఠించబడిన శివలింగం వృద్ధ సంగమేశ్వరుడని ప్రసిద్ధి కెక్కాడు.

ఇది ఆ కథ. ఈ కథ మూలంలో 60 శ్లోకాలలో ఉంటే కూచిమంచి తిమ్మ కవి 950 గద్యపద్యాలలో వ్రాశాడు. అయితే ముసలి సరసం, రసిక జనుల మనోభిరామంగా ఉండదు. వృద్ధ కన్య పుట్టటానికి ముందు ఆమె తల్లిదండ్రుల శృంగార గాథను ఆరున్నర ఆశ్వాసాలలో 867 గద్య పద్యాలలో కథనం చేశాడు. వృద్ధ గౌతముడు కథను 103 గద్య పద్యాలలో చెప్పాడు. కథను సమకూర్చక పోయినా తిమ్మన దీనిని పూర్తిగా ప్రబంధోచితంగా మార్చేశాడు. 'తన కాలంలోని రసిక జనులను పాత ప్రబంధాల మూసలో ఇందులోగల ఆఱవ ఆశ్వాసంలోని నూటఇరవై పద్యాలకు, బ్రహ్మపురాణంలోని 19 నుంచి 23 వరకు ఉన్న 5 శ్లోకాలే మూలం అని చెప్పవచ్చు. వాస్తవానికి ప్రధాన కథ ఈ అయిదు శ్లోకాలలో ఉన్నదే. తిమ్మన రసిక జనమనోభి రామంలో దీనిని అప్రధాన కథ చేశాడు. మూలంలో అప్రధాన కథయైన వృద్ధ తండ్రి వృత్తాంతం, తిమ్మన రచనలో ప్రధాన కథయై ప్రబంధానికి కావలసిన హంగులను సమకూర్చుకొని రసిక జనులకు మనోభిరామం అయింది.

మూలంలో సూచనప్రాయంగా మాత్రమే ఉన్న స్తోత్రాలు వర్ణనలు రసిక జనమనోభి రామంలో విస్తరింపబడ్డాయి. వృద్ధ కన్యక వాణీ వైశ్వానరులను ప్రార్థించి గౌతమునికి విద్య వలన సుందర రూపాన్ని కలిగించినట్లుగా మూల బ్రహ్మపురాణంలో ఒక శ్లోకంలో ఉండగా తిమ్మన రచన ఆరు పద్యాలైంది. మూలంలో గౌతముడు శివ కేశవులను గంగా నదిని కేవలం మూడు శ్లోకాలలో ప్రార్థింపగా తిమ్మన రచనలో రెండు పద్యాలు శివునికి.

విష్ణువుకు ఒక దండకం, గంగకు మూడు పద్యాలు కేటాయింపబడ్డాయి. మూలంలో వర్ణనలను విపులీకరిస్తూ సాగర వర్ణనను తిమ్మన సాగరంలాగా ఇరవై అయిదు పద్యాలలో చేశాడు. యాసతో చెప్పిన కార్యాలే మనోభిరామములని తిమ్మయ్య ఆ పద్ధతిలోనే రచన చేశాడు. కథంతా రొటీను ప్రబంధమే అయినా తిమ్మన మూలాన్ని అక్కడకూడా అనువాదం చేసినట్లే ఉన్నది. చూడండి.

మూలంలో

పుత్రోఽయం తవపౌత్రో వావృధే కో గౌత మోఽ భవత్
సత్యం వదస్య కల్యాణి ఇత్యేవం జహసుర్ద్వి జాః (బ్రహ్మపురాణం 107-46)

దీనికి తిమ్మ కవి అనువాదం

పడతిరొ నిజముగ నీతడు
కొడుకో మనుమండొ నీకు గొంచింపక యే
ర్పడ దెలుపుము మా కనుచుం
గడునడి గిరొక కొందరుత్సుకత మీరంగన్ (రసిక 6-161)

ఇలాగే

వృద్ధునకు యువతి విషమగు
వృద్ధసతికి యువజనుండు వెలయగ సుధయే
సిద్ధమని కొంద రపుడా
వృద్ధా గౌతముల నెగ్గులెన్నిరి పెలుచన్ (రసిక 6-163)

అనే తిమ్మకవి పద్యానికి సంస్కృత మూలం ఇది.

విషం వృద్ధ స్వయువ తీరుద్ధాయా అమృతం యువా
ఇష్టానిష్ట సమాయోగో దృష్టోఽస్మాభి రహో బరాత్ (బ్రహ్మపురాణము 107-47)

దీనికి తిమ్మకవి వృద్ధ స్రవంతీ సరిత్సతి సంగమ మాహాత్మ్యం అనే కథగా తెలిపి రసికజన మనోభిరామం అని పేరు పెట్టారు. ఈ కథ గౌతమీ మాహాత్మ్యాన్ని తెలిపేది. గోదావరీ నది ధవళేశ్వరం దిగువన రెండు పాయలుగా చీలుతుంది. వీటిల్లో పడమటి పాయను వసిష్ఠ అని, తూర్పు పాయను గౌతమి అని అంటారు. వీటిలో ఈ గౌతమీ మాహాత్మ్యమే బ్రహ్మపురాణంలో చెప్పబడింది.

ఇలా బ్రహ్మపురాణం తెలుగు కవులను కొంతవరకు ఆకర్షించింది అని చెప్పవచ్చు. పూర్తిగా తెలుగు కవులు ప్రాచీనులు కూడా దీనిని అంటుకోలేదు అనటానికి వీలులేదు.

జాహ్నవీ మాహాత్మ్యం - ఏనుగు లక్ష్మణ కవి : క్రీ.శ. 18వ శతాబ్దిలో జీవించిన ఏనుగు లక్ష్మణకవి రచించిన ప్రసిద్ధ కావ్యాలలో జాహ్నవీ మాహాత్మ్యం ఒకటి. ఇది కాకినాడ శలపాక మహాస్థల రాజ్యభర్త శ్రీ నండూరి కామ మంత్రి ప్రేరణచేత రచింపబడి వెంటూరి సోమేశ్వర స్వామికి అంకితము చేయబడిన గ్రంథము. కృతిప్రేరకుడైన కామమంత్రి "శంకర జటాజూట అలంకారంబును త్రిలోక పావనియు, సకల పురుషార్థ సంధాయిని జాహ్నవీ మాహాత్మ్యంబును వివిధ పురాణ ఫక్కికలు వక్కాణించు గావునఁ దత్కథా విశేష సంగ్రథన చమత్కృతి బంధురంబుగాఁ బ్రబంధంబు సంఘటింపుము" అని ఆనతిచ్చినట్లుగా చెప్పబడినది. లక్ష్మణకవి కూడా **"సకల పురాణ ప్రసిద్ధంబగు శ్రీ జాహ్నవీ మాహాత్మ్యంబు త్రిలింగ దేశ భాషా విశేషంబునఁ ప్రబంధంబు రచింపబూని"** నట్లుగా చెప్పుకొన్నాడు.

అవతారికలోనిపై వచనాలు పరిశీలిస్తే దీనికి మూలం ఏ పురాణం నుంచి తీసుకొన బడిందో చెప్పలేదు. కానీ లక్ష్మణకవి ఆయా కథాంశాలు తెలుపవలసి వచ్చినప్పుడు తానే మూల గ్రంథమునుంచి ఆ భాగాన్ని తీసుకొన్నది సూతవాక్యంగా తెలిపాడు. ఆయా సూత వాక్యాలను క్రోడీకరించినప్పుడు, ఆయా మూల గ్రంథాలలో అనువాదాలను పోల్చి నప్పుడు జాహ్నవీ మాహాత్మ్యానికి ముఖ్యంగా పద్మపురాణం ఉత్తరఖండం బ్రహ్మ పురాణం, రామా యణ బాలకాండలోని సగర చరిత్ర, గంగోత్పత్తి అనేవి ముఖ్య మూలాలైనట్లుగా గ్రహింపవచ్చు.

ఈ ప్రబంధంలోని నారదునికి బ్రహ్మ చెప్పిన జాహ్నవీ సంభవ వృత్తాంతానికి మూలం బ్రహ్మ పురాణంలోని 71, 72 అధ్యాయాలలోని గంగోత్పత్తి కథోపక్రమమే. ఇలాగే అక్కడ కూడా మరికొన్ని ఈ పురాణం నుంచి గ్రహించిన విశేషాలే ప్రబంధంలో చోటుచేసుకొన్నాయి.

బ్రహ్మపురాణం ధర్మోపదేశము

ధర్మాన్ని గురించి తెలుపుతూ ఈ పురాణం

ధర్మేణ రాజ్యం లభతే మనుష్యః స్వర్గంచ ధర్మేణ నరః ప్రయాతి
ఆయుశ్చ కీర్తించ తపః ప్రతిష్ఠాం ధర్మేణ మోక్షం లభతే మనుష్యః

మనుష్యునికి ధర్మంవల్ల రాజ్యం లభిస్తుంది; స్వర్గప్రాప్తి కలుగుతుంది. ఆయువు, కీర్తి, తపస్సు, ప్రతిష్ఠలతో పాటు మనుష్యునికి మోక్షం కూడా ధర్మం వలననే కలుగుతుంది అని బోధిస్తున్నది.

పరస్త్రీలను కామించరాదనీ, అలాచేస్తే ఆ పురుషులు పాపాత్ములై నపుంసకులు అవుతారని హెచ్చరిస్తున్నది బ్రహ్మపురాణం.

భక్తి-ముక్తి ప్రదాయకమైన ఒక కథ ఈ పురాణంలో ఇలా ఉంది.

పూర్వం గౌతమీ నదీతీరంలో "కండువు" అనే మహర్షి ఉండేవాడు. ఇతడు సత్యవాది. ఇంద్రియ నిగ్రహం కలవాడు మరియు వేద-వేదాంగాల్లో నిష్ణాతుడు. కంద-మూలాలు, సమిధలు, చక్కని పుష్పాలతో కూడిన ఒక ఆశ్రమంలో మౌనదీక్షతో ఉగ్రతపస్సు చేస్తుండేవాడు. వేసవిలో పంచాగ్నుల నడుమ, వానాకాలంలో కటికనేలమీద, చలికాలంలో తడిబట్టలతోనూ సాగిందీ తపస్సు. ఈ తపోదీక్షను చూసి దేవతలు ఆశ్చర్య పోయారు. తపోభంగం చేయటానికి "ప్రమ్లోచ" అనే అప్సరసను ఇంద్రుడు ఆదేశించాడు. తనకంతటి శక్తి-సామర్థ్యాలు లేవనీ, ఊర్వశి మొదలైనవారే ఇందుకు తగినవారనీ అంది ప్రమ్లోచ. "మరేంపరవాలేదు, మన్మథుడు, వసంతుడు, వాయువు నీకు తోడుగా ఉంటారు. నిర్భయంగా వెళ్ళు" అన్నాడు ఇంద్రుడు.

కండువు ఆశ్రమానికి వెళ్ళిందామె. తన గీత నృత్యాలతో ముని తపస్సును భంగం చేసింది. ఆమె సౌందర్యాన్ని చూసి ముని చలించిపోయాడు. మనసు వశం తప్పింది. ఆమె వివరాలను అడిగాడు. పూలకోసం వచ్చానన్నది. ముని తనను ఆదేశిస్తే ఆజ్ఞను శిరసా వహిస్తానన్నది. మరేమీ మాట్లాడక ముని సాదరంగా ఆమెను ఆశ్రమంలోనికి తీసికెళ్ళాడు. తపోబలంతో దివ్యరూప-యౌవనాలు, చక్కని వస్త్రాలు పొందాడు. ఇదివఱ కున్న గడ్డాలు ఇప్పుడు అడ్డుగా లేవు. అతని సౌందర్యం చూసి ఆశ్చర్యపోయింది ప్రమ్లోచ. కామవశు డయ్యాడు ఆముని. జప-హోమాదులు, ఉపవాస నియమాలు పూర్తిగా మరచాడు. పగలు-రేయనే తేడాలేక ఆమెతో సర్వదా కలిసేఉన్నాడు. ఇలానూరేళ్ళు గడిచాయి. "నేను స్వర్గానికి వెళ్ళాలి" అంది ప్రమ్లోచ. మరి కొద్దిరోజులు ఆగమన్నాడు. సరే అంది. ఇంకో నూరేళ్ళు గడిచాయి. ఇలా ఎన్నోసార్లు జరిగింది.

ఇలా ఉండగ, ఒకరోజు హడావిడిగ ఆశ్రమం నుంచి బయల్దేరాడు ముని. "ఎక్కడికి?" అడిగింది ప్రమ్లోచ. "తెల్లవారింది కదా సంధ్యావందనానికి వెళ్ళాలి. లేకపోతే అనుష్ఠానం లోపిస్తుంది" అనిముని సమాధానం ఇచ్చాడు. ఆ అప్సరస "ఇప్పుడా నీకు తెల్లవారింది? నీ అను ష్ఠానం ఎప్పుడో దారి తప్పింది" అన్నది. "అదేమిటి? కొద్దిసేపటి క్రితమే కదా నీవొచ్చావు" అన్నాడు. "నేను వేకువ ఝామున వచ్చిన విషయం వాస్తవమే. అయితే అది ఇవాళకాదు. కొన్ని వందల సంవత్సరాల క్రితము" అన్నదామె. నమ్మలేదు

ఆ ముని. ఇప్పటికి 907 సంవత్సరాల, ఆరునెలల, మూడు రోజులైనదనే నగ్నసత్యం తెలియజేసింది ప్రమ్లోచ. జ్ఞానోదయమైంది మునికి. తన అపచారం తెలిసికొన్నాడు. వివేకం దారి తప్పినందుకు పశ్చాత్తాపం చెందాడు. తనను తాను తిట్టుకొన్నాడు. ప్రమ్లోచను వెంటనే వెళ్ళిపొమ్మన్నాడు. భయంతో స్వర్గానికి తిరిగి వెళ్ళిందామె.

తన పాప ప్రక్షాళనకై ఆశ్రమం వదలి పురుషోత్తమ క్షేత్రానికి వెళ్ళాడు. దక్షిణ సముద్రతీరంలో ఉన్నదా క్షేత్రం. మోక్షప్రదాయకము ఆ క్షేత్రం. అదే పూరీజగన్నాథం. ఏకాగ్రచిత్తుడై జగన్నాథస్వామిని సేవించాడు. ఊర్ధ్వబాహువులతో "బ్రహ్మపారము" అనే మహామంత్రం జపించాడు. అచంచలమైన అతని భక్తికి సంతోషించాడు స్వామి. ప్రత్యక్ష మయ్యాడు. మోక్షంకోరాడు ముని. ఈ క్షేత్రంలో నిత్యము తనను కొలిస్తే అభీష్టం నెఱవేఱు తుందన్నాడు జగన్నాథుడు. అలాగే ఆచరించాడు ముని. కొంతకాలం తర్వాత స్వామి అతనికి ముక్తిని ఇచ్చాడు.

కార్తవీర్యార్జుని కథ : ఇలా ఎన్ని సుగుణాలు ఉన్నా కన్నుకానని అహంకారం ఉండరాదని **'బుద్ధిః కర్మానుసారిణీ'** అని ఈ పురాణం తెలుపుతు అందుకు ఉదాహరణగా కార్తవీర్యార్జు నుని కథను చెప్పింది.

పురువంశంలో కనక్కుడనే రాజుండేవాడు. అతనికి కృతవీరుడు, కృతా జసుడు, కృతధన్వుడు, కృతాగ్ని అని నలుగురు కొడుకులు. కృతవీరుని పుత్రుడే కార్తవీర్యార్జునుడు. ఇతడు సమస్త భూమండలాన్ని పాలించాడు. పదివేల సంవత్సరాలపాటు మహా భయంకర మైన తపస్సుచేసి దత్తాత్రేయ స్వామిని ప్రసన్నం చేసికొన్నాడు. నాలుగు కోరికల్ని కోరాడు. (1) వేయిచేతులుండటం, (2) సజ్జనులను రక్షించడం, (3) ధర్మ పరిపాలన, (4) యుద్ధరంగంలో తనకంటె గొప్పవీరుని చేతిలో వీరమరణం పొందడం. ఇవీ అతనికోరికలు. "తథాఽస్తు" అన్నాడు దత్తాత్రేయస్వామి. సప్తద్వీపాల్లో ఏడు వందల యాగాలు చేశాడు. ఇతని అద్భుతచరిత్రను నారదుడనే గంధర్వుడు గానం చేశాడు. లంకాధిపతి రావణుని అవలీలగా గెలిచి మాహిష్మతీ నగరంలో బంధించాడు. చివఱికి రావణుని తండ్రి పులస్త్య బ్రహ్మ పుత్రభిక్ష కోరగా అతన్ని వదిలేశాడు కార్తవీర్యార్జునుడు.

ఒకసారి అగ్నిదేవుడు తన దాహం తీర్చమని కార్తవీర్యార్జునుణ్ణి కోరాడు. వెంటనే సప్తద్వీపాల్ని అతనికి భిక్షగ ఇచ్చాడు. అంతే, అగ్ని సప్తదీపాల్లోని కొండలు, అడవులు మొదలైన వాటిని అన్నిటినీ దహించాడు. ఆపవుడు అనే ముని ఆశ్రమం కూడా అగ్నికి ఆహుతైంది. వరుణ పుత్రుడైన ఆపవుడు మహాతపస్వి. ఆ దృశ్యాన్ని భరింపలేక జమదగ్నికి

పుట్టబోయే పరశురాముడు కార్తవీర్యార్జునుణ్ణి సంహరించగలడని శపించాడు ఆ ముని. ఆ శాప ప్రభావమైతేనేమి, తను కోరిన వరం ప్రకారమైతే నేమి చివఱికి పరశురాముని చేతిలో వీరమరణం పొందాడు కార్తవీర్యార్జునుడు.

కార్తవీర్యస్య యోజన్మ కథయేదిహ నిత్యశః ।
న తస్య విత్తనాశః స్యాన్నష్టం ప్రతిలభేచ్చ సః ॥

ఈ కార్తవీర్యార్జుని చరిత్రను ఎవరైతే నిత్యము చదువుతారో వారికి ధననాశం కలుగదు. పోయిన సొమ్ము తిరిగి వస్తుందనీ ఈ శ్లోకం భావం.

అద్భుతమైన ఈ కార్తవీర్యార్జుని చరిత్ర బ్రహ్మపురాణంలో ఎంతో విపులంగా ఉంది.

బ్రహ్మపురాణంలోని స్తుతులు-స్తోత్రాలు

(మొదటి సంఖ్య అధ్యాయాన్ని తరువాతవి శ్లోక సంఖ్యను తెలుపుతాయి)

1.	మహావిష్ణు స్తుతి	లోమహర్షణుడు	పురాణ కథన ప్రారంభం (1-21-24)
2.	వ్యాసస్తుతి	లోమహర్షణుడు	పురాణ కథన ప్రారంభం (1-25-29)
3.	సూర్యస్తుతి (21 నామములు)	బ్రహ్మ	మునులకు ఆదిత్య మహాత్మ్యము తెల్పుచు (31-31-33)
4.	సూర్యస్తుతి (21 నామములు)	అదితి	అదితి సంతానము కొరకు సూర్యుని కోరిన సందర్భము(32-12-16)
5.	సూర్యస్తుతి	బ్రహ్మ దేవతలు	సూర్యుని తరణి పట్టునప్పుడు మూడు లోకములు ఆకులము కాగా(32-89-109)
6.	సూర్య అష్టోత్తరశతి	బ్రహ్మదేవతలు	మునులకు (33-34-49)
7.	శివస్తుతి	బ్రహ్మ	శివకళ్యాణ సమయంలో(36-39-56)
8.	శివస్తుతి	బ్రహ్మ	శివకళ్యాణ సమయంలో (37-2-26)
9.	శివస్తుతి (శివసహస్ర నామములు ఫలశ్రుతి)	దక్షుడు	దక్షయజ్ఞ ధ్వంసం తరువాత (40-2-81)
10.	బ్రహ్మస్తుతి	యమధర్మరాజు	పురుషోత్తమ క్షేత్రం దర్శించిన జనులు యమ లోకమునకు రాకుండుటచే (45-60-67)

11.	కారుణ్యస్తవము	ఇంద్రద్యుమ్నుడు	జగన్నాథ మందిర నిర్మాణం తరువాత	(49-1-59)
12.	పురుషోత్తమ స్తోత్రం	ఇంద్రద్యుమ్నుడు	జగన్నాథుని దర్శనము చేసికొన్నప్పుడు	(51-10-16)
13.	బాలకృష్ణస్తుతి వటపత్రశాయి	మార్కండేయమహర్షి ఇచ్చినప్పుడు	జగన్నాథుడు వటపత్రశాయిగా దర్శనము	(55-11-34)
14.	కల్పవృక్ష (మఱ్ఱి చెట్టు) స్తుతి	మార్కండేయుడు	మార్కండేయ హ్రదములో స్నానానంతరము	(57-13, 14)
15.	శివస్తోత్రం	మార్కండేయుడు	మార్కండేయ హ్రదములో స్నానానంతరము	(57-8)
16.	శివస్తోత్రం	మార్కండేయుడు	మార్కండేయ హ్రదములో స్నానానంతరము	(57-3,4)
17.	బలరామ స్తుతి	మార్కండేయుడు	మార్కండేయ హ్రదములో స్నానానంతరము	(57-22-23)
18.	శ్రీకృష్ణస్తుతి (పురుషోత్తముడు)	మార్కండేయుడు	మార్కండేయ హ్రదములో స్నానానంతరము	(57-33-40)
19.	సుభద్రాస్తుతి	మార్కండేయుడు	మార్కండేయ హ్రదములో స్నానానంతరము	(57-58)
20.	విష్ణుస్తోత్రం	శ్వేతుడు అను చక్రవర్తి	పురుషోత్తమ దర్శనానంతరము	(59-34-64)
21.	తీర్థరాజస్తోత్రం -			(60-44)
22.	అష్టాక్షరీమంత్ర సంపుటి	బ్రహ్మ		(61-4-38)
23.	కృష్ణ స్తవము	బ్రహ్మ		(65-49-51)
24.	బ్రహ్మపారస్తవము	కండుమహాముని		(178-115-118)
25.	శ్రీకృష్ణస్తుతి	కండుమహాముని		(178-129-177)
26.	గరుడధ్వజస్తుతి	బ్రహ్మ		(180-20-25)
27.	కృష్ణస్తవం	అక్రూరుడు	కృష్ణ దర్శనం తరువాత	(192-48-58)
28.	కృష్ణస్తుతి	వసుదేవుడు	కంసవధానంతరం	(193-80-90)

29.	కృష్ణస్తుతి	ముచికుందుడు	శ్రీకృష్ణుని దర్శనం తరువాత	(196-27-45)
30.	కృష్ణస్తుతి	భూదేవి	నరకాసుర వధానంతరం	(202-23-29)
31.	విష్ణుస్తుతి	అదితి	నరకుడు అపహరించిన మణికుండలము లను కృష్ణుడు తిరిగి ఇచ్చిన తరువాత	(203-6-19)
32.	యజ్ఞవరాహ స్తుతి	వరాహావతార వర్ణన		(213-12-27)
33.	విష్ణుస్తుతి	పితృదేవతలు	కోకాతీర్థ మాహాత్మ్య వర్ణన సందర్భము	(219-31-35)

బ్రహ్మపురాణ దానమహాత్మ్యము - ఫలశ్రుతి

దానం ఇవ్వతగిన (పాత్రులైన) వారిలో సర్వశ్రేష్ఠుడైనవాడు ఎవ్వడు అనే ప్రశ్నకు ఈ పురాణం

సర్వేషామేవ పాత్రాణాం శ్రేష్ఠం పాత్రం పురాణవిత్
పతనాత్రాయతే యస్మాత్పాత్ర ముదాహృతమ్
బ్రాహ్మణేషు పురాణేషు గఙ్గాయాం గోషుపిప్పలే
నారాయణధియా పుమ్భిర్భక్త కార్యాహ్యహేతువే

అని పురాణజ్ఞుడైన విద్వాంసుడే సర్వశ్రేష్ఠుడు, సత్పాత్రుడని ఈ పురాణం తెలుపుతున్నది. అతడే నరకమునుండి తప్పించగలవాడని ఘంటాపథంగా తెలుపుతూ పురాణ విదుని శ్రేష్ఠతను ప్రకటిస్తున్నది.

ఈ పురాణాన్ని వ్రాయటం, చదవటం వలన, దానం ఇవ్వటం వలన కలిగే ఫలితాన్ని తెలుపుతూ, బ్రహ్మపురాణాన్ని శ్రవణంచేత గానీ మననం చేతగానీ కోరుకొన్న సర్వకోరికలు సిద్ధిస్తాయని

శృణోతియః పురాణస్తు బ్రాహ్మం సర్వజితేన్ద్రియః
హవిష్యాశేచ నియమాత్ సలభేద్ బ్రహ్మణః పదమ్
కిమత్ర బహునోక్తేన యద్ యదిచ్ఛతి మానవః
తత్సర్వం లభతే వత్స! పురాణస్యాయ కీర్తనాత్.

అని చెప్తున్నది ఈ పురాణం.

అస్యశ్రవణ ఫలమితి కర్తవ్యతా నిర్దేశో యథా
సూత శౌనక సంవాదం భుక్తిముక్తి ప్రదాయకమ్
లిఖిత్వైత త్పురాణం యో వైశాఖ్యాం హేమ సంయుతమ్
జలధేను యుతఞ్చాపి భక్త్యాదద్యాత్ ద్విజాతయే
పౌరాణి కాయసం పూజ్యవస్త్రభోజ్య విభూషణైః
సవసేద్ బ్రహ్మణో లోకే యావచ్చన్ద్రార్క తారకమ్
యః పఠేచ్ఛృణు ద్వాఽపి బ్రహ్మను క్రమణీం ద్విజ !
సోపి సర్వ పురాణస్య శ్రోతుర్వ క్తుః ఫలం లభేత్
శృణోతి యః పురాణన్తు బ్రాహ్మం సర్వజితేన్ద్రియః
హ విష్యాశీ చనియమాత్ స లభేద్ బ్రహ్మణః పదమ్
కిమత్ర బహునోక్తేన యద్ యదిచ్ఛతి మానవః
తత్సర్వం లభతే వత్స! పురాణస్యాస్య కీర్తనాత్

సూతుడైన లోమహర్షణుడు శౌనకాది మహామునులకు ఉపదేశించిన ఈ పురాణము భుక్తి ముక్తులను కలిగించును. ఎవరు ఈ పురాణాన్ని వైశాఖ మాసంలో బంగారముతో చేయబడిన జలధేవును భక్తితో ద్విజులకు దానముగా గాని వస్త్రములు భోజన పదార్థములు ఆభరణములతో సమర్పించు కొందురో అతడు బ్రహ్మలోకము నందు ఆచంద్రార్క తారకముగా నివసించగలడు. అట్లే ఈ బ్రహ్మ పురాణమును చదువుటచే గానీ, వినుటచేత గానీ అతడు సర్వపురాణములను వినిన, చెప్పిన ఫలమును పొందగలడు. బ్రహ్మ పురాణమును జితేంద్రియుడై ఎవడు వినునో అతడు బ్రహ్మలోక పదవిని పొందగలుగును. దీనిని గురించి ఎక్కువ చెప్పుట ఎందుకు. ఎవరు ఏమేమి కోరుకొందురో వారికి అట్టి కోరికలు ఈ పురాణ పఠనముచే కలుగగలవు.

ఏతద్ బ్రహ్మపురాణం ।
సర్వ పాపఘ్నం సర్వ సౌఖ్య ప్రదాయకమ్ ॥ (245-36)

దీనిని అధ్యయనం చేయటంచేత సకల పాప నివృత్తి, సర్వవిధ సుఖావాప్తి కలుగుతుంది.

ఇదం యః శ్రద్ధయా నిత్యం పురాణం వేదసమ్మితమ్ ।
యః పఠేచ్ఛృణుయాన్మర్త్యః స యాతి భువనం హరేః ॥

ఎవరైతే ఈ బ్రహ్మపురాణాన్ని శ్రద్ధగావిందురో లేక చదివెదరో వారు హరి నిలయమైన వైకుంఠం చేరగలరు.

తథాఽస్తు

ఓం గణేశాయ నమ :
ఓం నమో భగవతే వాసుదేవాయ నమ :

శ్రీ బ్రహ్మ మహాపురాణం

నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్

తా. శ్రీమన్నారాయణునికి మనుష్యులలో ఉత్తముడైన నరునికి నమస్కారముచేసి, సరస్వతీ దేవికి సన్నుతులుచేసి జయము అను ఈ పురాణమును చెప్పుదును.

యస్మాత్సర్వమిదం ప్రపంచరచితం మాయాజగజ్జాయతే
యస్మింస్తిష్ఠతి యాతి చాంతసమయే కల్పాను కల్పేపునః
యం ధ్యాత్వా మునయః ప్రపంచ రహితం విందంతి మోక్షం ధ్రువం
తం వందే పురుషోత్తమాఖ్య మమలం నిత్యం విభుం నిశ్చలం

ఎవనివలన ఈ కనిపించుచున్న పంచభూత పంచీకృతము, మాయా కల్పితము అయిన జగము అంతయు పుట్టుచున్నదో, ఎవ్వనియందు ఉనికిని (స్థితిని) పొందుచున్నదో, ఎవ్వని యందు చిట్టచివర కల్పము నందు అనుకల్పము అనులీనమగుచున్నదో, ఎవ్వని ధ్యానించి మునులు దృశ్యాత్మక ప్రపంచమునకు అతీతమైన, శాశ్వతమైన మోక్షమును పొందుదురో, అట్టి నిత్యమైన నిశ్చలమైన స్వయంప్రకాశమైన పురుషోత్తముడు అని పిలువబడు స్వచ్ఛమైన తత్వమును పరమాత్మకు నమస్కరించుచున్నాను.

యం ధ్యాయంతి బుధాః సమాధిసమయే శుద్ధం వియత్సన్నిభం
నిత్యానంద మయం ప్రసన్న మమలం సర్వేశ్వరం నిర్గుణమ్
వ్యక్తావ్యక్తపరం ప్రపంచ రహితం ధ్యానైక గమ్యం విభుం
తం సంసార వినాశహేతు మజరం వందే హరిం ముక్తిదమ్

ఎవనిని శుద్ధుని (గుణరహితుని) ఆకాశమువలె సర్వమునందు వ్యాపించి ఉన్నవానిని, సమాధి సమయ మందు జ్ఞానులు ధ్యానింతురో అట్టి నిత్యానంద స్వరూపుని ప్రసన్నుని,

నిర్మలుని, నిర్గుణుని, సర్వేశ్వరుని, వ్యక్తావ్యక్త స్థితికి అతీతమైన వానిని, ప్రపంచశూన్యుని (ద్రష్టయైన వానిని) ధ్యానమాత్రము చేతనే గమ్యమైన ప్రకాశరూపుని, జనన మరణాత్మకమైన సంసారమునకు వినాశహేతువైనవానిని, అజరుని మోక్షమును అనుగ్రహించువానిని (ముకుందుని), హరిని ధ్యానించెదను.

అది మిక్కిలి పుణ్యవంతమైన నైమిశారణ్యము. పవిత్ర భూమి. పరమ సుందరము. మునిజన సమ్మర్దము. పలురకముల పువ్వులతో శోభించుచున్నది. సరళ తెల్లతెగడ కొండగోగు. పనస, ధవ (ఉమ్మెత్త), చంద్ర, మామిడి, నేరేడు, వెలగ, మఱ్ఱి, దేవదారు, రావి, పారిజాత, చందన, అగరు, పాటల (కలిగొట్టు), వకుల (పొగడ), సప్తపర్ణ (ఏడాకుల అరటి), పున్నాగ సురపొన్న, నాగకేసర (నాగకింజల్కము) శాల (బొద్దుగ) తాల (తాడి), తమాల (చీకటి మ్రాను), అర్జున (జువ్వి), నారికేళాది, మహావృక్షములతో, చంపకము (సంపెంగ) మొదలైన పుష్పలతలతో శోభితము, వివిధ పక్షిమృగకుల సమూహములచేత కలకలారావ సంకులితము, నానావిధ పుణ్య సరస్సులు దిగుడుబావులతో శోభిల్లుచున్నది. బ్రాహ్మణాది చతుర్వర్ణములవారు, బ్రహ్మచర్యాది నాల్గు ఆశ్రమములవారు స్వధర్మానుష్ఠాన నిరతులై అందు వసింతురు. సర్వసంపన్నమైన గోసంపదతో అది రాణించును. యవ గోధుమ చణక (సెనగలు), మాష (మినుము), ముద్గ (పెసర), తిల (నువ్వు), ఇక్షు (చెఱకు) మొదలగు సస్యములతో నిండి ఉన్నది.

అగ్నిహోత్రుడు, ఆజ్యాది హవిర్హోమములచేత ఉద్దీపింప, నైమిశారణ్య వాసులగు మునులు తాము ఆరంభించిన ద్వాదశవార్షిక సత్రయాగమునకు ఎందరో మునులు, ద్విజులు అచ్చటకు వచ్చిరి. వారివారికి ఆ మున్యాశ్రమములయందలి గృహ యజమానులు యథోచితపూజలు ఆచరించిరి. ఋత్విక్కులతో వారు యజ్ఞ సదస్సునందు ఆసీనులై ఉండగా మహా బుద్ధిమంతుడు మహర్షి అయిన లోమహర్షణుడు అను సూతుడు ఆ ప్రదేశమునకు అరుదెంచెను. మునివరులు ఆయనను చూచి సంతుష్టులైనవారై, సంతోషముతో ఆయనను పూజించిరి. ఆయనయు వారికి ప్రతిపూజచేసి, వారు ఏర్పాటుచేసిన ఆసనమును అలంకరించెను. ఋషులు అన్యోన్య ప్రసంగములు కావించిరి.

ఋత్విక్కులతో సదస్యులతో గోష్ఠి అయిన తరువాత యజ్ఞదీక్షితులు ఆయనను "సాధూత్తమ! నీవు వేదశాస్త్ర పురాణములందు భారత ఇతిహాసమునందును, మోక్ష శాస్త్రమగు భాగవతమునందలి సర్వవిషయములను తెలిసినవాడవు. దేవతల యొక్కయు, రాక్షసుల యొక్కయు జన్మ, కర్మ వృత్తాంతములు నీకు తెలియనివి లేవు. సుర అసుర

యక్ష, గంధర్వ, పన్నగ, రాక్షస వర్గము కల్గినదైన ఈ సృష్టి యెట్లు జరిగినది? ఎట్లు పెరిగినది. ఎట్లు అంతమైనది? వినదలంచుకొంటిమి, ఆ సర్వవిషయములను మాకు ఆనతిమ్ము" అని ప్రశ్నించిరి.

వారి సంప్రార్థనను శ్రద్ధగా ఆలకించిన లోమహర్షణుడు ఇట్లనియెను :

అవికారుడు (షడ్భావ వికారములు అనగా 1.ఉనికి, 2.పుట్టుట, 3.పెరుగుట, 4.తఱుగుట, 5.పరిణమించుట (మార్పుచెందుట), 6.నశించుట అను ఆరు వికృతులు లేనివాడు) శుద్ధుడు (ఎట్టి గుణ సంగము లేనివాడు), నిత్యుడు, నిత్యసత్తా స్వరూపుడు విష్ణువు (సర్వ వ్యాపకుడు), సర్వము జయించువాడు, హిరణ్యగర్భుడు, సృష్టి కర్త, హరి, శంకరుడు, వాసుదేవుడు, సర్వదేవతలకు (జ్యోతిస్వరూపులకు) నివాసమైనవాడు, తరింపజేయువాడు, సృష్టి స్థితి లయములను చేయువాడు. ఏకరూపము, నానారూపము తానే అయినవాడు, స్థూలము (సాకార సగుణ రూపము) సూక్ష్మము (అంతర్యామి జ్ఞాన రూపము) నైన వాడు. ఆ విధముగ వ్యక్తము, అవ్యక్తము అయినవాడు, ముక్తికి కారణమైన వాడు, జగన్నిర్మాణ పరిపాలన లయములు చేయువాడు, అజరుడు, ముదిమి లేనివాడు, అమరుడు (మరణములేనివాడు) సర్వమూలము (బీజము) అయినవాడు, సర్వము తానే అయిన ఆ పరమాత్మకు నమస్కారము. అంతేగాక

వ్యాస స్తుతి

ప్రపంచమునకు ఆధారమైనవాడు, అణువుకంటె అణువైనవాడు, సర్వ భూతములందు ఉండువాడు, అచ్యుతుడు, జ్ఞానమూర్తి, మిక్కిలి స్వచ్ఛమైనవాడు, పరమార్థముగ నిర్మలుడు (గుణ సంగము లేనివాడు), భ్రాంతి దృష్టికి జగముగ (వస్తువుగ) తోచువాడు, సర్వవ్యాపకుడు, సర్వము కబళించువాడు, సృష్టి స్థితులను తానేచేయు స్వతంత్రుడు, సర్వజ్ఞుడు, జగదీశ్వరుడు, పుట్టుట, హాని వృద్ధులు లేనివాడు, ఆద్యుడు మిక్కిలి సూక్ష్మమైన వాడును అగు విశ్వేశునికి బ్రహ్మాదులకు నమస్కరించి ఇతిహాస పురాణవేత్త వేదవేదాంగ పారగుడు సర్వశాస్త్ర తాత్పర్య రహస్యము ఎఱిగినవాడు పరాశరకుమారుడును అగు నా గురునికి వ్యాస భగవానునికి మ్రొక్కి, వేద తాత్పర్యమైన పురాణమును చెప్పుచున్నాను అని వారికి చెప్పి సర్వాత్మకుడైన భగవానునికి, తన గురువైన కృష్ణ ద్వైపాయన వ్యాసునికి మ్రొక్కి పూర్వము దక్షాది మునులు అడుగగ, బ్రహ్మ పలికిన కథమైనదానిని పాపహరమైన దానిని చెప్పెదను వినుడు. ఇది అర్థ గంభీరము, బహు చిత్రము, వేదార్థ విస్తరము. దీనిని ఎప్పుడు ధారణచేయువాడును, వినునట్టి వాడును స్వవంశోద్ధరణ మొనరించి స్వర్గమందు ఆదరమును పొందగలడు.

ఆది సర్గ వర్ణనము

తెలియరానిది, అవ్యక్తము, సర్వకారణము, నిత్యము ఉన్నదియు, లేనిదియు అయినది ప్రధానము ఒకటి గలదు. దానినుండి పరమేశ్వరుడు విశ్వమును సృజించెను. అదియే తత్త్వము, బ్రహ్మ సర్వభూత స్రష్ట, ఆతడు నారాయణపరాయణుడు. అదియే మహత్తత్త్వము (బుద్ధి) అందుండి అహంకారము, అందుండి పంచభూతములు జనించెను. వాని స్థితిభేదమును బట్టి వివిధ భూతకోటి పుట్టినది. ఇదియే సనాతనమగు ధర్మము సర్గము (సృష్టి). మీకీర్తిని ఇనుమడింప జేయునది ఇదే. ఈ సృష్టి విలాసము, నేను విన్నంత శ్రుతుల వలన నాకు తెలిసినంత పూర్తి విస్తరముగ తెలిపెదను వినుడు. ఇది కీర్తిశాలురకు ఎల్లరకు పుణ్యమును పెంచును.

అటు తరువాత స్వయంభువు (బ్రహ్మ) తొలుత అప్పులను సృజించెను. అప్పులు అనగా ప్రకాశోదకము. అందు తన వీర్యమును వదలెను. వీర్యమనగా సృష్టి సంకల్పము. **'స ఐక్షత బహుస్యాం ప్రజాయేయేతి'** అనగా తానే బహురూపములుగా పుట్టవలెనని చూచెను. అని ఈ సంకల్పమునే వేదము తెల్పినది.

అప్పులకు నారములనిపేరు. అవి నరుల సృష్టికి మూలములు. అవి మొదటి గమ్య స్థానములు అయినందున వానిని సృష్టించిన ఆయన నారాయణుడను పేరొందెను. ఆయన వదలిన వీర్యము బంగారు గ్రుడ్డయి అప్పుల యందు (ఉదకములందు) తేలినది. ఆ అండమునందు బ్రహ్మ తానే స్వయంభువు అనుపేర జనించెను. అందుచే ఆ బ్రహ్మదేవునికి హిరణ్యగర్భుడను పేరు వచ్చెను.

ఆ హిరణ్యగర్భుడు ఒక పరివత్సరము అట్లే ఉండి 'అప్' రూపము లేక నీటి రూపమున ఉన్న ఆ తత్వమును దివము, భువము అను పేర రెండుగా ఒనరించెను. ఆ రెండు భాగముల నడిమి ఖాళీప్రదేశమును ఆకాశముగ గావించెను. అప్పులందు మునిగిన భూమిని తేల్చి దిక్కులను పదింటిని గల్పించెను. అందే కాలము, మనస్సు, వాక్కు కామము, క్రోధము, రతి అను వానిని సృజించెను. ఆ రూపమున సృష్టిని కావింప తలంచి మరీచి, అత్రి, అంగిరస్సు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వసిష్ఠుడు అను వారిని మనస్సుచేత సృజించెను. వీరు సప్త బ్రహ్మలనుపేర ప్రసిద్ధి చెందిరి. ఈ సప్త బ్రహ్మ మానస పుత్రులకంటె ముందే బ్రహ్మ తన రోషమునుండి రుద్రుని సృజించెను. పూర్వులకెల్ల పూర్వుడైన సనత్కుమారుని గూడ సృజించెను. ఇంతకుపూర్వము చెప్పిన

సప్త బ్రహ్మల నుండి ప్రజలు, రుద్రులు పుట్టిరి. స్కందుడు సనత్కుమారుడును, తమ తేజస్సును తమలో గుప్తపఱచుకొని ఉండిరి. అనగా వారు సృష్టికి ఉన్ముఖులు కారైరి. సప్తబ్రహ్మల వంశములు దేవతలు, దేవగణములతో కూడినవి. వారందరు క్రియావంతులు అగు గృహస్థులైరి. మహర్షుల పరంపర ఇదియే, బ్రహ్మ మెఱుపులను, పిడుగులను, మేఘములను, లోహితములను, ఇంద్రధనుస్సును, పక్షులు మొదలగువానిని సృజించెను. యజ్ఞార్థము ఋగ్యజుస్సామ వేదములను జనింప జేసెను. సాధ్యులను కనెను. ఆయన మేనినుండి భూతములెన్నో పొడమెను.

అట్లు కావించు తన సృష్టి వృద్ధి పొందకుండుటను చూచి, తన శరీరమునే రెండు భాగములుగా చేసి సగభాగము పురుషుడు సగభాగము స్త్రీయు అయ్యెను. ఆ స్త్రీయందు అతడు వివిధ ప్రజలను కనెను. అతడు భూర్భువసువర్లోకములను వ్యాపించి విష్ణువు అని పేరందెను. ఆయన విరాట్పురుషుని సృజించెను. అతడు మనువును సృజించెను. ఆయన తరమే మన్వంతరము. బ్రహ్మమానస సృష్టిలో ఇది రెండవది. ఆ మనువు ప్రజాసర్గ మొనరించెను. నారాయణుని విసర్గ మిది. ఈ సృష్టిలోని సంతానము కూడ అయోనిజమే. బ్రహ్మపురాణమందు ఆది సర్గమను దీనిని దెలిసిన యతడు ఆయుష్మంతుడు, కీర్తిమంతుడు నగును. సంపూర్ణ ప్రజ్ఞావంతుడై అభీష్టగతి నొందును. (1)

సృష్టి కథనము

ఇట్లు ప్రజాపతి ప్రజలను సృజించి అయోనిజయైన శతరూపను పత్నిగ పొందెను. ద్యులోకమును ఆవరించి ఉండెడి ఆ భగవానునియొక్క మహిమచే శతరూప జనించినది, ఆమె పదివేల ఏండ్లు దుశ్చరతపము జేసి, తపోదీప్తుడైన, స్వాయంభువ మనువును భర్తగ పొందెను. డెబ్బది యొక్క మహాయుగములు ఆ మనువు యొక్క ఆయుర్దాయము. అదే మన్వంతర మనబడును.

అటుపిమ్మట స్వాయంభువమనువను తన భర్తయైన, రాజువలన శతరూప వీరుడను కుమారుని గనెను. ప్రియవ్రత-ఉత్తానపాదులను కూడ కనెను. వీరునికి కామ్య జనించెను. కామ్యయొక్క కుమారులు నల్వురు. వారు సమ్రాట్టు, కుక్షి, విరాట్టు, ప్రభువు అనువారు. ఉత్తానపాదుని వలన సూనృత అను అతని భార్య నల్వురు కొడుకులను గాంచెను. ఆమె ధర్ముని కూతురు. సూనృత (సునీతి) అశ్వమేధము చేయుటచే జనించినది. ఆమె ధ్రువుని తల్లి. ఉత్తానపాదునికి ధ్రువుడు, కీర్తిమంతుడు, ఆయుష్మంతుడు, వసువు అను నల్వురు కుమారులు సూనృతయందు గల్గిరి. ఆ కుమారులలో జ్యేష్ఠుడైన ధ్రువుడు గొప్పకీర్తి కావలెనని కోరి మూడువేల దివ్య సంవత్సరములు తపమాచరించెను.

ఆతనియెడ బ్రహ్మదేవుడు అత్యంత ప్రీతుడై, తన స్థానమునకు సమానమైన స్థానమును ఇచ్చెను. అది సప్తర్షుల పురోభాగమందు అచలమయి (ధ్రువమయి) వెలుగుచున్నది. ఆతని అభిమానమును సమృద్ధిని మహిమను గని దేవాసుర గురుడు శుక్రుడు

అహో ఽస్య తపసోవీర్యమహోశ్రుతమహాద్భుతమ్
యమద్య పురతః కృత్యాధ్రువం సప్తర్షయః స్థితాః -

('ఆహా ఈ ధ్రువుని తపస్సు, వీర్యము, పాండిత్యము, అద్భుతము. ఈతని ముందిడుకొని సప్తర్షులు విలసించుచున్నారు') అని చెప్పెను. ధ్రువుని వలన శంభువను ఆమె శ్లిష్టి, భవ్యుడు అను కుమారులను కనెను. శ్లిష్టి వలన సుచ్ఛాయ అను నామె రిపువు, రిపుంజయుడు, వీరుడు, వృకలుడు, వృకతేజసుడు అను ఐదుగురు తనయులను పొందెను. రిపువు వలన బృహతి అను అంగన సర్వ తేజశ్శాలియైన చక్షుస్సును కనెను, ఆతడు వీరణుడను ప్రజాపతి యొక్క కూతురగు పైరణి అందు చాక్షువును పొందెను.

ఆతనికి నడ్వల అను ఆమెయందు గొప్ప తేజస్సుగల సుతులు పదిమంది పుట్టిరి. నడ్వలపై రాజప్రజాపతి కుమార్తె పది మందికి జన్మనిచ్చెను. ఆ పదిమంది కుత్సుడు, పురుషుడు, శతద్యుమ్నుడు, తపస్వి, సత్యవాక్కు, కవి, అగ్నిష్టుత్తు, అతిరాత్రుడు, సుద్యుమ్నుడు, అభిమన్యుడు అనువారు. పురునివలన ఆగ్నేయి అను అమె అంగుడు, సుమనసుడు, ఖ్యాతి, క్రతువు, అంగిరసుడు, గయుడు అను ఆఱ్వురు కుమారులను కనెను. అంగుని వలన సునీథుని కుమార్తె వేనుడను కొడుకును గాంచెను. వాడు చేసిన అపచారముచే ఋషులు కోపోద్రిక్తులైరి. వాని సంతానమునకై వాని కుడి హస్తమును మథించిరి. అపుడు ఒక మహానుభావుడు ఉదయించెను. మునులు ఆతనిని చూచి ఇతడు ప్రజారంజకుడగునని నిరి. ఆ బాలుడు ధనుస్సును పూని, కవచము తొడిగికొని జ్వలించు అగ్నివలె ఉదయించెను. అతడే పృథువు. ఈ నేలను ఏలినవాడు. (అతని పేర ఈ భూమి పృథివి అనబడెను.)

ఆ మహారాజు రాజసూయ యాగ అభిషేకము పొందిన రాజులందరిలోను మొట్ట మొదటివాడు. ఆతనికి నిపుణులైన సూత, మాగధులు అను కుమారులు ఇర్వురు జనించిరి. ఆతడే భూమిని గోవుగా ఒనరించి సస్య రూపమైన క్షీరమును పిదికిన మహానుభావుడు. అట్లు పిదుకబడిన గోవు (భూమి), ప్రజా జీవనమునకు పాలు చేపినది. దేవతలు, ఋషులు, పితృదేవతలు, దానవులు, అప్సరసలు, నాగులు (సర్పములు), పుణ్యజనులు (రాక్షసులు), వీరుధులు, పర్వతులు, తమ తమకు ఆయా పాత్రములందు పిదుకబడిన క్షీరమును త్రాగి ప్రాణధారణము ఒనరించుకొనిరి. వసుంధర వారివారికి పాలిచ్చెను. పృథునికి

కుమారులుగా ధర్మజ్ఞులైన అంతర్ధి, పాతి అనువారు కల్గిరి. అంతర్ధానుని వలన శిఖండిని అను నామె హవిర్ధానుడు అను కొడుకును పొందెను. హవిర్ధానుని వలన ఆగ్నేయి ఆర్గురు కుమారులను గాంచెను. వారు ప్రాచీనబర్హి, శుక్రుడు, గయుడు, కృష్ణుడు, వ్రజుడు, అజినుడు అనువారు. ప్రాచీనబర్హి భగవానుడు మహానుభావుడు ప్రజాపతి అయ్యెను. హవిర్ధానుని కుమారుడు ప్రాచీనబర్హి పాలించునేలలో దర్భలు నీటిలో ప్రాచీనాగ్రములుగానే మొలచెనట. అందుచే నాతడు ప్రాచీన బర్హియని పిలువబడెను. ఆ ప్రభువు సముద్రుని కూతురు సవర్ణయ అను వనితను పరిణయము ఆడెను. తీవ్ర తపస్సు చేసిన మీదటనే అతడు పెండ్లి చేసికొని సవర్ణయందు ధనుర్వేద పారగులైన పదిమంది కుమారులను గాంచెను. ప్రాచేతనులగు వారందరు ఒక్కటియై తపమాచరించిరి. ఏకరీతిగ ధర్మము నిర్వహించిరి. పదివేలేండ్లు సముద్ర జలములందు ఉండి తీవ్ర తపస్సు చేసిన మహానుభావులు వారు. వారు తపము సేయు తఱి-రక్షణలేని కతన మహావృక్షములు (అంగుళము ఎడములేకుండ) మొలచి ఈ పృథివినికప్పివేసినవి. అందు వలన ప్రజాక్షయము ఏర్పడెను. వాయువు వీచరాదయ్యెను, వాయు పథము చెట్లచే నిండి నిబిడీకృతమయ్యెను. పదివేలేండ్లు ప్రజలకు కదలను మెదలను వశముకాదయ్యెను. అది విని తపస్వులు, ప్రాచేతనులు కోపించి మొగముల నుండి వాయువును, అగ్నిని జనింపజేసిరి. వాయువు తరువులను అన్నింటిని మొదటికి పెల్లగించి పడద్రోసి తడియార్చివైచెను. వానినినగ్ని దహించెను. ఇట్లు సర్వద్రుమ నాశనమయ్యెను. కొద్దిగా మిగిలిన వృక్షములను చూచి, సోముడు ఏతెంచి, వారిని చూచి, ఇట్లనియె. రాజులారా! కోపమును ఆపుడు. పృథివి అంతయును వృక్ష శూన్యముగా అయినది. అనలానిలములను (అగ్ని వాయువులను) శమింపజేయుడు. ఈ వృక్షములను కన్న కన్యారత్నము ఇదిగో! పరమ సుందరి-భవిష్యవృత్తాంతము ఎరిగి నేను ఈమెను కడుపులో దాచితిని. ఈమెకు మారిష అని పేరుకలదు. ఈమె మీకు భార్య అగుగాక! సోమవంశవర్ధని ఈమె. మీ తేజస్సులు సగము, నా తేజస్సులో సగము వహించి ఈమెయందు దక్షుడను ప్రజాపతి ఉదయింపగలడు. మీ తేజముచే దగ్ధమయిన ఈ పృథివిని అగ్ని కల్పుడగు ఆతడు చల్లార్చి, ప్రజలను వృద్ధి పొందింపగలడు అని చెప్పగా, ప్రచేతనులా సోముని పలుకులు ఆదరించి, కోపము ఉపసంహరించి, వృక్షముల నుండి మారిష అను ఆ కన్యను గైకొనిరి. ఆ ప్రచేతనులు పదిమంది వలన మారిష యందు సోమాంశమున మహాతేజస్వియగు దక్షుడు ఉదయించెను.

అతడు చరాచర భూతములను ద్విపాద చతుష్పాద పశువులను, మనసుచేతనే సృజించి ఆ మీదట స్త్రీ సంతానమును కనెను. అందు ధర్మునికి పదిమందిని, కశ్యపునకు

పదుమువ్వురను ఇచ్చి, తక్కిన వారిని నక్షత్ర నామ ధారిణులను ఇర్వది యేడ్గురను సోమునికి ఒసంగెను. వారియందు దేవతలు, పక్షులు, గోవులు, నాగులు, దైత్యులు, దానవులు, గంధర్వులు, అప్సరసలు అను జాతులును ఇంకను పెక్కు జాతులు జనించెను. అది మొదలు మైథున సంభవులైన ప్రజలు పుట్ట ఆరంభించిరి. పూర్వము సంకల్ప మాత్రమున, దర్శన మాత్రమున, స్పర్శ మాత్రమున సృష్టి అచ్చట జరుగుచుండెను అని తెలుపగా ఇంకను

మునులు ఇట్లనిరి –

"సూత! శుభవ్రతియైన దక్షుడు బ్రహ్మ యొక్క అంగుష్ఠమునుండి కదా జనించెనని చెప్పగా వినుచున్నాము. ఆయన బొటనవ్రేలినుండి కదా! ఈయన భార్య జనించెను. అట్టితఱి దక్షుడు ప్రాచేతనులకు జనించె నంటిరే ఇది ఎట్లు? అని ఈ సంశయము మాకు కలుగుచున్నది. ఈ సంశయము వివరింప నీవు అర్హుడవు. సోముని కూతురు బిడ్డ వీరి మామ యెట్లు అయ్యె" అని అడుగగా ఆ మునులతో

లోమహర్షణుడు ఇట్లనియె –

విప్రులార! భూతములందు జరుగు పుట్టువు నిరోధమును గురించి తెలియక మునులు తికమక పడుచుందురు. విద్యావంతులకే ఇది దురవగాహము. ఈ దక్షాదులు రాజులు యుగయుగ మందు తిరిగి పొడముచుందురు. తిరిగి చాటగుచుందురు. విద్వాంసుడైనను కూడా అక్కడ పొరబడును. వీరిలో జ్యేష్ఠ, కనిష్ఠ భావములు మున్ను లేకుండెను. తపస్సు-ప్రభావమును బట్టియే చిన్న పెద్ద పరిగణనము. దక్షుని ఈ విసృష్టిని ఎఱిగినవాడు సంతానవతుడై, పూర్ణాయువై స్వర్గమందు వసించును. (2)

దేవాసురుల ఉత్పత్తి కథనము

మునులు లోమహర్షణుడు తమకు తెలిపిన సృష్టి కథనమును సాకల్యముగా విని దేవ దానవ గంధర్వోరగ రాక్షసుల యొక్క ఉత్పత్తిని విపులముగ తెలుపుమని ఆ మహామునిని ప్రార్థించిరి. అంతట ఆ మహామునుల ప్రార్థనను సహర్షముగా విన్న లోమహర్షణుడు ఇట్లనియె ...

స్వయంభువు ఆజ్ఞచే దక్షుడు సృష్టి చేయుట ఆరంభించెను. తొలుత మనస్సుచే భూతములను సృజించెను. వారు దేవదానవ గంధర్వ యక్షరాక్షసాదులు. కాని ఆసంతతి అంతగ పెరుగదయ్యెను. అప్పుడు మైథున ధర్మముచే దానిని పెంపదలచి అసిక్నియను దానిని, వీరణుడను ప్రజాపతికూతురును గ్రహించెను. తపస్విని లోకముల ధరింప గలదియు అయిన ఆ అసిక్ని యందు దక్షుడు ఐదువేల మంది పుత్రులను గాంచెను. సృష్టిని

పెంపొందింపదలచిన ఆ దక్షపుత్రులను చూచి దేవర్షి (నారదుడు) మీరు ఎందుకు ఈ సృష్టికార్యము చేయుదురు, వద్దు అని ఆదేశించెను. అందుచే వారికి వినాశము కలిగినది. అట్లే ఆ నారద మహామునికి దక్షశాపము సంభవించెను. మున్ను బ్రహ్మకు ఉదయించిన వాడు నారదుడు, వీరణుని కూతురగు ఆసిక్నియందు ఉదయించెను. తండ్రివలె దక్షుడు ఆతనిని కొడుకుగా కనెను. అందువలన దక్షుని కుమారులు హర్యశ్వులని పేరొందిరి. వారు నారదుని మాటవిని ఎచ్చటకో పోయిరి. అపుడు పరమేష్ఠి (బ్రహ్మ) బ్రహ్మర్షుల పురస్కరించుకొని పోయి దక్షుని క్రోధము ఉపసంహరించుకొనవలసినదని వేడుకొనెను. ఆవల వారిరువురకు 'నా కన్య అందు నారదుడు నీకు పుత్రుడయి ఉదయింపవలెను' అని. సంధి అయ్యెను అందులకు దక్షుడు పరమేష్ఠికి ప్రియ అను కన్యనిచ్చెను. ఆమెయందు దక్షశాప భయముచే నారదుడు జనించెను" అని చెప్పెను. అంతట ఆ మునులు ఆయనతో ఇట్లు అనిరి.

"ప్రజాపతి కుమారులు ఎట్లు నారదునిచే నాశనము పొందిరి? ఆ వృత్తాంతము ఉన్నదున్నట్టు మేము వినగోరుచున్నాము" లోమహర్షణుడు వారితో

దక్ష సుతులయిన హర్యశ్వులు ప్రజావృద్ధి చేయగోరి రాగా నారదుడు వారిని చూచి మీరు మూఢులు. ఈ భూమి ప్రమాణము ఎంతో ఎఱుగరు. అట్లు ఎఱుగకయే సంతానమును కననెంచినారు. క్రిందును, మీదును, అంతరమును ఎఱుంగని వారు ఎట్లు బిడ్డలను పొందుదురు అనగా విని వారు నలుదిశలకు బోయిరి. సముద్రమును జొచ్చిన నదులు వెనుకకు తిరుగని విధముగా వారు ఇప్పటికిని వారు తిరిగిరారైరి. ప్రాచేతసుడైన దక్షుడు హర్యశ్వులు అట్లు పోగా, వైరిణియందు ఇంకను వేయిమంది పుత్రులను కనెను. వారు పూర్వము నారదుడు పలికిన పలుకులు స్మరించి దేవర్షి (మన అన్న) బాగుగ చెప్పినాడు. మనమును మన అన్నల జాడ వెంట పోవుదము భూమి ప్రమాణమెఱిగి ఆ మీద సృష్టి చేయుదము అని కూడబలుకుకొని అందరు అన్ని దిక్కులకును పోయిరి. వారును ఇంతవరకు వెనుతిరిగి రారైరి. అది మొదలు సోదరుడు సోదరుని జాడ వెదుక పోయెనేని అక్కడ నశించును, కాని తిరిగిరాడు. ఇది ఎఱిగిన వాడు ఈపనిని చేయరాదు.

దక్షుడు ఆ పుత్ర నష్టమును తెలుసుకొని వైరిణియందు అరువది మంది గన్యలను మరల పుట్టించెను. ఆతడు పదిమందిని ధర్మునికి, పదముగ్గురను కశ్యపునకు, ఇరువది ఏడుగు రను సోమునికి, నల్గురను అరిష్టనేమికి, ఇర్వురను బహుపుత్రునకు, ఇద్దరను అంగిరసునికి, ఇద్దరను విద్వాంసుడైన కృశాశ్వునికి ఇచ్చెను. వారి పేరులు వినుడు.

ధర్మునికి ఇచ్చిన పదిమంది అరుంధతి, వసువు, యామి, లంబా, భానువు, మరుత్వతి, సంకల్ప, ముహూర్త, సాధ్య, విశ్వ అను వీరు పదిమంది. వీరి సంతానమును వినుడు, విశ్వకుమారులు, విశ్వదేవులు, సాధ్యకొడుకులు సాధ్యులు, మరుత్వతి కొడుకులు మరుత్వంతులు, వసువు కుమారులు వసువులు, భాను బిడ్డలు భానువులు, ముహూర్త కొడుకులు ముహూర్తులు, లంబ కొడుకు ఘోషుడు, యామి కూతురు నాగవీధి పృథివికి సంబంధించిన సంతతి అంతా అరుంధతి యందు జనించెను. సంకల్పకు విశ్వాత్ముడైన సంకల్పుడు పుట్టెను. యామిజ అయిన నాగవీధియందు వృషలుడుపుట్టెను. ప్రచేతన కుమారుడయిన దక్షుడు సోమునికి ఇచ్చిన కన్యలందరు నక్షత్రముల యొక్క నామములతో జ్యోతిశ్శాస్త్రమునందు ప్రసిద్ధులై ఉన్నారు. జ్యోతిర్మండలము నందు పురోగమించువారు దేవతలు. ఖ్యాతివంతులు మఱి ఎనిమిది మంది అనలుడు, వసువులు, ఆపుడు, ధ్రువుడు, సోముడు, ధవుడు, అనిలుడు, అగ్ని ప్రత్యూషుడు, ప్రభాసుడు అనువారు. ఆపుని కొడుకులను లెక్కింపగా, వైతండ్యుడు, శ్రముడు, శాంతుడు, మునియు. ధ్రువ కుమారుడు కాల భగవానుడు అనువారు (లోక ప్రకాలనుడు) లోకమందు కాల గణమున పడును. సోముని కొడుకు వర్చస్సుడు, (ఆయనయే వర్చస్వి) ధవునికి మనోహర అనుదాని యందు ఉదయించిన వారు ద్రవిణుడు, హుతహవ్యవహుడు, శిశిరుడు, ప్రాణుడు, రమణుడు అనువారు. అనిలుని భార్య శివ. ఆమె బిడ్డలు మనోజవుడు అవిజ్ఞాతగతి అను వారు ఇద్దరు. అనలుని కొడుకు కుమారుడు రెల్లుదుబ్బునందు శోభిల్లువాడు, అతని తమ్ములు శాఖ, విశాఖ, నైగమేయులనువారు. కృత్తికలుకన్న సంతానం అగుట కార్తికేయుడు అను కుమారుడు. ప్రత్యూషుని కొడుకు దేవలుడను ఋషి. దేవలునికి ఇద్దరు కొడుకులు క్షమాశీలురు, పండితులు, బృహస్పతి చెల్లెలు పరస్త్రీ బ్రహ్మవాదిని. యోగ సిద్ధినంది యెల్ల జగమ్ములందును సంచరించెను. ఆమె ప్రభాసుని భార్య. ఆతడు వసువులలో ఎనిమిదవవాడు. విశ్వకర్మ అను ప్రజాపతి ఆమెయందే ఉద్భవించిరి. వేల శిల్ప ములకు ఆయన కర్త, త్రిదశులకు (దేవతలకు) ఆతడు వార్ధకి (వడ్రంగి). సర్వ భూషణ శిల్ప కల్పనము చేయువాడు. అతడు దేవతా విమాన నిర్మాత. కశ్యపుని వలన సురభి ఏకాదశ రుద్రులను పొందెను. ఆమె మహాదేవుని ప్రసాదమువలన తపస్సుచే ప్రభావితయై ఈ సంతతిని కనెను.

ఏకాదశరుద్రులు–అజైకపాత్తు, అహిర్బుధ్న్యుడు, త్వష్ట, రుద్రుడు, హరుడు, బహురూపుడు, త్ర్యంబకుడు, అపరాజితుడు, వృషాకపి, శంభువు, కపర్ది, రైవతుడు, మృగవ్యాధుడు, శర్వుడు, కపాలి. అనువారు రుద్రశతము పురాణము లందు వర్ణింపబడి

ఉన్నది. చరాచర భూత సంఘమువారిచే నిండి ఉన్నది. కశ్యప ప్రజాపతి భార్యలు–అదితి, దితి, దనువు, అరిష్ట, సురస, ఖన, సురభి, వినత, తామ్ర, క్రోధవశ, ఇల, కద్రువు, ముని అనువారు పూర్వ మన్వంతరమువారు. చాక్షుష మన్వంతరమునందు సర్వలోక హితము గోరి దేవతలొకరి కొకరు కలిసికొని వేగముగా రండు అదితి యందు ప్రవేశించి జనింతము. అందు వలన మనకు శ్రేయస్సు కలుగఁగలదు అనుకొనిరి" అని లోమహర్షణ సూతుడు పలికెను.

ఇంకను వారిని సంతోషపెట్టుటకై సూతుడు ఇట్లు అనెను ..... ఇట్లు అనుకొని ఆ దేవతలు చాక్షుషమన్వంతరమందు కశ్యపునకు దక్ష కుమార్తెయగు అదితియందు జన్మించిరి. విష్ణువు, ఇంద్రుడు తిరిగి పుట్టిరి. అర్యముడు, ధాత, త్వష్ట, పూష, వివస్వంతుడు, సవిత, మిత్రుడు, వరుణుడు, అంశుడు, మహాతేజస్వియగు భగుడు అను ద్వాదశాదిత్యులు (పన్నెండుమంది ఆదిత్యులు) ఉదయించిరి.

సోముని భార్యలు ఇరువది ఏడుగురు మంచి కాంతివంతులైన కుమారులను కనిరి. అరిష్టనేమి భార్యలయొక్క సంతతి పదునార్వురు జ్ఞాని అయిన బహుపుత్రునియొక్క సంతతి నలుగురు విద్యుత్తులు (మెఱుపులు) చాక్షుష మన్వంతరమందు ఋక్షాఖీయులు కృశాశ్వుడను దేవర్షియొక్క కుమారులు. బ్రహ్మర్షిచేత సత్కరింపబడినవారు మహాపురుషులు దేవ ప్రహరణులను వారు జనించిరి. వీరందరూ సహస్ర యుగాంతమున మరల అవతరింతురు. వీరు స్వేచ్ఛా జన్ములు. ముప్పది మూడు దేవ గణములు అని వీరినే పిలుతురు. ఆకాశమున సూర్యునకు ఉదయాస్తమయములు గల్గినట్లు వీరికిని యుత్పత్యవసాన ములు కలవు. ప్రతియుగమునందు ఇట్లు దేవతలు కల్గుచుందురు.

కశ్యపుని వలన దితికి హిరణ్యకశిపుడు హిరణ్యాక్షులు జనించిరి విప్రచిత్తి భార్య సింహిక. ఆమె పుత్రులు మహాబలవంతులు, సైంహికేయులు. హిరణ్య కశిపుని పుత్రులు బలశాలురు. వారు నల్గురు హ్లాదుడు, అనుహ్లాదుడు, ప్రహ్లాదుడు, సంహ్లాదుడు. హ్లాదుని కుమారుడు హ్లాదుడు. హ్లాదుని కుమారులు ఇద్దరు. శివుడు, కాలుడు అనువారు. ప్రహ్లాదుని కుమారుడు విరోచనుడు. అతని కొడుకు బలి. బలి కుమారులు బాణుడు మొదలుగాగల నూర్గురు. వారందరూ తపోధనులు. ధృతరాష్ట్రుని మొదలు విప్రచిత్తి వరకు కశ్యప ప్రజాపతికి పెక్కుమంది కలిగిరి. ఈ దానవులకు విప్రచిత్తి ప్రధానుడు. వీరి పుత్రపౌత్రగణము గణించి చెప్పుట సాధ్యముగాదు. వీరిలో స్వర్భానుని కూతురు ప్రభ.

సురభి ఆవులను, గేదెలను ప్రసవించెను. ఇతర చెట్లను, తీగలను, తృణ జాతులను కనెను. ఖస యక్షులను కనెను. ముని అనునామె అప్సరలను గాంచెను. అరిష్ట సిద్ధ

గంధర్వులను ప్రసవించెను. స్థావర జంగమాత్మకమైన ఈ సంతతి కశ్యపునకు సంబంధించినది. వారి మనుమలు, మునిమనుమలు వేలకొలది పుట్టిరి. ఇది స్వారోచిష మన్వంతరమున జరిగిన సృష్టి, వైవస్వత మన్వంతరమునందు వరుణ దేవతాకమైన క్రతువు జరుగగా బ్రహ్మ హోతగా ఉండి చేసిన హోమమువలన కల్గిన సృష్టిని ఇప్పుడు చెప్పుచున్నాను.

లోగడ కల్పమునందు పుట్టిన సప్తమహర్షులను ఈ కల్పమందు తిరిగి బ్రహ్మ సప్తర్షులుగా గల్పించెను. ఆ మీద దేవ, దానవులకు యుద్ధము జరిగెను. అందు దితి సంతానము రాక్షసులు నశించిరి. దితి కశ్యపునకు మొఱపెట్టుకొనెను. కశ్యపుడు ఆమె మొఱను విని ఇంద్రుని చంపగలిగిన కుమారుని వరముగా అనుగ్రహించెను.

నీ గర్భమందు జనించువాడు ఇంద్రుని చంపగలడు. కాని నీవు ఆ గర్భమును శుచిగా వ్రతముచేయుచు ధరింపవలెను అనగా ఆమె అట్లేయని గర్భవతి అయ్యెను. అప్పుడు కశ్యపుడు ఆమె యందు గర్భాధాన మొనరించి వెళ్ళిపోయెను. ఆమె దేవతలను అందరిని నిరోధింపగల్గు తేజస్సును గర్భమున దాల్చి, వ్రతము పూని, ఒకానొక పర్వతమునకు తపస్సుచేయుట కొఱకు పోయెను.

ఆమె వ్రతలోపము ఎప్పుడు జరుగునా అని చూచుచున్న ఇంద్రుడు నూరేండ్ల తరువాత పాదములు కడుగుకొనక పరుండుట చూచి ఆమె గర్భమున ప్రవేశించి వజ్రాయుధముతో దానిని ఏడు తునకలు గావించెను. వజ్రహతుడైన ఆ శిశువు రోదనము చేసెను. ఇంద్రుడు 'మారోదీ:' ఏడువకుమని మరిమరి చెప్పెను. ఆ గర్భము ఏడు తునకలయ్యెను, ఇంద్రుడు రోషముతో దానిని మరి ఏడు తునకలుగా ఉండగా, ఆ తునకలే మరుత్తులు అను పేర ఏర్పడిరి. ఆ నలుబది తొమ్మిది మందియును ఇంద్రునకు సహాయులైన దేవతలు గూడ అయిరి.

తరువాత దేవతా గణములను ప్రజాపతులనుగా ఒనరించి, పృథువు మొదలుగా గల వారికి రాజ్యములను గూడ విభాగించి ఇచ్చెను. హరియే సాక్షాత్ విష్ణువు, ప్రజా పతియు, పర్జన్యుడును, పవనుడు జిష్ణువునై ఈ జగత్తును సృష్టించెను. ఈ భూత సృష్టిని చక్కగ ఎరిగిన వారికి పునర్జన్మము కలుగదు. అట్టివారికి పరలోక భయము కూడా ఉండదు. (3)

పృథువు మొదలైన సర్వదేవతల రాజ్యాభిషేకము

అని ఇట్లు వారికి సర్వసృష్టిని గురించి తెలిపి ఇంకను లోమహర్షణుడు ఇట్లనెను ..

బ్రహ్మ వేన కుమారుడు పృథుని, చక్రవర్తిగా అభిషేకించి క్రమముగా వారివారికి రాజ్యములను నిర్ణయించి ఇచ్చెను. ద్విజులు ధాన్యములు, నక్షత్రములు, గ్రహములు,

యజ్ఞములు, తపస్సులు అనువాని రాజ్యాధికారమందు సోమునకు పట్టాభిషేకము చేసెను. అప్పులకు వరుణుని, రాజులకు రాజరాజును (కుబేరుని), ఆదిత్యులకు విష్ణుని, వసువులకు అగ్నిని, ప్రజాపతులకు దక్షుని, మరుత్తులకు వాసవుని, దైత్య దానవులకు ప్రహ్లాదుని, పితరులకు వైవస్వతుని (యముని), యక్ష రాక్షస పార్థివ సర్వభూత పిశాచములకు శూలపాణియైన గిరీశుని (శివుని), శైలమునకు హిమవంతుని, నదులకు సాగరుని, గంధర్వులకు చిత్రరథుని, నాగులకు వాసుకిని, సర్పములకు తక్షకుని, ఏనుగులకు ఐరావతుని, అశ్వములకు ఉచ్చైఃశ్రవమును, పక్షులకు గరుడుని, మృగములకు శార్దూలమును, గోవులకు గోవృషమును, వనస్పతులకు జువ్విచెట్టును రాజు గావించెను.

తూర్పు దిశకు వైరాజ ప్రజాపతి కుమారుడైన సుధన్వుని, దక్షిణ దిశకు కర్దమ ప్రజాపతి కొడుకు శంఖపదుని, పడమటిదిశకు రజస్సు కుమారుడు (అచ్యుతుని) కేతుమంతుని, ఉత్తర దిశకు పర్జన్య ప్రజాపతి తనయుడు హిరణ్య రోముని అధిపతులనుగా అభిషేకించెను.

సప్త ద్వీప పరివృతమయిన ఈ పృథ్వి పట్టణములతో గూడి వారివారిచేత ఇపుడును ధర్మముతో పాలించబడుచున్నది. ఈ నరపతులచే వేద విహితముగ రాజసూయాభిషిక్తుడై, రాజ్యాభిషిక్తుడుగా కూడా అయి పృథువు చక్రవర్తియై ఇమ్మేదినిని ఏలెను. చాక్షుష మన్వంతరము గడచి వైవస్వత మన్వంతరము ఆరంభమయ్యెను. ఆ మన్వంతర వృత్తాంతమును అంతయును సాకల్యముగా వినిపింతును వినుడు అని చెప్పగా శ్రద్ధతో ఆ లోమహర్షణుని మాటలను వినుచున్న మునులు .....

లోమహర్షణ! పృథు చక్రవర్తి మహానుభావుడు. ఈ భూమిని గోవును చేసి వస్తుసారమును పిదికెను అందురు. నరసురాసుర నాగ యక్షద్రుమ శైల పిశాచ గంధర్వ రాక్ష సాది మహాసత్వ జాతులచే ఈ భూమి ఎట్లు పిదుకబడినది. వారు వారు పిదికిన పాత్ర విశేషములేవి? దూడలు ఎవరు? దోగ్ధ (పాలు పితికినవాడు) ఎవరు? దుగ్ధము (పాలు) ఎట్టిది? కుపితులైన మహర్షులు ఎట్లు వేనుని హస్తము మథించిరి? దానికి కారణమేమి? ఈ సర్వవృత్తాంతమును ఆనతిమ్ము అనగా –

లోమహర్షణుడు ఇట్లు అనెను !

ఏకాగ్ర మనస్కులై ఆలింపుడు. అశుచికి, నీచ మనస్కునకు, శిష్యుడు కాని వానికి, వ్రతదూరునికి, కృతఘ్నునికి, అహితునకు దీనిని నేను తెలుపను. ఈకథ స్వర్గప్రదము, కీర్తిదము, ఆయుష్యము, ధన్యము, వేదసమ్మితము. ఋషులు రహస్యముగా ఆనతిచ్చినది వినుడు.

మున్ను అత్రి వంశమున ధర్మ ప్రభువు అత్రి సమానుడు. అంగుడు అను ప్రజాపతి ఉదయించెను. వాని సుతుడు వేనుడు. మృత్యువు కూతురగు సునీధయందు కలిగినవాడు. మాతామహ దోషముచే అతడు స్వధర్మమును వెనుకఁబెట్టి కామలోభియై ప్రవర్తించెను. ధర్మము యొక్క హద్దులను తారుమారు చేసెను. వేద ధర్మమును అతిక్రమించెను. వాని రాజ్యమున స్వాధ్యాయము, అగ్నియందు హవిస్సులను వ్రేల్చునప్పుడు చేయు వేద ధ్వనియును వినరాదయ్యెను. దేవతలు యజ్ఞములందు సోమరసమును త్రాగి ఎఱుగరు. హవిస్సులను ఆరగింపరు. ఆ నరపతికి వినాశకాలము దాపురించెను కావలయు యజ్ఞములు వలదు హోమములువలదు అని శాసించి, క్రూర ప్రతిజ్ఞ చేసెను. నేను యజ్ఞేశ్వరుడను, యజ్ఞ కర్తను, యజ్ఞమునందు నన్నుగూర్చి యజింపవలయును. నాకై హోమములు ఆచరింపవలెనని వాడు శాసించెను. మర్యాదను అతిక్రమించి ఉత్పథగామియై ఉన్న వానిని చూచి మరీచి ప్రముఖులైన ఋషులు వేన! మేము పెక్కు సంవత్సరములు దీక్షా ప్రవేశము కావించెదము. అధర్మము చేయకుము. ఇది సనాతన ధర్మము. అత్రి తరువాత నీవు ప్రజాపతి అను కీర్తితో అవతరించిన వాడవు. ప్రజలను పాలింతునని ప్రతిజ్ఞచేసి కదా రాజు అయితివి. అన విని వాడు వారలను పరిహసించి దుర్బుద్ధి అనర్థపరుడు కావున ఇట్లనెను.

ధర్మమునకు నాకంటే కర్త ఎవ్వడు? నేను ఎవ్వనిమాట వినవలయును? శ్రుతమున (పాండిత్యమున), వీర్యమందు, తపస్సులో, సత్యములో నాతో సమానమైనవాడు ఎవ్వడు? సర్వభూతముల యొక్కయు, ధర్మము యొక్కయు మొదలు తుదియు తెలియని మూర్ఖులు మీరు. నిజముగ మీరు నన్ను ఎఱుగరు. తలచితినేని ఈ ఇలాతలమును అంతను దహించి వేయగలను. నీటి వెల్లువలలో ముంచెత్తి వేయగలను. భూమ్యాకాశముల దారులను బంధించగలను అనవిని పొగరెక్కి మూర్ఖుడై ఉన్న వానిని సరిచేయుట అసంభవమని మహర్షులు క్రుద్ధులైరి.

వానిని బట్టి కట్టివైచి వాని ఎడమ తొడను మథించిరి. అందుండి నల్లనివాడు, పొట్టివాడు జనించి భయపడుచు దోసిలొగ్గి నిలువబడెను. బెదురుచున్న వానిని జూచి అత్రి మహర్షి 'నిషీద' (కూర్చుండుము) అనెను. అందుచే వాడు నిషాద వంశమునకు (బోయలకు) మూల పురుషుడు అయ్యెను. ఆ మీదట 'ధీవరులు' చేపలుపట్టు వారిని మేనికల్మషము కలవానిని కనెను. వాని వలన కోయలు మొదలగు కొండజాతుల వారు జనించిరి. వేనుని కల్మషముచే పుట్టిన వారందరు అధర్మ ప్రియులైరి.

ఆ మీదట వేనుని కుడిచేయిని అరణినట్లు మథింపగా అందుడి 'అజగవమ'ను ధనువును దివ్య బాణములను గొని కవచమును ధరించి పృథువు అగ్నివలె వెలుగుచు

ఉదయించెను. అప్పుడు సర్వభూతములు సంతుష్టములయ్యెను. వేనుడు ఆ క్షణమే స్వర్గం అలంకరించెను. మహానుభావుడైన పుత్రుని వలన అతడు పున్నామనరకము నుండి రక్షింపబడెను. ఆ పృథుని సన్నిధికి రత్నములుగొని సముద్రము, నదులు వచ్చి పవిత్ర ఉదకములతో అభిషేకించినవి. బ్రహ్మయు అంగిరసుడు మొదలగు దేవతలతో అచ్చటకి వచ్చెను. స్థావర జంగమములు అయిన భూతములు కూడ వచ్చినవి, అందరు అతనికి పట్టాభిషేకము కావించిరి. యథావిధిగా ధర్మ నిపుణులచే నభిషిక్తుడయిన యా చక్రవర్తి తండ్రిచే బాధితులు అయిన ప్రజల అనురాగముచే రంజింపజేసెను. దానివలన అతడు 'రాజు'యను పేరందెను. అతడు సముద్రమునకు పోగా ఉదకములు స్తంభించి కడకు అనుకూలము అయ్యెను. పర్వతములు అతని టెక్కెము(ధ్వజము) నకు భంగముగాకుండ దారి ఇచ్చెను. తలచుకొన్న మాత్రమున ధరణి దున్నకయే సర్వసస్యములను పండెను. గోవులు కామధేనువులయ్యెను. పట్టుపట్టునందును తేనియలు కురిసెను. ఈ సమయమందు ఒక యజ్ఞమున హవిస్సు నందు సూతి అనువానికి మహామేధావి అగు సూతుడు అవతరించెను. అయ్యజ్ఞ మందు ప్రాజ్ఞుడయిన మాగధుడును కలిగెను. వారు ఇరువురును పృథు చక్రవర్తిని స్తుతించుటకై మునులు పిలువగా ఏతెంచిన మహానుభావులు. ఋషులు పృథు చక్రవర్తిని మీరిద్దరు స్తుతింపుడు అని ఆదేశించిరి. అప్పుడు సర్వ ఋషులను గూర్చి ఆ సూతమాగధులిట్లు పలికిరి.

ఆ సూత మాగధులు మేము దేవతలను ఋషులను కీర్తించి, సంతుషులుగా ఒనరించు వారము. ఇతడెవడో? ఈతని పేరేమో? చేసిన చేతయేమో? లక్షణము ఎటువంటిదో? కీర్తి ఎటువంటిదో? ఎఱుగము. చూచుటకు మహా తేజస్వియై కనిపించుచున్నాడు. కాని ఏమని ఈతనిని నుతింతుము? అనగా మునులు జరుగబోవు ఈతని సత్కార్యములను భావించి గానము చేయుము అనిరి. వారు ఆతని చరితమును ఊహించి కొనియాడిరి. అది మొదలు లోకమునందు జరుగు స్తవములై ఆశీర్వాద ప్రధానములయి సూత మాగధ వంది జన ముఖమున ప్రవర్తింప చొచ్చెను. వారి స్తుతికి మిక్కిలి సంతసించి పృథుచక్రవర్తి సూతునకు (అనూపదేశము) అనగా సముద్రతీర ప్రాంతమును మాగధునకు మగధ దేశమును బహుమాన మిచ్చెను. ఆ తర్వాత మహర్షు లందరు పరమ ప్రీతులయి ప్రజలను ఉద్దేశించి ఈ తేడు (రాజు) మీకు అందరకు వృత్తులను ఏర్పాటు చేయగలడు అనిరి. అదివిని ప్రజలు వేనసుతని దరికి పరుగులెత్తిరి.

ఆ సమయమున ఆ రాజు విల్లు అమ్ములుదాల్చి భూమినిగూర్చి పరుగెత్తిన ఆ భూదేవి భయపడి పారిపోయిన ఆతడు వెంబడించి ఆమెను తఱుమజొచ్చెను. ఆమె

పృథునికి జడిసి బ్రహ్మాది లోకముల వెంట పరుగులు పెట్టిపెట్టి తాను చేరిన చోటయెల్ల ఎట్టయెదుట ధనుర్బాణ పాణియై జ్వలితాగ్నివలెనున్న ఆ రాజునే చూచి ఇతడు దేవతలకు కూడా ఓర్వరాని వాడని భావించి దిక్కుతోచక ఆతనినే శరణు వేడెను. త్రిభువన పూజ్యయైన ఆ వసుంధర (భూదేవి) అంజలిగాంచి 'స్త్రీ' వధ అధర్మమని నీకు తెలియదా? నేను లేకుండ ప్రజలను ఎట్లు ధరింతువు? లోకములన్నియు నాయందే ఉన్నవి. నా చేతనే ఈ జగము ధరింపబడుచున్నది. నేను పోయిన ప్రజలెల్లరు పోదురు. ఆ విషయమును తెలుసుకొనుము. నీవు ప్రజా శ్రేయస్సు చేయవలెనని భావించుచున్న ఎడల నన్ను తుదముట్టింప తగదు. ఇంకా ఒకమాటను కూడ వినుము. నిరపాయమైన ఉపాయమున సర్వకార్యములు సిద్ధించును. ఈ ప్రజల ధరించుటకు నేను ఒక ఉపాయము చెప్పెద వినుము. నన్ను సంహరించిన నీవు ప్రజలను పోషింప జాలవు. నేను నీకు అనుకూలనయ్యెదను. కోపము ఉపసంహరింపుము. పశుపక్షులలో ఆడది అవధ్యురాలని అందురు. నీవు ధర్మమును వీడుట తగదు అని పెక్కు విధముల పలికిన ధరిత్రి పలుకులు ఆలించి మహామతి కావున ఆ నృపతి కోపమును నిగ్రహించి వసుమతిని (భూమిని) చూచి ఇట్లనెను.

తనకుగాని ఇతరునికి గాని ఒక్కనికి మాత్రము క్షేమముగల్గుటకు పెక్కు ప్రాణులను సంహరించినవానికి అంతులేని పాపము గల్గును. ఏ దుష్టుడు సంహరింపబడుట వలన పెక్కుమంది జీవులు సుఖమును పొందుదురో అట్టివానిని సంహరించుటవలన పాతకము ఉపపాతకము అను ఏవియు కలుగవు. వసుంధరా! నేను చెప్పినట్లు జగద్ధితము చేయని ఎడల నిన్ను పెక్కుమంది ప్రజల క్షేమము నిమిత్తమై ఇదిగో ఇపుడే సంహరించెదను. నా శాపమునకు పెడమొగమైన నిన్ను నా బాణముచే ఇప్పుడు కూల్చి మెప్పుఁగొని ప్రజలను కాపాడెదను. ధర్మశీలురకెల్ల ఉత్తమురాలవు నీవు. నాశాసనమునకు కట్టువడి ప్రజల బ్రతికింపుము. ప్రజాధారణ మందు నీవు సమర్థురాలవు గదా! నాకు కుమార్తెవు కమ్ము అప్పుడు ఈ భయంకరమైన బాణమును ఉపసంహరించెదను అని రాజు అనెను. ఆ మాటలకు వసుధ ఇట్లని జవాబిచ్చెను :

"దీనిని అంతయు నేను చేసెదను. సంశయము లేదు. కాని నాకు ఒక దూడను సంపాదింప యత్నింపుము. దాని మూలమున నేను పాలు చేపెదను. అదిగాక నన్ను మెట్టపల్లములు లేనట్లుగా చేయుము. అపుడు నాచేపిన క్షీరము నలుమూలల సమముగా జాలువారును. ఆ మాటలు విని, పృథుచక్రవర్తి తన ధనుష్కోటిచే వేలకొలది కొండలను మీదికి లేవగొట్టెను. ఇంతకుముదు సృష్టియందు భూతలము విషమముగ అనగా ఎత్తు పల్లములుగా ఉండెను. ఆ యెగుడు దిగుడు నేల యందుపురములు, గ్రామములు అను

విభాగమే లేకుండెను. పంటలు లేవు. గోరక్షణ లేదు. కృషి లేదు. వర్తకమునకు దారి లేదు. సత్యానృతము (వాణిజ్యము) లేదు. లోభము లేదు. మత్సరము లేదు. వైవస్వతమనువు తరము అట్లు గడిచినది. ఇప్పుడు పృథు చక్రవర్తి మొదలు ఇది అంతయు ఏర్పడినది. ఎక్కడెక్కడ ఈ ధరిత్రి సమముగ ఉండిన అక్కడ ప్రజలు నివాస మేర్పరచు కొనకోరిరి. ఆనాటికి కందమూలములు ఆహారము. అది మిగుల కష్టజీవనమని విందుము. పృథువు స్వాయంభువ మనువును దూడగా ఒనరించి తన హస్తమే పాత్రముగ భూమిని పిదికెను. ఆ పిదికిన క్షీరము సర్వ సస్యస్వరూపము. ఆ అన్నముచేతనే ఈ నాటికిని ప్రజలు సుఖజీవనులు అగుచున్నారు. ఋష్యాదులు తమతమ ఆహార రూపమైన క్షీరమును తమకు అభిమతమైన పాత్రములందు పిదుకుకొనిరి.

ఆ క్రమము ఇట్టిది

ఋషులకు సోముడు వత్సము (దూడ), దోగ్ధ (పిదుకువాడు) బృహస్పతి. క్షీరము. తపో బ్రహ్మము పాత్రము ఛందోమయము దేవతలకు ఇంద్రుడు దూడ. దోగ్ధ రవి, పాలు ఓజస్సు (తేజస్సు) పాత్రము కాంచనము. పితృ దేవతలకు దూడ యముడు, దోగ్ధ అంతకుడు. పాలు సుధ (స్వధ). పాత్రము రజతము (వెండిగిన్నె) నాగులకు తక్షకుడు దూడ దోగ్ధ ఐరావతుడను నాగుడు. క్షీరము విషము పాత్రము సొరకాయ. అసురులకు విరోచనుడు వత్సము (దూడ) దోగ్ధ మధువు. పాలు మాయామయము. పాత్ర ఆయనము ఇనుపగిన్నె (అయోమయము) యక్షులకు దూడ వైశ్రవణుడు. దోగ్ధ రజతనాభుడు. పాలు అంతర్ధానము పాత్ర. మట్టికుండ. రాక్షసేంద్రులకు దూడ సుమాలి దోగ్ధ రజత నాభుడు, పాలు శోణితము (రక్తము) పాత్ర కపాలము. గంధర్వులకు దూడ చిత్రరథుడు పిదుకువాడు సురుచి పాలు సుగంధము. పాత్ర పద్మము పర్వతములకు దూడ. హిమ వంతుడు దోగ్ధ మేరువుపాలు రత్నౌషధులు పాత్రము శైలము. వృక్షములకు దూడ ప్లక్షము (జువ్వి) దోగ్ధ పుష్పించిన శాలము, వృద్ధిపాలు. తెగిన (కాలినచోట) మొలపించుశక్తి అనునది. పాత్రము మోదుగాకుల దొన్నె (పాలాశ పత్రము) ఈ విధముగ ఈధాత్రి నిజముగ ధాత్రియే (పాలిచ్చి పెంచెడి దాదియే) విధాత్రి (జీవన విధాత్రి– బ్రతుకుతెఱువు చూపెడి తల్లి) పావని. చరాచర భూతములకు నిలుచు ఆదరవు. (యోని కారణము) సర్వ కామ దోగ్ధ్రి– సర్వసస్య ప్రరోహణి. ఆ సముద్ర పర్యంతయైన ఈ భూమి మధుకైటభుల మేదస్సుచే (మెదడుచే) మేదిని అని ప్రఖ్యాతి గొన్నది. ఈ పేరు వేదవాదులు పెట్టినది. ఈవల ఈమె పృథు నృపతికి కన్నకూతురు అయ్యెను కావున పృథివి అను ఖ్యాతి గన్నది.

అతనిచే వసుంధర సువిభక్త అయినది. సువిశోధితమై సస్యములు, గనులు కల్గి, పురపట్టణ గ్రామాదులచే నిండుతనము సంతరించుకొన్నది. వైన్య (వేనుని కుమారుడైన) రాజన్య చూడామణి ఇట్టి అసామాన్య ప్రభావుడు రాజసత్తముడు, భూత-గ్రామములకు నమస్కరింప తగినవాడు. పూజింప అర్హుడు. వేదవేదాంగపారగులైన బ్రాహ్మణులకుగూడ పృథు చక్రవర్తి నమస్కరింపతగినవాడు. పార్థివత్వమును కోరు రాజుకు మహానుభావులకు ఆది రాజుగ అభివంద్యుడు. ప్రతాపశాలి శ్రీ పృథువు. విక్రమశీలురైన యోధులకు జయాకాంక్షులైనవారికి యోధులకెల్ల ప్రథముడైన పృథువు వంద్యుడు. పృథుని ధ్యానించి, కీర్తించిన యోధుడు ఘోరమయిన సంగ్రామ రంగము నుండి క్షేమముగ మరలి రాగల్గును. వాణిజ్య వృత్తిని అనుసరించు వైశ్యులకు, విత్త సమృద్ధికై వృత్తిదాతయైన పృథువు వంద నీయుడు. శుచివర్తనులై త్రివర్ణములను ఉపచరించు శూద్రులకును పృథుచక్రవర్తి నమస్కారానికి అర్హుడు. దానివలన వారు పరమ శ్రేయస్సు పొందగలరు. మహర్షులార! మహానుభావులార! మఱియేమి వినదలంతురు? సెలవిండు అని ఆ లోమహర్షణుడు అడుగగా (4)

మన్వంతర కీర్తనము

ఋషులు ఇట్లు పలికిరి -

ఓ బుద్ధిశాలీ లోమహర్షణ! మన్వంతరములను అన్నింటిని తెలుపుచు వానియొక్క విశేష సృష్టిని వర్ణింపుము. మనువు లెందరో వారి కాలమేదియో వారి సమయమందు జరిగిన విశేషములను స్పష్టముగా ఎరుగ కోరుచున్నాము. అని ఋషులు అడుగగా సూతుడు మన్వంతరములను గూర్చిన చరిత్ర సంక్షేపముగ చెప్పెదను. వేయేండ్లయిన దీనిని తెలుపుటకు అలవికాదు. స్వాయంభువుడు, స్వారోచిషుడు, ఉత్తముడు, తామసుడు, రైవతుడు, చాక్షుషుడు, వైవస్వతుడు. సావర్ణి (తర్వాత) రైభ్యుడు, రౌచ్యుడు, మేరుసావర్ణి. వీరందరూ మనువులు. ఇపుడు వైవస్వత మన్వంతరము జరుగుచున్నది. ఆయా మన్వంతరము లందలి సప్తర్షులను పుత్రపౌత్ర పరంపరను దేవగణములను తెలుపుచున్నాను వినుడు.

స్వాయంభువ మనువుకాలమున సప్తర్షులు మరీచి, అత్రి, అంగిరస్సు, పులహుడు, క్రతువు, పులస్త్యుడు, వశిష్ఠుడు, వీరు బ్రహ్మ కుమారులు. ఉత్తర దిక్కునందు ఉందురు. ఆగ్నీధ్రుడు, అగ్నిబాహుడు. మేధ్యుడు, మేధాతిథి, వసువు, జ్యోతిష్మంతుడు, ద్యుతిమంతుడు, హవ్యుడు, సబలుడు, పుత్రుడు అను పదిమంది స్వాయంభువుని కుమారులు. ఇది ప్రథమ మన్వంతరము.

స్వరోచి మనువు కాలమున ఋషులు-ఉర్వుడు, స్తంబుడు, కశ్యపుడు, ప్రాణుడు, బృహస్పతి, దత్తుడు, అత్రి, చ్యవనుడు. మహాప్రతులైన ఏడుగురు దేవతలు-తుషితులు. హవిష్ణుడు, సుకృతి, జ్యాతి, ఆపుడు, మూర్తిప్రతీతుడు, నభస్యుడు, నభస్సు, ఊర్జస్సు అను వారు స్వారోచి కుమారులు. ఇది రెండవ మన్వంతరమునకు సంబంధించిన విషయము.

ఉత్తముని కాలమున వశిష్ఠ కుమారులు(వాశిష్ఠులు) ఏడుగురు ఋషులు. హిరణ్యగర్భుని కుమారులు ఊర్జులు. ఉత్తముని కుమారులు పది మంది. ఇషుడు, ఊర్జస్సు తనూర్జుడు. మధువు, మాధవుడు, శుచి, శుక్రుడు, సహుడు, నభస్యుడు, నభుడు, దేవతలు ఇందు భానువులు ఇది తృతీయ మన్వంతర విషయము.

వశిష్ఠ కుమారులు (వాశిష్ఠులు) ఏడ్వురు ఋషులు. హిరణ్యగర్భుని కుమారులు ఊర్జులు. ఉత్తముని కుమారులు పదిమంది. ఇషుడు, ఊర్జసు, తనూర్జుడు, మధువు, మాధవుడు, శుచి, శుక్రుడు, నహుడు, నభస్యుడు, నభుడు. దేవతలు ఇందు భానువులు. ఇది చతుర్థ మన్వంతర విషయము.

తామస మన్వంతరమున కావ్యుడు, పృథువు, అగ్ని, జహ్నువు, ధాత, కపీవంతుడు, అకపీవంతుడు అనువారు సప్తర్షులు. ఇందు దేవగణములు. ద్యుతి, తపస్యుడు-సుతపుడు, తపోభూతుడు, సనాతనుడు, తపోరతి, అకల్మాషుడు, తన్వీ, ధన్వీ, పరంతపుడు అనువారు పదిమంది వాయువుచే చెప్పబడినవారు. దేవబాహువు యదుద్రుడు, (ముని) వేదశిరస్సు హిరణ్య రోముడు, పర్జన్యుడు, ఊర్ధ్వబాహువు (సోమజుడు, సత్యనేత్రుడు (ఆత్రేయుడు) అను వారు రైవతమనువు కాలమున సప్తర్షులు. ఇందు దేవగణములు - అభూత రజస్సు ప్రకృతి. వారిప్లవుడు, రైభ్యుడు, ధృతిమంతుడు, అవ్యయుడు, యుక్తుడు, తత్త్వదర్శి, నిరుత్సుకుడు, అరణ్యుడు, ప్రకాశుడు నిర్మోహుడు, సత్యవాక్కు, కృతి. ఐదవ రైవతమన్వంతరమునందు రైవతుని కుమారులు.

ఆఱవ మనువు చాక్షుషుడు, ఈయన కాలమున సప్తర్షులు. భృగువు, నభస్సు, వివస్వంతుడు, సుధాముడు, విరజుడు, సహిష్ణువు అనువారు (అప్రసూతులు) ఆ బాలప్రఖ్యాతులు. లేఖులను వారు దేవగణములు ఐదుగురు. అంగిర కుమారులు అతినాముడు, నాద్వలేయులు పదిమంది. చాక్షుష మనువు పుత్రులు రురు ప్రభృతులు.

సప్తమము వైవస్వత మన్వంతరము. అత్రి, వశిష్ఠుడు, కశ్యపుడు, గౌతముడు, భరద్వాజుడు, విశ్వామిత్రుడు, (ఋచీకుని కుమారుడు) జమదగ్ని అనువారు ఇపుడు సప్తర్షులు. సాధ్యులు, రుద్రులు, విశ్వేదేవులు, వసువులు, మరుత్తులు, ఆదిత్యులు, అశ్వినులు వైవస్వత

మనువు కాలమున దేవతలు. ఇక్ష్వాకు మొదలగువారు పది మంది కుమారులు. వారి సంతానములు అనంతములయి సర్వ మన్వంతరములందు సప్తసప్తకులు అనగా 7 × 7 = 49 మంది ధర్మవ్యవస్థ కొఱకు లోకరక్షణ కొఱకు (సప్త గణములు) వర్తించి కర్మానుష్ఠానమును చేసి శాశ్వత బ్రహ్మలోకమును అలంకరింతురు. ఆమీద వారివారి స్థానములను తపస్సంపన్నులు మరియొకరు అధిష్ఠింతురు. ఇట్లు అతీతులు వర్తమానులు అయిన వారిని పేర్కొంటిని.

ఇక రాగల మన్వంతరములలో సావర్ణి మనువు కాలమున రాముడు, వ్యాసుడు, (ఆత్రేయుడు) అశ్వత్థామ (భరద్వాజుడు, ద్రౌణి) అజరుడు, శరద్వంతుడు (గౌతముడు), గాలవుడు (కౌశికుడు), ఔర్వుడు (కాశ్యపుడు) వీరు ఏడుగురు ఋషులయ్యెదరు. వైరి అధ్వరీవంతుడు, శమనుడు, ధృతిమంతుడు, వసువు, అరిష్టుడు, అధృష్టుడు, వాజి, సుమతి అను వారు. సావర్ణి మనువు కుమారులు. వీరిని వేకువవేళ మేల్కొని కీర్తించిన సుఖ సమృద్ధికలుగును, కీర్తికల్గును. ఆయుర్భాగ్యము కలుగును. సావర్ణులయిన, మనువులలో ఒకడు వైవస్వతుడు నల్గురు ప్రజాపతి సంతతివారు. పరమేష్ఠి కుమారులు మేరు సావర్ణులయిరి. మేరుగిరిపై తపోనిరతి నుండువారు. రుచి ప్రజాపతి పుత్రుడు. రౌచ్యుడు. (మనువు) రుచికి భూతిదేవియందు గల్గినవాడు. వీరు ఈశ్వేత వరాహ కల్పమునందు రాగల మనువులు ఏడుగురు. ఈ పదునాల్గురు మనువులవలన సప్తద్వీపయైన ఈ పృథివియెల్ల పట్టములతో గూడ వేయి యుగములు పరిపాలింపబడగలదు. డెబ్బది యొక్క మహాయుగములు ప్రజాపతియొక్క పూర్ణాయుర్దాయము. వీరు మనువులు పదునల్వురు కీర్తి వర్ధనులు. వేదములందు పురాణములందు వినిపింతురు. ప్రజాపతులు వీరు. వీరి సంకీర్తనము ధన్యతాసంపాదకము. మన్వంతరములందు సంహారము, సంహారాంతమున (లయమందు) సృష్టి-ఈ లెక్క వర్ణింప అలవిగాదు. ప్రళయావసానమున సప్తర్షుల తోడ, తపోబలముచే, బ్రహ్మచర్య సంపత్తిచే, శ్రుతముచే (జ్ఞానముచే) కొందరు మహర్షులు శేషించి ఉందురు. వారినే శిష్టులందురు. యుగ సహస్ర సంపూర్తి యందు కల్ప సమాప్తియై జగత్తు నిశ్శేషమగును. అపుడెల్ల భూతములు ఆదిత్య కిరణములచేత దగ్ధము లగును. వీరు బ్రహ్మను ముందిడుకొని ఆదిత్య గణములతో సురశ్రేష్ఠుడైన నారాయణ ప్రభువునందు చొచ్చెదరు. కల్పాంతమునందు పునస్సృష్టిచేయు మహానుభావుడు ఆయన. అవ్యక్తము. శాశ్వతము అయిన తత్త్వము. ఈ జగత్తంతయు ఆయనయే ఇక వైవస్వతమనువు యొక్క విసర్గ వృత్తాంతము వినిపించెదను. పురాణ లక్షణములందు ఒకటైన వంశ లక్షణముగ ప్రసంగ వశమున శ్రీహరి అవతరించిన వృష్ణి వంశమును అటుతరువాత వర్ణించెదను వినుడు. (5)

ఆదిత్య ఉత్పత్తి

సూతుడు ఇట్లు అనియె –

ద్విజోత్తములార! కశ్యపునికి దక్షసుతయందు వివస్వంతుడు ఉదయించెను. అతని భార్య సంజ్ఞ. ఆమె త్వష్ట ప్రజాపతి కుమార్తె. సురేశ్వరియను పేర త్రిలోక ప్రఖ్యాతి పొందినది. రూప యౌవనశాలినియైన ఆ దేవికి భగవంతుడగు వివస్వంతుని యొక్క (మార్తాండుని యొక్క) అందము అంతగా ఆనంద మీయదయ్యెను. ఆమె మంచి తపస్సుచేసి మంచిదీప్తి గడించుకొన్నది. కాని ఆదిత్య మండలము వేడిమికి ఆమె తనూలత వాడిపోయి అంతగ రాణింపదయ్యెను. కాశ్యపుడు వాత్సల్యాతిశయముచే వీడు 'అండమందు మృతుడు కాలేదు' గద అని ఎఱుగక పలికిన విధమున అతనికి మార్తండుడను పేరు రూఢమయ్యెను. ఆతని తేజస్సు దుర్భరమై ముల్లోకములను దహింపజేయు నట్టిది అయ్యెను. ఆదిత్యుడు (వివస్వంతుడు) సంజ్ఞాదేవియందు మనువును శ్రాద్ధదేవుడైన యముని కనెను. యమున అను కన్యకుగూడ జన్మనిచ్చెను. యముడును, యమునయు కవలపిల్లలు. సంజ్ఞ శ్యామవర్ణుడైన ఆ వివస్వంతుని జూచి ఓర్చుకొనలేక తనకు సమానురాలును, మాయమయియైన ఛాయ (నీడ) అను స్త్రీని కల్పించెను. ఆ మాయ సృష్టింపబడిన వెంటనే సంజ్ఞ ఎదుట నిల్చి, ప్రాంజలియై మ్రొక్కి, ఓ సుహాసిని! నేను చేయతగిన కార్యమును జెప్పుము. నీఆజ్ఞావశనై ఉన్నాను. నాచేత పనిచేయించుకొనమని పలికెను.

సంజ్ఞ మాటలకు –

"అబలా! నేను పుట్టినింటికి ఏగెదను. నీకు శుభము కలుగును గాక! నాయింట నీవు నిశ్శంకముగ ఉండవచ్చును. ఈ పిల్లలిద్దరు ఈ బాలిక సంతానము. వీరిని కనిపెట్టుకొని ఉండుము. ఈ మాట భగవంతుడు వివస్వంతునికి ఎన్నడేని జెప్పకుము" అని పలికెను.

ఆ మాటలను అలకించిన సవర్ణ (ఛాయ) జుట్టుపట్టిలాగునందాక, శాపమిచ్చునందాక, ఈ వార్త నేను ఎన్నడును చెప్పను. నీకు నమస్కారము. దేవీ! సుఖముగ వెళ్ళిరమ్మనెను.

తపస్వినియైన సంజ్ఞ సవర్ణకు (ఛాయకు) ఇట్లు తెలిపి బిడ్డలను అప్పగించి తండ్రియగు త్వష్ట ప్రజాపతి సమీపమునకు ఏగి, సిగ్గున తలవంచుకొని నిలువబడెను. ప్రజాపతిచేత భర్త సన్నిధికి పో! పొమ్ము అని పలుమారులు అదలించి బెదిరించి ఆదేశింపబడియు అయ్యింతి కాంతుని గృహమునకు పోక, బడబ (ఆడు గుఱ్ఱము) ఆకృతిని దాల్చి (ఆడు గుఱ్ఱమై) తన రూపము మఱుగుపఱచుకొని ఉత్తర కురు భూములందలి పచ్చిక బయళ్ళలో తిఱుగజొచ్చెను.

రెండవ సంజ్ఞను, అసలు సంజ్ఞయే అని భావించి ఆమె యందు ఆదిత్యుడు (సూర్యుడు) తనకు అన్నింటియందు సమానుడైన కొడుకును పొందెను. ఇంతకుముందు పుట్టిన మనువును పోలినవాడైనందున ఇతడును 'సావర్ణ మనువు' అని పిలువబడుచుండెను.

ఆమెకు కల్గిన రెండవకుమారుడు శనైశ్చరుడు. అతడు పుట్టిన తరువాత ఆమె తనకు అప్పగించిన సవతిబిడ్డలను ఆదరించుట మానివేసెను. మనువు దానిని సమీపించి ఊరకుండెను. యముడు అది ఓర్వలేక ఆసవతి తల్లిని పాదమెత్తి బెదిరించెను. అందులకు ఛాయ కోపించి మిగుల దుఃఖించి నీకాలు పడిపోవుగాక అని శపించెను. యముడా వృత్తాంతమును తండ్రికి ప్రాంజలియై విన్నవించెను. నాకు అమె ఇచ్చిన శాపమును మరలింపుమని తండ్రిని వేడుకొనెను. తల్లి తన బిడ్డలు అందరియెడ సమానమైన వాత్సల్య ముతో వర్తింపవలయునుగదా. ఈ అమ్మ మమ్ములను నిరసించి బ్రతుకనెంచినది. అందువలననే ఆమెపై పాదము ఎత్తితిని, ఎత్తితినే కాని ఆమె శరీరమునకు తాకింపలేదు. బాల్యముచే, లౌల్యముచే ఎఱుఁగకనేను ఒనరించిన తప్పును క్షమింపుము. తల్లి శాపమునకు గురియైతిని. గ్రహరాజ! (ఓ సూర్యుడా) నీ అనుగ్రహముచే నా పాదము పడిపోకుండుగాక! అని కొడుకు వాపోవకరుణించి సూర్యుడు అతడితో ఇట్లు అనియె. పుత్ర! ఇందేదో గొప్ప కారణముండి తీరును. ధర్మజ్ఞుడవు, సత్యవచనుడవైన నిన్ను క్రోధము ఆవేశించినది. నీ తల్లిమాట మిథ్య గాకుండుటకు కృములు నీకాలి మాంసము దిని అవనికేగును. ఈ రీతి మీ అయమ్మ మాట సత్యము కాగలదు. ఈ విధమైన శాపపరిహారముచే నీవును సురక్షితుడవు అయ్యెదవనెను.

ఆదిత్యుడు సంజ్ఞను జూచి (ఛాయామూర్తిని) బిడ్డలను అందరిని ఒక్కరీతిగా గాక ఒక్కనియందు ఎక్కువ ప్రేమ నీకు ఎందులకని అడిగిన ఆమె ఆమాట తప్పించెనేగాని నిజము చెప్పదయ్యెను. అతడు తనకుతాను సమాధానపడి యోగదృష్టిచే నిజమెఱింగెను. ఆమెను అప్పుడే శపింపబూనియు శాపమీయక జుట్టు పట్టుకొని ఈడ్చెను. అంత ఆమె జరిగిన విషయము తన పతికి విన్నవించెను. వివస్వంతుడు ఆ వృత్తాంతము అంతటిని విని కోపించి, మామ గారగు త్వష్ట చెంతకు వెళ్ళెను. మామయు ఆ విధముగా వచ్చిన అల్లుని ఆదరించెను. రోషముతో తనను దహించుటకు వచ్చినాడని గ్రహించి అపుడు అతనిని అనునయించుచు ఇట్లనియె.

ఓ ఆదిత్యమూర్తి! ఈ నీ రూపము భరింపరాని తేజము కలది. అందుచే దానిని చూడరాదయ్యెను. సంజ్ఞ ఇది సైపనేరక పచ్చిక బయళ్ళ తిరుగాడుచున్నది. శుభచారిణియైన నీ సహధర్మచారిణిని ఇప్పుడు చూడవలయును. ఆమె శ్లాఘనీయ. యోగబల సంపన్నురాలు. గ్రహరాజగు నీకు నామాట అనుకూలము, సమ్మతము అగునేని యోగమానియామె చెంతకరుగుము. నీ రూపమును చూడముచ్చగటగ ఒనరింతునని తెలిపి, యా

తరణిని (సూర్యుని) యంత్రమునెక్కించి చెక్కివైచెను. తరణిని యంత్రమున బట్టిన నాటినుండీ తరణిబట్టుట వలన నీపేరు లోకమున రూఢికెక్కెను. దానివలన అతని తేజస్సు కొంతడిందువడి రూపము చూచుటకు అందమై ఇంపొందెను. ఆ మీద అతడు యోగశక్తిచే ఉత్తరకురు భూములకు పోయి బడబారూపమున చరించుచున్న తన భార్యను చూచెను. తేజస్సుచే పాతివ్రత్య నియమముచే భూతములకు దృశ్యమైయున్న ఆ అంగనను ఎందును భయపడక సంచరించుచుంచగాచూచి తాను అశ్వరూపము ధరించి ముఖ మునం గవయఁబోయెను. పరపురుషశంకగొని ఆమె పెడమొగ మైయున్న సమయమున ఆమెయందు నిక్షిప్తమైన శుక్రమును ఆమె నాసికా రంధ్రముల వెంట చీదివైచెను. అందుండి అశ్వినులు అను దేవవైద్యులు నాసత్యుడు (దస్రులు) అని పేర్కొనబడెడివారు ఉదయించిరి. అష్టమ ప్రజాపతియగు మార్తండుని ఔరసులైన ఇర్వురు మిక్కిలి అందమైనవారు. తరువాత భాస్కరుడు ఆకాంతకు మిగులకాంతుడై కానవచ్చె. ఆమె కూడ తన మనోహరునింగని మిగుల సంతోషించెను.

యముడు మాత్రము తాను ఇంతకు ముందు చేసిన పనికి మిక్కిలి వగచెఁది ప్రజలను ధర్మముచే రంజింపఁచేసి ధర్మరాజను సార్థక నామము, పితృ దేవతలకు ఆధిపత్యమును, లోకపాలకత్వమును బడసెను. సావర్ణి ప్రజాపతి సావర్ణి మన్వంతరమున మనువు కాగలడు. అతడు మేరుగిరిపై ఇప్పుడును తపము చేయుచున్నాడు. వాని తమ్ముడు శని గ్రహపదవిని పొందెను. త్వష్ట (సూర్యబింబమును) తరణి బట్టగా రాలిన రజమును బ్రోవుచేసి విష్ణు చక్రమును గావించెను. అది దానవాంతకము, అప్రతిహతము. యముని తరువాత పుట్టిన ఆ బాలిక యమున అనుపేర లోకపావని అయినది అయ్యెను. మనువు సావర్ణుడు అను పేర ఆ రెండవ కుమారుడు పిలువబడెను. ఆయన తమ్ముడు శనిగ్రహ పదవి నంది సర్వలోక పూజితుడు అయ్యెను. దేవతల ఈ జన్మ వృత్తాంతమును విన్నవాడు ఆపదలను బాసి మహాయశస్సు నందును. (6)

సూర్యవంశ నిరూపణము

మన్వంతర వృత్తాంతములను మునులకు తెలుపుచు ఇంకను లోమహర్షణుడు ఇట్లు పలికెను .....

వైవస్వత మనువునకు తొమ్మండ్రు కుమారులు గల్గిరి. వారు తండ్రి అంతవారు. వారు ఇక్ష్వాకుడు, నాభాగుడు, ధృష్టుడు, శర్యాతి, నరిష్యంతుడు, ప్రాంశువు, రిష్టుడు, కరూశుడు, పృషధ్రుడు అనువారు. వారు కల్పకముందు మనువు మిత్రావరుణులను

ఉద్దేశించి పుత్రకామేష్టిని చేసెను. అందు అతడు మిత్రావరుణుల ఎంచి ఆహుతులిచ్చెను. అక్కడ దివ్యాంబర ఆభరణములుదాల్చి దివ్య శరీరముతో ఇల అను అంగన ఆవిర్భవించెనని వినికిడి. మనువు దండధరుడై ఆమెను 'ఇలా, ఇలా' అని పేర్కొని ఓ కల్యాణి! నావెంట రమ్మని పిలిచెను. పుత్రకామియైన ఆ ప్రజాపతిని చూచి ఆమె ధర్మయుక్తముగ ఇట్లు పల్కెను.

నేను మిత్రావరుణుల అంశమున పుట్టిన దానను. వారి సన్నిధికేగెదను. నన్ను ధర్మదూరురాలిని కావింపకుమని పలికి వారికడకు ఏగి ప్రాంజలియై ఇట్లనెను.

"ఓ మిత్రావరుణ దేవతలార! మీ అంశముచే జనించినదానను. మీకేమి చేయుదును. మనువు తనను అనువర్తింపుమన్నాడని" ఇల పలికినంత వారు ధర్మపరాయణయగు ఆ సాధ్వితో ఇట్లు పలికిరి.

మానిని! నీ ధర్మము, వినయము, ఇంద్రియ నిగ్రహము, సత్యము అనువానికి ప్రీతులమైతిమి. ఓ సుందరి! మహానుభావయగు నీవు మా కన్యవుగా ఖ్యాతి నందుదువు. మనువునకు వంశకరుండగు కుమారుడవు గూడ నీవే అయ్యెదవు. జగత్ప్రియుడవు ధర్మ శీలుడవు. మను వంశవర్ధనుడవు అయ్యెదవు. సుద్యుమ్నుడను పేర ముల్లోకములందు ప్రసిద్ధుడవు అయ్యెదవు. అంత ఆమె వారిమాటలు విని వెనుదిరిగిపోవుచు దారిలో బుధునిచే కామింపబడి సంగమమువడసి సోమపుత్రుడగు అతని వలన పురూరవుడను కొడుకును కనియెను. అటుతరువాత ఆమె సుద్యుమ్నుడను పేర మగవాడయ్యెను. సుద్యుమ్నుని దాయాదులు పరమ ధార్మికులు ముగ్గురు.

వారు ఉత్కలుడు, గయుడు, వినతాశ్వుడు అనువారు. ఉత్కలుని భార్య ఉత్కల. వినతాశ్వుని వల్లభ పశ్చిమదిక్కు. గయుని భార్య ప్రాగ్దిక్కు. గయ అను పేర్లను పొందినది. మనువు సూర్యుని యందు జొచ్చినంతట ఈతని దాయాదులు క్షత్రజాతివారీ పృథివిని పదిభాగములు ఒనరించిరి. జ్యేష్ఠుడు 'ఇక్ష్వాకుడు' మధ్యదేశమునుc బడసెను. సుద్యుమ్నుడు మున్ను కన్యయై యున్నందున రాజ్యభాగములేని వాడయ్యెను. వశిష్ఠవచనముచే ప్రతిష్ఠానము నందు ధార్మికుడైన సుద్యుమ్ననికి ప్రతిష్ఠ (ఉనికి) లభించెను. దాని నతడు పురూరవునకు ఒసంగెను. సుద్యుమ్నుడు మనువు కుమారుడైనను, స్త్రీ పుంస లక్షణములు గలవాడై (ఇల–సుద్యుమ్నుడు అని పిలువబడుచు) పృథివిని ధరించెను.

నాభాగుని కొడుకులు నరిష్యంతులు శకులు అనువారు. అతనికి అంబరీషుడును పుత్రుడై జనించెను. ధృష్టునికి రణదృప్తమయిన క్షత్రజాతి ధార్ష్టికమను పేర ఉదయించినది. కరూశునికి కారూశులు కల్గిరి. వారును యుద్ధమునందు ఉద్ధతులు. నాభాగ ధృష్ట సంతాన

మైన క్షత్రియులు వైశ్యత్వమునందిరి. ప్రాంశువునకు ప్రజాపతి అను కుమారుడు గల్గెను. నరిష్యంతుని దాయాది దంతధరుడు. శర్యాతికి ఆనర్తుడను కుమారుడు సుకన్యయను కన్యయు ఇద్దరు జన్మించిరి. సుకన్య చ్యవనమహర్షికి ఇల్లాలు అయ్యెను. అనర్తుని దేశము ఆనర్తము. అతని రాజధాని కుశస్థలి. ఆనర్తుని దాయాది రైవుడు అను అతడు మహా తేజస్వి. రైవుని పెద్దకొడుకు (రైవతుడు) ककుద్మియను పేరుగలవాడు ధార్మికుడు. కుశస్థలి రాజధానిగా రాజ్యమేలినవాడు. తన కన్యకతో నేగి బ్రహ్మసన్నిధి ఒక్క ముహూర్త కాలము ఉండి గాంధర్వమును (సంగీతమును) విన్నవాడు. ఆ ముహూర్తకాలము పుడమిపై పెక్కు యుగమ్ములయ్యెను. అతడు తన రాజధానికిc దిరిగివచ్చెను. అప్పుడా నగరమును యాదవులావరించియుండిరి. పెక్కుద్వారములు గలదియై అప్పుడది ద్వారక అను పేర మనోహరమయ్యెను. అది భోజవృష్ణ్యంధక కులములవారగు వసుదేవాదుల పాలనమందుండెను. రైవతుడు అది తెలిసికొని బలదేవునకు తన కన్యను (రేవతిని) సుభద్రయను పేరుగలదానిని ఒసంగెను. ఆ మీద మేరు శిఖరమునకు వెళ్ళి తపస్సునందు ఉండెను. ధర్మాత్ముడగు బలరాముడును రేవతీదేవితో సుఖముగ విలసించెను.

ఆ వృత్తాంతమును సాకల్యముగా విన్న మునులు ఇట్లు అడిగిరి –

అప్పటికి అనేక యుగములు గడచెను గదా? రేవతికి ककుద్మికి (రేవతుని కుమారునికి) ముదిమి రాలేదేమి? మేరువునకు ఏగిన శర్యాతికిని గల్గిన సంతతి ఇప్పటికిని పృథివి యందు ఎట్లున్నది. ఈ విషయము స్పష్టముగ వినగోరుచున్నాము అన్న వారి ప్రశ్నకు లోమహర్షుడు.

అనఘులార! బ్రహ్మ లోకమున ముదిమి ఉండదు. ఆకలిదప్పిక లుండవు మృత్యువు ఉండదు. ఋతుచక్రము తిఱుగదు. స్వర్లోకమేగిన రేవత కుమారుడగు ककుద్మియొక్క రాజధాని కుశస్థలి రాక్షసులచే హరింపcబడెను. ఆతనికి సోదరులు నూరుగురుండిరి. కాని వారు రక్షోగణము బారిబడి చావుతప్పి నలుదిసలకు పారిపోయిరి. వారి వంశమందందు చెల్లాచెదరైనది. వారి పరంపరవారు శర్వాతులను పేరందిరి. గుణవంతులయిన ఆ క్షత్రియులు సర్వ దిక్కు లంటిపోయి గహనముల జొచ్చిరి. నాభగుని యొక్కయు, నరిష్టుని యొక్కయు కొడుకులు ఇర్వురు వైశ్యులు బ్రాహ్మణత్వమును బడసిరి. కరూశుని సంతతి కారూశులు. వృషధుడను వాడు గురు ధేనువును హింసించి, గురు శాపముచే శూద్రత్వ మందెను. ఇది ఆ తొమ్మిది మంది చరిత్ర.

వైవస్వతమనువు మునియే. అతడు తుమ్మగా అందుండి ఇక్ష్వాకువు పుట్టెను. అతనికి నూర్గురు పుత్రులు పుట్టిరి. వారు భూరిదక్షిణలు ఇచ్చి యజ్ఞములు గావించినవారు.

వారిలో వికుక్షి పెద్దవాడు. కుక్షిలేని వాడగుటచే అయోధ్యత్వమును పొందెను. (విరోధి ఎవ్వడు యుద్ధము చేయుటకు అశక్యముగాని వాడయ్యెను) అందఁచేతనే అతని రాజధాని అయోధ్య అనబడెను. ఆయన పుత్రులు శకుని మొదలయిన వారయిదువందల మంది ఉత్తరాపథము ఏలువారైరి. మహాబలశాలురు. ఏబది ఎనిమిది మంది దక్షిణ దిశను పాలించిరి. ఇక్ష్వాకువు వికుక్షిని, అష్టకాశ్రాద్ధమందు మాంసము తెమ్మని పంపెను. శ్రాద్ధ నిమిత్తము గనుక శశమును (కుందేటి జాతి) చంపి అతడామాంసమును తానే తిని శశాదుడను పేరంది, వశిష్ఠుని మాటనుబట్టి ఇక్ష్వాకుచే పరిత్యక్తుడై వేటకు పోయెను.

ఇక్ష్వాకువు ఉండగనే శశాదుడు రాజయ్యెను. శశాదుని దాయాదుడే ककుత్థుడు. మంచి బలశాలి. ఆయన కొడుకు అనేనుడు (ఏనస్సు పాపము ఆదిలేని వాడు అనేనస్సు) అతని కొడుకు పృథుడు. వానికి విష్టరాశ్వుడు. వానికి యవనాశ్వుడు, వానికి శ్రావుడు అనువారు కల్గిరి. శ్రావస్తకుడు శ్రావుని కుమారుడు. శ్రావస్తి నగరనిర్మాత. వాని కొడుకు బృహదశ్వుడు వాని సుతుడు కువలాశ్వుడు. పరమ ధర్మమూర్తి, ధుంధువను వానిని సంహరించి ధుంధుమారుడని పిలువబడెను.

తిరిగి మునులు ఇట్లు ప్రశ్నించిరి. "ఓ సూత! ఎవనిని వధించి కువలాశ్వుడు ధుంధుమారు అయ్యెనో ఆ ధుంధు వధను గూర్చి వినగోరుచున్నాము"

వారి ప్రశ్నకు సూతుడు ఇట్లు చెప్పదొడగెను –

కువలాశ్వునికి నూరుగురు కొడుకులు. ఉత్తమ ధానుష్కులు. అందరు విద్వాంసులు. అజేయులు ధార్మికులు. ఎల్లరు భూరిదక్షిణులయిన యజ్వలు. బృహదశ్వుడు, కువలాశ్వుని రాజ్యమందుంచి వనమునకు ప్రస్థానము చేయబోగా, అతనిని ఉత్తంక మహర్షి పోవలదని వారించగా ఉత్తంకుడు

నీవు రక్షణ చేయవలసినవాడవు, అందులకు అర్హుడవు. నేను ఆందోళనములేకుండ తపస్సుఁజేయుటకు చాలను. నా ఆశ్రమ సమీపమున చదునైన మరుధన్వములనెడి ప్రదేశములందు సముద్రుడు వాలుకాపూర్ణుడై (ఇసుకమేటలు వేసినది) ఉద్దాకుడని పిలువ బడును. ఆ సముద్రమందు దేవతలకేని అవధ్యుడు మహాకాయుడు బలశాలి. ఇసుకలోనే శయనించియుండు మధుపుత్రుడగు ధుంధుడను మహాసురుడు, లోకనాశనమునకు దారుణ తపమొనరించుచుండును. సంవత్సరము చివర వాడొకసారి నిట్టూర్పు పుచ్చును. అప్పుడు భూకంపము వచ్చును. వాని నిఃశ్వాస వాయువుచే ఇసుకలేచి ఏడురోజులు ఆదిత్య మండలముదాక కప్పివైచును. మిణుగురులతో, నిప్పులతో, పొగతో అది అతి దారుణముగ

నుండును. నేను అచట తపమొనరింప నిలువలేకుంటిని, లోక క్షేమమునకు నీవు వానిని సంహరింపుము. తన్మారణ మొనరింప లోకములు స్వస్థలములగును. నీవొక్క డవే వానిని సంహరింప సమర్థుడవు. వానిని జంపినవానికి వరములిచ్చి వాని ప్రతాప ఖ్యాతిగావింపుము అని విష్ణువు నాకు వరమిచ్చెను. వాడు మహాతేజస్వి. అల్ప తేజస్వి చేత మడియడు అనగా ఆ ఉత్తంకుని పలుకులు విని తనసుతుని కువలాశ్వుని జూపి స్వామి! నేనస్త్ర త్యాగము చేసితిని. ఈతడు ధుంధువధ యొనరింపఁజాలునని చెప్పి తానుతీవ్ర తపోనిష్ఠకై పర్వతమున కేగెను.

ఇంకను లోమహర్షణుడు ఇట్లనియె –

ఓ బ్రాహ్మణులారా! కువలాశ్వుడు నూర్గురు కొడుకులతో ధుంధుని పైకి దండెత్తెను. ఉత్తంకుడు అతని వెంటనుండెను. అప్పుడు విష్ణుభగవానుడు అతని ఆవేశించెను. అతడు దండెత్తి పోవు సమయమునందు 'ఇతడు శ్రీమంతుడు, అవధ్యుడు, తప్పక ధుంధువును చంపగలడ'ను శబ్దము ఆకాశమున వినబడెను. అతనిని దేవతలు దివ్య గంధ మాల్య ములచే ముంచెత్తిరి. దేవ దుందుభులు మ్రోగెను. అతడు సుతులతో పోయి సముద్రమును మూలమట్టుగ త్రవ్వించెను. పడమటి దిశ ఆ రాక్షసుడు బయలువడి వారిని ఎదిరించెను. వాని ముఖాగ్ని పెనుగాలితో రేగి లోకముల దహించి నట్లయ్యెను. వెల్లువలై నీరు ఉబికెను. మువ్వురు తప్ప తక్కిన వారెల్లరు దగ్ధులయిరి. అటుతరువాత రాజు వానిని పైకెత్తెను. యోగి కావున, యోగబలమున జలమునించి అగ్నిని శమింపజేసెను. ఉదక రాక్షసుడగు వానిని చంపి, యుత్తంకునికి చూపెను. అక్షయ ధనము, అరి విజయము, ధర్మ మందాసక్తి, అక్షయ స్వర్గ వాసము అను వరములు ఉత్తంకుడు ఆ జేనికిఇచ్చెను. రాక్షసునిచే కూలిన కుమారులకు అక్షయలోకములు కలుగునట్లును వరమిచ్చెను.

వానికి మిగిలిన కుమారులు ముగ్గురు. పెద్దవాడు దృఢాశ్వుడు చంద్రాశ్వ-కపిలా శ్వులు తరువాతివారు. ధుంధుమార కుమారుడైన దృఢాశ్వునికి హర్యశ్వుడు అనువాడు కలిగెను. వానికి నికుంభుడు ఉదయించెను. అతడు క్షత్ర ధర్మపరుడు. అతని కొడుకు సంహతాశ్వుడు. రణవిశారదుడు. వాని తనయులు అకృశాశ్వ, కృశాశ్వులు. కూతురు హైమవతి, ఆమె దృషద్వతి అని ఖ్యాతిని పొందినది. ఆమె కొడుకు ప్రసేనజిత్తు. అతడు గౌరి అను భార్యను బడసెను. ఆమె మహాసాధ్వి. భర్తృశాపముచే ఆమె బాహుద అను నదిఅయ్యెను. అతని కొడుకు యవనాశ్వుడు. వాని కొడుకు మాంధాత. అతడు త్రిలోకములను జయించినవాడు. అతని భార్య చైత్రరథి. శశిబిందుని కూతురు సాధ్వి. బిందుమతి అను పేరు కలది. పరమ సుందరి పదివేలమంది కామె అప్పగారు. ఆమె

యందు మాంధాత ఇరువురు కుమారులను కనెను. వారు పురుకుత్సుడు ముచికుందుడను వారలు. పురుకుత్సుని సుతుడు త్రసదస్యుడు. నర్మదయందు కలిగినవాడు, వానికొడుకు సంభూతుడు వాని కుమారుడు త్రిధన్వుడు. శత్రుమర్దనము జేసినవాడు. అయన తనయుడు విద్వాంసుడైన త్రయ్యారుణుడు ప్రభువు. వాని కుమారుడు సత్యవ్రతుడు మహాబలశాలి క్రూరుడు. పరిగ్రహణ మంత్రములకు విఘ్నముల కల్పించి మరొకని భార్యను హరించిన వాడు. బాల్యముచేత కామముచే మోహముచే సాహసముచే చాపల్యముచే వాడు అంతఃపురమున నివసించు ఒక గృహస్థుని కన్యను హరించెను. త్రయ్యారుణుడు ఆ అధర్మశంకచేత క్రోధసమన్వితుడై, ఆతనిని నిందించి పరిత్యజించెను. నేను ఎక్కడకు పోదునని వాడు అనెను. "నీవు శ్వపచులతో కూడి ఉండు"మని తండ్రి అనెను. నీవు కులపాంసనుడవు. నీచే నేను పుత్రవంతుడను కాను అనియెను. వాడు తండ్రి మాటను బట్టి నగరమును వీడిపోయెను. ఋషియైన వశిష్ఠ భగవానుడు పోవలదని వానిని వారింపలేదయ్యను. ఆ సత్యవ్రతుడు శ్వపాకుల పాకల సమీపమున వసించుచుండెను. కొన్నాళ్ళకు తండ్రియు ఆవనముకు పోయెను. అంతట ఇంద్రుడు ఆ రాజ్యమున వర్షింప డయ్యెను. ద్వాదశ వర్ష క్షామమేర్పడెను. విశ్వామిత్రుడు తన భార్యను ఆతని దేశమున వదలి సాగరాంతమున విపుల తపము చేసెను. ఆయన భార్య నడిమి కొడుకును గళమందు బంధించికొనిపోయి తక్కిన బిడ్డలను పోషించుటకై, నూరు గోవులను వెలకు అమ్మెను. అట్లు గళమందు బంధితుడైన వానిని జూచి సత్య వ్రతుడు (రాజ కుమారుడు) విడిపించి, ఆతనిని తాను భరించెను. విశ్వామిత్రుని సంతోష పెట్టుటకు, అతని అనుగ్రహము పొందుటకు అతడట్లు చేసెను. గళ బంధనమందిన కతన నాతడు 'గాలవుడు' అనబరగెను. కౌశిక మహర్షి ఆ వీరునివలన అట్లు విముక్తిని పడసెను. (7)

ఆదిత్యవంశాను కీర్తనము

లోమహర్షణుడు ఇట్లు అనియె .....

సత్యవ్రతుడు భక్తితో, కృపతో, పట్టుదలతో, వినయముతో, విశ్వామిత్రుని భార్యను పోషించెను. మృగముల వేటాడి తెచ్చిన మాంసమును అముని ఆశ్రమ సమీపమున చెట్టు కొమ్మకు వ్రేలాడగట్టెను. ఉపాంశువ్రతమూని (ఇందియములను, మనసును నిగ్రహించి-చేయు వ్రతము) ద్వాదశవార్షిక (పన్నెండు సంవత్సరముల) దీక్షగొని తండ్రి ఆ దేశమున ఆదేశమందు వసించెను. యజ్ఞకర్తలకు కులగురువులకుగల సంబంధము అనుసరించి, వశిష్ఠుడు అయోధ్యా రాజ్యమును రాణివాసమును తానే పర్యవేక్షించెను.

సత్యవ్రతుడు మాత్రము అజ్ఞానము వలన భావి దైవఘటనము వలనను కులగురువగు వశిష్ఠుని యెడ అధికమైన క్రోధము వహించెను. తండ్రి కుమారుని బహిష్కరించు తఱి వశిష్ఠుడు పెక్కు కారణములచే వలదనడయ్యెను. పాణిగ్రహణ మంత్రములకు సప్తపదితో సమగ్రత యేర్పడును కావున సత్యవ్రతుడు సప్తపదిలో కన్యను అపహరింప లేదు. ఓ బ్రాహ్మణులారా! వశిష్ఠుడు ఆ ధర్మ మెఱిగియు, నన్ను రక్షించుట లేదని సత్యవ్రతుడు వశిష్ఠునిపై కోపము వహించెను. వశిష్ఠ భగవానుడు గుణబుద్ధితోనే అట్లు చేసెను. కాని సత్యవ్రతుడు వానిని తటస్థ నిగ తలంచెను. తండ్రియగు వశిష్ఠునకు కుమారుడగు సత్యవ్రతునిపై అసంతుష్టి కలిగెను.

ఆ కారణమున ఆ రాజ్యమున ఇంద్రుడు పండ్రెండు సంవత్సరములు వర్షములు లేకుండజేసెను. అందులకు ప్రాయశ్చిత్తముగా సత్యవ్రతుడు ద్వాదశవార్షికమైన కఠోరదీక్షను పూనగలడని దానివలన నీకులమునకుఁగల కళంకము పోగలదని ఎఱిఁగియే వశిష్ఠుడు ఆనాడు అడవికి పోవుటను వలదనడయ్యెదు. అటుతరువాత మాంసము కరవై, సత్య వ్రతుడు క్షుధాతురుడై క్రోధ మోహములచే మిక్కిలి శ్రమించి వశిష్ఠుని కామధేనువును హరించెను. తాను వసించు దేశ ధర్మమును అనుసరించి ఆటవిక క్రూరవృత్తిచే దానిని చంపి ఆ మాంసమును విశ్వామిత్రుని కుమారులచే కూడ తినిపించెను. అది విని వశిష్ఠుడు అతని ఎడ కోపముతో ఇట్లు అనెను. "ఓరి క్రూరుడా! ఇపుడు గురుధనమగు గోవును అపహరించి సంహరించుట ఆ మాంసమును ప్రోక్షింపకయే ఆరగించుట అను ఈ రెండు శంకువులను (పాపము లను) చేసియుండక పోయెన యెడల తండ్రియే చేసిన నీ మొదటి అపరాధమును నిస్సంశయముగా పోగొట్టి ఉండెడివాడను. ఇప్పుడు మూడు శంకువులనుజేసి, నీవు త్రిశంకువైతి" అని వశిష్ఠ మహర్షి పలికెను. అటు తరువాత తన కుటుంబ భరణము చేసినాడని ప్రీతుడై విశ్వామిత్రుడు వరమేదేని అడుగుమగా ఆ నృప కుమారుడు అశరీర స్వర్గము అనుగ్రహింపుమని యాచించెను. అనావృష్టి భయము పోయిన తరువాత విశ్వామిత్రుడు వానిని తండ్రి రాజ్యమున అభిషిక్తుని జేసి సశరీర స్వర్గము కొఱకు యజింపజేసెను. దేవతలు, వశిష్ఠులు చూచుచుండగనే వానిని ఆ ముని స్వర్గ మెక్కించెను.

ఆరాజు భార్య సత్యరథ కేకయ వంశజురాలు! ఆమె పుణ్యాత్ముడగు హరిశ్చంద్రుడను కుమారుని కనెను. ఆ హరిశ్చంద్రుడు త్రైశంకవుడు (త్రిశంకుని కుమారుడు) అనుపేర ప్రఖ్యాతి నందెను. రాజసూయము కావించి సమ్రాట్టు (చక్రవర్తి) అని యశమందెను. ఆయన పుత్రుడు రోహితుడు. ఆతని కొడుకు హరితుడు. హరితుని కొడుకు చంచువు.

చంచువు పుత్రుడు విజయుడు. అతడు సర్వంసహా (భూమి) విజేత. అందువలన అతడు విజయుడు అనబడెను. వాని కొడుకు రురుకుడు. ధర్మార్థ కోవిదుడైన రాజు. వాని కొడుకు వృకుడు. వాని కుమారుడు బాహువు. హైహయులు-తాలజంఘులు ఆ రాజును జయించిరి. ఆతని భార్య గర్భవతియై ఔరుని ఆశ్రమమందు చేరెను. బాహువు కుమారుడు సగరుడు. అతడును ధర్మపరుడు, సత్యనిష్ఠుడు. కృతయుగము వాడు. తల్లికి సవతిపెట్టిన గరముతో (విషముతో) బాటు పుట్టినందున సగరుడని పేరొందెను. ఔర్వుని ఆశ్రమము నందు జనన సమయమున శుక్రుని రక్షణము పొంది క్షేమముగా జన్మించెను. ఆ భార్గవుని వలననే ఆగ్నేయాస్త్రమును పొంది తాలజంఘులను-హైహయులను సంహరించి, భూ మండలమెల్ల జయించెను. శక పహ్లవ పారదులను పేరబరగిన క్షత్రియుల యొక్క ధర్మమును (నాస్తిక ధర్మమును) ఖండించెను.

ఈ విధముగాలో మహర్షణుడు చెప్పి ఇంకను సందేహములు కలవా తెలుపుడని ప్రశ్నింపగా ఆ మహామునులు

"సగరుడు విషముతో ఎట్లు జనించెను? శకాదుల ధర్మములను క్రుద్ధుడై ఏల నిరసిం చెను. ఈ కథ మాకు సవిస్తరముగ ఆనతిమ్ము" అని అడిగిరి. లోమహర్షణుడు ఇట్లు అనియె.

బాహువు వ్యసని అయినందున హైహయులు, తాలజంఘులు, శకులును అతని రాజ్యమును అపహరించిరి. హైహయుని పక్షమున శకులు, యవనులు, పారదులు, కాంభోజులు, పహ్లవులు అను ఐదు గణములవారుకూడ చేరిరి. రాజ్యము పోయి బాహువు వనమున కేగెను. పత్నియు అతని వెంటచనెను. అతడక్కడ ప్రాణములు విడిచెను. అప్పటి కతని భార్య గర్భవతి. ఆమెకు సవతి గరము (విషము) పెట్టెను. వనమందు ఆ సాధ్వి భర్తతో సహగమనము చేయుటకు చితి ఎక్కెను. భృగువంశీయు డైన ఔర్వుడు అను ముని ఆమెపై జాలిపడి ఆమెను మరణ ప్రయత్నమునుండి నివారించెను. ఆయన ఆశ్రమమందు ఆ శిశువు గరముతోగూడ జన్మించెను. అందుచే సగరుడను పేరు పొందెను.

ఔర్వుడు అతనిని వేదశాస్త్రములు చదివించి, ఆగ్నేయాస్త్రమందు శిక్షణ యొసంగెను. క్రుద్ధుడైన రుద్రుడు పశువుల జంపునట్లు ఆగ్నేయాస్త్ర బలముచే హైహయుల వధించి మంచి కీర్తిని పొందెను. అవ్వల శక, యవన, కాంభోజ, పారద, పహ్లవులను నిశ్శేషముగా బరిమార్చుటకు పూనుకొనెను. వారు వశిష్ఠుని శరణు కోరిరి. ఆయన వారికి అభయమొసగి, సగరుని వారించెను, గురువచనములను ఆలించి ఆతడు వారినిగాక

వారి ధర్మమును ఖండించి వారందరి వేషములను మార్చెను. వేషముల మార్పు ఎట్లు జరిగినదనగా, శకులకు అర్ధముండనము (సగము తల గొరుగుట) గావించి వదలెను. యవన, కాంభోజులకు సంపూర్ణముండనము (పూర్తి తల గొరిగింపు) గావించెను. పారదులను తల విరబోసికొన జేసెను. పహ్లవులకు గడ్డములను ఉంచెను. వారెల్లరును నిస్వాధ్యాయ (వేద విద్యనేర్చు అర్హత) వషట్కారులం (వేద పఠనములో అగ్నిలో హవిస్సులు వ్రేల్చెడి ధర్మము) గావించెను. అనగా యజన యాజనాది వేదకర్మ దూరుల చేసెనని భావము. శకాదులు కోణిసర్పులు మాహిషకులు దర్వులు, చోళులు, కేరళులు అనుపేర వారందరు క్షత్రియులే. కాని వారి ధర్మమాతనిచే నిరాకరింప బడినది. అనగా వెలివేయబడిరి. ఇదంతయు వశిష్ఠుని ఆజ్ఞచేతనే అతడు ఒనరించెను.

ధర్మముచే జయమందిన ఆ సగర చక్రవర్తి వసుంధరను గెల్చి అశ్వమేధ దీక్షగొని గుఱ్ఱమును వదలెను. ఆ గుఱ్ఱము తూర్పు, దక్షిణ సముద్ర ప్రాంత తీరమున సంచరించు చుండగా ఎవ్వనిచేతనో హరింపబడి భూమియందు ప్రవేశింపజేయబడెను. అపుడా రాజు తన కొడుకులు అఱువదివేల మందిచేత ఆ భూమిని త్రవ్వించెను. వారందఱు సముద్రము చొచ్చి భూమిని త్రవ్వి పోయిపోయి ఆది పురుషుడగు హరిని, కపిల రూపమున నున్న విష్ణువును కాంచిరి. ఆ సమయమున ఆ దేవుడు నిదురలో ఉండెను. వారి రాకచే గల్గిన చప్పుడు వలన అతడు కనులు తెఱచెను. అందుండి వెడలిన తేజస్సుచే ఆ సగరులు నల్గురు, తరువాయిగా అఱువది వేలమందియు దగ్ధులైరి. అప్పుడు దగ్ధమైనవారు పోగా, మిగిలిన సగర వంశవర్ధనులు బర్హికేతువు, సుకేతువు, భర్మరథుడు, శూరుడైన పంచజనుడు అనువారు మాత్రమే. భగవంతుడు కపిలుడు తేనికి ఇక్ష్వాకువంశము, అక్షయముగ ఉండునట్లును మంచి కీర్తిమంతమగునట్లు వరమును అనుగ్రహించెను. సముద్రుని కుమారునిగ ఇచ్చి అక్షయ స్వర్గవాస సౌఖ్యమునుగూడ ఒసంగెను. సముద్రుడు ఆ సగరుని కర్ణముగొని వచ్చి యిచ్చి నమస్కరించెను. ఆ పుణ్యకర్మ ప్రభావముచే సముద్రుడు సాగరుడు గూడ అయ్యెను. (సముద్రుడు సగరుని కుమారుడని ప్రఖ్యాతి పొందెను) సగర చక్రవర్తి అన్యఅశ్వమేధాశ్వమును బడసి తిరిగి వచ్చి నూరశ్వమేధ యాగములు ఆచరించెను. అతని కుమారులే సాగరులను ప్రఖ్యాతి నందిన వారు అఱువదివేల మంది అని విన్నాము. అనవిని మునులు సగరునికి వీరులగు కుమారులు అఱువది వేల మంది ఎట్లు కల్గిరి? ఎట్లు విక్రమించిరో తెలుపుమన లోమహర్షణుడు ఇట్లనెను.

సగరునికి ఇద్దరు భార్యలు. విదర్భ దేశాధీశుని కూతురు కేశిని పెద్దభార్య. అరిష్టనేమి కూతురు మిక్కిలి అందగత్తె, మహతి అనునది రెండవది. ఔర్వుడు వారిని చూచి,

అరువదివేలమంది కొడుకులు కావలెనో, వంశోద్ధారకుడైన కొడుకు ఒక్కడు కావలెనో కోరుకొండని వరమొసంగెను. ఒకతె అరువది వేలమంది కొడుకులను, మరొకతె ఒక్క వంశధరుడగు పుత్రుని కోరిరి. అంత ఆ మహాముని అట్లే అగుగాక అనెను.

పంచజనుడను మహాతేజస్వియగు రాజు ఒకతెకు గల్గెను. రెండవ ఆమె బీజపూర్ణమైన ఒక తుంబుని (సొరకాయను) ప్రసవించెనని ప్రసిద్ధి. అందు నువ్వు గింజలంత వారు అరువదివేల మంది శిశువులు ఉండిరి. సమయమును అనుసరించి సుఖముగ పెంపొందిరి. ఆమె వారిని ఘృత పూర్ణ (నేతితో నిండియున్న కుండల) కుంభములలో ఉంచెను. ఒక్కొక్కని పోషణమున ఒక్కొక్కతెదాదిని ఏర్పరచెను. పదినెలలలో క్రమముగ ఆ శిశువు లందుండి బయలుదేరి సగరునికి ప్రీతి వర్ధనులైరి.

నారాయణ తేజస్సున ప్రవేశించిన ఆమహానుభావులలో ఒకడు పంచజనుడనువాడు రాజయ్యెను. ఆతని కుమారుడు వీర్యవంతుడగు అంశుమంతుడు. అంశు మంతుని సుతుడు దిలీపుడు. ఖట్వాంగుడను పేర అతడు సుప్రసిద్ధుడు. ఈతడు స్వర్గము నుండి ఈ లోకమునకు వచ్చి ముహూర్త కాలముండి, బుద్ధితోను సత్యముతోను ముల్లోక ముల ఒక్కటి చేసెను. దిలీపుని దాయాది భగీరథుడు. అతడు గంగను అవనికి అవతరింప జేసినవాడు. ఆ గంగను సముద్ర మందు సంగమింప చేసిన మహానుభావుడు. నదులలో ఉత్తమోత్తమమైన గంగను ఆ విధముగా భగీరథుడు తన కూతురుగా చేసికొనెను. అందువలననే గంగ భాగీరథి అయ్యెను.

భగీరథుని కుమారుడు శ్రుతుడు. అతని పుత్రుడు నాభాగుడు. అతడు పరమో త్కృష్టమైనవాడు, ఉత్తముడు. నాభాగుని పుత్రుడు అంబరీషుడు (నాభాగి). సింధు ద్వీపుడు అను వానికి అతడు జనకుడు. సింధుద్వీపుని కొడుకు అయుతాజిత్తు. అతని కొడుకు ఋతుపర్ణుడు. అక్షహృదయ మెరిగిన ఘనుడు. అనగా పాచికల ఆటలో మిగుల నైపుణ్యము గలవాడు, బలశాలి. నలునికి మిత్రము. ఋతుపర్ణుని కొడుకు ఆత్తపర్ణి. గొప్ప కీర్తి మంతుడు. వాని కుమారుడు సుదాసుడు ఇంద్రుని స్నేహితుడు. వాని బిడ్డడు సౌదాసుడు. అతడు రాజై, కల్మాష పాదుడు-మిత్ర సహుడనియు పేరు పొందెను. వాని కొడుకు సర్వ కర్మ. వాని కుమారుడు అనరణ్యుడు. వాని తనయుడు నిఘ్నుడు. నిఘ్నుని వలన అన మిత్రుడు రఘువు అని ఇద్దరు రాజ శ్రేష్ఠులు కల్గిరి. అనమిత్రుని సుతుడు విద్వాంసుడైన దువిదుహుడు. వాని కొడుకు దిలీపుడు. దిలీపుని కొడుకు వీరుడగు రఘువు. రఘువు శ్రీరాముని ముత్తాత. ఇతడు మహాబలుడై అయోధ్యా పట్టణమునకు మహారాజుగ ఉండెను.

ఆయన కొడుకు అజుడు. ఆయనకు దశరథుడు ఉదయించెను. దశరథుని యొక్క కుమారుడు రాముడు. రాముని కుమారుడు కుశుడు కుశనందను'అతిథి. అతిథి యొక్క పుత్రుడు నిషధుడు. నిషధుని సుతుడు నలుడు. నలుని కుమారుడు నభుడు. నభుని బిడ్డడు పుండరీకుడు. వానికి క్షేమధన్వుడు. వానికి దేవానీకుడు ఉదయించిరి. దేవానీకుని కొడుకు అహీనగువు వాని కొడుకు సుధన్వుడు. వాని కొడుకు శలుడు. శలపుత్రుడు ఉక్కుడు. ఉక్కుని కొడుకు వజ్రనాభుడు. వాని కొడుకు నలుడు. పురాణములందు నలులు ఇద్దరేఖ్యాతికెక్కినారు. ఒకడు వీరసేనుని కుమారుడు, రెండవవాడు ఇక్ష్వాకు వంశ జుడు. వీరు వివస్వతుని వంశమందలి తేజస్సమృద్ధులైన రాజులు. ప్రజలకు పోషకుడును, శ్రాద్ధదేవుడును అగు ఆదిత్యుని ఈ వంశ వృత్తము పఠించునాతడు సంతాన వంతుడయి ఆదిత్యుని యొక్క సాయుజ్యము నందును. (8)

సోమోత్పత్తి వర్ణనమ్

ఇంకను మునులలో లోమహర్షణ సూతుడు ఇట్లనెను - ఓ విప్రులార! సోముని తండ్రియైన అత్రి భగవానుడు ఋషి. ఆయన బ్రహ్మ మానస పుత్రుడు. అతడు గొప్ప తపమొనరించినవాడు. అతడు మూడు వేల దివ్య సంవత్సరములు తపమాచరించెనని ప్రసిద్ధి. ఆయన యొక్క తేజస్సు మీదికి ఎగజిమ్ముకొనెను. అదియే సోమరూపము దాల్చెను. ఆయన కళ్ళనుండి నీరు దిక్కుల ప్రకాశింప జేయుచు పది తెఱంగుల స్రవించెను. దశ దిశాధి దేవతలు ఏకమై విధి ఆనతి చేత ఆ తేజస్సును ధరింపబోయి శక్యముగాక జార విడిచిరి. వసుధపై బడిన ఆ సోమ రూపమయిన వీర్యమును జూచి లోక పితామహుడైన బ్రహ్మ లోకహితమునకై తన రథము ఎక్కించుకొనెను. అత్రి కుమారుడు అట్లు పడుట చూచి బ్రహ్మ కుమారులు దేవతలు మునివరులు పొగడిరి. అట్లు స్తుతింపబడు సోముని తేజస్సు లోకముల నాప్యాయనము చేయుటకై అన్ని దిక్కులయందును నెల్లెడల అలము కొనెను. ఆ సోముడు బ్రహ్మ యొక్క రథమునందు అధిష్ఠించి సాగర పరీవృతయైన ఈ వసుంధరను ఇరువది యొక్క మారులు ప్రదక్షణము చేసెను. ఆయన తేజస్సు భూమి యందు ప్రవేశించెను. అందుండి సర్వౌషధులు సర్వజగదాధార భూతములై మొలచినవి. ఆ సోముడు స్తుతులచే స్వకీయ సత్కృతులచే తేజస్సు వడసి పద్మ గర్భుని అనగా బ్రహ్మ దర్శనమునకై తపమొనరించెను. బ్రహ్మవిదగ్రగణ్యుడగు అతనికి బ్రహ్మ బీజౌషధుల యొక్కయు విప్రుల యొక్కయు జలము యొక్కయు సామ్రాజ్యము ఒసగెను. సౌమ్యులకెల్ల సౌమ్యుడగు అతడు దానిని పొంది, సహస్ర శత దక్షిణలతో కూడి ఉన్నదగు రాజసూయ

యాగము చేసెను. ముల్లోకములలోను ఆకైరవబంధువు దక్షిణ ఇచ్చెనని వినపడసాగెను. ఆ రాజసూయాధ్వరమున సదస్యులై బ్రహ్మర్షులు దక్షిణలను అందుకొనిరట. హిరణ్యగర్భుడు (బ్రహ్మ), అత్రి, భృగువు ఆ యజ్ఞమునందు ఋత్విజులైరి. బహుమునిపరివృతుడై హరి అందు సదస్యుడయ్యెను. ఆసోమని, సినీ కుహువు, ద్యుతి, పుష్టి, ప్రభ, వసువు, కీర్తి, ధృతి, లక్ష్మి అను తొమ్మండ్రు దేవతా సుందరీమణులు సేవించిరి. అవబృధస్నాతుడై సర్వ దేవర్షిపూజితుడై పది విధముల దిక్కులను ఉద్భాసింపజేయుచు సోమరాజేంద్రుడు వెలుగొందెను. ఎవరికిని పొందరాని యైశ్వర్య మంది ఋషి సత్కార సంభృతమై తనకు లభించెనని ఉప్పొంగి అవినయము ననయమునకు (అవినీతి) లోబడి అతడి మతిపోయి నంత అతడు అమిత ఐశ్వర్య మదమోహితుడై కానక బృహస్పతి భార్యను తారను బలా త్కారమున హరించెను.

దేవతలు, దేవర్షులు మఱిమఱి యాచించినను, వినక అతడు తారను అంగిరసునికి (బృహస్పతికి) అప్పగింపకయే పోయెను. అపుడు అంగిరసుని మడమల ద్రొక్కికొని ఉశ నసుడు (శుక్రుడు) వచ్చెను. రుద్రుడు అజగవమ్మను విల్లుకొని పార్ష్ణి గ్రాహుడయ్యెను. వారు సోమునిపైకి యుద్ధమునకు పోయిరి. అతడును బ్రహ్మశిరోనామక అస్త్రము తీసుకొని దేవతలపైకి విసరెను. దానిచే అవేల్పుల కీర్తి కళంకిత మయ్యెను. తారకామయమను ప్రఖ్యాతమైనది. ఆ యుద్ధము అక్కడ దేవదానవలోక క్షయకరమయ్యెను. మహామునులారా! అందు మిగిలిన దేవతలు, తుషితులు అను దేవతలు సనాతనుడును ఆనాదిదేవుడునగు బ్రహ్మను శరణు చొచ్చిరి.

పితామహుడంతట శుక్రుని, రుద్రుని (శంకరుని) వారించి స్వయముగ తారను ఆంగిరసునికి అప్పగించెను. బృహస్పతి ఆ ఇల్లాలిని అంతఃప్రసవగ గమనించి ('గర్భిణి అగుట గ్రహించి) క్రుద్ధుడై నాకు హక్కయిన ఈ యోనియందు గర్భము దాల్చుట నీకు ఉచితముగాదనిన ఆమె ముంజ గడ్డియందుంచెను. ఆ శివువు పుట్టినంతనే దివ్య శరీర మును పొందెను. సురవరులంతట సంశయమంది తారతో, నిజము చెప్పుము. ఈ బాలుడు సోముని కొడుకా లేక బృహస్పతి బిడ్డడా అనగా ఆమె వేల్పుల ప్రశ్నకు బదులు పలుకదయ్యెను. అపుడు చోరహస్తకుడగు ఆ కుమారుడు ఆమెను శపింప బూనిన వారించి. బ్రహ్మ తారా! ఇందు నిజమేది చెప్పుము. వీడెవ్వని కొడుకు? అనగా ఆమె ప్రాంజలియై సోముని వాడని అనెను. అయ్యెడ సోముడా పాపని శిరంబు మూర్కొని వానికి బుధుడని నామకరణము ఒనరించెను. ఆ బుధుడు గగనమున ప్రతికూలముగ ఉదయించుచుండును. అతడు వైరాజ మనువు పుత్రిక యందు పుత్రుని కనెను. ఆ పుత్రునకు పురూరవుడను

పుత్రుడు జనించెను. పురూరవునకు ఊర్వశియందు ఏడ్గురు మహాత్ములైన కుమారులు ఉదయించిరి. ఇది సోముని జన్మ వృత్తాంతము. ఇది కీర్తింప కీర్తికలుగును. ఈ సోమవంశ సంకీర్తనము ధన్యతను ఆయుష్యము, ఆరోగ్యము, పుణ్యమును కూర్చును. సంకల్ప సాఫ ల్యము గూర్చును. సోమ జన్మ వృత్తాంతము విన్నవాడు పాప విముక్తిని పొందగల్గును. (9)

సోమ వంశ వర్ణనము

సూతుడు ఇట్లనియె –

ఓ మునిశ్రేష్ఠులారా! బుధుని కుమారుడు పురూరవుడు. విద్వాంసుడు, తేజశ్శాలి, దాత. విపుల దక్షిణలు ఇచ్చిన యజ్వ. బ్రహ్మవాది. యుద్ధమునందు శత్రువులకు అందని వాడు. నిత్యాగ్నిహోత్రి, యజ్ఞకర్త. మహీపతి, సత్యవాది, పుణ్యమతి, నిగూఢ మైధనుడు, ముల్లోకములందు అనుపమ కీర్తిశాలి. అట్టి వానిని బ్రహ్మవాదిని (వేదాధ్యయనరతుని) శాంతుని ధర్మజ్ఞుని సత్యవచనుని యశస్వినిని యగు ఊర్వశి అభిమానము (గుట్టు) విడిచి వరించెను.

బ్రాహ్మణులారా! ఆ రాజు ఊర్వశితోగూడి చైత్ర రథమను సుందర వనమందు పది సంవత్సరములు, మందాకినీ నదీ తీరమున ఐదు సంవత్సరములు, అలకాపురమందు ఆరు సంవత్సరములు, బదరీ పురమునందు అయిదు సంవత్సరములు, నందనవనము నందు ఏడుసంవత్సరములు, మనోహర ఫలవృక్షములతోగూడిన ఉత్తరకురు దేశమునందు ఎనిమిది సంవత్సరములు, గంధమాదన పర్వతముపై పది సంవత్సరములు సుమేరు పర్వత ఉత్తర భాగమున ఎనిమిది సంవత్సరములు నివసించెను. ఈ ప్రధాన వనము లందును, దేవతల క్రీడాస్థానములందును, ఊర్వశితోగూడ ఆ రాజు పరమ హర్షమున క్రీడించెను. ఇలా పుత్రుడగు పురూరవుడు పవిత్రతమము మహర్షులచే స్తుతింపబడి నదియు అగు ప్రయాగ క్షేత్రమునందు రాజ్యము ఏలుచు మహా ప్రభావశాలియగు నర శ్రేష్ఠుడై ఒప్పెను అని చెప్పి సూతుడు ఇంకను ఇట్లు అనెను –

ఆ ఇలుని (పురూరవుని) కుమారులు ఏడుగురు. దేవ కుమారోపములు. గంధర్వ లోక ప్రసిద్ధులు. ఆయువు, ధీమంతుడగు అమావసువు, ధర్మాత్ముడగు విశ్వాయువు, శ్రుతాయువు, దృఢాయువు, వనాయువు, బహ్వాయువు అను వారు ఊర్వశికి జన్మించినారు.

అమావసు పుత్రుడు రాజరాజగు భీముడు. వాని కొడుకు శ్రీమంతుడగు కాంచన ప్రభ నామధేయుడు. వాని తనయుడగు సుహోత్రుడు బలశాలి. విద్వాంసుడు. వాని తనయుడు. జహ్నువు కేశిని కుమారుడు.

అతడు సర్వమేధము అను మహాయాగమును ఆచరించెను. గంగ పతిలోభముచే అతని పతిగ వరించి అభిసరించెను. అతని అంగీకారము లభింపగా యజ్ఞ సదస్సును ముంచెత్తెను. యజ్ఞవాటమును అట్లు ముంచుట చూచి సుహోత్రుని కుమారుడు ఆ జహ్నువు క్రుద్ధుడై 'ఈ నీ ప్రయత్నమును విఫలము ఒనరించునట్లు ఇదిగో ఈ నీటిని త్రాగెదను. నీ గర్వమునకు ఫలమిపుడే అనుభవింపుమని శపించి గంగను అంతను త్రాగివైచెను. ఆ వింతను చూచి, మహర్షులు ఆతనికి అభ్రాపగ(అనగా గంగను)ను కన్న కూతురు గావించిరి. దాని వలన ఆమె జాహ్నవి అయ్యెను.

యువనాశ్వుని పుత్రియగు కావేరిని జహ్ను మహర్షి పరిణయమాడెను. యవ నాశ్వుడు ఇచ్చిన శాపముచే గంగలో నర్ధాంశమయి ఏతెంచి జహ్ను భార్య, సరిద్వర (నదులలో శ్రేష్ఠరాలైనది) అగు కావేరిలో కలసెను. జహ్నుడు ధర్మపరుడయిన సునద్యుడు అను కుమారుని కావేరియందు బడసెను. వాని కుమారుడు అజకుడు. వాని బిడ్డడు బలాకాశ్వుడను రాజు. మృగయాభిరక్తుడగు కుశుడు వాని కొడుకు. వాని కుమారులు దేవ వర్చస్కులు నల్వురు. 1.కుశికుడు; 2.కుశనాభుడు; 3.కుశాంబుడు; 4.మూర్తి మంతుడను వారు. పల్లవులతో నిరంతరము పెంపు వడసి, వనచరుడై కుశికుడు ఇంద్ర తుల్యుడైన కుమారుని కోరి తపమొనరించెను. అతనికి బెదరి వేయేండ్లు ముగియగా ఉగ్రతపమ్మున ఉన్న ఆ రాజును చూచి పుత్రుని ప్రసాదించుటకు సమర్థుడైనను తానే అతనికి పుత్రుడు ఆయెను. కుశికు పుత్రుడగు ఇంద్రుడే గాధి అను రాజయ్యెను.

కుశికుని భార్యయగు పౌరయందు గాధిపుట్టెను. గాధి కుమార్తె సత్యవతి. మహాను భావురాలు. గాధి రాజామెను వక్రుని పుత్రుడగు ఋచీకునికి ఇచ్చెను. ఆమె యెడగల ప్రీతిచే భార్గవుడు (ఋచీకుడు) గాధికి (మామగారికి) కుమారుడు కలుగవలెనని యజ్ఞమున చరువును సాధించి ఇచ్చెను. ఋచీకుడు తన భార్య సత్యవతిని పిల్చి ఈ చరువును నీవును, మీ అమ్మాయి స్వీకరింపుడు. ఆమె యందు దీప్తిగల క్షత్రియోత్తముడు ఉదయించ గలడు. క్షత్రియుల కతడు అజేయుడు. అతడు క్షత్రియాంతకుడును కాగలడు. కల్యాణీ! నీవీ రెండవ చరువు సేవించినంతట ధృతిమంతుడు తపోధనుడు శాంతుడైన ద్విజ శ్రేష్ఠుడు ఉదయించును అని పలికి తపోనిరతుడై అరణ్యమున ప్రవేశించెను.

గాధియు భార్యతో అప్పుడు ఋచీకుని ఆశ్రమమున కేగెను. తీర్థ యాత్రా ప్రసంగ మున కూతురిని చూచుటకు ఆ రాజు జామాతృ (మామాగారి) స్వగృహమున కేతెంచెను. సత్యవతి యారెండు చరువులను గైకొని తల్లికి నివేదించెను ఆ తల్లి దైవవశమున తాను

గైకొనవలసిన చరువును కూతురునకిచ్చి, ఆమెకీయదగిన దానిని తాను గైకొనెను. అటుపై సత్యవతి సర్వ క్షత్రియాంతక తేజముం గర్భమున దాల్చిన కతన ఘోరమైన ఆకారముతో కనిపింపసాగెను. ద్విజశ్రేష్ఠుడైన ఋచీకుడా ఇంతింగని యోగదృష్టిచే గ్రహించి భార్యతో కల్యాణి! చరువ్యత్యాసముచే మీఅమ్మచే నీవు వంచింపబడితివి. నీకు క్రూరవర్తనుడు అతిదారుణుడు అగు తనయుడు ఉదయించును. వానికి భ్రాత బ్రహ్మణ్యుడు, తపోధనుడు కల్గును. తపస్సుచే నేనీ సమస్త బ్రహ్మమును వాని యందు అర్పించితిని అని చెప్పగావిని సత్యవతి నీవలన నాకిట్టి క్రూర కర్ముడు బ్రాహ్మణావసదుడు కొడుకు వద్దు అనిన ఋచీక ముని ఆమెతో

"కల్యాణి! నేనిట్లు కావలయునని సంకల్పింపలేదు. పితృ మాతృ భూమి నిమిత్తమునఁ తనయుడు ఉగ్రమూర్తి కాగలడు అని అనెను. అది విని మరల సత్యవతి ఇట్లనియె. నీవు తలచుకొనిన లోకములను సృజింపగలవాడవు. కొడుకును ఇచ్చు మాట లెక్కేమి శమాత్మకుని ఋజుస్వభావుని పుత్రుని నాకు అనుగ్రహింపుము. ఇది వేరొక విధముగ జేయవీలు పడని ఎడల మనకు ఉదయింపగల మనుమడు మీరన్నట్లు క్రూరమూర్తి అయగునట్లు అనుగ్రహింపుడని భర్తను వేడుకొనెను. అదివిని ఆ మహాముని తపోబలమున అట్లు అగుగాక అని అనుగ్రహము చేసెను. మరియు సుందరి! పుత్రునందును పౌత్రునందును నాకు భేదములేదు. నీవెట్ల అనిన అట్లేయగుట నా అభిమతమని ఆమెను ఆ తపస్వి లాలించెను. అటుతరువాత సత్యవతి భార్గవుడను కుమారుని కనెను. అతడే తపోనిరతుడు, అతిదాంతుడు, శాంతుడు అగు జమదగ్ని ఈ భృగు వంశమందు అవత రించెను. పుణ్యురాలు సత్యవతి సత్యధర్మ పరాయణ కౌశికియనుపేర మహానదియై ప్రవర్తిల్లెను.

ఇక్ష్వాకు వంశజుడు రేణువను రాజుకూతురు కామలి అనుపేరుగలది (రేణుక) మహానుభావురాలు. ఆమె యందు తపో విద్యాసమన్వితుడు ఆర్చీకుడు (జమదగ్ని) భయం కరుడైన జమదగ్నుని (పరశురాముని) కనెను. అతడు సర్వ విద్యాపారంగతుడు ధనుర్వేద విశారదుడు. క్షత్రియాంతకుడు ప్రజ్వలితాగ్ని ఒలె ఉండెను. పరశురాముడా జమదగ్ని తపోవీర్యమున జన్మించెను. మధ్యముడు శునశ్శేపుడు, కనిష్ఠుడు శునఃపుచ్ఛుడు. విశ్వామిత్రుడు బ్రహ్మర్షి సముడై బ్రహ్మయు అయ్యెను. విశ్వరథుడనియు ఆయనకుపేరు. విశ్వామిత్రుని కుమారులు దేవరాతుడు మొదలయినవారు. విఖ్యాతులు. దేవరాతుడు, కలి ఆయన సంతతి వారు కాత్యాయనులు. శాలావతి యందు హిరణ్యాక్షుడు రేణువు. రేణుకుడు సాంకృతి గాలవుడు ముద్గలుడు. మధుచ్ఛందుడు జయుడు, దేవలుడు, కచ్ఛపుడు, హారితుడు అనువారు జనించిరి. కౌశికుల గోత్రములు ప్రఖ్యాతి చెందియున్నవి. పాణినులు,

బభ్రేవులు, ధాన్యజప్యులు, దేవరాతులు, శాలంకాయనులు, బాష్కలులు, లోహితులు, యమదూతలు, కారూషకులు అనువారు కౌశికులు, పౌరవుడను బ్రహ్మర్షి యొక్కయు కౌశికుని యొక్కయు వంశ మందు బ్రహ్మ క్షత్ర సంబంధము ప్రసిద్ధమయ్యెను. విశ్వామిత్రుని కొడుకులలో శునఃశ్శేపుడు పెద్దవాడు. భార్గవుడు కౌశికత్వమును బడసినవాడు. శునఃశ్శేపుడు హరిదశ్వుని యజ్ఞమందు పశువుగా నియుక్తుడయ్యెను. దేవతలు అతనిని తిరిగి విశ్వా మిత్రునకు క్షేమముగా ఇచ్చిరి. దేవతలచే ఈయబడిన వాడగుటచే దేవరాతు డనియు పేరొందె. దేవరాతాదులు ఏడ్వురు విశ్వామిత్రుని కుమారులు. దృషద్వతి సుతు డును అష్టకుడును వైశ్వామిత్రుడే. అష్టక కుమారుడు లౌహి. జహ్నుముని గణము. నాచే చెప్పబడినది. ఇటుపైని ఆయువుయొక్క వంశమును తెల్పెదను. శ్రద్ధగా ఆలకింపుడు.(10)

సోమ వంశ వర్ణనము

అని లోమహర్షణుడు ఇట్లు అనెను –

ఆయువు పుత్రులు మహారథులు అయిదుగురు. స్వర్భానుని (రాహువు) కుమార్తె ప్రభయను నామెయందు జన్మించిరి వారు అయిదుగురును జన్మించిరి. వారు నహుషుడు, వృద్ధశర్మ, రంభుడు, రజి, అనేనుడు, అనువారు త్రిలోక ప్రసిద్ధులు. రజి అయిదు వందల మంది కుమారులను కనెను. ఈ క్షత్ర కుటుంబము రాజేయమని ప్రసిద్ధికెక్కినది. ఇంద్రునికి గూడ ఇది భయంకరమయ్యెను. దేవాసుర యుద్ధమైన తఱి ఆ ఉభయులకును మా ఇర్వురకును జరుగు యుద్ధమందు ఎవ్వరు జయింతురో వినవలయునని కోరిక గలదు. నిజము ఎరిగింపుమని బ్రహ్మనడిగిరి. వారితో బ్రహ్మ రజియను ప్రభువు ఆయుధమెత్తి ఎవ్వరివంక పోరాడునో వారు ముల్లోకములను గెలువగలరు. రజి ఎటుండునో అటనే ధైర్యము ఉండును. ధృతి ఎటుండునో అచ్చట లక్ష్మి ఉండును. ధృతియు, శ్రీయు ఎందుం డునో అక్కడ ధర్మము జయమును కల్గును అని అనెను.

అది విని దేవ దానవులు ప్రీతులై రజిని తమవంక రమ్మని కోరుకొనుచు ఆహ్వానించిరి. స్వర్భానుని దౌహిత్రుడు (రాహువుయొక్క కూతురు కొడుకు) ప్రభయందు పుట్టినవాడు, పరమతేజస్వి, సోమవంశ వర్ధనుడు అగు రజింగనివారు మాకు జయము కల్గుటకు నీవు విల్లు గైకొనుమని వేడికొనిరి. అతడు విని అర్ధజ్ఞుడుగావున స్వార్థమెంచి తన కీర్తిని ప్రకా శింప జేయుచు ఇట్లనియె.

దైత్య గణములను అన్నింటిని గెలిచి, ధర్మమున నేను ఇంద్రుడను అగుదునేని అప్పుడు యుద్ధమున పోరెదను అని రజియనగా వేల్పులు మొదట సంతోషపడిరి. అట్లే నీ కోరిక

నఫలము చేసికొమ్మనిరి. అటు పిమ్మట ముఖ్యుల జూచి దేవతలను అడిగినట్లు అడిగెను. దానవులు దర్పసంపూర్ణులు గావున స్వార్థమునే చూచికొని సాభిమానముగ అతనికి ఇట్లు బదులుపలికిరి.

అతడు అట్లే అని దేవతలచేత గూడ వీనిని (ప్రహ్లాదుని)గెలిచి ఇంద్రుడవై తీరెదవని ప్రేరేపింపబడి, దానవులందఱను సంహరించెను. వజ్రపాణికి గూడ వధింపనలవిగాని వారిని గూడ తుదముట్టించి పరమ శ్రీమంతుడైన రజిపూర్వము నష్టమైపోయిన వేల్పుల ఐశ్వర్యమును పునఃప్రతిష్ఠ చేసెను. అప్పుడు ఇంద్రుడు అమరులతో కూడుకొని మహా ధీరుడు అయిన రజిని చూచి నీవు నిక్కముగ దేవేంద్రుడవే. నాపనులచే నేను నీకు పుత్రుడ అను ప్రఖ్యాతిని కాంచెదననెను. రజియు అట్లు మాయచే శత్రువుచే మోసగింపబడి అట్లేయగుగాక అని సంప్రీతినందెను. అట్లు ఆ నృపతి దేవసముడై స్వర్గమునకు అతని అతని పుత్రులు ఐదువందల మంది ఆతని ఆస్తిని (పిత్రార్జితమును ఇంద్రుని నుండి గైకొనిరి, అట్లు స్వర్గము ఆక్రమించి వారు రాగమత్తులై తమకు తాము మూఢులై, ధర్మ దూరులై బ్రహ్మద్వేషులై వీరవిక్రమముల గోల్పోయిరి. అందుపై కామక్రోధ వశులైన వారిని చంపి ఇంద్రుడు ఎప్పటియట్ల స్వస్థానమును బొంది స్వస్థుడయ్యెను. ఈ శతముఖుని స్థాన భ్రంశ మును పునఃప్రతిష్ఠానమును విన్న వాడును ధారణ జేసినవాడును దుర్గతి పాలుగాడు అని

సూతుడు ఇట్లు అనియె –

రంభునకు సంతానములేదు. ఇక అనేనసుని వంశము వర్ణించెద. అనేనసుని కుమారుడు యశస్వియైన ప్రతిక్షత్రుడు అనురాజు. వాని తనయుడు సంజయుడు. వాని బిడ్డడు జయుడు. వానికుమారుడు విజయుడు. వాని తనయుడు కృతి. వాని సుతుడు హర్యత్వతుడు. వాని ఆత్మజుడు సహదేవుడు. మంచి ప్రతాపశాలి. వానికొడుకు ధర్మ శీలియగు అదీనుడు. జయత్సేనుడు వాని కుమారుడు. వాని యౌరసుడు సంకృతి. వాని బిడ్డడు ధర్మపరుడైన క్షత్రవృద్ధుడు, కీర్తిశాలి. ఇప్పటి వరకును అనేనసులు చెప్పబడిరి. ఇక క్షత్రవృద్ధుని వంశమును చెప్పెదను. క్షత్రవృద్ధుని తనయుడు సుసహోత్రుడు. యశస్వి వాని సంతానము, పరమ ధార్మికులు కాశుడు, శలుడు గృత్సమదుడు అనువారు. గృత్స మదుని కుమారుడు శునకుడు. వాని కొడుకు శౌనకుడు. వానికి బ్రాహ్మణ క్షత్రియులు, వైశ్యశూద్రులు కలిగిరి. అర్చిసేనుడు శలుని కుమారుడు. వాని తనయుడు కాశుడు. కాశుని కొడుకులు కాశిపుడు, దీర్ఘతపుడు. ధనువు దీర్ఘతపుని కుమారుడు. విద్వాంసుడు. వాని తనయుడు ధన్వంతరి. ఆయన మహత్తర తపము చేసి వృద్ధుడయిన దశలో

ధనువునకు కల్గినాడు. దేవతాంశమున మున్నుదయించిన ధన్వంతరియే ఇపుడు మానవ అంశమున జన్మించెను. కాశీ మహారాజై భరద్వాజుని వలన ఆయుర్వేదమును చదివి వైద్యముచేసి సర్వ రోగహరుడై ఆ శాస్త్రమును, ఎనిమిది భాగములు గావించి, (అష్టాంగ మొనరించి) శిష్యులకు ఉపదేశించెను.

ఆ ధన్వంతరి తనయుడు కేతుమంతుడు. భీమరథుడు ఆతని తనయుడు. దివోదాసు అతని తనయుడు. అతడు ధార్మికుడు కాశినగరమును ఏలినవాడు. ఈతని కాలముననే క్షేమకుడు అను రాక్షసుడు వారణాసిని శూన్యము గావించెను. మహాత్ముడైన నికుంభుని శాపముచే వేయేండ్లు కాశీ క్షేత్రము అట్లు గావలసివచ్చెను. అట్లు శాప నష్టమైన, రమ్యమైన నగరమును దివోదాసుడు గోమతీ తీరమందు పునర్నిర్మించెను. ఇంతకుముందు వారణాసి భద్రశ్రేణ్యుని పాలనయందు ఉండెను. దివోదాసుడు వాని కుమారులను నూరుగురు మేటి విలుకాండ్రను చంపి భద్రశ్రేణ్యుని రాజ్యము గెలిచి నూతననగర నిర్మాణము చేసెను.

భద్రశ్రేణ్యుని తనయుడు దుర్దముడు దివోదాసునిచే బాలుడని కరుణచే విడువ బడినవాడై హైహయుని దాయాద్యమును (పరంపరాగతమైన రాజ్య సంపదను) హరించెను. బలాత్కరించి హరించిన సామ్రాజ్యమును మహానుభావుడగు దుర్దముడు లాగికొనెను. తన ప్రతాపముచే వైరమును అంతముచేసెను. దివోదాసునికి దృషద్వతి యందు వీరుడగు ప్రతర్ధనుడు ఉదయించెను. బాలుడైనను అతడు పరబలమును హరించెను. వాని తనయులు వత్సుడు, భర్గుడు అనువారు మిక్కిలి కీర్తిశాలురు. వత్సుని కుమారుడు అలర్కుడు. అలర్కుడు బ్రహ్మజ్ఞాని, సత్యప్రతిజ్ఞుడు. వానికొడుకు సన్నతి. రాజర్షియగు అలర్కుని గూర్చి ప్రాచీనుల శ్లోకమొకటి గలదు. అతడు అరువది ఆరువేల ఏండ్లకు లోకోద్ధారకుడై, లోపాముద్రానుగ్రహ పాత్రుడయ్యెను. రూప యౌవన సంపన్నుడైన ఆతనికి సువిశాలమైన సామ్రాజ్యముండెను. శాపాంతమున క్షేమకుడను రాక్షసుని చంపి వారాణసీ నగరమును రమ్యముగ పునర్నిర్మాణము గావించెను.

సన్నతి కొడుకు సునీధుడు. వానినుండి క్షేముడు, వానికి కేతుమంతుడు, వానికి సుకేతువు, వానికి ధర్మకేతువు వానికి మహారథుడగు సత్యకేతువు, వానికి విభువు. వానికి ఆనర్తుడు, వానికి సుకుమారుడు, వానికి దృష్టకేతువు, వానికి వేణుహోత్రుడు, వానికి భార్గుడు అనుపుత్ర పరంపర ఏర్పడెను. వత్సునికి వత్సభూమి, అనువాడు భార్గునకు భార్గ భూమి అనువారు పుత్రులు. వీరందరును అంగిరసుని పుత్రులు. భార్గవ వంశము వారు. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు వేలకొలది జన్మించిరి. ఇది కాశ్యపవంశము ఇక నహూషుని పరంపర వినుడు. (11)

సోమోత్పత్తి వర్ణనము

పితృ కన్యయగు విరజ అందు మహాతపస్వి అగు నహుషునికి ఇంద్ర తుల్యులైన ఆర్గురు కుమారులు ఉదయించిరి. వారు యతి, యయాతి, సంయాతి, ఆయాతి, యాతి, సుయాతి అనువారు. అందు యయాతి రాజయ్యెను. ఆ పరమ ధార్మికుడు ककుత్స కన్యను గోవు అను ఆమెను వివాహమాడెను. యతి మునియై, మోక్షమార్గమందు ఉండి బ్రహ్మీ భావమందెను.

యయాతి సోదరులు ఐదుగురు రాజ్యమును గెల్చుకొని ఉశనసుని (శుక్రుని) తనయను దేవయానిని భార్యగ గైకొనెను. మఱియు వృషపర్వుడను అసురుని కుమార్తె శర్మిష్ఠను గూడ పత్నిగగైకొనెను. దేవయాని యదువును తుర్వసుని కనెను. శర్మిష్ఠ ద్రుహ్యుని అనువును-పురువును పుత్రులుగా పొందెను. దేవేంద్రుడు ఆతనికి (యయాతికి) ప్రీతుడై, దివ్యమైన, భుజకీర్తిని దివ్యములు మనోజవములైన తెల్లని అశ్వములను పూన్చిన స్వర్ణ మయమైన రథమును ప్రసాదించెను. ఆ రథముతో విజయయాత్రచేసి యుద్ధమునందు అజేయుడై యయాతి ఆరు దినములలో మహీమండలమంతటిని జయించెను. దేవదాన వులను నిగ్రహించెను. సంవర్తనమను పేరుగల ఆ రథము కౌరవులదాయెను. కురు వంశీయుడును పరీక్షిత్తుని కుమారుడును అగు జనమేజయుని నుండి గర్గశాపమున ఆ రథము అంతరించెను.

బాలుడైన గర్గుని కుమారుని జనమేజయుడు కాలవశమున చంపి బ్రహ్మహత్యా పాపమునందెను. దానిచే లోహగంధియై (ఇనుప వాసనగొట్టు శరీరముగలవాడై) ఆ రాజర్షి ఇందందు వెఱ్ఱి పరుగులు పెట్టుచు పౌర జానపద పరిత్యక్తుడై, దుఃఖ సంతప్తుడై ఎచటను శాంతిని పొందలేని వాడాయెను. అతడు ద్విజ శ్రేష్ఠుడగు శౌనకుని శరణ మందెను. జ్ఞానియైన శౌనకుడు పవిత్రతకై అతనిచే అశ్వమేధము చేయించెను. అవబృధ స్నానము కాగానే అతని దుర్వాసన పోయెను. ఆ యయాతి దివ్యరథము ఛేది రాజునకు చిక్కగ, ఇంద్రుడు తుష్టుడై దానిని కొనివచ్చి బృహద్రథునకు ఇచ్చెను. బృహద్రథునినుండి అది అతని కొడుకునకు జరాసంధునికి దక్కెను. భీముడు వానిని చంపి ఆ రథమును వాసుదేవునకు అర్పించెను.

నహుషుని కుమారుడగు యయాతి సాగరముతో, సప్త ద్వీపము అగు వసుంధర నెల్ల గెలిచి అయిదు భాగములుచేసి పుత్రుల కొసంగెను. తూర్పు దిశను జ్యేష్ఠుడగు యదువును, నడుమ పూరుని అభిషేకించెను. ఆగ్నేయమున తుర్వసుని ఉంచెను. వారిచే ఈ విశ్వంభర (భూమి) నేటికిని ధర్మముతో పరిపాలింపబడుచున్నది. బ్రాహ్మణులారా! ఆ దేశముల ప్రజలను గూర్చిముందు చెప్పగలను.

యయాతి తన ఐదుగురు కుమారులు, దురంధరులు రాజ్యభారము వహించగా వార్ధక్య దశలో ధనుర్బాణ సన్యాసము జేసి భూమియందు సంచరించుచు సంప్రీత మనస్కుడయ్యెను. ఇట్లు భూ విభాగముచేసి అతడు తన కుమారుని యదువుని జూచి నా ముసలితనము నీవు గ్రహించి నీ యౌవనము నాకు ఇమ్ము. నా ముసలితనమును నీయందుంచి నీ రూపములో యువకుడనై వేరొక కార్యమువలన ఈ భూమిపై సంచరింతును అని అర్థించెను. ఆ మాటలు వినిన యదువు ఇట్లు బదులు పలికెను.

ఒక బ్రాహ్మణునికైనేను ఇత్తునని ప్రతిజ్ఞ జేసిన భిక్షను ఇంతదాక ఈయలేదు. అది చెల్లింపక నీ జరాభారమెట్లు స్వీకరింపగలను? అదిగాక ముదిమియందు అన్న పాన నిమిత్తమయిన దోషములనేకములు గలవు. కావున నీ ముసలితనము నేను గ్రహించుటకు ఉత్సహింపను. రాజా! నాకంటెను ప్రియతములైన పుత్రులు నీకనేకులు గలరు. ధర్మజ్ఞా! నీ జరాభారము గ్రహింప మరొక్కని కోరుకొమ్ము అని చెప్పగావిని వక్తలలో శ్రేష్ఠుడగు యయాతి కోపవశుడై తనయుని గర్హించుచు ఇట్లనియె.

దుర్బుద్ధీ! నన్ను నిరాకరించిన నీకు మరి ఆశ్రమమేమి ఉన్నది? ధర్మమేమి ఉన్నదిరా! నేను నీకు దేశికుడను గద! నీసంతతికి రాజ్యముండదు, ఈ పలుకులయందు సందేహము లేదని శపించెను. అట్లే కొడుకులందరిని అడిగెను. వారు నలుగురు కాదని చెప్పగా వారిని కూడా ఇట్లే శపించెను. చివరకు పూరుని అదేమాట అడిగెను. వెంటనే ఆ పూరుడు తండ్రి వృద్ధాప్యాన్ని స్వీకరించి తండ్రికి తన యౌవనము ఇచ్చెను. అట్లు తిరిగి యౌవనమును పొందుటచేత, యయాతి భూమియందు తిరుగుచు, కోరికలు అన్నింటిని తీర్చుకొనుచు విశ్వాచితో గూడి చైత్రరథోద్యాన మందు స్వేచ్ఛావిహారములు ఒనరించుచు, పెక్కు కాలము క్రీడించెను. తృప్తుడైన తరువాత వచ్చి పూరున కాతని యౌవనము ఇచ్చివేసి తన ముదిమిని తాను గ్రహించెను.

మునిశ్రేష్ఠులారా! ఆ సమయమున యయాతిచే గానము చేయబడిన గాథ (అనుభవము)లు విన్నవాడు, తాబేలు తన అవయవములను లోపలికి ముడుచుకొనిన విధముగ తనకు కలిగిన కామము (కోరిక)లను సంకోచింప చేసికొనును. ఒకప్పుడును కోరికల అనుభవముచే కామము తీరదు. పైగా హవిస్సుచే అగ్ని పెంపొందినట్లు పెంపొందును. భూమియందుగల ధాన్య సంపద, బంగారము, పశువులు, స్త్రీలు, ఇవి అన్నియు ఒక్కనికి గూడ తృప్తిని ఈయజాలవని తెలిసినవాడు మోహపడడు. ఎపుడు సర్వ భూతములపై త్రికరణము (మనస్సు, వాక్కు, శరీరము)లచే పాపాలోచన చేయడో, అపుడా జీవుడు

బ్రహ్మయే అగును. ఎప్పుడు ఎవరెవరి వల్లగాని జడియడో, తనవలన ఎవ్వరు గాని జడియకుందురో, ఎప్పుడు ఎవ్వడేదియు కావలయునని గాని అక్కరలేదనిగాని అనడో అపుడాతడు బ్రహ్మ భావమందును. దుర్మతులకేది వదిలించుకొనరానిదో, ఏది నరునికి ముదిమి కదిపిన కొలది తాను ముదిమిగొనదో, ఏది ప్రాణాంతకమయిన రోగమో ఆ తృష్ణ (ఆశ) అనుదానిని వదిలించుకొన్నవానికే సుఖము లభించును. జరితుడైన కొలది కేశములు జర్జరితములగును. జుట్టు నెఱియును, దంతములు జరితములగును కాని ధనాశ, జీవితాశ మాత్రము జరితములుగావు. లోకమున కామసుఖముగాని దివ్య మయినది అనగా స్వర్గాది తేజోమయ లోకములలోగల్గు సుఖముగాని తృష్ణా క్షయమువలన గలుగు సుఖము యొక్క పదునారవ కళకు గూడ సరికాదు. అనిచెప్పి రాజర్షియైన యయాతి భార్యతో అడవిని ప్రవేశించెను. (వానప్రస్థాశ్రమము స్వీకరించెను) అతడు చాలకాలము విపుల తపమాచరించి అంతమందు భృగుతుంగ (పర్వతశిఖర) మందుండి నిరాహారియై మేను విడచి పత్నితో స్వర్గమునకేగెను. సూర్యుడు కిరణములచే ఆవరించినట్లు ఆతని వంశీయులు రాజర్షులు అయిదుగురు అఖిల భూమం డలము ఆవరించిరి. వృష్ణి కులవర్ధనుడై నారాయణుడు శ్రీకృష్ణుడుగ అవతరించిదైన రాజన్యులచే పొగడ్తగాంచిన యదువంశమును కీర్తించెదను. వినుడు! మునిసత్తములారా! ఈ యయాతి చరితము నిత్యము వినునతడు స్వస్థుడు, సంతానవంతుడు, ఆయుష్మంతుడు, కీర్తిమంతుడు కాగలడు.(12)

పురువంశ వర్ణనము

సూత! పురువంశమును, ద్రుహ్యుడు అనువు, యదువు, తుర్వసుడు అను వారి వంశములను వేర వేర వినవలతుమని బ్రాహ్మణులు అడుగ సూతుడు ఇట్లనెను.

మునిపుంగవులారా! ముందుగా మహాత్ముడైన పూరువు వంశమును గూర్చి మొదటి నుండి విస్తారముగా జెప్పుచున్నాను వినుడు.

పూరువు కుమారుడు సువీరుడు, వానికి మనస్యుడు, వానికి అభయదుడు. వానికి సుధన్వుడు, వానికి సుబాహువు, వానికి రౌద్రాశ్వుడు, రౌద్రాశ్వునకు దశార్ణేయుడు, కృకణేయువు, కక్షేయువు, స్థండిలేయువు, సన్నతేయువు, ఋచేయువు, జలేయువు, బలశాలియగు స్థలేయువు, ధనేయువు, వనేయువు అనుపదిమంది కల్గిరి. మరియు భద్ర, శూద్ర, మద్ర, శలద, మలద, ఖలద, నలద, సురస, గోచవల, స్త్రీ రత్న కూట అను పది మంది కుమార్తెలు జనించిరి. అత్రి వంశమందు ఉదయించిన ప్రభాకరుడను ఋషి వారందరకు భర్తయయ్యెను.

అతడు భద్ర యందు యశస్వియగు సోముని కనెను. సూర్యుడు రాహువుచే నిహతుడై (గ్రహణ మందు) ఆకాశము నుండి పడిపోవుచున్న తఱి, లోకము అంధకార బంధురమైన యెడ ఈ ప్రభాకరుని వలననే వెలుగు ఏర్పడెను. నీకు స్వస్తి (శుభము) గలుగుగాక! అని ప్రభాకరుడన్నంత సూర్యుడు అంతరిక్షము నుండి క్రిందికి పడడయ్యెను. ప్రభాకరుడు, అత్రి ప్రధానములయిన ఆత్రేయస గోత్రములకు కర్త అయ్యెను. యజ్ఞములందు అత్రికి బలము దేవతలచే కల్పింపబడెను. (ఇప్పటికిని యజ్ఞ సదస్సునందు ఆత్రేయస గోత్రులకు అగ్రపూజ ఇచ్చుట సంప్రదాయ సిద్ధమైనది) ప్రభాకరుడా పదిమంది పత్నుల యందు పదిమంది కుమారులను వేదపారగులను గోత్రకర్తలను గాంచెను. వారు స్వస్త్యా త్రేయులను పేర ప్రఖ్యాతి గనిరి.

త్రివిధ ధనశూన్యులు. (సూర్యుడు పడిపోవుట చూచి ఆత్రేయుడగు ప్రభాకరుడాయనకు స్వస్తియగుగాక అని అన్నందున ఆ గోత్రము వారికీ బిరుదు వచ్చినదన్నమాట) కక్షేయుని కుమారులు మువ్వురు. మహారథులు. సభానరుడు, చాక్షుషువు, పరమన్యువు అనువారు. సభానరుని కుమారుడు విద్వాంసుడగు కాలానలుడు. వాని కుమారుడు ధర్మజ్ఞుడగు సృంజయుడు. వాని పుత్రుడు వీరుడు, మహారాజును అగు పురంజయుడు వాని కుమారుడు జనమేజయుడు. మహాశాలుడు జనమేజయుని పుత్రుడు. మహాశాలుడు దేవతలలో విఖ్యాతుడు. సుప్రతిష్ఠగన్నవాడు అయ్యెను. మహాశాలుని కుమారుడు మహామనుడు దేవపూజితుడు. మిక్కిలి గొప్ప మనస్సుగల వాడు. ఆయన కొడుకులు ధర్మజ్ఞుడగు ఉశీనరుడు, మహాబలశాలియగు తితిక్షుడు అనువారిద్దరు. ఉశీనరుని పత్నులు అయిదుగురు. రాజర్షి వంశము వారు. నృగ, కృమి, నవ, దర్వ, దృషద్వతి యనువారు. వారి యందు ఉశీనరునకు వార్ధక దశలో తపః ప్రభావముచే కులోద్వహులైన కుమారులు ఐదుగురు. నృగకు, నృగుడు-కృమకు-కృమి, నవకు - నవుడు, దర్వకు సుప్రతుడు, దృష ద్వతికి శిబి అను ఔశీనర ప్రభువు జన్మించెను. శిబికి శిబులయుడను నల్గురు కొడుకులు. నృగునికి యౌధేయులు కల్గిరి. నవునిది నవయను రాష్ట్రము. కృమిది, కృమిలాపురి, సుప్రతునికి అంబష్ఠులు గల్గిరి. శిబియొక్క నల్గురు కుమారులు వృషదర్భుడు, సువీరుడు, కేకయుడు, మద్రకుడు అనువారు, వారిదేశములు సర్వ సంపత్సమృద్ధములగు కేకయ ములు, మద్రకములు, వృషదర్భములు, సువీరములు నను ప్రసిద్ధి చెందినట్టివి. తితిక్షువు పూర్వ దిక్కునకు రాజు అయ్యెను.

తితిక్షుని కుమారుడు ఉషద్రథుడు. వాని కుమారుడు ఫేనుడు. వానికి సుతపుడు వానికి బలి కలిగిరి. బలి మనుష్య జన్మము ఎత్తెను. అతడు బంగారపు తూణీరము

(అమ్ముల పొది) గలవాడు. మహాయోగియై రాజ్యమేలెను. వంశోద్ధారకులగు ఐదుగురు కుమారులను భూమియందు గనెను. వారు అంగుడు, వంగుడు, సుహ్ముడు, పుండ్రుడు, కళింగుడు అనువారు, వారి పరంపరచే బాలేయమనుపేర క్షత్రవంశము ప్రసిద్ధిగాంచెను. బాలేయులును, బ్రాహ్మణులను, బలి వంశోద్ధారకులును, గూడ అయిరి. బ్రహ్మ సంతోషించినవాడై బలికి మహాయోగిత్వము కల్పపూర్ణాయువు, ధర్మతత్త్వార్థ మెఱుంగుట సాటిలేని బలమున సంగ్రామమందు అజేయత్వము ధర్మ ప్రాధాన్యము, త్రైలోక్య దర్శనము, సంతాన ప్రాధా న్యము చాతుర్వర్ణ్య వ్యవస్థాపము అనను లక్షణములను వరముగ ఒసగెను. ఇందువలన బలి పరమశాంతిపడసెను. కాలక్రమమున నతడు స్వస్థానమును (పాతాళమును) చేరెను. అంగాదుల పేర ఆయా దేశములు; తపసిద్ధ అందియున్నవి.

అంగుని కొడుకు దధివాహనుడు. వాని కొడుకు దివిరథుడు. వాని పుత్రుడు ఇంద్ర తుల్య పరాక్రముడు. విద్వాంసుడు అగు ధర్మద్రుడు వాని పుత్రుడు చిత్రరథుడు, ధర్మరథుడు కాలంజరాద్రిపై యజ్ఞముచేసి ఇంద్రునితో గూడి సోమపానము చేసెను. చిత్రరథుని తనయుడు దశరథుడు, లోమపాదుడను ఖ్యాతినందెను. ఆయన కూతురు శాంత. ఆ దశరథునికి శాంత భర్తయైన ఋష్యశృంగుని అనుగ్రహముచే చతురంగుడను వాడు వంశోద్ధారకుడై జన్మించెను. చతురంగునికి పృథలాక్షుడు. వానికి చంపుడు అనుకొడుకు పుట్టెను. (ఈతని రాజధానియే చంపాపురి. ఇంతకుముందు ఈ నగరము 'మాలిని' అనబడెను) ఆతనికి పూర్ణభద్రుని ప్రసాదమున హర్యంగుడు గల్గెను. వైభాండకి (ఋష్యశృంగముని) మంత్రములతో ఇంద్రుని ఉత్తమ వాహనమైన ఐరావతమును ఆ హర్యంగుని ఏనుగుగా భూమికి దింపెను. హర్యంగుని తనయుడు భద్రరథుడను రాజు. వాని కొడుకు బృహత్కర్మ అను నరేంద్రుడు, వాని పుత్రుడు బృహద్గర్భుడు వానితనయుడు బృహన్మనుడు, రాజేంద్రుడగు వాని కుమారుడు జయద్రథుడు, వాని పుత్రుడు దృఢరథ మహారాజు. వాని సుతుడు విశ్వజిత్తయిన జనమే జయుడు. వానికుమారుడు వైకర్ణుడు. వానిపుత్రుడు వికర్ణుడు. వానికి నూర్గురు కొడుకులుకల్గిరి. వారంగ వంశవర్ధనులు, అంగ వంశ రాజులను అందరిని తెల్పియుంటిని. వారందరు సత్యవ్రతులు. మహాత్ములు, సంతాన వంతులు, మహారథులు, రౌద్రాశ్వ తనయుడైన ఋచేయుని వంశమిక వర్ణించెద; వినుడు.

ఋచేయుని తనయుడు మతినారుడు. వానికొడుకులు పరమ ధార్మికులు ముగ్గురు. వసురోధుడు. సుబాహువు అనువారు. అందరు వేదవిదులు. బ్రహ్మణ్యులు. సత్య సంగరులు. మతినారుని కూతురు ఇల. ఆమె స్త్రీ అయ్యు బ్రహ్మవాదిని అయ్యెను. ఆమె తంసుని భార్య. వారికొడుకు రాజర్షి, ప్రతిభాశాలియైన ధర్మనేత్రుడు. ఆయన బ్రహ్మవాది.

పరాక్రమవంతుడు. అతనిభార్య ఉపదాసవి. వారికి దుష్యంతుడు, సుష్మంతుడు, ప్రవీరుడు, అనఘుడు అనువారు నల్గురు కుమారులు.

దుష్యంతునికి శకుంతల యందు ఉదయించినవాడు భరతుడు. సర్వదమనుడను ఖ్యాతినందెను. అతడు పదివేల ఏనుగుల బలముగలవాడు. చక్రవర్తి. ఆయన పేరనే భారత వర్షము. అందలి ప్రజలు భారతులను పేరును పొందిరి. భరతుని తనయులు మాతృశాపమున నశించిరి. ఆ కథ ముందు తెలిపితిని.

బృహస్పతి (అంగిరస్సు)యొక్క కుమారుడు భరద్వాజుడు భరతునిచే పెక్కు యాగములు చేయించెను. కాని అవి పుత్ర సంతానము విషయములో వితథములు (వ్యర్థములు) కాగా భరద్వాజుని వలన (నియోగమువలన) ఆతనికి వితథుడను పుత్రుడు కలిగెను. వాడు కలిగిన వెంటనే భరతుడు దివమునకు వెళ్ళెను. ఆతనికి పట్టము గట్టి భరద్వాజుడు వనమున కేగెను.

వితథునికి ఐదుగురు సుతులు కల్గిరి. సుహోత్రుడు, సుహోత, గయుడు, గర్గుడు. కపిలుడు అనువారు. సుహోత్రుని కొడుకులు సత్యవాదియగు కాశికుడు నరపతియగు గృత్సమతి అనువారు. గృత్సమతి పుత్రులు బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులును. కాశికుని కుమారుడు (కాశేయుడు) దీర్ఘతపుడు. దీర్ఘతపుని కుమారుడు విద్వాంసుడైన ధన్వంతరి. ఆయన కుమారుడు కేతుమంతుడు వాని కుమారుడు విద్వాంసుడైన భీమరథుడు. వాని కుమారుడు వారణాసి ప్రభువగు దివోదాసుడు. దివోదాసు కొడుకు ప్రతర్ధనుడు వీరుడైన ప్రభువు ఆతని కుమారులు వత్సుడు, భార్గవుడు. వత్సరాజ పుత్రుడగు అలర్కుడను రాజు బుద్ధి మంతుడు. హైహయుని దాయాద్యమును (రాజ్యమును)హరించెను అంతియ గాక దివోదాసుడు హరించిన పితృ రాజ్యమును తిరిగి సంపాదించుకొనెను.

అలర్కుడు కాశీరాజు బ్రహ్మణ్యుడు సత్యసంగరుడు అరువది ఆరువేల ఏండ్ల యువకుడై రూప సంపన్నుడై ఉండెను. లోపాముద్ర ప్రసాదమున దీర్ఘాయువు పొందినాడు. చివరి వయస్సున క్షేమక రాక్షసుని చంపి రమ్యమైన వారాణసీ నగర నిర్మాణము చేసెను. అలర్కుని కొడుకు క్షేమకుడు వానిసుతుడు వర్షకేతుడు. వాని తనయుడు విభువు. విభుని కొడుకు ఆనర్తుడు. సుకుమారుడు వాని కొడుకు, వాని తనయుడు సత్యకేతువు ధర్మమూర్తి. వత్సునకు వత్సభూమి. భార్గవునివలన భర్గభూమియు కలిగెను. భార్గవ వంశము నందు అంగిరసుని పుత్రులు బ్రాహ్మణులు క్షత్రియులు వైశ్యులు శూద్రులుగలరు.

బ్రాహ్మణోత్తములారా! అజమీఢుని వంశమును గురించి మీరు విందురుగాక! సుహోత్రుని పుత్రుడు, బృహన్నామకుడు వానికి తనయులు ముగ్గురు. అజమీఢుడు ద్విమీఢుడు-పురుమీఢుడు. అజమీఢుని భార్యలు నీలిని, కేశిని, ధూమిని, అనువారు అజమీఢునకు కేశినియందు ప్రతాపవంతుడగు జహ్నువు కలిగెను. అతడు సర్వమేధమను మహాసత్రయాగ మొనరించెను. గంగాదేవి ఆయనను భర్తగా భావించి వినీతురాలివలె అభిసరించెను. ఆతడు ఇష్టపడకున్నంత ఆతని యజ్ఞసదస్సును ముంచెత్తెను. జహ్నువు అందులకు కోపించి ఇదిగో నీ నీరమును సంక్షేపించి త్రాగెదను చూడుమని త్రాగివైచెను. ఋషులు చూచి ఆమెను అతని కుమార్తెగా ఒనర్చిరి. యవనాశ్వుని కూతురగు కావేరిని అతడు పరిణయ మయ్యెను. గంగా శాపమున అటుతరువాత కావేరియొక్క సగము మేను నదీరూపమయ్యెను. జహ్నుని తనయుడు అజకుడు. వాని కుమారుడు బలాకాశ్వుడు. వాని సుతుడు మృగయా ప్రియుడు కుశికుడు.అడవిజాతులతో పెరిగినాడు. అతడు ఇంద్రతుల్యుడగు సుతుడు కావలెనని తపము చేసెను.ఇంద్రుడు హడలి గాధియను పేరుతో తానే స్వయముగ వానికి ఉదయించెను. గాధి తనయుడు విశ్వామిత్రుడు. అష్టకుడు అతని కొడుకు. వాని కొడుకు తౌహీ. ఇది జహ్ను గణము.

అజమీఢుని రెండవ వంశము. అజమీఢునికి నీలియందు సుశాంతి పుట్టెను. వానిది పురుజాతి, వానికి వాహ్యాశ్వుడు కల్గగా, వానికి అయిదుగురు పుత్రులు కల్గిరి. ముద్గలుడు సృంజయుడు, బృహదిషురాజు. పరాక్రమ శాలియగు యువీనరుడు, కృమిలాశ్వుడు అనువారు. ఈ అయిదుగురు దేశములను రక్షింప జాలుదురు అని ప్రసిద్ధి.

ముద్గలుని దాయాదుడు మౌద్గల్యుడు. ఆయన వలన ఇంద్రసేన ప్రధ్నశ్వుడను కొమరుని గన్నది. సృంజయుని కుమారుడు పంచజనుడనువాడు. వాని కొడుకు సోమదత్తుడు. వాని కొడుకు కీర్తిశాలి సహదేవుడు. వానిపుత్రుడు సోమకుడు. అజమీఢ వంశము యొక్క క్షీణదశలో సోమకుడు పుట్టెను. వాని కొడుకు జంతువు. వానికి నూర్గురు కుమారులు. వారిలో చిన్నవాడు వృషతుడు. వాని కొడుకు ద్రుపదుడు. ఇంతవరకు అజమీఢ వంశము గురించి చెప్పబడినది. వారు సోమకులను పేరుతో ప్రఖ్యాతి పొందిరి.

మునిశ్రేష్ఠులారా! అజమీఢుని మహిషి ధూమిని పతివ్రత. వ్రతాచరణపరాయణ. సంతతికై పదివేలేండ్లు దుశ్చరమైన తపమాచరించి అగ్ని హోత్రము సేయుచు మితభోజనయై అగ్నిహోత్ర సమీప దర్భలందు శయించెను. ఆమెతో అజమీఢుడు సమావేశమంది, ధూమ్రవర్ణుడు, చక్కనివాడగు ఋక్షుడను కుమారుని గాంచెను. ఋక్షుని వలన సంవరణుడు

వానికి కురువుగల్గెను. ఆతడు ప్రయాగ నుండి వెళ్ళి కురుక్షేత్రము నిర్మించెను. అది పవిత్రము, రమణీయము, పుణ్యవంతు లచే సేవింపబడునది. ఆయన వంశీయులే కౌరవులు. కురుని కుమారులు నల్వురు. సుధన్వుడు, సుధనుడు, పరీక్షిత్తు మహాపరాక్రమవంతుడగు అరిమేజయుడు. పరీక్షిత్తు కొడుకులు జనమేజయుడు, శ్రుతసేనుడు, ఆగ్రసేనుడు, భీమసేనుడు. వీరందరు శూరులు, బలశాలురు. జనమేజయుని తనయుడు బుద్ధిశాలియగు సురథుడు. వాని సుతుడు విదూరథుడు. వాని కొడుకు మహారథుడగు ఋక్షుడు. రెండవ వాడు భరద్వాజుని వలన అదే పేర ప్రఖ్యాతిపొందెను. సోమ వంశమందు ఇద్దరు ఋక్షులు, ఇద్దరు పరీక్షిత్తులు, ముగ్గురు భీమసేనులు, ఇద్దరు జనమేజయులు గల్గిరి. రెండవ ఋక్షునికి భీమసేనుడు ఉదయించెను. వానికి ప్రతీవుడు. వానికి శాంతనుడు. దేవాపి, బాహ్లీకుడు అను మువ్వురు పుత్రులు కల్గిరి. శాంతనునికి భీష్ముడు ఉదయించెను.

బ్రాహ్మణులారా! బాహ్లీకుని వంశము వినుడు. బాహ్లీకునికి కీర్తి శాలియగు సోమదత్తుడు, వానికి భూరి భూరిశ్రవుడు, శలుడు. దేవాపిముని. అతడు దేవతలకు ఉపాధ్యాయుడు అయ్యెను. చ్యవన పుత్రుడు కృతకుడు అతనికి ఇష్టుడయ్యెను. శాంతనుడు కౌరవ శ్రేష్ఠుడు. అతడు రాజయ్యెను.

త్రిలోక ప్రసిద్ధమైన శంతను వంశము తెల్పెద. శంతనుని వలన గంగ దేవవ్రతుని కన్నది. అతడే భీష్ముడు. (గాంగేయుడు), పాండవులకు పితామహుడు. శంతనుని భార్య కాళి విచిత్రవీర్యుని గాంచెను. విచిత్ర్య వీర్యుని క్షేత్రమందు (భార్యయందు) కృష్ణ ద్వైపాయనుని వలన ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుడు పుట్టిరి.

ధృతరాష్ట్రునికి గాంధారియందు దుర్యోధనాదులు నూర్గురు గల్గిరి. దుర్యోధనుడు రాజరాజయ్యెను. పాండురాజు కుమారుడు ధనంజయుడు. ఆయనకు సౌభద్రుడు (సుభద్ర కొడుకు) అభిమన్యుడు పుట్టెను. వానికి పరీక్షిత్తు పారిక్షిత్తు (జనమేజయుడు) వానికి కాశియందు ఇద్దరు సుతులు పుట్టిరి. మహారాజగు చంద్రాపీడుడు, మోక్షజ్ఞుడగు సూర్యాపీడుడు అనువారు. చంద్రాపీడుని కొడుకులు నూరుమంది. వారు మంచి విలుకాండ్రు. జానమేజయమను పేర ఈ క్షాత్రవంశము ప్రసిద్ధికెక్కినది.

అందు మొదటివాడు సత్యకర్ణుడు వారణాసీ నగరమందు ఉండెను. ఈతడు పరాక్రమశాలి, యజ్వ. విపుల దక్షిణుడు, వాని దాయాదుడు శ్వేతకర్ణుడు. ప్రతాపశాలి. అపుత్రకుడై వనమున కేగెను. అతనివలన వనమున యదువంశమునందు పుట్టినదియు సుచారుని కుమార్తెయు అగు మాలిని (గ్రాహమాలిని) గర్భవతి కాగా శ్వేతకర్ణుడు పూర్వము

సంకల్పించిన మహాప్రస్థానమున కేగెను. మాలినియు ప్రియుని వెంబడించి మార్గమందు సుకుమారుడైన కుమారుని ప్రసవించెను. ఆ శిశువును అక్కడనే విడిచి, మహాప్రస్థానమున పతుల ననుగమించిన ద్రౌపదివలె మహానుభావురాలగు ఆమె రాజు ననుగమించెను.

ఆ విడిచిపెట్టిన శిశువు పర్వతమందు ఏడ్చుచుండగా, దయచూప మేఘములు ఆ మహాత్మునికి నీడ ఇచ్చెను. శ్రవిష్ఠా కుమారులు ఇద్దరు పైప్పలాది కౌశికుడను వారు జాలి గొని ఆబాలుని జలమునందు కడిగిరి. అంతకుముందే ఏడ్చుచు పాషాణ మందు దొరలిన ఆ బాలుని రక్తసిక్తమైన శరీరము యొక్క ఇరుపార్శ్వములు మేకవలె నలుపు ఎక్కినవి. అందువలన ఆ బాలునికి ఆ మునులు అజపార్శ్వుడు అను పేరుపెట్టిరి. అతడు రేమకుని ఇంట ఇద్దరు బ్రాహ్మణులచే పెంచబడెను. రేమకుని భార్య అతనిని తన పుత్రునిగా ఎత్తుకొనగా ఆమెకు అతడు కొడుకయ్యెను. అతనికా బ్రాహ్మణులు మంత్రులైరి.

వారి పుత్ర పౌత్రులు సమాన జీవనులైరి. ఇది పౌర వంశచరిత్ర. మహానుభావులైన పాండవులగాథ. ఈ విషయములో పరమ ప్రీతినందిన ధీమంతుడగు నహుష కుమారుడగు యయాతిచే వార్ధక దశలో క్రింది చెప్పబడిన అర్థముగల శ్లోకము ఒకటి గానము చేయబడినది. ఈ భూమి చంద్రార్క గ్రహశూన్యమైన కావచ్చును. కాని ఎన్నటికి అపౌరవము కాదు. అనగా పురువంశాంకురము ఎన్నటికిని ఉండకపోదు. ఇది పౌరవంశ చరిత్ర. దీనిని మీకు నేను విస్తరముగా తెలిపితిని.

ఇక తుర్వసువు ద్రుహ్యుడు, అను యదువుల యొక్క వంశములను చెప్పెదను. తుర్వసుని కొడుకు వహ్ని వాని కొడుకు గోభానుడు. అతని కొడుకు ఐశానుడు. ఇతడు రసరాజితుడు. వాని కుమారుడు కరంధముడు. వానిపుత్రుడు మరుత్తుడు. మఱియొక అవిక్షితుని పుత్రుడగు మరుత్త మహారాజు నాచే ఇంతకుముందు చెప్పబడెను.

మరుత్తు విపుల దక్షిణములైన యజ్ఞములు ఆచరించెను. వానికి సంతతి లేదు. సంయత అను కూతురు మాత్రము కల్గెను. ఆమె యజ్ఞదక్షిణగా సంవర్తునకు ఈయబడినది. ఆమె దుష్యంతుడు అను కుమారుని కనెను. ఇట్లు యయాతి శాపముచే తుర్వసు వంశము పురువంశములో చేరెను.

దుష్యంతుని కుమారుడు కరూరోముడనురాజు. వాని కొడుకు ఆహ్లీదుడు. అతనికి నల్గురు కుమారులు, పాండ్యుడు, కేరశుడు, కాలుడు. చోళరాజు అనువారు. దృహ్యుని కుమారుడు బభ్రుసేతు మహారాజు. అతని కొడుకు అంగారసేతుడు. అతడు మరుత్తులకు రాజు. ఆ వీరుడు యౌవనాశ్వునిచే అతికష్టముతో యుద్ధమందు కూల్చబడెను. పదు నాలుగు

మాసములా ఘోర యుద్ధము జరిగెను. అంగారసేతువు కొడుకు గాంధారుడు. అతనిపేరనే గాంధారమను దేశము ప్రఖ్యాతి కెక్కెను. గాంధార దేశమందలి గుఱ్ఱములు ప్రశస్తములు.

అనువు కొడుకు ధర్ముడు, ధర్ముని కొడుకు ద్యుతుడు. వాని కొడుకు వనదహుడు. వాని కొడుకు ప్రచేతనుడు. వాని కొడుకు సుచేతనుడు. ఇట్టి వంశానుక్రమముగల తుర్వసు వంశీయులు నాచేత చెప్పబడిరి. యదు కుమారులు దేవకుమారతుల్యులు ఐదు గురు. సహస్రాదుడు, పయోదుడు, క్రోష్ట నీలుడు, అంజికుడు. సహస్రాదుని కొడుకులు పరమధార్మికులు ముగ్గురు. హైహయుడు, హయుడు వేణుహయరాజు. హైహయుని కుమారుడు ధర్మనేత్రుడు. వాని కొడుకు కార్తుడు. వానికొడుకు సాహంజుడు, వాని పేర 'సాహంబని' అను పురము ఏర్పడెను. మహిష్మంతుని కొడుకు భద్రశ్రేణ్యుడు, ప్రతాపశాలి. వాని తనయుడు దుర్దముడు. వాని తనయుడు బుద్ధిమంతుడు కనకుడు. వాని కుమారులు నల్గురు. కృతవీర్యుడు, కృతౌజనుడు, కృతధన్వుడు, కృతాగ్ని. వీరిలో కృతవీర్యుని తనయుడు అర్జునుడు (కార్తవీర్యార్జునుడు).

ఇతడు సప్త ద్వీపములు ఏలెను. వేయిబాహువులు కలవాడు. సూర్యునట్లు వెలుగు రథముతో ఒక్కడు వసుధామండలమెల్ల జయించెను. పదివేల ఏండ్లు దుశ్చరమైన తపము చేసి దత్తాత్రేయులను ఆరాధించెను. దత్తగురుడు ఆతనికి నాల్గు వరములు ఇచ్చెను. వేయి చేతులు కల్గుట, అధర్మమునుండి సజ్జనులను రక్షించుట, స్వభూమండలము జయించి ధర్మమున ప్రజారంజనము చేయుట, రణరంగమున అనేకమందిని జయించి, చివరకు రణరంగంలోనే సర్వాధికుడైన వానిచేతిలో వధింపబడుట అనునవి ఆ వరములు. యుద్ధము చేయుచుండగా యోగశక్తిచే యోగీశ్వరునికి వలె బాహుసహస్రము ఆవిర్భవించు చుండును. అతడు సముద్రములు. నగరములు, పట్టణములతో గూడినవి అగు సప్తద్వీప యైన వసుంధరను ఎల్లను గెల్చుకొనెను. ఏడు ద్వీపములందు నేడువందల యజ్ఞముల నతడు నిర్వహించెను. అన్ని యజ్ఞములు శతసహస్రదక్షిణములు, అన్నియు కాంచన యూపములు, కాంచన వేదికములు. అన్నిటను సర్వదేవతలు, గంధర్వులు, అప్సరసలు అలంకరించుకొని విమానములపై యరుదెంచి నిత్యము నాతని యజ్ఞము నలంకరించిరి. ఆ యజ్ఞమందు దేవర్షియు, వరీదాసు కొడుకును గంధర్వుడును విద్వాంసుడునగు నారదుడు ఆతని మహిమ కదరువడి యతని జన్మమందు ఈ గాథలను గానము చేసెను.

నారదుడు పాడిన గాథలివి – యజ్ఞ దాన తపస్సులచే, విక్రమముచే, శ్రుతముచే (పాండిత్యముచే) కార్తవీర్యార్జునుని స్థితి ఏ రాజును పొందజాలడు. సప్త ద్వీపములందును జనములకు ఆతడు డాలు, కత్తి, రథముకలవాడై, యోగియై, ఎట్టయెదుట కనబడుచుండును.

ద్రవ్య నష్టము, శోకము, విభ్రమము అనునవి ధర్మపాలనలో ఉండు ఆతనికి లేవు. సర్వరత్న భాజనుడు, సమ్రాట్టు, చక్రవర్తియును అతడే పశుపాలకుడు, క్షేత్రపాలుడును గూడ అయ్యెను. యోగి అగుటచే ఆ కార్తవీర్యార్జునుడు వర్షించుటలో పర్జన్యుడు అయ్యెను. మేఘము తానే అయ్యెను. వింటినారి దెబ్బలచే కఠినమైన చర్మముగల బాహుసహస్రముచే అతడు శరత్కాలమందు వేయి కిరణములచే వెలుగొందు భాస్కరునివలె తేజరిల్లెను.

మాహిష్మతీ నగరమందు కర్కోటకుని కొడుకులను నాగులను జయించి వారిని ఆ నగరమందే మనుష్యులలో ఉంచెను. పద్మనయనుడగు అతడు వర్షాకాలమునందు విలాసముగా తన బాహువులచే ఉబికిన సముద్ర వేగముచే నడనీటివాలును ఎదురెక్కించెను. క్రీడించుచున్న ఆ కార్తవీర్యార్జునిచే తిరస్కృతయై ఆతడు ఏలు గ్రామములను మాలాకారమున చలించు వేలకొలది కెరటములతో చుట్టుకొనిపారు నర్మదానది భయపడుచు ఆతనికి అభిముఖముగా వచ్చెను. అతడు వేయిచేతులచే సముద్రమును క్షోభింపచేయగా పాతాళవాసులగు మహోసురులు భయపడి నిశ్చేష్టులయి సముద్ర మందు నక్కినక్కి దాగిరి. మహాతరంగములు చూర్ణితములు అయ్యెను. మహామీన తిమింగలాది జలజంతువులు చలించిపోయెను. నురుగురాసులు గాలిచే భగ్నమాయెను. సుడులు సంకులములయ్యెను. ఇట్లు ఆతడు మందరగిరి మథన పరిక్షిప్తమగు క్షీరాబ్ధినట్లు అబ్ధిని సంక్షోభపరచెను. అమృతమథన మందువలె శంకితులయి వేలకొలది నాగులు తటాలున లేచి వెఱచుచు రాజవరుని తిలకించి పడగలువంచి వినతులై సాయాహ్నమందు వాయు కంపితములైన అరటిబోదెల గుంపులట్లు వణకుచు అతని శరణమందిరి. అతడు శర పంచకముచే రక్తముకారి తడిసిపోయిన సేనాసమేతులైన లంకేశ్వరుని అల్లె త్రాళ్ళతో బంధించి మోహింపజేసిలోగొని మాహిష్మతీ నగరమున బంధించెను.

తన కుమారుడట్లు కార్తవీర్యార్జునిచే బంధితుడగుట విని పులస్త్యబ్రహ్మ (రావణుని తండ్రి) కార్తవీర్యార్జునుని దర్శించి యాచించిన మీదట రావణుని అతడు విడిచిపుచ్చెను. వాని బాహు సహస్రముచే కావింపబడిన ధనుష్టంకారము ప్రళయసమయ పర్జన్య ఘోషణ భీషణమ్మై పిడుగులు పడినట్లు బెట్టదమాయెను. ఏమి ఆశ్చర్యము! భార్గవరాముని పరాక్రమము కార్తవీర్యుని బాహుసహస్రమును హేమతాళ వనంబునట్లు భేదించెను. దప్పికగొని అగ్ని ఒకప్పుడు కార్తవీర్యుని భిక్షమడుగ, ఆవీరుడు ఆయనకు పురములు, గ్రామములు, ఘోషములు, పల్లెలు దేశములతోడి సప్తద్వీపములను భిక్షగనొసంగెను. అగ్ని ఆవినోదమును తెలుసుకొనవలెనని అన్నిటిని దహించివేసెను. కార్తవీర్యుని ప్రభావముచే అగ్ని అట్లు పర్వతములు, వనములతోగూడ దహించెను. వరుణ కుమారుడావపుడను వాని

యాశ్రమము గూడ కార్తవీర్యు నితోగూడి మసిసేసెను. వరుణ కుమారుడు తేజస్వియు, ఉత్తముడు అగు వశిష్ఠుడనువాడు. ఆ ముని ఆపవుడను ప్రఖ్యాతినందెను, ఆపవుడు కోపించి అర్జునుని శపించెను. ఓరీ! హైహయ! నేను నివసించు వనమును గూడ విడువ వైతివి. కావున నీ చేసిన దుష్కర్మమును మరొక్కడు నాశనము సేయగలడు. రాముడను పేరుగల మహావీరుడు, జమదగ్నికి కుమారుడుగా ఉదయించి నీ వేయిబాహువులు నరికి, ఆ బ్రాహ్మణ తపస్వి నిన్ను సంహరింపగలడు అనెను. ఏ కార్తవీర్యునకు ద్రవ్యనాశనము లేదో! ఆ కార్తవీర్యార్జునునికి ఇంతకుముందు పొందిన వరములు అన్నియు ఈరీతి ఫలించెను. ప్రబలుడైన వానిచేతిలో మరణము అతడు కోరుకొనెను. కోరినట్లు ఆపన మహాముని శాపము వలన పరశురాముని చేతిలో అతడు వీరస్వర్గము పొందినాడు.

ఆ కార్తవీర్యునకు కుమారులు నూర్గురు. అందు ఐదుగురు మిగిలిరి. వారు బల శాలురు, శూరులు, ధర్మపరులు, కీర్తిశాలురు. శూరశేనుడు, శూరుడు, వృషణుడు, మధుపధ్వజుడు, జయధ్వజుడు అనువారు. జయధ్వజుడు అవంతీదేశమును పాలినవాడు. జయధ్వజుని తనయుడు తాలజంఘుడు. వాని కుమారులు నూర్గురు తాలజంఘులు అనుపేర బరగిరి. హైహయుల వంశమందు నీతిహోత్రులు, సుప్రతులు, భోజులు, అవంతులు, తౌండికేరులు, తాళజంఘులు ప్రసిద్ధులు. భరతులు, సుజాతులు మొదలగువారు పెక్కుమంది కూడా ఉన్నం దున వారిని పేర్కొనశక్యముగాదు. విప్రులారా! వృషుడు మొదలయిన యాదవులు పుణ్యా చరణ పరాయణులు, వృషుడు, వంశధరుడు (మూల పురుషుడు). వాని కుమారుడు మధువు వానికి నూర్గురు కుమారులు. అందు వృషణుడు వంశకర్త. వాని సంతతి వృష్ణులు. మధువను వాని సంతతి మాధవులైరి. యదువుపేర యాదవులని హైహయులు పేరందిరి. కార్తవీర్యుని జన్మచరిత్ర కథనము నిత్యము పఠనము చేయువానికి విత్తనాశము కలుగదు. పోయిన సొత్తు దొరకును. మహామునులారా! ఇవి యయాతి కుమారులు అయిదుగురి వంశములు.

యయాతి కుమారులు అయిదుగురు పంచ భూతములవలె లోకములను ధరించి నారు. కావున వారి చరిత్ర సంకీర్తనముచే ఈ చరాచరాత్మక పంచభూతజగత్తు ఎల్ల ధరింప బడును. ఉద్ధరింపబడును. ఈ పంచవంశ విసర్గము విన్నరాజు ధర్మార్థ నిపుణుడు వశి యును (జితేంద్రియుడు) కాగలడు. అయిదు పరములందగలడు. అవి ఆయువు, కీర్తి, పుత్రులు, ఐశ్వర్యము, విభూతి, ఈ పవిత్ర చరిత్ర ధారణమువలన, శ్రవణము వలన ఈ చెప్పిన ఫలము నిశ్చయము. క్రోష్టువంశము ఇంకను తెల్పెద వినుడు. యజ్ఞ కర్త ధర్మాత్ముడు వంశ ధారకుడు అగు యదుక్రోష్టువుల వంశముల వృత్తాంతము సర్వపాప విమోచకము. ఈ వృష్ణి వంశమందు శ్రీమహావిష్ణువు శ్రీకృష్ణ రూపమున అవతరించెను. (13)

శ్రీకృష్ణ జన్మాను కీర్తనము

సూతుడు ఇట్లనియె-గాంధారి మాద్రియును, క్రోష్టుని భార్యలు గాంధారి అనమిత్రుని, మాద్రి యుధాజిత్తును దేవమీఢుడు అను ఇద్దరిని కనెను. వారి వంశమే వృష్ణి వంశముగా మూడు శాఖలుగా వృద్ధి చెందెను. మాద్రి కొడుకులు వృష్ణి అంధకుడు అనువారు. శ్వఫ ల్కుడు. చిత్రకుడను వారు వృష్ణి యొక్క కుమారులు.

శ్వఫల్కుడు ధర్మపరుడు. వాని పాలనమునందు వ్యాధి భయము, అనావృష్టి తాపము మొదలైన బాధలు లేకుండెను. ఒకప్పుడు కాశీరాజు పాలించు దేశమునందు ఇంద్రుడు మూడేండ్లు వర్షింపనేలేదు, అపుడు కాశీరాజు శ్వఫల్కుని తనరాజ్యమునకు గొనివచ్చెను. అతడచ్చట మసలిన కారణముచేత హరివాహనుడు (ఇంద్రుడు) వానగురిపించెను. అపుడు శ్వఫల్కుడు కాశీశ్వరుని కుమార్తె గాదిని వివాహమాడెను. ఆమె నిత్యము విప్రునికి గోవును ఇచ్చుచుండెను.

శ్వఫల్కునకు సంతానముగా దాత, యజ్వ (యజ్ఞకర్త), వీరుడు, పండితుడు, అతిథిప్రియుడు, భూరిదక్షిణుడైన అక్రూరుడు, ఉపమద్గువు, మద్గువు, మందరుడు, అరిమేజయుడు, అవిక్షుతుడు, అంధకరువు, ఆవాహుడు, ప్రతివాహుడును సుందరి అను కన్యయుపుట్టిరి. అక్రూరునకు దేవవర్చస్సుగల ప్రసేనుడు, ఉపదేవుడు అనువారు ఉగ్రసేన యందు ఉదయించిరి. వృష్ణి కుమారుడగు చిత్రకునకు పృధువు, విపృధువు, అశ్వగ్రీవుడు, అశ్వబాహువు, స్వపార్శ్వుడు, గవేషణుడు, అరిష్టనేమి అశ్వుడు, సుధర్ముడు, సుబాహువు, బహుబాహువు అనుకుమారులును శవిష్ఠ, శ్రవణ అను కుమార్తెలు పుట్టిరి. దేవమీఢుడు అసిక్నియందు శూరుడను వానినికనెను. శూరునకు భోజ్య యందు పదిమంది శూరులైన వారు ఉదయించిరి. తరువాత దుందుభి అను పేరున వర్ధిల్లిన వసుదేవుడు ముందుగ పుట్టెను. అతడు పుట్టగానే ఆకాశములో ఆనకములోనెడి వాద్య విశేషములు దుందుభులు మ్రోగినవి. పుష్పవృష్టి గురిసెను. వసుదేవునితో సముడయిన అందగాడు ఈ లోకమున లేడు. అతడు చంద్రునివంటి కాంతితో తేజరిల్లెను.

ఈయనకు దేవభాగుడు, దేవశ్రవుడు, అనాధృష్టి, కనవకుడు, వత్సవానుడు, గృంజ ముడు, శ్యాముడు, శమీకుడు, గండూషుడు అను కుమారులు. పృథుకీర్తి, పృథ, శ్రుతదేవ, శ్రుతశ్రవ రాజాధిదేవి అను అయిదుగురు కూతురులు వీరపత్నులు గల్గిరి. శ్రుతశ్రవయందు చైద్యుడు శిశుపాలుడనుపేర కల్గెను. ఇతడే క్రిందటి జన్మమున దైత్యపతి హిరణ్యకశిపుడు. వృద్ధశర్మ వలన పృథకీర్తియందు కరూశాధిపతియైన దంతవక్త్రుడు పుట్టెను. కుంతి

అనురాజు పృథను కుమార్తెగా పెంచుకొనెను. ఆమే పాండవుల తల్లి కుంతి. ఆమెను పాండు రాజు పెండ్లాడెను. ఆమె అందు యముడే ధర్మవేత్తయైన ధర్మరాజై (యుధిష్ఠిరుడు) ఉదయించెను. వాయువువలన భీమసేనుడు కల్గెను. ఇంద్రుని వలన అప్రతిరథుడు, ఇంద్రపరాక్రముడు అయిన ధనంజయుడు (అర్జునుడు) ఉదయించెను. కనిష్ఠుడయిన అనమిత్రుడను వృష్ణి కుమారునికి శినియను వాడుకల్గెను. శిని కొడుకు (శైనేయుడు) సత్యకుడు సత్యకుని కుమారుడు యయుధానుడు (సాత్యకి), దేవభాగునకు మహాను భావుడగు ఉద్ధవుడు ఆవిర్భవించెను. దేవశ్రవుని పండితాగ్రణి అందురు, దేవశ్రవుడు కీర్తిశాలియగు అశ్మక్యుడను సుతునిబడసెను. అనాధృష్టిని కృత్తశత్రు వను కుమారుని, శ్రుతదేవ అను ఆమె శత్రుఘ్నుని కనెను. శ్రుతదేవ కుమారుడు ఏకలవ్యుడు నిషాదుని పెంపకములో పెరిగెను. వత్సవంతునకు పుత్రులులేని కారణముచేత శౌరి (శూరవంశము వాడగు వసుదేవుడు) తన కుమారుని కౌశికుని ధారాదత్తము చేసెను. అపుత్రకుడైన గండూషునకు విష్వక్సేనుడు తన కుమారులగు చారుధేష్ణుడు, సుధేష్ణుడు, పంచాలుడు, కృతలక్షణుడు అను వారినిదత్తత ఇచ్చెను.

చారుధేష్ణుడు యుద్ధమునకేగి ఎన్నడు వెనుదిరిగినవాడు గాడు అతడు రుక్మిణీ తనయులందు కడగొట్టువాడు, మహావీరుడు. అతడు యాత్రకు పోవునపుడు చారుధేష్ణునిచే హతులైనవారిని (చారూన్ అనగా రుచిగ ఉన్నవారిని) ఇపుడు తినవలయునని వేలకొలది కాకులు అతని వెంట పోయెడివట. కనవకునికి తంత్రిజుడు, తంత్రిపాలుడు అను ఇద్దరు కల్గిరి. కంజమునికి వీరువు అశ్వహనువు గల్గిరి. శ్యామపుత్రుడగు శమీకుడు రాజ్యమేలెను. భోజవంశమున జనించుటచే ఏవగించువాడైనను రాజసూయమొనర్చెను. అతనికి శత్రు నాశకుడగు అజాతశత్రువు గల్గెను. ఇక వసుదేవుని సంతానము తెల్పెదను. వృష్ణి యొక్క (వృష్ణి అంధకభోజ) త్రిశాఖమైన (మూడు శాఖలైన) ఈ వంశము యొక్క చరిత్ర ధారణము చేయు వాడు వంశాభివృద్ధిని పొందును అనర్ధములను బాయును.

పురు వంశమున పుట్టిన పౌరవి, రోహిణి, మధిరా, ఆది, వైశాఖి, భద్ర, సునామ్ని, సహదేవ, శాంతిదేవ, శ్రీదేవి, దేవరక్షిత, వృకదేవి, ఉపదేవి, దేవకి అని. వసుదేవుని భార్యలు పదునల్గురు. సుతనువు బడబ అనువారిరువురు పరిచారికలు. పౌరవి, రోహిణియు బాహ్లికుని కుమార్తెలు. వసుదేవుని పెద్దభార్యకు రాముడు, శరణ్యుడు, శరుడు, దుర్దముడు, దమనుడు, శుభ్రుడు, పిండారకుడు, ఉశీనరుడు, చిత్ర అను కూతురు కల్గిరి. మొత్తం వీరు తొమ్మండుగురు. చిత్రయే సుభద్రయను పేరుతో గూడ ఖ్యాతి గాంచినది. వసుదేవునికి దేవకియందు శౌరి (కృష్ణుడు) అవతరించెను. రామునికి రేవతియందు నిశఠుడను,

ప్రియపుత్రుడు ఉదయించె. పార్థునికి సుభద్రయందు రథికుడగు అభిమన్యుడు కల్గెను. అక్రూరునికి కాశికన్యయందు సత్యకేతువు జనించె. వసుదేవుని ఏడ్గురు భార్యలందు కలిగిన శూరుల క్రమమిది. శాంతిదేవకు భోజుడు విజయుడు అను ఇద్దరు కల్గిరి. సునామయందు వృకదేవుడు, గదుడుకల్గిరి. వృకదేవికి అగావహుడు పుట్టెను.

త్రిగర్తరాజు కూతురు శిశిరాయణి యొక్క భార్య గార్గ్యమునివర్యుని పౌరుషపరీక్షకు పూనుకొనెను. కాని అతని వీర్యము స్థలనముకాలేదు. పన్నెండవ సంవత్సరమున పరిహసితుడైన ఆముని ఒక ఘోషకన్యతో మిథున క్రీడకు ఉపక్రమించెను. ఆ ఘోషాంగన ఘోషవేషధారిణియైన గోపాలి అను ఒక అప్సరస. గోపకన్యా వేషము ధరించి, ధరింప అలవికాని ఆతని గర్భమును (శిశువును) ధరించెను. మనుష్య స్త్రీయైన ఆగార్గుని భార్యయందు శివుని ఆజ్ఞచే సింహమువంటి మహాబలశాలి కాలయవనుడనువాడు పుట్టెను. వాని పూర్వకాయము వర్తులాకారము సింహమువంటి ఆకారము గల్గియుండెను. అపుత్రకుడైన యవనరాజు యొక్క అంతఃపురమునవాడు పెరిగెను. అందువలన యవనునికి వాడు కుమారుడయి కాలయవనుడు అన ఒప్పెను. వాడు యుద్ధ కుతూహలముగొని యేరితో తలపడుదునని యడుగగా దేవర్షి నారదుడు వృష్ణి-అంధక కులములను జెప్పెను. అక్షౌహిణిసేనతో వాడు మధురపై దండెత్తి పోయి దూతను పంపెను. అపుడు వృష్ణ్యంధకులు మహామతియైన కృష్ణుని పురస్కరించుకొని పోయి కార్యాలోచనచేసి ఒక నిశ్చయమునకు వచ్చి, పారిపోవుటకు అంగీకరించిరి. పినాకపాణియైన శివుని అభిప్రాయమును గౌరవించి మధురను వదలి కుశస్థలికి, ద్వారకనుచేరి నివాసము చేయనెంచిరి. ఇది శ్రీకృష్ణ జన్మ వృత్తాంతము. శుచియై ఇంద్రియములను నియమించుకొని పర్వములందు వినిపింప వలెను. అట్లు వినిపించిన విద్వాంసుడు ఋణములను బాసి సుఖియగును. (14)

వృష్ణి వంశ వర్ణనము

లోమహర్షణ సూతుడు మునులతో ఇట్లు అనెను –

క్రోష్టునికి వృజినీవంతుడు పుట్టెను. వానికి స్వాహి జన్మించెను. అతడు యజ్ఞకర్తలలో శ్రేష్ఠుడు. స్వాహి కుమారుడు ఉషద్గువు. అతడు సంతతి కొఱకు భూరిదక్షిణములైన యజ్ఞములుచేసి చిత్రరథుడను కుమారుని పొందెను. అతడు మంచికర్మిష్ఠి, వాని కుమారుడు శశబిందువు యజ్వ, విపులదక్షిణుడు. రాజర్షుల వర్తనము అనుష్ఠించినవాడు. శశిబిందుని నందనుడు పృథుశ్రవుడు యశస్వి రాజయ్యెను. పురాణవిదులాతని కుమారుని అంతరుడని చెప్పుదురు.

ఈతనికి సుయజ్ఞుడు ఉదయించెను. వానికి ఉషతుడు కల్గెను. అతడు స్వధర్మా దరుడు. వానికి కొడుకు శినేయుడు. శత్రు తాపనుడు అతడు. వానితనూజుడు మరుతుడు. అతడు రాజర్షి. వాని జ్యేష్ట సుతుడు కంబల బర్హిషుడు. అతడు ప్రేత్య భాక్కయ్యు (మరణో న్ముఖుడై కూడ) ఉత్తమ సంతతిగల కుమారుడు కావలెనని గొప్ప ధర్మానుష్ఠానమును కోపముతో గావించెను.నూర్గురు పుట్టిన తరువాత అతనికి ఉత్తముడగు కుమారుడు ఒక్కడు ఉదయించెను. అతడు రుక్మకవచుడు. అతడు కవచధారులైన నూర్గురు ఉత్తమ ధానుష్కులను రణమునందు వాడియైన బాణములతో చంపి, అత్యుత్తమ శ్రీలాభమందెను. వానికి శత్రుసంహారకుడగు పరాజిత్తు, వానికి రుక్మేషువు, పృథురుక్ముడు, జ్యామఘుడు, పాలితుడు, హరి అను మహావీరులు పుట్టిరి. పరాజిత్తునికి ఐదుగురు సుతులు ఉదయించిరి. తండ్రి పాలితుని, హరిని విదేహరాజులకు ఇచ్చెను. పృథురుక్ముని ఆశ్రయమున రుక్మేషుడు రాజయ్యెను. వారిద్దరిచే పంపబడిన జ్యామఘుడు, ఆశ్రమమందుండెను. అతడు బ్రాహ్మణులచే లెస్సగ బోధింపబడి, ఏకాకియై ధనుస్సుపట్టి ధ్వజము, రథముగొని మరియొక దేశమునకు ఏగెను. నర్మదా తీరమున ఒంటరిగా తిరుగుచు, ఋక్ష వంతమను గిరిని గెలిచి శుక్తిమతీ నగరమునందు వసించెను. వాని భార్య శైబ్య. బలశాలిని, పతివ్రత, సంతానము లేకున్నను, అతడు మఱియొక భార్యను జేసికొనలేదు.

అతనికి ఒకానొక యుద్ధమందు జయము గల్గెను. అందొక కన్యను కానుకగా బడసెను. ఆమెనువెంటగొని భార్యదరికేగి భయముతో "కోడలిదిగో"అని చూపెను. ఆమె ఎవరి కోడలు? యని ప్రశ్నించెను. ఆ మాటను వినిన జ్యామఘుడు ఇట్లనెను.

నీకు పుట్టబోవు కుమారునికిది భార్య అనెను. సూతుడు ఇట్లంతయు చెప్పిన మరియు ఇట్లనియె –

ఆ కన్య ఉగ్రమైన తపస్సు చేసెను. ఆ తపఃఫలముగా శైబ్య విదర్భుడను కుమారుని కనెను. విదర్భుడు ఆ రాజ పుత్రికయందు క్రథకైశికులు, అనుశూరులు విద్వాంసులు అగు ఇద్దరు కుమారులను గాంచెను, వారు రణవిశారదులు. విదర్భుని కుమారుడు భీముడు, వాని తనయుడు కుంతి. వాని కొడుకు ధృష్టుడు. అతడు రణధృష్టుడు. ప్రతాప శాలి. వాని కొడుకులు ముగ్గురు, శూరులు, పరమధార్మికులు. అవంతుడు, దశా ర్ణుడు, విషహరుడు. దశార్ణసుతుడు వ్యోముడు, వాని కొడుకు జీమూతుడు, వాని తన యుడు వికృతి. వాని కుమారుడు భీమరథుడు, నవరథుడు. నవరథుని పుత్రుడు దశరథుడు, వాని కుమారుడు శకుని. శకుని సుతుడు కరంభుడు, కరంభుని తనయుడు దేవరాతుడు,

వాని పుత్రుడు దేవక్షత్రుడు. వాని సుతుడు వృద్ధక్షత్రుడు. వృద్ధక్షత్రనందనుడు, దేవపుత్ర సముడు, మధువుల వంశమునకు కర్త, మధురముగా మాట్లాడెడివాడు మధువనువాడు, అతనికి వైదర్భియందు పురుషోత్తముడగు పురుద్వంతు డనువాడు ఉదయించెను. మధునికి ఇక్ష్వాకి (ఇక్ష్వాకు వంశజాత) అను భార్యయందు సర్వగుణోపేతుడు సాత్వత కీర్తి వర్ధనుడగు సత్త్వంతుడు అనువాడు పుట్టెను. అతడు స్త్వాతులు అనుపేరు తెచ్చినవాడు. మహాత్ముడగు జ్యామఘుని విసృష్టిని విన్నవాడెప్పుడు పరమ ప్రీతినందును ప్రజావంతుడు (సంతానము కలవాడు) అగును.

అని చెప్పి ఇంకను సూతుడు ఇట్లు అనెను.

సత్త్వంతునివలన కౌసల్య అను నామె బలశాలురగు భాగి, భజమానుడు, దివ్యుడు దేవావృధుడు, అంధకుడు యదునందనుడగు వృష్ణి అనువారలను కనెను. వారి విశేష సృష్టుల నాల్గింటిని విస్తరించి వర్ణించితిమి. భజమానునికి సృంజయ కుమార్తెలు బాహ్యక ఉపబాహ్యక అను భార్యలుండిరి. వారికి పెక్కురు పుత్రులు కల్గిరి. క్రిమి, క్రమణుడు, ధృష్టుడు, శూరుడు, పురంజయుడు. వీరు బాహ్యక కుమార్తె సృంజయియందు భజమాను నకు జన్మించిరి. అయుతాజిత్తు, సహస్రజిత్తు, శతాజిత్తు దానకుడు అనువారు ఉపబాహ్యక సృంజయియందు కల్గినవారు.

దేవవృధుడు యజ్వ, తపస్వి, నాకుగుణశాలి అయిన కుమారుడు కావలెనని తపోనిష్ఠగొని పర్ణాశానదీజల మాచమించి, తపమాచరించుచుండెను. ఆ నదికి సదా తనయందు స్నానము చేయునాతని పై ప్రేమ కలిగెను. కాని ఏలాటిప్రియ మాచరించుట అను ఆలోచనలో ఒక నిశ్చయమునకు రాజాలదయ్యెను. ఈరాజు కల్యాణగుణుడు. ఈతని కీడైన కల్యాణి ఎవ్వతె? ఇతడు కోరిన గుణశాలి కుమారుడు ఉదయింపవలెనన్న ఏలాటి ఉత్తమ కన్య ఇతనికి పత్ని కావలెను? అని ఏమేమో తనలోతాను గుణించుకొని తుదకు నేనే యేగి ఈతనికింతిని అగుదునని పరమసుందర రూపముధరించి ఆనృపతిని వరించెను. ఆమెను ఆ ప్రభువు ఇష్టపడెను.

ఉదారమతియగు ఆనృపతి ఆసతియందు తేజస్వియైన గర్భముంచెను. పదియవ నెలలో ఆమె సర్వకల్యాణ గుణనిధియగు బభ్రుదేవావృధుడను కుమారుని ప్రసవించెను. ఈతడు యేడువేల ఇరువది ఆఱుగురు పురుషులకు అమృతత్వ మొందించెను. యజ్వ, దానవతి, ధీమంతుడు బ్రహ్మణ్యుడు, దృఢాయుధుడునైన ఈ బభ్రుని (దేవావృధుని) వంశమున భోజులు సార్తికావతులని ప్రసిద్ధులైరి. కాశ్యప దుహిత అంధకుని వలన

నల్వురగనెను. వారు కుకురుడు, భజమానుడు, సనకుడు, బలబర్హిషుడు. కుకురుని తనయుడు వృష్ణి. వానికొడుకు కపోతరోముడు. వానివాడుతివిరి. వానిసుతుడు పుశర్వనువు వానికి అభిజిత్తు వానికి ఇద్దరు పుత్రులు ఆహుకుడు, శ్రాహుకుడను అను ప్రసిద్ధి చెందిన వారు. ఆహుకునిగూర్చి పూర్వులు ఈ క్రింది గాథను ఉదహరింతురు.

శ్వేతపరివారముతో గూడి (తెల్లవాళ్ళతో) పసివానివలె ఆహుకుడు ఎనుబది కవచముల దాల్చి మొదట పోవును. పుత్ర సంతానము లేనివాడు, నూరువేలేండ్లు ఆయుర్దాయము లేనివాడు, అపవిత్ర కర్ముడు. యజ్వ కానివాడు, భోజరాజు వెంట ఉండరాడు. భోజునికి ఏనుగులు పదివేలు, ధ్వజములు కవచము ధరించినవారు పదివేలమంది. మేఘ ఘోషములుగల రథములు పదివేలు, బంగారు వెండి ఎనుబోతులు ఇరువది యొక్కటిగా తూర్పు దిక్కునపోయెడివి. ఉత్తరమున అటులనే ఏగెడివి. భోజ వంశీయ రాజులందరు వింటి నారియే చిరుగంటగ మ్రోగించినట్టివారు. అనగా మహాయోధులు. మరియు అంధక వంశీయులు తమ తోబుట్టువును అవంతీయులకు ఇత్తురు అని ఆ గాథ.

ఆహుకునికి కాశ్యపి అనునామె యందు దేవకుమారులను పోలిన దేవకుడు, ఉగ్రసేనుడనువారు ఇద్దరు కుమారులు కల్గిరి. దేవకుని కుమారులు నల్గురు. దేవవంతుడు, ఉపదేవుడు, నందేవుడు, దేవరక్షితుడు అనువారు. కుమార్తెలు ఏడుగురు. అతడు వారిని వసుదేవునికిచ్చి పెండ్లిచేసెను. వారు దేవకి, శాంతిదేవ, సుదేవ, దేవరక్షిత, వృకదేవి, ఉపదేవి, సునామ్నిని అనువారు. ఉగ్రసేనుని కొడుకులు తొమ్మండ్రు. కంసుడు, న్యగ్రోధుడు, సునాముడు, కంకుడు, సుభూషణుడు, రాష్ట్రపాలుడు, సుతనువు, అనావృష్టి, పుష్టిమంతుడు అనువారు. వారి చెల్లెండ్రు అయిదుగురు. కంస, కంసవతీ, సుతనువు, రాష్ట్రపాలి, కంక అనువారు. ఇది కుకుర వంశీయుడైన ఉగ్రసేనుని అతడి సంతతితోగూడిన వర్ణన. ఎవరు మిక్కిలి తేజశ్శాలురైన కుకురుల వంశమునువిని ధారణ చేయునో అతడు వంశాభివృద్ధినంది సుఖించును. (15)

స్యమంతక ప్రత్యానయనము

సూతుడు ఇట్లు అనియె –

భజమానుని సుతులు రథముఖ్యుడు, విదూరథుడు అనువారు విదూరథుని కుమారుడు వీరుడగు రాజాధిదేవుడు. వానికి దత్త, అతిదత్త, శోణాశ్వ, శ్వేతవాహన, శమి, దండశర్మ, దంతశత్రు, శత్రుజిత్తులు అనువారు సుతులు. శ్రవణ శ్రవిష్ఠ అను కుమార్తెలు కలిగిరి.

శమి కుమారుడు ప్రతిక్షత్రుడు, వానికి స్వయంభోజుడు, వానికి భదికుడు కల్గిరి. వాని కుమారులు భీమ పరాక్రమములు. వారిలో కృతవర్మ జ్యేష్ఠుడు. శతధన్వుడు మధ్యముడు. దేవాంతకుడు, నరాంతుడు, భిషక్కు పైతరుణుడు, సుదాంతుడు, అతిదాంతుడు, నికాశ్యుడు, కామదంభకుడు అనువారు కలిగిరి. దేవాంతకుని పుత్రుడు విద్వాంసుడగు కంబల బర్హిషుడు. వాని కొడుకులు అసమౌజుడు నాసమేజుడు అనువారు. పుత్ర సంతతిలేని అసమౌజనునికి సందఘ్రుడు, సుచారువు, కృష్ణుడు అను కుమారులను అంధకుడు ఇచ్చెను. వారు అంధకులను పేరందిరి.గాంధారి మాద్రి కోష్టునియొక్క భార్యలు. గాంధారి తనయుడు మహాబలశాలి యగు అనమిత్రుడు. మాద్రి తనయుడు యుధాజిత్తు దేవమీఢుడు ఇతడు శత్రువులకు గూడ మిత్రుడు. శత్రుజేతయగు అనమిత్రుని కొడుకు నిఘ్నుడు. వాని కొడుకులు ఇద్దరు. ప్రసేనుడు సత్రాజిత్తు, వీరు శత్రుసేనలను జయించినవారు.

సత్రాజిత్తు ప్రసేనుడు ద్వారవతిలో నుండెను. శ్యమంతకమను దివ్యమణిని సూర్యోపాసనచేసి సూర్యునినుండి పొందెను. అతనికి సూర్యుడు ప్రాణ సమానుడైన మిత్రుడు. అతడొక నాడు వేకువజామున రథమెక్కి ఒక జలాశయమునకేగి స్నానముచేసి సూర్యోపస్థానము చేయుచుండగా సూర్య భగవానుడు ఎదుట స్పష్టమైన మూర్తితో తేజోమండల ఆకారముతో సాక్షాత్కరించెను. రాజు ఆయనను చూచి ఇట్లనెను. "గగనము నందు నిత్యము నిన్నెట్లు చూచుచున్నానో అట్లే తేజోమండలాకారమున ఇపుడు ఎదుట చూచుచున్నాను. జ్యోతిస్సులకెల్ల అధిపతివి నీవు. నీతో ఇట్లు చెలిమి నొందిన నాకు నీవలన గలుగు విశేషమేమి?" అని అడుగగా,

దీనిని విని ఇనుడు తన కంఠమునుండి తీసి స్యమంతకమణిని ఏకాంతమున నుంచెను. అంతట భానుని సాకారముగ ఆ రాజప్పుడు దర్శించెను. మఱియు అతనితో ముహూర్తకాలము సంప్రీతితో ప్రసంగించెను. అటుపై భాస్కరుడు బయలుదేరబోవు సమయమున ఆ తేడు ప్రభూ! ఏ రత్నము దాల్చి నీవు లోకములన్నిటిని ప్రకాశింప జేయు చున్నావో ఆ మణిరత్నమును నాకు దయచేయుమని కోరెను. సూర్యుడును అమ్మణిని ఆ రాజశిఖామణికి ఇచ్చెను. ఆ మణిని ధరించి సత్రాజిత్తు రాజధానిలో ప్రవేశించెను. ఆ పురజనులు అంతట ఇదుగో సూర్యుడు అవనికిదిగి వచ్చుచున్నాడని ఆ రాజును చూచి పరుగిడిరి. అట్లు రాజు పట్టణ మంతటిని ఆశ్చర్యమునముంచి అంతఃపురమునకు పోయెను. ఆ రత్నమును ఇక్కడ తన తమ్ముడు ప్రసేనజిత్తునకు ప్రీతితో ఇచ్చెను. ఆ మణి యావృష్ణ్యంధకుల ఇంట బంగారమును వర్షించుచుండెను. అది వచ్చిన తరువాత మేఘుడు సకాలమున వర్షించుచుండెను. అందెందును వ్యాధిభయములు లేకపోయెను. గోవిందుడు

ఆ ప్రసేనుని మణిరత్నమును దీసికొననెంచెను. కాని అతడు శక్తుడయ్యు దానిని గైకొనలేదు. దానిని ధరించి ఒకప్పుడు ప్రసేనుడు వేటకుపోయి ఆ మణినిచూచి బెదరి మీదపడిన సింహము నోటబడి మృతిచెందెను. అయ్యెడ ఆప్రసేనుని చంపి పారిపోవు మృగరాజు (సింహము)ను ఋక్షరాజు (ఎలుగుబంటి) సంహరించి ఆ రత్న రాజమునుగొని తనగుహ జొచ్చెను. వృష్ణ్యంధకులయ్యెడ ప్రసేనుడు హతుడవుటవిని, అంతకు ముందు ఆ మణిని ఇమ్మని కోరియున్నందున ఇది కృష్ణుని పనియేమోయని శంకించిరి. అట్లు తనను అనుమానించుట ఎరిగి ఆపని తాను చేయకున్నను వచ్చిన అపవాదు తొలగించుకొన నిశ్చయించుకొని హరి ఆ మణిని వెనుకకు తెచ్చెనని ప్రతినచేసి అరణ్యమునకు వెళ్ళెను.

ప్రసేనుడు వేటాడిన తావునందు అతని అడుగుజాడలను, ఆప్తజనము వలన విని గుర్తించి, ఆజాడనుబట్టి పోయిపోయి వింధ్యపర్వతమున వెదకి వెదకి, అలసి సొలసి తుదకు ఋక్షవంతమను గిరియందు గుఱ్ఱముతోగూడ కూల్చబడిన ప్రసేనుని చూచెను. కాని మణిని మాత్రము కానడయ్యెను. ప్రసేనుని శరీరమునకు దగ్గర భల్లూకముచే హతమై పడి యున్న సింహమును చూచెను. అడుగుల గుర్తులనుబట్టి ఆచంపినది భల్లూకమని మాత్రము గ్రహించెను. అట్లే పయనించి అల్లంతలో ఒక గుహను చూచెను. ఆ ఎలుగుబంటి బిలమందు (కొండగుహ) నుంచి ఒక సుందరి ఏడుపు వినవచ్చెను. అచ్చట ఒకదాది జాంబవంతుని తనయుని ఒక బాలుని ఎత్తుకొని స్యమంతకమణిని చూపుచు, ఆడించుచున్న దానిని చూచెను.

ఆ దాది పిల్లవానిని ఓదార్చుచు –

సింహః ప్రశేన మవధీత్ సింహో జాంబవతా హతః ।
సుకుమారక! మారోదీ స్తవ హ్యేష స్యమంతకః ॥

సింహము ప్రసేనుని చంపినది. ఆ సింగము జాంబవంతునిచే చచ్చినది. ఓ సుకుమారుడా! ఏడువకు ఈ స్యమంతక మణి నీదే సుమా! అని దాది అనుచున్న మాటలను విని ఆ మాటలు పలికిన వ్యక్తిని బట్టి హరి వెనువెంటనే బిలమునందు ప్రవేశించెను. కృష్ణ భగవానుడు బిలద్వారమందు బలరామునితోగూడ యాదవులను ఇక్కడ ఉండుడని నిలిపి శార్ఙ ధనుస్సునుపూని, లోనికిపోయి జాంబవంతుని చూచెను. ఆ గుహ యందు వాసుదేవుడు అతనితో యుద్ధము చేయుచు ఇరువదియొక్క రోజులు బాహు యుద్ధమున గడిపెను.

కృష్ణుడు బిలమందు ప్రవేశించిన తరువాత అతని జాడ తెలియక బలరామాదులు ద్వారవతికేగి కృష్ణుడందు హతుడయ్యెనని తెలిపిరి. వాసుదేవుడో, జాంబవంతుని గెలిచి,

ఆ ఋక్షాధిపతి (ఎలుగుబంటుల రాజు) యొక్క తనయను జాంబవతినిపొంది తన అపవాదు పోవ ఎలుగుల రాజును అనునయించి స్యమంతక మణినిగైకొని ఉపాయమున, ఆ గుహనుండి వెలువడి ఆవలకేగెను. ఆయనతో విధేయులయిన పరివారము వెన్నంటి వచ్చిరి. ఇట్లు మణినిగొనివచ్చి, ఆత్మవిశోధనము చేసికొని సర్వసాత్వత జనసమావేశ మందు దానిని ఆతడు సత్రాజిత్తునకు ఒసంగెను. అరిజన సంహారియైన హరి లేనిపోని అపవాదునకు గురియై ఈ విధముగా తనపై వచ్చిన ఆ అపవాదును పోగొట్టుకొనెను.

సత్రాజిత్తు భార్యలు పదిమంది. వారియందు నూర్గురు కుమారులు ఉదయించిరి. అందు ప్రఖ్యాతిగలవారు ముగ్గురు. అందు అగ్రజుడు, భంగకారుడనువాడు, వాని తరువాతి వారు. వాతపతి, వసుమేధుడు, కూతురులు ముగ్గురు. వారిలో సత్యభామ ఉత్తమ (పెద్దదన్న మాట) రెండవది ఉత్తమ వ్రతాచారపరాయణ యగు వ్రతిని, మూడవ కుమార్తె ప్రస్వాపిని అనునది. వారిని సత్రాజిత్తు కృష్ణునకు ఇచ్చెను. భంగకారి కొడుకులు ఇద్దరు. కీర్తిమంతులు, రూపవంతులు సభాక్షుడు, నావేయుడనువారు. (క్రోష్టు భార్యయగు) మాద్రి యందు గల్గినవాడు వృష్ణి పుత్రుడు, యుధాజిత్తు. వృష్ణి కుమారులు శ్వఫల్కుడు, చిత్రకుడు అని ఇద్దరు. శ్వఫల్కుడు, కాశిరాజ తనయను పెండ్లాడెను. ఆమె పేరు గాందిని. ఆమె తండ్రి ఆమెకు గోవులను ఎప్పుడు ఇచ్చెడువాడు (అందుచే ఆపేరు ప్రఖ్యాతికి వచ్చినది) ఆమె యందు పండితుడు, అతిథి ప్రియుడు మహావీరుడు బహుదక్షిణ ఇచ్చువాడు మహానుభావుడగు అక్రూరుడు ఉదయించెను. శ్వఫల్కునికి అక్రూరుడేగాక ఉపమద్గువు, మద్గువు, మదురుడు, అరిమర్దనుడు, ఆరిక్షేపుడు, ఉపేక్షుడు, అరిమేజయుడు, ధర్మపరుడైన ధర్ముడు, గృధ్రభోజుడు, అంధకుడు, ఆవాహుడు, ప్రతివాహుడు అనువారును సుందరియగు వసుంధర అను కుమార్తె కలిగిరి. వసుంధర విశ్రుతాశ్వుని వివాహ మాడి పట్టమహిషి అయినది. అక్రూరునికి ఉగ్రసేనయందు కులనందనులైన నందనులు ఇద్దరు కల్గిరి. వసుదేవుడు, ఉపదేవుడు అనువారు. దేవవర్చస్కులు. చిత్రకుని కుమారులు పృథువు, విసృథువు, అశ్వ గ్రీవుడు, అశ్వబాహుడు, సుపార్శ్వకుడు, గవేషణుడు, అరిష్టనేమి, ధర్ముడు, ధర్మభృత్తు, సుబా హువు, బహుబాహువు అను పుత్రులు. శ్రవిష్ఠ, శ్రవణ అను కూతుళ్లు కలిగిరి. కృష్ణుని ఈ అప వాద వృత్తాంతము విన్నవానికి ఎన్నడును ఆపదల స్పర్శ ఉండదు. (16)

శ్యమంతకోపాఖ్యానము

సూతుడు ఇట్లు అనెను – శ్రీకృష్ణుడు సత్రాజిత్తునకు మణిరత్నము నొసగగా, దానిని అక్రువు (అక్రూరుడు), భోజవంశీయుడగు శతధన్వునిచే హరింపజేసెను. అక్రూరుడు

అవకాశము కనిపెట్టి సత్యభామను, స్యమంతకమును అడుగుచునే ఉండెను. శతధన్వుడు సత్రాజిత్తును సంహరించి రాత్రివేళ మణినిగొనివచ్చి అక్రూరున కొసగెను. అక్రూరుడు దానిని తీసుకొని ఈ అంశమెవ్వరికి ఎన్నడును తెలుపనని వానిచే ప్రమాణము చేయించెను.

తండ్రి హతుడగుటకు తపించి సత్యభామ రథమెక్కి వారణావతమునకేగెను. అక్కడ ఈ వృత్తాంతమును, భోజ వంశీయుడగు శతధన్వుడు చేసిన దుష్క్రియను భర్తకుతెలిపి కంటనీరు గ్రుక్కు కొనెను, లక్కయింట దగ్ధులైన పాండవులకు ఉదక క్రియ చేసి కృష్ణుడు సాత్యకిని వారియొక్క ఉత్తర క్రియయందు నియోగించి వెంటనే ద్వారక కేతెంచి బలరామునితో ఇట్లనెను.

సింహము ప్రసేనుని చంపినది, శతధ్వనుడు సత్రాజిత్తును చంపెను, స్యమంతకము నాకు చెందవలసి ఉన్నది. కావున త్వరగా రథమెక్కుము. ఆ భోజుని కూల్చి ఆమణిని తెచ్చెదము, ఆ స్యమంతకము మనది కాగలదనెను.

అని చెప్పి సూతుడు ఇట్లు అనెను –

శతధ్వనుడు కృష్ణునితో పోరుచు అక్రూరుడు ఎక్కడున్నాడని చూచుచుండెను. అక్రూరుడు శక్తుడయ్యు, శాపభీతిచే యుద్ధమున తోడ్పడడయ్యెను. అప్పుడు భోజుడు భయార్తుడై వెనుదిరుగ నిశ్చయించెను. భోజుని స్వాధీనమున 'హృదయ' అను గుఱ్ఱము నూరు యోజనములు మించి దూక కలిగినది కలదు. దానితోనే కృష్ణునితో తలపడెను. నూరు యోజనముల మేఱ అరిగి వేగముడుగుటయు, తన రథవేగము హెచ్చుటయు చూచి కృష్ణుడు శతధన్వుని నొప్పించెను. ఆ గుఱ్ఱము డిల్లవడి తుదకు ప్రాణములు గోల్పోవుట చూచి కృష్ణుడు బలరామునితో ఇట్లనియె.

"ఓ శూరాగ్రేసర! నీవు ఇక్కడే ఉండుము. గుఱ్ఱము నష్టమైనది. పాదచారినై వెళ్ళి మణిరత్నమైన స్యమంతకము హరించగలను."

అటు పిమ్మట హరి పాదచారియై శతధన్వుని పైకేగి మిథిలా ప్రాంతమున వానిని సంహరించెను. కాని వాని దగ్గర స్యమంతకము కానరాదయ్యెను. మరలివచ్చిన కృష్ణుని చూచి హలాయుధుడగు బలరాముడు మణిని ఇమ్మని అడిగెను. కృష్ణుడు లేదని బదులు చెప్పెను. అంతట బలరాముడు రోషముగొని ఛీ! ఛీ! అని కేకలు వేసి కృష్ణునితో

"తమ్ముడవని సైరించితిని. నీకు స్వస్తి యగుగాక. నాకు ద్వారకతోగాని, నీతోగాని, వృష్ణులతోగాని పనిలేదు, నేను వెళ్ళుచున్నాను" అని పలికెను.

బలరాముడు మిథిల ప్రవేశించెను. మిథిలాధిపతి సత్కారమంది ఇష్టోపభోగియై అక్కడనే ఉండెను. ఈ సమయములోనే బుద్ధిశాలియగు బభ్రువు (అక్రూరుడు) పెక్కు విధములగు క్రతువుల ఆచరించెను. గాందీపుత్రుడగు ఆ అక్రూరుడు దీక్షామయమైన రక్షా కవచము తొడిగికొని స్యమంతకము కొఱకు యజ్ఞము చేసెను. అరువదేండ్లు వివిధ రత్న ధనరాసులను అధ్వరములందు వినియోగించెను. 'అక్రూర యజ్ఞము' అను పేర అవి ప్రఖ్యాతి పొందినది. ఆ యజ్ఞములు విపులాన్నదాన దక్షిణలు సర్వకామ ప్రదములునై విలసిల్లెను. అంతట దుర్యోధనుడు మిథిలకు వెళ్ళి బలరామునివద్ద గదాయుద్ధ శిక్షణమును పొందెను.

మహారథులగు వృష్ణ్యంధకులతో పోయి కృష్ణుడు బలరాముని ద్వారకకు మరల తెచ్చెను. బంధువులతోగూడ నిద్రలో ఉన్న సత్రాజిత్తును జంపిన అక్రూరుడు అంధకులతో కలసి మరల ద్వారకకు వచ్చెను. అప్పుడు కృష్ణుడు జ్ఞాతులతో బెడియునను భయమువలన వానిని ఉపేక్షించెను. అప్పుడు అక్రూరుడు మిథిలకుపోగా ఇంద్రుడు వర్షించక పోయెను. అనావృష్టితో రాజ్యము అనేక విధముల క్షీణించిపోయెను. అందువలన కుకురాంధకులు అక్రూరుని ప్రసన్నుని జేసికొని మరలద్వారకకు కొనివచ్చిరి. అంత దానపతియగు అతడు ద్వారకకు రాగానే జలనిధి తీరమున వాసవుడు బాగుగా వర్షించెను. అక్రూరుడు వాసుదేవునికి ప్రీతికలుగునట్లు శీలవతి అగు తన చెల్లెలిని ఇచ్చెను. అంతట కృష్ణుడు యోగ శక్తిచే స్యమంతకమణి అక్రూరుని దగ్గర ఉన్నదని గమనించి సభామధ్యమున అక్రూరునితో

"నీ చేజిక్కిన మణిని నాకు ఇమ్ము. నా మర్యాద కాపాడుము. అఱువది యేండ్లు నాకీమణి నిమిత్తముగ రోషము గల్గినది, కాలమెంతో గడచిపోయినది" అని పలికెను.

అంతట అక్రూరుడు కృష్ణుని పలుకులను బట్టి సర్వ యాదవ సమాజమునందు మణిని గొనివచ్చి బుద్ధిమంతుడు కావున మనస్సు నొచ్చకుండ దానిని హరికిచ్చెను. అరిభీకరుడైన కృష్ణుడు బభ్రుహస్తమునుండి సూటిగ లభించిన ఆమణిని చేకొని హర్షముగొని తిరిగి దానిని అక్రూరునకే ఇచ్చెను. గాందినీ పుత్రుడగు అక్రూరుడు కృష్ణుని హస్తమునుండి లభించిన ఆ స్యమంతక మణిరత్నమును దాల్చి సూర్యునివలె తేజరిల్లెను. (17)

భువనకోశ ద్వీప వర్ణనము

లోమహర్షణుడు ఇంకను ఆ మహర్షులతో

మునులారా! ఇది నూతేండ్లు చెప్పినను తీరదు, సంక్షేపించి తెల్పెదను వినుడు. జంబూ + ప్లక్ష + శాల్మల + కుశ + క్రౌంచ + శాక + పుష్కరములు అనునవి సప్త

ద్వీపములు. ఇవి లవణ=ఉప్పు, ఇక్షు=చెఅకురసము, సురా=కల్లు, సర్పిఃనెయ్యి, దధి=పెరుగు, దుగ్ధ = పాలు, జల= నీరునుగల ఏడు సముద్రములచే చుట్టుకొనబడినవి. వీని నడుమ జంబూద్వీపమున్నది. దానికి నడుమ 'మేరువు' అను బంగారు కొండ ఉన్నది. అది ఎనుబదినాల్గు యోజనములయెత్తు, పదునారువేల యోజనములలోతు, ముప్పది రెండు వేల యోజనముల వైశాల్యముగల ఉపరిభాగము కలిగి ఉన్నది. మూలము పదునాఱు వేల యోజనముల విస్తారమై ఉన్నది. భూమి అను పద్మమునకు అది నడిమి కర్ణిక (దుద్దు)వలె ఉన్నది.

హిమవంతము-హేమకూటము నిషధము అనునవి దానికి దక్షిణమునను, నీలము, శ్వేతము, శృంగి అనునవి ఉత్తరమునను వర్ష పర్వతములు ఈ రెంటి నడుమ ఉన్నవి. అవి లక్ష యోజన ప్రమాణములు, తక్కినవి తొంబదివేల యోజనముల ప్రమాణము గలవి. రెండువేల యోజనముల ఎత్తు, అన్ని యోజనముల వెడల్పు కలవి.

భారత, కింపురుష, హరివర్షములు మేరువునకు దక్షిణమున ఉన్నవి. రమ్యకము ఉత్తరమందున్నది. అది కనకమయము. ఉత్తర కురుభూములక్కడనే ఉన్నవి. ఈవర్షము లొక్కొక్కటి భారతవర్షమువలె తొమ్మిదివేల యోజనముల వైశాల్యము గలవి.

ఇలావృతము నడుమ బంగారు మేరుగిరి కలదు. మేరువు నలుదిశల ఇలావృతము తొమ్మిదివేల యోజనముల వైశాల్యము కలది. ఇందు నాల్గు పర్వతములు మేరువునకు విష్కంభములు (గడియలు). పదివేల యోజనముల పొడవుగలవి. తూర్పున మందర పర్వతము, దక్షిణమున గంధమాదనము, పడమట విపులము, ఉత్తరమున సుపార్శ్వము అనునవి గలవు. వీనియందు క్రమముగ కదంబము (కడిమి), జంబువు (నేరేడు), పిప్పలము (రావి), వటము (మఱ్ఱి) అను చెట్లు పదునొకండు వందల యోజనముల విరివి గల వృక్షములు, 'గిరికేతువులు' (పర్వతాగ్ర పతాకములు) గలవు. జంబూ వృక్ష సమృద్ధినిబట్టి అది జంబూ ద్వీపము అనుపేర ప్రసిద్ధిని పొందెను.

ఆ నేరేడు పండ్లు మహాగజ ప్రమాణ రూపమున రాలుచుండునట. అవి ప్రిదిలి కారిన రసము ఏరైపారి జంబూనది అని పిలువబడుచున్నది. ఆ జంబూరసము త్రాగిన వారు కష్టము, దుర్వాసన, ముదిమి, ఇంద్రియక్షయము ఎఱుగరు. ఆ జంబూనది ఒడ్డున కల మన్ను ఆ రసముచే తడిసి సుఖవాయువున ఆరి జాంబూనదమను బంగారము ఏర్పడును. అది సిద్ధభూషణము అనగా సిద్ధులు ధరించునట్టిదన్నమాట.

మేరువునకు తూర్పుదెస భద్రాశ్వము. పడమట కేతుమూలము, అనురెండు వర్షములున్నవి. వానికి నడుమ ఇలావృతము. తూర్పున చైత్రరథము, దక్షిణమున గంధమాదనము,

పడమట వైభ్రాజము, ఉత్తరమున నందనవనము ఉన్నవి. అరుణోదయము, మహాభద్రము, అసితోదము, మానసము అను సరస్సులు నాల్గు దేవభోగ్యములుగలవు.

శాంతవంతము, చక్రకుంజము, కురరీ, మాల్యవంతము, వైకంకము అనునవి మేరువుయొక్క కేసరపర్వతములు. త్రికూటము, శిశిరము,పతంగము, రుచకము, నిషధము, మొదలైనవి దాని దక్షిణదిశలోగల మేరువుయొక్క కేసర పర్వతములు, శిఖివాసము, వైదూర్యము, కపిలము, గంధమాదనము, జానుధి మొదలైనవి మేరు పశ్చిమకేసరగిరులు. అవి మేరువునంటి జఠరాది స్థానములందు ఉన్నవి. శంఖకూటము, ఋషభము, హంసము, నాగము, కాలంజరము, మొదలగునవి మేరూత్తర దిశ కేసర శైలములు. మేరువుమీద బ్రహ్మయొక్క నగరము పదునాలుగువేల యోజనముల వైశాల్యముగలది. అందు ఎనిమిది మూలలందు అష్టదిక్పాలుర పురములుకలదు. విష్ణు పాదము నుండి వెడలి చంద్రమండలమున ప్రవహించుచు ఆకాశగంగ బ్రహ్మపురి నలు వైపుల పడుచున్నది. అట్లుపడి, నాల్గుదెసల నాల్గుపాయలైనది. సీత, అలకనంద, చక్షువు, భద్ర అనునవి ఆ నాల్గుపాయలు. సీత పూర్వ శైలమునుండి మరియొక శైలమున అంతరిక్ష సంచారము చేయును. అవ్వల భద్రాశ్వ వర్ష పర్వతము మీదుగా సముద్రుని పొందును. అలకనంద దక్షిణదిశగా భారత వర్షముంజేరి యేడు భాగములయి సముద్రము జొచ్చును. చక్షువు పడమటి గిరులన్నియు దాటి పడమటగల కేతుమాల వర్షమునందు ప్రవేశించి సముద్రమున కలియును. భద్ర ఉత్తరగిరులనుదాటి ఉత్తర కురుభూములందు ప్రవహించి ఉత్తర సముద్రమున చేరును.

నీల పర్వతమునుండి నిషధ పర్వతమువరకు పొడవయినదై మాల్యవంతము గంధమాదనమునుగలవు. వానినడిమి భాగమున తామర పువ్వులోని దుద్దువలె మేరువు ఉన్నది. మర్యాదా పర్వతమునకు ఆవల లోకాలోకమను పర్వతమునకు భారతములు, కేతుమాలములు, భద్రాశ్వములు, కురుభూములును రేకులట్లున్నవి. జఠరము దేవకూటము అనునవి రెండు మర్యాదా పర్వతములు. అవి దక్షిణోత్తరములందు నీలపర్వతమునుండి నిషధ పర్వతముదాక వ్యాపించియున్నవి. గంధమాదన కైలాస పర్వతములు తూర్పు పడమరలందు ఎనుబది యోజనముల పొడవుగలవై నీలపర్వతమునుండి నిషధ పర్వతము వరకు వ్యాపించి సముద్రములో చొచ్చియున్నవి. నిషధము, పారియాత్రము అనునవి రెండును మర్యాదా పర్వతములు. ఆరెండు దక్షిణోత్తరములందు నీల పర్వతము నుండి నిషధ పర్వతము వరకు దైర్ఘ్యముగలవై మేరు పర్వతమునకు పశ్చిమ భాగమునందు యథాపూర్వముగ నున్నవి. త్రిశృంగము, జారుధియు నుత్తరదిశ వర్షపర్వతములు. తూర్పు,

పడమరగా వ్యాపించి సముద్ర మధ్యమున ఉన్నవి. మర్యాదాగిరులు నాచే చెప్పబడినవి. వీనిలో రెండు రెండు పర్వతములు మేరు పర్వతమునకు జఠర (గర్భ) భాగములుగా నలుదెసల ఉన్నవి. మేరువు నలుదెసలగల కేసర పర్వతములు చెప్పబడినవి. అవి చల్లని ఆద్యంతములు గలవి. వాని లోపలగల లోయలు మనోహరములై ఉండును. వానియందు రమ్యములైన పురములు వనములుగలవు. లక్ష్మి, విష్ణువు, అగ్ని, సూర్యుడు, ఇంద్రుడు మొదలగు దేవతల ఆలయ శ్రేష్ఠములు నరకిన్నరులచే సేవితములై ఉండును. రమ్యములైన ఆ పర్వత ద్రోణు(లోయ)లందు రేయింబవళ్ళు గంధర్వ యక్ష రాక్షస దైత్య దానవులు క్రీడించుచుందురు. ఇవి భౌమ స్వర్గములు. అనగా భూమి మీద ఉన్న స్వర్గ భూములు. ధర్మనిష్ఠులకు నివాసములు. ఇందెన్ని జన్మములకైనను పాపాత్ములు చేరజాలరు.

భద్రాశ్వ పర్వతమందు విష్ణుభగవానుడు హయగ్రీవ స్వరూపుడై ఉండును. కేతుమాల మందు వరాహమూర్తి, భారతమందు కూర్మమూర్తి, కురుభూములందు సనాతను డగు గోవిందుడు మత్స్యమూర్తియునై యుండును. సర్వత్ర సర్వస్వరూపుడై ఆ సర్వేశ్వరుడు హరి విశ్వరూపుడై ఉండును. సర్వాత్మకుడైన ఆ విష్ణువు అందరికి ఆధారభూతుడై ఉండును.

బ్రాహ్మణులారా! కింపురుషాది వర్షములు ఎనిమిదింటియందుగల జీవులకు శోకము, ఆయాసము, ఉద్వేగము, ఆకలి, దప్పిక, భయము మొదలైనవి ఉండవు. అచటి ప్రజలు స్వస్థులు, నిరాతంకులు (అడ్డులేనివారు) ఏ దుఃఖస్పర్శయు లేనివారుగను పది, పండ్రెండు వేల యేండ్లు ఆయువు గలవారుగ ఉందురు. ఆ వర్షములందు ఇతరములగు భూమి యందలి బాధలు కృత, త్రేతాదియుగ విభాగములేదు. వానియందు అన్నిట ఏడేసి కుల పర్వతములు ఉన్నవి. అందుండి వందలకొలది నదులు పుట్టినవి. (18)

జంబూ ద్వీప వర్ణనము

సముద్రమునకు ఉత్తరమున హిమాలయమునకు దక్షిణమున భారతవర్షము గలదు. అందలి సంతతి 'భారతి' అనబడును. ఇది తొమ్మిదివేల యోజనముల వైశాల్యము గలది. కర్మభూమియని దీనికి పేరు. కోరినవారికి స్వర్గము మోక్షమును కూడ ఇందే ఉన్నవి.

ఇందు మహేంద్రము, మలయము, సహ్యము, శుక్తిమంతము, ఋక్షము, వింధ్యము, పారియాత్రములు అను సప్తకుల పర్వతములున్నవి. భారత వర్షము నుండియే స్వర్గ మోక్షములను జీవులు పొందుదురు. పశు పక్ష్యాది జన్మములను నరకమునుగూడ ఇట నుండియే పొందుదురు. ఆవాంతర కర్మఫలము స్వర్గము పర్యవసానము నందు అత్యంతిక

ఫలమైన మోక్షముగూడ ఇటనుండియే మానవుడు పొందును. ఈ భూమండలమందు ఇక్క డనే కర్మానుష్ఠానము విధింపబడినది. అందుచేతనే దీనికి కర్మ భూమి అను పేరు సార్థకము.

భారతవర్షమున తొమ్మిది ద్వీప విభాగములున్నవి. ఇంద్రద్వీపము, కశేరువు (కశేరు మంతమని కూడ అందురు) తామ్రపర్ణము, గభస్తిమంతము, నాగద్వీపము, సౌమ్యము, గాంధర్వము, వారుణము. అందు ఈ భారత ఖండము తొమ్మిదవది. సముద్ర సంవృతము ఇది దక్షిణ దిశనుండి ఉత్తరదిక్కుకు వేయి యోజనములు.

తూర్పున కిరాతులు, పడమట యవనులు, నడుమ బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు ఉందురు. యజన, యాజనములు, యుద్ధము, వాణిజ్యము, కృష్యాదులు వృత్తులు క్రమముగా వీరికి విహితములు.

హిమవత్పర్వత ప్రత్యంత పర్వతము నుండి శతద్రు (సట్‌లజ్) చంద్రభాగ, వేదము, స్మృతి మొదలయిన నదులు ప్రవహించుచున్నవి. నర్మద, సురస మొదలయినవి వింధ్యగిరి నుండి వెడలుచున్నవి. తాపి, పయోష్ణి, నిర్వింధ్య, కావేరి మొదలయినవి ఋక్షపర్వత పాదమందు జనించినవి. గోదావరి, భీమరథి, కృష్ణవేణి మొదలగునవి సహ్యగిరి పాద మందు పుట్టినవి. కృతమాలా, తామ్రపర్ణీ ప్రముఖములు మలయాద్రి సంభవములు. త్రిసాంధ్య, ఋషికుల్య మొదలయినవి మహేంద్రగిరి జన్యములు. ఋషికుల్యా, కుమారి మొదలైనవి శుక్తిమత్పర్వత పాదమందు పుట్టినవి. వీని ఉపనదులు వేలకొలదిగా కలవు.

వానియందు కురుపాంచాల దేశ ప్రజ నివసించుచున్నది. తూర్పున కామరూప దేశవాసులు, కళింగులు మగధులు ఉన్నారు. దాక్షిణాత్యులు దక్షిణమునందు ఉందువారు. పశ్చిమమున సౌరాష్ట్రులు, శూద్రులు, అభీరులు-అర్బుదులు, మారుకులు, మాళవులు పారియాత్ర నివాసులు, మద్రులు, రాములు, అంబష్ఠులు, పారసీకాదులు వీరందరు ఈ యీనదుల జలములను త్రాగుదురు. ఈ దేశములు కలిసిమెలసి ఆనందభరితులై పుష్టి వంతులు అయి జనులతో నిండియుండును.

కృత, త్రేతా, ద్వాపర, కలియుగ విభాగమిక్కడనే కలదు. అన్యత్రలేదు. ఇందు యతులు తపస్సుచేయుదురు. యజ్వలు హోమములు (యాగములు) చేయుదురు. పర లోకము కోరి ఇచట దానము లాచరింపబడును.

జంబూద్వీపమందు యజ్ఞపురుషుడు ఉపాసింపబడును. విష్ణువు యజ్ఞరూపుడుగ యజ్ఞేశ్వరుడుగ ఇచ్చట ఉపాసింపబడును. ఇతరద్వీపములందు మఱియొక పేరున

కొల్వబడును. ఈ జంబూద్వీపమున భారతవర్షము శ్రేష్ఠము. ఇది కర్మభూమి. తక్కినవి భోగభూములు, బహుజన్మ ఫలభోగముగ ఇందెంతోకాలమునకు మనుష్య జన్మము కల్గును.

స్వర్గాపవర్గము లొసగు భారతభూమియందు మనుష్యులై, వారిలో పురుషులై పుట్టి, అట్టి కర్మభూమి యందు జన్మము పొంది, ఫలాభిసంధిలేక సర్వ కర్మ ఫలములను పరమేశ్వరార్పణమని, పరమాత్మయగు విష్ణువునందు అర్పించి, పాపదూరులై ఆ పరబ్రహ్మ మందు లీనమగువారు ధన్యులు. అనగా పరమేశ్వరార్పణముగ ఆనాచరించిన స్వర్గ ప్రదమగు కర్మ లీనమైపోయిన తర్వాత దేహబంధమును మఱియెందు పొందుదురో ఎఱుగము. ఇంద్రియవంతులై భారత వర్షమున పుట్టినవారు ధన్యులు అని దేవతలు ఈ భారతభూమిని గూర్చి గానము చేయుచుందురు. తొమ్మిది వర్షములుగల్గి లక్ష యోజనముల విరివిగల ఈ జంబూద్వీపమును గూర్చి సంక్షేపముగా దెల్పితిని. ఈ ద్వీపమును ఆవరించి లక్ష యోజనములు విస్తారముగల క్షీరసముద్రము వలయాకారముగ నున్నది.(19)

ప్లక్ష ద్వీప వర్ణనము

పాల సముద్రముచే జంబూద్వీపము చుట్టబడినట్లు ప్లక్షద్వీపము ఉప్పు సముద్రముచే పరివృతమై ఉన్నది. జంబూద్వీప విస్తృతి లక్ష యోజనములు, దానికి రెట్టింపు ప్లక్ష ద్వీపము. ప్లక్ష ద్వీపేశ్వరుడు మేధాతిథి. వాని కుమారులు ఏడుగురు. శాంతమయుడు (జ్యేష్ఠుడు), శిశిరుడు, సుఖోదయుడు, ఆనందుడు, శివుడు, క్షేమకుడు, ధ్రువుడు అనువారు వారీ ద్వీపమును ఏలినవారు. వారిపేర మర్యాదా (హద్దు) కౌరవ పర్వతములు అనగా సరిహద్దులుగా గల పర్వతములు ఏడుగలవు. అట్లే వర్షపర్వతములు మఱి ఏడు గలవు. మునులారా! వాని పేర్లు వినుడు. గోమోదము, చంద్రము, నరదము, దుందుభి, సోమకము, సుమనస్సు, వైభ్రాజము అనునవి ఆ ఏడు.

పుణ్యాత్ములారా! రమ్యములగు ఈ వర్ష పర్వతములందును, వర్షములందును ప్రజలు దేవ గంధర్వులతో గూడి వసింతురు. అందలి దేశములు పవిత్రములు. వీర్యవంతములు. అందు జనులు మృతి నందరు. ఆధివ్యాధులు లేక సర్వకాలము సుఖముగా ఉందురు. అందు నదులుగూడ ఏడే. అవి సముద్ర గాములు. అనగా సముద్రము వైపు ప్రవహించి అందు కలియునట్టివి. వానిపేర్లు అనుతప్త, శిఖ, విప్రాశ, త్రిదివ, క్రము, అమృత, సుకృత అనునవి. వాని పేర్లను వినినంతనే పాపములు హరించును. ప్రధానములైన నదులు, పర్వతములు పేర్కొనబడినవి. చిన్నచిన్న నదులు పర్వతములు వేలకొలది గలవు. అచటి వారు ఎప్పుడును ఆ నదీ జలములనే త్రాగుచుందురు. కాని నదులు తగ్గవు పెరుగవు.

ఆ ప్రదేశములు ఏడింటియందును యుగ వ్యవస్థలేదు. ఎల్లప్పుడు త్రేతాయుగ సమముగనే కాలము నడచును. ప్లక్షద్వీపము మొదలు శాకద్వీపము వరకు జనులు అయిదు వేలేండ్లు ఆయువుగల్గి నిరోగులై ఉందురు, వర్ణాశ్రమ విభాగానుసారము అక్కడ ధర్మము నాల్గు విధములుగ ఉండును. అక్కడ వర్ణములు నాలుగు. వానిని మీకు చెప్పుచున్నాను వినుడు.

ఆర్యకులు, కురువులు, వివిశ్వులు, భావులు అనుపేర విప్ర క్షత్రియ వైశ్య శూద్రులు అను నాలుగు వర్ణముల వారుందురు.

జంబూ ద్వీపమున జంబువృక్షమున్నట్లు అంతపరిమాణముగల జువ్విచెట్టు ప్లక్ష ద్వీప మధ్యమందున్నది. అందుచే దానికాపేరుకల్గినది, అందు ఆర్యకాది వర్ణములవారిచే జగత్పర్తయు సర్వేశ్వరుడును సోమరూపియు అగు ఆహరి ఆరాధింపబడును, ప్లక్షద్వీప ప్రమాణముగల ఇక్షు (చెఱకురసము) సముద్రముచే ప్లక్ష ద్వీపమావరింపబడి యున్నది. మునులారా! ఇట్లు మీకు ప్లక్షద్వీపము సంగ్రహముగ వర్ణించితిని. ఇక నేను చెప్పబోవు శాల్మల ద్వీపమును గూర్చి తెలిసికొనుడు –

ఇక శాల్మల ద్వీపము – దీనికి వీరుడైన వపుష్మంతుడు అధీశ్వరుడు. వాని కుమారుల నామములతో శ్వేతము, హరితము, జీమూతము, రోహితము, వైద్యుతము, మానసము, సుప్రభము అను వర్షపర్వతములు ఏడును ప్రసిద్ధములు. శాల్మల ద్వీపము ఇక్షురస సముద్రముచే పరివేష్టితము. ఆ సముద్రము ఈ ద్వీపమునకు రెట్టింపు ప్రమాణము గలది. అక్కడ రత్నగర్భములైన సప్తకులాచలములు, సప్తనదులు గలవు. అందు కుముదము, ఉన్నతము, బలాహకము, ద్రోణము, కంకము, మహిషము, ककుద్మంతము అను పర్వతములు ఉన్నవి. ద్రోణగిరియందు మహౌషధులు ఉందును. ఇందలి నదులు : శ్రోణి, తోయ, విత్రుష్ణా, చంద్ర, శుక్ర, విమోచని, నివృత్తి అనునవి. అవి స్మరణ మాత్రాన పాపముల హరించును.

ఇందలి వర్షములు శ్వేతము, లోహితము, జీమూతము, హరితము, వైద్యుతము, మానసము, సుప్రభము అనునవి. ఇందు చాతుర్వర్ణ వ్యవస్థ యున్నది. కపిల=తేనెరంగు, అరుణ=ఎఱుపు, పీత=పసుపు, కృష్ణము=నలుపు అను రంగులు గల్గి క్రమముగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణముల వారిందు నివసింతురు. ఇచట యాగకర్తలకు ఉపాస్య దైవము విష్ణువు. యజ్ఞమందు వాయు స్వరూపునిగ ఆ దైవమును యజ్వలు సేవింతురు. అతి మనోహరమైన ఈ ద్వీపమందు దేవతలు సన్నిధిచేసి యుందురు. శాల్మల వృక్ష

ముండుటచే ఈ ద్వీపమునకు శాల్మల ద్వీపమని పేరు. కుశద్వీపము చుట్టును సురా సముద్రము ఉన్నది. అది శాల్మల ద్వీపమునకు రెట్టింపు విస్తారము గలది.

ఇందు రాజైన జ్యోతిష్మంతుని కుమారులు - ఉద్భిదుడు, వేణుమంతుడు, స్వైరథుడు, రంధనుడు, ధృతి, ప్రభాకరుడు, కపిలుడు అనువారి పేరులతో వర్షములు ఉన్నవి. ఇందు మనుజులతోబాటు దైత్య, దానవ, దేవ, గంధర్వ, యక్ష, కింపురుషులును వసింతురు. ఇక్కడ స్వధర్మానుష్ఠానపరులయిన బ్రాహ్మణాది చతుర్వర్ణ ప్రజలు వరుసగా దములు, శుష్మిణులు, స్నేహులు, మాందహులు అనుపేర ఉందురు. అక్కడ పరబ్రహ్మ రూపుడు జనార్దనుడు ఆరాధ్యదైవము. అచట జనులు జనార్దనుని గూర్చి యజ్ఞములు చేసి ఆధికారిక పురుషులుగా అవతరింప వలసిన పురాకృత పుణ్యకర్మ ఫలమును క్షయింప జేసికొందురు. అనగా కేవల నైష్కర్మ్య విషయమైన ముక్తినే కోరుదురని తాత్పర్యము. విద్రుమము, హేమశైలము, ద్యుతిమంతము, పుష్టిమంతము, కుశేశయము, హరి మందరము అనునవి అచ్చట వర్ష పర్వతములు ఏడు.

ధూతపాప, శివ, పవిత్ర, సమ్మతి, విద్యుదంభస్సు, మహీ అనునవి మరికొన్ని చిన్న చిన్న ఏరులు. వేలకొలది సర్వపాపహరములైనవి అక్కడ ఉన్నవి. కుశద్వీపమధ్యమున కుశస్తంభమున్నది. అందుచే దానికాపేరు కల్గినది. ఘృతసముద్రము క్రౌంచద్వీపముచే ఆవృతమై అచ్చట ఉన్నది.

ఇక క్రౌంచ ద్వీపము, కుశద్వీపము కంటె రెట్టింపు విరివిగలది. ఇచట ద్యుతిమంతుని కుమారులు ఏడుగురు, పరిపాలకులు. కువగుడు, మందగుడు, ఉష్ణుడు, పీవరుడు, అంధకారకుడు, ముని, దుందుభి అనువారు. దేవగంధర్వ నిషేవితములు రమ్యములు అయిన వర్షపర్వతములు ఇందున్నవి. అవి క్రౌంచము, వామనము, అంధకారకము. దేవవ్రతము, ధమము, పుండరీకవంతము, దుందుభి అనునవి ఒకదాని కంటె ఒకటి రెట్టింపు ప్రమాణముగలవి. ఇక్కడ దేవగణములతో గూడి పుష్కరులు. పుష్కలులు అనువారు ధన్యులై చరింతురు. బ్రాహ్మణాది చతుర్వర్ణములు ఇందుగలవు. ఇందు ప్రధాన నదులు ఏడు. గౌరి, కుముద్వతి, సంధ్య, రాత్రి, మనోజవ, ఖ్యాతి, పుండరీక అనునవి. అక్కడ పుష్కరాదులచే ధ్యాన యోగమున యజ్ఞమందు రుద్రరూపుడైన జనార్దనుడు ఆరాధింపబడును. ఇది మీగడ సముద్రముచే ఆవృతము. అది ఆ ద్వీప పరిమాణము గలది. దానిచుట్టును శాక ద్వీపమున్నది.

శాక ద్వీపవతియైన భవ్యునికి జలదుడు, కుమారుడు, సుకుమారుడు, మనీరకుడు, కుశమోదుడు, మోదాకి, మహాద్రుముడు అను పుత్రులుగలరు. అందలి వర్షములు వారిపేర

ఉన్నవి. అందు ఏడు వర్ష పర్వతములు ఉదయగిరి, జలధార, రైవతకము, శ్యామము, అంభోగిరి, అస్తికేయము,కేసరి అనునవి. సిద్ధ గంధర్వ సేవితమై, ఇచట శాకమను (టేకుగాని, కడిమిగాని) మహావృక్షమున్నది. దాని ఆకుల గాలి తాకినచో పర మాహ్లాదము గల్గును. అక్కడ పవిత్రములయిన చతుర్వర్ణ ప్రజలతో గూడిన జనపదములు గలవు. అచటి జనులు నిరాటంకులు ఏ అభ్యంతరములు లేనివారు నీరోగులు. నదులు మహా పుణ్యములు. పాపభయహరములు. సుకుమారి, కుమారి, నళిని, రేణుక, ఇక్షువు, ధేనుక, గభస్తి అనునవి యేడు చిన్నచిన్న ఏరులు, గిరులు వేలున్నవి. జలదాది గిరులపై వసించు జనులు ఆ నదీ సలిలములను త్రాగుదురు. ఈ నదులు స్వర్గమునుండి వచ్చినవి. అచటి ప్రజలలో ధర్మహాని సుఖదుఃఖములు, శాస్త్రము హద్దుమీరి నడచుట అనునవి లేవు. మగులు, మాగధులు, మానసులు, మందగులు అనుపేర బ్రాహ్మణాది చతుర్వర్ణ ప్రజలు అచట నివసింతురు. శాకద్వీపవాసుల కులదైవము విష్ణువు, సూర్యరూపుడుగా యథావిధి శ్రీహరి ఈ ప్రజలచే అర్చింపబడును.

శాకద్వీపము అదే ప్రమాణముగల క్షీరాబ్ధిచే ఆవరింపబడి ఉన్నది. క్షీరాబ్ధి పుష్కర ద్వీప సమావృతము. శాకద్వీపము కంటె రెట్టింపు ప్రమాణము కలది పుష్కరము. పుష్కర ద్వీపమందు సవనుని కుమారులు మహావీతుడు, ధాతకి అనువారు. వారిపేర వర్షములు రెండు. ఇక్కడ వర్ష పర్వతము మానసోత్తరము అనునది ఒక్కటియే. అది ఈ ద్వీపము నడుమ వలయాకారమున ఉన్నది. ఏబదివేల యోజనముల ఎత్తు, అంతే వెడల్పుగలది. అది పుష్కర ద్వీపమండలమును నడిమికి రెండు భాగములు చేయుచున్నట్లున్నది. దాని మూలముననే ఈ ద్వీపము రెండు వర్షములుగా విభక్తమైనది. అవి వలయాకారములు. వాని నడుమ పెద్దగిరి కలదు. అచటి జనులు పదివేలేండ్లు జీవింతురు. వారు రాగద్వేష శోకములు లేనివారు. ఆరోగ్యవంతులు. వారిలో అధమోత్తమ భేదము లేదు.చంపువాడు చంపబడువాడును లేరు. ఈర్ష్యాసూయ లెరుగరు. భయము, రోషము, దోషము, లోభము శూన్యములు. మానసోత్తర పర్వతమునకు మహావీత ఖండము వెలుపలిది. ధాతకీ ఖండము లోపలిది. దేవదైత్యులు వసింతురు. ఈ వర్షద్వయమున పుష్కర ద్వీపమందు సత్యానృతము (వాణిజ్యము) లేవు.నదులు లేవు కొండలులేవు. ద్వీపములు లేవు.

మనుష్యులు అందరి వేషమొక్కటే. వారు దేవసమరూపులు. అట వర్ణాశ్రమాచార ధర్మ విచక్షణలేదు. వేదత్రయము, వార్త, దండనీతి, శుశ్రూష అనునవి లేనేలేవు.ఈ వర్ష ద్వయము భూలోక స్వర్గమే. కాలము జరారోగములు లేక సర్వసుఖప్రదమగును. ఈ రెండు ఖండములందు పుష్కర ద్వీపమందు న్యగ్రోధ (మఱ్ఱి) మహావృక్షము బ్రహ్మ ఉండు

స్థానము. బ్రహ్మ అచట సురాసురులచే పూజింపబడుచుండును. తియ్యని నీటి సముద్ర ముచే అది చుట్టుకొన్నది. దాని ప్రమాణము పుష్కర ద్వీప సమానము.

ఇట్లు ద్వీపములు ఏడును సముద్రములు ఏడింటిచే అవరింపబడి ఉన్నవి. ద్వీపములు అన్నియు సమప్రమాణములు. సముద్రములు అన్నియు వానికి రెట్టింపు ప్రమాణము గలవి. అన్ని సాగరములందలి నీరు ఎల్లప్పుడును సమము. హెచ్చు తగ్గులు లేకుండా ఉండును. నిప్పుచే గిన్నెలో నీరు పొంగినట్లు, చంద్రుని వృద్ధిని అనుసరించి అందలి నీరుపొంగును. ఆ పొంగు క్రుంగు కూడ అన్నిట సమానమే. అన్ని సాగరములు సమముగ పొంగును తగ్గును. శుక్ల కృష్ణ పక్షములందు చంద్రోదయాస్తమయములందు పదునైదు అంగుళములు పొంగుచు క్రుంగుచు ఉండును. పుష్కర ద్వీపవాసులందరు అన్నివేళల స్వయంసంప్రాప్తమైన షడ్రసోపేత భోజనము చేయుచుందురు.

స్వాదూదక (మంచినీటి) సముద్రము చుట్టు లోకమున్నది. దానికి రెట్టింపు బంగారుభూమి కలదు. అది జంతు రహితము ఆ మీద లోకాలోక పర్వతము పదివేల యోజనములు విరివైనది, అంతే ఎత్తును అంతే లోతుగలది. ఆ శైలము ఆవరించి చీకటి ఉన్నది. ఆ చీకటి అండకటాహమంతట నావరించి ఉన్నది. ఇంతవరకుగల ఈ భూమి ఏబది కోట్ల యోజనముల ప్రమాణముగలది. బ్రహ్మాండకటాహముతో ద్వీపములతో పర్వతములతో ఈధాత్రి (సృష్టిహేతువు) యై సర్వభూతములలో గుణాధిక్యముగలదై సర్వజగదాధారమై ఉన్నది. (20)

పాతాళ ప్రమాణ కథనము

భువనకోశ వృత్తాంతమును సంగ్రహముగను సాకల్యముగను వర్ణించుచు, లోమహర్షణుడు, మునిశ్రేష్ఠులారా! భూమియొక్క వైశాల్యము డెబ్బది వేల యోజనములు, దాని ఎత్తు కూడా అంతే ఉండును. ఒక్కొక్క పాతాళము వైశాల్యము పది వేల యోజనములు. అతలము, వితలము, నితలము, సుతలము, తలాతలము, రసాతలము, పాతాళము అనునవి సప్తపాతాళములు. అచట కృష్ణా శుక్లా అరుణా పీతా శర్కరా శైలకాంచనీ అను భూములు ఉత్తమ సౌధములతో ఒప్పుచుండును. ఆ ప్రదేశములందు దైత్య, దానవ జాతులు వందల కొలది కలరు. మునిసత్తములారా! అచట పెద్ద నర్వ జాతులు కూడ కలవు.

స్వర్గము కంటెను పాతాళములు రమ్యములని పాతాళముల నుండి స్వర్గమునకేగి సభామధ్యమున నారదమహర్షి చెప్పిరి. వీనియందాహ్లాద జనకములైన పరిశుభ్ర కాంతి

భరితములైన రత్నములున్నవి. నాగాభరణ భూషణములు పెక్కులున్నవి. ఇట్టి పాతాళము దేనితో సాటియగును. దైత్యదానవ కన్యారత్నములు ఇందు అందందు క్రీడింతురు. ఇట్టి పాతాళము ముక్తుడైన వానికి గూడ ప్రీతిజనకమై ఉండును. పగటి సూర్యుని కిరణములు ఇచ్చట కాంతి నొసంగును గాని ఎండ వేడిమిని కలిగింపవు. రాత్రి చంద్ర కాంతులును చలినిగాక, చక్కని వెలుగును మాత్రమే ఇచ్చును. భక్ష్య, భోజ్య, లేహ్య, పానీయ రూపమైన ఆహారములచే మదించిన భోగులగు దానవాదులు కాలగమనమును ఇచట గమనింపనే గమనింపరు. వనములు, నదులు, సరోవరములు, పుంస్కోకిలల కలకలారావములతో మనోహరములై ఉండును. ఇచటి ప్రజలు ధరించు భూషణములు మిగుల రమ్యములు. అంగరాగములు గంధాదులు పరిమళ భరితములు. నిరంతరము వీణా వేణు మృదంగ నాదము శ్రవణ మనోహరముగ వినిపించును. ఇచటి భాగ్య భోగ్యములు పరమ మనోహరములు. పాతాళవాసులగు దానవులు, దైత్యులు, నాగులును ఆ భోగములు అనుభవించుచుందురు.

పాతాళమునకు అడుగున విష్ణువుయొక్క తమోమయ శరీరము శేషుడు అను పేర అనంత కళ్యాణగుణ నిలయమై తేజరిల్లుచుండును. దేవ, దేవర్షి, సిద్ధులచే అతడు అనంతుడని కీర్తింపబడును. స్వస్తిక ముద్రాంకితములైన వేయి శిరస్సులచే సహస్రఫణామణి కాంతిపుంజములచే దిశలను రంజింపచేయుచుండును. లోకహితమునకై ఆయన అచటి అసురులను తన తేజముచే నిర్వీర్యులనుగా చేయుచుండును. ఎల్లప్పుడు ఒకే కుండలమును ఆభరణముగ ధరించి, కిరీటధారియై, పుష్పమాలాలంకృతుడై, మదఘూర్ణిత నేత్రుడై అగ్ని సహిత శ్వేతాచలమువలె ప్రకాశించుచుండును. నీలవసనుడు మదోత్సిక్తుడు, శ్వేతవరోపశోభితుడు, ఆకాశగంగా ప్రపాత సంయుత కైలాస పర్వతమన్నట్లు ఈ శేషుడు ఒకచేత నాగలియు మరొకచేత రోకలియుధరించి వారుణి అను నాగ అంగనతో కూడి ఉపాసింపబడును. కల్పాంతమందు సహస్ర ముఖములనుండి విషానలజ్వాలలు గ్రమ్ముకొన సంకర్షణ స్వరూపుడైన రుద్రుడు జగత్రయమును త్రిమ్మివేయును. గిరిమండలమువలె అశేష క్షితి మండలమును ఫణాగ్రమున ధరించి అశేష సురసమర్చితుడై పాతాళ మూలమందు అధిష్ఠించి ఉన్నాడు. దేవతలు కూడ అతని వీర్య ప్రభావ రూప వైభవము వర్ణింపజాలరు. తెలిసికొనజాలరు. ఆయన ఫణామణి శిఖలచే అరుణమై కుసుమమాలికవలె ఇలాతలము అఖిలము నిలిచియున్నది. అట్టి మహానుభావుని శక్తి ఎవ్వడు వర్ణింపగలడు.

మదముచే తిరుగుడుపడు కన్నులతో ఆ అనంతుడు ఎప్పుడు విజృంభించునో అప్పుడు భూమండలము పర్వతములతో సహా సముద్రముగ కంపించును. గంధర్వాప్సర సిద్ధ కిన్నర ఉరగ వారణులు కూడ అశేషాహి గుణముల అంతు తెలియలేరు. కావుననే

ఆయన అనంతుడను పేరు పొందెను. నాగకన్యా తిలకములు తమ మృదుల కరకమలములచే అతనికి పూయు హరిచందనము శ్వాసానిలములచే వినరబడి దిశలకు సువాసన భరితవటవాసమై (పరిమళ చూర్ణమై) వాసించును. ఆ ఫణిరాజును ఆరాధించి పురాణ మహర్షి గర్గాచార్యుడు జ్యోతిశ్చక్రము యొక్క రహస్యములను తెలుసుకొనెను. సకల శకున ఫలితములను తెలుపగల్గెను. ఆ నాగేంద్రునిచే శిరసావహింపబడిన ఈ వసుంధర దేవాసుర మానుష విశేష సహితములయిన సర్వలోకములను ధరింపగల్గుచున్నది.(21)

నరక వర్ణనము

ఓ విప్రులారా! పాపాత్ములు పడవేయబడు రౌరవాది నరకములను గూర్చి ఇక వినుడు అని లోమహర్షణుడు ఇట్లనెను –

రౌరవము, శౌకరం, రోధము, తాలము, విశసనము, మహాజ్వాల, తప్తకుడ్యము, మహాలోభము, విమోచనము, రుధిరాంధము, వసాతప్తము, కృమీశము, కృమిభోజనము, అసిపత్రవనము, కృష్ణము, లాలాభక్షము, పూయవహము, వహ్నిజ్వాల, అధశ్శిరము, నదంశము, కృష్ణ సూత్రము, తమస్సు, ఆవీచి, శ్వభోజనము, అప్రతిష్టము మావీచి అను. పరమదారుణములైన పెక్కు నరకములు కలవు. ఇవి యముని పరిపాలన దేశములు. శస్త్ర, అగ్ని, విషములు ప్రయోగించు యమభటులు పాపకర్మాసక్తిగలవారు వీనియందు ఉందురు.

దొంగ సాక్ష్యమిచ్చినవాడు, పక్షపాతబుద్ధితో మాట్లాడువాడు, అబద్ధము చెప్పువాడు రౌరవమునకు పోవును. భ్రూణహత్య నగరధ్వంసము, గోహత్య చేసినవాడు, జీవులకు ఊపిరి ఆడకుండ చేసినవాడు భయంకర రౌరవమునకు పోదురు. బ్రహ్మహత్యా కారకుడు, బంగారమును దొంగిలించినవాడు, వాని స్నేహితుడు శూకర నరకమున పడుదురు. క్షత్రియ వైశ్య ఘాతకులు, గురుపత్నిని, అప్పచెల్లెండ్రను కూడినవాడు రాజభటుని హత్య చేసినవాడు తప్తకుంభమను నరకమున కూలును. మద్య విక్రేత వధ్యపాలుడు ఉరితీయు స్థానమును కాయువాడు (లేక) వధింపదగినవానిని కాపాడినవాడు, కేసర విక్రేత (విషమును అమ్మువాడు) భక్తుని విడిచినవాడు తప్తలోహమను నరకమున కూలుదురు.

కూతురును, కోడలిని సంగమించినవాడు, మహాజ్వాలమను నరకమున పడవేయబడును. వేదదూషకుడు, వేదవిక్రయి అగమ్యగామి, శబలము అను నరకము పొలగును. దొంగ, హద్దుమీరినవాడును విమోహ నరకమున పడును. దైవ బ్రాహ్మణ పితృ ద్వేషియు, రత్నములను (శ్రేష్ఠ వస్తువులను) దూషించినవాడు కృమి భక్ష్యము అను నరకమును

పొందును. దుర్భాగము చేసినవాడు, కృమీశము అను నరకము పొలగును. పితృదేవతా తిథులను విడిచి కుడిచినవాడు లాలా (చొంగ) భక్ష్యమను నరకమున పడును. బాణములను చేయువాడు వేధక నరకమున పడును, ఖడ్గాదులను చేయువాడును, కర్ణికారుడును, (కర్ణి ఒక విధమైన ఆయుధము) పరమదారుణమైన విశసనమను నరకమున పడును. అపాత్ర దానము పట్టినవాడు, అయాజ్యయాజనము (చేయకూడని వానిచే యజ్ఞము) చేయించినవాడు, నక్షత్ర సూచకుడు (జ్యోతిషశాస్త్రము దెలియకయే జాతక ముహూర్తములు చెప్పువాడు) అధోముఖ నరకము నందును. అతిథికి పెట్టక మృష్టాన్నము ఆరగించువాడు కృమిపూయ నరకమునకు పోవును. లాక్ష (లక్క), మాంసము, రసములు, మధుర పానీయములు, నువ్వులు, ఉప్పు అనువాని అమ్ము బ్రాహ్మణుడుకూడ కృమిపూయ నరకమున పడును. పిల్లి, కోడి, మేక, కుక్క, పంది గుఱ్ఱము వీనిని పెంచువానికిని అదేగతి. రంగోపజీవి (నాటకములందు నటించి జీవించు వాడు) జాలరి, కుండాశి, భగభక్షకుడు (వీర్యపానము చేయువాడు)లేక జారజుని నుతించువాడు, విషము పెట్టువాడు, సూచి, చాడీకోరు, పేచీకోరు, మాహిషకుడు, (దున్నపోతుల వ్యాపారి), పర్వములందు స్త్రీ సంయోగము చేసిన బ్రాహ్మణుడు, కొంపలు అంటించువాడు, మిత్ర ఘాతకుడు, శకునములు చెప్పువాడు, గ్రామపాచకుడు, సోమవిక్రయ రుధిరాంధ కూపమున పడుదురు. తేనెపుట్టలను రేపినవాడు గ్రామ నాశనము చేసినవాడు వైతరణి అను నరకములో పడును.

రేతః పానము చేసినవాడు, మర్యాదోల్లంఘనము చేసినవాడు (సదాచారములను, కట్టుబాట్లను దప్పినవాడు) మాయాజీవనులు, ఆచారహీనులు, కృచ్ఛ్రము అను నరకమున పడుదురు. జౌరభ్రికులు (గొఱ్ఱెల మందచే జీవించువారు), మృగవ్యాధులు వహ్నిజ్వాలమను నరకమున పడుదురు. అపాకములందు (వండగూడని వస్తువులకు) అగ్నిని పెట్టినవాడు అదే నరకమున పడును. వ్రతలోపము, ఆశ్రమధర్మచ్యుతి చేసినవాడు సందంశ యాతనమను నరకమున పడును. దివాస్వాపకాలయిన బ్రహ్మచారులు, కొడుకుల దగ్గర అధ్యయనము చేసినవారు శ్వభోజనమను నరకమున పడుదురు. ఇట్టివి నూర్లకొలది వేలకొలది నరకములు కలవు. పాపములను చేసినవారు పొంది, విడిచి, అతను, ఆశరీరములనొంది ఆయా నరకములందు హింసింపబడుదురు. వర్ణాశ్రమ విరుద్ధమైన కర్మను త్రికరణములచే చేసినవారు నరకము పొలగుదురు. ద్యులోకమందలి దేవతలు, తలక్రిందులుగా ఉండు నరకలోక జీవులచే చూడబడుచుందురు. దేవతలు నరకలోక వాసులను అధోముఖులుగా చూచుచుందురు. జీవులు స్థావరములు, కృములు, జలజంతువులు, పక్షులు, పశువులు, నరులు, ధార్మికులు, దేవతలు అనువరుసలో జన్మించి క్రమముక్తిని పొందుదురు.

స్వర్గమందు ఎందరు జీవులుందురో నరకమందు అందరుందురు. పాపముచేసి ప్రాయశ్చిత్తము చేసికొననివాడు నరకమునకు పోవును. ఆయా పాపములకు అనురూపములైన ప్రాయశ్చిత్తములను పరమర్షులు స్మరించి (స్మృతులలో) పెద్ద పాపమునకు పెద్దగ చిన్నదానికి చిన్నగా ప్రాయశ్చిత్తములను తెల్పిరి. స్వాయంభువమనువు మొదలయిన వారు ఆ ప్రాయశ్చిత్త కాండను రచించిరి. అన్నిటికిని ప్రాయశ్చిత్తము కృష్ణస్మరణము. దానిని మించినదిలేదు. ప్రాయశ్చిత్తమనగా తపస్సు. పాపముచేసి అనుతాపము పొందెనేని, హరిస్మరణ చేసెనేని, దానిని మించిన పుణ్యసాధనము లేదు. దానిచే జీవి నారాయణుని చేరును. ప్రాతఃకాల అహోరాత్రములందు సంధ్యా సమయములందు నారాయణ స్మరణ చేసిన పాపక్షయమంది నరుడు నారాయణుని పొందును. ఎవ్వని మనస్సు జప హోమార్చనములందు, వాసుదేవునందు లగ్నమై ఉండునో వాడు ముక్తినొందును. విష్ణువునందు అప్పుడప్పుడు మనసు నిలువక చలించెనేని, వానికి దేవేంద్రాది పదవి లభించును. పునరావృత్తి లక్షణమైన స్వర్గగమనమెక్కడ? ముక్తి బీజమైన వాసుదేవ నామ స్మరణమెక్కడ? కావున అహర్నిశము పురుషుడు, విష్ణు స్మరణ చేయుచు పాపక్షయము పొంది శుద్ధుడైనచో నరక దర్శనము జేయడు. స్వర్గము మనఃప్రీతి కూర్చునది, దానికి వ్యతిరేకము నరకము. నరక స్వర్గములనగా పాప-పుణ్యములే. అవి వానికి పర్యాయ పదములు, వాసుదేవైక చిత్తుడు అపునరావృత్తి లక్షణమైన సాయుజ్యముక్తికి అర్హుడన్నమాట.

ఒకే వస్తువు దుఃఖమునకు, సుఖమునకు, ఈర్ష్యకు, కోపమునకు కారణమగును. కావున ఏ వస్తువైనను దుఃఖాత్మకమే. ఆ వస్తువే ఒకప్పుడు కోపమునకు హేతువై అదే ప్రసన్నతకు కారణమగును. కావున కేవలము దుఃఖాత్మకము కేవలము సుఖాత్మకమును అయిన వస్తువు లేనేలేదు. సుఖ, దుఃఖాది లక్షణమైన ఈ పరిణామము కేవల మానసికము. బ్రహ్మజ్ఞాన మొక్కటియే జ్ఞానము. లౌకికము అయిన జ్ఞానము బంధమునకు, బ్రహ్మజ్ఞానము ముక్తికిని కారణమగును. ఈ ప్రపంచ వ్యవహారము తెలివివలననే జరుగును. కాని జ్ఞానమునకు భిన్నముగా ఏదియు లేదు. విద్య అవిద్య ను వానిని బ్రహ్మజ్ఞానము, లౌకిక జ్ఞానమునుగా గ్రహింపవలెను. (మోక్ష విషయకమైన జ్ఞానమే జ్ఞానమనియు, తదన్య విషయకమైన తెలివి విజ్ఞానమనియు అమరుడు చెప్పెను) **అవిద్యయామృత్యుం తీర్త్వా విద్యయా – మృతమశ్నుతే** అనగా అవిద్యచే జరా మరణములను లేకుండా చేసుకొని, విద్యచే అమృతస్థితిని (మోక్షమును) పొందునని శ్రుతి చెప్పినది. ఉపనిషత్తులలో చెప్పబడిన జ్ఞానము బ్రహ్మజ్ఞానము అగును. ఇతరము విద్యాశబ్ద వాచ్యమై కేవలము పునరావృత్తికమైన ముక్తికి హేతువు అగును. తక్కిన వేదాంగాది విద్యలు, తదుచిత కర్మానుష్ఠానమును అవిద్యగా

పేర్కొనబడి స్వర్గాది భోగమాత్ర సాధనములగునన్నమాట. వీనిచే చిత్తశుద్ధి వడసి పునరావృత్తి సమ్మితములైన పుణ్యలోక భోగములను పొందవచ్చును. కేవలము విద్యవలననే మోక్ష స్థితి కలుగునని భావము. ఈవిధముగ నాచే భూమండలము సమస్త పాతాళములు, నరకములు, మీకు చెప్పబడినవి. సముద్రము, పర్వతములు, ద్వీపములు, నదులు, సంక్షేపముగ చెప్పబడినవి. ఇంకేమి వినగోరుచున్నారు అని లోమహర్షణుడు మునులను ప్రశ్నింపగా(22)

భూర్భువస్సువరాది లోక వర్ణనము

మునులు ఇట్లు అడిగిరి –

ఓ లోమహర్షణ! నీవు లోకములను గురించిన సర్వమును మాకు తెలిపితివి. భువర్లోకము మొదలగు లోకములను, గ్రహ సంస్థానమును వాని ప్రమాణమును తెలుపుము అని మునులడుగ లోమహర్షణుడు ఇట్లు అనెను. ఆ మునుల ప్రశ్నలను వినిన – సూతుడు ఇట్లు అనెను.

సూర్య చంద్రుల కిరణ ప్రసారము కలదాక సముద్ర శైలపరివృతమై ఉన్న ప్రదేశము పృథివీ మండలము. భూమియొక్క విస్తారమెంతో దానికి మీదనున్న అంతరిక్ష విస్తారము అంతే. భూమికి లక్ష యోజనములలో సౌర మండలము ఉన్నది. దానికి లక్ష యోజనములలో చంద్రమండలమున్నది. దానికి లక్షయోజనముల మీద నక్షత్ర మండలము ఉన్నది. ఆ నక్షత్ర మండలమునకు రెండు లక్షల యోజనములలో ఉత్తరమున బుధుడు. కలడు. అతనికంటే దూరములో శుక్రుడు, అంతే దూరములో అంగారకుడు (కుజుడు) గలరు. అక్కడకు రెండులక్షల యోజనముల దూరములో బృహస్పతియు అటకు రెండు లక్షల యోజనములలో శని, ఆ మీద లక్ష యోజనములలో సప్తర్షి మండలము దానికి లక్ష యోజనములలో జ్యోతిశ్చక్రమునకెల్ల కేంద్ర స్థానమైన ధ్రువ మండలము ఉన్నవి. ఈ అంతరిక్ష లోకము జ్యోతిర్మండలము. ఇది యజ్ఞఫలమునకు స్థానము. ఇజ్య (యజ్ఞము) ఇందు ప్రతిష్ఠితమై యున్నది. 'క్షిప్రంహి మానుషేలోకే సిద్ధిర్భవతి కర్మజా' మనుష్య లోకమున కర్మఫలసిద్ధి వేగముగ కల్గును.

ధ్రువలోకమునకు మీద ఒక కోటి యోజనములలో కల్పాంత జీవులు నివసించు మహర్లోకము ఉన్నది. దానిపై రెండు కోట్ల యోజనములలో జనోలోకము ఉన్నది. అది బ్రహ్మ మానసపుత్రులు నిర్మల చిత్తులునైన సనకసనందనాదులు ఉండెడి స్థానము. జనోలోకమునకు పైన ఎనిమిది కోట్ల యోజనములలో తపోలోకము ఉన్నది. అచట వైరాజులను

దేహరహితులైన (విదేహులు) దేవతలు నివసింతురు. తపోలోకమునకుపైన ఆరు యోజనములలో సత్యలోకము విరాజిల్లుచున్నది. అచట సిద్ధాది మునులు ఉందురు. అది అపునర్మారకము. అనగా తిరిగి మరణ ధర్మములేనిది. పుణ్యలోకము బ్రహ్మ లోకము.

పాదగమ్యమైన భూభాగమంతయు భూలోకము. దీని విస్తారము చెప్పబడెను. భూమికిని, సిద్ధాది ముని సేవితమైన సూర్య లోకమునకు నడిమి భాగము భువర్లోకము (అంతరిక్షము)అని చెప్పబడును, ఇది రెండవలోకము. సూర్యునకు ధ్రువునకును నడుమ గల చతుర్దశ నియుత(లక్ష) పరిమాణమైన లోకము స్వర్లోకము. ఈ మూడు లోకములకు కృతకము (కర్మ సంపాద్యము)లను పేరు గలదు. ఆ మీద జన సప్త సత్యలోకములు మూడును అకృతకములు అనబడును. కృతక అకృతముల నడిమి భాగము మహర్లోకము. దీనికి కృతకాకృతకమని పేరు. ఇది కల్పాంతమందు శూన్యమగును. కాని నశింపదు.

మహామునులారా! సప్త మహాలోకములు, సప్త పాతాళములు నాచే చెప్పబడినవి. ఇది బ్రహ్మాండము యొక్క విస్తృతి. అండకటాహముతో క్రింద మీద నడుమ వ్యాపించి వెలగపండు విత్తనమువలె ఉండునది బ్రహ్మాండము. దీనికి పదిరెట్లు విరివిగల ఉదకము వహ్నిచే నావరింపబడి ఉన్నది. అగ్ని వాయువుచే, అది ఆకాశముచే ఆకాశము మహత్తత్వముచే పదేసిరెట్లు పరిమాణముగల దానితో ఆవరింపబడి ఉన్నది. మహా త్తత్వమును ఆవరించి ప్రధానమున్నది. అది అనంతము. దానికి లెక్కలేదు. అది సమస్త సృష్టికి హేతువైన పరాప్రకృతి. ఇట్టి అనంత కోటికోటి ప్రకృతులందు దారువునందు అగ్నివలె. నువ్వులందు తైలమువలె, చేతనాత్మకమై పురుషతత్వము-అనగా పరబ్రహ్మ వస్తువు ప్రధానమందు వ్యాపించియున్నది. ఈ ప్రధానము పురుషతత్వము, సర్వభూతముల అనుభూతిలో ఉన్న విష్ణుశక్తిచే ధరింపబడి పరస్పరాశ్రయ ధర్మము కలవియైయున్నవి. ఆరెండింటి పృథగ్భావమునకు, సంశ్రయమునకు ఆ విష్ణు శక్తియే కారణము.

సృష్టి కాలమందు విష్ణుశక్తియైన మాయ (ప్రకృతి)యే కారణరూపమైన తత్వము నందు క్షోభకు కారణమగును. అదే ప్రథమ స్పందనము. ఈ శక్తి, వాయువు నీటి బిందువులందలి చలువను భరించినట్లు, ప్రధాన పురుషాత్మకమై, ఈజగత్తును భరించును. చెట్టు మొదట స్కంధము (బోదె)కొమ్మలు, రెమ్మలు, ఆకులతో మొదటి విత్తనమునుండి పుట్టును. ఆ చెట్టునుండి మఱల విత్తనము పుట్టును. ఈ క్రమమునందు పుట్టినచెట్లు మొదలయిన వాని లక్షణములు తత్తద్రవ్యముల కారణములను అనుసరించి ఉన్నట్లే ఈ జగత్పరంపర (బీజపరంపర) అనంతమైన జగత్కారణమైన విష్ణువును అనుసరించి ఉండును.

ఆ విష్ణువే అవ్యాకృత తత్వము. ఆ బీజము నుండియే మహత్తు అహంకారము సమిష్టి మనస్సు మొదలగునవి వ్యాకృతమగుచున్నవి. (అవ్యాకృతమునే అవ్యక్తమని వ్యాకృతమును వ్యక్తమని శాస్త్రము వ్యవహరించినది). అహంకార తత్వము నుండి దేవ వర్గము తత్పుత్రులు పౌత్రులు జనించిరి. బీజమునుండి మొలక, మొలక నుండి వృక్షము, తద్భాగములు పుట్టినపుడు బీజాదులకు నాశములేనట్లు భూతముల పరిణామము వలన మూలభూతములకు అపచయము లేదు. వృక్షమునకు ఆకాశము, కాలము మొదలైన ద్రవ్యములు సన్నిధాన మాత్రమున కారణమైనట్లు, సర్వసాక్షి అయిన భగవంతుని సన్నిధాన మాత్రమున పొడమెడి నామరూపాత్మక వివిధ సృష్టివలన సర్వాధిష్ఠానమైన భగవత్తత్వ మునకు ఉపచయాపచయములు లేవు. హరి పరిణామము లేకుండగనే కారణమగు చున్నాడు. ధ్యానపుగింజలో మూలము, కాడ, మొలక, ఆకు, కోశము, పువ్వు, క్షీరము, ధ్యానము, బియ్యము, ఊక, తవుడు మొదలైన పదార్థములు (అవ్యక్తముగ) ఇమిడియుండి తరువాత వ్యక్తమైనట్లు పరమాత్మయందు సృష్టి కారణ సామగ్రి అయిన అనేక కర్మబీజములు దేవాది ఉపాధులు జీవశరీరమును నిండియుండి విష్ణుశక్తివలన ఆపరమాత్మనుండి ఆవిర్భావమును పొందుచున్నవి. కావు ఈజగమెల్ల పుట్టిపెరిగి, లయించుటకు హేతువైన విష్ణువే పరబ్రహ్మ మనబడును. అదియే పరంధామము, పరమపదము, సదసద్రూపము అనబడు పరతత్వము. చరాచరమైన ఈ జగత్తు అభేదదృష్టిచేత అతడే అగును. మూలప్రకృతియు, వ్యక్తరూపమగు జగత్తును అతడే. ఆతని అందు సర్వము నిలుచుచున్నది. లయించుచున్నది. యజ్ఞకర్త, యజ్ఞము, యజ్ఞమున యజింపబడువాడు, యజ్ఞభోక్త, యజ్ఞఫలమును కూడా అతడే. సర్వస్వరూపుడడైన అతనినుండియే యుగాదికాలగణన మేర్పడినది. ఆ హరికి వ్యతిరిక్తము అయినది కొంచెమును లేదు. (23)

ధ్రువ సంస్థితి నిరూపణము

ఇంకను మునులతో సూతుడు ఇట్లు చెప్పెను

భగవంతుడగు హరియొక్క తారా (నక్షత్ర) మయమైన రూపము శింశుమార నక్షత్రము అంతరిక్ష చక్రమునందు ప్రకాశించుచున్నది. దాని తోకయందు ధ్రువుడున్నాడు. అతడు తాను తిఱుగుచు చంద్రాదిత్యాది గ్రహములను త్రిప్పుచున్నాడు. తిరుగుచున్న ఈ ధ్రువుని అనుసరించి నక్షత్రములు చక్రమువలె తిరుగుచుండును. సూర్యచంద్రులు తారా నక్షత్ర గ్రహ సమూహము వాయుమయములైన సంబంధములచే ధ్రువునియందు అనుబద్ధములై ఉన్నవి. అంతరిక్షమందు జ్యోతిశ్చక్రము, శింశుమారాకారమున (మొసలివలె) ఉన్నదని

వర్ణితమైనది. ఆమ్మూర్తికాధారమై హృదయమందు నారాయణుడు ఉన్నాడు. ఉత్తానపాదుని కుమారుడు ప్రజాపతిని ఆరాధించి తారా రూపమయిన ఆ శింశుమారము యొక్క తోక యందు ఉన్నాడు. శింశుమారమునకు ఆధారము సర్వాధ్యక్షుడైన జనార్దనుడు. ధ్రువునకు ఆధారము శింశుమార చక్రము. ధ్రువుని యందు భానుడు ఉన్నాడు. సురాసుర మానుష మయిన ఈ జగత్తంతయు ఆ సూర్యుని ఆధారమున నిలిచియున్నది. సూర్యుడు ఈ జగత్తునకంతకు ఏ విధానమున ఆధారముగ ఉండెనో చెప్పుచున్నాను. ఆ వృత్తాంత మును నావలన వినుడు!

సూర్యుడు ఎనిమిది మాసములు రసస్వరూపములైన జలములను పీల్చి వర్షించును. ఆ వర్షమువలన అన్నము దానివలన సకల జగత్తు పొడమును. తీక్ష్ణ కిరణములచే అర్కుడు (సూర్యుడు) జగమ్మునగల నీటిని ఆకర్షించి సోముని పోషించును. ఆయన వాయునాడీ మయమైన జలముచే ఆకాశమునందుండి పొగ, అగ్ని, వాయువుయొక్క సన్నిపాత స్వరూపమయిన మేఘములందు జలములను చిమ్మును. ఆ మేఘముల నుండి నీరుభ్రంశము కానందున ఆ మబ్బులకు 'అభ్రములు'అను పేరువచ్చినది. ఈ మేఘము నందున్న నీళ్ళువాయు ప్రేరణమున కాలజనిత సంస్కారమును బొంది నిర్మలములై వానగా అవనిపై పడును. ప్రాణికోటి పుట్టుటకు కారణములై, భౌమములయిన ఈ అప్పులు (నీళ్ళు) నదులు, సముద్రములు, భూమి ప్రాణి జన్యములనినాలుగు రూపములతోనున్న ఈ జలమును భగవంతుడైన సవిత అదానము చేయును (గ్రహించును). సూర్యుడు అభ్రగతము కాకుండ ఆకాశగంగా గతమైన నీటినికూడ కిరణములచే గ్రహించి అప్పటికి అప్పుడు అవనిపై వర్షించును. అట్టి ఆకాశ గంగోదకముల స్పర్శవలన పాపములు వాసిన మర్త్యుడు నరకమునకు పోడు. అది దివ్యస్నానమని ఋషులు చెప్పిరి. సూర్యదర్శన మాత్రమున దివంబు నుండి రవి కిరణములచే ఆ ఆకాశ గంగోదకము వెదజల్లబడును.

కృత్తికాది విషమ(బేసి) నక్షత్రములందు సూర్యుని దర్శనముతో వర్షించు ఆ ఉదకము దిగ్గజములెత్తి వర్షించినట్టి గంగోదకమని తెలియనగును. సూర్యుని కిరణముల ద్వారమున సరిసంఖ్యకల నక్షత్రములందు కురియువాన అప్పటికప్పుడు సూర్య కిరణములచే స్వీకరింపబడి వర్షింపబడినది. ఈ ఉభయమును నరులకు పాపహరము పుణ్యకరమును అగు దివ్యస్నానమని తెలియనగును. మేఘముల వెంట కురియు ఉదకము ఓషధులను పోషించును. ప్రాణుల కుజ్జీవనమగు ఆ జలము అమృతము. దానిచే పెంపొందిన సకల ఔషధీ గణము ఫలపాకాంతమై (పంటపండగానే నశించునదియై) ప్రజలకు సాధకమగును. అందుచే శాస్త్రచక్షువులగు మానవులు వేదములు చెప్పిన యజ్ఞము అహరహరము ఆచరించి

దేవతల కాప్యాయనము కలిగింతురు. ఇట్లు యజ్ఞములు వేదములు బ్రాహ్మణాది వర్ణములు సర్వదేవనికాయము సకల పశుభూత సంఘాతము స్థావర జంగమాత్మకమైన సర్వజగత్తు వర్షాధారమున రాజిల్లుచున్నది. ఆవర్షము సూర్యుని వలన ఏర్పడుచున్నది. అట్టి సూర్యుని కాధారమై ధ్రువుడున్నాడు. ఆతనికి శింశుమారము దానికి నారాయణుడును ఆశ్రయమై ఉన్నారు. శింశుమార చక్రహృదయ స్థానమందు నారాయణుడుండి సర్వ భూతములను ధరించుచు, సనాతనుడు సర్వాదిభూతుడై అలరారుచున్నాడు. భూ సముద్రాది సహితమైన బ్రహ్మాండముయొక్క స్వరూపమిది. మీకు తెలిపితిని. మరియేమి వినదలతురో ఆనతిండు అని పల్కెను (24)

సర్వతీర్థమాహాత్మ్యము

మునులు - ధర్మజ్ఞా! భూమియందు ఎన్ని పుణ్యతీర్థములు, క్షేత్రములు ఉన్నవో వానిని గురించి వినగోరుచున్నాము. ఎఱింగింపుము అని అడుగగా వారికి

సూతుడు ఇట్లు అనియెను -

"ఎవని చేతులు, పాదములు, మనస్సు స్వాధీనములుగా ఉండునో, జ్ఞానము, తపస్సు కీర్తియు ఎవ్వనికి గల్గునో అతడు సర్వతీర్థముల సేవించిన ఫలమందును. ఎవని మనస్సు, మాట, ఇంద్రియములు పరిశుద్ధములో అవి వాని శరీరమందు ఉన్న తీర్థములే, అవి స్వర్గమార్గమును చూపగలవు. అశుచియైన కల్లుకుండ నూరుమారులు నీట కడిగినను శుచిగానట్లు అంతఃకరణము దుష్టమైన ఎడల తీర్థములందు ఎన్నింట మునిగినను, పరిశుద్ధము కానేరదు. తీర్థములు, దానములు వ్రతములు, ఆశ్రమములు, దుస్స్వభావుని, దాంభికుని, విశృంఖల సంచారములయిన ఇంద్రియములు గలవానిని పవిత్రుని జేయలేవు. ఇంద్రియముల ఒదిగించికొని మనుష్యుడు ఎందెందు ఉన్నను అదియది వానికి కురుక్షేత్రము ప్రయాగ పుష్కరమును అగును.కావున భూమిగల తీర్థ క్షేత్రములను గురించి క్లుప్తముగ దెల్పెదను వినుడు.

మహర్షులారా!

మొదటిది పుష్కరతీర్థము. నైమిశారణ్యము, ప్రయాగ, ధర్మారణ్యము, ధేనుకము, చంపకారణ్యము, సైంధవారణ్యము, పవిత్రమైన మగధారణ్యము, దండకారణ్యము, గయ, ప్రభాసతీర్థము, శ్రీతీర్థము, దివ్యమైన కనఖలము, భృగుతుంగము, హిరణ్యాక్షము, భీమారణ్యము, కుశస్థలి, లోహాకులము, కేదారము, మందరారణ్యము, మహాబలము, కోటితీర్థము, సర్వపాపహరతీర్థము, రూపతీర్థము, శూకరవతీర్థము, మహాఫలదాయక చక్ర

తీర్థము, యోగతీర్థము, సోమ తీర్థము, సోహోటకతీర్థము, కోకాముఖతీర్థము, పవిత్రమైన బదరీ పర్వతము, సోమతీర్థము, తుంగకూటము, స్కందాశ్రమము, కోటితీర్థము, అగ్నిపద తీర్థము పందశిఖము ధర్మోద్భవము కోటి తీర్థము బాధప్రమోచన తీర్థము గంగాద్వారము పంచకూటము మధ్యకేసరము చక్రప్రభ మతంగ తీర్థము కుశదండ తీర్థము దంష్ట్రా కుండము విష్ణుతీర్థము సార్వకామిక తీర్థము మత్స్యతిల తీర్థము బదరీ సుప్రభ బ్రహ్మ కుండము, వహ్నికుండము, సత్యపద తీర్థము, చతుస్రోతతీర్థము, చతుశ్శృంగము ద్వాదశ ధారక శైలము, మానసము, స్థూల శృంగము, స్థూల దండము, ఊర్వశీ తీర్థము, లోక పాలము, మనువరము, సోమశైలము, సదాప్రభ మేరుకుండము, సోమాభిషేచన తీర్థము, మహాస్రోత తీర్థము, కోటరకము, పంచధారత్రిధారక సప్తధార, ఏకధార అమరకంటక తీర్థము, శాలగ్రామ తీర్థము, చక్రతీర్థము, కోటిద్రుమ తీర్థము, బిల్వప్రభము దేవహ్రదము, విష్ణుహ్రదము, శంఖప్రభ పున్నాగతీర్థము, దేవప్రభ విద్యాధరము గాంధర్వము, శ్రీతీర్థము, బ్రహ్మ హ్రదము, సాతీర్థము లోకపాల తీర్థము, మణిపూరగిరి పంచహ్రదము, పుణ్యమైన పిండారక తీర్థము, మాలవ్యతీర్థము, గోప్రభావ తీర్థము, గోవర తీర్థము, వటమూలక తీర్థము, స్నానదండతీర్థము, ప్రయాగ గుహ్యవిష్ణుపద కన్యాశ్రమ వాయుకుండ తీర్థము, జంబూమార్గ తీర్థము, అట్లే శ్రేష్ఠమైన గభస్తితీర్థ యయాతి పతన కోటితీర్థ భద్రము మహాకాలవన తీర్థప్రజ అర్బుద మహాకాలవన నర్మదాతీర్థ పింగుతీర్థ వాశిష్ఠ పృథుసంగమ దౌర్వాసిక, పిఙ్జరక, ఋషితీర్థ బ్రహ్మతుంగ వసుతీర్థ కుమారిక శత్రుతీర్థ పఞ్చనద రేణుకాతీర్థ పైతామహవిమల రుద్రపాద మణిమత్త కామ తీర్థ కృష్ణతీర్థ కుశావిల యజన యాజన బ్రహ్మవాలుక పుష్పన్యాస పుండరీక మణిపూర దీర్ఘసత్ర హయపద అనశన గంగోద్భేద, శివోద్భేద, నర్మదోద్భేద, వస్త్రాపద, దారుబల, ఛాయారోహణ, సిద్ధేశ్వర, మిత్రబల కాలికాశ్రమ వటావట భద్రవట కౌశాంబి దివాకర సారస్వతద్వీప విజయ కామద రుద్రకోట సుమనస నద్రావనామిత స్యమంతపంచక బ్రహ్మతీర్థ సుదర్శన సతత పృథివీసర్వ పారిప్లవ పృథూదక దశాశ్వమేధిక సర్పిజ విషయాంతిక కోటితీర్థ-పంచనద-వారాహ-యక్షిణీహ్రదతీర్థ పుండరీక సోమతీర్థముఞ్ఞాట బదరీవన ఆసీన రత్నమూలక లోకద్వార పఞ్చతీర్థ కపిలాతీర్థ సూర్య శంఖినీ గోభవన యక్షరాజ బ్రహ్మావర్త సుతీర్థ కామేశ్వర మాతృతీర్థ శీతవన స్నానలోమాపహమాన నంసరక దశాశ్వమేధ కేదార బ్రహ్మోదుంబర సప్తర్షికుండ దేవీతీర్థ సుజమ్బుక ఈహాస్పద కోటికూట కిందాన కింజప కారండవ ఆవేద్యన త్రివిష్టప పాణిఖాత మిశ్రక మధూవట మనోజవ కేశికీ దేవలోక ఋణమోచన దివ్య నృగధూమ విష్ణుపద అమరహ్రద కోటితీర్థ శ్రీకుంజ శాలితీర్థ నైమిశేయ

బ్రహ్మస్థాన సోమకన్యాలోక బ్రహ్మతీర్థమన స్తీర్థ కారుపావన సౌగంధిక వనమణి సరస్వతి ఈశానప్రవర పావన పాఞ్చయజ్ఞిక త్రిశూలధర మాహేంద్ర దేవస్థాన కృతాలయ శాకంభరి దేవతీర్థ సువర్ణాక్ష కలిహ్రద క్షీరస్రవ విరూపాక్ష భృగు కుశోద్భవ బ్రహ్మతీర్థ బ్రహ్మయోని నీలపర్వత కుబ్జాంబ భద్రవట వశిష్ఠపద స్వర్గద్వార ప్రజాద్వార కాళికాశ్రమ రుద్రావర్త సుగంధాశ్వ కపిలావన భద్రకర్ణహ్రద శంకుకర్ణహ్రద సప్తసారస్వత ఔశసన కపాలమోచన అవకీర్ణ కామ్యక చతుస్సాముద్రిక శతిక సహస్రిక రేణుక పంచవటక విమోచన ఔజసస్థాణు కురుతీర్థ స్వర్గద్వార కుశధ్వజ విశ్వేశ్వర మాణవక కూప నారాయణాశ్రమ గంగాహ్రదవట బదరీ పాటన ఇంద్రమార్గ ఏకరాత్ర క్షీరకావాన సోమదధీచ శ్రుత కోటితీర్థస్థలీ భద్రకాళీ అరుంధతీ వనబ్రహ్మావర్త అశ్వవేదికుబ్జావన యమునా ప్రభవ వీరప్రమోక్ష సింధూత్థ ఋషికుల్యా సకృత్తిక ఉర్వీసంక్రమణ మాయావిద్యోద్భవ మహాశ్రమ వైతసికారూప సుందరికాశ్రమ బాహుతీర్థ చారునదీ విమలాశోక పంచనద మార్కండేయ సోమ సితోద మత్స్యోదరి సూర్యప్రభ సూర్యతీర్థ అశోకవన అరుణాస్పద కామదనవాలుక శుక్ర పిశాచమోచన సుభద్రాహ్రద విమల దండకుండ చండీశ్వర జ్యేష్ఠ స్థానహ్రద బ్రహ్మసర జైగీషవ్యగుహా హరి కేశవన అజాముఖనర ఘంటాకర్ణహ్రద పుండరీకహ్రద కర్కోటకవాపీ సుపర్ణోదపాన శ్వేతతీర్థహ్రద ఘర్ఘరి కాకుండ శ్యామాకూప చంద్రికా శ్మశానస్తంభకూప వినాయకహ్రద, సింధూద్భవమాప బ్రహ్మనర రుద్రావాన నాగతీర్థ పులోమక భక్తహ్రద క్షీరనర ప్రేతధార కుమారక బ్రహ్మావర్త కుశార్త దధికర్ణోధపాన శృంగమహాతీర్థ మహానదీ బ్రహ్మ నగర యాశీర్ష అక్షయవట దక్షిణ గోమయ ఉత్తర గోమయ రూపశీతిక కపిలాహ్రద గృధ్రవట సావిత్రీహ్రద ప్రభాసనసీతవన యోనిద్వార ధేనుక ధన్యక కోకిలా మతఙ్గహ్రద పితృకూప రుద్రతీర్థ శక్రతీర్థ సుమాలి బ్రహ్మస్థాన సప్తకుండ మణిరత్నహ్రద కౌశిక్య భరత జ్యేష్ఠాలికా విశ్వేశ్వర కల్పనరకన్యాసంవేద్య నిశ్చీవాప్రభవ వశిష్ఠాశ్రమ దేవకూట కూపవసిష్ఠాశ్రమ వీరాశ్రమ బ్రహ్మసర బ్రహ్మవీర అవకాపిలి కుమారధార శ్రీధారా గౌరీశిఖర శునఃకుండ నందితీర్థ కుమారవాస శ్రీవాస ఔర్వసీతీర్థ కుంభకర్ణహ్రదతీర్థ కౌశికిహ్రద ధర్మకామతీర్థ ఉద్ధాలక సంధ్యా కారతోయ కపిల లోహితార్ణవ శోణోద్భవ వంశగుల్మ ఋషభ కలతీర్థ పుణ్యావతీహ్రద బదరీకాశ్రమ రామతీర్థ పితృవన విరజా మార్కండేయవన కృష్ణతీర్థ వటతీర్థ రోహిణీ ప్రవరతీర్థ ఇంద్రద్యుమ్న నరతీర్థ సానుగర్త మహేంద్రతీర్థ శ్రీనద ఇషుతీర్థ వార్షభ కావేరీహ్రద కన్యా గోకర్ణ గాయత్రీస్థాన బదరీహ్రద మధ్యస్థాన వికర్ణక జాతీహ్రద దేవకూప కుశప్రవణ సర్వదేవవ్రత కన్యాశ్రమహ్రద వాలఖిల్యమహర్షి అఖండిత హ్రద నామక తీర్థములు ఇవి.

వీనిని శ్రద్ధతో సేవించి స్నానాది విధులుచేసి ఉపవసించి జితేంద్రియుడై దేవ ఋషి పితృ తర్పణములు గావించి దేవతార్చనముచేసి మూడు రాత్రులు ఇందు ఉపవసించిన వారికి వేరువేరు ఫలములు అనంతములు కల్గును, దాన అశ్వమేధ యాగఫలము కల్గును. సంశయము లేదు. ఈ తీర్థ మాహాత్మ్యము నిత్యము విన్నను పఠించినను సర్వపాప విముక్తి గల్గును అని చెప్పెను. (25)

స్వయంభు బ్రహ్మర్షి సంవాదము

ప్రవచన నిపుణా! పృథివియందు ఉత్తమ మయినది ధర్మార్థకామమోక్షములను ఒసగునది అగు భూమిని, తీర్థములకెల్ల ఉత్తమ తీర్థమును తెల్పుమని మునులడుగగా, సూతుడు ఇట్లు చెప్పదొడంగెను ఇంతకుపూర్వము మునులు ఈ ప్రశ్నమును మా గురువులను అడిగిరి. కురుక్షేత్రమున నానాతరు లతాపుష్పఫలోప శోభితమైన తన ఆశ్రమమునందు ఆసీనుడై ఉన్న మహాభారత కర్తను, సర్వశాస్త్ర విశారదుని, ఆధ్యాత్మ నిష్ఠుని, సర్వజ్ఞుని, సర్వభూత హితాభిరతుని, పురాణాగమవక్తను, వేదవేదాంగపారగుని, శాంతుని, మతిమంతులకు ఎల్ల అగ్రేసరుని, పద్మ పత్రాయతేక్షణుని, శ్రీవేదవ్యాసుని దర్శించువేడుకతో నిశిత వ్రతపరాయణులైన మునులు ఏతెంచిరి. ఆ వచ్చినవారు కశ్యపుని మొదలు కృష్ణాను భౌతుకుని వరకుగల పేర్లవారు. నక్షత్రములలో చంద్రునివలె వారిలో పరాశరసూనుడు శ్రీమంతుడు వ్యాసుడు మిక్కిలిగా తేజరిల్లెను. వేదవేత్తయగు అమ్ముని ఆ మునివరులను పూజించెను. వారును అతనికి ప్రతిపూజసల్పి కుశల ప్రశ్నములయిన తరువాత సాత్యవతేయుని ఇట్లు అడిగిరి.

ఓ మునివరా! వేదశాస్త్ర పురాణ ఆగమాది సర్వ సారస్వతమును భూత భవిష్యద్వర్త మానములను ఎరుగుదువు. మునిసత్తమా! రాగము అను మొసళ్ళు విషయములు అను ఉప్పు నీరు, ఇంద్రియములు అను సుళ్ళు కలిగి దురాశ అను కెరటములతో నిండి లోభగంభీరము దుస్తరము మోహముఅను రొంపియుకల్గి దుఃఖబహుళము కష్టతరము నిస్సారమైన సంసార సాగరమందుమునిగి నిరాలంబమై అచేతనమై ఉన్న జగత్తును జూచి మహానుభావుడవు అగు నిన్ను అడుగుచున్నాము. ఈ భయంకర సంసారమందు దేనిని సాధింపవలెను? ఏది శ్రేయస్సాధనము? దానిని ఉపదేశించి జగములను ఉద్ధరింపుము. ఈ అవనియందు దుర్లభము మోక్షదమునైన పవిత్ర క్షేత్రమును చెప్పుడు. ఈ మేదినియందు కర్మభూమి ఏదియో నీవలన వినదలచితిమి. కర్మభూమియందు నరుడు యథావిధిగా కర్మ మొనరించి పరమ సిద్ధిని పొందును. వికర్మవలన నరకమును పొందును.

మోక్షభూమియందు మోక్షమును పొందును కావున మాకీ విషయములు వినిపింపుము అనగా, త్రికాలజ్ఞుడగు వ్యాసమహర్షి వారికి ఇట్లు ఆనతిచ్చెను.

మున్ను మేరుపృష్ఠమందు నానారత్నద్రుమ లతా కుసుమ పల్లవ లలితమై, నానా మృగఖగకలకలమై, నానావర్ణ శిలాధాతు రంజితమై, నానామునిజనాశ్రమ సమన్వితమై, రమ్యము అయిన ప్రదేశమునందు ఆసీనుడై ఉన్నవాడు. జగన్నాథుడు, జగద్యోని, చతుర్ముఖుడు, జగన్నాథుడు, జగద్వంద్యుడు, జగదాధారుడు ఈశ్వరుడు, జగత్పతి, దేవదానవాదులచే వివిధ రీతుల సేవింపబడుచున్న బ్రహ్మను భృగ్వాది మునులు దర్శించి మ్రొక్కి ఇదే అంశములను అడిగిరి. భగవంతుడా! భూతలమున కర్మ భూమిని, దుర్లభమైన మోక్షపద క్షేత్రమును తెలుపుడు అనగా సురేశ్వరుడు ఇట్లు తెలుపబూనెను. (26)

భారత వర్ష వర్ణనము

బ్రహ్మ ఇట్లు అనియె .....

భక్తి ముక్తి ప్రదమై వేద సమ్మితమైన పురాణమును ఎరిగించెద వినుడు. భారత వర్షము కర్మభూమి అనబడు. కర్మఫలభూములు స్వర్గము, నరకమును కూడా కలిగించును. బ్రాహ్మణాదులీ భారతవర్షమందే స్వకీయ కర్మములను ఆచరించి సిద్ధిపొందిరి. ఇందు సందియము లేదు. ధర్మాది పురుషార్థ ప్రదము ఈ భూమి. ఇంద్రాదులు ఇచట శుభకర్మ మాచరించి ఇంద్రాది పదవులందిరి. ఈ వర్షమందలి బుధులు, శాంతులు, వీతరాగులు, విమత్సరులు అయిన మరి కొందరు మోక్షమునందిరి. విమాన యానమున స్వర్గమున నిర్భయముగ ఉండు సురలు కూడ ఈవర్షమునందు శుభకర్మముల నాచరించియే స్వర్గమున కేగినారు. సురాసురులు కూడ ఈ భారత భూమియందు వసింప వేడుక పడుదురు. ఎన్నడు ఆ పుణ్యభారతము దర్శింతుమాయని ఉవ్విళ్ళూరుచుందురు.

నీచే చెప్పబడిన కర్మ భారతవర్షమున తప్ప ఇతరలోకమున ఫలప్రదము కాదు. కావున భారత భూమియే ఉత్తమము, స్వర్గాదులు మధ్యమములనుచు ఆనతిచ్చితిరి. అట్లయిన నా పవిత్ర భూమి వృత్తాంతము సమగ్రముగ, ఆనతిమ్మన పద్మజుడు ఇట్లు చెప్పెను.

భారత వర్షమున భాగములు తొమ్మిది. ఇంద్రద్వీపము, కశేరువు, తామ్రపర్ణము, గభస్తిమంతము, నాగద్వీపము, సౌమ్యము, గాంధర్వము, వారుణము అను తొమ్మిది భాగములు కలవు. ఈ భారత ఖండము సముద్ర పరివృతము. ఇచటి నదులు ఉపనదులు ఈ పురాణమునందు పందొమ్మిదవ అధ్యాయమున పేర్కొనబడినవి.

మహాత్ముడైన భార్గవుని పురము గ్రోవర్ధన మతిరమ్యము. ఇందు ఉత్తర దేశములు వాహేక, వాటధాన, సుతీర, కాలతోయద, అవరాస్త, శూద్ర వర్షాకాలమందు మాత్రమే ప్రవహించునవి. ఎల్లప్పుడు ప్రవహించునవియు అగు నదులు గలవి మత్స్యములు మకుట కుల్యములు కుంతలములు కాశ్మీశములు. అంధ్రకములు, కళింగములు, సమకములు, వృకములు అనుదేశములు మధ్య ప్రదేశమందలి దేశములు. సహ్యాపర్వతమునకు ఉత్తరమున గోదావరి పుట్టి ప్రవహించిన ప్రదేశము. మొత్తము భూమండలమునకు ఎల్ల. ఇది, మనోహరమైనది. వాహ్లీక, వాటధాన, సుతీర, కాలతోయద, అపరాంత, శూద్ర, బాహ్లీక, కేరళ, గాంధార, యవన, సింధు సౌవీర, మద్రక, శతద్రుహ, కళింగ, పాద, హారభూషిక, మాతర, కనక, కైకేయ, దంభమాలిక అనునవి క్షత్రియ, వైశ్య, శూద్ర జాతి నివాసములైన దేశములు కాంభోజ, బర్బర, లౌకిక, వీర, తుషార, పహ్లవ, ఆధాయత, నర, ఆత్రేయ, భరద్వాజ, పుష్కల, దశేరక, లంవక, శునశ్శోకకులిక, జాంగల, ఔషధి, చలచంద్రములు, కిరాత జాతులుగల దేశములు. తోమర హంస, మార్గ, కాశ్మీర, కరుణ, శూలిక, కుహక మాగధములు అనునవి భారతోత్తర దిశనున్న దేశములు. ఇక తూర్పు దేశములందు తెల్పెద తెలిసికొనుడు.

ఆంధ్ర వామజ్ఘాక బల్లక మఖాంతక అంగ, వంగ, మలద, మాలవ, ఋత్తిక, భద్రతుంగ, ప్రతిజయ, భార్యాంగ (దర్భాంగ), అపమర్దక, ప్రాగ్జ్యోతిష, మద్ర, విదేహ, తామ్ర లిప్తక, మల్ల మగధక నందములు. దక్షిణాపథ దేశములు. పూర్ణ కేవల, గోలాంగూల, ఋషిక, ముషిక, కుమార, రామఠ. శక మహారాష్ట్ర, మూహిషక, కళింగ, ఆభీర, వైళిక్య, అటవ్య, సరవ, పులింద, మౌలేయ, వైదర్భ, దందక, పౌలిక, మౌలిక, అశ్మక, భోజ వర్ధన, కాలిక, కుంతల, దంభక నీల కాలకములు. ఇవి దాక్షిణాత్య దేశములు.

శూరివక-కాలిధనలోల తాంకటములు-అపరాంత దేశములని చెప్పబడును. మలజ-కర్కశ-మేలక-జోళక, ఉత్తమర్ణ దశార్ణ-భోజ-కిష్కింధ, తోషల-కోశల-త్రైపుర-వైదిశ-తుంబుర-చర-యనన-పవన-అభయ-రుండికేర-బర్బర-హోత్ర ఋతువులు. వింధ్యపర్వత ప్రాంతములు. ఇక పర్వతాశ్రయములైన దేశములు. నీహార-తుషమార్గ కురు, తంగణ స్వస కర్ణ ప్రావరణ ఊర్ణ దర్భ కుంతక చిత్రమార్గ-మాలవా కిరాత తోమరములు. ఇక్కడ చతుర్యుగ ధర్మము నడచును. ఈ భారత వర్షమునకు పూర్వ దక్షిణములుగా 'మహోదధి' యను పేరుగల సముద్రమున్నది. ఉత్తరమున హిమవంతము వింటినారి యట్లున్నది. ఈ భారత వర్షము సర్వబీజము. సర్వజీవులు కర్మాచరణముచేసి తత్తత్ఫలభాజనులగుటకు ఇదియే స్థానము. దేవతలుకూడ ఇందు మానవ జన్మమెత్తి

సుకృత మొనరించి తత్ఫల మవ్వలి లోకములను అనుభవింప గోరుదురు. ఇది తపఃఫలమిచ్చు భూమి. తీర్థ క్షేత్ర యాత్రాదాన దేవతారాధన స్వాధ్యాయాది సకల సత్కర్మ ఫలప్రద పుణ్య భూమి ఇది. బ్రహ్మచర్యా ద్యాశ్రమములు శాస్త్రములు వ్రతములు ఇష్టాపూర్తములు మఱి యేకల్యాణాచరణమేని ఇచట సఫలము కాక తప్పదు. ఈ భారతవర్ష ప్రశంస సర్వపాపహరము పుణ్యము ధన్యము జ్ఞాన వర్ధనము. ఇది చదివిన విన్నవారు సర్వపాప విముక్తులై విష్ణు లోకమందురు. (27)

కోణాదిత్య మాహాత్మ్యము

దక్షిణ సముద్ర తీరమందు ఓడ్రదేశము కలదు. అది స్వర్గ మోక్ష ప్రదము. సముద్రమునకు ఉత్తరముగా విరజ మండలము సరిహద్దులదాక అది ఉన్నది. అచటి బ్రాహ్మణులు జితేంద్రియులు. తపస్స్వాధ్యాయ నిరతులు. వంద్యులు, పూజ్యులును, యజ్ఞ దాన వివాహాది శుభ కర్మములందు శ్రాద్ధాదుల యందు వీరు చాలా ప్రశస్తులు. షట్కర్మ నిరతులు. ఇతిహాస పురాణార్థ విశారదులు. సర్వశాస్త్రార్థ సమర్థులు. మాత్సర్యహీనులు పుత్ర దారధనక్షేత్ర సంపన్నులు. సత్యవచనులు. దాతలు. క్షత్రియాది వర్ణములవారును స్వధర్మనిరతులు ధార్మికులు శాంతులు. ఆ దేశమందు కోణాదిత్యుడను పేర సూర్య భగవానుడు వెలసి యున్నాడు. తద్దర్శనము సర్వపాప నికృంతనము. లవణ సముద్రోత్తర తీరము వాలుకాకీర్ణము. మనోహరము సర్వపుష్ప ఫల భరితతరుసుందరము రమారమి సార్ధ యోజన విశాలముగా అచట సూర్య క్షేత్రము భక్తి ముక్తి ప్రదము. అది నానాతరులతా సుందరము.

మాఘమాస శుక్ల సప్తమినాడు వేకువన అక్కడి సముద్రమున స్నానముచేసి దేవ ఋషి పితృ తర్పణముచేసి ధౌతవస్త్రములు దాల్చి ఆచమించి అమ్మహోదధియందు ఉదయవేళ ఆసీనుడై రక్తచందన జలముల సూర్యునకు ఎనిమిది రేకులుగల కేసరా వృతమైన వర్తులాకార పద్మమును (అష్టదళ పద్మమును) కర్ణికతో గూడ లిఖించి తిలతండుల తోయముల రక్తచందనముతో గూర్చి రక్త పుష్పములు దర్భలు రాగిపాత్ర యందు ఉంచి దానిని మరొక పాత్రతో మూసి అంగన్యాస కరన్యాసములుచేసి తనను భాస్కరునిగా ధ్యానించి శ్రద్ధతో నడుమ నగ్నిదశమందు నైఋతి వాయవ్య ఈశాన్యస్థాన మధ్యయందు పూజచేయవలెను. (కేసరము=కింజల్కము)

ఆ పద్మమును ఆరాధించి, అందు గగనమునుండి భాస్కరుని ఆహ్వానించి, తామర పువ్వు దుద్దు మీద ప్రతిష్ఠించి, ముద్రా ప్రదర్శనముచేసి రెండు భుజములు తేనెరంగు కన్నులుగల వానినిగా అరుణ పద్మారుణాంబరధారిగా, సర్వాభరణ భూషితునిగా, సర్వలక్షణ

లక్షితునిగా, శాంతమూర్తిగా, వరదముద్రాధారిగా, ప్రభామండలమండితునిగా, సాంద్ర సిందూర వర్ణునిగ, ఉదయ భాస్కరుని ధ్యానించి మోకాళ్ళపై కూర్చుండి ఆ పాత్రను పైకెత్తి, శిరంబున దాల్చి, త్ర్యక్షర మంత్రముతో సూర్యునకు అర్ఘ్యమీయవలెను. సూర్య మంత్ర దీక్షలేనివాడు సూర్య నామముతోనే అర్ఘ్య మీయవచ్చును. ఆగ్నేయ-నైఋతి, వాయు-ఈశ-మధ్య పూర్వాదిదిశలందు-హృదయ-శిర శ్శిఖా-కవచ-నేత్ర అస్త్రములను పూజింప వలెను. అర్ఘ్యము అర్పించి, గంధ ధూప దీప నైవేద్యాదు లొసగి, జపముచేసి నమస్కరించి, స్తుతించి, ముద్రాబంధముతో విసర్జనము చెప్పవలెను, భక్తితో ఈ విధముగా సూర్యునకు అర్ఘ్యమిచ్చిన పుణ్యులు భుక్తిముక్తులను బడయుదురు. త్రైలోక్య దీపనుడైన భాస్కరదేవుని, గగన సంచారిని, ఎవ్వరు ఆశ్రయింతురో ఆ జనులు సుఖభాజనులు. భాస్కరున అర్ఘ్యమీయ కుండ విష్ణు శంకర సురేశ్వరులను అర్చింపగూడదు.

రోగవిముక్తి-ధనసంపత్తి-విద్యాసిద్ధి-పుత్ర పౌత్రాభివృద్ధి అన్నియు దీని వలన కల్గును. చేతిలో పూవులు ధరించి సూర్యాలయమునకు వెళ్ళవలయును. మూడుమార్లు ప్రదక్షిణము చేయవలెను. ఆ మీద ఆ దేవుని పూజింపవలెను. దానిచేత దశాశ్వమేధ ఫలము కల్గును, తుదకు సూర్యునివలె వెలుగు విమానమును ఎక్కి గంధర్వులచే ఉపగీయమానుడై, సూర్య భక్తుడు సూర్యలోకమందును తిరిగి వచ్చి యోగి కులమందు ఉదయించి భానుయోగము నంది ముక్తినందును. చైత్రశుక్లమందు మదనభంజిక అను (కామదహనము) యాత్రను చేసినను ఈ ఫలమందును. శయనోత్థాన ఏకాదశీ తిథులందు భాను సంక్రమణమందు ఈ యాత్రచేసినవారు విమానయానులై భానులోకమునకు పోవుదురు. ఆ సముద్ర తీరమున రామేశ్వరుడను పేర శివుడున్నాడు. ఆయనను అర్చించినవారికి రాజసూయ ఫలమొదవును. కామగమైన విమానమున ఈమున్ను చెప్పిన ప్రభావముతో శివపురికేగును. ఈ రవి క్షేత్రమున మరణించిన యెడల జీవి సూర్యలోకమంది, మానవ జన్మమెత్తి, ధార్మిక ప్రభువై సూర్య సారూప్యమంది మోక్షమందును. ఇది కోణార్కస్వామి మహిమ. అని లోమ హర్షణుడు చెప్పగా మునులు హెచ్చిన కుతూహలముతో మహానుభావా (28)

సూర్యపూజా ప్రకరణము

మీరు చెప్పిన భాస్కర క్షేత్రమహిమ వింటిమి. కాని మాకు తృప్తి కలుగలేదు. కావున పూజా విధానము దానము నమస్కారము-ప్రదక్షిణము ధూపదీపాది సమర్పణ ఉప వాసము, సూర్యాలయ మార్జనము-మొదలగు వాని విశేషములను వినగోరెదము. సూర్య ప్రీతికరములైన పూవులను, నమస్కార విశేషములను, సూర్య అర్ఘ్య విధానము, సూర్యుని

ఉద్దేశించి చేయు ఉపవాసము, నక్తము (పగలు ఉపవాసముండి రాత్రి భోజనము చేయుట) మొదలగువాని ఫలము, దేశకాల విశేషములను వినవలెనని కుతూహల పడుచున్నాము. అని మునులడుగ బ్రహ్మ ఇట్లు అనియె.

మనస్సుచేత జేయు భావన భక్తి, శ్రద్ధ, ధ్యానము, సమాధి అనుపేర్లచే పిలువబడును. భక్తి, సమాధి, స్తుతి అనువానిచే పత్ర, పుష్ప, ఫలతోయములు ఏకొంచెము ఒసగినను అది భగవంతుడు స్వీకరించి ప్రీతి చెందును. రవికి భక్తితో చేసిన ప్రదక్షిణము అఖిల భూప్రదక్షిణమే అగును. అది సర్వదేవతా ప్రదక్షిణమే కూడా. షష్ఠి తిథియందు ఏకభుక్తము చేసిగాని, సప్తమినాడు భానుని అర్చించిన అది అశ్వమేధ ఫలమిచ్చును. కృష్ణపక్ష సప్తమీ తిథియందు భాస్కరుని పూజించిన పద్మప్రభగల విమానములో ఎక్కి సూర్యలోకమునకు ఏగును. శుక్లపక్ష సప్తమినాడు ఉపవసించి తెల్లనిపూజా ద్రవ్యములచే అబ్జబాంధవుని పూజించిన అదియే ఫలము. అర్క సంపుటముతో (రాగి అరివాణముతో) కూడిన తీర్థమునే అనగా రాగి పళ్ళెములో ఉంచిన మంచినీటిని ఏకోత్తర వృద్ధిగా, అనగా క్రమముగా ఒకటి పెంచుచు, ఇరవై నాలుగు రోజులు పానము చేసి క్రమముగా తగ్గించుకొనివచ్చుచు, సేవించుచు ఇట్లు రెండేండ్లకు వ్రతసమాప్తి చేసినచో ఆ సూర్య సప్తమీ వ్రతము అశేష కామప్రదము. శుక్లపక్ష సప్తమి భానువారము కలసివచ్చెనేని అది విజయ సప్తమి అన బడును. అందు స్నాన దానములు అనంత ఫలదములు అగును.

ఆదివారము శ్రాద్ధము పెట్టినను, మహాశ్వేతము (తెల్ల జిల్లేడు)తో హోమమొనర్చి నను అభీష్టసిద్ధి కలుగును. వారి వంశమున దరిద్రుడుగాని, రోగిగాని పుట్టడు. తెల్లని ఎఱ్ఱని, పసుపుపచ్చని, మృత్తికతో పూసికొన్నవాని కోర్కెలు నెరవేరును. రంగురంగుల పూలతో చిత్రభానుని అర్చించి ఉపవాసము ఉండిన అభీష్టములు సిద్ధించును. ఆవు నెయ్యితో గాని, నువ్వుల నూనెతోగాని దీపముపెట్టి ఆదిత్యుని పూజించిన వానికి నేత్ర వ్యాధులుండవు. దీపదాతకు జ్ఞానదీపము లభించును. తిలలు పవిత్రములు కావున తైలగోదానము పుణ్య ప్రదము. నలుదారులు కలిసినచోట (చతుష్పథములందు) రాజమార్గములందు అట్టి దీపదానము చేసిననరుడు అందగాడు (సుభగుడు) భాగ్యవంతుడు అగును. దీపము హవిర్ద్రవ్యములు (ఆవు నెయ్యి) మొదలైన వానిచే పెట్టుట ప్రథమ కల్పము. ఓషధీరసముల చేత పెట్టుట రెండవ కల్పము. వసామేదోస్థి సంబంధమైన (క్రొవ్వుపదార్థములు) దీపము నిషిద్ధము. దీపము ఎప్పుడును ఊర్ధ్వముగా ప్రసరించును. కావున దీపదాత ఎపుడు ఊర్ధ్వ గతినే గాని అధోగతి పొందడు. వెలుగుచున్న దీపమును తగ్గింపరాదు. ఆర్పివేయరాదు. అట్లుచేసినవాడు బంధము, నాశనము, కోపము, తమోగుణమును పొందును. దీపదాత

స్వర్గ మందు దీపమాలవలె వెలుగును. కుంకుమ అగరు చందనములచే రక్తచందన రక్త పుష్పములచే ఆదిత్యుని అర్చించిన వాడు ఉదయమందు అర్ఘ్యమిచ్చివాడు సంవత్సరములో ఇష్టసిద్ధిని గాంచును.

సూర్యుడు ఉదయించి అస్తమించుదాక నిలబడి సూర్యాభిముఖుడై ఏదేని మంత్రము జపించినవాడు, సూర్య స్తోత్రమేదేని చేసినవాడు సర్వ పాపములనుంచి విముక్తుడు అగును. దీనిని ఆదిత్య వ్రతమందురు. సువర్ణ గోవృషభ వస్త్ర దానములతో సూర్యార్ఘ్యమును ఇచ్చిన పుణ్యుడు ఆ ఫలము ఏడు జన్మలదాక అనుభవించును. అగ్ని నీరు అంతరిక్షము, పవిత్రభూమి ప్రతిమ పిండితో చేసిన సూర్యమూర్తి అనువానియందు అర్ఘ్యమీయవలెను. సవ్యముగా గాని అపసవ్యముగ (కుడి ఎడమ ప్రక్కల) అర్ఘ్యమీయరాదు. అభిముఖముగ మాత్రమే సూర్యార్ఘ్యమీయ వలెను. రవికి గుగ్గులు కర్ర, మారేడు, దేవదారువులతో చేసిన నలుపలకల ఆసనము, కర్పూర అగరు ధూపము లొసగినవారు స్వర్గమందుదురు. విషువములందు (రాత్రి పగలు సమముగా ఉన్న పర్వములందు) ప్రభాకరుని అర్చించిన సర్వ దురితములు తొలగును. కృసరము (పులగము) పాయసము, అపూపములు, పండ్లు, దుంపలు, నెయ్యి అనువానిచే సూర్యబలి ఇచ్చిన సర్వ కామసమృద్ధి నందును. ఆవునేతితో తర్పణము చేసిన సర్వసిద్ధినందును. ఆవుపాలతో తర్పణము మనస్తాపహరణము, ఆవు పెరుగుతో చేసిన కార్యసిద్ధి. పవిత్ర తీర్థజలముచే మార్తండునకు స్నానము నిర్వర్తించినచో పరమగతి వడయును. ఛత్రముధ్వజము వితానము (చాందినీ) పతాక చామరములు భానునకు సమర్పించిన అభీష్టగతి లభించును. ఏ ద్రవ్యము అర్కునకు భక్తితో సమర్పించునో, ఆ ద్రవ్యము అనంతముగా లభించును. త్రికరణకృత దురితజాలమెల్ల జలజబంధువు (సూర్య దేవుడు) వారింపగలడు. యథోక్త దక్షిణముగా చేసిన క్రతుశతము వలన ఫలము ఒక్కనాడు సూర్యుని భక్తితో ఆరాధించినను లభింపగలదు. అనగా మునులు (29)

సూర్యభగవానుని మాహాత్మ్యము

"సూర్య భగవానుని మహిమ నీవు చెప్పగా విన్నాము. ఇంకను వినుటకు కుతూహలమగుచున్నది. బ్రహ్మచర్యాశ్రమస్థులు ముక్తిని పొందుటకు ఏ దేవతను ఉపాసింపవలయును. స్వర్గమునుండి దిగజారకుండుటకు ఏమిచేయవలయును? దేవతలకు పితృదేవతలకు పరమదేవత ఎవరు? ఈ సృష్టి ఎవనివలన జరుగును? ఎవ్వనియందు లీనమగును. తెలుపవలయును" అని అడుగగా, ఓ ద్విజోత్తములారా! ఈ ఆదిత్యుడు ఉదయించుచునే తన కిరణములచే చీకటిని హరింపజేయును. ఇంతకంటె మరిదైవమెవ్వరు?

ఈ పురుషుడు మొదలు తుదలేనివాడు శాశ్వతుడు. అవ్యయుడు. ముల్లోకములను తన కిరణములచే వెలిగించుచుండును. సర్వ దేవమయుడు, సర్వజగన్నాథుడు, సర్వసాక్షి, జగత్పతి, సర్వభూతములను సృజించును, పెంచును, సంక్షేపించును. ఈయనయే వేడిమిని ఇచ్చును, వర్షించును. ధాత, విధాత, భూతాది, భూతభావనుడు, అయిన ఈయనకు క్షయములేదు. అన్నివేళల అక్షయ మండ లుడు పితరులకు పిత. దేవతలకు దేవత. ఈయనది ధ్రువస్థానము. ఇందుండి మరలడు. ఆదిత్యుని నుండి జగత్తు పుట్టును. అందులయించును. యోగులు కళేబరమును వీడి వాయు రూపమంది తేజోరాశియైన దివాకరుని యందు ప్రవేశింతురు. పక్షులు తరుశాఖలను ఆశ్రయించి ఉన్నట్లు ఈయన వెలువడజేయు వేలకొలది కిరణములను ఆశ్రయించి సిద్ధులు, దేవతలు ఈయనయందు వసింతురు. యోగులు, గృహస్థులైన జనకాది రాజర్షులు వాలఖిల్యాదులు, బ్రహ్మవాదులైన మహర్షులు వ్యాసాదులు వానప్రస్థులు భిక్షువులు యోగము పూని సూర్యమండలమున ప్రవేశింతురు. వ్యాసకుమారుడు శ్రీ శుకుడు యోగధర్మము పూని యాదిత్య కిరణముల జొచ్చి పునరావృత్తి లేని పదవిని పొందియున్నాడు.

బ్రహ్మ విష్ణు శివాది దేవతలు శబ్దమాత్ర శ్రుతిగమ్యులు. ఈయనయే ప్రత్యక్షముగా మన కనులకు కనిపించు పరదేవత, తమోహరుడు. విష్ణుముఖ దేవతావర్గము కంటికి కానరారు. ఈయన ప్రత్యక్ష నారాయణుడు. ఈయనయే తల్లి, తండ్రి, గురువు, అనాది, రశ్మిమాలి, జగత్పతి, మిత్రుడు నిత్యుడు, అక్షయుడు. ఈయన సాగర ద్వీపములను పదునాల్గు భువనములను సృజించి చంద్రనదీ తీరమున ఉన్నాడు. సహస్రాంశువై అవ్యక్తుడయ్యు, ద్వాదశమూర్తులచే వ్యక్తుడై, ప్రత్యక్ష నారాయణుడై, ఆదిత్యస్థానమున వెలుగుచున్నాడు.

ఇంద్రుడు, ధాత, పర్జన్యుడు, త్వష్ట, పూష, అర్యముడు, భగుడు, వివస్వంతుడు, విష్ణువు, అంశుమంతుడు, వరుణుడు, మిత్రుడు అను ఈ పండ్రెండు మూర్తులచే ఈ పరమాత్మ సర్వజగమ్ములు వ్యాపించియున్నాడు. దేవశత్రునాశినియైన మూర్తి ఇంద్ర రూపమున దేవ రాజ్యమందున్నది మొదటిది, రెండవది ప్రజాపతి రూపమున సృష్టి గావించునది. మూడవది మేఘములందు వర్షించునది. నాల్గవది వనస్పతులందు ఓషధులందున్నది. ఐదవ మూర్తి పూష, అన్నగతమై ప్రజల పోషించును. ఆఱవమూర్తి ఆర్యమా రూపమై దేవతలందున్నది. సప్తమ మూర్తి భగనామమున దేహులదేహములందు, సంపదలందు ఉన్నది. ఎనిమిదవది వివస్వాన్ అగ్నిగా ఉండి జీవుల ఆహారమును పచనము చేయుచున్నది. తొమ్మిదవది 'విష్ణువు' అను మూర్తి. దేవశత్రు సంహారమునకు ప్రవర్తించును. పదవమూర్తి వాయువునందు ఉండి జీవులకు సుఖ స్పర్శనొసగి ఆనందపెట్టును.

పదునొకండవ మూర్తి వరుణనామకము,జలములందుండి ప్రజాపుష్టి కూర్చును. పది రెండవ మూర్తి మిత్ర సంజ్ఞకము. లోకహితమునకై చంద్రనదీ తీర మందున్నది. ప్రభాకరుడు ఈ మూర్తితో వాయుభక్షణ సేయుచు మైత్రీ ప్రయుక్తమైన చూపుతో వరములు ఇచ్చి, భక్తానుగ్రహము చేయుచు చంద్రనదీ తటమందు తపము చేయుచుండును.కావున అతడు మిత్రుడను బిరుదు నామమందెనని స్మృతులు తెలుపుచున్నవి. ఇట్లు ద్వాదశ మూర్తియగు పరమాత్మ స్థావర జంగమముల కెల్ల ఆత్మరూపుడైన సూర్యభగవానుడై, ధ్యానమునకు లక్ష్యమై యుండి నమస్కరింపతగినవాడు ఈ ద్వాదశాదిత్యులను గూర్చి నిత్యము నమస్కరించుచు, పఠించుచు, వినువారు సూర్యలోకమందు వెలుగొందుదురు" అని లోమహర్షణుడు చెప్పగా మునులు ఇట్లు పలికిరి .....

సూర్యుడు సనాతనుడగు ఆది దేవుడైనచో ప్రాకృత జనునివలె వరములను కోరుచు తపమెందులకు చేసెను.

బ్రహ్మ ఇట్లు అనియె-ఇది మిక్కిలి రహస్యవిషయము. నారదుడు సూర్యుని అడిగిన విషయమిది. ఇంతకు మున్ను సూర్యభగవానుని పండ్రెండు మూర్తుల గురించి చెప్పితిని. అందు మిత్రుడు. వరుణుడు అనువారు తపస్సు నందుండిరి. అందు జలా హారియై వరుణుడు పశ్చిమ సముద్రమునందును మిత్రుడు వాయుభక్షకుడై, ఈ వనమందును ఉన్నారు. ఈ మిత్రుడు మేరుశిఖరము నుండి గంధమాదనము నుండిజారెను. మహా యోగియైన నారదుడు మిత్రుని దగ్గరకు వచ్చెను. తపస్సు చేయుచున్న ఆయనను చూచి చాలా వేడుకపడెను. అవ్యయము వ్యక్తావ్యక్తము త్రిలోకధారకము సర్వదేవతా పరా యణము సర్వజనకమునైన మిత్రమూర్తి మనస్సుచేత మఱి ఏ దేవతలను, పితృ దేవతలను ఉద్దేశించి ధ్యానించుచు యజించుచున్నాడు అని ఆలోచించి ఆయనతో ఇట్లు అనెను.

"సాంగోపాంగములైన వేదములందు నీవు గానము చేయబడుదువు. భూత భవద్భవ్యమయిన ఈ దృశ్యమెల్ల కేవల ద్రష్టవైన నీ యందు విలుపునందును. గృహస్థా ద్యాశ్రమస్థులు నల్గురు నిన్నే పూజింతురు. నీవు సర్వ జగజ్జనకుడవు జననివియును, దైవమును, నీవు నీకు పితయైన మఱి యే దేవతను యజింతువో మేము ఎఱుంగము"

అనగా మిత్రుడు (సూర్యుడు) ఇట్లనియె. "నీ వడిగిన ప్రశ్నము పరమగుహ్యము. తెలుపరానిది. నీవు భక్తుడవని తెలుపుచున్నాను. సూక్ష్మము అవ్యక్తము అచలము ధ్రువము అనబడు ఆదివస్తువేది గలదో అది భూతేంద్రీయ వివర్జితము. సర్వభూతాంతరాత్మ క్షేత్రజ్ఞుడనబడును. త్రిగుణాతీతము. పురుష శబ్దవాచ్యము. హిరణ్యగర్భ నామకమే అదియే

బుద్ధియని చెప్పబడును. మహత్తు ప్రధానమనియు యోగ సాంఖ్యము లందు పెక్కుపేరుల పిలువబడును. ఆ వస్తువు త్రిరూపము. ఈశ్వరుడనియు, అక్షరమనియు పేర్కొనబడినది. అది ఏకరూపమై ఈ త్రిలోకమును ధరించును. శరీరులందు అశరీరుడై యుండును. కర్మ లేశము అతనికి లేదు, అంతరాత్మ అనగా అదియే. సర్వసాక్షి. ఈ తత్వము సగుణము, నిర్గుణము. విశ్వరూపము. జ్ఞానగమ్యము. సర్వతః పాణిపాదము. సర్వతోక్షి శిరోముఖము. సర్వత శ్రుతిమంతము. సర్వమావరించి ఉన్నది. విశ్వమూర్ధము విశ్వ భుజము విశ్వ పాదాక్షినాసికము. క్షేత్రమందు (దేహమందు) స్వేచ్ఛా సంచారియై ఒక్కడుగా ఉండును, తానున్న ఉపాధుల నెరుగువాడు కావున క్షేత్రజ్ఞుడనబడును. అవ్యక్తమయిన పురమందు శయించును. కావున పురుషుడనబడును. విశ్వము బహువిధము. అది ఆయనయే కావున విశ్వరూపుడన బడును. ఆయన యొక్కనికే మహత్త్వముండుటచే అతడు మహాపురుషుడు. ఆకాశమునుండి పడిన నీరు భూమియొక్క రుచిని బట్టి రుచి భేదమందినట్లు గుణభేదమును బట్టి అతడు పలువిధ రూపముల గానవచ్చును. ఒక్కటే వాయువు దేహమందు అయిదు తీరులుగ ఉన్నట్లాయన ఒక్కడే నానారూపుడగును. అగ్ని స్థాన భేదమునుబట్టి పలు రీతుల గనవచ్చి పలునామము లందినట్లు ఆయనయు ఉపాధి నిమిత్తముగా నానాత్వ మందును. ఒక్క దీపమునుండి పలుదీపములు ముట్టింపబడి వెల్గిన ట్లొక్కడయ్యు అతడనేక రూపముల కన్పించి వెలుగును. తన్ను తానెరిగినతరి అతడు కేవలుండగును. ఏకత్వ ప్రళయమునందు బహుత్వము నొందును. నిత్యుడు అతడొక్కడే. అతని వలన త్రిగుణ రూపము అవ్యక్తము పొడమినది. వ్యక్తావ్యక్త భావ అవస్థయగు దానినే ప్రకృతి అందురు. అదిబ్రహ్మకు కారణము. బ్రహ్మ సదసదాత్మకుడు. దేవ పితృ కర్మములందితడే పూజింప బడువాడు. అతడు, తండ్రి, దేవుడు, ఆత్మచే తెలియదగినవాడు. అతనినే నేను పూజించు చున్నాను. నానారూపముల, నానాదేవతల అర్చించు అందరి పూజలు అతడికి ఒక్కడికే చెందును. ఆయన సర్వగతి. ఆయనయే సూర్యుడును. కావున దివాకరుని నామరూపమునే నేనారా ధింతును. ఏకత్వ విశ్వాసము గలవారు ఏకైకమైన ఆ పరతత్వమునే అందురు. ఇది గుహ్యాతి గుహ్యమైన అంశము."

ఇట్లు ఇంతకు ముందు నారదునకు సూర్యుడు తెలిపెను. మీకు ఇది తేట తెల్లముగా నేను వివరించితిని. ఆదిత్య భక్తిలేని వానికిది తెలుపరాదు. ఇదిచదివిన, విన్న నరులు సహస్ర కిరణు సాలోక్యము పొందగల్గుదురు. ఇది సర్వ దుఃఖహరము. అభీష్ట సిద్ధిదము. సూర్య భగవానుని మీరెల్లప్పుడు స్మరింపుడు. ఆయనయే ధాత, విధాత, సర్వజగత్ప్రభువు. (30)

మార్తండుని కీర్తనము

బ్రహ్మ ఇట్లు అనెను.

"ఓ మునులార! సదేవాసుర మానుషమైన సర్వజగత్తు ఆదిత్యమూలము. ఈ తేజస్సు ఇంద్ర ఉపేంద్రాది సర్వ దేవతామయము. పరమదైవతము ఇదియే. అగ్నియందు యథా విధి వేల్వబడిన ఆహుతి ఆదిత్యునందును ఆదిత్యునివలన వృష్టి. వర్షమువలన అన్నము, దానివలన, ప్రజలు కల్గుదురు. ధ్యాననిష్ఠులకు ధ్యానము, మోక్షులకు మోక్షము-ఈతత్వమే. క్షణ-ముహూర్త-దివస-నిశా-పక్ష-మాస-సంవత్సర-ఋతు-యుగాది కాలగణనము ఆదిత్యుని వలననే. కాలము లేక నియమములేదు. అగ్ని విహరణ క్రియలేదు. ఋతు విభాగములేదు. అపుడు పుష్పఫలము లెక్కడ ఉండగలవు. సస్య నిష్పత్తి యెక్కడిది. తృణ ఓషధి గణమెక్కడ ఉండును? ఇక్కడ దివంబునను జీవ వ్యవహారము లేనేలేదు. నీటిని హరించునట్టి భాస్కరుని వలననే జగద్వ్యవహారముసాగును. వృష్టి లేక సూర్యుడు తపింపడు నీటిని శోషింపజేయడు. గుడికట్టడు. ఉదకముననే వెలుగును. వసంతమున కపిలవర్ణుడు. గ్రీష్మమున బంగారురంగువాడు. వర్షఋతువున తెల్లనివాడు. శరత్కాలమున పాండువర్ణము వాడు. హేమంతమున రాగిరంగుగలవాడు. శిశిరమున లోహితుడు (ఎఱ్ఱని వాడు). ఋతు స్వభావ సిద్ధములయిన రంగులంబట్టి కూడ సూర్యుడు క్షేమము, సుభిక్షము చేయునట్టివాడు.

సూర్యునకు ఆదిత్య, సవితృ, సూర్య, మిహిర, అర్క, ప్రభాకర, మార్తాండ, భాస్కర, భాను, చిత్రభాను, దివాకర, రవి - ఇత్యాదిగ పండ్రెండు సామాన్య నామములు. విష్ణు ధాత, భగ, పూష, మిత్ర, ఇంద్ర, వరుణ, అర్యమ, వివస్వత్, అంశుమత్, త్వష్ట, పర్జన్య అను ఈ పండ్రెండు నామములు విశేషనామములు. విష్ణువు చైత్రమందు పండ్రెండు వందల కిరణములతో వెలుగును. అర్యముడు వైశాఖమందు పదమూడు వందల రశ్ములలో దీపించును. వివస్వంతుడు జ్యేష్ఠమందు పదునాల్గు వందల కరములతోడను, అంశు మంతుడు ఆషాఢమున పదునేను వందల అంశువులతోను, పర్జన్యుడు శ్రావణ మందు పదునాల్గు వందలును, వరుణుడు భాద్రపదమందు అన్నియే కిరణములచేతను, ఇంద్రుడు ఆశ్వయుజమున పన్నెండు వందల కిరణములతోను ధాత కార్తీకమందు పదు నొకండు వందల కిరణములచేతను మార్గశిరమున మిత్రుడు పై విధముగాను, పౌషమున పూష తొమ్మిది వందల కిరణములతోను మాఘమున భగుడును ఫాల్గుణమున త్వష్ట పదునొకండు వందల కిరణములతోను వెలుగుదురు, ఉత్తరాయణము నుండి సూర్య కిరణములు పెంపొందును. దక్షిణాయనము నుండి తగ్గును. ఇట్లు వేలకొలది కిరణములు గ్రహములను

అనుసరించి సూర్యునినుండి వెలువడి వెలుంగును. సూర్య సామాన్య నామములు. విశేష నామములును కలిసి ఇరువది నాల్గు ప్రసిద్ధములు. ఇవి గాక సూర్య సహస్ర నామములు వేఱుగా నున్నవి.

అంతట మునులు-ఓ పరమేశ్వరా! ప్రజాపతీ! సహస్రనామములతో సూర్యుని స్తుతించిన మానవునకు ఏ పుణ్యము ప్రాప్తించును? ఏ గతి సిద్ధించును? తెలుపుమని అడిగిరి. బ్రహ్మ ఇట్లు చెప్పెను-మునులారా! సూర్యసహస్రనామ పారాయణమువలన ఏఫలము గల్గునో పవిత్రము శుభావహము, గుహ్యములునైన ఆ సూర్యనామములను మీకు తెల్పెదను వినుడు. 1. వికర్తనుడు 2. వివస్వాంశుడు 3. మార్తాండుడు 4. భాస్కరుడు 5. రవి 6. లోకప్రకాశుడు 7. శ్రీమాన్ 8. లోకచక్షుడు 9. మహేశ్వరుడు 10. లోకసాక్షి 11. త్రిలోకేశుడు 12. కర్త 13. హర్త 14. తమిస్రుడు 15. తపసుడు 16. తాపసుడు 17. శుచి 18. సప్తాశ్వవాహనుడు 19. గభస్తిహస్తుడు 20. బ్రహ్మ 21. సర్వదేవుడు అనునవి సూర్యుని ఇరువది ఒక్క నామములు. ఈ పవిత్ర నామస్తుతి సూర్యునకు సదా ప్రీతిని గూర్చును.

ఇది శరీరారోగ్యము, ధనవృద్ధి, యశస్సును కూర్చును. రెండు సంధ్యలందు ఈ స్తుతి పఠించిన పాపములెల్ల పోవును. ఒకసారి జపించిన త్రికరణకృతమైన దురితము నశించును. ఒకమారీ నామములచే హోమము సంధ్యోపాసనము చేసిన అర్ఘ్యమందు బలియందు, అన్నదానమందు, స్నానమున, నమస్కారమందు, ప్రదక్షిణమందు ఈ మహా మంత్రము పఠించిన సర్వపాపక్షయమగును. శుభమగును. కావున మీరీమంత్రము పఠించి వరదుడైన సూర్యదేవుని నుతింపుడు"(31)

మార్తాండ జన్మ శరీరలిఖన వర్ణనము

"దివాకరుడు, శాశ్వతుడు, నిర్గుణుడు అని తెల్పితివి. తరువాత పండ్రెండు మూర్తులతో జన్మించినట్లు తెల్పితివి. తేజోరాశియైన యా వెల్గు స్త్రీ గర్భమందెట్లున్నది? ఎట్లు పుట్టెను. ఇది మాకు పెద్ద సంశయము తీర్పుము" అని మునులడుగ బ్రహ్మవారితో ఇట్లనెను.

దక్షునకు సౌందర్యవతులు ప్రసిద్ధలు అయిన అరువది మంది కుమార్తెలుండిరి. వారు అదితి, దితి, దనువు, వినత మొదలైనవారు. అందు పదముగ్గురను కశ్యపునకు ఇచ్చెను. వారి పుత్ర, పౌత్ర, దౌహిత్ర, సంతతి అనంతము. అదితి సంతతి దేవతలు, దితి సంతానము దైత్యులు అనగా రాక్షసులు. వారు అన్యోన్యము కలహించిరి. దానిచేత ముల్లోకములు ఆకులమగుటకు వగచి, అదితి సూర్యుని ఆరాధించెను. ఆమె సూర్యుని ఇట్లు స్తుతించెను.

అతిదికృత సూర్యస్తుతి

సూక్ష్మము పుణ్యము స్వచ్ఛమునైన పరమతేజస్సును ధరించు నీకు నమస్కారము. తేజోవంతులకు ఈశ్వరుడును తేజస్సులకు ఆధారభూతుడు శాశ్వతుడునై జగదుపకారమునకై తీవ్రరూపముదాల్చిన నిన్ను స్తుతించెదను. ఓ గ్రహాధిపతి! ఎనిమిది మాసములు (ఆదాన మాసములు) జలరూపమయిన రసమును గ్రహించుటకు తీవ్రరూపమును దాల్చు నీకు వినతనయ్యెదను. అగ్నిష్టోమములతో గూడి త్రిగుణాత్మకమై ఋగ్యజుసామరూప వేదత్రయీ రూపమైన నీ స్వరూపము ఈ విశ్వమును తపించుచున్నది. అట్టి నీకు నమస్కారములు. ఓ సనాతన మూర్తి! నీ త్రయీరూపము కంటె పరమై ఓంకారముచేత అభిసంహిత మైన (వర్ణింపబడిన) స్థూలము సూక్ష్మమునైన ఆ నీ రూపమునకు నమస్కారము.

అని ఇట్లు నిరాహారమై అహర్నిశము ఆ భగవానుని స్తుతించెను. చిరకాలమునకు ఆ సూర్యభగవానుడు ఆమెకు ప్రత్యక్షమయ్యెను. ఆమె ఆకసమంతట ఆవరించి పుడమికి అవతరించిన ఆ జ్వాలామయమూర్తిని జూచి మిక్కిలి జడుపంది స్తుతించెను.

ఓ దివాకర! జగత్తునకెల్ల మొదటివాడా! నీ స్వరూపము చూడలేకున్నాను. నేను చూడగల్గునట్లు ప్రసన్నుడవగుము. నీ భక్తులగు నాబిడ్డలను రక్షింపుము.

అంతట సూర్య భగవానుడు ఆ తేజోమండలము నుండి వెలువడి అగ్నితప్తమైన రాగి వలె నెఱ్ఱగా సాకారముగ దర్శనమిచ్చి, నమస్కరించుచున్న ఆమెతో అభీష్టవరము కోరుకొను మనెను. ఆమె శిరసువంచి మోకాళ్ళ మీదవ్రాలి నమస్కరించి వరదుడయిన స్వామిని ఇట్లు కోరెను.

గ్రహరాజా! నా యెడను నా పుత్రులయెడను ప్రసన్నుడవుకమ్ము. ప్రబలురైన దైత్య దానవులు త్రిభువనములను హరించి యజ్ఞభాగములను తామే అనుభవించుచున్నారు. అందుచే మాయెడల ప్రసన్నుడవై నీ అంశమున వారికి భ్రాతవై జన్మించి ఆ శత్రువులను నశింపజేయుము. నా కుమారులు మరల యజ్ఞభాగములు అనుభవించి ముల్లోకములకు ప్రభువులగునట్లు అనుగ్రహింపుము. శరణన్నవారి దుఃఖమును హరించువాడవు. వారి కార్యము చక్కబెట్టువాడవు అని పేరొందితివి" అనగా ఉదకములను హరించు సూర్య భగవానుడు ప్రసన్నుడై ఆమెతో

నేను నీతపస్సునకు సంతోషించితిని. నీకు నా తేజస్సులో వేయియవవంతులో కుమారుడనై జనించి నీ బిడ్డలకు శత్రువులయినవారి నందరను నశింపజేసెదను అని చెప్పి సూర్యభగవానుడు అంతర్ధానమందెను. ఆమె కోరిక సఫలమై తపస్సును చాలించెను.

అటు తరువాత ఒక సంవత్సరమునకు 'సుషుమ్న' అనుకిరణరూపమున అదితి గర్భమందు ఆమె కోర్కె సఫలమొనర్ప సూర్యుడు ప్రవేశించెను. ఆమె కృచ్ఛ్ర చాంద్రాయణాది వ్రతములను ఆచరించెను. అంతట కశ్యపుడు కుపితుడై 'నిత్యోపవాసములను చేసి నీగర్భమారణము చేసికొందువా' యనగా ఆమె కుపితయై ఈ గర్భాండమును జూడుము. ఇది మారితము కాలేదు. గాక శత్రు మారకము కాగలదు అని పలికి గర్భమును పనివడి విసర్జించెను. అట్లు జారిన ఆమెగర్భము తేజస్సులచే జాజ్వల్యమాన మయ్యెను. కశ్యపుడు భాస్కర వర్చస్వియగు ఆమూర్తింగని ప్రణతుడై ఆదరముతో తొలిపల్కుల స్తుతించెను. అంతట నాగర్భాండము వెలువడి పద్మపత్రమట్టి అరుణ ప్రభల దీపించుచు నలుదెసలు ఉద్దీపింప జేయుచు నొక మూర్తి ప్రత్యక్షమయ్యెను. అవ్వల అంతరిక్షమునుండి ఆముని సత్తముని గూర్చి అశరీరవాణి సజలజలద గంభీరముగా ఇట్లు పలికెను.

ఈ అండము మారితమని నీవంటివి. ఓ కశ్యప మునీంద్రా! అందువలన నీ మూర్తి మార్తాండుడను పేరుచేత ప్రసిద్ధి చెందగలదు. ఇతడు యజ్ఞభాగముల హరించుచున్న అసురులను సంహరించును. అప్పుడు ఆ ఆకాశవాణి వాణినాలించి గీర్వాణులు హర్షించిరి. దానవులు దిగులొందిరి. దేవేంద్రుడు అంతట అసురులను యుద్ధమునకు పిలిచెను. మార్తాండునిచే చూడబడిన దానవులెల్ల నిస్తేజస్కులై దహింపబడి భస్మమైపోయిరి. దేవతలు మార్తాండుని పెక్కు భంగుల వినుతించిరి. సురలు మార్తాండుడు స్వాధికారమును బడసి యజ్ఞభాగములు అందిరి. ఇనుడు క్రిందుమీదును తన కిరణములచే కడిమి పూవువలె భాసించుచుచ అగ్నిగోళమట్లు వెలుంగుచు అస్ఫుటమైన ఆకారము దాల్చెను.

అంత మునులు "కదంబ ముకుళమట్లెఱ్ఱగ కన్నెఱ్ఱయైన ఆమూర్తి ఎట్లు దర్శనీయమయ్యె" ఆనతిమ్మన బ్రహ్మ ఇట్లనియె.

తపస్వినియైన సంజ్ఞ సవర్ణకు (ఛాయకు) ఇట్లు తెలిపి బిడ్డలనప్పగించి తండ్రియగు త్వష్ట ప్రజాపతి సమీపమున కేగి సిగ్గున తలవంచుకొని నిలువబడెను. ప్రజాపతిచే భర్త సన్నిధికి పోపొమ్మని పలుమారులు అదలించి బెదిరించి ఆదేశింపబడియు ఆయింతి కాంతుని వంక బోక బడబాకృతిని దాల్చి (ఆడుగఱ్ఱమై) తన రూపము మఱుగు పఱచుకొని ఉత్తరకురుభూములందు పచ్చిక బయళ్ళలో తిఱుగజొచ్చెను.

రెండవ సంజ్ఞను ఈమె సంజ్ఞయేయని భావించి ఆమెయందు ఆదిత్యుడు తనకు సమానుడైన కొడుకుంగాంచెను. ఇంతకు మున్ను, పుట్టిన మనువును పోలినవాడైనందున ఇతడును 'సావర్ణ మనువు' అని పిలువబడుచుండెను.

ఆమెకు కల్గిన రెండవకుమారుడు శనైశ్చరుడు అతడు పుట్టిన తరువాత ఆమె తనకు అప్పగించిన సవతిబిడ్డలను ఆదరింపదయ్యెను. మనువు దానికిసైచి ఊర కుండెను. యముడది ఓర్వక ఆసవతి తల్లిని పాదమెత్తి బెదరించెను. అందులకు ఛాయ కోపించి మిగుల దుఃఖించి నీకాలు పడిపోవుగాకయని శపించెను. యముడా వృత్తాంతమును తండ్రికి ప్రాంజలియై విన్నవించెను. నాకు ఆమె ఇచ్చిన శాపమును మరలింపుమని తండ్రిని వేడుకొనెను. తల్లి తనయులందరియెడ వాత్సల్యముతో వర్తింప వలయునుగదా. ఈ అమ్మ మమ్ములను నిరసించినది. అందువలననే ఆమెపై పాదమెత్తితిని. ఎత్తితినే కాని ఆమె శరీరమునకు తాకింపలేదు. నేనుచేసిన తప్పును క్షమింపదగుదువు. తల్లిశాపమునకు గురియైతిని గ్రహరాజ! నీ అనుగ్రహముచే నా పాదము పడిపోకుండుగాక! అని కొడుకు వాపోవ కరుణించి సూర్యుడిట్లనియె. పుత్ర! ఇందేదో గొప్ప కారణముండి తీరును. ధర్మజ్ఞుడవు, సత్యవచనుడవైన నిన్ను క్రోధము ఆవేశించినది. నీతల్లిమాట మిథ్యగాకుండుటకు, కృములు నీకాలి మాంసము తిని అవని కేగును ఈరీతి మీ అమ్మ మాట సత్యము కాగలదు. ఈవిధమైన శాపపరిహారముచే నీవును సురక్షితుడయ్యెద వనెను.

ఆదిత్యుడు సంజ్ఞను జూచి (ఛాయామూర్తిని) బిడ్డలనందరిని ఒక్కరీతిగా గాక ఒక్కని యందెక్కువ ప్రేమ నీకెందులకని అడిగిన నామె అమాట తప్పించెనేగాని నిజము చెప్ప దయ్యెను. అతడు తనకుతాను సమాధానపడి యోగదృష్టిచే నిజమెఱింగెను. ఆమె అప్పుడు శపింపబూనియు శాపమీయక జుట్టు పట్టుకొని ఊపెను. అంత ఆమె జరిగినది పతికి విన్నవించెను. వివస్వంతుడు విని కనలి మామగారగు త్వష్ట చెంత కరిగెను. మామయు అటువచ్చిన అల్లుని ఆదరించెను. రోషముగొని తనను దహింప ఏతెంచినాడని గ్రహించి అపుడాతని అనునయించుచు ఇట్లనెను.

ఓ ఆదిత్య మూర్తి! ఈ నీ రూపము భరింపరాని తేజముచే చూడరాదయ్యెను. సంజ్ఞ ఇది సైపనేరక పచ్చిక బయళ్ళ తిరుగాడుచున్నది. శుభచాఱిణియైన నీ సహధర్మచారిణిని ఇప్పుడు చూడవలయును. ఆమె శ్లాఘనీయ. యోగబల సంపన్నురాలు. గ్రహరాజగు నీకు నామాట అనుకూలము, సమ్మతము అగునేని, యోగమూని ఆమె చెంతకరుగుము. నీ రూపమును జూడముచ్చటగ ఒనరింతునని తెలిపి ఆ తరణిని (సూర్యుని) యంత్రము నెక్కించి చెక్కివైచెను. తరణిని యంత్రమున బట్టిన నాటినుండీ తరణిబట్టుటన నీపేరు లోకమున రూఢికెక్కెను. దాన నాతని తేజస్సు కొంతడిందువడి రూపము చూడ అందమయి ఇంపొందెను. ఆ మీద అతడు యోగశక్తిచేపోయి తన భార్యను బడబారూపమున చరించు

దానిని జూచెను. తేజస్సుచే పాతివ్రత్య నియమముచే భూతములకు అదృశ్యమైయున్న అర్యంగనను ఎందును జడియక సంచరించుచున్న దానిని చూచి, తాను అశ్వరూపము దాల్చి ముఖమునంగవయబోయెను. పరపురుషశంకగొని ఆమె పెడమొగమయి ఉన్న సమయమునందు ఆమెయందు నిక్షిప్తమైన శుక్రము ఆమె నాసికారంధ్రముల వెంట బీదివైచెను. అందుండి అశ్వినులు అను దేవవైద్యులు, నాసత్యుడు (దస్రుడు) అని పేర్కొన బడెడివారు ఉదయించిరి. అష్టమ ప్రజాపతియగు మార్తండుని ఔరసులు ఈయిర్వురు మిక్కిలి అందగాండ్రు. అవ్వల భాస్కరుడు, ఆకాంతకు మిగులకాంతుడై కానవచ్చె. ఆమె కూడ తన మనోహరుని చూచి మిగుల సంతోషించెను.

యముడు మాత్రము తాను ఇంతకు ముందు చేసిన పనికి మిక్కిలి బాధచెంది ప్రజలను ధర్మముచే రంజింపచేసి ధర్మరాజను సార్థకనామము, పితృదేవతలకు ఆధిపత్యమును, లోకపాలకత్వము బడసెను. సావర్ణి ప్రజాపతి సావర్ణి మన్వంతరమున మనువు కాగలడు. అతడు మేరుగిరిపై ఇప్పుడును తపము చేయుచున్నాడు. వాని తమ్ముడు శని గ్రహపదవి నందెను. త్వష్ట (సూర్య బింబమును) తరణి బట్టగా రాలిన రజమును ప్రోగుచేసి విష్ణు చక్రమును తయారుచేసెను. అది దానవాంతకము, అప్రతిహతము. యముని తరువాత పుట్టిన ఆ బాలిక యమున అనుపేర లోకపావని ఆయ్యెను. మనువు సావర్ణుడు అను పేర ఆ రెండవ కుమారుడు పిలువబడెను. ఆయన తమ్ముడు శని గ్రహ పదవి నంది సర్వలోక పూజితుడయ్యెను. దేవతల ఈ జన్మవృత్తాంతమును విన్నవాడు ఆపదలను బాసి మహాయశస్సును పొందును.

సర్వలోకములకు నాభిస్థానమైన సూర్యుడు తరణి పట్టునప్పుడు పరిభ్రమించుట వలన సముద్రములు పర్వతములు వనములతో గూడిన భూమి ఆకాశ మంటెను. చంద్రాది గ్రహనక్షత్ర సహితమైన ఆకాశ మెల్ల చిమ్మబడి వ్యాకులమై భూమికి దిగిపోయెను. సముద్ర జలము సంక్షోభించెను. ధ్రువు నాధారముగా గొన్న ఆఖిల జ్యోతిర్నివాసములు (లోకములు) రశ్మి (కిరణము శ్లేష రజ్జువు) బంధములు తెగి క్రిందబడినవి. సూర్యభ్రమణము వలన విక్షిప్తములైన భూమ్యా కాశ పాతాళ ప్రపంచము మిక్కిలి వ్యాకులమయ్యెను. ఇట్లు ముల్లోకముల ఆకుల మగుటగని బ్రహ్మతోగూడ దేవతలు భాస్కరుని ఇట్లు స్తుతించిరి.

సూర్యభగవానుని స్తుతి

దేవతలకు ఆదేవుడవై ఆవిర్భవించితివి. భూమియొక్క విభూతికెల్ల నీవే ఆధారము. నీవే సృష్టి స్థితి లయ కార్యములందు మమ్మూర్తులగుదువు. జగత్పతీ! నీకు మంగళమగుగాక!

నీవు తాపము వర్షింతువు. జగత్పతీ! జయము జయమని ఇంద్రాదులు సప్తర్షులు వివిధ స్తోత్రములచే తను, వాలఖిల్యాదులు వేదసూక్తములచేతను స్తుతించిరి. దేవతలకెల్ల మొదటి వాడు (దేవతలకు ముఖస్థానీయుడు) అగు అగ్ని భగవానుడు సంతోషముతో తరణిపట్ట బడుచున్న తరణిని నాథ! మోక్షమందినవారికి నీవు మోక్షస్వరూపుడవు. ధ్యాననిష్ములకు పరమధ్యేయమైన వస్తువవు. సర్వ భూతములకు నీవు పరమగతివి. కర్మ కాండ ప్రవర్తనులకు నీవే గతివి. పూజ్యుడవు. దేవేశ! మాకు శం (సుఖము), అస్తు (కలుగుగాక) ద్విపదే (రెండు పాదాలుగల) జీవకోటికి అనగా మాకు సుఖమగుగాక. చతుష్పదే, నాలుగు పాదములు గలపశుజాతికి సుఖమగుగాక అని వేదసూక్తార్థములతో విద్యాధర గణములు యక్షరాక్షస నాగ కులములు తలలు వంచి చేతులు జోడించి మనసునకును వీనులకును ఇంపుగ స్తుతులను పలికిరి. సర్వ భూతాధారమైన నీతేజస్సు భూతజాలము సహింప గలదగుగాక! అటు తరువాత హాహా హూహూ నామక గంధర్వులు నారద తుంబురులు షడ్జమధ్యమ గాంధార రూపగాన త్రయ విశారదులు కావున సూర్య పరమాత్మను గాంధర్వ విధితో సంకీర్తనము చేయ ఆరంభించిరి.

తాన మూర్ఛనాది వివిధ సంగీత ప్రయోగములచే బహుసుఖముగ వారు పాడిరి. విశ్వాచి, ఘృతాచి, ఊర్వశి, తిలోత్తమ, మేనక, సహజన్య, రంభ మొదలైన అప్సర స్త్రీ మణులు నర్తనము చేసిరి. హావభావ విలాసములచే అభినయించిరి. వీణావేణుమృదంగ ఝర్ఝర పణవపుష్కరపటహ ఆనక దేవదుందుభిశంఖాది వివిధ వాద్యములు శతము, సహస్రముల మ్రోయించిరి. పాటలుపాడు గంధర్వులచే ఆటలాడు అప్సరోగణములచే తూర్యవాదిత్రఘోషములచే సర్వ కోలాహల మయ్యెను. ఆ సమయమున వేల్పులెల్లరు చేతులు మొగిచి భక్తితో వంగి సహస్రాంశునకు ప్రణామములు చేసిరి.

అంతట సర్వస్వర్గసమావేశమునందు, కోలాహలమందు విశ్వకర్మ (దేవశిల్పి) మెలమెల్లన రవిబింబమును యంత్ర మెక్కించి చెక్కనారంభించెను. ఆయనచే భానుడా జానువుగ (మోకాళ్ళదనుక)నిపుణముగ లేఖనము చేయబడి తన అభినందనము లేనందున యంత్రమునుండి దింపబడెను. తేజోహానివలన గలిగిన రూపమును నిషేధింపలేదు. అందువలన ఆయన రూపము చక్కని వానికెల్ల చక్కనిదై మిక్కిలి శోభించెను. హేమంతవర్ష గ్రీష్మ ఋతువులకు హేతువైన వాడును, త్రిమూర్తులచే స్తుతింపబడు వాడును అగు భాను మూర్తి యొక్క ఈ స్వరూప తక్షణములు (చెక్కుటను) విన్నవాడు ఆయుస్సమాప్తిలో సూర్య సాలోక్యమును పొందును. ఓమునిసత్తములార! సూర్యునిజన్మవృత్తాంతము ఆయన పరమోత్తమ రూపమును నేనుసంకీర్తించితిని. (32)

మార్తండ మాహాత్మ్యము

మునులు అంతట

పితామహా! సూర్యకథ ఎంతవిన్నను తృప్తిలేదు. అగ్నిరాశివలె వెలుంగు నీ మూర్తికి ప్రభావ మెందుండి అయ్యెనో తెలియనెంతము. ఇంకను ఆశుభచరిత్ర మాకు ఆనతిమ్ము అనగా బ్రహ్మ ఇట్లు అనియె-లోకములు, తమఃప్రాయములు కాగా చరాచరసృష్టి నష్టప్రాయము కాగా ప్రకృతి యొక్క గుణ వికారమునకు కారణమై బుద్ధి జనించెను. అందుండి యహంకారము, దాని నుంచి మహాభూతములు అవ్వల ఒక అండము జనించెను. ఈ లోకములెల్ల దానియందు ఉన్నవి. అందు నేను, విష్ణువు, శివుడు ఉండి తామస వృత్తులమై ఈశ్వరుని ధ్యానించితిమి అపుడు విజ్ఞాన స్వరూపుడు ధ్యానయోగమందు మాకు సూర్యరూపుడై గోచరించెను. విశ్వరూపునిగ మేము ఆయనను స్తుతించితిమి.

'ఆదిదేవోఽసిదేవానాం నీవు దేవతలకెల్ల మొదటి దేవతవు' అనుచు స్తోత్ర పాఠము చేసితిమి. ఈ స్తోత్రము పారాయణమునకు అర్హమైనది. ఆ స్తోత్రమిది.

ఆదిదేవోఽసి దేవానా మైశ్వర్యార్చ త్వమీశ్వరః ।
ఆదికర్తాసి భూతానాం దేవదేవో దివాకరః ॥
జీవనః సర్వభూతానాం దేవగంధర్వ రక్షసామ్ ।
మునికిన్నర సిద్ధానాం తథై వోరగపక్షిణామ్ ॥
త్వం బ్రహ్మం త్వం మహాదేవ స్త్వం విష్ణుస్త్వం
ప్రజాపతిః వాయురింద్రశ్చ సోమశ్చ వివస్వాన్ వరుణ స్తథా ॥
త్వం కాలః సృష్టికర్తాచ హర్తా భర్తా తథా ప్రభుః ।
సరితః సాగరాః శైలా విద్యుదింద్ర ధనూంషిచ ॥
ప్రళయః ప్రభవశ్చైవ వ్యక్తావ్యక్తః సనాతనః ।
ఈశ్వరా త్పరతో విద్యాఽవిద్యాయాః పరతః శివః ॥
శివాత్పరతరో దేవ స్త్వమేవ పరమేశ్వరః ।
సర్వతః పాణిపాదాంతః సర్వత్తోఽక్షి శిరోముఖః ॥
సహస్రాంశుః సహస్రాస్యః సహస్ర చరణేక్షణః
భూతాది ర్భూర్భువః స్వచ్ఛ మహః సత్యం తపో జనః ॥
ప్రదీప్తం దీపనం దివ్యం సర్వలోక ప్రకాశకమ్ ।
దుర్నిరీక్షం సురేంద్రాణాం యద్రూపం తస్య తే నమః ॥

సుర సిద్ధ గణైర్జుష్టం భృగ్వత్రిపులహోధిభిః ।
స్తుతం పరమ వ్యక్తం యద్రూపం తస్య తే నమః॥
వేద్యం వేదవిదం నిత్యం సర్వజ్ఞాన సమన్వితమ్ ।
సర్వదేవాది దేవస్య యద్రూపం తస్య తే నమః ॥
విశ్వకృ ద్విశ్వభూతం చ వైశ్వానరసురార్చితమ్ ।
విశ్వస్థిత మచింత్యం చ యద్రూపం తస్య తే నమః ॥
పరం యజ్ఞాత్ పరం వేదాత్ పరం లోకాత్ పరం దివః ।
పరమాత్మే త్యభిఖ్యాతం యద్రూపం తస్య తే నమః ॥
అవిజ్ఞేయ మనాలక్ష్య మధ్యానగత మవ్యయమ్ ।
అనాదినిధనం చైవ యద్రూపం తస్య తే నమః ॥
నమో నమః కారణ కారణాయ నమోనమః పాపవిమోచనాయ ।
నమో నమస్తే దితిజార్దనాయ, నమోనమో రోగ విమోచనాయ ॥
నమోనమః సర్వవర ప్రదాయ, నమోనమః సర్వసుఖ ప్రదాయ ।
నమోనమః సర్వధన ప్రదాయ, నమోనమః సర్వమతి ప్రదాయ ॥

తరువాత దేవతలు జగత్ ప్రభూ! నీ తేజో రూపమును ఎవ్వడును సహింపనేరడు. కావున లోకహితము కొఱకు అది ప్రశాంతమగు గాక! అనినంతట సూర్యభగవానుడు ఘర్మమును వర్షమును చలువను గూడ ఈయగలవాడు కావున జగత్కార్య సిద్ధికి అట్లే అగుగాక అనెను. సాంఖ్యులు, యోగులు ముముక్షువులు భాస్కరుని హృదయమందు చైతన్య రూపమున ఉన్నవాని దర్శించి ధ్యానింతురు. బహుదక్షిణములైన క్రతువులు వానికి ఆధా రమైన వేదములు సూర్య నమస్కారము యొక్క కలామాత్రమున కేని (లేశమాత్రమున కేని) సరిగావు, అది తీర్థముల కెల్ల తీర్థము. మంగళములకెల్ల మంగళము. పవిత్రములకెల్ల పవిత్రము అయిన దివాకరమూర్తిని అందరు శరణు పొందుదురు. సూర్య నమస్కారము సర్వ పాపహరము. 'ప్రజాపతీ! చాలకాలము నుండి మాకు సూర్యుని అష్టోత్తర శతనామములను వినవలెనని కోరిక యున్నది. కాన దయచేసి తెలుపుమని' మునులడిగిరి.

బ్రాహ్మణులారా! మిక్కిలి రహస్యమును స్వర్గ మోక్షములను ఇచ్చునదియు అగు సూర్యుని అష్టోత్తర శతనామములను చెప్పుచున్నాను. వినుడు-

సూర్యుని అష్టోత్తర శతనామములు

ఓం సూర్యోఽర్యమా భగస్త్వష్టా పూషాఽర్కః సవితా రవిః ।
గభస్తిమా నజః కాఽ మృత్యుర్ధాతా ప్రభాకరః ॥

పృథివ్యాపశ్చ తేజశ్చ ఖం వాయుశ్చ పరాయణం ।
సోమో బృహస్పతిః శుక్రో బుధోఽంగారక ఏవచ ॥
ఇంద్రో వివస్వాన్ దీప్తాంశుః శుచిః శౌరిః శనైశ్చరః ।
బ్రహ్మా విష్ణుశ్చ రుద్రశ్చ స్కందో వైశ్రవణో యమః ॥
వైద్యుతో జాఠర శ్చాగ్ని రైంధన స్తేజసాం పతిః ।
ధర్మధ్వజో వేదకర్తా వేదాంగో వేదవాహనః ॥
కృతం త్రేతా ద్వాపరశ్చ కలిః సర్వామరాశ్రయః ।
కలా కాష్ఠా ముహూర్తాశ్చ క్షపా యామా స్తథా క్షణాః ॥
సంవత్సరకరో ఽశ్వత్థః కాలచక్రో విభావసుః ।
పురుషః శాశ్వతో యోగీ వ్యక్తావ్యక్తః సనాతనః ॥
కాలాధ్యక్షః ప్రజాధ్యక్షో విశ్వకర్మా తమోనుదః ।
వరుణః సాగరో ఽంశశ్చ జీమూతో జీవనో ఽరిహా ॥
భూతాశ్రయో భూతపతిః సర్వలోక నమస్కృతః ।
స్రష్టా సంవర్తకో వహ్నిః సర్వస్యా ఽఽది రలోలుపః ॥
అనంతః కపిలో భానుః కామదః సర్వతోముఖః ।
జయో విశాలో వరదః సర్వభూతనిషేవితః ॥
మనః సుపర్ణో భూతాదిః శీఘ్రగః ప్రాణధారణః ।
ధన్వంతరి ర్ధూమకేతు రాదిదేవో ఽదితేః సుతః ॥
ద్వాదశాత్మా రవి ర్దక్షః పితా మాతా పితామహః ।
స్వర్గద్వారం ప్రజాద్వారం మోక్షద్వారం త్రివిష్టపమ్ ॥
దేహకర్తా ప్రశాంతాత్మా విశ్వాత్మా విశ్వతోముఖః ।
చరాచరాత్మా సూక్ష్మాత్మా మైత్రేయః కరుణాన్వితః ॥
ఏతద్వై కీర్తనీయస్య సూర్యస్యామిత తేజసః ।
నామ్నా మష్టశతం రమ్యం మయా ప్రోక్తం ద్విజోత్తమాః ॥
సురగణ పితృ యక్ష సేవితం । హ్యసుర నిశాకర సిద్ధవందితం ।
వరకనక హుతాశన ప్రభం ప్రణిపతితోఽస్మి హితాయ భాస్కరమ్ ॥

గొప్ప తేజశ్శాలియగు శ్రీ సూర్యుని అష్టోత్తర శతనామములు చెప్పబడెను. సురాసుర సిద్ధపితృ యక్షగణ సేవితుడును, సువర్ణము అగ్నియొక్క కాంతివంటి కాంతి గలవాడును అగు భాస్కరుని నా శ్రేయస్సు కొరకు నమస్కరింతును. సూర్యోదయ కాలమున ఈ అష్టోత్తర శతనామ స్తోత్రమును సావధానచిత్తుడై చదివినవాడు యోగ్యమైన భార్యను పుత్రులను ధన రత్న సముదాయమును, పూర్వ జన్మస్మృతిని, జ్ఞాపక శక్తిని, గొప్ప ధారణా శక్తిని పొందగలడు. సంసార దావాగ్ని సాగరము నుండి విముక్తిని పొందును. మనో రథముల నెల్ల పొందును. (33)

రుద్రాఖ్యానము

సర్వాంతర్యామియైన రుద్రుడు ఉమాదేవికి ప్రియము చేయువాడై సర్వదేవతలను సిద్ధవిద్యధరులను ఋషులను గంధర్వ నాగ యక్షాదులను మఱి యజ్ఞమునకు వచ్చిన అందఱిని పారద్రోలి సర్వశ్రేష్ఠ పదార్థములతో నిండిన యజ్ఞమును సర్వసంభారములతో నశింపజేసెను. స్వామి ప్రతాపమునకు భీతినొంది ఇంద్రాదులు శాంతి కరవై, కైలాసమున కేగి వరదుడైన ఆ శూలపాణిని దక్షయజ్ఞ ధ్వంసకుడైన భగవంతుని శరణందిరి. అప్పుడు పరమశివుడు ఏకామ్రక (కాంచీ) క్షేత్రమందు సర్వకామప్రదుడై ఉండెను.

మునులు-"సర్వభూత హితాభిలాషియైన శివుడేల ఆ దక్షుని యజ్ఞమును సంహరించెను. సర్వదేవతలు అందు అలంకరించి ఉన్నారు గదా! స్వల్ప కారణమున అట్లు జరిగినదని మేము అనుకొనము. మీవలన విన మిక్కిలి కుతూహలము అగుచున్నది" అని అనగా, బ్రహ్మ ఇట్లు అనియె - దక్షునికి ఎనమండుగురు కూతుండ్రు. వారందరు వివాహితులు. వారిని తండ్రి రావించి తనయింట సత్కరించెను. వారును పుట్టింట ఆదరమంది వసించిరి. వారిలో పెద్దదియగు సతి అను శివుని భార్యను దక్షుడు రుద్రుని ద్వేషించి పిలువడయ్యెను. అందులకు అల్లుడు పరమేశ్వరుడు నైజముగ దనప్రభావమున తానున్నవాడు కావున ఆమామగారి యెడ ఏకొంచెము వినయము చూపడయ్యెను తండ్రి గృహమునకు చెల్లెండ్రందరు వచ్చిరని సతీదేవి ఎఱింగి తానును, పిలువకున్నను అటకేగెను. తండ్రి అందరు కూతురుల కంటె ఆమెను హీనముగ చూచి వారికంటె తక్కువగ ఆదరించెను. అంతట సతీదేవి కినుకగొని తండ్రితో ఇట్లు అనెను.

నాకన్న ఈ కన్యలు చిన్నలు. నేను పెద్ద ఆడపడుచును. నన్ను గౌరవింక ఉన్నావు. అంతేకాదు అలుసు చేసితివి. నేను ఇందఱిలో పెద్దను, యోగ్యతలోను పెద్దను. నన్ను సత్కరింప వలసిన వాడవు. నీవు ఎందుకు ఉపేక్ష చేసితివి ?

అని సతీదేవి అనగా విని దక్షుడు కన్నెఱ్ఱ చేసి ఇట్లు అనియె.

ఆ నాకన్నియలు నీకన్న అన్నివిధముల మిన్నలు. యోగ్యులు. వారి భర్తలుగూడ నాకెంతేని కూర్తురు. బ్రహ్మిష్ఠులు, వ్రతనిష్ఠులు, ధర్మిష్ఠులు, యోగనిష్ఠులు, గుణగరిష్ఠులు, నిటలాక్షుని(శివుని) కంటె పలువిధముల అందఱు మెచ్చదగినవారు. వారు వశిష్ఠుడు, అత్రి, పులస్త్యుడు, అంగిరుడు, పులహుడు, క్రతువు, భృగువు, మరీచి అనువారు. పశుపతి వారితో గూడ స్పర్ధ గొనును. వారును అతనిని ద్వేషింతురు. అందు వలన నిన్ను నేను గౌరవింపను. నాకు శివుడు ప్రతికూలుడని మూఢ బుద్ధియైన దక్షుడు ఆమెతో అనెను. శాపమునకు తాను గురి కావలసిన విధి ననుసరించి ఇట్లు ఋషులను అల్లుని తూల నాడెను. అంతట ఆ దేవి కోపము తెచ్చికొని తండ్రితో

త్రికరణములచేత పరిశుద్ధురాలనైన నన్ను గర్హించితివి. కావున నీ వలన వచ్చిన ఈ దేహమును ఇదిగో ఇప్పుడే విడుచుచున్నాను అనెను.

అని ఆ అవమానము సహింపలేక దుఃఖముతో ఆదేవి దక్షునితో ఇంకను ఈ మేను విడిచి మఱియొక ఉపాధితో వెలుగొందుచు నేను పొరపాటు పడని దాననై ధర్మనిష్ఠనై పరమేశ్వరునికి ధర్మపత్నిని అయ్యెదనుగాక.

అని అక్కడనే కూర్చుండి, దుష్టుడగు దక్షుని సాధించుటకు తాన తనయందగ్ని ధారణ చేసెను.

ఆ అగ్ని వాయు ప్రేరితుడై ఆమె అన్ని అవయవములందుండి వెలువడి ఆమెను భస్మ మొనరించెను. శూలపాణి ఆమె నిర్యాణ వార్తను విని, తండ్రి కూతుండ్ర సంవాదమును ఉన్నదున్నట్లు తెలిసికొని భగవంతుడన శంకరుడు కుపితుడై దక్ష వినాశమునకై ఉద్యుక్తుడయ్యెను.

అట్లు కోపించి శంకరుడు ఇట్లు అనియె. "ఓ దక్షా! పిలువని పేరంటముగ వచ్చి సతీదేవి నీచే అవమానితురాలైనది కావున నీ తక్కిన కూతుళ్లు మగలతో ఉత్తమరాండ్రు కావున వైవస్వత ద్వితీయ మన్వంతరమున నీ మహర్షులు అయోనిజులై నీ యజ్ఞమునకు వత్తురు. చాక్షుష మన్వంతరమున బ్రహ్మ గావించు సత్రయాగమందు హోమము జరుగగా ఇట్లు జరుగును. అని సప్తర్షులను శపించి రుద్రుడు దక్షుని కిట్లు శాపమిచ్చెను. చాక్షుష మన్వంతరమున ప్రాచీన బర్హిపౌత్రుడు ప్రచేతసుని పుత్రుడునై దక్షుడను నీ పేరుతోనే మారిషయందు నీవు జనింతువు. ఆ మారిష వృక్షములకు కన్యయై జనించును. నేను

అక్కడగూడ దుర్బుద్ధివగు నీకు ధర్మకామార్థ యుక్తములయిన నీ కర్మాచరణములందు మఱిమఱి విఘ్నములు గావింతును అని పలికెను. ఇట్లు శప్తుడై ఆదక్షుడును రుద్రునకిట్లు ప్రతిశాప మిచ్చెను. ఓ క్రూరుడా! నా కొఱకు ఈ మహర్షులనుగూడ తూలనాడితివి. కావున యజ్ఞములందు దేవతలతో బాటు నిన్నెవ్వరును యజింపరు. ఒక వేళ నీకు ఆహుతి ఇచ్చినను, (రుద్రునికి ఇచ్చిన ఆహుతి అనంతరము) పవిత్రులగుట కుదరక స్పర్శగావింతురు. యుగాంతము వరకీ లోకముననే నీవుందువు. దేవతలతోబాటు నీకు పూజ ఉండదనెను.

ఆ మాటలకు పరమ శివుడు దేవతలు తమలోగల చతుర్వర్ణములవారితో కలిసి భుజింతురు. వారితో కలిసి నేను భుజింపను. వేరే భుజింతును. అన్ని లోకములకు మొదటిది భూ లోకమందురు. ఆలోకమును నా ఆంతట నేనొక్కడనే ధరింతును. నీ ఆజ్ఞతో గాదు. (నీ ఆజ్ఞ అక్కర లేదు) ఈ కర్మ భూమిని ధరించినంతట ఎల్లలోకములు శాశ్వతముగ సుస్థిరములై నిలువ గలవు. అందుచే నేను ఈ భూలోకమందే ఉందును. అదియు నీ యాజ్ఞచేత గాదు అని అనెను.

అమిత తేజోమూర్తి అగు రుద్రునిచే నిట్లు దక్షుడు నొవ్వనాడబడి స్వాయంభువ మూర్తిని విడిచి (ప్రజాపతిత్వము గోల్పోయి) మనుజులందు ఇక్కడ మానవ లోకమున జనించి దక్షుడను పేరుతోనే గృహస్థుడై యజ్ఞములందు యజమానుడై దేవతలతో గూడ ఎల్ల యజ్ఞములను ఆచరించెను.

ఆ మీదట సతీదేవి వైవస్వత మన్వంతరమురాగానే హిమవంతునికి మేనకయందు 'ఉమా' అనుపేరుగలదై అవతరించెను. ముందు సతియను పేరంది ఆ మీద 'ఉమ' అను నామమందెను. శంభునికి ఈమె సహధర్మచారిణి. ఆయన ఈమె ఎన్నడును విడిచి ఉండడు. మరీచి కుమారుడైన కశ్యపుని అదితి, నారాయణుని శ్రీదేవి. ఇంద్రుని శచీదేవి, విష్ణుని కీర్తి, సూర్యుని ఉష, వశిష్ఠ అరుంధతియు వలె శంకరుని ఈమె ఎన్నడును విడువదు. పరమేశ్వరునకు ఈమె నిత్యానపాయిని.

మున్ను ఇట్లు ఆ దక్షుడును, చాక్షుష మన్వంతరమందు బ్రహ్మ గావించిన యజ్ఞమునందు ప్రాచీనబర్హికి పౌత్రుడుగను ప్రచేతసులకు పుత్రుడుగనునై మారిషయందు జన్మించెను. ఇది మునుపు త్రేతాయుగమున వైవస్వత మనువు కాలమున బ్రహ్మ వరుణ దేవతాకమైన రూపము ధరించి గావించిన యజ్ఞమునందు దక్షుని జన్మము జరిగినది. అల్లుడు మామలకు కలిగిన ఈ విరోధము జన్మాంతరమును పొందినది. కావున ఉత్తములు ఒండొరులు విరోధము పెట్టుకొనగూడదు. శుభా శుభకర్మ ఫలములచే భావితుడై (అనగా

ప్రారబ్ధమునకు అధీనుడై) ఉండు జీవుడు ఆకారణముచే జాత్యంతరమందు పుట్టినపుడు వానికిని పూర్వజన్మ ఖ్యాతి (యోగ్యత)రాదు. ఆ పుట్టువులో కార్యాకార్య విచక్షణత ఉన్నను కొల్లిటి కర్మానుభవమెంత వారికిని తప్పదన్నమాట అని చెప్పగా

బ్రహ్మ పలుకులు విని మునులు ఇట్లనిరి. "దక్షకన్య సతీదేవి రోషముగొని మేను విడిచి పర్వతరాజింట జనించెగదా! అపుడు మఱల నా భవానికి భవునితో సమావేశము ఎట్లు అయినది? వారికా ఘట్టమునందు జరిగిన సంవాదమేమి? ఆ మహాపుణ్య జన్మమందు స్వయంవర మెట్లయ్యెను? వారి కల్యాణ మహోత్సవము అచ్చెరువు కొల్పునది గదా! అదెల్ల సవిస్తరముగ ఆనతీయ వలసినదిగా మా ప్రార్థన. మనోహరమైన ఆ పుణ్యకథ మేము విన కుతూహల పడుచున్నాము" అనగా బ్రహ్మ ఇట్లనియె.

ఓ మునివర్యులార! పాపహరమగు ఆ ఉమా శంకర కల్యాణము పవిత్రము. కామ ఫలదము. ఒకప్పుడు తన ఇంటికి అరుదెంచిన కశ్యప మహర్షిని హిమవంతుడు పుణ్యయశఃకరమగు ఒక వృత్తాంతమును ఇట్లు అడిగెను. మునీ! ఏమి చేసిన అక్షయపుణ్య లోకములు గల్గును? పరమోత్తమ ఖ్యాతి దేనివలన వచ్చును? సత్పురుషులు ఎవ్వరెట్లు పూజింపవలసి ఉందురు అది ఆనతిమ్మని అడుగగా కశ్యపుడు ఇట్లనెను.

నీ తెల్పిన భాగ్యమెల్ల సంతానమువలన గలుగును. నేను (చతుర్ముఖ బ్రహ్మ) పర మర్షులు ఎల్లరు సంతాన లాభముచే ఖ్యాతి గన్నారము. గిరీంద్ర! నీవు చూచుట లేదా! ఇంకను అడిగెదవేమి? మున్ను నేను చూచిన వృత్తాంతమిది దీనిని చెప్పెద వినుము. వారణాసి కేగుచు ఆకాశమందున్న ఒక నూతన దివ్య విమానము గాంచితిని. దానికి క్రిందుగ ఒక గుంట నుండి యొక ఏడుపుధ్వని విన్నాను. నా తపశ్శక్తిచే దానిని ఎఱింగి అచటికేగి దాగి నిలిచితిని. అటనొక పవిత్రమూర్తి తపస్వి తీర్థముల సేవించి అభిషేకము గావించుకొని ఆదారినేగుచు ఒక బెబ్బులికి బెదరి ఆగుంట దరికి పరువిడి వచ్చెను. అక్కడ ఒక అవురుగడ్డికాడను పట్టుకొని వ్రేలాడు మునులనుచూచెను. అట్లుచూచి ఆర్తుడై దుఃఖించులను ఎవ్వరుమీరు? ఈ గడ్డి దుబ్బును ఊతగాగొని మొగములు క్రిందికి వాల్చి వ్రేలాడుచున్నారు. మీ దుఃఖమునకు విముక్తి కలుగగలదు చెప్పుడు. అనగా పితరులు ఇట్లు అనిరి.

మేము పుణ్యకర్ముడవగు నీ తండ్రులము, తాతలము, ముత్తాతలమును. నీ పాప కర్మముచే మేమిట్లు క్లేశపడుచున్నాము. ఈ గుంట గుంటగాదు నరకమే. నీవే ఈ అవురు గడ్డిదుబ్బు. నిన్నే ఊతముగా చేసికొని వ్రేలాడుచున్నాము. నీవుబ్రతికి నన్నాళ్ళు మేము

ఇచ్చట ఇట్లుందుము. నీవు మరణించినంతట మేము నరకము పాలగుదుము. నీవు పెండ్లి చేసికొని గుణవంతుని పుత్రుని గంటివేని మేము ఈ పాపమునుండి ముక్తులగుదుము. వేరు ఏ తపస్సు యొక్క తీర్థముల యొక్క ఫలమునను మాకు విముక్తిరాదు. బుద్ధిమంతుడవు కావున నీ పితరులను మమ్మీ నరక భయము నుండి తరింపజేయుము. అన కశ్యపుడు

అట్లే చేసెదనని చెప్పి అతడు వృషభవాహను ఆరాధించి ఆగర్తము నుండి పితరులను ఉద్ధరించి వారిని శివుని ప్రమథగణముల నాయకులను కావించెను. తాను సువేశుడను పేర బలశాలియై రుద్రుని గణనాయకుడయ్యెను. కావున ఓ శైలేంద్ర! తీవ్ర తపస్సుచేసి గుణశాలియైన సంతానమును కనుము. పరమసుందరిని కూతురుని గాంచుము.

ఇంకను బ్రహ్మ ఇట్లు అనెను. ఇట్లు ఆ ఋషిచే తెలుపబడి, కొండల తోడు (హిమవంతుడు) నియమమును పూని అనుపమమయిన తపస్సు గావించెను. దానిచే నాకు సంతుష్టి గల్గినది. వెంటనే నేనాతని కడ వ్రాలితిని. నీ తపమ్మునకు మెచ్చితిని. వరమిచ్చెద నడుగుమంటిని. సర్వ గుణాలం కారుని కుమారుని కోరెద నాయెడ సంతుష్టుడైతివేని అనుగ్రహింపుమని శైలరాజు అనియెను.

ఆతని మాటవిని, యాతని మదికనువైన వరము ఇచ్చితిని. ఓ శైలరాజ! ఈ తపఃప్రభావమున నీకొక కన్య ఉదయించును. దాన నీవు పరమశోభనమైన కీర్తి నొందెదవు. ఎల్లవేల్పులు నిన్నర్చింప కోటి తీర్థములకు నెలవై పావనుడవై దేవతలకెల్ల పూజనీయుడవయ్యెదవు. ఆ కన్నియ నీకు పెద్ద కూతురగును. మరి ఇద్దఱు కన్యలు కలుగుదురు.

బ్రహ్మ అన్నట్లు గానే హిమవంతుడు మేనయందు కన్యకను గాంచెను. మేనాదేవియందు హిమవంతుడు మఱి కొంత కాలమునకు అపర్ణ ఏకపాటల ఏకపర్ణ అనుకన్యలను కనెను. ఆకుకూడ తినక అపర్ణయు మఱ్ఱియాకు ఒకదానిని తిని ఏకవర్ణయు పాటలమను చెట్టునాకొకటి తిని, నీడను నిలువక ఏకపాటలయు తపస్సుచేసిరి. ఇట్లు వారువేయి ఏండ్లు తపస్సు గావించిరి. అప్పుడు తల్లి మేన మాతృ ప్రేమతో ఉ+మా తపస్సువద్దు చాలింపుము అనెను. అట్లు తనను నిషేధించుచున్నను తీవ్రతపస్సు కావించినందున అదే పేరుతో అనగా 'ఉమా' అనుపేరుతో దేవతలకు పూజనీయయై ప్రఖ్యాతి నందెను.

చరాచరాత్మకమైన ఈ జగత్తు త్రికుమారీకము అనగా ఈ ముగ్గురు కుమార్తెలతో (శక్తులతో) నిండినది. వీరి తపోవృత్తాంతమును భూమి ఎంతవఱకు ధరించునో అనగా ఈ చరిత్ర భూ లోకమునందు వాడబడినంత కాలము తపోమూర్తులైన ఈ ముగ్గురు

శక్తులు యోగభూమిక యందుండి స్థిరయౌవనులై లోకమాతృకలై బ్రహ్మచారిణులై తమ తపస్సుచే ఎల్లప్పుడు లోకములను అనుగ్రహింతురు. వారిలో జ్యేష్ఠురాలు (పెద్దది) శ్రేష్ఠురాలు గూడ. మహాయోగ బలముతో గూడి మహేశ్వరుని పొందినది.

భృగు కుమారునికి ఏకపర్ణ భార్య అయ్యెను. ఆమె దేవలుడను పుత్రునిగనెను. ఆ మువ్వురు కుమారికలలో మూడవ ఆమె ఏకపాటల అలర్కుని కుమారుడగు జైగీషవ్యుని పెండ్లాడినది. ఆమెకు శంఖ లిఖితులను ఇద్దరు పుత్రులు అయోనిజులు గల్గిరి. నీకేను దెల్పిన ఉమాదేవి పరమసుందరి. ఆమె తపస్తీ వ్రతముచేత ముల్లోకములు పొగలు గ్రమ్ముట చూచి నేను (బ్రహ్మ) ఆమెతో దేవీ కళ్యాణివి నీవు తపస్సుచే లోకములనేల తపింపజేయుదువు. నీచేత ఈ జగత్తు సృష్టింపబడినది. నీవు దానిని పుట్టించినదానవు. నీవు దీనిని నశింపజేయదగదు. నీ తేజముచే ఈ లోకములను అన్నిటిని ధరించుచున్నావు. ఓ జగన్మాతా! నీవు కోరునదేమో మాకు ఇపుడు ఇక్కడ తెలుపుమనగా, దేవి నేనెందులకీ తపస్సు చేయుచున్నానో నీవే ఎరుంగుదువు. మరల నన్నేల ప్రశ్నింతువనెను.

బ్రహ్మ ఇట్లు అనియె –

అంతట నేను ఆమెతో ఇట్లంటిని. ఎవని కొఱకు నీవీ తపస్సు చేయుచున్నావో అతడు తానేవచ్చి ఇచట నిన్ను వరింప గలడు. నీకు దగిన వాడు ఆ శర్వుడు. సర్వలోకేశ్వరులకు ఈశ్వరుడు. మేము ఆయన వశములోని కింకరులము. ఆ దేవదేవుడు స్వయంభువు. ఆయన ఉదారరూపుడు. విలక్షణ రూపుడును. ఆయనకు సమానరూపుడు మఱిలేరు. కొండలమీద వసించు వాడతడు. చరాచర సృష్టికి ఈశ్వరుడు ఆయన. మొట్టమొదటివాడు. ఊహకందనివాడు. ఇంద్రునికి ఈడగు వర్చస్సుతో ఇందుబింబము భరింపకుండ ఆదిశేష సమానమైన వర్చస్సుతో భీకరమగు రూపముతో నీదరికి తానే రాగలడు. (34)

పార్వతీ తపోవర్ణనము

బ్రహ్మ ఇట్లు అనియె –

అఖిల దేవతా మండలి ఆజగజ్జనని కడకేగి, ఓ దేవీ! తపము వలదు. శీఘ్రు కాలములో ఆ నీలకంఠుడు ఏతెంచి నీకు భర్త కాగలడు అని నచ్చజెప్పి ప్రదక్షిణముచేసి వెళ్లిపోయిరి. ఆమె తపస్సు విరమించెను. తన పర్ణశాల గుమ్మమున ఉన్న అశోకము క్రింద ఆమె వసించెను. అంతట ఇందుతిలకుడు సురార్తిహరుడు అగు హరుడు వికృత రూపియై పొట్టిచేతులు సొట్టముక్కు రాగిజడలు వికృత ముఖము మఱుగుజ్జునై వచ్చి దేవీ! నిన్ను

నేను వరింతుననెను. ఉమయు యోగసిద్ధిచే నాతనిని శంకరునిగా గ్రహించి విశుద్ధాంక రంగయై అర్ఘ్యపాద్యాదులు మధుపర్కములు ఒసగి బ్రాహ్మణాకారమున ఉన్న స్వామిని బ్రాహ్మణ ప్రియగావున యథావిధి నర్చించి.

'స్వామీ! నేను అస్వతంత్రను. మా తండ్రి శైలాధిపతి ఇంట ఉన్నారు. ఆయన కన్యా దానము చేయసమర్థుడు. ఆతని అర్థింపుము. ఆయన నన్ను కీకిచ్చునేని యది నాకు ఉచితము'. అంత నా విప్రుడు గిరిరాజు కడకేగి 'తనకు కన్యా దానము చేయుమని' అర్థించెను. ఈ వికృతరూపుని శివునిగా గ్రహించి శాపభీతిచే నిట్లనియె.

శైలరాజు ఇట్లు అనెను – భూ దేవులగు విప్రులను అవమానింపబోను, నా యభి ప్రాయము మనవిచేసెదను. 'మా అమ్మాయి స్వయంవరమున ఎవ్వనిని వరించునో అతడు ఆమెకు భర్తయగును.' అనగా వృషభధ్వజుడు తిరిగివచ్చి 'దేవీ! మీ తండ్రి స్వయంవరమున నీవెవ్వని వరింతువో వానికిచ్చెదనని చెప్పియున్నాడు. నీవు నీకు ఈడగు రూపవంతుని విడచి తగనివాని నేల వరింతువు'. కాన నాకందవు. నీతో చెప్పి వెళ్లుచున్నాని తెలిపిన

బ్రహ్మ ఇంకను ఇట్లనియె అంత ఆ ఉమాదేవి ఆమాటను భావనచేసి తనపై ఆతడు ఇడిన భారమును గ్రహించి దానితో బాటు చూపిన మనఃప్రసన్నతను ఆలక్షించి 'దేవేశ! నీకు మఱొక తలపు వలదు. నేను నిన్ను వరించెద. ఆశ్చర్య మక్కరలేదు. సందేహము ఉన్నదా? ఇదిగో ఇక్కడే నాకోరిన విభుడవగు నిన్ను నేను వరించుచున్నాను అని పుష్పగుచ్ఛ మొక్కటి రెండుచేతలంగొని శంభుని మూపున ఉంచి యాదేవి దేవదేవుంగని ఇప్పుడు వరింపబడితివి అనెను. అంత ఆశివుడామె కూర్చుండిన యశోకమును చూచుచు దానికి మాటచే ప్రాణము పోయుచున్నాడా అన్నట్లు ఇట్లనియె.

"ఓ అశోకమా! నీ పూలగుత్తిచే నేను వరింపబడినాడ కావున నీకు ముదిమి ఉండదు. అమరమయ్యెదవు గాక! నీవు సర్వాభరణ కుసుమ ఫల భరితమై కామరూపివై, సర్వకామ ప్రదమై, కామపుష్పమవై, సర్వాన్న భక్షకమై అమృతాస్వాదివై సర్వపరిమళ పూర్ణమై దేవతలకు అత్యంత ప్రియము కాగలవు. నీకు ఎందును భయముగల్గదు. నీవు సంపూర్ణ తృప్తుడ వయ్యెదవు. ఈ అశోకాశ్రమము చిత్ర కూటమని ఖ్యాతినందగలదు. ఇటకు యాత్రచేసిన వాడు అశ్వమేధయాగ ఫలమందును. ఇచట ప్రాణోత్క్రమణ మందిన, అతడు దేవి యొక్క తపస్సుతో గూడి మహాగణపతి అగును"

బ్రహ్మ ఇట్లు అనియె – పై ప్రకారము అశోకమునకు వరమిచ్చి శివుడు గిరికన్యతో వెళ్ళివత్తునని చెప్పి అంతర్ధాన మందెను. ఆయన వంకనే మోమునిలిపి ఆదేవి అచట

ఒక శిలయందు చంద్రుడు లేని రాత్రియట్లు విరహ వ్యధాకులమనస్కయై ఉండెను. అంతలో శైలకన్య ఆశ్రమ సమీపమున ఉదక పూర్ణమైన సరస్సు నందు ఆర్తుడైన ఒక బాలుని మాట వినెను. శివుడు బాలరూపము దాల్చి ఆ సరోవరమందు క్రీడించుచు మొసలి పట్టుకొన్నట్లు సృష్టి హేతువైన యోగమాయను పూని నటించి.

"ఎవరైనా నన్ను మొసలిబారినుండి రక్షించండి! అయ్యో! మొసలినోట బడినాడను. నాకై నా దేహమునకై నేను ఏడ్వను. కాని నాకై ఇంటనెదురు చూచు నా తల్లిదండ్రుల గూర్చి చింతించుచున్నాను. వారికి నేనొక్కడనే తనయుడను. నాయందు ఎంతేని ప్రేమ, మక్కువ గొన్నవారు. కావున ఈ విషయము వినిన ప్రాణముల బాసెదరు. ఎంత కష్టము వచ్చినది. బాలుడను. అకృతాశ్రముడను. (ఉపనయనమైనను కానివాడను) ఈ మొసలి వాతబడి మృత్యువాత కెర అయ్యెదను గదా!" అని దుఃఖించెను.

బాలకుని మాటలు విని ఆ కల్యాణి బయలుదేరి సుందరుడగు ఆ బాలకుడు మొసలి నోటబడి కొట్టుకొనుచున్న విధమును చూచెను. ఆ మొసలియును దేవిని చూచి ఆ బాలుని నోట గఱుచుకొని సరస్సులోనికి పాఱెను. బాలకుడు ఆక్రందించు చుండెను. అది చూచి పార్వతి మొసలితో ఇట్లనియె.

"ఓ గ్రాహరాజ! మహాపరాక్రమా! ఈ బాలకుని త్వరగ విడిచిపెట్టుము. ఈతడు తల్లిదండ్రులకు ఏకైక పుత్రుడు" అన మొసలి.

"దేవి! ఆఱవరోజున ముందుగా ఈ సరస్సునకు వచ్చు నతడు నీకు ఆహారమగునని నాకు బ్రహ్మ యేర్పాటుచేసెను. నేడు, నాకు ఈతడు లభించెను. బ్రహ్మ ప్రేరణమిది. ఏమైనను వీనిని వదలననెను. అంత వారిరువురకు ఇట్లు సంవాదమయ్యెను.

"ఓ మకర రాజమా! హిమగిరి శిఖర మందు నేను చేసిన ఉత్తమతపస్సు ఫలము నీవు తీసికొని ప్రతిఫలముగ ఈ బాలుని విడిచి పెట్టుము. నీకు నమస్కారము"

"ఓ దేవీ! తపము వ్యయ పరచకుము. నేను చెప్పినట్లు చేయుము. అట్లైన ఇతడు ముక్తుడగును. హే గ్రాహాధిప! సత్పురుషులు నిందింపని ఏ పనియైన చెప్పుము. తప్పక చేసెదను. సందేహము లేదు. బ్రాహ్మణులు నాకు మిక్కిలి ఇష్టులు"

"ఓ దేవి! నీవు చేసిన తపము స్వల్పమైనను ఉత్తమమైనది. ఆ తపము సర్వమును నాకిమ్ము. అట్లైన ఈ బాలుడు ముక్తుడగును" "ఓ మహాగ్రాహమా! మంచిది. ఆ జన్మము నేను చేసిన పుణ్యమేదిగలదో అది సర్వము నీకు ఒసగుచున్నాను. బాలుని విడువుము" అని పలికెను.

ఇట్లు అన్యోన్య భాషణములు జరిపిన వెంటనే మొసలి ఆదేవి తపస్సు సర్వము స్వీకరించి మధ్యందిన భానునివలె వెలుగొందెను. మరియు లోకోద్ధారిణి అగు దేవినిగని సంతుష్టాంతరంగుడై ఇట్లు పల్కెను.

"దేవీ! తపస్సు సంపాదించుట కష్టము దానిని త్యజించుట ప్రశస్తముగాదు. కావున తపస్సును, ఈ బాలుని కూడా నీవే స్వీకరింపుము. నీ బ్రాహ్మణ భక్తికి మెచ్చితిని" అని మకరము పలుక మహావ్రతధారిణియగు ఆమె ఇట్లనియె.

"దేహముతోనైనను విప్రుడు నాకు రక్షణీయుడు. తపస్సు మరల సాధించగలను గాని బ్రాహ్మణుడు సాధ్యుడు కాడు గదా! విప్రులకంటె తపస్సు గొప్పది కాదు. నేనిచ్చినది మరల స్వీకరింపను. ఇది నీకు ఇవ్వబడినది. ఇచ్చిన దానిని ఎవ్వడును తిరిగి తీసుకొనడు. తపస్సు నీదె. బాలుని మాత్రము విడిచిపుచ్చు" మనెను.

ఆ మాటలను విన్న మకరము దేవికి నమస్కరించి ఆదిత్యుడట్లు వెలుంగుచు అచ్చటనే అంతర్ధానమయ్యెను. ఆ బాలుడును సరస్తీరమున మొసలిచే విడువబడి, కలలో కనిపించిన వస్తువువలె అచ్చటనే అంతర్ధానమయ్యెను. దేవియు తన తపఃఫలము బాలుని నిమిత్తముగా వ్యయమగుటను చూచి మరల తపస్సు ఆచరింప పూనుకొనెను. శంకరుడది యెరిగి నీ వింక తపస్సు చేయవలదు. నీ చేసినదంతయు నాకు అర్పించితివి. అది నీ కక్షయము కాగలదనెను. అట్లు వరమును పొంది ఆదేవి స్వయంవరము కొఅకు నిరీక్షించుచుండెను. పరమేశ్వరుని ఈ శిశులీలను జదివిన వాడు దేహపాతానంతరము పవిత్రుడై కుమార తుల్యుడై గణాధీశుడగును.(35)

ఉమామహేశ్వర కల్యాణ వైభవము

బ్రహ్మ ఇట్లు చెప్పెను –

విశాలమైన హిమవత్పర్వతము మీద విమానముల సమ్మర్దము అధికమయ్యెను. పార్వతి స్వయంవర సన్నాహమునందు గిరిరాజు తన కుమార్తె అభిప్రాయము హరునిపై ఉండుట నెఱింగియును, వంశాచారము పాలించుటకు స్వయంవర వార్తను ఎల్ల లోకములందును జాటింపించెను. దేవదానవసిద్ధ గంధర్వాదు అందఱి సమక్షమున నా కుమార్తె బ్రహ్మవరకుగల దేవతలందు పరమేశ్వరుని వరించునేని అదినా పుణ్యము. సంస్తవనీయము. నా అభ్యుదయముల కది అనుకూలము. అని మదిలో ఎంచి తన నగరము రత్న తోరణాలంకృతము గావించి, స్వయముగా ఆ వార్తను ప్రకటించెను.

హిమవంతుడు చాటించిన స్వయంవర వార్తవిని యఖిలభువన వాసులయిన యువకులరుదెంచిరి. నేనును అక్కడ గిరిరాజు ప్రార్థనచే ఎల్ల యోగులు సిద్ధులు సేవింప దేవతలతో పోయి పద్మాసన మందు ఉపవిష్ణుడనై ఉంటిని, దివ్యాంబరాంగ రాగహారాది భూషణములు దాల్చి, సురరాజు వేయి కన్నులతో ఆ ఉత్సవము తిలకించుటకు మదధారల కురియు మహిత గజరాజము ఐరావతమునెక్కి వచ్చెను. తేజః ప్రభావమువలన ఎల్లదిశల వెలిగించు చలత్పతాకమగు (జెండా నెగురుచున్న) బంగారు విమానమెక్కి భాస్కరుడు అరుదెంచెను. తేజమ్మున బలమ్మున శాసనమున అనదృశుడై మణిమయోజ్వల కుండలములు ధరించి ఆదిత్య మండలమునుండి భగుడును అమరమూర్తి సూర్యుడట్లు అగ్నియట్లు వెలుగు విమానమున ఏతెంచెను. యముడును దండముగొని భయంకర మహిష వాహనమెక్కి జవంబున పెద్ద పర్వత మట్లొడ్డునుం బొడవుం గల్గి, మంగళమూర్తియై మణిమయ స్వర్ణ భూషణ మంజుల వేషియై అచ్చటకు విచ్చేసెను. సర్వజగత్ప్రాణుడైన వాయుదేవుడు విమానమెక్కి సురాసురులకు వెరగుగూర్చు తేజంబున అరుదెంచెను. అగ్నియు దివ్య విమానమెక్కి వరవేషధారియై వచ్చి సురేంద్రుల నడుమ వెలుగుచుండెను. సర్వధనాధ్యక్షుడగు కుబేరుడు కాంతిచే, వేషముచే ఎల్ల సురాసురుల ఆప్యాయన మొందజేయుచు పుష్పక విమానమెక్కి అరుదెంచెను. నవరత్న విచిత్ర విమానమెక్కి చామన చాయ మేనివాడు సువిచిత్రవేషుడు పరిమళ పుష్పమాలను ధరించిన సుధాంశుడు (చంద్రుడు) అరుదెంచెను. పర్వతమువలెనున్న విష్ణువు గదనుదాల్చి గరుడుని అధిరోహించి ఏగు దెంచెను. పరమ సుందరులు, దేవలోకభిషగ్వరులు అశ్వినీదేవతలు ఇరువురు ఒక్కటే విమాన మెక్కి ముచ్చట గొల్పు వేషములతో అటకు వచ్చిరి. అగ్ని వర్ణమైన విమానమెక్కి జ్వలనార్క ప్రభతో నాగపరి వారముతో సహస్ర ఫణామణి మండలుడగు నాగేంద్రుడు ఏతెంచెను.

పెండ్లి కుమారులట్లు అలంకరించుకొని, బృందారక (దేవతల) బృందమేతెంచెను. గంధర్వరాజు తన సంఘముతో నప్సరసలతో నింద్రాజ్ఞంగొని ఆముచ్చట కనుగొనుటకు వచ్చెను. మఱియు కిన్నర కింపురుష నాగ గణంబులు వచ్చిరి. అందరిలో అమరేంద్రుడు శచీపతి చూడ ముచ్చటైన సొంపున వెలింగెను. సురాసుర జనని శంభుపత్ని అని పురాణములందు గీర్తింపబడినది. పరాప్రకృతిమున్ను దక్షకోపమునకు గురియై హిమ వంతుని ఇంటికి కార్యావసరముగొని వచ్చినది. దివ్య విమానమందు దేవకాంతలు వింజామరలు వీవ సర్వ ఋతువులందలి పువ్వులతో సంతరింపబడిన మాలంగొని సత్వరముగ ఆమె స్వయంవరమునకు బయలుదేరెను. అట్లు అరుదెంచు గిరిరాజ కన్యనుగని ఆమెను పరీక్షింపనెంచి శంభుడు పంచ శిఖల ముచ్చట గొల్పు శిశువై ఆదేవి ఒడిలో అల్లన నిదు

రించెను. ఆ దేవి చూచి ప్రీతి నంది ఆ రహస్యము గ్రహించి తాను అభిలషించిన పతిగా నెఱిగి ఆ పాపని తన హృదయ మందు నిలిపి స్వయంవర మండపము నుండి వెనుదిరిగి వెళ్ళిపోయెను. ఎవడీ శిశువు? ఇచటికి ఎట్లు వచ్చినాడు! అని మిక్కిలి మోహపడి సురలు కేకలిడిరి. ఇంద్రుడు వజ్రాయుధమును పూని నిలువబడి ఆశిశువుచే అపుడే స్తంభితు డయ్యెను. భగుడెత్తిన చేయి ఎత్తినట్లే ఉండెను. విష్ణువు శిరః కంపనమును జేయుచు శంకరుని వంకచూచెను. అపుడు నేను (బ్రహ్మ) కలతబడి ధ్యానమున నిలచి ఆక్షణమే ఆదేవి ఒడిలోని బాలుడు బాలేందుధరుడని (లేత చంద్రుని ధరించిన శివుడు) గ్రహించితిని. తెలిసినంతలేచి నిలువబడి ఆ దేవదేవు చరణములకు మ్రొక్కి పురాణములచే నామ సంగీతములచే గుహ్యములయిన పుణ్యనామావళిచే పెక్కురీతుల స్తుతించితిని.

ఇట్లు పరమేశ్వరుని నుతించి స్తంభించిన దేవతలనుచూచి మీరీ పాపని శంకరుడని ఎఱుగలేరైరి. పొండు శరణమందుడు. నేను మీతో శరణాగతుడను అయ్యెద అన ఆ దేవతలు భావశుద్ధితో ఆ శర్వునికి నమస్కరించిరి. శీఘ్రప్రసన్నుడు కావునస్వామి, వారియెడ జాలిపడి అందరిని మున్నట్లు స్వస్థుల చేసెను. ఇది అయిన వెనుక ఈశ్వరుడు త్రిలోచన ములతో కూడిన అద్భుతమైన శరీరము దాల్చెను. ఆ తేజమునకు వారి కనులు మిరుమిట్లు గొనగా చూడలేక కనులు మూసికొనిరి. ఆయన వారికి తన మూర్తి చూచుటకు అనువైన చూపును అనుగ్రహించెను. దానిచే వారు ఆ ఈశ్వరుని చూచి ఆయన నిటలాక్షుడని తెలుసుకొనిరి. వారందరు కనుగొనుచుండ అప్పుడు ఆ దేవి ఆదేవదేవుని పాదముల యందు స్వయంవరమాలను అలంకరించెను. 'బాగు బాగు' అని ఎల్లవేల్పులు నుతించిరి. ఆ దేవితో గూడ తలలు వాల్చి నమస్కరించిరి. అపుడు నేను హిమవంతునితో ఇట్లంటిని. 'పూజనీయుడ వైనీవు వందనము చేయ తగినవాడవు. ఈశ్వరుని తోడి సంబంధమిది. ఇది నీ భాగ్యమ్ము కానిమ్ము. కల్యాణ మహోత్సవమునకు విలంబము ఎందులకు' అన హిమవంతుడు మ్రొక్కి నాతో ఇట్లనెను. "దేవా! నా అభ్యుదయమున కెల్ల నీవే కారణము. అనుకొనని అనుగ్రహమిట్టిది. నాకు లభించినది! పితామహ! వివాహము ఎట్లు ఎపుడు చేయనగునో అదెల్ల నీవు నడుప వలయును" అనిన విని బ్రహ్మ.

కల్యాణ సన్నాహము

హిమవంతుని మాటవిని శివునితో 'వివాహమగు గాక' అని నేననగా లోకేశుడగు శంకరుడు అట్లేయగుగాక! అనగా మేమందరము అందమైన కల్యాణ పురము నిర్మించితిమి. నవరత్నములు మూర్తిని ధరించి కల్యాణ వేదికను స్వయముగ అలంకరించి నవి. అందలి

కుడ్యములు స్ఫాటికములు భూమి మరకతమాణిక్యమయము. స్తంభములు స్వర్ణమయ ములు. ద్వారములందు ముక్తాహారములు తమంత వ్రేలినవి. అమ్మణుల జిగ జిగ కాంతులు వెదజల్లుచు వాని ముందు సోమ సూర్యులు స్వప్రభల వెలయించిరి. శివభక్తిని ప్రకటించుచు వాయువు మనోహరపరిమళముల వెదజల్లుచు అందందు వాహ్యాళి వెడలెను. చతుస్స ముద్రములు, శక్రాది సురలు, దేవనదులు, మహానదులు, సిద్ధులు, మునులు, గంధర అప్సర, యక్ష, రాక్షస, నాగ, కిన్నర, చారణులు, జలచరులు, ఖేచరులు, తుంబుర, నారదులు హాహా హూహూ వంటి ప్రముఖ దేవగాయనులు రమ్య మంగళ వాద్యములుగొని ఆమండపమునకు వచ్చిరి. ఋషులును వేద గీతములు మేళవించిరి. జగన్మాతలు, దేవ కన్యలు పాటలు పాడిరి. అప్సరసలు ఆటలాడిరి. ఆఱు ఋతువులు నానా సువాసనల సుఖావహములై మూర్తిమంతములై హిమవంతుని ఇంటికేతెంచి ఈశ్వరునికి ఉపచరిం చినవి. వర్షర్తు సమాగమము మంత్రధ్వని గర్జనములతో నల్లని మేఘముల కాంతులతో కేకారవ మనోహర మయూర నృత్యములతో విలోల పింగళ రుచి విలాసి విద్యుల్లతాచకచక ద్యుతులతో కుముదకుసుమాపీడ శుక్లములగు బలాక మాలికలతో నపుడ పొడమిన శిలీంధ్ర కందళీలతాద్రుమ హృద్యతర పల్లవ మంజరులతో చల్లని వానధారల కలరి మేల్కొని చేయు కప్పల అరువులతో, మానవతులు ప్రియులయెడ పొలియలుకవాసి తమంత ప్రియుల కౌగిలికి తార్చు ముచ్చటలతో నునుమబ్బుల చాటున అల్లనల్లన తొంగి చూచు శశిరేఖ సొగసుతో మేఘముచాయ చాయలుకులుకు ఇంద్ర చాపము చూపు సొంపుతో చిత్రవిచిత్ర కుసుమ పరిమళములచే భావితంబై మధురవాసనలు చిందు చల్లని జలసంపర్కమునంది వీచు మనోహర మందమందానిలములచే అల్లనల్లన కదలు సురాంగనల లలితాలక నటనములతో గర్జించు మేఘములు గ్రమ్మిన ఇందు బింబమ్ము దంబరముతో తొలకరివాన చినుకులు ముత్యాల మురువుగొని పచ్చలు దాపినట్లు మెఱయు గరికదుబ్బులు అబ్బురము గొల్పు పచ్చని కాంతులతో హంస నూపురంబులతో సమున్నత పయోధర శాలినియై వర్షఋతు సుందరి సుందరపు కల్యాణ మండపము అలంకరించెను. నీలమేఘ గర్జనలకు హంసలు బెదరినవి. స్వచ్ఛములైన సలిల ధారలకు కలువలు విన్నమ్రములైనవి. పరిమళకుసుమ కింజల్క పరాగ పరిభూషితాంగియై వర్షఋతువు పార్వతీ వివాహమునకు తనను ముస్తాబు చేసికొనెను.

శరద్ఋతు వర్ణనము

ఆ పైని శరద్ఋతులక్ష్మి మేఘకంచుకము తొలగించుకొని పద్మ కోశకుచశోభయై హంస నూపుర మనోహరయై దిశలు తెలివిగొన విస్తీర్ణములైన సైకతములు పిరుదులుగా

మధుర కూజిత హంసమేఖలయై, వికసించిన నల్లకలువలనెడి నయనముల సొంపుతో పండిన దొండ పండనెడి అధర శోభతో మొల్ల మొగ్గలనెడి దంతకాంతితో, వినూత్న శ్యామలతికా వినీల రోమరాజితో, చంద్రాంశు గౌరహార వితానముతో బృందారక, బృంద హృదయారవిందముల సర్వము ఉల్లాసపరచుచు, శరద్ఋతు లక్ష్మిమనోహర మత్త భ్రమరకుల కలగీత సర్వభాషిణియై చలత్కుముద చారుకుండల మండితయై రక్తాశోక శాఖానిర్గత లలితసుకుమార పల్లవాంగుళియై పలువన్నెల పూలచీర దాల్చి రక్తోత్పలాగ్ర చరణయై జాతీపుష్పసఖనవ్యనఖ రుచియై రంభాస్తంభ రమణీయోరు రుచియై చంద్రవదనయై సర్వా లంకారభూషితయై సర్వలక్షణ లక్షితయై నిర్ముక్త నీలమేఘ కంచుకాంచిత వసనయై పూర్ణేందు బింబ ప్రతిబింబవదనయై సామరాగయగు నాయికవోలె నీలాంభోజ లలిత నయనయై రవికరవికచకమలసుస్తనియై నానా కుసుమ రజః పరిమళ పవన ప్రహ్లాదినియై కలహంస నూపురరవభవ్యయై గిరిసుత కల్యాణమునకు శరద్ఋతులక్ష్మి తన్ను సింగారించుకొని వచ్చెను.

హేమంత శిశిరములు

అవ్వల మిక్కిలి చలువల వెదజల్లు జలముల మించుచు హేమంత శిశిర ఋతు దేవతలు ఆ వివాహమునకు వచ్చిరి. హిమవంతుడు ఆ ఋతు విలాసినులు ప్రాలేయ చూర్ణముల వర్షించుచుండ రజతహర్తపగిది రాణించెను.

వసంతర్తు సమాగమము

ఆమంచు సోనలచే ఘనీభావమునంది హిమవంతుడు చూపరులకు క్షీరసాగరము వలె మనోహరముగా కనిపించెను. ఒకానొక దుర్జనుడు సాధుపరిచర్యజేసి కృతార్థుడైనట్లు, ఆ పర్వత సార్వభౌముడు హేమంత, శిశిర పర్యాయ శోభచేత ఇంపుకొల్పెను. మంచు చుట్టుముట్టిన మహిత శిఖములచే శ్వేత ఛత్ర ఛాయలో ఉన్న చక్రవర్తివలె వెలుగొందెను.

వసంతుడును గిరికన్య కల్యాణమునకు వచ్చెను. సురలకు సురాంగనలకు మదన ఉద్రేక కరములైన మందమంద మలయా నిలములును, స్వచ్ఛమైన నీటిధారలతో నిండి ఉండి సరస్సులును, తామర, నల్లకలువల సంభారములచేత నిండి ఉండి విమల రస పూర్ణములై ముత్తైదు వులపగిది ముస్తాబుచేసికొని పార్వతి పెండ్లి పేరంటమునకు వచ్చెను. కొలదికొలదిగా కనిపించుచున్న పయోధరాగ్రములచే (మేఘములచే) చూచుటకు ఇంపు కలిగించు కుమారికలవలె మిక్కిలి శోభించెను. ఎక్కువ వేడి, ఎక్కువ చల్లదనములు కానివై కుసుమ కీలాగ్రములందలి పుప్పొడిచేత ప్రకాశించుచున్న శరీర శోభచే చక్ర

వాకముల జంటల కలకలారావములచే ప్రతిధ్వనులీనుచు సరస్సులు ముచ్చట గొల్పెను. ఐరావతాది దిగ్గజములు లలిత గమనముతో ఆనందోత్కటములయి పర్వతరాజపుత్రి వివాహమునకు నడచెను. ప్రియంగు వృక్షములు ఆమ్రవృక్షములును, అన్యోన్యము బెదరించు కొనుచున్నవా అన్నట్లు పూవుల గుత్తులతో హృదయ రంజకములయ్యెను. తెల్లని హిమ శృంగములందు కుసుమితములైన తిలక వృక్షములు శుభకార్యమని ఎంచి వచ్చిన వృద్ధ జనమో అనునట్లు భాసించెను. వికసించిన అశోక తిలకములు సాల వృక్షములను కౌగిలించుకొని ప్రియుల కంఠములను కౌగలించుకొను ప్రియురాండ్ర జనము వలె మూడముచ్చట గొలిపెను. ఆ వసంత వేళ కదంబ నీప, తాడి, చీకటి మ్రాకులు, సరళ వెలగ, అశోక, సజ్జ, మద్ది, కోవిదార, పున్నాగ, నాగేశ్వర, కర్ణికార, లవంగ, నల్ల అగరు, సప్తవర్ణ, న్యగ్రోధ శోభాంజన నారికేళ ప్రముఖ సకల వృక్ష కదంబము పూలతో పండ్లతో మనోహర కుసుమాంగ రాగములతో హృదయంగమములు అయ్యెను. చిత్రవిచిత్ర వర్ణము లయిన రెక్కలచే టిట్టిభ కలవింక బలాకా (బెగ్గురు) మొదలైన నీలి పక్షులతో పద్మోత్పల మీనములతో కూడిన సరస్సులనుండి సుశీతల సుగంధ వాయువులు కొమ్మలను రెమ్మల కదలించి రాల్చిన పూవులతో నగకుమారియైన పార్వతి వివాహ మండప ప్రాంతభూములు పరస్పర సమ్మేళన మందిన ఋతువుల చిహ్నములతో శోభావహములై రాజిల్లెను.

అచ్చట సమద షట్పదములగీతములు, మంగళ గీతములయ్యెను. తుమ్మెదలు ముసిరిన కలువలచే నల్లనివై, తెల్లని మృణాల లతలచే తెల్లనివై, ఎఱ్ఱని అరవిందములచే ఎఱ్ఱగా శోభించుచు సరోవర నీరములు నయన మనోహరము లయ్యెను. కొన్ని కొలనులు బంగారు తామర పూవుల నలముకొని మిక్కిలి సొంపు నింపుచుండెను. కొన్ని ఎడల వైడూర్య మణి నాళమయములై కమలవనములు విలసిల్లెను. హేమసోపాన పంక్తులతో నానాపక్షుల కలకూజితములతో కమలోత్పల వనములతో కూడిన దిగుడుబావులు భావ మధురములయి రాణించెను. కుసుమిత కర్ణికారములతో నీహారాద్రి సమున్నత శృంగములు హేమ మయములట్లు రంజిల్లెను. ఇంచుకించుకగ విప్పారి అల్లనల్ల వీచు గాలులకు కదులుచు నిండైన వాసనలను నింపెడి పాటల పుష్పములచే దెసలు పాటలము లయ్యెను. (ఎఱు పెక్కెను) నిండబూసిన కృష్ణ తరువులు, అర్జునములు నీలాశోకములు అల్లనల్లన వికసించిన విరులతోడి అందమున స్పర్ధగొని ఒండొరుల మించి శోభిల్లినవి. గిరినితంబములు అందెల్లెడ వీచు గాలులకు ఊగుచు హోరుమని మ్రోతనించు కింశుకము వనములు అంతరాంతరముల నీలమేఘ సంఘాతములు క్రమ్ము కొన్నవా అనిపించు చీకటి మ్రాను వృక్షముల సమూహములచేత అచ్చమైన హిమగిరి చూడముచ్చట అయ్యెను.

కొమ్మల రెమ్మలనిండ పూసి రాలినపూవులతో, చందనములతో, చంపకములతో, బాగుగా మదించిన పుంస్కోకిలల ఆలాపములతో, గిరిరాజు మిక్కిలి రంజిల్లెను. కోకిలల కూజితము లాలించి నీలకంఠములు పురివిప్పి కేకలు పెట్టుచు నాట్యములు ఆరంభించినవి. వాని సడివిని పుష్పబాణుడు (మన్మథుడు) పుష్టిగొని దేవతాస్త్రీలను గురిచేసికొని పూబాణములు విసరదొడగెను. ఎండ తీవ్రమై జలాశయములు ఎండి తనువులకు సుఖమునింద అత్తఱి గ్రీష్మర్తువు గిరికన్య పెండిలికి వచ్చి గిరిరాజునకు తమతమ సేవలను అందించెను.

గ్రీష్మర్తు సమాగమము

మఱియు తరువులనుండి విరులను రాల్చి హ్రాలేయ గిరి శృంగములను సింగారించెను. పాటల కుసుమ విస్తీర్ణ కదంబ అర్జున సుమనోహర వాయువులు చల్లగ వీచెను. దిగుడు బావులు వికచకమల కేసర పుంజ రంజితములై ఎఱుపెక్క కలహంస కదంబముల అచ్చపు జిగి ఎంతేని ముచ్చట గొలిపెను. పూలగోరంటలు, పువ్వుల తెలినిగ్గుల నెఱనీటు గులుకు తుమ్మెదలకు వలపు కూర్చుచుండెను. హిమశైల విశాల నితంబము (శిఖరము) లందు పొగడలు, నలువంకల తావులు జిమ్ము పూవులరాసులం గ్రుమ్మరించినవి. ఓ ముని ప్రవరులారా! వింటిరే ఇట్లు ఆరుఋతువులు గౌరీ వివాహ కౌతుకమునకు కుతూహలముగొని కుసుమ విచిత్ర శృంగారతరులతా బృందముతో ఆందముగా ఏతెంచినవి.

మంగళ వాద్యములు మ్రోయ ఇట్లుసాగిన కల్యాణ వైభవమున బ్రాహ్మణ సముదాయములతో శైలపుత్రిని సకలాభరణ భూషిత గావించి, వెంటగొని, నేను స్వయముగా పురప్రవేశము చేయించితిని. అటుతరువాత నేను బ్రహ్మస్థానమందు ఉండి ఈశ్వరునితో నీవివాహ నిమిత్తముగ అగ్నియందు ఆజ్యాది హవిస్సులను హోమము నిర్వహించెద ఆజ్ఞ ఇమ్మని అడిగితిని. అందుకు శివుడు-ఓ సురేశ్వర! ఏమిచేయ ఉద్దేశింపబడినదానిని ఎల్లను నీ ఇష్టానుసారము కావింపుము, నీ చెప్పినట్లు అంతయు నేను చేయుదును అని అనెను.

ఆమాటలకు ఆనందపడి, నేను దర్భలనుగ్రహించి ఆదేవుని యొక్కయు దేవియొక్కయు హస్తములను యోగబంధమున జతచేసితిని. శ్రుతి గీతములయిన మహామంత్రములై మూర్తి మంతములయి సన్నిధిచేయ, అగ్ని కూడా హవిర్భాగములను స్వయముగా అందుకొన దలచినట్లుగా దోసిలిపట్టి నిలిచెను. యథావిధిగ అమృత రూపమైన హవిస్సును హోమముచేసి సనాతనులయ్యు, నూతనులయిన ఆ దంపతులు చేయి చేయియుంగొని అగ్నికి ప్రదక్షిణము నొనరించిన తరువాత వారి చేయి విడిపింప, సర్వదేవతలు నామానస పుత్రులు సిద్ధులు ప్రహృష్టాంతరంగులై నన్ను అనుగమింప అందఱము ఆపెండ్లివేక

వృషధ్వజునకు ప్రణామములు గావించితిమి. ఇట్లు ఆ సనాతన మిథునమునకు యోగము చేతనే ఈ వివాహ మహోత్సవము జరిగినది. ఈ అందము మున్నెన్నడు దేవతలు కూడా చూచి యెఱుగరు. ఈ మహేశ్వర స్వయంవర కల్యాణ వృత్తాంతము మీకెల్ల వినిపించితిని. ఇది సకల జగత్కల్యాణకరము. (36)

బ్రహ్మాదికృత శివస్తుతి

ఉమామహేశుల వివాహమిట్లు జరుగగా ఇంద్రాదులగు అమరులెల్లరు అమందానంద భరితులయి మహేశ్వరునికి ప్రణమిల్లి అనేక సాభిప్రాయ పలుకులచేత వినుతించిరి.

ఇట్లు జగత్పతి, భగవంతుడు అయిన ఉమాపతి ఎల్ల సురలచే వినుతుడై ఓ నిర్జరులారా! మీకు నేను చూడ సౌమ్యుడనైతిని. వేగమే వరము కోరుకొనుడు ఒసంగెద. ఇందు సందియము లేదు అనగా 'ఆ వరము నీచేతనే ఉండుగాక! కార్యావసరమందు దానిని ఇత్తువు గాక! అని దేవతలనగా ఆయనయు సరే అని ప్రమథగణములతో స్వభవనమున కేగెను. అద్భుతమైన ఈ శివకల్యాణ మహోత్సవము దేవ భూదేవుల సమక్షమున గానముచేయు వాడు గణేశ భావమునంది సుఖించును. (37)

మదన దహనము

తరువాత బ్రహ్మ ఇట్లు అనెను - మహాదేవుడు నిజభవన మందాసనమున గూర్చుండ దుష్టుడగు మన్మథుడాయనను వేధింప ఏతెంచెను. అది ఎఱింగి ఆ ఆతతాయిని శిక్షింప నిటలాక్షుండు తృతీయ నేత్రమున వీక్షింప ఆ ముక్కంటి మంటకెఱయై మన్మథుడు మూర్ఛపడెను. ఆయన భార్య రతి మిక్కిలి శోకించెను. అంత జాలిగొని ఆ ఉమాశంకరులు రతీదేవినిచూచి ఇట్లనిరి. కళ్యాణీ! శరీరములేకయు నీ భర్త పూర్వమట్లు సర్వకార్య సమర్థుడగును. విష్ణువు కృష్ణావతార మెత్తినపుడు ఆతనికి కుమారుడై నీపతి జనింపగలడు అని వరమిచ్చిరి.

అచట అప్సరసలాడిరి. గంధర్వులు పాడిరి. కొందరు దివ్యవాద్యములను వాయించిరి. కొందరు స్తుతించిరి. ఇంద్రయమ అగ్నితుల్యులగు ప్రమథ గణములతో ఇట్లు శివుడు దేవితో కూడి విహరించుచు దేవికి ప్రియమ్ము కూర్చుటకై ఆ పర్వతమును విడువడయ్యెను. ఆ మీద దేవేశుండు ఏమి కావించెనని ఋషులడుగ బ్రహ్మ ఇట్లనియె : భగవంతుడు శివుడు ఆ హిమగిరి శిఖరము దేవికి వినోదము గూర్చ ప్రమథగణములు పలు రూపులుదాల్చి ఆడునట్లొనర్చి దేవికి పరిహాసము గల్పించెను. అటుపై గిరికన్య ఒంటరిగ

బంగారు పీఠముపై గూర్చున్న జనని సన్నిధి కేగెను. మేనా దేవియు దేవరూపిణియగు శర్వాణికి ఆసనమిడి ఆదరించి ఆమె కూరుచున్న తర్వాత నిట్లు పలుకరించెను.

మేన "కుమారీ! చిరకాలమునకు నీవు వచ్చితివి. ఆటవస్తువుల లేమికి గురియై భర్తతో ఆడుకొనుచున్నావు. ఎవ్వరులేనివారు దిక్కులేనివారో వారీ విధముగ నీ మగనివలె వినోదింతురు" అని తల్లి పలుక విని పార్వతి అంతరంగ మందంతట సంతోషపడలేక పోయెను. మిక్కిలి ఓర్మితో కూడి ఆమెకు ఇంచుకయు బదులీయదయ్యెను. మఱియు తల్లిచే విడువబడి పరమేశ్వరుని సన్నిధికి పోయి ఆ మహాదేవునికి ఇట్లనియె.

స్వామి! దేవదేవేశ్వర! ఈ పర్వతమందు వసింపను. ఓ తేజోనిధీ! ఈ భువనము లందు ఎందేని నాకు వేఱొక నివాసము ఏర్పరుపుము. అన విని దేవి! నివాసార్థమై నేను ఎల్లపుడు చెప్పుచున్నను వేఱొక నివాసమునకెన్నడు ఇష్టపడవైతివి. ఓ కళ్యాణి! ఇప్పుడు నీఅంతట నీవే వేఱొక నివాసము ఎందులకు వెదకెదవో? నాకది తెలుపుము అనిన దేవి మహానుభావుడు మా తండ్రి ఇంటికి ఇప్పుడే నేను వెళితిని. మా అమ్మ అచ్చట నన్నుచూచి ఏకాంతమున నాకు ఆసనాదులిడి ఆదరించి ఉమా! నీ మగడు దరిద్రుడు. నిరంతరము. ఆటవస్తువులతో (బొమ్మలతో) ఆడుకొనును. దేవతల కటువంటి ఆట కూడదనెను. మహాదేవ! నీవు ప్రమథ గణముతో పలుకరకములగు భూత ప్రేత పిశాచములతో వినోదింతువు. వృషభవాహన! అది మా అమ్మకు ఇష్టము కాదు అని చెప్పెను. ఈశ్వరుడు అది విని ఆ దేవిని పరిహసింప జేయుటకు "ఇంతీ! మీ అమ్మ అన్నది సత్యము. నీకేల కోపము. నేనిదిగో కృత్తివాసుడను. నిర్వాసుడను, శ్మశానవాసిని, నిలువనీడ లేనివాడను. అడవులలో, కొండలలో, గుహలలో, దిగంబరుల గుంపులతో తిరుగుదును. మీ అమ్మ యెడ కినియకుము. తల్లికి సాటియగు చుట్టము మఱిలేదు. అని హరుడన ఆ ఇల్లాలు నాకు బంధువులతో పనిలేదు. నేను సుఖపడు మార్గము ఏదైనా చేయుమనెను.

పరమేశ్వరుడు ప్రియురాలి ప్రీతి కొఱకామెతో కైలాసమునండి ప్రమథ గణపరివార ముతో సురసిద్ధ సేవితమగు మేరువునకు పోయెను. (38)

దక్షయజ్ఞ విధ్వంసము

వైవస్వత మన్వంతరమున ప్రాచేతసుడగు దక్ష ప్రజాపతియొక్క అశ్వమేధయాగము ఎట్లు నాశమొందెను. దేవియొక్క క్రోధ వ్యాపార మెరిగి సర్వాత్మకుడగు ఈశ్వరుడెట్లు కోపించెను. అమిత తేజోవంతుడగు దక్షుని యాగము మహాదేవునిచే రోషముతో నశింప చేయబడిన వృత్తాంతము సవిస్తరముగ మాకు ఎఱింగింపుము అని ఋషులు బ్రహ్మను ప్రశ్నించిరి.

ఋషులకు బ్రహ్మ ఇట్లనియె! మేరుశృంగ మొకటి 'జ్యోతి స్థలము' అను పేర ఉన్నది. అది సర్వరత్న భూషితము. లోకమనోహరము. ఆ పర్వతముపై శైలకన్యతో ఇందుధరుడు (శివుడు) వసించును. ఆదిత్యులు, వసువులు, అశ్వినులు, కుబేరుడు, సనత్కుమారాదులు అప్సరసలు అందరు ఈశ్వరుని సేవింతురు. గంగానది మూర్తిని ధరించి శివునికి సేవలు చేయుచుండును. దక్ష ప్రజాపతి ఆ సమయమున యజ్ఞారంభము చేసెను. ఇంద్రాది దేవతలు వచ్చిరి. అగ్నిసమమైన తేజస్సులతో విమానములమీద గంగా (హరి) ద్వారమునకు వారు అరుదెంచిరి. గంధర్వులు అప్సరసలు ఆడిరి పాడిరి. అందరును చేతులొగ్గి ఆయనను సేవించిరి. మఱియు శ్రీమహావిష్ణువుతో వసు, రుద్ర, ఆదిత్య, సాధ్య మరుద్గ ణములు, ఊష్మపులు, ఆజ్యపులు, సోమపాయులు అశ్వినీ దేవతలు యజ్ఞభాగార్థులై వచ్చిరి. జరాయుజ, అండజ, స్వేదజ, ఉద్భిజ్జములను నాలుగు రకముల జీవసమూహము కూడ వచ్చిచేరిరి. దేవతలు, ఋషులు, సపత్నీకులై ఏతెంచిరి. వారిని చూచి దధీచి కుపితుడై

పూజార్హులు కానివారిని పూజించినను అర్హులను పూజింపకున్నను మానవుడు మహా పాపియగును. అని దక్షుని చూచి పశుపతిని పూజార్హుని పరమేశ్వరుని నీవేల పూజింపవని యడిగెను. దానికి దక్షుడు, శూలహస్తులు జటాజూటధారులునైన ఏకాదశ రుద్రులు నాకు గలరు. మఱియొక మహేశ్వరుని నేనెరుగను అనెను. అదివిని దధీచి సర్వేశ్వరులకు ఏకైకమూర్తి అయిన మా మహేశ్వరుని నీవు పిలువలేదు శంకరుని కంటె మించిన దైవత మును నేనుగానను. ఈయజ్ఞము సంపన్నముగాదు. అన దక్షుడు విష్ణువునకు హవిర్భాగము లిచ్చితిమి. రుద్రులకు నిచ్చితిమి. మఱియును గల దేవతలందరకు వారివారి భాగములను ఇచ్చుచున్నాను. శంకరునికి మాత్రము ఈయను అనెను.

తండ్రి యజ్ఞమునకు వెళ్ళులెల్లరు ఏగిరని తెలిసి గిరిరాజకుమారి పార్వతి పశుపతి యగు పతితో నిట్లనియె. స్వామి! ఇంద్రాది దేవతలు ఎచటికేగుచు ఉన్నారు. ఆ రహస్య మును సర్వ రహస్యజ్ఞుడ వగు నీవు నాకానతిమ్ము అన ఈశ్వరుడు : మహానుభావుడగు దక్షుడను పేరుగల ప్రజాపతి అశ్వమేధము చేయుచున్నాడు. దేవి! ఈ యజ్ఞమునకు మీరేల వెళ్ళరు. వెళ్ళక పోవుటకు అభ్యంతరమేమి? ఈశ్వరుడు : ఇదంతయు దేవతలు చేసిన కుట్ర. యజ్ఞములందు అన్నిటను నాకు భాగము కల్పింపబడుటలేదు. మునుపటి నుండి యేర్పడిన దారినే పోవలెను. దేవతలు యజ్ఞభాగమును నాకు ధర్మము ననుసరించి ఈయవలసినది ఇచ్చుటలేదు అనగా పార్వతి ఏలినవారు ప్రభావము చేతను గుణముల చేతను తేజస్సుచేత కీర్తిచేత అణిమాసంపదచేత దేవతలందరిలో గెలువరానివారు లొంగని వారు. మీకీ హవిర్భాగము ఈయనందుకు నేనెంతో దుఃఖము పొందుచున్నాను. నాకు

వణకు పుట్టుచున్నది. సాక్షాత్తు భగవంతుడు ధ్యానమునకందని మహానుభావులు అయిన నా భర్త యజ్ఞభాగము నందుటకు నేనేమి దానము, నియమము తపస్సు చేయుదును అని పలికి క్షోభ పడుచున్న పత్నిని జూచి భగవంతుడు ఆనందభరితుడై ఇట్లనియె.

ఈశ్వరుడు –

ఓ కృశోదరి! లతాంగి! నన్ను నీవెఱుంగవు. నీవిపుడన్న మాటలేమంత ఉచితములు? విశాలాక్షి! మహానుభావులు అందఱు ఏమనుకొందురో నేనెఱుంగుదును. నీకు కలిగిన పొరబాటువలన ఇంద్రునితో గూడ ఎల్ల దేవతలు ముల్లోకములు సర్వము నష్టపడినది. నన్ను యజ్ఞేశ్వరుండందురు. రథంత సామముచే వేదవిదులు నన్ను స్తుతింతురు. బ్రాహ్మణులు నన్ను వేదమంత్రములచే యజింతురు. అధ్వర్యులు నాకు యజ్ఞములందు భాగము కల్పింతురు. అనవిని దేవి ఇట్లనియె. సామాన్యునివలె ఆడువారివద్ద నిన్ను నీవు పొగడుకొనుచున్నావు. నీలో నీవు గర్వపడుచున్నావు. సందేహములేదన నీశ్వరుడు సురేశ్వరి! నీవనుకొన్నట్లు నన్ను నేను పొగడుకొనుటలేదు. ఇక నా యజ్ఞ భాగమును నేనడుగ బోవ చున్నాను. అని ప్రాణముల కంటె ప్రియురాలైన ఉమాదేవిని గూర్చి భగవంతుడు పలికి ముఖము నుండి వెలువడుచున్న క్రోధాగ్ని నుండి ఒక కుమారుని సృష్టించెను. వానిని చూచి దక్షుని యజ్ఞమునకు పొమ్ము. నాఆజ్ఞచే అతడు చేయుచున్న క్రతువును నాశనము చేయుమనెను.

అటు తరువాత ఇట్లు రుద్రుడు ప్రయోగించిన సింహవేషధారి చేతను దేవి క్రోధవశమై నదని యెఱింగి నా దక్షయజ్ఞము అవలీలగ ధ్వంసము చేయబడెను. ఆగ్రహముచే మహోగ్రయై మహేశ్వరి భద్రకాళియై తాను కర్మసాక్షి గావున ఆ కోపమూర్తి వెంటనేగెను. రుద్రక్రోధ స్వరూపుడైన అతడు వీరభద్రుడను పేరందెను. ఆయన శ్మశాన నివాసిగూడ. దాక్షాయణి కోప నివారణము చేసినవాడు. ఆయన తన రోమకూపముల నుండి తనకుదాన గణేశ్వరు లను సృజించెను. వారు రుద్రునివెంట ఉందువారు రుద్రుని బలపరాక్రమ స్వరూపులు రౌద్రాకారులు. రుద్రుని సేవకులు వందలు వేలకొలది అప్పుడు యటవచ్చి వ్రాలిరి. ఆ రుద్రగణములు చేసిన ఘోరమైన కిలకిలారావములు ఆకాశమెల్ల అలము కొన్నట్లయ్యెను. ఆ ధ్వనికి దేవతలందరు హడలిపోయిరి. పర్వతములు బ్రద్దలయ్యెను. భూమికంపమందెను, ఝంఝామారుతములు విసరెను. సముద్రము క్షోభించెను. అగ్నులు వెలుగవయ్యెను. సూర్యుడు వెలవెల పోయెను. నక్షత్రములు తారా గ్రహములు కాంతి హీనములయ్యెను. ఋషులు, దేవదానవులు ప్రభాశూన్యులయిరి. లోకమిట్ల అంధకార బంధుంమైన సమయమున గణేశ్వరులు విజృంభించి, యజ్ఞశాలను అంటించిరి. బ్రద్దలు కొట్టిరి. యూపస్తంభములను పెల్లగించి పారవేసిరి. మనో వాయు వేగముల పర్యులెత్తిరి.

యజ్ఞ పాత్రములను యజ్ఞాయతనములను పిండి పిండి చేసిరి. తారలు (నక్షత్రములు) తునుకతునుకలై నింగి నుండి రాలుచున్నట్టు కనబడెను. రుద్ర గణము దివ్యాన్నపానభక్ష్య రాసులను, పర్వతములట్లున్న వానిని తినివేయ మొదలిడిరి. క్షీరనదులు, కరడుగట్టిన నెయ్యి, పాయసము, తేనెలు, ఇసుక మేటలు ఇట్లు పడియున్న ఖండ శర్కరలు, కాలువలై పారు బెల్లపు పాకములు, హెచ్చు రుచిగుల్కు మాంసములు, వివిధములైన భక్ష్యములు (తినదగినవి) లేహ్య (నాకదగినవి) చోష్య (జుఱ్ఱదగినవి) పానీయములు (త్రాగ దగినవి)పెక్కునోళ్ళ తినుచున్నారు. ఒలకబోయుచున్నారు. విరజిమ్ము చున్నారు, రుద్రుని బంట్లు కోపస్వరూపులు, మహాకోపులు, కాలాగ్నులట్లున్నారు. నడగొండలట్లు నలుదెసల క్రమ్మి భక్షించిరి. బెదిరించిరి. పలురూపుల ఆడిరి. గంతులిడిరి. దేవతాంగనల బట్టుకొని విసరజొచ్చిరి. ఇట్లు గణముల గూడి ప్రతాపశాలి వీరభద్రుడు రుద్రకోపముచే ప్రయోగిం పబడి సర్వదేవతల రక్షణలోనున్న ఆమహాయజ్ఞమును, భద్రకాళి సన్నిధినుండగా దహించి వేసెను. కొందరు గణాధిపులు సర్వభూత భయంకరముగ అర్చులు పెట్టిరి. యజ్ఞ పురుషుని తలబ్రద్దలుగొట్టి పెల్లున గర్జించిరి. అంతట ఇంద్రాది దేవతలు దక్ష ప్రజాపతియు చేతులు జోడించి తామెవ్వరో తెలుపుమనిరి.

అపుడు వీరభద్రుడు ఇట్లనియె. నేను దేవుడనుకాను. దైత్యుడనుకాను. ఇక్కడ విందు కుడుచుటకు వచ్చినవాడనుకాను. మీవేడుకచూడ వేడుకపడువాడనుకాను. దక్షయజ్ఞ నాశనముచేయ వచ్చినవాడను. రుద్ర కోపమువలన బయలుదేరినవాడను. వీరభద్రుడను పేరందినవాడను. దేవి క్రోధమునుండి వెలువడి భద్రకాళియని పేరందినదీమె. దేవదేవుడు పంప నీయజ్ఞము దరికి వచ్చినది. రాజేంద్రా! నీవు దేవదేవుని ఉమాపతిని శరణందుము. దేవప్రభువు కోపించుట మంచిదిగాని నౌకరులతో కోపము మంచిదికాదు.

కలుగులనుండి పెల్లగింపబడి విఱువబడిన యూపములతో మాంసలుబ్ధములై వ్రాలుచు మిక్కిలి విసురగ తొక్కలు విసురుచు ఎగురుచు వ్రాలుచున్న గ్రద్దలతో నక్క కూతలతో ప్రతిధ్వనించుచున్న రుద్రగణములచే ధ్వంసము చేయబడిన దక్షయజ్ఞమప్పుడు లేడిరూపుగొని ఆకాశమున కెగిరిపోయెను. ఆ రూపమున పోవుచున్న అయ్యజ్ఞపురుషుని చూచి వీరభద్రస్వామి విల్లు అమ్ములుంగొని వానిని చంప నేగెను. అమిత ప్రతాపశాలియైన ఆగణేశుని క్రోధమువలన అతని నుదుటినుండి ఘోరమైన ఒక చెమటచుక్క రాలి పడెను. నేలపై పడగానె ఆ స్వేద బిందువు నుండి ప్రజ్వలించు కాలాగ్నివొలె ఒక పురుషుడు ఆవిర్భవించెను. అట్లు ఆవిర్భవించిన పురుషమూర్తి మరుగుజ్జు ఎఱుపు కన్నులవాడు.

బవిరి గడ్డమువాడు, భయంకరుడు, నిక్కిన తలవెంట్రుకలు. ఒడలెల్లబొచ్చు, ఎఱుపారు చెవులు, జడుపుగొల్పు కాఱునలుపురంగు, ఎఱ్ఱబట్టలు గలవాడై ఆమహాబలుడు ఆ యజ్ఞము అగ్ని కక్షమును (ఎండుగడ్డిని) వలె కాల్చివైచెను.

దేవతలు భయాకులులై పదిదెసలకు పారిపోయిరి. అందు విక్రమముతో సంచారము చేయుచున్న ఆ వీరభద్రుని తలచే భూమి సప్త ద్వీపములతో కంపించెను. దేవలోక భయంకర మైన ఒక పెనుభూతము ఇట్లు విజృంభించగా అంతట నేను (బ్రహ్మ) మహాదేవుని పూజించుచు ఇట్లు అంటిని.

"దేవతలందరు నీకుకూడ యజ్ఞభాగము ఈయగలరు. ప్రభూ! సర్వదేవాధినాథుడవు. నీవీ భయంకర రూపమును ఉపసంహరింపుము. ఈ దేవతలందఱు, వేలకొలది ఋషులు నీ క్రోధముచే శాంతి పొందలేకున్నారు. ఓ సురేశ్వరా! నీ చెమటనుండి పుట్టిన ఈ పురుషుడు జ్వరమనుపేర లోకములందు చరింపగలడు. ఏకరూపమై ఉన్న ఇతని తేజస్సును ఈ ఎల్ల పృథివియు భరింపజాలదు. కావున దీనిని పెక్కురూపులుగా కావింపుము అని నేనన్నం తట, ఆయనకుగూడ యజ్ఞభాగము కల్పించి అంతట ఆ భగవంతుడు పినాకపాణి తనకుతాను పరమ ప్రీతి నందెను. దక్షుడును మనసార ఆ భవుని దేవుని శరణందెను. నేత్ర స్థానమున ప్రాణాపానములను ప్రయత్నముతో నిలిపి బహుదృష్టియగు పరమేశ్వరుడు బహిర్గతమైన చూపును మరలించి నిలిపి అల్లన నవ్వి నీకేమి చేయుదును తెలుపుమని ప్రశ్నించెను. ఈ కథను దేవతలు పితృదేవతలు ఆలించినంతట ప్రజాపతి దక్షుడు చేతులు మొగిచి బెదరిపోయి మదిలో శంకించుచు కన్నుల నీరుకార్చుచు ఇట్లనియె.

భగవంతుడు నాయెడల ప్రసన్నుడగునేని, నేను నీకు ప్రియుడనేని, నేననుగ్రహింప బడుటకు అర్హుడనేని, నాకొక్క వరమీయదగును. ఈ యజ్ఞము కొఱకు బహుకాలము బహుప్రయత్నముచే సమకూర్చుకొన్న భక్ష్యమెల్ల భక్షింపబడినది. త్రాగదగినదెల్ల త్రాగి వేయబడినది. బెదిరింపబడినది. నాశనము చేయబడినది. పొడిపొడి గావింపబడినది. ముక్కలు ముక్కలు చేయబడినది. అయినను నీ అనుగ్రహము వలన ఓ మహేశ్వరా! ఈ యజ్ఞము అబద్ధము కాగూడదు. సఫలము కావలయునని ప్రార్థించెను.

తథాస్తు (అట్లేయగుగాక!) అని భగుని కన్నులు రాల్చిన ఆహారుడు పలికెను. దక్షుడు నేలపై మోకాళ్ళను ఆనించి ధర్మమునకకు అధ్యక్షుడు త్రినేత్రుడు అగు మహాదేవుని నమస్కరించి శివ యజ్ఞముంబడసి ఎనిమిదివేల శివనామముల చేత ఆ వృషభధ్వజుని బహువిధముల స్తుతించెను. (39)

దక్షునిచే చేయబడిన శివస్తుతి

ఓ సదాశివా! నీ కన్నులు చంత్ర, ఆదిత్యులు. హృదయము బ్రహ్మ. ధర్మకర్మ సంపాదితమైన అగ్నిష్టోమము శరీరము. నీ యథార్థమైన మహిమను బ్రహ్మ, హరి ఋషులును గూడ ఎఱుగలేరు. నీ శివమూర్తులు (మంగళకరములయిన ఆకారములు) సూక్ష్మములు. అవి నాకు దర్శనమిచ్చు గాక! తండ్రి కన్నకొడుకువలె ఆ మూర్తులతో నన్ను రక్షింపుము. నీ సంరక్షణలో ఉండదగిన నన్ను రక్షింపుము. నీవు భక్తానుగ్రాహకుడవు, నేను నీభక్తుడను, ఏ మూర్తి వేలకొలది పురుషులను ఆవరించి సముద్రము అవ్వల ఉందునో ఆ మూర్తి నాకు రక్షకమగుగాక! నిద్రజయించి శ్వాసను అరికట్టి సత్త్వగుణ స్థాయినంది సమదర్శనులైనవారు పరంజ్యోతిని (భ్రూమధ్య స్థానమున) సంయోజన చేసి ఏమూర్తిని చూతురో అట్టి యోగాత్మకుడవైన నీకు నమస్కారము. ప్రళయమందెల్ల భూతములను భక్షించి జలమధ్యమున శయనించు ఆ శివునకు నమస్కారము. అతడు రాహుముఖము జొచ్చి రాత్రి సోముని త్రాగును. పగలు సూర్యుని గ్రసించును. అట్టి నీమూర్తికి నమస్కా రము. సోముడు, అగ్ని అంగుష్ఠమాత్రులై సర్వదేవతల దేహమందుండు పురుషులు (శివమూర్తులు) నన్నెల్లపుడు రక్షింతురు గాక నన్నాప్యాయనము చేయుదురుగాక (సంతృప్తుని గావింతురు గాక). ఎవ్వరి వలన పిండోత్పత్తి (గర్భోత్పత్తి) జరుగునో ఎవరు జలగర్భ మందుదురో, స్వాహా స్వధాకారమున హవిర్భాగములను అందుకొందురో ఆరగింతురో ఎవని వలన దేహధారులు పుట్టుదురో ఏ మూర్తులు జీవులను ఏడిపింతురో (రుద్ర రూపులుగా) ఆనంద పెట్టుదురో క్లేశముకల్గింపరో అట్టి నీమూర్తులకు నమస్కారము. సముద్ర మందు, నదీదుర్గమందు, పర్వతములందు, గుహలందు, వృక్షమూలమందు, గోశాలలందు, అడవులలో, గహనములలో, చతుష్పథములందు (నాలుగుదార్లు కలిసినచోట), వీధులందు (రాచబాటలందు), చత్వరములందు (సంస్కరింపబడిన భూమి), సభలలో, ఏనుగు, గుఱ్ఱముల సాలలందు, పాడుబడిన ఉద్యాన వనములందు, ఆలయము లందు, పంచ భూతములలో, దిక్కులలో, విదిక్కులలో, ఇంద్రసూర్యుల నడుమ, సూర్య చంద్ర కిరణములందు, పాతాళమందు, అంతకంటెను మీదను, ఇచ్చట ఏ మూర్తులుగలవో వానికి నమస్కారము. సత్వము నీవే సర్వత్ర నీవే సర్వభూతపతివి, సర్వభూతాంతరాత్మవు నీవు, అందుచే నీవు నిమంత్రితుడవు (పిలువ బడువాడు) కావు. వివిధములైన దక్షిణలుగల యజ్ఞములచే నీవే యజింపబడుదువు. అంతకును నీవే కర్తవు. అందుచే నీవు నిమంత్రితుడవు కావు సూక్ష్మమైన మాయయునీవే. దానిచే నేనును మోహింపబడితిని. (పొరబడితినన్న మాట) అందుచేతగూడ నిన్ను నేను నిమంత్రింపలేను. నిన్ను పేర్కొనలేదని

భావము. నాయెడల ప్రసన్నుడవగుము. నాకు నీవే దిక్కు. నీవే నాగతివి. నీవే నా ప్రతిష్ఠయు (ఉనికి లేక ఆధారము). నీకంటె మఱియొక్కడు లేడని నా తలంపు అని ఇట్లు మహేశ్వరుని దక్షుడు స్తుతించి ఊరుకొనెను. భగవంతుడు ప్రీతుడై దక్షునిగని మఱియు ఇట్లనెను. నీ చేసిన స్తవముచే సంతుష్టుడనైతిని. నీవు ఉత్తమ వ్రతనిష్ఠుడవు. ఎక్కువమాటలు ఎందులకు? నీవు నాసన్నిధికి వత్తువని త్రిలోకేశుడు భవుడు సర్వజ్ఞుడు దక్షునికి ఓదార్చుగ దక్షా! యజ్ఞ ధ్వంసమునకు దుఃఖపడవలదు. చూచితివిగదా. యజ్ఞహసనము చేసినది నేనే. ఇదిగో నీయజ్ఞఫలము ఉత్తమమైన దానిని నావలన మఱల పొందుము. ప్రసన్న ముఖుడవు ఏకాగ్ర మనస్కుడవై నామాట వినుము. వేయి అశ్వమేధములు, నూరు వాజపేయములు చేసిన ఫలము నా ప్రసాదముచే నీవు ఇప్పుడు పొందగలవు. షడంగ వేదములను సమగ్రసాంఖ్య యోగములను (జ్ఞానయోగములను) నీవు తెలిసికొనుము. పండ్రెండేండ్లు దేవదానవులు చేయలేని ప్రజ్ఞాహీనులు (అజ్ఞానులు) నిందించు నట్టిదియు వర్ణాశ్రమ ధర్మములతో కూడినదియు, లొంగనిదియు, వ్యవసితమును (వ్యవస్థ చేయ బడినదియు) పశుపాశ విమోచనము చేయునది. (జీవుల అజ్ఞానపాశముల త్రెంచునది) సర్వాశ్రమస్థులకు అనువైనదిగ నేను సర్వపశుపాప విమోచన మంత్రమును రూపొందించితిని. ఇది లెస్సగ ఆచరించిన ఎడల పుష్కలమైన ఫలము గల్గును. అది నీకు అనుష్ఠేయము అగుగాక! మహానుభావ! మానసిక జ్వరమును (తాపమును) విడువుము అని ఇట్లు దేవేశుడు పలికి ఉమాదేవితో పరివారముతో అంతర్ధానమయ్యెను. మఱియు ఆ భవుడు సర్వధర్మజ్ఞుడు కావున సర్వభూత శాంతి కొఱకు దక్షయజ్ఞ ధ్వంసమునకు తాను ఆవిర్భవింపజేసిన జ్వరము ఈ క్రింది విధముగా విభజించెను. ఆ వివరము ఓ విప్రోత్తములారా వినుడు.

ఆ జ్వరము గజములలో శిరోతాపముగను, పర్వతములలో శిలాజితముగను, నీటిలో నీలిక (అనుపేరుతోను) పాములలో కుబుసముగను, ఆవులలో ఖోరకము, భూమి యందు ఊషరము (చవిటినేల) కుక్కలకు నేత్రావరోధము (గ్రుడ్డితనము) గుఱ్ఱములకు రంధ్రాగతము నెమళ్లకు పింఛములూడి పోవుటయును, కోకిలలకు నేత్ర రాగముగను, మహాత్ములకు ద్వేషము, సర్వజనులకు భేదము (ఒంటెత్తుతనము. ఒకరికొకరికి పడకపోవుట) చిలుకల కెక్కిళ్ళు, పులులకు శ్రమ (అలసట) మనుష్యులకు కేవలము జ్వరరూపమైన వ్యాధిగాను ఉంచబడినది. ఇది నరులకు పుట్టునపుడు, గిట్టునపుడు, ఆరెంటికి నడుమను గూడ ఉంచబడినది. ఇది మహేశ్వర తేజస్సే. జ్వరము (శివజ్వరము) అనుపేర మిక్కిలి దారుణమై ఉన్నది. సర్వ ప్రాణులకును ఈశ్వరుడు నమస్కరింపవలసినవాడు, మాన్యుడు. ఈ జ్వరోత్పత్తి నిండుమనసుతో చదివినవాడు రోగముక్తుడై సంతోషముతోగూడి సర్వాభీష్టములను పొందును.

ఫలశ్రుతి

దక్షుడు చేసిన ఈ శివస్తవమును పారాయణముచేసిన వాడెన్నడును అశుభము పొందడు. దీర్ఘాయువునందును. సర్వదేవులందు మహాదేవుడు భగవంతుడు, శ్రేష్ఠుడైనట్లు దక్షకృతమైన ఈ శివస్తుతికూడ సర్వస్తుతివరిష్ఠము. కీర్తి, స్వర్గము, దేవైశ్వర్యము, ధనము జయము కోరువారును విద్యాకాములును ఈ స్తవమును భక్తితో పఠింపవలయును, వ్యాధి, దుఃఖము, భయమునకు గురియైనవాడు రాజకార్య నియుక్తుడును, ఈస్తుతి పఠించిన భయవిముక్తుడగును. అతడీ దేహముతోనే శివగణములు అనుభవించు మహేశ్వర సుఖమును (పరమేశ్వర విభూతిని) ఇహమందు అనుభవించి, గణాధిపతి అగును. యక్షులు, పిశాచులు, నాగులు, వినాయకులును, ఆ భక్తునికి ఎట్టి విఘ్నములు కల్గింపరు. ఈ స్తుతిని భక్తితో శివునిపై భావమునిల్పి విన్నచో పుట్టింటను, అత్తింటను పూజ్యురాలగును. దీనిని విన్నను కీర్తించినను, వానికి నిర్విఘ్నముగ సర్వకార్యసిద్ధి అగును. ఇది కీర్తించుటచే మనసుచేత సంకల్పించినది మాటచే అన్నది ఎల్లపనులు నెరవేరును. కుమారస్వామికి గౌరికి నందీశ్వరునికి ఇంద్రియ నిగ్రహముతో నియమముతో వేర్వేరు బలిని (పూజను) ఒనరించి ఆమీద నీ శివనామములను క్రమముగ పారాయణమునకు గ్రహింపవలెను. అందువలన మానవుడి ఇష్టార్థములను భోగములను పురుషార్థములను బడయును. మరణించి అప్సర స్త్రీ సహస్రముతో స్వర్గమునకేగును. కోరికలతో పాతకములతో ఉన్న వాడైనను ఈ దక్షకృత శివస్తుతి పఠించి సర్వపాప ముక్తుడగును. దేహపాతానంతరము గణ సాయుజ్య మందును. సురాసురలపుడు వానిని పూజింతురు. అతడు భూత ప్రళయము దాక వృషభ వాహన మెక్కి రుద్రానుచరుడగును.

ఈ విధముగ పరాశరసూనుడు వ్యాసభగవానుడు పలికినాడు. ఇది ఎవ్వడు ఎఱుగడు. దీనిని ఎవ్వనికి వినిపింపరాదు. ఇది గుహ్యమైన (మంత్రసమ్మిత మైన) స్తవము. పాపజన్ములయినను వైశ్యులు స్త్రీలు శూద్రులు ఈస్తుతిని పఠించి విని రుద్రలోక మందుదురు. విప్రులకు ప్రతిపర్వమందు దీనిని వినిపింపవలెను. అందుచే ద్విజుడు రుద్రలోక మందు కొనగలడు. సందియము లేదు.(40)

ఏకామ్రక్షేత్ర మాహాత్మ్యము

లోమహర్షణుడు ఇట్లనియె –

మునివరులారా! వ్యాసులు తెలుపుచుండ రుద్రుడు కోపించిన మీదట జరిగిన పుణ్య

కథా వృత్తాంతమైన పార్వతిరోషము, శంభుని క్రోధము, వీరభద్రుని యొక్కయు, భద్రకాళి యొక్క అవతారము, దక్షయజ్ఞధ్వంసము, శంకరుని అద్భుత విక్రమము, తిరిగి ఆయన మహాత్ము డగు దక్షునికి ప్రసన్నుడగుట, రుద్రునకు యజ్ఞ భాగమిచ్చుట దక్షునికి క్రతుఫలము లభించుట చూచి సంప్రీతులు విస్మితులునై ఋషులు వ్యాసుని తక్కిన కథను తెలుపుమని అడిగిరి. వ్యాస భగవానుడు ఏకామ్ర క్షేత్రమును గురించి వారడుగ ఇట్లు తెలుప దొడంగెను. వ్యాసుడు పలికెను –

బ్రహ్మ తెలిపిన పుణ్యకథను ఆలించి మునిపుంగవుల ఒడలు పులకరింప ఆనంద భరితులై వ్యాసులను కథను కొనియాడిరి. ఋషులు –

"ఆహా! శంభుదేవుని మహిమ నీవు చక్కగ తెల్పితివి. ఇపుడు ఏకామ్ర క్షేత్రమును గురించి తెలుపుము. వినవలెనని మిక్కిలి కుతూహలముతో ఉన్నా"మనిపలికిరి. వ్యాసుడు వారి వచనము విని లోకేశ్వరుడు చతుర్ముఖుడు భూతలమున పాపహరమగు ఆ శివ క్షేత్రమును గూర్చి మునులకిట్లు తెలిపెను.

"సర్వ పాపహరము, పరమ దుర్లభము, కోటిలింగ సహితము, కాశీ క్షేత్ర సమానము ఎనిమిది తీర్థములతో కూడినదియు ఏకామ్రమని ప్రసిద్ధిగల పుణ్య క్షేత్రమును గురించి చెప్పుచున్నాను" వినుడు.

పూర్వకల్పమందక్కడ ఏకామ్రవృక్షము (ఒంటి మామిడిచెట్టు) ఉన్నందున ఆ క్షేత్రము నకు ఆపేరువచ్చినది. అందు సంతుష్టి, పుష్టియుగల స్త్రీ పురుషులు ఉందురు. పండిత సమూహముతోను ధన ధాన్యములతోను గూడినది. గృహ గోపురముల ఒత్తిడి గొన్నది. త్రికోణాకార ద్వారబంధ శోభితము, నర్తక బృందసహితము సర్వరత్నోప శోభితము. కోట బురుజులతో ఒప్పునదియు రథికులచే శోభించునది, రాజహంసలట్లు తెల్లని ప్రాసాదముతో రాణించునది, పురద్వారములతో ఒప్పునదియు తెల్లని ప్రాకారములతో వ్యాప్తమైనదియు, ఆయుధ ధారులచే అభిరక్షితమైనది, కందకములతో రాణించునదియు, గాలిచే చలింపజేయబడిన బహువర్ణ పతాక పరిశోభితము, నిరంతర ఉత్సవ ప్రముదితము, నానావాద్యధ్వని సంకులము, దేవాలయములు, ప్రాకారములు, ఉద్యానవనములతో పరమసుందరము. అందలి స్త్రీలు పరమసుందరులు, ఆనందభరితులు. సర్వాభరణ భూషితులు, పద్మనేత్రలు. పూర్ణచంద్రాననలు, కాంచీనూపుర శబ్దశోభితులు, కొందరు బంగరు చాయవారు, కొందరు గజగమనలు, కొందరు పీనోన్నత కుచభారావనమ్రలు, దివ్యగంధానులిప్తలు, కొందరు కర్ణాభరణ భూషితలు, మరికొందఱు మదవతులు, సుక్షీ

ణులు, కొందరు నగుమోము గలవారు, అపుడించుక వెలువడు పలువరుస గలవారు కొందరు బింబాధరోష్ఠులు. కొందరు మధురస్వర మనోహరులు. తాంబూల రంజిత ముఖులు, ప్రియదర్శనులు, మనోహారిణులు. క్రియవాదినులు, నిత్య యౌవనగర్వితులు. అందరు దివ్యాంబరాభరణ ధారిణులు, పరమ పతివ్రతలు ఆ క్షేత్రమున యువతులు అప్సరల సమానులు, క్రీడా విలాసినులు. రేయింబవళ్ళు తమతమ గృహములందు ఆనంద భరితులై ఉండు ఉత్తమ గృహిణులు.

అచట పురుషులు రూపయౌవన గర్వితులు, సర్వలక్షణ సంపన్నులు, నిగనిగ మెరయు మణిమండనములు ధరించువారు. బ్రాహ్మణాది వర్ణములవారు స్వధర్మ నిరతులు. అందు వారాంగనలు కూడ పరమ సుందరులై ఒప్పుదురు. ఊర్వశీ, మేనకాది దేవ సుందరీమణుల అందమున ఒప్పువారు. సంగీతాది సకల కళానిపుణులు. ప్రియవాదినులు. సర్వ లక్షణ లక్షితులు, నృత్య గీత విశారదులు. సర్వరమణీ రమణీయ గుణ గర్వితులు. వాలు చూపులలో మాటలలో నిపుణులు; కురూపులు, కుబుద్ధులు, పరద్రోహి పరాయణులు అందు కానరారు. వారి కటాక్ష ప్రసరణ మాత్రమున మానవులు మోహవివశులు అగుదురు.

నిర్ధనులు, మూర్ఖులు, పరద్వేషులు, రోగులు, లోభులు, మాయకులు, జగత్ప్రసిద్ధమైన ఆ క్షేత్రమున ఉండరు. సర్వసుఖ సంచారము. సర్వసత్త్వ సుఖకరము. సర్వసస్య సంభరితము. సర్వజన సంకులము ఆ ప్రదేశము. అందుకల ఫలవృక్షములు ఎందును లేవు. అందలి ఉద్యానములు నందనవనములు. సర్వ ఋతుకుసుమఫల భారావనమ్ర వృక్ష శోభితములు.

అందు శుక పిక చకోర చక్రవాత ప్రముఖ సకల పక్షికుల కిలకిలారావ సంకులములగు వనములు, సరస్సులు, దిగుడు బావులు, చూడముచ్చట గొల్పుచుండును. అందు కమలములు, కలువలు, ఎర్ర తామరలతో నిండిన పుణ్య సరస్సులు ఎటు చూచినను కన్నుల పండువు చేయుచుండును. అచట పరమశివుడు సన్నిహితుడు. ఆ పరమేశ్వరుడు భూమి యందున్న నదులు పుష్కరిణులు చెరువులు నూతులు, సాగరములు అనువాని నుండి జల బిందువులను సేకరించి సురలతో ఆ పుణ్యక్షేత్రమున బిందుసరమను తీర్థమును నిర్మించెను. మార్గశీర్ష బహుళ అష్టమినాడు జితేంద్రియుడై అచట యాత్రచేసి శ్రద్ధతో స్నానము చేసి వాజ్ఞియమమును పాటించి దేవర్షి పితృతర్పణము ఆచచరించి తిలాంజలులు చేసినవాడు అశ్వమేధ ఫలమందును. గ్రహణ పర్వకాలమున విషువమున (పగలు రాత్రి సమానముగా ఉండు కాలమున) సంక్రమణమందు ఆయన సమయమున యుగాదులందు షడశీతిని (తుల మొదలుకొని 86వ రోజున వచ్చెడి పుణ్యకాలము. ఇది సంవత్సరమునకు నాలుగు

పర్యాయములు వచ్చును. ద్విస్వభావ రాశియందే ఇదివచ్చును.) మఱి ఇతర శుభ సమయములందు ధనాది పుణ్యదానములు చేసినవారు ఇతర తీర్థములకంటె నూరురెట్ల ఫలమును అందుదురు. ఆ బిందు సరస్తీర్థము నందు పితృదేవతలకు పిండ ప్రదానము చేసినవారు పితృదేవతలకు అక్షయతృప్తిని కలుగజేసిన వారగుదురు సంశయము లేదు.

అటుపైన ఇంద్రియములను ఇమిడించుకొని వాక్కును నిగ్రహించుకొని, శివాలయమునకు (ఏకామ్రేశ్వరాలయము) పోయి, అందు శంకరుని పూజింపవలెను. అంతకు ముందు ఆలయ మునకు ముమ్మారు ప్రదక్షిణము చేయవలెను. ఆవునేతితో గోక్షీరముతో శుచియై స్వామికి అభిషేకించి చందనము, కుంకుమయు పూసి అటుతరువాత ఉమాపతియగు చంద్రమౌళీశ్వరుని పుష్పములచే పవిత్రములగు బిల్వార్క కమలాదులచే ఆగమ విధానమున వైదిక మంత్రములతో ఆరాధించవలెను. దీక్షాపరుల పూజావిధానమిది. దీక్షనొందనివారు మూల మంత్రముతోను, నామములతోను అర్చించవలెను. ఈ విధముగ గంధ పుష్పాదులతో షోడశోప చారములతోను నృత్య గీతాదులతోను ఆరాధించి పాపవిముక్తులగుదురు. రూపసి యువ కుడు అగును. ఇరువది ఒక్క తరముల వారిని ఉద్ధరించి దివ్యాభరణముల దాల్చి, చిరు గంటలు మ్రోయు బంగరు విమానమున గంధర్వ అప్సరసాదులు కీర్తింప సర్వ దిశల మిరుమిట్లు గొల్పుచు తుదకు శివలోకము చేరును. అచటి భక్తులతో భూత ప్రళయ పర్యంతము అచ్చట ఉండి భూ లోకమునకువచ్చి యోగి గృహమునందు చతుర్వేది అగును. అచట పాశుపత దీక్షగొని మోక్షము పొందును.

శయనైకాదశి, ఉత్థాన ఏకాదశులందు సంక్రమణములందు, అయన పుణ్యకాలములందును, అశోకాష్టమి పవిత్రారోపణము లందును శివ దర్శనము చేయువారు సూర్య ప్రభగల విమానమున శివలోకమునకు ఏగుదురు. మేధావంతులు ఎల్లకాలము శివ దర్శనము చేసి శివలోకమందుదురు. ఈ శివ క్షేత్రమునకు నలుదిక్కులందుగల రెండున్నర యోజనముల ప్రదేశము భుక్తి ముక్తులను ఇచ్చు క్షేత్రము. ఆ క్షేత్రమునందుగల లింగము భాస్కరేశ్వర మనబడును. అచట ఉన్న కుండమున స్నానముచేసి ఆదిత్యునిచే అర్చింపబడిన ఆ భాస్కరేశ్వరుని దర్శించినవారు విమానమెక్కి గంధర్వగానములను వినుచు శివలోకమునకు ఏగుదురు. అచట ఆనందభరితులై ఒక కల్పకాలము మనోహర భోగములను అనుభవించి పుణ్య క్షయముకాగా, భూ లోకముచేరి యోగి గృహమునందు పుట్టి వేద వేదాంగ పారగులై సర్వభూత హితముకోరు బ్రాహ్మణులై సర్వసములై, మోక్షశాస్త్ర కుశలురై, శివయోగ మంది మోక్షమందుదురు. పూజ్యమైనను, అపూజ్యమైనను ఒక శివలింగము అడవిలో, రాచబాటలో, నాల్గుదార్లు కలిసినచోట, శ్మశానమునందుగాని ఎక్కడో అక్కడ

ఆక్షేత్రమునందు ఉన్న యెడల దానిని జూచి తొట్రుపడక, శ్రద్ధతో మనసునిలిపి భక్తితో అభిషేకము చేసి సుగంధ పుష్పాదులచే ధూపదీప నైవేద్యాదులచే నమస్కారములచే నమస్కరించి సాష్టాంగ దండప్రణామము గావించిన అతడు శివలోకమేగును. స్త్రీ యైనను శ్రద్ధతో శివుని పూజించిన ఈ చెప్పిన ఫలమందును. ఇందు ఆలోచించవలసిన పనిలేదు.

ఆ ఏకామ్ర క్షేత్రముయొక్క సమగ్ర గుణ విశేషములను పరమేశ్వరునికంటె మఱి ఎవ్వడు వర్ణింపగలడు? ఏయే స్థితిలోనున్నను వైశాఖాది మాసములందు, బిందు సరోవర జలమందు స్నానముచేసి అటనున్న శివుని, వరదాత్రియగు పరమేశ్వరిని, ప్రమథ గణములను, కుమారస్వామిని, గణపతిని, నందిని, కల్పవృక్షమును, సావిత్రీదేవిని దర్శింపవలెను. అందువలన శివుని సాలోక్య మందును. కపిల తీర్థమున యథావిధిగా స్నానమాచరించి అభీష్టములనంది శివలోకమందును. ఆ క్షేత్రముననే జితేంద్రియుడై యథావిధి స్తంభ ప్రతిష్ట చేయునతడు ఇరువది యొక్కతరములు కులమును ఉద్ధరించి శివలోకమునకు పోవును. కాశీ క్షేత్రసమయమున శివ క్షేత్రమగు ఏకామ్ర క్షేత్రమునందు స్నానము చేసిన అతడు తప్పక మోక్ష మందును. (41)

ఉత్కల క్షేత్ర వర్ణనము

విరజమను క్షేత్రమందు విరజయను పేరుగల మాత సరస్వతీదేవి సుప్రతిష్ఠింపబడినది. ఆమెను దర్శించిన మనుజుడు ఏడు తరముల వారిని పవిత్రులను చేయగలడు. ఆ దేవిని ఒక్క మారైనను దర్శించి పూజించి మ్రొక్కినవాడు తన వంశమును ఉద్ధరించి స్వర్గలోకమునకు ఏగును. ఆ విరజ క్షేత్రమునందు లోకమాతలింక ఎందతో ఉన్నారు. వారు సర్వపాప హారిణులు భక్తవత్సలలు, వరప్రదాత్రులు. అక్కడ సర్వ పాప హారిణి వైతరిణీనది ఉన్నది. అందు స్నానముచేసిన నరోత్తముడు సర్వ పాపవిముక్తుడగును. అక్కడనే వరాహమూర్తియై హరి తనకుతాను వెలసియున్నాడు. ఆయనను భక్తితో దర్శించి మ్రొక్కిన విష్ణు పరమాత్మను చేరుకుందురు.

విరజ క్షేత్రమందున్న కపిలతీర్థము, గోగ్రహము, సోమము, ఆలాబుతీర్థము, మృత్యుంజయము, క్రోడము (వరాహము), వాసుకము, సిద్ధకేశ్వరము అను పేరుగల ఈ ఎనిమిది తీర్థములందు బుద్ధిమంతుడు ఇంద్రియములను నిగ్రహించి యథావిధిగ స్నానము చేసి దేవతలకు మ్రొక్కి సర్వ పాపముక్తుడై దివ్యవిమానమెక్కి గంధర్వులు గానము చేయుచు కీర్తింపగా ఏగి ఆ లోకమందు పూజ్యుడగును.

విరజ క్షేత్రమున పితరులకు పిండదానముచేసిన అది అక్షయ తృప్తికరమగును. ఈ నా క్షేత్రమందు శరీరము విడిచినవారు ముక్తులగుదురు. ఇచట సముద్ర స్నానము చేసి కపిలుడను పేరనున్న విష్ణువును, వారాహియను దేవతను దర్శించిన స్వర్గమందుదురు. ఇచట పుణ్యతీర్థములందు ఆలయములు పెక్కులున్నవి. అవి ఆ యాత్రా సమయమందు తెలిసికొని సేవింపదగును. సముద్రము ఉత్తరపు ఒడ్డునగల ప్రదేశమందు గుహ్యమైన ముక్తి క్షేత్రమున్నది. అందంతట ఇసుకమేటలు ఉన్నవి. పదియోజనముల వైశాల్యము గలది. అశోకాది నానా ఫలవృక్షములు, మందారాదులు, పూలచెట్లు, ఖర్జూరాది వృక్షములు సర్వ ఋతుఫల కుసుమ గంధ భరితములు, పక్షికూజిత మనోహరములు ఎన్నో కలవు. దిగుడు బావులు పుష్కరిణులు తామర కొలనులకు లెక్కేలేదు. స్వవర్ణ ధర్మానుసారులు గృహస్థాద్యాశ్రమముల వారు అక్కడ ఉన్నారు. స్త్రీలు, పురుషులు, హృష్టులు, పుష్టులును అందే వసింతురు. అది సర్వవిద్యాసదనము సర్వ ధర్మ గుణాకరము. అట్టి క్షేత్రము మఱి దుర్లభము.

అక్కడ పురుషోత్తముడను పేర విష్ణువున్నాడు. ఉత్కళ దేశము సరిహద్దువరకుగల దేశము కృష్ణానుగ్రహముచే పుణ్యతమము. నేను, రుద్రుడు, ఇంద్రుడు, అగ్నిముఖులగు దేవతలు అచ్చటనే ఎల్లవేళల వసింతుము. గంధర్వులు, అప్సరసలు, పితరులు, మనుష్యులు, మునులు, వాలఖిల్యాదులు, కశ్యపాదులు, గరుడులు, కిన్నరులు, నాగులు, సాంగములైన వేదములు, సర్వశాస్త్రములు, ఇతిహాస పురాణాదులు, యజ్ఞములు, పుణ్య నదులు, తీర్థములు, గిరులు, సాగరములు అక్కడనే ఉన్నవి. ఇట్లు దేవ, ఋషి, పితృ సేవితమై సమస్తోపభోగములతో కూడిన పవిత్రతమమైన దేశమున నివాసము ఎవనికి రుచింపదు? దానికంటె అధికమైన శ్రేష్ఠత్వము ఏదేశమున ఉండును? బ్రాహ్మణులారా! ముక్తిప్రదుడైన పురుషోత్తముడు స్వయముగ సన్నిహితుడై ఉన్న ఉత్కళ దేశవాసులు ధన్యులు.

అక్కడ తీర్థ స్నానముచేసి పురుషోత్తముని సేవించినవారు స్వర్గమునకు పోవుదురు. వారు యముని ఆలయమునకు పోరు. ఉత్కల దేశమునందలి పురుషోత్తమ క్షేత్ర నివాసుల జీవితము ధన్యము. ప్రసన్నములై విశాల నేత్రములు, చక్కని కనుబొమలు, కేశపాశము, కిరీటము, ఇంపైన చెవి కమ్మలు, చిఱునవ్వు, చక్కని పలువరుసయుకల్గి కిరీటాలంకృతుడైన ఆ కృష్ణ పరమాత్మ యొక్క ముఖపద్మము త్రిలోకానంద జనకము. (42)

అవంతీ వర్ణనము

బ్రహ్మ ఇట్లు అనెను –

విప్రులార! మున్ను కృతయుగమునందు 'ఇంద్రద్యుమ్నుడు' అనురాజు ఉండెను.

అతడు ఇంద్రతుల్య పరాక్రముడు. సత్యవాది, సమర్థుడు, సర్వశాస్త్ర విశారదుడు. రూపవంతుడు, సుభగుడు, శూరుడు, దాత, భోక్త, ప్రియభాషి. యజ్వ బ్రహ్మజ్ఞాని, సత్యప్రతిజ్ఞుడు, ధనుర్వేదమందు, వేదమందు, శాస్త్రమునందు నిపుణుడు, స్త్రీ పురుషులకు పున్నమచందుని విధముగా ఆందగాడు. ప్రతాపమున సూర్యునివలె తేరిపారజూడ అలవి కానివాడు. శత్రు కూటమునకు భయంకరుడు. విష్ణు భక్తుడు. సత్త్వశాలి. జితక్రోధుడు, జితేంద్రియుడు. యోగశాస్త్ర సాంఖ్య (జ్ఞాన) శాస్త్రములను అధ్యయనము చేసినవాడు. మోక్షమునందు ఇచ్ఛగలవాడు. ధర్మనిష్ఠుడు. ఇట్లు సర్వలక్షణ నిధియైన ఆరాజు భూమిని పాలించుచుండ అతనికి హరిని ఆరాధింపవలెనను నిశ్చయము కల్గినది.

దేవేశ్వరుడైన జనార్దనుని నేను ఎట్లారాధింపగలను? ఏ క్షేత్రము తీర్థము నదీతీరము ఆశ్రమము ఇందులకు అనువైనవి! అని తలచి మనసుచే పృథివినెల్ల పరికించి అన్ని తీర్థక్షేత్రపుర సముదాయము నెల్ల వదలి పురుషోత్తమ క్షేత్రమందు ఆలయమున కేగెను. అతనిని బలము (సేన) వాహనములు వెంబడించినవి. అక్కడ భూరిదక్షిణలొసంగి యథావిధిగ అశ్వమేధము చేసెను. స్వామికి మహోన్నత ప్రాసాదము గట్టించి అందు సంకర్షణుని (బలరాముని), కృష్ణుని, సుభద్రను ప్రతిష్ఠించి పంచతీర్థములు ఏర్పరచి స్నాన దాన తపో హోమాదులు ఆచరించి దేవతా దర్శనముచేసి భక్తితో ప్రతిదినము హరిని ఆరాధించి అస్వామి అనుగ్రహముచే మోక్షమును పొందెను. మార్కండేయుని, కృష్ణుని, బలరాముని దర్శించి ఇంద్రద్యుమ్న సాగరమున స్నానముచేసిన మానవుడు తప్పక మోక్షమును పొందును.

మునులు –ఇంద్రద్యుమ్న ప్రభువు మున్ను ఆ ముక్తి క్షేత్రమునకు ఎందులకు వెళ్లెను. వెళ్లి ఆ స్వామిని అశ్వమేధముచేసి ఎట్లు ఆరాధించెను? త్రిలోక ప్రఖ్యాతమైన ఆలయము అక్కడ ఎట్లు నిర్మించెను? సుభద్రా, బలరామ కృష్ణుల మూర్తులను ఎట్లు నిర్మించెను? ఆ క్షేత్ర రక్షణ ఎట్లు చేసెను? ఆలయమందు కృష్ణాదుల ప్రతిష్ట ఎట్లు జరిగెను? ఇదంతయు జరిగినది జరిగినట్లు విపులముగ ఆనతిమ్ము నీ వాగమృతము సేవించిన కొలది మాకింకను అది గ్రోలవలయును అనిపించుచున్నది. వినవలెనని మిక్కిలి కుతూహలమగుచున్నది.

అని ఇట్లు మునులు అడుగ బ్రహ్మ "బాగు బాగు! పురాతనకథను అడిగితిరి. ఇది సర్వపాప హరము. భుక్తిముక్తి ప్రదము. శుభకరము. కృతయుగమందు జరిగిన చరిత్ర ఇదె చెప్పుచున్నాను. శ్రద్ధగా ఇంద్రియములను అదుపులో ఉంచుకొని వినుడు.

మాళవ దేశమునందు అవంతి అను నగరమున్నది. అది భూ మండలమను ఋషభమునకు మూపురమా అన్నట్లు తలమానికమై ఉండెను.

అక్కడి త్రిపురవైరి (శివుడు) 'మహాకాలుడు' అను పేర వెలసియున్నాడు. ఆయన సర్వాభీష్ట ప్రదాత. అచ్చట పాపహరమైన శివకుండమున స్నానముచేసి దేవ ఋషి, పితృ తర్పణాదులుచేసి శివాలయమునకేగి ప్రదక్షిణముచేసి ధ్యాన ఆవాహనాది ఉపచారములతో స్వామిని అర్చించిన నరుడు అశ్వమేధ యాగ ఫలమునందును. దివ్య విమానములో శివలోకమున కేగును. అట దివ్య రూపాంబరాభరణాదులతో గూడి మహాభోగములు అనుభవించి ఇక్కడికివచ్చి బ్రాహ్మణుడై జనించి నాల్గు వేదములు సర్వశాస్త్రములు నేర్చి పాశుపత యోగముల పొంది ముక్తిని పొందును.

అక్కడ శిప్రా అను నది గలదు. అట స్నాన తర్పణాదులు చేసిన అతడు విమానమున స్వర్గమేగును. అక్కడనే విష్ణువు గోవిందస్వామి అనుపేర ఉన్నాడు. ఆయనను సేవించిన ఇరువదియొక్క తరములు తరించును. ఈ మున్ను చెప్పిన ఫలములన్నియు అచ్చట కల్గును. తిరిగి ఈ లోకమునకు వచ్చి వైష్ణవ యోగమున ముక్తిని పొందును. అక్కడనే విక్రమస్వామి అను పేరనున్న విష్ణువు ఆరాధించిన మగవాడుగాని స్త్రీగాని మున్ను చెప్పిన ఫలమందుదురు. అక్కడ ఇంద్రాదిదేవతలు, మాతృకలు గలరు. వారును కోరిన కోర్కు లిత్తురు. వారిని సేవించిన స్వర్గము లభించును. అవంతి అను ఆ నగరమును రాజసిం హుడను రాజు పాలించెను. అందులో పదునెన్మిది పురములు (మహాపుర భాగములు) గలవు. అవి సువిస్తీర్ణ రాజమార్గములు. అచ్చట అందఱును విద్వాంతులు వేద ఘోషచే అది ప్రతి ధ్వనించుచుండును. అట ఇతిహాస శాస్త్ర పురాణాది ప్రసంగములు నిత్యము వినబడును. దీనికి ఒకానొక కాలముల ఇంద్రద్యుమ్నుడు పరిపాలకుడు. (43)

పురుషోత్తమ క్షేత్ర దర్శనము

అని చెప్పి ఇంకను బ్రహ్మ ఇట్లు అనెను –

ఆ రాజు అవంతీనగర మందు (ఉజ్జయిని యందు) ప్రజలను స్వసంతానమట్లు పాలించెను. సత్యవచనుడు శూరుడు సర్వసుగుణ సంపన్నుడు, ధార్మికుడు, జ్ఞాని, బుద్ధిశాలి, సర్వశాస్త్రజ్ఞుడు, పరరాజుల గెల్చినవాడునై అతడు ప్రతాపమున రవిని రూపముచే అశ్వినీ కుమారులను, పరాక్రమమున ఇంద్రుని ప్రజారంజకమున చంద్రుని పోలియుండెను. అశ్వమేధాది యజ్ఞములను దానములను తపస్సులను ఆచరించి అష్టైశ్వర్య సంపన్నుడై ఉండెను. విప్రులకు ప్రతి యజ్ఞ మందును సువర్ణ మణిముక్తాదులను, ఏనుగులను, గుఱ్ఱములను ఒసంగెను. కంబళులు, అజినములు, వస్త్రములను, ధన, ధాన్యములను, సర్వ సమృద్ధముగ ఒసంగెను. భక్తిని, ముక్తిని ఇచ్చు సర్వయోగేశ్వరుని హరిని సేవింప

నిచ్చ జనించి సర్వ నిగమాగములను ఇతిహాస పురాణములను వేదవేదాంగములను పరిశోధించి, ఋషులు తెలిపిన నియమములను పాటించి, వేదపారగులయిన విప్రుల సేవించి గురుసేవలొనర్చి పరమావిధి ధర్మమునందుకని కృతార్థుడయ్యెను.

వాసుదేవ తత్త్వము నంది భ్రాంతి జ్ఞానము విడరాడి మోక్షేచ్ఛగొని ఇంద్రియము లెల్ల నిగ్రహించి భగవంతుని ఎట్లు ఆరాధింతునని ఆమూర్తిని ధ్యానించుచు ఉజ్జయిని నుండి మంత్రులు, పురోహితులు, భృత్యసపరివారముగ, చతురంగ సైన్యముతో, అంతఃపురాంగనలతో, వందిమాగధులు చేయు స్తుతులతో బ్రాహ్మణాది చాతుర్వర్ణములవారు వివిధ కులముల వారు, వివిధ వ్యాపారులు, కవులు, గాయకులు, పౌరులు, గ్రామాంతరము పోవు తండ్రిని తనయులట్లు తనను వెంబడింప, దక్షిణ సముద్ర తీరమునకు ప్రస్థాన మొనరించెను. అక్కడ నానారత్న పూర్ణము, తిమి తిమింగలాది నానాజంతు సమాకలము, పరమ గంభీర మును, పవిత్రము మంగళము తీర్థములకెల్ల ఉత్తమ తీర్థము. సర్వ పుణ్య నద నదీ నాయకము అయిన ఆ సాగరమును దర్శించి ఆశ్చర్యమంది తత్తీరమందు విడ సెను. అవ్వార్ధి తీరము సర్వవృక్ష మనోహరము. సర్వ ఋతుకుసుమ ఫలభరితము చిలుకలు గోరువంకలు నెమళ్ళు చకోర చక్రవాకములు కలకలారావములు శ్రుతి మనోహర ముగ అందు వినిపించుచుండెను. మల్లికా కుందమందారము ఆది వివిధ తరులకు సుమవాసనలిట ఇంపు గొల్పుచుండెను. విద్యాధర గంధర్వ కిన్నర అప్సరో గణములు అందు ఆడుచు పాడుచు నిత్యము విహరించుచుండును. నందన సమానములు అగు ఉద్యాన వనములు హంసకారండకాది జలపక్షుల విహార స్థానములు పద్మాకరములు అందు ఆశ్చర్యకరములై ఉండెను. ముల్లోకములకు పూజనీయమగు పది యోజనముల పొడవు ఐదు యోజనములు వెడల్పుగల ఆ దివ్య క్షేత్రమును ఆరాజు దర్శించి ఆనంద వివశుడయ్యెను. (44)

పురుషోత్తమ క్షేత్ర వర్ణనము

ముసులు ఇట్లు అనిరి –

పురుషోత్తమమును ఆ పుణ్య వైష్ణవ క్షేత్రమును ఆ రాజు ససైన్య పరివారముగ సేవించి అందు బలరామకృష్ణులను ప్రతిష్ఠించి పూజించెనని విందుము. ఆకథ సవిస్తరముగ ఆనతిమ్మన బ్రహ్మ వారలకు ఇట్లనియె.

శ్రీదేవి అడుగగా మున్ను శ్రీహరి తెలిపిన పుణ్యకథను వినుడు. సుమేరు పర్వతము యొక్క సువర్ణ శిఖరమునందు సిద్ధ విద్యాధర కిన్నరులు, సంచరించుచోట, వాలఖిల్యాది

మహర్షులు విహరించు చక్కని ప్రదేశమందు నానా తరులతా కుసుమ ఫలభరితమైన చోట, కోకిలలు, చిలుకలు, నెమళ్ళు మనోహరముగ కూయు తావున దేవతలు కొలువున్న వాసుదేవుని జగన్నాథుని సమీపించి శిరసువంచి నమస్కరించి శ్రీదేవి సర్వలోక హితము గోరి ఇట్లని ప్రశ్నించెను.

సర్వేశ్వరా! నా సంశయము వారింపుము. మర్త్యలోకమున మిక్కిలి ఆశ్చర్యము కొలుపు నది కర్మ భూమి అగు భారతదేశము అచట జన్మ అంత సులభముగాదు. లోభ మోహాదులు అను మొసళ్ళు సంచరించుచు, కామక్రోధములు అను మహాసముద్రమునందు జనన మరణాదుల నుండి తరించుటకు అనువైన ఉపాయము తెలుపుము. నీ కన్న ఈ సంశయ మును వారింపగలవక్తలేడు. మాయెడల దయగొని తెలుపతలపు గలదేని అనుగ్రహింపుము.

అనగా బ్రహ్మ ఇట్లు అనియె – శ్రీదేవి పలుకులు విని దేవదేవుడు పరమ ప్రీతితో అమృతోపమానము సర్వవేద శాస్త్రసారము అయిన విషయమును ఇట్లుపన్యసించెను.

"సుఖముగను, సులభముగను ఉపాసించి సాధింపదగిన మహాఫలమును ఒసంగు దివ్య క్షేత్రమొకటి పురుషోత్తమమను పేర ప్రసిద్ధమై ఉన్నది. అది కీర్తన, స్మరణ, వందనా దులచే సర్వ పాపముక్తిని ఈయగలది. సురాసురులు మరీచ్యాది మునివరులు కూడ దానిని ఎఱుగరు. అట్టి తీర్థరాజమును గూర్చి నీకు తెలుపుచున్నాను. సుందరీ! ఏకాగ్ర చిత్తవై వినుము. కల్పాంత ప్రళయమందు, స్థావర జంగమాత్మకమైన జగమెల్ల లయ మందెను. అంధకార బంధురమయ్యెను. ఆ పెంజీకటికి అవ్వల ఉన్నవాడు మేలుకొన్నవాడు ఒక్కడే పరమాత్మ. ఆయనయే సర్వభూత స్వరూపుడు. త్రిమూర్తులకు కర్త. వాసుదేవుడను వాడు యోగీశ్వరుడు. ఆయన యోగనిద్రనుండి మేల్కొని తన నాభికమలము నుండి కమలదళ కాంతి సంపన్నమగు బ్రహ్మ అనెడి ఒక మూర్తిని పంచతన్మాత్రలకు కారణములైన ఆకాశము, వాయువు, తేజస్సు, ఉదకము, భూమి అనెడి స్థూలసూక్ష్మములైన పంచ భూతములను సృజించెను. బ్రహ్మ క్షత్ర – వైశ్య – శూద్రులను నాలుగు వర్ణములను, అంత్యజులను, మ్లేచ్ఛులను వేర్వేర సృజించెను. ఆ మీద ఆ ప్రజాపతి మనసును ఆత్మవంకకు మరల్చి సంకల్పించి మరీచ్యాది మునులను సర్వదేవతలను, పితృదేవతలను, యజ్ఞములను, విద్యాధరులను, గంగాదినదులను, నరవానరసింహ శార్దూలాదిమృగములను, జరాయుజ-అండజ-శ్వేదజ-ఉద్భిజ్జములను నాలుగు విధములైన చరాచర భూత జాలమును సృజించెను. పిపీలికాది జీవకోటి ఆయన సృజించినదే. ఆ సృష్టికర్త తన కుడి భాగమందు తననే పురుష రూపముగా భావించి, ఎడమ భాగమున స్త్రీని భావించి స్త్రీ-పుంస రూపమున

ద్విధా భావము నందెను. మానసిక సృష్టి ఇట్లు జరిగిన తరువాత స్త్రీ పుంసాత్మక మిథునము నుండి సృష్టి ఆవిర్భవించెను. అటనుండియే మైథున సంభవమైన సృష్టి ఆరంభమైనది. ఉత్తమ, మధ్యమ అధమ భేదమున తయారయిన ఈ ఉపాధులు అన్నియు నాయొక్క క్షేత్రములు. ఇట్లు చతుర్ముఖ బ్రహ్మ సృష్టి యొనరించి, ఇంచుక ఆలోచించి, ధ్యాన నిష్ఠుడై వాసుదేవ తత్త్వమందు వాసుదేవాత్మకమైన మూర్తిని ధరించెను. ధ్యానమాత్రముచే ఆ జనార్దనుడు తానే ఆ క్షణమున సహస్రాక్షుడు, సహస్రపాదుడు, సహస్రశీర్షుడునైన పురుషుడై ఆవిర్భవించెను. తెల్లతామరపూల వంటి నేత్రములు సజల జలదచ్ఛాయమైన శరీరము, శ్రీవత్సచిహ్నము, మొదలైన లక్షణములతో ఒక ప్రాకృత మంగళ స్వరూపమున సాక్షాత్కరించెను. లోక పితామహుడగు బ్రహ్మ హఠాత్తుగా ఆమూర్తిని దర్శించి ఆసన అర్ఘ్య పాద్య సమర్పణముచేసి అక్షతల పూజించి అభివాదనము చేసి పరమ మంగళ స్తుతులచే స్తుతించెను. విరించి మనస్సును ఒదిగించి చేసిన ఆ స్తోత్రమును విని తండ్రీ ఇపుడు నన్ను ధ్యానించుటకు కారణమేమని ప్రశ్నించితిని.

బ్రహ్మ ఇట్లు అనియె –

దేవేశ! స్వర్గ ద్వారమునకు దారులు, యజ్ఞదాన వ్రతములు. యోగము, సత్యము, శ్రద్ధ వివిధ తీర్థములు తెలుపబడినవి. ఆ అనుష్ఠానము దుర్లభము. వాటినన్నిటిని మించిన సులభ సాధనము లోకహితము కొఱకు తెల్పుము. ఓ వాసుదేవ! పరమోత్తమ మయిన పుణ్య స్థానమును ఆనతిమ్ము అన విధాత పలుకులు విని, ఆతనికి ఇట్లు చెప్పితిని.

సంసారతారకము సర్వోత్తమ క్షేత్రము, చాతుర్వర్ణ సుఖసాధనము. భుక్తిముక్తి ప్రదము. శీఘ్రసిద్ధిదము, చతుర్యుగములందును సుస్థిరమై సేవింపదగినది. సర్వదేవ దానవ యోనులకును సుసేవ్యమై ఉన్న తీర్థరాజము పురుషోత్తమునికి ఆవాసమైన 'పురుషోత్తమము' అను క్షేత్రము గలదు. అది దక్షిణ సముద్రతీరమందున్నది. పది యోజనముల వైశాల్యము గలది. అచ్చట ఒక మఱ్ఱివృక్షము గలదు. కల్పాంతమందు కాలాగ్ని విజృంభించినపుడు కూడ అది నశింపదు. నేను స్వయముగా అచటనే ఉన్నాను. ఆ వటవృక్షమును దర్శించి, ఆ వృక్షము క్రిందినీడలో విశ్రమించిన వాడు బ్రహ్మహత్యా పాపమునుండి విడివడును. తక్కిన మహాపాపములమాట చెప్పనేల! దానికి ప్రదక్షిణ నమస్కారములు చేసినవారు విష్ణు లోకమునకు ఏగుదురు. ఆ మర్రికి కొద్ది దూరమున దక్షిణమున కేశవుని ఆలయమున్నది. అది ధర్మమయము. భగవంతుడు తానే నిర్మించుకొన్న ప్రతిమ (విగ్రహం) గలదు. దానిని దర్శించినవారు అనాయాసముగ వైకుంఠమునకు ఏగుదురు. అట్లు ఏగుచున్న జీవులను చూచి యమధర్మరాజు నాకడకు ఏతెంచి శిరసు వంచి మ్రొక్కి ఇట్లనియె.

జగన్నాథస్వామీ! నీకు నమస్కారము. శ్రీవత్సవక్షస్థల, పద్మమాలాభూషిత, పీతాం బరధారీ, శంఖచక్ర గదాధరా! హారకేయూర భూషితా! కిరీటగద ధారియునై సాక్షాత్క రించు జగద్గురువగు సగుణమూర్తి నీకు వందనము. ప్రకృతికి ఆవల సర్వేంద్రియ రహితుడై కేవల జ్ఞానజ్యోతియై, సర్వసాక్షియై, నిర్విశేష సుఖానుభవము, జ్ఞానము సర్వరూపముగా కల్గియున్న కేవలాత్మవైన నీకు నమస్కరించుచున్నాను. అనవిని పరమాత్మ నన్ను నీవిపుడు ఎందులకు స్తుతించితివో క్లుప్తముగ ఆనతిమ్ము అని పురుషోత్తముడనెను.

స్వామీ! పురుషోత్తమము అను ఈ పుణ్యాలయమున ఇంద్రనీలమణిమయమైన ఈ ప్రతిమ సర్వాభీష్టములను తీర్చునది. దానిని శ్రద్ధతో దర్శించి ఏకాగ్రచిత్తమున సేవించి మానవులు నిష్కాములై శ్వేతభవనమునకు వెళ్ళుదురు. కావున పాపులన్నవారు లేరు. పాపులను దండించు అధికారము నాకున్నను దాని అవసరము లేనందున నా పదవికి గౌరవము పోయినది. కావున నీ ప్రతిమను ఉపసంహరింపుమనెను. అది విని ఇసుకలో దాచెదను అంటిని. అన్నట్లు నేను దాచితిని. బంగారు తీగల పొదరింట దాచి యమును దక్షిణదిశకు పంపితిని అని చెప్పెను. అందుకు బ్రహ్మ ఇట్లు అనియె – ఇంద్రనీల ప్రతిమ అట్లు మరుగుపడిన మీదట జరిగినకథను విష్ణువు లక్ష్మికి చెప్పెను. (45)

పురుషోత్తమ క్షేత్ర వర్ణనము

"మునులారా! వినుడు. ఇంద్రద్యుమ్న మహారాజు అచ్చటకు పోయి చక్కని ప్రదేశములను, వింధ్య పాదమునుండి వెడలెడు పుణ్యనదులను దర్శించెను. సర్వపాపహారిణి గంగకు సమానమైనది దక్షిణ సముద్రమున సంగమించునదియగు 'స్విత్రోపల' అను నది అచ్చట గలదు. దానికి ఇరువైపుల తీరములందు సస్యశ్యామలములు మనోహరములు అగు గ్రామములు నగరములు కనిపించును. అందలి ప్రజలు చక్కని వలువలు, నగలును దాల్చి పుష్టియు తుష్టియు కలిగి ఉందురు. చతుర్వర్ణములవారు స్వస్వధర్మ నిరతులై శుభలక్షణులై కనిపింతురు. నిరంతరతాంబూల చర్వణము, నిరంతర పుష్పమాలా ధారణము వారి ప్రత్యేక శుభచిహ్నము. విప్రులు వేద పూర్ణముఖులు–షడంగవిదులు. పదక్రమ జటాఘన పాఠులు, నిత్యాగ్ని హోత్రులు, ఉపాసకులు, సర్వశాస్త్రార్థ సమర్థులు, భూరి దక్షిణ లొసంగిన దీక్షితులు, సోమయాజులు, చయనులు.

రాజవీథులందు నలుదారులు కలిసిన చోట మండపములందు వనములందు ఉద్యానవనములందు, సభలందు, మేరులందు, దేవాలయములందు ఎచ్చటవిన్నను ఇతిహాస పురాణ ప్రవచనము సాంగ వేదాధ్యయనము కావ్యశాస్త్ర గోష్ఠులు వినిపించును.

ఆ దేశమందలి సుందరులు చక్కని రూపము యౌవనముగొని ఉత్తమ స్త్రీ సాముద్రిక లక్షణ లక్షితలై శరత్కాల చంద్రబింబాననలై దివ్య వస్త్రములు తాల్చి బంగారు కంకణములను ధరించి కదళీ గర్భమునకు ఈడగు బంగరు చాయయు, ఎఱ్ఱతామర పూల పుప్పొడికి సమానమగు అరుణారుణ వర్ణమునుగల మేనులతో, ఆకర్ణాంత నేత్రములతో చక్కని నెమ్మోములతో నలుపు ఎక్కిన కురులతో దొండపండునకు ఈడగు పెదవులతో హావభావ విలాసములతో, కొందఱు తామరరేకుల కెనయగు నయనశోభ గలవారు కొందరు నల్లకలువరేకుల కీడగు కాటుక కండ్ల అందముగలవారునై ఉంగరాలు తిరిగిన ముంగురులతో మెఱపట్లు మెఱయు పలువరుస గల్గి పీనోన్నత స్తనభారమున సువర్ణ మణిమయ కంఠ హారములు సుమమాలలు తూగుచుండగా మణిమయ కుండల కాంతులు చెక్కుటద్దముల మిఱుమిట్లు గొల్పు చుండగా సాక్షాద్దేవ సుందరులో అనునట్లు దర్శనమిత్తురు. వీణా వేణు మృదంగ వాద్యములు జతచేసి భక్తి భరితములైన చక్కని పాటలచేత ఆటలచేత పరమాత్మను పరవశింపజేయుదురు.

రాత్రి అనక, పగలనక అచట శంఖ దుందుభి నిర్ఘోషము వినిపించును. కామోన్మత్తమైన అవ్విలాసినుల నృత్య విలాసము, గాన మాధుర్యమును అనాదృశము. భిక్షువులు, వైఖానసులు, స్నాతకులు, బ్రహ్మచారులు, సిద్ధులు, వీరువారననేల మంత్రసిద్ధులు, రస సిద్ధులు, ఘటికా పాదుకా సిద్ధులు అచట స్వామి పరివారమై సేవింతురు.

ఇట్టి దివ్య క్షేత్రమును దర్శించి, ఆరాజు నిజముగ ఇదియే మానస క్షేత్రము. ఇది పురుషోత్తమము. తెలిసినది నాకిది తెలిసినదని ఉప్పొంగి మఱ్ఱి నీడకేగి ఇంద్రనీల మణిమయమగు ఆ నీలమేఘశరీరుని మూర్తినిగని ఆ కల్యాణ మూర్తి నాకు గోచరింప యత్న మొనర్తుగాక అని జన్నము లొనర్చుదును. తపములు ఆచరింతును. హోమములు చేయుదును. ధ్యానింతును. ఉపవసించి అర్చనలు ఒనరింతునుగాక అని అనన్యమనస్కుడై విష్ణాలయ నిర్మాణము కావింతునుగాక అని నిశ్చయించెను. (46)

ప్రాసాదకరణము

ఇట్లు ఆ రాజు విష్ణు ప్రాసాద నిర్మాణమును గురించి ఆలోచించి ప్రారంభము చేసెను. జ్యోతిష్కులను పిలిపించి భూ శోధనము చేయించెను. అంతే గాక, జ్ఞానులు, వేదశాస్త్ర పారంగతులు, అమాత్యులు, మంత్రులు, మొదలగు వారితో సమాలోచించి సుముహూర్తమున చంద్ర తారాబలసంపత్తి గ్రహానుకూల్యతగల శుభసమయమున వాస్తు విద్వాంసులతో ఈ ఆరంభము జరిపించెను. మంగళవాద్యములు, వేదాధ్యయనము మనో

హరముగా జరిగెను. పూవులు, అక్షతలు, పేలాలతో, దీపములతో పూర్ణకుంభములతో ఆ మహీపతి భక్తితో భగవంతునకు అర్ఘ్యమిచ్చెను. కళింగ ఉత్కళ, కోసలాధీశ్వరులను ఆహ్వానించెను.

మఱియు ఆ నరేంద్రులను స్వామి విగ్రహము కొఱకు అనువైన శిలకై వెళ్ళుడని ఆనతిచ్చెను. శిల్పులను వెంటగొని వింధ్యాద్రికి చని బండ్లపై పడవలపై ఏగి పాషాణములను గొనిరండని పంపెను. ఇట్లు ఆజ్ఞయిచ్చి అమాత్యులతో పురోహితులకు ఇట్లు ఆనతిచ్చెను.

నా ఆనతిగొని దూతలు ఈపుడమికల రాజులందరికి శుభవార్త తెలిపిరండనెను. దూతలు రాజు వచనమును రాజులకు తెలుపనేగిరి. దూతలేగి రాజులకు వార్త నెఱింగింప వారు ససైన్య పరివారముగా అరుదెంచిరి. నలుదెసల రాజ్యములవారు పర్వత ద్వీపాది ప్రాంతములవారు ఆ ఉత్సవమునకు వచ్చిరి. అట్లరుదెంచిన రాజులనుచూచి, ఈ పుణ్యక్షేత్రము భుక్తిముక్తి ప్రదము. ఇందశ్వమేధ మును జేసి విష్ణు ప్రాసాద నిర్మాణమును కూడ చేయుటకుగాను నాకిందు సహకరింప వలెను అని పలికెను. బుద్ధిశాలియగు రాజిట్లు పలుకుటకు నృపతులెల్లరు ఆనందించిరి. ఆతని శాసన మును అనుసరించి ధన, కనక, రత్న, ముక్తామణి రాసులను అనర్ఘ వజ్ర వైడుర్యాదులను, శాలువలను, నూతనాంబరములను ఏనుగులపై, గుర్రములపై అసంఖ్యాకముగ తరలించుకొని వచ్చిరి. నానావిధ ఆహారపదార్థములను నవ ధాన్యములను, మాష ముద్గ తండుల తిలాదులను (మినుము, పెసలు, బియ్యము, నువ్వులు మొదలైనవానిని) కొనితెచ్చి గాదెలను నింపిరి. ఆ యజ్ఞ సంభారములను చూచి నృపతి పరమానందభరితుడై మహ ర్షులను, దేవర్షులను, బ్రహ్మచారి ప్రముఖ చతురాశ్రమస్థులను ఆచార్యోపాధ్యాయ ఋత్విజ వర్గమును సర్వశాస్త్ర కుశలురైన సదస్యులను ఆ శ్రీమంతుడు దర్శింపగా ఆనందభరితుడై పురోహితునితో అశ్వమేధాశ్వమునకు వేదపారగులైన బ్రాహ్మలు ఆయా దేశములకేగి పరీక్షింతురుగాక అనెను. రాజ పురోహితుడు ఆనందభరితుడై, రాజులతో బ్రాహ్మణ పురస్సరముగా ఒక గ్రామ ప్రాంతమున యజ్ఞవాటమును శాస్త్రీయముగా నిర్మింప జేసెను. అది అనేక రాజ ప్రాసాదములతో మణిమయములు అయిన వేదికలతో, బంగరు స్తంభములతో తోరణములతో సుమనోహరముగ శోభిల్లుచుండెను. నానాదేశ రాజులకు అంతఃపురములను ఏర్పరచెను. ఆ దేవుని సంతోషపరుప నమూల్యమయిన వస్తువులను స్వర్ణరత్నాదులను కాన్కలనుగొని వారివారి శిబిరములందు విడిసిరి. ఆ సందడి సముద్ర ధ్వనిని మించి ఆకాశమంటెను.

నానాదేశాగతులైన బ్రాహ్మణ వైశ్యులకును విడుదులను యథావిధిగ ఏర్పాటు చేయించెను. మఱియు అందు ఆగతులైనవారికి శయ్యాసనాదులు మృష్టాన్న సంతర్పణ

ముల నాడేర్పరచెను. ఆ యజ్ఞమునకు మహానుభావులు బ్రహ్మవేత్తలు శిష్యులతో ఏతెంచిరి. ఎట్టి డాంబికములేక రాజు వారికి హృదయపూర్వకముగా స్వయముగా స్వాగతమొసగెను. ఆ మీదట శిల్పులు అందు తమ శిల్పనైపుణ్యము ప్రదర్శించిరి. రాజ మంత్రులతో ఏమాత్రము ఏమరుపాటు లేకుండ ఆ యజ్ఞ సన్నాహము తిలకించి పులకితాంగుడయ్యెను.

ఆ యజ్ఞము ఆరంభమయినంతట సదస్యులు ఒండొరులను గెలువ అత్యద్భుత శాస్త్రార్థ ములు గావించిరి. దేవేంద్ర వైభవమును మించిన ఆ యజ్ఞవాట నిర్మాణ శోభను తిలకించి, మంగళార్థములయిన పూర్ణ కలశముల వీక్షించి శ్రౌతము చెప్పినట్లు నిలువబడిన దారు మయ యూపస్తంభములగని, జల స్థలములందు పుట్టిన యజ్ఞ పశువులను, ఆవులను, గేదెలను ఆలోకించి యజ్ఞమునకు ఏతెంచిన ప్రజలానంద భరితులైరి. జరాయు జాదులు నాల్గురకముల జీవులు పర్వతములందు పండెడి ధాన్యములు మొదలయిన యజ్ఞ సంభారములు అనేకములను చూచి రాజులు ఆశ్చర్యానంద వివశులైరి. బ్రాహ్మణాదులకు మృష్టాన్న సంతర్పణములు జరిగెను. ఇట్లు విప్రసహస్ర సంకులమైన ఆయజ్ఞ వాటమునందు మంగళార్థములైన దుందుభి ధ్వనులు వినబడసాగినవి. పాలు పెరుగులు అందు ఏరులై ప్రవహించెను. జంబూద్వీపమంతయు అచ్చటకు ఏతెంచినట్లు కనిపించెను. విప్రులు సువర్ణ మణికుండలాదులను వేలకొలది బహుమానములు అందుకొని ఏగిరి. అందు బ్రాహ్మణులు రాజ భోజ్యములయిన విందులు ఆరగించిరి. ఋత్విజులకు భూరి దక్షిణ లొసంగెను. మరియు ఆమహా రాజు, యజ్ఞదర్శనార్థము వచ్చిన రాజులను గూడ మిక్కిలి సత్కరించెను. ఆ రాజు అంతఃపురము యజమాన పత్నీగణము కులశీల సంపన్నము పరమశోభన స్వర్ణ రత్నాభరణములను దాల్చి ముక్తారత్న హారములు మెఱయ ఆ యజ్ఞమున అద్భుతశోభను సంపాదించెను. మహాగజములు సింధు జాతములైన అశ్వములు పలురంగులుగలవి నానావిధ ఆయుధ ధారులయిన భటులు నా యజ్ఞమునకు రక్ష ఇచ్చుచుండ చూచి ఆ యజమాని మానవేశ్వరుడు ఉప్పొంగుచు ఇట్లనెను.

సర్వ శుభలక్షణలక్షితమైన అశ్వమేధాశ్వమును కొనిరండు. సుసన్నద్ధులై రాజకుమారులు ఆ గుఱ్ఱము వెంట రక్షణ ఇచ్చుచు అనుగమింతురుగాక ! ధర్మశాస్త్ర విదులు అయిన విప్రులు ఋత్విజులు ఇక్కడ హోమాదులను నిర్వర్తింపుడు. నల్లమేక, నల్లలేడి, జాతి గల ఎద్దు, దున్నపోతు, గోవులు, గోపాలురను ఇందు గొనిరండు. ఇష్టి విశేషములను జరిపింపుడు. ఆ మీద విష్ణు దేవాలయ నిర్మాణము నిర్వర్తింపబడును. విప్రులేది కోరిన అది ఎల్ల సమకూర్చుడు. మఱి ఇందువచ్చు యాచకులు ఎల్లరకు లేదనకుండ సర్వద్రవ్యములు ఈయబడుగాక. నాకు భగవంతుడు విష్ణువు సాక్షాద్దర్శనము

ఇచ్చు దాక ఈ యజ్ఞము జరుగవలసినదే అని ఆరాజు బంగారురాసులను, గజ, తురగ, గో, వృషభాదులను కోట్లు అర్బుదములుగా దానములు గావించెను. గోవుల కొమ్ములకు బంగారు తొడుగులు, పాలు పితుకుటకు కంచు బిందెలు జతసేసి అనేక గోవులను వేదవిదులకు ఒసంగెను.

అనర్ఘ సువర్ణ మణిమయాంబరాభరణములను తెల్లని శయ్యాసనాస్తరణములను, పగడములను వజ్ర వైడూర్య గోమేధికాది రత్నములను అమూల్యము ఈనమేయములను ఇచ్చెను. సాలంకృత కన్యాదానములు చేసెను. సర్వాంగసుందరులయిన అంగనామణులను విలాసవతులను చీరలతో రవికలతో హారకేయూర నూపుర కంకణాదులతో కాన్క లిచ్చెను. భక్ష్య భోజ్య చోష్య లేహ్యోత్తములు అయిన చతుర్విధ మృష్టాన్న సంతర్పణము ఘృత పాయసాపూప సమృద్ధముగ కావించెను. సర్వజీవ సంతృప్తిగ అన్నదానము చేసెను. ఆ దానములకు అంతు దరికానరాదయ్యెను. ఈ అద్భుత యజ్ఞ వైభవమును గాంచి దేవతలు దైత్యులు, చారణులు, గంధర్వులు, అప్సరసలు, సిద్ధులు, ఋషులు, రాజులు ఎంతేని ఆశ్చర్య మందిరి. ఋత్విగ్వర్గము, పురోహిత, మంత్రి, సామంతులు, పొందిన ఆనందమునకు హద్దులు లేవు. అందు ఒడలు, వలువలు మాసినవాడు, దీనుడు, ఆకలి గొన్నవాడు, ఇబ్బందులకు లోనైనవాడు, దిగులుపడినవాడు, వ్యాధిగ్రస్తుడు, మనో వ్యాధిగ్రస్తుడునైన జీవి ఒక్కడును లేడు.

ఆ రాజ్యమున అకాలమరణము, గ్రహావేశము భూతప్రేత పిశాచావేశము విష స్పర్శము అన్నది లేనేలేదు. హృష్ట పుష్ట జనసంకులము ఆ తేని దేశము. మునులు తాము చేయు తపస్సులందు పరమ సిద్ధిని పడసిరి. చిరంజీవులైరి. ఎన్నడును అప్పటివరకు ఇట్లు ధన ధాన్య సమృద్ధముగ యజ్ఞము జరిగినది లేదు. ఇట్లు ఆ రాజేంద్రుడు ఇంద్రద్యుమ్నుడు యదా విధిగ ఆ అశ్వమేధమును విష్ణుప్రాసాదమును నిర్వర్తించి జగన్మంగళము చేకూర్చెను. (47)

ప్రతిమా నిర్మాణ విధాన పర్యాలోచనము

అని చెప్పగా విని మునులు ఇట్లు అనిరి – "దేవదేవా! ఆ ప్రతిమలు ఇంద్రద్యుమ్ననిచే ఎట్లు నిర్మింప బడినవి, ఏ ప్రకారమున మాధవుడు సంతుష్టుడయ్యెను అదియెల్ల ఆనతిమ్ము వినవలెను. మా మనసులు ఉవ్విళ్ళూరుచున్నవి" అన.

బ్రహ్మ ఇట్లు అనియె – "మునివరులారా! వినుండు. వేదతుల్యమైన పురాణమిది. యజ్ఞారంభముకాగా దేవప్రాసాద నిర్మాణము జరుగగా ఆతేనికి విగ్రహ నిర్మాణమును

గూర్చిన ఆలోచన రేయింబవళ్ళు మనసునందు ఇరవుకొనెను. సృష్టిస్థితిలయ కర్తయైన ఆ సర్వేశ్వరుని నేనెఱుంగను. ఆస్వామిని నేనెట్లు కనుగొందునను ఊహతో రాత్రియుం పవలును పండుకొనడు. ఆ ఆవేదనలో ఆతని అష్ట ఐశ్వర్య సమృద్ధి మనస్తుష్టిని ఈయ జాలక పోయెను. రాళ్ళు మన్ను కట్టెలందేది విష్ణు ప్రతిమకు యోగ్యమగును? ఎట్టి మూర్తిని ప్రతిష్ఠించిన విష్ణువు ప్రీతుడగును అను ఆలోచనలో అతడు మునిగెను. అంతట అతడు పాంచరాత్ర విధానమున పురుషోత్తమ దేవుని బూజించి అదే ఆలోచనగొని స్వామిని స్తుతింప ఆరంభించెను. (48)

కారుణ్యస్తవము

ఇంద్రద్యుమ్నుడు పురుషోత్తమ దేవుని స్తుతించుట – వాసుదేవా! మోక్షకారణ! జన్మ సంసార సాగరమునుండి రక్షింపుము. అచ్చమైన ఆకాశమువంటి వాడవు. నిర్లేపుడవు. (గుణసంగములేని వాడవు)

వాసుదేవ! నమస్తేఽస్తు నమస్తే మోక్షకారణ ।
త్రాహిమాం సర్వలోకేశ జన్మసంసార సాగరాత్ ॥
నిర్మలాంబర సంకాశ నమస్తే పురుషోత్తమ ।
సంకర్షణ నమస్తేఽస్తు త్రాహిమాం ధరణీధరా ॥
నమస్తే హేమగర్భాభ నమస్తే మకరధ్వజ ।
రతికాంత నమస్తేఽస్తు త్రాహిమాం సంపరాంతక ॥
నమస్తేఽజన సంకాశ నమస్తే భక్తవత్సల ।
అనిరుద్ధ నమస్తే ఽస్తు త్రాహిమాం వరదో భవ ॥
నమస్తే విబుధావాస నమమ్తే విబుధప్రియ ।
నారాయణ నమస్తేఽస్తు త్రాహిమాం శరణాగతమ్ ॥
నమస్తే బలినాం శ్రేష్ఠ నమస్తే లాంగలాయుధ ।
చతుర్ముఖ జగద్ధామ త్రాహిమాం ప్రపితామహ ॥
నమస్తే నీలమేఘాభ నమస్తే త్రిదశార్చిత ।
త్రాహి విష్ణో జగన్నాథ మగ్న మాం భవసాగరే ॥
ప్రళయానల సంకాశ నమస్తే దితిజాంతక ।
నరసింహ మహావీర్య త్రాహిమాం దీప్తలోచన ॥

సాధువులు మహానుభావులు అపరాధుల యెడ గూడ క్షమ సేయుదురు. భక్త వాత్సల్యము ననుసరించి దేవేశ్వర! నాయెడ ప్రసన్నుడవగుము. భక్తిభరిత చిత్తమున నుతించితినిగాన నా చేసిన పూజయెల్ల సాంగమగును గాక! వాసుదేవ! నమస్కారము.

అని ఇట్లు అతనిచే పొగడబడిన గరుడధ్వజుడు ప్రసన్నుడై, అతడు మనసార ఏది కోరిన అది ఎల్ల ఇచ్చెను. దినదినము ఎవ్వడు పూజించి హరి నీ స్తోత్రముచే వినుతించునో అతడు నిక్కముగ మోక్షమందును. ఈ స్తోత్ర వరమును ఎవ్వడు తెలిసి (అర్థమెఱిగి) త్రిసంధ్యము శుచియై జపించునో ఆ నరుడు ధర్మ, అర్థ, కామ, మోక్షములను బొందును. దీని జదివిన విన్న వినిపించిన యాతడు పాపములెడ బాసిశాశ్వతమైన విష్ణు లోకమందును. ధన్యము, పాపహరము, భుక్తి, ముక్తిదము, శివము (మంగళము), గుహ్యము (రహస్యము), సుదుర్లభము, పుణ్యము అయిన ఈ స్తుతి ఎవ్వనికి బట్టిన వానికీయరాదు. నాస్తికుడు, మూర్ఖుడు, కృతఘ్నుడు, మాని (నే నే ఘనుడు అనుకొనువాడు), దురాలోచనుడు (దుష్ట జ్ఞానము గలవాడు), అభక్తుడు అయిన వానికి ఎప్పుడును దీనిని ఈయరాదు. భక్తుడు, గుణవంతుడు, శీలవంతుడు, విష్ణుభక్తుడు, శాంతుడు, శ్రద్ధతో అనుష్ఠానము చేయువాడు అయిన వానికిది సర్వపాప విధూతకము (సమస్త పాపములను పోగొట్టునది) సుఖ మోక్షదము, అశేషవాంఛా ఫలదము, వరిష్ఠము అయి 'కారుణ్య'మను పేరుగల ఈ పురుషోత్తమ స్తోత్రమును నేను చెప్పితిని. విశుద్ధులు ఎవ్వరు అసూక్ష్మవస్తువైన మురారిని పురాణపురుషుని నిచ్చలు ధ్యానింతురో వారు ముక్తులై మంత్రములచే యజ్ఞాగ్నియందు హోమముచేయబడిన ఆజ్యమువలె హరిని ప్రవేశింతురు. ఆతడొక్కడే దైవము. సంసార దుఃఖహరుడు, పరుడు, పరాత్పరుడు, అంతకంటె మఱి ఒకడు లేరు.

ఆకృష్ణుడు ద్రష్ట (సర్వసాక్షి), పాత (రక్షకుడు), నాశకర్త, సమస్త సారభూతుడు, జగద్గురువు, మోక్షసుఖ ప్రదాతయునగును. కృష్ణునందు, ఇహమందు ఎవరికి భక్తి కలుగదో వారికి విద్యచేనేమి? గుణముల చేనేమి యజ్ఞములను దానమును ఉగ్రతపములచే నేమి ప్రయోజనము? ఎవనికి పురుషోత్తమునందు భక్తి ఉండునో, అతడు లోకమందు ధన్యుడు. అతడు శుచి, అతడు విద్వాంసుడు. సుఖములతో, తపస్సులతో, గుణములతో అతడు శ్రేష్ఠుడు. జ్ఞాని, దాత, అతడే సత్యవక్త. (49)

ప్రతిమావిర్భావము

బ్రహ్మ ఇట్లు అనియె – ఓ మునివరులార! అమ్మహీపతి ఇట్లు జగన్నాథుని మ్రొక్కి వినుతించి ఆలోచనలో మునిగి దర్భలు పరచుకొని ఆమీద బట్టపరచుకొని ఆ దేవుని పై

మనసు నిల్పి నాబాధను హరించు దేవదేవుడు ఎపుడు ప్రత్యక్షమగునని అనుకొనుచు నేలపై నిదురించెను. జగద్గురువు ఆ నిదురించిన తేనికి స్వరూపదర్శనమును అనుగ్రహించెను. శంఖ చక్ర గదాశార్ఙ్గములను దాల్చి చుట్టును నొకవెలుగు గుడికట్టు చుందగా, యుగాంత ఆదిత్య ప్రభతో గరుడుని మూపుపై ఎక్కి ఎనిమిది బాహువులతో దర్శనమిచ్చిన ఆ దేవదేవుని రాజు దర్శించెను.

అట్లు పొడసూపిన ఆస్వామి రాజుతో "ఈ క్రతువుచేత నీ భక్తి శ్రద్ధలచేత సంతుష్టుడను అయితిని. ఊరక ఏల పరితపింతువు ఈ ప్రతిమ జగత్పూజ్యము. సనాతనము (ఈనాటిది గాదు) ఇది నీవు పొందుటకు ఉపాయము తెల్పెదను. ఈ రాత్రిగడచి సూర్యోదయము కాగానే సముద్రజలములకు అల్లంత చివర పలుచెట్ల గుబురులతో చెలియలికట్టను ఆనుకొని సముద్ర జలము కెరటములతో కానవచ్చును. దానికి ఆవలి గట్టున ఒకచెట్టు నీళ్ళను నేలను గూడ తాకుచు ఉండును. అలల తాకుడులచేత కూడా అది కంపింపదు. గొడ్డలిగొని నీవు ఆ నీటిలో ఏకాకివై ఎట్టి జడుపుగొనక అట్టిటు దిటిగిచూచి ఇట్టి చిహ్నాలు గల ఆ వృక్షమును చూచి శంకింపక నఱకుము. ఆ అద్భుత వృక్షమును గని ఆలోచించి దానిచే ఆ దివ్యమూర్తిని గావింపుము. నిన్ను తబ్బిబ్బు పరచునట్టి వేరు ఎట్టి ఆలోచనైనను చేయకుము" అని పలికెను.

ఇట్లు మహానుభావుడు ఆ హరి ఆనతిచ్చి అంతర్ధానమందెను. రాజు తన కలను గమనించి ఎంతో ఆశ్చర్యపడెను. ఆ రాత్రి అంతయు అందే మనసునిడి విష్ణు దేవతాకమునైన మంత్రములను, విష్ణు సూక్తమును పారాయణము చేయుచు వేకువను లేచి వేరు తలంపు గొనక చక్కగ సాగరస్నానముచేసి, గుట్టములేక, వెంట కాలిబంటులేక, ఏన్గులేక, సారథియు లేక, ఒంటరిగ ఆ కడలి చెలియలకట్టనుదిగి తేజోమయమైన పెనుమొదలు గట్టిన సువిస్తృతమైన ఆ పుణ్యవృక్షమును చూచెను. మిక్కిలి ఎత్తుగ మిక్కిలి బోదెగల్గి నీటిచెంత నిద్రలో ఉన్న దట్టమైన మంజిష్ఠ వర్ణము (ఎఱుపు) కలిగిన ఆతరువు ఏ జాతిదో ఏ పేరిదో తెలియరాదయ్యెను. నరనాథుడదిగని, ఆనందపడి పదునైన గొడ్డలిచే దానిని రెండు తునకలు గావింపనెంచి కొట్టెను. అదిచూడ నాశ్చర్యము గొల్పుచుండెను. అంతట విశ్వకర్మయు (దేవశిల్పి) విష్ణువును విప్రరూపముదాల్చి వచ్చిరి. ఇద్దరు ఒకేరూపున తేజరిల్లుచుండిరి. దివ్యమాలలు ధరించిరి. దివ్యగంధము పూసికొనిరి. ఇంద్రునకు మిత్రుడైన ఆ రాజును కలిసికొని "మహారాజా! నీవు ఇచ్చట ఏదో చేయుచున్నావు? ఈ మహా వృక్షమును ఎందులకు నఱికితివి? ఈ నిర్జనమైన కాఱడవిలో నీవు తోడులేక మహోదధి ఒడ్డున ఒంటరిగ నీవెట్లో చెట్టును నఱికితివి?" అని ప్రశ్నించిరి.

ఆయిరువురి మాటవిని, ఆరాజు ముదమంది చంద్రసూర్యులవలె అచ్చటకు అరుదెంచిన ఆ బ్రాహ్మణులను ఆనందభరితుడై చూచి నమస్కరించి ఆ జగన్నాథుల సన్నిధి దలవంచుకొని నిలువబడి.

"ఆది అంతములేని అనంతమూర్తిని, జగత్పతిని ఆరాధించుట కొక ప్రతిమను గావించుకొనవలెనని తలంపు గల్గినది. కలలో ఆ దేవునిచేత నేను భావింపబడితిని. ఆ సంగతి మీకు తెల్పితిని" అని అనెను.

అనవిని విశ్వేశ్వరుడు హరి నవ్వి సంతుష్టి గొని ఇట్లు పలికెను. బాగు బాగు నృప! నీతలంపు మేలైనది. అంతులేని ఈ ఘోర సంసారము అరటి ఆకు పగిది నిస్సారము. బహుదుఃఖ నిలయము. కామక్రోధాకులము. ఇంద్రియములు ఇందు సుడులు, నానా వ్యాధులు, నీటిబుడగ వంటివి. విష్ణుని ఆరాధింప నీకు తలపు గలుగుటచే నీవు ధన్యుడవు. సద్గుణభూషణుడవు. ఈ ప్రజలు, పట్టణములు, గ్రామములు, పర్వతములు, అడవులతో నాల్గువర్ణములతో నీవు పాలించు పృథివియు ధన్యులు. రారమ్ము! చల్లని ఈ చెట్టుదరి మాటలాడుకొంద ఇట నీవు మాతోగూడ వచ్చి నిలువుము. ఈతడు నాతోడ వచ్చినాడు మహాశిల్పి. విశ్వకర్మతో సాటియైనవాడు. ఎల్లపనులు చేయుటయందు ఎంతో నేర్పరి. నేను ఉద్దేశించిన ప్రతిమను ఈతడు చేయును. ఒడ్డు దిగుము. అనగా ఆ ద్విజుని మాట విని సముద్రము ఒడ్డునుండి చని ఆ చెట్టునీడను నిలిచెను. ఆ విశ్వరూపుడు విష్ణువు ఆ శిల్పివరునకు ప్రతిమ చెక్కుమని, తామరతేకులట్టి కన్నులు ఉరమున శ్రీవత్స కౌస్తుభములు హస్తములందు శంఖ చక్రగదాశార్ఙములు గలిగినదొకటి అచ్చము పాలవలె తెల్లనై స్వస్తిక ముద్ర నాగలి చేతను పూనిన అనంతమూర్తి ఇంకొకటి వాసుదేవుని చెలియలు బంగారు చాయగల పరమ శోభనము సర్వ లక్షణలక్షితము అగు సుభద్రామూర్తి మూడవది. ఇట్లు మూడు ప్రతిమలు గావింపుమని ఆనతిచ్చెను.

విశ్వకర్మ ఆమాట విని అక్షణమున ఆ శుభలక్షణములతో ముమ్మూర్తుల (మూడు విగ్రహములకు)ను కావించెను. ఒకటి శరత్కాల చంద్రబింబమువలు అచ్చము తెల్లనిది. ఎఱ్ఱని కనులు పెద్ద శరీరము పాముపడగబోలు మస్తకము నల్లని వలువయుగల బలరామమూర్తి. ఒక్కటే కుండలము, దివ్యగదాముసలాయుధము పూనినది. తెల్లతామరల బోలు కన్నులు. నల్లని మేఘము. అతసీకుసుమమువలె నిగనిగలాడు నీలతనువు, పీతాంబరము ఉరమున, శ్రీవత్స లక్షణము చేతను చక్రాయుధము గల్గిన సర్వపాపహరమైన శ్రీహరిమూర్తి రెండవది. మూడవది స్వర్ణచ్ఛాయశరీరము రత్నహారకేయూరాది విచిత్ర భూషణములు కమల నయనములు విచిత్ర వస్త్రములతో ఒప్పుచు ఉన్న పీనోన్నత స్తనియైన

సుభద్రమూర్తి. ఆరాజు ఇంద్రద్యుమ్నుడు ఆ అద్భుత శిల్పమును చూచి క్షణములో నిర్మించిన ఆ దివ్య మూర్తులను వీక్షించి వింతపడి బ్రాహ్మణ వేషములను ధరించి ఏతెంచిన మీరిద్దరు దేవతలు, అద్భుత కర్ములు దేవవర్తనులు అమానుష కర్ములు అగు మీరు వేల్పులా, యక్షులా, విద్యాధరులా, బ్రహ్మయు, విష్ణువునా? వసువులా! కాక అశ్వినీ కుమారులా! తెలుసుకొనలేక ఉన్నాను. మాయా రూపమున ఉన్న మిమ్ము శరణుపొందుచున్నాను. మీస్వరూపమును నాకు వెలువరింపుడు. అని ఇంద్రద్యుమ్నుడు అనెను. (50)

పురుషోత్తమ వర్ణనము

ఇంద్రద్యుమ్ననితో పరమేశ్వరుడు –

రాజా! యక్ష, గంధర్వాదులు, మహేంద్ర, బ్రహ్మ, రుద్రాదులలో నేను ఎవ్వడను గాను, పురుషోత్తమునిగా నన్ను ఎఱుంగుము. సకల పాపములు హరించు అనంత బల పౌరుషములు గలవాడను. అనంతుడను. అశేష భూతకోటికి ఆరాధనీయుడను. జ్ఞాన గమ్యుడని, వాసుదేవుడని, యోగులు ఎవరిని పేర్కొందురో, వేదాంతములు ఎవ్వరిని గురించి తెల్పునో అట్టి యోగగమ్యమగు వస్తువును నేను. త్రిమూర్తులు నేనై ఉన్నాను. దిక్పాలు లందరు నేనే. అఖిల చరాచర జగత్తును నేను. నా కంటె అన్యములేదు. నీ యెడల సంప్రీతిని పొందితిని. వరము కోరుకొనుము. నా దర్శనము పుణ్యము చేయని వానికి కలనైన గాదు. నీవు దృఢభక్తి సంపన్నుడ వగుటచే ప్రత్యక్షముగ నన్ను జూచితివి. అని పలికెను. అప్పుడు భూమిపతి శరీరముపుల కింపుచుండగా ఆ దేవుని పలు విధములుగా స్తుతించెను.

"ఓ లక్ష్మీనాథా! పీతాంబరధారీ! శ్రీనివాసా! నమస్కారము. ఆదిపురుషుడు సర్వేశ్వరుడు, సర్వతోముఖుడు, సనాతనుడు అగు విష్ణుదేవునికి నమస్కరించెను. శబ్దములకు అతీతుడు, గుణాతీతుడు, భావాతీతుడు, నిర్లిప్తుడు, నిర్గుణుడు, సూక్ష్మమైనవాడు. సర్వజ్ఞుడు శంఖ చక్ర గదా ముసల ధారియు నీలోత్పలదళ శ్యాముడు. వరప్రదాత, శేషశాయియు, క్షీర సాగరశయనుడు, సర్వపాప హారియునగు హృషీకేశునికి నమస్కరించెదను. మోక్షకారణ భూతుడవు, వ్యాపకుడవు, నాశరహితుడవు, దేవదేవుడవు అగు నీకు నమస్కరించెదను" అని ప్రాంజలియై ప్రణామము ఆచరించి వినయమున రాజు ఇట్లు పలికెను. 'జగన్నాథ! దేవాసుర గంధర్వ యక్ష, రాక్షస, సిద్ధ, సాధ్య, విద్యాధర, నాగ, గుహ్యక, కిన్నరాదులు సర్వశాస్త్ర పారగులు, సన్యాసులు, యోగులు, వేదార్థ చింతనులు మోక్షమార్గవిదులు ఏ పరమపదమును ధ్యానింతురో నిర్గుణము, నిర్మలము, శాంతము అగు దేనిని పొంద కోరుదురో అట్టి పదమును నీ ప్రసాదమున పొందకోరుచున్నాను.

అంత భగవంతుడు 'ఓ రాజా! మంచిది, నీకు శుభమగుగాక. నీ కోరిన స్థానమును అందుకొనుము. నా అనుగ్రహమున అది నీకు లభించును. సందేహము వలదు. పదివేల తొమ్మిది వందలేండ్లు నీవు రాజ్యమేలుదువు గాక. ఆ మీద నా దివ్యపదము గాంతువు. నీ కీర్తి శాశ్వతమగును. 'ఇంద్రద్యుమ్న సరస్సు' అను పేర ఈ తీర్థము యజ్ఞాంగ సంభవము. ఇందు స్నానము చేసిన జీవి ఇంద్రలోకము పొందును. ఇచ్చట పిండప్రదానము చేసిన ఇరువది తరములవారు స్వర్గమును పొందుదురు. అచ్చట అప్సరసలచే గంధర్వ గానము ఆలపించుచు పూజింపబడి పదునల్గురింద్రులు పాలించునంత కాలము విమానము అధివసించి నీవు విహరింతువు. ఈ సరస్సునకు దక్షిణ దిశ నైఋతి మూల ఒక మఱ్ఱి చెట్టున్నది. దానివద్ద ఒక మండపముగలదు. దానిచుట్టు మొగలి పొదలున్నవి. వివిధ తరు సంకులమైన ఆ ప్రదేశమున కొబ్బరి మొదలగు తోటలు సంపెంగ పూలతోటలు చాలగలవు. ఆషాఢశుక్ల పంచమి పితృ దేవతాకమయిన మఘానక్షత్రమందు మండపమున వేంచేపుజేసి ఏడురోజులు నిలిపి నృత్యగీత క్రీడా వినోదములచే అర్చించి సువర్ణ దండము లగు చామరములచే నీ చోపులిచ్చుచు రత్న భూషిత వ్యజనములచే వీచుచు ఒక స్తంభమును అచ్చట ప్రతిష్ఠించి బ్రహ్మచారి యతి స్నాతకులు గృహస్థులు, వానప్రస్థులు నానావిధ స్తోత్ర పాఠములచే ఋగ్యజుస్సామములచే మమ్ము (బలరామ కృష్ణులను) స్తుతింతురు. ఇట్లు మమ్ము దర్శించి భక్తితో మ్రొక్కిన భక్తులు పదివేలేండ్లు వైకుంఠమున వసింతురు. ఆ పుణ్యమును అనుభవించి, తిరిగి ఈ ఇలపై విప్రులై జనించి కోటీశ్వరులై చతుర్వేదులై విరాజిల్లుదురు.

అని ఇట్లు హరి అతనికి వరమిచ్చి విశ్వకర్మతో కనుమఱుగయ్యెను. ఆ రాజు ఆనందభరితుడై కృతార్థుడనైతిని అనుకొని బలరామ కృష్ణులను, సుభద్రను, దేవ విమానము వంటి మట్టి రథమును ఎక్కించి, ఊరేగించి, పురోహితమంత్రి సామంతాదులతో చక్కని పవిత్ర ప్రదేశమందు శుభలగ్నమున ప్రతిష్ఠించి యథావిధిగ అర్చించి ఆచార్య ఋత్విగ్జనంబులను భూరిదక్షిణలచే సత్కరించెను. ఆ మీద బెక్కు యజ్ఞములు చేసెను. కృతకృత్యుడై ఐహిక భోగములను విడిచి విష్ణుపదమందెను. ఇది ఈ పురుషోత్తమ క్షేత్ర మహిమ. మరి యేమి కోరుచున్నారు అనగా మునులు ఇట్లనిరి. "పురుషోత్తమ క్షేత్రయాత్ర ఎప్పుడు ఎట్లు చేయ వలెను! పంచతీర్థ విశేష మేమి! అందొక్కొక్క తీర్థస్నానంబు వలనను, దానముల వలనను, దేవతా దర్శనంబు వలనను, ఏయే ఫలములు లభించును? తెలుపుమని వేడిరి. అంత బ్రహ్మ ఇట్లనియె –

"కురుక్షేత్రమందు నిరాహారియై ఒంటికాలిపై నిల్చి డెబ్బది వేలేండ్లు చేసిన తపస్సు యొక్క ఫలమీ క్షేత్రమునందు జ్యేష్ఠ శుద్ధ దశమినాడు ఉపవాసముండి జగన్నాథుని

దర్శించినంత మాత్రాన గల్గును. జ్యేష్ఠమందే పంచతీర్థయాత్ర చేసి శుద్ధద్వాదశినాడు పురుషోత్తముని దర్శించవలెను. దానిచే విష్ణులోకమును శాశ్వతముగ పొందును. దూర మునుండి అయినను పురుషోత్తముని దినదినము కీర్తించిన చాలును. విష్ణుపురమును పొందును. హరిచేతిలోని చక్రము అల్లంత దూరమందుండి అయినను ఆలయము ఉపరి భాగమునందు ఉన్న దానిని చూచి నమస్కరించిన అతడు పాప విముక్తుడగును. (51)

మార్కండేయ వట దర్శనము

ఇంకను బ్రహ్మ ఇట్లు అనియె –

"ఓ మునివరులార! కల్పాంతమందు ప్రళయమైన తఱి సూర్యచంద్రులు వాయువు చరాచర ప్రపంచము నశించి ప్రచండ ప్రళయ ఆదిత్యుడు ఉదయింప, మేఘములు ఉరుము చుండగా, విద్యుదుత్పాతమున పిడుగులు పడి, చెట్లు గుట్టలుగా పడిపోయి భగ్నమై ఎల్ల లోకములు ఉల్కలుపడి నశింపగా ఎల్ల నదులు సరస్సులు ఇంకిపోవ, సంవర్తకాగ్ని వాయువుతో కూడ ఆదిత్య శోభితమైన లోకమున ప్రవేశించును. అటుపిమ్మట భూమిని బ్రద్దలు గొట్టి పాతాళమున ప్రవేశించి దేవదానవ యక్షాదులకు భయముకూర్చును. అది నాగలోకము దహించి ఈ భూమిని ఏకొంచెమైనను లేకుండ కాల్చి ఈ క్రిందను అంత యును క్షణములో నశింపచేయును. భయంకర జ్వాలలతో మహాధ్వనితో ప్రజ్వలించు ఈ రౌద్రాగ్ని కల్పాగ్ని అని శ్రుతుల వినబడును. ఇది కోటి సూర్య ప్రభతో విజృంభించును. ముల్లోకములను దహించును.

ఇట్టి మహాదారుణ ప్రళయమందు మార్కండేయుడను పరమ ధర్మాతుడు ఋషి ధ్యానయోగనిష్ఠలో ఉండెను. ఆయన ఒక్కడే ఇప్పుడుండునని శ్రుతి అనగా వేదము తెల్పును. ఆయన మోహపాశముల కట్టుపడి, ఆకలిదప్పులకు, ఇంద్రియములు చెదర అమ్మహాగ్నిని చూచి కంఠము, పెదవులు, నాలుకయు ఎండి, భయమొంది తడబడుచు ఎల్ల భూమి అంతయు కాందిశీకుడై తిఱుగాడుటకు విశ్రమించుటకు ఇంచుకచోటు గానక ఏమి చేయుదు ఎవ్వని శరణంద వలయునో తెలియకున్నాను అన, ఆముని పురుషోత్తముని ఎట్లు కనుగొందును అని ఏకాగ్ర మనస్కుడై ధ్యానించి ఆ దివ్యమైన పరమపదమును మహాప్రళయ కారణమైన దానిని పురుషోత్తమ నామకమైన సుప్రసిద్ధ వటరాజమును చేరెను. ఆ ముని ఆ మఱ్ఱి వృక్షము వద్దకు త్వరగాపోయి, దాని మొదలున కూర్చుండెను. అక్కడ కాలాగ్ని భయములేదు. అక్కడ నిప్పులు కురియవు. సంవర్తాగ్ని ఇక్కడకు చొరదు. అచ్చట పిడుగులు పడవు. అట్టి అభయస్థానమందు ఆ సనాతన ఋషి విశ్రమించెను. (52)

మార్కండేయ ప్రళయ దర్శనము

అంతట ఏన్గులట్లు మెఱుపుదీగల చేత మెరయు మేఘములు వింతగా నింగి అలము కొనెను. అవి కొన్ని నల్లకలువలవలె నల్లనివి, కొన్ని తెల్లకలువలవలె తెల్లనివి. కొన్ని పద్మ కింజల్కములట్లు ఎర్రనివి, కొన్ని పసుపుపచ్చనివి, కొన్ని ఆకుపచ్చనివి, కొన్ని కాకిగ్రుడ్ల వంటివి. కొన్ని తామర రేకులవంటివి. కొన్ని ఇంగువఛాయగలవిగా ఉండెను. కొన్ని పెద్ద నగరములుగను, కొన్ని పర్వతములట్లు, కొన్ని కాటుక కొండలట్లు, మరకత ప్రభలు కలవియునై మెఱుపుతీగలను అలుముకొని మహామేఘములు క్రమ్ముకొనెను. అవి కుండ పోతగా వర్షించు వర్షధారలచే ఈ మేదిని నాల్గుదిక్కుల బెందడి అయ్యెను. ఆ వర్షాతముచే ఇంతకు మున్నేర్పడి అగ్ని ఉత్పాతము ఉపశమించెను. పరమేశ్వర ప్రేరణచే మేఘములు అవిరామముగా పండ్రెండేండ్లు వర్షింప, సముద్రములు పొంగి చెలియలకట్టలుదాటి జగమును ముంచెత్తెను. పర్వతములు పిండిగుండ అయ్యెను. ఆ భూమి నీటిలో మునిగి పోయినది. అట్లు ఉవ్వెత్తుగ క్రమ్మిన కారుమబ్బులెల్ల అల్లంతలో వీచిన పెనుగాలులకు పింజపింజలై విడిపోయెను. ఆ తొలితామర గద్దియపై నున్న విష్ణువు ప్రళయకాల మారుతమును త్రోసివైచి ఆ ప్రళయ పయోధిపై హాయిగ నిద్రపోయెను. అపుడు సర్వ జీవకోటి వినష్ట మయ్యెను.

అంత మార్కండేయ మహర్షి విశ్రమించి పురుషోత్తముని ధ్యానించి కనుతెఱచి ఈ వసుంధరయెల్ల నీటమునిగినట్లు గమనించెను. అంతముందుగల ఆ పెద్ద మఱ్ఱి వృక్షము లేదు, భూమిలేదు. దిక్కులులేవు. భాస్కరుడులేడు. చంద్రుడులేడు. అగ్నిలేదు. గాలిలేదు. సురాసురులు లేరు. ఏకార్ణవమై కేవలము కారుచీకటి క్రమ్మిన ఆ సమయమున, నిరాశ్రయమైన ఆ నీటమునిగి ఈద యత్నించెను. అట్టిటు ఈతకొట్టుచు ఆయాసపడ జొచ్చెను. తుదకు అందు మునిగెను. కాని రక్షకుని కానలేడయ్యెను. ఆయన ధ్యానమునకు తనివిచెంది పురుషోత్తము డపుడు అదరి చెదరి పోవుచున్న మునిని చూచి ఇట్లనెను.

"వత్స! అలసిపోయితివి. పిల్లవాడవు. నాకు భక్తుడవు. వ్రతనిష్ఠుడవు. ఇటు రారమ్ము మార్కండేయ! నాదరికి రమ్ము. భయపడకు. నీవు నాముందున్నావు".

అన్న ఆముని మిగుల కుపితుడై మరిమరి వెఱగువడుచు ఇట్లనెను.

ఎవడు వీడు? నా తపస్సును కించపరచి మాటలాడుచున్నాడు. పెక్కు వేలేండ్లు ఈడుగల నా శరీరమును బెదిరించుచున్నాడు. దేవతలలో కూడ ఈ విధముగ నన్ను

తేలికజేసి మాటలాడు ఆచారము లేదు. దేవేశుడు బ్రహ్మకూడ నన్ను దీర్ఘాయుష్మంతుడవని అనెనే ఎవడురా! జీవితము కడముట్టినవాడు. తపముచే గట్టిపడిన తలకాయగల నాకు (నన్ను) ఇట్లు మార్కండేయ! అని పేరెత్తిపిలిచి ఘోరమైన చావుపొంద గోరుచున్నాడు అని పలికి చింతంగొని 'ఇది కలయా! మోహమా! ఈ వింతయేమనుకొన్న అతడికి అంతలో నిశ్చల చిత్తంబున ధ్యానించుటయు, ఆతనికి సకల దుఃఖ విధ్వంసిని యగు మనశ్శక్తి ఆవిర్భూత మయ్యెను. అపుడతడు పురుషోత్తముని భక్తితో శరణొందెదనని మనసు నిలిపి శరణంది ఆ వెంటనే ఆ నీటిమీద విశాలమైన వటవృక్షమును చూచెను. ఆ చెట్టు పెనుకొమ్మపై పరచు కొనియున్న విశ్వకర్మ నిర్మితమయిన చక్కని వింతయిన పర్యంకమును చూచెను. అది వజ్రవైడూర్య నిర్మితము. నానావిధాస్తరణము నానారత్న శోభితము. వింతలన్నిటికి నెలవు. విచిత్ర ప్రభామండల మండితము. అందు కోటి సూర్య ప్రభాజిష్ణుని, తేజోమూర్తిని, చతుర్భుజుని, సుందరాంగుని, పద్మపత్రనేత్రుని, శ్రీవత్సవక్షుని, శంఖచక్రగదాధరుని, వనమాలాలంకృత వక్షస్థలముగల వానిని, దివ్యకుండలములచే ప్రకాశించువానిని, హారముల భారముచే వంగిన మెడగల వాడైన బాలకృష్ణుని దర్శించెను.

మార్కండేయుడు అచ్చెరువడి, విచ్చిన కన్నులు పులకించిన మేనుంగొని వ్రాలి "ఆహా! ఈ వికార్ణవమందు చరాచరము అణగిపోయిన సమయమున ఈ బాలుడెవ్వడో భయము లేక మసలుచున్నాడు" అనుకొనెను. భూత భవ్యభవిష్యము ఎఱింగియు అమ్మహాముని మాయా మోహితుడై ఆదేవుని ఎఱుంగడయ్యెను. మఱియు నా తపశ్శక్తి వ్యర్థము – నా జ్ఞానము వృధా–సుదీర్ఘమయిన నాబ్రతుకు వ్యర్థము. నామానుష ముత్తది. ఈ పర్యంకమున నిదురించు బాలుడెవ్వడో తెలుసుకొనలేకపోతిని" అనుకొనుచు ఈదుచు మైమఱచి మార్కండేయుడు మిగుల వగచెంది రక్షణ కొఱకు తడుములాడెను. కాని బాలసూర్యుడట్లు తనమహిమచే వెలయుచున్న తేజోమయుడగు ఆ బాలుని చూడలేకపోయెను. ఆ పిల్లవాడు అట్లు వచ్చుచున్న మునిని చూచి మేఘ గంభీరముగ ఇట్లు పలికెను. వత్సా! చాల అలసి తివని ఎఱుగుదును. నిన్ను కాపాడుటకే వచ్చితిని. నా శరీరమందిపుడు ప్రవేశింపుము. నీకు విశ్రాంతికల్గును. అనవిని ఏ భయము ఎఱుగక ఏమియు మాటలాడక ఆ బాలుడు తెఱచిన మోమునందు వివశుడై ప్రవేశించెను. (53)

మార్కండేయాఖ్యానము

బ్రహ్మ ఇట్లు అనియె –

ఆ మార్కండేయుడు వటపత్రశాయి అయిన ఆబాలుని గర్భమందు బ్రవేశించి సమస్త

భూమండలమను అందుచూచెను. సప్త సముద్రములను, సప్త ద్వీపములను, సప్త కులాచలములను, సర్వరత్ననిధి అయిన మేరువును దర్శించెను. ఆ మేరుపర్వతము సర్వరత్ననిధి నానామని సమాకీర్ణము. సర్వ వృక్షములకు స్థానము వింతలకెల్ల స్థానము. సింహ వ్యాఘ్రాదులకు నిలయము. ఇంద్రాది దేవతలు సిద్ధచారణ గంధర్వ అప్సర వర్గములకు విహార స్థానము.

శ్రీమంతమగు ఆ మేరువును చూచుచు ఆబాలుని ఉదరమందు చనిచని కురుక్షేత్రాది పుణ్యక్షేత్రములను పుణ్యనదులను, తీర్థములను, కృషి గోరక్ష, వాణిజ్యాది వృత్తులను చేయు మానవులను సర్వ జనావాసమయిన నగర గ్రామములను ఇది అది అనేల బ్రహ్మాది స్తంభపర్యంతమైన సర్వ బ్రహ్మాండమును, భూర్భువస్సర్ మహస్తప స్సత్యమను ఊర్ధ్వలోకములను అతల, వితల, పాతాళ, సుతల, రసాతల, మహాతల, తలాతల అధోలోకములను ఆ స్వామి ఉదరమందు వీక్షించెను. ఆ దేవుని అనుగ్రహమున అందాతని గతికడ్డులేకుండెను. అందట్లు తిరుగాడుచు అతడా విష్ణువు యొక్క శరీరమునకు తుదకానడయ్యెను. అంతట నవ్వరదుని ఆముని శరణు జొచ్చెను. అవ్వల నా మహా పురుషుడు ముఖము తెఱువ అందుండి తటాలున వాయువేగమున వెలికి వచ్చెను. (54)

మార్కండేయ వృత్తాంతము

బ్రహ్మ ఇట్లు అనియె –

మార్కండేయుడు ఆ పాపని కడుపు నందుండి వెడలి వెలుపల ఒక్కటే సముద్రమయిన భూమిని నిర్జనమయిన దానిని దర్శించెను. మున్ను చూచిన ఆ బాలుని కూడ మర్రికొమ్మపై వటపత్ర పర్యంకమున నున్న శిశువును గాంచెను. శ్రీవత్స చిహ్నము ఉరమున దీపింప పీతాంబరము ధరించి ఆ పద్మపత్ర లోచనుడు జగత్తును చేకొని ఉన్నట్లు దర్శించెను. ఆ బాలుడు కూడ తన ముఖమునుండి వెడలి, ఆ మహార్ణమున తేలి చేష్టలు తక్కియున్న ఆ మునిని జూచి 'వత్సా! నా కడుపునందు ప్రవేశించి విశ్రమించితివా? అందిటునటు పరిభ్రమించి ఏమి వింత జూచితివి? ఓ మునిశ్రేష్ఠా! నాకు భక్తుడవు. నా అండ చేరితివి. అలసితివి. కావున నీకు ఉపకారము చేయ సంభాషించుచున్నాను. నావంక చూడుమని మెల్లగానవ్వుచు భగవంతుడనెను.

ఆ మాటవిని ఉప్పొంగి ఒడలు గగుర్పొడవ, ఈకన్నులచే కనరాని దివ్య రత్నాలంకృతుడయిన అమ్మేటి వేల్పుని మార్కండేయుడు దర్శించెను. అంత ఆముని తదను గ్రహ

మున మిగుల ప్రసన్నమై మరల క్రొత్త సొగసును పొంది ఆవిర్భవించెను. ఎఱ్ఱని వ్రేళ్ళ గల ఆమేటివేల్పు అడుగుల తలవాల్చి వ్రాలి సురవంద్యములయిన ఆ పాద ద్వంద్వమునకు ప్రణమిల్లి హర్ష గద్గదములైన మాటలతో కృతాంజలియై ఆనందభరితుడై అచ్చెరువొందుచు మరిమరి చూచి ఆపరమాత్మను స్తుతించుట ఆరంభించెను.

మార్కండేయ కృతస్తవము – దేవదేవ! మాయాబాలమూర్తిధర! పద్మాక్ష! దుఃఖితుడనై శరణొందిన నన్ను రక్షింపుము. ప్రళయకాలాగ్నికి ఉడికిపోయితి, నిప్పుల వర్షమునకు జడిసిపోతిని. ప్రళయ ప్రచండ వాయువునకు ఆరిపోతిని. అలసి విహ్వలుడనయి ప్రళయావర్తమునకు అదిరిపోయి శాంతిని కనజాలకున్నాను. ఆకలి దప్పులకు వశుడనైతిని. పురుషోత్తమా నేనొక రక్షనిందు కననైతిని. రక్షింపుము. ఈ ఏకార్ణవ ప్రళయమందు చరాచరము సురిగిపోయిన ఈ ఘోరదశయందు– అంతుదరి కనలేకున్నాను. దేవేశ! నీ ఉదరగోళమున చరాచర ప్రపంచమును కంటిని. ఆశ్చర్య విషాదములను పొందుచున్నాను. దిక్కులేని ఈ సంసారమున–పరమేశ! ప్రసన్నుడవు కమ్ము. ఓ వేల్పుమేటి! ప్రసాదము చూపుము. దేవనాథ! అనుగ్రహింపుము. జగత్కారణులకు కారణుడవు. నీవు పంచభూతములు. అహంకారము నీవు. మహత్తత్వము బుద్ధి నీవు. ప్రకృతివి. సత్వాది గుణత్రయము నీవు. నీవు దిక్పాలురవు. అష్ట వసువులు నీవు. ఏకాదశ రుద్రులు, ద్వాదశాదిత్యులు, గంధర్వులు, దేవదానవులు, మరుత్తులు, పితృ దేవతలు, వాలఖిల్యాదులు, ప్రజాపతులు, సప్త ఋషులు, అశ్వినులు, మరి మనసుకు మాటకు అందని అశేష జీవ సంతతి బ్రహ్మాది స్తంభపర్యంత భూత భవ్య భవిష్య జ్వాలము నీ రూపము. అంతకును మీదనున్న కూటస్థుడవు నీవు. బ్రహ్మాదులు నిన్నెరుగరు. అల్ప మేధసులు నీ జాడను ఎట్లెరుగ గల్గుదురు. నీవు నిత్య శుద్ధ బుద్ధ ముక్త స్వభావుడవు. ప్రకృతికి ఆవల ఉండువాడవు. అవ్యక్తుడవు. అనంతుడవు. అంతట ఉన్నవాడవు. ఆకాశమువలె శాంతుడవు.

ఇట్లు నిర్గుణుడు, నిరంజనుడు అయిన నిన్ను ఎవ్వరు స్తుతింపగలరు. మనసు చెదిరిన అల్పమతినయిన నేను నిన్ను స్తుతించితిని. ఇదెల్ల క్షమింప అర్హుడవు. ఓ అవ్యయ! దేవదేవేశ! వందనము. (55)

విష్ణు మార్కండేయ సంవాదము

భగవంతుడట్లు మార్కండేయునిచే వినుతింపబడి, మధుర గంభీరముగ ఇట్లనియెను. నీ మనసునగల కోర్కెయేమి? తెలుపుము. అదెల్ల ఇచ్చెదను అనగా ముని ఆ దేవునియెడ మనసు నిలిపి ఇట్లనియె.

స్వామి తామెవ్వరో నీ మాయ యెట్టిదో నీ దయచే నెఱుగకోరెదను. నా జ్ఞాపకశక్తి పోలేదు. నీ ఉదరమందు మేమి వింతలు కంటిన్. అవి నా మనసులో మెదలుచున్నవి. ఇచట చిన్ని శిశువునై ఆడుకొనుచున్నావు. ఈ జగత్తెల్ల నీ గర్భమందు ఎందులకు ఉన్నది. ఎంతకాల మిచ్చట ఉందువు. దేవేశ! విస్తరముగ తెలుపుము. నేను తెలుసుకొనవలెనని కోరుచున్నాను. నేను చూచినది ఊహకు అందునది గాదు అని అనగా దేవదేవుడు ఓదార్చుచు ఇట్లనియె! 'వేల్పులు కూడ నన్ను అచ్చముగ తెలియలేరు. నీకు ప్రీతి కూర్చుటకు తెల్పెదను. నీవు పితృభక్తుడవు. నన్ను శరణందితివి. నీ బ్రహ్మచర్య దీక్ష చూచియున్నాను. 'నారములు' అనగా నీరు 'ఆయనము' అనగా స్థానముగాగలవాడను కాన నారాయణుడను. నేనే జగత్కారణము. నాకు నాశములేదు. విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుడు, శివుడు, కుబేరుడు, యముడు, సోముడు, కశ్యప ప్రజాపతి, యజ్ఞము నేనే. 'నాకు అగ్ని ముఖము, భూమి పాదము, సూర్య చంద్రులు నేత్రములు' అని ఈ విధముగా తన తత్త్వమును విస్తారముగా తెలియచేసెను.

ఇట్లు వానికి వేయి యుగములు ముగియగానే స్వామి 'మఱియేమి కోరెదవన' ఆ పురాణమును ఇట్లనియె. నీ దయచే లోకహితముగోరి భేద భావము నశించుటకు శివ వైష్ణవవాద భేదము లంతరింప జేయుటకు ఇక్కడ శివాలయము నిర్మించెదను. అందు నీ క్షేత్రమున శంకర ప్రతిష్ఠ జేసెదను. హరిహరు లొక్కటే అని లోకమెఱుగునుగాక' అని జగన్నాథుడు భువనేశ్వర రూపమైన లింగము జగత్కారణము. నా ఆజ్ఞనుగొని వెంటనే ఇట నీశ్వరుని ప్రతిష్ఠింపుము. మా ఇర్వురకు అంతరములేదు. లోకము ఈ విషయమును ఎఱుగక వాదులాడును. నా ఆలయ మిది నీ పేర నిర్మించుము. దానికి ఉత్తరముగ మార్కండేయ 'హ్రదము' అను పేరనొక తీర్థముకూడ నేర్పడును. అది సర్వ పాపహర మగును. అని సర్వ వ్యాపియైన జనార్దనుడు పల్కి తిరోహితుడయ్యెను.(56)

పంచతీర్థవిధి వర్ణనము

ఇక పంచ తీర్థములందు స్నానము, దానములు చేయుట అచటి దేవతలను దర్శించుట వలకల్గు ఫలమును తెల్పెదను. మార్కండేయమను మడుగున ఉత్తరముగ తిరిగి శుచియై ముమ్మారు

సంసారసాగరేమగ్నం పాపగ్రస్తం అచేతనం,
త్రాహిమాం భగనేత్రఘ్న్ త్రిపురారే నమోఽస్తుతే
నమశ్శివాయ శాంతాయ సర్వపాపహరాయచ
స్నానం కరోమి దేవేశ మమనశ్యతుపాతకమ్

(సంసారసాగరమందు మునిగి పాపగ్రస్తుడనై తెలివిదప్పి ఉన్న నన్ను ఓ త్రిపురహర! రక్షింపుము. మంగళ స్వరూపుడు శాంతుడు సర్వ పాపహరుడునగు నీకు నమస్కారము. ఈశ్వర! ఇదిగో స్నానము చేయుచున్నాను. నా పాతకము నశించుగాక!) అను మంత్రము చెప్పుచు స్నానము చేయవలెను.

బొడ్డు లోతున స్నాన మొనరించి యథావిధిగ దేవతలకు ఋషులకు పితరులకు మొదలగు వారికి తిలోదక తర్పణములు కావింపవలెను. అవ్వల దేవాలయమందు మూడు మారులు ప్రదక్షిణము చేసి మూలమంత్రముతో అఘోర మంత్రముతోను మార్కండేయ ఈశ్వరుని పూజించి సాష్టాంగ నమస్కారము గావించి ఓ త్రినేత్ర చంద్రభూషణ ఓ విరూపాక్ష నన్ను రక్షింపుము. ఓ మహాదేవ నీకు నమస్కారము అని ఈ విధముగ స్తుతించి ప్రసన్నుని జేసికొనవలెను.

మార్కండేయ హ్రదమందిట్లు స్నానమాడి శంకరుని దర్శించిన అతడు పది అశ్వమేధములు కావించిన ఫలమందును. సర్వపాప విముక్తుడై శివలోకమునకు పోవును. అచట మహా భోగములను ప్రళయ కాలము వరకు అనుభవించి ఈ లోకమందు (కర్మభూమియందు) విప్రుడై జనించి వేదవేదాంగ విద్యాసంపన్నుడై శంకర సాలోక్య సారూప్య యోగమునంది అవ్వల మోక్షమును పడయును.

అట్లే కల్పవృక్షము (మఱ్ఱిచెట్టు) దరికేగి

ఓం నమోవ్యక్త రూపాయ మహాప్రళయ కారిణే
మహాద్రసోపవిష్టాయ న్యగ్రోధాయ నమోస్తుతే
అమరస్త్వం సదాకల్పే హరేశ్చాయతనంవట
న్యగ్రోధహరమే పాపం కల్పవృక్ష నమోస్తుతే

(అవ్యక్తమయిన పరమాత్మయొక్క వ్యక్తరూపము నీవు. మహా ప్రళయకర్తవు. అనగా ముక్తినిచ్చు వాడవు. అమృత మయుడవు. కల్పాంతము నశింపవు. హరికి నివాసమవు నీవు నాపాపమును హరింపుము. నీకిదే నమస్కారము.) అను ఈ మంత్రము జపించుచు పూజించి మూడుసార్లు ప్రదక్షిణము చేయవలెను.

భక్తితో ప్రదక్షిణము చేసి కల్ప వృక్షమునకు మ్రొక్కిన అతడు పాము కుబుసమును విడిచినట్లు పాపమునుండి విడివడును. ఆ కల్పము నీడ వసించి బ్రహ్మ హత్యాపాపమునే పోగొట్టుకొనవచ్చును. మఱి ఇతర పాపముల మాట చెప్పనేల? కృష్ణ శరీరము నుండి

జనించి బ్రహ్మ తేజస్సుతో నిండిన వటవృక్ష స్వరూపముననున్న విష్ణువునకు మ్రొక్కి రాజసూయ అశ్వమేధయాగ ఫలమును పొందును. అట్లు స్వవంశమును ఉద్ధరించి విష్ణు లోకమును పొందును. కృష్ణుని కెదుటనున్న గరుడమూర్తికి మ్రొక్కి, సర్వపాపము వెడలి విష్ణు లోకమును పడయును. వటవృక్షమును, గరుడుని దర్శించి పురుషోత్తముని, సంకర్ష ణుని, సుభద్రను దర్శించినవాడు పరమోత్తమగతి కేగును. విష్ణ్వాలయము చొచ్చి ముమ్మారు ప్రదక్షిణము చేసి సంకర్షణ మంత్రముచే ఆ మూర్తిని పూజించి ఇట్లు ప్రసన్నుని చేసికొనవలెను.

నాగలిని ధరించి నీకు నమస్కారము. రోకలిచేకొనిన నీకు నమస్కారము. రేవతీ ప్రియ! భక్తవత్సల! నీకు నమస్కారము. బలశాలుర కెల్ల మిన్నయగు నీకు నమస్కారము. ధరణింధరించు నీకు నమస్కారము. ప్రలంబాసురుని సంహరించిన నీకు నమస్కారము. కృష్ణునికి అన్నగారైన నీకు నమస్కారము అని ప్రార్థించెను.

అటు పిమ్మట హరిని ప్రసన్నుని చేసికొని నీలాంబరుడైన ఏక కుండలుని బలరాముని రోహిణీ కుమారుని అనుగ్రహింపజేసికొని, అతడు పాపము వాసి విష్ణులోకమున కేగును. ప్రళయముదాక అట సుఖములంది పుణ్యానుభవ అనంతరము భువికివచ్చి యోగి కులమందు విప్రుడై జనించి సర్వశాస్త్ర పారగుడై జ్ఞానమంది ముక్తినందును. ఆమీద హరిని ద్వాదశాక్షర మంత్రముచే పూజించి సద్గతి నందును. గంధ పుష్పాదులచే కృష్ణుని అర్చించి జయజయ అని స్వామి నామములను కీర్తించి నిస్సార సంసార సాగర మందు మునిగితిని. ఇది దుఃఖమను నురుగు, క్రోధమను మొసళ్ళు, విషయములను ఉదకము, నానా రోగములనెడి కెరటములు, మోహమను సుళ్ళుగలది. ఈ మహాభయంకర స్థితి నుండి నన్ను పురుషోత్తమా! కాపాడుమని స్వామిమూర్తిని పద్మ పత్రాయతేక్షణాది కల్యాణ లక్షణ ములు గలదానిని ధ్యానించి మ్రొక్కిన యతడశ్వ మేధములు వేయి చేసిన పుణ్యము నందును.

సర్వతీర్థ స్నానదాన ఫలమును కృష్ణదర్శనము చేసి పొందును. ఇట్లు కృష్ణదర్శనము చేయు నతడు పాపరహితుడయి ఐశ్వర్యవంతుడు, గుణవంతుడునై, కల్పశతము అఖిల భోగములను అనుభవించి గంధర్వాప్సరసలు అనుగమింప విష్ణులోకమంది ఇటకు తిరిగి వచ్చి విప్రుడై జనించి సర్వవేది సర్వజ్ఞుడునై స్వధర్మ నిష్ఠుడై శాంతుడై సర్వ భూతహితము కోరుచు వైష్ణవ జ్ఞానము పొంది ముక్తినందును.

ఆ మీద మంత్రపురస్సరముగా భక్తవత్సలను సుభద్రను అర్చించి 'నమస్తే సర్వగే' అను ఈ మంత్రముచే నమస్కరించి కామగమన విమానమున విష్ణుపురమేగి ప్రళయము దాక అట క్రీడించి వేదవేత్తయై విష్ణుయోగమంది ముక్తి నందును. (57)

నృసింహమాహాత్మ్యము

బ్రహ్మ ఇట్లు అనియె – ఇట్లు బలరాముని కృష్ణుని సుభద్రనుజూచి మ్రొక్కిన అతడు ధర్మాది పురుషార్థములను నాల్గింటిని బడయును. దేవాలయము వెడలి నమస్కరించి ఇనుకలో దాగియున్న ఇంద్ర నీలమణి స్వరూపుడగు విష్ణుని దర్శించిన భక్తుడు వైకుంఠమునకు ఏగును.

హిరణ్యకశిపుని సంహరించిన నరసింహమూర్తి సర్వదేవతామయము నిచట దర్శించిన అతడు సర్వ పాప విముక్తుడగును. నరసింహ భక్తులకు అసాధ్యములేదు. సర్వాభీష్టములు లభించును. ఆయన సర్వ పురుషార్థ ప్రదాత.

నరసింహమూర్తి ప్రభావమును విపులముగా వినకోరుచున్నాను. ఆయన ఎట్లు ప్రసన్నుడగును. ఆయన వలన కలుగు సిద్ధులేవి. దయచేసి తెల్పుము అనగా బ్రహ్మ ఇట్లు అనెను. మునులార! ఆయన అజేయుడు ఊహకందడు, భుక్తి ముక్తి ప్రదుడు ఆయన గుణ సంపదను తెలుపవశముగాదు. ఆయన అనుగ్రహముచే దైవ మానుష సర్వ సిద్ధులు లభించును. ఆయన దయచే స్వర్గ మర్త్య పాతాళాదులందు అప్రతిహతమైన గమనమేర్పడును. చరాచరముల యందు నరసింహ భక్తునకు అసాధ్యము లేదు. నరసింహ స్వామి ప్రసన్న డగుటకు సురాసురులకు కూడ తెలియని ఆయన తత్త్వమును-ఉపాసనా కల్పమును తెల్పెదను వినుడు.

నృసింహోపాసకుడు ఆకులు, దుంపలు, యవలు, పండ్లు, పేలపిండి, జలము మాత్రముతో వసించుచు, పట్టుగోచి పెట్టుకొని అరణ్యమందు, పర్వతమునందు, నదీ సంగమమునందు, ఊషర క్షేత్రమునందు, సిద్ధ క్షేత్రమునందు స్వామిని ప్రతిష్ఠించి జితేంద్రియుడై సమాధినిష్ఠుడై కల్పవిధానముచే పూజింపవలెను. శుక్లపక్ష ద్వాదశినాడు ఉపవసించి నృసింహ మంత్రమును ఇరువది లక్షలు జపింపవలెను. దానిచే మహాపాతక ఉపపాతకముల నుండి ముక్తుడగును.

స్వామికి ప్రదక్షిణ మాచరించి షోడశోపచార పూజల నొనరించి నమస్కారము చేయవలెను. పచ్చ కర్పూరమునందు అద్దిన పూవులను శిరసునందుంచిన సిద్ధిని బడయగలరు. అన్నిపనులు అప్రతిహతముగ సఫలమగును. బ్రహ్మ రుద్రాదులేని ఆయన తేజస్సును ఓర్వజాలరు. దానవ, సిద్ధ, గంధర్వ, మానుషాదుల విషయము చెప్పనేల. ఆసురములైన మంత్రములు ఆభిచారికములును నృసింహ మంత్ర జపముచే ప్రళయము చెందును. నృసింహ కవచము ఒక్కసారి జపించిన, సర్వోపద్రవముల నుండి రక్షించును.

రెండుసార్లు జపించిన దేవదానవ యక్ష భూత ప్రేత పిశాచాదుల బాధలు నశించును. మూడు సార్లు జపించిన పండ్రెండు యోజనముల మేరలో సురాసురులకు అభేద్యుడగును.

ఇట్లు ఆ భగవంతుని పూజించి ఆ సాధకుడు నృసింహ బిలద్వారమునకు ప్రో మూడు రాత్రులు మోదుగ సమిధలచే అగ్నిని జ్వలింపజేసి త్రిమధు రసపూతములైన మోదుగ సమిధలను హోమము చేయవలెను. రెండువందల హోమములను వషట్కార పూర్వకముగా జేయవలెను. అంతట నరసింహబిల ద్వారము తెరుచుకొనును. నిశ్శంకముగా నృసింహకవచ న్యాసము చేసికొని లోనికి ప్రవేశించిన సాధకునకు తమో మోహము కల్గును. వెంటనే సువిశాలమైన రాజమార్గము కనిపించును. అట తేనెటీగల బాధ కనిపింపదు. నృసింహుని స్మరించుచు అటనుండి సాధకుడు పాతాళము ప్రవేశించును.

ఆ లోనికేగి నృసింహ మంత్ర జపము జేయగా వీణా మేళనము జేయు వేలకొలది స్త్రీ లెదురై స్వాగతమిచ్చి చేయి పట్టుకొని లోనికి ప్రవేశింప జేయుదురు. తరువాత ఒక దివ్య రసాయన పానముచే దివ్య శరీరియు బలశాలియు అగును. భూత ప్రళయముదాక ఆ కన్యలతో క్రీడించి శరీరము బాసి వాసుదేవుని యందు లీనమగును.

ఆ గుహయందు వసింప గోరని వాడటనుండి వెలికివచ్చి, పట్టము శూలము ఖడ్గము రోచనము మణిరసము రసాయనము పాదుకాంజనము కృష్ణాజినము మనోహరమైన కమండలువు అక్షమాల సంజీవని విద్యయును శస్త్రములను చేకొని జ్వలించెడి విస్ఫులింగములచే ఆవరింపబడిన త్రిశిఖము నొక్కసారి హృదయమందు ఆనించినంతనే అనేక కోటిజన్మ పాపము దహింపబడును. ఆ త్రిశూలమును విషమునందుంచిన విషము విరిగిపోవును. శరీరమునకు తాకించిన కుష్ఠువ్యాధి పోవును. తన దేహమందు మోపిన భ్రూణహత్య మొదలైన పాపములు పోవును. తీవ్రమయిన గ్రహబాధలు జ్వలించు ఆ త్రిశూలమును ధ్యానించినంతనే నశించును. బాలురకు కంఠమందు కట్టిన రక్ష ఇచ్చును. అది గరళరోగములను, గండపిండకలూతాది రోగములను నశింపజేయును. ఆవునేతితో, ఆవు పాలతో, సమిధలతో ఒక నెల మూడు సంధ్యలయందును ఆ మంత్ర జపముచే హోమము చేసినయెడల అసాధ్యరోగములు కూడ నశించును. త్రిలోకము లందేది కోరినను సిద్ధించును. నృసింహుని పూజించిన యెడల కోరికలెల్ల సిద్ధించును.

నరసింహుని అష్టోత్తర శతనామములతో పూజించి, పుట్టమన్ను, శ్మశానమందలి మట్టి, రాజవీధిని నాలుగు దారులు కలియుచోటనుండియు ఏడేసి మట్టి ఉండలు గ్రహించి రక్తచందనము కలిపి ఆవుపాలతో మెదిపి ఆరంగుళముల నరసింహ ప్రతిమ తయారు

జేసి భూర్జ పత్రమునందు గోరోచనముతో మంత్రమును వ్రాసి నరసింహ స్వామి కంఠము నందు గట్టి మంత్రమును లెక్కలేకుండగ మడుగులో నిలిచి ఏడురోజులు పూజించి జపింపవలెను. అందువలన ముహూర్తమాత్రములో ఎల్లభూమియు జల సమృద్ధమగును. ఎండిన చెట్టుచివర నరసింహమూర్తిని పూజించి నూట యెనిమిది మార్లు ఆ మంత్రము జపించిన ఎడల వర్షము ఆగిపోవును. అట్లే నరసింహస్వామిని పిండిముద్దలోనుంచి గిరగిర త్రిప్పిన ఎడల వెంటనే పెనుగాలి వీచును. తరువాత ఏడుసార్లు జపించి మంత్రించిన జలముచే ఆ ప్రతిమ అభిషేకించి దానిని తాను ధరింపవలెను.

దానిని ఎవ్వని గృహద్వారమందు పాతిపెట్టునో, వానివంశము నశించును. ఆ ప్రతిమను వెలికితీయగా ఆ ఉపద్రవము శాంతించును. కావున సర్వాభీష్టములను ఒసంగు నరసింహమూర్తిని భక్తితో పూజింపవలెను. దానిచే పాపముక్తుడై విష్ణులోక మందును. బ్రాహ్మణాది వర్ణములవారు అంత్యజులుకూడ ఆ స్వామిని పూజించి అమంగళములను తరింపగలరు. అంతియకాదు దేవత్వ దేవేంద్రత్వములు యక్ష విద్యాధర గంధర్వాది దేవ విశేష భావములను రాజ్య స్వర్గ సుఖములను దుర్లభమైన మోక్షమును గూడ పొంద గలరు. నృసింహ దర్శన మొకసారి చేసినను పాప విముక్తి నంది అభీష్టములను పొంద గలరు. యుద్ధమందు, సంకటములందు, దొంగలు, కిరాతులు మొదలైనవారి పీడచే దుర్గమమైన అడవి అందు ప్రాణసందేహము కల్గినపుడు విషాగ్ని జలోపద్రవముల నుండియు రాజులవలన, సముద్రమువలన, గ్రహములవలన కలుగు పీడనుండి తరించును. నృసింహస్వామిని స్మరించినంతనే రాజోపద్రవములనుండి ముక్తుడగును. ఉదయమందు చీకటి విడిపోయినట్లు స్వామి దర్శనముచే సమస్త కష్టములు నశించును. ఘుటిక, కాటుక, పాదుక అను వానియందు రసాయన సిద్ధిని పొందవచ్చును. ఎల్ల కోరికలు ఫలించును.

స్వామిని పూజించి నమస్కరించి దర్శించి యశ్వమేధ యాగముల ఫలమందును, సమ్మణ సంపన్నుడగును. జరా మరణములు లేనివాడై, చిరుగంటలతో మెరయు మెరయు కామదమైన స్వర్ణ విమానమెక్కి ఉదయసూర్యునివలె దివ్యవర్చస్సుతో ముత్యాల హారములు మెరయు దివ్య స్త్రీ శతముతో గంధర్వగాన రమ్యమైన విమానమెక్కి ఇరువది యొక్క తరములవారిని ఉద్ధరించుచు సాక్షాద్దేవతా స్వరూపముతో సమ్మోదముతో సుఖముతో అప్సరసలు స్తుతింప విష్ణు లోకమున కేగును. అందు అనుపమ భోగములను అనుభవించి చతుర్భుజములు దాల్చి మనోహరమైన రూపముతో భూత ప్రళయము దాక ఆనందించి ఆపుణ్యము భుక్తమయిన తరువాత ఉత్తమమయిన యోగుల కులమందు పుట్టి చతుర్వేద వేదాంగ పారగుడై విష్ణుదేవతా భక్తి యోగము నంది మోక్షమును పొందును. (58)

శ్వేతమాధవ మాహాత్మ్య వర్ణనము

బ్రహ్మ ఇట్లు అనియె –

అనంత వాసుదేవమూర్తినే సేవించినవారు పాపముక్తులై పరమపద మందుదురు. ఈస్వామిని నేనును ఇంద్రుడును సేవించినాము. అటుపై విభీషణుడు, రాముడు సేవించిరి. శ్వేతగంగ యందు స్నానముచేసి శ్వేతమాధవుని, మత్స్యమూర్తియైన మాధవుని దర్శించిన అతడు శ్వేతద్వీపమునకు పోవును.

అనగా అటుపై మునులు "శ్వేత మాధవుని మాహాత్మ్యమును చెప్పుడు. శ్వేతమాధవుని విగ్రహమును ప్రతిష్ఠించిన వారెవరు?" అని అడిగిరి.

అప్పుడు బ్రహ్మ కృతయుగమందు బుద్ధిమంతుడు, ధర్మజ్ఞుడు, శూరుడు, సత్య సంధుడు, వ్రత నిష్ఠుడు అయిన శ్వేతుడను రాజు యొక్క రాజ్యమందు మానవులు పదివేల సంవత్సరముల ఆయుర్దాయము గల్గియుండిరి. కొంతకాలమునకు కపాల గౌతముడను ఋషి పండ్లుకూడ రానిస్థితిలో మరణించిన తన కుమారుని ఎత్తుకొని రాజు ఒద్దకు తీసుకొని వచ్చెను. రాజు వానినిజూచి ఆ శిశువును యమలోకము నుండి తిరిగి తీసికొని రానిచో ఏడు రోజులలో చితిని ఎక్కెదనని ప్రతిజ్ఞచేసెను. అట్లుచేసి వేలకొలది పద్మములతో మహాదేవుని పూజించి శివమంత్రమును జపించెను. అతని భక్తికిమెచ్చి మహేశ్వరుడు ఉమాదేవితో సాక్షాత్కరించెను. అంతేకాదు "నీభక్తికి సంతుష్టుడ నైతిని" అనెను. శరత్కాల మందలి చంద్రబింబ మట్లు మొల్లమొగ్గలవలె తెల్లగ ఉన్న విభూతి దాల్చి శార్దూల చర్మ మూని, చంద్రశేఖరుడునై దర్శనమిచ్చిన ఫాలాక్షుని దర్శించి నమస్కార మొనరించి శ్వేతుండు ఇట్లనియె. "స్వామీ! నాయందు దయకలదేని ప్రసన్నుడవైతివేని, కాలవశుడైన ఈ బ్రాహ్మణ శిశువు బ్రతుకుగాక! అకాల మృతుడైన ఈ బాలుని సంపూర్ణాయుష్మంతుని, క్షేమవంతుని చేయుమని కోరెను. శ్వేతుని ఆ పలుకులువిని శివుడు ఆనందపడి కాలమును నియమించి, సర్వ భూత భయంకరమైన యముని శాశించి మృత్యుముఖగ్రస్తుడైన ఆ బాలుని జీవింప చేసెను. మహాదేవుడు గౌరితో ముని కుమారుని సర్వ జగత్తును క్షేమ సంపన్న మొనర్చి అంతర్ధా నమయ్యెను" అచి చెప్పగా విని మునులు "ఆ శ్వేత నృపతి వృత్తాంతమును సవిస్తరముగా దెల్పుమని అడుగగా జగత్ప్రభువు ఇట్లు పలికెను.

ఈ కథ సర్వజీవ హితకరము. మాధవుని మాహాత్మ్యము సర్వపాప ప్రణాశనము. సర్వకామ ఫలప్రదము. నేను ఋషుల వలన వింటిని. భయదుఃఖములను హరించు

ఈ దివ్యకథను వినుడు. శ్వేతుడు వేలేండ్లు చక్కగ పాలించి లౌకిక, వైదిక ధర్మవిచారణచేసి దక్షిణ సముద్ర తీరమందలి క్షేత్రములకు పోయి కృష్ణాష్టమినాడు సలక్షణమైన విష్ణు ప్రాసాదమును నిర్మించెను. అది నూరు ధనుస్సుల పరిమాణము గలది. శ్వేతశైల మయమైన భగవన్మూర్తిని మాధవుని మూర్తిని అందు స్వయముగా ప్రతిష్ఠించెను. బ్రాహ్మణులకు తపస్వినులకు దీనులకు అనాధలకు అమాధవుని సన్నిధిని దానముల చేసి, స్వామి ఎదుట పుడమిపై వ్రాలి ప్రణవ పూర్వకమైన ద్వాదశాక్షర మంత్రమును జపించుచు, ఒక మాసము మౌనవ్రతుడై, నిరాహారుడై ఆ విష్ణుపదమందు సమాధి నిష్ఠుడు అయ్యెను. జపాంతమందు దేవేశ్వరుని విష్ణునామ మధురము, సరళము, సులభార్థములుగ స్తోత్రములచేత స్తుతించెను.

ఇంకను "ప్రభో! నన్ను నరకము నుండి ఉద్ధరింపగల బంధువు నీకంటె లేదు. కాయిక మలము మానసిక మలము అను వానికంతము లేదు. వానిని క్షాళనము చేయ నీకంటె ఎవ్వరులేరు. సర్వసంగముల నుంచి విముక్తుడనై నిన్ను చేరితిని. నీతో ఎల్లప్పుడును నాకు సంగము కలుగుగాక. అది ఆత్మలాభము (స్వరూప దర్శనము) కొఱకు సమర్థమగు గాక. ఈసంసారము అపార కష్టభరితము. నేను తాపత్రయ పరితప్తుడను. నిన్ను శరణు వొచ్చితిని. దారేషణ, పుత్రేషణ ఫలేషణచే మాయా మోహితుడనై లోభాది గుణములచే ఆకర్షితుడనై నిన్ను శరణందితిని. సాంసారిక సుఖమించుకైన లేదు. యజ్ఞే శ్వరా! మనసు నీవంక ప్రవర్తించి నిష్కామమైన ఆత్యంతిక సుఖము (మోక్షము) పొందుదును గాక. వివేకశూన్యుడనై ఉన్నాను. జగత్తు వ్యక్తావ్యక్తము.ఓ గోవిందా! రక్షింపుము. నన్ను సంసారమునుండి ఉద్ధరింపుము. ఓ పుండరీకాక్ష! మోహ రసమయము, దుస్తరము అయిన భవాబ్ధిలో మునిగిన నన్ను ఉద్ధరింపగలవాడు నీ కంటె మఱి కనబడడు."

అని ఇట్లు శ్వేతునిచే వినుతుడై ఆ పురుషోత్తమ క్షేత్రమందు జగద్గురువు హరి సర్వ దేవతలతో సాక్షాత్కరించెను. ఆ మూర్తి నీలమేఘుడు. పద్మనేత్రుడు. తేజోమండ లాంతర్గ తుడు. ఆయన వామహస్తమున పాలవెల్లి చందమామ వలె పాంచజన్యమను శంఖము వెలుగొం దుచుండెను. గదా శార్ఙ్గఖడ్గధరుడై గరుడ ధ్వజుడు వచ్చి రాజా! నీ బుద్ధి స్వచ్ఛ మైనది. భక్తి భరితమైనది. ఓ పుణ్యశాలి! ప్రసన్నుడనైతిని. అభీష్టవరమును కోరుకొనుము అనగా శిరసువంచి తద్గతమనస్కుడై, స్వామి పరమామృత వాక్యములను విని శ్వేతుడు ఇట్లనియె. ప్రభో! నేను భగవద్భక్తుడనేని బ్రహ్మ లోకము కంటెను మీదిది, విమలము, విరజము శుద్ధము సంసార సంగరహితము అవ్యయము అగు విష్ణుపదమును, నీ అనుగ్రహమున అందగోరుచున్నాను అని విన్నవించెను.

భగవంతుడు ఇట్లు అనియె – దేవ, ముని, సిద్ధ, యోగిగణముల కందని పరమ రమ్యమైన స్థానమునకు నీవు వెళ్ళగలవు. రాజ్యాసనము, రాజ్యామృతమును ఉపాసించి సర్వలోకములు దాటి నా లోకమున కేగగలవు. నీకీర్తి త్రిలోక వ్యాప్తమగును. ఎల్లప్పుడు నా సాన్నిధ్యము కలుగును. ఇది శ్వేతగంగయని దేవదానవులు గానము చేయుదురు. ఈ శ్వేత గంగా జలమును కుశాగ్రముచేత స్పృశించి నాభక్తులు సమాధి నిష్ములై స్వర్గమునకు పోగలరు. ఈ శ్వేతమాధవ విగ్రహము వెన్నెలకాంతిని మించును. శంఖము గోక్షీరము వలె అచ్ఛమైనది. ఈ మూర్తి సదా అఘవినాశిని. తెల్లతామర పూలవలె మెఱయు నేత్ర శోభ గలది. ఈ ప్రతిమకు నమస్కరించి సర్వలోకములను దాటి, నాకలోకమందు అనేక మన్వంతరముల పాటు దేవ సుందరీ పరివృతుడై మధురముగ గానము చేయబడు కీర్తిగలవాడై సిద్ధ గంధర్వ సేవితుడై నా భక్తులతో అతడు విపుల భోగముల అనుభవించును. అటనుండి పుడమిపై బ్రాహ్మ ణుడై వేద వేదాంగ వేత్తయై భోగియై, సమృద్ధుడై, శుచియై, అదృష్టవంతుడై, రూపవంతుడై పుత్ర పౌత్రాదులతో సుఖించు పురుషోత్తముని మరలచేరి ఆ వట మూలమందు చేరి ఈ సముద్రమందు హరిస్మరణ చేయుచు దేహమును వదిలి శాంత పదమందుదువు. (59)

సముద్ర స్నాన విధి

బ్రహ్మ ఇట్లనియె – "శ్వేత మాధవుని దర్శించి ప్రళయమందు ఏకార్ణవమైన తఱి మత్స్యావతారమెత్తిన మాధవుని దర్శింపవలెను. వేదములను హరించిన హిరణ్యాక్షుని సంహరించి వేదరక్షణము చేసిన మొదటి అవతారమెత్తిన విష్ణువునకు నమస్కరించిన నరుడు దుఃఖ విముక్తుడగును. విష్ణు లోకమును పడయును. మరల ఈ పుడమికి వచ్చి వత్సమాధవ స్వామిని అచ్చట దర్శించి దాతయు, ఐశ్వర్య భోక్తయు, యజ్ఞకర్తయు, విష్ణుభక్తుడును సత్యవ్రతుడును అయి హరిసన్నిధాన మొంది మోక్షము పడయును. సర్వ కామప్రదమయిన మత్స్య మాధవ మాహాత్మ్యమును వర్ణించితిని. అనవిని మునులు "స్వామి! సముద్ర జలమార్జనము స్నానము, దానము చేయుటచేతను అందువలన కల్గు అశేష ఫలము చెప్పు"మని అడుగగా బ్రహ్మ ఇట్లనియె.

"మునులార! వినుడు. భక్తి మనసు నందు ఉంచిన యెడల సముద్రజల మార్జనము. మార్కండేయ హ్రదమందు ప్రాతః స్నానము ఉత్తమ పుణ్యఫల మిచ్చును. చతుర్దశియందు పూర్ణి మకు స్నానముజేసిన అశ్వమేధ ఫలమందును.

మార్కండేయ హ్రదము, కృష్ణవటము, బలరాముడు, మహోదధి ఇంద్రద్యుమ్న సరస్సును వీనికి పంచ తీర్థములనిపేరు. జ్యేష్ఠ పూర్ణిమ జ్యేష్ఠా నక్షత్రము కలసి వచ్చిన పుణ్యకాలమున ఈ తీర్థ సేవనము పరమ శుభమని చెప్పబడినది. త్రికరణములచేతను శుద్ధుడయి రాగద్వేషాదులను ద్వంద్వములను బాసి కల్పవృక్షమును బోలిన మర్రిచెట్టునకు స్నానపూర్వకముగ ప్రదక్షిణము చేసి విష్ణువునకు కూడ ముమ్మార్లు ప్రదక్షిణము చేసి సప్తజన్మ పాపములనుండి ముక్తుడయి కోరిన సద్గతి బడయును. ఆ వటవృక్షమునకు వటేశ్వరుడు కృష్ణుడు, పురాణపురుషుడు అను మూడు పేర్లచేత కృతాది యుగములందు కీర్తింపబడినది. కృత యుగమునందు నీ వృక్ష ప్రమాణము ఒక యోజనము. త్రేతా యుగము నందు నాల్గవ వంతు తగ్గినది. ద్వాపర మందు సగము యోజనము. కలిలో దానిలో సగము వైశాల్యమని చెప్పబడెను. ఎడమ పాదమున ప్రణవమును, దక్షిణ పాదమున 'న' కారము, వామ కటియందు 'మో' కారము, కుడివైపున 'నా' కారము, నాభియందు 'రా' కారము, ఎడమ భుజమున 'య' కారమును, కుడిభుజమున 'ణా' కారము, శిరస్సున 'య' కారమును న్యాసము చేయవలెను. క్రిందను మీదను హృదయ మందును ఇరుప్రక్కలను పృష్ఠభాగమునను నారాయణుని ధ్యానించి నారాయణ కవచ పారాయణము ప్రారంభించవలెను. గోవిందాది నామములతో తూర్పు మొదలుగ నలు దిక్కులయందును విష్ణువు, మొదలుగా గల నామములతో ఆగ్నేయాది విదిక్కుల యందు (మూలలందు)ను విష్ణువు రక్షించుగాక అని పలుకవలెను. వరాహమూర్తి భూతలము నందును త్రివిక్రముడు మీదను రక్షించుగాక అని పలికి నారాయణుడను నేనేయని ఆత్మానుసంధానము చేయవలెను. (అద్వైతమును) అభేదమును సాధింపవలెను.

అటుపై ఈ క్రింది మంత్రమును జపింపవలెను. ఆ మంత్రభావము ఇది. మనుజులలో నగ్నివి నీవు. అనగా వైశ్వానరాగ్నియను జఠరాగ్ని నీవె. కామోద్దీపనము చేయు వీర్యా ధానము చేయువాడవు నీవె. సర్వ భూతములకు ప్రధాన భూతము నీవు. సర్వ జీవులకు ప్రభువవు. అమృతములకు నరణివి. అనగా జన్మస్థానము. దేవతలకు మూల పురుషుడవు. నా పాపము హరింపుము. ఓ తీర్థరాజమా! నీకు నమస్కారము అని పలికి ఆ పైన స్నానము చేయవలెను లేనియెడల స్నానమవసరమూ లేదు. ఆ తీర్థ జలములందు వైదిక మంత్రములతో అభిషేకముచేసి మార్జనము చేసుకొన్నను చాలు. మోకాళ్ళ నీళ్ళలో నిలిచి అఘమర్షణ ఋక్కులను మూడు ఆవృత్తులు జపించుచు స్నానముచేసిన అశ్వమేధ యాగ ఫలము వచ్చును. గట్టునకు వచ్చి, మడిబట్టలను ధరించి ప్రాణాయామము ఆచరణములను జేసి, సంధ్యను ఉపాసించి సూర్యోపస్థానము చెప్పిపూలతో జలాంజలి ఇచ్చి బాహువులు

మీదికెత్తి సూర్యుని ఉద్దేశించి నూటఎనిమిది మార్లు జపించవలెను. నిలువబడి ఇంకను గల సౌర మంత్రములను జపించవలెను. సూర్యుని ఉద్దేశించి ప్రదక్షిణము జేసి నమస్కరించి తూర్పు ముఖమై బ్రహ్మయజ్ఞము, దేవర్షి పితృ తర్పణములను, గోత్రములతో పితృ దేవతలకును తర్పణము చేయవలెను. దేవతా తర్పణమయిన తరువాతనే పితృ తర్పణమునకు అధికారి అగును. శ్రాద్ధకాలమందు హోమ కాలమందు ఒంటిచేతితో చేయవచ్చును. తర్పణము రెండు చేతులతో చేయవలెను.

తర్పణము చేయువాడు నీటిలో నిలబడి ఒడ్డున తర్పణము చేసిన యెడలను, వొడ్డున కూర్చుండి నీటిలో తర్పణము చేసినను అది ఆయా దేవతలకు చెందదు. వృధా అగును. పితృ తర్పణము నీటిలో చేయరాదు కుపితుడై చేయరాదు. ఒంటిచేతితో చేయరాదు. గట్టుమీదికి వచ్చి శుచియైన చోట పితృ తర్పణము చేయవలెను. ఉదకమందు పాత్రలయందు జేయరాదు. అట్లు చేసిన అది పితృ దేవతలకు అందదు. భూమియందు జేసిన పితృ తర్పణము అక్షయము అందుకొరకె నేను భూమిని ఇచ్చితిని. జలము భూమిలో పుట్టినది. భూమియందు పారుచున్నది. భూమియందే లయమగుచున్నది. కావున పితృ తర్పణమునకు భూమి ప్రధాన స్థానము. అగ్రములతో ఉన్న దర్భలను తూర్పు అగ్రములుగ పఱచి దేవతలకును, దక్షిణాగ్రములుగ పఱచి పితృ దేవతలకును తర్పణము జేయవలెను. (60)

పూజావిధి

ఇంకను బ్రహ్మ ఇట్లు చెప్పెను – అచమనము కావించి మౌనము బట్టి జీవర్షి పితృ తర్పణములను కావించి శ్రీమన్నారాయణ పూజ ఇట్లు చేయవలెను. మూరెడు చతురము గల మండలము లిఖింపవలెను. అందు నాలుగు కోణములు నాలుగు ద్వారములు గుర్తింపవలెను. సముద్ర తీరమున అష్టదళ పద్మాకారమున లిఖించిన ఆ మండల మందు నడుమ తామర పూవుదుద్దుగుర్తుగా, పసుపు కుంకుమలతో చిత్రింపవలెను. నారాయణాష్టాక్షరీ మంత్ర పూర్వకముగ ఇందు నారాయణుని పూజింపవలెను.

అష్టాక్షరీ మంత్ర సంపుటితో అంగన్యాస కరన్యాసాదులు ధ్యాన ఆవాహనాది షోడశోపచారాది పూజలు కల్పమును అనుసరించి ఆచరింపవలెను. (61)

సముద్ర స్నాన మాహాత్మ్యం

ఇట్లు నారాయణుని యథావిధి పూజించి సముద్రునకు నమస్కరించవలెను. అపుడు 'ప్రాణస్త్వం' అను మంత్రమును జపించవలెను. స్నానము చేసివచ్చి ఒడ్డున నారాయణుని

పూజించి బలరాముని కృష్ణుని, సుభద్రను, సముద్రునికి నమస్కారము చేసి అశ్వమేధ ఫలమును మానవుడు పొందును. అంతేకాక సూర్యప్రభగల విమానమును ఎక్కి గంధర్వ అప్సరసలు సేవింప, ఇరువదియొక్క తరముల వారిని ఉద్ధరించి విష్ణులోకమున కేగును. నూరు మన్వంతరములు విష్ణులోక భోగములను అనుభవించి ఈ భారత భూమి యందు శ్రీమంతుడై సర్వైశ్వర్యసంపన్నుడయి వేదశాస్త్ర వేత్తయై వర్తించి వైష్ణవ యోగమున మోక్షమును పొందును. ఈ సముద్రమున పుణ్యకాలమందు అనగా గ్రహణ సంక్రాంతి అయన విషువ యుగాది షడశీతి వ్యతీపాతము దిన క్షయ ఆషాఢీ, కార్తిక, వైశాఖీ పూర్ణిమలయందు స్నానదానాదులు చేసి పితృతర్పణ పిండ ప్రదానాదులు చేసిన అనంత పుణ్య నిధి అగును. పిండ ప్రదానము వలన ఆయువు, కీర్తి, భుక్తి, ముక్తి సిద్ధించును. ఈ వార్త నాస్తికులకు చెప్పరాదు. పుష్కర తీర్థములు ఇంతకుముందు చెప్పబడిన ఆయా ఫలములను ఈయగలవు. ఈ తీర్థరాజము సర్వతీర్థ ఫలప్రదము. సాగరుడు సర్వతీర్థ రాజు. సూర్యోదయ మందు చీకటి విరిసినట్లు ఈ తీర్థరాజ సేవనమున పాపమెల్ల విరియును. స్నాన దాన తపో హోమాదులు ఇచట అక్షయఫలప్రదములు అగును. (62)

పంచతీర్థ మాహాత్మ్యము

సముద్ర స్నానానంతరము యజ్ఞ పురుషుని శరీరమందు ఆవిర్భవించిన తీర్థము ఇంద్రద్యుమ్న సరస్సును సేవింపవలెను. ఆ తీర్థ సేవనమందు 'అశ్వమేధాంగ సంభూత' అను మంత్రమును ఉచ్చరించవలెను. ఇట దేవర్షి పితృ తర్పణముచేసి దశాశ్వమేధయాగ ఫలమొందవచ్చును. గడచిన ఏడు తరముల, రాగల ఏడు తరములవారిని ఈ పుణ్యమాచరించు వాడు ఉద్ధరింపగలడు. కామగమన విమానమున విష్ణు లోకమునకు పోగలడు. ఏకాదశి ఉపవాసముండి, పంచ తీర్థములను సేవించి, జ్యేష్ఠశుద్ధ పూర్ణిమనాడు పురుషోత్తముని దర్శించు వాడు పునరావృత్తి రహిత పుణ్య స్థానమందును" అని చెప్పెను.

"మాఘాది మాసములను వదలి జ్యేష్ఠ మాసమునే ప్రశంసించితి వేల? అని మునులు అడుగ బ్రహ్మ ఇట్లనియె. జ్యేష్ఠ శుక్ల దశమి మొదలు ఏడు రోజులు సర్వ తీర్థములు పురుషోత్తమ క్షేత్రమందుండును. కావున ఏకొంచెము పుణ్యమైనను ఇచట అక్షయమగును.

జ్యేష్ఠ శుక్లపక్ష దశమి పది రకముల పాపములను హరించును. కనుక దశహర అనబడును. ఆనాడు బలరామకృష్ణ సుభద్రల దర్శనము విష్ణు లోకప్రదము. ఫాల్గుణ పూర్ణిమనాడు ఊయెల యందున్న గోవిందుని డోలోత్సవమును జూచు నతడు గోవింద పురమేగును. విషువత్తులందు పంచతీర్థ సేవన మొనరించి, ఆమూడు మూర్తులను సేవించు

సేతడు సర్వయజ్ఞ ఫలమును పూర్తిగా పొందినవాడు అగును. విష్ణులోక గమనము. వైశాఖ కృష్ణ తృతీయ తిథియందు కృష్ణునకు చందనోత్సవము జరుగును. అది చూచునతడు విష్ణు లోకమునకు చేరుకొనును. జ్యేష్ఠా నక్షత్రముతో నున్న జ్యేష్ఠ పూర్ణిమ యందు పురుషోత్తమ దర్శనముచేసి అనతడు ఇరువది యొక్క తరములను ఉద్ధరించి విష్ణుపద మందును. (63)

మహాజ్యేష్ఠి ప్రశంస

బ్రహ్మ ఇట్లు అనియె –

మహాజ్యేష్ఠి పర్వమునందు పురుషోత్తమ క్షేత్రము సేవింపదగినది. శ్రీకృష్ణుని, బలరాముని సుభద్రను ఆనాడు దర్శించుట వలన ప్రయాగ మొదలైన పుణ్య క్షేత్రములను సేవించిన ద్వాదశ పుణ్య క్షేత్ర యాత్రా ఫలము లభించును. గోదావరి మొదలైన పుణ్య నదులు సేవించిన ఫలము కూడ సిద్ధించును. భూమియందు గల సర్వ దేవాలయములను, నదీ సాగర పర్వత తీర్థములను సేవించి స్నానదానాదులు చేసిన పుణ్యము కృష్ణ దర్శనము చేత లభించును. అంతేగాక విష్ణు లోకము కూడ లభించి అచ్చట పుణ్యానుభవమైన తరువాత కర్మ భూమి యందు జనించి చతుర్వేదాధ్యయనము చేసి వేదోక్తాచార ధర్మ నిరతుడై కృష్ణ భక్తుడై విష్ణుభక్తి యోగమునంది మానవుడు మోక్షము పొందును" (64)

కృష్ణస్నాన మాహాత్మ్య వర్ణనము

మునులడుగగ బ్రహ్మ బలరామ కృష్ణ సుభద్రా ప్రీతిగ చేసిన స్నాన ఫలమును గూర్చి ఇట్లు చెప్పెను. "జ్యేష్ఠ మాసమందు చంద్ర దేవతాక మగు నక్షత్రమందు పూర్ణిమనాడు సర్వ తీర్థములు పురుషోత్తమ క్షేత్రమునందున్న నూతియందు ఉండును. భోగవతి అను పుణ్యతీర్థము అచ్చట ప్రత్యక్షమగును. ఆనాడు బంగారు కలశములచే ఆ కూప జలమును తోడి ఆమ్ముగ్గురి దేవతలకు అభిషేకము చేయవలెను. ఒక మంచము, వస్త్ర పుష్పాదులచే అలంకరించి, పతాకములెత్తి, తెల్లని వస్త్రము పఱచి, ధూప దీపాదులు అలంకరించి, వివిధ మంగళ వాద్యములు మ్రోగ, బలరామ కృష్ణులను సుభద్రను పూజింపవలెను. సుభద్రను వారిద్దరికి నడుమ నిలుపవలెను. ఆ విధముగ యథావిధి పూజచేసి మంగళ వాద్యములను మ్రోయించి వేద పారాయణముకూడ చేయించవలెను. బ్రహ్మచారి, గృహస్థ, వానప్రస్థ, సన్యాసులు కూడ ఈ పూజ చేయవచ్చును. ఆపైన స్తుతి చేయవలెను. ఆ స్తుతియందు 'నమస్తే దేవదేవేశ' అను స్తోత్రమును పఠింపవలెను. ఈ పూజకు ఇంద్రాది దేవతలు కూడ వత్తురు.

ఈ విధముగ దేవతలు మొదలగువారు సమస్త అభిషేక సామాగ్రిచేతను, సమస్త మంత్ర లాభముల చేతను యథావిధిగా బలరామ సుభద్రా కృష్ణులను అర్చింతురు. ఈ అర్చనవలన సర్వాభీష్టములు సిద్ధించును. సర్వదాన ఫలము కల్గును. గ్రహబాధలు తొలుగును. సంతాన సిద్ధి కలుగును. ఆయా దానములచేత ఫల సిద్ధులు సంపూర్ణముగా పొందగలరు. (65)

గుడివాయాత్రా మాహాత్మ్యము

బ్రహ్మ – సుభద్రా కృష్ణ బలరాములు గుడివా మండపమునకు రథయాత్ర చేయుదురు, ఆ ఉత్సవము దర్శించిన వారు విష్ణులోక మందుదురు."

అది విని మునులు "దక్షిణ దిక్కునందు ఆ యాత్రా విధానమును ఏర్పరిచిన వారెవరు? ఆ యాత్రా సందర్శన ఫలమేమి? ఇంద్రద్యుమ్న రాజ నిర్మితమగు ఆ సరస్సు యొక్క తీరమందుగల ఆ మండపమున తమ దేవాలయమును వదలి ఆమ్ముగ్గురును ఏడు రాత్రులు నిర్జనమైన ఆ పవిత్ర ప్రదేశమున ఎందులకు వసింతురో తెల్పుడు" అన బ్రహ్మ ఇట్లు అనియె.

ఇంద్రద్యుమ్నుడు ప్రార్థింప శ్రీహరి గుడివా యాత్రజేసి ఏడు రోజులచ్చట నివసింతునని వరమిచ్చెను. ఈ యాత్రా దర్శనము సర్వకామ ఫలప్రదము. బ్రాహ్మణాది వర్ణముల వారు యథావిధిగ షోడశోపచార పూజలుగావించి, గీత నృత్యాదులచే పరమాత్మను సేవించిన ఎడల వారికి సర్వా భీష్టములు సిద్ధించును అని ఈ విషయమును స్వయముగా తెల్పి అంతర్ధానమయ్యెను. ఆరాజ శ్రేష్ఠుడా యాత్రను నిర్వహించి భగవద్దర్శనము చేసి కృతార్థుడయ్యెను. (66)

ద్వాదశ యాత్రా మాహాత్మ్యము

మునులు అడుగ బ్రహ్మ ఇట్లు అనియె. ఉత్థాన ఏకాదశినాడు ఫాల్గుణ పూర్ణిమనాడు విష్ణు పుణ్యకాల మందు గుడివా యాత్రా దర్శనముచేసిన వాడు పదునల్గురు ఇంద్రుల పరిపాలన కాలము వరకు విష్ణులోకమునందు ఉండును. పురుషోత్తమ క్షేత్రమునకు జ్యేష్ఠ మందు యాత్ర చేసినవాడు కల్పాంతము వరకు విష్ణు లోకమందు సుఖించును. విధానమున లోభత్వము డాంబికము లేకుండ భగవత్ప్రతిష్ఠ చేసి పూజించిన అతడు వైకుంఠ భోగములను అనుభవించి మోక్షము నందును.

భగవత్ప్రతిష్ఠా విధానము. అర్చనము, దానము మొదలైనవాని ఫలమును గురించి మునులడుగ బ్రహ్మ ఇట్లు అనియె.

జ్యేష్ఠ శుక్ల ఏకాదశినాడు ఇంద్రద్యుమ్న సరసునందు యథావిధిగ స్నానమాచ రించి దేవర్షి పితృ తర్పణములు ఒనరించి మడి వస్త్రములను ధరించి సూర్యాభిముఖుడై వేదమాత గాయత్రిని అష్టోత్తర శతము (108)మార్లు జపించి సౌరమంత్ర పారాయణము చేసి ముమ్మార్లు ప్రదక్షిణముజేసి త్రివర్ణములవారు వేదోక్త విధానమున సూర్య నమస్కారములను చేయవలెను. స్త్రీ శూద్రులు స్నానాదులందు జపములందు వేదోక్తముగాగాక పురాణోక్త విధానమును అనుసరింపవలెను.

అటుమీద గృహమునకేగి మౌనము వహించి పురుషోత్తముని ధ్యాన ఆవాహనాది విధానమున పూజింపవలెను. ఆ దేవుని ఆవునేతితో పాలతో నభిషేకింపవలెను. పంచామృత స్నానము కూడ చేయింపవలెను. చందనోదకముతో స్నానమాడింపవలెను. ఆ మీద వస్త్రయుగ్మ సమర్పణ చేయవలెను. చందన అగరు కర్పూర కుంకుమములు పూయవలెను. విష్ణుప్రియములైన తామర, మల్లియలతో జగన్నాథుని పూజింపవలెను. ధూపమీయవలెను. ఆవునేతితోగాని నువ్వుల నూనెతోగాని పండ్రెండు దీపములను పెట్టవలెను. పాయసము చక్కిలములు లడ్డూ వంటకము బెల్లపు పాకము నివేదింపవలెను. మధుర ఫలములను గూడ నివేదింపవలెను. పంచ ఉపచారములచే ఇట్లు పూజించి 'నమః పురుషోత్తమాయ' అను మంత్రము108 మార్లు జపింపవలెను. అటుపై, ఆ దేవుని నమస్తే సర్వలోకేశ అని ప్రారంభించి స్తుతించి ఈ పండ్రెండు యాత్రలు నీ యనుగ్రహమున సంపూర్ణ ఫలవంతములగుగాక అని ఆదేవుని అనుగ్రహింప జేసుకొని దండవత్ప్రణామము గావింపవలెను. పుష్ప వస్త్ర గంధాదులచే అటుపై గురువుని పూజింపవలెను గురువునకును దేవునకును భేదములేదు. ఆ మీదట పుష్పమండప నిర్మాణము జేసి వేదాది విద్యలను స్వామికి అవధరింపజేసి ఆ రాత్రి జాగరణ చేయవలెను. అందు వాసుదేవకథా ప్రసంగము. సంకీర్తనము చేయవలెను. చేయించవలెను. ధ్యానించుచు పఠించుచు శ్రీహరిని స్తుతించుచు నమస్కరించుచు ఆరేయి గడుపవలెను. ద్వాదశి యందు ప్రభాతమున పండ్రెండుగురు వ్రత స్నాతులు వేదపారగులు ఇతిహాస పురాణజ్ఞులు జితేంద్రియులు నయిన బ్రాహ్మణులను ఆహ్వానింపవలెను. తాను యథావిధి స్నానముజేసి పురుషోత్తముని పూజింపవలెను. బ్రాహ్మణులను పూజించి గో, స్వర్ణ, ఛత్ర, పాదుకాదులను వస్త్రాభరణములను ఒసంగి బూజింపవలెను. ఆచార్యునకుకూడ పైన చెప్పిన ద్రవ్యముల ఒసంగి అందరికిని మృష్టాన్న భోజనము పెట్టవలెను. ఆ బ్రాహ్మణులకు మోదకములతోగూడ పండ్రెండు ఉదకుంభము

లను సదక్షిణముగ దానము చేయవలెను. జ్ఞానప్రదుడైన గురువును బ్రాహ్మణులను విష్ణుతుల్యులుగా భక్తితో భావించి ఇట్లు బూజింపవలెను. అటుపై వారికి నమస్కరించుచు శ్లోక రూపమయిన మంత్రమును పఠింపవలెను. ఆ శ్లోక భావమిది. "అంతటను నిండి యున్నవాడు. ఆది మధ్యాంతములు లేనివాడు శంఖచక్ర గదాధరుడు జగన్నాథుడు అగు పురుషోత్తమ దేవుడు సంప్రీతుడగుగాక. అని ఇట్లు పలికి విప్రులకు నమస్కరించి ఆచార్యుని తోబాటు వారికి శిరసువంచి నమస్కరించి వారిని తనయింటి సరిహద్దుల వరకు సాగనంపి నమస్కరించివచ్చి బంధుజనముతో వాజ్ఞియము వహించి భగవత్ప్ర సాదము ఆరగింప వలెను. ఉపాసకులకు దీనులకు భిక్షుకులకు అన్నాతురులకుకు కూడ భోజనము పెట్ట వలెను. ఇట్లు చేసిన పురుషుడేని స్త్రీ యేని యశ్వమేధ రాజసూయ శతసహస్ర పుణ్యము పొందును. నూరు తరములు వెనుకవారిని ముందువారిని తరింపజేసి దివ్యరూపధారియై సూర్యునట్లు వెలుగు కామగమగు విమానమున గంధర్వాప్సరో బృందము స్తుతింప తనపుణ్య విశేషముచే దశదిశలను వెలిగించుచు అతడు హరిపురమునకు చేరుకొనును. నూరు కల్పములు వైకుంఠ భోగములను అనుభవించి సర్వస్తుతి పాత్రమై జగన్నాథ స్వామి సారూప్యమంది సర్వభోగములను అనుభవించి బ్రహ్మలోకమేగును. అచట తొంబది కల్పములు సుఖించి రుద్రలోకమున కేగును. అచట ఎనుబది కల్పములు సుఖము అనుభవించి గోలోకమునకు ఏగును. డెబ్బది కల్పములచ్చట ఉండును. అటనుండి ప్రజాపతి లోకమేగి అఱువది కల్పములు నానా భోగములను అనుభవించును. అట నుండి ఇంద్ర భవనమునకు ఏతెంచి ఏబది కల్పములు సుఖించి నలుబది కల్పములు సురలోకమున సుఖమనుభవించి, నక్షత్ర లోకమునకుఏగి ముప్పది కల్పములుండి చంద్ర లోకమున ఇరువది కల్పములుండి, ఆదిత్య లోకమునకేగి పది కల్పములు సుఖించి గంధర్వ భువనమున నొక కల్పము భోగించి భూమికేతెంచి ధర్మపరుడైన చక్రవర్తి అగును. ఇచట రాజ్యమును ధర్మముగ పాలించి సంపూర్ణ దక్షిణములగు యజ్ఞములు ఆచరించి యోగిగమ్యమగు మోక్ష ప్రదమయిన శివలోక మందును. అందు భూత ప్రళయముదాక సర్వభోగములను అనుభవించి మరల ఇటకు వచ్చి యోగుల కులమందు విష్ణు భక్తుడైన విప్రుల వంశమందు జనించి చతుర్వేదాధ్యాయియై సుదక్షిణములైన యజ్ఞములను జేసి విష్ణుభక్తి యోగముపూని మోక్షమందుదురు.

భుక్తి ముక్తులను సమకూర్చు గుడివా యాత్రాఫలము మీకు చక్కగ వినిపించితిని. ఓ విప్రులార! మరి ఏమి వినవలతురు? అనతిండు" (67)

విష్ణులోక వర్ణనము

విష్ణు లోక ప్రమాణము అచటి భోగములు కాంతి బలముల గురించి మాకు తెల్పుము అని మునులు అడిగిరి. ఏ ధర్మా చరణము వలన విష్ణులోకము లభించునో తెల్పుము అన బ్రహ్మ ఇట్లు అనియె.

"విష్ణులోకము సంసార నాశకము. సర్వాశ్చర్య స్థానము. అశోకాది సర్వవృక్ష సంకులము. కల్పవృక్ష స్థానము. సర్వర్తు పుష్ప ఫలసుందరము. పద్మములు కలువలు నానా విధ జలపక్షులు గల దిగుడు బావులు, సరస్సులు అందు గలవు. కామగములైన బంగారు విమానములపై వేల్పులు విహరింతురు. అవి వాయువు కంటె మనస్సు కంటె మించిన వేగముగలవి. పరమ సుందరులైన దేవతాస్త్రీలు అటకేగిన పుణ్యాత్ములను చుట్టుకొని వారికి ఛత్ర చామరములుపట్టి సంగీత నృత్యాదులచే ఆనందింపచేయుదురు.

దక్షిణ సముద్ర తీరమున పెద్దమఱ్ఱిచెట్టు దగ్గరగల కృష్ణభగవానుడు అప్సరసలతో దర్శన మిచ్చును. కృష్ణసారూప్యము నందిన కృష్ణ భక్త బృందము విష్ణు పురమునందు దర్శనమిత్తురు.

మేలిమి బంగారము రంగుగల్గి అనేక రత్నభూషితమై బహుపతాక సమలంకృతమై, బంగారు ప్రాకారముచేత చుట్టుకొని యోజన విస్తారమైన హరి మందిరము ఆ విష్ణు పురమధ్య మందు భాసిల్లుచుండును. చుక్కల నడుమనున్న శరశ్చంద్రునివలె అది ప్రకాశించు చుండును. కంచుకధారులైన ద్వారపాలకులు ఆ పురమునకు గల నాలుగు ద్వారములకు రక్ష ఇచ్చుచుందురు. ఆ లోపల స్వర్ణమయము. మరకత మణిమయము ఇంద్ర నీలము మహానీలము పద్మరాగ మణిమయము వజ్రమయము వైడూర్య మయము అయిన ఏడు పురములు వైకుంఠ లోకములో ఉన్నవి. అందలి స్తంభములు రత్న మయములు. పగడపు కర్రతో తయారుచేసినవి. అచట మహా సిద్ధులు తమ తేజస్సుచేత దశ దిశలను వెల్గింతురు. వారి నడుమ నక్షత్రముల నడుమనున్న పున్నమి చంద్రునివలె మేఘశ్యాముడు, పీతాంబరధారి, శ్రీవత్సాంకితుడు అయిన శ్రీహరి శ్రీదేవితో ప్రకాశించు చుండును. ఆయన కుడిచేతిలో సుదర్శన చక్రము ఎడమచేత అచ్చము తెల్లనైన శంఖము విలసిల్లుచుండును. ఆశంఖము వేయిసుడులు గలది. పాంచజన్యమను పేరుగలది. ఆ శంఖనాదమున సకల జనము సంక్షోభించును. ఆయన యొక్క కుడిచేతిలో దైత్య దానవ నాశకము, జ్వలదగ్ని ప్రకాశము, సర్వపాప వినాశకము అయిన కౌమోదకి అను గద రాణించుచుండును. ఎడమ చేత సూర్యునట్లు వెల్గు శార్ఙమను ధనువు అగ్నిజ్వాలలను చిమ్ము బాణములను దీపించు చుండును. ఆ స్వామి సర్వలోక సృష్టి స్థితి సంహారకుడు సర్వశాస్త్ర నిపుణుడు.

సర్వ జగద్గురువు. సహస్రశీర్షుడు. సహస్రపాదుడు. ఆ ప్రభువు సింహాసనమందు ఆసీనుడై ఉండును. ఆయన కనులు తామర రేకులు. ఆయన మేని తళుకు మెఱపుతీగ సొంపులొలుకు చుండును. సురసిద్ధ గంధర్వాదులతో, మునులతో, సురవరులతో ఇంకను సురాసుర ప్రభువు లందరితో పేరోలగముండి వారుచేయు స్తుతుల అవధరించుచుండును. అచట క్రీర్తి మొదలుకొని మాయ వఱకుగల ఆయాశక్త్యధిష్టాన దేవతలు ఆయన భవనమున కొలువు చేయుచుందురు. ఘృతాచి మొదలు నవగర్భ వరకుగల అప్సరసలు రూప యౌవన శాలినులు స్వామి పేరోలగమునందు ఆడుచు పాడుచు హరిని సేవించు చుందురు. అటగలవారికి రోగము, నీరసము, మృత్యువు, యెండ, చలి, ఆకలి, దప్పిక, దుఃఖము విరూపము కలుగవు. విష్ణుభువనము పరమానంద జనకము. సర్వాభీష్ట ప్రదము. పుణ్యులు పొందు ఉత్తమలోకములు అన్నియు విష్ణు లోకముయొక్క పదునాఱవ కళకు కూడ సరితూగవు. ఇట్టి పుణ్య లోకమునకు నాస్తికులు, విషయలంపటులు, కృతఘ్నులు, పిసినారులు, దొంగలు, అజితేంద్రియులు చేరలేరు. విష్ణుభక్తులై దక్షిణ సముద్ర తీరమందలి క్షేత్రమును సేవించి సుభద్రా రామకృష్ణుల అర్చించిన ధన్యులే పొందగలరు. పురుషోత్తమ క్షేత్రమందు కల్ప వటవృక్ష సముద్ర మధ్యమందు మరణించినవారు ఈ పరమోత్తమ స్థానమునకు ఏగుదురు. సనాతనము సర్వానం దకరము. భుక్తిముక్తి ప్రదము అయిన హరి లోకమును గురించి మీకు తెలిపితిని. (68)

పురుషోత్తమ క్షేత్ర మాహాత్మ్యము

మునులు ఇట్లు అనిరి – స్వామి! అద్భుతమయిన క్షేత్ర ప్రశంస తమ వలన వింటిమి. చాలా ఆశ్చర్యమైనది. తాము చెప్పినది ముమ్మాటికిని సత్యము. సర్వేశ్వరుడయిన విష్ణువు సర్వ దేవోత్తముడైనట్లే పురుషోత్తమ దేవుని పుణ్యతీర్థము సర్వతీర్థ రాజము. వసువులలో అగ్ని మొదలుకొని సిద్ధులలో కపిలునివరకు మూలమున చెప్పబడిన ఆయాపుణ్య పదార్థములందు పరమోత్తమ మైన పదార్థము సంసారతారకమైన ధర్మముదాక ఈ మహాక్షేత్రము సర్వశ్రేష్ఠము. ఈ విశేషములెల్ల పారాయణార్హములు, సుబోధకములు పుణ్యప్రదము అని బ్రహ్మ మునులతో చెప్పెను. (69)

అనంతవాసుదేవ మాహాత్మ్యము

ఋషులు ఇట్లు అనిరి – "భగవంతుని కథలను ఎంత విన్నను మాకు తృప్తి కలుగుట లేదు. అనంత వాసు దేవుని మహిమను తాము వర్ణించినారు. కాని అందలి రహస్యమును విస్తరించి పలుకుడు అన బ్రహ్మ ఇట్లు అనియె.

మునిశ్రేష్ఠులార! పరమసారమైన అనంత వాసుదేవుని మహిమ భూలోకవాసుల కందనిది. ఆది కల్పమందు అవ్యక్త జన్ముండనగు నేను దేవశిల్పి, శ్రేష్ఠుడు, విశ్వకర్మలందరికి అగ్రేసరుడయిన పనివాడు అగు విశ్వకర్మను పిలిచి వాసుదేవుని ప్రతిమను శిలామయమైన దానిని జేయుమ్ము. దానిని దర్శించి ఇంద్రాది దేవతలు మనుష్యాది భూలోకవాసులు దానవులవలన, రాక్షసులవలన కలుగు భయము తొలగి స్వర్గమును పొంది, సుమేరు శిఖరమందు ఎల్లకాలము ఆ వాసుదేవుని ఆరాధించుచు ఏ అడ్డును లేక నివశింపగలరు అని ఆదేశించితిని.

ఇట్లు నేను తెలుప విని విశ్వకర్మ క్షణము పురుషోత్తముని యొక్క ప్రతిమను తయారు చేసెను. శంఖ చక్ర గదలంగొని శ్రీవత్సచిహ్నము వనమాలయు ధరించి తెల్లతామర పూవులట్టి నేత్రములు గల్గి, కిరీటము భుజకీర్తులు ధరించి పీతాంబరము కట్టుకొని మణి కుండలము మెరయ శోభించు అందమగు విగ్రహమును నిర్మింపజేసి రహస్య మంత్రములచే నేనే ఒక పుణ్య లగ్నమందు ప్రతిష్ఠ చేసితిని. ఆ సుముహూర్తమునకు దేవరాజు ఇంద్రుడు వేల్పులతో గూడి ఐరావత మెక్కి బ్రహ్మ సదనమునకు ఏగి, స్నానదానాదులు ఒనరించి ఆ విగ్రహమును మఱిమఱి పూజించి తన నగరమునకు తిరిగి వచ్చెను. అచట ఆ విగ్రహమును అర్చించి త్రికరణములను నియమించుకొని వృత్రుడు, నముచి మొదలుగా గల అసురులను చంపి ముల్లోకములను పాలించెను.

రెండవ త్రేతాయుగము రాగా మహావీర్యుడు రావణుడు పుట్టెను. పదివేలేండ్లు నిరాహారియై జితేంద్రియుడై అసాధ్యమైన ఉగ్రతపములను చేసెను. దానిచే నేను సంతుష్టుడనై దేవతలకు, దైత్యులకు, నాగులకు, రాక్షసులకును నీవు అవధ్యుడవగుదువని వరమిచ్చితిని. యమ కింకరులకు కూడ వాడు అవధ్యుడయ్యెను. వాని కొడుకు ఇంద్రజిత్తు మేఘనాథుడను పేరొంది ఇంద్రుని గెల్చి స్వర్గ రాజ్యమును వడసెను. రావణుడు అమరావతిని స్వాధీనము చేసుకొని ఇంద్రగృహమందు వాసుదేవ మూర్తిని ఇంతకుమున్ను వర్ణించిన ఆకృతిని దర్శించెను. అంతట నట గెల్చుకొన్న రత్నములను (శ్రేష్ఠములగు సామాగ్రిని)వదలి వేసి ఆ వాసుదేవ విగ్రహమును విమానముమీద లంకకు గొని తెచ్చెను.

అప్పుడు మంత్రియు నగరాధ్యక్షుడు అయి యున్న విభీషణుడు ధర్మమూర్తి గావునను నారాయణ భక్తిపరాయణుడయినందున ఇంద్ర భవనమునుండి దిగివచ్చిన ఆ విష్ణు విగ్రహముం గని మేను పులకరించి అచ్చెరువంది తలవంచి నమస్కరించి సంతుష్టాంత రంగుడై ఇప్పుడు నా జన్మము ధన్యమయ్యె. ఇప్పుడు నాతపస్సు ఫలించినది అని మఱి

మఱి మ్రొక్కి, పెద్దన్నయగు రావణుని కడకేగి దోసిలొగ్గి ప్రభూ! ఈ ప్రతిమను నాకు ప్రసాదింపుము. దీని నారాధించి సంసార సముద్రమును దాటెదను అన దశాననుడు తీసికొనుము ఇదిగో విగ్రహము. దీనితో నేనేమి చేయుదును. సర్వభూత కారణుడగు బ్రహ్మనారాధించి ముల్లోక విజయమును అందితిని అని పలికెను.

విభీషణుడు ఆశ్చర్యము కల్గించు ఆ మూర్తిని గ్రహించి నూట ఎనిమిదేండ్లు పూజించి జరామరణములు లేని స్థితిని (చిరంజీవిత్వమును) అణిమాది విభూతులను పొంది లంకా రాజ్యాధిపతియై అభీష్ట భోగములను అనుభవించుచున్నాడు. అనవిని మనులు అహో! చాల ఆశ్చర్యకరమైన కథ వింటిమి. ఆ అనంత వాసుదేవ ప్రభావము ఇంకను విస్తరముగ తెలుపుము అన బ్రహ్మ ఇట్లు అనియె.

అయ్యెడ నా రాక్షసుడు దశకంఠుడు దేవ, గంధర్వ, కిన్నరులను ఓడించి లోక పాలుర అవనీపాలురు, తపస్వులను, సిద్ధులను గెలిచి వారి ఇల్లాండ్ర కొని తెచ్చి తన రాజధాని యందు లంకలో ఉంచి, సీతాదేవి యెడ మోహవివశుడై బంగారు లేడిరూపు ధరించిన (మారీచు)నితో బయలుదేరి సీతను అపహరించెను. అంత కోపించిన రాముడు లక్ష్మణునితో గూడి యుద్ధమునందు రావణుని చంపుటకై తొలుత వాలిని జంపి, సుగ్రీవుని వానర రాజ్యమందు అభిషిక్తుని గావించెను. అంగదుని యువరాజుగా చేసెను. హనుమ దాది కపివీరులతో కొండలను పడవైచి సముద్రమునకు సేతువును గట్టి సేనలతో వారధి దాటి, అనుపమమైన రణమొనరించి ప్రహస్త నికుంభ కుంభకర్ణాదులతో ఇంద్రజిత్తును చంపి రావణుని పరిమార్చి అగ్ని శోధనము చేసి జానకిని గ్రహించి విభీషణునికి లంకా రాజ్య మొసంగి అక్కడనున్న వాసుదేవమూర్తిని గొని పుష్పక మెక్కి అవలీలగ లీలామానుష మూర్తి రామచంద్రమూర్తి అయోధ్య కేతెంచి భక్తవత్సలుండు, రామచంద్ర ప్రభువు భక్తి భరితుడిం తమ్ముని భరతుని పినతమ్ముని, శత్రుఘ్నుని సర్వసామ్రాజ్యాధి నేతలట్లు గౌరవించి సనాతన వాసుదేవమూర్తిని ఆరాధించి పదునొకండు వేలేండ్లు అయోధ్యను పాలించి ఆ విష్ణు విగ్రహమును సముద్రునికి ప్రసాదించెను. అట్లొసంగుచు ఓ వారధీ! నీవు ధన్యుడవు. ఈ మూర్తిరక్షణము నీ పని. నీవు సర్వరత్న నిధివి అనెను.

ఇంకను ద్వాపర యుగమందు జగన్నాథుడు హరి, భూదేవి ప్రార్థనచే ఆమెకు కల్గిన భావ వైకల్యమును వారింప వసుదేవు కులమునందు అవతరింపగా సర్వాభీష్ట ప్రద మగు ఈ విగ్రహమును సర్వలోక క్షేమము కొఱకు మరి కారణాంతరమునను 'పురుషోత్త మము' అను పుణ్యక్షేత్రమందు సముద్రుడు నీళ్ళనుండి తానుగా ఈ మూర్తిని పైకి లేవనెత్తెను.

అప్పటినుండి ముక్తిదమయిన ఆ క్షేత్రమున ఈ మూర్తి వెలసియున్నది. భక్తితో ఈ సర్వేశ్వరుని త్రికరణములను నిగ్రహించి ఆరాధించు భక్తులు పరమపదమందుదురు. ఈ అనంత వాసుదేవుని ఒక్కమారేని దర్శించి నమస్కరించిన, అతడు దశాశ్వమేధ రాజసూయ ఫలమందును. ఆ మీద కామగ విమానమెక్కి సూర్య సమాన వర్చస్సుతో చిటి గంటలు మ్రోయ, ఆనందభరితుడై విష్ణు లోక మేగును. ఇరువది యొక్క తరముల వారిని ఉద్ధరింపగలడు. ప్రళయ పర్యంతము అచట అనంత భోగములను అనుభవించి పుణ్యానుభవమయిన తరువాత ఈ యవని కేతెంచి చతుర్వేదవిదుడై వైష్ణవ యోగమున మోక్షమును బొందును. అనంత వాసుదేవుని మహిమ ఇది. నేను కీర్తించితిని. ఓ మునివరులారా! వందల ఏండ్లు వర్ణించినను, ఇది తుదముట్ట స్తుతింప శక్యముగాదు. (176)

పురుషోత్తమ క్షేత్ర మాహాత్మ్య వర్ణనము

బ్రహ్మ ఇట్లు అనియె - ఇట్లు నేను అనంతమహిమగల పురుషోత్తమ క్షేత్ర మహిమయు భుక్తిముక్తులను, ఇచ్చునని తెల్పితిని. అచ్చట కృష్ణుని సంకర్షణుని సుభద్రను దర్శించినవారు ధన్యులు, ముక్తులును సమంత్రకముగా ఒసంగిన హవిస్సు అగ్నిని పొంది నట్లు కృష్ణుని రాత్రులందు ఉషఃకాలమునందు చేయు ధ్యానము వలన భక్తులు దేహము విడిచి కృష్ణుని పొందుదురు. శయనము నుండి లేవగానే కమలాక్షుని హరిని బలరాముని సుభద్రను తలచుకొనువారు విష్ణుసాలోక్యమందుదురు. వర్షఋతువు నాల్గు మాసములు ఆ పురుషోత్తమ క్షేత్ర నివాసము చేయువారు భూమినిగల సర్వ తీర్థములు సేవించిన ఫలము పొందురు. ఇంద్రియ నిగ్రహముచేసి కోపము జయించి ఎల్లపుడు అచట వసించువారు తపఃఫలమును పొందుదురు.

అన్య తీర్థములందు పదివేలేండ్లు చేసిన తపస్సు యొక్క ఫలము పురుషోత్తమ క్షేత్రమున ఒక్క మాసము ఆచరించిన లభించును. బ్రహ్మచర్యాదులచే నిస్సంగులై చేయు పుణ్యమిచ్చట సేవించిన కల్గును. ఇది సర్వయజ్ఞ ఫలప్రదము. ఇచట దేహము విడిచిన ముక్తి కల్గును. మఱ్ఱి వృక్షమునకు సాగరమునకును నడుమ మేనువిడిచిన ముక్తి సిద్ధముగా లభించును. క్రిమికీటకాదులు పశుపక్షులు ఇక్కడ శరీరము విడిచిన పరమ గతినందును. అన్యతీర్థముల వెంట తిరుగవలెననుకొనుట వట్టి భ్రాంతి. పురుషోత్తమదర్శన మొనరించిన వాడు పురుషోత్తముడగును. అతడు ప్రకృతికి అతీతుడు. వేదపురాణము లందుచేతనే హరి పురుషోత్తముడని కీర్తించెను. దారిలో, శ్మశానములో, గృహమున, మఱియెచ్చటనైనను, శ్రీపురుషోత్తమ క్షేత్రమున ఇష్టమున్నను లేకున్నను దేహమును వీడిన మనుజుడు మోక్షమంది తీరును.

అందువలన మోక్షకాంక్షులు పురుషోత్తమ క్షేత్రమున దేహము త్యాగము చేయ యత్నింపవలెను. పురుషోత్తమ మాహాత్మ్యమును మించినది కలుగదు, కలుగబోదు. క్షేత్ర గుణ సంపదలో కొంతను మాత్రమే నేను చెప్పితిని. సమగ్రముగా తెలుప సాధ్యపడదు. ఓ మునులారా! మీరు మోక్షార్థులైన యెడల ఆ పుణ్య క్షేత్రమందు వసింపుడు అని ముసులతో వ్యాసుడు పలికెను. బ్రహ్మ వచన మాలించి ఆ మునులు ఆ క్షేత్రమందు వసించి పరమపదమందిరి. (177)

కండూపాఖ్యానమ్

వ్యాసులు ఇట్లు అనిరి - ఓ మునీశ్వరులారా! సర్వజీవి సుఖకరమైనది సర్వ పురుషార్థములు ఇచ్చునదియు నైన ఆపురుషోత్తమ క్షేత్రమున 'కండువు' అను ఒక ఋషి పరమ ధర్మాత్ముడు, తేజస్వి, సత్యవాది, శుచి ఇంద్రియముల నిగ్రహించినవాడు సర్వభూత హితవు కోరువాడు క్రోధము లేనివాడు వేదవేదాంగ పారంగతుడునై వసించుచుండెను. అతడు పురుషోత్తముని ఆరాధించి పరమ సిద్ధి నందెను. అట్టివారే మఱిపెక్కుమంది మునులు అతనివలె ముక్తి నందిరి అని చెప్పగా మునులు ఈ కండువెవరు? అచట పరమగతిని ఎట్లందెను. ఆ చరిత్ర వినవలతుమన వ్యాసులు ఇట్లనిరి.

మునులార! ఇదె వినుడు. పవిత్రమైన గోమతీనదీ తీరమందు కందమూల ఫల సమృద్ధము సమిత్పుష్ప కుశ సంపూర్ణము అయిన పుణ్యాశ్రమమ్ము కలదు. అది కండుముని నివాసము. అది సర్వర్తు ఫలపుష్ప శోభితము. అందాయన యమ నియమాదులతో మౌనముతో తపమాచరించుచుండెను. గ్రీష్మ ఋతువున, పంచాగ్ని మధ్యమున, వర్షా కాలమున ఆవరణము లేని ప్రదేశమున తడి బట్టలతో ప్రదేశమున చలికాలములో మహాతప మాచరించెను. అదిచూచి ఈయన తపస్సు వేడిమికి భూమి అంతరిక్షము స్వర్గముకూడ ఉడుకెత్తినవి. ఆహా! ఈయన ధైర్యమేమి? ఈ తపస్సేమి? అని దేవతలు వెరగంది యందరు నాయన తపము భంగము గావింతమని నిశ్చయించిరి. వారి తల పెఱింగి ఇంద్రుడు ప్రమ్లోచయను అప్సరసను పరమసుందరినిజూచి భామినీ! కండుముని తపమాచరించు తావునకు ఇప్పుడు చనుము. ఆతని తపము చెరచి క్షోభింప జేయుమనియె. ఆమె ప్రభూ! నీయాజ్ఞ తప్పక చేసెదను కాని ఇక్కడ నాకు జీవిత సంశయము ఏర్పడినది. బ్రహ్మచర్యనిష్ఠుడగు ఆమునిని మహోగ్ర తపస్విని అగ్ని సూర్యులట్లు వెలుగు వానినిగ నెఱిగిన దానను గావున జడియుచున్నాను. అతడు దుస్సహమయిన శాపమీయ గలడు. ఏలినవారియానతో ఊర్వశ్యాదులెందరో యప్సరసలున్నారు. వారు సుందరులు, నెఱ జాణలు. ఎవ్వనినేని మోహింపజేయగల నేర్పరులు. వారిని ఆ పనిలో నియోగింపుమనెను.

ఆమె మాటవిని ఇంద్రుడు – "ఎందరో ఉందురుగాక! ఇక్కడ నీవే నేర్పరివి. నీకు మన్మథుని, వసంతుని, వాయువును కూడ తోడొసంగెదను. నీవేగుమన నా ప్రమ్లోచ ఆకాశమున, ఆ ముని ఆశ్రమమునకు వెళ్ళి, అచ్చట ఒక సుందర వనమీక్షించెను. అందు ఆశ్రమమ్మందున్న అమ్మునిని చూచెను. ఆ ఆశ్రమ సమీపమునందలి ఆవనము యొక్క శోభ నిరుపమానము, సర్వపుష్ప ఫలభరితము సర్వర్తుశోభనము. అందలి పాపురములు కోవెలలయొక్క కలకూజితములు శ్రవణ మనోహరములు. ఆ విశాలనయన ఆయందమును చేరి పాఅజూచి ఆమధుర నాదములు విని ప్రసన్న సలిలములైన కొలనులను చూచి వసంతాదులతో మీరందఱు నాకు తోడ్పుడుడని హెచ్చరించెను.

ఇట్లని వారిచే ఔననిపించుకొని ఇప్పుడు ఆ మునిచెంత కేగెదను. శరీర రథమును ఇంద్రియములను గుఱ్ఱములచే నిగ్రహించిన ఆతని పూవిలుతుని వాడి అమ్ములచే పగ్గముల బిగువు సడలంజేసి చేతగాని సారథినిగలవానిబోలె చేసెదను. బ్రహ్మ జనార్దనుడు శివుడయినను అగుగాక ఈక్షణములో కామబాణక్షతుని గావించెదను అని ఆముని ప్రశాంత ఆశ్రమందు నిలిచి అల్లల్లన సంగీతము పాడ నారంభించెను. అంతట వసంతుడు తన బలగమును గూర్చికొని అకాలిక మధుర కోకిలారావము మేళవింపజేసెను. గంధ వహుడు (వాయువు) మలయాద్రి నుండి అల్లల్లన వీవందొడంగెను. అంతేకాక ఆవన సీమ నాల్గు దిక్కుల చెట్లును పూవులను జలజల రాల్చెను. మదనుడు పూవుటమ్ములచేత అముని మనస్సును కలగుండుపరచెను. అంత కండువా సంగీత ధ్వని నాలకించి వింతగొని ఆ అప్సరోరత్నమన్న తావునకేగి ఆ సొగసులాడి సోయగమున కచ్చెరువడి తేఱిపాఅ జూచి పైవలువజార మేను గగుర్పొడవ మది చెదరి అల్లన ఇట్లు పలుకరించె. ఓ సుందరి! నీవెటనుండు దానవు ఎవరిదానవు? నామనసు చూరగొనుచున్నావు. నిజము తెల్పుమన ఆమె నీ దాస్యము చేసెదను. పూవులకొఱకు వచ్చితిని. నావలన పనిగొనుము. నీ ఆజ్ఞను ఇప్పుడు నిర్వహింతును అని పలుకగా విని ముని మోహముగొని ధైర్యమెడలి ఆమె చేతబట్టుకొని తన ఆశ్రమమున ప్రవేశించెను. అవ్వల పువ్విలుకాడు, వాయువు, వసంతుడు ఇట్లు తమపని చక్కవెట్టికొని వచ్చినదారిన అమరపురికి అరిగిరి. ఆతని యొక్కయు ఆమె యొక్కయు సమావేశ వృత్తాంతము ఇంద్రునకు ఎరింగించిరి. సురపతియు సురలు అదివిని ప్రీతిచెందిరి.

కండుముని ఆ వనితతో ఆశ్రమమందు ప్రవేశించి, మనోహర రూపము నిండు జవ్వనమున తనకు సంతరించుకొనియె. దివ్య వస్త్రములు దివ్యాభరణములును తాల్చి పదునా లేండ్ల ఈడున నున్న ఆ మందయాననుగాంచి కేవల తపశ్శక్తిచే దివ్య కుసుమ

మాలలు తాల్చి సుగంధము బూసికొని సర్వ భోగసంపన్నుడై అప్పటికప్పుడు తోచిన ఆ తపస్వి ప్రభావముంగని అచ్చెరువుపడి యవ్వేల్పుపడతి, ఓహో! ఈయన తపస్సు ఈయన వీర్యము అద్భుతమని కడుంగడు సంబరపడెను. స్నాన సంధ్యలు, జపము, హోమము, బ్రహ్మ యజ్ఞము, దేవతార్చనము, ధ్యానము, వ్రతోపవాస నియమములను వదలి ఆ అప్సరా శిరోమణితో, రేయింబవళ్ళు మదనవశుడై క్రీడించెను. తపస్సు క్షయమైనదని కూడ గుర్తింపడయ్యె. విషయలంపటుడై పగలు రాత్రి సంధ్య పక్షమాస ఋతు సంవత్సరములు ఏవోకూడ తెలియక, ఆమె వలపునంబడెను. అక్కాంతయు పంచబాణ బాణనిహతయై ఏకాంతమున నింపు ఇంపు పలుకుల ఉపలాలించుచు అతనిగోరి రమించెను. ఇట్లా మౌని గ్రామ్య సుఖము మఱగి వందయేండ్లా సుందరితో మందరగిరి కందరమునందుండెను. అంతనది అమ్మాహానుభావునిగని నేను స్వర్గమునకేగెద. ప్రసన్నముఖుడవై ఓ బ్రహ్మణ్యమూర్తీ అనుజ్ఞ దయసేయుమనియె. ఆతడామెయెడ సడలని వలపుగొని కల్యాణి! కొన్ని దినములుండుమనియె. అట్లయని ఆ వేల్పుపడతి నూరేండ్లకు మించి ఆతని తోడి పొందుగొని ఇంపొందెను. ఆ మీద మఱల అనుమతింపుమనియె. కాదుకాదు నిలునిలుము అన మరి వందసంవత్సరము లేగె. ఎడనెడ ఇట్లు ఆవిడ అడుగుటయు ఆముని వలపుగొని వలదనుటయుంగా జరుగుచుండ, నాతని శాపమున కడలి యాదేవకామిని ఇంచుక తక్కువగా రెండువందలేండ్లు ప్రణయ భంగమువలన గలుగు బాధ నెఱింగినది కావున ఆతని వదలిపోదయ్యెను. ఆ పరమ మహర్షి దానితో రేయింబవళ్లు రమించుచున్న కొలది ప్రేయ యెప్పటికప్పుడు గ్రొత్తదికాజొచ్చెను. ఒక్కతఱి నాతడు తత్తరముగొని ఆట్లు విడిచి చనుచుండ ఆ సురకాంత ఎచటికేగుచున్నారన కల్యాణి తెల్లవారినది. సంధ్య వార్చెదను. కాదేని అనుష్ఠానలోప మగునన అల్లననవ్వి అమ్మహామునినిగని ఓధర్మజ్ఞ! ఇప్పుడా నీకు తెల్లవారుట అనుష్ఠానమెప్పుడో గతించినది. ఇమ్మాట ఎవనికి వింతగొలువదు? అనగా ఆముని ఈ ఉదయమే నీవీ నదీతీరమునకు వచ్చితివి. నాకు కనబడితివి. నా ఆశ్రమమును జొచ్చితివి. సంధ్యా సమయమైనది. ప్రొద్దెక్కినది ఎందుకు పరియాచకము లాడెదవు? ఉన్నదున్నట్లు పలుకుము. అనవిని ప్రమ్లోచ నేను వేకువవేళ వచ్చిన మాట ఓ బ్రాహ్మణ్యా నిజమే. నేను అబద్ధమాడుట లేదు. కాని ఇప్పుడా కాలము కొన్ని వందవేండ్లు గడచిపోయినదనియె. అంతట నా విప్రుడు వెఱపుగొని యామెంగని నీతో నేను క్రీడించిన కాలమెంతో నిజము చెప్పుము, జడియకుము. పరిహాసమా? యన తొమ్మిది వందలేండ్ల ఆరుమాసాల మూడు రోజుల యినది. అబద్ధమాడను, బ్రహ్మణ్యుడవగు నీ సన్నిధినా అబద్ధము లాడుట దారి

యించుకయు దప్పని మహానుభావులగు తమరడుగుచుండ అనృతమెట్లు పలుకగలను అనదాని పలుకు ఆలించ్చి ఆముని ఛీఛీ ఎంత అనాచార మెంత అపచారము గావించితిని? అని తనను దానిని నిందించుకొని నా తపస్సునెల్ల నీటగలిసినది. బ్రహ్మవేత్తల ధనమెల్ల చెఱచినట్లయినది. నావివేక మెవ్వడో కాజేసినట్లయినది. ఈ ఆడుది నన్ను మోహపెట్టుటకు పుట్టింపబడినది. షెడూర్ములు (1.బుభుక్ష, 2.తృష్ణ, 3.శోకము, 4.మోహము, 5.జర, 6.మరణము) కు అవ్వలిదా బ్రహ్మ వస్తువు ఆత్మ నిగ్రహముచే నెఱుగ వలసినది. ఛీఛీ ఆకామమహాగ్రహము నన్ను పట్టుకొని నాకీగతి తెచ్చిపెట్టినది. నా వ్రతములు సర్వ వేదములు మఱియెల్ల ఉత్తమ కారణములు, నరక గ్రామమునకు మార్గమైన కామముచే నిహతములయినవి. అని ఇట్లు తన్ను తాను నిందించుకొని ఆ ధర్మజ్ఞుడు తనముందు గూర్చున్న ఆ అప్సరసను జూచి ఇట్లనియె.

పొమ్ము ఓ పాపాత్మురాల! నీ హావభావములచే నామదిని కలచి ఇంద్రునికై చేయ వలసిన దంతయును జేసితివి. సత్పురుషులతోడి మైత్రి సాప్తపదము (అనగా ఏడడుగులు కలిసి వేయుట లేక యేడుమాటలు మాటలాడు కొనుటవలన నేర్పడునది) కావున నీతో గలిసి కొన్నాళ్లుంటిని గావున నిన్ను భస్మము చేయను. అదిగాక ఇందు నీ తప్పిదమేమున్నది! నీకేదైన శాస్తిచేయుటకు, ఇంద్రియ నిగ్రహము లేనివాడనగుట నీ తప్పు నాదే. సురపతి ప్రీతికొరకైన నీ వాలుచూపును సమ్మోహన మంత్రముచే నేను ఈయపకరమునకు గుఱి యైతిని. అని ఇట్లా బ్రహ్మర్షి ఆ రమణితో అనిన అంతట అది ముచ్చెమటలుపోసి ఒడ లెల్ల తడియ నెదనెద వణకుచున్న ఆ వేల్పుపడతింగని పోపొమ్మని అమ్మని అలుకగొని జడిపింపనది అయ్యాశ్రమము వెడలి ఆకసమువెంట ఏగుచు ఆచెట్ల చిగుళ్లను జెమట దుడిచికొనియె. అట్లు చెట్టునుండి చెట్టున కడుగు వెట్టుచు, ఆ చిన్నది ఎర్రయెఱ్ఱని క్రొత్త చిగురుటాకులందు చెమట తడులొత్తుకొనుచున్నంత అయ్యింతికి పులకలయ్యె. అప్పుడు పులకలతో పాటు ఆమె మేనువెడలి స్వేద రూపమున గర్భము కలిలమయి జాల్వారెను. దానిని వృక్షములు చేకొనియె. వాయువద్దానిని ఏకము చేసెను. అమృతాంశుడు తన కిరణముల దానికాప్యాయ మొనరింప అల్లల్లన అది దినదినాభివృద్ధి నొందెను. ఆ గర్భమే మారిషయను పేర వృక్షములకు కన్య అయ్యెను. ఆమె ప్రాచేతసుల భార్య దక్షునికి తల్లి.

ఆ కండుముని తనను క్షమించుటకు పురుషోత్తమము అను ఆ విష్ణు క్షేత్రమున వెళ్ళెను. ముక్తిదము దుర్లభమునై దక్షిణ సముద్ర తీరమందున్న సర్వకామదమయిన ఆ దివ్య క్షేత్రమును దర్శించెను. భృగ్వాది మునులు నిరంతరము సేవించు ఆ వైకుంఠా యతనమునుగని సర్వ దేవతలు కొలువ నింపుగులుకు హరిని పురుషోత్తము, వైకుంఠుని

దర్శించి కృతార్థుడనైతి అనుకొనియె. మఱియు ఏకాగ్రచిత్తుడై ఆస్వామిని ఆరాధించెను. అయోగి ఊర్ధ్వబాహువై అచట నిలువబడి 'బ్రహ్మ పారము' అను మహా మంత్రమును జపించెను అని చెప్పగా వినిమునులు వ్యాసుని చూచి యోమునీ ఆ బ్రహ్మ పారము పరమ శుభమంత్రము కండుముని జపించి విష్ణువును ఆరాధించిన దానిని మేము వినవలెనని కోరుచున్నామన వ్యాస భగవానుడు ఇట్లు ఆనతిచ్చెను.

కండుకృత బ్రహ్మ పారస్తవము

పారంపరం విష్ణురపారపారః పరః పరేభ్యః పరమార్థరూపః ।
సబ్రహ్మాపారః పరపారభూతః పరః పరణామపి పారపారః
సకారణం కారణం సంశ్రితోఽపి తస్యాపి హేతుః పరహేతు హేతుః ।
కార్యోపి చైష సహకర్మకర్తృ .... రూపైరనేకైరవ తీహసర్వమ్ ॥
బ్రహ్మ ప్రభుర్బ్రహ్మ స సర్వభూతో బ్రహ్మ ప్రజానాం పతిరచ్యుతోఽసౌ।
బ్రహ్మోవ్యయం నిత్యమజం స విష్ణు రపక్షయాద్యైరఖిలై రసంగః ॥
బ్రహ్మోక్షరమజం నిత్యం యదాఽసౌ పురుషోత్తమః
తదా రాగాదయో దోషాః ప్రయాంతు ప్రశమం మమ ॥

పారం పరం విష్ణుః = సంసార మార్గమునకు సర్వోత్కృష్టము పునరావృత్తి రహితము అగు అవధి లేక గురుపరంపరచే తెలియదగిన రహస్య వస్తువు శ్రీహరి, అపార పారః = తెలియలేని అంతముగలవాడు లేక అపరిమిత శక్తి గలవాడు, పరేభ్యః పరః = ఉత్కృష్టముగా ఎంచబడు ఆకాశాదులకంటె గొప్పవాడు, (మహతో మహీయాన్), పరమాత్మ రూపః = పరబ్రహ్మ రూపుడు. బ్రహ్మపారః=బ్రహ్మ ఉద్భూతమగు ప్రధానమునకు అవసాన మైన వాడు లేక సబ్రహ్మపారః = వేదములు తపస్సులతో కూడికొనినవారు సబ్రహ్మలు. అట్టివారికి గంత వ్యుడు, పరపారభూతః =ఆత్మేతరమగు అనాత్మ ప్రపంచమునకు అవధి యైనవాడు పరాణా మపి పరః = ఆత్మగా ప్రతీయ మానములు అగుచున్న ఇంద్రియాదులకు అతీతుడు, పార పారః =పూరకములు, పోషకములు అయిన ఆకాశాదులకు లేక ఇంద్రా దులకు కూడ పూరకుడు పోషకుడు అయినవాడు.

ఆ విష్ణువు అన్నిటికి కారణము. సమస్త కార్యములకు కారణమైన విపంచ మహా భూతములు తన్మాత్రలు వానికి కూడ కారణమైనవాడు. అహంకారమునకు మహత్త్వము హేతువు. దానికికూడ హేతువైన వాడు అనగా ఉపాదాన కారణభూతుడు. ఆతడే క్రియా

కారక రూపముతో సమస్తమునకు రక్షకుడునై ఉన్నాడు. ఆతడు వేదనిర్వాహకుడు. ఆతనే వేదము. వేదాంగాదులుకూడ ఆతడే. వేదార్థస్మర్తలగు మనువు మొదలైనవారికి కూడ ప్రభువైన వాడు. అవ్యయుడు నిత్యుడు పుట్టుక లేనివాడు. షడ్భావ వికారములతో సంబంధము లేని వాడు. బ్రహ్మ పుట్టుక లేనివాడు నాశన రహితుడు నిత్యుడునై, అట్లు ఈ పురుషోత్తముడును అట్లే అని స్తుతించుచున్న నా యొక్క రాగద్వేషాదులు శమించుగాక!

అని ఇట్లు ఆముని జపించు బ్రహ్మ పారమునువిని అతని అచంచల భక్తి పారమ్యమును ఎఱిగి పురుషోత్తమస్వామి పరమప్రీతితో భక్తవత్సలుడు కావున అతని దగ్గరకేగి వినతాదుల నందనుడైన గరుడునిపై కూర్చుండి ఇట్లనెను.

"ఓమునీ! నీ మదిని ఉన్న పని తెలుపుము. వరమీయ వచ్చితిని. అడుగులమన కందుముని కనులు తెఱచి ఎదుటనున్న కమలాక్షుని అతసీ కుసుమ సంకాశుని, శంఖ చక్ర గదా హస్తుని, కిరీటాంగదధారిని పీతాంబరుని శ్రీవత్సవక్షుని, వనమాలా భూషితుని, చతుర్బాహువును, దివ్యగంధాను లిప్తుని, దివ్యమాలాభూషితుని, సమున్నత మూర్తిని చూచి వెఱగంది తనువు పులకరింప సాష్టాంగదండప్రణామము ఆచరించెను. మఱియు ఇపుడు నా జన్మ సఫలమైనది. నా తపస్సు ఫలించినదని ఆ మునివరుడు ఇట్లు వినుతింప అరంభించెను.

కండుముని చేసిన పురుషోత్తమ స్తోత్రము :

నారాయణ ! హరే ! కృష్ణ ! శ్రీవత్సాంక ! జగత్పతే !
జగద్బీజ ! జగద్ధామ ! జగత్సాక్షిన్న మోఽస్తుతే ॥
అవ్యక్త! జిష్ణో ! ప్రభవ ! ప్రధాన । పురుషోత్తమ ।
పుండరీకాక్ష । గోవింద । హృషీకేశ ! నమోస్తుతే ॥
హిరణ్యగర్భ ! శ్రీనాథ పద్మనాభ ! సనాతన !
భూగర్భ! ధ్రువ ! ఈశాన ! హృషీకేశ ! నమోస్తుతే ॥
అన్యాద్యంతామృతాజేయ ! జయత్వం జయతాం వర! ।
అజితాఖండ! శ్రీకృష్ణ ! శ్రీనివాస! నమోస్తుతే ॥
పర్జన్య ధర్మకర్తాచ దుష్పార దురధిష్ఠిత ! ।
దుఃఖార్తినాశన ! హరే ! జలశాయిన్నమోఽస్తుతే ॥
భూతపావ్యక్త భూతేశ భైతత్వైరనాకుల । భూతాధివాస ।
భూతాత్మన్భూతగర్భ ! నమోఽస్తుతే ॥

యజ్ఞ! యజ్వన్యజ్ఞధర ! యజ్ఞధాతాఽభయప్రద !
యజ్ఞగర్భ ! హిర్యణ్యాంగ ! పృశ్నిగర్భ ! నమోఽస్తుతే ॥
క్షేత్రజ్ఞః క్షేత్రభృతేక్షత్రీ క్షేతహా క్షేత్రకృద్వశీ !
క్షేత్రాత్మనేక్షేత్రరహిత ! క్షేత్ర స్రష్టే నమోఽస్తుతే ॥
గుణాలయ! గుణావాస ! గుణాశ్రయ! గుణావహ !
గుణభోక్త! గుణారామ ! గుణాత్యాగిన్న మోఽస్తుతే ॥
త్వంవిష్ణుస్త్వంహరిశ్చ క్రీత్వం జిష్ణుస్త్వం జనార్దనః ।
త్వంభూత స్త్వంవషట్కార స్త్వంభవ్య స్త్వంభవత్ప్రభుః ॥
త్వంభూత కృత్త్వమవ్యక్తస్త్వం భవోభూతభృద్భవాన్ !
త్వంభూతభావనో దేవస్త్వామాహుర జమీశ్వరమ్ ॥
త్వమనంతః కృతజ్ఞస్త్వం ప్రకృతి సత్త్వం వృషాకపిః ।
త్వం రుద్రస్త్వం దురాధర్ష స్త్వసత్త్వమమోఘ స్త్వమీశ్వరః ॥
త్వం విశ్వకార్మజిష్ణు స్తంఽత్వంశంభు స్త్వంవృషాకృతిః ।
త్వం శంకర స్త్వముశనాత్వంసత్యం త్వం తపోజనః ॥
త్వం విశ్వజేతాత్వం శర్మత్వం శరణ్య స్త్వమక్షరమ్ ।
త్వంశంభు సస్త్వం స్వయంభూశ్చత్వం జేష్ఠ సత్త్వంపరాయణః ॥
త్వ మాదిత్య సత్త్వమోంకార స్త్వం ప్రాణ స్త్వంతమిస్రహా ।
తం పర్జన్య సస్త్వం ప్రథిత వేధా స్త్వంసురేశ్వరః ॥
త్వ మృగ్యజుః సామ చైవత్వ మాత్మాసంమతోభవాన్ ।
త్వ మగ్ని స్త్వం చపవన స్త్వ మాపోవసుధా భవాన్ ॥
త్వం స్రష్టా త్వం తధా భోక్తా హోతాత్వంచ హవిః క్రతుః।
త్వం ప్రభుస్త్వం విభుః శ్రేష్ఠస్తమ లోక పతిరచ్యుతః ॥
త్వం సర్వదర్శనః శ్రీమాంస్త్వం సర్వదమనో రిహా ।
త్వ మహాస్త్వం తధా రాత్రిస్త్వామాహు ర్వత్సరంబుధాః ॥
త్వంకాల స్త్వంకలా కాష్ఠా త్వం ముహూర్తః ఓణాలవాః ।
త్వంబాల స్త్వంతధా వృద్ధస్త్వం పుమా స్త్రీ నపుంసకః ॥
త్వం విశ్వయోని స్త్వం చక్షు స్త్వం వేదాంగ స్త్వ మవ్యయః ।
త్వం శాశ్వత సత్త్వమజిత స్త్వముపేంద్రస్త్వముత్తమః ॥

త్వం వేదవేద స్త్వం దాతా విధాతాత్వం సమాహితః ।
త్వం సర్వ విశ్వసుఖదస్త్వం వేదాంగం త్వమవ్యయః ॥
త్వం వేదస్త్వంధాతా విధాతా త్వం సమాహితః ।
త్వం జలనిధి రామూలం త్వం ధాతాత్వం పునర్వసుః ॥
త్వం వైద్య స్త్వంధృతాత్మా చ త్వ మతీంద్రియ గోచరః ।
త్వ మగ్రణీ ర్గ్రామణీ స్త్వం త్వం సుపర్ణ స్త్వ మాదిమాన్ ॥
త్వం సంగ్రహ స్త్వం సుమహత్త్వం ధృతాత్మా త్వ మచ్యుతః ।
త్వం యమస్త్వం చ నియమ స్త్వం ప్రాంశు స్త్వం చతుర్భుజః ॥
త్వమే వాన్నాంతరాత్మా త్వం పరమాత్మా త్వ ముచ్యతే ॥
త్వం గురు స్త్వం గురుతమ స్త్వం వామ స్త్వం ప్రదక్షిణః ।
త్వం పిప్పల స్త్వ మగమ స్త్వం వ్యక్త స్త్వం ప్రజాపతి ః ॥
హితణ్యనాభ స్త్వం దేవ స్త్వం శశీ త్వం ప్రజాపతిః ।
అనిర్దేశ్యవపు స్త్వం వైత్వం యమ స్త్వం సురారిహా ॥
త్వం చ సంకర్షణో దేవ స్త్వం కర్తా త్వం సనాతనః ।
త్వం వాసుదేవో ఽమేయాత్మాత్వ మేవ గుణవర్జితః
త్వం జేష్ఠస్త్వం వరిష్ఠత్వం సహిష్ణుశ్చ మాధవః ।
సహస్ర శీర్షా త్వందేవ స్త్వ మవ్యక్తః సహస్రదృక్ ॥
సహస్రపాద స్త్వం దేవ స్త్వం విరాట్త్వం సుప్రభుః ।
త్వమేవ తిష్ఠసే భూయో దేవదేవ దశాంగులః ॥
యద్భూతం తత్త్వమేవోక్తః పురుషః శక్ర ఉత్తమః
యద్భావ్యం త త్త్వ మీశానస్త్వ మృతస్త్వ తథాఽమృతః ॥
త్వత్తోరోహత్యయం లోకోమహీయాం స్త్వ మనుత్తమః ।
త్వం జ్యాయా న్పురుషస్త్వం చ త్వం దేవ దశధాస్థితః
విశ్వభూత శ్చతుర్భాగోనవభాగోఽమృతో దివి ।
నవభాగోఽన్తరిక్షస్థః పౌరుషేయః సనాతనః ॥
భాగద్వయం చ భూసంస్థం చతుర్భాగోఽప్యభూదిహ ।
త్వత్తో యజ్ఞాః సంభవంతి జగతో వృష్టికారణమ్ ॥
త్వత్తో విరాట్సముత్పన్నో జగతో హృది యః పుమాన్ ।
సోఽతిరిచ్యత భూతేభ్య స్తేజసాయళసాశ్రియా ॥

త్వత్తః సురాణా మాహారః పృషదాజ్య మజాయత ।
గ్రామ్యారణ్యా శ్చౌషధయ స్త్వత్తః పశుమృగాదయః ॥
ధ్యేయధ్యాన పర స్త్వం చ కృతవా నసి చౌషధీః ।
త్వం దేవదేవ సప్తాస్య కాలాఖ్యో దీప్తవిగ్రహః ॥
జంగమాజంగమం సర్వం జగదేత చ్చరాచరమ్ ।
త్వత్తః సర్వ మిదం జాతం త్వయి సర్వం ప్రతిష్ఠితమ్ ॥
అనిరుద్ధ స్త్వం మాధవ స్త్వం ప్రద్యుమ్నః సురారిహా ।
దేవ! సర్వసుర శ్రేష్ఠ ! సర్వలోక పరాయణ! ॥
త్రాహి మా మరవిందాక్ష నారాయణ నమోఽస్తుతే ।
నమస్తే భగవన్విష్ణో నమస్తే నమస్తే పురుషోత్తమ ॥
నమస్తే సర్వలోకేశ । నమస్తే కమలాలయ ।
గుణాలయ । నమస్తేఽస్తు గుణాకర ॥
వాసుదేవ ! నమస్తే ఽస్తు నమస్తేఽస్తు సురోత్తమ ।
జనార్దన నమస్తేఽస్తు సనాతన ॥
నమస్తే యోగినాం గమ్య । యోగావాస నమోస్తుఽతే ।
గోపతే । శ్రీపతే । విష్ణో నమస్తేఽస్తు మరుత్పతే ॥
జగత్పతే జగత్పూతే నమస్తే జ్ఞానినాం పతే ।
దివస్పతే నమస్తేఽస్తు మహీపతే ॥
నమస్తే మధుహంత్రే చ నమస్తే పుష్కరేక్షణ ।
కైటభఘ్న నమస్తే ఽస్తు సుబ్రహ్మణ్య నమోస్తుతే ॥
నమోఽస్తు తే మహామీన శ్రుతి పృష్ఠధరాచ్యుత ।
సముద్రసలిలక్షోభ పద్మజాహ్లాద కారిణే ॥
అశ్వశీర్ష మహాఘోణ మహాపురుష విగ్రహ ।
మధుకైటభ హంత్రే చ నమస్తే తురగానన ॥
మహాకమఠ భోగాయ పృథివ్యుద్ధరణాయ చ ।
విధృతాద్రి స్వరూపాయ మహాకూర్మాయ తే నమః ॥
నమో మహావరాహాయ పృథివ్యుద్ధార కారిణే ।
నమశ్చాఽఽది వరాహాయ విశ్వరూపాయ వేధసే ॥

నమోఽనంతాయ సూక్ష్మాయ ముఖ్యాయ చ వరాయ చ ।
పరమాణు స్వరూపాయ యోగిగమ్యాయ తేనమ ః ॥
తస్మైనమో కారణ కారణాయ ।
యోగీంద్ర వృత్తి నిలయాయ సుదుర్విదాయ ॥
క్షీరార్ణవాశ్రిత మహాహిసుతల్పగాయ ।
తుభ్యం నమః కనకరత్న సుకుండలాయ ॥

అని ఇట్లు స్తుతింపబడి సంప్రీతుడై మాధవుడు మునివర! నావలన నీవు కోరునది ఏమో త్వరగ చెప్పుము అనగా కండుముని జగన్నాథా! తలచుకొన్నంత మేను గగుర్పొడుచునట్టి ఈ దాటరాని అనిత్య సంసారమందు బహుదుఃఖకరమై అరటాకువలె పేలవమై నశించు స్వభావముగల నిరాశ్రయము, నిరాలంబము అగు నీటిబుడగ వంటి భయంకర సంసార మున మాయామోహితుడనై తిరుగుచున్నాను. విషయవాసనలచేత చెడిన మనసుతో దీని అంతు దరికాన లేకున్నాను. దీనికి దడిచి ఇపుడు నిన్ను దిక్కంటిని, కృష్ణా! నన్ను ఉద్ధరింపుము 'నీ ప్రసాదమున పునరావృత్తిలేని దుర్లభమైన సనాతన ముక్తిపదమును పొందగోరుచున్నాను' అనగా భగవంతుడు

"ఓ ముని శిరోమణి! నీవు నా భక్తుడవు. నిచ్చలు నన్ను ఆరాధింపుము. నా అనుగ్రహమున నిశ్చలమైన మోక్షమును పొందగలవు. నా భక్తులు ఏకులమువారైనను స్త్రీలైన పరమసిద్ధిని పొందుదురు. నీవు పొందుటలో ఆశ్చర్యమేమి. కుక్క మాంసము తినువాడైనను మిక్కిలి శ్రద్ధగొని నాయెడ భక్తి కలవాడు అభీష్టసిద్ధి పొందును. మఱి ఇతరుల మాట జెప్పనేల?" అని పలికి, భక్తవత్సలుడగు హరి అంతర్ధానము అయ్యెను.

విష్ణువు అట్లు అదృశ్యమైనంతట కండువు మహా ఆనందము పొంది, నిష్కాముడై, స్వస్థచిత్తుడై, ఇంద్రియముల నియమించుకొని అహంకారము వదలి మనస్సు నిలకడగొన నిర్లేపుడు నిర్గుణుడు శాంతుడు, సత్తామాత్రుడునైన పురుషోత్తమదేవుని ధ్యానించి అమర దుర్లభమైన పరమపదమును పొందెను. మహాత్ముడగు కండువు యొక్క కథను ఎవ్వరు చదువుదురో, విందురో వారు పాపములనును విడిచి స్వర్గలోకము పొందురు. ఓ ముని తల్లజులార! కర్మ భూమియగు భారత వర్షమును గుఱించి మోక్ష క్షేత్రముల గురించి పరమాత్మ పురుషోత్తముని గుఱించి చెప్పితిని. ఆ వరదుడైన ప్రభుని భక్తితో ఎవ్వరు ధ్యానింతురో, దర్శింతురో, స్తుతింతురో వారు పవిత్రులై రాజ్య భోగములను అనుభవించి స్వర్గసుఖములలో ఓలలాడి అవ్యయమగు ముక్తినందుదురు. (178) అని ఇంకను

ఋషి ప్రశంస నిరూపణము

లోమహర్షణుడు ఇట్లు చెప్పెను –

వ్యాస వచనములువిని జితేంద్రియులగు మునులు సంప్రీతులై సంతసించి ఆశ్చర్యముతో ఇట్లనిరి. భారతవర్ష ప్రభావమెంత చక్కగ నీవు వర్ణించితివి. అట్లే పురుషోత్తమ క్షేత్ర మహిమము తాము సెలవిచ్చినదివిని వింత చెందితిమి. చిరకాలము నుండి మా ఎదలో ఒక సందేహము పొదుకొని ఉన్నది. దానిని వదలింప తమకంటె వేరొకడు ఈ భూతలమున లేడు. బలరామకృష్ణులు అవనిలో అవతరించుటకు కారణమేమి? భద్రాదేవి అవతారము ఎందులకు వచ్చినది? వసుదేవుని కుమారులై అతని గృహమందు ఆ అన్నదమ్ములు ఎందులకుండిరి? ఈ లోకము దుఃఖప్రాయము, మృత్యురూపము. నీటి బుడగవలె అస్థిరము. పరమపురుషులగు వారు ఈ మలపూరితమైన రొంపిలో ఈ ఘోరమైన గర్భమున ఎందులకు నివాసమును కోరిరి? అవనిపై అవతరించి వారేమేమి పనులు చేసిరి? అవెల్ల సమగ్రముగ మాకు ఆనతిమ్ము. అతి మానుషమైన వాసుదేవ భగవానుని కథ పరమ పుణ్యము. పుణ్యాత్ముల చరిత్రలతో ముడిపడియున్నది. దివినుండి భూమి స్వామి వచ్చుటకు గతమేమి? చక్రపాణి సర్వసృష్టి, చక్రము త్రిప్పు ప్రభువు మనుష్యలోకము ఎడల ఎట్లు తలుపుగొనెను? సర్వ జగద్గోపకుడైన హరి సామాన్య గోపమూర్తి ఎందులకు అయ్యెను? మహాభూతములను భరించు సర్వభూతాత్మకుడైన ప్రభువు శ్రీగర్భుడు (అణిమాద్యైశ్వర్య సంపన్నుడు)అగు శ్రీపతి ఒకమానవ స్త్రీ గర్భమున ఎట్లు భరింపబడెను? దేవతల మేలు కొఱకు ముల్లోకములను మూడడుగులచే ఆక్రమించిన త్రివిక్రమమూర్తి. భూర్భువ స్వర్లోకములు అను మూడు దారులను ధర్మార్థకామలు అను మూడు పురుషార్థములను ఒడుదుడుకు లేకుండ నిలుపు స్థితికర్త అతడు లయకాలమున జలమయ మూర్తి దాల్చి లోకము ఏకార్ణవము ఒనరించి దృశ్యాదృశ్య స్వరూపమున జగమెల్ల దిగద్రావి ఉండు పురాణ పురుషుడు. పురాణాత్మరూపుడు. వరాహరూపధారియై, తన కొమ్ము తుద ఈ వసుమతిని ఉద్ధరించిన మధుసూదనుడు వసుంధరనెల్ల గెలిచి దేవతలకు ఇచ్చిన దేవపతి, నరాకృతి సింహాకృతియునై హిరణ్యకశిపు సంహరించిన శ్రీహరి బొర్వాగ్ని (బాడబాగ్ని) స్వరూపుడై, ప్రళయమూర్తియై, పాతాళమునకు వెళ్ళి సముద్రమునెల్ల అపోశనము పట్టిన నారాయణుడు, ఈ అవని నరాకృతియై ఏల అవతరించెను? సహస్ర చరణుడు, సహస్ర శీర్షుడు, సహస్రపాదుడు, సహస్రాంశువునని ఏదేవుని (పురుష సూక్తమున) వేదజ్ఞులు స్తుతింతురో యుగ యుగమందు ఎవ్వని నాభినుండి పితా మహుని పుట్టినిల్లైన పద్మము ఉద్భవించునో, లోకము ఏకార్ణవమైనపుడు హిరణ్మయమైన ఆ

కమలము ఎవ్వని నుండి పొడమెనో, ఎవ్వనిచే తారకాసుర సంగ్రామమున దైత్యులు హతులైరో, ఎవ్వడు సర్వ దేవతాత్మకమైన సర్వాయుధములను ధరించి మేనుగొని మద మెక్కిన కాలనేమిని కూల్చెనో, తుట్ట తుదను క్షీరసముద్రమందు అమృతనిధి యందు యోగమూర్తియై జగత్తు అంధకార బంధుర మైనప్పుడు ఎవ్వడు నిద్రించునో ఆస్వామి ఈ అవనిపై అవతరించుటకు కారణమేమి! అని మునులు ప్రశ్నింపగా లోమహర్షణుడు వారికి ఇట్లు ఆనతిచ్చెను.

తపోబలమున దేవతలు అవతరించుటకు అరణియైన (అగ్ని పుట్టుటకు ఆధార భూతమైన జమ్మి కర్రల జత అరణి అనబడును) అదితి గర్భమందు ధరించిన దైత్యగణ బద్ధుడైన దేవేంద్రుని ఎవడు జాగరూకతతో రక్షించెనో, మూడడుగులను యోగమయములైన పదములనుగ చేసి, దైత్యులను సముద్రము పాలొనరించి, దేవతలను దేవేశ్వరులను దేవేంద్రుని, కాపాడెనో, గార్హపత్య విధానమున అన్వాహార్య కర్మచే ఆ హవనీయ అగ్నిని వేదమును, దీక్షను సమిధలను, ధ్రువపాత్రను ప్రోక్షణ పాత్రను, స్రువమును, అవబృధ్య మును ఏ మహానుభావుడు ముఖము చేయియు మఱియే అవయవ స్ఫూర్తి లేని నిరాకారుడు ఈ యజ్ఞరూపమును కల్పించెనో ఎవ్వడు హవ్య భాగములను భుజించు దేవతలను, హవ్యముల ఒసగు యజమానులను దేవతలను, కవ్యములను ఆరగించు పితృదేవతలను కల్పించి భోగార్థము యజ్ఞాచరణ మందు యజ్ఞవిధిని సమ్మేళనము చేసెనో యజ్ఞపాత్రలు దక్షిణ దీక్ష చెరువు సోమ సాధనములైన యూపము సమిధ సోమము స్రువము పవిత్రములు పరిధులు మఱియు యజ్ఞార్హములైన ద్రవ్యములు చేమసలు సదస్యులను యజమానులను మేధాదులను క్రతు శ్రేష్ఠములను ఎవ్వడు పారమేష్ట్యమగు కర్మచేత (బ్రహ్మచేయవలసిన పనిగా) విభాగముచేసి అయా యుగముల కనువుగా ఒనరించెనో అయ్యజ్ఞ పురుషుడు విష్ణువే కృష్ణుడై అవతరించెను.

క్షణములు, నిమేషములు, కాష్ఠలు, కలలు వీని మానము అనుసరించి ఏర్పడు భూత భవిష్యద్వర్తమాన కాలములు ముహూర్తములు, తిథులు, నెలలు, దినము, సంవత్స రము, ఋతువులు, కాల యోగములు, త్రైకాలిక, కాలప్రమాణము, ఆయువు, క్షేత్రములు (శరీరము), వాని ఉపచయము (పెరుగుదల), లక్షణము, రూపసౌష్ఠవము, ముల్లోకములు, ముమ్మూర్తుల, త్రివిధ కార్యము, త్రేతాగ్నులు, త్రికాలములు, కర్మత్రయము, త్రివర్ణములు సత్వరజస్తమ గుణములు ఎవ్వనిచే అంతులేని కర్మ ప్రభావముచే సృష్టింప బడునో, ఆ సృష్టికర్త హరియై అవతరించెను. సర్వ భూతాంతర్యామియై సర్వ భూత గుణ మూర్తియై మానవుల యందు ఇంద్రియముల వెంటనగు యోగముచేత వినోదించునో, గడచిన

గడువనున్న కర్మముల యొక్క సంబంధముచేత సర్వ విధాయకుడైన ఈశ్వరుడు తానై (కర్మ ఫలదాన సమర్థుడై) ధర్మపరులకు ఎవ్వడు గతియు పాప కర్ములకు అగతియునై తోచునో, చాతుర్వర్ణ్య విభాగమునకు మూలమై రక్షకుడై ఉన్నాడో చాతుర్వర్ణ్యమున (చతుర్వేద విజ్ఞానమునకు) ఎవ్వడెరుగునో, బ్రహ్మచర్యాది చతురాశ్రమములకు ఎవ్వడాశ్రయుడో. సర్వ దిక్కుల నడిమి భాగము, ఆకసము, భూమి, వాయువు, సూర్యుడు, చంద్ర, సూర్యమయ మైన జ్యోతిస్సు చతుర్యుగములకు అధీశ్వరమును ఎవ్వడు పరంజ్యోతి అని పరమ తపస్సని వేదములందు వినబడునో, ఎవ్వని పరుని ఆపరునిగా కూడ (జీవాత్మగా పరమాత్మగా కూడ) పేర్కొందురో, ఎవ్వడు పరుడు పరమాత్మయునో, ఆదిత్యులకు అధినాథుడును, దైత్యులకు ఆగంతకుడును ఏవిభుడో, యుగాంత మందంతకు డెవ్వడో, ఎవ్వడు లోకాంతకులకు కూడ నంతకుడో లోకసేతువుల కెవ్వడు సేతువో మేధ్యకర్ముల కెవ్వడు మేథ్యుడో (మేథ్యము = పవిత్రము) వేదము లెరింగిన వారికి ఎవ్వడు ఎరుగ తగినవాడో సృష్టి హేతువులైన వారికి గూడ ఎవ్వడు సృష్టి బీజమో లేక ప్రభుశక్తి కలవాని కెవ్వడు ప్రభువో, సౌమ్య ద్రవ్యములకెవ్వడు సోముడో, అగ్నివర్చస్సుల కెవ్వడు అగ్నియో, సర్వ లోకేశులగు శక్రులకు (ఇంద్రులకు). ఈశ్వరుడో తపస్సులకు తపస్స్వరూపుడో వినయ శీలురులలో ఎవ్వడు వినయమో, తేజఃశ్శాలురలలో ఎవ్వడు తేజస్సో. కలహ శీలురులలో ఎవ్వడు కలహమో, గతిమంతులలో ఎవడు గతియో, అట్టి హరి ఈ పుడమిలో అవత రించెను. ఆకాశము నుండి వాయువు, ప్రాణవాయువు నుండి అగ్ని పుట్టినవి. ఆకాశము, అగ్ని, ప్రాణము ఈ మూడును విష్ణు రూపములే. రసము నుండి శోణితము, శోణితము నుండి మాంసము, మాంసము నుండి మేదస్సు, మేదస్సు నుండి (క్రొవ్వు) (హృదయస్థమైన) ఎముక ఎముక నుండి మజ్జ (ఎముకలోని క్రొవ్వు) మజ్జ నుండి శుక్రము, శుక్రము నుండి రస నిర్మాణ క్రియచే గర్భము పుట్టును. అందు మొదటి భాగము అప్పులు(ఉదకము) అదే సౌమ్య రాశియని చెప్పబడును. గర్భగతమగు ఊష్మము నుండి రెండవ రాశి పుట్టును. శుక్రము సోమాత్మకము ఆర్తవము (స్త్రీ శోణితము) అనలాత్మకము. అగ్ని సోమాత్మకమైన ఈ ద్రవ్యములు రసమును అనుసరించి ఏర్పడును. శశి పావకులు (అగ్ని) బీజములు. కఫ వర్గమునకు సంబంధించినది శుక్రము (పురుష వీర్యము) పిత్తవర్గములోనిది. స్త్రీ శోణితము. కఫమునకు స్థానము హృదయము. పిత్తమునకు స్థానము నాభి. దేహమధ్య మందున్న హృదయము మనస్సు ఉండుచోట నాభికోష్ఠమునందు అగ్ని దేవుడున్నాడు. మనస్సు ప్రజాపతి, కఫము సోముడు, పిత్తమగ్ని ఈవిధముగ ఈజగత్తు అగ్నిసోమాత్మకము. ఇట్లు ఏర్పడెడి గర్భము వృద్ధిబొందిన కొలది పరమాత్మతోపాటు వాయువు శరీరమునందు ప్రవేశించును. ఆ వాయువు శరీరమందు ప్రాణము అపానము, సమానము, ఉదానము,

వ్యాసమును అయిదు తెరగుల అయినది. ప్రాణ వాయువు పరమాత్మను పెంపొందించుచు హృదయమందు ఉండును. అపానము నాభి క్రింద భాగమున (గుద స్థానము) ఉండును. ఉదానము కంఠదేవము నందు ఉండును. వ్యానవాయువు శరీరమెల్ల వ్యాపించి యుండును. సమాన వాయువు నాభియందు ఉండును. ఇంద్రియ గోచరమైన ఈ భూతోత్పత్తి ఈ వాయువుల వలననే కలుగును. వాయువు, ఆకాశము, నీరు, భూమి, తేజస్సు అను ఈ పంచ భూతాంశలు ఇంద్రియ ములందు చేరినవై తమతమ భాగములను నిర్వహించును. దేహము పార్థివమని అందురు. వాయువును ప్రాణస్వరూప మందురు. శరీరమందు ఉన్న నవరంధ్రములు (అవకాశములు) ఆకాశ మూలములు. జలభూతమువలన శరీర మందు రక్త శుక్రాది స్రావమేర్పడును. కన్నులు జ్యోతి (తేజః) స్వరూపములు. మనస్సు వానికి ఆత్మ రూపము. మనశ్శక్తి వలననే విషయాదులు ప్రవర్తితములగును.

ఈ విధముగ సనాతనుడైన పురుషుడు పరమాత్మ సర్వలోకములను సృజించెను అని అనగా మునులు ఇట్లు అడిగిరి –

నశించు స్వభావముగల ఈ లోకమందు నశింపని పదార్థమగు విష్ణువు నర రూపమును ఎట్లు పొందెను అని మా సందియము. విస్మయమును, ఉత్తమగతి కేగువారికి పరమగతి అగు ఈతడెట్లు మానవశరీరి అయ్యెను? దేవతలు దైత్యులుగూడ ఈవిషయము పరమాశ్చర్యముగా పేర్కొందురు. అట్టి ఆశ్చర్యకరమైన విష్ణువయొక్క పుట్టుక వృత్తాంతము తెలుపుము. ఆయన మహాతేజస్సు. బలవీర్యములు ప్రసిద్ధములు. ఆయనచేష్ట ఆశ్చర్యకరము. అట్టి విష్ణువు యొక్క తత్వమిపుడు చెప్పతగును. ఆ దేవుడు పురుషోత్తముడు దేవతల కష్టములను ఎట్లు హరించెను. సర్వవ్యాపకుడు సర్వలోకేశ్వరుడు సర్వలోక సుఖకరుడు సృష్టి స్థితి లయకారకుడును అగు జగన్నాథుడు శాశ్వతుడు. అంతము లేనివాడు. క్షయ వృద్ధులు లేనివాడు. పాపపుణ్య స్పర్శ లేనివాడు. నిర్గుణుడు. సూక్ష్ముడు, వికార రహితుడు, నిరంజనుడు, విభువు, నిత్యుడు, సత్తామాత్రుడు. అచలుడు, నిర్మలుడు, సర్వవ్యాపి నిత్యతృప్తుడు, నిరాశ్రయుడు అయిన అతడు దేవతలయందు వైకుంఠభావమును (నారాయణత్వం) మానవులందు కృష్ణత్వమును ఎట్లు పొందెను? కృతయుగమందు విశుద్ధమైన హరిత్వమును, సర్వేశ్వరుడగు ఆ భగవంతుని కర్మగతిని దురవగాహము అగు గడచిన, జరుగనున్న దానిని వినగోరుచున్నాము. భగవంతుడు స్వభావముచేత అవ్యక్తు డయ్యు వ్యక్త రూపమును పొందియున్నాడు. ఈయన నారాయణుడయ్యు హరి అనుపేర అవతరించెను. ఆయనే బ్రహ్మ, శక్రుడు (ఇంద్రుడు), రుద్రుడు, ధర్ముడు (యముడు), శుక్రుడు, గురుడు, అయినాడు. తొలుత ఆయనకు ప్రధానాత్మయై బ్రహ్మను సృజించెను.

పురాణ పురుషుడగు అతడు పూర్వ కల్పమందు ప్రజాపతులను సృజించెను. అట్టి భగవంతుడు (షడ్గుణైశ్వర్య సంపన్నుడు) సర్వవ్యాపకుడగు విష్ణువు సర్వ లోకేశ్వరుడు మర్త్య లోకమున యదుకులమునందు ఎందులకు బ్రవేశించెను. తెలుపుము అని అడిగిరి (179)

శ్రీకృష్ణ చరిత్ర

వ్యాసుడు ఇట్లు అనియె –

సురేశ్వరునికి, సృష్టికారణునకు, విష్ణువునకు, పురాణపురుషునకు చతుర్వ్యూహ స్వరూపుడైన నిర్గుణ స్వరూపునకు, గుణరూపునకు, సర్వాధికునకు, యజ్ఞాంగ స్వరూపునకు, సర్వాంగునకు నమస్కారము. ఎవనికంటె అణువైన వస్తువు ఎవనికంటె పెద్దదైన వస్తువు లేదో, జననము లేని ఎవ్వనిచేత విశ్వము వ్యాప్తమైనదో, పుట్టుట గిట్టుట దృశ్యమగుట అదృశ్యమగుట అను లక్షణములచే విలక్షణమైన చరాచర విశ్వవ్యాప్తమైనవానినిగా తెలుపుదురో, ఎవనివలన జగత్తు పుట్టినది, నశించినది అని బ్రహ్మణ్యులు పేర్కొందురో, అట్టి నిర్వికారము శుద్ధము నిత్యము ఏకైక రూపము విష్ణువు జిష్ణువు (సర్వవ్యాపకము, జయ శీలము) అని వర్ణింపబడు పరమాత్మకు నమస్కారము. హిరణ్యగర్భునకు (స్వర్ణమయమైన బ్రహ్మాండము గర్భముగా గలవాడు) హరికి, శంకరునకు, వాసుదేవునకు, (సర్వదేవ నివాసమైనవానికి, తారునికి (సంసారమును తరింపజేయువాడు), ఏకరూపునికి, స్థూలము, సూక్ష్మమునైన వానికి, అవ్యక్తము, వ్యక్తమునైన వానికి, ముక్తి హేతువగు విష్ణునకు, జగన్మూలము అయినవానికి నమస్కారము. విశ్వమునకు ఆధారమై అణువుల కంటె అణువై సర్వ భూతములందు ఉండి చ్యుతిలేని వానికి (అచ్యుతునకు) నమస్కారము. పరమార్థముగ కేవల జ్ఞాన రూపము అయినను అర్థ స్వరూపముగ భ్రాంతి దర్శనమున దృశ్యాత్మక జగత్తుగ కనిపించువానినిగ మునులు పేర్కొనెడి భగవత్తత్వమును గుఱించి బ్రహ్మ పూర్వము ఒక మారు చెప్పినట్లు నేనును చెప్పుచున్నాను.

ఎవడు తన ముఖములచేత ఋక్ సామవేద మంత్రములను పఠించుచు ఏకార్ణవము నుండి వెలువడివచ్చి ముల్లోకములను పవిత్రముజేయునో అట్టి ఈశానునకు నమస్కరించి దేవతలు యజ్ఞములొనరించు వారి ఆజ్ఞాచరణమునకు లోపము రానీయరో ఆయనకు నమస్కరించి, అవ్యక్తమునుండి పుట్టిన బ్రహ్మయొక్క సమగ్రమైన అభిప్రాయమును తెలుపుచున్నాను. ఆయన సృష్టిని ఉద్దేశించి ధర్మార్థకామమోక్షములను పురుషార్థములను వేద రూపమున ప్రకటించి ఉన్నాడు. ఆపః (దీనికి నీరు సామాన్యార్థము. కాని దానికి మూల పదార్థమైన విద్యుత్తు ప్రకాశోదకమను పేర అనర్థమని ఋషులు చెప్పినారు) వానికి

నారములని నామాంతరము. అవియే, యనము అనగా గమ్యస్థానము (ఉనికి)గ గలవాడు నారాయణుడు. సృష్టిమూలమైన ఆపోరూపమున సర్వవ్యాపకమై ఉన్నతత్త్వమే నారాయణ తత్త్వమని తాత్పర్యము, ఆ భగవత్తత్త్వము నాలుగు విధములై ఉన్నది. ఒక మూర్తి శుక్ల వర్ణము. అది జ్వాలా మాలమయము. దానిని యోగులు జ్ఞానులు మాత్రమే దర్శింతురు. అది దూరమందును దగ్గరనుగూడ ఉండునది. అది గుణముల కతీతమైనది. వాసుదేవ నామమున ఉండునది. మమకారము లేని స్థితిలోనే అది కనబడును. రూపము రంగు మొదలగు కల్పిత భావములు దానికి లేవు. కేవల శుద్ధ స్వరూపము. మిక్కిలి నిలకడగల వస్తువు. ఇక రెండవ వ్యూహము. శేషుడను పేర భూమిని ధరించుచున్నది. అది తమోగుణ మూర్తి. తిర్యగ్భావమును బొందినది. అనగా పశుత్వము నొందినదని అర్థము. మూడవ వ్యూహము సత్వ ప్రధానమూర్తి ధర్మసంస్థాపన మొనరించి ప్రజారక్షణ నిమిత్తమైన కర్మను (స్థితిరూపమును జేయునది). నాలుగవ వ్యూహము (మూర్తి) శేష తల్పమున సముద్ర మధ్య మందు ఉండును. రజోగుణ రూపము సర్గకారణము (సృష్టి కారణము) ఈచెప్పిన వానిలో మూడవ మూర్తియగు హరి స్వరూపము ధర్మ వ్యవస్థాపనము జేయును. ధర్మ నాశము చేయ చెలరేగిన అసురులను సంహరించును. ధర్మపరాయణులైన దేవగంధర్వా దులను రక్షించును. ఈ మూర్తి ఎపుడు ధర్మము వాడిపోవునో, అధర్మము ప్రకోపించునో, అప్పుడు తననుతాను సృజించుకొనును. మున్ను వరాహమై ముట్టెతో ఉదకమును చిమ్ముకొని వచ్చి తనయొక్క కొమ్ముచేత ఈ వసుంధరను పద్మిని (తామర తీగ)వలె పైకెత్తినది. ఈ మూర్తియే నరసింహమూర్తియై హిరణ్యకశిపుని సంహరించినది. దీనిచేతనే విప్రచిత్తి మొదలుగా మఱెందరో దానవులు గూల్పబడిరి. వామన రూపమూని మాయచే బలిని బంధించి దైత్యులనుగెలచి ముల్లోకములు ఆక్రమింపబడినవి. భృగు వంశమందు జమదగ్ని కుమారుడై పుట్టి అద్భుత ప్రతాపముచే ఒక రాచపురుగు తండ్రిని సంహరించి నాడని సర్వక్షత్రియ నాశనమొనరించినది. అట్లే అత్రి కుమారుడై ప్రతాపశీలియై దత్తాత్రేయుడను పేర ఉదయించి మహాత్ముడైన అలర్కునకు అష్టాంగ యోగమును ఉపదేశించినది. దశరథ కుమారుడై, రాముడనుపేర పుట్టి రావణుని సంహరించినది. సర్వ జగత్తు ఒకే సముద్రమైనపుడు ఈసర్వజగత్ప్రభువు అనేక యుగసహస్రములు నాగపర్యంక శయనుడై యోగనిద్ర వహించి తన మహిమయందు తాను ఇమిడియుండి ముల్లోకములను గర్భమున తాల్చి జనోలోక మందున్న సిద్ధులు స్తుతింప విలసిల్లుచుండును.

ఆ అనంత శయన మూర్తి నాభినుండి దిక్కులే రేకులుగా భాసించు ఒక పద్మము పుట్టినది. అందలి కేసరములు మరుద్గణము. (వాయు). అది పితామహుడైన చతుర్ముఖుని

పుట్టిల్లు. యోగ నిద్రనున్న ఆ స్వామి గులిమినుండి మధుకైటభులను దానవులు పుట్టిరి. మహావీర్యులు మహాబలశాలులునై, బ్రహ్మను చంపబోయిన, ఆ ఇద్దరను తల్పము నుండి లేచి ఆ ప్రభువు సంహరించెను. ఆయన అనేక లీలలు అసంఖ్యాకములు. అట్టి అజుడు అవికారుడు మధురానగరములో అవతరించి ఉన్నాడు. ఈ సాత్విక మూర్తి జగత్ స్థితి హేతువై అవతరించగా ప్రద్యుమ్న నామమున నాల్గవ వ్యూహముగ చెప్పబడినది. ఈ మూర్తి ఒకప్పుడు దేవభావమును, నొకతఱి మనుష్య భావమును, వేరొక యెడ పశుపక్ష్యాది భావమునుగూడ గ్రహించుచుండి తదనురూప స్వభావమునై వాసు దేవాఖ్యమై పూజింపబడి అభీష్టముల అనుగ్రహించుచున్నది. కృతకృత్యుడయ్యు (ఏ కర్తవ్యములేని వాడయ్యు) సర్వప్రభువైన విష్ణువునుగూర్చి నేనింతవరకు తెల్పితిని. ఇటుపై ఆయన మనుష్యత్వమును పొంది చేసిన లీలావిశేషములను ఆలింపుడు. (180)

హరి అంశావతారము

వ్యాసుడు అనియె –

భూ భారము హరింప ఈ భారత వర్షమందు హరి అవతరించిన వృత్తాంతమును తెలిపెదను. ఓ మునివరులార వినుడు. ధర్మహాననము, అధర్మాభివృద్ధి అయిన తఱి జనార్దనుడు తన మూర్తిని రెండు విధములు ఒనర్చికొని సాధు రక్షణకు ధర్మ స్థాపనకును దుష్టుల దేవద్వేషుల నిగ్రహమునకును యుగయుగమందు ఉదయించును. మున్నీ భూమి బహుభార పీడితమై, మేరువునందున్న దేవ సమాజమున కేగి, బ్రహ్మాది దేవతలకు మ్రొక్కి తన కష్టమును ఇట్లు మొఱపెట్టుకొనెను.

అగ్ని బంగారమునకు గురువు. గ్రహములకు సూర్యుడు గురువు. నాకును మఱి ఎల్ల లోకములకు వంద్యుడైన గురువు నారాయణుడు. ఇపుడు కాలనేమి మొదలుగా గల ఈ దైత్యులు మర్త్య లోకమునకు వచ్చి రేయింబవళ్ళు ప్రజలను బాధించుచున్నారు. ప్రభువైన విష్ణువుచే కాలనేమి కూల్చబడెను. ఉగ్రసేనుని కొడుకు కంసుడను, మహాసురుడు పుట్టియున్నాడు. అరిష్టుడు, ధేనుకుడు, కేశి, ప్రలంబుడు, నరకుడు, సుందుడు, మహోగ్రుడగు బాణుడు (బలికొడుకు) మఱియెందఱో రాజుల ఇండ్లలో పుట్టినారు. వారిని లెక్కపెట్ట ఉత్సహించను. దివ్యమూర్తిధరులగు దేవతలు మదించియున్న దైత్యరాజులు గలిసి అక్షౌహిణు అనేకములు నామీద ఉన్నవి. ఆ బరువు సైపలేకున్నానని మీకు విన్నవించు కొనుచున్నాను. నేను పాతాళమునకు క్రుంగిపోకుండ ఈ నా బరువును మీరు దింప వలయును. అని అవని మాటవిని సురల ప్రేరణచే బ్రహ్మ భూభార హరణార్థమై ఇట్లు పలికెను.

ఓ వేల్పులారా! భూదేవి ఇప్పుడు అన్నది యెల్ల నిజము. నేను భవుడను (శివుడు) మీరు మఱి అంతయు నారాయణ స్వరూపము. ఇవన్నియు హరియొక్క విభూతులే. ఆ విభూతుల హెచ్చు తగ్గులను అనురించియే ఒకరినొకరు బాధింపబడువారు, ఒకరు బాధించువారుగ తోచుచుందురు. అందుచే మనమందరము పాలకడలి ఒడ్డునకు వెళ్ళుదము. అచట హరిని ఆరాధించి ఆయనకు విన్నవింతము. ఆ దేవుడు జగన్మయుడు భూమి ఉపకారమునకై సత్వ గుణాంశమున అవనిపై అవతరించి ధర్మస్థితిని గావించును అని బ్రహ్మ సురలతో ఏగి మనసు నిలిపి గరుడధ్వజుని ఇట్లు స్తుతించెను.

సహస్రమూర్తీ! సహస్రపాద! సహస్రముఖ! సృష్టి స్థితి లయకారణ! అప్రమేయ! నీకు నమస్కారము. సూక్ష్మాతి సూక్ష్ముము! బృహత్ప్రమాణము! గొప్పవాని కెల్ల గొప్పది ప్రధానము బుద్ధి ఇంద్రియములు వాగ్రూపమైన వేదములకు మూలము పరమునైన ఓ భగవంతుడా! ప్రసన్నుడవగుము. ఈ భూమి, భూమిపై పుట్టిన మహాసురులచే పీడ నొందిన పర్వతబంధములుకలదై జగత్పరాయణమైన నిన్ను భారము దింపగోరి అరు దెంచినది. మేము, ఇంద్రుడు, అశ్వినీదేవులు, వరుణుడు, ఇరుగో రుద్రులు, వసువులు, సూర్యులు, వాయువు, అగ్ని మొదలగు ఎల్లరను అరుదెంచితిమి. మేము ఒనరింప వలసినవని అనతిమ్ము. నీ చెప్పినది విధేయులమై చేసెదము. దోషములు వాసి నీ హద్దున నిలుతుము.

వారు ఇట్లు భగవంతుని స్తుతింపగా, పరమేశ్వరుడుకావున వారిని అనుగ్రహింప తన రెండు శిరోజములను తెలుపు నలుపు వానిని నూడబెరికి వారికి జూపి ఈ కేశములు వసుధ యందు అవతరించి, భూ భారక్లేశమును హరింపగలవు. సురలెల్లరు తమతమ అంశములచే అవనీతలమందు అవతరించి మదోన్మత్తులైపుట్టి ఉన్న మహారాక్షసులతో యుద్ధమును ఒనరింతురు గాక! అందుచే నానాయుధ హతులై అశేష దైత్య కూటము నశించును. సంది యము లేదు. వసుదేవుని ధర్మపత్ని దేవతా సమానురాలు దేవకి. ఆమె ఎనిమిదవ గర్భముగ నా యొక్క కేశము అవతరించును. కంసాదులను సంహరించును అని హరి అంతర్ధానమందెను.

అదృశ్యుడయిన ఆ మహాత్మునికి నమస్కరించి ఆ దేవతలును మేరుగిరునకు వెళ్ళి అటనుండి అవనికి దిగిరి. నారద భగవానుడు కంసుని కడకేగి దేవకి ఎనిమిదవ గర్భము (శిశువు) అవతరించునని తెల్పెను. కంసుడువిని కోపగించి దేవకీ వసుదేవులను కారాగార మున ఉంచెను. తాను ఇంతకు పూర్వము ఇచ్చిన మాటను అనుసరించి వసుదేవుడు పుట్టిన వానిని పుట్టినట్లు బిడ్లలను తీసుకొనిపోయి కంసునికి అప్పగించెను. అట్లు జనించిన కొడు కులు ఆరుగురు. తొలి జన్మమున హిరణ్యకశిపుని పుత్రులు. విష్ణు ప్రేరణము నొంది

నిద్రాదేవి (యోగనిద్ర) గర్భమునందు వారిని ఆవేశించెను. ఆమె వైష్ణవియైన మాయ. అవిద్యారూపమైన ఆ మాయచేతనే జగమెల్ల మోహితమగుచుండును. ఆమెను చూచి హరి.

ఓ నిద్రా! నాఆజ్ఞచే నీవు వెళ్ళి పాతాళమందున్నవారిని ఒక్కక్కరిని దేవకీ జఠరమున చేర్పుము. కంసునిచే వారు చంపబడగా శేషుని అంశమున పుణ్యమూర్తి ఆ దేవకి ఏడవ గర్భమగును. గోకులమునందు వసుదేవుని భార్య రోహిణి గలదు. ఆమె ప్రసవ సమయ మందు ఈ సప్తమ గర్భమును కొనిపోయి ఆమె ఉదర మందుంచుము. భోజరాజగు కంసుని వలని జడుపుచే బంధనముచే దేవకి గర్భము భంగమైనదని జనశ్రుతి పుట్టును. గర్భసంకర్షణముచే ఆ శిశువు 'సంకర్షణుడు' అని పేరొందును. తరువాత నేను ఆ దేవకి శుభస్థానమైన గర్భమందు ఉందును. నీవిప్పుడు యశోద ఉదరమునందు విలంబము లేకుండ ఉండవలెను. వర్షర్తువున శ్రావణ బహుళ అష్టమినాడు అర్ధరాత్రి నేను పుట్టెదను. నాశక్తి ప్రేరణమందిన బుద్ధితో వసుదేవుడు దేవకి పక్కలో ఉన్న నిన్ను యశోద ప్రక్కలోనికిని చేర్చును. కంసుడు నిన్ను పట్టుకొని, ఒక కొండబండపైకి విసరికొట్టును. నీవు అంతరిక్ష మున కెగిరి నిలుతువు. అంతట నిన్ను ఇంద్రుడు నా మీది గౌరవముచే పలుమారులు నమస్కరించి తలవంచి తన చెల్లెలుగా గౌరవించును. అటుపై నీవు శుంభ నిశుంభాది దైత్యులను వేలకొలదిగ సంహరించి పృథివియందు వేఱువేఱు స్థానములందు వేఱువేఱు రూపములచే అలంకరింతువు. నీవే భూతివి, సన్నతివి, కీర్తివి, కాంతివి, పృథివివి, భృతివి, లజ్జ, పుష్టి రూపా (రోషము), మఱి ఏమేమి శక్తులుగలవో అన్నియు నీవే. ఆర్య దుర్గ, వేదగర్భ, అంబిక, భద్ర, భద్రకాళి, క్షేమ్య, క్షేమంకరి అని ప్రాతఃకాలమున అందు అపరా హ్ణమున జనులు వినతులై నిన్ను పెక్కురీతుల స్తుతింతురు. వారి వాంఛిత మెల్ల నా ప్రసాదమున సమకూరును. కల్లు, మాంసము, భక్ష్య భోజ్యములు నివేదించి పూజించిన మానవుల ఎల్ల కోరికలను నీవు ప్రసన్నవై ఎవరికి అనుగ్రహింతువో వారందఱు అన్నివేళల నా అనుగ్రహమున భద్రమూర్తులగుదురు. సందేహములేదు. దేవి! నేను చెప్పినట్లు చేయుము పొమ్ము (181) అని ఆనతిచ్చెను.

శ్రీకృష్ణ జన్మ కథనము

వ్యాసులు ఇట్లు అనియె –

జగత్కర్తయైన ఆ విష్ణుమాయ దేవదేవుడు చెప్పినట్లు దేవకి ఆరు కాన్పుల ఒనరించి తరువాతి గర్భమును ఆకర్షించెను. ఆ తరువాత దేవకీ గర్భమందు హరి ప్రవేశించెను. అదే సమయమున యోగనిద్ర యశోద ఉదర మందు బ్రహ్మ చెప్పిన విధముగ జనించినది.

అంతట గ్రహములు శుభ స్థానములందు సంచరించినవి. విష్ణు అంశము భూమియందు అవతరించు సమయమున ఋతువులు సుశోభనమయ్యెను. దేవకి ముఖకాంతి అతిశయించి ఆమెవంక జూచుటకు ఎల్లరకు అశక్యమయ్యెను. దేదీప్యమానమై ఉన్న ఆమెను జూచిన వారిమనసులు కలతజెందినవి. ఏరికిని తేరిపార చూడ శక్యముగాని దివ్యప్రభతో విష్ణువును తన ఉదరమందు భరించుచున్న ఆమెను దేవతలు అహర్నిశము స్తుతించు చుందురు.

దేవతలు దేవకీ దేవిని స్తుతించుట

దేవతలు ఆమెను "దేవీ నీవు స్వాహా స్వధా విద్యా సుధా స్వరూపిణివి. జ్యోతి స్వరూపురాలవు. సర్వలోక రక్షణమునకై భూలోక మందు అవతరించితివి. దేవీ! ప్రసన్నురాలవగుము. ఎల్ల జగత్తునకు మేలు చేయుము. ఎవ్వనిచే ఎల్ల జగము తరింపచేయబడెనో ఆ ఈశ్వరుని నీవు ప్రీతితో ధరింపుము" అని స్తుతించిరి. ఇట్లు స్తుతింపబడిన ఆ తల్లి జగద్రక్షిణ కారణమైన పుండరీకాక్షుని గర్భమున దాల్చెను. ఎల్ల లోకములనెడి పద్మములను వికసింప చేయుటకు అచ్యుతుడు సూర్యుడు పూర్వసంధ్యా సమయమందు దేవకి యందు ఆవిర్భావము జేసెను. అఖిల జగదాధారమూర్తియైన జనార్దనుడు నడిరేయి జనించు చుండగ మేఘములు అల్లన గర్జనము చేసినవి. దేవతలు పుష్పవృష్టి కురిపించిరి. వికసించిన నల్లకలువ రంగులో నాల్గు బాహువులతో శ్రీవత్సవక్షుడై ఉన్న ఆ మూర్తిని చూచి వసుదేవుడు స్తుతించెను. ప్రసాద గుణభరితములైన వాక్కులతో స్తుతించి అతడు కంసుని వలన జడిసి "ఓ దేవదేవ! శంఖ చక్ర గదాధరా! నీకలరూపు జూపితివి. నేనది తెలిసికొంటిని. దయచేసి ఈ రూపమును మరుగుపరచుము. ఇది తెలిసినయెడల కంసుడు ఈక్షణము నన్ను అనేక యాతనలకు గురిచేయును. ఈ కారాగారమున నీవు అవతారము తాల్చితివని వానికి దెలియుట ప్రమాదము" అని విన్నవించెను. అప్పుడు దేవకియు అనంతరూపుడు విశ్వరూపుడునై తనయందెల్ల లోకములను భరించు దేవదేవుడు తన మాయంగొని బాల రూపమున వెలువడిన ఈ స్వామి మా ఎడల ప్రసన్నుడగుగాక! ఓ సర్వాత్మమూర్తి ఈ చతుర్భుజ రూపమును ఉపసంహరింపుము. ఓ దైత్యాంతక నీయీ అవతారమును కంసుడు ఎరుగకుండుగాక. అనగావిని శ్రీ భగవంతుడు పుత్రార్థినివై మున్ను నన్ను స్తుతించితివి కావున అది ఇప్పుడు సఫలమైనది. నీ ఉదరమునుండి ఇపుడందులకే అవతరించితిని అని పలికి స్వామి మిన్నకుండెను.

వసుదేవుడు ఆ రాత్రియే ఆ శిశువును ఎత్తుకొని కారాగారము వెడలెను. కారాగార రక్షకులు యోగనిద్రా మోహితులైరి. మధురానగర పాలకులుగూడ అక్కడ నిద్రావశులైరి.

పడిరేయి మేఘములు మిక్కిలిగా వర్షించుచుండ శేషుడు తన పడగలు విప్పి పైని కప్ప, సళ్ళుతిరిగి కెరటములు ఉవ్వెత్తుగ పరవళ్ళు దొక్కు లోతైన యమునానదిని, మోకాలిబంటి లోతు ఉన్న దానిని వసుదేవుడు విష్ణువు నెత్తుకొని దాటెను. అదే సమయమున కంసునికి కష్టము చెల్లింప అచ్చటకు వచ్చియున్న నందుడు మొదలగు గోపవృద్ధులను అతడు యమున దరిని దర్శించెను. మఱియు అతడు బాలుని యశోదప్రక్కలో నుంచి అందున్న పిల్లను ఎత్తుకొని వచ్చెను.

అప్పుడు యశోద మెళుకువగొని, పుట్టిన కుమారుని చూచెను. నల్లకలువ రేకుల బోలి నిగనిగలాడు నల్లని మేనిగల శిశువునిచూచి, ఎంతో సంబరబడెను. అట వసుదేవుడును ఆ బాలికను ఇంటికి తీసుకొని వచ్చి దేవకి ప్రక్కలో ఉంచి ఎప్పటి యట్ల ఉండెను. పిమ్మట కారాగార రక్షకులు పిల్ల ఏడుపువిని తటాలునలేచి దేవకి ప్రసవించిన వార్తను కంసునికి నివేదించిరి. కంసుడు అపుడు వెంటనే వచ్చి, ఆ పిల్లను పట్టుకొనెను. దేవకి మృదుస్వరమున విడువు, విడువుమని వారించుచున్నను, వాడటనున్న బండపైకి ఆ బాలికను విసరి కొట్టెను. ఆ శిశువు ఆక్షణము ఆకాశమందు నిలచి ఆయుధములతో గూడిన ఎనిమిది బాహువులతో అపురూపమైన రూపుగొని, బిగ్గరగా నవ్వి రోషముగొని కంసుని చూచి, కంసా! నన్ను విసరినంత ఏమయ్యెను. నిన్ను చంపువాడు ఒకడు పుట్టి ఉన్నాడు. క్రూరుడవగు నీ పాలిటికి మృత్యువు. దేవతల సర్వస్వమూర్తి అవతరించి ఉన్నాడు. ఇది నీమనస్సులో పెట్టుకొని నీకేది హితమో అది చేసికొనుము అని పలికి ఆ దేవి దివ్య గంధ మాల్యభూషణ ధారిణియై కంసుడు చూచుచుండ సిద్ధులు పొగడుచుండ ఆకసము వెంట వెళ్ళెను. (182)

కంసవిచారము

వ్యాసుడు అనియె –

అంతట కంసుడు మనసు తొట్రుపడగా, ప్రలంబుడు, కేశి మొదలయిన అసుర ప్రముఖులను పిల్చి ఓ ప్రలంబ! మహావీర! కేశీ! ధేనుక! పూతనా! అరిష్టా నా మాటలను ఆలింపుడు. దురాత్ములు దేవతలు నన్ను చంపయత్నించుచున్నారు. నేను వీండ్రను లెక్క సేయను. దేవకికి పుట్టినపిల్ల చెప్పిన మాటలు ఆశ్చర్యము గల్గించినవి. వారెంత యత్నము చేయుచున్నను వారియెడ నాకు పరిహాసము గల్గుచున్నది. అయినను ఆ దుష్టులకు అపకారము చేయయత్నింప వలసినదే. త్రికాలములందు నిత్యమయిన మృత్యువు నా కొరకు పుట్టినట్లు ఆ బాలిక చెప్పినది. కావున ఏ పిల్లవాని యందు మిక్కిలి బలము కాన్పించునో, వెదకి వానిని తుదముట్టింపుడు" అని

ఇట్లు ఆజ్ఞ ఇచ్చి కంసుడు ఇంట ప్రవేశించి, దేవకీ వసుదేవులతో వైరము దోపకుండ ఇట్లనియె. ఊరక మీశిశువులను నేను చంపితిని. కాని ఎవ్వడో మఱి ఒకడు నా నాశమునకు పుట్టియున్నాడు. మీరు బాధపడకుడు. భావి తప్పదు. మీకు ఇద్దరి పిల్లలు లేరు గదా! ఆయుర్దాయ సమాప్తియందు ఎవడు చంపబడడు? అని దేవకీ వసుదేవులను అమ్మ యించి కారాగారమునుండి వదలిపెట్టి, సంతోషపరచి తన అంతర్గృహమున ప్రవేశించెను.

బృందావన గమనము

వ్యాసులు అనిరి –

వసుదేవుడు కారాగృహము నుంచి విముక్తిపొంది నందుని బండియెక్కి నాకు పుత్రుడు కల్గినాడని ఆనందభరితుడు అగుచున్న నందుని జూచెను. మఱియు అతనితో ఆదరముగొని నీకీ వార్ధకమందు పిల్లవాడు కల్గినాడు. రాజునకు మీరు ఏటేట చెల్లింప వలసిన పన్ను కట్టుటకు వచ్చి అది చెల్లింపబడెగదా వచ్చినపనియైనది. శీఘ్రముగ గోకులమునకు ఏగుడు. నాకు అక్కడ రోహిణి యందు శిశువు పుట్టినాడు. మీ బిడ్డనట్లు వానిని తమరు రక్షింప వలయును అనియె.

నందాది గోపకులు బండ్లమీద ధన భాండముల నెక్కించుకొని తెచ్చిన ధనమును పన్ను చెల్లించి వ్రేపల్లె యందు ఉండగా, బాలఘాతినియైన పూతన వచ్చి నిదిరించుచున్న కృష్ణుని ఎత్తుకొని ఒకరేయి పాలిచ్చెను. ఆమె ఎవనెవ్వనికి చను గుడిపెనో వాని శరీరము నశించుచుండును. కృష్ణుడు ఆ రాక్షసి స్తనము రెండు చేతుల నొత్తి పట్టుకొని కోపమున ప్రాణములు త్రావివైచెను. అది అరుచుచు ప్రేగులు తెగి ప్రాణము పోయి, భూమిపై పడిపోయెను. దాని ఆరుపువిని హడలిపోయి మేల్కని వ్రేపల్లెలోని జనము పూతన ఒడిలో ఉన్న కృష్ణుని, కూలిపడియున్న ఆ రక్కసిని చూచిరి. యశోద తటాలున కృష్ణుని ఎత్తుకొని జడిసిపోయి ఆవుతోక తలచుట్టుతిప్పుట, నుదుట గోమయము బొట్టుపెట్టుట, మున్నగు అంగరక్షలు చేసి, చంటి పిల్లలకగు దోషమును వారించెను. మఱియు ఆ తల్లి ఇట్లు రక్షాకవచము బఠించెను.

ఎవని బొడ్డునందు ఉద్భవించి తామర పువ్వునుండి జగత్తు పొడమినదో, ఆ సర్వభూత కర్తయగు హరి నిన్ను రక్షించుగాక! ఎవ్వని కోర తుట్టతుద ధరింపబడిన ధారుణీ సర్వ జగత్తును ధరించుచున్నదో ఆ వరాహరూపము దాల్చిన వేల్పు కేశవుడు నిన్ను రక్షించుగాక! నీ గుహ్యమును జఠరమును విష్ణువు, నీ పిక్కలను పాదములను జనార్దనుడు రక్షించుగాక! ఎవ్వడు వామనమూర్తియై క్షణములో మూడడుగులిడి ముల్లోకములను ఆక్రమించెనో, ఆ వామనమూర్తి ఆయుధములగొని నిన్ను బ్రోచుగాక. గోవిందుడు నీ శిరస్సును కాపాడు

గాక! కేశవుడు నీకంఠమును రక్షించుగాక! నీ ముఖము నీ బాహువులు నీ ముంజేతులను మనస్సును సర్వేంద్రియములను అవ్యాహతైశ్వర్యుడు అవ్యయుడు అగు నారాయణుడు రక్షించుగాక! నలుదిక్కుల నిన్ను వైకుంఠుడేలుగాక! విదిక్కులందు మధుసూదనుడు బ్రోచుగాక! అంబరవీథిని హృషీకేశుడు, మహీధరుడు భూమి నందును నిన్ను రక్షించుగాక! అని ఇట్లు యశోదమ్మచేత మంగళాశాసనములు చేయబడిన బాలకుడు బండిక్రింద పొత్తిళ్ళపై పరుండబెట్టబడెను. అంతట గోపకులు కూలిన పూతన కళేబరమును చూచి వచ్చిన దానిని చూచియు అదలిపోయి ఆశ్చర్యము పొందిరి.

ఒకతఱి ఒక బండి క్రింద పరుండిన మధుసూదనుడు రెండు పాదములు మీదికెత్తి పాలకై ఏడ్చుచుండెను. ఆ స్వామి పాదముల తోపునకు ఆ బండి తలక్రిందుఅయ్యెను. అందున్న పాలకడవలు అన్నియు బోర్లపడెను. అంత ఆగోప గోపీజనము హాహాకారము చేసిరి. అందఱు వచ్చి వెల్లకిలపరున్న శిశువు చూచి, ఈ బండి ఎవ్వని వలన తిరుగు పడినదని అడిగిరి. అచ్చట ఉన్న పిల్లలు ఈ పిల్లవాని వలననే ఇది పడినది. ఏడ్చుచు ఈతడు పాదములు ఆడింప అవి తగిలి ఈబండి తలక్రిందులైనది. ఈపని మఱి ఎవ్వనిది కాదనిరి. అదివిని గోపకులు ఇంకను వింతపడిరి.

నందగోపుడు ఆబిడ్డను ఎత్తికొని వెఱగుపడెను. యశోద అబ్బురపడి పగిలిన కుండ పెంకులుగల బండిని పెరుగు, పూలు, పండ్లు, అక్షతలచే అర్చించెను. గర్గాచార్యులు గోకుల మందు వసుదేవు ప్రేరణముచే (కంపభీతిచే) ఎవ్వనికిని తెలియరాకుండనే ఆ బలరామ కృష్ణులకు జాతకర్మాది సంస్కారములు చేసెను. ఆ ముని పెద్దవానిని రాముడని, చిన్నవానిని కృష్ణుడని పేర్కొనెను. అత్యల్ప కాలముననే ఆ బాలురు మహాబల సంపన్నులయిరి. కాలుచేతులు ఆడించుచు క్రమముగా ప్రాకుచు వెలిబూడిద మెడల పూసుకొని ఇట్టటు నడయాడుచుండ ఆ అన్నదమ్ములను చూచి ఆ తల్లి యశోద పట్టలేని సంతోముగలదయ్యెను. గోవాటమునందు, లేగల దొడ్డియందు ఆ బాలురు ఆనాడే పుట్టిన లేగదూడల తోకలు పట్టుకొనిలాగుచు, ఇద్దరు ఒక్కచోట నడయాడుచు ఆటలాడుచుండ యశోద వారిని పట్టలేనిది అయ్యెను. కొన్ని సందర్భాలలో ఆ తల్లి కోపగించుకొని కృష్ణుని త్రాడుగొని తోలికి గట్టి ఓరోరి అల్లరి పిల్లవాడ! నీ చేతనైన ఏది ఎటువెళ్ళెదవో చూచెదనని ఇంటి పనులు చక్కపెట్టు తొందరలో ఉండ ఆ బాలుడు రోలును ఈడ్చుకొనుచు పోయిపోయి రెండు మద్ది చెట్ల నడుమ పోయి ఇరుకుత్రోవ యందు పోవుచుండ తోలు తిరుగుడువడితాక, ఆ చెట్లు పెనుకొమ్మల కూలి పడిపోయెను. అంత అచ్చట పొడమిన కటకట శబ్దమువిని బెదరి వ్రేపల్లె జనము గ్రమ్ముకొని ఆ పెనుమ్రాకుల మొదళ్ళు పెల్లగిల కొమ్మలు

వితిగి పుడమిబడ జూచిరి. దానితోబాటు వచ్చియురాని పలువరుస మందహాసమును ఇంపును నా మ్రాకులజంట నట్టనడుమ బొజ్జదిఱుగ పెనురజ్జువున గట్టబడిన పలుదిట్టమై చిట్టి కుఱ్ఱని చూచిరి. దామముచే ఉదరమున కట్టబడినవాడు కావున దాన అతడు దామోదరుడయ్యెను. అప్పుడు గోపవృద్ధులు సందాదులు బెదరిపోయి ఎడనెడ ఇట్లు కల్గు మహోత్పాతములకు జడిసిపోయి ఇచ్చట పనిలేదు ఎటకేని కారడవికి బోవుదము అనుకొనిరి. వ్రేపల్లెలో కన్పించిన పెక్కురకముల ఉత్పాతములివి. పూతన కూలుట, బండి తలక్రిందులగుట, పెనుగాలి, మఱి యే ఇతర దోషము లేక చెట్లు కూలిపడుట–ఇవన్నియు మనకు నాశనహేతువులు. అందుచే ఇచ్చట నుండిలేచి ఇపుడు బృందావనమున కేగుదుము గాక. భౌమమయిన ఉత్పాతదోషము ఏర్పడకుండ నీ పల్లెను విడచిపోవలయునని నిశ్చయించిరి. మరియు తమతమ వారిని బందుగులను విలంబము వలదు లెండు లెండని హెచ్చరించి అందఱు బండ్లెక్కి గోధనములతో (మందలతో) నాలమేపరులను వ్రజవాసులను పిలిచికొనుచు మందలుగా తరలిపోయి. క్షణములో ఆ వ్రజవాటము సర్వావయవ భంగముపొంది కాకి కూతలచేత భయపడి పోయెను.

భగవంతుడు కృష్ణుడు గోవుల క్షేమాభివృద్ధులను కోరి శుభమయిన మనస్సుతో బృందావనమును ధ్యానించెను. అందుచే మిక్కిలి పరుషమైన గ్రీష్మకాలమునకూడ వర్ష ఋతు ధర్మములుతోచి వానకారునంబోలె ఎటజూచిన లేత పచ్చికలు ఆశ్చర్యము కొలిపెను. సర్వ గోకులము అట్లు బృందావన నివాసమయ్యెను. వారెక్కి వెళ్లిన బండ్లు నిలిపిన అవ్వన వాటము అర్ధచంద్రాకారమున శృంగార మొలికించె. రామదామోదరులు అక్కడ ఆలకాపరులైరి. ఆ గోవుల మందలందు, గోశాలలందు (గోష్ఠములందు) సువిలాసముగ ఆ బలరామకృష్ణులు ఆడుకొన చొచ్చిరి. తలయందలి కొండెసిగలందు నెమలి పింఛములను దోపుకొని ఆ అడవి పూలను జుట్టులందు తురిమి పిల్లన గ్రోవులు ఊది కొనుచు, లయానుగుణముగ వాద్యములు వాయించుచు, ఇరువంక జులుపములు వ్రేల అగ్నికుమారులో అన్నట్లు (కుమారస్వామి పోలికతో) నవ్వుచు కేరుచు కేరింతలు కొట్టుచు ఆవనమందు సంచరింపసాగిరి. ఒండొరులంగని పరియాచకము లాడుకొనుచు అంగడి కాండ్రకూడి దూడల మరలించు కొనుచు ఇట్లు సరసన వారు ఏడు ఏండ్ల ప్రాయమువారైరి.

ఎల్లలోకములను కాచువారు, అచ్చట అట్లు దూడలంగాచువారైన తఱి నింగినెల్ల మబ్బులు క్రమ్మ వర్షపు ధారల దశదిశలు ఒక్కటి గావించి వానాకాల మేతెంచె. ఎటు చూచిన చెట్లు చేమలు తీవలు మొగ్గదొడిగి కొన్ననలుపూసె. ఇంద్ర గోపములు మెఱసి మరకతమణి పద్మ రాగములు పొదవినట్లు అందము గుల్కి, నదీజలపూరములు కట్టలు

త్రెంచుకొని నడమంత్రపు సిరినొంది దుందుడుకువడ చెడగరుల మనస్సులట్లు ఉన్మార్గగాములు (దారితప్పి నడచునవి) అయ్యెను. సమయముగాని సమయములైనను స్వేచ్ఛగా ఆ మందకువచ్చి ఆ వీరులు బలరామకృష్ణులు ఈడుజోడు వారింగలిసి అమరులట్లు ఆ బృందావన మందు ఆటలాడిరి. (174)

కాళీయ మర్దనము

కృష్ణుడు గోపకులతో అడవి పూలమాలలు దాల్చి బలరాముడు రాకుండ ఒకసారి బృందావనమునకు వెళ్ళెను. అచట తరగలులేచి నురుగులు ఒడ్డుల దొరయ, నవ్వుచున్నదా అన్నట్లున్న కాళిందీ నదికి పోయి అందు ఒక భయంకరమైన విషాగ్నిని చిమ్ము కాళీయ సర్పమునకు నివాసమైన మడుగును జూచెను. విషాగ్ని వ్యాపించి మాడిపోయిన ఆ తీర మందలి తరువులతో గాలి తాకిడికి లేచిన విషజల స్పర్శచే మాడిపోయిన పక్షులతో మరొక మృత్యుముఖమా అన్నట్లు మహారౌద్రమై ఉన్న అమడుగు చూచి మధుసూదనుడు ఈ మడుగులో విషాయుధుడు కాళీయుడు అను దుష్ట సర్పరాజు ఉన్నాడు. ఇంతమున్ను వీనిని సముద్రమందు నిర్జించి వదలిపెట్టితిని. వానిచేత సాగరమున కలియు యమునానది విషదూషితయైనది. దానిచే నరులు గోవులు దప్పిక గొనియు దీని దరిలేక పోవుచున్నారు. కావున వీనిని అవశ్యము నిగ్రహింపవలెను. వ్రేపల్లెలోని జనము నిత్యము వీనికి జడియుచుందురు. వారెల్లరు ఇంక ఇచట సుఖముగ సంచరింతురు గాక. ఇందు కొఱకే నీ లోకము నందు అవతరించితిని. ఇది సత్పురుషులకు రాకపోకలకు అనువైన చోటు. దురాత్ములకు శాస్తి చేయవలెను. కావున అనతి దూరములోనున్న కదంబ వృక్షమును (కడిమి చెట్టును) ఎక్కి జీవనాశకమైన ఈ విషపు మడుగులో దూకెదను అని తలచి నడుమున వలువ బిగించుకొని ఆ కాళీయుని మడుగునందు కృష్ణుడు దూకిపడెను.

అట్లు దూకిన హరిచే ఆమడుగు కలగబడి దూరదూరమున ఉన్న వృక్షములను గూడ తన జలములచే దడపెను. విష జ్వాలలచే క్రాగిన ఆ ఉడుకు నీటిచే తడుపబడిన చెట్లు అంటుకొని నలుదెసల జ్వాలలు క్రమ్ముకొనెను. కృష్ణుడు ఆ మడువును బాహువులచే కలగుండుపరచెను. ఆ శబ్దము విని నాగరాజు కోపముచే నిండ ఎరుపెక్కిన కనులతో విష జ్వాలాకులమైన బుడగలతో మఱిపెక్కు ఎఱ్ఱని మహా విష సర్పములతో చుట్టుకొనబడి ఉండెను. ఆ నాగుని భార్యలు మనోహర హారములను తాల్చి మేనులు కంపింప, కుండలములు జలించి మణికాంతులు మిరుమిట్లు గొలుప నూరునకు మించి అందంద క్రమ్ముకొనిరి. ఆ ఫణిరాజు ఫణాగ్ర మందు జొచ్చి కృష్ణుడు పడగల బంధమందు జిక్కుకొనియె.

కాళీయుని పరివారమగు పాములు విషజ్వాలలు చిమ్ము ముఖములచే కరచెను. ఆమడ గున బడి నాగుని భోగమునందు ఇరుకుగొని యున్న హరిని చూచి గోపకులు వ్రేపల్లెకు పోయి శోకవివశులై గోలపెట్టిరి. ఇదిగో కృష్ణుడు కాళీయుని మడుగున విషముచే మూర్ఛ పోయినాడు. సర్పరాజు వీనిని తినివేయగలడు. రండు. త్వరగా రండని కేకలు పెట్టిరి.

అదివిని గోపకులు గోపికలు పిడుగుపడినట్లై యశోద మున్నగువారందరు మదువ దరికేగిరి. 'కృష్ణుడెక్కడ' అనుచు వ్రేపల్లెలో యశోదతో బెదరిబెదరి తడబడుచు అటకు వచ్చిరి. నందుడు గోపకులు బలరాముడు మొదలగు అద్భుత పరాక్రమ సంపన్నులు కూడ హడలెత్తి కృష్ణుని చూచుటకు యమున కేగిరి. సర్పరాజ వశమున నుండి అన్ని పడగలచే చుట్టబడి ఏమి జేయక మిన్నకున్న కృష్ణుని జూచిరి. నందగోపుడు నిశ్చేష్టుడై కొడుకు నెమ్మోము చూచుచు నిలువబడెను. మఱియుంగల గోపికలు ఏడ్చుచు, కేశవుని గూర్చి శోకాక్రాంతులై, భయభ్రాంతులై, యశోదతోగూడ ఈపెనుమడువున జొత్తుము చత్తుము గాక తిరిగి పల్లె చెంతకు పోరాదు. సూర్యుడులేని పగలేమి, చంద్రుడు లేని రాత్రి యేమి? రాత్రి పాలులేని ఆవులు? ఏమి ఆవులు. కృష్ణుడులేని వ్రేపల్లె ఏమి పల్లె? ఈ కృష్ణుడు లేకుండ గోకులమునకు పోనేపోము అను నీ గోపికల మాటవిని రోహిణి కొడుకు బలరాముడు కృష్ణ దూరులైన గోపకులను జూచి చూపు నిలిపి బిడ్డ ముఖమున జూపు పెట్టి దిగులు పడియున్న నందుని, మూర్ఛాకులయైన యశోదను ఉద్దేశించి కృష్ణ ప్రభావమెఱిగి ఇట్లనియె

'దేవదేవ! నీ మానుష భావము వెల్లడించుచుంటివా? ఆత్మ స్వరూపమును నీ వెరుగవా? వేరొక రూపే చూపనేల? నీవే జగత్తునకు నాభిభూతుడవు. దేవతలకు ఆశ్రయుడవు. త్రైలోక్యమునకు కర్తవు, భర్తవు, హర్తవును, వేదత్రయీ రూపుడవు. ఇట అవతరించిన మన ఇద్దరకు గొల్లలే చుట్టాలు కదా కృష్ణా! గోపికలు అంతే కదా! ఇట్లు పరితపించు నీ బంధువులను చూచి ఎందువలన ఉపేక్షించుచున్నావు. మానుషభావము చూపితివి. బాలచేష్టలు ప్రదర్శించితివి. కోరలు ఆయుధముగ గొనిన ఈ దురాత్ముని దమింపుము' అని బలరామునిచే జ్ఞప్తి చేయబడి, కృష్ణుడు చిరునవ్వున అధరబింబము తెరచుకొన భుజా స్ఫాదనముజేసి పాము పడగల బంధముల నుండి తన మేనిని వదలించుకొనెను.

రెండు చేతుల ఆ పాము మధ్యమ ఫణమును వంచి వ్రాలిన వాని తలపై కెక్కి అవక్ర విక్రమమున నర్తనము చేసెను. హరి పాదకుట్టనములచే (రాపిడిచే) వాని పడగలు పుళ్ళుపడెను. త్రొక్కిన తల వొంగిపోయెను. కాళీయుడు కృష్ణపాద ఘట్టనమున మూర్ఛ

చెందెను. దండపాతమట్లు పడిపోయి నెత్తురు గ్రక్కెను. శిథిలములైన శిరస్సుల ముఖముల నుండి రక్తము స్రవింప చూచి, వాని భార్యలు మధుసూదనుని శరణొందిరి.

దేవదేవ! సర్వేశ్వర! పురుషోత్తమ! నీవు పరంజ్యోతి స్వరూపుడవు. ఆత్మయొక్క భాగమే నీవు. నిన్ను స్తుతింప దేవతలును చాలరు. అట్టి నీ స్వరూప వర్ణన ఆడుది ఎట్లు చేయగలదు. పృథివ్యాపస్తేజో వాయ్వాకాశ రూపమయిన బ్రహ్మాండము నీలో అల్పాల్పమైన అంశము. అట్టి నిన్నేమి స్తుతింపగలము. కావున ఓ జగత్ప్రభో! ఈ నాగుని ఎడ దయ చూపుము. అణగిమణగి ప్రాణములు వదలుచున్నాడు. భర్తృభిక్ష పెట్టుము అని నాగ పత్నులు పలుక కాళీయుడు ఒడలెల్ల నలుగుడువడి కూడ దేవదేవ! అనుగ్రహింపు మని మరిమరి ఇట్లు పలికెను.

నీ ఐశ్వర్యము ఎనిమిది విధములు. అది స్వభావసిద్ధము. దానిని అతిశయించు నది మఱిలేదు. అట్టి అణిమాది విభూతి సంపన్నుడగు నిన్ను ఏమని స్తుతింపగలను. నీవు పరుడవు, పరునకును మూలము నీవు. నీకంటె పరమైన తత్వము నీవె. పర తత్వమునకు పరమునీవు. అట్టి నిన్నేమి స్తుతింపగలను. జాతిచే రూపముచే తాము ఇట్లు నన్ను సృజించితిరి. దానికి అణుగుణమైన స్వభావము కూడినవాడను. తదను గుణమైన చేష్టను చేసితిని. సర్వ స్వభావమైన కాటు వేయుటను, కరచుటను మాని వేఱొక తీరున ప్రవర్తింతునేని స్వామి! నన్ను దండించుట న్యాయము. అట్లయ్యు ఓజగత్ప్రభు! నాపై దండనము వైచితివి. ఈ దండనము నీవు విధించినది కావున ఇది వరముగ నేను స్మరింపవలసినదే. ఇంతకంటె నీవలన మఱొక వరము వలదు. అచ్యుత! వీర్యము హతమైనది. విషము హతమైనది. నీచే నేనును దమితుడను అయితిని. ప్రాణ మొక్కటి మాత్రమిమ్ము. నేను మఱియేమి సేయవలెనో ఆజ్ఞాపింపుము. అని పలుకగావిని శ్రీభగవానుడు "ఓ పాము! ఈ యమున జలమున ఇక్కడ నీవెపుడు ఉండవలదు. భృత్యపరివారముతో నీవు సముద్రజలములలోనికి చనుము. నీతలపై నా పాదములను జూచి సముద్రమున పన్నగారియైన గరుడుడు నిన్ను చంపడు" అని హరి సర్పరాజును వదలెను. వాడును కృష్ణునకు మ్రొక్కి సముద్రమున కేగెను. సర్వభూతములు చూచుచుండ భృత్యులతో, సంతతితో, బంధువులతో, భార్యలందరితో ఆ మడుగు విడిచి సర్పము పోయి నంతట గోపకులు చనిపోయి మఱి బ్రతికివచ్చిన వాని విధముగ గోవిందుని కౌగిలించుకొని భాష్పములచే అతని శిరస్సును తడిపిరి. ఎల్లరు మనసులు అచ్చెరువుచెంద ఆనందభరితులై ఆనంద మధుర మంగళ రసపూరితముగా చూచి స్వామిని స్తుతించిరి. గోపికలచే కీర్తింపబడి, గోపకులతో కృష్ణుడు వ్రేపల్లెకు అరుదెంచెను. (175)

ధేనుక వధ

బలరామకృష్ణులు కలసి ఆవులను కాచుచు ఆవనమున తిరుగుచు చక్కని తాల వనమునకు వెళ్ళిరి. ఆ వనమందు నరగోమాంసములను తినుచు గాడిదరూపమున ధేనుకుడను దానవుడు వసించుచుండెను. ఆ వనములో తాటిపండ్లు సమృద్ధిగా ఉండుటను చూచి గోపకులు కుతూహలముతో ఓ రామకృష్ణ! ఈ ప్రాంతము ధేనుకుని కాపుదలలో ఉన్నందున సువాసనగల ఈ పండ్లు వదలి వేయబడి ఉన్నవి. వీనిని మేము కోరుచున్నాము. మీకది సమ్మతమైనచో వీనిని రాలగొట్టుదము అన బలరాముడు, కృష్ణుడును వానిని పడగొట్టిరి.

ఆ చప్పుడువిని రాక్షసుడు గర్దభాకారుడు కోపముతోవచ్చి వెనుక కాళ్ళతో వాని యెదురు రొమ్ముపై కొట్టగా ఆ కాళ్ళను పట్టుకొని గిరగిర ద్రిప్పి ఆకసమున కెగురవేసెను. వాడు ప్రాణములను బాసెను. అట్లు పడుచున్న వాని తాకిడికి పండ్లు గుట్టలుగ పడినవి. వాని జ్ఞాతులు ఖరాసురు లెందరో ఎదిరింపగా వాయువు మేఘములను చెదరగొట్టినట్లు వారిని అందరను బలరామ కృష్ణులు ఆ చెట్లమీదకు విసరిరి. దానిచే తాటి పండ్లు అన్నియు నేలపైబడి చూచుటకు ఇంపుగ తోచెను. క్రూరులగు ఆగర్దభాకారులు చచ్చి పడినంతనే, అవి నిరాబాధమై గోపకులు, గోవులు హాయిగ సంచరింప మిగుల రమణీయమై ఒప్పెను. అందలి పచ్చని లేబచ్చికలయందు ఆ గొల్లపిల్లలు తాళ ఫలములు ఆరంగించిరి. (176)

రామకృష్ణుల బహువిధ లీలలు వర్ణనము

గర్దభాసురుడు తమ్ములతో హతుడైన తరువాత గోపీగోపాల బృందమునకు తాళ వనము చక్కని విహారస్థానమయ్యెను. బలరాములు లేగొమ్ములు గల వృషభములట్లు ఆ గోప సమాజమున రాణించిరి. ఆలమందలను దూరదూరములకు తోలుకొనిపోయి వానిని రకరకములైన పేరులతో పిలుచుచుండిరి. లేగల పలుపులను భుజములందు వైచుకొని వనమాలలు దాల్చి సువర్ణాంజన చూర్ణములచేత మెరయు వస్త్రములు ధరించి, ఇంద్ర ధనస్సులవలె, తెలుపు నలుపు మేఘములట్లు కానవచ్చుచు, విచిత్రములైన జాతీయ ములయిన ఆటలాడుచు విహరింపజొచ్చిరి. సర్వలోకనాథులు అందరకు దిక్కై అవనింజొచ్చి మనుష్య ధర్మాభిరతులై మానవత్వమును సమ్మానించుచు, మానవజాతికి అనుగుణమైన ఆటలాడుచు ఆ వనమున క్రీడించిరి. మఱియు తూగుటుయ్యాలలపై ఊగుచు, కుస్తీ మొదలైన చిన్నచిన్న యుద్ధములందు తలపడుచు, ఉండీల బద్దలుగొని మీదికి రాళ్ళు విసరుట మొదలగు విచిత్ర వ్యాయామములచే వినోదించుచుండిరి.

అంతట ప్రలంబాసురుడు అను రాక్షసుడు గోపవేషమున రహస్యముగా సంచరించుచు ఆ గోపకులనడుమ ప్రవేశించెను. అవకాశము వెదకుచు ఆ బలరామకృష్ణులను అప్పట్టున సంహరింప తలచెను. ఒండొరులను భుజముల నెక్కించుకొని మోయుట అను ఒక వింత ఆటకు జొచ్చి బలరాములతో తలపడెను. శ్రీదాముడను గోపకునితో కృష్ణుడు, ప్రలంబునితో, బలరాముడు మఱి గోపకులతో గోపకులు ఎగిరి ఎగిరి ఆ ఆటలో వినోదించిరి. కృష్ణుడు శ్రీదాముని బలరాముడు ప్రలంబుని ఓడించిరి. కృష్ణునివైపు గొల్లలు ఎదిరి గొల్లలను గెలిచిరి. ఓడినవారు ఓడనివారిని భాండీరస్కందము దాక మోసికొని పోయి తీసికొని రావలెనను పందెముపెట్టి ఆడుకొనజొచ్చిరి. ఆ దానవుడు తానే ఓడినట్లు నటించి మబ్బులో నున్న చంద్రునట్లు తాను బలరాము నెత్తుకొని పోవుచు ఆ బరువు మోయలేనట్లు వర్షమేఘమట్టి తన కాయమును పెంచెను. బలరాముడు కార్చిచ్చునగాలు పర్వతమట్లు పూలమాలలు వ్రేలదలపై కిరీటము దాల్చి బండి చక్రము లట్టి మిడిగ్రుడ్లతో రౌద్రాకారుడై, పాదముల తాకిడిచే భూమి అదర తనను మోసికొని పోవుచున్న వానిని గని కృష్ణా! పెద్ద కొండవలెనై మాయా గోపాలరూపముతో రాక్షసుడే ఒకడు నన్ను మోసికొని పోవుచున్నాడు. వీడు పరమ దుర్మార్గుడు. ఇపుడు నేనేమి చేయవలెనో తెలుపుము అనగా గోవిందుడు చిరునవ్వున పెదవులు తెరచి, బలరాముని బలపరాక్రమము లెరిగినవాడు కావున ఇట్లనియె.

సర్వాత్మకుడు సర్వరహస్యములకు రహస్యము అయిన నీవు మానవ రూపము ధరించుట వినోదార్థము. ఒకానొక కారణమున నాకు అన్నవై అశేష జగత్ప్రభువైన నీవు సర్వ కారణమైన నీ స్వరూపమును తలచుకొనుము. జగమెల్ల ఏకార్ణవమైనపుడు నీవును నేనును కలిసి ఏకైక పరబ్రహ్మ మగుటయు, ఈ జగమును నిలుపుటకు వేరు అగుటయు సత్యము. కావున నిన్ను నీవెరిగి ఈ దానవుని సంహరింపుము. మానుష భావమిట్లు హూని మనవారికి బంధువులకు హితము చేయుము.

ఇట్లు కృష్ణ భగవానునిచే జ్ఞప్తిచేయబడి బలరముడు అల్లన నవ్వి, ప్రలంబుని పట్టి ఎత్తి కోపముచే కన్నులెర్రబడ పిడికిట వాని నడినెత్తిపై గ్రుద్దెను. ఆ దెబ్బతో వాడు కనుగ్రుడ్లు వెలికిరాగా తలపగిలి నోట రక్తము గ్రక్కికొని భూమిపైబడి మృతినొందెను. అద్భుతమైన బలముచే బలుడట్లు ప్రలంబుని కూల్చి, గోపకులు బాగుబాగని ఆనంద భరితులై రాముని స్తుతించిరి. అవ్వల గోపకులతో, కృష్ణునితో, బలరాముడు గోకులమునకు చేరుకొనెను.

రామకేశవులట్లు విహరించుచుండగ, వర్షఋతువుగడచి తామరపూలు వికసింప శరదృతువు వచ్చెను. ఆకాశము స్వచ్ఛమై నక్షత్రములు కాంతులను చిమ్మగా చక్కని ఆనమయ మందు వ్రేపల్లె జనము ఇంద్రోత్సవ ఆరంభము చేయ కుతూహలపడుట

చూచి కృష్ణుడు పెద్దవాండ్రతో ముచ్చటగ ఇంద్రోత్సవము అనగా ఏమి? దీనికి మీరింత ఆనందపడుటకు కారణమేమి అని అడుగ నందుడు అతనితో ఇట్లు అనెను.

మేఘములకును జలములకును దేవేంద్రుడు అధిపతి. అతని ప్రేరణముచే జల రూపమున సర్వ ప్రాణాధారకమయిన రసము అనగా నీరు వర్షించును. ఆవర్షమునే పండిన పంటను మనము, ఇతర ప్రాణులు తిని బ్రతుకుదుము. దేవతలను దానినే తృప్తి పరుతుము. ఆవులు పాలిచ్చును. లేగలతో వానల వలన గల్గిన సస్యము సంతృప్తి పడును. సస్యసమృద్ధి, పచ్చిక (మేత) సమృద్ధి మేఘ నిమిత్తమే. సకాలమున వర్షించు మేఘములుగలచోట ఆకలికి అలమటించు జనముండరు. సూర్య కిరణములచేత మేఘము ఈభూమియందలి ఉదకమును చేకొని ధరించును.సర్వలోక జీవనమునకు భూమిపై అది వర్షించును. అందువలన వర్ష ఋతువునందెల్ల రాజులు సంతోషముతో ఈ ఉత్సవము నందు దేవేంద్రుని కొలుతురు. మనము మఱి ఎల్లజీవులు అమరపతిని కొలుచుటయు అందులకే అని తెలుప నందుని మాటవిని ఇంద్రుని పూజించు విషయమున కృష్ణుడు దేవేంద్రునకు కోపము గలుగునట్లుగా ఇట్లు అనెను.

మనము కర్షకులము కాము, వర్తకమును జేసి జీవించువారము కాము. గోవులే మనకు దైవము. వనమునందు సంచరింతుము. ఆన్వీక్షకి, త్రయీ, వార్తా(వర్తకము), దండనీతి అని విద్య నాల్గు విధములు. వానిలో వార్త అనగా వ్యవసాయము వాణిజ్యము పశుపాలన మునను పేర మూడు వృత్తులు చెప్పబడినవి.

కర్షకులకు కృషి పుణ్యజీవులకు (వర్తకులకు) వర్తకము, వృత్తులు. మనకన్నన్ గోపాలనము ముఖ్యవృత్తి. ఈ విధముగ వార్త అనునది మూడు విధముల చెప్పబడినది. ఎవ్వడు ఏవిద్యను నేర్చునో అదే వానికి పరమదైవము. అదే పూజింపదగినది. ఆరాధింప తగినదియు, అదేవానికి ఉపకారకముకూడ. ఒకదాని ఫలము అనుభవించుచు, వేరొక విద్యను పూజించువాడు ఇహపరములందు శుభమందడు. ప్రసిద్ధమైన మన హద్దులను (ఆవుల దొడ్లను) పూజింతము. వానికన్నిటికి హద్దుగానున్న వనమును పూజింతము. వనములకు పరమావధులైన కొండలు మనకు పరమ దైవములు. కావున గిరియజ్ఞము (కొండదేవతల పూజ), గో యజ్ఞము (గోపూజ) మనము కావింతము. ఇంద్రునితో మనకేమి పని? గోవులు కొండలు మనకు దేవతలు. విప్రులు మంత్ర యజ్ఞపరులు. మంత్రానుష్ఠానమే వారికి యజ్ఞము. కర్షకులకు యజ్ఞము నాగలి. కొండలందును, అడవులందు ఉండు మనకు కొండలను గోవులను గొలుచుటే యజ్ఞము (పూజ).కావున తామందరు రకరకములైన పూజా ద్రవ్యములచే పశువును బలియిచ్చి యథావిధిగ గోవర్ధనగిరిని అర్చింపుడు.

ప్రేపల్లెలో ఉన్న సర్వసంభారములను చేకొనుడు ఆలోచింపవలదు. ఆ సామాగ్రిచే విప్రులకు మఱి అన్నార్తులకు సంతర్పణము జేయుడుము గాక! ఆ అర్చింపబడిన కొండను ఉద్దేశించి హోమములు చేసి ద్విజులకు సంతర్పణము చేసిన తరువాత శరద్ఋతువు నందలి పూలను శిరముల దాల్చి మన ఆవుల మందలు ప్రేపల్లెకు మరలునుగాక! ఇది నా ఉద్దేశము. దీనిని ప్రీతితో చేసినయెడల గోవులకు ప్రీతిగల్గును. గోవర్ధనగిరికిని నాకును కూడసంతోష మగును. అని తెలుప కృష్ణుని పలుకులువిని నందాదులందరు సంతోషముచే మోములు విప్పార బాగుబాగని వత్సా! నీ అభిప్రాయము పరమశోభనము. నీవు చెప్పిన మాటనే మేము అనుసరింతుము ఈ గిరియజ్ఞము సాగింపబడుగాక! అని వ్రజవాసులెల్లరు పెరుగు పాయసము మాంసములతో కొండకు బలియిచ్చిరి. నూర్లు వేలుగ విప్రులకు విందులు చేసిరి. అట్లు కొలువబడిన ఆ గిరికి గోవులు ప్రదక్షిణము చేసినవి. సజల జలదములట్లు వృషభములు రంకెలు వేయుచు గిరిప్రదక్షిణము చేసెను. గోవిందుడు కొండ నెత్తమున కూర్చుండి, నేనే మూర్తి ధరించిన కొండ దేవతనని ఆ గోపశ్రేష్ఠులు గొనివచ్చి నివేదించిన పలుతెరంగులైన అన్నములను ఆరగించెను. మఱియు అదేరూపమున కృష్ణుడు గిరి శిఖరమున కెక్కి అది తన రెండవ మూర్తిగ పూజించెను. తరువాత నతడంతర్ధానముకాగ అతని వలన గోపకులు వరములు పొంది, ఇట్లు గోవర్ధనోత్సవము చేసి తమతమ గోష్ఠములకు (గోశాలలకు) తరలి వచ్చిరి. (187)

గోవర్ధనోద్ధరణము

వ్యాసుడు ఇట్లు అనియె –

ఇంద్రోత్సవము చేయ పనిలేదను గోపకుల నిశ్చయముచే మిక్కిలి కోపించి ఇంద్రుడు సంవర్తకమను మేఘగణమును గూర్చి ఇట్లనియె. ఓ మేఘములారా! నేను పలుకు వచనములు ఆలింపుడు. నా ఆజ్ఞను అవిరామముగ వెంటనే కావింపుడు. నందుడు దుర్బుద్ధియై గొల్లలను కూడగట్టుకొని కృష్ణుని ఆశ్రయబలముచే ఉబ్బి ఉత్సవ భంగము చేసినాడు. ఆ గొల్లలకు జీవనాధారము, గోపాలురు అనిపించుకొనుటకు కారణమును గోవులే కావున రాళ్లవానగురిపించి వానిని బాధింపుడు. నేనును కొండశిఖర మట్లున్న ఐరావత గజమునెక్కివచ్చి వాయువులతోడ మీకు తోడయ్యెదను" ఇట్లు ఇంద్రునిచే నాజ్ఞాపింపబడి మేఘములు గోవులకు జడుపుగొలుపు జడివాన గురిసినవి. క్షణములో ఈధరణి దిక్కులు ఆకాశము ఒక్కటిగ ఏకధారగ కురిసిన కుంభవృష్టిచే ఆవులు దెబ్బతిని మెడలు తలలు తిఱుగబడి పడిపోయినవి. కొన్ని గోవులు దూడలను తొమ్ముల

అదిమికొన్నవి. కొన్నిగోవులు దూడలకెడమైనవి. కొన్ని ఆవులు గాలికి ఒడలు వణకు చుండగా బిక్క మొగముపెట్టి కావుకావుమన్నట్లు అంబారవములుచేసి అల్లన కృష్ణుని గూర్చి మొరపెట్టికొన్నవి. గోవులు గోపికలు గోపకులతో నా గోపకులమెల్ల బెగడువడి వ్యాకులమగుట చూచి హరివారిని రక్షింప ఆలోచించెను. ఉత్సవ భంగమునకు పగగొని ఇంద్రుడిది చేసెను. నేనీ గో వ్రజమును కాపాడవలయును. ఈ కొండను పెల్లగించి ఈ గోష్ఠమునకెల్ల గొడుగుగా ఎత్తి పట్టెదనుగాక అని నిశ్చయించి ఆ గోవర్ధనగిరి ఒంటిచెక్క అవలీలగ ఎత్తి పట్టెను. మఱియును జగన్నాథుడు "వానకడ్డు చేసితిని. ఈ కొండ గొడుగు క్రింద కందఱు రండురండు. గాలితాకిడి లేనియెడల అనువగుచోట మీరు సర్దుకొనుడు. ఈ కొండ విరిగి మీద పడునేమో అని, ఈ క్రింద నిలుచుటకు జడియ వలదు" అనగా హరి పలుకువిని, గోధనములతో బండ్లకెక్కించు కొన్న కుండలు మండలతో గోపకులు గోపికలు వానదెబ్బతిని ఆ కొండ క్రిందికి జొచ్చిరి. కృష్ణుడు ఆ శైలమును కేలల్లాడకుండ ఎత్తి పట్టెను. వ్రజవాసులు ఆనందపడి అచ్చెరువుగొని విచ్చిన వెడకన్నులప్పగించి కృష్ణుని చూచి బాలకృష్ణ లీలలను గొనియాడిరి. స్వామియు అదియొక ఆటగా ఏడు రాత్రులు ఏకధారగా ఇంద్రాజ్ఞగొని మేఘములు కురియ, ఏకధాటి ఆ గోవర్ధనమును ఎత్తికొనెను. హరి అట్లు ఆపెనుకొండను ఎత్తికొన గోకులము రక్షణగొన ఇంద్రుడు తనప్రతిన అబద్ధమై, ఆకసమున మబ్బువిరిసినట్ల తన ఆలోచనలు వమ్మయిపోగా గోకులమువెడలి సంబరపడి స్వస్థానమునకు తిరిగి వచ్చెను.

కృష్ణుడును గోవర్ధనగిరిని యథాస్థానమునకు దించెను. వ్రజవాసులు ఎనలేని ఉల్లాసమున ఆవింతను చూచిరి. ఈ విధముగ గిరిని పైకెత్తగా గోకులము రక్షణము పొందగా, ఇంద్రుడు కృష్ణ దర్శనము చేసికొననెంచి ఐరావత మెక్కి క్రిందికి దిగివచ్చి ఆ జగన్నాటక సూత్రధారి, ఆ ప్రపంచమునకు అంతటికి కాపరిగా గరుడుడు తనపెక్కలు విప్పి కల్పించిన నీడక్రింద గరుడవాహనారూఢుడై ఉన్న సాక్షాద్విష్ణువును, మధుసూదనుని దర్శించి, గజరాజము నుండి దిగి ఏకాంతమునందు అల్లన నవ్వుచు ప్రీతిచే కన్నులు విప్పార ఇట్లనియె.

గోవర్ధన పట్టాభిషేకము

కృష్ణా! కృష్ణా! నేను ఇటకు నీ సన్నిధికి ఎందులకు వచ్చితినో వినుము. ఇది మతొక లాగున భావింవద్దు. భూభారముదింప ఈ ఇలపై నీవు అవతరించిన నిఖిల ఆధారుడవు. నన్ను గూర్చిన మహోత్సవమునకు భంగమయ్యెనన్న విరోధమున గోకులమును చెఱుప

నేను పంపిన కారు మబ్బులచే ఇంత రగడ జరిగినది. నీవు ఆ గిరినెత్తి యాదవులను రక్షించితివి. ఆ వింతను చూచి నేనును సంతుష్టుడనైతిని. దేవతలకు కార్యము దీనిచే నెరవేరినది. నా ప్రయోజనము చక్కగ సిద్ధించినది. నీ రక్షణ పొందిన గోవులు నీ అవతార కారణమునకు కారణమైనవి. ప్రోత్సాహము చేయుటకు నీ వద్దకు వచ్చితిని. గోవిందుడవు నీవే. ఇపుడు ఉపేంద్రుడవును కాగలవు అని ఐరావతము మెడనుండి గంటను చేకొని పవిత్ర జల పూర్ణమైన ఆ గంటచే హరికి అభిషేకము కావించెను. గోప్రేరణచే జరిపిన ఆ గోవర్ధన పట్టాభిషేక వైభవమందు గోవులు హెచ్చుగా చేపిన క్షీరధారలచే, ఆ క్షణమే అభిషేకించి వసుంధరను కూడ పూర్తిగా తడిపినవి. శచీపతి పేరుతో, వినయముతో కృష్ణునిచూచి మఱియు ఇట్లనియె.

"ఈ వైభవమంతయు గోవుల మాటనుబట్టి చేసితిని. ఒక విన్నపము కావించెదను ఆలింపుము. నా అంశమున ఈ అవనిపై మహాపురుషుడై అర్జునుడు అవతరించి ఉన్నాడు. అతడు తమ రక్షణకు అర్హుడు. భూభారమునందు నీతో చెలిమి చేయగలడు. వానిని నీవు నిన్నువలె కాపాడవలయును" అనగా భగవంతుడు ఇట్లనెను. "భారత వంశమున నీ అంశమున పార్థుడు పుట్టుట నేనెఱుగుదును. వానిని నేను అవని ఉన్నంతదనుక పాలిం తును. ఆ అర్జునుని ఎవ్వడును యుద్ధమున గెలువజాలడు. కంసుడు అరిష్టుడు కేశి కువలయాపీఱుడు, నరకుడు మఱి ఎందరో కూలిన తరువాత మహాయుద్ధము జరుగ గలదు. దానిచే భూభారము హరింపబడును. అందుచే నీవేగుము. నీ పుత్రునకై నీవు పరితాప పడకుము. అర్జునునికి శత్రువనువాడు ఒక్కడు నా ముందు ఉండబోడు. భారత యుద్ధము జరిగిన తరువాత అర్జునుని కొఱకే నేను యుధిష్ఠిరాదులను క్షేమమున ఉన్న వారిని కుంతికి సమర్పింతును" అని హరి పలుక దేవాధిపతి జనార్దనుని కొగలించుకొని ఐరావత మెక్కి స్వర్గమునకు పోయెను. కృష్ణుడును గోవులతో గోపాలురతో కూడి గోపికల చూపులచే పవిత్రమైన త్రోవనకు గొల్లపల్లెకు ఏతెంచెను. (188)

రాస క్రీడా విలాసము

వ్యాసుడు అనియె –

ఇంద్రుడేగిన తరువాత గోవర్ధనగిరిని అవలీలగ ఎత్తిన కృష్ణునికని ప్రీతితో గోపాలురు ఇట్లనిరి. 'కృష్ణా! కొండ ఎత్తిన అద్భుత లీలచే నీవు గోవులను మమ్ములను మహాభయము నుండి కాచితివి. నీ ఈ బాల్యలీల అనుపమము. ఆలకాపరి అగుట నింద్యము. నీ చేసిన పని దివ్యము. ఇదెట్లు జరిగెనో తెలుపుము. మడుగులో కాళీయుని అణగ ద్రొక్కితిని.

ప్రలంబుడు నీచేతిలో కూలెను. ఈ గోవర్ధనమును లేవనెత్తితిని. ఇవిచూడగా మా మానసములు సంశయ గ్రస్తములగుచున్నవి. శ్రీహరి! నీపాదములే మేము ఆశ్రయిం చెదము. నీ బలిమి చూచి నిన్ను నరమాత్రునిగ భావింపలేకున్నాము. సత్యము! సత్యము. నీవు దేవుడవో, దానవుడవో, యక్షుడవో, గంధర్వుడవో ఆ విమర్శ మాకేల? మాకు బంధువుడవు. నీకు నమస్కారము. ఆబాలగోపాలమునకు నీయెడల ప్రీతిగల్గినది. నీవు చేసిన పని ఎల్ల దేవతలు ఒక్కటైనను జేయజాలరు. ఒకవంక బాల్యము వేఱొకవంక అద్భుత వీర్యము విని అన్నియు ఇట్లుండ సామాన్యులమైన గొల్లలమగు మాలో నీవు జన్మించుట ఆలోచించగా మాకు సంశయము గల్గించుచున్నది". అనగానే కృష్ణుడు క్షణమాత్రము పలుకకుండ నిలిచి ప్రణయ కోపము నటించి ఇట్లు వారికి బదులు పలికెను. "నా సంబంధముచే మీకు సిగ్గు గలుగదేని నేను శ్లాఘ్యుడనే గద! అందువలన కార్యాకార్య విమర్శ ఎందులకు? మీకు నాయందు ప్రీతి ఉన్న ఎడల మీమెప్పునే పొందదగిన వాడనయిన యెడల బంధు సమానమైన గౌరవము మీరు చూపుడు. నేను దేవుడనుకాను గంధర్వుడను, యక్షుడను, దానవుడనుకాను, నేను మీకు చుట్టమునై పుట్టితిని. ఇందువలన వేఱొక విధముగ మీరు అలోచింపపనిలేదు" అని పలికిన శ్రీహరి వాక్యము విని మహానుభావులైన గోపకులు మౌనము వహించి పొలయలుక చెందిన ఆతని వద్ద నుండి బలరాముని దరికేగిరి.

రాస క్రీడారంభము

ఆకాశము స్వచ్ఛమై శారద చంద్ర చంద్రికా మనోహరమై కలువ తీగలు వికసింప దిగంతములు సువాసనలు ఘుమఘుమలాడ తుమ్మెదల ఝంకారములచే ఇంపుగొలుపు వనపాళిని జూచి కృష్ణుడు గోపికలతో క్రీడింప మనసు పడెను. బలరామునితో కృష్ణుడు పద్మములవంటి పాదములతో ఆ వనమున విహరించుచు, గోపాంగనలకు మిగుల ఇంపు గూర్చుచు వేణుగాన మొనరించెను. రమ్యమైన ఆ గీతధ్వనిని విని, గోపికలు ఇండ్లు వెడలి సత్వరము కృష్ణుని దరికి ఏతెంచిరి. ఒక గోపిక అతని అడుగులను మెల్లమెల్లగా అనుగమించెను. వేణుగానము విన గుతూహలముగొని, వేఱొకతె అతనినే స్మరించెను. మఱొకతె కృష్ణా! కృష్ణా అని పలికి అంతలో సిగ్గుపడెను. వేఱొకతె ప్రేమ కనులుగప్ప సిగ్గువిడిచి ఆతని ప్రక్కన నిలిచెను. మఱియొక గోపిక ఇంటనే నిలిచి, బయట ఉన్న పెద్దల (మామగారిని) గని బృందావనమునకు వెళ్ళుటకు సాహసము జేయలేక తన్మయతను చెంది కనులు మూసికొని గోవిందునే ధ్యానించెను. శరచ్చంద్ర మనోహరమైన ఒక రాత్రివేళ గోపికలు వెంబడింప గోవిందుడు రాసక్రీడారంభ రసోల్లాసియై

వారల ఆదరించెను. గోపికలు గుంపులుగ కృష్ణ విలాసవివశలై అతడు కనుపించకపోవుటచే విరహాతురులై కృష్ణ దర్శన అపేక్షతో బృందావన మెల్లను వెదకుచు తిరిగిరి. రాత్రి కృష్ణుని అడుగుజాడలను చూచి అతని వివిధ శృంగారానుభావములకు మురిసి, మైమరచి పరిపరి విధముల ఆ వనమున పరిభ్రమించిరి. కృష్ణుడు కనిపించనందుచే నిరాశచెంది మరలి యమునా తీరమునకు వచ్చి కృష్ణ చరిత్రమును మధురముగ స్వర సమ్మేళనమొనరించి పాడిరి. అంతలో హరిముఖ పంకజము వికసింప తటాలున ఎదురువడగ గోపికలు ముల్లోకములను రక్షింపగల పుణ్యశీలురు కావున ఆమూర్తిని దర్శించిరి. ఏతెంచుచున్న గోవిందుని ఒక సుందరి చూచి కనుదమ్ములు విప్పార ఆనంద భరితయై కృష్ణా! కృష్ణా! అని ఆలాపనము చేసెను. ఒకతె కనుబొమలు ముడివడ హరినిజూచి అ ముఖ పంకజమును తన నయనములను తుమ్మెదలచే ఆస్వాదించెను. మఱియొకతె కనులల్లన మూసికొని అతని రూపమును ధ్యానించుచు యోగారూఢయైనట్లు భాసించెను. అవ్వల ప్రియభాషణములచే ఒక్కతెను, భ్రూభంగ విలాసములచే ఒక్కతెను, కరస్పర్శముచే ఇంకొకతెను అనునయించి మాధవుడు వారి నందరిని అన్ని లీలల కలకదేర్చి, వారితో రాసక్రీడా విలాస వైభవమున రమించెను.

గోపికాజనము వర్తులాకారముగ తీరి రాసక్రీడయందు ఇమిడియున్నను, ఒకే లక్ష్యమందు స్థిరపడిన మనస్సుతో కృష్ణునియందు ఏకాగ్రత చెందిన మనస్సుతో, సుస్థిరమైన సమాధి యోగముచేత కృష్ణుని పార్శ్వభాగమును విడవకుండ నిరంతర సాన్నిధ్యానందము అనుభవించెను. శ్రీహరియొక గోపిక చేయి పట్టుకొని తన కరస్పర్శచే కల్గిన ఆనంద పారవశ్యముచేత అరమోడ్పువెట్టిన కన్నులు కలదానినిగా నొనరించెను. అవ్వల చలించు నొడ్డాణముల చిరుగంటల స్వనములచే క్రమక్రమముగ శరదృతు సమయ కావ్య గీతము అనుసరించి లయానుగుణముగ గోపికా కృష్ణుల నృత్యము ఆరంభ మయ్యెను.

ఒక గోపిక బాహులతలు సాచి కృష్ణుని కౌగిలించుకొని గోపికల సంగీత మాధుర్యమును స్తుతించు నెపమున తోచు నైపుణ్యమున స్వామిని ముద్దుపెట్టుకొనెను. ఆ గోపికల చెక్కిళ్ళ కలయిక (సంశయమును) నొంది, కృష్ణుని భుజములు ఒడలు పులకరించుట అను పంటనుజ్జీవకమగు స్వేదము అనెడి జలమును వర్షించుటలో జలధర భావమును పొందినది. (అనగా నొక సస్యమునకు వర్షము గురియు మేఘముజ్జీవక మైనట్లు కపోల స్పర్శము వలన కల్గిన శృంగారానుభవముచే గోపికలు మైమరపు చెందగా వారి తనువల్లరి పులకరించినదని భావము) కృష్ణుడు తారస్థాయిలో రాసక్రీడా గేయ మాలపించి అంతట భేష్ భేష్ కృష్ణా! అని రెట్టించి వంతపాడిరి. హరిముందడుగు వేయ ఆ వెంబడిని వారడుగు

వేసిరి. అతడు వెనుతిరిగిన, వారతనికి సమ్ముఖమైరి (ఎదురైరి) ఇట్లు లయానుగుణమైన పాద విన్యాసమున గోపాంగనలు ప్రతిమలోమానులోమముగ హరికి తారసిల్లిరి. ఇట్లు గోప సుందరులతో కృష్ణుడు రమింప అతనితో అగు క్షణము ఎడబాటు వారికి కోటి సంవత్సరముల వియోగముతో సమానమై తోచెను.

తండ్రులు భర్తలు అన్నదమ్ములు ఎంత వారించినను అత్యుల్లాసమున వ్రజసుందరులు రాత్రులందు కృష్ణునితో గ్రీడించిరి. అతడును కైశోరక వయస్సున వారిని ఆదరించుచు అనేక రాత్రులు రమించెను. వారి పతులందు గోపికలందు సర్వభూతములందు సర్వేశ్వరుడు కావున ఆత్మస్వరూపమై సర్వమున వ్యాపించి హరి వర్తించెను. సమస్త భూతములందు పృథివ్యాపస్తేజోవాయురాకాశములను పంచభూతములు ఎట్లు వ్యాపించి ఉన్నవో, అట్లే కృష్ణపరబ్రహ్మము ఆ ప్రదేశమున సర్వ వ్యాపకుడై ఉండెను.

అరిష్ట వధ

ఒకతరి అర్థాస్తమయ సమయమున (ప్రదోషకాలము సగము గడచిన తరువాత) జనార్దనుడు రాసక్రీడా వినోదమునందు ఆసక్తుడై ఉండగా అరిష్టుడను రాక్షసుడు మదమెక్కి హడలగొట్టుచు గోశాల కరుదెంచెను. కారుమబ్బువలె నల్లగ ఉండి, పదునైన కొమ్ములుగల్గి సూర్యునట్లు జ్వలించు చూపులతో డెక్కలతాకున భూతలము చీల్చుచు, నాలుకచే పెదవులను నొరయించి నాకుచు, తోకలు ఉవ్వెత్తున పైకెత్తి, మిగుల కఠినమగు స్కంధ బంధమున మిగుల వెడదయగు మూపుతో ఒడ్డుపొడువులను మిగుల గడువరానివాడై, మూత్ర పురీషములం పూతవడిన పిరుదులతో ఒడలితో గోవులకు వెరపుగొల్పుచు మెడవ్రేల ఎదురై, చెట్లతాకిడివడిన ముఖముతో, వృషభ రూపముగొని గోవులకు గర్భపాతము చేయుచు అడవుల కూల్చుచు నిలువగా ఒక దైత్యుడు అచట ఎల్లపుడు సంచరించు వాడు ఎదుటబడెను. భయంకరమగు కన్నులతో ఉన్న వానినిచూచి గోపకులు గోపికలు కృష్ణా! కృష్ణా అని ఆక్రందించిరి. అంతట కేశవుడు సింహగర్జనము చేసి చప్పట్లు చరచెను. ఆ రాక్షసుడు ఆ సడివిని, దామోదరున కెదురుగ చని కొమ్ములు ముందునకు నిగిడించి కృష్ణుని కడుపునెడ చూపు నిలిపి, పరుగులు పెట్టెను. అట్లు వచ్చుచున్న వృషభాసురునిచూచి కృష్ణుడు వానిని ఈసడించు సూచనగ ఒదవిన చిరునవ్వు సొగసు చూపి తాను నిలిచిన చోటనుండి కదలక నిలుచుండెను. మఱియు దాపునకు వచ్చిన వానిని హరి మొసలి పట్టినట్లు పట్టి, కొమ్ములు చేకొని వాని కడుపునందు తన మోకాళ్ళచే పొడిచెను. వాని కొమ్ములను ఒడిసిపట్టి వాని దర్పమును బలమును కొట్టి తడిబట్టను పిండినట్లు వాని

కంఠమును మెలిపెట్టెను. మఱియు వాని కొమ్మొకటి పెరికి దానిచేతనే వానిని గొట్టెను. ఆ మహాదైత్యుడు నోటనెత్తురు గ్రక్కుచు మరణించెను. వాడు అట్లుహతుడైనంత, గోపకులు అప్పుడు ఇంద్రుని స్తుతించినట్లు జనార్దనుని స్తుతించిరి. (188)

కేశివధ నిరూపణమ్

వ్యాసులు అనిరి –

అరిష్ట ధేనుకాది రాక్షసులు హతులుకాగా గోవర్ధనోద్ధరణము జరిగిన తరువాత, నారదుడు కంసుని సమీపమునకుపోయి, అతనికి యశోదా గర్భము మార్పు మొదలైన విశేషములు అశేషముగా నివేదించెను. అదివిని కంసుడు వసుదేవునిపై పగబట్టెను. యాదవ సభలో అతడు యాదవులను దుయ్యబట్టి తనలో ఇట్లు ఆలోచించెను.

బాలురైన బలరామకృష్ణులను బలవంతులు కాకుండనే నేను వధింపవలయును. యౌవన మొందిన తరువాత వారు అసాధ్యులు అయ్యెదరు. ఇక్కడ చాణూరుడు ముష్టికుడును మంచి బలశాలురు. వీరితో ఆ బాలురకు మల్లయుద్ధము పెట్టి ఆ దుర్మార్గులను చంపెదను గాక! ధనుర్యాగమను మిషపెట్టి వ్రేపల్లెనుండి వారల రావించి వారు కడతేఱుటకు ఎట్లెట్లు చేయవలెనో అట్లు చేసెదను అనితలచి, ఆదుష్టుడు ఒక నిశ్చయమునకు వచ్చి అక్రూరునితో ఇట్లు అనెను.

ఓ దానవేశ! నా ప్రీతి కొఱకు నీవిట నుండి రథమెక్కి గోకుల మేగుము. హరి అంశమున బుట్టిన వసుదేవుని కొడుకులను గైకొనిరమ్ము. వారలు నా చావునకు పుట్టి పెరుగుచున్నారు. ఈ చతుర్దశినాడు ధనురుత్సవమను మహాయాగము జరుగగలదు. అందు మల్లయుద్ధమునకై ఏర్పాటు జరుగును. నాకడ చాణూర ముష్టికులను మల్లురు యుద్ధ కుశలురు. వారలతో ఈ బలరామ కృష్ణులకు జరుగు యుద్ధమును సర్వలోకము చూచుగాక! మావటీంద్రకెల్ల మేటియైన వానిచే కువలయాపీడమను ఏనుగు తోలబడుటచే, ఆఇద్దఱు శిశువులను మట్టుపెట్టగలదు. వారిని చంపి వసుదేవుని, నందుని కూల్చి, నా తండ్రి దుష్టుడగు ఉగ్రసేనుని చంపెదను. అటుపై గోపాలుర గోధనములను కొల్లగొట్టెదను. వారు నాకు శత్రువులు. నీవుతప్ప ఈయాదవులందరు పరమదుష్టులు. నాకు గిట్టరు. ఈ అందఱను కూడ చంపుటకు క్రమముగ నీతో నేను ప్రయత్నించెదను. ఆ గొల్లలు గేదెనెయ్యి, పెరుగును కాన్కగకొని నీ వెంబడి వచ్చునట్లు నీ వట్లట్ల నచ్చచెప్పుము అని ఇట్లు ఆజ్ఞాపించబడి మహాభాగవతుడు (భక్తాగ్రేసరుడు) మధు ప్రియుడు, (మద్య ప్రియుడు) అగు అక్రూరుడు అట్లేయని కంసరాజునకు తెల్పి, మధురాపురము నుండి బయలు వెడలెను.

తరువాత కంసుని వాహనమగు గుఱ్ఱము రూపముగల కేశియనువాడు కంస ప్రేరితుడై కృష్ణుని చంపనెంచి, బృందావనమునకు వచ్చెను. వాడు కాలిడెక్కలచే ధరణి తలమునగల దుమ్ము చిమ్ముచు, జూలు విదిలించి మేఘముల చెదరగొట్టుచు, చంద్ర సూర్య మార్గము ఆక్రమించి గోపకుల వద్దకు ఏతెంచెను. వాని సకిలింపునువిని, గోపాలురు గోపికలు భయమున బెదరిపోయి గోవిందుని త్రాహి త్రాహి (రక్షింపు రక్షింపుము)అని శరణొందిరి. అదివిని జలములతో ఉన్న మేఘముయొక్క గర్జనమట్ల గంభీరముగ హరి ఇట్లు పల్కెను. "గోపకులార జడియ వలదు. గోపజాతి పరాక్రమము లోపమగును. అల్పబలము రాక్షస బలభారముచే చిందులు ద్రొక్కుచు సకిలించుచున్న ఈ పాడు గుఱ్ఱమువలన ఏమగును". అని "ఓ క్రూర! రా! రా! నేను కృష్ణుడను. పినాకపాణి (శివుని) చేత పూషుని (సూర్యుని) పండ్లెల్ల ఊడ గొట్టబడిన విధముగా మీ పండ్లెల్ల ఊడ గొట్టెదను అని కృష్ణుడు వాని కెదురు నడచెను". వాడును నోరుతెఱచి హరిపై కెగబడెను. కృష్ణుడు తన నిండుభుజమును వాని నోటిలో దూర్చెను. దాన, వాని పండ్లెల్ల తెలిమేఘువు తునుకలవలె ఊడి రాలిపోయెను. కృష్ణ బాహువులోన కేగిన కొలది బంధువులు ఉపేక్షింప పెఱిగిన వ్యాధివలె ఊరక పెరిగి, దవడలు బ్రద్దలై నురుగులతోడి రక్తము గ్రక్కికొని వాడు నెలవులు విచ్చి, కీలుకీలు ఊడి పడి పాదములు చాచి విణ్మూత్రములు విడుచుచు పుడమిపై బడెను. మఱియు ముచ్చెమటలు పోసి, చచ్చువడి చేష్టలుడక్కెను. హరి బాహువుచే నోరు విచ్చిపోవ, మహా రౌద్రాకారియగు వాడు పిడుగువడిన చెట్టువలె బెండై రెండై కూలెను. రెండుపాదములు, పిరుదుతోక రెండుగానై చెవి కన్ను ముక్కు ఒక్కటివంతుననై, మొత్తము శరీరము రెండు ముక్కలై వాడు కూలబడెను. కృష్ణుడు ఇట్లు కేశిసంహారము చేయ సంతోషపడిన గోపకులతో గూడుకొని శరీరమించుకయు ఆయాస పడకుండ స్వస్థుడై నవ్వుచు, అచ్చటనే ఉండెను. గోపికలును గోపకులును కేశి హతుడగుట చూచి వింతబడి ఆ అనురాగ మనోహరముగ పుండరీకాక్షుని కొనియాడిరి. కేశి హతుడగుటచూచి నారదుడంత మేఘముల నుండి వెలువడి వేవేగ వచ్చి మనసు ఆనందభరితముకాగా కృష్ణుని ఇట్లు కొనియాడెను. "బాగు బాగు జగన్నాథ స్వర్గ వాసులకు పీడగల్గించు కేశిని, లీలామాత్రముగ చంపితివి. ఈ అవతారమున నీవు చేసిన లీలలు అద్భుతములు. దీనికి నామనసు ఆశ్చర్యమును ఆనందమును చెందినది. ఇంద్రుడు దేవతలును ఈ హయాసురునకు హడలి పోవుదురు. వీడు విదిలించి సకిలించుచు ఆకాశమువంకకు చూచిన వానినిజూచి దేవతలు హడలెత్తి పోవుదురు. కేశివధ చేసినందున లోకమందు నీవు కేశి నామమున కీర్తింపబడుదువు. నీకు మంగళమగుగాక. వెళ్ళుచున్నాను. కంసునితోడి యుద్ధమున ఎల్లుండి నిన్ను కలిసికొందును. ఉగ్రసేనుని కొడుకు కంసుడు

సపరివారముగ కూలగనే, నీవు పృథివీ భారమును తొలగించినవాడవు అగుదువు. అక్కడ రాజులతోడి యుద్ధములు అనేకములు నాకు దర్శనీయము కాగలవు. ఓ జనార్దన! గోవింద! నేను వెళ్ళివచ్చెదను. దేవకార్యము చాల గొప్పగ జరుపబడినది. నీచే నేను గౌరవింప బడితిని. నీకు శుభమగుగాక" అని నారదుడు వెళ్ళగా, తమ నయనములచే తనలీలా సౌందర్యపానము చేయు గోపికలుగల గోకులమున కృష్ణుడు గోపకులతో ప్రవేశము చేసెను. (189)

బాలకృష్ణుని వద్దకు అక్రూరుడు వచ్చుట

వ్యాసులు అనిరి.....

అక్రూరుడు గమన వేగముగా ప్రయాణించగల రథమున బయలుదేరి కృష్ణ దర్శనాసక్తిచే నంద గోకులమునకు పోయెను. ఏగుచు త్రోవలో నాకన్న ధన్యతముడు లేడు. హరి అంశమున అవతరించిన ఆచక్రపాణి నెమ్మోము చూడబోవున్నాను. ఇపుడు నా జన్మము సఫలమైనది. ఈ రాత్రి సుశోభనముగ తెల్లవారినది. విచ్చిన తామరరేకుల వంటి కన్నులుగల ఆ విష్ణు ముఖమును దర్శింపబోవుచున్నాను. దేనినితలచికొన్న పాపము పోవునో అట్టి పుండరీకనయనుని నిండుముఖమును ఇప్పుడుచూడనున్నాను. ఎచ్చటి సమస్త యెల్ల వేదములు వేదాంగములు వెలువడినవో, దేవతలకు ఏది పరంధామమో అట్టి భగవంతుని ముఖము చూడబోవుచున్నాను. యజ్ఞములందు యజ్ఞ పురుషునిగ, పురుషులచే పురుషోత్తముడుగ ఏసర్వాధార మూర్తి యజింపబడునో అట్టి జగద్భర్తను చూడనున్నాను. నూరు యజ్ఞములయందు ఎవ్వని ఉపాసించి ఇంద్రుడు దేవేంద్రపదవి అందెనో అట్టి అయంతువడని ఆయాదిగల స్వామిని కేశవుని చూడబోవుచున్నాను. బ్రహ్మ ఇంద్ర రుద్ర అశ్వినీ వసు ఆదిత్య మరుద్గణములు ఎవ్వని రూపమెరుగరో అట్టి హరి నన్ను తాకుచున్నాడు.సర్వమునుదానై సర్వ భూతములందు ఉండి సర్వమగు సర్వ వ్యాపి ఇపుడు నాకు కనబడుచున్నాడు. మత్స్య, కూర్మ, వరాహ, నారసింహాద్యవతార యోగమును యోగముచేత ఒనరించిన ఆ దేవుడు నన్ను ఇపుడు పలుకరింపనున్నాడు. అవ్యయుడైన హరి జగత్ప్రభువు. ఇపుడు వ్రేపల్లె యందు ఉనికి చేయ స్వేచ్ఛా శరీరధారియై మనుష్య రూపమొంది స్థితికార్యనిర్వహణమునకు వచ్చి ఉన్నాడు. ఆ అనంతుడు శిఖరాదివిశిష్ట పృథివిని ధరించునో ఆ దేవుడు జగత్కార్య నిర్వహణమునకు నవతరించిన మహాను భావుడు 'అక్రూర!' అని నోరార నన్ను పిలువనున్నాడు. తండ్రి బంధువు చెలి తమ్ముడు అన్న అను చుట్టరికములతో అల్లుకొనియున్న జగత్తు ఎవ్వని మాయచే దాట శక్యముగాదో

అట్టి మాధవునికి నమస్కారము. ఎవ్వడు హృదయమందు బ్రవేశించినంతట మర్త్యులు (మరణ స్వభావం గలవారు) సువిస్తరమైన అవిద్యను యోగమాయను దాటుదురో అట్టి కేవల జ్ఞానస్వరూపుడైన ఆ దేవదేవునికి నమస్కారము. ఎవ్వడు వేదాంత మెరిగిన వారిచేత యజ్ఞభోక్త యజ్ఞ పురుషుడు వాసుదేవుడు అని గీర్తింపబడునో, అట్టి విష్ణువునకు నేను వినతుడను అయ్యెదను. జగదాధారుడగు ఆ పరమాత్మయందు నిలువబడి సరసద్రూప జగత్తు ధరింపబడుచున్నది. అట్టి స్వామి నా ఎడల ప్రసన్నుడు అగుగాక! నరుని జీవనము ఎవ్వని స్మరణ మాత్రమున సకల కల్యాణ భాజన మగునో అట్టి పురుషోత్తముని హరిని నిత్యము శరణొందెదను.

అని ఇట్లు భక్తినమ్రమైన తన మనస్సుతో విష్ణువుని తలచుచు అక్రూరుడు ఇంచుక పొద్దుండగనే గోకులమును జేరెను. అతడు అచ్చట ఆవుల పాలు పిదుకుచు ఉన్న కృష్ణుని, దూడల మధ్యనున్న వానిని, ప్రఫుల్ల పద్మపత్రాక్షుని, శ్రీవత్సాంకితవక్షుని, ఆజానుబాహుని, ఎత్తైన వెడద ఉరముగలవానిని, ఉన్నతాసుని, సవిలాసమందహాస భరిత వదనారవిందుని, ఎత్తై, మెరుపు చిందు నఖములతో పీతాంబరమును ఉత్తరీయమును దాల్చి, వనమాలా భూషితుడై తెల్ల తామర పూవు శిరమునదాల్చి ఉన్న హరిని అక్రూరుడు సందర్శించెను. హంసవలె, చందమామవలె, మొల్లలవలె తెల్లనై, నల్లని వలువ దాల్చిన యదునందనుని, బలభద్రుని ఆ కృష్ణుని వెనుక జూచెను. అతడు ఉన్నతుడు, ఉన్నత బాహువులు గలవాడు. సవికాసమైన ముఖారవిందము గలవాడునై మేఘముల గుంపుతో అలముకొన్న మఱొక కైలాస పర్వతమట్లున్న బలరామమూర్తిని కాంచెను. ఆ ఇద్దరి చూచిన ఆమతిమంతుడు అక్రూరుడు ముఖపద్మము విప్పార మేనెల్ల గగుర్పొడువ, ఇది పరంధామము. ఇదియే ఆ పరమ పదము.ఆవాసుదేవుడు ఇరుతెరగులై ఇచట ఉన్నాడు. ఆ ప్రదేశమిదే.

ఆ జగద్విధాత దర్శనమున నాకనుగవ సాఫల్యమందుగాక! నన్ను కౌగలించికొను చున్న అవ్యాజమైన అనవ్వు ఆభగవంతుని ప్రసాదమే. అది నాసర్వార్థ సిద్ధికి మార్గమగు గాక!

ఎవ్వడు తన కొనవేలిచే స్పృశించిన మాత్రాన, సర్వ పాపములు తూలిపడునో అట్టి ఆ అనంతమూర్తి నాహస్త పద్మమును, శ్రీమంతము, శోభావంతమును జేయును. దానిచే ఇంద్ర మరుత్ అశ్విని దేవతలందఱు నాయెడ ప్రసన్నులై వరములు ఇత్తురా? ఎవ్వడు దైత్యరాజ బలమునుచంపి భార్యల కనులకాటుకలను ఎల్లను తుడిచివైచెనో ఎవ్వని చేతిలో దానధార పోసి అవనిపైనుండియే అమరలోకేంద్ర భోగములను అందెనో, ఎవ్వనిని కొలిచి ఇంద్రుడు మన్వంతరముదాక స్థిరమైయుండు స్వర్గసామ్రాజ్యాధిపత్యము నందెనో, అట్టి సాక్షాద్భగవంతుడు కంసుని పరిగ్రహముచే (నన్ను తన వానిగా మిత్రకోటి లోనికి

స్వీకరించుటచే) దోషమునకు స్థానమైనట్టియు, నిర్దోషినైఆత్మ బహిష్కరింప బడినట్టి దురభిమానినగు నన్నుగూర్చి నిందయగు గాక! (నన్ను నేనే ఛీ అనుకొన వలసి యున్న దన్న మాట) కేవల జ్ఞానమై, సత్వనిధియై, అదోషియై, అందరును సులభముగా తేటపడక అందరి హృదయములందు ఉండెడి ప్రభువునకీ జగమునందు తెలియనిది ఏమున్నది? అందు వల్ల భక్తిచే మోమువంచి ఈశ్వరుల కెల్ల ఈశ్వరుడైన ఆ విశ్వేశ్వరుని అనాది మధ్యావ సానుడు అజుడుఅగు విష్ణువు యొక్క ఆ అంశావతార మూర్తిని దర్శింప పోయెదను. (191)

అక్రూరుని తిరిగి రాక

వ్యాసుడు ఇట్లు అనెను –

"ఇట్లా యాదవుడు అక్రూరుడు గోవిందుని తలచుచువచ్చి నేను అక్రూరదనని పేరు చెప్పికొని తలవంచుకొని, హరికి నమస్కరించెను. (గోత్ర నామములు చెప్పికొని నమస్క రించుట విశిష్ట గౌరవపాత్రులగు గురువులకు దైవసమానులయెడ చేయవలసిన లక్షణము శాస్త్రీయము) శ్రీహరియు ధ్వజ వజ్ర పద్మ చిహ్నములుగల హస్తముచే అక్రూరుని తాకి, దరికిదీసికొని ప్రీతితో గాఢాలింగనము చేసికొనెను. బలరామకృష్ణులు ఆతనితో కుశల సంభాషణాదులు నెఱిపి వెంటనే ఆతనిని చేకొని తమ మందిరమున ప్రవేశించిరి. అతడును వారితో ముచ్చటలాడుచు విందారగించి సముచితముగ వారికి తానువచ్చిన విశేషమును తెలిపెను. కంసుడు దేవకీవసుదేవులను బెదరించుట, తన తండ్రియగు ఉగ్రసేనుని యెడ అతడు వర్తించుతీరు, తనను ఎందులకు కంసుడు పంపెనో ఆ విషయము ఎల్లను ఆతడు తెలుప విని, కేశి సంహారకుడగు భగవంతుడు దానపతీ! (ఓ అక్రూరా) ఇదెల్ల నాకు తెలిసినది. ఇందేమి ఉచితమో అది ఆలోచించి చేసెదను. ఓ మహాను భావ! నీవింకొకలాగ అనుకొనకుము. నాచే కంసుడు హతుడు అయినట్లే తెలియుము. నేనును అన్నయ్య బలరాముడును నీతో రేపు మధురకు వత్తుము. గోపవృద్ధులు కూడ ఉపాయనములను పెక్కింటిని గొనివత్తురు. ఈ రేయి విశ్రమింపుము. చింతింప పనిలేదు. మూడు రాత్రులలోగా కంసుని పరివారముతో సహా సంహరింతు"నని కృష్ణుడు పల్కెను.

గోపికా పరితాపము

అక్రూరుడు ఆరాత్రి గోపకులకు చెప్పి కృష్ణునితో బలభద్రునితో నందుని మందిర మున నిదురించెను. బలశాలురగు రామకృష్ణులు ఆ తరువాత రోజు సుప్రభాతమునందు అక్రూరునితో మధురకు ఏగ సన్నద్ధులైరి. గోపికలది చూచి కన్నుల నీరు నిండ, దుఃఖమున

చిక్కి ముంజేతుల కంకణములు జార, నిట్టూర్పు పుచ్చుచు ఒండొరులతో ఇట్లు అనుకొనిరి. గోవిందుడు మధుర కేగి మరి వ్రేపల్లె కెట్లు రాగలడు? ఆ నాగరిక సుందరుల అవ్యక్త మధుర భాషణమధుధారల వీనులగోలును. ఆ నగర కాంతల మెరమెచ్చుల ముచ్చట లందు చిక్కుకొన్న ఈతని చిత్త మిక ఈపల్లె గొల్లపడుచుల వంక ఎట్లు తిఱుగును? ఈ గోష్ఠము యొక్క (వ్రేపల్లె యొక్క) సమగ్రసారమైన హరినిట్లు హరించుకొని పోవు ఆపాడు దైవము నిర్దయమై గోపాంగనల సర్వస్వము దోచుకొన్నాడు. పరిహాసభావ గర్భితమైన ఆయాపలుకులు, ఆ ఒయ్యారపు నడకలు, ఆనెఱజాణలు మధురాపురీ సుందరుల ఆ వాలుచూపుల చిక్కి ఈ పల్లెటూరి దేవయ్య మీ ప్రక్కకు మఱి ఏయుక్తిని రాగలడు? పేరుమాత్రమునకు అక్రూరుడయిన ఈ క్రూరునిచే, ఈహతాశునిచే, మోసగింపబడి ఇదే మాధవుడు రథమెక్కి మధురకు ఏగుచున్నాడు. ఈ నీచుడింత ఎరుగడా? ఈతని పై వలపుగొన్న ఈ జనమును తఱుగనితఱి తీపుగొని మఱగిన మనస్వామిని హరిని కొంపోవుచున్నాడు. ఇతడో! దయమాలి రమ్మన్నదే తడవుగ ఈ వనమాలి హలితో వీని వెంటబడి రథమెక్కి (ఎన్నడు ఎక్కని రథమెక్కుటకు ఉబలాటపడి కాబోలు!) పోవుచున్నాడు. వలదని వారింప త్వరపడుదము? పెద్దలయెదుటబడి మా కేదిగతి ఏమందువని మొర పెట్టుదము. ఆ పెద్దవాండ్రు మాత్రము విరహాగ్నిచే క్రాగుమన ఏమిచేయగలరు? నంద గోపుడు ముందుగా ప్రయాణము కాకనే, వీరును ప్రయాణ సన్న ద్ధులగుచున్నారు. గోవిందుని మఱలింప ఒక్కరైనను ఇందు యత్నించుట లేదు. మధురావాసులగు విలా సినులకు ఈరేయి ఇపుడు సుప్రభాతము. అచ్యుతుని ముఖార విందమునకా సుందరుల కనుగవలు భోగ్య వస్తువులుకాగలవు. (అనగా కృష్ణుడు ఆ పడతుల వాల్చూపుల సొంపులను అనుభవించు నన్నమాట) ఇటనుండి కృష్ణుడు ఏగుచుండ దారిలో నిలిచి స్వేచ్ఛగా ఆ సొగసుగాని సొగసు చూచి నెమ్మేనపులకింతురో ఆ ఇంతలు ధన్యులుగదె. గోవింద వదనారవింద సందర్శనమున ఇపుడు మధురాపుర పౌరుల నయనములకు ఇది ఒక మహోత్సవముగా ఉన్నది. కనులంతంతలు చేసికొని ఏ అభ్యంతరము లేకుండ భాగ్య వతులగు ఆ పురయువతులు కృష్ణుని చూడ ఉన్నారు. ఇది ఒక కలగాదుగదా? ఈ గోపికల కొక పెన్నిధిని చూపించిన అవ్విధి (బ్రహ్మ) ఇంతలో జాలిమాలి మనకన్నులందిగ నడచినాడు. మాధవుని యెడ అనురాగమున అతడేగుటకు మనయందు శైథిల్య మేర్పడ (ఏ కీలుసకాలు పట్టువిడుచుండ) మాతో బాటు మా ముంజేతుల నున్న వలయములును (కంకణములు) పట్టుతప్పి జారిపోవుచున్నవి. అక్రూరుడు క్రూర హృదయుడు, అల్లదె గుఱ్ఱములను త్వరత్వరగా తోలుచున్నాడు. అని ఇట్లు ఆర్తులై అలమటించు అబలలపై ఎవ్వనికి దయపుట్టదు? ఓ ఓకృష్ణా! అల్లదె రథచక్రములచేత రేగిన రేణువు వదనముపై

క్రమ్మినది చూడుము. దానిచే హరి దూరము చేయబడినాడు ఆ రేణువు గూడ కనబడుట లేదు అని ఇట్లు హార్దమైన భావముతో గోపికలు అలమటింప ఎవరికి జాలి కలుగదు!

జవనాశ్వమగు రథమున పోయి, బలరామకృష్ణులు అక్రూరుడును మధ్యాహ్నము నకు యమునా తీరమును జేరిరి. అంతట అక్రూరుడు తామిద్దరు ఇట గూర్చుండుడు. నేనీ కాళిందీ జలములందు ఆహ్నిక కృత్యము ఒనరింతును అనెను. వారట్లేయన అతడు యమునా జలములం జొచ్చి ఆచమించి స్నానముచేసి పరబ్రహ్మమును ధ్యానించెను. అనీటిలో అతడు ఆ సమయమున వేయిపడగలతో ఉన్న శేషునిగ బలరాముని దర్శించెను. అతడు మల్లెదండ వంటి శరీరము ధరించి తామరరేకులట్లున్న కన్నులలో వాసుకిగన్న డింభకులు పవనభక్షులు, చుట్టు ఉండి స్తుతింప వనమాలదాల్చి నల్లని వస్త్రమును ధరించి చక్కని అవతంసముతో (శిరోభూషణముతో) ఇంపైన కుండలములుదాల్చి నీటిలో కనిపించు చుండగా ఆతని ఒడిలో మేఘశ్యాముని, అంతట ఎఱ్ఱనగు కన్నులుగల వానిని, నాలు చేతలుగల వానిని, ఉన్నత శరీరుని, చక్రాద్యాయుధధారిని, పీతాంబరోత్తరీయముల రంగు రంగుల పూలమాలల దాల్చి ఇంద్రధనుస్సు మెఱపుదీగల తోడి విచిత్రమగు తోయ దము (మేఘము) వలెనున్న, వానిని శ్రీవత్సాంకిత వక్షుని, భుజకీర్తులు కిరీటముదాల్చి మిఱు మిట్లు గొల్పుచున్న వానిని, తెల్లతామర పువ్వు సిగపూవుగా ధరించి ఉన్న ఆనంద మూర్తిని, కృష్ణుని పుణ్యులగు సనకసనందాది సిద్ధ యోగులు ముక్కుకొనపై చూపు నిలిపి మనస్సుచే ధ్యానించు వానిని కృష్ణుని కనెను.

అప్పుడు అక్రూరుడు వీరు బలరామ కృష్ణులని తెలిసికొని ఆశ్చర్యపడి ఆ వెంటనే వీరు ఎట్లు ఇచ్చటికి వచ్చినారని ఆలోచించెను. పలుకబోయిన ఆతని వాక్కును హరి స్తంభింపజేసెను. అంతట ఆతడు నీరు వెడలి, వెలికేగు దెంచి రథమునందును ఆ ఇరువు వురను దర్శించెను. మునుపటియట్ల వారు మానవులట్లు ప్రాకృతరూపమున గోచరిం చిరి. తిఱిగి అతడు నీటను మునిగి యున్నట్లు ప్రాకృత దివ్యమూర్తులను అందు దర్శించెను. గంధర్వులు మునులు సిద్ధులు నాగులు మొదలగు దివ్వులు వారిని ఆ సమయ మునందు స్తుతించుచుండగా చూచెను. అంతట ఆద్దానవపతి (అక్రూరుడు) సర్వసత్తా స్వరూపము తెలుసుకొని సర్వవిజ్ఞానమయుడగు అచ్యుతుని ఈశ్వరుని స్తుతించెను.

అక్రూర స్తవము

పంచతన్మాత్ర రూపుడు, ఊహింప అలవిగాని మహిమ గలవాడు, సర్వ వ్యాపకుడు అనేక రూపుడు ఏకరూపుడు అయినవాడు అగు పరమాత్మకు నమస్కారము. శబ్దరూపము

హవిస్స్వరూపము విజ్ఞాన రూపము అయినవానికి ప్రకృతి కంటె పరునికి నమస్కారము. భూతాత్మయు ఇంద్రియాత్మయు ప్రధానాత్మయు నీవే. ఆత్మయు (జీవుడు) పరమాత్మయు నీవే. ఇట్లు నీవొక్కడవే ఐదుగా ఉన్నావు. క్షరము (సర్వభూతము) అక్షరము (కూటస్థుడు) సర్వధర్మ మూర్తివి బ్రహ్మ విష్ణు శివాది నానావిధ కల్పనలచే పిలువబడు నీవు ప్రసన్నుడవు కమ్ము. నీ స్వరూపము పలుకుటకు అలవికానిది. నీవు ఏమి ప్రయోజనము గలవాడవో తెలుప శక్యముగాదు. నీ అభిదానమిది అని చెప్ప వశముగాదు. అట్టి పరమేశ్వరుని నిన్ను గూర్చి వినతుడను అయ్యెదను. నామము జాతి మొదలైన కల్పనలు ఎందులేవో అట్టి పర బ్రహ్మము, నిత్యము అవికారి అజమునైనది నీవే. కల్పన కాకుండ సకల పదార్థము లందువు కావున కృష్ణ, అచ్యుత, విష్ణు నామములచే (కల్పనలచే) నీవు స్తుతింప బడుచున్నావు.

నీవు సర్వమునకు ఆత్మవు. వికల్పములచే నీవే దేవతలు విశ్వమును. ఓ విశ్వాత్మ! నీవు వికారభేదము లేనివాడవు. అంతట నీకంటే వేరొకటి ఇంచుకయు లేదు. నీవు బ్రహ్మవు, పశుపతివి, ఆర్యముడవు (సూర్యుడు), విధాతవు, ధాతవు, ఇంద్రుడవు, వాయువు, అగ్నివి, జలాధిపతి వరుణుడవు, ధనేశుడవు (కుబేరుడు) నీవు. అంతము చేయువాడు (యముడు) నీవు. ఒక్కడయ్యు భిన్న భిన్న శక్తులచే భిన్నభిన్న రూపుడవై జగత్తును రక్షించు చున్నావు. కిరణ రూపమున నీవు జగత్తును సృజించి హరింతువు. ఈ విశ్వము పంచభూత వికారము. గుణమయము. 'సత్' అను శబ్దమున కర్థమైన పరమ స్వరూపము అక్షరమునై సదసద్రూపుడవు జ్ఞానరూపుడవునగు నీకు నమస్కారము. వాసుదేవుడవు, సంకర్షణుడవు ప్రద్యుమ్నుడవు, అనిరుద్ధుడవు అగు నీకు నమస్కారము (చతుర్వ్యూహాత్మకమైన పరమాత్మకు నమస్కారము) అని ఇట్లు నీళ్లలో కృష్ణుని పొగడి ఆయాదవుడు మనస్సుచేత కల్పింప బడిన ధూపదీప పుష్పాదులచే షోడశోపచారము లచే శ్రీహరిని అర్చించెను. మానసిక పూజ చేసెనన్నమాట. ఇతర విషయములను విడిచి మనస్సును కృష్ణరూప పరబ్రహ్మము నందు నిలిపి చిరకాలమునకు సమాధినుండి విరమించెను. తనను కృతార్థునిగ భావించి, యమునా జలముల నుండి వెడలి మరల రథము దగ్గరకు వచ్చెను. వచ్చి రామకృష్ణులను ముందటి వలె ఉన్నవారిని గాంచెను. ఆశ్చర్యమున చూచు అక్రూరునితో కృష్ణుడు యమునా జలమున నీవేమి వింతచూచితివి నీ కన్నులు ఆశ్చర్య వికసితములైనవని అనగ అక్రూరుడు ఇట్లనియె.

అచ్యుతా! నీళ్ళలో నేనేమి వింత కనుగొంటినో అది ఇచటనే రూపొంది నాముందర కలదు. ఈ జగచ్చిత్రము ఏమహాత్మునిచే ఆశ్చర్యరూపమై ఉన్నదో అట్టి ఆశ్చర్యములకు అవధియైన నీతో నేనిపుడు కూడికొన్నాను. ఈవింతతో మనము మధురకు వెళ్ళుదమా! కంసునకు నేను జడియుచున్నాను. ఛీ! ఛీ! పరులు పెట్టిన పిండముచే బ్రతుకువాని

జన్మమమి జన్మము అని వాయువేగమున రథాశ్వములను తోలెను. కొంచెము మధ్యాహ్నముగల సాయంకాలమున అక్రూరుడు మధురలో ప్రవేశించెను. మధురను చూచి బలరామ కృష్ణులతో అతడు ఇట్లు అనెను.

"మీరు ఇరువురు నడచిరండు. నేను రథమున ఒక్కడనే నగరమున ప్రవేశింతును. మీరు వసుదేవుని గృహమునకు ఏగకుడు. మీ నిమిత్తమున ఆ వృద్ధుని కంసుడు బాధించును అని అక్రూరుడు ఒక్కడే మధురలో ప్రవేశించెను. రామకృష్ణులు రాజమార్గమునకు వచ్చిరి. ఆనందభరితములైన చూపుల జూడబడుచున్న స్త్రీలు, పురుషులు విలాసముగ ఏనుగు గున్నలట్లు రాజవీధిలో నడచిరి. అచట అట్టిట్టు తిరుగుచు వారొక చాకలిని జూచి చక్కని చలువమడతలను ఇమ్మని అడిగిరి. వాడు కంసుని చాకలి కావున మిగుల విస్మయ మంది రామకృష్ణులను గూర్చి ఆక్షేప వాక్యముల పెక్కులు బిగ్గఅగా అరచెను. అంతట కినుకనుకొని కృష్ణుడరచేత గొట్టివాని తలను బుడమిండకొట్టెను. వానిని చంపి పీత నీలాంబరులు కృష్ణుడు రాముడును బట్టలను తీసుకొని ముదమున పూమాలలు కట్టు వృత్తికల వా(మాలాకారు)ని ఇంటికి చనిరి. చక్కగా ఉన్న వారిని చూచి వాడు దేవతలు అవనికి దిగివచ్చిరని ఎంచి మోములు వికసింప, వారు పువ్వులిమ్మని అడిగినంతట, చేతులంపుడమి తాకి తలతో నేలనంటి ప్రసన్న సుముఖులై ప్రభువులు నా ఇంటికి వచ్చి తిరి నేను ధన్యుడను. మిమ్ము అర్చించెదనని అమాలా కారుడు పలికి, హర్షవదనుడై పరిమళించు చక్కనిపువ్వులు ఏరియేరి, మురిపించుచు మతిమతి మ్రొక్కి కోరి వారికి కాన్కగా ఇచ్చెను. కృష్ణుడును ప్రసన్నుడై మాలాకారునికి వరమిచ్చెను. ఓ భద్రుడా! (శుభలక్షణా) నన్ను ఆశ్రయించిన సిరి నిన్నెప్పుడును విడువదు. నీ బలమునకు హానిగలుగదు. ఓ మంచివాడ! ధనహానియు నీకు కలుగదు. నీవు విపులములైన భోగము లను అభవించి, తుదకు నా ప్రసాదము వలన నా అనుస్మరణ మంది దివ్యలోకము చేరెదవు. నీమనసెల్ల వేళల ధర్మమునందు ఉండగలదు. నీసంతతికి పుట్టినవారికి దీర్ఘాయువు కల్గును. నీసంతతి సూర్యుడున్నంత కాలము ఎట్టి ఇబ్బందులకు లోనుగాదు" అని పల్కి మాలాకారుని పూజగొని వాని ఇంటినుండి కృష్ణుడు బలదేవుని తోడుగా బయలు వెడలెను. (192)

కుబ్జోద్ధారణము

అటుపిమ్మట కృష్ణుడు రాజమార్గము వెంట సుగంధ ద్రవ్యపాత్రను చేకొని వచ్చుచున్న నవయౌవనశాలిని అగు కుబ్జను జూచెను. ఇందీవరాక్షి! ఈ అనులేపనము ఎవతికొఅకు

తీసుకొనిపోవుచున్నావు. నిజము చెప్పమని కృష్ణుడు ఆమెను ప్రశ్నించెను. సాభిలాషముగ హరి ముచ్చటింప అదియు అనురక్తిగొని ఆసుందరుని చూచినంత వివశమైన మనస్సును, బలిమియై నిలిపి హరితో సొంపుగ ఇట్లు పలికెను. కాంతుడా! నీకు తెలియదా? నేను సుగంధ ద్రవ్యానులేపన కార్యక్రమమున కంసునిచే నియోగింపబడినదానను. అనేక వక్ర అను ప్రసిద్ధి గన్నదానను. కంసునికి నా కూర్చిన కలవము దప్ప ఇతరము ప్రియము కాదు. అతని అనుగ్రహ సంపదకు నేను పాత్రమును'.

అన కృష్ణుడు 'సుందరముఖి; రాజునకు అర్హమైన ఈ మంచి గంధము మేమిద్దరము పూసికొనదగినది. అది మాకు ఇత్తువా? అనగా ఆమె వెనువెంటనే 'తీసికొమ్ము'ని ఆదరముతో వారికిచ్చెను. వారు చిత్ర చిత్ర రచనలుగా ఆ గంధమును పూసికొని ఇంద్రధనస్సుతో శోభించు తెల్లని నల్లని మేఘములట్లు భాసించిరి. అంతట హరి ఉల్లాపన నిపుణుడు కావున (మధుర హాస్యవచన రచనా నిపుణుడు గావున) దాని గడ్డము క్రింద జేయిజేర్చి దాని పాదములందన యడుగులం ద్రొక్కిపట్టి (భక్తులను ఉద్ధరించు నెరజాణ గావున) ఈమెను మీదికెత్తి లీలగ ఇటు అటు ఊచెను. దానిచే ఆ పడతి మేని వంకర లెల్ల పోయి, తీరి తిన్న పడిన శరీరమున సుందరుల కెల్ల సుందరి అయ్యెను. అవ్వల ప్రేమ నిర్భర మృదు మధుర మంద్రముగ మా ఇంటికి రమ్మని పలికి సవిలాసముగ నతని పై వలువగొని యాకర్షించెను. స్వామి తప్పక వచ్చెదననెను. ఆ విలాసిని బలభద్రుని వంక అల్లన గనుచు పెద్దగా నవ్వి కృష్ణుని వదలెను. ఆమె ఇచ్చిన ఆమంచి గంధమును ఆయిద్దరు పూసి కొని రంగు రంగుల పూలమాలలుదాల్చి నీలాంబర పీతాంబరధారులై ధనుశ్శాలకు చనిరి. ధనుర్యాగమునకు నిర్దిష్టమైన ధనుశ్శ్రేష్ఠము ఎక్కడ ఉన్నదని శాలారక్షకులను అడిగి తెలిసికొని హరి దానిని గొని ఎక్కుపెట్టెను. ఎక్కుపెట్టినది తడవుగ అది విరుగగా వెలువడిన చప్పుడు మధురా పట్టణము నలుమూలల అలము కొనెను. ఆవిల్లు విరుగుట చూచి శూలా రక్షకులు మీరెవ్వరని ప్రశ్నింప బదులు పలుకకయే ఆ అయన్నదమ్ములు ధనుశ్శాల నుండి వెడలిరి. కంసుడు అక్రూరుని రాకను, రామకృష్ణులు, ధనుస్సును విరచుటను విని చాణూర ముష్టికులను జూచి, గోపాల బాలకులు ఇద్దరు వచ్చినారు. మల్లయుద్ధమున నా ప్రాణమును హరించువారిని మీరు సంహరింపుడు. అందువలన నేను సంతోషించెదను. న్యాయా న్యాయ విచక్షణ లేకుండ ఎట్లైనను మీరు వారిని కడతేర్చవలెను. దాన మీకోరినదెల్ల తీర్చగలను. వారి వధవలన నీ రాజ్యము నాకును మీకును ఉమ్మడిసొత్తు కాగలదు' అని ఆ మల్లురకు ఆజ్ఞ ఇడి మావటి వానిని పిలిచి 'నీవు మదపుటేనుగును సమాజ ద్వారమున నిలుపుము. కువలయాపీడమను ఆ మదగజము చేత మల్లరంగ ద్వారమునకు వచ్చిన

ఆ గొల్లపిల్లలను త్రొక్కింపుము అని ఆనతి ఇచ్చి పోగాలము దాపురించిన ఆ దుష్టుడు కంసుడు, సూర్యోదయమున కెదురు చూచుచుండెను.

పౌరులు మంచములందును, రాజులు భృత్యులతో ఏగి తమకు ఉచితములగు మంచములందు అధిష్ఠించిరి. మల్లురు ప్రాశ్నికులు (మధ్యవర్తులు) ఆ సభారంగమున నడిమి భాగమున వసించిరి. కంసుడు అందరికంటె ఎత్తైన మంచెనందు (అనగా ఆసనము నందు) ఆసీనుడయ్యెను. అంతఃపుర జనము వసింప వేర్వేరు ఆసనములు అమర్పబడెను. వార స్త్రీలు ఒకచో, నగరాంగనలు ఒకచో నందాది గోపకులు ఒకచో ఆసీనులైరి. అక్రూర వాసుదేవులు ఆ మంచె ప్రాంతమున ఉండిరి. పౌరాంగనల నడుమ పుత్రవాత్సల్య భరితయగు దేవకిని ఆబిడ్డ నెమ్మోము తుదిగడియలోనైన చూతునుగాక అని కూర్చుండెను.

ఉత్సవ వాద్యములు మ్రోగగా చాణూరుడు ఎగిరెగిరి గంతులిడుచుండ, ముష్టికుడు బాహువులు చరచ, లోకము హాహాకారము ఒనరింప మావటీడు తమ మీదికి తోలిన కువలయాపీడమును చంపి, దాని మదముచే రక్తముచే శరీరములు పూతవడ దాని దంతములు పెరికి ఆయుధములుగ ధరించి సగర్వ విలాసమున చూచుచు మృగముల నడుమ మృగరాజులట్లు బలరామకృష్ణులు మల్లరంగమును ప్రవేశించిరి. అంతట అన్ని రంగములందు ఇతడే కృష్ణుడు. ఇదుగో బలభద్రుడని జనము వింతగొనిచేయు హాహా కారము మిన్నంటెను. ఘోర రాక్షసిని పూతనను చంపిన అతడే ఇతడు. శకటాసుర భంజనము, యమల అర్జునోన్మూలనము చేసినవాడు కాళియ ఫణి ఫణాగ్రమున నర్తనము జేసిన ఆ బాలుడు ఇతడే. గోవర్ధన మహాగిరిని ఏడురోజులు ఎత్తిపట్టిన పలుదిట్ట ఆతడు. అరిష్ట, ధేనుకులను, కేశి అను హయమును విలాసముగ చంపిన మహాత్ముడు అచ్యుతుడు ఇతడే. ఇతని ముందు సవిలాసముగ ఈ మల్లరంగమున పచారు చేయుచున్న సుందరీ నయనానందకరుడు యదునందనుడు ఇడుగో! బలరాముడు. ఈ స్వామి హరిపురాణ అర్థములను లెస్సగ చూచిన ప్రాజ్ఞులు. గోపాలమూర్తియై కంసునిచే దిగబడియున్న యదువంశమును ఉద్ధరింపగలడని పొగడొందిన బాలుడిడుగో. ఇతడు సర్వసృష్టి హేతువు. సర్వము తానైన విష్ణువు అంశమున అవతరించి భూభారమును హరింప ఉన్నాడు' అని ఇట్లు బలరామ కృష్ణులను పౌరులు కొనియాడుచుండ దేవకిపాలు చేపుకొన ఆ బిడ్డలంగని మనసునందు తాపము నొందెను. మహోత్సవము చూచుచున్న నెపమున తన పుత్రులనే చూచుచు పై గదిసిన ముదిమి (వార్ధక్యము) పోయి, యువకుడ ట్లై వసుదేవుడు తనిసెను. శుద్ధాంతఃస్త్రీలు నాగర స్త్రీ సమాజము కనుగవలు అల్లార్చి అవిరామముగ ఆ రామ కృష్ణులను తిలకించిరి – మఱియు ఇట్లొండొరులతో మురిసి ముచ్చటింప జొచ్చిరి.

సఖులార! కమలములవలె ఇంపుగొలుపు కృష్ణుని నెమ్మోము గనుడు. ఏనుగుతోడి పెనుగులాటచే నొడవిన శ్రమచే గ్రమ్మిన చెమట బిందువులతో హరి వదనము మంచు బిందువులు పై బడిన వికసిత నవాంబుజ మట్లు సొంపు కులుకుచున్నది. అల్లదే చూడుడు. అక్షరము (అవినాశి) అయిన పరబ్రహ్మమున్ మరచి వినశ్వరమగు నీ జగద్దృశ్యమును మరిగిన మన ఈ జన్మమును మన కన్నులను సఫలములను జేసుకొందము. శ్రీవత్స లాంచితమై సర్వ జగదావాసమై శత్రువులను మట్టుపెట్టు ఈవీరుని వెడద ఉరంబును విశాల భుజయుగమును సఖీ! కన్గొనవె. గంతులిడు ముష్టికునితో రంతులుచేయు చాణూరునితో తక్కుంగల మల్లురతో వీరాలాపముల మేలమాడు బల రాముని నెమ్మోము గనరె! సఖులారా. పలుదిట్టయగు చాణూరునితో పసిబాలుడు గోపా లుడు తలపడు చున్నాడు. అన్యాయమిది అని చెప్పగల పెద్దలెవ్వరు ఇక్కడలేరా? ఇపుడిప్పుడు అంకురించు యౌవనమునకు ఉన్ముఖుడై సుకుమార శరీరుడై ఉన్న ఈ హరియెక్కడ వజ్రకఠినమై నిండు మదమెక్కి ఉక్కును మించిన నెమ్మేన ఉన్న ఈ మహా రాక్షసుడెక్కడ? పరమ సుకుమారులు చిరుతప్రాయమువారు గోపాలురే రంగమందున్నవారు. వీరితో ఉజ్జీగ, పరమ రాక్షసులు అతి దారుణులు చాణూరాదులు మల్లులు ఎదుట ఉన్నారు. ఈ విపర్యయము ఈ మర్యాదను ఇటనున్న మధ్యవర్తులు ఉల్లంఘించుట కడు విపరీతము. మధ్యస్థులిది చూచి ఉపేక్షించుచున్నారు. అని ఇట్లు ఊరక పౌరసుందరులు పరితపిం చుటగని పుడమి కంపింప హరి చూపరులకు ఆనందోత్కర్షమును వర్షించుచు యుద్ధసన్నద్ధు డయ్యెను. బలరాముడును బాహువులు చరచి చక్కగ ఇటు అటు దూకినంతట అదుగడు గున అవని పగులు పడవలసినది అట్లు కాకుండుట అదియు ఒక అద్భుతమయ్యెను.

అంతట చాణూరునితో కృష్ణుడును మల్లయుద్ధ విశారదుడైన ముష్టికుడు బలదేవునితో తలపడిరి. ఒండొరులు దూరముగ విసరుట, గ్రుద్దుట, పట్టు గడచినంత చేబట్టి దిగనడ చుట, పాదములను తన్నుట, మర్దించుట మొదలగు మల్లయుద్ధ భంగిమలచే, వారితో అస్త్రములులేని అతిఘోరమైన అతిదారుణమైన సమరము జరిగెను. ధనుర్యాగ. ఉత్సవ మందు తన బల ప్రాణములచే ఎంతెంత చేయగలడో అంతకు చుట్టరికమని లేకుండ ఆ రామకృష్ణులు పోరాడిరి. జగదంత ర్యామియైన కృష్ణుడును వానితో విలాస మాత్రముగనే పోరెను.

అంతట కంసుడు ఖేదమువలన, తనయొక్క వధను, చేయనున్న, చేతిని, చలింప జేయుచున్న కృష్ణునిచే కల్గిన, కోపము వలనను (అనగా కృష్ణుడు విజృంభించిచేయు భీషణమైన యుద్ధము చూచినందు వలన కల్గిన బాధవలనను, తనను చంపనున్న హస్త మును, పాముపడగవలె ఆడించుచున్న కృష్ణుని యెడల ఉడుకుమోతుతనమువలన

గల్గిన క్రోధమువలనను) చాణూరునియందు బలక్షయమును కృష్ణునియందు బలవృద్ధిని చూచి యుద్ధ వాద్యములను ఆపు చేయించెను. మృదంగాది వాద్యములు అట్లు ఆపబడి నంత ఆ క్షణము ఆకసమందలి దేవవాద్యములు (దుందుభులు మొదలయినవి) భోరన మ్రోసినవి.

"జయింపుము గోవింద! చాణూరుని సంహరింపుము కేశవ. ఈ దానవుని అంతము చేయుము" అని అంతర్ధానగతులై వేల్పులు ఆనందమంది హరిని స్తుతించిరి. మధు సూదనుడు చాలసేపు చాణూరునితో ఆడికొని తుదముట్టింపదలచి వానిని లేవనెత్తి అంతకు నూఱుమెట్ల ఊపున గిరగిరత్రిప్పి గగనమంద ప్రాణములువాసిన వానిని బుడమిపై విసరి వేసెను. ఆ వ్రేటున వాడు నూరువ్రక్కలై రక్త స్రావము చేసికొని అనేలను అంతటిని పెనుబెందడి గావించెను.

చాణూరునితో హరియట్లు బలదేవుడును ముష్టికునితో పోరెను. అతడును వీని ముష్టిచే నడితల నడచి మోకాలును తొమ్మునం బొడిచి, పుడమిపై బడవేసి ప్రాణములు పోవ కాలఱాచెను. కృష్ణుడు ఎడమ పిడికిలితో గ్రుద్ది, మల్లవీరుని మహాబలుని ఆ విధముగ భూతలమున పడవేసెను. చాణూరుడు నిహతుడు కాగా ముష్టికుడు కూల్పబడగా అచ్చట ఉన్న మల్లురు అందరూ పారిపోయిరి. అపుడు కృష్ణ సంకర్షణులు ఇద్దరు ఆవీరవిహారమున తమ ఈడువారల బలాత్కారముగ ఆకర్షించి, ఆయారంగభూమిపై కుప్పించి గంతులు పెట్టిరి. అంతట కంసుడు కినుకచే కనులెఱ్ఱవడ అట చెదఱియున్న తన మనుజులతో "ఈ గోపకులను ఇద్దరిని ఈ సమాజముగుంపునుండి బలాత్కారమున గెంటివేయుడు. పాపాత్ముడు నందుని ఇప్పుడే సంకెళ్ళచే బంధింపుడు. వృద్ధులకు తగినిట్టిదిగాని, దండన మున వసుదేవుని గూడ కట్టివేయుడు? కృష్ణునితో ఎగిరెగిరి గంతులుపెట్టు ఈ గొల్లల గోధనములను కొల్లగొట్టు"డు అనెను.

ఇట్లు ఆజ్ఞయిచ్చు ఆ కంసుని చూచి, మెల్లగా నవ్వి మధుసూదనుడు మీచెకి దూకి ఎత్తుగా ఉన్న సింహాసనముపైకెక్కి కంసునిబట్టి జుట్టుపట్టి లాగి, కిరీటము తొలగి ఇలపై పడునట్లుగా వానిని పడవైచి వానిపై పడెను. ఎల్ల జగములకు ఆధారమైన బరువుచే మీదబడిన కృష్ణునిచే ఆయుగ్రసేని (ఉగ్రసేనుని కొడుకు) కంసరాజు ప్రాణములను వదిలెను. చచ్చిన వాని కేశముల బట్టి కేశవుడు వాని దేహమును ఆ రంగమధ్యమందు బరబర ఈడ్చి వైచెను. సహజముగ పెద్దది, బరువైనది, క్రోధముచే మఱియు బరువెక్కినది అగు కంసుని శరీరమును మహాత్ముడగు కృష్ణుడు కూల్చి వేసి కడువేగముగా ఈడ్చబడి వేసెను. అది చూచి వాని తమ్ముడు సునాముడు ఎత్తి రాగ, బలభద్రుడు లీలగ వానిని పడగొట్టెను. హరిచే అవమానమునకు గురియై మధురాధీశ్వరుడు కంసుడు హతుడు

అగుటను చూచి, కని ఆ రంగమండపమెల్ల హాహాకారములతో నిండిపోయెను. కృష్ణుడును వెనువెంటనే బల రామునితో కలసి దేవకీ వసుదేవుల వద్దకు పోయి వారి పాదములను పట్టుకొనెను. వసుదేవుడు దేవకియు, జనార్దనునెత్తి జన్మ సమయమున (పురిటింట) స్వామి పల్కిన పల్కులను తలచుకొని వారికి ప్రణతులై నిలిచిరి. అప్పుడు వసుదేవుడు ఆ ప్రభువును ఇట్లు వినుతించెను.

దేవకీ వాసుదేవులతో శ్రీకృష్ణ సంవాదము

భగవద్విలాస దర్శనము వలన విజ్ఞానము ఉదయించిన దేవకీ వసుదేవులను చూచి హరి యాదవ సంఘము మోహములో పడుటకు తన వైష్ణవ మాయను విస్తరింపజేసెను. అమ్మా! ఓ అయ్యా! ఎన్నాళ్ల నుండియో మిమ్మెప్పుడు చూచెదనా అని త్వరపడుచు, కంసునికి భయపడి ఉన్న బలరాముడు నేటికి మిమ్ములను చూచినాడు. తల్లిదండ్రులను పూజింపకయే జరిగిన కాలము అది వ్యర్థము. ఉత్తములకు అది బాధాకరము అగును. గురువుల, దేవతల విప్రుల తలిదండ్రులను పూజించువారి జన్మము సార్థకము. ఇంతదనుక ఇది తప్పుచేసిన తప్పిదము. తండ్రీ! క్షమింపుము. కంసుని బలపరాక్రమములకు జడిసి పరవశులమై ఉన్నందున అట్లు జరిగినది అని పలికి ప్రీతితో యదువృద్ధుల పాదములపై వ్రాలి ఇద్దరును వసుదేవుని మనసు నకు ఊరటనుకూర్చిరి.

అంతట కంసుని భార్యలు వాని తల్లులు నేలపై విగతజీవుడై పడియున్న కంసుని చుట్టును జేరి, దుఃఖ శోకముల మునిగి (దుఃఖము=కష్టము, శోకము=ఆప్తబంధు మరణాదులచే మనస్సుకు కలుగు బాధ) పెక్కురీతుల కలతవడి, పశ్చాత్తాపము చెందుచు పెక్కు రీతులుగా ఏడ్చిరి. హరి తాను కన్నుల నీరు పెట్టికొని వారలను ఓదార్చెను. అటు తరువాత ఉగ్రసేనుని బంధము నుండి విడిపించెను. మఱియు కొడుకును కోల్పోయిన వాడైన అతడిని వానిని రాజ్యమునందు అభిషిక్తుని జేసెను. రాజ్యాభిషిక్తుడై అతడు తన కొడుకునకు ఇంకను ఆ సమయమున చచ్చిన వారికిని ప్రేత కృత్యములు కావించెను. అట్లానభి సింహాసన మెక్కిన ఆతనితో కృష్ణుడు శంకింపక ఇపుడు ఏమి చేయవలయునో ఆనతిమ్ము యయాతి శాపముచే నీ యదువంశము రాజ్యానికి అనర్హమే అయినను ఇప్పుడు నేను భృత్యుడనై ఉన్నాను కావున నీవు దేవతలనైనను శాసింపుము. నరపాలుర లెక్కేమి అని కార్య నిమిత్తమున మానుషాకారములు ధరించిన భగవంతుడు మానవ భాషణముల ఉగ్రసేనునితో పలికి, వాయువు బిలిచి ఇట్లనియె. నీవేగి ఇంద్రునితో ఇట్లనుము. ఇంద్రా గర్వమువలదు. కృష్ణుడు చెప్పుచున్నాడు. నీ సుధర్మ సభ అనుసింహాసనమును ఉగ్రసేనునికి

సమర్పింపుము. అత్యుత్తమము రాజులకర్హము. ఈ సుధర్మ సభారత్నము (సర్వసభా శ్రేష్ఠము) యదువు లెక్కుట యుక్తము అని పలుక పవనుడు స్వర్గమునకు పోయి శచీపతికి అదియెల్ల విన్నవించెను. ఆతడును సుధర్మ సభను వాయువునకు ఒసగెను. వాయువు కొనివచ్చిన ఆ దివ్యసభను సర్వ రత్నాధ్యమును (సర్వ వస్తువులలో అత్యుత్తమ శ్రేష్ఠవస్తువులు గలదానిని) గోవిందుని భుజముల నీడలో ఉండి యదు శ్రేష్ఠులు అనుభవించిరి.

సర్వ విజ్ఞానము లెఱిగినవారు, కేవల జ్ఞాన స్వరూపులైన ఆవీరులు రామకృష్ణులు శిష్టాచార మిట్లుండవలెనని లోకమునకు వెల్లడించువారై కాశీ క్షేత్రమునందు పుట్టి అవంతీ పురమునందు (ఉజ్జయినిలో) వసించుచున్న సాందీపని సన్నిధికి పోయి అస్త్ర విద్యను బోధింపవలసినదిగా ఆయనను అడిగిరి. ఆయనకు శిష్యులై గురుశుశ్రూష చేయుచు ఎల్లజనమునకు సదాచారము గురుశిష్య భావమిట్లుండ వలెనని చేసి చూపించిరి. ధనుర్వేదము రహస్యముగ, సంగ్రహముగ, అరువది నాల్గు దినములలో ఆయన నుంచి అధ్యయనము చేసిరి. అది వింతలలోకెల్ల వింత అయ్యెను. సాందీపనియు ఎన్నడు ఊహించ వలనుగానిది, అమానుషము అయిన ఆ అధ్యయనము తీరుగని, ఆలోచించి చంద్ర సూర్యులు ఇటు వచ్చినారని వారిని భావించెను. ఆ ఇద్దరు చెప్పిన మాత్రాన (ఉపదేశ మాత్రమున) అస్త్ర క్రమమెల్లపొంది, తమకు గురుదక్షిణ ఏమీయవలెనో అడుగు మనిరి. ఆయన మతిమంతుడు కావున వారిపనిని అతీంద్రియ జ్ఞానమునగని (కేవల తపోదృష్టితో చూచి)లవణసముద్రమున ప్రభాస తీర్థమందు మున్ను గతించిన పుత్రుని యాచించెను.

అప్పుడు బలరామకృష్ణులిద్దరు అస్త్రములను చేకొని సముద్ర ప్రాంతమునకు చేరి సాగరునితో గురుపుత్రుని ఇమ్మని పల్కిరి. వార్ధియు చేతులు మొగిచి నేను సాందీపని పుత్రుని హరింప లేదనియు పంచజనుడను దైత్యుడు శంఖము రూపమున నుండు వాడు ఆబాలుని గొనిపోయెను వాడు నా నీటిలోనే ఉన్నాడు అనెను. అదివిని కృష్ణుడు నీళ్లలోనికి ప్రవేశించి పంచజనుని పంచత్వ మందించి (చంపి) వాని అమ్ముల పొడమిన ఉత్తమమైన శంఖమును చేకొనెను. దాని నాదముచే దైత్యులకు బలము పోవును. దేవతలకు తేజస్సు వృద్ధిపొందును. అధర్మము క్షయించును. అట్టి పాంచజన్యము నెత్తి బలభద్రుడును, హరియును యమపురికేగి యమునిగెల్చి, యమయాతనలు పడుచున్న ఆ బాలునిగొని మునుపటి వలె మానవ శరీరమున ఉన్న వానిని తండ్రియైన సాందీపునికి బలరామకృష్ణులు ఒసంగిరి.

అటనుండి ఉగ్రసేన పరిపాలనలో ఉన్న మధురకు వారు ఏతెంచిరి, మధురాపుర వాసులు స్త్రీ పురుషులు వారి ఆగమనమునకు అమితానందభరితులైరి. (194)

జరాసంధునితో బలరామ శ్రీకృష్ణ యుద్ధము

వ్యాసుడు అనియె –

మగధాధిపతి జరాసంధుని కూతుండ్రను అస్తిపాస్తి అనువారిని కంసుడు పెండ్లి ఆడెను. వారి భర్తను చంపినాడని విని జరాసంధుని యాదవుడైన హరిని తాను చంపుటకు కోపముతో దండెత్తి వచ్చెను. వచ్చి మధురను ముట్టడించెను. వానికి ఇరువది మూడు అక్షౌహిణుల సేనయుండెను. బలరామకృష్ణులు అల్ప పరివారముతో వాని బలముతో పోరిరి. కొంతసేపటికి హలియు హరియు తమ పురాణాయుధములను చేకొనవలెనని సంకల్పించిరి. సంకల్ప మాత్రమున చక్రము, శార్ఙము (విష్ణు ధనస్సు), అక్షయ బాణములు, అమ్ముల పొదులు రెండు, కౌమోదకి అను గదయు నింగినుండి ఆ మహావీరుల వద్దకు వచ్చెను. బలరాముని నాగలికూడ గగనమునుండి ఆతని చేతికందెను. మరియు అతనికి ఇష్టమైన సునందమను ముసలాయుధము (రోకలి) గూడ బలరాముని కరమున చేరెను. అవ్వల యుద్ధమున సేనతో మగధరాజును ఓడించి ఆ వీరులు వారి పురమును చొచ్చిరి.

ఆ దుష్టుడు ఓడిపోయెనుగాని, బ్రతికిపోయెనని కృష్ణుడు వానిని గెలిచినట్లు కాదను కొనెను. వాడు బలమును కూర్చుకొని మఱల వారిపై తిఱుగబడెను. అప్పుడు వారి చేతిలో వాడు ఓడిపోయెను. దుర్మదమున అతడు ఇట్లు పద్నెన్మిది దండయాత్రలు చేసి మాగధుడు కృష్ణ ముఖ్యులతో యాదవులతో పోరి అల్పావశిష్టమైన సైన్యముతో వెనుదిరిగి పోవుచుండెను. అన్నింటను యాదవ సైన్యము పెక్కుతీరుల సురక్షిత మగుట, కేవలము ఛత్రియగు విష్ణు అంశము యొక్క సాన్నిధ్య ప్రభావమే అది ఆ జగత్పతియొక్క మానుషావతార లీలా విలాసమే. మనసు చేతనే జగమ్ముల సృష్టి సంహారములు చేయు భగవంతుడు శత్రువులపై అనేకములయిన అస్త్రములను విడచుట శత్రుపక్ష క్షయమునకై చేయు ప్రయత్న విస్తరమది ఎంత పాటిది? అయినను మానవులకు మానవ ధర్మాను వర్తనము ధర్మము కావున బలవంతులతో సంధియు తక్కువారితో విగ్రహమును ఈ మహానుభావుడు కృష్ణుడును చేయును.

సామదాన భేదోపాయములు ప్రదర్శించి తుదకు దండోపాయము ఉపయోగించి ఒకప్పుడు పలాయనమును (పారిపోవుటను) గావించును. లీలా మానుషమూర్తియగు ఆ జగత్ప్రభువు స్వేచ్ఛానుసారము వర్తించును. మానవ శరీరుల చేష్టలను కూడ ఇట్లు అనువర్తింప చేయును. (195)

కాలయవనోపాఖ్యానము

గోష్ఠమందు పురోహితుడు గార్గ్యుని బావమరది అని, షండుడని (నపుంసకుడని) యదువులందరి సన్నిధి యందు తూలనాడెను. యాదవులందఱు నవ్విరి. అంత అతడు కినుకగొని దక్షిణాపథమునకు వచ్చి యదువంశ భయంకరుడగు పుత్రునిగోరి తపస్సు చేసెను. ఆతడు శివుని ఆరాధించుచు లోహచూర్ణము మాత్రముతిని తపస్సు చేసెను. హరుడు అతని తపస్సునకు సంతుష్టుడై పండ్రెండవ సంవత్సరమున వరమిచ్చెను. పుత్ర సంతతిలేని యవనాధీశ్వరుడు అతనిని గౌరవించెను. వాని అంగనతో అతడు సంగమించి నంతట భ్రమర (తుమ్మెద) సమాన ప్రభగల కొడుకు పుట్టెను. కాలయవనుడను పేరుగల వానిని వజ్రకఠినమైన రొమ్ముగల వానిని తన రాజ్యమున పట్టాభిషేకించి యడవికిం బోయెను.

ఆ కాలయవనుడు బలమున మదమెక్కి అవనిలోగల బలవంతులైన రాజులు ఎవ్వరని అడుగ నారదుడు యాదవులని తెల్పెను. వాడు కోటివేలమంది మ్లేచ్ఛులతో చతురంగ బలముతో పెద్ద ఉద్యమము చేసెను. దినదినము ఎండలలో వాడు పయనించి, కసిగొని యాదవుల కొరకు మధురాపురికేగెను. అంతట కృష్ణుడు ఇట్లు ఆలోచించెను. "యవనులచే యాదవులము నశించుటచూచి మాగధుడు (జరాసంధుడు) యుద్ధమునకు ఏతెంచును. మాగధుని బలము క్షీణించినపుడు యవనుడు వచ్చును ఈవిధముగ రెండువైపుల నుండియు యాదవులకు కష్టము వచ్చిపడినది. అందుచే యాదవులకొరకు అభేద్యమైన దుర్గ మొకటి నిర్మించెదను. ఆ దుర్గములు కలిగించు రక్షణచే అబలలు (స్త్రీలు) కూడ యుద్ధము చేయగలరు. అట్టి యెడ వృష్ణి యదువంశముల వారి మాట చెప్పనేల? నేను మత్తుగొనికాని, ప్రమత్తుడనై లేక ఉన్నను నిద్రపోయినను ఎటకేని ప్రవాసము వెళ్ళినగాని, యాదవుల లోకువచూచి శత్రువులు వారిపై ఎక్కువగా విజృంభింతురు" అని గోవిందుడు ఆలోచించి మహా సముద్రుని పండ్రెండు యోజనముల మేర ఇమ్మని (సముద్రమును దూరముగా తొలగుమనికోరి) అచట ద్వారకాపుర నిర్మాణము చేసెను. అది మహోద్యానములు, పెద్దకోట, పెక్కు తటాకములు ప్రాకారములతో ఇంద్రుని రాజధాని అమరావతి వలె ఉండెను. మధురాపుర వాసులను అక్కడికి గొనివచ్చి అందుంచి కాల యవనునికి దగ్గరగా ఉండునని తాను మధుర కేగెను. అందుండి సైన్యము తరలింపబడగా తాను నిరాయుధుడై అటకేగినంత అతనిని కాలయవనుడు చూచెను. వాడాయన వాసుదేవుడని, గ్రహించి చేత ఆయుధములు చేపూని మహాయోగులైనను మనసుల చేబట్టరాని ఆ స్వామిని వెన్నంటి తరిమెను. అట్లు తరుమబడి కృష్ణుడచ్చట, ముచుకుందుడను రాజు మహా

పరాక్రముడు, నిద్రించుచున్న గుహలో ప్రవేశించెను. ఆ యవనుడు అచ్చటదూరి అటపరుండియున్న నరునిచూచి కృష్ణుడనుకొని పాదముచే తన్నెను. అతడు కన్ను తెరచి చూచిన క్షణములో యవనుడు అగ్నిచే కాలిపోయెను. ఆ ముచుకుందుడు మున్ను దేవాసుర యుద్ధమునకేగి మహారాక్షసు లందఱిని జయించి దేవతలను నిద్రకావలెనని కోరెను. వారును నిదురించిన నిన్నెవ్వడు వచ్చి లేపునో వాడు దేహమున పుట్టిన అగ్నిచే అప్పుడే భస్మము కాగలడు అని వరమిచ్చిరి.

ఇట్లు ఆపాపాత్ముని, యవనునికాల్చి మధుసూదనుని చూచి "ఎవడు నీవు" అన "నేను చంద్రవంశమున వసుదేవునికి పుట్టినవాడను. యాదవుడ"నని హరి పల్కెను. ముచుకుందుడు ఆ పలుకులువిని వృద్ధగార్గ్యుని మాట స్మరించి సర్వేశ్వరుడని ఎఱిగి హరికి ప్రణతుడై ఇట్లనియె. అవును. నిన్నెఱుగుదును నీవు విష్ణు అంశమున ఉదయించిన వాడవు. మున్ను గార్గ్యుడు ఇరువది యెనిమిదవ ద్వాపరము చివర యదువంశమున హరి అవతారము జరుగునని చెప్పెను. ఆతడే నీవు. మర్త్యులకు ఉపకారము చేయ దయచేసిన వాడవు. సంశయములేదు. నీ అప్రాకృత దివ్యతేజము నేను సహింపలేను అని మహామేఘ గర్జాగంభీరమైన ధ్వనితో కృష్ణస్వామిని ఇట్లు స్తుతించెను.

ముచుకుందుడు కృష్ణుని స్తుతించుట

స్వామి! దేవాసుర యుద్ధములందు ఉద్భటులైన దైత్యులెందఱో నీ తేజమునకు తట్టుకొనలేక పోయిరి. అట్టి నీ తేజస్సును నేను ఓర్వజాలను. సంసారపతితమైన జంతువునకు నీవొక్కడివే దిక్కు. ప్రపన్నుల ఆర్తిని హరించు నీవు నా యెడ ప్రసన్నుడవు కమ్ము. నా అశుభమును హరింపుము. సముద్రములు, పర్వతములు, నదులు, మేదిని, గగనము, వాయువు, నీరు అగ్నియు నీవే. పురుషుని కంటె మిగులపరమై వికల్పాత్మకమైన ఎల్ల జన్మములందు వ్యాపించి శబ్దాది విషయస్పర్శ లేక వృద్ధిక్షయ జరాదులు లేక ఉన్న కేవలమైన వస్తువు నీవే. నీవలననే చరాచరాత్మకము, స్థూలము, సూక్ష్మమునైన జగత్తు పొడమినది. పొడముచున్నది. పొడమనున్నది. మూర్తము అమూర్తమునైనది ఎల్లను నీవలనైననదే. నీకంటె మఱి ఏదియు లేదు. సంసారచక్ర పరిభ్రమణము చేయుచు తాపత్రయ తప్తుడనైన నాకు ఆత్యంతిక సుఖము అందలేదు. దుఃఖములను సుఖములని, ఎండమావులు జలాశయములని అనుకొంటిని. అది ఎక్కడలేని ఉడుకు దెచ్చిపెట్టినది. రాజ్యసుఖము పుత్రమిత్ర కళత్రాదికము శబ్దాది విషయ భోగము సుఖమని మఱగిన నాకు తుదకు అది తాపాత్మకముగా పరిణమించినది. దేవలోక గతినందితినిగాని ఆ

దేవగణము నాసాహా య్యము గోరినది. తండ్రీ! శాశ్వతమైన నిర్వృతి (పరమ తృప్తి) యెక్కడ? సర్వజగత్తుకు ప్రభువు స్థానమున ఉన్న నిన్ను ఆరాధింపక ఆ శాశ్వతానంద మెవడు పొందును? నీ మాయచే మూఢులై జన్మమృత్యు జరాది పాపానుభవములను పొంది ప్రేతపతిం జూతురు. ఆవల కాలపాశముల గట్టుపడి అతి దారుణముగ నరకము లందు అనేక విధములగు దుఃఖములనందుదురు. ఇది నీ విశ్వ స్వరూపము. నేను విషయలోలుడనై నీ మాయచే మోహితుడనై మమకారము అను మురికి గుంటలో తిరుగాడు చున్నాను పరమేశ్వర! స్తుతిపాత్రుడునైన నిన్ను శరణు కోరుచున్నాను. సంసారశ్రమచే ఉడికిన మనసుతో, నిర్విణ్ణుడనై (దుఃఖినై) పరమపదమైన పరంధామమైన నీయందు ముచ్చటగొన్నాడను". (196)

గోకులేబల ప్రత్యాగమన వర్ణనమ్

వ్యాసులు అనిరి –

ఇట్లు ముచుకుందునిచే పొగడబడి సర్వ భూతేశ్వరుడు అగు హరి నీకోరిన దివ్య లోకములను పొందుమని ఆరాజునకు తెల్పెను. నా సాకతము అవ్యాహమైన ఐశ్వర్యముతో దివ్యభోగములు అచట అనుభవించి పూర్వజన్మ స్మృతివడసి ఉత్తమకులమందు పుట్టి, ఆవల ముక్తినందుదువు. అనగా ఆరాజు పరమేశ్వరునకు మ్రొక్కి గుహనుండి వెలువడి వచ్చి వెలినున్న అల్పాల్ప శరీరులను నరులను జూచెను. దానిచే కలియుగము వచ్చెనని గ్రహించి నరనారాయణ స్థానమైన గంధమాదనమున (బదరి కాశ్రమమున) తపము చేయ నేగెను.

కృష్ణుడు ఉపాయముచే శత్రువు, కాలయవనుని కూల్చి వాని సేననెల్ల గొనివచ్చి ద్వారకయందు ఉగ్రసేనునికి సమర్పించెను. ఆవల యదుకులము శత్రు భయశంక పోయి స్వస్థత నందెను. బలరాముడును యుద్ధములెల్ల శాంతింప తన జ్ఞాతులను దర్శించు వేడుకతో నంద గోకులమున కేగెను. అచ్చట గోపకులును గోపికలును ముందటియట్ల తనను సబహుమానముగ ప్రేమతో కలిసికొని అచ్చట నిల్చిపోయెను. కొందఱు వచ్చి కౌగలింప కౌగలించుకొనెను. కొందఱితో నవ్వెను. కొందఱితో ముచ్చటలాడెను. వారు ఎన్నో ప్రియ వాక్యముల బలరాముని పలుకరించిరి. కొందఱు గోపికలు ప్రేమతో కొందరు ఈర్ష్య తోడను గూడ ప్రశ్నలు వేసిరి.

నాగరిక కామినులకు ప్రాణమైనవాడు నిలకడలేని వలపుతీపులను తొలకు కృష్ణుడు సుఖముగ ఉన్నాడు గదా! ఆ క్షణమాత్ర సౌహృదుడు (నిమిష మాత్రము వట్టి మెరుపువలె

మెరమిచ్చులు గొలుపువాడు) నైన చెలిమిగల హరి వారివద్ద మా చేతలయెడ పరిహాసముతో సౌభాగ్య గర్వాతిశయము చేయుటలేదు గదా! బృందావనమున వేణుగానమును విని అనుసరించి వచ్చిన మా రాకను తలంచుచున్నాడా? కన్నతల్లిని చూడడానికి ఒక మాట్రైన అతడు ఇచ్చటకు వచ్చునా! ఐనను వాని ప్రసంగములు ఎందుకు? వేరు మాటలు చెప్పుకొందము, మనము లేకుండ అతనికి, అతడు లేకుండ మనకు సాగదు. ఆతనికై మేము తండ్రి, తల్లి, సోదరుడు, భర్త బంధుజనము అను వారిలో అందరిని వదలిపెట్టితిమి. తనకొఅకు ఇందరను కాదని వచ్చినారము. అట్టి మమ్ములను వదలి ఉన్న అతడు కృతఘ్నుడు గదా! ఐనను ఇటకు తాను తిరిగి రాదగిన ఆత్మీయమగు ఏదో వస్తువును ఉద్దేశించి ఉండును. లేదా అట్టివారెవరికో తన సందేశమిచ్చి ఉండవలెను. అతని వచనామృతము నీనుంచి తెలుసుకొన కోరుకొనుచున్నాము. ఈ దామోదరుడు గోవిందుడు పురస్త్రీలపై తగిలిన మనస్సుచే మా యెడల ప్రీతి తొలగినాడు. ఇక మాకు కనపడడని తోచుచున్నది అని ఇట్లు గోపికలు బలరామునితో పలుకుచునే మైమరచి కృష్ణా ! దామోదరా! అని సుస్వరముగ బిలుచుచు కలకల నవ్విరి. అవ్వల చక్కగా, మధురముగ, నిండు ప్రేమ తొలుక స్వాతిశయము ఇంచుకయు కనపడకుండ, మధురస్వర సరసముగ కృష్ణుడు పంపిన సందేశము వారికి వినిపించి బలరాముడు ఆ గొల్ల భామలను ఓదార్చెను. అటు పిమ్మట బలభద్రుడు మునుపటియట్ల పరిహాస సుందరులగు గోపకులతో నా వ్రేపల్లెయందు ప్రేమ పూర్వకముగా సంభాషణములు నెఱపెను. (197)

బలరామ క్రీడా వర్ణనము

వ్యాసుడు అనియె –

మాయామానుష రూపమున ఒకానొక పనికై అవనియందు అవతరించి గోపకులతో బృందావనమున సంచరించుచున్న తన ఫణామండలమున ధరణి నెల్ల ధరించిన శేషుని అవతారమై, మహత్తర కార్యములను నిర్వహించుచున్న బలరాముని ఉపభోగము కొఱకు వరుణుడు వారుణి అను తనశక్తిని పిల్చి ఓ మదిరా! నీవు అనంతుని కెంతయు ఇష్టమైన దానవు. అతడు నిన్ను ఆలకించుటకు అనువుగ అచటికి అరుగుము అనగా ఆవారుణీ సంకర్షణుని సన్నిధానమునకు అరిగెను. బృందావనమందున్న కదంబ (కడిమి) వృక్షము యొక్క తొఱ్ఱలో వసించుచున్న ఆ వారుణి వలనకలిగిన సుగంధమును అద్భుతమైన మద్యపరిమళము బలదేవుడు ఆఘ్రాణించి తొలుతటి రుచిని గుర్తించి హర్షమొందెను. అవల ఆ చెట్టునుండి పడుచున్న మద్యధారను చూచి మిగుల సంతోషించెను. గోపికలతో

గోపకులతో గూడి గీతవాద్య నిపుణులు తన యశోగానము చేయు చుండగా ఆ వారుణుని త్రాగెను. శ్రమచే క్రమ్మిన చెమటబిందువులు ముత్యములవలె భాసిల్ల అతడు యమునకు వచ్చి స్నానము చేయుదునని పలికెను.

ఆ నది అతని మాటవిని తప్పత్రాగి మత్తుచే అన్నమాట అని అనుమానించి ఆమె అతని వద్దకు రాదయ్యెను. దానిచే కోపించి అతడు నాగలిగైకొని మదవివశుడై ఆ నది యొడ్డున పెల్లగించి లాగెను. పాపాత్మురాల! రావైతివి. మరి యెచటికేని నీ ఇచ్ఛ నను సరించి పొమ్మనెను. ఆ నదీ దేవత అట్లు తటాలున ఆకర్షింపబడి, మార్గము విడిచి బలదేవుడున్న ఆ వనమును అంతను ముంచెత్తెను. మరియు శరీరము దాల్చి బెదరిన చూపులతో, ఓ హలాయుధా! అనుగ్రహము జూపుము. నన్ను వదలిపెట్టుమని పల్కెను. అతడు నా శౌర్యమును బలమును నీవు క్షించపరతువేని నా నాగలిచే నిన్ను అణచ దలచి, వేయిపాయలుగా వెంట నిన్ను నడిపించెదను అన ఆమె మిక్కిలి జడిసిపోయి ప్రతిమాలగా, ఆమె ముంచెత్తిన భూ భాగమందు ఆమెను వదలెను.

ఆవల అతడు స్నానము చేయగా అద్భుతకాంతి వచ్చెను. తరువాత లక్ష్మి ఒక శిరోభూషణముగ నల్లకలువను వరుణుడు కానుకగా పంపిన కుండలములు పెట్టుకొని, వాడిపోని తామర పూమాలను, సముద్రుడు తనకు ఉచితములైన రెండు దివ్యాంబరములను బలభద్రునకు కానుకగా ఇవ్వగా వానిని ధరించెను. నీలాబ్జము నవతంసముగ ధరించి మణి కుండలము చెవికి బెట్టుకొని ఆ నీలాంబరములు కట్టుకొని పూలమాల దాల్చి కాంతి నొంది బలరాముడు మిక్కిలి శోభించెను. అచట రెండు మాసములు క్రీడించి మధురకు పోయి రైవతరాజు కూతురును రేవతిని పరిణయమాడెను. ఆమె యందు ఆతడు నిశరుడు, ఉన్ముఖుడు అను ఇర్వురు పుత్రులను కనెను. (198)

రుక్మిణీ కల్యాణం - శంబరాసుర వధ

వ్యాసులు ఇట్లు చెప్పిరి –

భీష్మకుడు విదర్భ దేశాధిపతి కుండిన నగరము రాజధానిగ రాజ్య పరిపాలన చేసెను. అతని కుమార్తె రుక్మిణి. కుమారుడు రుక్మి అనువాడు. రుక్మిణిని కృష్ణుడును కృష్ణుని రుక్మిణియు ఒండొరులు వరించుకొనిరి. కాని రుక్మి ద్వేషముచేత చక్రాయుధునకు తన చెల్లెలు రుక్మిణిని ఈయడయ్యెను. జరాసంధుని ప్రేరణచే ఆమెనురుక్మి శిశుపాలునకు వాగ్దానము చేసెను. భీష్మకుడును రుక్మితో అట్లే అనెను. అటు పిమ్మట జరాసంధాదులు

కళ్యాణార్థము భీష్మ నగరమునకు వచ్చిరి. శిశుపాలుడును వచ్చెను. కృష్ణుడు బలభద్రుడు మొదలగు యాదవులతోగూడి ఆవివాహము చూచుటకు వచ్చెను. రేపు వివాహముకాగల్గే సమయమున హరి ఆ కన్యను కొంపోయెను. అందుచేత శ్రీమంతుడగు పౌండ్రకుడు, దంతవక్త్రుడు, విదూరథుడు శిశుపాలుడు జరాసంధుడు శాల్వాది రాజులు కోపించి బలరామాది బంధువుల యెడ శత్రుత్వముగొని హరిని చంపుటకు తీవ్రమైన యత్నము చేసిరి. వారిపై దండెత్తి వచ్చిరి, అట్లెత్తివచ్చిన ఆ బలగము కూడిన వారందరు రామాదులచే ఓడిపోయిరి. రుక్మి రణమున కేశవుని చంపకుండా పురమున ప్రవేశింపనని ప్రతిజ్ఞచేసి కృష్ణుని చంపుటకు దూకెను. చక్రాయుధుడు వాని చతురంగ సైన్యమును అవలీలగా కూల్చి రుక్మిని పడగొట్టెను. వాడు ఓడి పోయెను. అట్లు రుక్మిని గెలిచి శ్రీకృష్ణుడు శ్రీరుక్మిణీ దేవిని రాక్షస వివాహవిధానమున పరిణయమాడెను. కృష్ణునకు ఆమెయందు మన్మథాంశమున ప్రద్యుమ్నుడు జన్మించెను. ఒకప్పుడు శంబరుడు ప్రద్యుమ్నుని దొంగిలించుకొని పోయెను. శ్రీకృష్ణుడు శంబరుని సంహరించెను. (199)

ప్రద్యుమ్నుని కథ

"శంబరునిచే ప్రద్యుమ్నుడు ఎట్లు హరింపబడెను? ప్రద్యుమ్నుడు శంబరుని సంహరించిన విధము ఏమి? తెలుపుడు" అని మునులు అడగగా వ్యాసుడు ఇట్లు చెప్పెను. "ప్రద్యుమ్నుడు పుట్టిన ఆఅవనాడు కాలశంబరుడు తనకు ఈతడు హంతకుడని తలచి ఆ శిశువును పురిటింటినుండి కొంపోయి మొసళ్ళుగల భయంకరమైన సముద్రమున విసరివేసెను. ఆ పడిన శిశువును ఒక చేపపట్టుకొనెను. దాని జఠరాగ్నికి గురి అయిన ఆ బాలుడు చావలేదు. జాలరులు వలవేయగా ఇతర చేపలతో పాటు పట్టువడిన ఆ బాలుని జాలరులు శంబరునికి సమర్పించిరి. జాలరి భార్య మాయావతివాని గృహ యజమానురాలుకు ఇవ్వగా ఆమె చేపను వంటవానికీయ, వాడు అది చీల్చి ఆ చేప కడుపున వృక్షము యొక్క మొదటి మొలకవంటి పరమ సుందరుడు మున్నుదగ్గడైన మన్మథుడను శిశువును జూచెను. ఎవడు వీడు? చేప కడుపున కెట్లు వచ్చెను! అని వేడుకపడుచున్న శంబరుని భార్యనుచూచి నారదుడు; ఈ శిశువు సర్వసృష్టి సంహారములు చేయగల శంబరునిచే పురిటింట నుండి హరింపబడినవాడు. కృష్ణుని కుమారుడు సముద్రమున విసరబడి చేప మ్రింగగా నీకు దక్కినాడు. ఇది మానవ రత్నము. క్రద్దగ కాపాడుమని తెల్పెను. ఆమె అట్లే ఆ బాలుని సౌందర్యాతిశయమునకు మోహవశి అనురక్తితో పెంచెను.

ఆ బాలుని నిండు యౌవనముగని ఆమె వానికి తనమాయనంతను చెప్పెను. వాని యందు హృదయము చూపులు నిలిపి ప్రవర్తించుచుండ, ప్రద్యుమ్నుడు మాతృ భావము విడిచి మరొక తీరున నా యెడల నీవేల ప్రవర్తించుచున్నావని అడిగెను. ఆమెయు నీవు నాకు కుమారుడవుకావు. విష్ణు కుమారుడవైన నిన్ను కాలశంబరుడు హరించి సముద్రమున విసరగా ఒక చేప కడుపునుండి నాకు లభించితివి. నిన్నుగన్న తల్లి నీ కొఱకు ఇప్పుడును ఏడ్చుచునే ఉండును. అని చెప్పెను.

అది విని కోపముచెంది, మనసు వికలమై ప్రద్యుమ్నుడు శంబరుని యుద్ధమునకు పిలిచెను. మరియు వాని సైన్యమంతటిని కూల్చి ఏడురకముల మాయలను దాటి ఎనిమిదవ విధమైన మాయను ప్రయోగించి ఆ శంబరాసురుని జంపెను. ఆ మాయావతితో గగనగతి తండ్రి పురమునకు వచ్చెను. అంతఃపుర మందు వ్రాలి మాయావతితో కూడియున్న అతనిని జూచి, కృష్ణపత్నులు సంతోషించిరి. రుక్మిణియును ప్రీతితో అతనిపై చూపు నిలిపి ఇట్లనియె.

"ఏ ధన్యురాలి తనయుడో ఇతడు నవయౌవన మందున్నాడు. నా కుమారుడు ప్రద్యుమ్నుడే కనుక జీవించి ఉండిన ఈ వయసులో ఉండెడివాడు.నాయనా! నీచేత సొంపుగన్న ఆ కన్నతల్లి అదృష్టవంతురాలు. అదిగాక నీఈశరీరము ఈ ఆకారము సరిగా నన్ను పోలియున్నది. స్పష్టముగ నీవు హరి కుమారుడవే అగుదువు" అనెను. ఇంతలో కృష్ణునితో గూడ నారదుడు ఏతెంచి అంతఃపురాంగనల కెల్ల మిన్నయైన రుక్మిణీదేవిని చూచి హర్షముతో కల్యాణీ! మున్ను పురిటింటనుండి హరించిన ఆ శంబరాసురుని చంపి వచ్చిన ఈతడు నీ బిడ్డడే. ఈ మాయావతి పతివ్రత. ఆ నీకుమారుని భార్య. శంబరుని భార్య కాదు. దానికి కారణమిదిగో వినుము. మన్మథుడు పోయిన తరువాత అతడి పునర్జన్మ కోరుచు మాయారూపమున వివాహాది భోగములందు శంబరుని ఈమె తబ్బిబ్బు చేసెను. మన్మథునిపత్నియే ఈమె. ఆ దైత్యునికి మాయా రూపమును చూపినది. నీ కుమారుడు మన్మథుడు తిరిగి అవతరించినాడు. ఆతని ప్రాణ ప్రియరతియే ఈమె. శంకింపకుము. ఈ పరమ కల్యాణి నీ కోడలు అని పలుకగా రుక్మిణీ, కృష్ణులు ఆనంద భరితులైరి. ద్వారకా నగరమెల్ల బాగుబాగని హర్షించినది. చిరకాలము క్రిందట పోయిన కుమారునితో కూడుకొనిన రుక్మిణిని చూచి ద్వారకా నగర జనమెల్ల విస్మయము చెందిరి. (200)

అనిరుద్ధ వివాహము - రుక్మి వధ

వ్యాసులిట్లనియె : చారుదేష్ణుడు, సుధేష్ణుడు, చారుదేహుడు, సుషేణుడు, చారుగుప్తుడు, చారుబిందుడు (చంద్రుడు), సుచారుడు అనువారు ఏడుగురు రుక్మిణి కుమారులు.

చారుమతి అనునామె కృష్ణునకు కుమార్తె. కృష్ణునకు మఱి ఏడ్గురు భార్యలు కాళింది, మిత్రవింద, సత్య, నాగ్నజితి, జాంబవతి, నిత్యసంతుష్టయగు రోహిణి, మద్రరాజ కుమార్తె ఉత్తమ శీలముగలది అగు శీలమండల.

వీరుకాక పదహారు వేలమంది భార్యలు హరికి గలరు. ప్రద్యుమ్నుడు రుక్మి కూతురును స్వయంవరమున గ్రహించెను. ఆమె ఆతనిని స్వయంవరమందే స్వీకరించెను. ఆతనికి ఆమెయందు 'అనిరుద్ధుడ'ను కుమారుడు కల్గెను. యుద్ధములందు నిరోధించుటకు శక్యముగాని బలసమృద్ధుడు అగుట వలన అతనికి ఆపేరువచ్చెను. వానికి రుక్మి పౌత్రిని ఇమ్మని కోరెను. అతడును కృష్ణునితో స్పర్ధ బెట్టుకొన్నను, దౌహిత్రునకు ఇచ్చెను. ఆ వివాహమందు బలరామాది యాదవులు రుక్మి రాజధానియగు 'భోజకటము'నకు కృష్ణునితో తరలి వెళ్ళిరి. ప్రద్యుమ్న కుమారుని వివాహమచట అయిన తరువాత కళింగ రాజు మొదలైన వారు రుక్మింగని బలరాముడు పాచికలాట ఎరుగడు. కావున అతనిని జూదములోనే ఓడింతమని రుక్మికి యుక్తి చెప్పగా ఆరాజులు పిలిచి, తడిని బలగము కూర్చుకొని సభయందు బలరామునితో జూదమాడెను. ఆ ఆటలో రుక్మి వెయ్యి నిష్కముల పందెము గెలిచెను. రెండవ రోజున మఱి వేయి నిష్కములను గెలుచుకొనెను. ఆ మీద పదివేల నిష్కములను పందెము గాచెను. అత్తఱి కళింగరాజు బలరాముని చూచి పండ్లు బయలుపడ పరిహాసపూర్వముగ నవ్వెను. అయ్యెడ రుక్మి చెలరేగి బలభద్రుడు జూదమాడుట ఎరుగడు. ఐనను అహంభావముతో నేను ఆటగాడనని జూదమునకు సిద్ధపడినాడని గేలిచేసెను. హలాయుధుడు పండ్లు పైబడ, ఇకిలించిన కళింగరాజును బరిహసించుచు, పేలిన రుక్మిని జూచి కుపితుడై కోటి నిష్కములను పందెమొడ్డి గెలిచెను. రుక్మి పాచికలను విసరి పారవేసెను. బలరాముడట్లు గెలిచి 'గెలుపు నాదియని' బిగ్గరగ పలికెను. 'గెలుపు నాదని అబద్ధమాడకు మని' రుక్మి అరచెను. నీ ఒడ్డిన పందెమునకు నేనామోదింపలేదు. 'ఇట్లు గెలుపు నీది అగునేని నాది ఎందులకు గాదు' అని రగడ చేయుచుండ ఆకాశవాణి గంభీరముగ పెద్దపెట్టున మహాత్ముడగు బలరాముని కోపమును బెంచుచు 'బలరాముడే గెలిచినాడు రుక్మిమాట అబద్ధము. ఏమియు పలుకక చేసినదియే చేసినట్లగును' అనెను.

అంత బలరాముడు కోపముచే కన్నులెర్రబడ రుక్మిని కొట్టెను. ఎగిరెగిరి పడుచున్న కళింగ రాజునుకూడ బలరాముడు బలముచే పట్టి, వేనిని తెరచి నవ్వెనో ఆ పండ్లను ఊడ గొట్టెను. మఱియు ఆ జూదమందిరమందున్న బంగారు స్తంభమునులాగి వాని పక్షమున ఉన్న రాజులపై వైచెను. అంతట సభలో అంతటను హాహాకారములుప్పతిల్లి రాజమండల మెల్ల పలాయనమయ్యెను. బలరాముడు కోపోద్రిక్తుడయ్యెను. రుక్మి బలునిచే

హతుడగుట విని రుక్మిణికి, బలరామునకు జడిసి శ్రీకృష్ణుడు ఏమియు బలుకకుండెను. అటు వీమ్మట యదు సంఘము పెండ్లి కుమారుని అనిరుద్ధుని గొని కేశవునితో గూడ ద్వారకకు వచ్చెను. (201)

నరకాసుర వధ

వ్యాసులు అనియె –

'ఇంద్రుడు ఐరావతమెక్కి ద్వారవతియందున్న కృష్ణుని చూడవచ్చి, అతనికి నరకాసురుని చర్యలను తెలిపెను. దేవతలకు దిక్కయిన నీవు మనుష్యరూపమున ఉండియు సర్వదుఃఖ ప్రశమనము జేసినావు. తపశ్శాలుర రక్షణకు, అరిష్టుడు మొదలగు కంసునివరకు గల జగత్తుకు ఉపద్రవమైన వారిని నశింపజేసితివి. నీ బాహుదండము చేతను ప్రబోధము చేతను త్రిభువనములు రక్షణముపొంది దేవతలు యజ్ఞములందు హవిర్భాగములు ఆరగించి తృప్తులగుచున్నారు. నేనిపుడు ఎందులకు వచ్చితినో విని, ప్రతిక్రియకు యత్నింపుడు. భూమి పుత్రుడు నరకుడు అనువాడు ప్రాగ్జ్యోతిష పురాధిపతి సర్వభూతములకు బాధ చేయుచున్నాడు. దేవసిద్ధులు సురులు మొదలగువారి కన్యకల హరించి తనయింట నిర్బంధించినాడు. ఉదకమును స్రవించు వరుణుని యొక్క గొడుగును వాడు హరించెను. మణులకు ఆకరమైన మందరపర్వత శిఖరమును గొనిపోయినాడు. మాతల్లి అదితియొక్క కుండలములను అమృతము స్రవించువానినిగా జేసినాడు. ఇపుడు ఐరావతము కావలెనను చున్నాడు. వాని దుష్కృత్యము నీకు నివేదించినాను. ఇందుకు చేయవలసిన ప్రతిక్రియ నీవు స్వయముగా విమర్శింపుము.

అనినవిని భగవంతుడు దేవకీసుతుడు అల్లననవ్వి ఇంద్రునిచేయి పట్టుకొని పీఠము నుండి లేచెను. తలచినంతన వచ్చిన గరుత్మంతునిపై సత్యభామను ఎక్కించి ప్రాగ్జ్యోతిష పురమునకేగెను. ఇంద్రుడు ఐరావతమునెక్కి ద్వారకావాసులు చూచుచుండ స్వర్గమునకు వెళ్ళెను.

ప్రాగ్జ్యోతిష పురము చుట్టునూ నూరు యోజనములు భయంకరములైన పాశములచే చుట్టబడి ఉండెను. పరసైన్య నిరోధమునకు ఏర్పడిన ఆ పాశములను సుదర్శనాయుధము విసరి హరి ఖండించెను. అవ్వల మురాసురుడు ఎదిరింపరాగ హరి వానిని కడతేర్చెను. మరియు వాని కొడుకులను ఏడువేలమందిని మిడుతలనువలె చక్రధారాగ్ని దగ్ధులను చేసెను. అచ్చటనే హయగ్రీవుని చంపి బుద్ధిశాలియగు హరి తొందరతో ప్రాగ్జ్యోతిష పురమునకు బరువెత్తెను. అచ్చట నరకునితో మహాసైన్యముతో ఘోర యుద్ధమయ్యెను. గోవిందుడు వేలకొలది దైత్యులను కూల్చెను. అవ్వల శస్త్రాస్త్రములను వర్షించుచున్న భౌముని

మీదికి చక్రాయుధమును విసరి దైతేయ చక్రసంహారి వానిని రెండుగ జేసెను. నరకుడు కూలగా భూదేవి అతిదికి ఇచ్చిన కుండలములుగొని జగన్నాధు సన్నిధికి వచ్చి ఇట్లనెను.

భూమికృత కృష్ణస్తుతి

'స్వామి! వరాహమూర్తివై నన్నుద్ధరించినపుడు ఆ నీ స్పర్శవలన ఈ పుత్రుడు పుట్టినాడు. నీ ఇచ్చినవాడు వీడు. నీ చేతిలో కూలినాడు. ఈ కుండలములను గైకొనుము. ఈ నరకుని సంతానమును రక్షింపుము. నా భారమును దింపుటకు నీవీ లోకమున అంశావతారము ఎత్తినావు. అనుగ్రహసుముఖుడవు కమ్ము. నీవు కర్తవు. వికర్తవు. (వేరు చేయువాడు) సంహర్తవు. సృష్టిహేతువవు. జగత్ స్వరూపుడవు. నిన్ను నేనెక్కడ స్తుతింపగలను, వ్యాపించువాడవు. వ్యాపింపబడువాడవు. చేయువాడవు. చేయదగు పని చేయుటయు నీవె. సర్వ భూతములకు ఆత్మ స్వరూపుడవు. నేనెక్కడ స్తుతింతును. ఆత్మ (జీవుడు), భూతాత్మ (భూత స్వరూపము) పరమాత్మవు నీవె. నరకుడుచేసిన దానిని తప్పిదము కాకుండ క్షమింపుము. ప్రసన్నుడవు కమ్ము. వీడు నా కుమారుడు. నీచేత బడినాడు" అని భూదేవి హరిని స్తుతించెను.

కృష్ణుడు ధరణితో 'అట్లే' అని నరకుని ఇంట ఉన్న రత్నములను తీసికొనెను. (రత్నములనగ మణులేకాదు ఆయా వస్తువులలోకెల్ల ఉత్తమమయిన సమస్త వస్తువులు) అంతఃపుర మున పదహారువేలు పైన నూర్గురుగల కన్యకలను గూడ గైకొనెను. నాలుగు దంతములు గల ఆరువేల ఏనుగులను అచ్చట చూచెను. కాంభోజ దేశీయులైన గుఱ్ఱములు ఇరువది యొక్క నియతముల సంఖ్యగలవి వాని ఇంట ఉన్నవి. నరకుని కింకరులచే అప్పటికప్పుడు గోవిందుడు ద్వారకాపురికి తరలింపజేసెను. వారుణచ్ఛత్రము అచ్చట కనిపించెను. అట్లే మణి పర్వతమును. హరి దానిని ఖగరాజు గరుడునిపైకి ఎక్కించెను. సత్యభామతో తాను అధిష్ఠించి అదితికి కుండలములు ఇచ్చుటకు స్వర్గమునకు పోయెను. (102)

అదితికృత భగవత్ స్తుతి

వ్యాసుడు ఇట్లు చెప్పెను.

గరుత్మంతుడు వరుణుడు ఇచ్చిన ఛత్రమును, మణిపర్వతమును పత్నీ సమేతుడైన హరిని విలాసముగ వహించుచు పయనించెను. స్వర్గద్వారమునకు జేరి హరి శంఖము నూత్తెను. దేవతలు అర్ఘ్య పాత్రమునుగొని ఎదురువచ్చిరి. వేల్పులచే పూజింపబడి తెల్లని మేఘములవలె ఉన్న శిఖరములతో నున్న దేవమాతయగు అతిది గృహమున ప్రవేశించి

ఇంద్రునితోగూడ తానామెకు నమస్కరించి, మణికుండలములు ఒసంగి, నరకుడు వధించెనని తెల్పెను. జగజ్జనని అదితి సంప్రీతియై జగత్కర్తయగు హరిని, మనస్సు అతని యందు నిలిపి తొట్రుపడక ఇట్లు స్తుతించెను.

"పుండరీకాక్ష! భక్తాభయప్రద! సనాతన స్వరూపా! సర్వ భూతభావన! మనోబుద్ధీంద్రియములకు ప్రేరకుడా! హ్రస్వ దీర్ఘాది వికల్పరహిత! జన్మాదిరహిత! స్వప్నాద్యవస్థాత్రయ వ్యక్త! నీవు సంధ్యాది కాలస్వరూపుడవు. భూమ్యాది పంచభూత స్వరూపుడవు. మనోబుద్ధి చిత్తాహంకారములు నీవే. సృష్ట్యాదికర్తవు. కర్తలకు పతివి నీవే. మాయాకృతములగు బ్రహ్మాదిమూర్తులతో అంతట చరాచరాత్మక జగమెల్ల వ్యాపించియున్నాడవు. ఆత్మగాని దాని యందు ఆత్మబుద్ధి నీమాయ. దానివలననే అహంకార మమకారములు గల్గును. సంసారమందు ఇదెల్ల నీ మాయయొక్క చేష్టయే. స్వధర్మపరులచే నీవు ఆరాధింపబడుదువు. వారే ఈ మాయను తరింతురు. బ్రహ్మాదులు మనుష్యులు పశువులు సకలము విష్ణుమాయ అను సుడిలోపడి మోహము అను గాఢాంధకారమున క్రమ్ముకొనబడుదురు. నిన్నారాధించి అభీష్టములంది భవము తరింతురు. నీ పదమునందు కొందురు. పుత్ర కామనచే శత్రుక్షయము కొరకు నిన్ను నేను ఆరాధించితిని. మోక్షమునకు కాదు. మాయ యొక్క విలాసమిది. ఈ కోరిన కల్పవృక్షము నుండి కూడ గోచిగుడ్డ అడుగుట వంటిది. పుణ్య కర్మలు చేయనివారు ఇట్టి ఫలవాంఛ చేయుట అను అపరాధము తమకుతాము చేసుకున్నదే. సకల జగన్మాయామోహ పరుడవగు ఓ పరాత్పర! నాయెడ ప్రసన్నుడవగుము. కేవల జ్ఞానసత్తా స్వరూపుడవు. నా అజ్ఞానమును నశింపజేయుము. శార్ఙ్గ చక్ర గదా హస్త! నీకు నమస్కారము. స్థూల చిహ్నములచే శోభిల్లు నీ రూపమిదే చూచుచున్నాను. నీ కేవల తత్త్వము నెరుగను. ప్రసన్నుడవగుము.

ఇట్లు స్తుతింపబడి విష్ణువు సురారణిని (దేవమాత) చూచి అల్లన నవ్వి ఇట్లనియె. (అగ్ని పుట్టుటకు ఆధారము అరణి. అట్లే దేవతల ప్రాదుర్భావమునకు ఆధారము అదితి కావున ఆమెను సురారణి అను వైదిక భాషతో చక్కగా వ్యాసులు ఇచ్చట పేర్కొన్నారు.)

దేవీ మాకు నీవు మాతవు. దయచూపుము. వరప్రదాత్రివి కమ్ము అని కృష్ణుడు స్తుతింప నీ ఇష్టమట్లే అగు గాక! సురాసురలకు నీవు అజేయుడవై మనుష్య లోకమున పుట్టుమని అదితి అనెను. అటుపై శచీదేవితో గూడిన అదితికి సత్యభామ మ్రొక్కి మాయెడ ప్రసన్నురాలవు కమ్మని మరిమరి కోరెను. అదితియు "నా ప్రసాదమున ముదిమియును రూప వికృతియు నీకు కలుగదు. సర్వకామ సిద్ధిని పొందగల"వని దీవించెను.

అదితి అనుజ్ఞగొని దేవేంద్రుడు హరిని సబహుమానముగ యథావిధి పూజించె. అప్పుడు కృష్ణుడు సత్యభామ వెంబడి రాగా, నందనవనము మొదలైన దేవోద్యాన వనములు అన్నిటిని దర్శించెను. మరియు సువాసనలను ఇచ్చు పూలగుత్తులతో చలువల జిప్పలు ఎర్రని చిగుళ్ళతో ఆహ్లాదకరమై అమృత మథనమునందు పుట్టి సువర్ణప్రభ ఒప్పు దివ్యమైన పారిజాతమును దర్శించెను. ఆ దివ్యతరు రత్నమునుగని భామా రత్నము సత్యతో ఇట్లనియె. కృష్ణా! ఈ దివ్యవృక్షము ద్వారకకు మనమేల గొనిపోరాదు? సత్య నాకెంతో ప్రియురాలను నీ మాట నిజమే అగునేని నా ఇంటి పెరటిలో నాటుటకు దీనిని గొనిరమ్ము. నీ అంతగ ప్రేమ పాత్రము జాంబవతిగాదు. రుక్మిణియుగాదు అని పలుమారులు పలికితివి. ఆ పలుకులు నిజమైనచో అది మాటమాత్రము కాదేని (ఉపచార మాత్రమున అన్నచో కాదేని) ఈ పారిజాతమును నా గృహ భూషణము చేయుము! ఈ పారిజాత కుసుమ మంజరిని నా కొప్పునందు తుఱుముకొని సవతుల నడుమ అందరికన్న మిన్నగ రాణింతు గోరుచున్నానని పలుక కృష్ణుడు నవ్వి పారిజాతము గరుడునిపై కెక్కించెను. శ్రీకృష్ణుని చూచిన నందనవనపాలకులు ఇట్లనిరి :

"దేవరాజు పట్టమహిషి శచీదేవి. ఆమెసొత్తు పారిజాతము. గోవింద! దానిని నీవు కొల్లగొనతగదు. శచీదేవి అలంకారమునకే దేవతలు అమృత మంథనమున దీనిని ఆవిర్భవింపజేసినారు. దానిని చేకొని నీవు క్షేమమున అరుగజాలవు. తెలియక దీనిని కోరెదవు. ఎవడు దీనినిగొనిపోగలడు? దీనివలన దేవేంద్రుడు వికృతి నందగలడు. (అతని మనసు చెడునని భావము). వజ్రాయుధమును చేబూనిన శక్రుని అమరులు వెంబడింప గలరు. అచ్యుత! దేవతలందరితోడి విరోధము నీకు వలదు. పరిణామమందు కటువైన (చేదైన)పనిని పండితులు మెచ్చరు" (పర్యవసానమున దేవవిరోధము కొనితెచ్చు విషమమైన పని ఈ పారిజాతాపహరణమని భావము) అని వనపాలకులు పలుక, ప్రచండ కోపమున సత్యభామ ఇట్లనియె :

పారిజాతమునకు శచి ఎవతె? సురాధిపుడు శక్రుడెవరు? ఈ వృక్షము అమృత మథనమునందే పుట్టినయెడల ఇది సర్వలోకములకు చెందిన సమానమైన ఆస్తి. వానిలో దొక్కడే దాని ఎందులకు గైకొనును? దేవతలు, చంద్రుడు, లక్ష్మి, సర్వలోకమునకు సామాన్య ధనమైనట్లు పారిజాత వృక్షముగూడ సామాన్యమే. మగని బాహువులను అండగొని పొందిన గర్వాతిశయముచే ఇపుడు శచి దీనిని నిరోధించుచున్నది. అందువలన పరుగున పోయి పౌలోమికి నా మాటను చెప్పుదును. భర్తృ గర్వమున (సౌభాగ్య గర్వమున) ఉద్ధతమైన భాషలో సత్యభామ ఇట్లు చెప్పుచున్నది. నీవు గనక మగనికి కూర్చుదానవేని

అతనికి ప్రియురాలవైన నీ తరువును హరించు నా భర్తను ఆపింపుము. నీమగడగు ఇంద్రుని ఎరుగుదును. దేవతలకు ప్రభువని ఎరుగుదును. అదంతయు అట్లుండ మనుష్య స్త్రీని నేను నా పారిజాతమును గొనిపోజేయుచున్నానని సత్యభామ పలుక వనపాలకులేగి సత్యభామ చెప్పినది చెప్పినట్లు పెద్దగ ఘోషించుచు శచీదేవికి జెప్పిరి. శచీయు దేవాధిపతిని ప్రోత్సహించెను.

అంతట ఎల్ల దేవసేనలు తన్ను అనుగమింప పారిజాతము కొరకు ఇంద్రుడు యుద్ధము చేయింప ప్రవృత్తుడయ్యెను. అవ్వల పరిఘనిస్త్రింశ గదా శూలాది ఆయుధ విశేషములను గొని దేవతలు వజ్రాయుధము గొని ఇంద్రుడు నిలిచి యుద్ధసన్నద్ధులైరి. అంతట గోవిందుడు ఐరావత గజరాజమందున్న దేవేంద్రుని దేవపరివారమును యుద్ధ సన్నద్ధులంచూచి, దిక్కులు పిక్కటిల్ల శంఖ నిర్ఘోష మొనరించెను. వేలు లక్షలుగ బాణములను వదలెను. దిక్కులు ఆకాశము బాణములునిండ దేవతలు అనేక శస్త్రాస్త్రములను విసరిరి. జగదీశ్వరుడు మధుసూదనుడు ఒక్కొక్క అస్త్రమును శస్త్రమును వేవేలు తునకలుగ భేదించెను. వరుణునిపాశము ఉరగాశనుడు (గరుత్మంతుడు), పాముపిల్ల దేహమన్నట్లు ఖండ ఖండములుగా ఎగిరెను. భగవంతుడు దేవకీ కుమారుడు యముడు వదలిన దండమును గదచే అడచి ఖండించి పొడిమిచేసి వైచెను. ఆ ప్రభువు శౌరి కుబేరుని పల్లకిని చక్రముచే నువ్వుగింజంత తునకతునకలు చేసెను. సూర్యచంద్రులను తేరిపార జూచి తేజోహీనుల గావించెను. అగ్ని దేవుడు వందల కొలది బాణములకు గురి అయ్యెను. వసువులు నలుదిక్కులకు తరుమబడిరి. చక్రాయుధముచే శూలాగ్రములు తెగబడ రుద్రులు పుడమిపై పడగొట్టబడిరి. శారిఙ్గ (శార్ఙమను ధనుస్సును పట్టెడి హరి) సాధ్యులను విశ్వేదేవతలను, మరుత్తులను, గంధర్వులను అమ్ములచే ఆకాశమున బూరుగు పింజలు అగునట్లుగా ఎగురగొట్టెను. గరుడుడు తుండముతో రెక్కలతో గోటికొనలతో దేవదానవు లను తినుచు చంపుచుండెను.

ఇంద్ర ఉపేంద్రులు రెండు మేఘములు వర్షధారలట్లు బాణ సహస్రములు ఒకరిపై ఒకరు వర్షించుకొనిరి. సంకుల యుద్ధమున గరుడుడు, ఐరావతముతో దేవతలతో పోరగా జనార్దనుడు ఇంద్రునితో పోరిరి. శస్త్రములు అస్త్రములును తెగి విరిగి విడిపోవ సత్వరముగ ఇంద్రుడు వజ్రమును బట్టెను. కృష్ణుడు సుదర్శన చక్రమును ఎత్తెను. అంత చరాచరమగు మల్లోకమెల్ల వజ్ర చక్రధరులైన ఆ దేవరాజ, జనార్దనులను చూచి హాహాకార మొనరించెను.

ఆ తరువాత ఇంద్రుడు విసరిన వజ్రాయుధమును చేతపట్టుకొని శ్రీకృష్ణుడు చక్రాయుధమును మాత్రము వదలక నిలునిలుమని తర్జించెను. వజ్రము కోల్పోయి తన

వాహనము గరుడుని దెబ్బతినునంతట పలాయన మంత్రము జపింపనున్న శచీపతినిగని సత్యభామ ఇట్లనియె :

త్రిలోకేశ్వరా! శచీభర్తకు పారిపోవుట యుక్తముగాదు. పారిజాత కుసుమమాల సిగను ముడుచుకొని శచి నిన్ను సేవింపగలదు. పారిజాతమాలచే తేజరిల్లుచు వలపుగొని ఏతెంచిన శచిని మునుపటి అట్లు చూడని నీ దేవసామ్రాజ్యము ఏపాటిది? ఇంద్రా! చాలుచాలు సిగ్గు పడకుము ! దేవతలు పారిజాతము గొంపోదురుగాక! వారు వృధపడ కుందురుగాక! పతిగర్వమున తాను గర్వముగొని తన ఇంటికి వచ్చిన నన్ను శచి బహుమానముగ చూడలేదు. స్త్రీని అగుటవలన ఉదారమైన మనస్సు లేనిదాన్నై నా భర్తను మెచ్చుకొనుటయేపనిగా ఓఇంద్రా! నీతో తగవు బెట్టుకొంటిని. చాలు పరుల సొత్తుతో దొంగిలుటతో పారిజాతముతో పనిలేదు. రూపమునకు కీర్తికిని ఏ ఆడుది గర్వింపదు? అని పలుక ఇంద్రుడు సంరంభముడిగి ఓ సఖి! చండి! (తీవ్ర కోపమున) మిగుల ఖేదపడవలదు. సృష్టి స్థితి సంహార కర్తయగు విశ్వ స్వరూపునిచే ఓడుటకు నేను సిగ్గుపడను. ఎవని యందీ జగమెల్ల ఉన్నదో, కల్గుచున్నదో, లయించుచున్నదో అట్టి ప్రభువుచేత ఓడిన వానికి సిగ్గేల కల్గును. సకల భువన స్వరూపుడగు ఆయన సూక్ష్మాతి సూక్ష్మ స్వరూపము. సకల వేదవిధులచే ఎరుగబడునది, అన్యులచే ఎరుగ బడుటెట్లు? అట్టి అజుని, ఈశ్వరుని, శాశ్వతుని, తనంతట తాను జగదుపకారము చేయు మొట్టమొదటి వానిని ఎవ్వడు జయింప సమర్థుడు? (203)

ఇంద్ర కృష్ణ సంవాదము

వ్యాసుడు అనియె –

ఇట్లు దేవేంద్రునిచే భగవంతుడు పొగడబడిన భావగంభీరముగ నవ్వి, ఇట్లు పలికెను. జగన్నాథా! నీవు దేవ ప్రభువవు. ఇంద్రుడవు. మేము మానవులము. నేను చేసిన ఈ అపరాధము నీవు క్షమింపవలయు. ఈ పారిజాత తరువును యథా స్థానమునకు కొనిపొమ్ము. సత్యభామ వచనానుసారము నేను దీనిని కొనివచ్చితిని. నీచే విసరబడిన ఈ వజ్రాయుధము పూజనీయము. దీనిని నీవే చేకొనుము. శత్రువుల చీల్చు ఈ ప్రహరణము (ఆయుధము) నీదే. అని అనగా ఇంద్రుడు ఇట్లనియె. స్వామి! నేను మర్త్యుడనని పలికి నన్ను తబ్బిబ్బు చేయనేల? భగవంతుడగు నీవలని అనంత సౌఖ్యమును ఎఱిగిన (రుచి మఱిగిన) మేము నిన్నెఱుగుదుము. జగన్నాథ! నీవెవ్వడవో ఆతడే అగుదువుగాక! (నీ స్వరూపమును గూర్చి తర్కింపపనిలేదన్న మాట) అయినను ప్రవృత్తి యందున్నావు.

(నివృత్తియందు కేవలము నీవు సాక్షివి. కూటస్థ బ్రహ్మమయినను) జగత్కంటకుల నిష్కర్షను (పెల్లగించి వేయుటను) జేయుచున్నావు (దుష్ట సంహారము కొఱకు అవతరించితి వన్న మాట) కావున ఈ పారిజాతమును ద్వారవతికి కొనిపొమ్ము. నీవు మర్త్యలోకము విడిచిన తర్వాత ఈ వృక్షము అచ్చట ఉండదు అనగా హరియు ఇంద్రునితో అట్లే కమ్మని అతనితోడి సిద్ధ గంధర్వులు ఋషులును కొనియాడ భూలోకమునకు ఏతెంచి ద్వారకానగరము పైనుండి శంఖమును పూరించి పురవాసులకు ఆనంద మొనరించెను.

సత్యభామతో గరుడుని పైనుంచి దిగి పారిజాతతరువును సత్యభామ పెరటిలో నాటించెను. నగర మందలి జనము ఆ స్వర్గతరువును దర్శించి పూర్వ జన్మ స్మృతినందిరి. ఆ పారిజాతము యొక్క పూవుల వాసనచే మూడు యోజనముల దాక పరిమళించుట మరియు యాదవులెల్లరు నాతరువునందు అద్దమందువలె తమముఖదర్శనము చేయుటయే గాదు దేవగంధర్వ మానుషులు ఎల్లరు అందు దర్శించిరి. ప్రాగ్జ్యోతిషము నుండి నౌకరులు గొనివచ్చిన ఏన్గులు గుఱ్ఱములు ధనము స్త్రీలను కృష్ణుడు నరకుని పరిగ్రహము నుండి గ్రహించెను. అవ్వలనొక సుముహూర్త మందు నరకుని చెఱనుండి విడిచి రప్పింపబడిన ఆ కన్యలందఱను (అవివాహితలు అన్నమాట) తన కులధర్మానుసారము పదునాఱువేల మీద ఒక వంద మందిని యథాశాస్త్రముగా పాణిగ్రహణ మొనరించుకొనెను. అయ్యెడ భగవంతడగు శ్రీకృష్ణుడు అందఱకు అన్ని రూపముల తాల్చెను. ఆ కన్యకలును ఒక్కొక్కతె ఒక్కొక్కనిగా కృష్ణుని భావించి ఎవరి మట్టుకు వారు గోవిందుడు నాపాణియే గ్రహించి నా చేతినే చేపట్టెనని అనుకొనిరి. రాత్రులందు జగత్సృష్టి కర్తయగు మాధవుడు యోగీశ్వరేశ్వరుడు కావున విశ్వరూపధరుడై అందఱి ఇండ్ల ఇన్నిరూపుల తానొక్కడై సంచరించెను. (204)

అనిరుద్ధ చరిత్ర

వ్యాసుడు ఇట్లనియె –

శ్రీకృష్ణునికి రుక్మిణి యందు గల్గిన ప్రద్యుమ్నాదులగు పుత్రులను గూర్చి తెల్పితిని. సత్యభామ యందు భానువు మొదలగు కుమారులు గల్గిరి. దీప్తిమంతుడు ప్రపక్షుడు మున్నగువారు రోహిణియందు గల్గిన తనయులు. సాంబాదులు జాంబవతికి ఉదయించిరి. నాగ్నజితియందు భద్రవిందాదులు పుట్టిరి. శైబ్యయందు సంగ్రామజిత్తు మొదలయిన కొడుకులు గల్గిరి. మాద్రి కుమారులు వృకాదులు. లక్ష్మణ గాత్రవంతుడు మొదలగు వారిని కనెను. కాళిందికి శ్రుతాదులు ఉదయించిరి. మఱి ఇతర భార్యలందు చక్రికి ఎనిమిద యుతములు (నూరు వేలును) కుమారులు జనించిరి. (అయుతము పది వేలు

× 8 = 80000 + 100000 = అనగా ఒక లక్ష యెనుబది వేల మంది హరి వంశమన్న మాట) అందరిలో రుక్మిణీ కుమారుడు ప్రద్యుమ్నుడు మొదటివాడు. అతని వలన అనిరుద్ధుడు ఉదయించెను. అతనికి వజ్రుడు పుట్టెను. యుద్ధములందు అనిరుద్ధుడు = నిరోధింపబడనివాడు. కావున అనిరుద్ధుడను పౌరుషనామమును పొందిన ఆతడు బలి పౌత్రిని బాణుని కుమార్తెను ఉషను పెండ్లాడెను. ఆ సందర్భముననే హరి హరులకు ఘోరయుద్ధమే జరిగి బాణాసురుని వేయి బాహువులు చక్రిచే తెగగొట్టబడినవి.

అని తెలుపగా మునులువిని ఉషా నిమిత్తముగనైన ఆ యుద్ధ విశేషములు పూర్తిగ తెల్పుము. విన కుతూహల మగుచున్నదన వ్యాసులు ఇట్లనిరి :

బాణుని కూతురు ఉష శంకరునితో క్రీడించు పార్వతినిచూచి తనలో తానెంతో ముచ్చటపడెను. అంత గౌరి అందరి డెందములను ఎఱిగినది కావున తాపపడకు! నీవును మగనితో ఇట్లే క్రీడింతువు లెమ్మనెను. అదివిని ఆ ముగ్ధ ఎప్పుడు, నామగడు ఎవ్వడు అని అడుగగా మరల పార్వతి ఓ రాచకన్నియ! వైశాఖ శుక్ల ద్వాదశినాడు కలలో నీకు అభిభవము = తిరస్కారమును (మానభంగమును) చేయునో అతడే నీకు భర్త కాగలడు అనెను.

చెలి చిత్రలేఖ మెల్లన లాలించి విశ్వాసము గల్గించినంత ఉషాదేవి గౌరి పలికినది పలికినట్లు చెలికత్తెకు తెలిపి వానికి ఉపాయము చేయమనెను. అంతట చిత్రలేఖ పటమునందు సురలను, దైత్యులను, గంధర్వులను ప్రధానముగా మనుష్యులను లిఖించి చూపెను. ఆ బాలిక అందఱను తిలకించి మనుష్యుల చిత్తర్వులందు చూపు ఉంచెను. వారిలో కూడ అంధక వృష్ణి వంశములందు దృష్టిపెట్టెను. అందును కృష్ణుని బలరాముని చూసి సిగ్గుదొలకి, కన్నులు విప్పార, ప్రద్యుమ్నుని జూడ లజ్జనిండిన చూపును ప్రసరింప జేసెను. అప్పుడు అనిరుద్ధుని గాంచియు ఆ సిగ్గు ఎటు పోయెనో అతడే ఈతడు నాకని (నాకు కనబడిన వాడని బాహ్యార్థము) నాకు కావలసినవాడని చెప్పగా సఖియగు ఆ చిత్రలేఖ నెచ్చెలిని ఓదార్చి, యోగశక్తిచే ద్వారవతికేగెను. (205)

బాణయుద్ధ వర్ణనము

వ్యాసుడు ఇట్లు అనియె –

బాణుడు త్రిలోచనునికి మ్రొక్కి ఇట్లనియె. వేయి బాహువులతో యుద్ధములేక నేను నిస్పృహుడనైతిని. ఈ చేతులున్నందులకు ఇవి సాఫల్యము నందుటకు ఏదేని రణము సంఘటింపవలెను? అదిలేనపుడు ఈ చేతులు బరువుచేటుగదా. ఇవి యెందులకు?

అన శంకరుడు నీ నెమలి టెక్కెమెప్పుడు విఱుగునో అప్పుడు మాంసాశనులగు జనములకు ఆనందమగు యుద్ధము నీకు సంఘటించుననెను.

ఆ మాటలకు సంతసించిన బాణుడు శంభునికి మ్రొక్కి ఇంటికివచ్చి రాగానే ధ్వజభంగమగుట చూచి మిక్కిలి హర్షమొందెను. ఇదే సమయమున చిత్రలేఖ ఆ అనిరుద్ధుని యోగబలమున కన్యాంతఃపురమునకు గొనివచ్చి ఉంచగా, ఉషాదేవితో క్రీడించుచున్న వానిని చూచి కావలివాండ్రు దైత్యపతి కెఱిగించిరి. బాణుని ఆనతిచే వచ్చిపైబడిన సేవక సైన్యము అమహాత్ముడు అనిరుద్ధుడు ఇనుపపరిఘచేత చావమోదెను.

వారు అట్లు హతులైనంత బాణుడు రథమెక్కివచ్చి పోరి ఆ వీరుని వలన పరాజయమొందెను. తరువాత బాణుడు మంత్రము జపించి మాయాయుద్ధము చేయుట ఆరంభించెను. సర్పాస్త్రముచే యదునందనుని బంధించెను. అనిరుద్ధుడెటువోయెనని ద్వారకలో అనుకొనుచున్న యదువులకు నారదుడు అతని బాణునిచే బద్ధుడయినట్లు తెలియజేసెను. అప్పుడు యాదవులు ఆనిరుద్ధ కుమారుని యోగవిద్యా విశారదయగు ఒక అంగన శోణిత పురమునకు గొంపోయినట్లువిని విచారించిరి.

అంతట తలచినంతనే వచ్చిన గరుడునెక్కి బలరామునితో ప్రద్యుమ్నునితో గూడి హరి బాణపురమునకు ఏగెను. పురప్రవేశమందే బలశాలురగు ప్రమథగణముతో రణమయ్యెను. హరి వారిని క్షయమొందించి బాణపుర ప్రాంతములకు వెళ్లెను.

ఆ తరువాత త్రిపాదము త్రిశిరస్కమునైన మహేశ్వర మహాజ్వరము బాణుని కాపుదలకై శారఙ్గధన్వునితో (హరితో) పోరజొచ్చెను. కృష్ణశరీరస్పర్శ వలన భస్మస్పర్శవలన జనించిన ఒకానొక తాపమును బలరాముడు కూడ పొంది కన్నులు మూసికొనెను. కృష్ణునితో పోరుచున్న మహేశ్వర జ్వరము, వైష్ణవ జ్వరముచే కృష్ణదేహము నుండి త్రోసివేయబడెను. నారాయణ భుజాఘాతముచే కల్గిన బాధచే కన్నులు తీసివేసిన మహేశ్వర జ్వరమును చూచి బ్రహ్మ వీనిని క్షమింపుమని హరిని కోరెను. అటుమీద క్షమించితినని వైష్ణవ జ్వరమునుదనయందు లయింపజేసికొనెను. నీతో నాకైన ఈయుద్ధమును ఎవ్వరు స్మరింతురో వారు విజ్వరులు (జ్వరబాధలేనివారు) అయ్యెదరని హరి యేగెను. అవ్వల శత్రు ప్రయుక్తములగు పంచాగ్నులగెల్చి క్షీణింపజేసి దానవుల సేనలను విష్ణువు లీలగ పిండిచేసెను.

అటు పిమ్మట బాణుడు శంకరుడు, కుమారస్వామియు సమస్త సైన్యముతో కృష్ణునెదిరించి యుద్ధము చేసిరి. హరిహరుల పోరాటము మిక్కిలి దారుణమయ్యెను. శస్త్రాస్త్రములచే లోకములు సంక్షోభించెను. ఇది సర్వ జగత్ప్రళయము కొరకే వచ్చినదని దేవతలు

తలచిరి. గోవిందుడు జృంభణాస్త్రముచే శంకరుని జృంభింప జేసెను. అంతట దైత్యుల ప్రమథులును నశించిరి. జృంభణమువలన ఓటువడి, హరుడు రథమధ్యమందు ఒరిగెను. కృష్ణునితో పోరలేడయ్యెను కుమారస్వామి గరుడునిచే పొడువబడిన బాహువులతో ప్రద్యుమ్నుని అస్త్రముల దెబ్బతిని కృష్ణుని హుంకారములచే శక్త్యాయుధము చెదర రణభూమి నుండి తొలగిపోయెను. హరిచే శంకరుడూదరగొన రాక్షస సైన్యము నాశముకాగా గుహుడోటువడ ప్రమథసేన క్షయమొందగా నందీశుడు అశ్వములను పూన్చిన రథమెక్కి బాణుడు కృష్ణునితోను కృష్ణుని బలముతోను యుద్ధము చేయుటకు ఎత్తి వచ్చెను.

మహావీరుడు బలభద్రుడు బాణుని సైన్యమును అనేక విధముల చండాడెను. ప్రద్యుమ్నుడు రణధర్మమును అనుసరించి పారిపోక (వెనుదిరుగక) పోరెను. బలరాముడు నాగలి కొనచే పట్టిలాగి రోకలిని చక్రి బాణములచే నుగ్గు చేయుటను బాణుడు చూచెను. అప్పుడు కృష్ణుడును బాణుడును తలపడిరి. ఒండొరులు మెఱుగులు క్రమ్ము కవచములను ఖండించుకొనిరి. ఒండొరుల బాణములచేతను ఒండొరులను కొట్టుకొనిరి. తుదకు హరి బాణుని సంహరింపవలెనని దృఢ నిశ్చయముచేసికొనెను. అంతట నూరుగురు సూర్యులవలె వెలుగు చక్రమును సుదర్శనాఖ్యమును దైత్యచక్రవైరి హరిచేపట్టెను. మధువైరి ఈసారి బాణుడు నశించి తీరవలెనని చక్రాయుధమును వదలినంతట రాక్షసుల మాయా మంత్రశక్తి కోటరి అనునది దిగంబరి అయ్యెను. అనగా వెల్లడియయ్యెను. ఆ శక్తిని గని కనులు మూసికొని బాణుని బాహు వనమును ఖండించుటకు సుదర్శనమును విసరెను. ఆ చక్రాయుధము బాణుని బాహుసమూహమును నరకెను. హరి ఆమీద బాణునిగూడ సంహరింపనెంచి నంతట త్రిపురవైరి (శివుడు) బాణుడు చేతులు తెగి రక్తము వర్షించు చుండగని తటాలున వచ్చి హరితో సామరస్యపూర్వకముగ ఇట్లనియె.

కృష్ణా! కృష్ణా! జగన్నాథ! నీవు పురుషోత్తముడవు, పరాత్పరుడవు, ఆద్యంతములు లేనివాడవు అని ఎఱుంగుదును. దేవ మనుష్య పశుపక్ష్యాదులందు శరీరమును గ్రహించుట దైత్యసంహారము చేయుట అను లక్షణముగల ఈ చేష్ట నీలీల. కావున ప్రసన్నుడవు అగుము. ఈ బాణునకు నేను అభయమిచ్చి ఉన్నాను. నాపల్కినపలుకు నీవు అబద్ధము చేయ తగదు. నా ఆశ్రయమదముచే పెరిగినవాడు వీడు. నీ అపరాధమిందు లేదు. ఈ దైత్యునికి నేను వరములు ఇచ్చితిని. కావున నిన్ను నేను సైరణ గొనుమని కోరుచున్నాను అని చెప్పగా గోవిందుడు మాధవుని శూలపాణిని గూర్చి ప్రసన్నముఖుడై బాణునియెడ కసివిడచి ఇట్లనియె.

శంకర! నీచే వరములు ఈయబడిన వాడు కావున నీ బాణుడు బ్రతుకుగాక! నీ మాటపై గల గౌరవముచే ఇదిగో చక్రమును మఱలించితిని. నీవు అభయమిచ్చుట నేను

ఇచ్చుటయే. నాకంటె నీవు వేఱుగావని చూడదగును. నేను ఎవ్వడనో అతడు నీవే. సదేవాసుర మానుషమైన ఈ జగత్తు గూడ మనమే. అవిద్యా మోహితులైనవారు భేదదృష్టి ని వహింతురు. అని కృష్ణుడు పలుక ప్రద్యుమ్నుని చుట్టుకొని ఉన్న పాములు చచ్చుపడి పోయినవి. అంతట పత్నితోగూడిన అనిరుద్ధుని గరుడునిపైకి ఎక్కించుకొని బలరామకృష్ణ కృష్ణ సంబంధి పరివారములు ద్వారకాపురికి వచ్చిరి. (206)

పౌండ్రక వాసుదేవ వధ

మునులు ఇట్లు అనిరి –

మానుషమూర్తియై శౌరి ఇంద్రుని శంకరుని సర్వదేవతలను లీలామాత్రముగ గెలిచి మహత్కార్యమును ఒనరించెను. దేవతలు తెలియక చేసిన చేతలకు విఘాతము చేసిన హరి ఇంకను చేసిన లీలలను తెలుపుము. మాకు విన వేడుక అగుచున్నదన వ్యాసులు ఇట్లనిరి :

'మునివరులారా! తెలుపుచున్నాను. ఆదరముతో వినుడు. కృష్ణుడు నరావతారమున వారణాసి నగరమును కాల్చి వైచెను. పౌండ్రక వాసుదేవుడు ప్రజలు తనతో వాసుదేవు డొకడు భూలోకమున సంచరించుచున్నాడు. నిజముగ అవతరించిన వాడవు నీవే అని పలుకుచుండ వాడు వాసుదేవుడను నేనే, అవని అవతరించితిని ననుకొనెను. దానిచే స్మృతితప్పి వాడు విష్ణు చిహ్నములైన శంఖ చక్ర గదాదులను అయోమయముగ చేయించుకొని పెట్టుకొని కృష్ణునకు దూతను కూడ పంపెను.

ఆ పంపబడిన దూత వాని మాటలుగ కృష్ణునికి ఇట్లు చెప్పెను. 'ఓ మూఢ! చక్రాది చిహ్నములను నీవు పెట్టుకున్న వాసుదేవుడు అనెడి నా పేరును సర్వమును విడిచి నీవు బ్రతుక తలతువేని నాకు ప్రణతుడవగుము' అనగా నవ్వి దూతతో భగవంతుడు 'నా చిహ్నమగు చక్రమును నీ ఎదుట విడిచెదను. అని అంటినని నా మాటగ నీవేగి పౌండ్రకునికి చెప్పుము. నీమాటలోని మంచితనము నాకు తెలిసినది. చేయదగినదేదో చేయుము. నేను నా చిహ్నములను ధరించియే నీ పురమునకు వచ్చెదను. నా చిహ్నమయిన చక్రమును నీ కొఱకు వదలెదను గూడ. సందేహము లేదు. ఆజ్ఞాపూర్వకముగ తమ్ముని నీవన్న మాటను రేపే విలంబము లేకుండ నీకు అప్పగించెదను.నీ శరణము (దిక్కు)నకు ఏతెంచి నీవలన మఱి ఏ కొంచెము భయము లేకుండ చేయవలసినపని చేసెదను' అని పరిహాసగర్భముగ తెలుపబడి దూత చనినంతట స్మరణ మాత్రముచేత వచ్చి వ్రాలిన గరుత్మంతునెక్కి త్వరితముగ హరి తత్పురమునకు ఏగెను.

కాశిరాజు హరి ప్రయత్నమును విని అపుడు పౌండ్రకుని పక్షమున సర్వ సైన్య పరివారముతో పార్ణిగ్రాహియై (మడమల ద్రొక్కికొనుచు) వచ్చెను. అంతట ఆ పౌండ్రక వాసుదేవుడు పెనుబలముతో కాశిరాజు బలముతోడను కేశవునకు ఎదురు నిలిచెను. హరి ఉన్నత రథమందున్న వానిని శంఖ చక్ర గదాహస్తుడైన వానిని, ఒక హస్తమున పద్మమును బట్టిన వానిని వనమాలాధరుని శార్ఙమను విల్లు చేకొన్నవానిని బంగారపు నగిషీ చెక్కిన టెక్కముగల వానిని ఉరమున శ్రీవత్స చిహ్నమును దాల్చినవానిని కిరీట కుండల ధారిని పీతాంబరుని పౌండ్రకుని చూచి మధువైరి భావ గంభీరముగ నవ్వెను.

చతురంగ బలముతో గదాశూలశక్త్యాది సర్వాయుధములతో ఎదిరించినవానితో కృష్ణుడు యుద్ధము చేసెను. శార్ఙ ధనుర్ముక్తములైన అగ్ని జ్వాలలచే దారుణములైన గదా చక్రపాతములచే క్షణములో వాని సైన్యమును హతమొనర్చెను. కాశిరాజు సత్వమును గూడ క్షయింపజేసి తన చిహ్నములను దాల్చియున్న ఆమూఢునితో భగవంతుడు ఇట్లనియె.

పౌండ్రక! దూతముఖమున నీవు పంపిన కబురంతయు విన్నాను. నా చక్రాది చిహ్నములను వదలమని కదా నీ యాజ్ఞ. అది అట్లే నిర్వహించినాను. ఇదిగో చక్రము. ఇదిగో గద వదలుచున్నాను. గరుత్మంతుడిదుగో. నీ ధ్వజమిందెక్కు గాక! అని పలికిన క్షణమున హరి వదలిన చక్రముచే వాడు చీల్చబడెను. గదచే హతుడై పడెను. గరుత్మంతునిచే గరుత్మంతుడయ్యెను. అనగా రెక్కలు వచ్చినట్లై ఆకాశమునకు ఎగిరిపోయెను. అంతట లోకము హాహాకార మొనరించెను. మిత్రునకు ఉపకారముగ కృతజ్ఞతగ కాశిరాజు వాసుదేవునితో తలపడెను. హరి శార్ఙ ధనుర్ముక్తములైన అమ్ములచే వాని శిరము నరికి లోకమునకు అచ్చెరువు కలుగునట్లుగా కాశిపురికి విసరివేసెను. శౌరి పౌండ్రకుని కూల్చి పరివారముతో కాశిరాజును చంపి ద్వారవతికి వచ్చి స్వర్గమునకు ఏతెంచిన దేవేంద్రునివలె విలసిల్లెను.

కాశిరాజ్య రాజధానియందు పడిన కాశీరాజు తలను చూచి ఇదేమి ఎవరీ పనిచేసిన వారు అని జనము విస్మయమందిరి. వాసుదేవునిచే ఆ కాశిరాజు హతుడయ్యెనని ఎరిగి వాని కొడుకు పురోహితునితో ఏగి కాశి విశ్వేశ్వరుని స్తుతించెను శంకరుడు ఆ విముక్త మహాక్షేత్రమున వానిచే తోషితుడై ఆ రాజు సుతుని వరము కోరుకొమ్మనెను. వాడు స్వామి! నా తండ్రిని కడతేర్చిన కృష్ణుని కడతేర్చుటకు మహేశ్వర! నీ అనుగ్రహమున కృత్యయను దారుణశక్తి లేచుగాక అనెను. అట్లేయగునని అనినంత వాని అగ్నిహోత్ర శాల యందలి దక్షిణాగ్నినుండి మహాకృత్యలేచెను. అగ్నిజ్వలా భయంకరమైన ముఖము, మంటలెగయుచున్న కేశకలాపముతో, కృష్ణా! కృష్ణా! అనుచు కోపముతో అది ద్వారవతి

వంక చనెను. ఆ రౌద్రమూర్తిని వికృతమగు కన్నుల దానిని ద్వారకావాసి జనమెల్ల చూచి జగముల కెల్ల శరణమైన మధువైరిని శరణొందిరి.

కాశిరాజు వృషభధ్వజుని ఆరాధించి ఈ మహా కృత్యను కృష్ణుని చంపుటకు పుట్టించెను. అగ్ని జ్వాలలతోడి జడలచే ఆకులయైన ఈ ఉగ్ర శక్తిని సంహరింపుము అను జనఘోష చదరంగమాడుచు విని ఆటగ అగ్ని మూలాజటిలయై జ్వాలలను గ్రక్కుచున్న అతి భీషణమైన ఆకృత్యను విష్ణు చక్రము సుదర్శనము వెనుకకు తరిమెను. మహేశ్వర దేవతాకయగు ఆ కృత్య హరి చక్ర విధ్వస్తయై వేగమున పరువెత్తెను. దానిని చక్రము వెంబడించెను. అపుడా కృత్య విష్ణు చక్రముచే ప్రభావము గోల్పడినదై, వారాణసిని ప్రవేశించెను.

అవ్వల కాశిరాజు సైన్యము అంతువడని ప్రమథగణ సైన్యము సర్వ శస్త్రాస్త్రములతో చక్రమున కెదురు పోయెను. శస్త్రాస్త్రాహుత బహుళమైన ఆ సైన్యమునెల్ల దహింపజేసి అశేష కాశీనగరమును నిండ చతురంగ బలముతో, రాజ భృత్యులతో, పౌరులతో, దుర్గములతో, కోష్ఠములతో కాల్చి గృహ, ప్రాకార, తోరణములందు మంటలు అలముకొన సత్వరము ఆచక్రము వారణాసిని గాల్చెను. అక్షీణమైన కసితో సాధ్యసాధన కారకములు అన్నింటిని శేషములేకుండా చేసి, ఆ సుదర్శన ఆయుధము, దీప్తిమంతమై విష్ణు హస్తమునకు ఏతెంచెను. (207)

బలరామ ప్రభావము

"ధీశాలి బలభద్రుని పరాక్రమము శౌర్యమును గూర్చి ఇంకను వినగోరు చున్నాము. యమునా నదీ సమాకర్షణము మొదలగునవి విన్నాము. అతడు మఱియేమి చేసెను" అని మునులు అడుగగా వ్యాసులు ఇట్లు అనిరి - అనంతుడు భూమిని మోయు ఆదిశేషుడు అగు బలరామమూర్తి లీలలు వినుడు :

స్వయంవరమున దృష్టిపెట్టుకున్న దుర్యోధనుని కూతురును, జాంబవతి కుమారుడు సాంబుడు బలాత్కారముగ హరించెను. దానికి కోపించి కర్ణ దుర్యోధనాదులు భీష్మ ద్రోణాదులును వానిని యుద్ధములో ఓడించి బంధించిరి. అదివిని యాదవులు దుర్యోధనాదులందు కోపము గొని వారిని కడతేర్తుమని ప్రతిక్రియకు పూనుకొనిరి. వారిని వారించి బలరాముడు సగర్వముగ నేనొక్కడనే ఏగెదను. నా మాటచే వానిని విడచెదరని నాగసము అను పురికేగి వెలుపలి ఉద్యానవనమందు విడిచెను. నగరములోని ప్రవేశింప లేదు. బలభద్రుడు వచ్చెనని తెలిసి దుర్యోధనాదులు హరికి గోవును పాద్యార్ఘ్యములను ఒసంగిరి.

అవి స్వీకరించి కౌరవులతో ఉగ్రసేనుని ఆజ్ఞయిది. సాంబుని వెంటనే విడువుడు అనగా భీష్మ, ద్రోణాదులు, కర్ణ, దుర్యోధనులును విని కోపించిరి. బాహ్లికాదులతో అందరును యదు వంశము రాజ్యార్హము కాదని చూచి ముసలాయుధునితో ఇట్లనిరి.

బలభద్ర! నీవు అన్నమాట ఇదేమి? ఉత్తమ వంశమందు బుట్టిన వారి కొక యాదవుడు ఆజ్ఞ ఇచ్చుటా, ఎవ్వడు ఆతడు? ఉగ్రసేనుడు గూడ కౌరవుల కాజ్ఞ చేయునేని రాజులకు ఉచితమైన శ్వేతచ్ఛత్రము మీకెందులకు? అలంకారప్రాయములు. ఇవి ఎందులకు? బలభద్ర! నీవు చనుము. అన్యాయవర్తనుని సాంబుని నీ ఆజ్ఞచే కాని ఉగ్రసేనుని ఆజ్ఞచేకాని విడిచిపెట్టము. కుకురాంధకాదులు రాజులు మాకు ప్రణతులైనారు. అట్టి ప్రణతి చేయక పోగా, స్వామి భృత్యునికచ్చినట్లు ఆజ్ఞ చేయుటయేమి? సహాసన సహపంక్తి భోజనములచే మీకు గర్వమెక్కినది. మీ తప్పేమి! ఓ బల! నీ చెప్పిన ఈ ఉగ్రసేనుడు మాకు పూజనీయుడగుట ప్రేమచేతనే. కులమును బట్టి కాదు. ఈ మా మర్యాద మీ కులమునకు తగదు అని కౌరవులు పలుకుచు హరి కుమారుని సాంబుని విడువరైరి. అందరు ఒకటే నిశ్చయముతో హస్తినాపుర నగరమును ప్రవేశించిరి.

అంతట అధిక్షేపముచే గల్గిన కోపముచే మత్తుగొని, ఘూర్ణించుచు, లేచి, నేలను మడమలతో త్రొక్కి తాటించుచు, దానిచే ఈభూమి పగులునట్లు పెద్ద ధ్వని దిక్కుల పిక్కటిల్ల హలి బాహులం జరచి కనులెఱ్ఱపడగా కనుబొమలు ముడివడి, మొగము కుటిలముగాగ బలదేవుడు ఇట్లనియె– "అహో! వట్టి నీరసులు దురాత్ములైనవారికి ఏమి పొగరిది! మాపై కౌరవుల పెత్తనము కాల ప్రభావము. ఉగ్రసేనుని ఆనతి అనుల్లం ఘనీ యము (దాటగూడనిది) అని అనుకొనరే ! ఆయన ఆజ్ఞను దేవతలతో గూడ శచీపతి సధర్మముగ గైకొనునే. శచీ ప్రియుని సుధర్మసభను ఉగ్రసేనుడు ఏవేళను అధిష్టించుచున్నాడు. ఛీ ! ఛీ! నూరుగురు మనుష్యుల ఉహరి చ్ఛిష్టమైన రాజాసనము నందు వీరికి సంతుష్టియట. పారిజాత తరుపుష్ప మంజరులను ఎవ్వని బంట్రౌతు లయ బలాజనము కొప్పులందు తురుము కొందుతో అట్టి యుగ్రసేనుడు గూడ వీరికి దొరగాడట. సమస్త సార్వభౌములకు నధినాథుడైన యుగ్రసేనుడు అట్లుండుట! ఇప్పుడు ఉర్వినెల్ల నిష్కారవము చేసి ఆ ఊరికే ఏగెదను. కర్ణుని దుర్యోధనుని ద్రోణుని ఇప్పుడు భీష్ముని బాహ్లికుని దుశ్శాసనాదులను భూరిశ్రవస్సును సోమదత్తుని శలుని భీముని అర్జునుని యుధిష్ఠిరునితో కవలలను (నకుల సహదేవులను) మరియుంగల కౌరవులను సాశ్వరథ కుంజరముగ హత మొనర్చెదను. ఆ మీద సాంబుని సభార్యకముగ చేకొని ఆ పురికి ఏగెదను. ద్వారకకు ఏగి ఉగ్రసేనాది బంధుప్రులను జూచెదను. లేదా! ఎల్ల కురువర్గముతో కౌరవుల భారము హరింప దేవాధీశు

ప్రేరణమున శీఘ్రముగ నాగసమను ఆ నగరమును భాగీరథిలోనికి విసరివైచెదను" అని ఇట్లు కోపమున ఎఱుపు వారిన చూపులతో తాలాంకుడు ప్రాకార ప్రప్రములు అధో ముఖముగ నాగలి (క్రిందు ముఖముగ) గ్రుచ్చి లాగెను. అంతట కౌరవులు గగ్గోలువడి ఇట్లు గోలవెట్టిరి.

రామ! రామ! మహావీర! క్షమింపు క్షమింపుము. కోపమును ఉపసంహరింపుము. ప్రసన్నుడ వగుము! ఇదుగో సాంబుడు పత్నితో ఇదే వెలువరింపబడినాడు : నీ ప్రభావము ఎఱుగని అపరాధులను క్షమింపుము అని కౌరవులు త్వరగ తమపురమునకు ఏగి భార్యతో సాంబుని విడిచిరి. బలవంతులకెల్ల బలవంతుడగు బలరాముడు భీష్మ ద్రోణ కృపాచార్యాదులకు ప్రణామములు చేసి శాంతుడనైతినని పలికెను. ఇప్పటికిని ద్వారక పెల్లగిలి నదిపెల్లగిలి నట్లు కనబడుచున్నది. ఇది బల శౌర్యశాలి బలరాముని ప్రభావము. ఓ ద్విజులారా! అవ్వల కౌరవులు సాంబుని హరి సహితముగ పూజించి పెండ్లి కానుకలు సారె చీరలు పెట్టి భార్యతో ద్వారకకు పంపిరి. (208)

ద్వివిదవానర వధ

వ్యాసుడు ఇట్లు చెప్పెను.

బలరాముని లీల మఱియొకటి వినుడు. నరకాసురునికి మిత్రుడు దేవవిరోధి ద్వివిదుడను వానరుడు ఉండెను. వాడు శత్రువులతో విరోధము పెట్టుకుని నరకుని చంపిన కృష్ణుని నిమిత్తముగా దేవతలకు ప్రతిక్రియ చేయుదునని యజ్ఞధ్వంసము చేయుచు మర్త్య లోకమునకు హాని చేసెను. సాధువుల మర్యాదలను చెరచెను. జీవులను జంపెను. దేశమును పురములను, గ్రామములను కాల్చెను. పర్వతములు ఎత్తి పడవేసి గ్రామములను పిండిపిండి చేసెను. శైలములలేపి నీళ్ళలో సముద్రములో బడద్రొబ్బెను. సముద్రమున నిల్చి క్షోభింపజేసెను. దానిచే వార్ధి పొంగి చెలియలికట్ట దాటి దారినున్న పుర గ్రామములను ముంచెత్తెను. కోరిన రూపుదాల్చి దూకుచు గంతులిడుచు పంటలను అన్ని విధముల చూర్ణములు చేసెను. వానిచే ఈ జగమెల్ల అపకరింపబడి వేదాధ్యయన ధ్వని, వేద పఠన శబ్దము లేక దుఃఖించెను.

ఒకతరి హలాయుధుడు రైవతోద్యానమున మద్యపానము చేయుచుండెను. ఆయన భార్య రైవతి మఱి కొందరు రమణులు ఆతనిని అనుగమించిరి. వారు తన కీర్తిని గానము చేయు చుండగా వారి మధ్యలో నిల్చి కుబేరునివలె వెలుగొందను. అంతట ద్వివిదవానరుడు వచ్చి ఆతని రోకలిని, నాగలిని గైకొని యెదుటబడి వినోద మొనరించెను. ఆ తరుణుల యెదుట ఇకిలించెను. నిండు కల్లుకుండల గిరవాటు వెట్టెను. వానిని పగుల

వేసెను. బలరాముడు ఈసు గొని వానిని బెదరించెను. అయినను వాడు అతని అవమానించుచు కిలకిల ధ్వని చేసెను. అంతటలేచి హలి రోషముతో రోకలిని పట్టెను. వాడొక వెఱపు గొలుపు రాతిబండను ఎత్తివిసరెను. హలి దానిని తోకట వేలతునకలు చేసి చిమ్మెను. ఆ కోతి దుమికి మీద పడగా బలుడు రోషమున వానిని వంచి తొమ్మున కొట్టెను. నడినెత్తిన గ్రుద్దెను. అంత ద్వివిదుడు రక్తము గ్రక్కికొని ప్రాణములుపోయి పడిపోయెను. పడుచున్నవాని యొడలున నా కొండ శిఖరము దేవేంద్రుని యొక్క వజ్రముచే కొట్టబడినట్లు విరిగి పడెను. అంతట దేవతలు బలరామునిపై పూలవాన కురిపించిరి. వచ్చి బాగుబాగు గొప్పపని చేసినాడవని కొనియాడిరి. ఈ చెడ్డకోతి దైత్యుల వైపు ఉపకారముచేయ లోకమున బాధించినాడు. భాగ్యవశమున వీడు నీచే కడతేర్పబడినాడని ప్రశంసించిరి. ఇట్లనంతమూర్తి విశ్వంభరాధారి బలదేవుని లీలలు అనంతములు. (209)

కృష్ణ నిర్యాణము

ఇంకను వ్యాసుడు ఇట్లు చెప్పెను

ఇట్లు కృష్ణుడు బలదేవుని సాయమున విశ్వరక్షణకొఱకు దుష్టరాజన్య శిక్షణము చేసెను. ఫల్గునునితోగూడి నారాయణుడు అక్షౌహిణులన్నింటిని కూల్చి భూదేవి బరువును దించెను. ఇటుచేసి విప్రులు ఇచ్చిన శాపము నెపమున యదుకులమును గూడ ఉపసంహరించెను. ద్వారకను వదలి మానవాకారము విడిచి ఆ స్వయంభువు నిజాంశమున తిఱిగి నిజస్థానమును విష్ణులోకమున ప్రవేశించెను.

"అతడు విప్రశాప మిషమ్మున స్వకులమును ఎట్లు ఉపసంహరించెను". మనుష్య దేహమును ఎట్లు వదలెను? అని మునులు అడిగిరి అందులకు సమాధానముగా వ్యాసుడు ఇట్లు పలుక దొడగెను.

యదు కుమారులు పిండారకమను తీర్థమున కణ్వ నారద విశ్వామిత్రులను గాంచిరి. నడిప్రాయపు మదముచేత భావికార్య ప్రేరణము చేతను జాంబవతీ పుత్రునికి సాంబునికి ఆడువేషమువేసి సాగినడచి ప్రణామపూర్వకముగ వారిని గూర్చి ఈవిడ కొడుకు కావలయుననుచున్నది. స్వామీ! పుత్రుని కనగలదా? అనిరి. యదుబాలురచే వంచితులై ఆమునులు దివ్యజ్ఞాన సంపన్నులు సుప్రతులు కావున వారి నాశనమునకు అప్పుడు శాప మిచ్చిరి. కుపితులై ఈమె ముసలముపే కనగలదనిరి. దానిచే అఖిల యాదవకులము విచ్ఛిన్నము కాగలదనిరి. ఇట్లు శపింపబడిన ఆయాదవ బాలురు పోయి ఉగ్రసేనునికి యథాతథముగా తెలిపిరి. సాంబుని కడుపు నందుండి ముసలము పుట్టెను.

ఉగ్రసేనుడు ఆ ముసలమును ఇనుపరజనుగా కొట్టించెను. అది సముద్రమునందు పడవేయబడి మేక పెంటికలట్లు పొడి అయ్యెను. ఇనుప రోకలి అది చూర్ణితమై ఇనుపగుదియగా (తోమరముగా) తయారయ్యెగాని దానిని అంతకంటె ఎక్కువగా పొడిసేయలేక దానిని గూడ సముద్రములో పడవేయగా ఒకచేప దానిని మ్రింగెను. ఆ చేపను చంపి దాని కడుపునుండి ఆ ఇనుప గుదియ ఒకజాలరి గైకొనెను. మధువైరి భగవంతుడు ఆ నిజమెఱింగియు విధివశుడై దానిని మఱొకలాగున చేయుటకు ఇచ్ఛగింపను లేదు.

దేవతలుపంప నొక దూతవచ్చి కేశవునికి ప్రణతిచేసి ఏకాంతమందు "నేను దేవదూతను ఏలికవారికడకు దేవతలు పంపగా వచ్చితిని. వసువులు అశ్వినులు మరుత్తులు, రుద్రాదిత్యులు, సాధ్యులనుగూడి ఇంద్రుడు తమకు ఇట్లు విజ్ఞాపనము చేయుచున్నాడు. ఇదె వినుడు. త్రిదశుల ప్రార్థనచే భూభార హరణమునకై నూరేండ్లకు పైని భగవంతుడవు ఈ ధరణిని అవతరించితివి. దుష్టదైత్యులు నీచే హతులైరి. భూమి బరువు దింపబడినది. ముక్కోటి దేవతలిప్పుడు అనాథులైరి. (దిక్కులేని వారైరి) దేవాధిపత్యమందుదురు గాక! జగన్నాథ! నూరేండ్లు గడచినవి. తమకు అభిమతమేని ఇపుడు స్వర్గమునకు దయ చేయవలయును మఱియు నీకు ఇక్కడ ఉండుటకు భూలోకమందే అభిలాషయేని ఇక్కడనె ఉండవచ్చును. ఏలినవారి సేవకులము మేమిట్లు సేయుమని చెప్ప తగిన వారముకాము." అని విన్నవించగా, అంతట భగవంతుడు ఇట్లనెను. "నీవు అన్నదంతయు నేనెఱుంగుదును. కాని యాదవుల యొక్క క్షయముగూడ నాచే ఆరంభింపబడినది. ఎవ్వరిరిని చంపరాని వారగు యాదవులచేగూడ భూమికి బరువనునది తప్పదు. దీనిని ఏడు రాత్రులలో సత్వరమే దింపెదను. సముద్రమునకు గొంపోబడిన ద్వారకను తిఱిగితీసు కొనివచ్చి యాదవులను ఉపసంహ రింపజేసి స్వర్గమును అలంకరింతును. మానవదేహము వదలి సంకర్షణునితో అటకు వచ్చినాడననియే, ఇంద్రుడు దేవతలును అనుకొనవలసినది. భూభార కారణమైన జరా సంధాదులు హతులైరి. వారివలన వసుధ భారము యాదవులపై కెత్తబడినది. ఆయీ భారమును నేను దింపి అమరలోక పరిపాలనమునకు రాగలను" అని ఇట్లు వాసుదేవునిచే తెలుపబడి దేవదూత ఆయనకు ప్రణమిల్లి దేవయానమున ఇంద్రుని సన్నిధికేగెను.

భగవంతుడు అప్పుడు దివ్య భౌమాంతరిక్షములైన ఉత్పాతములను దర్శించి వెంటనే ప్రభాస తీర్థమున కేగుదమనెను. అప్పుడు పరమ భాగవతుడు (భగవద్భక్తుడు) ఉద్ధవుడు ప్రణతుడై హరితో "ఇప్పుడు నా చేయవలసిన పని సెలవిమ్ము. ఏలినవారిప్పుడు యదుకుల మెల్లను ఉపసంహరింతురని తోచుచున్నది. యదుకుల నాశనము కాగల నిమిత్తములను చూచుచున్నాను అనగా భగవంతుడు ఇట్లు అనియె.

"ఉద్ధవ! నా ప్రసాదముచే నీవు దివ్యగమనమున గంధమాదన పర్వతమందున్న పుణ్యమగు బదరిక ఆశ్రమమునకు చనుము. మహీతల మంతటిని పవిత్రముచేయు ఆ నరనారాయణ స్థానమందు నాపై మనసుంచి నా ప్రసాదమున అక్కడ నీవు సిద్ధి నంద గలవు. నేను కులమెల్లను ఉపసంహరించి స్వర్గమునకు ఏగుదును. నేను విడిచిన ద్వారకను సముద్రుడు ముంచును అని పలుక విని ఉద్ధవుడు పదముల వ్రాలి నారాయణుని అను మోదితుడై నరనారాయణ స్థానమునకు ఏగెను.

అప్పుడు ఆయాదవులందరు శీఘ్రగములైన రథములను ఎక్కి, కృష్ణ బలరాములతో ప్రభాసమునకు చనిరి. కుకురాంధకులను వారు నియమము పూని వాసుదేవుని ఆమోద మున సురాపాన మొనరించిరి. అట్లు తప్ప ద్రావినవారికి అన్యోన్య సంఘర్షణమున కల హాగ్ని రేగి యాదవ వంశక్షయ హేతువయ్యెను. వారు దైవముచే బలాత్కరింపబడినవారై, శస్త్రాస్త్ర ములచేత ఒండొరులు కొట్టుకొనిరి. శస్త్రములై పోయి దగ్గరనున్న ఏరకమును (గుంద్రమూల అను గడ్డిపోచలను) బట్టిరి. వారదిపట్టినంత వజ్రమట్లు కనిపించెను. దానితో మిగులదారుణముగ నొకరినొకరు కొట్టుకొనిరి. ప్రద్యుమ్న సాంబాదులు, కృతవర్మ, సాత్యకి, అనిరుద్ధాదులు, పృధువు, వివృధువు, చారువర్మ, చారువు, అక్రూరుడు ఏరకా రూపమైన వజ్రములచే కొట్టుకొనిరి.

హరి వారిని వారు హరిని వారించుకొనిరి. హరి సాయపడ వచ్చినాడనుకొని ఒండొరు లను కొట్టుకొనిరి. కృష్ణుడును కుపితుడై యేరకాతృణపుంజము గుప్పిట పట్టెను. అది యాదవ వధకనువైన ముసలము. (గుప్పెడు ఇనుప దుడ్డు) అయ్యెను. ఆతతాయులై దానిచే యాదవులను హరి నిశ్శేషముగా గొట్టెను. వారును త్వరగవచ్చి ఒండొరుల బాదు కొనిరి.

అటుపై అర్ణవ మధ్యము నుండి చక్రాయుధుని జైత్రరథము (జయశీలమైన రథము), దారుకుడు (సారథి) చూచుచుండగనే అశ్వములచే కొంపోబడెను. చక్రము గద (కౌమోదకి), శార్ఙ్గ (హరివిల్లు), తూణము (అమ్ముల పొది), శంఖము (పాంచజన్యము), కత్తి (నందకము) హరికి ప్రదక్షిణముచేసి ఆదిత్య మండల మార్గమును బట్టి ఏగెను. (స్వరాదిత్యే అను శ్రుతి ననుసరించి స్వర్గము ఆదిత్య మండలమని రహస్యము) ఒక్క క్షణములోనే అట యాదవ వంశ క్షయమయ్యెను. మహాశూరు లొక్క కృష్ణుడు దారుకు డును (రథసారథి) మిగిలిరి.

ఒకచెట్టు మొదట నాసనమువైచికొని కూర్చుండియున్న బలరాముని దరికి ఏగి వారిద్దరు ఆతని ముఖము నుండి వెడలుచున్న మహాసర్పమును దర్శించిరి. ఆ సర్పము పెద్ద పడగలతో ఆతని మొగము వెలువడి సిద్ధులు నాగులు పూజింప సముద్రమునకు

ఏగెను. సముద్రుడు అర్ఘ్యమునుగొని ఎదురేగెను. మహేంద్రులచే పూజితుడై ఆసర్పము ఆనీట ప్రవేశించెను. బలరామ స్వామి నిర్యాణముంగని

"బలరాముని నిర్యాణము, యాదవకులక్షయము దీని నంతను నీవు వసుదేవునికి ఉగ్ర సేనునికి దెల్పుము. నేనును యోగ సమాధి నిలిచి ఈ కళేబరమును విడితినని ద్వారకా వాసులైన జనమునకు చెప్పుము. ఈ ద్వారకా నగరమును సముద్రుడు ముంచి వేయును. అందువలన సిద్ధముగా పూన్పబడిన రథములతో అర్జునుని రాక కెదురు చూడుము. పాండవుడైన అర్జునుడు నిష్క్రమించిన తరువాత ద్వారకామధ్యమందు మీరుండ వలదు. అతడెటకేగునో అచ్చటకు అతనితో మీరును ఏగవలయును. నీవేగి కుంతీ కుమా రునికి అర్జునునకు నేను చెప్పిన మాట చెప్పుము. నా పరిగ్రహము (భార్యా వర్గము)ను నీవు నీశక్తికొలది రక్షింపవలయును అని పలికి అర్జునితో గూడి నీవు ద్వారవతి యందలి జన మును వెంటపెట్టుకొనిపొమ్ము. వజ్రుడు యాదవులకు రాజుకాగలడు అని హరి దారు కునితో అనెను. (210)

కృష్ణ నిర్యాణము

తరువాత వ్యాసుడు ఇంకను

ఇట్లు కృష్ణునిచే తెలుపబడి దారుకుడు స్వామికి మఱిమఱి నమస్కరించి ప్రదక్షిణ మొనరించి ఆయన చెప్పినట్లు పోయెను. తదుపరి ద్వారకకు అర్జునుని కొనివచ్చి వజ్రుని రాజును చేసెను. భగవంతుడగు గోవిందుడు వాసుదేవాత్మకమైన తన అంశమును బ్రహ్మ మందు ఆరోపించి సర్వ భూతములందు ధరించెను. అనగా సర్వాత్మ భావమునందెను. పూర్వము దుర్వాసుడు చెప్పినట్లు (అది ద్విజుడు. బ్రాహ్మణుడు చెప్పిన మాట యైనందున) దానిని గౌరవించి మోకాలిపై పాదముంచి యోగ సమాధిని గొని నిల్చెను. అంతట జరుడు అను వ్యాధుడు (బోయ) అచటికి వచ్చెను. వాడు మునుపటి రోకలియందు మిగిలిన ఇనుప ముక్కతో తయారైన బాణమునుగొని ఒక లేడి కాలి అడుగువలె ఉన్న హరి పాదమును జూచి బాణముతో కొట్టెను. కొట్టి ఆదరికి వెళ్ళి నాలుగు బాహువులతో ఉన్న ఒక నరమూర్తిని చూచెను. ఆయనకు ప్రణామము చేసి క్షమింపు మని మఱిమఱి వేడుకొనెను. తెలియక లేడియనుకొని కొట్టితిని. నా పాప కర్మము చేత తగలబడుచున్న నన్ను నీవు తగలబెట్టవలదు అనెను. వానిని చూచి భగవంతుడు నీకు అణుమాత్రమైనను భయము వద్దు. నా ప్రసాదముచే దేవేంద్ర లోకమునకు ఏగుమని హరి పలికెను.

శ్రీహరి వాక్యానంతరము అప్పుడే విమానము ఏతెంచెను. ఆ బోయ హరి ప్రసాదము వలన అదియెక్కి స్వర్గమునకు వెళ్ళెను. అతడు ఏగిన తరువాత భగవంతుడు నారాయణుడు మనసున కందని అమేయము, అమలము, జన్మజరామరణములు లేనిది సర్వాత్మకమునైన ఆత్మయందు (తనయందు) ఆత్మను (తనను) వాసుదేవమూర్తియందు సంయోజించి మానుష దేహమును వదలి త్రివిధమయిన గతిని పొందెను. సాలోక్య సారూప్య సాయుజ్య రూపమైన పరమ ముక్తిని పొందెను. (211)

రుక్మిణ్యాదులు పరలోకమునకు పోవుట

అని చెప్పి ఇంకను వ్యాసుడు ఇట్లు చెప్పెను.

అర్జునుడు అప్పుడు కృష్ణ బలరామ శరీరములను వెదకి, వానికిని మఱి ఇతర శరీరములకు సంస్కారమును గావించెను. మఱియును అష్టమహిషులు రుక్మిణి మొదలగువారు హరి శరీరమునందు పుట్టిన అగ్నియందు ప్రవేశించిరి. రేవతియు బలరాముని దేహమును కౌగలించుకొని, తత్స్పర్శవలన గలిగిన ఆనందముచే చల్లబడిన అగ్నియందు ప్రవేశించెను. ఆపై అర్జునుడు వారికి ప్రేతకృత్యములను యథావిధిగ జరిపి, తక్కిన జనమును, వజ్రుని తీసికొని వెళ్ళెను.

ద్వారవతి (ద్వారక) నుండి బయలుదేరిన వేలకొలది కృష్ణ భార్యలకు వజ్రునికి అతడు రక్షణను ఇచ్చి ఆదరించెను. కృష్ణునిచే భూమికి కొనిరాబడిన సుధర్మ అను దేవసభ (సింహాసనము) పారిజాత వృక్షము స్వర్గమునకు వెళ్లిపోయెను. హరి మేదిని విడిచి స్వర్గారోహణము చేసిననాడే కలి నల్లని శరీరముతో భూమికి దిగెను. మహా సముద్రము నిర్జనమైన ద్వారకను ముంచి వేసెను. ఒక్క కృష్ణ గృహమును మాత్రము ముంచ లేదు. ఆ గృహమందు ఎపుడును భగవంతుడు ఈనాటికిని ఉండుటచే నేడును సముద్రుడు తన హద్దుదాటి దానిని ఆక్రమింపడు. అది మహాపుణ్య స్థానము సర్వ పాపహరము. విష్ణువు క్రీడించిన స్థానము. దానిని దర్శించిన పాపము పోవును.

పార్థుడు ధాన్యధన సమృద్ధమైన పంచనద దేశమందు యాదవ జనమున కంతకు నివాసము ఏర్పరచెను. ఆవల కలి ప్రభావముచేత మానవులలో లోభగుణము అంకు రించెను. భర్తలను కోల్పోయిన స్త్రీలు, వారి వారిని ధనుర్ధారియైన ఒక్క అర్జునుడు తీసి కొనిపోయి రక్షణ ఇచ్చుట చూచి లోభవశులై పాపులైన చోరులకు సంబంధించిన ఆభీరులు (అడవి మూకలు) పొగరుగొని ఒండొరులతో ఇట్లు ఆలోచించిరి. ఈ అర్జునుడు ఒక్కడు

విల్లుగొని భర్తలు చనిపోయిన స్త్రీ జనమును కొనిపోవుచున్నాడు. మనలను లెక్కచేయుట లేదు. కనుక మనబలము జూపింతము. భీష్మ, ద్రోణ, జయద్రథ, కర్ణాది వీరులను చంపి గర్వమెక్కి గ్రామవాసులగు మన బలమేదో ఎరుగకున్నాడు. బలాఢ్యులగు పెక్కు గ్రామముల వారినందరిని అవమానించుచున్నాడు. మీరెవ్వరును బదులు పలుక పలదు అని కర్రలు కత్తులు గొని దస్యులు (గూండాలు) వేలకొలది పరువులెత్తిరి. అంత అర్జునుడు వెనుదిరిగి అయ్యాభీరులం గని మీరు బ్రతుకదలతురేని వెనుకకు పొండు' అన అతడి మాటను ధిక్కరించి వారెల్ల స్త్రీలను, కృష్ణ భార్యలను, అర్జునునిచెంత నుండి లాగికొని పోయిరి.

అంత అర్జునుడు యుద్ధమందు వమ్ముపోయి గాండీవము ఎక్కుపెట్ట పూనెను. కాని అది అతనికి అశక్యమయ్యెను. కష్టముమీద ఎక్కుపెట్టినను క్షణములో అది శిథిలమై పోయెను. దివ్యాస్త్రములు అతనికి జ్ఞాపకమే రాలేదు. చేతిలోనున్న తక్కిన అస్త్రములను వారిపై విసరెను. కాని అవి అన్నియు క్రుంగిపోయి శత్రు భేదనమును చేయవయ్యెను. ఖాండవ వనదహన సమయమున అగ్ని ఇచ్చిన అక్షయ బాణములుకూడ అప్పుడు క్షయించి పోయినవి. గోపాలురతో పోరుచున్న అర్జునునికి హైన్యస్థితి వచ్చెను. అపుడు అర్జునుడు శరజాలముచే బలాఢ్యులగు రాజులను నేను గెలుచుట కృష్ణునియొక్క బలమే అని తలంచెను. అతడు చూచుచుండగనే యుత్తమ స్త్రీ వర్గమును ఆభీరులు లాగికొని పోయిరి. కొందరు స్త్రీలు తమంతనే కామ ప్రవృత్తితో ఆ మూకవెంట పడిపోయిరి. అర్జునుడు శస్త్రాస్త్రములచే గొట్టుచుండ వాండ్రు పకపక నవ్వుచుండిరి. ఇట్లు పార్థుడు చూచుచుండగనే మ్లేచ్ఛులు వృష్ణ్యంధక కులాంగనలను అందరను కొనిపోయిరి.

అంత జిష్ణువగు అర్జునుడు కష్టము! కష్టమనుచు భగవంతునిచే విడువబడితినని ఏడ్చెను. అదే ధనుస్సు అవే అమ్ములు అదే రథము అవే గుఱ్ఱములు. వేదవిదుడు వేదానుష్ఠాతయు కాని వానికి చేసిన దానమువలె ఒక్క అడుగులో సర్వము వమ్మై పోయినది. ఆహా! విధి ఎంత బలీయము. ఆ మహానుభావుడు లేనంతట వట్టిచేతగాని దద్దమ్మనై పనికి మాలిన వారిచే నవమానింపబడితిని. అవే బాహువులు అదే పిడికిలి, అదేచోటు, ఆ అర్జునుడనే యైయున్నాను. పుణ్యముతో నా స్వామితో నెడబాటుచే అంతయు నిస్సారమై పోయినది. నా అర్జునత్వము భీముని భీమత్వము కృష్ణుని వలన ఈయబడినవే. నిజము. ఆయన లేమి నీ చచ్చు గొల్లలకు నేను బెందువడితిని" అని ఇట్లు అర్జునుడు పలుకుచు ఇంద్రప్రస్థమునకు ఏగి యాదవ కుమారుడగు వజ్రుని అందు రాజును కావించెను. అడవిలోనున్న వ్యాసుని మహానుభావుని దర్శించి సమీపించి అడకువ దోప నమస్కరించెను. అట్లు మ్రొక్కిన యర్జునుని వ్యాస భగవానులు తేరిపార జూచి అర్జునుడేయని నిశ్చయ

మునకు వచ్చి "పార్థా! ఈ విధముగా మిక్కిలి వన్నెదరిగి ఉన్నాడవేమి? గొర్రెలపరాగము వెంబడింపవలసి వచ్చెనా? బ్రహ్మ హత్యకు పాల్పడితివా? గెలుపునందు ఆశాభంగమై దుఃఖము గల్గెనా! చిన్నపోయి ఉన్నాడవు. నిన్ను యాచింప వచ్చిన సాంతానికాదులను లేదని నిరాకరించి పంపితివా! (సాంతినికుడు = పుత్రుడు మొదలగువాడు) అగమ్యాగ మనము జేసితివా! (కూడని స్త్రీతో సంగమము) ప్రభతరిగి ఉండుటకు కారణమేమి! విప్రులకు పెట్టక నీవొక్కడవే మధురాన్నములను తింటివా! కాక దీనుల ధనములను హరించితివా? సూర్యవాతమునకు (వడదెబ్బకు) గురికాలేదు కదా! ఎట్లు శోభ గోల్పో యితివి? దృష్టి దోషము తగిలెనా నభోదక స్పర్శ కల్గినదా! (గోళ్లయొక్క స్పర్శ కల్గిన యుదకము అశుచి అన్నమాట) మట్టికుండ నీటిచే ప్రోక్షింప బడితివా! (తడుప బడితివా) నీకన్న తక్కువ వారిచే గెలువబడితివా! ఇట్లు ఛాయ తరిగి ఉన్నావేమి ?" అని ప్రశ్నించెను.

అంతట పార్థుడు నిట్టూర్పు పుచ్చి "భగవంతుడ! వినుము" అని తన పరాభవ వృత్తాంతమును జరిగినది జరిగినట్లు చెప్పెను.

"మా బలము, మా తేజస్సు, మా వీర్యము, మా పరాక్రమము, మా సిరి, మా కాంతికి కారణము. ఎవరో అట్టి హరి మమ్ము వీడివెళ్ళినాడు. చిరునవ్వుతో ముచ్చటించు మా స్వామి, ఆ మహానుభావుడు అన్యుడట్లు మమ్ము విడిచివెళ్ళినాడు. దానిచే నా సర్వాయు ధములు తృణప్రాయములైనవి. అస్త్రములు, శస్త్రములు గాండీవముయొక్క మూర్తీభవించిన సారమెల్ల తానైన ఆ పురుషోత్తముడు వెళ్ళిపోయినాడు. ఎవని చూపున మమ్ములను శ్రీ, జయము, సంపత్సమృద్ధి విడువలేదో అట్టి గోవిందుడు భగవంతుడు విడిచి వెళ్ళినాడు. భీష్మ ద్రోణులు అంగరాజు (కర్ణుడు) దుర్యోధనాదులు ఏ ప్రభువు ప్రభావముచే సమూలము నిర్దగ్ధులైరో అట్టి కృష్ణుడు భూమిని వదలిపోయినాడు. యౌవనముబాసి హతశ్రీయైవన్నె తరిగి చక్రాయుధుని విరహమువలన నేనొక్కడనే కాదు, ఈ పృథివి కుములుచున్నది. ఏ స్వామి అనుభావము వలన లీలవలన నేను అను అగ్నియందు భీష్మాదులు మిడుతలైరో అట్టి కృష్ణుని బాసి గొల్లలకు ఓడిపోయితిని. ఎవ్వని అనుభావముచే త్రిలోక ప్రసిద్ధమైనదో అట్టి గాండీవము కృష్ణుడు లేమిని గొల్లల బడితెలకు లొంగిపోయినది. హరిలేమిని ఎన్నో వేలమంది స్త్రీలు అనాథలు వట్టి కట్టెలతో దొంగలచే కొనిపోబడినారు. నా బలమును ధిక్కరించి గొల్లలు నేను గొనివచ్చుచున్న కృష్ణుని యంతఃపురమంతయు కర్రలతో అదలించి తోలికొనిపోబడినారు. నేను సిరి కోల్పోవుట వింతగాదు. బ్రతికి యుండుట అదే అద్భుతము. నీచులవలని అవమానమను ఱొంపిని బూసికొని తాత! దిక్కుమాలి సిగ్గుమాలిన వాడనైతిని."

ఈ విధముగా తెలుపబడిన అర్జునుని దుఃఖము విని దీనుడై ఏడ్చుచున్న మహాత్ముడైన ఆ పాండవుని యొక్క మాటలను విని నేను ఇట్లు అంటిని. (వ్యాసుడు) పార్థ! సిగ్గుపడ వలదు. ఏడువకుము. సర్వభూతముల యెడల కాలముయొక్క గతి ఇట్టిదని ఎఱుంగుము. భూతముల పుట్టుకకు గిట్టుటకు కాలము కారణము. ఇది కాలనిమిత్తమని ఎరిగి స్థైర్యము నొందుము. నదులు, సముద్రములు, పర్వతములు, వసుధ, మనుష్యులు, పశువులు, చెట్లు, పాపములు కాలముచే సృజింపబడి కాలముచేతనే క్షయించును. సర్వమును కాల స్వరూపముగ తెలిసి శాంతిని పొందుము. ధనంజయ! కృష్ణ ప్రభావము నీవన్నది అంతయు అంతే. భారహరణమునకు భూమియందు అతడు అవతరించినాడు. భూదేవి భారవశయై మున్ను దేవతలదరి కేగినది. అందులకే కామరూపియైన భగవంతుడు అవతరించి ఆ పని జరిపినాడు.రాజులను కూల్చినాడు. తుదకుతాను జన్మించిన వృష్ణ్యంధక కులమును గూడ ఉపసంహరించినాడు. ఇతనికింక నీ భూతలమున చేయవలసినది కొంచెము కూడలేదు, అందుచే కృతకృత్యుడై భగవంతుడు యథేచ్ఛగా నిర్గమించినాడు. సృష్టిస్థితి లయములు మూడును శ్రీహరిలీలలే. పార్థ! పరాభవమునకు సంతాపపడకుము. పురుషుల పరాక్రమములు అందగుచుండును కాగలకాలములందు భీష్మ, ద్రోణాదులు నీచే కూలుట కాలమువలననే. పరమాత్మయను భావముననే వారి పరాభవము. తక్కువ వారివలన నీకు పరాభవము. ఆ దేవుడు స్థితిలయములు చేయునపుడు అన్య శరీరము లందు ఆవేశించుచుండును. కాగలప్పుడు హరి నీకు సహాయుడయ్యెను. కానపుడు నీ శత్రువులు హరి దృష్టిలో పడినారు. నీవు గాంగేయునితోడి కౌరవులనెల్ల గూల్చితివన్న ఎవడు నమ్మును? అట్లే ఎందులకుగాని ఆభీరుల కోడితి వన్నను నెవడును నమ్ముడు? ఇవి సర్వ భూతముల యందు హరియొక్క విలాసము. అతని చేష్ట. నీచే కౌరవులు ధ్వంసమగుట, భీరులకు నీవు ఓడుట, నీ రక్షణలో ఉన్న స్త్రీలు దొంగలచేతిలో పడుట అను విషయములో జరిగినది నీకు చెప్పుచున్నాను వినుము.

అష్టావక్ర కథ

మున్ను సనాతన బ్రహ్మోపాసనము జేయుచు అష్టావక్రుడు పెక్కేండ్లు నీటనే నివాస ముండెను. అసురులు ఓడినతరువాత మేరువుపై పెద్ద ఉత్సవము అయ్యెను. అది చూడనేగుచు దేవతా స్త్రీలు ఆతనిని జూచిరి. రంభా, తిలోత్తమ మొదలైనవారు నూర్ల వేలుగ ఆమహాత్ముని స్తుతించిరి. ప్రశంసించిరి. అతడు కంఠమువరకు జలమున మునిగి పెనుజడలు దాల్చి ఉన్నను, వినయమున అమరాంగనలు మ్రొక్కిన ప్రసన్నుడై ఇట్లనియె.

"నేను ప్రసన్నుడనైతిని. తామేదికోరిన నిచ్చెదను కోరుకొనుడన రంభ, తిలోత్తమ మొదలైనవారు నీవు ప్రసన్నుడవైన మేము పడయని భాగ్యమేమున్నదనిరి. కాని వారిలో కొందరు ప్రసన్నుడ వైతివేని నిన్ను భర్తగా కోరెదమనిరి. అట్లే అగునని అతడు నీళ్ళనుండి లేచెను. అయ్యెడ ఆతని ఎనిమిది వంకరలుగల వికృత రూపునిగా చూచిరి. చూచి చాటు వడుచున్న ఆయింతుల పరిహాసము అతనికి స్పష్టమయ్యెను. దానికి కోపించి అతడు నా విరూపము చూచి హసించి అవమానముచేసితిరి కావున నా దయచేతనే పురుషోత్తముని భర్తగ బొంది నా శాపముచే దొంగలచేత చిక్కెదరనెను.

ఆ మాటలకు భీతలై వారు బ్రతిమాలగా, ఆ ముని ఇంద్రలోకమునకు ఆ మీద ఏగుదురని అనుగ్రహించెను. ఇట్లు అష్టా వక్రుని శాపము వలన జరిగిన దానికి నీవు కొంచెముకూడ శోకింపబనిలేదు. ఈ సంహా రమేకాదు కొలది కాలములో మీరును ఉపసంహరింపబడుదురు. పుట్టినవానికి గిట్టుటయు, మీద ఉండుటయు సంచయము ప్రోగుచేయుట క్షయము (పోగొట్టుకొనుట) కలిసి విడి వడుటయును తప్పదు. స్వభావమని దీనిని ఎరిగిన పండితులు క్రుంగరు పొంగరు. అట్టి పండితుల నడవడిని అలవరచుకొన్న వారు కూడ వారివలెనే ఉన్నవారును కాగలరు.

కావున నరశ్రేష్ఠ! సోదరులతో ఇది ఎఱిగి రాజ్యము విడిచి తపముచేయ వనమునకు వెళ్ళదగును. ఈ నామాటను ధర్మరాజునకు చెప్పుము. ఎల్లుండి సోదరులతో గూడ ఉత్తమ గతి మహాప్రస్థానము జేయుడు. అని తెలుపబడి పార్థుడు ధర్మరాజు దగ్గరకు వచ్చి ఆ వృత్తాం తమునంతయు తెల్పెను. వారందరు అర్జునుని వచనము విని పరీక్షిత్తును రాజ్యమున నుంచి వనమునకు చనిరి. ఓ మునిశ్రేష్ఠులార! విస్తరముగ ఇట్లు యదు వంశమునందు పుట్టిన వాసుదేవునియొక్క చరిత్రము మీకు దెలిపితిని" అని వ్యాసుడు వారితో అనెను. (212)

వరాహావతార వర్ణనము

"ఓ మునీంద్రా! కృష్ణుని మహిమ అద్భుతము. బలరాముని యొక్కయు ప్రభావం అట్టిదే. నీ వలన ఎంత విన్నను తృప్తికలుగుటలేదు. పురాణములందు విష్ణువు వరాహావతార మెత్తినట్లు విన్నాము. అది విస్తరముగా నానతిమ్ము. వరాహమన స్వరూపమేమి? దేవత యెవరు? ఏవిధమైన ఆచారము ప్రభావము కృత్యము జరిపెనో తెలుపుము. యజ్ఞకర్తలకు పరలోకమేగు వారికి బ్రాహ్మణులకు ఈ చరిత్ర పుణ్యలోక ప్రదము. ఆయన కోరతుదతో భూమినెత్తిన కథ వినగోరెదము. అదిగాక పరమాత్మ యొక్క అవతార విశేషములు కూడ దెల్పు"మన వ్యాసుడు ఇట్లు అనియె.

ఇది గొప్ప ప్రశ్న. యథాశక్తిగ తెల్పెదను. ఆవిష్ణు యశస్సు శ్రవణము చేయ వలెనన్న తలపు మీకు కల్గుట అదృష్టము. అందువలన విష్ణు లీలలను వినుడు.

యజ్ఞవరాహ స్తుతి

విష్ణువు సహస్రశీర్షుడు. సహస్రాక్షుడు. సహస్రముఖుడు, సహస్రకరుడు, సహస్ర జిహ్వుడు, సహస్ర కిరీటుడు, సహస్రభుజుడని ఆ యజ్ఞపురుషుని విష్ణుని పురుషసూక్త విధానమున బ్రహ్మజ్ఞులు స్తుతింతురు. హవనము, హోమము, సవనము (ప్రాతర్మధ్యాహ్న సాయంసవనములు మూడు) హోత హవ్యము (హోమ ద్రవ్యము) పాత్రలు పవిత్రములు వేది దీక్ష సమిధ స్రువము స్రుక్కు సోమము సూర్యుడు ముసలము ప్రోక్షణి దక్షిణాయనము అధ్వర్యుడు సామగుడు (ఉద్గాత) సదస్యుడు (యజ్ఞశాల) సదస్సు యూపము చక్రము ధ్రువ దర్వి చరువు ఉలూఖలము ప్రాగ్వంశము త్రేతాగ్నులుండుశాల. హ్రస్వములు అణువులు స్థావరములు జంగమములు ప్రాయశ్చిత్తములు అర్ఘ్యము స్థండిలములు (అగ్ని ప్రతిష్ఠ చేయుటకు కల్పింపబడిన ప్రదేశ విశేషములు) కుశలు మంత్రములు, యజ్ఞముల వహించు వహ్ని హవిర్భాగము భాగవహము (హవిర్భాగములను వహించు పాత్ర విశేషము) అగ్రాసి సోమభుజుడు హోమము చేయబడిన శ్రుత్యుక్త ఆయుధములను ధరించిన అగ్నిగ వేదవేత్తలు పిలుతురో అట్టి శాశ్వతుని యజ్ఞేశ్వరుని శ్రీవత్సాంకిత వక్షుడగు విష్ణువు యొక్క అవతార సహస్రములు ఎన్నో జరిగినవి. జరుగనున్నవి. చతుర్ముఖ బ్రహ్మ ఇట్లు చెప్పెను. విష్ణువు యొక్క అవతారమునకు సంబంధించిన కథలను శ్రద్ధతో వినుడు. ఈ వాసుదేవ మాహాత్మ్యము చరిత్ర దేవమర్త్య లోకములకు హితకరము. శుభప్రదము.

సర్వ భూతాంతరాత్మ అవతారములు పెక్కు గలవు. వేయి దివ్య యుగములు నిదురించి ఒకానొక పనికై మరల మేల్కొనును. బ్రహ్మ, కపిలుడు, త్ర్యంబకుడు, దేవతలు, సప్తర్షులు, నారదుడు, అప్సరసలు, సనత్కుమారుడు, మనువు మొదలగు వారిని ఆయన ఆవిర్భవింపజేసెను. అతడు అగ్నివంటి తేజస్వి.

సముద్రమధ్యమందా సనాతనమూర్తి ఉండగా ప్రళయమైన తఱి మధుకైటభులు ఇద్దరు భగవంతునిచేత వరములంది యుద్ధము చేయబూనిరి. కమలనాభుడు నిదురించిన తఱి పుష్కరమునుండి దేవతలు ఋషులు పుట్టిరి. ఆ ప్రాదుర్భావమే పౌష్కరమను పేర పురాణమునందు శ్రుతి సమ్మతమై వర్ణింపబడినది.

హరి వరాహ రూపము ఎత్తిన అవతారము శ్రుతి ముఖము. అనగా వేదములే ఆ మూర్తియొక్క ముఖాద్యవయవ స్వరూపములందె నన్నమాట.

యజ్ఞవరాహమూర్తి స్వరూప వర్ణనము

ఆయజ్ఞ వరాహమూర్తి పాదములు నాల్గు వేదములు. ఆయన కోర యూప స్తంభము. క్రతువు చేతులు, అశ్వినులు ముఖము, అగ్ని జిహ్వ, దర్భలు రోమములు, బ్రహ్మ శిరస్సు, అహో రాత్రములు కన్నులు, వేదాంగములు కర్ణ భూషణములు, ఆజ్యము నాసిక, స్రువము ముట్టి, సామధ్వని ఘర్ఘర స్వరము. సత్యధర్మములు ఆ శ్రీమంతుని స్వరూపము. ప్రాయశ్చిత్తము ఆయన ఘోరమైన ముఖము. పశువు మోకాళ్ళు ఉద్గాతి ఆయన పేగు, మంత్రము, మూవు, వేదిక, హవిస్సు వాసన (హవ్యకవ్యములు) ప్రాగ్వంశము నానాదక్షతలతో కూడినది శరీరము. ఆసనము శరీరకాంతి, పత్ని మణిమయమైన శృంగమువలె లేచి దక్షిణ, హృదయము అనేక సత్రమయము యజ్ఞ వరాహమూర్తి యొక్క స్వరూపము. ఉపాకర్మాష్టకము దంతములు, ప్రవర్గలా శరీరమందలి సుడులు, ఛందస్సులన్నియు ఆయన నడచు దారులు, గాహ్యోపనిషత్తు సశైలవనము. సాగర పర్యంతము ఏకార్ణవ మందు మునిగిన భూమిని తన కొమ్ముచివర లోకహితముకొరకు పెల్లగించి ధరించెను. ఈవిధముగ యజ్ఞ వరాహమూర్తిచేత వసుంధరాదేవి భూతహితార్థము ఉద్ధరింపబడినది.

నరసింహమూర్తి వర్ణనము

నరసింహరూపమెత్తి హరి హిరణ్యకశిపుని సంహరించిన కథ వినుడు. కృతయుగ మందు దైత్యులకు మొదటిపురుషుడు హిరణ్యకశిపుడు పదివేల పదునేను వందల సంవత్సరములు ఉపవాసముచేసి మౌనము బూని తీవ్ర తపస్సు చేసెను. వాని శమదమములకు బ్రహ్మచర్యమునకు తపోనియమములకు ప్రీతినొంది భగవంతుడు స్వయంభువు స్వయముగా హంసలను పూన్చిన సూర్య ప్రభగల విమానమున ఆదిత్యులు వసువులు మరుత్తులు, దేవతలు, రుద్రులు వెన్నంటిరాగా యక్షరాక్షసులు, కిన్నరులు, దిక్కులు, విదిక్కులు, నదులు, సముద్రములు, నక్షత్రములు, ముహూర్తములు, మహాగ్రహములు తపోవృద్ధులైన సిద్ధులు, విద్వాంసులు పుణ్యఋషులు మొదలగు పరివారముతో వచ్చి "నీ తపస్సునకు సంతసించితిని. నీకు భద్రమగు గాక. ఇష్టమైన వరము కోరుము సిద్ధినందుము' అనెను.

హిరణ్యకశిపుడు ఇట్లనెను. "పితామహ! దేవాసుర గంధర్వాదు లెవ్వరును కోపించి నన్ను శపింపరాదు. ఇదియే వరము. శస్త్రాస్త్రములచే చెట్లచే గిరులచే ఎండిన తడసిన దేనిచేగాని క్రిందగాని పైనగాని కాకుండ ఒక్క చేతితో మాత్రమే సైన్య సపరివారముగ నన్ను చంపగలవాడే నాకు మృత్యువు కావలెను. నేనే సూర్యచంద్రులు, వాయువు, అగ్ని, నీరు, అంతరిక్షము, ఆకాశమునై ఉండవలెను. కామక్రోధములు నేనే. ఇంద్ర, యమ

వరుణ, కుబేరులు అంతయు నేనే కావలెను" అనగా బ్రహ్మ ఇవిగో దివ్యబాణములు. నీకు ఇచ్చుచున్నాను. ఇవి అద్భుతములు. నీవు కోరిన కోరికలు వానిచే పొందెదవు. సందియము లేదు" అని బ్రహ్మర్షి గణసేవితుడై వైరాజము అని శ్రుతి (వేదములు) పిలిచెడి బ్రహ్మ తన సదనమునకు బ్రహ్మర్షి గణసేవితుడై వేంచేసెను. అటుపై దేవనాగ గంధర్వ ముసులు బ్రహ్మవలన జరిగిన ఈ వరప్రదాన విషయము విని బ్రహ్మతో ఇట్లు అనిరి. "స్వామీ! ఈ నీ విచ్చిన వరమువలన ఆ అసురుడు మమ్ము బాధింపగలడు. దయజేసి వాని వధ విషయము ఆలోచింపుము. నీవు ఆదికర్తవు హవ్య కవ్యములను సృష్టించిన వాడవేనీవు" అనగా బ్రహ్మ "త్రిదశులార! చేసిన తపస్సుయొక్క ఫలమును అవశ్యము అనుభవింపవలసినదే. తపస్సునకు చివర విష్ణు భగవానుడు వానిని వధించును" అనగా విని దేవతలు సంతసించి స్వస్థానములకు వెళ్ళిరి.

వాడు వరము లభించిన క్షణములో పొగరెక్కి మున్యాశ్రమములందు వ్రతనిష్ఠులై సత్య ధర్మరతులైన దాంతులను శాంతులను హడలగొట్టెను. అట్లే స్వర్గమునకు వెళ్ళి దేవతలను ఓడించెను. ముల్లోకములు వశము చేసుకొని స్వేచ్ఛాసంచారియై దైత్యులను యజ్ఞీయులను (యజ్ఞ భాగార్హులను) దేవతలను అయజ్ఞీయులను కావించెను. ఆదిత్యులు మొదలుగా దేవ వర్గము విష్ణుని శరణొందిరి. "దేవేశ్వరా! రక్షింపుము. హిరణ్యకశిపుని వలన మాకు ఇప్పుడు భయము వచ్చిపడినది. నీవుగదా మాకు పరమ దైవము. పరమ గురుడవు, పరమ దాతవు, కమలలోచన! అదితి వంశ జయమునకు శరణ"మగు మనిరి.

వాసుదేవుడు పలికెను –

జడియకుడు. అభయమిచ్చుచున్నాను. మునుపటివలె స్వర్గమును త్వరలో పొందగలరు. ఇప్పుడే నేను వరదాన దర్పితుడైన వానిని సపరివారముగ సంహరించుచున్నాను అని ఇట్లు పలికి దేవతలను పంపి భగవంతుడు హిరణ్యకశిపుని వద్దకు వచ్చెను. సగము నరశరీరము సగము సింహశరీరముచేసి చేతిలో చేయిని తాకుచు దట్టపు మేఘమువంటి శరీరము మేఘగర్జనము వంటి గర్జనముకొని మెరయుచు మేఘమంత వేగముగ వచ్చి రక్కసులచే రక్షణ ఇవ్వబడుచున్న ఆకలికొనిన పెద్దపులివలె నున్న ఆరక్కసుని పొగరెక్కి ఉన్న వానిని సంహరించెను.

వామనావతారము

నృసింహుని గురించి చెప్పితిమి. ఇక వామనుని గురించి వినుడు. బలి యజ్ఞమందు బలశాలియైన విష్ణువుచే మూడడుగులచే మహాసురులు సంక్షోభింపజేయబడిరి. విప్రచిత్తి,

బృహత్‌కీర్తి మొదలు శంబరుడుదాక గల రాక్షసులు శతఘ్ని చక్రముసలములు ధరించి, అశ్వ యంత్రములు పూని, బిందిపాల శూల ఉలూఖలములు జేపూని, పరశ్వధములూని, పాశముద్గర పరిఘాయుధములు గొని పెద్దబండలుగొని యుద్ధమునకు నడిచిరి. వారి ముఖములు తాబేలువలె కోడివలె, గుడ్లగూబలవలె ఉండెను. కొందరు గాడిదలు ఒంటెలు పందులు పిల్లులు నెమళ్ళ వంటి ముఖములు గలవారు. మొసళ్ళు మేకలు ఎద్దు గొర్రెలు గేదెలు దున్నపోతులవంటి మొగములతో ఉండిరి. ఉడుము ముఖము కొందరిది. చుంచులు కప్పలను తోడేళ్ళను పోలినవారు కొందరు. అశ్వముఖులు క్రౌంచ ముఖులు (బెగ్గురు పక్షులు) మయూర ముఖులు కొందరు. కొందరు గజచర్మము కృష్ణాజినము ధరించిరి. నల్లని బట్టలు కట్టుకొనిరి. కొందరు తలపాగలు, కొందరు కిరీటములు ధరించిరి. కొందరికి కుండలములు ఉన్నవి. జుట్టు విరబోసికొనిరి కొందరు. శంఖము వంటి మెడలుగల్గి నానా మాల్యములు గంధములు పూసికొని నానా వేషధారులై అందరు తమ ఆయుధములతో పచారు చేయుచున్న వారు హరిని సమీపించిరి. విష్ణువు పాదములతో కరతలముతో రక్కసులంగొట్టి భూమిని లాగుకొనెను. అతడు అడుగడుగున నాక్రమించి, చంద్ర సూర్యులు రొమ్ము దానం దాక పెరిగి, నాభిదాక అంతై ఇంతంతగుచు, సర్వమాక్రమించి సర్వంసహాధికారమును ఇంద్రున కొసంగెను. ఈ త్రివిక్ర మావతార వైభవమును వేదవిదులు వర్ణింతురు. ఇది విష్ణు యశస్సంకీర్తనము.

దత్తాత్రేయావతారం

భూతాత్మయగు విష్ణువుయొక్క కేవల క్షమాలక్షణమైన అవతారము దత్తాత్రేయుడను పేరవచ్చి ప్రఖ్యాతిజెందినది. వేదములు నశింప ప్రక్రియ యజ్ఞలు నశింప చాతుర్వర్ణ్యము సంకరమై, ధర్మము శిథిలమై అధర్మము పెరుగ సత్యముచెడి అసత్యము పెరుగ, ధర్మము వ్యాకులముకాగ యజ్ఞముతో క్రియలతో అతడు వేదములను పునరుద్ధరించెను. చాతుర్వర్ణ వ్యవస్థను ఆమహాత్ముడు కాపాడెను. మరియు హైహయరాజ వంశము వాడైన బుద్ధిమంతుడగు కార్తవీర్యునకు ఆయన వరమిచ్చెను. ఈ నీ బాహువులు రెండును నా నిమిత్తముగ వేయి బాహువులగును. సర్వ వసుధను పాలింతువు. యుద్ధము నందు శత్రువులకు జూడ అశక్యుడ వగుదువు అని వాగ్దానము చేసెను. ఈ అవతారము విష్ణువు యొక్క అవతారము.

పరశురామావతారము

ఇటుపై మహానుభావుడగు పరశురాముని అవతారమయ్యెను. అందు వేయి బాహువులచేత దుర్జయుడైన కార్తవీర్యార్జునుని ఆయన సంహరించును. రథమునందున్న

కార్తవీర్యుని పరశురాముడు పుడమిపై పడగొట్టి అప్పటికిని మేఘమువలె గర్జించుచున్న వానిని హడలగొట్టి వేయి బాహువులను గొడ్డలిచే నఱికెను. వాని జ్ఞాతులను గూడ కొట్టెను. కోట్ల కొలది క్షత్రియులతో నిండి మేరు మంధర పర్వత భూషణమైన పృథివి ఇరువది యొక్క మార్లు దండెత్తి నిక్షత్రియమొనర్చెను. ఈ పాపము పోవుట కాయన అశ్వమేధమును కూడ చేసెను. మహాదాన పవిత్రమైన ఆయజ్ఞమందాతడు మరీచి వంశము వాడైన కశ్యపునకు, తాను గెల్చిన భూమిని దక్షిణగా ఇచ్చెను. మరియు ఆ అశ్వమేధమున గుణ్ణములను రథములను ఏనుగులను లక్షయమైన బంగారమును గోవులను దానము చేసెను. ఇప్పుడును భృగునందనుడగు (భార్గవుడు) పరశురాముడు లోక హితము కొరకు మహా తపస్సు చేయుచు శ్రీమంతుడై, దేవునివలె ఉన్నాడు. ఇది, దేవపతి అవ్యయుడు శాశ్వతుడునైన విష్ణువుయొక్క పరశురాముడను పేరి అవతారము.

దశరథ రామావతారము

ఇరువది నాల్గవ త్రేతాయుగమందు విశ్వామిత్రుని పురస్కరించుకొని దశరథునకు కమలాక్షుడు అవతరించెను. ఆయన తనను నాల్గు విధములుగ ఒనరించుకొని సాక్షాత్ సూర్యునివలె వెలుగుచు రాముడను ప్రసిద్ధి నొందెను. లోకానుగ్రహమునకు రాక్షస నిగ్రహమునకు ధర్మసమగ్రవృద్ధి కొరకు మహాకీర్తిశాలి దయచేసినారు. సర్వభూతహితుడు నరేంద్రుడని ఆయనను అందురు. అతడు సర్వధర్మజ్ఞుడు. లక్ష్మణుడు అనుసరింప, పదునాలుగేండ్లు అరణ్యమున వసించి, తపస్సు చేసెను. ఆయన గృహిణి సీత. జగత్ప్రసిద్ధురాలు. మున్నేను చెప్పిన మహాలక్ష్మియే సీతగా భర్తను అనుగమించినది. జనస్థానమున వసించుచు ఆయన వేల్పుల కార్యమును చక్కపెట్టినాడు. ఆయనకు అపకారియైన పరమక్రూరుని రావణుని సీతజాడ నెరుగబోయి సంహరించినాడు. ఆ రావణుడు దేవాసుర యక్ష రాక్షస నాగాది గణములకు అవధ్యుడు. కారుమేఘమట్లున్న వానిని రాక్షస కోట్లు వెంబడించినవి. ముల్లోకములు ఆరావమెత్త జేసినందున (ఏడ్పించినందున) రావణుడను పేరుగన్న ఆ రాక్షసరాజును, దుర్జయుని, దుర్మదుని, దృక్తుని శార్దూల విక్రముని, దుర్నిరీక్ష్యుని, వరదాన గర్వితుని, మంత్రులతో సేనలతో గూడ సమూలముగ రామచంద్ర ప్రభువు సంహరించెను. ఆ చేసిన రావణ సంహారము సర్వ జగత్సంహారము చేసిన భూతపతి (శివుని యొక్క) చేతవలె దీపించెను. సుగ్రీవుని కొరకు మహాబలుడైన వానరేంద్రుడు వాలి హంతుడయ్యెను. సుగ్రీవుడు అభిషిక్తుడయ్యెను.

మధువను రాక్షసుని కుమారుడు లవణుడు. వాడు మధువనమందు సంహరింపబడెను. మునుల యజ్ఞములను చెరచిన మారీచసుబాహులు శ్రీరామునిచే నిహతులైరి.

మరియెందరో రాక్షసులు సంహరింపబడిరి. శాపవశులైన గంధర్వులు విరాధ కబంధులు ఆయనచే కూలిరి. ఆయన బాణములు అగ్ని రవి తేజస్స్వరూపములు. బంగారపు విచిత్రమైన పుంఖములు కలవి. ఆ మహానుభావునకు విశ్వామిత్రుడు అమోఘములైన శస్త్రాస్త్రములను ప్రసాదించెను.

మహానుభావుడైన జనక చక్రవర్తియొక్క యజ్ఞమందు రాముడు శివచాపమును విలాసముగ ఎత్తి విరచెను. ఈ పనులుచేసి ధర్మమూర్తి రామమూర్తి అవిఘ్నముగ పది అశ్వమేధ యాగములు చేసెను.

రాముడు రాజ్యము ప్రశాసించుచుండ, దొంగతనములు లేవు. వైధవ్య దుఃఖము లేదు. సర్వము శుభమయ్యెను. వాయుజలాగ్న్యాది భూత ప్రకోపమువలని భయములేదు. పెద్దవాండ్రు బాలురకు, ప్రేతకార్యములు చేయుటలేదు. క్షత్రియ జాతి బ్రహ్మచర్య పరమై ఉండెను. అనగా బ్రాహ్మణులకు అధీనులై ప్రవర్తించిరి. వైశ్యులు క్షత్రపరులైరి. శూద్రులు మూడు వర్ణములవారు చెప్పినట్లు వినిరి. అహంభావము లేనివారైరి. స్త్రీలు భర్తలను భర్త భార్యను అతిక్రమించి నడువలేదు. సర్వజగత్తు ప్రశాంతమయ్యెను. భూమి చోరరహితమయ్యెను. రాముడొక్కడే భరించువాడు(భర్త)రాముడొక్కడే పాలించువాడు. పుత్ర సహస్రములతో అనేక వర్ష సహస్రములు ప్రజలు జీవించిరి. ప్రాణులును ఎట్టి రోగములు లేనివారుగా ఉండిరి. దేవతలకు ఋషులకు మనుష్యులకు అన్యోన్య సామరస్యము పృథివి యందు నెలకొల్పెను. ఇచ్చట పురాణజ్ఞులు రాముని యెడల చంచలమైన తత్వ జ్ఞానము గలవారు. ఆ బుద్ధిమంతుని మాహాత్మ్యమును గురించి ఈ క్రింది విధమైన గాథను గానము చేయుదురు.

రాముడు చామనచాయ మేనివాడు, రక్తాంతలోచనుడు, కళకళలాడు నెమ్మోము వాడు. ఆజానుబాహువు. ప్రసన్న ముఖుడు. సింహము నూపురము వంటి నూపురము గలవాడు. మహావీరుడు. ఆ రాముడు పదివేలేండ్లు రాజ్యముచేసెను. ఆయన రాజ్యమున ఋగ్యజుస్సామ వేదములయొక్క ఘోషము జ్యాఘోషము (ధనుష్టంకారము) యెడతెగకుండెను. ఇవ్వండి, తినండి అన్న ధ్వని నిర్విరామముగ వినిపించెను. సత్వ సంపన్నుడు గుణ సంపన్నుడైన రాముడు కేవలము తన తేజస్సుచే దేదీప్యమాను డయ్యెను. రామచంద్రుడు చంద్రుని సూర్యులను మించి తేజరిల్లెను. పవిత్ర క్రతుశతము సంపూర్ణ శ్రేష్ఠ దక్షిణమైనదాని నతడు యజించెను. అయోధ్యను విడచి మహాబలుడు రాఘవుడు దివమ్మునకేగెను. ఇక్ష్వాకుల నందనుడైన దశరథ నందనుడు సగణముగ రావణుని చంపి స్వర్గమాక్రమించెను.

కృష్ణావతారం

మహాత్ముడైన విష్ణువు యొక్క మరొక అవతార వర్ణనము. ఈ తరువాతి అవతారము. ఇది సర్వలోక హితమునకై మాధుర కల్పమునందు వచ్చినట్లు విఖ్యాతి గన్నది. ఇందు సాల్వ చైద్యకంస ద్వివిధ వృషభ కేశి పూతనారిష్టాదులను కువలయా పీడ చాణూర ముష్టికాదులను మానుషాకారముతో వచ్చి సంహరించెను. ఇందే బాణుని వేయి బాహువులు తెగినవి. నరకుడు కూలెను. కాలయవనుడు కడతేరెను. అనేకమంది రాజులయొక్క సర్వ రత్నములు (సర్వ ద్రవ్యములందు సర్వ శ్రేష్ఠ వస్తువులు) ద్వారకకు కొనిరాబడినవి. ధుర్ధరులైన రాజులు భూతలమున కొరిగిరి. ఇది లోక హితమునకు వచ్చిన పరమాత్మయొక్క యవతారము.

కల్కి అవతారం

కల్కిమూర్తి శంభల గ్రామమున విష్ణు యశస్సను పేరున సర్వలోక హితమునకు అవతరించును. ఇవేగాక దితితో దేవగణములతో వచ్చిన అవతారములను బ్రహ్మ వాదులు పురాణములందు కీర్తించియున్నారు. ఈ అవతార కీర్తనమందు దేవతలు గూడ తబ్బిబ్బు పడుదురు. వేదధ్వనితో బాటు పురాణకీర్తన ప్రవచనము జరుగవలెనను ఉద్దేశ్యముతో నా అవతార చరిత్ర వర్ణింపబడినది. కీర్తనీయుడైన సర్వ జగద్గురులైన విష్ణువుయొక్క ఈ చరిత్రను కీర్తించుట వలన పితృదేవతలు సంప్రీతులగుదురు. మరియు విష్ణువుయొక్క ఈ కథ కృతాంజలియై విన్నవాడు యోగీశ్వరేశ్వరుడైన ఆ స్వామియొక్క యోగమాయ విలాసములను విన్న నరుడు సర్వ పాపములనుండి విమోచనము నంది, సమృద్ధియైన బుద్ధిని (జ్ఞానమును) విస్తారములైన భోగములను, భగవత్ ప్రసాదము వలన శీఘ్రముగ పొందును. మునీంద్రులార! ఇట్లు నాచే అమిత తేజస్వియైన విష్ణువుయొక్క పుణ్యావతారములు సర్వపాపహరములు. సమగ్రముగా కీర్తింపబడినవి. (213)

యమలోకమార్త స్వరూప వర్ణనమ్

మునులు ఇట్లు అడిగిరి –

"వ్యాసముని! మీ ముఖముచే గానముచేయబడిన పుణ్యధర్మములు అనెడి గానామృతమునకు తృప్తి చెందలేకున్నాము. భూతములయొక్క పుట్టువు, ప్రళయము కర్మగతి అంతయు ఎరుగుదువు. అందువలన నిన్ను అడుగుచున్నాము. యమలోక మార్గము దుఃఖ క్లేశములను కల్గించునని సర్వభూత భయంకరమని మిక్కిలి దుర్లభమని విన్నాము.

ఆదారివెంట నరులు యమసదనమునకు ఎట్లు వెళ్ళుదురు. ఆ దారి యొక్క దూరమెంత? నరక దుఃఖములను పొందకుండుటకు ఉపాయముగాగల దానధర్మ నియమాదు లెట్టివి? నరులు స్వర్గమెట్లు పొందుదురు. ఆ రెంటికిని స్థానములెన్ని? పుణ్యాత్ములెట్లు వెళ్ళుదురు. పాపులెట్లు వేళ్ళుదురు? స్వర్గమునకు కొంపోబడు జీవుని యొక్కయు, నరకమునకు కొంపోబడు జీవునియొక్కయు ఆకారము రంగు ప్రమాణములు ఎట్టివి?" అన వ్యాసుడు ఇట్లు చెప్పెను.

'సంసార చక్రము అజరము. అనగ అది ఎన్నిటికిని శిథిలముకానిది. నిలుకడలేక తిరుగుచునే యుండును. ప్రాణోత్క్రమణము జరిగినది మొదలు జీవుడు పయనించు యమమార్గ స్వరూపము నేను చెప్పెదను. మఱియొకడు చెప్పలేడు. యమలోకమునకు మనుష్య లోకమునకు నడుమగల అంతరము ఎనుబది ఆరు వేల యోజనములు. కాలిన రాగివలె అది క్రాగుచుండును. జీవులు తప్పక ప్రయాణము జేయవలసిన దారి అది. పుణ్యులు పుణ్యాలోకమునకు, పాపులు నరకమునకు పోవుదురు. యముని రాజధానిలో ఇరువది రెండు నరకములున్నవి. వాని పేరులు : రౌరవము, రౌద్రము, శూకరము, తాళము, కుంభీపాకము, మహాఘోరము, శష్మిలము, విమోహనము, కేటాదము, కృమిభక్షము, లాలాభక్షము, భ్రమము, నద్యము, పూయవహము, రుధిరాంభము, అగ్ని జ్వాల, మహాఘోరము, సందంశము, శునభోజనము, ఘోరము, వైతరణి, అసిపత్రవనము.

ఆ దారిలో చెట్టునీట చెరువులు, సరస్సులు, బావులు, చలివెందరలు, విశ్రమించుటకు గృహముగాని ఉండవు. ఆ దారిలో నదులు, పర్వతములు, కొంచెము విశ్రమించుటకు చోట్లు ఉండవు. మరణ కాలము వచ్చినంతట బంధు మిత్రాదులను వదలి సర్వ జీవులు సర్వ వేళల చిన్న పెద్ద అనకుండ గర్భములో ఉన్న శిశువు సైతము ఏ స్థితిలో ఉన్నను, తుదకు నిద్రావస్థలో ఉన్నను, ప్రాణములు విడిచిన జీవి ఇహము అందు నిర్దిష్టమై ఉన్న ఆయుర్దాయమును అనుభవించి తుదకు ఆదారి వెంబడి ఏగవలసినదే. వద్దన్నను అది తప్పదు. జలాగ్నులు విషశస్త్రములు ఆకలి, పర్వతమునుండి పడుట మొదలగు ఏదో నిమిత్తమున దేహి ప్రాణములను వదలి ఈ పాంచభౌతిక మహాశరీరమును ఇక్కడ విడుచును.

తానుచేసిన కర్మానుసారము యాతనా శరీరమును సుఖదుఃఖములను అనుభవించుటకు మఱొక ధృఢమైన దానిని స్వీకరించును. ఆ శరీరముతో పాపి పాపమును పుణ్యుడు పుణ్యమును అనుభవించును. ప్రాణము పోవునపుడు తీవ్రమైన వాయువుచే రగుల్కొల్పబడి శరీరమందు సూక్ష్మముగ ఉన్న అగ్ని ప్రకోపించును. అది కట్టెలు లేకుండగనే మండు

అగ్నివలె రగుల్కొని ఆయువు పట్టులను (మర్మ స్థానములు) బ్రద్దలు కొట్టును. ఉదాన వాయువు మీదికి లేచును. ఆ జీవి తిన్న ఆహారము, త్రాగిన నీరు, క్రిందికి పోకుండ నిరోధించును. ఎవడు బ్రతికి ఉండగ మంచినీళ్ళిచ్చి ఎవరికేని అన్నరసము పెట్టెనో వానికి ఆ ఆపద సమయమందు హాయి గల్గును. శ్రద్ధా పవిత్రమైన మనస్సుతో అన్నము పెట్టినవాడు ఆ యామార్గమున అన్నము లేకుండగనే తృప్తి నొందును. అన్నతమాడనివాడు, ఎదుటివాని ప్రీతికి భంగము చేయనివాడు, ఆస్తికుడు, శ్రద్ధావంతుడు సుఖమైన మరణమును పొందును. దేవబ్రాహ్మణ పూజానిరతులు, అసూయారహితులు, శుక్లులు (అచ్చము పుణ్యములు చేసిన వారు) దాతలు హ్రీమంతులు (తప్పుపని చేయుటకు కల్గెడి సంకోచము హ్రీయనబడును) వీరు సుఖమృత్యువులు. (అనాయాస మరణులు) కామోద్రేక ద్వేషములకు వశుడుగాక ధర్మము తప్పక చెప్పినట్లు చేయుచు సౌమ్యుడై ఉండువాడు సుఖమైన చావు పొందును. దప్పికకు నీళ్లు, ఆకలికి అన్నము పెట్టిన నరులు సుఖమరణము పొందుదురు. ధనదాతలు యమమార్గములో చలిని జయింతురు. మంచి గంధము ఇచ్చినవారు తాపము పొందరు. ఇతరుల ఉద్వేగమును సహించినవారు ప్రాణోత్క్రమణ వేదనను పొందరు. జ్ఞాన(విద్య) దాతలు, దీపమిచ్చినవారు మోహములో పడరు. కూటసాక్షి అసత్య వాది గురుశిక్ష పొందనివాడు వేదనిందకుడు మృత్యు సమయములో మూర్ఛలో పడుదురు.

ప్రాణము పోవు జీవునకు భయంకరులు, పాడుకంపు గొట్టువారు, బడితలు, బల్లెములు, దుడ్లు చేతబట్టినవారు, క్రూరులు, యమకింకరులు ఎదురు వత్తురు. వాండ్రు కంటబడగానే ఈ ప్రాణికి కంపము పుట్టును. మొర్రోయని బంధువుల కొఱకు ఏడ్చును. ఆ మాట కూడ అస్ఫుటముగా అన్ని అక్షరములు ఏక రూపమున వినిపించును. బెదరున జూపు బెదరును. కంఠములో గురగురపుట్టును. అంతట వేదనామయమైన ఆ శరీరమును జీవుడు వదలును.

వాయువు ననుసరించి (వాత ప్రకోపముచే) కర్మ యాతనానుభవమునకు తల్లి తండ్రులవలన ఏర్పడిన శరీరమునుగాక అదేరూపముననున్న శరీరమును సరిగా అదే ప్రమాణము అదే బాల్యాద్యవస్థగల అవయవములతో పొందును. ఆ తరువాత యమదూత పాశములచే కట్టివేయును. మరణవేదన పడుచు కాలమురాగా పంచ భూతములు దేహమును విడచిపెట్టును. ప్రాణము కంఠగతమైన సమయమున జీవుడు శరీరము నుండి విడదీయబడి ఎద్దువలె రంకెలు వేయును. షాట్కౌశికమైన ఆనందమయ (అన్న మయ ప్రాణమయ మనోమయ విజ్ఞానమయ) వాయు స్వరూపమున నిర్గమించును. తల్లితండ్రి మొదలగు సర్వ సంబంధులచేత విడువబడును. బిక్కమొగములు వెట్టి కన్నీళ్ళు గార్చుచు వారు చూచుచుండ తన శరీరమును (గూడును) విడచి వాయురూపుడై పోవును.

అంధకారబంధురము చుట్టు చీకటి ఆవరించినది, సుఖదుఃఖ ప్రదము, దుస్సహము, దురంతము, దురాసదము, దుర్నిరీక్ష్యము, దుర్గమమునై ఆ దారినిబట్టి పాపాత్ములు వెళ్ళుదురు.

యమకింకరులు పాశములచే కట్టి ముద్గరములచే కొట్టుచు లాగికొనిపోవుదురు. (ముద్గరము = పొట్టి ఇనుప దుడ్డు) యమదూతలు జీవుని ఆయుర్దాయమయి పోయినట్లు తెలిసికొని భల్లూకములు, పెద్దపులులు, గాడిదలు, ఒంటెలు, కోతులు, మండ్రగబ్బలు, తోడేళ్ళు, గుడ్లగూబలు, పాములు, పిల్లులు, గ్రద్దలు, దేగలు, నక్కలు ఎక్కివత్తురు. పెక్కు వికృత రూపములతో అనగా పందులు, కుక్కలు, పశువులు, దున్నలు మొదలగు రూపములతో వత్తురు. భయంకరమూర్తులు. వంకర ముక్కులు, మూడు కళ్ళు పెద్ద దవడలు దీర్ఘాండములు వ్రేలాడు పెదవులు గల్గి రక్త మాంసములు అలమిన శరీరములతో భయంకరమైన కోరలతో మండుచున్న నాలుకలతో పాతాళమువంటి ముఖములతో వికృతములైన నేత్రములతో పిల్లులు, గుడ్లగూబలు, మిణుగురు పురుగులు, ఆర్ద్ర పురుగులట్లున్న తిరుగుడువడుచున్న కన్నులతో, మెల్లకళ్ళతో, నిప్పులట్లు మెఱయు చూపులతో, ఆ యమదూతలు కనిపింతురు. భయంకరమైన పాములట్లుండు అయోమయములైన భూషణములతో పుఱ్ఱెల మాలలు ధరించి బుసలుకొట్టు నల్లతాచుల కంఠములకు చుట్టుకొని అగ్ని మంటలట్లున్న నిక్కిన తల వెంట్రుకలతో నూరు కదలు రాగిరంగు, గోరోచనపు రంగులోనున్న వ్రేలాడు గడ్డములతో కొందరికి రెండు నాలుగు పదహారు పది, ఇరువది మఱియు లెక్కలేనన్ని చేతులతో కొందరు వేయిచేతులతో మంటలు చిమ్ము వివిధ ఆయుధములతో పాశములతో, ఇనుపగొలుసులతో, దండములతోవచ్చి హడలుగొట్టుదురు. యముని ఆజ్ఞగొని జీవుల సత్వమాహరించికొనిపోయి యమసదనము జేర్తురు. తడబడుచు, ఏడ్చుచు, బొబ్బలు ఇడుచు, అమ్మ, నాన్న, కొడుకా అని చుట్టాలను పిలిచి ఏడ్చుచున్న కర్మచే చెడినవానిని శూలములచే పొడుచుచు, ఇనుప గుదియలచే అడచుచు వజ్ర సమానములైన దండములచే బాదుచు, కత్తులచే నరకుచు, పెల్లుగ ఆర్చుచు, కృద్ధులైన కింకరులు ఈడ్చుకొని పోవుచుండ ఆ జీవుడు దుఃఖమున కుమిలి మూర్ఛవడి ఉడుకెత్తిపోవ ఇట్టట్టు లాగుచు, సూదులట్లు గ్రుచ్చికొను కుశ కంటకములను ఈడ్చుచు పుట్టల దొర్లించుచు, శంకు పాషాణముల దొరలించుచు కులకరాళ్ళ కెరలించుచు గనగనమండు మంటలలో కాలెడి ఎండలో ఒకవంక నక్కలు తినుచుండ, జీవుడు నరక మార్గమున పోవును. ఇట పాపులు బెదరిబెదరి తడబడి ఆక్రందనము చేయుచు ఆదారిని జనుచుందురు. కాలిన నేలపై ముండ్ల కంచెలలో కాలుచు దానము చేయని పిసినిగొట్టులు పయనింతురు. జీవ ఘాతకులు రక్తము రసి మొదలగువాని పాడుకంపుతో గొడ్డు మేకపోతు శరీరముతో చర్మము కాలుచుండ వెళ్ళును.

మఱియు పులుగులవలె కూయుచు ఆక్రందించుచు వికృతముగ ఆక్రోశించుచు వేదనకు గురియై వివిధాయుధములచే నరకబడుచు, పొడువబడుచు, జీవఘాతకులు ఆదారిలో పోవుదురు. మాంసము మెక్కిన జీవులు బల్లెములచే పొడవబడుచు అంపములచే కోయబడుచు ఎడ్లు దున్నలు మొదలగు వానిచే పొడవబడుచు పందులచే గీరబడుచు సూదులచే పొడవబడుచు కందురీగలు కుట్ట మధుఘాతకులు (ఇతరుల నోటి యందలి మధురమైన కూడు పడగొట్టినవారు) స్వామి ద్రోహము జేసినవారు, మిత్రఘాత, స్త్రీ ఘాత చేసినవారు యమకింకరుల శస్త్రములచే తెగిపోవలసి ఉండును. నిరపరాధములైన సాధు జంతువులను చంపిన వారిని, రాక్షసులు ఆదారిలో కొరికి తినుచుందురు. పరస్త్రీల వస్త్రములు అపహరించినవారు ప్రేతలై దిగంబరులై అమాలయమునకు పరువు లెత్తుదురు. గృహ క్షేత్ర సువర్ణ వస్త్ర ధాన్యాదులను దొంగిలించిన పాపులు పాషాణములచే బడితెలచే బాదబడుచు కీలుకీలు పట్టువిడి, రక్తములు కార ఆదారి వెంట పోవలసి ఉండును. బ్రాహ్మణులను కొట్టి ఘోష పెట్టించినవారు ఎండిన కాష్ఠములకు వేసి కట్టబడి కన్ను, ముక్కు, చెవులు, కోయబడగా చీము, నెత్తురుచే అలముకొనబడి కాలుని గ్రద్దలచే నక్కలచే పీకికొని తినబడుచు, దండములచేత బాదబడుచు, మొరవెట్టుచు ఆతెరవున బోవుదురు. ఇట్టి ఘోరమైన జ్వాలా మయమైన రౌరవమను నరకము మానవులకు ఏర్పడినది.

కాలినరాగివలె మంటలు చిమ్ముచు మిణుగురులు చెదర, ముళ్ళజెముడు డొంకలతో నిండిన నిప్పుల ఇసుకతో నిండి వహ్ని కీటకమైన మార్గమున (వహ్ని=నిప్పుచేత కీటకము=నిష్ఠురము) మండుటెండకాయు దారిని చనవలసి ఉండును. ఇట్లెంతో దూరము గడచిన పిదప రాగి ఇనుముతో నిర్మితమై లక్ష యోజనముల వైశాల్యము గల్గి నలుచదర ముగా నాలుగు ద్వారములుగల యమనగరము వచ్చును. పదివేల యోజనముల ఎత్తైన బంగారు ప్రాకారములు దానికి గలవు. ఇంద్రనీలాది మణులచే అది శోభించుచుండును. దాని తూర్పు ద్వారమున దేవ దానవ యక్ష రాక్షస పన్నగాది గణములుండును. వందల కొలది పతాకములు ఎగురుచుండును. గంధర్వ అప్సరసలచట ఆడుచు పాడుచుందురు. ఆ తూర్పు ద్వారమున ప్రవేశము దేవఋషియోగి బృందములకు మాత్రమే కల్పించబడును. యక్ష సిద్ధాదర విద్యాధరులకు మాత్రమే, ఉత్తర ద్వారమున గంటలు మ్రోయుచుండును. ఛత్ర చామ రాదులు సొంపు నింపుచుండును. అది నానారత్నాలంకృతము. వీణా వేణు మృదంగాది మంగళధ్వనులు వినిపించుచుండును. ఋగ్యజుస్సామ వేద ఘోషముతో ముని బృంద అందము గొలుపుచుండును. ఆ ద్వారము వెంట ప్రవేశము గలవారు ధర్మజ్ఞులు సత్య వ్రతులు. వేసవిలో మంచినీరు ఇచ్చినవారు. చలికాలమున వెచ్చదనము

ఇచ్చినవారు. అలసట వడిన వారికి విశ్రాంతిని ఇచ్చినవారు. ప్రియ భాషణము చేసినవారు. దానశూరులు. మాతా పితృసేవాతత్పరులు. గురుశుశ్రూష చేసినవారు. అతిథిపూజకులు. వీరికి ఉత్తర ద్వారము ప్రవేశద్వారము. ఇక పడమటి ద్వారము రత్న భూషితము. రంగురంగుల రత్నాల మెట్లు తోమరములు అచట రాణించును. భేరీ మృదంగ శంఖాదుల ధ్వనులు కాహళముల మేళవింపు (కాహళం=బాకా) వినిపించును. హర్ష భరితులై శుభ ప్రదులైన సిద్ధులయొక్క బృందములచే అది మారుమ్రోయు చుండును. ఆ దారిని ప్రవేశము ఆనంద భరితులకు భక్తులకు సర్వతీర్థస్నానము జేసినవారికి. పంచాగ్నుల సేవించినవారికి పుణ్యతీర్థ యాత్రలందు, కాలంజర పర్వతములందు, అగ్నియందు మరణించినవారికి శత్రు నాశనము చేసికొన్నవారికి స్వామి(యజమాని) స్నేహితుడు లోకము గోవులు మొదలైన వాని రక్షణ కొరకు హతులైన శూరులకు, తపోధనులకు పశ్చిమ ద్వారమున ప్రవేశము ఈయబడును.

ఆ నగరమునకు దక్షిణ ద్వారము మహా భయంకరము, సర్వప్రాణి భయంకరము. హాహాకార మెత్తుచుండును. అంధకార బంధురము. సూదిమొనగల శిఖరములు ముళ్ళు తేళ్ళు వజ్ర కీటములు (కర్రల దొలుచు పురుగులు) వీనిచేత అడుగిడుటకు వీలుండదు. తోడేళ్ళు పులులు నక్కలతో సింహములు పిల్లులు గ్రద్దలు కణకణమండు ముఖములతో చరించు ఆ ద్వారమున సర్వాపకారులైన వారికి ప్రవేశము. గోబ్రాహ్మణ వృద్ధులను, బాధలో నున్నవానిని, శరణుజొచ్చిన వానిని, స్త్రీని, మిత్రుని, ఆయుధము చేతిలో లేనివానిని చంపిన వారికిది ప్రవేశద్వారము. పొందరాని గురుపత్ని మొదలైన స్త్రీలను పొందినవారు మూఢులు పరద్రవ్యాపహారకులు దాచనిచ్చిన వస్తువులు హరించిన వారు, విషము పెట్టిన వారు, నిప్పంటించిన వారు పర భూ గృహశయ్యా వస్త్ర భూషణాపహారులు పరుల లోప ములనే వెదకు క్రూరులు, అనృత వాదులు గ్రామమునకు రాష్ట్రమునకు పురమునకు దుఃఖము కల్గించినవారు అబద్ధసాక్ష్య మిచ్చినవారు కన్యలను అమ్ముకొన్న వారు అభక్ష్య భక్షణ ప్రియులు కోడలిని కూతురును పొందినవారు, తల్లిని తండ్రిని కటువుగ మాట్లాడినవారు మరి మహాపాతకులుగ చెప్పబడినవారు. అందరు దక్షిణ ద్వారమున యమపురము ప్రవేశింతురు. (214)

దక్షిణమార్గ వర్ణనము

మునులు "తపోధనా! పాపులు దక్షిణ మార్గమున ఎట్లు పోదురో సవిస్తరముగ ఆనతి ఇమ్మన వ్యాసులు ఇట్లనియె. ఆ మార్గము ఘోరాతి ఘోరము. ఆ ద్వారము ఘోర

కమృగ సంకులము. భయంకరము. నక్కల అరపులతో ప్రతిధ్వనించును. అగ మ్యము. భూతప్రేత పిశాచ రాక్షస సంకీర్ణము. తలచికొన్న తనువు గగుర్పాటు చెందును. పాపులు ద్వారము దూరాననేకని బెదరి ప్రేలాపన చేయుచు మూర్ఛపడుదురు. అటుపై యమభటులు వారిని కొట్టుచు సంకెళ్ల పాశములగట్టి ఈడ్చుచు దండములచే బెదిరింతురు. ఆ జీవులు తెలివొంది రక్తమునందు తడిసి అడుగడుగున తడబడుచు దక్షిణ ద్వారమును ప్రవేశింతురు. ఆదారి ముండ్లతో గులకరాళ్లతో కత్తులతో పాషాణములతో ఒక్కెడ బురదతో దాటరాని గోతులతో ఇనుప సూదులట్టి దంగములతో, దుర్గమమై ఉండును. అందు జీవులు దుఃఖిం చుచు, ఒడ్డులం గూల్చు కొండలు చెట్లతో నిప్పులతో కూడిన దారిని పోదురు. కొన్ని యెడల ఒరకములు (హెచ్చుతగ్గులు) కొన్నియెడల మట్టిపెళ్లలు కణకణలాడు ఇసుక, పదునైన శంకువులు సలసలకాగు నేలతోడి నలుదారులు కలిసిన బాటలు కాలిన పాషా ణములు కొన్నియెడల మంచుతో పీకదాక దిగిపోవు ఇసుక మేటలతో ముఱుగు నీటితో గనగనమండు నిప్పులతో కూడియుండును. సింహములు, తోడేళ్ళు, ఈగలు, దోమలు, దారుణములయిన పురుగులు, నొక్కెడ పెద్దపెద్ద జలగలు, మీద కొండ చిలువలు, కందు రీగలు, విషము గ్రక్కు పాములు, దుష్టగజములు, పదునైన కొమ్ములతో దారినేల రాయు ఎద్దులతో, దున్నలతో, ఒంటెలతో కూడి ఉండును. రౌద్రముల యిన ఢాకిని శాకిన్యాది పిశాచములు రాక్షసులు వ్యాధులు పీడింప ఆ దారిని పీడితులై పోవుదురు. మహాధూళి గ్రమ్మ, మహాప్రచండ వాయువులు వీవ, మహాపాషాణములు వర్షించుచుండ, యమభటులు బాదుచుండ, నిలువ నీడగానక, నొక్కెడ పిడుగుపాటున నొడలు పగుల, బాణవర్షమున బ్రద్దలుకాగా, దారుణముగ గొఅవులు పడుచుండ, పైని నిప్పులు కురియుచుండ, ఆదారిని జనుదురు. పెనుధూళి కురియుచుండ అందు బ్రుంగి ఏడ్తురు. మేఘముల ఉరుములకు అడలి పోవుదురు. బాణ వర్షములచే చూర్ణమై పోయెదరు. పెద్ద ఉప్పునీటి దారలం తడియుచు పుండు వంటి చలిగాలికి బిగియుచు పగులుచు నొగులుచు ఆదారి ఆకలివడి తినుటకేమియులేక కుములుచు నిరాలంబము నిర్జలమునైన ఆ దుర్గమయ మార్గమునంబడి అతిశ్రమ గుడుచుచు దేహులు మూఢులు పాపాత్ములు ఆ వెంట జనియెదరు. యముని ఆజ్ఞకొని దూతలు అతి ఘోరరూపు లీడ్వ, ఒంటరిగ పరాధీనులై బంధు.ుత్రాదులు లేక, తాము మున్ను చేసిన పాపములకు మఱిమఱి ఏడ్చుచు నడుమనడుమ యమభటులు నోరెత్త వలదని కొట్టుచుండ నోరు నాలుక ఎండగా ప్రేతలై నొగులుదురు. బక్కచిక్కిన మేనులతో జడిసి జడిసి పోవుచు ఆకలి చిచ్చునకు దహింపబడుచు సంకెళ్ళ బంధితులై కొందరు తలక్రిందుగా పాదములు మీదుగా గైకొని దూతలచే ఈడ్వబడుదురు. కొందరు మొగము క్రిందుగా ఈడ్వబడి ఏడ్తురు. అన్నము నీరు లేక మఱిమఱి దేహిదేహి అని

అడుగుకొనుచు కంట నీరు పెట్టుచు గద్గదికతో చేతులు జోడించి దీనులై ఆకలి దప్పుల కుమిలి, మంచి భక్ష్యములు పేయములు భోజ్యములు గమగమ వాసనలు చిమ్ముచుండ జూచుచు మఱి మఱి ప్రాధేయపడి అడిగికొనుచు, పెరుగు పాలు నెయ్యియు కలిపిన అన్నము జూచి సుగంధభరిత పానీ యములు, చల్లని నీటిని చూచి యమదూతలం బిక్క మొగము పెట్టి యాచించికొనుచుందురు. వారింగని యమదూతలు, భయంకరులు క్రోధమున కనుకెలకులు ఎఱ్ఱవడ బెదరించుచు ఇట్లందురు.

"సకాలమున మీరు హోమము చేయలేదు. విప్రుల కేమియు ఈయలేదు. ఎవరేని ఇచ్చుచున్న దానికి అడ్డు తగిలితిరి. దానివలని పాపమిది అనుభవింప వలసినది. అగ్నిచే కాలలేదు. నీటిపాలు కాలేదు. రాజులు దొంగలు అపహరింపలేదు. మున్న మీరు చేయని దానము ఇప్పుడు బ్రాహ్మణ ముఖమున ఈయబడుచున్నది. సాత్త్విక దానములు చేసిన సాధువులకు ఇవిగో అన్నపర్వతము లెదురగుచున్నవి. భక్ష్య భోజ్య లేహ్య పేయాది రూపమగు నాహార సమృద్ధి. ఇది మీకుగాదు. మీరు విప్రముఖమున ఎన్నడు ఇంత అన్నము పెట్టి ఉండలేదు. బ్రాహ్మణుల బూజింపనైన లేదు. ఆ విధముగ చేసిన పుణ్యాత్ములదీ అన్నసమృద్ధి. వారిది గొనివచ్చి మేము మీకెట్లు పెట్టగలము?

యమకింకరుల మాటలు వీని దిగులువడి ఆకలికి కుమిలి ఆజీవులు దారుణ శస్త్ర పీడితుగుదురు. ఇనుప గుదియలు ఇనుపదుడ్లు శక్తితోమరపట్టి సపరిఘ బిందిపాల గదా పరశు బాణాదులచే వీపున బాదుచు పరమ నిర్దయులు కింకరులు వేధింప అరిగి యరిగి సింహవ్యాఘ్రాదులచే పాపులు భక్షింపబడుదురు. అట్లు మిగుల పీడించి కింకరులు పాపులను యమ ప్రభువు ఎదటకు గొంపోదురు. ఆయన ధర్మాత్ముడు, ధర్మకర్త, సర్వప్రాణి నియామకుడునైన యముడు ఇట్లు అతికష్టమైన దారింజని ప్రేతపురము జేరిన నరులను ప్రభువుకు ఎదురబెట్టి యమదూతలు వారువారు చేసిన కర్మములు నివేదింప ప్రాణులా యనను అతిభయంకరుని జూచెదరు. పాపముచే కనులు మూతవడి బుద్ధులుచెడి ప్రాణి కోరలతో భయంకరమై కనుబొమలు ముడివడి మిడిగ్రుడ్ల జడుపు కూర్చు మొగము, నిక్కినజుట్టు, పెద్దగడ్డముతో, పెదవులు అదర పదునెన్మిది చేతులతో కాటుకవలె నల్లని మేనితో సర్వాయుధములు కరములందు పూని పెద్దదున్న పోతునెక్కి పెద్దమబ్బువలె నిప్పులట్లు మండు కండ్లు రక్తమాల్యములుపూని ప్రళయ మేఘమట్లు ఉరుముచు సముద్రుని ఆపోశన పట్టునా అన్నట్లు, ముల్లోకములను మ్రింగునా అన్నట్లు, నిప్పులు క్రక్కుచున్నట్లు, దగ్గరగానిల్చి కాలాగ్ని ప్రభతో ఉన్న మృత్యువును చూచి, మహామారి కాలరాత్రియు వివిధ వ్యాధులు కష్టాలు నానారూపాలు శక్తి శూలాస్త్ర పాశ చక్రాంకుశ ఖడ్గాదులు దాల్చి

వజ్రదండములు గొని చురకత్తులు అమ్ములపొదలు విండ్లును అసంఖ్యాకమును పూని మహావీర్యులు క్రూరులు కాటుకవలె నల్లని మేనికాంతిగలవారు సర్వాయుధహస్తులై యమదూతలు అతి భయానకులై ఘోరముగ పరివారమై కొలువ కొలువైన యముని చిత్రగుప్తుని పాపాత్ములు దర్శింతురు. యముడు ఉగ్రుడై వారిని ఉరిమి ఉరిమి చూచును. అపుడు చిత్రగుప్త భగవానుడు ధర్మ వచనములచే ప్రబోధించుచు ఇట్లనును.

"ఓ! పాపకర్ములారా! పరద్రవ్యాపహారులారా! రూపముచే బలముచే పొగరెక్కి పరదారాభిగమనము చేసిన ఫలమది అనుభవింపవలయును. దుఃఖము కుడువక తప్పదు. ఈ తప్పెవనిదికాదు. నాకడకు వచ్చినవారు ఈ రాజులు తెలివిచెడి బలగర్వితులై చేసిన తమ కర్మమును అనుభవించుచున్నారు. ఓ రాజులారా! ప్రజానాశన మొనరించితిరి. అల్ప రాజ్య సుఖమునకై ఘోరములు చేసినారు. మీరు రాజ్య లోభముతో మోహముతో బలాత్కారముగ ప్రజలను దండించినారు. దాని ఫలము ఇపుడు అనుభవింపుడు.రాజ్యమేది ఇక్కడ భార్య యెక్కడ? ఏకాకియై చేసిన అశుభమును ఇపుడు అనుభవింపవలసినదే. ఏ బలముకొని ప్రజల బాధింతురో ఆ బలము ఇపుడు ఏ మాత్రము ఈ లోకమున గనబడదు. యమకింకరుల వలని బాధలకు గురియైతిరి. పాపము" అని ఇట్లు పలుతీరుల దెప్పి పొడుచుచు, నొవ్వనాడుచు, యముడుత్కట కోపియై పడదిట్ట నేడ్చుచు చేసిన పాపములకు పశ్చాత్తపించుచు, ప్రాణులు నోరెత్తక నిల్తురు. ధర్మరాజు ఇట్లు చిత్రగుప్తుని వారివారి కర్మల లెక్కలు చెప్పుమని విని ఆ పాపవిశుద్ధికి విధింపనగు దండనముల గూర్చి దండధరుడు ఇట్లు ఆదేశమిచ్చును.

"ఓరిచండ! మహాచండ! ఈ నరపతుల గొంపోయి నరకాగ్నులందు పడవేసి పాపముల నుండి విశుద్ధుల జేయుడు" అన వెనువెంటనే లేచి యమభటులు నృపులకాళ్ళు పట్టుకొని ఎత్తి విసరిపారవేసి పాపప్రమాణము బట్టి బండపై నడిచి పిడుగుచే మహాతరువు నట్లు కొట్టిరి. అంతట రక్తము ప్రవాహమెత్తినట్లు ముక్కుననోట జాల్కాన తెలివితప్పి ఆదేహి పడిపోవును. అటుపై దానిపై వాయువు వీవ తెలివిగొనినంత వారిని పాపవిశుద్ధికి నరక సాగరమున విసురుదురు. ఆ దూతలు మహాదుఃఖముల కుములు, మఱియుంగల జీవులను యమునికి నివేదింతురు. "ఇదుగో వీనిని మహాపాపిని మూర్ఛ బడవేసి కొని వచ్చితిమి. ధర్మ విముఖుడు నిత్యపాపరతుడు. ఇదుగో వీడు పరమలుబ్ధుడు. మహాపాతక ఉప పాతకములెన్నో చేసినాడు హింసాపరుడు అనాచారుడు. కూడరానిది కూడినవాడు పర ద్రవ్యాపహారి. కన్యావిక్రయి, కూటసాక్షి, కృతఘ్నుడు, మిత్రద్రోహి మరియు వీడు ధర్మనింద చేసినాడు. పాపములు చేసినాడు, దురాత్ముడు, వీనిని శిక్షించుటో రక్షించుటో

ప్రభువు నీవు సెలవిమ్ము. నీవు చెప్పినది అమలుచేయుటలో మేము సర్వదా విధేయులము" అని ఇట్లు విన్నవించి ధర్మప్రభువు ఎదుట నిలిపి వేలకొలది లక్షకోటి నరకముల పడవైతురు. ఆపై మఱి కొందఱిని పట్టపోవుదురు. చేసినతప్పు నిర్ధారణచేసిన మీద తన కింకరులకు ఆనయిచ్చి వశిష్ఠాది మహర్షులేయే నేరములకు ఏయే దండనము విధించిరో ఆయారీతి దండింపజేయును. యమకింకరులు క్రోధమూని అంకుశముద్గర దండాదులు, అంపములు శక్తి, తోమరములు, కత్తులు, శూలములుగొని అడచి కొట్టికోసి యేసిగ్రుచ్చి నరకి చీల్చి పాపశోధనము చేయుదురు.

నరకముల భయానక స్వరూపము వాని ప్రమాణములు వినుడు. మహావీచి అను నరకము రక్తపూర్ణము. వజ్రకంటక మిశ్రము. పదివేల యోజనముల విరివిగలది పాపి నందు ముంచి వజ్ర కంటకముల గ్రుచ్చి చీల్తురు. లక్షయేండ్లు అక్కడ గోహత్యచేసిన వాడు కూలియుండును. కుంభీపాకము మహాదారుణ నరకము. నూరు లక్షల యోజనములు ఉండును. కాలుచున్న రాగి బిందెలతో అది మిడమిడకాలు ఇసుక నిప్పులతో గూడి ఉండును. బ్రహ్మఘ్నుడు భూమి హర్త ధన నిక్షేపములను (నిధులను) హరించిన వాడచట కూలును. భూత ప్రళయముదాక జీవులందు కాల్పబడుదురు. అటుపై రౌరవము జ్వలించు వజ్ర బాణములతో నిండియుండును. అరువది యోజనముల పొడవు వెడల్పు గల్గియుండును. జ్వాలలు గ్రమ్ము ఆ నరకమున బాణములచే పాపులు చీల్చబడుదురు. అయోమయ నరకము మంజూషాకారము (బోనువంటిది) దానిలో పాపుల పడవేసి చెఱకును ఆడించినట్లు ఆడింతురు. అదియును జ్వలించుచుండును.

అప్రతిష్ఠమను నరకము మలమూత్ర పురీష మయము. పాపియందు అధోముఖుడై కూలును. బ్రాహ్మణులను పీడించినవాడు బ్రాహ్మణ ద్రవ్యము అపహరించినవాడు దానిచే కూలును. విలేపకమను నరకము సలసలకాగు లక్కతో ఉండును. మద్యపానరతులు అందులో మున్గుదురు. మహాప్రభమను నరకము కాలిన శూలములతో నిండియుండును. ఆలు మగలకు తగవుపెట్టిన వారు ఆ శూలములచే పొడువబడుదురు. జయంతి అను ఘోర నరకము ఉక్కు పరచిన రాతినేల. పరభార్యాసంగమము చేసినవాడు దానంబడి ఉడికి పోవును.

శాల్మలమను నరకము నిప్పుల ముళ్ళతో నిండినది. బహుజన వ్యభిచారిణియైన స్త్రీ దానిని కౌగలించుకొనును. ఎవ్వరితరుల ఆయువు పట్టులకు తగులు అసత్యములు పల్కుదురో వాండ్ర నాలుకను లాగి అంపముల గోయుదురు. ఎవ్వరు సరాగములగు చూపులం పరాంగనం చూతురో వారి కన్నులం బాణములంగ్రుచ్చి పగిలింతురు. తల్లిని

సోదరిని కోడలిని కూతురును పొందిన వాండ్రను, స్త్రీ బాలవృద్ధ హంతకులను, పదు నల్వురు ఇంద్రుల కాలము జ్వాలామాలాకాకులమైన రౌద్రమగు మహారౌరవమను నరకమున కూల్తురు. అది ఇరువది నాల్గు యోజనముల విరివియైనది. ఎవ్వడు పుర గ్రామ క్షేత్ర గృహాదులకు నిప్పు పెట్టునో ఆ మూఢుడు కల్పాంతముదాక పై నరకమున కాల్పబడును. తామిస్రమను నరకము లక్ష యోజనములు. కత్తులు పట్టిసములు ముద్గరములు పరచినది. అందు దొంగలను విసిరివైతురు. యమకింకరులు శూలశక్తి గదా ఖడ్గాదులచే కల్పశతము అచట పాపులను అడంతురు. తామిస్రము కంటె రెట్టింపు విశాలము మహాతామిస్రము. అందు జలగలు పాములు ఉండును. కారుచీకటి పరమ దుఃఖదము. మాతృ పితృ హంతకులు మిత్ర విశ్వాస ఘాతకులు అందు బాడితెలం జెక్కబడుచుందురు. భూమి ఉన్నంత దాక దానిని అనుభవింతురు. అసిపత్రవనము (కత్తులబోను) మహాదుఃఖదము. కాలుచున్న కత్తులతో నిండినది. ఒక్క యోజనము విరివిగలది. అందు మిత్రఘ్నుడు భూత ప్రళయము దాక కత్తులచే నూరు వ్రక్కలు గావింపబడును. కరంభ వాలుకమను నరకము ఒక్క యోజనము. కూపాకారము, మిడ మిడ కాలు నిప్పులతో ముండ్లతో ఇసుకతో నిండినది. అందు ఒక లక్షా పదివేల మూడు వందలేండ్లు జనులను మాయోపాయములచే దారుణముగ ప్రగ్గుచేయుదురు. దహించిన వారు అదు దహింపబడుదురు. కాకోలమను నరకము కృమిమయము మలమయమును. మృష్టాన్నము తాను ఒక్కడ తిన్నవాడు దానిలో కూలును. మలమూత్ర శోణిత మయము కుడ్యలమనునది. పంచ యజ్ఞములు మానిన వారు అందుబడుదురు. మాంసము రక్తముతో అది పాడు కంపు గొట్టుచుండును. భయంకరము. అభక్ష్యాన్న భక్షకులందు కూలుదురు. క్రిమి కీటకమయము, శవసంపూర్ణము మహా వటమను నరకము. కన్యా విక్రయము చేసినవాడు అక్కడ తలక్రిందుగా ఆ పెద్ద మఱిచెట్టు నుండి క్రిందపడును. తిలపాకమను నరకము దారుణము. పరులను పీడింప గోరిన వారు అందు గానుగ యందు నువ్వులట్లు ఆడింపబడుదురు. అందు సలసలక్రాగు నూనెలో ఉడికిపోదురు. మిత్రఘ్నుడు శరణాగత హంతకుడు వజ్రపాటకమను నరకమున వజ్రమయములైన గొలుసుల బంధింపబడును. పాలమ్మువాడు నిర్దయముగ నిరుచ్ఛ్వాస మగు గాఢాంధకార బంధురము, గాలి ఆడని నరకమున పీడింపబడును. బ్రాహ్మణునికి చేయుదానమునకు అడ్డుపడినవాడు చేష్టలు దక్కియందు కుములును. గనగన మండు నిప్పుల నరకమగునట్టిది, అంగారోపచయము. విప్రునికి దానముచేసి చేయలేదన్న వాడు దానియందు పడును. మహాపాయి అనునరకము లక్షయోజనములు. అనృతము లాడినవానిని అందు అధోముఖముగా పడవేయబడును.

మహాజ్వాలమను నరకము పెనుమంటలతో భయంకరము. పాపులు అందు దహింప బడుదురు. క్రకచమను నరకమున వజ్రము వంటి పదునైన అంపములచే అగమ్యాగమనమును జేసిన పాపులు కోయబడుదురు. గుడపాకమను నరకము క్రాగుచున్న బెల్లపుపాకముయొక్క మడుగు. అందు వర్ణసాంకర్యము చేసిన వాడు పడవేయబడును. క్షుర ధారమను నరకము పదునైన కత్తుల నరకము. బ్రాహ్మణ భూమి కాజేసిన వాడందు కల్పాంతముదాక కోతలంబడును. అంబరీషమను నరకము. ప్రళయకాలాగ్ని దీపితము. నూరు కల్పకోటులందు స్వర్ణస్తేయి (బంగారపు దొంగ) కూలును. వజ్రకుఠానరకము కేవలవజ్రమయము. చెట్లను నరకిన వారు అందులోబడుదురు. పరితాపము ప్రళయాగ్ని మయము. విషము పెట్టినవాడు మధుహర్త (మధువు=తేనె) దానం బడును. కాల సూత్రము వజ్రసూత్రమయము. ఇతరుల పంటలను హరించిన వాడు అందుపడుదురు. కశ్మలమను నరకము చీమిడి శ్లేష్మముతో నిండినది. ఒక కల్పము అక్కడ నిరంతర మాంసాభిరుచి గలవాడుకూలును. ఉగ్ర గంధమను నరకము లాలా (చొంగ) మూత్ర పురీషమయము. పితరులకు పిండప్రదానము చేయని వారందు బడవేయబడుదురు. జలగలు తేళ్ళతో మండెడిదుర్భర నరకము పదివేల ఏండ్లు అందు తిండిపోతు కూలును. వజ్రమయము వజ్రమహానీడమను నరకమున ధనధాన్య హిరణ్యములను హరించిన వారు కుములుదురు. యమకింకరులు లేశలేశముగా దొంగలనట చెక్కుదురు. కాకిని గ్రద్దకువలె ప్రాణుల నరకి తినువాండ్రను యమకింకరులు కల్పాంతము దాక వారి మాంసమును వారిచేతనే తినిపింతురు. పరుల శయనాసన వస్త్రాదులను కాజేసిన వారిని శక్తి తోమరాదులచే యమభటులు ఖండింతురు. పండ్లు ఆకులు హరించిన కుబుద్ధులు గడ్డి నిప్పునం కాల్ప బడుదురు. కాలభటులు పరదార ధనాదుల యెడ బుద్ధిగల వాని గుండెలలో కాలిన ఇనుప శూలమును గ్రుచ్చుదురు. మనోవాక్కాయ కర్మలందు ధర్మ విముఖులైన పాపులు యమలోకమున పలుఘోరములైన యాతనలందు వేలు లక్షలు కోట్ల సంవత్సరములు దుఃఖములు కుడువవలసి యుండును" (215).

నరకదుఃఖ నివారణము

మునులు ఇట్లు అనిరి –

"యమలోక మార్గమందు గల్గు ఘోర దుఃఖము ఘోరములైన నరకములు నరక ద్వారమును గురించి ఆశ్చర్యమైన విషయములను నీవు తెలిపితివి. భయంకరమైన ఆ దారిలో సుఖముగ వెళ్ళుటకు ఉపాయము కలదో లేదో తెలుపుము అనగా వ్యాసుడు

ఇట్లనియె. ఇహమందు ధర్మపరులై అహింసా నిరతులై గురుశుశ్రూష దేవ బ్రాహ్మణ పూజచేసిన వారు భార్యా పుత్రాదులతో యమ మార్గమున వెళ్ళరు. బంగారు టెక్కెములతో కూడిన దివ్య విమానముల అందు అప్సరసలు సేవించుచుండగా ధర్మరాజు పురమునకు పోయెదరు. బ్రాహ్మణులకు అన్నదానము మొదలైన వానిని భక్తితో పవిత్రముగ చేసినవారు దేవతా తరుణులచేత సేవింపబడుచు విమానముల మీద వెళ్ళెదరు. సత్యము పల్కినవారు మనసులో మాటలో స్వచ్ఛమైనవారు విష్ణు తాత్పర్యముతో గోదానము చేసినవారు అప్సరసలు సేవింప ధర్మపురికి ఏగుదురు.

పాద రక్షలు గొడుగు మంచము ఆసనము వస్త్రాభరణములను ఒసంగినవారు గజాశ్వరథములను ఎక్కి బంగారు వెండి గొడుగులతో ఏగుదురు. శుద్ధాంతఃకరణముతో పానకము అన్నము పూజించి ఇచ్చినవారు బంగారు విమానములలో ప్రయాణింతురు. పాలు పెరుగు నేయి బెల్లము మంత్రపూతముగా పరిమళ పుష్పముల నిచ్చిన వారు హంస విమానముల మీద అరుగుదురు. నువ్వులను తిలధేను ఘృతధేను దానములను శ్రద్ధతో శ్రోత్రియులకు ఇచ్చినవారు చంద్రమండలమువలె ప్రకాశించు విమానముల మీద గంధర్వులు గానము చేయుచుండ యమపురికి పోయెదరు. వాపీకూప తటాకములు సరస్సులు దిగుడుబావులు పుష్కరుణులు మొదలైన శీతలోదక జలాశయములను త్రవ్వించిన వారు బంగారు విమానముల మీద దివ్య ఘంటానాదము వినిపించుచుండగా ఛత్ర చామరాదులచే వీచబడుచు పోవుదురు. ఈ లోకమందు దేవాలయములు సువర్ణ రత్న మయములుగా నిర్మించినవారు వాయువేగములైన విమానములలో లోకపాలురతో ఏగుదురు. మంచినీళ్ళిచ్చిన వారు దారుమయ పాదులు పీఠములు ఆసనములు ఇచ్చిన వారు సుఖముగ స్వర్ణమణి పీఠమందు గూర్చుండి విమానములలో ఏగుదురు. పుష్పోద్యానములు పండ్లతోటలు ప్రతిష్ఠించినవారు చల్లనిచెట్ల నీడలో దేవతాగానముల వినుచు ఏగుదురు. బంగారము వెండి పవడము ముత్యము దానమిచ్చిన వారు భూదాతలు సాలంకృత కన్యాదానము చేసినవారు సుగంధాగరు కర్పూరములను పుష్పములను ధూప ద్రవ్యములను ఒసంగినవారు సుగంధ లిప్తులై, సువేషులై, సుప్రభులై, సుభూషితులై, ధర్మపురము ఏగుదురు. దీప దానము చేసినవారు సూర్యసదృశమైన విమానములమీద దశదిశలు మెరయించుచు ఏగుదురు. గృహదానము చేసినవారు బంగారు గృహముల వసింతురు. జలకుంభములను కుండికలను కూజాలనిచ్చినవారు ఏనుగులమీద వెళ్ళెదరు. పాదా భ్యంగము. శిరోభ్యంగము చేయించినవారు, స్నానపానోదకములను ఇచ్చిన వారు జాతి గుఱ్ఱమునెక్కి వెళ్ళెదరు. మార్గాయాసమున వచ్చిన బ్రాహ్మణులను విశ్రమింపజేసిన

వారు చక్రవాక పక్షులు పూన్చిన వాహనముల ఏగుదురు. ఇంటికి వచ్చిన బ్రాహ్మణులకు స్వాగతము ఇచ్చి (దయచేయుడని గౌరవించి), సుఖాసనమిచ్చి, పూజించినవారు నమో బ్రహ్మణ్యదేవాయ (బ్రహ్మణ్యమూర్తియైన భూదేవునకు నమస్కారము) అని పాదములపై వ్రాలి నమస్కరించి పాపహరయను మంత్రముతో గోదానము చేసిన వారును సుఖ ప్రయాణము చేయుదురు. ద్విజభుక్త శేషము అనగా బ్రాహ్మణులకు భోజనము పెట్టిన తరువాత శేషించిన అమృతమను పేరుగల ఆహారము ప్రసాద రూపముగ ఆరగించిన వారు, దాంభిక వృత్తి అనృతము లేనివారు హంస విమానమున ఏగుదురు. మూడు రోజులు ఉపవాస ముండి నాల్గవ రోజున ఏకభుక్తముచేసిన వారు మూర్ఖత్వము డాంబికము లేనివారు నెమలి విమానములో ఏగుదురు. మూడు రోజుల కొకసారి వ్రతము పూని భోజనము చేయువారు గజ రథముల మీద ఏగుదురు. ఆరురోజుల కొక్కమారే శుచియై భోజనము చేసిన ఆతడు దేవేంద్రునట్లు ఏనుగును ఎక్కి వెళ్ళును. పక్షమున కొకతూరి భోజనము చేసినవారు పులులుపూన్చిన రథమున పోయెదరు. నెలరోజులు ఉపవాసము చేసినవారు గంధర్వ గానములు వినుచు విమానయానము చేయుదురు. విష్ణుభక్తి తాత్పర్యముతో నారాయణ పారాయణతతో ప్రాణము బాసినవాడు అగ్ని ప్రవేశము చేసినవాడు అగ్నివలె విలసించు రథమున పోవును. విష్ణు భక్తితో తనంతట తాను జలములో దిగి ప్రాణము వదలినవాడు, తన శరీరమును గ్రద్దలకు ఎరవెట్టినవాడు బంగారు విమానమున ఏగును. గోరక్షణకు స్త్రీ రక్షణ కొరకు ప్రాణమర్పించినవాడు దేవతా స్త్రీలు గొలువ సూర్యప్రభతో ఏగును. విష్ణు భక్తితో తీర్థయాత్ర చేసినవారు, యజ్ఞములు చేసినవారు ఇతరులకు ఎట్టి బాధయు కల్గింపనివారు భక్తితో సేవచేయు నౌకర్లను భరించినవారు ఓరిమిగల వారు సర్వ భూతదయ గలవారు అభయమిచ్చినవారు కామాది గుణములు లేనివారు చంద్ర ప్రకాశమైన విమానమున దేవ గంధర్వులు కొలువ యమపురికి ఏగుదురు. బ్రహ్మ విష్ణు శివ మూర్తులను భేదబుద్ధి లేకుండ పూజించినవారు సూర్య ప్రభములగు విమానముల చేయుదురు. సత్య శౌచములుగల్గి మాంసము తినని వారును సుఖముగ ఏగుదురు. భక్ష్య భోజ్యాదులందు మాంసముకంటె రుచికరమైన పదార్థములేదు. పరసుఖాభిలాషి దానిని తినగూడదు. మాంసము ముట్టనివాడు గో సహస్ర దానము చేసినవాడును సమానులే అని వేదవేత్తల కెల్ల శ్రేష్ఠుడైన బ్రహ్మ చెప్పినాడు. సర్వతీర్థ సేవనము సర్వయజ్ఞా చరణము వలన కల్గు పుణ్యమొక్క మాంసభక్షణ చేయ నందువలన కల్గును. దానవ్రత ధర్మపరులైన మహానుభావులు సూర్యకుమారుడైన ధర్మ ప్రభువుయొక్క నగరమునకు సుఖముగ ఏగుదురు.

అట్లువచ్చిన ధర్మాత్ములకు యముడు స్వయముగా స్వాగతముపల్కి పాద్యార్ఘ్యాసనాద్యుపచారములు చేసి సత్కరించును. మీరు ధన్యులు మహానుభావులు. మీ హితవేదియో తెలిసి పుణ్యముచేసినారు. ఇదిగో! దివ్యస్త్రీ భోగ భాజనమైన ఈ విమానమెక్కి సర్వకామ సమృద్ధమైన స్వర్గమునకు వెళ్ళుడు. మహాభోగములను అట అనుభవించి దానము పుణ్యము చెల్లిన తరువాత శేషించి ఏదైనను కొంచెము పాపమున్నయెడల దానినిక్కడ అనుభవింపుడు. పుణ్యఫలముగా సౌమ్యమైన మనస్సుతో తనకు తండ్రియైన యముని పితృదేవతా రూపమున దర్శింతురు. కావున ధర్మము భుక్తి ముక్తులను ఇచ్చునది అవశ్యము సేవింప వలసినది. ధర్మమువలననే అర్థ కామములు మోక్షముగూడ సిద్ధించును. ధర్మము తల్లి, తండ్రి, సోదరుడు దిక్కు. ధర్మము యజమానికి మిత్రుడు రక్షకుడు ధాత పోషకుడును. ధర్మము వలన అర్థము అర్థమువలన కామము కామమువలన సుఖభోగములు ధర్మము వలన సర్వోత్తమ ఐశ్వర్యము ధర్మమువలన స్వర్గగతి పరమగతియు ధర్మమును ఆచరించిన అది మహాభయమునుండి రక్షించును.

దేవత్వము భూదేవత్వము దాని వలననే లభించును. పూర్వపాపము నశించినపుడే జీవులకు ధర్మబుద్ధి కలుగును. వేలకొలది జన్మముల తరువాతగాని లభింపని మానుష్యమును పొందికూడ ధర్మమును ఆచరింపనివాడు దైవవంచితుడు. ధర్మ దూరులైన వారే నీచులు, దరిద్రులు, విరూపులు, రోగులు, నౌకరులు, మూర్ఖులు అగుదురు. దీర్ఘాయుష్మంతులు, శూరులు, పండితులు, భోగులు, ధనికులు, అరోగులు, సురూపులు అగువారు పూర్వము ధర్మము చేసినవారన్న మాట. ధర్మరతులు ఉత్తమగతి పొందుదురు. అధర్మరతులు పశుపక్ష్యాది యోనినందుదురు. నరక ధ్వంసియైన వాసుదేవుని సేవించు వ్రతముగలవారు కలలోగూడ కాలుని నరకములను చూడరు. ఆద్యంతములు లేని దేవుని దైత్య దానవ నాశకుని పరమేశ్వరుని అచ్యుతుని త్రికరణశుద్ధిగ శరణొందినవారిని యముడేమియు చేయజాలడు. నారాయణుని నమస్కరించువారు విష్ణు స్థానమందు మరియొక చోటునకు పోరు. వారికి యమదూతలు, యముడు, యమపురి, నరకములు కానిపింపవు. పొరపడి పెక్కు పాపములు చేసినవారుకూడ సర్వపాపహరుడగు హరిని నమస్కరించిరేని నరకమునకు పోరు. మౌఢ్యము చేతనైనను జనార్దనస్మరణ చేసినవారు శరీరమును విడిచి విష్ణు లోకమునకు పోదురు. పగచేనైనను ఒక్కతఱి హరినామము ఉచ్చరించిన చాలును శిశుపాలుడు అట్లు ముక్తిని పొందెను" అని లోమహర్షుడు చెప్పెను. (216)

సంసార చక్ర నిరూపణము

మునివరులు యమమార్గము నరకయాతనలను గురించి విని తిరిగి వ్యాసుని ఈ క్రింది సందేశమడిగిరి. "భగవంతుడా! సర్వ ధర్మజ్ఞా! సర్వశాస్త్ర విశారద! మానవునకు సహాయులు తండ్రియా? తాతయా? కొడుకా గురువా!జ్ఞాతులు బంధువర్గమా? మిత్ర వర్గమా? జనులు చనిపోయిన వాని శరీరము కట్టెను రాతిని వలె విసరి పారవేయుదురు కాని వాని వెంబడి పోవువాడెవ్వడు? అనగా వ్యాస దేవులు నరుడొక్కడే పుట్టును, ఒక్కడుగానే గిట్టును. ఒక్కడే దుర్గతిని దాటును. ఒక్కడే దుర్గతినందును. జీవుడు నిస్సహాయుడు. చచ్చిన శరీరమును నీవన్నట్లు పారవేసి బంధువులు కొలదిసేపుఏడ్చి వెనుదిరిగిపోవుదురు. వారు పారవేసిన ఆ జీవుని ధర్మమొక్కటే వెంబడించును. అందుచే ధర్మము అన్ని అవస్థ లందు అన్ని లోకములందు సహాయమగును కావున నరులు దానిని సేవింపవలయును. లోభ మోహముల వలన జాలివలన భయమువలన బహుశ్రుతుడు (పండితుడు) కూడ ఇతరుల కొరకు లోభవశుడై తప్పిదములు చేయును. బ్రతుకునకు ఫలము ధర్మము అర్థము కామము అను మూడు పురుషార్థములు. ధర్మము తప్పకుండ ఈ మూడు ఫల ములను పొంది తీరవలెను. అనవిని మునులిట్లనిరి. వ్యాసదేవా! నీ వలన పరమహితమైనది ధర్మ యుక్తమునైన వాక్యము విన్నాము. శరీరసిచయము అనగా శరీరనాశస్థితిని ఎఱుగ కోరెదము. మానవుల మృతశరీరము సూక్ష్మమై అవ్యక్త స్థితినంది కనబడని దైనప్పుడు దానిని ధర్మమెట్లు వెంబడించును? అనగా వ్యాసులు ఇట్లనిరి. భూమి వాయువు ఆకాశము నీరు జ్యోతి (తేజస్సు) అంతరంగము (మనస్సు) బుద్ధి అనునవి ఏకీభావమొంది ధర్మమును చూచును. అన్ని జీవులకు వారువారు చేయు పనులన్నిటికిని రేయింబవళ్లు సాక్షులై ఉందును. వీనితో పాటు ధర్మము జీవుని వెంట ఏగును. చర్మము, ఎముకలు, మాంసము, శుక్రము, రక్తము అనునవి ప్రాణముపోయిన వెంటనే శరీరమును విడిచిపెట్టును. అందువలన ధర్మపరుడు ఒక్కడే ఇహమందు పరమందు సుఖపడువాడు. ఇంకేమి తెలుపుదు"నన మునులు ఇట్లనిరి.

ధర్మమెట్లు వెంటబడునో తాము కనులగట్టినట్లు తెలిపినారు. ఇక రేతస్సు ఎట్లు ప్రవర్తించునో ఇదియు పిండోత్పత్తి క్రమమును తెలుపుమని ప్రార్థింప వ్యాసుడు ఇట్లనియె. ఓ విప్ర శ్రేష్ఠులార! శరీరమందున్న దేవతలు (ఆయా ఇంద్రియాధిష్ఠాన దేవతలు) అన్న మును ఆరగింతురు. వారు పృథివ్యప్తేజోవాయ్వాకాశములను పంచభూతములు మనస్సు స్వరూపమున ఉందురు. ఆ రూపమున పంచభూతములు మనస్సు తృప్తిపడ గానే పరి శుద్ధమైన రేతస్సు రూపొందును. దానివలన స్త్రీ పురుష సంయోగమున గర్భ మేర్పడును. ఇదంతయు మీకు ఎఱింగించితి ఇక ఏమివినవలతు" రనమునులు ఇట్లనిరి.

"ఎముకలు చర్మము మాంసమును విడిచి ఆ జీవాత్మ ఎక్కడ నిలచి సుఖ దుఃఖము లను అనుభవించును. "అది పురుషుడై పుట్టి ప్రవర్తించు రీతిని తెలుపుము అని ఋషుల దుగగా వ్యాసులు ఇట్లనిరి. "(జీవుడు) పంచభూత సమావేశమంది వానికి లోబడి ఉండును. వానితో విడివడి తిరిగి మఱొకగతికి ఏగును. భూత సంబంధము పొంది ప్రాణ ధారణము చేయును. అప్పుడు జీవరూపమున ఉన్న వీడు చేయు పుణ్య పాపములను పంచ భూతము లందు అంతర్యామి రూపమున ఉన్న దేవతలు గాంచు చుందురు. "మఱి యేమి విన నెంతురు?" అన మునులును ఇట్లనిరి. "చర్మాస్థి మాంసములను విడిచి ఆ భూతము లన్నింటిని విడిచి జీవుడు తనకుతానై సుఖదుఃఖములను అనుభవించును గద?" అనగా వ్యాసుడు, "జీవుడు కర్మ సంబంధము నంది రేతస్సును బొంది స్త్రీయొక్క పుష్పమును (ఆర్తవమును) పొంది జనించును. ఆ తరువాత యమభటుల వలన బాధలను చావును దుఃఖములను సంసార చక్ర పరిభ్రమణమును పొంది నానాక్లేశములకు వశుడగును. ఇహలోకమున ఆప్రాణి పుట్టినదిమొదలు మున్ను తాచేసిన పుణ్యము ధర్మము యొక్క ఫలము ఆశ్రయించి సుఖము అనుభవించును. పుట్టినదాదిగ ధర్మమునే సేవించిన యెడల పురుషుడై నిత్యమును సుఖించును. అనంతరము తాజేసిన అధర్మ ఫలమును అనుభ వించును. సుఖము తర్వాత దుఃఖమును పొందును. అధర్మ యుక్తుడు యమలోక మేగి మహాదుఃఖమొంది పశుపక్ష్యాదులందు పుట్టును. ఏయే కర్మము ఇక్కడ జేసి ఏయే యోని యందు మోహవశుడై పుట్టునో ఇపుడు వివరముగ వినుడు.

ఈ విషయము శాస్త్రములు ఇతిహాసాదులు వేదమునందును తెలుపబడినది. మర్త్య లోకము ఘోర యమలోకమునకు విషయమై యున్నది. ఈ లోకమందు దేవతుల్య ములు పుణ్యములగు స్థానములున్నవి. అవి పశుపక్ష్యాది జీవ భావమునకు భిన్నములు. బ్రహ్మలోకము వంటి దివ్యమైన యమమందిరమందు జీవుడు కర్మబద్ధుడై దుఃఖములను అనుభవించును. ఏయే స్వరూపమున ఏయే కర్మ ఫలమును పురుషుడందునో ఆయా ఘోరగతులను దెలిపెదను. నాల్గు వేదములు చదివి ద్విజుడు మోహము నొంది పతితుని వలన (కులభ్రష్టుని వలన) పరిగ్రహముచేసి (దానము పట్టి) గాడిదయై పుట్టును. గాడిద పదునైదేండ్లు బ్రతుకును. గాడిదై చచ్చి ఏడేండ్లు ఎద్దగును. ఎద్దుచచ్చి బ్రహ్మ రక్షస్సగును. అందుమూడేండ్లుండి బ్రాహ్మణుడగును. కులభ్రష్టునిచేత యజ్ఞము చేయించిన వాడు కృమి (పురుగు)గా పుట్టును. అందు పదునైదేండ్లుండి గాడిదయై ఐదేండ్లు, నక్కగా ఐదేండ్లు, కుక్కగా ఒక ఏడు ఉండి అటుపై మానవుడగును.

ఉపాధ్యాయునెడ బుద్ధిపూర్వముగ పాపము చేసిన శిష్యుడు మూడు జన్మములు ఇహలోకమున సంసారమందు కుములును. అవ్వల కుక్కగును. అటుపై పచ్చి మాంసము తిను జంతువై గాడిదయై చచ్చి నరకము అనుభవించి, అవ్వల బ్రాహ్మణ జన్మమెత్తును. ఏ శిష్యుడు గురుపత్నిని మనసుచేతనైన పొందునో వాడు అధర్మచిత్త సంస్కారముచే భయంకర సంసార దుఃఖితుడగును. కుక్కగా మూడేండ్లు జీవించి చచ్చి బ్రాహ్మణ జన్మమెత్తును. గురువు బుద్ధి పూర్వకముగ పుత్రుడట్లున్న శిష్యుని హనన మొనర్చినచో ఘాతుక మృత మగును. ఏ కొడుకు తల్లిని తండ్రిని అవమానించునో, వాడు తొలుత గాడిద అగును. పదేళ్లు అట్లుండి ఒక ఏడు కుంభీరమగును. ముసలి తల్లి దండ్రులు ఇద్దరు ఎవ్వనికి దుష్టులుగ దోచుదురో దారుణమైన ఆ అపధ్యానము వలన (పొరపాటు తలంపు వలన) వాడు గార్దభమగును. ఆ విధముగ రెండేడ్లు ఉండి వాడు పిల్లియై ఏడు నెలలుండును. తల్లి దండ్రులను గోలపెట్టినవాడు కోకిలయగును. వారిని కొట్టిన వాడు మూడేండ్లు శాత్వక(డేగ)మగును. అటుపై ఆఱు మాసములు వ్యాళమై(పామై) ఆ మీద మానవుడుగా పుట్టును. యజమాని అన్నము కాజేసినవాడు, రాజద్వేషుల అన్నము తిన్నవాడు కోతి అగును. పదేండ్లు అట్లుండి ఏడేండ్లు ఎలుక అగును. ఆఱు మాసములు కుక్కయై, అటుపిమ్మట మానవుడగును. అసూయాగ్రస్తుడు శార్ఙకము అగును. విశ్వాస ఘాతకుడు చేప అగును. ఎనిమిది ఏండ్లు అట్లుండి నాల్గు నెలలు మృగమగును. తరువాత మేక అగును. ఒక్క ఏడాదికి చచ్చి కీటకమై యా మీదమానుష జన్మమందును. ధాన్యములు యవలు దొంగిలించిన వాడు ఎలుక అగును. అటుపై చచ్చి పందియై రోగముచే చచ్చును. అటు తరువాత మూగ కుక్కయై ఐదేండ్లు ఉండి మానవుడగును. పరదార గమనము చేసినవాడు తోడేలగును. కుక్క నక్క గ్రద్ద పాము కంకము రాబందు కొంగయు అగును. ఏ పాపి సోదరుని భార్యను బలాత్కరించునో అతడు మగకోకిలై ఒక్కయేడుండును. స్నేహితుని యొక్క, గురువు యొక్క, రాజుయొక్క భార్యను కామించినవాడు పంది అగును. అయిదేండ్లు అట్లుండి కొంగయై మూడు నెలలు చీమయై ఒక నెల కీటకమై క్రిమియై పదునాల్గు నెలలుండి తరువాత మనుజుడగును. తొలుత కన్యనిత్తునని వాగ్దానముచేసి మఱొక్కనికిచ్చిన వాడు క్రిమియగును. పదమూడేండ్లు అట్లు బ్రతికి పాపము క్షయించి మనుజుడగును. దేవ పితృ కార్యములు చేయక వారికి తర్పణము చేయకున్నవాడు కాకియై నూరేండ్లు ఉండి ఆ మీదట కోడియగును. ఆ మీద ఒకనెల పామై నరజన్మ మందును. తండ్రితో సముడైన పెద్ద అన్నను తమ్ముని ఎవ్వడు అవమానించునో వాడు బెగ్గురు పక్షిగ పదేండ్లుండి జీవకము (చకోర పక్షి) అగును. తరువాత నరుడగును. వృషలుడు బ్రాహ్మణ స్త్రీని సంగమించి, కృమియై పందియై రోగముచే చచ్చును. అటుపై

కుక్కయై తుదకు నరుడగును. అపుడు సంతానముగని చచ్చి ఎలుక యగును. కృతఘ్నుడు (చేసిన మేలు మరచిన వాడు) యమలోకము ఏగి యమభటుల క్రౌర్యమునకు కుమిలి కుమిలి వారి దండాఘాతములకు ముద్గర శూరాగ్ని దండముల దెబ్బలకు గురియై ఘోర మైన అసిపత్ర వనమునందు (కత్తుల బోనున) కూటశాల్మలియను మిడమిడ కాలు ఇనుక మేటలంద నడిపింపబడి ఘోరయాతనలను అనుభవించి సంసారచక్ర పరిభ్రమణ మంది క్రిమి అగును. పదిహేను ఏండ్లు అట్లుండి అక్కడ కడుపువచ్చి అటనే చచ్చును. తరువాత అనేక గర్భములనంది తుదకు పశు పక్షి జన్మమందు పెక్కేండ్లు అట్లుండి తాబేలగును. పెరుగు దొంగిలించిన కొంగ అగును. పచ్చిచేపలను హరించినవాడు తేనెటీగ అగును. పండు మూలకము (ముల్లంగి), అప్పము దొంగిలించినవాడు చీమ అగును.

పాయసపు దొంగ తిత్తిరి (తీతువు) పక్షి అగును. పిండితో జేసిన అప్పచ్చిని అపహరించినవాడు గ్రుడ్ల గూబ అగును. మంచినీళ్లు హరించిన కాకియగును. కంచు దొంగిలించిన హారితము (పచ్చపిట్ట) అగును. వెండిగిన్నె కాజేసిన పావురమగును. బంగారు బిందెను హరించిన క్రిమి అగును. పట్టుబట్ట దొంగిలించినవాడు కురరము (టిట్టిభము-తీతువు పక్షి) అగును. పట్టు పురుగులను హరించినవాడు నర్తకుడు (నటకుడు) అగును. వస్త్ర సామాన్యమును హరించినవాడు చిలక అగును. నార పట్టుబట్ట హరించిన హంస జన్మము ఎత్తును. నూలుబట్ట హరించిప తీతువు పక్షి అగును. గొఱ్ఱె ఉన్నితో చకోరపక్షి అగును.

చందనాది సుగంధ వస్తువులు హరించినవాడు చుంచుగా పుట్టును. ఆ జన్మములో పదునైదు ఏండ్లుండి ఆపాపము క్షమింపజేసికొని మానవుడై జనించును. పాలు దొంగి లించినవాడు బలాక పక్షి (పెద్దకొక్కెర) యై పుట్టును.నూనె (నువ్వులనూనె) హరించిన గబ్బిలము (తైలముంద్రావు) జంతువగును. అర్థము కొఱకు (డబ్బుకొఱకు) చేతిలో ఆయుధము లేని వాని సాయుధుడై కొట్టినవాని(చంపినవాడు)గాడిదయగును. ఆ జన్మలో రెండేండ్లు బ్రతికి చివరకు ఆయుధముచే నరకబడును. అట్లుచచ్చి వాడు మృగముగా పుట్టి నిరంతర ఆందోళనముతో ఉండును. ఒక్క ఏడాది తర్వాత వాడు ఆయుధపు దెబ్బ తిని కూలును. ఆమీద వాడే వలలో తగుల్కొన్న చేపయై నాల్గవనెలలో అడవి జంతు వగును. పదేండ్లు అట్లుండి పులిజన్మ మెత్తి అయిదేండ్లు ఉండి మరణించి, అధర్మ క్షయమై మనుజుడగును.

వాద్యమును హరించినవాడు గొఱ్ఱె అగును. పిండితో కూడిన అన్నమును (ఆహారమును) దొంగిలించినవాడు బఱ్రునటువు (ముంగి పింగళ వర్ణముగల వేండ్రుకలు గలది) అను దారుణమైన మూషికముగా పుట్టును. అట్టిది మనుజులను నిత్యము కఱచుచుండును. నేతిని హరించినవాడు నీరుకాకియగును. చేపమాంసము దొంగిలించిన కాకియగును.

ఉప్పు దొంగిలించిన చిరికాకము అగును. (చెముడుకాకి బొంతకాకి మొదలగు వానిలో రకము). తనపై విశ్వాసము (నమ్మకము) కల్గి ఉన్నవానిని మోసగించినవాడు చేపయైపుట్టి మనుజుడగును. అప్పుడు ఆయుర్దాయం తక్కువై ఉండును. నరుడు పాపములుచేసి పశుపక్ష్యాది జన్మము లందును. తన తాహతేదో ధర్మమేదో వాడెరుగలేడు. అట్టివారు వ్రతదూరులై వ్యాధిగ్రస్తులై దుఃఖితులు అగుచుందురు. ఒడలిపై బట్టకూడ లేకుండ మ్లేచ్ఛులై పాపులై లోభ మోహాది వశులై పుట్టుదురు. (మ్లేచ్ఛుడు అనార్యుడు గోమాంస భక్షకుడు, అపశబ్దములు భాషించువాడు, శిష్టాచారరహితమగు కామరూపాది దేశముల ఉండు వాడు) పుట్టిన నాటి నుండి ఎవ్వరు పాపములను విడిచె దరో, వారు ఆరోగ్యవంతులు, ఐశ్వర్యవంతులు, రూపవంతులు అగుదురు. ఈ చెప్పిన కల్పము ప్రకారము స్త్రీలుకూడ ఆయా పాప ఫలములందుదురు. అట్టి పాపాత్ములకే భార్యలగుదురు. ఇంతవరకు విశేషించి ఆయా వస్తువుల దొంగతనము వలని దోషములు తెలుపబడినవి. ఇది లేశమాత్రముగ మీకెఱింగించితిని. వాటి యొక్క కథా సందర్భమందు ఓ ద్విజులారా! ఇంకను విశేషముగ విందురుగాక! నేను దీనిని బ్రహ్మ దేవర్షులకు తెలుపు సమయమున వింటిని. అది విన్నది విన్నట్లు మీకు తెలిపితిని. అనగా అది విని మునివరులార! మీరు మనస్సును ధర్మమునందు నిలుపుడు" అని పలికెను. (217)

అన్నదాన ప్రశంస

మునులు అనిరి –

నీవు అధర్మమువలన గలుగు గతులను గూర్చి తెల్పితివి. ధర్మగతుల గూర్చి వినగోరెదము. ఏ పనిచేసి అశుభగతిని పొందునో దేనిచే శుభగతినందునో ఆనతిమ్ము అన వ్యాసుడు ఇట్లు అనెను. పాపపు పనులను ధర్మపరుడై విపరీత మనస్సుతో చేసినవాడు నరక మందును. పొరబడి అధర్మము చేసి పశ్చాత్తాపబడి మనస్సును కుదుట పరచు కొన్నవాడు పాపమును అనుభవింపడు. ఎంతెంత వరకు వాని మనస్సు దుష్కర్మమును గర్హించునో అంతంతవరకు వాని ఉపాధి (శరీరము) అధర్మమునుండి విడివడును. చేసిన తప్పును ధర్మవాదులగు విప్రులకు తెల్పిన ఎడల అధర్మమువలన చేసిన అపరాధము నుండి వేగముగ ముక్తుడగును. మానవుడు తానుచేసిన తప్పిదమును మనసు సమాధాన పరచు కొని నలుగురలో వెల్లడించుకొన్నకొలది అతడు దానినుండి విడివడును. పాము కుబుసమును విడిచినట్లు పూర్వము అనుభవించిన పాప ఫలముల నుండి విమోచన మందును. మనస్సమాధితో విప్రునికి వివిధ దానములు చేసిన అతడు సుగతినందును.

మానవుడు పాపము ఆచరించియు తత్ఫలము అనుభవింపకుండుటకు చేయవలసిన దానములను తెల్పెదను వినుడు.

అన్ని దానముల కంటె అన్నదానము మిన్న. ధర్మాపేక్ష కలవాడు వక్రముగాని బుద్ధితో సర్వాన్న దానము చేయనగును. మనుజులకు ప్రాణము అన్నము గదా! అన్నము వలననే జీవుడు పుట్టును. లోకము అన్నము నందు ప్రతిష్ఠతములై ఉన్నవి. (బ్రతుకంతయు అన్నముమీద ఆధారపడి ఉన్నదన్నమాట!) అందువలన అన్నము ప్రశంసార్హమగును. దేవర్షి పితృ మానవులు అన్నమునే మెచ్చుకొందురు. అన్నదానముచే స్వర్గమందును. ఎంతలభించునో అంత అన్నము ద్విజులకు పెట్టవలెను. నిండు మనసుతో వేదాధ్యయన సంపన్నులగు బ్రాహ్మణులకు అన్నదానము చేయవలెను. ఒక్కమారైన పది మంది బ్రాహ్మణులు ఎవ్వడు పెట్టిన అన్నము ఆరగింతురో మనస్ఫూర్తిగా అట్లు పెట్టినవాడు పశుపక్ష్యాది జన్మము లెత్తడు. పదివేల మంది బ్రాహ్మణులకు అన్న సంతర్పణము గావించినాతడు మున్ను పాపరహితుడై చేసిన అధర్మము నుండి విముక్తి నందును. వేదములు చదివి భిక్షాటనము చేసికొని తెచ్చిన అన్నమును వేదవేత్తయగు విప్రునికి పెట్టినవాడు ఇహలోకమున సుఖాభి వృద్ధినందును. క్షత్రియుడు బ్రాహ్మణ ద్రవ్యమునకు హానిచేయక న్యాయ పరిపాలన చేయుచు సుసమాహిత మనస్కుడై, వేదవిదులయిన ద్విజులకు బలాత్కారముగ లభించిన అన్నమును దానము చేసిన ఎడల ఈతడు ధర్మాత్ముడై రాజసముచే చేసిన దుష్కర్మను ఎడబాపుకొనును. కృషి (వ్యవసాయము) చేసి వైశ్యుడు ఆర్జించుకొన్న ద్రవ్యము ఆరవ వంతుగ పరి శుద్ధమైన దానిని ద్విజులకు దానముచేసిన పాపవిముక్తుడగును. శూద్రులు ద్విజాతులకు అన్నదానముచేసి పాప ముక్తుడగును. ప్రాణములిక పోవునన్న సమయమున శూద్రుడు కర్కశుడై (కఠినుడై) సంపాదించిన అన్నమును కన్న కొడుకుచేత కూడబెట్టించి అన్నము విప్రులకు పెట్టినవాడు దుర్గమున (కడవరాని కష్టముల) దాటును. న్యాయార్జితమైన అన్నమును ఆనందముతో వేదవృద్ధులైన విప్రులకు విందుచేసిన వాడు పాపమును పోగొట్టుకొనును. అన్నము లోకమందు ఊర్జస్కరము. కావున దానిని పెట్టినవాడు ఊర్జస్వి అగును. సత్పురుషులు ఏగిన దారినేగినవాడు సర్వపాపవిముక్తుడగును. దానిచే ధర్మము ఎఱింగిన వారు ఏర్పరచిన దారిని బుద్ధిమంతులు పోవుదురు. అందులోగూడ అన్నదాతలు ఉత్తములు. వారి వలననే సనాతన ధర్మము నిలుచును.

అందువలన అన్నదానము న్యాయము తప్పకుండ చేయవలసినది. ఏ గృహస్థు ముందు ప్రాణాహుతులు చేసి అన్నము ఆరగించునో ఎవ్వడు అన్నదానముచే రోజును సార్థకమైనదానిని గావించునో, నిత్యము వేదవిదులను ధర్మవేత్తలను ఇతిహాసపురాణ

విదులను నూరు మందిని విందు ఆరగింపజేయునో, అతడు ఘోరనరకము పాలుగాడు. సంసారమునంబడడు. చనిపోయియు అతడు సర్వకామ్య సాఫల్యమంది సుఖమందును. ఇట్లు సత్కర్మ సమన్వితుడై ఏ బాధలు లేకుండ ఆనందపడును. చక్కనివాడు కీర్తిశాలి ధనవంతుడునై మరుజన్మ మందును. మీకు ఇట్లు అన్నదాన మహాఫల మంతయు దెలిపితిని. సర్వధర్మములకు దానములకును మూలమిదియే" అని తెల్పెను. (218)

శ్రాద్ధవిధి వర్ణనం

అప్పుడు మునులు అనిరి –

"పరలోకమునకేగి తమ కర్మానుగుణమయిన స్థానమందున్నవారికి కొడుకులు మఱియు వారి బంధువులు శ్రాద్ధ మెట్లు పెట్టవలయును" అనగా వ్యాస భగవానుడు ఇట్లనియె. "జగన్నాథునికి వరాహమూర్తికి నమస్కరించి తెలుపుచున్నాను. కల్పమును వినుడు. మున్న కోకాజలధి అందు మునిగిపోయిన పితరులను వరాహమూర్తియైన ప్రభువు శ్రాద్ధము గావించి ఉద్ధరించెనను అనగా మునులు అదెట్లు జరిగెనో ఆనతిమ్ము" న వ్యాసుడు ఇట్లు అనియె.

"త్రేతా ద్వాపర యుగసంధిలో మున్ను మేరుగిరి మీద దివ్యులు మానుషులు అయిన పితరులు విశ్వేదేవులతో వసించిరి. (పితరులకు దేవత్వము మనుష్యత్వము అను రెండు ధర్మములు గలవని శాస్త్రములు తెలుపుచున్నవి. కావున పితృపతియైన యమునికి నరక చతుర్దశి నాడు చేయవలసిన తర్పణము దేవతగా భావించి సవ్యముగానూ మనుష్యత్వమును భావించి ప్రాచీన రీతిగానూ చేయవచ్చునని ధర్మశాస్త్రములు తెలుపుచున్నవి.) అచట వారు కూరుచున్న తఱి సోముని కూతురు కాంతిమతియను దేవకన్య ప్రాంజలియై వారి ఎదుట నిలిచెను. వారు కళ్యాణి! నీవెవ్వతెవు. నీకు ప్రభువెవ్వడు? తెలుపుమనిరి. "నేను చంద్రకళను. మీకు ఇష్టమగునేని మిమ్ము నా ప్రభువులుగా వర్తించుచున్నాను. నా మొదటి పేరు 'ఊర్జ' ఆ పైని 'స్వధ' యను పేరున పిలువబడుచున్నాను. ఇప్పుడే మీరు 'కోక' అను పేర పిల్చినారు అని పలికెను. అంతట పితరులు ఆమె పలుకులు విని ఆమె మోము వంక చూచి తృప్తి చెందరైరి. (మోహపడి రన్నమాట) ఆ కన్యను ఊరక చూచుచు తనివి చెందక, యోగభ్రష్ట లైనారని ఎరిగి విశ్వేదేవులు ఆ పితరులు అను వారిని వదలిపెట్టి స్వర్గమునకు పోయిరి.

చంద్రభగవానుడు తన కూతురు ఊర్జను ఇంట గానక కలతవడిన మనస్సుతో ఎటుపోయినదని ఆలోచించెను. ఆ సమాధిలో అతడామె కామముతో పితరులకడకు ఏగెనని వారిచే హృదయపూర్వకముగా ఆమె స్వీకరింపబడినదనియు తపోబలమున

ఎఱింగెను. అంత గినుకగొని శశాంకుడు యోగభ్రష్ములై మనస్సు స్థాయిచెడి తండ్రి హద్దులోనున్న సాధ్వి! తెలియకుండ అట్టి కన్యను హరించితిరి గావున మీరు క్రింద బడుదురుగాక అని శపించెను. ఈ నా కూతురును స్వతంత్రురాలై ధర్మము విడిచి భరించి నందున కోకయను పేర హిమాద్రిపై ఒక నది అగుగాక అనెను. ఇట్లు శప్తులైన పితృదేవతలు యోగ భ్రష్ములై, హిమగిరి మొదటపడిరి. ఊర్జయు అక్కడనే హిమగిరి ప్రస్థమందు పడి సప్తసాముద్రమమ తీర్థమను చేరి కోకయనుపేర నూరు తీర్థములతో హిమగిరి శిఖరమును తడుపుచు అర్పణము చేయుటవలన (ప్రవహించుట వలన) సరిత్తు (నది) అనుపేరందెను. యోగమందిన పితరులు చల్లని నీటితోనున్న ఆ మహానదిని చూచిరి. కాని అది చంద్రుని కూతురగు ఊర్జయే అని ఎఱుంగరైరి. అంతట, పితరులను ఆకలిచే కుములుచున్నట్లు చూచి ఒక రేగు వృక్షమును, మధుక్షీరమును ఒసంగు ఒక ఆవును ఒసంగెను. దివ్యమైన క్షీరము కోకానది జలము రేగువండు అను నీ యాహారము పితృ దేవతల పోషణమునను నిరూపింపబడినది. ఆ విధమైన వృత్తితో (ఆహారాదుల సేవనముతో) జీవించుచున్న పితరులకు వేల యేండ్లు ఒక్క దినమువలె గడచెను.

ఈ విధముగా లోకమెల్ల పితృశూన్యమై స్వధాకారము వినిపింప అంతట దైత్యులు రాక్షసులు యాతుధానులు బలవంతులైరి. వారు విజృంభించి విశ్వేదేవులతో విడివడిన పితృగణములపై నలువైపుల నుండి వచ్చిపడిరి. అదిచూచి పితరులు రోషముగొని కోకానది ఒడ్డున ఉన్న ఒక రాతి నెత్తిపట్టుకొనిరి. ఆ రాయి తొలగగానే ఆనది వేగము ఎక్కువై నీటిచే పితరులను హిమాలయమును కూడ ముంచెత్తెను. పితరులంతర్హితులైనంతట రాక్షసులు తాండ్రచెట్టునెక్కి నిరాహారులై దాగికొనిరి. పితృదేవతలు నీటివెల్లువకు వంతచెంది ఆకట నకనకంబడి ఆనీటనే ఉండి విష్ణుని శరణొందిరి.

గోవింద! నీవు జయింపుము. జగన్నివాస! ఓ కేశవ నీదయచే మాకును జయమగు గాక! అప్రతిహత ప్రతాపుడవు. మమ్ము ఈ నీట మునిగిన వారిని ఉద్ధరింపుము. దారుణా కారులైన ఆరాక్షసులకు జడిసిపోవుచున్న మమ్ము ఓ వరాహమూర్తీ! రక్షింపుము. నీపుణ్య నామములు సంకీర్తనము చేసినంత రాక్షసులు భూత ప్రేత పిశాచాదులు నశింతురు. ధర్మాది పురుషార్థములు సిద్ధించును" అని ఇట్లు స్తుతింప విని తన దివ్యమూర్తిని చూపి కోకానది ముఖమందు నీటమునిగి తలపై రాతిని ధరించి యున్న పితృగణమును చూచెను. అంతట వరాహమూర్తియై హరి పితృగణమును ఉద్ధరింప సంకల్పించెను. తన కోఅచేగొట్టి ఎత్తి ఆరాతిని విసరివైచెను. పితరుల నీటి నుండియె మీదికి ఆకర్షించెను. ఆ దివ్య వరాహము కోరయందున్న పితరులు బంగారమ్మట్లు మెఱయుచు, విష్ణునిచే భయముక్తులైరి,

అట్లు వారినెత్తి విష్ణు తీర్థమని పేరందిన ఆ తావున హరి వారిని లోహార్గలము నందలి జలమును ద్రావనిచ్చెను. ఆవల తన రోమముల నుండి పుట్టిన దర్భలను చెమట నుండి పుట్టిన నువ్వులను జేకొని కొఅకంచు ఒకదానిని సూర్య సమానప్రభనుగ కల్పించి ఒక పాత్రను తీర్థముగా రూపొందించి కోటివటము క్రింద నిలువబడి గంగాధరమను తీర్థ మందలి ఉదకమును తుంగ కూటమునుండి గైకొని యజ్ఞియములైన ఓషధులను మధుక్షీర రసములను గంధములను పువ్వులను గంధధూప దీపాదులను జేకొని సరస్సు నుండి ధేనువును సముద్రము నుండి రత్నములను గైకొని భూమిని కోరచే గీసి నీటం దడిపి భూమిని కుశలచే గీసి కొఅవిని దానిచుట్టు ద్రిప్పి మఱలమఱల నీరుప్రోక్షించి శిరోకూపము లందు ఉండి ప్రాగగ్రములైన (తూర్పు వైపు కొసలుగా నున్న) కుశలను గ్రహించి ఋషులను ఆహ్వానించి పితృ తర్పణము జేయుదుననెను. వారును చేయుమా అన ప్రభువు విశ్వే దేవులను పిల్చి సమంత్రకముగ వారికి విష్టరముల (ఆసనముల)ను ఒసంగి అక్షతలచే దేవతా రక్షచేసెను. సర్వ దేవతల అంశలతో బుట్టిన అక్షతలు ఓషధులు అన్నిదిశల అంతట రక్షణ ఇచ్చుటకు కల్పింపబడినవి. దేవ దానవ దైత్య యక్ష రాక్షసుల చరాచర మందెక్కడును వానికి క్షయము ఎవ్వరు కల్పింపజాలరు. కావున వానికి అక్షతములు అనుపేరు ఏర్పడినది. మున్ను విష్ణువు దేవతా రక్షణ కొరకే అక్షతల నేర్పరచెను. కుశలు గంధము యవలు పువ్వులచే అర్ఘ్యమొసంగి వరాహమూర్తి విశ్వేదేవులను ఇట్లు అడిగెను.

దివ్యులు మనుష్యులునుగూడ అయిన పితరులను ఆహ్వానించుచున్నాను అనెను. వారు పిలువుమన వారిని శుచియై పిలిచెను. నువ్వులతో మొదళ్ళు చివరలు కూర్చిన దర్భలను మోకాలిపై హస్తమానించి సవ్యముగ ఆసన మొసంగెను. అదేవిధముగ పితరులను పితృ స్థానమందున్న విప్రులకు 'ఆయాంతు' అను మంత్రము చెప్పుచు ఆహ్వానించెను. 'అపహత' అను మంత్రముచే అపసవ్యముగ అసురాదుల వలన రక్షణనిచ్చి పితరుల నామ గోత్రములతో 'తత్పితరో మనోజరానావా ఆగచ్ఛత' అను మంత్రము కూడ చెప్పుచు అవాహనము చేసెను. 'సంవత్సరైః' అను మంత్రముచే అర్ఘ్యమిచ్చెను. 'యాస్తిష్ఠంత్యమృతా వాచోయన్మ అని యన్మే పితామహ' అని తండ్రికి ప్రితామహునికి 'యన్మే ప్రపితామహ' అని ప్రపితామహునికి కుశ గంధపుష్ప తిల మిశ్రమైన అర్ఘ్యమును అపసవ్యముగ ఇచ్చెను. అట్లే మాతామహులకును విష్ణువు పొనరించెను. ఇట్లు గంధాదులచే అర్చించి ధూపదీపము లొసంగి 'ఆదిత్యా వసవోరుద్రా' అను మంత్రముతో నెయ్యి, నువ్వులు, దర్భలతో అన్నమును పాత్రయందలి అవ్వల మునులను చూచి 'అగ్నౌకరిష్యే' అని పలికి వారు కురుష్వ (చేయుము) అని ప్రేరణ ఈయ సోమునికి అగ్నికిని యమునికిని మూడు ఆహుతులు

ఇచ్చెను. 'యేమామకేతి' అను యజుర్మంత్ర సప్తకము జపించి హోమశిష్టమును నామ గోత్రములతో ఒక్కొక్కసారి మూడేసి ఆహుతులుగా పితృ స్థానమందు ఒసంగెను. ఇందు మిగిలిన అన్నమును పిండ పాత్ర యందుంచెను.

ఆ మీదట పరిశుద్ధము, (ప్రత్యగ్రము) ఒకేసారి ఉడికినది, నిలువ ఉండనిది, కూరలు తక్కువ పండ్లెక్కువయునై ఆఱు రసములు గల్గి అమృతోపమానమైన అన్నమును, బ్రాహ్మ ణుల కారగింప చేసి పిండపాత్ర అందు గూడ వడ్డించి మంత్రముతో నేయి తేనెయుంగూర్చి 'పృథివీ' అనియు 'మధువాత' అను ఋగ్వేద మంత్రమును పఠించెను. భోజనము చేసిన తర్వాత బ్రాహ్మణులకు ఐదు మంత్రములు 'యత్తే' అను ఋక్కుతో ఆరంభించి 'నాధికం' అను సమాప్తి మంత్రము వరకును జపించెను. త్రిమధు త్రిసుపర్ణ మంత్రములను బృహ దారణ్యకమును మఱియు జపింపవలసిన సౌరసూక్త పురుష సూక్తములను గూడ జపిం చెను. విప్రులు భోజనము చేసిన తర్వాత 'తృప్తాస్థ' (మీరు తృప్తులైనారా?) అని అడిగి వారు 'తృప్తాస్మ' (తృప్తులమైనాము) అని అన్న తర్వాత అంతవరకు మౌనముతో భోజనము చేసిన బ్రాహ్మణులు మౌన విమోచనము చేయుటను సూచించు ఉత్తరాపోశన మొసంగెను. (219)

శ్రాద్ధ విధి వర్ణనం

మునులు శ్రాద్ధకల్పము ఎవరెవరికెప్పుడు ఆనతిచ్చిరో సవిస్తరముగ తెల్పుడు అనగా వ్యాస భగవానుడు ఇట్లు అనియె. "బ్రాహ్మణ క్షత్రియ వైశ్య కులములవారు తమ తమకు చెప్పబడిన విధానమున మంత్రపూర్వకముగ శ్రాద్ధము అనుష్ఠింపవలెను. స్త్రీలు మరి శూద్రాదులు బ్రాహ్మణులు చెప్పినట్లు అగ్ని హోత్రము లేకుండ అమంత్రకముగ శ్రాద్ధము పెట్టవలెను. పితృదేవతలను ఉద్దేశించి శ్రాద్ధము పెట్టవలసిన ప్రదేశములు; పుష్కరాది తీర్థములు, పుణ్యక్షేత్రములు, పర్వతశిఖరములు, పవిత్రనదులు, నదములు, సరస్సులు, నదీ సంగమములు, సముద్రతీరములు - ఇవి ముఖ్యములు. గోమయముతో అలికిన స్వగృహము నందు దివ్య వృక్షమూలములందు యజ్ఞార్థములైన మడుగుల యందు శ్రాద్ధము పెట్టుట ప్రశస్తము. కిరాత దేశములందు కళింగము, కొంకణము, కృమి, దశార్ణవము, కుమార్య దేశములందు, తంగణమను దేశమునందు క్రథమను దేశమునందు సముద్రము యొక్క ఉత్తర తీరమునందు (సింధునదీ ఉత్తర తీరమునందు) నర్మదానదీ దక్షిణ తీరములందు కరతోయ అనునదికి తూర్పు ప్రదేశమునందును శ్రాద్ధము పెట్టరాదు. ఇదే విధముగ నిత్య శ్రాద్ధ విధానము కూడ చెప్పబడినది. ప్రతి సంవత్సరము నైమిత్తికము కామ్యము అను శ్రాద్ధములు నిత్య శ్రాద్ధముతో పాటు నిర్వర్తింపవలెను. జాతకర్మాదుల

యందు వృద్ధి శ్రాద్ధము పెట్టవలెను. మంత్ర పూర్వకముగ శ్రాద్ధము పెట్టవలసిన వారు ద్విజులు అనగా (బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు) మాత్రమే. సూర్యుడు కన్యారాశిలో ఉన్నప్పుడు పదునైదు రోజులు శ్రాద్ధము పెట్టుటకు ఉత్తమములని చెప్పబడినవి.

శ్రాద్ధము పాడ్యమినాడు పెట్టిన ధనలాభము, విదియ పశుసంపద ఇచ్చును. తదియ పుత్రప్రదము. చతుర్ది శత్రు నాశకము. పంచమి ఐశ్వర్య ప్రదము. షష్టి లోక పూజ్యుని చేయును. సప్తమి గణాధిపత్యమును కూర్చును. అష్టమి జ్ఞానప్రదము. నవమి స్త్రీ లాభము కలిగించును. దశమి సర్వాభీష్టములను చేకూర్చును. ఏకాదశి సర్వవేద సంపన్నుని చేయును. ద్వాదశి జయకరము.త్రయోదశి సంతానాభివృద్ధి పశు సంపద మేధ స్వాతంత్ర్యము మంచి పుష్టిని దీర్ఘాయుర్దాయమును ఐశ్వర్యమును చేకూర్చును. ఇందు సందేహము లేదు. చతుర్దశి నాడు లభించినంత అన్నముతో శ్రద్ధతో శ్రాద్ధము పెట్టిన యెడల ఆయుధముల దెబ్బతిని చనిపోయినవారు యువకులుగ చనిపోయినవారు సంతృప్తిని పొందుదురు. అమావాస్య నాడు శ్రాద్ధము పెట్టిన, అతడు సర్వ కామములును బడసి స్వర్గము బడయును.

పితృదేవతలు సంప్రీతులు అగుటకు శ్రాద్ధములందు వినియోగింపవలసిన ద్రవ్యములను గురించి చెప్పెద వినుడు. హవిష్యాన్నముతో పితృ శ్రాద్ధము పెట్టిన ఎడల పితృ దేవతలకు నెల రోజులు తృప్తికలుగును. మత్స్య మాంసముచేత పితృ దేవతలు రెండు మాసములు తృప్తులగుదురు. లేడి మాంసము మూడు నెలలు పితృ దేవతలకు తృప్తి కలిగించును. శశ మాంసము (కుందేలు) నాలుగు మాసములు తృప్తిని కలిగించును. పక్షి మాంసము ఐదు నెలలు తృప్తినిచ్చును. శూకర మాంసము (పంది మాంసము) ఆరు మాసములు తృప్తిని ఇచ్చును. మేక మాంసము ఏడు నెలలు. ఖణేయము (నల్లని ఇట్టిది) ఎనిమిది మాసములును. రురు (దుప్పి) మాంసము తొమ్మిది నెలలు తృప్తిని కూర్చును. గోమాంసము పితృ దేవతలకు దశమాస తృప్తిని ఒసంగును. ఔరభ్రము (పొట్టేలు మాంసము) పదకొండు మాసముల తృప్తినిచ్చును. ఆవుపాలు గాని పాయసము గాని సంవత్సర తృప్తి కలిగించును. గండక పక్షి మాంసము, నెత్తురన్నము, కరివేపకూర తేనె ఎఱ్ఱమేక మాంసము అన్నము తన వంశీయులచే పెట్టబడినవి. అనంత తృప్తిని పుత్రులను కలుగజేయును.

గయా శ్రాద్ధము అనంతఫలము. బెల్లముతో కలిపి నువ్వులను శ్రాద్ధమందు ఉపయోగించిన విశేష ఫలమొసగును. తేనెకాని, తేనెతో కూడిన పదార్థముగాని పితృ దేవతలకు ఒసంగిన అక్షయఫల మొసగును. మా కులమందు పుట్టినవాడు మాకు జలాంజలులు ఒసగి (పితృ తర్పణములు చేసి) వర్ష ఋతువు నందు మాఘ ఫాల్గుణము లందు

తేనెతో కూడిన పాయసమును మాకు నివేదించునా అని పితృ దేవతలు ఉవ్విళ్ళూరుదురు. బహు పుత్ర సంతానము మాకు కావలయునని కోరుట అందరిలో ఏ ఒక్కడేని గయకు వెళ్ళునేమోఅని? గౌరీ (కన్యావివాహము చేయునా? దశ వర్ష) నీల వృషభోత్సర్జనము చేయునా? అని పితృ దేవతలు ఉబలాటపడుదురు. కృత్తికా నక్షత్రమందు శ్రాద్ధము పెట్టిన స్వర్గము నందును. రోహిణీ నక్షత్ర మందు పితృ శ్రాద్ధము సంతాన ప్రదము. సౌమ్యదేవతా (మృగశిర) నక్షత్రమునందు పెట్టిన శ్రాద్ధము మంచి తేజశ్శాలిని చేయును. ఆర్ద్రా నక్షత్ర శ్రాద్ధము శౌర్యవంతునిచేయును. పునర్వసు నక్షత్రము క్షేత్ర సందర్శన భాగ్యము నొసగును. పుష్యమి అక్షయధన మొసగును. ఆశ్లేష పూర్ణాయుర్దాయము ఇచ్చును. మఘ సంతానమును, పుష్టిని కూర్చును. పూర్వ ఫల్గుణీ నక్షత్రములు సౌభాగ్య ప్రదములు. ఉత్తర ఫల్గునియందు పెట్టిన శ్రాద్ధము సంతాన మొసగును. హస్తా నక్షత్రమందు శ్రాద్ధము పెట్టిన అతడు శాస్త్ర పారంగతుడగును. చిత్రా నక్షత్రము తేజస్సును, సంతానమును ఒసంగును. స్వాతి వ్యాపారమందు లాభము గూర్చును. విశాఖ పుత్ర ప్రదము. అనూరాధా నక్షత్రమందు పితృశ్రాద్ధమొనరించిన చక్రవర్తిత్వము ఒసంగును. జ్యేష్ఠ ఆధిపత్య మొసంగును. మూలా నక్షత్ర మారోగ్యప్రదము. పూర్వాషాఢ యశస్కరము. ఉత్తరాషాఢ శోకమును హరించును. శ్రవణము శుభలోక ప్రదము. ధనిష్ఠ ధన సమృద్ధిదము. అభిజిత్తు వేదవేత్తను గావించును. వారుణము (శతభిషము) వైద్యసిద్ధిని ఇచ్చును. పూర్వాభాద్ర మేకలమందను, ఉత్తరాభాద్ర గోసంపద ఒసంగును. రేవతి రజత సమృద్ధిదము. అశ్విని అశ్వసంపత్తి కూర్చును. భరణీ నక్షత్ర శ్రాద్ధము దీర్ఘాయుర్భాగ్యము ఇచ్చును. కావున కామ్యములయిన శ్రాద్ధములచే గూడ పితృ దేవతా సంప్రీతి కావింపవలయును.

కన్యా రవి (మహాలయ) ప్రశంస

సూర్యుడు కన్యారాశి యందున్నపుడు శ్రాద్ధము పెట్టిన ఏ యే కోరికలు కోరునో అవి అన్నియు నెరవేరును. వారాహ పురాణము నందు జెప్పబడినట్లు పౌర్ణమాసి యందు పితృ శ్రాద్ధము పెట్టినయెడల దివ్య భౌమ అంతరిక్షములకు స్థావర జంగమములకును సంబంధించిన సర్వ కామములను పొందుదురు. సూర్యుడు కన్యారాశియందున్నపుడు పితృదేవతలు పిండమును కోరుదురు. రవి కన్యారాశి యందున్న పదునాఱు రోజులందు పితరులకు పిండ ప్రదానము చేయుట సర్వ క్రతువులు చేయుటే అని నారాయణుడు పలికెను. రాజసూయాశ్వ మేధముల ఫలమును సూర్యుడు కన్యారాశి గతుడైనప్పుడు నీళ్లు ఆకుకూరలు దుంపలతో పెట్టిన శ్రాద్ధము వలన సుఖముల నందును.. ఉత్తర-హస్త నక్షత్రము

ళందు సూర్యుడు ఉన్నపుడు భక్తితో పితృ దేవతార్చనము చేసిన స్వర్గము సిద్ధించును. రవి హస్త యందు ప్రవేశించిన వృశ్చిక రాశి ప్రవేశము చేయుదాక పితృపురి శూన్యమై ఉండును. వృశ్చికమును గూడ రవి దాటిపోయిన తఱి పితృ దేవతలు దేవతలతోగూడ నిట్టూర్పుపుచ్చి తన కులమువారికి శాపమిచ్చి తిరిగి పోవుదురు. అష్టక లందు మన్వంతరములందు గ్రహణమందు వ్యతీపాతమందు రవి చంద్రసమాగమ మందు (అమావాస్యనాడు) జన్మనక్షత్రమందు గ్రహబాధలు గల్గినపుడు పెట్టు శ్రాద్ధము పార్వణ శ్రాద్ధమనబడును. రెండు అయనములందు రెండు విషువత్తులందు సంక్రాంతులందును యథావిధిగ శ్రాద్ధమున పెట్టవలెను. వీనిలో పిండ ప్రదాన నిర్వాపణములు అవసరము గావు. వైశాఖ శుక్ల తదియయందు కార్తిక నవమియందును సంక్రాంతి శ్రాద్ధ విధానమున పితరులను అర్చింపవలెను.భాద్రపద శుక్ల త్రయోదశి యందు మఘ యందు చంద్ర క్షయ పర్వమందు పాయసముతో శ్రాద్ధము పెట్టవలెను. అది దక్షిణాయన శ్రాద్ధ తుల్యము. వేదవేత్త శ్రోత్రియుడు నిత్యాగ్ని హోత్రియు నైన బ్రాహ్మణుడు ఇంటికి అరుదెంచెనేని ఆ ఒక్కనితోనే యథావిధిగ శ్రాద్ధము పెట్టవచ్చును. శాస్త్రీయమైన శ్రాద్ధీయ ద్రవ్య సంపద సమకూరినపుడు పార్వణ విధానమున పితృ శ్రాద్ధమును చేయవలెను.

తల్లి దండ్రులకు, సంతానములేని పినతండ్రులకు, పెద్ద అన్నకు ప్రతి సంవత్సరము విశ్వేదేవతలతోకూడ పితృదేవతలకు తద్దినము పెట్టవలెను. విశ్వేదేవులు లేకుండ ఏకోద్దిష్ట శ్రాద్ధము నందు దేవ పితృ స్థానములందు ఇద్దరు బ్రాహ్మణులను అర్చింపవలెను. ఇట్లే మాతామహాదులకును జరుపవలెను. ప్రేతీ భూతుడైన జీవునకు భూమిపై పిండమును జలమును తిలలతో కుశలతో జల సమీపమందు పెట్టవలెను. బ్రాహ్మణులు పదునొకండవ దినమునను, క్షత్రియులు పదుమూడవ దినమునను, వైశ్యులు పదునారవ దినమునను, శూద్రుడు ముప్పది ఒకటవ దినమునను శుద్ధులగుదురు. అనగా అశౌచమును విడుతురు. సూతకము తుదను గృహమందు పండ్రెండవ దినమందును మాస మందును త్రిపక్ష మందును ఏకోద్దిష్ట శ్రాద్ధము పెట్టవలెను. సంవత్సరము తుదదాక ప్రతినెల మాసికము పెట్టవలెను. ఆపైన సపిండీకరణము పార్వణ విధానమున జరుపవలెను. అప్పటి నుండి చనిపోయిన జీవుడు ప్రేతత్వమును విడిచి పితృ దేవతాత్వమును పొందును. పితృ దేవతలు అమూర్తులు మూర్తిమంతులు అని రెండు విధములుగా నుందురు. నాందీముఖులు అమూర్తులు. పార్వణులు మూర్తిమంతులు."

అటు పిమ్మట మునులు సపిండీకరణ విధానమును ఆనతిమ్మని అడుగగా వ్యాసుడు ఇట్లు చెప్పెను.

"సపిండీకరణము నందు విశ్వేదేవతలు ఆహ్వానింపబడరు. అందొకటే అర్ఘ్యమీయ వలెను. అగ్నౌకరణము ఉండదు. ఆవాహనముకూడ ఉండదు. బ్రాహ్మణులు బేసి సంఖ్యలో అర్చింపబడుదురు. ఆ సపిండీకరణ విధానమున మరొక విశేషము తెలిపెదను. తిల గంధోదకములచే కూడిన నాల్గు పాత్రములు ఉపయోగింపబడును. వానిలో పితరులకు మూడు ప్రేతకు ఒకటి. ప్రేత పాత్రమందలి అర్ఘ్యముచేత మిగిలిన మూడు పాత్రములను 'యేసమానాః' అనుమంత్రము జపించుచు ఉదకము చల్లవలెను. స్త్రీలకు గూడ ఈ ఏకోద్దిష్ట విధానమున జరుపవలెను. సంతానము లేని స్త్రీలకు సపిండీకరణము పెట్ట నవసరము లేదు. స్త్రీలకు, సంతానము లేనివారికి ఏకోద్దిష్ట విధానమున ప్రతి సంవత్సరము విధి విహితము. కొడుకులు లేని స్త్రీలకు జ్ఞాతులు, జ్ఞాతులు కూడ లేనపుడు సోదరులు శ్రాద్ధము పెట్టవలెను. మాతామహులకు దౌహిత్రుడు (కూతురి కొడుకు) ద్వ్యాముష్యాయణు లను పేర పిలువబడు మనుష్యులు మాతామహవర్గమును యథావిధిగ పూజింపవలెను. వారికి నిత్యశ్రాద్ధమేకాక నైమిత్తిక శ్రాద్ధములుకూడ దౌహిత్రుడు పెట్టవలెను. సర్వా భావమందు అనగా తద్దినము పెట్టువాడు లేనపుడు స్త్రీలు స్వయముగా మంత్రరహి తముగా శ్రాద్ధము పెట్టవలెను. ఏ దిక్కునులేని జీవులకు రాజు ఆయా జాతి పురుషులచే శవ వాహనము దగ్గరనుండి సకలకర్మలు జరిపింపవలెను. సర్వ వర్ణములకు రాజు బంధువు.

నిత్య నైమిత్తిక శ్రాద్ధ విధానము చెప్పెద వినుడు. నిత్య శ్రాద్ధము సపిండీకరణా నంతరము జరుపవలెను. అందు తండ్రికి పెట్టిన పిండము నుండి లేపము ప్రితామహుడు పొందును. వానికి పైన నాల్గవవాడును లేప భుజుడగును. అతడును తండ్రి తాత ముత్తాత అను ఈ ముగ్గురు పురుషులు పిండ భుక్కులు. మిగిలిన పై మూడు తరముల వారు పిండ లేప సంబంధులు. ఇట్లు పితృ పితామహ ప్రపితామహులు వారికి వెనుకటి మూడు తరములవారు యజమానుడు కలిసి మొత్తము వీరు ఏడుగురు. వీరి అన్యోన్య సంబంధము సాప్త పౌరుషము. యజమానికి పై వారిలో అనులేప భుక్కులు వాని కంటె ముందు అ కుటుంబమున పుట్టినవారును నరకమునకు ఏగినవారు పశు పక్ష్యాది జన్మలు ఎత్తిన వారు భూతాదులందు వ్యాపించి యున్నవారు. ఇందరకు యజమాని శ్రాద్ధము పెట్టి సంతృప్తి పరచును. అసంతృప్తిపరచుటలో అన్న ప్రకిరణము అన్నపు మెతుకులను చిమ్ముట అనుక్రియ చేయబడును. దానివలన పిశాచాది జన్మలందిన వారు తృప్తి పొందుదురు. స్నానము చేసిన వస్త్రమును విడిచిన నీటిచే వృక్ష జన్మ పొందినవారు తృప్తి పొందుదురు. భూమిమీద పడిన గంధోదక బిందువులచేత ఆ కులములో దేవత్వము పొందినవారికి ఆప్యాయనము కలుగును. పిండములు ఉద్ధరించిన తరువాత చల్లిన నీటి చినుకులచే

పశుపక్ష్యాది జన్మలెత్తిన వారికి తృప్తి కలుగును. దంతములు కూడ రాని బాలురు కర్మ బహిష్కృతు లైన వారు పితృ స్థానమందు సమ్మార్జనము చేసిన ఉదకము చేతను బ్రాహ్మణ పాద ప్రక్షాళనముచేసి ఉదకము పొందియు తృప్తి పొందుదురు. ఈ విధముగ యజమాని నిర్వర్తించిన శ్రాద్ధము నందు చిందిన నీరు చిమ్మిన అన్న విక్షేపము. అది శుచియైనను కాకున్నను దానినిపొంది ఆ కులమువారు ప్రస్తుతము అన్య యోనులందు పుట్టినవారు ఆప్యాయనము పొందెదరు. విధానమును అనుసరించి శ్రాద్ధము చేసినవారి పితరులు ఆప్యాయనముతో తృప్తిని పొందుదురు.

అన్యాయార్జిత విత్తములచేత పెట్టిన శ్రాద్ధము చండాల పుల్కసాది జాతులందు పుట్టిన వారికి తృప్తి కూర్చును. కనుక మానవుడు తుదకు ఆకు కూరతోనైన భక్తితో శ్రాద్ధము పెట్టిన యెడల వానికులమందు ఒక్కడును దుఃఖపడడు. ఆచారవంతులను నిత్యాగ్ని హోత్రులను జ్ఞానులను నిత్య శుచులను విశేషించి శ్రోత్రియులను భోక్తలనుగా నిమంత్రించి శ్రాద్ధము పెట్టుట ప్రశస్తమైన విషయము. త్రిణాచికేతుడు, త్రిమధువు, త్రిసుపర్ణుడు (నాచికేతాగ్ని విద్యను, త్రిమధు విద్యను, త్రిసువర్ణ విద్యను ఈ మూటిని అధ్యయనముచేసి వాని అర్థమును ఎరిగి ఆ అగ్నిచయనమును అనుష్ఠించినవారు) వేదాంగములను ఆరింటిని అధ్యయనము చేసినవారు మాతృపితృ భక్తులు మేనల్లుడు సామవేదము నెరిగినవారు యజ్ఞమున ఋత్విక్కుగా ఉండదగినవాడు తన పురోహితుడు తన ఆచార్యుడు ఉపాధ్యాయుడు-యజ్ఞమున జరుగు అన్ని క్రియా కలాపములలోను యజ్ఞమును జరుపుచు, జరిపించుచు అందరలోను మంచి చెడ్డలను పరిశీలించి చెప్పగల మహాపండితుడు-ఇట్టి వారిని భోక్తగా తీసికొనవలెను. మేనమామ తన భార్యకు, తండ్రి తన భార్యకు, సోదరుడు వియ్యంకుడు-ద్రోణపాఠకుడు-నాలుగు వందల గ్రామముల మొత్తములో ముఖ్య వేద పండితుడు, మండల బ్రాహ్మణుడు, ఒక మండలప్రదేశము మొత్తములో ప్రధాన వేద పండితుడు, పురాణములలోని తత్త్వ విషయములను ఎరిగినవాడు కూడని దానము గ్రహించనివాడు అకల్పుడు, దుస్సంకల్పములు లేనివాడు కల్ప సంతుష్టుడు, తన సత్సంకల్పము నెరవేరగనే సంతృప్తి పొందువాడు, ఇట్టి వారిని శ్రాద్ధము నందు భోక్తలుగ పెట్టవలెను. పంక్తి పావనులైన తాము ఏ పంక్తిలో కూర్చుండి భుజించెదరో ఆ పంక్తిలో భుజించిన వారందరును తమ శక్తిచే పవిత్రులను చేయగలవారు, అట్టి బ్రాహ్మణులను గూడ శ్రాద్ధమున భోజనమునకు పిలువవలెను. శ్రాద్ధమునకు ముందటి నాడే వీరిని పిలిచి కొని వచ్చి విశ్వేదేవ పిత్రస్థానము లందు కూర్చుండ బెట్టి అర్చింపవలెను. శ్రాద్ధము చేయు యజమానుడు కూడ వారితోపాటు మౌనాది నియమములను పూనవలయును.

శ్రాద్ధ భోజనము చేసినవాడు మైథునము సలిపిన యెడల వాని పితరులు ఆరేతస్సు నందు ఒక నెల పడియుందురు. స్త్రీని పొంది శ్రాద్ధమునందు బ్రాహ్మణుడుగ కూర్చుండి భోజనము చేసిన వాని పితృ దేవతలు రేతో మూత్రము ఆహారముగా గొని నెలరోజులు కుములుదురు. కావున చక్కగ తెలిసి ఉత్తముడైన బ్రాహ్మణులను నిమంత్రణము చేయవలయును. ఇది ప్రథమ కర్తవ్యము. తద్దినమునాడు స్త్రీ మైథునము చేసిన వారిని ఏమాత్రము నిమంత్రింపరాదు. ఉత్తమ బ్రాహ్మణుడు లభింపనపుడు భిక్షకొరకు వచ్చిన వారిని సరిగా ఆసమయమున ఇంటికి వచ్చిన యతులను యోగులను సాష్టాంగముగ మ్రొక్కి బ్రతిమాలి శ్రాద్ధమందు భోజనము పెట్టవలెను. పితృదేవతలు యోగము మీద ఆధారపడినవారు కావున వారి ప్రీతికి పూజింపవలసినవారు యోగులు వేయి మంది బ్రాహ్మణులకు ఒక్క యోగి సమానుడు. ఆతడు నీటిలో నౌకవలె యజమానిని భోక్తలను (పితృదేవతలను) తరింపచేయగలడు. ఈ విషయములో బ్రహ్మణాదులు గానముచేసిన పితృగాథల తాత్పర్యము ఇది.

పితృ గాథలు

ఐలుడను రాజును ఉద్దేశించి పితృదేవతలు ఇట్లు గానము చేసిరి. మా సంతతిలో పరమ శ్రేష్ఠుడు ఒక్క కుమారుడు కల్గునా? యోగుల భుక్త శేషాన్నము భూమిపై మాకు పిండములు పెట్టునా? లేదా గయయందు పిండదానము చేయునా? ఖడ్గ మృగ మాంసము హవిస్సు-పులుపుకారము చురుకు వస్తువులు లేని సాత్వికమైన ఆహారము-బలుసు కూర తిలలు ఆజ్యము కృసరము (పులగము) మాకు పెట్టునా? కొమ్ములు మాత్రము విడిచి, పాదము మొదలు శిరసుదాకగల ఖడ్గ మృగముల మాంసము త్రయోదశినాడు మఖా నక్షత్రమందు తేనె నెయ్యితో కలిపిన పాయసముతో దక్షిణాయనము నందు మాకు నివేదించునా? అని ఉబలాటపడుచుందురు. కావున భక్తితో పితృ దేవతలను అర్చించి సర్వాభీష్టములను బడయవలయును ఆ పితృప్రీతి వలన వసువులు, రుద్రులు, ఆదిత్యులు నక్షత్ర దేవతలు, గ్రహములు, తారాగ్రహములు పితృ శ్రాద్ధము వలన తృప్తులై, ఆయువును, సంతానమును, ధనమును, విద్యను, స్వర్గమును, మోక్షమును, పితృదేవత లొసంగుదురు. అపరాహ్ణకాలము నుండి పితృకాలము. అపుడు స్వాగతముచెప్పి పవిత్రపాణియై ఆచమించి అభ్యాగతుడైన ద్విజులను ఆసనములందు ఉపవిష్టులను జేయవలెను. శ్రాద్ధము పూర్తిచేసి ఉత్తమ ద్విజులకు భోజనముపెట్టి ప్రియ సంభాషణముల చేత ప్రణమిల్లి భక్తితో ద్వారము దాక అనుగమించి విసర్జించి వారి అనుమోదము పొందివచ్చి నిత్యక్రియా కలాపము పూర్తిచేసి కొని అతిథులకు భోజనము పెట్టవలెను. పితృదేవతలకు సంబంధించిన తర్పణాది

నిత్యక్రియలు అపుడే చేయవలయునని కొందరందురు. కాదని కొందరందురు. అవి వేరుగా చేయవలెను. కొందరు ముందే చేయవలెనని చెప్పుదురు. అటుపై యజమానుడు శ్రాద్ధాన్నమును తమవారితో పరివారముతో భుజింపవలెను. ఇట్లు ధర్మజ్ఞుడైన బ్రాహ్మణుడు బ్రాహ్మణులందరు సంతోషించునట్లు శ్రద్ధతో శ్రాద్ధము నిర్వహింపవలెను.

శ్రాద్ధ వర్జ్యములు

శ్రాద్ధమునందు భోక్తలుగా పెట్టతగని అధమ బ్రాహ్మణులను పేర్కొందును వినుడు. మిత్రద్రోహి, పుప్పిగోళ్ళవాడు, నపుంసకుడు, క్షయవ్యాధి, బొల్లికలవాడు, వాణిజ్యము చేయువాడు, గారపండ్లవాడు, బట్టతలవాడు, మెల్లకంటివాడు, గ్రుడ్డివాడు, చెవిటివాడు, మందబుద్ధి, మూగవాడు, కుంటివాడు, పీలచేయిగాని వంకరచేయిగాని కలవాడు, పౌరుష శక్తి లేనివాడు, చర్మవ్యాధి కలవాడు, అవయవములు తొలగింపబడినవాడు, ఓర, వంకర చూపుగల వాడు, కుష్ఠువ్యాధితుడు, ఎఱ్ఱని కండ్లవాడు, మరుగుజ్జు, పొట్టివాడు, వికటమైన ఆకారముగలవాడు, చురుకుదనములేనివాడు, మిత్రుని శత్రునిగా భావించువాడు, నీచ వంశమున పుట్టినవాడు, పశుపాలనచే జీవించువాడు, వెలివేయబడిన వాడు, పరివిత్తి (తమ్మునికి వివాహమైన తర్వాత తాను పెండ్లి చేసికొన్నవాడు) పరివేత్త (అన్నకంటె ముందుతాను పెండ్లాడిన తమ్ముడు) పరివేదిని కాసుతుడు (అన్న కంటె ముందు పెండ్లాడిన వాని భార్య కడుపున పుట్టిన కొడుకు) శూద్రస్త్రీని పెండ్లాడిన బ్రాహ్మణుడు, శూద్ర స్త్రీని పెండ్లాడిన బ్రాహ్మణునికి పుట్టిన కొడుకు ఇట్టి వారిని శ్రాద్ధమున భోక్తలుగా తీసికొన కూడదు. ఇట్టి శూద్రస్త్రీకి ఉపనయనాది సంస్కారములు జరిపించిన బ్రాహ్మణుడు పెండ్లాడనివాడు దిధిషూవతి (భర్త మరణించిన తరువాత మరల పెండ్లాడిన స్త్రీయొక్క భర్త) జీతము తీసికొని వేదాధ్యయనము చేయించువాడు జీతమిచ్చి వేదము నేర్చుకొనువాడు, సూతక అన్నముచే జీవించువాడు, వేటాడువాడు, సోమ రసమును, సోమలతను అమ్ము వాడు, అభిశస్తుడు (వేదాధ్యయనముచేసిన క్షత్రియుని వధచేసినపాపి), దొంగ, భ్రష్టుడు, వడ్డీ వ్యాపారముచే జీవించువాడు, మోసముచేసి జీవించువాడు, కొండెములు చెప్పువాడు, వేదాధ్యయనము దానము అగ్నిహోత్రము చేయక విడిచి కాఠిన్యము వహించినవాడు, రాజపురోహితుడు, రాజసేవకుడు, విద్యావిహీనుడు, ఇతరులమేలు ఓర్చనివాడు, పెద్దలను ద్వేషించువాడు, భరింపరాని దుష్టుడు, క్రూరుడు మూఢుడు, గుడిపూజారి, నక్షత్ర సూచకుడు (జాతక ఫలములు చెప్పి జీవించువాడు) పర్వకారుడు (రాతిపని చేయువాడు), లోకనింద పొందువాడు, యాగము చేయింపకూడని వారిచే యాగము చేయించినవాడు ఇట్టి వారిని శ్రాద్ధమున భోక్తలుగ గ్రహింపకూడదు.

పాత్రదానము పట్టువాడు, సత్పురుషులను అవమానించువాడుగా ఉన్న వారికి దైవము అప్పటికప్పుడు దారుణమైన దండనము విధించును. వీరు బహు నిషిద్ధులు. ఆగమ విహితుని విడిచి నీచునికి భోజనము పెట్టిన యజమాని, ధర్మమూలమునకే దూరుడై నశించును. తనతో తనను ఆశ్రయించి ఉండు బ్రాహ్మణుని విడిచి ఇంకొకనిని గొనివచ్చి భోజనము పెట్టినచో ఆ ఆశ్రయించుకొనిన బ్రాహ్మణుని నిట్టూర్పు నిప్పుచే దగ్ధుడై దాన నశించును. వస్త్రములేని క్రియ లేనే లేదు. యజ్ఞములు లేవు. వేదములు లేవు. తపస్సులు లేవు. కావున శ్రాద్ధకాలమందు పితృదేవతలకు వస్త్రములు తప్పక ఇచ్చి తీరవలెను. పట్టుపంచె పొత్తుపంచె నూలు వస్త్రము క్రొత్త దుకూలము శ్రాద్ధము నందు ఇచ్చినవాడు పరమ ఉత్తమాభిలాషలను బడయును.

ఆవులమందలో దూడ, ఎట్లు తమ తల్లి పొదుగునకే చేరునో శ్రాద్ధము నందు విప్రులకు పెట్టిన అన్నము ఆ జీవుని అట్లే పొందును. నామము గోత్రము మంత్రము అనునవి ఈ అన్నమును ఆయా స్థానములకు అందించును. ఆ కులమునందలి అందరకును తృప్తి కలుగును.

'దేవతలకు పితరులకు మహాయోగులకు నమస్కారము. స్వధాదేవికి స్వాహాదేవికి నమస్కారము. వీరందరు నిత్యము నాయందుందురు' అను ఈ మంత్రమును శ్రాద్ధము ముందు అవసానము నందు ముమ్మారులు జపింపవలెను. పిండ నిర్వహణ సమయమందు కూడ ఇట్లు జపింపవలెను. ఈ మంత్రమువలన పితృదేవతలు పరుగు పరుగున వత్తురు. రాక్షసులు పారిపోవుదురు. ముల్లోకములు తృప్తిచెందును. ఇది తరింపజేయును.

పిండములను అగ్ని యందుంచిన భోగసమృద్ధి కలుగును. భార్యకుపెట్టిన సంతానము కలుగును. మధ్య పిండము మాత్రమే ఇట్లు చేయవలెను. గోవులకు పెట్టినచో మంచి తేజస్సును బడయును. ఉదకములందువేసిన ప్రజ్ఞ, కీర్తి, యశస్సు కలుగును. దీర్ఘాయుర్దాయము కోరువాడు కాకులకు పెట్టవలెను. కుమారులను కోరువాడు, కోళ్ళకు పెట్టవలెను. కొందఱు పండితులు అగ్ర భాగమునుండి పిండములను ఎత్తవలె ననిరి. బ్రాహ్మణ అనుజ్ఞ పొంది పిండోద్ధరణము చేయవలెను. ఇది యథావిధిగ ఋషులు చెప్పిన శ్రాద్ధ విధానము. ఇంకొకలాగు చేసిన దోషము కలుగుటయే గాక పితృ దేవతలకు ముట్టదు. యవలు, వ్రీహులు, తిలలు, గోధుమలు, శనగలు, పెసలు, చామలు, ఆవాలు, నీవారము, హస్తి, శ్యామాకములు ప్రియంగులు సతూలిక ప్రసాతిక (అణువ్రీహి) ఇవి శ్రాద్ధ ప్రశస్తములు. మామిడికాయ, ఆమ్రాతకము, భిల్వము, దానిమ్మ, బీజపూరము, ప్రాచీనామలకము, పాలు, కొబ్బరి, పరూషకము, నారంగము (నారింజ), ఖర్జూరము, ద్రాక్ష,

నల్లవెల పొట్ల, ప్రియాలు (చారకర్కంధువు) ఐదరము (రేగు) వితంకతము (కానరేగు) వత్సకము (కొడిసెచెట్టు) కస్తాళువు, **వారకీము**, వీని పండ్లను శ్రాద్ధమునందు పెట్టవలెను. ఆవుపాలు, పెరుగు, నెయ్యి, **నువ్వులనూనె**, సైంధవ లవణము సముద్ర లవణము సారసము (సరోవర జలము) **వీనిని నివేదింపవలెను.** చందన అగురు కుంకుమాది సుగంధములను కాలశాకము (**కరివేము**) **జాజి, చంపకము**, లొద్దుగ, మల్ల, బాణ కుసుమము, బర్బరి, అశోకము, వృంతాశోకము, **అటరూశము**, మామిడి, తిలకము, తామరగంధ, సేఫాలిక, కుబ్జకము, తగరము, **అరణ్యమృగమనునొక జాతిపువ్వు**, మొగలి, యూధిక, అలిముక్తము, కమలము, **కుముదము**, పద్మము, పుండరీకము, ప్రయత్న పూర్వకముగ కొనివచ్చి పితరుల **అర్చింపవలెను.** నల్లకలువ ఎఱ్ఱకలువ కల్హారము (ఎర్ర తామర) కుష్టము మాంసి బాలకము, కుక్కుటి, జాతిపత్రకము (జాపత్రి), నశిక, ఉసీర, ముస్తములు, గ్రంధిపర్ణి మొదలైన పరిమళ ద్రవ్యములు పితృ ప్రీతికరములు. అగరు, గుగ్గులు, చందనము, శ్రీవాసము, మొదలగునవి పితృ యోగ్యములైన ధూపములు. ఋషి గుగ్గులము కూడ. **రాజమాషములు**, (బొబ్బరలు) శనగలు, మసూరములు, కోర దూషకములు, విప్రషములు, **మర్కటములు**, కోద్రవములు అనునివి పితృతిథియందు నిషిద్ధములు. గేదెపాలు, **పెరుగు**, **తాటిపండు**, జంబీరము, ఎర్రమారేడు పండు, శాల ఫలము నిషిద్ధములు. **చేప, వంది**, తాబేలు, ఆవు అనువాని మాంసములు మిక్కిలి వర్జ్యములు. పూతికము, మృగమాఖి, గోరోచనం, పద్మ చందనము, కాలేయకము, ఉగ్రగంధము, తురుష్కము, పాలంకము, వరుమ, చనుపత్రిక, కుమారి కిరాతము, పిండమూలికము, గ్రుంజనము, చుక్రిక, చుక్రము జీవ శతపుష్ప నాలిక, గంధశూకరము, హలభృత్యము, సర్షపము, నీరుల్లి, వెల్లుల్లి మానకందము, విషకందము, వజ్ర కందము, గదాస్థికము, పురుషాల్వము పిండాలువు నిషిద్ధములు. ఆనప తిక్తపర్ణ గుమ్మడి (త్రికటుకము) కరకలిండి ఉసిరికను వార్తాకము (వంకాయ) శివిజాతము. కాలీయము రక్తవాణ చిలికలకుచము విభీతకఫలము (తాంద్రము) ఆరనాలము. శుక్తము శీర్ణము పర్యుషితము ఉగ్రగంధము కోవిదారము (కాంచన వృక్షము) శిగ్రువు (ములగ) పనికిరావు. మిక్కిలి పులుపు పిచ్చిలము. సూక్ష్మము యాతయామము గతరనము, మద్య గంధము, ఇంగువచే ఉగ్రగంధమైన పదార్థములు, ఫణిశము, భూనింబము నింబము రాజికము కలింగదేశపు కుస్తుంబురువు (కొత్తిమిర) అమ్లకేతనము (పుల్ల ప్రబ్బ) నిషిద్ధములు. దానిమ్మ, మాగధి, నాగరము, ఆర్ద్రక తిత్తిడి, ఆమ్రాతకము, జీవకము, తుంబురువు అనునవి వినియోగింపవచ్చును. పాయసము, శాల్మలీ ముద్రములు (కజ్జికాయలు), మోచకాదులు, పానకము, తియ్య మామిడి పండ్లు, ఆవుపాలు ప్రశస్తములు. రుచిగల్గి స్నిగ్ధములుకొలది పులుపు కొలది

కారముగల పదార్థములు ప్రశస్తములు. కాఱుపులుపు, కాఱుప్పు, మిక్కిలి చేదు కారముగల ఆసురా హారములను దరికి చేరనీయరాదు. స్వాదువులై దైవభోజ్యము లయిన వానినే ఏర్పరు పవలెను. మేక, కార్తికపక్ష, తిత్తిరి, కుందేలు మున్నగువాని మాంసములు పెట్ట వచ్చును. వాఘ్రాణనము రక్త శివము శల్కముతో గూడిన లోహము సింహ తుండము ఖడ్గము అనునవి యోజ్యములు. రోహితమును (చేపను) హవ్య కవ్యములందు పెట్టవచ్చునని మనువు చెప్పెను.

ఈ శ్రాద్ధ కల్పము వారాహునిచేత తృష్టము దీనికి వారాహ శ్రాద్ధ కల్పమను ప్రసిద్ధి కలదు. ఇందు నిషిద్ధ పదార్థములను శ్రాద్ధములందు బ్రాహ్మణులకు పెట్టరాదు. తినరాదు. రోహితము, శూకరము, తాబేలు, ఉడుము మాంసము పనికిరాదు. చక్రవాకము, మద్గువు, (నీటికాకి), ఎముకలులేని చేపలు, ఎముకలేని కుర్రము (కురలపక్షి) కలవింకము (ఊరపిచ్చుక), నెమలి, భారాద్వాజపక్షి, శార్ఙకపక్షి, ముంగిస, గుడ్లగూబ, తిత్తిరిపక్షి, నక్క, పెద్దపులి, ఎలుగొడ్డు, తరక్షుపు ఈపదార్థములు పెట్టిన రౌరవ నరకము వచ్చును. అదిగాక స్వర్గమునందున్న పితృదేవతలను కూడ నరకమున పడవేయుదురు. కుసుంభ శాకము, జంబీరము, సిగ్రుకము, కోవిదారము, పిణ్యాకము (తెలక పిండి) విప్రుషము మసూరము. గుంజనము శణము కోద్రవము కోకిలాక్షము చక్రము కంబుకము పద్మకము చకోరము డేగ గుండ్రానపుకాయ తాళిని తాటుపండు ఇవి నరకప్రదములు. వానిని పెట్టిన యజమాని పితృ దేవతలతో పాటు పూయవహమను నరకమున బడును. వరాహ శ్రాద్ధకల్ప నిషిద్ధము లైన ఈ వస్తువులనుపెట్టి తినుటకంటె ఆత్మమాంస భక్షణముచేయుట మేలు. పొరపాటుచే తెలియక ఇవి పెట్టినను తిన్నను ప్రాయశ్చిత్తము చేసుకొనవలెను.

ప్రాయశ్చిత్తములు

పళ్ళు దుంపలు పాలు పెరుగు మజ్జిగ గో మూత్రము గంజి ఏడు రోజులు తీసుకొనినచో అభోజ్యాన్న భోజన దోషము పోవును. మరియొక విశేషము. విష్ణు భక్తుడు విధి విధానముగ ఇట్లు శ్రాద్ధము పెట్టి ఆ బ్రాహ్మ స్తంబ పర్యంతమైన జగత్తును సంప్రీతి నందించును.

మునులు-తండ్రి బ్రతికి ఉండగ తండ్రియొక్క తల్లి దండ్రులు పోయినపుడు చేయవలసిన విధానమేమన తండ్రి బ్రతికియుండి ఎవనికి తద్దినము పెట్టునో కొడుకు దానిని స్వయముగ పెట్టవలెను. లౌకిక వైదిక ధర్మములు రెండును దీనివలన లోపింపవు. (తండ్రి తన తండ్రికి తద్దినముపెట్టుచుండ కొడుకు తాతకు తద్దినము పెట్టనక్కర లేదన్న

మాట) తండ్రిపోయి పితామహుడు బ్రతికి యున్నప్పుడు, కొడుకు తండ్రికి పిండమువేసి పితామహునిచే భుజింప జేయవలెను. ప్రపితామహుని ఉద్దేశించి పిండమును వేయవలెను. ఇది శాస్త్ర నిర్ణయము. పోయినవారికి పిండము పెట్టవలెను. ఉన్నవారికి అన్నము పెట్టవలెను. సపిండీకరణము పార్వణ శ్రాద్ధము వీనియందు లేవు. పితృమేధ కల్పము అనుసరించి ఆచారము పాటించినవాడు ధనధాన్య ఆయురారోగ్య పుత్ర పౌత్రాదులతో వర్ధిల్లును. ఈ పితృ మేధాధ్యాయనమును శ్రాద్ధ కాలమందు పఠించిన ఎడల ఆ యజమాని ఇడిన అన్నమును పితృ దేవతలు మూడు యుగములు అనుభవింతురు. ఈ పితృ మేధ కల్పము పాపహరము. పుణ్య వివర్ధనము శ్రాద్ధములందు దీనిని కీర్తింపవలెను. శ్రద్ధతో వినవలెను. (220)

సదాచార వర్ణనము

వ్యాసుడు ఇట్లు చెప్పెను –

ఇట్లు గృహస్థు దేవతలను పితృదేవతలను హవ్యకవ్యములచేతను, అతిథులను బంధువులను, భూతములను, నౌకరులను పశుపక్ష్యాదులను, జీవులను, బిచ్చగాండ్రను, సన్యాసులను, యాచకులను, బాటసారులను, సదాచారవంతులను, అన్నము మొదలైన ఆహారములచే పానీయములచే పూజించి నిత్యములయిన సంధ్యావందనాదులను, నైమిత్తకములయిన ఆయా పర్వాదులందు విహితములైన క్రియలను నిర్వర్తించి తీరవలెను. వీనిని అతిక్రమించిన ఎడల పాపము అనుభవించును అనగా మునులు ఇట్లు అనిరి.

"ఓ విప్రుడా! నీవలన నిత్యము నైమిత్తికము కామ్యము (ఏదేని కోరిక సఫలము కావలెనని చేయు కర్మ) అను త్రివిధమైన పురుష కర్తవ్యము (కర్మను) తెలిసికొన్నాము. ఇక సదాచారమనగా ఏమో ఇహమందు పరమందు మానవుడు ఆచరించి సుఖపడు దానిని గురించి వినగోరుచున్నాము అన మునులకు వ్యాసుడు ఇట్లు చెప్పెను.

గృహస్థు నిరంతరమును ఆచార రక్షణము చేసికొనవలెను. ఆచార హీనునికి ఇహపరములందు క్షేమము లేదు. సదాచారమును ఉల్లంఘించి వర్తించువానికి యజ్ఞదాన తపస్సులు సుఖమీయవు. దురాచారుడు ఇక్కడ పూర్ణ ఆయుర్దాయము పొందడు. సదాచార సంపన్నమైన ధర్మమును చేయవలెను. అట్టి ఆచారము యొక్క లక్షణము స్వరూపమును తెల్పెదవినుడు. తాను ఏకాగ్ర మనస్కుడై దానిని నిర్వహింపవలెను గృహస్థు త్రి వర్గమును (ధర్మ అర్థ కామములు అను పురుషార్థములను) సాధించు ప్రయత్నము చేయవలెను. అది సిద్ధించినయెడల ఇహపర సిద్ధియు కల్గును. ఈ త్రివర్గ మందు నాల్గవ భాగమైనను జరిపిన పరలోకశ్రేయస్సు చేకూర్చును. సగము నిర్వర్తించినచో తన్నుతాను భరించుకొన

గలవాడగును. నిత్య నైమిత్తికములను చేయగల్గును. నాల్గవ వంతు సదాచార సహచరణమున ధర్మ మూలమును వృద్ధిగావింప గలడు. ఈ ధర్మాచరణముచే అర్థము సిద్ధించును. అట్లే పాపమును నిషేధించుటకు తెలిసినవాడు ధర్మమాచరింపవలెను. పరమందు అర్థము దాని తరువాతిది కామము ఫలప్రదములు అగుటకు వానిని ఇహమందు అనుష్ఠింపవలయును. ప్రత్యవాయ భయముతో (పొరపాటుగ చేసిన పాపము వచ్చునను భయముతో) కామముగాని మఱి యే పురుషార్థమునకు విరుద్ధము కాకుండా (రెండు విధములుగాను) గావించిన కామ పురుషార్థము గూడ త్రివర్గ సాధనమందు విరోధకరము కాదు. ఈ పురుషార్థము ఒక దానికి ఒకటి అనుబంధింపబడునవిగా ఉన్నవా? విపరీతాను బంధములుగా ఉన్నవా? అనువిషయము తెలిసికొనవలయును. ధర్మము ధర్మాను బంధియైన అర్థమును బాధింపని ధర్మము అట్లే ధర్మార్థానుబంధియైన కామము ఆ రెండిటిని బాధింపని కామము, దానిచే (కామముచే)బాధింపబడని ధర్మార్థములును ఆత్మ బాధకములుకావు. అనగా తనకు కృతార్థతను కల్గించి తీరునన్నమాట. పురుషార్థములు ఒక దానికి ఒకటి అనుబంధపడి పరస్పర విరుద్ధములు గాకుండ జాగరూకుడై చేసిన ఎడల మానవుడు అన్నింటి ఫలమును పూర్తిగ పొందునని భావము.

బ్రాహ్మ ముహూర్తమున (తెల్లవారుజాము) మేలుకొని తాను ఆనాడు చేయవలసిన ధర్మము, అర్థము అను పురుషార్థ సాధనను గురించి ఆలోచన చేయవలెను. అటుపై ఆచమనముచేసి, స్నానముచేసి నియమవంతుడై శుచియై సంధ్యావందనమును నక్షత్రములుండగా చేయవలెను. సాయం సంధ్యను సూర్యుడు ఉండగా కావింపవలెను. ఈ సంధ్యోపాసనను ఆపద ఏమియు లేనప్పుడు తప్పక చేసితీరవలసినదే. అట్లే అసచ్ఛాస్త్రమును (నాస్తికాది మతములను) అసద్వాదమును (దుష్టవాదము), అసత్సేవను (అధర్మపరులను సేవించుటను) మానవలెను. నియమవంతుడై సాయం ప్రాతఃకాలములందు హోమము చేయ వలెను. సూర్యుని ఉదయాస్తమయములను చూడరాదు. తలదువ్వుకొనుట, అద్దము చూచుట, దంత ధావనము, కాటుక పెట్టుకొనుటయు పూర్వాహ్ణమందే చేయవలెను. దేవ తర్పణము కూడ అప్పుడే కావింపనగును. గ్రామములు ఇండ్లు తీర్థములు క్షేత్రములు అనువానికి పోవుదారులందు దున్నిన పొలములో గోశాలలందు విణ్మూత్రములు చేయరాదు.

దిగంబరమై ఉన్న పరస్త్రీని, తన పురీషమును చూడరాదు. బహిష్ఠయైన స్త్రీని చూచుట, తాకుట పలకరించుట కూడదు! నీళ్ళలో మూత్రపురీషములు చేయుట, మైథునము పనికిరాదు. మూత్ర పురీషములు, వెంట్రుకలు బూడిద, పొల్లు, బొగ్గులు, తెగిపోయిన త్రాళ్ళు, గుడ్డ పీలికలు, దారిలో పడియున్న చింపి గుడ్డలు మొదలగు వానిని త్రొక్కరాదు.

పితృదేవ మనుష్యులను భూతములను అర్చించి అటుపై గృహ యజమాని భోజనము చేయవలెను. తూర్పు ఉత్తరము దిశలవైపునకు ఉన్ముఖుడై ఆచమనము చేసి మౌనము పూని శుచియై మనసులో తాను తిను ఆహారము వైపు నిలిపి మోకాళ్ళ లోపల చేయి ఉంచి భోజనము చేయవలెను. తెలిసినవాడు చెడిన అన్నమొక్కటితప్ప మఱి యే అన్న దోషములను తెలుపరాదు. కేవల లవణము తినరాదు. ఉచ్ఛిష్టాన్నమును (ఎంగిలిని) విడిచిపెట్టవలెను. నడుచుచు లేక నిలువబడి మూత్ర పురీషములు విడువరాదు. ఎంగిలిని ఏ కొంచెము తినరాదు.ఎంగిలి నోటితో మాటలాడరాదు. వేదము చెప్పకూడదు. సూర్య చంద్ర నక్షత్రములను బుద్ధిపూర్వకముగ చూడరాదు. విరిగిన ఆసనము, మంచము, పగిలిన పాత్రమును వాడుకొనరాదు. పెద్దలు వచ్చినపుడు తాను లేచి నిలుచుట, ఎదురేగుట మొదలగు సత్కారములు చేసి ఆసనము (పీట, కుర్చీ, చాప మొదలయినవి) వేయవలెను. అనుకూలముగ సంభాషణము చేయవలెను. వారు వెడలి చనునపుడు కొంతదూరము వెంబడింపవలెను.ప్రతికూలముగ సంచరింపరాదు. ఒంటిగుడ్డతో భోజనము, దేవతార్చనము, బ్రాహ్మణాహ్వానము, అగ్నియందు హోమము చేయరాదు. నగ్నుడై (దిస్స మొలతో దిగంబరియై) స్నానము చేయరాదు. వండుకొనరాదు. రెండుచేతులతోను నెత్తిని గోకుకొనరాదు. నిష్కారణముగ మాటి మాటికి తలనిండ స్నానము చేయరాదు. శిరఃస్నానముచేసి తైలముతో అంగస్పర్శ చేయరాదు. అనధ్యయన దినములందన్నిట వేదాధ్యయనము మానవలెను. బ్రాహ్మణులను, అగ్నిని, గోవులను, సూర్యుని ఎన్నడు అవమానింపరాదు.

పగలు ఉత్తరాభి ముఖముగను రాత్రి దక్షిణాభి ముఖముగను సంకట సమయములందు యథేష్టముగను మూత్రపురీషోత్సర్జనము చేయవచ్చును. గురువు తప్పును చెప్పరాదు. ఆయన కోపించినయెడ ప్రతిమాలి క్షమాపణ చెప్పికొని ప్రసన్నుని చేసికొనవలెను. ఇతరులు చేయు అపవాదమును వినరాదు. బ్రాహ్మణులకు, రాజునకు, దుఃఖాతురునికి, విద్యాధికునికి, గర్భిణికి, రోగికి, పూజ్యునకు, మూగ, గ్రుడ్డి, చెవిటివాండ్రకు మత్తెక్కినవానికి, ఉన్మత్తునికి దారి ఇచ్చి తొలగినడువవలెను. దేవాలయమును చైత్య వృక్షమును (ఆలయాది పుణ్య స్థానములందు నాటించిన పుణ్యవృక్షము రావి మొదలయిన వానిని) నాల్గుదారులు కలిగిన కూడలిని ప్రదక్షిణముచేసి వెళ్లవలయును. అప్రదక్షిణముగా పోరాదన్నమాట. ఇంకొకడు వాడిన చెప్పులు, బట్టలు, పూలమాలలు మొదలయిన వానిని తాను ధరింపరాదు. చతుర్దశి, అష్టమి, పూర్ణిమ పర్వములు అయిననాడు అభ్యంగము, స్త్రీ సంభోగము కూడదు. బాహువులు, పిక్కలు పైకెత్తి నిలుచుండరాదు. పాదములు ఇట్టట్టు

ఆడింపరాదు. ఒక కాలితో ఇంకొకకాలు త్రొక్కరాదు. జారిణిని, తప్పు జరిగిపోయిన తరువాత బాలుని, జాతి భ్రష్టుని, మర్మాఘాతముగ తిట్టుటను, దెప్పి పొడుచుటను (సాధించుటను) మానవలెను. వివేకి అయినవాడు దాంభికత్వము (డంబములు పలుకుట) నేనే ఘనుడనను దురభిమానము తీక్షణత్వమును చూపరాదు. మూర్ఖులను పిచ్చివాండ్రను కష్టములలో ఉన్నవారిని, విరూపులను అంగవైకల్యము గలవారిని నిర్ధనులను పరిహసించి కించపరచరాదు. శిష్యులను, పుత్రులను శిక్షించుటకు ఇంకొకని చేతికి దండమును (కట్టను) ఈయరాదు. కాలితో ఆసనము దగ్గరగా ఈడ్చికొని దానిపై కూర్చుండరాదు. తనకుతాను తినుటకు సంయావము (గోధుమపిండితో చేయు పదార్థము) కృశరము (పులగము), మాంసమును సేకరింపరాదు. సాయం ప్రాతః కాలములందు అతిథులను పూజించి భుజింపవలెను. తూర్పు ఉత్తరము మొగమై మౌనియై పండ్లు తోముకొనవలెను. నిషిద్ధములయిన దంత కాష్ఠములను వాడరాదు. ఉత్తరదిశగా, పడమరగా తలపెట్టి పండుకొనరాదు. దక్షిణదిశగా తలపెట్టి పండుకొనవలెను. పరిమళోదకములతో నిద్రపోరాదు. ఉషఃకాలమందు నిదురింపరాదు. గ్రహణమునందు విడుపుస్నానము రాత్రియే చేయవలెను. విడుపు కాగానే రాత్రియే చేయవలెనుకాని మరునాడు పగలు చేయరాదని అర్థము. ఉప్పును దినరాదు. నిలువ ఉన్నది, తడి ఆరినది, పాసినదియునగు అన్నము తినరాదు. పిండికూరలు, చెఱకు, పాలు అను వాని యొక్కయు మాంసము యొక్కయు వికారములు అనగా వానివానితో తయారైన పదార్థములను చిరకాలము నిలువయున్న వైనను తినవచ్చును. సూర్యోదయ అస్తమయ కాలములందు పండుకొన రాదు. స్నానముచేయక, కూర్చుండక, మనస్సు నిలుపక, మంచముమీద వట్టినేలమీద కూర్చుండి చప్పుడు చేయుచు లేక మాటలాడుచు భోజనము చేయరాదు. సేవకులకు పెట్టకుండ తినరాదు. సాయంప్రాతఃకాలములందు స్నానముచేసి భోజనము చేయవలెను. పరదార సంగము కూడదు. ఆ దోషము ఇష్టాపూర్తముల వలనగల్గు ఫలమును ఆయుర్దాయ మును నాశము చేయును. ఇష్టమనగా యజ్ఞము, వాపీకూప తటాకాది నిర్మాణము, సత్రము పెట్టుట, గోడ కట్టించుట, తోటలు వేయించుట మొదలయిన ధర్మకార్యములు పూర్తములు పరదారగమన మంత ఆయుర్దాయమును హరించు తప్పిదము మఱి ఒకటిలేదు.

ఆచమనముచేసియే దేవాగ్ని పితృకార్యములు గురు వందనము భోజనమును చేయవలెను. ఆచమనమునకు ఉపయోగించు జలము నురుగు, వాసన లేనివిగా ఉండవలెను. ఆచమనము చప్పుడు కాగూడదు. తూర్పుగ, ఉత్తరముగ తిరిగి ఆచమనము చేయవలెను. నీళ్ళనుండి తీసినది, ఇంటిపెరటిలో ఉన్నది, పుట్టలోని ఎలుక కలుగులోనిది,

శౌచక్రియ యందు ఉపయోగింపగా మిగిలినదియునుగా ఈ ఐదు విధముల మన్ను శౌచ విధికి ఉపయోగింపరాదు. కాలుచేతులు కడిగికొని వానిని ప్రోక్షణము చేసికొని స్థిర మనస్కుడై మూడుసార్లు గాని, నాల్గుసార్లు గాని ఆచమనముచేసి రెండుసార్లు పెదవులను తుడిచికొని ఇంద్రియములను రెండుసార్లు స్పృశించి శుచియై సంధ్యా వందనాది క్రియలను జేయవలెను. తుమ్మునందు, నాకుటయందు, అపానవాయువు నందు, ఉమ్మి వేయుట మొదలగు పనులందు ఆచమనము చేయవలెను. అంటరానివానిని అంటినపుడు సూర్యదర్శనము చేయవలెను. మఱియు కుడిచెవి స్పృశించవలెను. ఈ చెవిని స్పృశించుట ఇంతకుమున్ను చెప్పిన ఆచమన సూర్య దర్శనములకు అవకాశము లేనప్పుడే. మున్ను చెప్పినది ఉన్నప్పుడు తరువాత జెప్పిన పనులు సమ్మతములుగావు. పండ్లు కొఱుకరాదు, తన దేహమును గ్రుద్దు కొనరాదు, పండుకొన్నపుడు, దారినడచునపుడు, భుజించునపుడు స్వాధ్యాయము పనికిరాదు. సంధ్యలందు మైథునము, ప్రయాణమును చేయగూడదు. అపరాహ్ణమున (కుతపకాలమందు) పగటికాలమును మూడు భాగములు చేయగా మూడవ భాగమున పితృ తర్పణము చేయవలెను. దేవ పితృ కార్యముల యందు శిరఃస్నానము చేయనగును. తూర్పు, ఉత్తర దిశమొగమై క్షుర కర్మ చేయించుకొనవలెను. వికలాంగిని వివాహమాడరాదు. ఉత్తమ కులమున పుట్టినది రోగములు లేనిది అగు కన్యను పెండ్లాడవలెను. తండ్రి వైపున ఏడవ తరము దానిని, తల్లివైపున ఐదవతరము దానిని మాత్రమే స్వీకరింపనగును. భార్యను సత్ప్రవృత్తి యందు పెట్టవచ్చును పగటియందు నిద్రా మైథునములు కూడవు. ఇతరులకు తాపము కల్గించుపని, జంతుపీడయు చేయరాదు.

ముట్టయిన స్త్రీని అన్ని వర్ణములవారు నాల్గు రాత్రులు వెలుపల ఉంచవలెను. అయిదవ రోజుకూడ దూరముగ ఉంచినచో నామెకు మఱి స్త్రీ జన్మముగాదు. ఆఱవరాత్రి ఆమెను పొందవచ్చును. మఱియు జ్యేష్ఠయుగ్మాను అనగా ఋతుదినములైన మొదటి పదియారు దినములలో సరిరాత్రులందు పొందనగును. సరిరాత్రులందు గూడిన పుత్రులు, బేసిరాత్రులందు కూడిన ఆడపిల్లలు కల్గుదురు. పర్వదినములందు పొందిన అధర్మపరులు, సంధ్యాకాలమందు కూడిన నపుంసకులు పుట్టుదురు. రిక్తాతిథి క్షురకర్మకు నిషిద్ధము. వినయము లేనివాండ్రేదేని చెప్పుచుండ అది వినరాదు. నీచునకు అత్యున్నత స్థానమీయ రాదు. క్షురకర్మ చేసికొన్నపుడు, స్త్రీ సంభోగానంతరము, సంతకు వెళ్ళినపుడు సచేల (తలపై కూడా) స్నానము చేయవలెను. దేవతలను వేదములను ద్విజులను సాధువులు సత్యవంతులు మహాత్ములునైన వారిని, గురువును, పతివ్రతలను, బ్రహ్మ యజ్ఞములు తపస్సు చేయువారిని దూషించుట (అప్రతిష్ట పాలు చేయుట) పరిహసించటము కూడదు.

అచ్చపు తెలుపు వస్త్రములను, తెల్లని పువ్వులను దాల్చి ఎపుడును మాంగల్యవేషియై శుభవేషము గొన్నవాడై యుండవలెను. అట్టివానికి అమంగళములు కల్గవు. తలబిరుసు గలవారితో, ఉన్మత్తులతో, మూఢులతో, వినయహీనులతో, నీచశీలురతో, వయస్సుచే, జాతిచే దూషితులైన వారితో, డబ్బు దుబారా చేయువారితో, శత్రువులతో, కార్యదక్షులు కాని వారితో, నింద్యులతో, జారులతో చేరిన వారితో, నిరుపేదలతో, వాదపరులతో, మఱిపెక్కు తెఱగుల అధములైన వారితో చెలిమి చేయరాదు.

మిత్రుడు, దీక్షితుడు (యజ్ఞము చేసినవాడు), భూపాలుడు, స్నాతకుడు (గురుకుల మందు విద్య పూర్తిచేసినవాడు) మామగారు అనువారితో గూడ తానును వేచి వారు వచ్చినపుడు ప్రత్యుత్థానముచేసి ఆసన పాద్యాదులు ఈయవలెను. వీరు తన ఇంటికి వచ్చినపుడు తనకు ఉన్నంతలో లోటు చేయకుండ పూజింపవలెను.

ప్రతి సంవత్సరోషితాన్=సంవత్సరమునకు ఒకసారి వచ్చియున్నవారిని అనగా ఆబ్దికమునందు యథాస్థానముగ అనగా వైశ్వే దేవస్థానము, పితృస్థానము అనువానియందు అర్చన చేయవలెను. అవ్వల అగ్నికి, ప్రజాపతికి, గృహ దేవతలకు వరుసగా మూడు ఆహుతులు ఈయవలెను. మఱొకటి కశ్యపునకు ఈయవలెను. అటుపైని అనుమతి కొక ఆహుతి ఈయవలెను. పిమ్మట గృహబలిని ఈయవలెను. నిత్య కర్మ విధానమందు నేను ఇంతమున్ను చెప్పిన వైశ్వదేవ క్రియను చేయవలెను. ఆ విధానము తెలుపుచున్నాను వినుడు.

పర్జన్య దేవతకు (వరుణునికి), ఆబ్దేవతకు, భూ దేవతకు మూడు స్థానములందు విడివిడిగా బలి వేయవలెను. ఆ వేయుట మణికమందు. (మణిక మనగా మట్టిపాత్ర) వాయువునకు అన్ని దిశలందు దిగ్దేవతలకు వరుసగా తూర్పు నుండి బ్రహ్మ అంతరిక్షము సూర్యుడు విశ్వేదేవులు విశ్వభూతములు ఉషస్సు భూతపతి అనువారికి ఉత్తరము వైపు బలివేయవలెను. 'స్వధాయై నమః' అని పలుకుచు పితరులకు దక్షిణముఖను ప్రాచీనావీతిగ వేయవలెను. 'యక్ష్మైతత్తే' అను మంత్రము పఠించుచు వాయవ్యమూలలో అన్నావశేషముతో కూడిన ఉదకము యథావిధిగ వదలవలెను. అటుపై దేవతలకు బ్రాహ్మణులకు నమస్కారము చేయవలెను. కుడిచేతి అంగుష్ఠమునకు (బొటనవ్రేలికి) ఉత్తరముపైపున ఉన్న రేఖ బ్రాహ్మతీర్థ మనబడును. ఆచమనము చేయవలసిన తీర్థమిది. తర్జనికి (చూపుడు వేలు) అంగుష్ఠమునకు నడిమిది పితృతీర్థము. నాందీ ముఖములోగాక మఱి ఎల్లవిధులందును పితరులకు తర్పణాదులు ఈ తీర్థమున చేయవలెను. వేళ్ళ అగ్రము దైవతీర్థము. దేవతలను ఉద్దేశించిచేయు తర్పణాది విధులు ఆ తీర్థమున జేయవలెను. చిటికెన వ్రేలి మొదలు ప్రజాపతి తీర్థము. అక్కడ ప్రజాపతికి జేయవలయును. ప్రజాపతి కాండర్షి కావున ఋషి

తీర్థమున చేయవలెనన్న మాట. బ్రాహ్మ తీర్థమునందు ఆచమనము ప్రశస్తము. పిత్ర్య క్రియ పితృ తీర్థమున, దేవతలకు దేవతీర్థమున, ప్రజాపతికి నాందీముఖ దేవతలకు పిండ తర్పణాదులు ప్రజాపతికివలె ప్రాజాపత్య తీర్థమున (చిటికెన వ్రేలి మొదట) చేయవలెను.

నీటిని అగ్నిని ఒక్కస్థారి కలిపి పట్టుకొనరాదు. గురువులు, దేవతలు, తల్లిదండ్రులు, బ్రాహ్మణుల వైపు పాదములు చాచరాదు. పాలు కుడుపుచున్న గోవును చూడరాదు. దోసిలితో నీరు త్రాగరాదు. చిన్నపెద్ద శౌచకాలములందు విలంబము చేయరాదు. 'నవేగాన్ ధార యేత్క్వచిత్' అని ఇదే విషయము మఱియొకచో తెలుపబడినది. నోటితో అగ్ని ఊదరాదు. అప్పిచ్చువాడు, వైద్యుడు, ఎప్పుడు పారు ఏరు, ద్విజుడు. ఈ నాలుగును లేని ఊరిలో నివసింపరాదు.

భృత్యులను జయించినవాడు నౌకరులకు లొంగనివాడన్న మాట. బలశాలి, ధర్మ తత్పరుడు అయిన రాజుగల దేశమందు ప్రాజ్ఞుడు వసింపవలెను. చెడ్డరాజు కలచోట సుఖమెక్కడిది? ఎక్కడ పౌరులు (ప్రజలు) కలిసిమెలిసి న్యాయవర్తనులై శాంతులు, మాత్స్యర్య హీనులునై ఉందురో అక్కడ నివాసము సుఖోదయము. ఎక్కడ వ్యవసాయదారులు (కృషికులు) దురభిమాన దురహంకారములు లేనివారో యెక్కడ ఓషధులు సర్వముగలవో అచ్చట వివేకి వసింపవలెను. జయింపవలెనను కోరిక కలవారు పూర్వ వైరము కలవారు నిరంతరము వేడుకలకై వేడుకపడు జనము ఈ మూడు లక్షణములు గలచోట వసింప రాదు. ఉత్తమశీలురైన వారు సహచరులు శత్రువుల బెదిరింపులకు లొంగని రాజు సస్య సమృద్ధమైన భూమిగలచోటు నిత్య నివాసార్హము. ఇదంతయు మీ హితము కోరి తెల్పితిని. ఈ మీద భక్ష్యాభక్ష్య విధానము తెల్పెద వినుడు.

నేయి, నూనెలతో మిశ్రితమైనచో, పర్యుషితమైన (నిలువయున్నది చలిది) అన్నము గూడ త్యాజ్యమే. నేయి, నూనెల స్పర్శ లేకున్నను గోధుమ, యవ పదార్థములు ఆవుపాలు, పెరుగు, నేయి మొదలయినవి వానితో జేసిన వంటలును నిలువ ఉన్నవైనను భుజింప తగినవే. కుందేలు, తాబేలు, ఉడుము, పంది చేప (ఒక రకము చేప) అనునవి తినదగినవి. ఊరపంది, కోడియు తినరానివి. పితృశేషము, దేవశేషము శ్రాద్ధమందు బ్రాహ్మణులకు పెట్టు ఉద్దేశముతో ప్రోక్షింప బడినదియు, ఔషధము కొరకైనదియు అగు మాంసము తిన్న దోషము కలుగదు.

శంఖము, రాయి, బంగారము, వెండి, తాళ్ళ వస్త్రములు, కూరలు, దుంపలు, పండ్లు, పువ్వులు, చర్మము, మణులు, వస్త్రములు, పవడములు, ముత్యాలు, పాత్రలు,

చమసలు (చతురస్రములైన యజ్ఞపాత్రలు) నీటితో కడిగిన శుద్ధములగును. రాతిచిప్పలు (రాచ్చిప్ప అని వాడుక) నీటిచేతను రాతితో సంఘర్షించుటచేతను శుద్ధములగును. నూనె జిడ్డున్న యెడల వానిని వేడినీట కడుగవలయును. చేట, చర్మము, తోకలి, తోలు, ముతుక బట్టలు, ప్రోక్షణ చేసిన శుద్ధి గల్గును. నారబట్టలు, నీరు మట్టి (చవుడుమన్ను) ఎండ బెట్టుట అనువానిచే పరిశుద్ధములు అగును. గొర్రె ఉన్నితో నేసిన బట్టలు (ముదుకగా ఉన్న బట్టలు) ఆవాలముద్ద, నువ్వులముద్దచే శోధనము సేయవలెను. దట్టమైన నూలుబట్టలు గూడ పూర్వోక్త రీతిగానే స్వచ్ఛములగును. కఱ్ఱ, దంతములు, ఎముకలు, కొమ్ములు అనునవి నీటితో కడిగినను భస్మముతో తోమినను శుద్ధములగును. అంటు కుండలు మరల వంటకు పనికిరావు. తోమి వంటచేయవలెను. బ్రహ్మచారి, సన్యాసి మొదలగు వారి భిక్షాన్నము, వడ్రంగి (శిల్పి) హస్తము, బజారువస్తువులు, స్త్రీ ముఖమును శుద్ధములు. బాటలోపడి ఉన్నది, తెలియకుండ స్పృశించినది (త్రొక్కినది), దాసిచే తోమబడినది ఆదిలో పరిశుద్ధమే. చిరకాలమయినను, వస్తు సమృద్ధితో చేరిన అశుచియైన అల్పవస్తువుగూడ పరిశుద్ధమే.

స్థానభ్రంశము పొందని వెంట్రుక ముసలివాండ్రు రోగాదిపీడితులు చేసినపని, సత్కర్మ మరిగిన ఇండ్లు, వాకిండ్లు, స్త్రీయొక్క పాలిండ్లు పవిత్రములు. ప్రవాహోదకము, వాసనలేని నీరు పరిశుద్ధము. భూమి కాలముచేతను, అగ్ని దాహముచేత, ఉదకము మార్జనముచేత, ఆవులు త్రొక్కుట చేత పవిత్రమగును. గృహము అలుకుట, నీట తడుపుట, నీళ్ళు చల్లుట వలన శుచి అగును. వెంట్రుకల పురుగులచే దూషిత మయినపుడు, ఆవువాసన చూచినప్పుడు, ఈగలు వ్రాలినపుడు అన్నము, మట్టి, నీరు భస్మములను ఇంచుక చిమ్ముట వలన శుచి అగును. చింతపండు రసముచేత మేడి కర్రతో జేసిన పాత్రలు తగరపు సీసపుగిన్నెలు చింతపండు రసముచేతను కంచుగిన్నెలు బేడిద నీరు చేతను శుద్ధి చెందును. ద్రవపదార్థము అశుచియైనతఱి కొంచెము క్రింద పోయుటవలన పవిత్రమగును. అపవిత్ర వస్తువులతో కూడిన ద్రవ్యము మట్టి నీరువలనను, వాసన పోవుదాక తోముట వలనను పవిత్రమగును. మఱి ఇతర వస్తువులు వానిరంగు వాసనను తొలగించిన శుభ్రములగును. చండాలుడు పచ్చి మాంసము తినువాడు తెచ్చిన మాంసము, శుచి, దుకాణము నుండి తెచ్చిన నూనె, గోవునకు తృప్తి గూర్చిన నీరు (ఆవులు త్రావినది) ధూళి, అగ్ని గుర్రములు గోవులయొక్క నీడ కిరణములు, గాలి, భూమి, నీటి చినుకులు ఈగలు మొదలయిన దుష్ట వస్తుస్పర్శ పొందినను మైలపడవు. మేకలు గుర్రములు ముఖముచే పవిత్రములు" (221)

వర్ణాశ్రమ ధర్మములు

మునులడుగగా వర్ణ ధర్మములను, నాల్గు ఆశ్రమ ధర్మములు వ్యాస భగవానుడు ఇట్లు అనతి ఇచ్చెను -

బ్రాహ్మణునికి దానము దయ తపస్సు దేవ పితృ దేవతాయజ్ఞములు స్వాధ్యాయము ప్రధాన ధర్మములు. నిత్యోదకి (స్నానాదులతో చలికి వెఱువక) త్రిషవణస్నాన నిరతుడు కావలెను. అగ్నులను ఉపాసింపవలెను. జీవనముకొఱకై ఇతరులచేత యజ్ఞములు చేయింప వచ్చును. శిష్యులకు వేదములు చెప్పవలెను. యజ్ఞనిమిత్తముగా తెలిసి (పాత్రాపాత్ర వివేకముతో) ప్రతిగ్రహము చేయవచ్చును. బ్రాహ్మణునికి చెప్పబడిన షట్కర్మలలో ప్రతి గ్రహము (దానము పట్టుట) కూడ విహితమయి యున్నది. సర్వ లోకమునకు హితమే చేయవలెను గాని అహితముచేయరాదు. సర్వభూతములతో మైత్రి బ్రాహ్మణునికి ఉత్తమధనము. ఋతు సమయమందే భార్యాభిగమనము ప్రశంసా పాత్రము.

క్షత్రియుడు మనఃపూర్తిగ ద్విజులకు దానములు యజ్ఞములు, వేదాధ్యయనము చేయనగును. జగద్రక్షణకై అస్త్రము పట్టి జీవించుట క్షత్రియుని ధర్మము. భూపాలనము కూడ ప్రధాన ధర్మము. దాననే రాజులు కృతార్థులు. యజ్ఞాది రక్షణము రాజు ధర్మము. దుష్టులను శిక్షించుట, శిష్టులను రక్షించుట వర్ణధర్మ వ్యవస్థ చేయుటవలన రాజు అభీష్ట పుణ్యలోక గామియగును.

పశు పాలనము వాణిజ్యము కృషి (వ్యవసాయము) వైశ్యుని వృత్తిగా (జీవికగా) బ్రహ్మ యొసంగెను. అతనికి గూడ అధ్యయనము యజ్ఞము దానము ధర్మము అనునవి నిత్య నైమిత్తిక కర్మానుష్ఠానములు. బ్రాహ్మణ పురస్సరముగా కర్మాచరణము విహితము. అందులకే బ్రాహ్మణులను పోషించుట అందుకొరకే క్రయవిక్రయ వ్యాపారము, వడ్రంగము వైశ్యునికి విహితములు. శూద్రుడు దానములు ఈయవలెను. పాక యజ్ఞములు చేయ వలెను. పాకయజ్ఞముచేతనే పితరులను అర్చించుట మొదలగు సర్వకర్మాచరణము విహి తము. నౌకరులను భరించుటకు సర్వ పరిగ్రహములు చేయవచ్చును. ఋతుకాలాభిగమన మందఱికిని సామాన్య ధర్మము, అంతేకాదు సర్వభూతదయ ఓరిమి దురభిమానము లేమి, సత్యము, శౌచము, అనాయాసము, మంగళ కార్యాచరణము, ప్రియముగా మాట్లా డుట, సర్వులతోమైత్రి, దురాశ లేకుండుట ఇవి అన్ని వర్ణములకు అన్ని ఆశ్రమముల వారి కిని సాధారణ లక్షణములు. ఇవిగాక బ్రాహ్మణాదులకు ఈ క్రింది ఉపధర్మములు (ఆపద్ధర్మములు అన్న మాట)కూడ చెప్పబడినవి. ఆపద్ధర్మముగా (జీవనము గడుపునపుడు)

బ్రాహ్మణుడు క్షాత్ర ధర్మమును క్షత్రియుడు వైశ్య ధర్మమును వైశ్యుడు శూద్ర విహిత కర్మ మును జేయవచ్చును. వైశ్య శూద్రులు సమర్థులైయుండి ఈ స్వధర్మములను విడువరాదు. ఆపద్ధర్మములో కూడ వారికిది త్యాజ్యము గాదు. కర్మ సాంకర్యము మాత్రము ఎన్నడును చేయగూడదు. ఇవి వర్ణ ధర్మములు చెప్పితిని. ఇక ఆశ్రమ ధర్మములను తెల్పెద తెలుసుకొనుము.

బాలుడుపవీతుడై, వేదాధ్యయనతత్పరుడై, గురు గృహమందు వసించుచు, బ్రహ్మ చారియై ఉండవలెను. సదాచారమందు అభిలాషగొని గురు శ్రూష చేయవలెను. (శ్రూష= వినవలెనను కోరిక అనగా గురువు చెప్పినట్లు వినుట అనగా ఆ ప్రకారము నడచుట) వ్రతములను జేయవలెను. (అనగా బ్రహ్మచర్య నియమములను బాటింపవలెను) మనసు నిల్పి(అవధానము గొని)వేదము నేర్చుకోవలెను. మది కుదురుపరచుకొని ఉభయ సంధ్యలందు, అగ్నికార్య మొనరించి గురునకు అభివాదనముచేయవలెను. గురువు నిలువ బడిన, తాను నిలువబడి, నడచిన, వెంటనడచి, ఆయనకు క్రిందుగ కూర్చుండవలెను. గురునకు ప్రతికూలమైన పని వదలిపెట్టవలెను. ఆయనతో వేదము పఠింపవలెను. అతనికి ఎదురుగా గూర్చుండి వేరుతలపు గొనకుండవలెను. ఆపై భిక్షాన్నము తెచ్చికొని గురునకు నివేదించి తదనుమతిని పొంది తాను దానిని తినవలెను. గురువు దిగి స్నానముచేసిన తరువాత ఆ తీర్థమందు తాను దిగి స్నానము చేయవలెను. సమిధలు తీర్థమును ఆయనకై ప్రతికల్పము (అవసరమైనపుడెల్ల) తేవలయును. వేదములు చదివిన తరువాత గురుదక్షిణ సమర్పించి ప్రాజ్ఞుడై గార్హస్థ్యమందు ప్రవేశింపవలెను.

శక్తి కొలది గృహస్థుచేయతగిన కార్యములను అన్నింటినిచే పితృ దేతలను నిర్వాపముచే (తర్పణములచే), దేవతలను అతిథులను యజ్ఞములచే, మునుల అన్న దానము స్వాధ్యాయములచే సంతతిచేత, ప్రజాపతిని బలికర్మచే భూతములను సత్యవచనముచే నెల్లజగమ్మును అర్చించి పురుషుడు తాజేసిన ఈ పుణ్యకర్మ ప్రభావమున పుణ్యలోకములను పొందును. భిక్షాన్న భోజనులగు సన్యాసులు బ్రహ్మచారులు మఱియుం గల వారు ఈ గృహమునెడ (గృహస్థునెడ) నిలుతురు. కావున గార్హస్థ్యము. పరమాశ్రమ ధర్మము. వేదముల నేర్చుకొను పనితో తీర్థస్థానముకొరకు పృథివీ దర్శనము కొఱకు ద్విజులు వసుధపై సంచార మొనరింతురు. ఇల్లులేక ఆహారము లేక సాయంకాలమందు ఎవరు ఇండ్లకువత్తురో వారికి గృహస్థులు నిలువనీడ అని చెప్పబడినారు. ఆతడు వారికి మధురాతి మధుర భాషణముల స్వాగతము పలుకవలెను. (అయ్యా! దయచేయుడు అనవలయును) ఆ మీద దానములు చేయగోరు (అన్ని దానాదులు) ఇంటికి ఏగుదెంచిన వారికి పరుండ కూరుచుండ తినుటకు శయన ఆసన భోజనాదులను కూర్పవలయును.

భగ్నాశుడై అతిథి ఎవ్వని ఇల్లు వదలి పోవునో, ఆ అతిథి తన పాపము ఆ ఇంటి యజమానికి ఇచ్చి వాని పుణ్యమునుగొని పోవును. ఈసడింపు, అహంకారము, డాంబికము, నింద, ఉపఘాత పారుష్యము గృహికి (అనగా ఇంటి యజమానికి) తగదు. గృహస్థీ (గృహస్థుడు) ఉత్తమ ధర్మము పాటించి సర్వబంధ ముక్తుడై ఉత్తమ లోకములను పొందగలడు.

వయస్సు పండినతఱి గృహాశ్రమి కృతకృత్యుడై భార్యను పుత్రులకు అప్పగించి వనమేగవలెను. ఆమెతోనైన ఏగవచ్చును. రాలిన ఆకులు దుంపలు రాలిన పండును తినుచు జుట్టు గడ్డము జటలు పెంచికొని నేలం బరుండుచు అచ్చట మునియై సర్వులకు అతిథియై ఉండవలయును. చర్మములు రెల్లు దర్భలతో అల్లిన వానిని కట్టుకొనవలెను. పైని వేసికొనవలెను. తప్పక త్రిషవణ స్నానము చేయవలెను. దేవతార్చనము, హోమము, సర్వ అభ్యాగతపూజ, భిక్ష, బలిప్రదానము ఈ వానప్రస్థునకు ప్రశస్తమని చెప్పబడినది. అడవి నూనెలతో నభ్యంగ స్నానము కూడా వీనికి ప్రశస్తము. శీతోష్ణాది ద్వంద్వ సహనము తపస్సునకు నీ నియమములనుబూని వానప్రస్థుడు చరింపవలెను. అట్టి పుణ్యుడు అగ్నివలె ఎల్ల దోషములను దహించి శాశ్వత పుణ్యలోకములు అందగలడు.

చతుర్థాశ్రమము భిక్షువునకు సంబంధించినది. సన్యాసమను పేరుగల ఆ ఆశ్రమ ధర్మమును తెల్పెదను ఎరింగికొనుడు. కళత్ర పుత్ర ధనాదులందు స్నేహములం బాయవలెను. మాత్సర్యము ఏ మాత్రము ఉండరాదు. త్రైవర్ణిక ధర్మములను, కర్మల నన్నింటిని విడువవలెను. మిత్రాదులకు మైత్రుడు, సముడునై ఎల్ల భూతములందు అట్లుండ వలెను. జరాయుజములు (మావి వలన బుట్టినవి) అండజములు (పక్షులు) స్వేదజములు (చెమట వలన బుట్టు క్రిములు) ఉద్భిజ్జములు (విత్తు నుండి పుట్టు వృక్షాదులు) అగు వీనియందు ఎందును త్రికరణములచే ఎట్టి ద్రోహము చేయరాదు. సర్వ సంగములు వీడవలెను. ఒక ఊరిలో ఒకరాత్రి, పురమందు ఐదు రాత్రులు మాత్రమే ఉండవలెను. పశు పక్ష్యాదులందు ప్రీతి ద్వేషమును వీనికుండదు. ప్రాణయాత్రా నిమిత్తముగనే నిప్పులు ఆర్పుకొని జనములు భుజించిన తర్వాత ప్రశస్త వర్ణముల వారికడ భిక్షాటనము చేయ వలెను. భిక్ష దొరకనిచో విషాదపడరాదు. దొరకిన హర్షపడరాదు. ప్రాణ యాత్రా మాత్ర మాత్రా కాలసంగముగొని వెడలిపోవలెను. మితిమీరిన పూజ లాభములను ఎల్లెడను సహించు కొనవలెను. కామము క్రోధము దర్పము లోభము మోహము మొదలగు దోషములను వీడి నాది నేనను భావము లేక (నిర్ముడు నిరహంకారుడై) ఉండవలెను. వానికి దేహమును వదలునపుడును భయము కలుగదు. తన మేనిలోని అగ్నిని తన ముఖమున అగ్ని హోత్రమాచరించి అనగా తనలోనున్న జఠరాగ్ని అందు వైశ్వానరాగ్ని అందు

హవిస్సుగా పంచాహుతుల రూపమున ఆహారమున హోమ ద్రవ్యముగా వేల్చి అదిగూడ భిక్షా రూపమున తెచ్చికొన్న దానినే హోమము చేసి చితాగ్నులైన వారియొక్క లోకములకు ఆతడేగును. (అగ్ని చయనము చేసిన వారేగు లోకములకు అని అర్థము) ఇక మోక్షాశ్రమ సన్యాసియో (విద్వత్సన్న్యాసి అన్న మాట) యథోక్త విధానమున ఆశ్రమ ధర్మము నిర్వహించి సంకల్పిత బుద్ధితో అనింధనమయిన జ్యోతివలె(కట్టెలులేని నిప్పువలె)ప్రశాంతమయిన ఆబ్రహ్మ లోకమును పొందును. ద్విజులకు మాత్రమే ఈ ఆశ్రమము చెప్పబడినది." (222) అని చెప్పెను.

సంకరజాతి లక్షణ వర్ణనమ్

అంతట మునులు మహానుభావ! నీవు సర్వజ్ఞుడవు. మఱియు సర్వభూత హితాభిలాషివి. భూత భవిష్య వర్తమానములు నీకు కరతలామలకములు. ఏ కర్మచే నడతచే వర్ణములకు అధమ స్థితి వచ్చును? ఉత్తమ స్థితియును కల్గును? ఆనతిమ్ము. శూద్రుడు ఏ కర్మ మాచరించి బ్రాహ్మణత్వ మందును. వినగోరెదము" అని అడుగగా వ్యాస భగవానులు ఇట్లనిరి.

"హిమగిరి శిఖరమందాసీనుడైయున్న మహాదేవుం డైన త్రిలోచనుని శైలరాజతనయ మ్రొక్కి ఇట్టిదే ప్రశ్న అడిగినది. ఓ భగనేత్ర నాశన! పూషదంత వినాశన! దక్షక్రతుహర! బ్రహ్మమున్ను చాతుర్వర్ణ్య ధర్మములను అడిగెను. ఏ కర్మ విపాకముచే బ్రాహ్మణాదులు క్షత్రి యాది జన్మము లందుదురు. ఈ అనులోమ విలోమ వర్ణ సాంకర్య మెట్లు గలుగునో నా సంశయమును వారింపుము అన శివుడిట్లు చెప్పెను.

"దేవీ! బ్రాహ్మణ్యము దుర్లభము. బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులు స్వభావముచేత ఏర్పడిరని నా తలంపు. తరువాత దుష్కర్మము ఒనరించి సహజసిద్ధమైన బ్రాహ్మణ్యము నుండి దిగజారును. బ్రాహ్మణుడు మొదలయినవారు తమ స్వధర్మ మందుండిరేని బ్రాహ్మణ్యమును పరమావధిగ బడయుదురు. ఎవడు విప్రధర్మము విడిచి క్షత్రియ ధర్మము ఆచరించునో అతడు, విప్రత్వము కోల్పోయి క్షత్రియ యోనిం జనించును. ఇట్లే వైశ్యాది వర్ణములందును స్వధర్మ పరిత్యాగము చేసినవాడు జనించును. శూద్రత్వముదాక పతనమైన విప్రుడు బ్రహ్మలోక భ్రష్టుడై వర్ణ సాంకర్యమందును.

శూద్రుడు స్వధర్మముచే జ్ఞానవిజ్ఞానములనంది, శుచియై, ధర్మజ్ఞుడై, ధర్మనిరతుడై స్వధర్మ ఫలము వడయును. అనగా క్రమముగ ఉన్నత వర్ణములందు జన్మించి బ్రహ్మత్వ

సిద్ధినిగూడ అందును. మున్ను బ్రహ్మ ఉదాహరించిన అధ్యాత్మ జ్ఞానము, నిష్ఠాసిద్ధిని ధర్మపరులెట్లు పొందుదురో ఆవిషయములు ఇవి. ఉగ్రాన్నము, గణాన్నము, శ్రాద్ధాన్నము, మైలఅన్నము, మృష్టాన్నము, శూద్రాన్నము, ఎన్నడును తినరాదు. ఇది బ్రహ్మ ముఖము నుండి వచ్చిన వాక్కుగాన (వేదము) పరమ ప్రమాణమని నా అభిప్రాయము.

శూద్రాన్న శేషము కడుపులోనుండగా చనిపోయిన ద్విజుడు ఆహితాగ్ని యజ్ఞ కర్తయు శూద్రుడై పుట్టును. దానికి ప్రాయశ్చిత్తము గూడలేదు. ఏయే వర్ణములవారి అన్నము జఠర మందుండగా ఎవ్వడు చనిపోవునో వాడు ఆ వర్ణములందు పుట్టును. అక్కడ విమర్శలేదు. దుర్లభమైన బ్రాహ్మణ జన్మమంది అభోజ్యాన్నములు తిన్నవాడో పతితుడై తీరునో బ్రాహ్మణుడు సురాపానము, బ్రహ్మహత్య దొంగతనము వ్రతభంగము శౌచలోపము స్వాధ్యాయ లోపముచే లుబ్ధుడై నైకృతికుడై శఠుడై వ్రతదూరుడై వృషలిని సంగమించి కుండాశనముచేసి సోమము అమ్మి, నీచుల సేవించి భ్రష్టుడగును. గురుతల్పగుడు గురుద్వేషి గురువుల పరిహసించువాడు బ్రహ్మ ద్వేషి బ్రాహ్మణ్య పతితుడగును. ఈ పాపములు చేయక శుభకర్మములు ఆచరించి శూద్రుడు బ్రాహ్మణుడు అగును. వైశ్యుడు క్షత్రియుడుగాను శూద్రుడు న్యాయము తప్పక యథావిధిగ స్వధార్మచరణము చేసి అందరికిని తాను అతిథియై అందరి భుక్త శేషమును తిన్నవాడు, వారికి శుశ్రూష పరిచర్య చేసినవాడు, సన్మార్గమందు స్థిరుడైనవాడు, దేవతల భూదేవులను పూజించినవాడు ఋతుకాల స్త్రీ సంగమము చేసినవాడు, నియతమయిన ఆహారము తిన్నవాడు వృథామాంసము తిననివాడు వైశ్యత్వమును పడయగలడు.

ఋత వచనుడు అహంభావము లేనివాడు. సుఖ దుఃఖాది ద్వంద్వములకు అతీతుడు. సామ నిపుణుడు బ్రహ్మ యజ్ఞాది నిత్య యజ్ఞములు చేయువాడు స్వాధ్యాయ పరుడు ఆచారశీలుడు ఇంద్రియములను తన అధీనమున ఉంచుకొన్నవాడు సత్కార్యకర్త సర్వవర్ణముల యెడ అసూయ లేనివాడు గృహస్థ వ్రతమూని రెండువేళల మాత్రమే భుజించుచు శిష్ట శేషము యజ్ఞ శేషము ఆరగించుచు నిష్కాముడు నిరహంకార మతి యథావిధి కాలముగ హోమము చేయుచు అగ్న్యుపాసన చేయువాడు సర్వులకు ఆతిథ్య మొసగుచు శేషాన్నము మాత్రమే తాను భుజించువాడు అగు వైశ్యుడు త్రేతాగ్నిమాత్ర సంపాద్యమైన బ్రాహ్మణత్వములడుగ ఆ వైశ్యుడు తొలుగ క్షత్రియుడై పుట్టి జన్మాది సంస్కారములు పొంది మంచి దక్షిణ నిచ్చి యజ్ఞములు చేయువారికి దానములు చేసి స్వర్గము కోరి అధ్యయనము చేసి త్రేతాగ్ని హోత్రియై ఎల్లపుడు తడిచేతితో దానములు చేయును. చేయి ఆరకుండ ధారాపూర్వకముగ (బహుదానములు చేయుచున్నమాట)

ప్రజలను ధర్మమున బాలించుచు సత్యవచనుడై ఆచారవంతుడై సత్యము అయిన ధర్మములను జేయుచు ధర్మ దండముచే దగ్ధుడుగాక (రాజందఱిని దండించు వాడయ్యును ఆతనిపై శాస్త్రవిహిత ధర్మ దండనమనునది ఒకటి ఉండి అతని అదుపులో పెట్టుచుండును. దానిచే రాజు దగ్ధుడు కాకపోవుట అనగా దానికి లోబడి ప్రజారక్షణ శిక్షణలు చేసి దానికి విధేయుడై ఉండవలెను) ధర్మ కామార్థములను మూడు పురుషార్థములను సాధించుచు కార్యములచే కార్యసాధనములచే నియమింపబడినవాడై ప్రజలవలన అఱవంతు మాత్రమే పన్ను గ్రహించువాడై స్వేచ్ఛగొని గ్రామ్య ధర్మములను సేవింపక అర్థశాస్త్రము చక్కగ ఎఱిగి ఋతుకాలమందు పత్నీ సమావేశము పొంది (సదా బ్రహ్మచారియై) సదోపవాసియై (నియమిత భోజనములు రెండిటి నడుమ ఎట్టి అల్పాహారములు గొనకుండువాడు సదోపవాసి) స్వాధ్యాయనిరతుడై శుచియై గృహమందుండి మూడువర్ణముల వారికిని అతిథ్యమిచ్చుచు మంచి మనసుతో నిత్యము అన్నమడుగు శూద్రులకు సిద్ధమైయున్నది రండనుచు స్వార్థముచేకాని కామముచేగాని ఏకొంచెమును చూడక కేవలము పితృదేవత అతిథి నిమిత్తముగానే సాధనము చేయుచు, తన ఇంటనే తాను భిక్షాన్నమునుసేవించి, ద్వికాలమగ్ని హోత్రములు చేయుచు, గోబ్రాహ్మణ హితమునకై మాత్రమే ప్రవర్తించుచు, యుద్ధమందు వెన్నుజూపక అందులో మరణించినను త్రేతాగ్ని మంత్రపూతమయిన ఉపాధితో శరీర మింకొకటి ప్రవేశించి ద్విజుడగును. అప్పుడు జ్ఞాన విజ్ఞాన సంపన్నుడై వేద పారగుడై సుసంస్కృతుడై వైశ్యుడిట్టి క్షత్రియత్వమును బడయును. శూద్రుడును ఆగమ విధానముచే (వైదిక ప్రక్రియతో కాదు) సంస్కారములను పొంది ద్విజుడగును.

బ్రాహ్మణుడే అగుగాక అసద్వృత్తముచే సర్వసంకర భోజనముచే బ్రాహ్మణ్యమును కోల్పోయి శూద్రత్వమందును. శుచి కర్మాచరణముచే దేవీ కటాక్షముచే మనస్సు శుద్ధినంది జితేంద్రియుడైన శూద్రుడును ద్విజునియట్ల సేవింప దగినవాడని బ్రహ్మ స్వయముగ పల్కెను. స్వభావ కర్మచేత శూద్రుడు ప్రవర్తించునేని ఆతడు ద్విజుల కంటెను విశుద్ధుడని నా తలంపు. యోనికాదు (జన్మకాదు) సంస్కారము కాదు, శ్రుతికాదు, సంతానము కాదు, ద్విజత్వమునకు కారణము కేవలము వృత్తమే (నడవడియే). బ్రాహ్మణుడను ఈ సర్వ జాతియు లోకమందు వృత్తమును అనుసరించి విధింపబడును. వృత్తమునన్న శూద్రుడు గూడ బ్రాహ్మణత్వమందును. ఓ రమణి! బ్రహ్మ స్వభావ మనగా సర్వత్ర సమ త్వమని నా తలంపు. నిర్గుణము నిర్మలమునైన బ్రహ్మ ఎవ్వనియందు ఉండునో అతడు ద్విజుడు. (బ్రహ్మ విషయక జ్ఞానము కలవాడన్నమాట) ఇట్టి పవిత్రులు ఒక స్థానము ఒక అధికారము అనిలేని ఒక విలక్షణ స్థితికి నిదర్శనమై ఉందురు. ప్రజాసృష్టి చేయు బ్రహ్మయే స్వయముగా

ఇట్లు చెప్పెను. బ్రహ్మపదార్థము యొక్క మహాక్షేత్రము పాదములచే ఈ లోకమందు బ్రాహ్మణ రూపమున సంచారము చేయుచున్నది. అక్కడపడిన విత్తనము ఆ కృషి (వ్యవసాయము) పరమందు ఫలవంతమగును. నిత్యసంతుష్టుడై బ్రాహ్మణ మార్గమును అనుసరించి సంహితాధ్యయనము నిత్యము చేయుచు, గృహమందు ఉత్తమ గృహస్థై, నిత్యము స్వాధ్యాయమే బ్రతుకుగా వేదాధ్యయనముచే సంపాదనచేసి బ్రతుకక యుండు విప్రుడు నిత్యసన్మార్గవర్తి, ఆహితాగ్ని, అధ్యయనపరుడునైన విప్రుడు బ్రహ్మ భావమున కర్హుడగును. బ్రాహ్మణ్యము వీడక మనసు నియమించుకొని దానిని జన్మ కారణమైన సహజ ద్విజత్వము చేతను సత్ప్రతి గ్రహముచేత దానముల చేయుటచేతను విహితకర్మాచరణములచేతను కాపాడుకొన వలయును. ఇది చాల గుహ్యమైన విషయము. శూద్రుడు ద్విజుడు కాగల విధానము ద్విజుడు ధర్మచ్యుతి నొంది శూద్రుడగు రీతియు నీకు తెల్పితిని. (223)

మానవులకు ఉత్తమగతి ప్రాప్తి

అనగా "సర్వప్రాణులకు ఈశుడవును దేవతలచేతను, రాక్షసుల చేతను సమస్కరింపబడు ఓ భగవన్! శివా! మానవుల ధర్మాధర్మములను నాకు తెలిపి సంశయము తీర్చుము. మానవులు, మానసికములు, వాచికములు, శారీరకములు అగు ఏత్రివిధ కర్మ బంధములచే బంధింపబడుదురు? ఎట్లు విడుదల పొందుదురు? ఓ దేవా! ఏ శీల ముచే ఎటువంటి కర్మచే ఏ ఆచరణములచే గుణములచే వారు స్వర్గము పొందుదురు?" అని పార్వతి పలికెను.

ఆ ప్రశ్నలను విన్న సదాశివుడు ఆమెతో ఇట్లు పలికెను –

ధర్మ తత్త్వమును ఎఱిగి నిరతము దానియందే ఉండు ఓ దేవీ! సర్వ ప్రాణులకు హితకరమై బుద్ధిని వృద్ధిచేయు నీ ప్రశ్నకు సమాధానము చెప్పెదను. వినుము : సత్య ధర్మములందు ఆసక్తులై, శాంతులై, అన్ని బాహ్యలక్షణములను వదలి సంశయ రహితులగు వారు బంధనములకు లోబడరు. అట్టివారు ప్రపంచోత్పత్తి ప్రళయముల తత్త్వము తెలిసి, సర్వజ్ఞులై కోరికలు లేక కర్మ బంధముల నుండి ముక్తి పొందుదురు. త్రికరణములతో ఏ ప్రాణిని హింసించక దేనియందు ఆసక్తి ని పొందనివారు దయకలిగి ప్రాణిహింస చేయక సత్‌శీలము ప్రియా ప్రియముల యందు సమబుద్ధి కలిగి సర్వ ప్రాణులకు విశ్వసనీయులై ఇంద్రియ నిగ్రహము కలిగినవారు కర్మలచే బంధింపబడరు. స్వర్గమును పొందుదురు. ఇతరుల ధనములయందు దారలయందు ఆసక్తి లేక వారిని తల్లిగా చెల్లెలుగా తలచుచు,

మొరటు సుఖమునకు కాక, తన భార్యను ఋతుకాలమున మాత్రమే ధర్మమునకై కలియుచు ధర్మముచే ఆర్జించిన దానితో జీవించుచు, తృప్తి నొందుచు దొంగతనము లేక సత్ప్రవర్తనము ఇంద్రియ జయము కలవారు స్వర్గము ఒందుదురు. వ్యర్థముగా ఏ ప్రాణికి అపకారము చేయక మనస్సున మాలిన్యము లేక దానము సత్కర్మము తపస్సు శీలము శుచిత్వము దయకలిగి జీవించు ఈ మార్గము దైవము నిర్ణయించినది. వివేకము కలిగి దీనినే మానవుడు అనుసరించవలెను" అని చెప్పిన పరమశివుని మాటలను వినిన పార్వతి "పూజ్యుడవగు దేవా! భూతపతీ! బంధమునకు కాని ముక్తికికాని హేతువులగు కర్మలను తెలుపుము" అని ప్రశ్నింపగా శివుడు ఆమెతో ఇట్లు అనెను :

"తన కొఱకేకాని, పరులకొఱకే కాని, జీవనమునకే కాని, ధర్మమునకే కాని, తన స్వేచ్ఛకే కాని అసత్యము పలుకరాదు. పరుషము, కటువు, నిష్ఠురము, కొండెములు, మిత్రభేదము కల్గించునది ఇతరులకు బాధ, ద్రోహమును కలిగించునది అగు మాట పలుకక మృదువై స్వచ్ఛ వర్ణములుకలిగి పాపములేక, తీయనైన పలుకులు అంతఃకరణ శుద్ధిగా కోపములేక మనోహరముగా పలుకువారు స్వర్గమును పొందుదురు. వాచికమగు ధర్మ స్వరూపము ఇది.

మానవుని స్వర్గలోక గతికి సాధనమగు మానసిక ధర్మములు చెప్పెదను వినుము. అతడు మనస్సును చెడుదానినిగా చేసినచో కర్మచే బద్ధుడగును. అరణ్యమున నిర్జన ప్రదేశమున పరధనము కనబడినను గ్రహించతలచక ఏకాంతమున లభించినను పరదారల కోరక-శత్రువులను మిత్రులను సమముగా మైత్రితో చూచుచు వేదశాస్త్రాధ్యయనము దయ శౌచము సత్యము కలిగి, తమ ధనములతో తృప్తులై ఏ ప్రాణియందు దయయే కాని వైరము లేనివారు స్వర్గమును పొందుదురు. జ్ఞానము, సత్కర్మలు, ఓర్పు మంచిమనస్సు కలవారిపై ప్రీతి ధర్మాధర్మ జ్ఞానముకలిగి తామాచరించు శుభ, అశుభ, కర్మలలో వేనియొక్క ఫలమునందును కోరికలు లేక జీవించువారు స్వర్గము నొందుదురు. ఈ చెప్పిన మానసిక పాపములను విడిచి దేవబ్రాహ్మణ భక్తికలిగి నిత్యము సత్కర్మలయందు ప్రయత్న పరులయి ఉండువారు స్వర్గము పొందుదురు. మానసిక సత్కర్మలు నీకు తెలిపితిని. మఱి ఏమి వినగోరెదవు?" అని అడుగగా పార్వతి "ఓ మహేశ్వరా! మానవుల విషయమున నాకొక సంశయము కలదు. మీరు దానిని వివరించి తీర్చవలయును. ఏ కర్మచే ఏ తపస్సుచే దీర్ఘాయువు లభించును? ఏ కర్మచే ఆయువు క్షీణించును? కర్మ విపాకము ఎట్టిది? కొందఱు మహా భాగ్యము కలవారు మఱికొందరు మందభాగ్యులు అగుటకు కొందరు గొప్పకులమున, మఱికొందరు తక్కువ కులమున పుట్టుటకు కొందఱు కొయ్య బొమ్మలవలె

కురూపులు మఱి కొందఱు అందగాండ్రు కొందఱు ప్రజ్ఞాహీనులు మఱి కొందఱు మహా ప్రజ్ఞకల పండితులు, జ్ఞానవిజ్ఞానవంతులు కొందఱు, అల్పవాక్కు కలవారు మఱి కొందఱు గొప్ప వాక్పాటవము కలవారై కనబడుటకు హేతువును తాము నాకు వివరించవలయును" అని ప్రశ్నించెను.

అప్పుడు శివుడు దేవీ! మర్త్యలోకమున ప్రతిమానవుడును తన కర్మకు తగినట్లు ఫలమును పొందు విధమును చెప్పెదను వినుము. యోగీంద్రుడే ఐనను ఎప్పుడును చేతిలో దండమును ఆయుధములను ధరించి ప్రాణి సమూహముల ప్రాణముల హింసించుచు వాటిపై దయలేక వానికి భయమే కలిగించుచు కీటకములకు పక్షులకుకూడ రక్షణనీయని వాడు నరకము పొందును. ఇట్టి ఏహింసను చేయనివాడు స్వర్గము పొందును. అట్టి ధర్మాత్ముడు స్వస్వరూపముతోనే ఉండును. హింసకుడు నరకమున భయంకరమును క్లేశములతో కూడినది అగు యాతననుపొంది, ఎట్లోదానినుండి బయటపడిన తరువాత కూడ మానవుడై జన్మించినను క్షీణాయువు అగును. పాపకర్మలు చేయుచు ప్రాణులను హింసించుచు వానికి అహితుడు అగుటయే అయుఃక్షయమునకు హేతువు. శుభకర్మలను ఆచరించుచు, ఆయుధము ధరించక ఏప్రాణిని దండించక హింసించక ఏ ప్రాణినితానై చంపక చంపువారిని అనుమోదించక తనయందు వలెనే ఇతర ప్రాణి యందును భావము కలిగి ప్రాణుల యందు స్నేహము కల నరుడు దేవత్వమును పొందును. సముచితములగు సుఖములను అనుభవించి స్వర్గమున సంతోషమును పొందును. ఒకప్పుడు ఇట్టివాడు మానవుడై జన్మించినను దీర్ఘాయుడగును. ప్రాణిహింసను విడుచుటయే దీర్ఘాయువును పొందుటకు మార్గమని బ్రహ్మ విధించెను. (224)

దేవలోక ప్రాప్తికి ఆచరింపవలసిన ధర్మ కార్యములు

పార్వతి ఇట్లు పలికెను -

"ఏ శీలము, ఏ ఆచరణము కలిగి ఏ కర్మములు ఆచరించి ఏ దానములు చేసి మానవుడు స్వర్గమును పొందును?"

మహేశ్వరుడు ఇట్లు పలికెను -

బ్రాహ్మణులను ఆదరించుచు దీనులు ఆర్తులు బీదలు అగువారికి భక్ష్యములు భోజ్యములు అన్న పానములు వస్త్రములు ఉదారబుద్ధితో దానము చేయవలెను. బాట సారులకు ఆశ్రయములను సభామండపములను కోనేరులను నిర్మించుచు నిత్య నైమిత్తిక

కామ్యకర్మలను ప్రయతుడై శుచియై చేయుచు, ఆసనములు శయనములు వాహనములు గృహములు రత్నము ధనము పొలములు పైరులు స్త్రీలు మొదలగునవి ప్రశాంత మనస్సుతో నిరతము దానముచేయునతడు దేవలోకమునకు పోవును. అచ్చట చాల కాలముండి శ్రేష్ఠములగు భోగముల అనుభవించి అప్సరసలతో కూడి నందనోద్యానము మొదలగుచోట సంతోషముతో గడిపి, అక్కడి నుండి క్రిందికి జారియు భూలోకమునందు ధన ధాన్యములతో నిండిన మహాభాగుల ఇంట జన్మించును. అచ్చట అన్ని కోరికలను అనుభవించుచు సంతోషించుచు మహాభోగములను అనుభవించును. మహా కార్యములు చేయును. ధనవంతుడగును. అందరకు చూడముచ్చటయగు బ్రాహ్మణుడగును.

ఉండియు దానము చేయక అన్నముపెట్టక దీనులను అంధులను పేదలను భిక్షుకులను అతిథులను చూచియు, వారు యాచించుచున్నను నాలుక కదలించి మాటనైన ఆడక, ధనము సువర్ణము వస్త్రములు భోగములు గోవులు వివిధములగు అన్నములు దానము చేయక లోభులై, నాస్తికులై అవివేకులై ఉండువారు నరకము పొందుదురు. ఇట్టివారు నరకయాతనలైన తరువాత మానవులుగా జన్మించినను ఆకలిదప్పులు బాధలు పడుచు జనులచే వెలివేయబడి ఏ భోగములను అనుభవించు ఆశయులేక జీవనాధారము లేక తక్కువ భోగములతో బీదలై ఉందురు. కపటులై గర్వముకలిగి అల్పబుద్ధులై పీఠముతో గౌరవించదగినవారిని అట్లు గౌరవించక త్రోవ ఈయవలసిన వారికి త్రోవ ఈయక పూజించదగినవారిని పాద్యము ఆచమనీయము మొదలగు వానితో పూజించక గురువులతో ప్రేమగా శుభము అభిమతమైన మాటలాడక దురభిమానము లోభము కలవారై సన్మానించదగిన పెద్దలను సన్మానించక పోగా అవమానించువారు అందరును నరకమును పొందుదురు. ఎన్నో వేల ఏండ్లు నరకము అనుభవించి మరల మానవులై పుట్టినను శునక మాంసము వండితినువారి వంటి బుద్ధిహీనుల, నింద్యుల ఇండ్లలో నింద్యులుగా పుట్టుదురు.

దంభము దురభిమానములేక దేవతలను అతిథులను గౌరవించుచు జనులచే పూజింపబడుచు పెద్దలకు నమస్కరించుచు తీయని మాటలాడుచు సర్వకర్మలచే ఇతరులకు ప్రీతికలిగించుచు ఏ ప్రాణిని ద్వేషించక మంచి ముఖ లక్షణములు స్నేహభావము కలిగి ఎదుటి వారికి స్వాగతము పలుకుచు యథార్థముగా సత్కార పూర్వకముగా త్రోవ ఈయదగిన వారికి త్రోవ ఇచ్చుచు గురువుల గౌరవించుచు అతిథులను అభ్యాగతులను పూజించునరుడు స్వర్గము పొందును. తరువాత కూడ మానవ లోకమున గొప్ప ఇంటపుట్టి సర్వ రత్నములు-శ్రేష్ఠ వస్తువులు లభించి సర్వ భోగములను పొంది తగిన విధమున దానము చేయుచు ధర్మములను ఆచరించుచు సర్వ ప్రాణుల సమానమును నమస్కారములను

అందుకొనువాడగును. మొత్తము మీద మనుష్యుడు ఎప్పుడును తాను చేసిన కర్మమునకు అనుగుణమగు ఫలమును పొందును అని నిర్ణయము. విధాత బ్రహ్మ స్వయముగానే చెప్పిన ఈ ధర్మమును నీకు చెప్పితిని. సర్వ ప్రాణులకు భయమును కలిగించు ప్రవర్తనము కలిగి హస్తములతోనో పాదములతోనో, త్రాటితోనో, కఱ్ఱతోనో, గడ్డలతోనో, స్తంభముల వంటి ఇతరోపాయములతోనో, ప్రతీకార బుద్ధితో ప్రాణులను బాధించుచు, భయపెట్టుచు ఉండువాడు నరకమును పొందును. ఎంతో కాలము తరువాత అతడు మనుష్యుడై పుట్టినను జనులకు ద్వేష్యుడై అధముడై జ్ఞాతులకు బంధువులకు ఇష్టుడు కాక ఉండును.

సర్వ భూతములను దయతో మైత్రితో చూచుచు ఖానికి తండ్రివలె మెలగుచు వైరము చూపక ఇంద్రియముల జయించి హస్త పాదాదులతో ప్రాణుల హింసించక భయ పెట్టక అన్ని ప్రాణులకు విశ్వసనీయుడై శుభకర్మలను ఆచర్రించుచుండువారు స్వర్గమును పొంది అచ్చట దేవతల వలెనే దివ్యమగు భవనమున సంతోషము నొందును. స్వర్గసుఖానుభవము ముగిసిన తరువాతను కూడ మానవుడు పుట్టి శ్రమలు భయములు లేక సుఖమును అనుభవించును.

మానవులలో కొందఱు ఊహలు అపోహలు, విషయముల వింగడించుకొనుట, చేయుటలో నేర్పుకలిగి ఆధ్యాత్మిక విషయజ్ఞానము లౌకిక విషయములలో విజ్ఞానము కలిగి ప్రజ్ఞావంతులై అర్ధ విషయములలో నేర్పుకలిగి యున్నారు. మఱి కొందఱు ప్రజ్ఞా రహితులై జ్ఞానవిజ్ఞానములు లేక ఉన్నారు. కొందఱు పుట్టుగ్రుడ్డివారు, రోగార్తులు నపుంస కులు అగుచున్నారు. ఏ కర్మ ఫలముగా వీరు ఇట్లు వైవిధ్యము పొందు చున్నారో, సర్వధర్మము లను ఎరిగిన వారిలో శ్రేష్ఠుడవగు ఓ విరూపాక్షా! నాకు తెలిపి నా సంశయము తీర్చుము.

వేదార్థముల నెఱిగిన బ్రాహ్మణులను సిద్ధులను ధర్మముల ఎఱిగిన వారిని అనుదినము మంచి చెడులను అడుగుచు, అశుభకర్మముల విడిచి శుభకర్మలను ఆచరించు వాడు ఇహలోకమున సుఖములు అనుభవించి పరమున స్వర్గమును పొందును. ఆతడు మరల మానవుడై పుట్టినను మేధావంతుడు యజ్ఞాది కర్మలయందు ఆసక్తితో కూడిన శుభమగు శాస్త్ర సంస్కారము కలవాడగును. దుష్ట స్వభావముతో పరదారలను చెడుచూపు చూచువాడు పుట్టు గ్రుడ్డి అగును. వివస్త్రయగు స్త్రీని అధిక దుష్టమగు మనస్సుతో చూచువాడు ఈ దుష్కృతమునకు ఫలముగా రోగములచే బాధనొందును. మూఢులై దురాచరణము కలిగి, యోనికానిచోట్ల మైథునము చేయువారు ప్రజ్ఞారహితులు నపుంసకులు అగుదురు. మైథునమునకై పశువులను బంధించువారు గురుపత్నితో సంగమించు వారు వివిధములుగ మైథునము చేయువారును నపుంసకులు అగుదురు.

ఓ దేవశ్రేష్ఠా! దోషముతో కూడిన ఏ కర్మను విడిచి దోష రహితమగు ఏ కర్మను ఆచరించి మానవుడు శ్రేయమును పొందును?

శ్రేయస్సు కలిగించు మార్గమును ధర్మములను సద్గుణములను కోరుచు అవి ఎరిగిన బ్రాహ్మణులను అడిగి తెలిసి ఆచరించువాడు స్వర్గము నొందును. తరువాత మనుష్యుడై పుట్టినను ఇంద్రియ నిగ్రహము మేధ ధారణాశక్తి కల ప్రాజ్ఞుడుగా జన్మించును. మానవులకు క్షేమము కలిగించు సన్మార్గము ఇది. మానవుల శ్రేయము కోరి నీకు తెలిపితిని.

ఓ పరమేశ్వరా! కొందఱు అల్ప విజ్ఞానము ధర్మ ద్వేషము కలవారై వేదధర్మములను ఎఱిగిన బ్రాహ్మణులను ధర్మమును అడిగి తెలిసికొనగోరక ఉన్నారు. మంచి నియ మములను కర్మలను ఆచరించక నియమ భ్రష్టులై రాక్షసులవలె ఉందురు. మఱి కొందఱు మంచి వ్రతములను ఆచరించుచు శ్రద్ధ ఇంద్రియ నిగ్రహము కలిగి యజ్ఞాదుల నాచరిం చుచు మూఢత్వములేక ఉందురు. ఏ కర్మములకు ఫలముగా ఇట్లగుదురో తెలుపుము.

పూర్వులు నిర్మించిన ధర్మశాస్త్రముల లోక ధర్మముల వ్యవస్థలను శాస్త్ర ప్రమాణాను సారము ఆచరించువారు దృఢవ్రతులై ఆయాశాస్త్రీయ కర్మలను గట్టిగా ఆచరించువారుగా ఉన్నారు. అజ్ఞానవశమున అధర్మమును కూడ ధర్మము అని చెప్పుచు సద్వ్రతములను ఆచరించక శాస్త్ర మర్యాదలను విడిచినవారు బ్రహ్మరాక్షసులగుదురు. కాలమును అనుసరించి పనులనాచరించుచు, హోమము వషట్కారమువంటి వైదిక కర్మానుష్ఠాన మునకు దూరముగా ఉండువారు నరాధములు అగుదురు. ఓ దేవీ! నీ సర్వ సంశయ ములను ఛేదించుటకుగాను మానవుల శ్రేయమునకు అశ్రేయమునకును హేతువగు ధర్మ సముద్రమును ఈ విధముగా వివరించితిని" (225)

వాసుదేవ మహిమ

ఇట్లు పరమేశ్వరుడు చెప్పిన విషయము అంతయు విని జగన్మాత హర్షమును ప్రీతిని ఆశ్చర్యమును పొందెను. ఆ సమయములో శివుని సమీపమున ఉన్న మునివరు లును తీర్థయాత్రా ప్రసంగమున అచటికివచ్చి చేరియున్న ద్విజులును శివుని సంపూజించి నమస్కరించి లోకముల హితమునుకోరి తమకుగల సంశయమును ప్రశ్నించిరి.

"ఓ త్రిలోచనా! దక్షయజ్ఞ వినాశనా! జగన్నాథా! మా హృదయమందున్న సంశయ మును అడుగుచున్నాము. మహాఘోరమయి భయంకరమయి గగుర్పాటు కలిగించు ఈ సంసారములో అల్పప్రజ్ఞ కలవారగు మానవులు ఎంతో కాలము జన్మ ఆవృత్తి పొందు

చున్నారు. వీరు జన్మ సంసారముల బంధనమునుండి విడుదల పొందు ఉపాయమును వినగోరుచున్నాము చెప్పుము.

ఓ బ్రాహ్మణులారా! కర్మపాశములచే బద్ధులయి దుఃఖములను అనుభవించుచున్న మానవులకు వాసుదేవుడు తప్ప వేరు ఉపాయములేదు. శంఖ చక్ర గదా ధరుడగు ఆ దేవుని మనోవాక్కర్మలతో లెస్సగా పూజించువారు మోక్షమును పొందుదురు. జగద్రూపుడగు వాసుదేవుని వైపునకు మరలి ఉండని మనస్సు కలవారు పశువులవలెనే ఆహారనిద్రాది చేష్టలతో ఈ లోకమున జీవించుటవలన ప్రయోజనము ఏమున్నది ?

ఓ పినాకధారీ! భగుడు అను ఆదిత్యుని నేత్రము పోగొట్టినవాడవు, సర్వలోకముల నమస్కృతుల అందుకొనువాడవు అగు శంకరా! వాసుదేవుని మాహాత్మ్యమును వినగోరు చున్నాము.

బ్రహ్మ కంటెను మేలగువాడు శాశ్వతుడగు పురుషుడు హరి. అతడే కృష్ణుడు. మేఘములులేని ఆకాశమున ఉదయించిన సూర్యునివలె బంగారు కాంతితో ప్రకాశించు వాడు. పది బాహువులు మహా తేజస్సుకలిగి రాక్షస సంహారియై శ్రీవత్సమను మచ్చతో కూడి విషయేంద్రియములకు అధిపతియై సర్వదేవతా సమూహమునకు ప్రభువగువాడు. ఆతని ఉదరమునుండి బ్రహ్మశిరస్సు నుండి నేను జన్మించితిమి. శిరోజముల నుండి జ్యోతిస్సులు, రోమముల నుండి దేవదానవులు దేహమునుండి ఋషులు శాశ్వతములగు లోకములు జనించినవి. అతడు సాక్షాత్ బ్రహ్మకును సర్వలోకములకును గృహము. ఈ పృథివి అంతటిని సృష్టించువాడు-త్రిలోకములకు ఈశ్వరుడు, రక్షకుడు. చరాచర భూతముల సంహరించువాడు. తానే దేవతలకును దేవుడు, రక్షకుడు. పరుల తపింప జేయువాడు. సర్వజ్ఞుడు సర్వము సృష్టించువాడు అంతట ఉండువాడు. అన్నివైపులకు ముఖములు కలవాడు. మూడు లోకములందును అతనికంటె మేలగు తత్త్వము ఏదియు లేదు. సనాతనుడు, ఎల్లప్పుడు ఉండువాడు, మహాభాగుడు, గోవిందుడు, సర్వధర్మ రక్షకుడు అని ప్రసిద్ధి కలవాడు. మహామానవంతుడగు ఆ వాసుదేవుడు దేవకార్యార్థమై మానవదేహము ధరించి యుద్ధమున రాజులను అందఱను సంహరించును. ఈ త్రివిక్రముడు లేనిదే ఈ లోకమున దేవతలును తమకార్యములను నెరవేర్చుకొనజాలరు. అతడు సర్వ భూతముల నమస్కారములను అందుకొను సర్వ భూతనాయకుడు. ఆతనికి నాయకులు ఎవరునులేరు. దేవతలకు రక్షకుడు కార్యజగద్రూపుడు పరబ్రహ్మ తత్త్వరూపుడు బ్రహ్మర్షులకును శరణ్యుడుఅగు అతని నాభియందు బ్రహ్మశరీరమునందు నేను అందఱు దేవతలును సుఖముగా ఉన్నాము. ఆ దేవుడు పద్మనేత్రుడు. లక్ష్మి తన గర్భమందున్నవాడు.

లక్ష్మితో కూడియుండువాడు, శార్ఙ్గము చక్రము ఖడ్గము గరుడధ్వజము కలిగి ఉత్తమమగు సుశీలము శౌచము బహిరింద్రియ నిగ్రహము పరాక్రమము వీర్యము దేహసౌందర్యము చక్కని ఆకృతి ఎత్తుసరి ఋజు స్వభావ సంపద సౌమ్యత రూపము బలము కలవాడు. ఆశ్చర్యకరమగు రూపములుకల సర్వ దివ్యాస్త్రములు కలవాడు. యోగమాయచే వేయి కన్నులు విరూపములగు కన్నులు కలవాడు. ఉన్నత మనస్సుకలవాడు. వాక్కుతో తన మిత్రజనుల మెచ్చువాడు. జ్ఞాతులకును బంధుజనులకును ప్రియుడు. క్షమాగుణము కలవాడు. అహంకారము లేనివాడు. బ్రహ్మత్వమును ఇచ్చువాడు. భయముచే బాధనొందు వారి భయమును పోగొట్టువాడు. మిత్రుల ఆనందమును వృద్ధిచేయువాడు. సర్వభూతము లకు శరణ్యుడు. దీనుల పాలించుటయందు ఆసక్తుడు. వేదశాస్త్రముల అధ్యయనము యోగ్యత కలవాడు. ఆశ్రితులకు రక్షకుడు. శత్రుభయంకరుడు. నీతితత్త్వమును ఎఱిగి ఆచరించువాడు. వేదవేదాంగతత్త్వము ప్రవచించువాడు. ఇంద్రియముల జయించినవాడు.

దేవతల మేలు కొఱకే, ఆ వాసుదేవుడు ఉత్తమ బుద్ధిశాలియై ధర్మముచే సంస్కరింప బడినను ప్రజాపతి యొక్క శుభ మార్గమున మహాత్ముడగు మనువు వంశమున జన్మించును. మనువునకు అంశుడు అతనికి అంతర్ధాముడు అతనికి పూజ్యుడగు హవిర్ధాముడను ప్రజాపతి అతనికి ప్రాచీన బర్హి జనింతురు. అతనికి ప్రచేతసుడు మొదలగు పదిమంది కుమారులు పుట్టుదురు. వారిలో ప్రచేతసుని కుమారుడగు దక్షుడు ప్రజాపతి అగును. దక్షుని పుత్రికలు దాక్షాయణులను నక్షత్రములు. ఆదిత్యుని కుమారుడు వైవస్వతమనువు. ఈ వైవస్వతమను వంశమున ఇల అను ఆమెయు సుద్యుమ్నుడును జన్మింతురు. ఇలా కుమారుడు బుధుడు, ఆతనికి పురూరవసుడు, ఆతనికి ఆయువు, ఆతనికి నహుషుడు, ఆతనికి యయాతి, ఆతనికి యదువు, అతనికి మహాబలశాలియగు క్రోష్ట, ఆతనికి వృజినీవాన్, ఆతనికి పరాజయమునే ఎఱుగని వీరుడగు ఉషంగుడు, ఆతనికి శూరుడగు చిత్రరథుడు, ఆతనికి కడసారి కుమారుడుగా శూరుడనువాడు కలుగును. ప్రసిద్ధమగు వీర్యము కలిగి సత్ప్రవర్తనము సద్గుణములు కలిగి యజ్ఞములను ఆచరించిన పవిత్రుల వంశమున జన్మించిన క్షత్రియశ్రేష్ఠుడు మహావీర్యము మహాయశస్సుకల ఆ శూరుడను అతడు తనవంశమును విస్తరింప చేయువాడును అభిమానశాలియు వసుదేవుడని ప్రసిద్ధి పొందినవాడును అగు దుందుభిని కుమారునిగా పొందును. అతనికి కుమారుడు చతుర్బాహుడగు వాసుదేవుడు. యదువంశ సంజాతుడగు దాత-బ్రాహ్మణులను ఆదరించు వాడు, బ్రాహ్మణులకు ప్రీతిపాత్రుడు బ్రాహ్మణుల యందు ప్రీతి కలవాడు. గిరి వ్రజము నందలి మగధరాజగు జరాసంధుని, అతడు జయించి అతనిచే బద్ధులై యున్న రాజులను

అందఱను విడిపించును. పృథివియందే తనకెదుఱులేని వీర్యవంతుడగు ఆ వాసుదేవుడు, శ్రీకృష్ణుడు సమస్త రాజశ్రేష్ఠులచే ఆశ్రయింపబడును. సమస్త రాజులకు రాజై విక్రమము కలిగి శూరునకు ఉండదగిన దృఢ దేహనిర్మాణము కలిగి ఆ ప్రభువు ద్వారక యందు వసించుచు, చెడుమనస్సు కలవారగు శత్రువుల జయించి భూదేవిని పాలించును. మీరు ఆతనిని ఆశ్రయించి బ్రాహ్మణులకు చేయదగిన మేలైన పూజలతో శాశ్వతుడగు పరబ్రహ్మ మునువలె శాస్త్ర న్యాయానుసారము అర్చింతురు. లోకపితామహుడగు బ్రహ్మను నన్నును దర్శింపగోరువారు ప్రతాపవంతుడును భగవానుడు అగు వాసుదేవుని దర్శింపవలెను. అతనిని దర్శించుట నన్ను దర్శించుటయే. అందు సందేహములేదు. బ్రహ్మయు వాసుదేవుడే అని ఓ తపోధనులారా! తెలిసికొనుడు. పుండరీకాక్షుడగు వాసుదేవ కృష్ణునకు ఎవరిపై ప్రీతికలుగునో వారి విషయమున బ్రహ్మాది దేవతలందఱు ప్రీతులగుదురు. శ్రీకృష్ణుని ఆశ్రయించిన మానవునకు కీర్తియు స్వర్గమును లభించును. ధార్మికుడు అగు వాసుదేవుడే ఇతరులకు సర్వ ధర్మములను ఉపదేశించువాడగును. ధర్మము ఎఱిగిన వారెల్లరును దేవతలకు ప్రభువు, అచ్యుతుడు - తన్నాశ్రయించినవారిని అధోగతికి పోనీయనివాడు - అగు వాసుదేవునికి నమస్కరింపవలెను. విభుడగు ఆ శ్రీకృష్ణుని ఆసక్తితో అర్చించినచో ధర్మమే లభించును.

మహా తేజస్సు కలవాడును, పురుష శ్రేష్ఠుడును అగు ఆ వాసుదేవుడు ప్రజల హితమును కోరి ధర్మమును ఉద్ధరించుటకై ఋషులన్ను సృష్టించెను. సనత్కుమారుడు మొదలగు ఆ ఋషులు తపోవంతులై గంధమాదన పర్వతమున ఉన్నారు. అందువలన ఓ బ్రాహ్మణ శ్రేష్ఠులారా! ధర్మజ్ఞుడును ధర్మ ప్రవచన సామర్థ్యము కలవాడును అగు ఆ వాసుదేవునికి నమస్కరించినచో అతడును వారికి నమస్కరించును. అట్లే తన్నాదరించిన వారిని తానాదరించును. తన్ను దర్శించినవారిని తాను దర్శించును, తన్నాశ్రయించినవారిని తనాశ్రయించును. తన్నర్చించిన వారిని తానర్చించును. ఇట్లు మానవ లోకమున సజ్జనులు దోషరహితుడు సద్గుణశాలి ఆదిదేవుడు పూజ్యుడునగు విష్ణుని విషయమున తపమాచరింతురు. సనాతనుడు, శాశ్వతుడు అగు ఆదేవుని దేవతలును అర్చింతురు. తమకు తగిన అభయముతో, శరణాగతితో ఆయనను అనుష్ఠించుచు ద్విజులు మొదలగువారు త్రికరణములతో నమస్కరించుచు యగ్నిపూర్వకముగా దర్శనము చేసికొనవలెను. ఓ మునిశ్రేష్ఠులారా! నేను వ్యవస్థచేసిన మార్గము ఇది. సర్వ దేవులకు ఈశుడగు ఆ వాసుదేవుని దర్శించినచో సర్వదేవ శ్రేష్ఠులను దర్శించినట్లే. మహావరాహరూపుడు సర్వలోక సృష్టికర్త జగములకు రక్షకుడు అగు ఆ వాసుదేవుని నేనును నిత్యము నమస్కరించుచుందును.

నేను మొదలుగా సమస్త దేవతలును ఆయన దేహమున వసింతుము. కనుక ఆయన దర్శనముచే త్రిమూర్తుల దర్శనము జరుగును. ఆ వాసుదేవుని అన్న వెండికొండల కాంతి వంటి కాంతి కలిగి హలి-హలము ధరించినవాడు, బలుడు అని ప్రసిద్ధుడై భూమిని రక్షించును. అతడు సహస్ర శిరస్కుడగు శేషుడే. దేవుడును ప్రభువును పరమాత్మ రూపుడునగు ఆతని అంతమును కశ్యపుని కుమారుడును బలశాలియునగు గరుడుడును తన వీర్యముతో చూడజాలక పోవుటచే అతడు అనంతుడు అనబడెను. ఆ శేషుడే సంతోషముతో కూడి భూమ్యంతర్భాగమున భూమిని చుట్టుకొని తన పడగలతో భూమిని ధరించుచు చరించుచు వసించుచున్నాడు. ఆ విష్ణువే ఈ అనంతుడు. అట్లే సర్వ ధరాధరుడగు హృషీకేశుడగు వాసుదేవ కృష్ణుడే ఈ బలరాముడు. ఈ పురుష శ్రేష్ఠులు ఇరువురును దివ్యులు, దివ్య పరాక్రమము కలవారు. చక్రమును నాగలిని ధరించిన ఈ ఇరువురను మీరు అర్చించి పూజించవలెను. ఓ తపోధనులారా! మీకు నేను తెలుపుచున్న అనుగ్రహము ఇదియే. కనుక మీరు ప్రయత్నపూర్వకముగా ఆ యదుశ్రేష్ఠుని పూజించవలెను. (226)

విష్ణు భక్తులు ఉత్తమ గతులను పొందు విధము

ఆశ్చర్యకరమును సర్వపాపహరమును పుణ్యకరమును ధన్యత కలిగించునదియు సంసారబంధ నాశనమునగు శ్రీకృష్ణ మాహాత్మ్యమును మేము వింటిమి. చాల సంతోషమైనది. ఓ మహామునీ! మానవులు వాసుదేవుని అర్చించుట యందు ఆసక్తులయి భక్తితో విధివిధానమున ఆతని అర్చించువారు ఏగతిని పొందుదురు? స్వర్గమునా? మోక్షమునా? రెంటినా? మా ఈసంశయమును ఛేదించుము. ఓ ముని శ్రేష్ఠా ! అందులకు నీవు తప్ప సమర్థులు మఱెవ్వరును లేరు" అని మునులు వ్యాసుని అడిగిరి.

"ముని శ్రేష్ఠులారా! వైష్ణవులకు సుఖము కలిగించు మీ ప్రశ్నకు సమాధానమును వినుడు. నరులు కృష్ణుని దీక్షా మాత్రముచేతనే ముక్తి పొందుదురు. ఎల్లప్పుడును భక్తితో ఆ అచ్యుతుని పూజించువారి విషయము చెప్పవలసినదేమి? ఓ మునిసత్తములారా! వారికి స్వర్గముకాని మోక్షముకాని దుర్లభముకాదు. వైష్ణవులు తాము కోరిన కోరికలు ఎంత దుర్లభములైనను పొందగలరు. రత్న పర్వతము నెక్కినవారు రత్నముల వలెను కల్పవృక్షము నాశ్రయించి ఫలములు కోసికొన్నట్లును వారు జగద్గురుడగు వాసుదేవుని విధిని అనుసరించి అర్చించినందులకు ఫలముగా ధర్మ అర్థ కామ మోక్ష ఫలములను పొందుదురు. జగన్నాథుని విశుద్ధమగు అంతఃకరణముతో ఆరాధించిన మానవులు

దేవతలకును దుర్లభములగు కామితములు పొందుదురు. సర్వ పాపహరుడును సర్వకామిత ఫలములను ఇచ్చువాడును అగు శ్రీహరిని అర్చించు నరులు లోకమున ధన్యులు. ఏలయన బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రులును కడజాతివారును స్త్రీలును ఆ దేవశ్రేష్ఠుని అర్చించుటచే ఉత్తమగతిని పొందుదురు. కనుక ఓ మునులారా! అట్టి మహనీయులు పొందు ఉత్తమగతిని సంగ్రహముగా చెప్పెదను. వినుడు.

రోగములకు ఆశ్రయము అస్థిరము జరామరణ యుక్తము నీటిబుడగతో సమము మాంస రక్తముల దుర్గంధము కలది మలమూత్రాదియుక్తము ఎముకలనెడి కట్టుకొయ్యలతో కూర్చబడినది అపవిత్రము నులినరములతో చర్మముతో రక్తనాళములతో కూడినది అగు మానవదేహమును విడిచి సంకల్పముతో నడచునది, దివ్యగంధర్వుల సంగీతముతో కూడినది లేత సూర్యుడువలె ప్రకాశించునది, చిఱు మువ్వల గుత్తుల మాలలు కలది అగు విమానము నెక్కి గంధర్వులు గానము చేయుచుండ అప్సరలు అలంకరించుచుండ వేరువేరుగా ఆయా లోకపాలుర లోకములకు పోవుదురు. ఒక్కొక్క లోకమున ఒక్కొక్క మన్వంతర కాలము సర్వ భోగములను అనుభవించి వారు అంతట సర్వ సుఖప్రదమగు అంతరిక్ష లోకమునకు వత్తురు. అచ్చట శ్రేష్ఠమగు భోగములు పదిమన్వంతరముల పాటు అనుభవించి అక్కడనుండి గంధర్వ లోకమునకు పోయి ఇరువది మన్వంతరముల పాటు మనోహరములగు భోగములను అనుభవింతురు. అచటినుండి ఆదిత్యలోకములకు పోయి ఇరువది మన్వంతరములపాటు మనోహరములగు భోగములను అనుభవింతురు. అచటి నుండి ఆదిత్య లోకములకు ఏగి అచ్చట చక్కగా పూజలనందు కొనుచు ముప్పది మన్వంతరముల కాలము దేవతలకును దుర్లభములగు భోగములను అనుభవింతురు. అటనుండి సుఖప్రదమగు చంద్రలోకమునకుపోయి నలువది మన్వంతరములు, అటనుండి నక్షత్ర లోకమున ఏబది మన్వంతరములు, దేవలోకమున అఱువది మన్వంతరములు అటనుండి ఇంద్రలోకమున డెబ్బది మన్వంతరములు అటనుండి ప్రజాపతి లోకమున ఎనుబది మన్వంతరములు జరామరణములు లేక ఉత్తమములగు భోగములను అనుభవించి బ్రహ్మ లోకమునకు పోవుదురు.

ఇట్టి వైష్ణవులు బ్రహ్మలోకమున తొంబది మన్వంతరములు సమస్త సుఖములను అనుభవించి మరల ఈ భూ లోకమునకువచ్చి బ్రాహ్మణులలో ఉత్తమ వంశమున యోగులుగా వేదవేదాంగ సారము నెఱిగిన బ్రాహ్మణులుగా జన్మింతురు. మరల క్రమ క్రమముగా పైకిపైకి పోవుచు ప్రతి జన్మమునందును నూఱేసి సంవత్సరములు జీవించి యథేప్సితములగు భోగముల ననుభవించి లోకాంతరమునకు పోవుదురు. ఇట్లు పది జన్మములైన

తరువాత వారు బ్రహ్మ లోకమునుండి దివ్యమగు విష్ణులోకమునకు ఏగుదురు. అచ్చట నూరు మన్వంతరముల కాలము సర్వ గుణములతో కూడిన అక్షయభోగములను అనుభవించి జన్మమరణములు లేనివారయి వారాహమూర్తి యొక్క లోకమునకు ఏగుదురు. ఓ బ్రాహ్మణ శ్రేష్ఠులారా! ఈ వైష్ణవులు అచ్చట మహాబలము చతుర్బాహువులు కలదియగు దివ్యమగు మహాశరీరము కలిగి సర్వదేవతల నమస్కారములు అందుకొనుచు పదివేలకోట్ల సంవత్సరములు ముక్తి సుఖము అనుభవించుచుందురు. అచనుండి నరసింహదేవుని గృహమునకుఏగి పదివేలకోట్ల సంవత్సరములు విహరించి తదంతమున విష్ణు లోకమునకు పోయి అచ్చటను అనేక కోట్ల సంవత్సరములు ఆనందింతురు. తరువాత ఈ సాధకోత్తములు బ్రహ్మ లోకమున నూర్ల కోట్ల సంవత్సరములు అనేకములు ఆనందించి నారాయణుని పురమునకు ఏగి అర్బుదముల కోట్ల సంవత్సరములు ఉండి యానందించి దివ్యరూపులై మహాబలులై సురాసురుల స్తోత్రములందుకొనుచు అనిరుద్ధుని పురమున జరామరణములు లేక పదునాలుగు వేలకోట్ల సంవత్సరములుండి ఏ సంతాపములును లేక ప్రద్యుమ్నపురమునకు పోయి అచట మూడు వందల లక్షల కోట్ల సంవత్సరములు సుఖింతురు. తరువాత ఈ యోగులు బలశక్తితో కూడి స్వచ్ఛంద గమనము కలవారగుచు సంకర్షణ లోకము చేరి అచట చాలకాలము సహస్ర విధములగు భోగముల ననుభవించి సర్వ మోక్షమును పొంది సర్వదోష రహితము జరామరణ రహితమునగు వాసుదేవ నామముగల పరతత్త్వము నందు ప్రవేశింతురు. ఇది నిశ్చయము. ఓ ముని శ్రేష్ఠులారా! వాసు దేవార్చనమున ఆసక్తులు పొందు ఫలములు సుఖములు ఇట్టివి.

విష్ణుమహిమ గానమునకు ఫలము

రెండు పక్షములందును ఏకాదశీ తిథినాడు ఉపవసించి శ్రద్ధాయుక్తుడై లెస్సగా విధానానుసారము స్నానమాడి మడుగువస్త్రము ధరించి జితేంద్రియుడై విధివత్‌గా శ్రద్ధతో మనస్సు నిలిపి విష్ణుని పుష్పములతో బహు విధములగు ఉపచారములతో జప హోమ ప్రదక్షిణములతో నానావిధములగు స్తోత్రము లతో దివ్యములు మనోహరములు అగు గీత వాద్యము లతో నమస్కారములతో ఉత్తమములగు జయశబ్దములతో పూజించి రాత్రి యందు జాగరణముచేసి విష్ణుని యందు పరమ శ్రద్ధ కలిగి ఆ మహనీయుని కథలనో గీతికలనో గానము చేసినచో నరులు విష్ణుని స్థానమును పొందుదురు. ఇది నిశ్చయము" అని వ్యాసుడు పలికెను.

"ఓ వ్యాస మహామునీ! జాగరణము చేసి గీతికాగానము చేయుట వలన కలుగు ఫలమును వినగోరుచున్నాము" అని మునులు అడిగిరి.

"ఓ ముని శ్రేష్ఠులారా! ప్రజాగరము చేసి విష్ణు మహిమ గానము చేయుటవలని ఫలమును క్రమముతో చెప్పెదను వినుడు."

భూ లోకమున ప్రసిద్ధి పొందిన అవంతీ నగరమున శంఖ చక్ర గదాధరుడగు విష్ణువుకలడు. ఆ నగరము చివరలో గానమున నేర్పరియగు ఛండాలుడు కలడు. అతడు సద్వృత్తితో ధనమార్జించి తనసేవకులను పోషించుచుండును. అతడు విష్ణుభక్తుడై ప్రతి మాసమునను దృఢవ్రతుడై ఏకాదశినాడు ఉపవసించి రాత్రి జాగరణము చేసి విష్ణుని అవతారములను గూర్చి అతని నామముచే అంకితములగు గీతికలను సప్త స్వరప్రస్తార యుక్తములగు గానము చేయును. ప్రాతః సమయమున ద్వాదశీ తిథిలో విష్ణునికి నమస్కరించి స్వగృహమునకు వచ్చి తన కూతుళ్లు, అల్లుండ్రు, మేనల్లుండ్రు పరివారము – వీరిని భుజింపజేసి తరువాత తాను భుజించును. ఇట్లు విష్ణు ప్రీతిని కలిగించుచు జీవించు అతనికి చాలవయస్సు గడచెను. ఇట్లుండ ఒకప్పుడు చైత్ర కృష్ణ ఏకాదశినాడు విష్ణుసేవకై ఆతడు భక్తి తత్పరుడై పూలు తెచ్చుటకై ఉత్తమ వనమునకు పోయి క్షిప్రానది ఒడ్డున కలి వృక్షము క్రిందనున్న ఒక రాక్షసునకు కనబడెను. ఆ రాక్షసుడు ఈ చండాలుని తిన గోరెను. నీవు నన్ను ఈనాడు తినవలదు. నేను రేపు మరల నిజముగా వత్తును. నేను ఈనాడు పూజ చేసికొనవలయును. కాన రాక్షసా! నన్ను విడువుము. రాత్రి జాగరణము చేసి నేను విష్ణుని సేవింతును. నాకు వ్రత విఘ్నము చేయవలదు అని చండాలుడు రాక్షసుని వేడెను.

ఓ చండాలుడా! పదినాళ్ళు నాకు ఆహారము లేక ఈనాడు నీవు నాకు దొరకితివి. నాకు చాల ఆకలిగా ఉన్నది. నేను నిన్ను విడువను. భక్షింతును అని పలికిన రాక్షసుని బ్రతిమాలుచు, చండాలుడు దృఢములగు సత్యవచనముల ఇట్లు పలికెను :

బ్రహ్మ రాక్షసా! వినుము. జగత్తునకు అంతటికి సత్యమే మూలము. నేను మరల వత్తునని సత్యముతో శపథము చేయుచున్నాను. నరుడు చేయు పనులకు సూర్య చంద్రులు అగ్నివాయువులు, భూమ్యాకాశములు జలము మనస్సు అహోరాత్రములు యముడు ప్రాతః సాయం సంధ్యలు సాక్షులు. నేను మరల నీ దగ్గరకు రానిచో పరదార ధనములందు ఆసక్తి బ్రహ్మహత్య సురాపానము గురుదార గమనము గొడ్రాలికి శూద్ర స్త్రీకి పతి అగుట పూజారితనము చేప, పంది, తాబేలు వీని మాంసము తినుట నిష్కారణముగా మాంసము తినుట, వెన్ను మాంసము తినుట, కృతఘ్నత మిత్ర ద్రోహము, మారుమనువాడిన స్త్రీని పెండ్లాడుట, సూతకము కలుపుకొనుట క్రూరకర్మలు చేయుట పిసినిగొట్టుతనము

అతిథులను ఆదరింపకుండుట అమావాస్య అష్టమి షష్ఠీ కృష్ణ శుక్లపక్ష చతుర్దశులు–ఈ తిథుల యందును శ్రాద్ధముచేసిన తరువాతను స్త్రీతో సంగమించుట, బహిష్మఐన స్త్రీని కలియుట, మిత్రుని భార్యను పొందుట, చాడీలు చెప్పుట, కపటము, మోసము చేయుట, తేనెను దొంగిలించుట, బ్రాహ్మణునికి దానమిత్తునని ఒప్పుకొనినది ఈయకుండుట, కన్యను గోవును కంచరగాడిదను ఇత్తునని ఈయకుండుట, స్త్రీ బాలవధ, అసత్యమాడుట, వ్యర్థముగా మాటలాడుట, దేవతలను వేదములను ద్విజులను రాజులను పుత్రులను మిత్రులను పతివ్రతలను గురువులను నిందించుట, అగ్ని హోత్రము విడుచుట, నిప్పు పెట్టుట, గృహేష్టి చేయుట, ద్విజాధముడై గోవధచేయుట, భ్రూణవధ, తమ్మునకు పెండ్లి ఐన తరువాత తాను పెండ్లాడుట, అన్నకంటె ముందు తాను పెండ్లాడుట వలన కలుగు పాపములు నేను మరల నీకడకు రానిచో నాకు తగులును. ఇంకను భయంకర శపథము వినుము. నేను తిరిగిరానిచో తన కన్యపై జీవించుట సత్యమును మఱుగుపఱచి సాక్ష్యము పలుకుట, యాగము చేయింపరాని వానిచే యాగము చేయించుట, నపుంసకుడగుట, శ్రవణము చేయరానివానినుండి శాస్త్ర శ్రవణము చేయుట, శ్రవణము చేయదగని వానికి శాస్త్రముల శ్రవణము చేయుట, సన్యాసికాని బ్రహ్మచారికాని కాముకుడై ప్రవర్తించుట – వీనివలన కలుగు పాపముల పొందుదును అని చండాలుడు రాక్షసునకు శపథము చేసెను.

బ్రహ్మ రాక్షసుడు చండాలుని మాటవిని ఆశ్చర్యపడి ఈ సత్య శపథముతో వెళ్ళి అన్నమాట కాపాడుము అనెను. ఆ చండాలుడును పుష్పములు తీసికొని దేవాలయమునకు పోయి బ్రాహ్మణునకు ఇచ్చెను. అతడవి నీటితో కడిగి విష్ణుని అర్చించి తన ఇంటికి పోయెను. చండాలుడు ఆనాడు ఉపవసించి గుడివెలుపలనుండి విష్ణు గీతుల పాడుచు రాత్రి జాగరము చేసెను. తెల్లవారగనే అతడు స్నానమాడి విష్ణునికి నమస్కరించి తన సత్యమును కాపాడుకొనుటకై రాక్షసుని దగ్గరకు బయలుదేరెను. త్రోవలో తనకెదురైన ఒకనరునకును చండాలునకును ఇట్లు సంభాషణము జరిగెను.

నరుడు 'నాయనా! ఎక్కడకు పోవుచున్నావు?'

చండాలుడు తనకు రాక్షసుని విషయమున జరిగినదంతయును చెప్పెను.

నరుడు : 'ధర్మ అర్థ కామ మోక్షములకు శరీరమే సాధనము. కావున వివేకవంతుడు మహాప్రయత్నముతో నైనను శరీరము రక్షించుకొనవలెను. జీవించినచో కీర్తియు లభించును. మరణించిన వాని మాట ఎవడు తలచును?'

చండాలుడు యుక్తి యుక్తముగా ఇట్లనెను. 'అయ్యా నేను చాల శపథములు చేసితిని. సత్యము కాపాడుటకై నేను పోవుచున్నాను.

నరుడు 'నీవు ఇట్లు మూఢబుద్ధివై ఉన్నావేమి? ఓ సత్పురుషుడా! గోవులను స్త్రీలను ద్విజులను రక్షించుటకును వివాహము విషయమునను సురత సందర్భమునను ప్రాణములును సర్వధనమును పోవుచున్నప్పుడును అసత్యమాడుట పాతకముగాదు. స్త్రీల విషయమున వివాహ సందర్భమునను శత్రువు విషయమునను మోసము ధనహాని ఆత్మనాశము జరుగునప్పుడును, ఇతరులు అసత్యము చేయునప్పుడును ధర్మ వాక్యములను పాటించరాదు అని మనువు చెప్పినది నీవు వినలేదా?'

చండాలుడు 'అయ్యా! అట్లు పలుకకుము. సత్యము లోకములందు పూజింపబడును. లోకమందలి సర్వ సౌఖ్యములును సత్యముచే లభించును. సత్యముచేతనే సూర్యుడు వెలుగును. నీరు ప్రవహించును. అగ్ని జ్వలించును. గాలి వీచును. చతుర్విధ పురుషార్థములు సత్యము చేతనే లభించును. సత్యము పర బ్రహ్మము. ఉత్తమ యజ్ఞము, స్వర్గము నుండి వచ్చినది సత్యము, సత్యమును విడువరాదు".

అని ఇట్లు పలికి ఆ చండాలుడు ఆ నరుని వదలివేసి ప్రాణి ఘాతుకుడగు ఆ బ్రహ్మ రాక్షసుడున్న చోటికి పోయెను. వాడు ఆశ్చర్యముతో కన్ను విప్పారించి తల ఆడించుచు ఇట్లు పలికెను. 'సత్య వాక్యమును అనుపాలించిన ఓ మహాభాగా! మేలు మేలు! సత్యమే లక్షణముగా గల నీవు చండాలుడవు కావని నా అభిప్రాయము. నీవు చేసిన ఈ పనిని బట్టి నీవు శుచియై అవ్యయుడగు ఏ వికారమును లేని బ్రాహ్మణుడవే. శుభ స్వరూపుడవగు నీతో ధర్మమును గూర్చి కొంచెము మాటలాడెదను. నీవు రాత్రి విష్ణ్వాలయమున ఏమి చేసితివో చెప్పుము.' చండాలుడు ఇట్లు పలికెను. 'వినుము. రాత్రికాలమున విష్ణ్వాలయమున నేనేమి చేసితినో ఉన్నది ఉన్నట్లు చెప్పెదను. ఆలయమునకు దిగువ వినయముతో వంగియుండి నిలిచి రాత్రి అంతయు ప్రజాగరము చేసి విష్ణు గీతికలు గానము చేసితిని. రాక్షసుడు నీవు భక్తితో ఎంతకాలము ఆలయమున జాగరణము చేసితివి?' అనెను. ప్రతిమాసము నందును ఏకాదశీ తిథులందు ఇరువది సంవత్సరములు జాగరణము చేసితిని అని చాండాలుడు నవ్వుచుపలికెను. అదివిని బ్రహ్మ రాక్షసుడు నీవు ఒక రాత్రి ప్రజాగరము చేసి పొందిన ఫలము నాకిమ్ము. అట్లిననేకాని నేను నిన్ను విడువను అని పలికెను. ఓ రాక్షసుడా! నా దేహము నీకు అర్పించితిని. మాటలతో పనియేమి? స్వేచ్ఛగా నన్ను నీవు తినుమని చాండాలుడు పలికెను. అయ్యా! దయతో నీవు రెండు జాములు ప్రజాగరము చేసి సంగీతము పాడి సంపాదిచిన ఫలమునైన

ఇమ్మని రాక్షసుడు బ్రతిమాలెను. అసంబద్ధముగా ఏల మాటాడెదవు? నేను జాగరణ ఫలమును ఈయను. స్వేచ్ఛగా నన్ను నీవు తినుమని చండాలుడనెను. ఆ మాటవిని బ్రహ్మ రాక్షసుడు ఇట్టనెను; ఏమందుడగు దుష్టబుద్ధి ధర్మకర్మలచే రక్షితుడవగు నిన్ను చూచుటకుగాని బెదరించుటకుగాని పీడించుటకుగాని శక్తి కలవాడు అగును? అదికాక దీనుడు పాపగ్రస్తుడు విషయసుఖములచే మోహము పొందినవాడు నరక యాతనలచే పీడింపబడు వాడు మూఢుడు అగువాని విషయములో సత్పురుషులు దయ చూపుదురు. ఇట్టి నా మీద నీవు దయచూపి ఒక జాము జాగరణముచేసి సంపాదించిన ఫలమునైన ఇమ్ము. లేదా నీఇంటికి మరలిపొమ్ము. నీకు యామప్రజాగరణ ఫలమును కూడ ఈయను. ఇంటికిని మరలిపోను అని చండాలుడనెను. రాత్రి చివరలో వినోదార్థము పాడిన పాట ఫలమునైన ఇచ్చి నన్ను పాపము నుండి సముద్ధరింపుము అని బ్రహ్మరాక్షసుడు బ్రతిమాలెను. అది విని నీవు పూర్వము ఏ వికృత కర్మముచేసి ఆ దోషరాశిచే ఇట్లు బ్రహ్మరాక్షసుడవైతివని చండాలుడు అడుగగా విని వాడు దుఃఖముచే సంతప్తుడగుచు తానుచేసిన దుష్కృతమును జ్ఞాపకము చేసికొనుచు ఇట్లు పలికెను :

నేను పూర్వము ఎవడనో ఏమి పాపము చేసినందున రాక్షసుడనై పాపయోని యందు జన్మించితినో చెప్పెదను వినుము. సోమయాజియు వేదాధ్యయనము చేసినవాడు అగు దేవశర్మయను బ్రాహ్మణుని కుమారుడగు సోమశర్మ అనువాడనుగా ఉంటిని. యజ్ఞోపవీత ధారణమునకు వేదమంత్ర గ్రహణమునకు అధికారము లేకయు యజ్ఞకర్మ చేయవలెనను ఆసక్తి కల ఒక యజమాని యజ్ఞకర్మను జరిపించుటయందు శ్రద్ధ వహించి లోభముచే, మోహముచే బాధింపబడిన వాడనగుచు ఆగ్నీధ్రుడుగా (ఆగ్నీధ్రము అను స్థానమున నుండు ఋత్విక్‌గా) ఉంటిని. ఆ యజమానుని ఆ యజ్ఞము ముగియగానే మూర్ఖుడనై ద్వాదమును అవలంబించి, ద్వాదశాహ (పండ్రెండు) మను హవిస్సులతో చేయదగిన-మహాక్రతువును చేయింప నారంభించితిని. అది జరుగుచుండగా నాకు కడుపునొప్పి కలిగెను. అప్పటికి పదినాళ్ళు మాత్రము గడచెను. యజ్ఞము ముగియలేదు. రాక్షస సమయమునందు విరూపాక్షునకు ఆహుతి ఈయబడుచున్న సమయమున నేను మరణించి ఆ దోషముచే బ్రహ్మరాక్షసుడ నైతిని. మూర్ఖుడనై మంత్రము సూత్రము స్వరము సరిగ తెలియక యజ్ఞవిద్య తెలియక యజ్ఞము చేయుటచే, చేయించుటచే, ఆ దోషమున బ్రహ్మ రాక్షసుడనైతిని. కనుక ఇట్లు పాప మహాసముద్రమున మునిగియున్న నన్ను నీ జాగరణములో కడపటి ఒక పాటయొక్క ఫలమునైన దానముచేసి ఉద్ధరింపుము అని బ్రహ్మరాక్షసుడు వేడెను. నీవు ఇకనుండి ప్రాణివధను మానుకొందువేని నా కడపటి

పాట ఫలమిత్తునని చండాలుడనగా బ్రహ్మ రాక్షసుడు అంగీకరించెను. తన జాగరణములో కడపటి సగము జాములో పాడిన పాట ఫలమును చండాలుడు వానికి దానము చేసెను. వెంటనే వాడును చండాలునికి నమస్కరించి తీర్థ శ్రేష్ఠమగు పృథూదక తీర్థమునకు పోయి అక్కడ సంకల్పపూర్వకముగా ఆహారము విడిచి ప్రాణములు విడుచుటతో ఆ చండాలు డిచ్చిన గీతికా ఫలబలముచే రాక్షసత్వము నుండి విముక్తుడయ్యెను. పృథూదక తీర్థప్రభావమున పదివేల ఏండ్లు దుర్లభమగు బ్రహ్మలోకమున నిరంతరముగా నుండి పిమ్మట పూర్వ జన్మస్మృతియు ఇంద్రియ నిగ్రహమునుగల బ్రాహ్మణుడై జన్మించెను. ద్విజులారా! ఆతని కథను మీకు మరల చెప్పెదను.

చండాలుని కథాశేషమును చెప్పెదను వినుడు. బుద్ధిశాలియు శుచియు అగు ఆ చండాలుడు అనంతరము తన ఇంటికిపోయి ఆ బ్రాహ్మణుని కథను తలచుకొనుచు వైరాగ్యము చెంది భార్యను కుమారులకు అప్పగించి కోకాముఖ క్షేత్రమునకు బయలుదేఱి కుమార స్వామి దర్శనమగువరకు భూ ప్రదక్షిణము చేసెను. కుమారస్వామిని, స్కందుని దర్శించి ధారాచక్రమును ప్రదక్షిణము చేసి పర్వతమును చేరి పాపప్రమోచన తీర్థమున స్నానముచేసి పాపవిముక్తుడై తన పూర్వ జన్మములు అనేకములు జ్ఞాపకము చేసికొనెను. ఆ జన్మపరంపరా విషయము ఇట్లున్నది ఈ చండాలుడు ఒక పూర్వ జన్మములో బుద్ధి శాలియు వేదవేదాంగములు కడవరకు నేర్చినవాడును, త్రికరణములయందు నిగ్రహము కలవాడును అగు భిక్షువుగా నుండెను. ఒకప్పుడు దొంగలు హరించుకొనిపోవుచున్న గోవులచే రేగిన ధూళిచే ఆ భిక్షువుయొక్క భిక్ష కప్పబడగా దానిని అతడు వదలివేసెను. ఆ అధర్మ దోషముచే ఆతడు చండాలుడై పుట్టెను. ఆతడు నర్మదా తీరము నందలి పాప ప్రమోచన తీర్థమున స్నానమాడిన పుణ్యమున, మరణానంతరము వారణాసియందు మూర్ఖుడగు బ్రాహ్మణ శ్రేష్ఠుడుగా పుట్టెను. అతడు ముప్పది ఏండ్ల వాడై ఉండగా అచటికి యోగమాయా బలము కలవాడును విరూపుడును అగు సిద్ధుడు సంచరించుచు వచ్చి ఇతనికి కనబడెను. ఆతనిని చూచి ఈ మూర్ఖ బ్రాహ్మణుడు ఉపహాసమునకై ఆతనికి నమస్కరించి ఓ సిద్ధపురుషా! కుశలమా! ఎక్కడినుండి వచ్చుచున్నావు? అని ప్రశ్నించెను. ఆ సిద్ధుడు తన్ను ఈతడు తెలిసికొనెనని తలచి స్వర్గము నుండి వచ్చుచున్నాను అనెను. స్వర్గమునందు నారాయణముని నుండి జన్మించిన అప్సరసయగు ఊర్వశిని ఎఱుగుదువా? అని మూర్ఖ బ్రాహ్మణుడడిగెను. ఆమె నారాయణముని నుండి జన్మించినది. స్వర్గమునకు ఆభరణము వంటిది. ఇంద్రునికి చామర గ్రాహిణి, ఇట్టి ఊర్వశిని నేనెఱుగక పోవుటేమి? అని సిద్ధుడనెను. ఆ మూర్ఖ బ్రాహ్మణుడును సరళ మార్గము విడిచి వక్ర మార్గమున

ఇట్లనెను. ఓ మిత్రమా! నా మీద ఆదరము చూపి నా వృత్తాంతము ఊర్వశికి తెలిపి ఆమె చెప్పిన సమాధానమును నాకు వచ్చి చెప్పుమనెను. సిద్ధుడు సరే అనెను. విప్రుడు సంతసించెను. సిద్ధుడు మేరుపర్వత సానువు నందలి స్వర్గమునకు పోయి ఈ బ్రాహ్మణుడు చెప్పిన మాట ఊర్వశికి చెప్పెను. కాశీస్థితియగు బ్రాహ్మణుడెపరో నేనెఱుగను. కనుక నీవు చెప్పినమాట నిజమని నేననుకొనుటలేదు అని ఊర్వశి సిద్ధునితో పలికెను.

ఊర్వశి చెప్పిన ఈ మాటలు విని సిద్ధుడు వెడలిపోయి చాలాకాలము తరువాత మరల వారాణసికి పోయెను. అతనిని చూచి మూర్ఖ బ్రాహ్మణుడు ఊర్వశి ఏమి చెప్పెనని అడుగగా ఆమె తాను నిన్ను ఎఱుగనని సిద్ధుడు పలికెను. అది విని మూర్ఖ విప్రుడు చిరునవ్వు నవ్వి, ఈమాఱు పోయినప్పుడు నీవు అతనిని ఏ గుర్తుతో గుర్తింపగలవని ఊర్వశిని అడుగుమనగా సిద్ధుడును సరేయని స్వర్గమునకు పోయినప్పుడు ఇంద్ర భవనము నుండి బయటికి వచ్చుచున్న ఊర్వశిని చూసి మూర్ఖ బ్రాహ్మణుడు చెప్పిన మాట ఆమెకు చెప్పెను. ఆమె ఆ బ్రాహ్మణుడు ఏదైన నియమమును పూనినచో దానినిబట్టి ఆతనిని గుర్తింపగలననెను. ఆ మాటకు సిద్ధుడు మరల మూర్ఖ బ్రాహ్మణునితో చెప్పగా అతడును నేను ఇక మీదట శకటము భక్షింపను. ఇది నా నియమమని ఊర్వశితో చెప్పుమనెను. సిద్ధుడు సరే అని తాను మరల స్వర్గమునకు పోయినప్పుడు ఈ విషయము ఊర్వశితో చెప్పెను. ఇప్పుడు నేను అతనిని ఈ నియమమును బట్టి గుర్తింపగలను. ఆ మూర్ఖుడు నన్ను ఉపహాసము చేయుటకే ఇట్లు చెప్పెను అని పలుకుచు ఊర్వశి వెడలిపోయెను. సిద్ధుడును తన ఇచ్ఛానుసారముతో లోకసంచారము చేయుచుండెను. మహాసుందరి అగు ఊర్వశియు వారాణసికి పోయి దివ్య శరీరము ధరించి మత్స్యోదరీతీర్థమున స్నానము చేయుచుండెను. ఆ సమయమున యాదృచ్ఛికముగ అచటకు వచ్చిన ఆ మూర్ఖ బ్రాహ్మణుడు అట్టి ఊర్వశిని చూచి కామముచే కలతనొందెను. అందుచే అతడు చేసిన చేష్టలను బట్టి మునుపు సిద్ధుడు చెప్పిన మూర్ఖవిప్రుడు ఈతడేయని ఊర్వశి గుర్తించి చిఱునవ్వు నవ్వుచు అతనితో ఓ మహాభాగా! నా వలన నీకు ఏమి కావలెనో చెప్పుము. నీ మాట ప్రకారము చేయుదును. నీవు నన్ను విశ్వసింపుము అనెను. నిన్ను నాకు అర్పణము చేసికొని ఓ సుందరీ! నా ప్రాణములను కాపాడుమని అతడనెను. నేను ఇప్పుడు వ్రత నియమము నందున్నాను. క్షణకాలము నా రాకకై వేచియుండుమని ఊర్వశి పలుకగా ఆతడు సరేయనెను. ఆమెయు స్వర్గమునకేగి ఒక మాసము తరువాత మరల వారాణసికి రాగా ఆ విప్రుడు కృశించి కనబడెను. ఆతడంతవరకును నిరాహారుడై నదీతీరమందే నిశ్చయముతో నుండెనని ఆమె తెలిసికొని వృద్ధురాలి రూపము ధరించి వచ్చి నదీతీరమున

శర్కరతో తేనెతో నేతితో నిండిన శకటమును కావించి మత్స్యోదరీ తీర్థమునకు పోయి స్నానమాడి ఒడ్డునకు వచ్చి శకటము కడ నిలిచి ఆ మూర్ఖ బ్రాహ్మణుని పిలిచి ఇట్లు పలికెను. ఓ విప్రా! నేను తీవ్రమగు వ్రతమును సౌభాగ్యము నిమిత్తము ఆచరించితిని. వ్రతాంతమున ఉద్యాపవమునకై ఇది దానము చేయుచున్నాను. ప్రతి గ్రహించుము అనెను.

అతడు ఇట్లనెను : ఇది ఏమి? లోకములో శర్కరతో నిండిన శకటము దానము చేయుదురా? ఓ పూజ్యురాలా! ఆకలిచే ఎండిన కంఠముతో ఉండి అడుగుచున్నాను. చక్కగా చెప్పుము అనగా ఆమె ఇట్లనెను. ఓ విప్రా! ఈశకటము శర్కరతోను పిండితోను నిండి ఉన్నది. దీనిని నీవు తీసికొని నీ ప్రాణములను తృప్తిని పొందించుకొనుము. ఆలస్యము చేయకుము. ఆ మాటవిని అతడు ఆకలితో బాధపడుచుండియు జ్ఞాపకము చేసికొని ఇట్లనెను. ఓ పూజ్యురాలా! నేను ఇది తీసికొనను. నేను సిద్ధవర్యునికడ శకటమును భక్షింపనని నియమమును ఊర్వశికి గుర్తుగా చేసితిని. కనుక దీనిని మఱి ఎవ్వరికైన దానము చేయుము అని చెప్పగా ఆమె ఇట్లు పలికెను. ఓ విప్రా! పూజ్యుడా! నీవు కొయ్యతో చేసిన శకటమును తిననని నియమము పూనితివి. ఇది కొయ్యతో చేసినదికాదు. శర్కరతో చేసిన శకటము. దీనినిని భక్షింపుము. నీవును ఆకలిచే చాల బాధనొంది యున్నావు" బ్రాహ్మణుడు ఇట్లు అనెను : నేను శకటము అని సామాన్యముగా పలికితిని. కాని దేనితో చేసినది అని విశేషముతో చెప్పలేదు. ఊర్వశి ఇట్లనెను. ఓవిప్రుడా! సరే. నీవు తినకున్నను నీ కుటుంబమువారు తిందురు. నీవీ చక్కెర బండిని కొనిపొమ్ము. బ్రాహ్మ ణుడు ఇట్లు పలికెను. ఓ సుదతీ! నేనిపుడింటికి పోవను. మూడు లోకముల యందును గుణములచే అందరికంటె అధికురాలును సుందరియు అగు ఆమె ఇక్కడకు వచ్చినది. నేను కామార్తుడనై వేడగా క్షణములో వత్తును. ఉండుమని నన్ను ఓదార్చి ఆమె వెళ్ళినది. ఓ వ్రతస్థురాలా! ఆమెయొక్క సత్యవచనమునందు అనురక్తుడనై ఆమె సంగమముకోరి ఆమె వెళ్ళి ఇప్పటికి మాసము గడిచినను ఇక్కడనే ఉన్నాను. ఆ మూర్ఖ విప్రుని మాటలువిని ఊర్వశి తన స్వరూపము ధరించి నవ్వుచు భావ గంభీరముగా ఇట్లు పలికెను : ఓ విప్రుడా! నీవు నా దర్శనముగోరి హఠముతో నిష్ఠతో కూడిన మనస్సుతో వ్రతమును నిర్వహించినమాట సత్యము. నీ విషయము తెలిసికొనగోరి వచ్చితిని. ఓ విప్రా! నేనే ఊర్వశిని. నిన్ను పరీక్షించి నీవు సత్యతపస్కుడు అను ఋషివని నిశ్చయించితిని. రూపతీర్థమని ప్రసిద్ధిపొందిన శూకరవ క్షేత్రమునకు పొమ్ము. అచ్చట నీకు సిద్ధికలుగును. అప్పుడు నేను నీకు లభింతును అని ఇట్లు పలికి ఆ ఊర్వశి స్వర్గమునకు ఎగిరిపోయెను. ఆ సత్యతపోఋషియు రూపతీర్థమునకు పోయి అచట శాంతిపరుడై నియమ వ్రతములను

పూని శుచియై జీవించి దేహత్యాగానంతరము ఉత్తమమగు గంధర్వలోకమునకు పోయెను. అచ్చట నూరులకొలది మన్వంతరములు వాస్తవములగు భోగములను అనుభవించి పిమ్మట భూ లోకమున ప్రజారంజకుడగు రాజై జన్మించెను. సమగ్రమగు దక్షిణలతో వివిధములగు యజ్ఞములు ఆచరించి కుమారులకు రాజ్యమును అప్పగించి మరల శూకరవ క్షేత్రమునకు ఏగెను. ఆ రూపతీర్థమున మృతిపొంది ఇంద్రలోకమునకు పోయి అచట నూరులకొలది మన్వంతరములు భోగములను అనుభవించి అచటనుండి దిగి భూమిపై ప్రతిష్ఠాన నగర మున బుధుని కుమారుడగు పురూరవుడుగా జన్మించి ఊర్వశితో సంగమము పొందెను. ఈ విధముగ సత్య తపస్కుడను బ్రాహ్మణుడు శూకరవ క్షేత్రమను రూప తీర్థమున శ్రీమహా విష్ణువును ఆరాధించి భోగములను అనుభవించి ముక్తిని కూడ పొందెను. (ఈ ప్రతిష్ఠా నగరమే ఈనాటి అలహాబాదు) (228)

విష్ణుభక్తి హేతు కథనము

జాగరణము చేసి విష్ణు మహిమ గానము చేసి చండాలుడును ముక్తిని పొందిన విషయము వింటిమి. మహామతిశాలివగు ఓ వ్యాసమహర్షీ! ఏ తపస్సుచే ఏ కర్మ నాచరించుటచే విష్ణువునందు భక్తి కలుగునో ఆ ఉపాయమును మాకు తెలుపుము. వినగోరుచున్నాము. అని మునులు అడిగిరి.

ఓ మునిశ్రేష్ఠులారా! మానవునకు మహాఫలప్రదమగు విష్ణుభక్తి కలుగు ఉపాయము క్రమముగా చెప్పెదను వినుడు. మహాఘోరమును సర్వప్రాణులకు భయమును కలిగించునదియు, మహామోహమును కలిగించునదియు నానా విధములగు నూర్లకొలది దుఃఖములతో నిండినదియు అగు ఈ సంసారమున జీవుడు వేలకొలదిగా తిర్యగ్యోనుల - వృక్ష పశు పక్ష్యాది జన్మముల యందు మరల మరల జన్మించి ఎంతో కష్టము మీద మనుష్య జన్మమును పొందును. అందును బ్రాహ్మణుడగుట, అందును వివేకము కలుగుట, అందును ధర్మమునందు ప్రవృత్తి, అందును శ్రేయఃప్రదమయిన వానిని గ్రహించుట దుర్లభము. సంచితపాపము సంపూర్ణముగా నశించనంతవరకు సర్వజగద్రూపుడగు వాసుదేవుని యందు భక్తికలుగదు. కనుక అందులకు ఉపాయము తెలిపెదను వినుడు. త్రికరణములతో శుద్ధిగా అన్యదేవతల అందు మనస్సు నిలిపి అనుష్ఠించు భక్తివలన యజ్ఞములు చేయుట అందు శ్రద్ధకలుగును. అప్పుడు అగ్నియందు భక్తికలిగి యజ్ఞములుచేసి అగ్నిని తృప్తి నొందించుటచే సూర్యునియందు భక్తికలుగును. భాస్కరుని ఉపాసించి అతనిని ప్రీతునిగా చేయుటవలన శంకరునియందు భక్తికలుగును. విధివిధానానుసారము శంకరుని ఆరాధించి

అతనిని తుష్టి నొందించుటవలన విష్ణునియందు భక్తికలుగును. జగద్రక్షకుడును అవ్యయుడును - నాశము లేనివాడు - అగు వాసుదేవుని సంపూజించుట వలన నరుడు భుక్తిని ముక్తిని పొందును.

ఓ మహామునీ! లోకమున వైష్ణవులు కానివారు కొందఱు కనబడుటకును వారా విష్ణువును అర్చింపకుండుటకును హేతువేమని ముసులు వ్యాసునడిగిరి.

ఓ మునిశ్రేష్ఠులారా! స్వయంభూబ్రహ్మ చేయు ఈ భూత సృష్టి దైవీ సృష్టి, అసుర సృష్టి అని రెండు విధములు. దైవీ ప్రకృతి-స్వభావము-కలవారు విష్ణుని భక్తితో అర్చింతురు. ఆసురీ ప్రకృతి కలవారు హరిని దూషింతురు. ఆసురీ ప్రకృతిగల నరాధములు మాయచే విజ్ఞానము నశించినందున విష్ణుని చేరలేక అధమగతిని పొందుదురు. విష్ణుని మాయ గంభీరమైనది. సురాసురులకును తెలిసికొన శక్యము కానిది. మహా మోహము కలిగించునది. సంస్కారము నొందిన మనస్సులు లేని వారికి దాట శక్యము కానిది.

ఓ ధర్మజ్ఞా! సుదుస్తరమగు విష్ణుని మహామాయను గూర్చి తెలిసికొన కుతూహల మగుచున్నది. తెలుపుము.

లోకములను ఆకర్షించు ఆ విష్ణుమాయ స్వప్నముతో, ఇంద్రజాలముతో, సమాన మైనది. దానిని విష్ణువు తప్ప మఱెవ్వరును తెలిసికొన జాలరు. మాయ విషయములో ఒక బ్రాహ్మణునకును నారద మహర్షికిని కూడ జరిగిన మోసము తెలిపెదను వినుడు. ఒక నగరమున పూర్వము ఆగ్నీధ్రుడగు కామదమనుడు అను రాజుండెడివాడు. అతని కుమారుడు పవిత్రుడు, ధర్మమునందే ఉండి ఆనందము పొందువాడు, క్షమాశీలము పితృసేవాసక్తి ప్రజలను రంజించు సమర్థత కలవాడు, వేదములయందు శాస్త్రములయందు పరిశ్రమ చేసినవాడు. తండ్రి అతనికి పెండ్లి చేయ యత్నించెను. అతడు ఇష్టపడలేదు. నాయనా! నీవు పెండ్లాడ ఇష్టపడని కారణమేమి? మనుజులు భార్యవలన సుఖములు లభించునను తలపుతోనేకదా పెండ్లాడుదురు. కనుక నీవును వివాహము చేసికొనుము అని తండ్రి పలుకగా ఆయనయందలి గౌరవముచే కుమారుడు ఏమియు సమాధాన మీయక ఊరకుండెను. ఐనను మరల అడుగగా అతడు తండ్రితో ఇట్లు పలికెను : నేను అభివ్యక్తమును, పరిపాలింపదగినదియు, విష్ణునికి సంబంధించినదియును అగు 'నామానురూపతా'-నామమునకు తగినట్లు నడచుట అను నియమమును ఆశ్రయించితిని అనెను. తండ్రి ఇట్లు పలికెను. కుమారా! ఇది ధర్మముకాదు. వివేకియగు పురుషుడు తండ్రి ఆజ్ఞకు విరుద్ధముగా ఆలోచింప తగదు. నాకు నీపై అధికారము కలదు. నామాట

పాలింపుము. సంతతి ముందునకు సాగకపోవుటచే నావంశము నరకములో మునుగు నట్లు చేయకుము అనెను. తండ్రి ఇచ్చిన ఈ ఆజ్ఞను విని ఇంద్రియ నిగ్రహము కల ఆ కుమారుడు అనాది సిద్ధముగా నున్న ఈ సంసారపు విచిత్ర స్థితిని జ్ఞాపకము చేసికొని ఇట్లు పలికెను.

నాయనా! సహేతుకమగు తాత్విక విషయమును చెప్పెద వినుము. ఓ రాజా! నామమునకు అనుగుణముగా ఆచరించుట కర్తవ్యము అనునది సత్యము. నేను ఎన్నియో జన్మములు జరామరణములు, భార్యలతో సంయోగ వియోగములు గడ్డి, పొదలు, తీగలు సరీసృపములు, ప్రాకెడి పామువంటి ప్రాణులు, మృగములు, పక్షులు, పశువులు, మానవులలో, స్త్రీ, పురుషులు మొదలగు రూపములు ఎన్నియో పొందితిని. గణదేవతలగు వసు రుద్రాదిత్యులు కిన్నర గంధర్వ, విద్యాధర నాగులు యక్ష గుహ్యక రాక్షసులు, దానవులు, అప్సరసలు, దేవతలు, సముద్రములు మొదలగు అనేక రూపములలో సృష్టింపబడితిని. సంహరింపబడితిని. దారలతో సంయోగము వలన నాకు కలిగిన మోసము ఇటువంటిది. ఈ జన్మనుండి పూర్వము మూడవ జన్మమున జరిగినదియు తీర్థ మాహాత్మ్యముతో సంబంధించినదియు అగు వృత్తాంతమును సంగ్రహముగా చెప్పెదను వినుము. నేను నర దేవ గంధర్వ నాగ విద్యాధర గరుడ కిన్నరాది జన్మములు అనేకములు పొందిన తరువాత సుతపస్కుడను మహాఋషిగా జన్మించితిని. అట్టి నాకు లోకములకు ప్రభువు - మధువను రాక్షసుని వధించినవాడు అగు జనార్దనుని యందు స్థిరమగు భక్తి కలిగెను. చక్రగదా ఖడ్గధారియగు విష్ణుని వివిధములగు వ్రతములచే ఉపవాసములచే మెప్పింపగా ఆ మహాత్ముడు నాకు వరమీయ కోరి గరుడుని ఎక్కివచ్చి ఓ బ్రాహ్మణా! నీకు కావలసిన వరము ఏదో కోరుము ఇచ్చెదను అని బిగ్గరగా పలికెను. నీకు నాపై ప్రీతి కలిగినచో నీ మాయా తత్త్వమును నాకు తెలుపుమని కోరితిని. ధర్మార్థ కామములను శ్రేష్ఠులగు పుత్రులను బాధారాహిత్యమును ఇత్తును. తీసికొనుము. నా మాయను తెలిసికొని ఏమి చేయుదువు? అని విష్ణువనెను. ధర్మార్థ కామాది పురుషార్థములచేతనైనను జయింప వలసినది నీ మాయయే కావున నేను దానితత్త్వమును తెలిసికొనగోరుచున్నాను. కనుక ఓ పుండరీకాక్షా! నాకు నీ మాయాతత్త్వమును చూపుము అని నేనంటిని.

నా మాయ ఇంతవరకు ఎవరును ఎఱుగరు. ఇకముందును తెలిసికొనజాలరు. పూర్వము బ్రహ్మకు కుమారుడును దేవర్షియు అగు నారదుడు భక్తియుక్తుడై నీవలెనే నన్ను ఆరాధించి మెప్పించెను. నేనతనికి వరమీయ బోవ అతడును ఇదే కోరెను. నేనెంతగా వలదు అని చెప్పినను అతడు మూఢుడై ఈ వరమునకై పట్టుపట్టెను. అంతట నేనతనితో

నారదా! నీవు నీటిలో మునిగినచో నామాయ తెలియునంటిని. నారదుడు నామాటను అనుసరించి నీట మునిగిలేచి సుశీల అను కాశిరాజ పుత్రిగా అయ్యెను. ఆమె యౌవనవతి ఐనతరువాత ఆ రాజామెను విదర్భ రాజకుమారుడగు సుధర్మునకిచ్చి వివాహము చేసెను. ఆ సుధర్ముడు ఈమెతో కామసుఖమును అనుభవించెను. తన తండ్రి స్వర్గమునకు ఏగిన తరువాత ప్రతాపవంతుడగు ఆ సుధర్ముడు ఆతని విదర్భ రాజ్యమునకు పాలకుడై పుత్ర పౌత్రులతో కూడి సంతోషముతో నుండెను. ఇట్లుండ కాశీరాజునకు సుధర్మునకును యుద్ధము జరిగెను. తమ పుత్రపౌత్రులతో కూడ ఇరువురును నాశము నొందిరి. ఈ విషయముతెలిసి యుద్ధ రంగమునకు పోయి సుశీల చాలతడవు శోకించి ఆర్తురాలై తల్లికడకు పోయెను. మఱియు మరణించిన తన తండ్రిని భర్తను వారి వారి పుత్రపౌత్రాదులను తీసికొని గొప్ప చితిని పేర్చి అగ్నిని ప్రజ్వలింపజేసి హాపుత్రా! హాపుత్రా! అని శోకించుచు అగ్నిలో ప్రవేశించెను. వెంటనే ఆమె నారదుడయ్యెను. ఆ అగ్నిస్ఫటికమువలె నిర్మలమును చల్లనిదియునై నిండు సరస్సయ్యెను. అతని ఎదుట నిలిచి దేవ శ్రేష్ఠుడగు విష్ణువు బిగ్గరగా నవ్వి దేవర్షియగు నారదునితో ఇట్లు పలికెను! మహర్షీ! నీకుమారుడు ఎవ్వరు? బుద్ధిపోగొట్టుకొని ఎవరిని గూర్చి శోకించుచున్నావు? అది విని నారదుడు సిగ్గుపడెను. నేను (శ్రీ మహావిష్ణువు) అతనితో మరల ఇట్లంటిని : ఓనారదా! నామాయ ఇటువంటిది. చాలకష్టరూపమయినది. బ్రహ్మరుద్రుడు మహేంద్రుడు కూడ దీనిని ఎఱుగ లేరనిన నీవేమి తెలిసికొనగలవు? ఈ నామాయ ఇట్టిదని ఊహించుటకును అలవి కానిది.

నారద మహర్షి నామాట విని ఇట్లు పలికెను. ఓ విష్ణూ! నాకు నీయందు భక్తిని ఇమ్ము. సమయము వచ్చినప్పుడు నీ సంస్మరణమును సందర్శనమును నాకు లభించుగాక! నేను ఇప్పుడు ఆర్తుడనై చితిని ఆరోహించిన స్థలము తీర్థముగా అగుచుండగా ఓ అచ్యుతా! కేశవా! పాపనాశకుడవగు నీచేతను బ్రహ్మదేవునిచేతను అధిష్ఠింపబడినది అగుగాక! నారదుని కోరికవిని ఓ బ్రాహ్మణా! సుతపోమహర్షీ! నేను (శ్రీ మహావిష్ణువు) ఇట్లంటిని: ఓ నారదా! కాశిరాజ కన్యగా నీవు చితి చేసిన తావు సితోదమను తీర్థము అగును. నేనును మహేశ్వరుడును దీనియందు నిలిచెదము. ఉగ్రముగా మాటలాడిన బ్రహ్మయొక్క ముఖమును శివుడు త్రుంచిన తరువాత ఆతడీ నీటి తీర్థమున స్నానముచేయగనే ఆ బ్రహ్మ యొక్క కపాలము. ఈ తీర్థ స్థానమున భూమిపై పడును. అంతటనుండి దీనికి కపాల మోచన తీర్థమను ప్రఖ్యాతి ఏర్పడును. అప్పటినుండి ఈ పుణ్యతీర్థమునందు ఇంద్రుడు నిరంతరము నిలిచియుండును. ఇంద్రునికి నిరంతర బ్రహ్మవధ దోషము అంటగా, అతడు దానిని ఇచ్చట విడిపించుకొనును. కాన దేవతలును ఈ రహస్యమగు

మహాతీర్థమును విముక్త తీర్థమని ప్రసిద్ధము చేయుదురు. నరుడు ఎన్ని మహాపాపములు చేసినవాడైనను ఈ తీర్థమున ప్రవేశించి ఏమరుపాటులేక స్నానమాడి శుచియై నన్ను స్మరించినచో శుద్ధుడై భగవదనుగ్రహము పొంది ముక్తుడగును. రుద్ర పిశాచమను మహాపాపుడు అనేక జన్మములంది దుఃఖములు అనుభవించును. అతడట్లు జన్మ పరంపరలతో పాపము నశించి అనేక సహస్ర సంవత్సరముల తరువాత విప్రగృహమున జన్మించును. అతడు జన్మములో మహా నిగ్రహము కలవాడగును. ఆతని అంతకాలమున రుద్రుడు హితకరమగు తారకమంత్రము నతనికి ఉపదేశించును. ఓ విప్రా? నేనిట్లు నారదునకు చెప్పి నా నివాసమగు క్షీరసాగరమునకు వెళ్ళితిని. విప్రుడు-నారద మహర్షియును గంధర్వ రాజుచే సమర్పించబడుచు స్వర్గమున సంచరించెను. ఓ సుతపోమహామునీ! నిన్ను ప్రబోధించుటకై నీకు ఈ నారద వృత్తాంతము తెలిపితిని. నామాయను నీవు ఎఱుగజాలవు. నీవది తెలిసికొనగోరినచో ఈ కోకాముక తీర్థమందు మునుగుము అని విష్ణువు పలికెను.

విష్ణుని వచనము ననుసరించి విప్రుడగు సుతపోమహాముని తన భవిష్యత్ ఫలమునకు వశుడై ఆ నీట మునిగెను. నాయనా! ఆ బ్రాహ్మణుడు వెంటనే చండాల గృహమున కన్యగా అయ్యెను. ఆమె మంచిరూపము శీలము గుణములు కలది. క్రమముగా యౌవనవంతురాలు కాగా ఆమెకు రూపహీనుడగు సుబాహుడను చండాల కుమారునితో వివాహమయ్యెను. భర్త ఆమెకు ఇష్టుడు కాలేదు. కాని భర్తకు ఆమె ఇష్టురాలు అయ్యెను. ఆమెకు ఇద్దఱు అంధులగు కుమారులును ఒక చెవిటి కుమార్తెయు కలిగిరి. భర్త దరిద్రుడు. అందుచే ఆ అమాయకురాలు అనుదినము నదికిపోయి ఏడ్చుచుండెడిది. ఒకానొకప్పుడా చండాల కన్యక బిందె తీసికొని నదికిపోయి స్నానమునకై నీటిలో ప్రవేశించి లేవగనే కర్మయోగమునందు ఆసక్తుడగు సుతపో మహాముని యను బ్రాహ్మణుడుగా మొదటి రూపమునకు మారెను. భర్తయగు సుబాహుడును భార్య నదికిపోయి చాలసేపయినదేయని నదికి వెడలి అచట కడవ మాత్రముండి ఒడ్డున ఆమె కనబడకపోవుటచే మహాదుఃఖమున ఆ ప్రదేశము మారుమ్రోగునట్లు ఏడువసాగెను. అంతలో గ్రుడ్డి కుమారులును చెవిటి కూతురును అచటికి వచ్చి తమతండ్రి ఏడ్చుచుండుట చూచి తామును ఏడువసాగిరి. తరువాత సుబాహుడు అచ్చటనున్న బ్రాహ్మణులను మీరెవరైన నీటికి నదిలో దిగిన యువతిని చూచితిరా? చెప్పుడు అని అడిగెను. ఆమె నదిలో దిగుట చూచితిమి. కాని పైకి వచ్చినట్లు చూడలేదు అని వారు చెప్పిరి. భయంకరమగు ఆ మాట విని సుబాహుడు గట్టిగా ఏడువ నారంభించెను. ఓ రాజా! అట్లు అతడును కొడుకులును కూతురును ఏడ్చుట

చూచి నాకు చాల బాధ కలుగుటతోబాటు నేనే అంతవరకు చండాల కన్యకగా ఉంటినను విషయము స్మరణమునకు వచ్చెను. అందుచే నేనా సుబాహునితో నీవిట్లు ఎందులకు ఆర్తుడవై ఏడిచెదవు? మూర్ఖుడవై ఎంత ఏడ్చినను ఆమె నీకు లభింపదు అంటిని. అతడు నాతో ఇట్లనెను. ఓ బ్రాహ్మణా! ఈ కుమారులు ఇద్దరును గ్రుడ్డివారు. కుమార్తె చెవిటిది. దుఃఖించుచున్న వీరిని నేను ఎట్లు ఓదార్చగలను? ఎట్లు పెంచి పెద్ద చేయగలను? ఇట్లు పలికి ఆతడు కుమారులతో కుమార్తెలతో కూడ వెక్కివెక్కి ఏడువసాగెను. అతడు ఏడ్చినకొలది నాకు వారిపై దయ కలిగెను. అందుచే అతని ఏడ్పు మాన్పించి నా వృత్తాంతము అతనికి తెలిపితిని. అతడును మిగుల ఆర్తుడై ఆ కోకాముఖ తీర్థమున మునిగెను. నీటిలో ప్రవేశించగనే ఆ తీర్థ ప్రభావమున వాడు పాపములనుండి ముక్తుడై నేను చూచుచుండగనే విమానమెక్కి స్వర్గమునకు పోయెను. అతడట్లు మరణించగనే నాకును మోహకరమగు మనోవ్యథ కలిగెను. ఓ రాజా! నేనును పవిత్రమగు కోకాజలమున మునిగి స్వర్గమునకు వెళ్ళితిని.

తరువాత జన్మమున వైశ్యకులమునందు వ్యధతో బాధపవాడనుగా కోకాముఖతీర్థ ప్రభావమున పూర్వ జన్మస్మృతి కలవాడనుగా జన్మించితిని. అంతట నేను వాక్కును మనస్సును నిగ్రహములో ఉంచుకొని కోకాముఖ తీర్థమునకు వెళ్ళితిని. అచ్చటనే కృశింపజేసికొని దేహత్యాగముచేసి స్వర్గమును పొందితిని. స్వర్గమునుండిదిగి భూలోకమునందు కూడ విష్ణుని అనుగ్రహము వలన పూర్వజన్మ స్మృతి కలవాడనుగా నీ ఇంట పుట్టితిని. ఇట్లు నేను శ్రీమహావిష్ణుని ఆరాధించి కోకాముఖతీర్థమున శుభాశుభము లగు కోరికలు ఏవియు లేకుండ వదలుకొనిన వాడనైతిని అని పలికి ఆరాజకుమారుడు తండ్రికి నమస్కరించి శ్రేష్ఠమగు కోకాముఖ తీర్థమునకు పోయి వరాహ రూపుడగు శ్రీమహావిష్ణువు ఆరాధించి సిద్ధిని పొందెను. ఇట్లు ఆ కామదమనుడను నతడు తన పుత్ర పౌత్రులతో కూడ మహాపవిత్రమగు కోకాముఖ తీర్థమున అపవిత్రమగు మానవ శరీరమును విడిచి విమానములో స్వర్గమునకేగెను.

ఓ బ్రాహ్మణులారా! దేవతలకును ఊహించరానిది, ఇంద్రజాలముతోను సమానమును, లోకమును మోహపరచునదియునగు పరమేశ్వరుడగు విష్ణునిమాయను మీకు తెలిపితినని వ్యాసమహాముని పలికెను. (229)

మహా ప్రళయ వర్ణనము

ఓ వ్యాసా! ఎఱుక శక్యము కాని విష్ణుమాయా తత్త్వము నీవలన వింటిమి. కల్పాంతమున జరుగు మహాప్రళయమును, సృష్టి ఉప సంహారమును వినగోరుచున్నాము అని మునులు వ్యాసుని అడిగిరి.

"ప్రాకృత ప్రళయమున సృష్టి ఉప సంహారము జరుగు విధము వినుడు. మానవుల మాసము పితరులకును సంవత్సరము దేవతలకును ఒక అహోరాత్రమగును. కృత, త్రేతా ద్వాపరము కలి అను చతుర్యుగము బ్రహ్మకు ఒక పగలు. ఇది దేవతల పండ్రెండువేల సంవత్సరములకు సమానము. కల్పాదియందలి కృతయుగమున సృష్టియు కల్పాంతము నందలి కలియుగమున ఉపసంహారము, ప్రళయమును జరుగును" అని చెప్పగా

ధర్మము నాలుగు పాదములతో నడువక వైకల్యమునొందు కలియుగ స్వరూపము వినగోరెదమని మునులనిరి.

కలియుగమున నరులు ఋగ్యజు సామవేదములు ప్రమాణముగా వర్ణాశ్రమాచార ధర్మములయందు ప్రవర్తించరు. వివాహములు ధర్మములు ఉండవు. శిష్యులు గురువులను ఆదరించరు. పుత్రులు తమ ధర్మమును పాటించరు. అగ్నిహోత్రాది క్రియలు ఉండవు. ఏకులమున పుట్టినవాడైనను, బలమున్నచో సర్వేశ్వరుడై పాలకుడగును. అన్ని వర్ణములందును జనులు తమ కుమార్తెల మూలమున ధనమార్జింతురు. విప్రులు తమకు తోచిన ఏదో యొక విధానమున యాగ దీక్షను వహింతురు. తమకు తోచిన విధానమున ప్రాయశ్చిత్తములు చేయుదురు. ఎవరు ఏది చెప్పిన అదే శాస్త్రము. అందరును అందరకును దేవతలే. అందరకును అన్నియు బ్రహ్మచర్యాది ఆశ్రమములే. తమకు ఏది ఇష్టమై అనుష్ఠించినచో వారికి అదియే ఉపవాసము. అదే తపస్సు అదే దానము. కొంచెము ధనమున్నను మదము హెచ్చును. బంగారు మణులు రత్నములు అన్నియు నశించగా, స్త్రీలకు కేశములే అలంకారమునకు సౌందర్యమునకు కారణమై యుండును. స్త్రీలు ధనవంతునే భర్తగా గ్రహింతురు. ధనహీనుడగు భర్తను వదలుదురు. సేవకులు తమకు ఎక్కువ ధనము ఇచ్చినవానినే యజమానునిగా గ్రహింతురు. ధనమునకు గృహములే ప్రధానోపయోగము-తెలివి ఉన్నందులకు ధనము ఆర్జించుటయే ప్రధాన ఉపయోగము-ఆస్థి ఉన్నందులకు సుఖములే ప్రధానోపయోగము అని కలియుగ జనులు భావింతురు.

కలియుగమున స్త్రీలు స్వేచ్ఛా ప్రవృత్తి-విలాసములయందు వాంఛ కలిగి ఉందురు. అన్యాయముగా ధనమార్జించిన పురుషులను స్త్రీలు వాంఛింతురు. మిత్రులు కూడ ఎంత వేడినను మానవులు అల్పముగా కూడ తమ ధనమును వదలుటకు ఇష్టపడరు. మనస్సు ఎప్పుడును లౌకికమైన పురుషార్థములను సాధించుటయందే ఉండును. పాలెక్కువగా ఇచ్చుటనుబట్టియే గోవులపై గౌరవము. జనులు తరచుగా అనావృష్టికి గుఱియై ఆకలిచే బాధనొందుచు ఆకాశమువైపు వానకై చూచుచుందురు. వేళ్ళు పండ్లు ఆకులు తినుచు

తమ్ముతాము చంపుకొనుచుందురు. కఱువులతో పడరాని బాధలు పడుచు తట్టుకొనలేక సుఖములులేక ఉందురు. స్నానము చేయకయే ఆహారము తిందురు. అగ్నిని దేవతలను అంధులను పూజింతురు. పిండోదకాది పితృ క్రియలు చేయరు. స్త్రీలు విషయసుఖ వాంఛ చిన్నదేహము అధికాహారము తినుట ఎక్కువ సంతానము తక్కువ భాగ్యము కలవారగుదురు. వారు రెండుచేతులతో తలగోకికొందురు. దేహమును నిండుగా కప్పుకొనక ఉందురు. పెద్దలయొక్క భర్తయొక్క ఆజ్ఞమీరుదురు. తమపొట్ట నింపుకొనుచు కోపనలై దేహసంస్కారములేక అసత్యములు పరుషములు మాటాడుచుందురు. దుఃశీలము కలిగి దుఃశీలురగు పురుషుల యందు ఆసక్తి దుష్ప్రవర్తనము కలిగి ఉందురు.

బ్రాహ్మణులు ఉపనయనములేకయే వేదాధ్యయనము చేయుదురు. గృహస్థులు హోమము, తగినట్లు దానములు చేయరు. యతులు అడవులలో నివసించుచు మొఱ్ఱైన ఆహారము తినుచు పుత్రాది స్వజనముపై ప్రీతి కలిగియుందురు. ప్రభువులు ప్రజలను కాపాడకపోగా పన్నులను పేరుతో ప్రజల ధనమును హరించుచుందురు. అశ్వరథ గజములు ఉన్న వాడే రాజు; బలహీనుడే సేవకుడు. వైశ్యులు కృషి వాణిజ్యము వంటి తమ వృత్తులు విడిచి వడ్రంగము మొదలగు పనులతో శూద్రవృత్తితో జీవింతురు. శూద్రులు అధములై సన్యాసివేషముతో ఉండి ధర్మములు సంస్కారములులేక భిక్షావృత్తితో యతివలె జీవింతురు. జనులు కఱువువలన పన్నులవలన బాధలుపడలేక గోధుమలు యవలు ఆహారముగా తిను దేశములకు పాఱిపోదురు. లోకమున వేద మార్గము నశించి, అవైదిక ప్రవర్తనపెరిగి, అధర్మ మెక్కువైనందున జనులు అల్పాయువులు అగుదురు. శాస్త్ర విహితములుకాని ఘోర తపస్సులు చేయు జనులను రాజు దండించక పోవుటచే, రాజదోషము వలన పసివారు మరణింతురు. ఎనిమిది తొమ్మిది పది ఏండ్ల మగవారివలన ఐదాఱేండ్ల స్త్రీలకు కాన్పులు అగును. పండ్రెండేండ్ల కంటె పై బడి చాల తక్కువమంది జీవింతురు. తక్కువ తెలివి వ్యర్థముగా వేషము ధరించుట దుష్టమగు అంతఃకరణము కలిగి జనులు అల్ప వయస్సుననే మరణింతురు.

వైదిక మార్గము ననుసరించి, వారికి హాని కలిగినప్పుడెల్ల అధర్మము పెరుగునని ఎఱుగవలెను. అప్పుడే కలి విజృంభించును. ధర్మమును ఆచరించువారి ప్రయత్నములు నెఱవేరకుండును. వేదవాదములందు ఆసక్తి తగ్గును. నరులు అవైదికుల ప్రభావమునకు లోబడుటచే సర్వస్రష్ట-సర్వేశ్వరుడగు విష్ణుని అర్చింపకుందురు. వేదములతోను బ్రాహ్మణులతోను దేవతలతోను నీటితో పవిత్రత సంపాదించుటతోను పనియేమి? అని పలుకుచుందురు. వాసలు ఎక్కువగా కురియవు. పంటలు ఎక్కువగా పండవు. పండ్లలో

సారమెక్కువగా ఉండదు. అణుప్రాయమగు ధాన్యము. మేకపాలకు ప్రాముఖ్యము. వట్టివేళ్ళ గంధము పూసికొనుట అధికమగును. నరులకు అత్తమామలే గురువులుగా మిత్రులే ముని శ్రేష్ఠులుగా అగుదురు. నరులు మామగారలు చెప్పినది వినుచు మానవుడు తనపని తాను చేసికొనునపుడు ఎవరికి ఎవరు తండ్రి? ఎవరు తల్లి? ఎవరు కుమారుడు? అందురు. అల్ప ప్రజ్ఞ కలవారై వాఙ్మనఃకాయిక దోషములకు వశులై అనుదినమును పాపములను చేయుచుందురు. సత్యము శౌచము సిగ్గు వీనిని విడిచిన వారికి కలుగవలసిన దుఃఖము లన్నియు కలిగి, జనులు బాధలు పడుదురు. స్వాధ్యాయము స్వధా స్వాహా వషట్కారములు లోపించును. సరియగు బ్రాహ్మణులు అరుదుగా ఉందురు. కృత యుగమున దీర్ఘ కాలము తపస్సుచేసి సాధించిన పుణ్య స్కంధమును కలియుగములో అల్పకాలములోనే సాధించుకొందురు.

"ఏ కాలములో అల్ప ధర్మమును ఆచరించినను అధిక పుణ్య ఫలము కలుగునో తెలుపు"మని వ్యాసుని మునులడిగిరి.

"ఓ విప్రులారా! ధన్యమగు అల్ప క్లేశముతో తపస్సు చేసినను మహాఫలము లభించును. ఈ విషయములో స్త్రీలును శూద్రులును మఱియు ధన్యులు. కృతయుగమున పండ్రెండేండ్లు తపస్సు చేయుటచే కలుగు ఫలితము త్రేతాయుగమున ఒక సంవత్సరము ద్వాపరమున ఒకమాసము కలిలో ఒక అహోరాత్రముతోనే కలుగును. తపస్సు బ్రహ్మచర్యము జపము మొదలగువాని ఫలము కలియుగములో ఇట్లు నరుడు అల్పశ్రమముతోనే పొందగలడు. అంతేకాక కృతయుగమున ధ్యానముచేత త్రేతాయుగము యజ్ఞముల చేత ద్వాపరములో అర్చనముచేత కలుగు ఫలము కలియుగమున కేశవ సంకీర్తనముతోనే కలుగును. బ్రాహ్మణులు కలియుగమున ఉపనయనము చేసికొని వేద వ్రతములు అనుష్ఠించుచు వేదాధ్యయనము చేయవలెను. తరువాత ధర్మానుసారముగ సంపాదించిన ధనముతో విధానమును అనుసరించి యజ్ఞములు చేయవలెను. వ్యర్థముగా భాషించుట, భుజించుట, ధనమార్జించుట బ్రాహ్మణులు పతితులు అగుటకు హేతువగును. కనుక విప్రులు ఆయా విషయములలో నిగ్రహము కలిగి ఉండవలెను. వారు ఏ విషయముల నైనను సరిగా చేయకపోవుట దోషకరము. భోజ్యములను తినుట పానీయములను త్రావుట వలన ద్విజులకు కోరికలు నెరవేరవు. జనులును అట్టి బ్రాహ్మణులకు అధీనులై అన్ని కార్యములయందును ప్రవర్తించినచో వారు ఎంతో శ్రమకు ఓర్చి వినయవంతులై జనులచే ఆయా యజ్ఞాదులను చేయింతురు. శూద్రుడు బ్రాహ్మణులను సేవించుచున్నచో పాక యజ్ఞమునకు అధికారము కలిగి తాను సాధింపదగిన ఉత్తమ లోకములను సాధించు

కొనును. త్రికరణములతో పతిసేవ చేయుట వలన స్త్రీలు తన భర్తతోపాటు అతడు పుణ్యములు చేసి సాధించిన లోకములకేగి సుఖింతురు.

ఓ బ్రాహ్మణులారా! మీరు ఏ విషయము తెలియగోరి ఇక్కడకు వచ్చితిరో అది తెలిపితిని. ఇంకను ఏమి కావలయునో అడుగుడు." (230)

భవిష్య కథనము

ఓ వ్యాసమహామునీ! ప్రళయకాలము దగ్గరలో నున్నదో దూరములో నున్నదో మాకు తెలియదు. కనుక ఎప్పుడు ద్వాపరయుగము అంతమై కలియుగము ఆరంభమగునో ప్రళయము ఎప్పుడు వచ్చునో గుర్తించు విధము తెలిసికొనగోరి ఇటకు వచ్చితిమి. అల్పమగు ధర్మానుష్ఠానముతోనే అధికమగు ధర్మఫలము లభించు విధమును ధర్మము నాశము నొందుటచే మహాభయంకరమగు ప్రళయ సమయమును గుర్తించు విధమును ఓ మునీ! మాకు తెలుపుము.

యుగాంత కాలమున రాజులు ప్రజలను రక్షింపకయే పన్నులు గ్రహించుచు తమ్ము తాము రక్షించుకొనుట యందు ఆసక్తి కలిగియుందురు. క్షత్రియులు కానివారు రాజులు అగుదురు. బ్రాహ్మణులు శూద్రుల సేవించి జీవింతురు. శూద్రులు బ్రాహ్మణుల ఆచారములను పాటింతురు. వేద పండితుల కాండపృష్ఠులు (వేదములను నిరర్థకముగా మోయు వారు) అగుదురు. కర్మానుష్ఠానము సరిగా చేయకయే హవిస్సును అగ్నిలో వేల్చెదరు. అన్ని కులములవారును ఒకే పంక్తిలో భుజింతురు. జనులు శిష్టాచారములు లేక ధనము ముఖ్యమని భావించుచు మద్యమాంసములయందు ప్రీతికల వారగుదురు. నరాధములై మిత్రుల భార్యలను అనుభవింతురు. దొంగలు రాజువలెను రాజులు దొంగలవలెను ప్రవర్తింతురు. భృత్యులు తమకు అర్హముకాని దానిని అనుభవింతురు. ధనములకు గౌరవము కలుగును. సత్ప్రవర్తనకు ఆదరము కలుగదు. భ్రష్టుడైన వానిని ఎవరును నిందింపక మెచ్చుకొందురు. పురుషులు వివేకహీనులు. జుట్టు ముడివేసికొనక విడిచినవారు విరూపులు అగుదురు. పదునాలేండ్లలోపు స్త్రీలకే కాన్పు అగును. జనపదములలో అన్నము అమ్మబడును. నడి వీథులలో వేదము విక్రయించబడును. స్త్రీలును మానమును అమ్ముకొందురు. బ్రాహ్మణులు అంత్యజులగు వారితో కలిసి వసించుచు శూద్రులవలె మాటలాడుచుందురు. శూద్రులు తెల్లని దంతములు కలవారు- ఇంద్రియముల జయించినవారునై, తలలు బోడిగా చేసికొని కాషాయ వస్త్రములు ధరించి కపటధూర్త బుద్ధితో జీవించుచు ధర్మము ప్రవచింతురు. కుక్కలు ఎక్కువగును. గోవులు

తగ్గును. సాధువులును తగ్గిపోవుదురు. గ్రామాంతములందు నివసింపవలసిన వారు గ్రామమధ్యమునను, గ్రామమధ్యమున ఉండవలసిన వారు గ్రామాంతమున నివసింతురు. జనులు అందరు సిగ్గులేని వారై తత్ఫలముగా నశింతురు. బ్రాహ్మణులు తపోయజ్ఞ ఫలములు అమ్ముకొందురు. ఋతుధర్మములు తారుమారు అగును. రెండేండ్ల గిత్తలచే నాగళ్ళు లాగింతురు. వానలు క్రమము అనుసరించి కురియకుండును.

దొంగల వంశములలో పుట్టినవారందరును ప్రభువులగుదురు. దానికి తగినవారు గానే ప్రజలు ఉందురు. తండ్రులకు ఈయదగినవి అన్నియు ఇతరులకు ఈయబడును. కుమారులు గాని, ఇతర మానవులు గాని తాముతాము ఆచరించవలసిన ధర్మములను ఆచరింపరు. భూమి ఎక్కువ చవిటినేలయగును. త్రోవలు అన్నియు దొంగలతో నిండిపోవును. తండ్రి నుండి దాయభాగముగా వచ్చిన ఆస్తిని కుమారులు పంచుకొనుటలో లోభముతో నిండినవారై పరస్పరము కలహించుకొనుచు తామే ఎక్కువ హరించుకొన వలెనను ప్రయత్నముతో కూడినవారై ఉందురు. స్త్రీలు తమ సౌకుమార్యము, రూపము నశించి పోగా కేశములతో మాత్రమే అలంకారము చేసికొందురు. పురుషుడు నిర్వీర్యుడై ఉండియు అట్టి భార్యలతో సుఖింతురు. భార్యతో సుఖించుటయే పరమ సుఖముగా భావింతురు. జనులు చాల భాగము దుఃశీలము కలవారై అనార్యులై ఉందురు. నిరుపయోగముగా రూప సౌందర్యములను పోషించుకొందురు. పురుషులు తగ్గిపోవుదురు. స్త్రీల సంఖ్య అధికమగును. పైరులలో పంట తక్కువగును. యాచకులు ఎక్కువగుదురు. ఒకరికి ఒకరు ఇచ్చుకొనుట ఉండదు. రాజ దండనము చోరపీడల వలన బాధనొంది జనులు నశింతురు. యువకులు కూడ వృద్ధులవలె అలవాటులు కలవారుగా ఉందురు. శీలములేని వారే సుఖింతురు. వర్షాకాలమందును పరుషమైన గాలులు ఇసుకను వర్షించుచుండును. పరలోకము లేదా ఉన్నదా అని సందేహింతురు. క్షత్రియులును, వైశ్యులవలె ధన ధాన్యములపై ఆధారపడి జీవింతురు. బంధు ప్రీతి తగ్గిపోవును. ఒడంబడికలు శపథములు పనిచేయక నశించును. ఋణము తీర్చు విషయములో సద్వ్యవహారముండదు. సంతోషము నిష్ఫలమై క్రోధము సఫలమగును. అనగా కోపముచేసిన వారికి మనుష్యులు భయపడుదురే కాని నిదానముగా చెప్పినమాట వినరు. పాడికే మేకలను గొర్రెలను కట్టివేసికొందురు. యజ్ఞములు శాస్త్ర విధానమును అనుసరింపకయే జరుగుచుండును. నరులు ఎవరికివారు తామే పండితులమనుకొనుచు శాస్త్ర ప్రమాణములతో పనిలేక ఆయా కార్యములు ఆచరింతురు. శాస్త్రవిషయములను ప్రవచించువారుండరు. పెద్దలను సేవించి విషయములను తెలిసికొనకయే తనకు

విషయము తెలిసెనను. ప్రతివాడును కవియే. నక్షత్రములు సరియైన యోగములతో ఉండవు. బ్రాహ్మణులు తమ ధర్మ కర్మములను సరిగా ఆచరింపరు. రాజులు దొంగల వంటి వారగుదురు. బ్రాహ్మణులు మోసగాండ్రు, కల్లు త్రాగువారు అగుదురు. అశ్వ మేధయాగము చేయుదురు. యాగము చేయింపతగనివారిచే యజ్ఞములు చేయింతురు. తినరాని దానిని తిందురు. ధనాశాపరులగుదురు. అందరును "భోః" అను శబ్దమును ఉచ్చరింతురే కాని ఒక్కడును అధ్యయనము చేయడు. స్త్రీలు గడ్డితో తలలు కప్పికొందురు. నక్షత్రముల కాంతి తగ్గును. దిక్కులు తారుమారగును. సాయం సంధ్యాకాలపు ఎఱుపు, దిక్కులు మండుచున్నట్లు కనబడును. కుమారులు తండ్రులకును, కోడళ్ళు అత్తలకును, పనులు ఆజ్ఞాపింతురు. బ్రాహ్మణులు హోమములు చేయరు. ఏమియు ఇతరులకు మిగల్చక అంతయు తామే తిందురు. నిద్రించుచున్న భర్తలను మోసగించి స్త్రీలు మఱియొక చోటికి పోవుదురు. స్త్రీలు రోగులుగాను, రూపహీనులుగాను, ప్రయత్నపరులుగాను తమ తప్పులు గుర్తించువారుగాను ఉండు భర్తలను పొందరు. ఉపకారికి ఎవరును ప్రత్యుపకారముకూడ చేయరు.

ఇట్లు యుగాంతమున ధర్మము లోపింపగా మనుష్యులు కష్టములు పొందుచు ఏ ఆహార విహారములు కలిగి ఏ కర్మలాచరించుచు ఏ కోరికలు కోరుచు ఎంత ప్రమాణము (ఎత్తు కొలతలు) ఎంత ఆయువు కలవారై కాలము గడుపుచు మరల కృతయుగమును అందుకొందురు? అని మునులు వ్యాసునడిగిరి.

అటుమీదట క్రమముగా ధర్మము భ్రష్టమైపోగా ప్రజలు సద్గుణ హీనులగుదురు. శీలము నశించును. ఆయువు క్షీణమగును. బలము తగ్గును. దానిచే దేహము వన్నె తఱుగును. దానిచే వ్యాధుల బాధ కలుగును. దానిచే వైరాగ్యము కలుగును. దానిచే ఆత్మజ్ఞాన సిద్ధికై ప్రయత్నించి దానిని పొంది మఱల జనులు ధర్మశీలురు అగుదురు. ఇట్లు మఱల ఉన్నత స్థితికిపోయి పోయి కృతయుగమును అందుకొనెదరు. అంతకులోగా మాత్రము కొందఱు నామమాత్రమునకు ధర్మశీలముకలవారు-కొందఱు ధర్మము తెలిసియు పట్టించుకొనని తటస్థులు-కొందఱు అల్పముగా ధర్మశీలము కలవారు-కొందఱు వేడుకకు మాత్రము ధర్మమును అనుష్ఠించువారు-అగుదురు. ప్రత్యక్షముగా ఇంద్రియములకు గోచరించునదే ప్రమాణమని కొందఱు-అనుమానము-హేతువుచే నిర్ణయించినది-కూడ ప్రమాణమే అని మఱికొందఱు ఏ ప్రమాణముతోను పనిలేదని మఱికొందరు వాదింతురు. నాస్తికత్వమును పూనువారు ధర్మమును లోపింపజేయువారు అగుదురు. బ్రాహ్మణులును తామే పండితులమను అహంకారముతో నుందురు. అప్పటికి పని జరుగు

విషయములమీద మాత్రము శ్రద్ధ కలవారై శాస్త్ర జ్ఞానము లేక దాంభికులై పరమార్థతత్త్వ జ్ఞానము లేకుందురు. ఇట్లు ధర్మము నశించగా జనులు మరల శ్రేష్ఠులగు పెద్దలను ముందుపెట్టుకొని దానగుణము సుశీలము కలవారై శుభము కలిగించు కర్మలను ఆచరింతురు. జనులు సిగ్గులేక సర్వము భక్షింతురు. తమకై అన్నియు దాచుకొందురు. నిర్దయులు అగుదురు. జ్ఞానము సాధించుట యందు నిష్ఠ ఉండదు. అట్టి స్థితిలో జ్ఞాననిష్ఠ కలవారు మాత్రము అల్పకాల తపముతోనే సిద్ధి పొందుదురు. యుగాంతమున తక్కువ కులములవారు బ్రాహ్మణుల ప్రవర్తనమును-వహింతురు. మహాయుద్ధములు-మహావర్ష ములు-పెనుగాలులు-తీవ్రమగు ఎండలు సంభవించును. రాజులు కర్మవాదులు అయి భూమిని రాజ్యమును అనుభవింతురు. రాక్షసులు బ్రాహ్మణులై జన్మింతురు. వారు స్వాధ్యాయము వషట్కారములు మొదలగు యజ్ఞ వాక్కులు లేక జనులను చెడుమార్గములలో నడుపుచు దురభిమానులై సర్వము భక్షించుచు వ్యర్థముగా కపటమునకు మాత్రము కర్మానుష్ఠానము చేయుదురు. వారు మూర్ఖులు ధనప్రధానులు లోభులు క్షుద్రులు క్షుద్రులను పరివార జనముగా పెట్టుకొనినవారు శాశ్వతమగు ధర్మమును వదలి లోకవ్యవహారమునకై పాటుపడువారు అగుదురు. పరధనముల హరింతురు. పరదారలను ఆశింతురు. కామముతో దురాత్ములై, కపటులై సాహసముమీద ఇష్టము కలవారై ఉందురు. బ్రాహ్మణులు ఇట్లు కాగా మునులు అనేక లక్షణములతో ఉందురు. జనులలో జరుగరాని చెడుగులు జరుగును. ప్రధాన పురుషులుగా ఏర్పడిన వ్యక్తులను గూర్చిన కథలకు ప్రాముఖ్య మిచ్చి అట్టివారిని పూజించుచుందురు. జనులు పంటలు-పైరులు-వస్త్రములు భక్ష్య భోజ్యములు - వస్తువులు దాచుకొను పెట్టెలు దొంగిలించు వారగుదురు. దొంగల ధనము హరించు దొంగలు, వధించువారిని కూడ వధించు క్రూరులు అగుదురు. ఇట్లు దొంగలు-ప్రాణివధ చేయువారు నశించిపోగా ప్రజలకు క్షేమము కలుగును. ఇట్లు లోకము నిఃసారమై క్షోభము చెందగా ఏమియుచేయలేక పన్నుల బరువు మోయలేక జనులు అడవులకు పారిపోవుదురు. యజ్ఞకర్మలు లోపించుటచే జనులకు రాక్షసుల-క్రూరమృగముల-కీటకమూషిక సర్పముల వలన భయమెక్కువగును. ప్రజలలో క్షేమము సుభిక్షము ఆరోగ్యము బంధు సమృద్ధి ఉండవలెనను ఉద్దేశము కలవారెవరైన నున్నచో అట్టివారు నరశ్రేష్ఠులని భావించవలసిన కాలమువచ్చును ఇట్టి స్థితిలో జనులు నిఃసారులై తమ వారితో కూడ స్వదేశములు విడిపోవుదురు.

జనులంతట కుమారులను వెంట తీసికొని భయముతో పారిపోవుచు కౌశికీ నదిని (హిమాలయ సమీపమున) దాటి ఆకలితో బాధపడుచు అంగ వంగ కళింగ కాశ్మీర

కోసల దేశములను కొండ లోయలను హిమవత్పర్వత ప్రాంతమును సముద్ర తీరము నంతటిని ఆశ్రయించి నివసించుచు తమకు తామే శ్రమించి సంపాదించుకొనిన ఎండుటాకులు తినుచు, చర్మములు, చెట్ల నారలు ధరించుచు జీవింతురు. భూమి శూన్యమును కాక, అడవియ్ను కాక ఉండును. ప్రభువులు ప్రజల రక్షింపని వారగుదురు. మానవులు మృగములను, చేపలను, పక్షులను, క్రూర మృగములను, పాములను, పురుగులను, తేనెను, ఆకుకూరలను, పండ్లను, దుంపలను, వేళ్ళను, ఎండు టాకులను తిని జీవింతురు. తమ వంశమువారిపై కూడ స్నేహభావము లేక కర్రలతో చేసిన శంకువులతో కొట్లాడుకొనుచు మేకలను, గొర్రెలను, గాడిదలను, ఒంటెలను పశువులుగా పోషించుకొనుచుదురు. నదీ తీరములను ఆశ్రయించి నివసించుచు నీటికై నదీజల ప్రవాహములను అడ్డు కట్టలతో అడ్డగింతురు. జుట్టు మొలచినది మొలచినట్లు లోపల మురికితో నిండి పెరుగుచుండ అట్లే వదలుదురు. కొందఱికి సంతానము అధికము. కొందఱికి సంతానమే కలుగదు. కుల శీలములు ఉండవు. వండిన ఆహార పదార్థములు అమ్ముచు, కొనుచు వానితో వ్యాపారము చేయుదురు. ప్రజలు హీనులై హీన ధర్మమును అనుసరింతురు. విషయ సుఖములకు పాల్పడి దుర్బలులు రోగులునై, ఇంద్రియములు క్షీణములై జరాశోకములచే బాధ నొందుదురు. ఆయువు తగ్గునని భయము కలుగగా, చివరకు ఇంద్రియ సుఖముల నుండి వెనుకకు మరలుదురు. లోక వ్యవహారము చేతకాక పోవుటచే వైరాగ్యము కలిగి సత్పురుషుల దర్శించి సేవించవలెను అను కోరిక కలుగును. సత్యముపై శ్రద్ధ కలుగును. పెద్దల ఆజ్ఞను పాటించి సద్గుణముల వైపునకు మరలుటచేత ధర్మమే మంచిదని తోచి దానిననుష్ఠింతురు. కోరికలు తీరుటకు అవకాశము లేకపోవుటచే ధర్మశీలులు అగుదురు సుఖ క్షయముచే బాధనొంది చిత్తసంస్కారము సంపాదింతురు. ప్రాణులపై దయకలుగును. ఇట్లు పాదపాదక్రమమున మరల ధర్మము వృద్ధియగుట కారంభమగును. ఇట్లు మరల జనులు కృత యుగములోనికి వత్తురు. కాలము ఎప్పుడును ఒక్కటియే. కలియుగమున ధర్మక్షయము-కృతయుగమున ధర్మవృద్ధి-ఇదే భేదము. చంద్రుడొక్కడే రాహువు కప్పినచో మలినుడై-విడిచినపుడు ప్రకాశించును కదా! కలియుగమున పరబ్రహ్మ తత్త్వమును అర్ధ వాదముగా, పొగుడుటకు చెప్పిన గొప్పమాటగా భావింతురు. కృతయుగముతో ఆ పరబ్రహ్మము వేదముచే తెలియదగిన వస్తువునుగా గ్రహింతురు. ఆ తత్త్వము కలిలో తెలియరానిదై వివేచింపరానిదై శత్రుభావముతో చూడబడును. కలిలో తపస్సు అనునది ఇష్టముతో వేడుకకు చేయుపనిగా ఉండును. కృత యుగములో అదే తపస్సు గౌరవించబడును. ఇదే రెంటికి భేదము. సద్గుణములున్నచో కర్మలనుష్ఠించగలరు. కర్మలు అనుష్ఠించినచో గుణములు సంస్కారమును పొంది

శుద్ధములగును. ఆయా యుగములందలి పురుషుని యోగ్యతను బట్టి దేశ కాలానుసారముగా వారివారి కోరికలును ఆచరణములు ఉండునని ఋషులు చెప్పిరి. యుగ యుగమునను పురుషుని యోగ్యతానుసారమే ధర్మార్థ కామ మోక్ష సాధనకై కర్మానుష్ఠానము దేవతల అనుగ్రహము శుభములు పుణ్యములు అగు కోరికలు జనులకు కలుగును. ఇట్లు యుగముల పరివర్తనములు విధి చేసిన సృష్టి స్వభావము అనుసరించి అనాదినుండియు ప్రవర్తిల్లుచున్నవి. ముందును ఇట్లే ప్రవర్తిల్లుచుండును.

ఈ జీవ లోకము కూడ యుగ స్వభావము ననుసరించి క్షయమును వృద్ధిని పొందుచు మార్పులను పొందుచుండునే కాని ఒక్క క్షణము కూడ మార్పులేక నిలుకడగా నుండదు. (231)

సృష్టి ఉపసంహార లక్షణము

సర్వ భూతములకును జరుగు ప్రతి సంచరము. అనగా ప్రళయము మూడు విధములు. 1.నైమిత్తికము, 2.ప్రాకృతికము, 3. ఆత్యంతికము. వానిలో (1.బ్రహ్మదేవుని ఆయుః కాలము సమాప్తికాగా కల్పాంతమున జరుగు ప్రళయము నైమిత్తికము. 2.జీవునకు మోక్షము లభించుటయే ఆత్యంతిక ప్రళయము. 3.రెండు పరార్ధముల కొకసారి జరుగునది ప్రాకృత ప్రళయము. అని వ్యాసుడు పలికెను).

మాకు పరార్ధ కాల పరిమాణము తెలిపినచో దానికి రెట్టింపు కాలమగు ద్విపరార్ధముల తరువాత జరుగు ప్రాకృత ప్రళయము మాకవగతమగును. కనుక దానిని తెలుపుమని మునులు వ్యాసునడిగిరి. సంఖ్యల లెక్కింపులో కుడివైపునుండి ఎడమవైపుకు పోగా స్థానపువిలువ పదిరెట్లు పెరుగుచుండును. అట్లు పోగా పదునెనిమిదవ స్థానముతో పరార్ధమగును. ఒకట్లు పదులు నూర్లు - వేలు పదివేలు లక్ష-పది లక్షలు-కోటి పది కోట్లు ఇట్లుపోగా పదునెనిమిదవ స్థానములో ఏర్పడు సంఖ్య పరార్ధము. అనగా 100,000,000,000,000,000 (వంద కోటి కోట్లు) ఇది పరార్ధ సంఖ్య. ఇన్ని సంవత్సరముల కాలమునకు రెట్టింపు చేసినచో ద్విపరార్ధము. ఇట్టి ద్విపరార్ధకాలమున కొకసారి జరుగు ప్రళయము ప్రాకృత ప్రళయము. అప్పుడు ఈ వ్యక్త స్పష్ట రూపములకల ప్రపంచమంతయు తన మూల కారణముతో కూడ అవ్యక్తమగు ప్రకృతి మూల తత్త్వమునందు లయమునొందును.

నైమిత్తిక ప్రళయము వివరింతును. కాల పరిమాణములో మానవుని తెప్పపాటు అన్నిటికి మూల పరిమాణము. అది నిమేషము అనబడును. అట్టి నిమేషములు పదునైదు

(పదునేనిమిది) కాష్ఠా అనబడును. ముప్పది కాష్ఠలుకల పదునైదు కలలు నాడిక. రెండు నాడికలు ముహూర్తము. ముప్పది ముహూర్తముల కాలము, ఒక రాత్రింబగలు. ముప్పది అహోరాత్రములు మాసము. పండ్రెండు మాసములు సంవత్సరము. ఇట్టి మూడు వందల అఱువది సంవత్సరములు దేవతల సంపత్సరము. పండ్రెండు వేల దేవ సంవత్సరములు ఒక చతుర్యుగము. అనగా కృత త్రేతాద్వాపర కలియుగములు నాలుగు అగును. వేయిచతుర్యుగములు బ్రహ్మదినము. అదియే కల్పము. కల్ప కాలములో పదునాలుగు మంది మనువులు సృష్టిని లోక వ్యవహారమును నిర్వహింతురు. అట్టి కల్పాంతము. బ్రహ్మతో కూడ నైమిత్తిక లయము జరుగును. దాని స్వరూపము మిగుల భయంకరము. అది మొదట మీకు తెలిపి పిమ్మట ప్రాకృత ప్రళయ స్వరూపము వివరింతును వినుడు.

వేయి చతుర్యుగముల తరువాత మహీతలము చాలవరకు క్షీణించిపోగా నూరేండ్లు ఎడతెగని అనావృష్టి ఏర్పడును. బలము అంతగాలేని ప్రాణులనేకములు భూమిపై మిగుల పీడలపాలై నశించును. అంతట విష్ణుభగవానుడు, రుద్రుని రూపమున సమస్త ప్రజలను తనలో లయము చేసికొనుటకు యత్నించును. అతడు సూర్యుని ఏడుకిరణముల యందును నిలిచి సమస్త జలమును త్రాగును. ప్రాణులన్నియు అందుచే శోషించును. సముద్రముల నదుల కొండల సెలయేళ్ళ పాతాళములలోనున్న నీరంతయు ఇంకిపోవును. దానిచే నీరు మాత్రమే ఆహారముగా గల జీవరాశులును నశించి పోవును. అంతట ఏడు మంది సూర్యులు ఆవిర్భవించి వారు అన్ని దిక్కులకును ప్రజ్వలించుచు, పాతాళ తలము వరకుగల లోకమునంతటిని కాల్చివేయుదురు. వారి మూలమున ఈ భూమి పర్వతములు సముద్రములతో కూడ దగ్ధమయి తాబేలు వీపువలె అయిపోవును. అంతట ప్రళయకాలాగ్ని, రుద్రుని ఆదిశేషుని నిశ్శ్వాస వాయువుల తాపముచే సప్త పాతాళములను కాల్చివేయును. ఆ అగ్నియే పాతాళము నుండి భూ లోకమునకు అచటి నుండి స్వర్గమునకు కూడ పోయి వరుసగా మూడు లోకములను పూర్తిగా కాల్చివేయును.

అపుడు ఈ మూడు లోకములు జ్వాలల సుడులతో చుట్టివేయబడి కాలుచున్న వేపుడు మంగలము వలె నుండును. ముల్లోకములోని బ్రాహ్మణులను తాపముతో నిండి బలము ఉపక్షీణమై ఎచ్చటను నిలుచుటకు అవకాశములేక మహర్లోకమునకు పోవుదురు. అచ్చటను మహాతాపముతో తపించి అంతకు పై నున్న జనలోకమునకు పోవుదురు. అంతట రుద్ర రూపుడగు విష్ణువు తన నిట్టూర్పు ఆవిరులచే మేఘములను సృష్టించును. సంవర్తకములను పేరుతో ఆ మబ్బులు పెద్ద ఉరుములతో మెఱుపులతో ఆకాశమంతట క్రమ్మును. ఏనుగులవలె-కాటుకవలె నల్ల కలువపూలవలె-నల్లనివి, కొన్ని పొగరంగుతో,

కొన్ని పచ్చనివి, కొన్ని పసపువలె, లక్కవలె, వైడూర్య రత్నముల వలె, ఇంద్ర నీలములవలె, శంఖముల వలె, మొల్లపూలవలె, జాజిపూలవలె, ఆర్ద్రపురుగులవలె, మనఃశిలవలె, తామర పూరేకులవలె, వెలిగెడి ఆమేఘములు అంతటను వ్యాపించును. నగరముల వంటి పర్వత ముల వంటి గిడ్డంగుల వంటి మెట్టనేలల వంటి ఆకారములతో పెద్దశరీరములతో పెద్ద ధ్వనులతో అవి ఆకాశమున నిండును. పెద్ద వానలు కురియించి ఆ భయంకరాగ్ని జ్వాలలను ఆర్పివేయును. ఆ అగ్ని చల్లారిన తరువాత కూడ ఆ మేఘములు ఎడతెగక వర్షించుచు లోకము నంతటిని నీటితో ముంచును. అవి బండి ఇరుసంత లావైన జలధారల నీటితో భూమిని నింపిన తరువాత ఊర్ధ్వరుకములనులోడ నింపును. ఇట్లు స్థిర్నర జీవులు జడచేతనే పదార్థములు అన్నియు నశించి లోకమంతయు అంధకారావృతమై ఉండగా ఆ మేఘములట్లు నూరు సంవత్సరములకు పై కాలము ఎడతెగక వర్షించుచునే యుండును. (232)

నైమిత్తిక ప్రాకృత ప్రళయ కథనము

వ్యాసుడిట్లు మునులతో పలికెను : ఓ బ్రాహ్మణోత్తములారా! ఈ ప్రళయ మేఘములు వర్షించుటచే కలిగిన జలము సప్తమహర్షులుండు స్థానము వరకు వ్యాపింపగా ఈ త్రిలోక్యమంతయు ఏక సముద్రముగ ఏర్పడును. విష్ణువంతట తన నిట్టూర్పు వాయువుతోనే దానిని నూరేండ్లకు పైబడిన కాల వ్యవధిలో నశింపజేయును. సర్వ భూతమయుడును ఊహింపను అలవికానివాడు, భూతముల నన్నిటిని సృష్టించువాడు ఆదిలేకయు లోకమునకు ఆదియగు విష్ణు భగవానుడు వాయువు నంతటిని పూర్తిగా పీల్చివేసి బ్రహ్మ రూపమును ధరించి ఆ ఏకార్ణవమున శేషశయ్యపై పరుండును. అప్పుడతనిని జనలోకమందలి సనకాది సిద్ధులు బ్రహ్మలోకము నందలి వారు స్తుతించు చుందురు. మోక్షము కోరినవారు ధ్యానించుచుందురు. ఆ పరమేశ్వరుడు వాసుదేవుడను తన స్వరూపమును చింతించుచు తన స్వమాయా రూపయగు యోగనిద్ర నాశ్రయించి యుండును. ప్రళయాంతమున హరి సృష్టికి నిమిత్త కారణుడుగా బ్రహ్మ రూపము ధరించి శయనించి యుండుటచే దీనికి నైమిత్తిక ప్రళయమని పేరు. వేయి చతుర్యుగముల పరిమాణముకల బ్రహ్మ దేవుని పగటి వలెనే అతని రాత్రియు అంతే పరిమాణము కలది. అంతకాలము గడచిన తరువాత విష్ణువు మరల బ్రహ్మ యొక్క రూపముతో సృష్టిని ఆరంభించును. ఇట్లు ఓ విప్రులారా! మీకు నైమిత్తిక ప్రళయ విధము తెలిపితిని. ఇక ప్రాకృత ప్రళయము తెలిపెదను వినుడు.

అనావృష్టి, అగ్ని మొదలగు ఉపద్రవములతో, భూలోక పాతాళాది లోకములందలి ఉపరితలమునగల పదార్థములు అన్నియు మొదట నశించును. తరువాత విష్ణుని ఇచ్ఛకు లోబడి మహదాది ప్రకృతి వికారములన్నియు నశించును. ఇదే ప్రాకృత ప్రళయము. దాని క్రమమిది. మొదట జలము పృథివియొక్క గంధగుణమును హరించును. అంతట పృథివియు జలరూపము ధరించును. అపుడవి మహాధ్వనితో మహావేగమున ప్రవహించి లోకాలోక పర్వతమువరకు నిండి పోవును. అంతట అగ్నితత్త్వము జలమును దానిలోని రసతన్మాత్రను హరించును. అంతట జలము జలరూపము వదలి అగ్నిగా అగును. అపుడీ జలమంతయు పృథివిలేక, జలములేక, కేవల మగ్ని జ్వాలలతో నిండి ఉండును. అంతట వాయువు అగ్నియొక్క విశేష గుణమగు రూపతన్మాత్రను హరించును. అప్పుడు అగ్ని యంతయు అగ్నిత్వమును కోల్పోయి వాయువుగా అగును. ప్రపంచ మంతయు వాయువు మాత్రమే అయి అది పదిదెసల వీచుచుండును. అంతలో ఆకాశము వాయువు యొక్క విశేష గుణమగు స్పర్శతన్మాత్రను తనలోనికి లయము చేసికొనుటచే వాయువు వాయువుగా నుండక లయము నొందుటచే అంతటను ఆకాశము కేవల శూన్య తత్త్వము మాత్రము-ఉండును. అంతలో ఆకాశము యొక్క విశేష గుణమగు శబ్ద తన్మాత్రను భూతాది తత్త్వము తనలో లయ మొందించుకొనును. అదియు మహత్తత్త్వము నందును-అదియు ప్రకృతి యందును లయము నొందును. అదియే త్రిగుణముల సామ్యావస్థ. అనగా అప్పుడు సత్త్వ రజ స్తమో గుణములలో ఏ యొక్కటియు ఎక్కువగ ఉద్రేకింపక మూడును సమస్థితిలో నుండును.

ఈ ప్రకృతినే ప్రధాన హేతువు పరమ కారణమనియు వ్యవహరింతురు. ఇది వ్యక్త, అవ్యక్త, స్పష్ట, అస్పష్ట స్వరూపము కలది. ఈ వ్యక్తావ్యక్త తత్త్వము అవ్యక్త తత్త్వములో లయమునందును. ఆ అవ్యక్తమే అక్షరము, నాశము లేనిది, నిత్యము, సర్వ వ్యాపియై యుండును. అదియు సర్వ భూతాత్మకుడగు పరమాత్మ యొక్క అంశమే. సత్తామాత్ర, జ్ఞానమాత్ర, సత్, చిత్ రూపుడును అన్ని తత్త్వముల కంటె గొప్పవాడును అగు ఆ పరమాత్మనందే ఈ ప్రాపంచిక వ్యవహారమునకు సంబంధించిన నామము, జాతి మొదలగు కల్పనలు అన్నియు లయము పొందును. ఆ తత్త్వమే బ్రహ్మము పరంధామము పరమాత్మ, పరమేశ్వరుడు విష్ణువు అనబడును. అతనిని చేరినవారు మరల జన్మ లోనికి రారు. వ్యక్తా వ్యక్త స్వరూపయగు ప్రకృతియు అవ్యక్తరూపుడు అక్షరుడును – పురుషుడును ఈ రెండును పరమాత్మ యందు లయమగును. ఆయనయే అన్ని తత్త్వములకును ఆశ్రయ మగుచోటు. అతడు విష్ణవనుపేరుతో వేదముల, వేదాంతములయందు గానము చేయబడు

చున్నాడు. వేదోక్తమగు కర్మలు ప్రవృత్తి ప్రధానములు నివృత్తి ప్రధానములు అని రెండు విధములు. ఋగ్యజుఃసామవేదాను సారియగు మార్గమున యజ్ఞేశ్వరుడుగా యజ్ఞ పురుషుడుగా పరమాత్మను ఆరాధించుట ప్రవృత్తి మార్గము. జ్ఞానమూర్తి, చిద్రూపుడు, అగు ఆయనను జ్ఞానయోగమున ఉపాసించుట నివృత్తి మార్గము. ఆయన తత్త్వము వాక్కులకు అందరానిది. ద్విపరార్ధ పరిమితిగల కాలము విష్ణువునకు ఒక పగలు-అంతే ఆయనకు రాత్రి పరిమాణమును. ఇదికూడ లోక సామ్యమును బట్టి చెప్పుటయే కాని ఆ పరమాత్మునకు పగలును రాత్రియు అనునవి లేవు. ఓ ఋషులారా! ఈ చెప్పినది ప్రాకృత లయ స్వరూపము. (233)

ఆత్యన్తిక లయ నిరూపణము

ఓ విప్రులారా! వివేకియగు జీవుడు ఆధ్యాత్మికములు-ఆధిభౌతికములు-ఆధిదైవికములు అను మూడు విధములగు తాపములవలన దుఃఖమును దోషమును గుర్తెరిగి వైరాగ్యముతో జ్ఞానము సంపాదించుటచే ఆత్యంతిక లయమును-మోక్షమును పొందును. వీనిలో ఆధ్యాత్మిక తాపము దైహికము, మానసికము అని రెండు విధములు. శిరోరోగము-ప్రతిశ్యాయము-జ్వరము-శూలవ్యాధి-భగందరము-గుల్మము-అర్శస్సు-శ్వయథువు-శ్వాసవ్యాధి-ఛర్ది-అక్షిరోగములు-అతిసారము-కుష్ఠము-అవయవముల రోగములు. ఈ మొదలగు దైహిక తాపము బహువిధములు. కామము-క్రోధము-భయము-ద్వేషము-లభ్యము-మోహము-విషాదము-శోకము-అసూయ-అవమానము-ఈర్ష్య-మత్సరము-తిరస్కారము మొదలుగ మానసతాపము అనేక విధములు ఈ రెండును కలిసి ఆధ్యాత్మిక తాపమనబడును. ఆత్మ అనగా ఇచట దేహమని అర్థము. పాంచభౌతిక దేహముతో సంబంధించినవి ఆధ్యాత్మికములు. పైవాని వివరము ఆయుర్వేదాది శాస్త్రముల నుండి తెలియదగినవి.

మృగములు-పక్షులు-మనుష్యులు-పిశాచములు-సర్పములు-రాక్షసులు-ప్రాకెడి ప్రాణులు మొదలగు వానిచే మానవునికి కలుగు తాపములు ఆధి భౌతికములు-భూతముల-ప్రాణుల-వలన కలుగునవి. చలి-ఉష్ణము-గాలి-వర్షము-నీరు మెఱుపులు మొదలగు హేనివలన కలుగు తాపము ఆధిదైవికము.

గర్భము-జన్మము-ముసలితనము-అజ్ఞానము-మృత్యువు-నరకము-మొదలగు వానివలన కలుగు దుఃఖములు వేలకొలది విధములు. ఎట్లనగా-సుకుమార శరీరము కల జీవుడు తల్లి గర్భములో అనేక మలినములు క్రమ్మియున్న గర్భములో మూవిలో

చుట్టబడి వెన్ను వీపు మెడ ఎముకలు వంగి దాన పుల్లనివి-కారపువి-చురుకైనవి-చాల వెచ్చనివి-ఉప్పనివి అగు ఆహారములు తల్లి తినగా, అవి కలిగించు తాపమువలన చాల బాధపడుచుండును. అవయవములు స్వేచ్ఛగా చాచలేక ముడువలేక మలమూత్ర ముల రొంపిలో పండుకొనుచు ఊపిరాడక చైతన్యమున్నందున గడచిన వందల కొలది జన్మములను జ్ఞాపకము చేసికొనుచు తన పూర్వ కర్మలకు బద్ధుడై దుఃఖము లనుభవించు చుండును. ఇది గర్భ దుఃఖము. ప్రసవ కాలపు గాలులచే తలక్రిందులుగా త్రిప్పబడి మలము రక్తము మూత్రము శుక్ర శోణితములు మొదలగు వానిచే నోరంతయు మలినము కాగా ప్రాజాపత్యము అను ప్రసవద్వారపు గాలిచే ఎముకల సంధులు బాధపడుచుండ తల్లి గర్భము నుండి ఎన్నో క్లేశములతో వెలుపలికి వచ్చును. ముళ్ళు గ్రుచ్చుకొనినట్లు రంపముతో కోసినట్లు అవయవములు బాధపడుచుండ క్రుళ్ళిన పుండులో నుండి బయట పడిన క్రిమివలె బయటపడి గోకికొనుటకును అటు ఇటు దొరలుటకును శక్తిలేక ఇతరుల ఇచ్ఛకులోబడి పాలుమొదలగు ఆహారము గ్రహించును. మలినమగు ప్రక్కలపై వరుండియు పురుగులు దోమలు కుట్టుచున్నను తినుచున్నను వాటిని తోలుకొనునైన లేకుండును. ఇటువంటి జన్మ దుఃఖములును జన్మకు అనంతరము పొందు ఆధ్యాత్మికాది దుఃఖములను అంతులేనివి.

నరుడు అజ్ఞానాంధకారముతో కప్పబడి మనస్సు మూఢమై నేను ఎక్కడినుండి వచ్చితిని? ఎవడను? ఎట్టివాడను? ఎక్కడికి పోవలెను? నన్ను ఏ బంధము బంధించినది? ఇది సకారణమా? అకారణమా? చేయదగినదేది ! తగనిదేది? పలుక దగినదేది? తగనిదేది? ధర్మమేది ? అధర్మమేది ? గుణము ఏది ? దోషమేది ? అని ఎరుగక పశువులవలె ఆహార మైథునములకై మాత్రము ప్రాకులాడుట అజ్ఞానము వలన కలుగు దుఃఖము. అజ్ఞానము తమోగుణ ధర్మము. దానివలన నరులు చేయవలసిన కర్మలను చేయక చేయరాని వానిని చేయుచుందురు.

కర్మల లోపమువలన మానవులకు నరక యాతనలు కలుగును. ఈ విధముగ అజ్ఞానులకు ఇహలోకమునను పరలోకమునను దుఃఖములే.

ముసలితనమున దేహమును, దేహావయవములును శిథిలములై దంతములు కదలుచు ఊడుచు చర్మము ముడతలు పడి నాడులు నరములు తేలుచు, దూరపుచూపు కనబడక కంటిపాపలు ఆకాశములోనికి పెట్టి చూచుచు, నాసికారంధ్రముల నుండి వెంట్రుకలు వెలికివచ్చుచుండ, శరీరము వణకుచుండ, ఎముకలు బయటపడి, వెన్ను వంగి, ఆకలి నశించి, ఎక్కువ తినలేక, తిన్నది జీర్ణముకాక పనులు చేయుటకు శక్తిలేక

ఎంతో శ్రమతో నడచుట లేచుట కూర్చుండుట పనులు చేయుట కలిగి, చెవులు సరిగా వినబడక కన్నులు సరిగా కనబడక నోట చొల్లు కారుచు ఇంద్రియశక్తి తగ్గి చావునకు సిద్ధమై ఎప్పటికప్పుడు విషయములు మరచుచు ఒక్కమాట పలుకుటకు చాలా శ్రమపడుచు దగ్గుతో ఆయాసముతో నిద్రపట్టక లేచుటకు పండుకొనుటకు కూడ ఇతరులపై ఆధారపడుచు సేవకులు భార్య పుత్రులు కూడ అలక్ష్యము చేయుచుండగా శౌచము చేసికొనుటకు కూడా శక్తి లేక ఏమో తినవలెనని తిరుగవలెనని కోరికలు మాత్రము అధికమై పరిజనులు కూడ ఎగతాళి చేయుచుండ చుట్టములు విసుగుకొనుచుండ తాను తన యౌవనములో శక్తి ఉన్నపుడు చేసిన పనులను ఏదో పూర్వ జన్మములో చేసిన పనులనువలె జ్ఞాపకము చేసికొనుచు, ఇట్టి అనేక బాధలను అనుభవించును.

మరణకాలమున కాళ్లు చేతులు మెడ శిథిలమగును. అంతలోనే శ్రమ అంతలోనే తెలివి-బలము కలుగుచుండును. తన భార్య, సంతానము, ధనము, ఇల్లు, సేవకులు తన తరువాత ఏమగునో అని చింత-అంపములతో కోయుచున్నట్లు మర్మస్థానములలో రోగబాధ-అస్థిసంధులలో యమునిబాణములు గ్రుచ్చుకొన్నట్లు బాధ-మెలికలు తిరిగి పోవుచున్న కనుగ్రుడ్లు-కాళ్లు చేతులు కలిగి తన్నుకొనుట-పెదవులు దౌడలు కంఠము ఎండిపోవుచు గురగురలాడుచు కంఠమునుండి శ్వాస ఆడక బాధ - ఆకలి దప్పులచే బాధ పడుచు యమభటులచే బాధ నొందుచు ఎంతో క్లేశముతో ప్రాణములు బయటికి పోవుచుండును. తరువాత యాతనా దేహములో ప్రవేశించును.

నరకములో యమకింకరులు పాశములతో కట్టుట-కర్రలతో కొట్టుట-యమ దర్శనము-భయంకరమగు మార్గములు చూచుట-మండుచున్న ఇనుక-అగ్ని యంత్ర ములు, శస్త్రములు మొదలగు వానితో భయంకర బాధలు-అంపములతో కోయుట మూసలలో వేసి క్రాచుట, గొడ్డళ్ళతో పగుల కొట్టుట, భూమిలో పాతిపెట్టుట, శూలములపై గ్రుచ్చుట, పులి నోటిలో వేయుట, గ్రద్దలచే తినిపించుట, నూనెలో ఉడికించుట, కారపు అడుసులో నాన వేయుట, ఎత్తునుండి పడవేయుట, ఒడిసెలలతో కొట్టుట మొదలైన యాతనలు జీవులు తాముచేసిన పాపానుసారము అనుభవింతురు. ఇంతేకాదు. స్వర్గము నకు వెళ్ళినవారికి కూడ ఆ పుణ్యము పూర్తికాగానే క్రిందికి పడిపోవలెనను భయము వెంటాడును. కనుక అచ్చటను సుఖము లేదు.

పిమ్మట మరల గర్భ ప్రవేశము-పుట్టుట-కడుపులో గాని పుట్టుచుకాని పుట్టిన తరువాత ఏదో సమయమున బాల్యముననో యౌవనముననో మరణించుట-ఇట్టి జన్మ

మరణ పరంపర సాగును. ఈ సంసారములో ఏది సుఖమునకు కారణమో అదే దుఃఖము నకు కారణము. కనుక దార పుత్రధనాదులయందు మక్కువ పెంచుకొనక ఈ తెలిపిన తాపత్రయములలోని దోషములను గుర్తించి ముక్తి కొరకై యత్నించుట ఒక్కటియే ఈ బాధను తొలగించుటకు ఔషధము. కనుక వివేకులు అందుకే యత్నింపవలెను. కర్మ చరణము జ్ఞానము - ఈ రెండును ముక్తికి సాధనములే. ఆగమములో చెప్పిన శబ్ద బ్రహ్మో పాసనము-వివేకమువలన కలిగెడి బ్రహ్మతత్త్వ జ్ఞానము అని జ్ఞానముకూడ రెండు విధములు. శబ్ద బ్రహ్మతత్త్వమున కృతార్థుడైనచో పరబ్రహ్మత్వము ప్రాప్తించును. పరా-అపరా అను రెండు విద్యలు ఎఱుగవలసి ఉన్నది అని అథర్వణవేదీయమగు ముండకోపనిషత్తు చెప్పుచున్నది. వానిలో ఋగ్వేదాది వేదప్రోక్తమగు కర్మానుష్ఠానము అపరావిద్యా. అక్షరతత్త్వమగు పరబ్రహ్మమును అందించునది పరావిద్య. పరబ్రహ్మ తత్త్వము అవ్యక్తము అజరము అచింత్యము అవ్యయము అనిర్దేశ్యము అరూపము అపాణిపాదము సర్వగతము సత్యము భూతయోని వ్యాప్తము. ఈ తత్త్వమును సూరులు మాత్రమే ఎల్లప్పుడును దర్శింపగలరు. ఆ తత్త్వమే విష్ణు భగవానుడు. భూతములయొక్క ఉత్పత్తిని-నాశమును-వాటిరాకడను-పోకడను విద్యను అవిద్యను ఎఱిగిన మహాను భావుడు భగవానుడనబడును. హేయములగు దుర్గుణములుకాని దోషములుకాని ఏవియు లేక జ్ఞానశక్తి బలైశ్వర్యవీర్య తేజస్సులు అను ఆఱుశక్తులు కలవాడే భగవానుడు అనబడును. ఆ పరమాత్ముని యందు సమస్త భూతములును-ఆతడు సమస్త భూతముల యందును వసించును. అతడు సర్వాత్మకుడు. అందుచేతనే ఆ పరతత్త్వమునకు వాసుదేవుడని పేరు. పూర్వము మహర్షులు చేసిన ప్రశ్నమునకు సమాధానముగా ప్రజాపతియే ఈ వాసుదేవ పదమునకు అర్థమును ఇట్లు వ్యాఖ్యానించి తెలిపెను. అందుచేతనే జగములను నిర్మించాడు. వాటి స్థితి వ్యవస్థ చేయువాడుకూడ ప్రభువగు వాసుదేవుడే. అతడు సర్వ భూతములకును ప్రకృతి-మూలతత్త్వము, సమస్త దోషములకును గుణములకును అతీతుడు. సర్వావరణములకును అతీతుడు. అఖాలాత్ముడు. ఈ భువనాంతరాళ మంతయు ఆయనచేతనే ఆవరింపబడి ఉన్నది. అతడు సమస్తకల్యాణ గుణాత్మకుడు. స్వశక్తి లేశ మాత్రము చేతనే సమస్త భూతసృష్టిని చేయువాడు. తన ఇచ్ఛచేత తనకిష్టములగు గొప్ప రూపముల ధరించి సమస్త లోకములకు హితమును సాధించును. తేజో బలైశ్వర్య వీర్య శక్తి జ్ఞానములకు రాశి. పరమైనవాటికంటె పరుడు. ఆ పరాపరునియందు ఎట్టి క్లేశము లును లేవు. అతడు ఈశ్వరుడు. వ్యష్టి సమిష్టి రూపుడు. వ్యక్తరూపుడు. అవ్యక్తరూపుడు. సర్వేశ్వరుడు. సర్వద్రష్ట-సర్వశక్తియగు పరమేశ్వరుడు. సమస్త దోష రహితమును

శుద్ధమును పరమును నిర్మలమును ఏక రూపమునునగు ఆ మహాతత్త్వమును ఏది తెలుపగలదో, చూపగలదో, లభింపజేయగలదో అది మాత్రమే జ్ఞానమనబడును. మిగిలినది అంతయు అజ్ఞానము. (234)

యోగాధ్యాయము

సంసార దుఃఖ నివారణౌషధమగు యోగమును తాము తెలిపినచో దానియందు పురుషోత్తముడు అవ్యయుడగు విష్ణుని అనుసంధానము చేయుదుము అని మహర్షులు కోరగా యోగ వేత్తలలో శ్రేష్ఠుడగు వ్యాసుడు మిగుల సంతోషముతో యోగ ప్రకారమును ఇట్లు చెప్పనారంభించెను.

ఓ విప్రులారా! సంసార నాశకమగు యోగమును తెలిపెదను. దాని అభ్యసించి యోగియైనవాడు పరమదుర్లభమగు మోక్షమును పొందగలుగును. మొదట యోగశాస్త్రము లను శ్రవణముచేసి భక్తితో గురువును ఆరాధించి యోగవిషయములనెఱిగి ఇతిహాస పురాణ వేదములలో చెప్పిన విషయములను ఆహారగుణ దోషములను దేశకాలస్థితిగుణ దోషములను తెలిసికొని పిమ్మట సుఖదుఃఖాది ద్వంద్వములకు అతీతుడై ఎవరినుండి ఏదియు ప్రతిగ్రహించుటపై ఆశనుమాని, యోగమును అభ్యసింపవలెను. పేలపిండి, గంజి, మజ్జిగ, దుంపలు, వేళ్లు, పండ్లు, రవ్వతో వండిన అన్నము, యవపిండితో చేసిన వంట యోగసాధనకు పనికివచ్చు ఆహారము. మనస్సు ఆవేశముచెంది యున్నప్పుడు మనస్సు వికలమై ఉన్నప్పుడు శ్రమగా ఆకలిగా ఉన్నప్పుడు చలి ఉష్ణము గాలి బాధించు చున్నప్పుడు ధ్వనులు వినబడుచుండగా నీటి సమీపమున శిథిలమైన గోస్థానములో నాలుగుబాటలు కలిసిన ప్రదేశములో పాములు తిరుగుచోట శ్మశానములో నదుల చివరలలో అగ్ని సమీపమున చైత్యముల-గ్రామములలో జనులు సమావేశ మగుటకును దేవతా భావనతో, పూజించుటకును నాటిన చెట్ల దగ్గరను-పుట్టల దగ్గరను-భయమునకు అవకాశముగల చోట్లను, బావుల దగ్గరను, ఎండిన ఆకుల కుప్పల దగ్గరను, యోగసాధన ఎప్పుడును చేయరాదు. ఒకవేళ ఇట్టిచోట్ల యోగసాధనను మూఢుడై చేసిన ఎడల చెవుడు, బుద్ధి మాంద్యము, జ్ఞాపకశక్తి లోపము, మూగితనము, గ్రుడ్డితనము, జ్వరము కలుగును. అజ్ఞానము సంభవించును. నాలుగు పురుషార్థములకును దేహమే సాధనము కావున పై విషయములను పాటించి దేహమును రక్షించుకొనుచు యోగ సాధన చేయవలెను.

ఆశ్రమములో జనులులేనిచోట, రహస్య స్థానమున, శబ్దము వినబడనిచోట, నిర్భయమగుచోట, కొండమీద, శూన్యగృహమున, శుచిస్థానమున, అందమైనచోట,

ఏకాంత స్థానమున, దేవాలయమున, రాత్రియొక్క మొదటి జామున, చివరి జామున పగలు ప్రాతఃకాలమున, మధ్యాహ్నమున యోగసాధన చేయతగును. తగిన ఆహారమును మితముగా భుజించుచు, ఇంద్రియముల జయించి సుఖమును నిశ్చలమునునై, ఎక్కువ ఎత్తునుకాని రమ్యమైన ఆసనమున ప్రాఙ్ముఖుడై కూర్చుండవలెను. సత్యవచనుడు, శుచి, తగినంత నిద్రకలవాడు, క్రోధము జయించినవాడు, సర్వభూతములకు హితమును కోరు వాడు, చలి వేడి మొదలగు అన్ని ద్వంద్వములను సహించువాడు, మనసున నిబ్బరము కలవాడు, శరీరము పాదములు శిరస్సు సమముగా ఉంచినవాడు కావలెను. హస్తములను నాభిపై నిలిపి శాంతుడై పద్మాసనమున నుండవలెను. మౌనియై దృష్టిని ముక్కు కొనపై నిలిపి ప్రాణాయామము చేయవలెను. జ్ఞానేంద్రియములను ఐదింటిని మనస్సుతో కూడ హృదయములోనికి ఉపసంహరించవలెను. మునియై ప్రణవమును దీర్ఘముగా పూనికతో ఉచ్చరించుచు మిగుల నిశ్చలుడై తమోగుణ వ్యాపారము రజోగుణము చేతను రజోగుణ వ్యాపారమును సత్త్వగుణముచేతను కప్పివేసి కన్నులు మూసికొని నిర్మల శాంత స్థితిలో ఉండవలెను. ఇట్లు హృదయ గుహయందు దాగినవాడును సర్వవ్యాపియు నిరంజనుడును అగు పురుషోత్తముని తన చిత్తమున అనుసంధానము చేయవలెను. జ్ఞాన కర్మేంద్రియము లను భూతములను మొదట క్షేత్రజ్ఞుడు అగు జీవచైతన్యము నందును తరువాత ఆక్షేత్రజ్ఞుని పరమాత్మ తత్త్వమునందును అనుసంధానము చేయవలెను. సహజ చంచలమగు మనస్సు బాహ్య విషయ సుఖములను వదలి పరమాత్ముని చేరిన వానికి యోగసిద్ధి నిశ్చయముగా కలుగును. చిత్తము విషయములపైకిపోక బ్రహ్మమునందు లయమొందినచో యోగసమాధి ఫలమును సిద్ధింపజేయుటచే సాధకుడు పరమపదమును పొందును. యోగసాధకుని చిత్తము ఏకర్మాచరణమునందును ఆసక్తి నొందక ఆనందమును పొందినప్పుడు మోక్షము పొందును. జాగరిత స్వప్న సుషుప్తి స్థానములను దాటి తురీయావస్థలో ఉండు పురుషోత్తముని చేరినప్పుడు మోక్షము పొందును.జాగరిత స్వప్న సుషుప్తి స్థానములను దాటి తురీయావస్థలో ఉండు పురుషోత్తముని చేరినప్పుడు యోగసాధకుడు మోక్షసిద్ధి నొందును. ఏ కోరికలునులేక అన్నిటిని ప్రీతికరమైన వానినిగానే చూచుచు పరతత్త్వము తప్ప మిగిలినదంతయు అనిత్యమని ఎఱుగనిదే మోక్షము సిద్ధింపదు. యోగ సాధకుడు వైరాగ్యముతో నుండవలెను. ఇంద్రియ సుఖముల సేవింపరాదు. యోగమును అభ్యసింప వలెను. పద్మాసనముతో కూర్చుండుట నాసాగ్రమున దృష్టి నిలుపుట మాత్రమున యోగసిద్ధి కలుగదు. మనస్సు ఇంద్రియములు కలిసి లయము నొందుటయే యోగము.

ఓ ముని శ్రేష్ఠులారా! సంసారమోక్ష సాధనమగు యోగ ప్రకారమును తెలిపితిని. మఱి యేమి వినగోరుదురో అడుగుడు" అనగా (235)

సాంఖ్య యోగము

మునులు ఇట్లనిరి "ఓ వ్యాసమహామునీ! నీ ముఖమను క్షీరసముద్రము నుండి ఉద్భవిల్లిన వాగ్రూపమగు అమృతమును ఎంతత్రావినను మాకు తృప్తి కలుగుటలేదు. అందుచేత సంసార విముక్తిని కలిగించు యోగమును ఓ పురుషోత్తమా! సాంఖ్యమును గూడ మాకు విస్తరించి చెప్పుము. మాకు వినుటకు కుతూహలము కలుగుచున్నది. ప్రజ్ఞావంతుడును శ్రోత్రియుడు-తన శాఖకు చెందిన వేదమును సంపూర్ణముగా అధ్యయ నము చేసిన ద్విజుడు-యజ్ఞములు ఆచరించిన ప్రసిద్ధుడు-విశేషముగ అన్ని విషయ ములను ఎఱిగినవాడు, అసూయలేనివాడు, సత్య ధర్మములయందు స్థిరబుద్ధికలవాడు అగు ముముక్షువు, తపస్సు బ్రహ్మచర్యము సర్వ కర్మఫల త్యాగము చేసియు మేధావం తుడయ్యు ఏ సాధన మున్నచో ముక్తి నందును ? సాంఖ్యము చేతనా? యోగముచేతనా ? మాకు తెలుపుము. పురుషుడు ఏ ఉపాయముచే ఇంద్రియములకును మనస్సునకును తత్త్వము నందు ఏకాగ్రత సంపాదించ కలుగును? వివరింప వలయును అని ప్రార్థించిరి. (పురుష డనగా జీవుడు-మగవాడని కాదు.)

వ్యాసుడు ఇట్లు అనెను : జ్ఞాన తపస్సులు ఇంద్రియ నిగ్రహము సర్వసంగ పరిత్యాగము లేనిదే ఎవరును సిద్ధి పొందలేరు. స్వయంభూబ్రహ్మయొక్క మొదటి సృష్టియగు ఐదు మహాభూతములును జీవుల దేహ సముదాయమునందు ఇమిడియున్నవి. భూమినుండి దేహము (దేహములోని గట్టి అంశ) జలమునుండి ద్రవాంశము, అగ్ని నుండి కన్నులు, వాయువు నుండి ప్రాణా పానాది వాయువులైదు, ఆకాశమునుండి ఉదరము ఏర్పడినవి. జీవుల నడకలో విష్ణువు బలమునందు ఇంద్రుడు ఉందురు. ఉదరమున అగ్నియుండి ఆకలిని ఏర్పరచును. చెవులలో దిక్కులు జిహ్వయందు సరస్వతి ఉండును. చెవులు చర్మము కన్నులు నాలుక ముక్కు అను జ్ఞానేంద్రియములు మరి ఐదు కర్మేంద్రి యములు కలిసి ఈ పదియు తమకు ఆహారమునకై శబ్ద స్పర్శ రూప రస గంధములను ఆయా కర్మేంద్రియ వ్యాపారములను కోరుచుండును. జీవాత్ముడు మనస్సును, మనస్సు ఇంద్రియములను, ప్రేరణచేయుటచే ఆయా పది ఇంద్రియ వ్యాపారములును జరుగుచున్నవి. మనీషి (విద్వాంసుడు) మనస్సు తోనే తనలోనున్న ఆత్మను చూచును. ప్రకాశమునొందిన మనస్సుతో తప్ప ఆత్మను ఇంద్రియములతో దర్శింప, అనుభవింప శక్యముకాదు. ఈదృశ్య ప్రపంచమంతయు ఆ మహాతత్త్వముతో వ్యాప్తమై యున్నది. స్థిర చర జడ చేతన పదార్థములన్నిటి యందును ఆతడొక్కడే నిలిచియున్నాడు.

జీవుడు తనలో సర్వ భూతములను సర్వభూతములలో తనకంటె అభిన్నుడగు పరమాత్మను చూడగలిగినచో బ్రహ్మమే తానగును. దృశ్య ప్రపంచమునందు ఏ రూపమున ఎంత ఆత్మకలదో, పరమాత్ముని యందును అదే అంతే తత్త్వము కలదని ఎఱిగినవాడు అమృతత్వమును, మోక్షమును పొందును. తాను బ్రహ్మమే అగును. సర్వభూతములును తానై సర్వ భూతములకు హితుడగు ఆ మహానుభావుడు పాదములు లేకయే సంచరించు వాడు. కాన ఆతడు నడచుమార్గము ఏదియో దేవతలుకూడ ఎఱుగజాలరు. ఆకాశమున పక్షుల మార్గమువలె నీటిలో చేపలమార్గమువలె, జ్ఞానుల మార్గము ఎవరికిని కనబడదు. అన్ని భూతములను కాలము పరిపాకము నొందించి తనకు లోబరుచుకొనును. కాని కాలమును కూడ పరిపాకము నొందించుచు తన అధీనములో నుంచుకొను పరతత్త్వమును ఎవరోతప్ప ఎఱుగజాలరు. ఆ పరతత్త్వమునకు మీదక్రింద, అడ్డముగా, ప్రక్కగా మరలమరల మధ్యలో ఇదియున్నది అనిచెప్ప శక్యముకాదు. ఏలయన అంతయు తానేయగు ఏకైక, అఖండ పదార్థమది. ఈ లోకములన్నియు దానియందు ఉన్నవి. అవి అదియే కనుక వానికి వెలుపల ఏదియు లేదు. వింటి త్రాటినుండి వెడలిన బాణమువలె సూటిగా మనో వేగముతో ఎంతదూరము ఎంతసేపు పరుగుతోపోయినను ఆ మహాతత్త్వము యొక్క కడపటి మేర దొరుకదు. దానికంటె చిన్నదికాని పెద్దదికాని ఏదియులేదు. ఆతత్త్వమునకు కాలు సేతులు కన్నులు తలలు నోళ్ళు చెవులు అన్ని వైపులకును కలవు. అది అంతట అన్నిటిని ఆవరించి యున్నది. అది చాల చిన్నవానికంటె చాలచిన్నది, చాలపెద్దవానికంటె చాలపెద్దది. అన్ని భూతముల లోపల ఎప్పుడు ఉండియు అది కనబడకుండును. ఈ తత్త్వము క్షరము అక్షరము అని రెండు విధములు. సర్వ భూతముల యందును సర్వ భూతముల రూపముతోను ఉన్నది క్షరము-నశించునది. దివ్యము అమృతమునగు తత్త్వము అక్షరము-నశింపనిది. హంస అని వ్యవహరింపబడు ఈ పరతత్త్వము స్థావరములు, చరములు (కదలని-కదలగల) సర్వభూతముల యందును దేహము అనెడి నవద్వారములుకల పురమును (రెండు ముక్కులు, రెండు చెవులు, రెండు కన్నులు, నోరు, గుదము, మర్మాంగము మొత్తము తొమ్మిది) నిర్మించుకొని నియమములతో ఇంద్రియములను తనఅధీనములో ఉంచుకొనియుండును. ఆయనకు మనకువలెసంకల్ప, వికల్పములు ఉండవు కనుకను అన్ని ప్రాణుల శరీరములను తన అధీనమున ఉంచుకొనుటచేతను అతనిని హంస అందురని తత్త్వవేత్తలు చెప్పుదురు. ఇది ప్రపంచ రూపమున ఉండుటచే క్షర రూపమైనది. ఈ రూప వికల్పములు లేని అవికారియైన కూటస్థ రూపము అక్షరము. దానిని ఎఱిగిన వాడు అది తానేయగును. ఇదియే తత్త్వసారము.

వ్యాసుడు ఇట్లు అనెను :

ఓ విప్రులారా! మీరడిగిన తత్త్వ వివేచన రూపమగు సాంఖ్యతత్త్వమును ఉన్నది ఉన్నట్లు తెలిపితిని. ఇక మీదట యోగప్రకారమును తెలిపెదను. బుద్ధి, మనస్సు, ఇంద్రియములు ఏకత్వమొందునట్లు చేయుచు సర్వవ్యాపియగు ఆత్మను ఎఱుగు ఉత్తమ జ్ఞానము-మనస్సును బాహ్యేంద్రియములను నిగ్రహించుకొని ఆధ్యాత్మతత్త్వము నెఱుగుట అభ్యసించుచు కామము క్రోధము లోభము భయము స్వప్నము అనెడి ఐదు యోగదోషములను విడిచి, తనలో తానే ఆనందమును తృప్తిని పొందుచు పవిత్రములగు కర్మలు మాత్రము అనుష్ఠించుచు, ఆత్మ తత్త్వము ఎఱుగవలెను. మనోనిగ్రహముచే క్రోధమును సంకల్పములు విడిచి కామమును సత్త్వగుణము పెంచుకొనుటచే స్వప్నము, నిద్ర, మనస్సు, నిబ్బరముచే తిండిపై కామ సుఖముపై వాంఛను కంటితో కాలుసేతులతో చేయు పనులను మనస్సుతో కన్నులను చెవులను పవిత్ర కర్మతో మనస్సును వాక్కును ఏమఱుపాటు లేకుండుటచే భయమును వివేకవంతులను సేవించుటచే కపట ప్రవృత్తిని ఇట్లీ యోగదోషములను ప్రయత్నముతో జయింపవచ్చును. ఎప్పుడును అగ్నులకు బ్రాహ్మణులకు దేవతలకు నమస్కరించుచుండవలెను. మనస్సునకు తోచినట్లు ఇతరులను నొప్పించు పొగరుమాటలు పలుకరాదు. సర్వ చరాచర భూతాత్మకుడగు పరమాత్ముడు స్వయంజ్యోతియై ప్రకాశించు తేజోరూపుడు. ఈ పరమాత్మ రూపమగు తేజస్సు వృద్ధి నొందుటకు పాపము నశించుటకు ధ్యానము అధ్యయనము దానము సత్యము బిడియము, ఋజు (వంకరగాని) స్వభావము క్షమశౌచము మనఃశుద్ధి ఇంద్రియ నిగ్రహము అనునవి సాధనములు. సర్వభూతముల యందు సమబుద్ధి కలిగి యత్నము లేకయే లభించిన దానితో జీవించుచు పాపములు విడిచి తేజస్సు వృద్ధిపరచుకొని లఘు ఆహారము తినుచు ఇంద్రియములను కామక్రోధములను జయించి ఇంద్రియములను మనస్సును ఏకాగ్రములుగాచేసి, రాత్రి మొదటి కడపటి జాములందు పరతత్త్వమున మనస్సు నిలిపి తత్త్వసాధనము చేయవలెను. ఏ ఒక్క ఇంద్రియమైనను కోరికలతో తడిసినచో పర్వతము ప్రక్కనుండు మిట్టనుండి నీరువలె జీవుని ప్రజ్ఞ పరతత్త్వము నుండి క్రిందికి జారును. కనుక చేపలపట్టువాడు గాలముతో వలె మనస్సుతో శ్రోత్రము చక్షుస్సు జిహ్వ, ఘ్రాణము అనుక్రమమున జ్ఞానేంద్రియములను నిగ్రహించి మనస్సున నిలిపి పిమ్మట మనస్సులోని సంకల్పములను కూడ అణచి దానిని హృదయమున నిలుపవలెను. దానిని ఆత్మతత్త్వముపై నిలుపవలెను. అప్పుడు పొగలేని నిప్పువలె మేఘావరణములేని సూర్యునివలె ఆకాశమందలి మెఱుపువలె పరమాత్మ తత్త్వము ప్రకాశించును. అది తనయందు తానై అంతయు తనయందు అంతయందు తానై వ్యాపించి

యున్నది. బ్రాహ్మణులు - మనీషులు (బ్రహ్మతత్త్వమునందు శ్రద్ధగలవారు, మనస్సును దానిపై నిలిపినవారు అగు మహాత్ములు, మహత్ గొప్ప, ఆత్మా = మనస్సు కలవారు, నిబ్బరము కలవారు మహావివేకవంతులు సర్వభూతములకును హితము కోరువారును మాత్రమే ఆ తత్త్వముఖ దర్శింపగలరు. ఈ చెప్పినవిధమున ఏకాంతమునందు పరిమిత మగు నియత కాలమున కూర్చుండుచు నిశితమైన పవిత్ర కర్మలు మాత్రమే ఆచరించుచు తత్త్వమును అభ్యసించినచో అక్షరతత్త్వముతో ఏకమగును. (అభ్యసించుట అనగా ఆ పనిలో సిద్ధి కలుగునంత వరకు మరల మరల చేయుచుండుట) ఇతరులు పొగడినను, తిట్టినను, నమస్కరించినను, లేకున్నను దానిని మంచిగాగాని చెడుగాగాని తలచక లాభమున సంతోషించక, లభించనపుడు దుఃఖించక, అన్నివిషయములందు సమదృష్టియై అన్ని భూతములయందు వాయువువలె సమాన భారము కలవాడై ఎడతెగక ఆరు మాసములకు తక్కువ లేకుండ సాధనము చేసినచో శబ్ద బ్రహ్మానుభవము కలుగును. ఇది మట్టిగడ్డ, ఇది బంగారము, ఇది గొప్పది, ఇది కాదు అని తలచుచు లోకులు పొందు దుఃఖముల చూచి తాను ఆ భేదబుద్ధి వదల వలెను. ఎన్నడును అజ్ఞానముచే ఈ అభ్యాస యోగమును విడువరాదు. అట్లైనచో ఎంత తక్కువ కులమున పుట్టినను స్త్రీకాని, పురుషుడుకాని ముక్తిని పొందుదురు.

ఓ బ్రాహ్మణులారా! మనీషులైనవారు ఇట్టి మార్గము అనుసరించినచో అజుడు, పురాణుడు, సనాతనుడు, ఇంద్రియాతీతుడు అగు ఆ వాసుదేవుని దర్శించి ఆ బ్రహ్మతత్త్వముతో ఒక్కటిగా అగుదురు. (236) అని వ్యాసుడు మునులకు తెల్పెను.

విద్యా-కర్మ-గతి వివేచనము

"వేదవిధి ననుసరించి కర్మలను ఆచరించవలెననియు కర్మలను విడువవలె ననియు మీరు చెప్పుచున్నారు. ఇది పరస్పరము విరుద్ధముగా నున్నది. కావున కర్మల నాచరించినచో ఏ గతి కలుగునో వానిని విడిచి విద్యను-జ్ఞానమును ఆశ్రయించినచో ఏ గతి కలుగునో వివ కుతూహల మగుచున్నది. తెలుపుడు" అని మునులు వ్యాసునడిగిరి.

మునిశ్రేష్ఠులారా! మీరడిగినది చెప్పెదను. కర్మమయమగు క్షరతత్త్వమును, విద్యా మయమగు ఆక్షర తత్వమును కర్మాను ష్ఠానము వలన విద్యా లాభమువలన కలుగు గతులనుకూడ వివరింతును. వినుడు. ఈ ప్రశ్నలకు సమాధానము చాల గహన-గంభీం మైనది. ధర్మమున్నది అనుచునే అదే ధర్మము లేదని చెప్పుట పరస్పర విరుద్ధము. వేదాను సారియగు ప్రవృత్తి మార్గము, విద్యానుసారియగు నివృత్తి మార్గము అని రెండు మార్గములు

కలవు. కర్మము బంధ హేతువు. విద్య ముక్తి హేతువు. అందుచే తత్త్వము నెరిగిన మునులు కర్మలను ఆచరింపరు. కర్మలను ఆచరించుటచే షోడశ తత్త్వరూపుడగు పురుషుడు మరణించి మరల పుట్టును. విద్యచే అక్షరరూపుడై ముక్తినందును. (షోడశకళలు అనగా ముఖ్యప్రాణము, శ్రద్ధ, పంచ భూతములు ఇంద్రియములు, మనస్సు, అన్నము, వీర్యము, తపస్సు, వేదమంత్రములు, కర్మములు, లోకములు, నామము, ఇవి పదునారు ప్రశ్నోపనిషత్ - 6 ప్రశ్న - 4 మంత్రము) అపరా విద్యను ఆశ్రయించినవారు కర్మలను మెచ్చుచు, జన్మమరణ పరంపరలో చిక్కి దేహములతోనే ఆనందించుచుందురు. పరా విద్యను ఆశ్రయించినవారు ధర్మతత్త్వము నెఱిగినవారు కావున నది నీరు త్రావువారు బావినీటిని మెచ్చనట్లు కర్మ మార్గమును మెచ్చరు. కర్మానుష్ఠానము వలన సుఖదుఃఖములను జన్మమరణములను పొందుదురు. విద్యచేత దుఃఖశోకములు కాని జన్మ మరణములు కాని హానివృద్ధులు కాలేని స్థానమును పొందుదురు. అవ్యక్తము అచలము ధ్రువము అవ్యాకృతము అనామయము అమృతము యోగముచే ప్రాప్యము అగు పరబ్రహ్మ స్థానమును పొందుదురు. అట్టివారు సుఖదుఃఖముల వంటి ద్వంద్వముల చేతను సంకల్ప కృతములగు కర్మలచేతను బాధింపబడక అన్ని ప్రాణులయందు మైత్రీ భావము హితబుద్ధి కలిగియుందురు. పురుషుడును (జీవుడు) కర్మమయుడు విద్యామయుడు అని రెండు విధములు. వీరిలో కర్మమయ పురుషుడు చంద్రునివలె సుకుమార స్పర్శ కలిగి చంద్రకళ వంటి సూక్ష్మ కళారూపమున ఉండును అని ఋగ్వేద పురుషుడు చెప్పెను. దానిని విస్తరించి అనుగానము చేయుదురు. వస్త్రములో దారపు ఏసెవలె సూక్ష్మమగు ఆ తత్త్వము సులభముగా మాటలతో చెప్పుటకుగాని ఇంద్రియములతో చూచుటకుగాని శక్యముకాదు. పంచతన్మాత్రలు గుణత్రయము మనోబుద్ధి అహంకారములు అంతఃకరణత్రయము అనెడి ఏకాదశ తత్త్వవికారములు, షోడశకలలు, కర్మలు, గుణములు మూర్తీభవించిన తత్త్వముగా ఆ కర్మమయ పురుషుని తెలియవచ్చును. అతడు ఈ షోడశ కలామయమగు దేహమును ఆశ్రయించి సముద్రజలమునందు ప్రతిబింబించిన చంద్రుడివలె నుండి యోగసాధనచే జయింపబడు తత్త్వమై క్షేత్రజ్ఞుడని వ్యవహరింపబడు చుండును. తమస్సు రజస్సు సత్త్వము ఈ మూడును జీవుని గుణములు. జీవుడు ఆత్మ యొక్క గుణము. ఆత్మ పరమాత్మయొక్క గుణము. ఈ గుణత్రయాత్మకమగు ఈ దృశ్య ప్రపంచము అంతయు ఈ సప్త లోకములును ఈ జీవుని సృష్టియే అని క్షేత్రతత్త్వమును ఎఱిగినవారి వచనము.

ప్రకృతియొక్క వికారములు అగు దృశ్య ప్రపంచము-క్షేత్రజ్ఞుడనబడు ఆత్మతత్త్వము అను ఈ రెంటిలో అవి ఇతనిని ఎరుగజాలవు. కాని అతడు వాని నెరుగును, సమర్థుడగు

సారథి మేలైన గుఱ్ఱములతో రథమును నడిపినట్లు మనస్సుతో ఐదు జ్ఞానేంద్రియములతో ఆయా పనులు చేయించును. ఇంద్రియముల కంటె, ఇంద్రియములతో అనుభవించు విషయములు వాటికంటె మనస్సు, మనస్సు కంటె బుద్ధి, బుద్ధికంటె హిరణ్య గర్భుడను తత్త్వము దానికంటె జగద్బీజమగు అవ్యక్తమను ఈశ్వరతత్త్వము, దానికంటె అమృతత్త్వము ఒకదానికంటె మఱియొకటి సూక్ష్మతరములు. అమృత తత్త్వముకంటె సూక్ష్మతరము లేదు. అదే అందరకును కడపటి గమ్యస్థానము. ఈ విధముగా సర్వభూతముల యందు రహస్యముగా ప్రత్యక్తత్త్వమై ఉన్న పరాత్మతత్త్వము బహిర్గతమై ప్రకాశింపక కనబడక ఉండును. కాని సూక్ష్మదృష్టి కల మహనీయులు నిశితమగు బుద్ధితో చూడగలుగుదురు. పంచ జ్ఞానేంద్రియములను మనస్సున లీనముచేసి ఆ ఆఱింటితో సుఖవిషయములను ఆలోచింపక, అనుభవింపక, జ్ఞానసంపన్నమగు మనస్సును పరతత్వ ధ్యానమున నిలిపి, తనపై ఇంద్రియములను అధికారము చేయనీయక, ప్రశాంత మనస్కుడగు వాడు ముక్తి పొందును. ఇంద్రియములకు అన్నిటికి వశుడై, ధ్యానము తత్త్వముపై నిలువలేక ఆత్మను మనశ్చాంచల్యమునకు వదలినవాడు మృత్యువును, సంసారమును పొందును. సర్వ సంకల్పములను అణచి చిత్తమున సత్త్వగుణమును నింపి తత్త్వ విచారణాపరుడు కావలెను. చిత్తము నిర్మలమగుటచే ఇది శుభము ఇది అశుభము అను భేదబుద్ధి తొలగి అత్యంత సుఖమును పొందును. చిత్త ప్రసాదము గాఢ సుషుప్తి సుఖమువలె స్వచ్ఛమయినది. అప్పుడు చిత్తము గాలిలేనిచోట దీపమువలె నిశ్చలమై ప్రకాశించును. ఈ తత్త్వ విచారశాస్త్రము సర్వవేద రహస్యము. ఇతిహ్యాములచే ఆగమములచే లభించదు. ఆత్మజ్ఞానము కలిగించునది. భృగువను నతనికి, అతని తండ్రియగు వరుణుడు ఉపదేశించినది. పెరుగును మథించి నవనీతమును వలె కాష్ఠము మథించి అగ్నివలె ధర్మసత్య ప్రతిపాదకములగు శాస్త్రములను పదివేలు కొలదిగ సంవత్సరముల పాటు మథించి తత్త్వవేత్తలు ముముక్షువులకు ముక్తిని సంపాదించు. ఈ తత్త్వమును వారిని ఉద్ధరించుటకై బయల్వ రచిరి. వేదవిద్యాధ్యయనము చేసినవానికి దీనిని తెలుపవలెను. ప్రశాంత చిత్తము ఇంద్రియ నిగ్రహము తపస్సు వేదార్థ జ్ఞానము పెద్దలను అనువర్తించుట అనసూయత ఋజు ప్రవర్తనము చెప్పినట్లు చేయుట అను మంచి లక్షణములు లేనివానికిని తర్కశాస్త్రముతో బుద్ధి చెడినవానికిని కొండెగానికిని ఆత్మస్తుతి చేసికొనువానికిని అతడు భూమినంతటిని ప్రతిఫలముగా ఇచ్చినను బోధించరాదు. ఇది అన్ని ధనములకంటె జ్ఞానముల కంటె శ్రేయో రూపము. మనుష్యులకు దుర్లభము. మహర్షులు దర్శించినది. ఉపనిషత్తులలో తెలుప బడినది. ఓ మహర్షులారా! వీరు నన్నడిగితిరి కావున తెలిపితిని. అదంతయు వింటిరి. నాకు తెలిసినది మీకు సంశయము కలిగినది ఏదైన అడుగుడు. చెప్పెదను.

ఓ భగవన్! ఋషిసత్తమా! ఆధ్యాత్మమును మాకు ఇంకను విస్తరించి తెలుపుము అని మునులు ప్రశ్నింపగా,

విప్రులారా! పృథివి-నీరు-అగ్ని-వాయువు-ఆకాశము-అను పంచమహా భూతములను వాటియందు నిలిచియున్న భూత స్రష్టయగు పరమాత్ముడును అనునదియే అధ్యాత్మము.

వీనిలో వేనికి రూపముకలదు ? వేనికి రూపము లేదు ? ఇవి శరీరమున ఎట్లు ఉన్నవి ? ఇంద్రియములును వాని గుణములును ఏవి ? ఎట్లు వానిని గుర్తించవలెను ?

శబ్దము ఆకాశపు గుణము; చెవి దానిని గ్రహించు ఇంద్రియము. శూన్యము దేహములో దాని ఉనికి. స్పర్శ వాయువునకు గుణము. ప్రాణవాయువు దేహమున దాని రూపము. చేష్ట-చలనము-దాని వ్యాపారము. రూపము అగ్నికి గుణము. నేత్రము దాని ఇంద్రియము. విపాకము దేహమున దాని వ్యాపారము. రసము-రుచి-నీటికి గుణము; నాలుక దాని ఇంద్రియము; చెమట దేహమున దాని రూపము. గంధము భూమికి గుణము. ముక్కు దాని ఇంద్రియము. శరీరము దాని రూపము. మనస్సు-బుద్ధి-స్వభావము-ఇవి స్వతః సిద్ధములైనవి. ఇవి ఈ భూత గుణములకు అతీతములు. బుద్ధితో వాటిని వివేకులు నిగ్రహించుకొందురు. శబ్దాది గుణములు-విషయములు బుద్ధిని ప్రేరించును. బుద్ధి ఇంద్రియములను ప్రేరించును. మనస్సుతో ఇంద్రియములు ఆరు బుద్ధి ప్రేరణ లేనిచో గుణ-విషయ-అనుభవమునకు లేదు. కనుక అది ఆరింద్రియములపై ఏడవ తత్త్వము-క్షేత్రజ్ఞుడగు జీవుడు ఎనిమిదవ తత్త్వము. క్షేత్రమనగా దేహము. దానియందుండి ఆయా కర్మలు చేయుచు వాని ఫలములను అనుభవించు జీవుడు క్షేత్రజ్ఞుడు. వీనిలో చక్షుస్సు మొదలగు ఇంద్రియములు రూపము మొదలగు విషయముల గ్రహించును. మనస్సు సంకల్ప వికల్పములను సంశయమును కలిగించును. బుద్ధి - ఇది ఇట్టిదని నిశ్చయమును కలిగించును. క్షేత్రజ్ఞుడు వీటి సహాయమున ఆయాపనులు చేయుచుండును. సత్త్వరజస్తమో గుణములును స్వతః సిద్ధములైనవి. ఇవి అన్ని భూతములయందును సమత్వముతోనే ఉండును. కాని జీవులలో ఎవరి యందు ఏది అధికముగా ఉండునో, వారికి దానిని బట్టి ప్రవృత్తులు కలుగుచుండును. ప్రహర్షము, ప్రీతి, ఆనందము, నిశ్చలచిత్తము అన్నిటిని తన అధీనములో ఉంచుకోగలుగుట. ఇవి సత్త్వగుణ లక్షణములు. అభిమానము, వ్యర్థముగా మాటాడుట, లోభము, మోహము, క్షమ ఇవి రజో లక్షణములు. అధిక మోహము, మూఢత్వము, ఏమరుపాటు, బద్ధకము,

నిద్ర, ఎచ్చరిక, మెలకువ లేకుండుట తెలియవలసిన వాటిని ఎంతో శ్రమమీదకాని తెలిసికొన లేకుండుట ఇవి తమోగుణ లక్షణములు.

భావములను సృజించునది మనస్సు : అధ్యవసాయమును, నిశ్చయమును కలిగించునది బుద్ధి, ఆనందము మొదలగు భావములను అనుభూతి పొందునది హృదయము అని కర్మలకై జీవునిప్రేరించు తత్త్వములు మూడు విధములు. ఈ అంశములను ఇట్లు వివరించుకొనవలయును : ఇంద్రియములకంటె సూక్ష్మతరములు శబ్ద స్పర్శ రూప రస గంధములనెడి విషయములు. వాటికంటె సూక్ష్మతరము మనస్సు. దానికంటె సూక్ష్మతరము బుద్ధి : బుద్ధికంటె సూక్ష్మతరమై ఈ అన్నింటిచేత పని చేయించువాడు జీవుడు. కాని జీవునకు గల ఉపకరణములలో బుద్ధియే సూక్ష్మతమము. ఈ స్వతంత్ర శక్తికల బుద్ధిలో సంకల్ప వికల్పములు కలిగిన స్థితియే మనస్సు. అట్లే బుద్ధియే వినుచో శ్రోత్రము స్పృశించుచో త్వక్ చూచుచో చక్షుస్సు, రుచి చూచుచో రసన, వాసన చూచుచో ఘ్రాణము అని ఐదింద్రియములుగా వ్యవహరింపబడును. జీవుని ఆశ్రయించి ఉండు ఈ బుద్ధి ఆయా భావములను బట్టి వ్యవస్థనొందును. అవి 1.సుఖము; 2.దుఃఖము; 3.ఏమియు తెలియని మూఢస్థితి. బుద్ధి ఈ మూడు ప్రభావములకును అతీతమైనది. సముద్రము నదులను చెలియలికట్టను తనలో ఇముడ్చుకొన్నట్లు, బుద్ధి ఆయా భావములను తనలో ఇముడ్చుకొనును. బుద్ధి ఆయాభావములయందు ప్రవర్తించునప్పుడు గుణములు మూడును తమతమ ప్రభావమును చూపును. ప్రవృత్తికాలములో రజోగుణము, సత్త్వ గుణముపై తన అధికారము చూపును. ఈ మూడు గుణములును చక్రనాభినేముల నడుమ చక్రపు అరల-ఆకులవలె బుద్ధియందు ఇమిడియుండి ఆయా విషయముల ననుసరించి ప్రవర్తించుచుండును. వివేకులు ఇంద్రియములను మనస్సునుకూడ ఆత్మ తత్త్వమును సాక్షాత్కరించుకొనుటకే వినియోగించుకోవలెను. కాని మనస్సును అదుపులో ఉంచు కొననిదే ఇంద్రియములు తమ విషయములమీద స్వేచ్ఛగా ప్రవర్తించు చున్నం తవరకు ఆత్మ సాక్షాత్కారము సాధ్యముకాదు. కనుక ముముక్షువు వివేకముతో మనస్సహాయమున ఇంద్రియములను నిగ్రహించవలెను. చీకటి తొలగగానే లోకమునందలి ప్రాణులకు ఆయా వస్తువులు కనబడునట్లు అజ్ఞానము తొలగగానే ఆత్మ సాక్షాత్కారము జరుగును. నీటిపక్షి నీటిలో తిరుగుచున్నను నీరుకాని, అచటి మలినములు కాని అంటనట్లు జీవన్ముక్తు డగు యోగి ఇంద్రియ విషయములలో ప్రవర్తించినను వాని దోషములు అతనికి అంటవు. ఆత్మానుభవముతో తనయందు తానే ఆనందించువారు సంచితకర్మను నశింపజేసికొని ప్రారబ్ధము అనుభవముతో నశించి సర్వభూతములు తానైనందున త్రిగుణ

సంబంధముచే విషయములలో ప్రవర్తిల్లినను ఆత్మ స్వయంజ్యోతి సత్త్వముతో ప్రకాశించును. ఆత్మ గుణములను ఎరుగును. జడములగుటచే గుణములు ఆత్మను ఎరుగలేవు. అతడు ధ్యాన యోగముచే త్రిగుణముల తత్త్వమును గ్రహించగలడు. సత్త్వాది గుణములకును క్షేత్రజ్ఞునకు గల భేదము ఇది. వీనిలో సత్త్వాదులు గుణములను సృజించ జాలవు. ఆత్మ గుణాదులను సృజించగలదు. ఇట్లు ఇవి వేరువేరయి యుండియు లోక వ్యవహారమున ఇవి అవినాభావ ముతో ఒకదానిని మఱియొకటి ఎడబాయక యుండును. ఇవి ఖనిజ శిల-బంగారముల వంటివి. మేడికాయ-దానియందలి పురుగులవంటివి. ముంజదర్భ యందలి ముల్లు వంటివి. ఇవి వేరు తత్త్వములైను కలిసియే ఉండును. వీనిని వేరుపరచు కొనుటయే ఆత్మ తత్త్వ వివేకము. ఇదియే ఆత్మ సాక్షాత్కారమునకు సాధనము. (237)

సాంఖ్య వివేచనము

సత్త్వము - సత్తా - అనునది గుణత్రయమును, క్షేత్రజ్ఞుడగు ఆత్మతత్త్వము ఈ గుణత్రయమునకు సత్త్వమునకు అధిష్ఠాతయై ప్రపంచ రూపమున పరిణామము పొందు గుణములను ఉదాసీన భావముతో చూచుచు ఈశ్వరుడై యుండును. సత్త్వము గుణములను సృజించుట సాలెపురుగు తన నుండి తనకంటె వేరుకాని పదార్థముతో దారమునుతీసి గూడు అల్లుటవంటిది. గుణములు ఎప్పుడును ప్రవృతివైపే ఉండి ముందునకు పోవుచుండును. ఆ ప్రవృత్తి గోచరము కాదు అని కొందరును, నివృత్తియు వాటికి కలదని కొందరును అందురు. ఈ విషయములో గొప్ప సంశయమునకు అవకాశమున్నది. కాని విచారణచేసి ఏదో ఒక పక్షమును నిర్ణయించుకొనవలయును. మొత్తము మీద ఆత్మతత్త్వము జనన మరణములు లేనిది. దాని నెరిగి ఆనందించవలెను. క్రోధము హర్షము మత్సరము విడువవలెను. ఈ ఆత్మతత్త్వమును ఎఱిగిన మనుష్యులు కృతకృత్యులై ముక్తినందుదురు. ఇట్టి వారికి పరలోకవిషయమై భయముండదు. లేనివారికి భయము కలదు. తత్త్వవేత్తకు కలుగు శాశ్వతగతియగు పరమముక్తి కంటె మించిన ఉత్తమస్థితి మఱి ఏదియు లేదు. నరుడు కృతమును-కార్యరూపమగు ప్రపంచ తత్త్వమును-అకృతమును-జనన మరణములులేని పరతత్త్వమును ఎరుగనంతవరకును భేదబుద్ధి కలవాడగుటచే ఇది ప్రియము ఇది అప్రి యము అని తలచుచు ఒకప్పుడు తల్లినికూడ ద్వేషించును. శోకమును అనుభవించును. కర్మలను ఫలముపై అభిసంధితో చేయునంత వరకు ఇది ప్రియము ఇది అప్రియము అను భావముండును. తత్త్వమును ఎరిగి ఫలముపై అభిసంధి లేక కర్మలను ఆచరించువాడు తాను పూర్వమునందు కర్మలుచేసి సంపాదించిన సంచిత కర్మమునుకూడ నశింపచేసికొనును. అనగా ముక్తి పొందును.

'అన్ని భూతతత్త్వముల కంటె ఉత్తమమగు తత్త్వమును అన్ని ధర్మముల కంటె మేలగు ధర్మమును మాకు తెలుపుమని మునులు వ్యాసునడిగిరి. అందులకు వ్యాసులవారు.

అతి ప్రాచీనమును ఋషులును మెచ్చినదియు అన్ని ధర్మములకంటె శ్రేష్ఠము అగు ధర్మము తెలిపెదను వినుడు. ఇంద్రియములు జీవుని కలవర పరచునవి. కనుక బుద్ధితో వాటిని బాలురను తండ్రివలె అదుపులో ఉంచుకొని ఇంద్రియములకును మనస్సునకును ఏకాగ్రత అనెడి ఉత్తమతపస్సుచే ఆ ఉత్తమ ధర్మమును ఎరుగవలెను. గోచరించు వేటిని అనుభవింపగోరక ఇంద్రియములు నివృత్తి నొందినపుడు శాశ్వతుడగు పరమాత్మ తత్త్వము సాక్షాత్కారమును పొందును. ఎన్నో కొమ్మలు పండ్లు పూలు ఆకులు కల వృక్షమునకు తన ఏ పండెక్కడనో ఏ పూవు ఎక్కడనో ఏ కొమ్మ ఏ ఆకు ఎక్కడనో తెలియనట్లే అనేక వస్తు భేదములతో నిండిన ఈ సంసారములోని జీవుడును తానెవడు ? ఎక్కడనుండి తాను వచ్చెను ? ఎక్కడకు పోవలెను ? అని తెలియకుండును. కాని జ్ఞాన దీపమును ప్రకాశింప జేసికొనినచో అతడు తన అంతరాత్మతో తనలో తన్నుతాను చూడగలుగును. కనుక ఓ విప్రులారా! అందులకై మీరును మొదట వైరాగ్యమును పూనుడు. దానిచే మీరు కుబుసము విడిచిన పామువలె పాపములను వదలించుకొనగలరు. జ్ఞానము సంపాదించి, చింతా సంతాపములు విడువగలరు. లోకగతి అనాది ప్రవాహము. నది వంటిది. ఘోరమైనది. ఇది అన్ని వైపులకు వ్యాపించును. ఇంద్రియములు మొసళ్లు, మనఃసంకల్పములు దీనిగట్లు. లోభ మోహములు, క్రోధము బురద, అవ్యక్త తత్త్వమునుండి ఇది పుట్టినది. మహా వేగముకలది. సంసారసాగరములో అది కలియును. జన్మ పరంపర అను పాతాళములోనికిది పోవును. కామముచే ఇది పుట్టును. జిహ్వాచాపలము సుడులు. దీనిని జ్ఞానవంతులు మాత్రమే దాటగలరు. సమస్త భూతము సృష్టి ప్రళయములు తెలిసికొన గలరు. ఇదియే సర్వశ్రేష్ఠమగు ధర్మము. దీనిని హితుడై అనుగతుడై శుచిమనస్కుడైన శిష్యునకును, కుమారునకును మాత్రమే బోధించవలయును" అని చెప్పెను. అంతట

"స్వయంభూ బ్రహ్మము మోక్షమునకై నిర్ణయించిన ఉపాయమును యథాశాస్త్ర న్యాయానుసారముగ మాకు తెలుప వేడుచున్నా" మని మునులు వ్యాసుని అడిగిరి.

వ్యాసుడు మునులకిట్లు చెప్పెను :

ఓ మహా ప్రాజ్ఞులారా! మనవంటివారికి వివేక జ్ఞానము సరియగు ఉపాయము. దాని సహాయమున సర్వ విషయములను అన్వేషించి కనుగొనవచ్చును. కాని మనకు ఒక కడవతో పనిపడినపుడు దానిని ఒక్కదానిని సరియైనదానిని సంపాదించుకొనవలయునే

కాని లోకములో అన్ని కడవలను గూర్చి తెలిసికొనవలసిన పనికాని, అన్ని కడవలను సంపాదించవలసిన పనికానిలేదు. అట్లే మోక్షమును కోరినవారు మోక్ష ధర్మమును మాత్రమే కాని ఇతర ధర్మములను తెలిసికొన నక్కరలేదు. తూర్పు సముద్రమునకు చేర్చు మార్గము పశ్చిమ సముద్రమునకు చేర్చదు. అట్లే మోక్షము సిద్ధింపజేయు ధర్మము ఒక్కటియే. ఇతర మార్గములు దానిని సిద్ధింప జేయజాలవు. అట్టి ధర్మమును తెలిపెదను. యోగ సాధనకు మూలముగా క్షమచే క్రోధమును సంకల్పములను విడుచుటచే కోరికలను, సత్త్వ వృద్ధిచే నిద్రను, ఎచ్చరికచే భయమును, మనస్సు నిబ్బరముచే ఇచ్ఛను ద్వేషమును కామ ప్రవృత్తిని, జ్ఞాన వివేకమును అభ్యసించుటచేత బుద్ధిమాంద్యమును, ఏ విషయములును చిత్తమున స్ఫురించకపోవుటను హితములు సులభముగా జీర్ణమగు మితాహారముచే దైహికములు మానసికములు అగు ఉపద్రవములను, తృప్తిచే లోభమోహములను తత్త్వా జ్ఞానముచే విషయ భోగములను దయాభావముచే అధర్మమును ఫలానభిసంధిచే యజ్ఞ దానాది ధర్మ కర్మములను ఆ యతిచే ఆశను సంగము విడుచుటచే కార్య సామర్థ్యమును దృశ్య ప్రపంచ వస్తువులు అనిత్యములను భావముచే వాటిపై ప్రీతిని, యోగముచే ఆకలిని జయించవలెను. మౌనముచే వాగుడుతనమును, శౌర్యముచే భయమును విడువవలెను. వాక్కును మనస్సును బుద్ధితో, బుద్ధిని జ్ఞాన నేత్రములతో అదుపులో నుంచి జ్ఞానముచే ఆత్మ తత్త్వమెరిగి ఆత్మ శాంతిని సాధించవలెను. ఫలాభిసంధి లేక పవిత్రకర్మలు ఆచరించి శుద్ధమైన చిత్తముతో జ్ఞానము సాధించవలెను. కామ క్రోధ లోభ భయస్వప్నములను యోగదోషముల అయిదింటిని విడిచి యోగసాధనము చేయుచు ధ్యానము అధ్యయనము దానము సత్యము బిడియము ఋజువర్తనము క్షమ శౌచము ఆచారశుద్ధి ఇంద్రియ జయము కలిగియున్నచో తేజస్సు వృద్ధియగును. పాపము నశించును. సంకల్పములు నెరవేరును. విజ్ఞానము ప్రవర్తిల్లును. చివరకు బ్రహ్మ స్థానమున ప్రవేశించును. అమూఢత్వము సంగ రాహిత్యము కామక్రోధముల విడుచుట దైన్యముకాని పొగరుకాని లేకుండుట భయములేక నిబ్బరముతోనుండుట-ఇది ప్రసన్నమును విమలమును శుచియు అయిన మోక్షమార్గము. మనోవాక్కాయ నిగ్రహము తప్పక ఉండవలసిన నియమము. (138)

యోగవిధి

"ఓ మునిసత్తమా! తాము అన్ని విషయములను ఎఱిగినవారు. సాంఖ్య దర్శనమునందు కంటె యోగదర్శనమునందుకల విశిష్టత ఏమియో మాకు తెలుప ప్రార్థించుచున్నాము" అని మునులు వ్యాసుని ప్రార్థించిరి.

సాంఖ్యులును యోగులును ఉత్తమములగు యుక్తులతో తమతమ పక్షములను సమర్థించుకొనుచు ప్రశంసించుకొనుచు ఉందురు. కాని విద్వాంసులగువారు మాత్రము సాంఖ్య సంప్రదాయమునందు ఈశ్వరుని అంగీకరింపరు కావున ఈశ్వరుని అంగీకరింపని వారికి మోక్షము సిద్ధించుటేమి? అను తలంపుతో సాంఖ్యమును గ్రహింపక యోగ దర్శనమును ప్రశంసింతురు. ఇహమునందలి సర్వగతులను వాని యందలి దోషములను ఎఱిగి విషయములందు విరక్తుడైనవాడు దేహత్యాగమునకు తరువాత తప్పక ముక్తి నందును అని సాంఖ్యుల సిద్ధాంతము. సమర్థములగు యుక్తులను హితములగు వచనము లను గుర్తించి స్వపక్షమునకు తగినవానిని గ్రహించుట న్యాయము. ప్రత్యక్షమును, తత్త్వ సాక్షాత్కారమును ప్రమాణముగా గ్రహించువారు యోగదర్శనపరులు. శాస్త్రప్రమాణ బలముచే విషయ నిర్ణయము చేయువారు సాంఖ్యులు. ఓ ద్విజోత్తములారా! ఈ రెండు తత్త్వములును అవినాభావ సంబంధము కలవి. రెండును శిష్టులకు సమ్మతమైనవి. శాస్త్ర ప్రమాణానుసారము అనుష్ఠించినచో రెండు దర్శనములును మోక్షమును ఇచ్చునవే. శౌచము భూతదయ ఆయా వ్రతానుష్ఠానములు రెండు దర్శనము లందును సమానమే. ఐనను దర్శన సిద్ధాంతములు మాత్రము రెంటికిని భిన్నములు.

"ఐనచో ఓ ద్విజోత్తమా! ఈ దర్శనములకు రెంటికి భేదమేమో తెలియగోరెద"మని మునులు వ్యాసునడిగిరి.

చేపలు వలను చించివేసి మరల నీటిలో ప్రవేశించినట్లు, మృగములు ఉరులను త్రెంచుకొని మరల తమ మార్గమున తాము పోవునట్లు యోగబలమును సాధించినవారును లోభ బంధనములను త్రెంచుకొని విమలమును శుభము అగు ముక్తి మార్గము చేరెదరు. యోగబలమును సాధించజాలనివారు వలలో చిక్కిన చేపలవలె, ఉరులలో చిక్కిన మృగముల వలె ఆ బంధనములలో చిక్కి నశింతురు. మొదటి బంధనములలో చిక్కని యోగులు చాల అరుదు. అగ్ని అల్పముగా నుండగా దానిపై లావైన కట్టెలు అంటించు నపుడు అది చల్లారును. అదే అగ్నికి గాలి బాగుగా తోడైనపుడు ప్రజ్వలించి భూమండలము నంతటిని కూడ దహించగలుగును. యోగశక్తి కూడ ఈ అగ్నివంటిదే. తత్త్వజ్ఞానబలము కల యోగి మహాబలమును అంతటిని కూడ దహించగలుగును. యోగశక్తి కూడ ఈ అగ్ని వంటిదే. తత్త్వ జ్ఞాన బలము కల యోగి మహాబలమును, దీప్తమగు తేజస్సును కలవాడై ప్రళయ కాలసూర్యునివలె జగత్తునంతటిని కాల్చగలుగును. దుర్బలుడగు మానవుడు ప్రవాహములో కొట్టుకొని పోయినట్లు యోగబలమును తగినంతగ సాధించని యోగియు విషయప్రవాహములో కొట్టుకొనిపోవును. ఏనుగు ప్రవాహమును ఎదుర్కొన

గలిగినట్లు యోగబలమును సాధించిన యోగియు విషయ ప్రవాహముతో కొట్టుకొనిపోడు. యోగ బలాన్వితులగు యోగులు ఈశ్వరులు, సమర్థులు అయి ప్రజాపతులు మనువులు మహా భూతములు మొదలగు తత్త్వములను అన్నిటిని ప్రవేశింపగలరు. కాని క్రుద్ధుడైన ఆగంతకుడగు యముడుకాని భయంకర విక్రమముకల మృత్యువుకాని వీరెవ్వరును యోగబలము సాధించిన యోగియందు ప్రవేశింపజాలరు. యోగసాధన చేయవలెను. బలము సంపాదించి ఆ బలములతో మహీమండల మంతట సంచరింపవచ్చును. యోగి యగు వాడొకడు విషయ సుఖములను యోగ బలముచే సాధింపవచ్చును. అవి కొంత కాలమనుభవించి మరల ఉగ్రమగు తపస్సును చేయవచ్చును. సూర్యుడు తన కిరణముల వలె తన శక్తులను ముడుచుకొనవచ్చును. ఓ సత్తములారా! బలముగా సాధింపబడిన యోగ శక్తిగల యోగియొక్క బంధనమునకు ముక్తి ప్రదాతయగు విష్ణువుకూడ లోబడును. యోగబల ప్రభావమును మీకు తెలుపుటకు మీకు ఇవికొన్ని నిదర్శనములు తెలిపితిని. ఇంకను సూక్ష్మతరములైన మరికొన్ని అంశములు మీకు తెలిపెదను. మనస్సమాధానము నకును ధారణకును సంబంధించిన నిదర్శనములును మరికొన్ని తెలిపెదను. అవి ఎరిగి అనుష్ఠించిన యోగి అప్రమత్తుడైన విలుకాడు శ్రద్ధతో లక్ష్యమును కొట్టగలిగినట్లు తానును లెస్సగా మోక్షమును పొందగలుగును. ఇది నిశ్చయము.

సూర్యునివలె ప్రకాశించుచు కనబడెడి పూర్ణమైన నూనె పాత్రయందు నిశ్చలమగు మనస్సును నిలిపి తన్నుతాను అమలునిగా చేసికొనునో అట్లే ముముక్షువు అగువాడు మనస్సును నిశ్చలమొనర్చుకొని యోగసోపానమును ఆరోహించవలెను. మహాసముద్ర ములో ఉన్న బ్రాహ్మణ శ్రేష్ఠులు నావపై ఎక్కి శ్రద్ధావంతుడగు నావికుని సాయమున ఒడ్డునకు చేరినట్లే యోగసాధకుడును యోగ సహాయమున మనస్సును సమాహితముచేసి తత్త్వము నందు నిలిపి దేహత్యాగానంతరము మోక్షమును పొందగలుగును. గుతితప్పని బాణము వలెను, మంచి గుఱ్ఱమును పూన్చిన రథమునెక్కి సమర్థుడగు సారథిని సహా యముగా తీసికొన్న రథికునివలెను, సాధకుడు తన గమ్యమగు సిద్ధిని పొందగలడు. తన మనస్సును ఆత్మతత్త్వమునందు దృఢముగా నిలిపి నిశ్చలుడైయున్న యోగి నిశ్చలముగా ఉన్న జాలరి వలవేసి చేపలను చిక్కించుకొన్నట్లు తత్త్వమును స్వాధీనము చేసికొనుచు మహాశక్తిశాలియు మహానియమములయందు శ్రద్ధ వహించినవాడును అగుచు, నాభి శిరస్సు, కుక్షి, హృదయము, వక్షస్సు, రెండు పార్శ్వములు, నేత్రములు, శ్రవణములు, ఘ్రాణము ఈ స్థానముల యందు చిత్తమును దృఢముగా నిలిపి సాధనచేసినచో పర్వతము లంత రాసులుగా నున్న శుభాశుభ కర్మరాసులను దగ్ధముచేసి ఉత్తమ యోగ సిద్ధిని సాధించి తన సంకల్పానుసారము ముక్తుడగును."

"యోగ సాధకుడు ఏ ఆహారములను తినుట వలనను వేటిని జయించుట వలనను యోగబలమును సాధించునో మాకు తెలుపుడు" అని మునులు వ్యాసునడిగిరి.

వ్యాసుడిట్లు చెప్పెను :

రవ్వతోను, తెలికపిండితోను చేసిన వంటకమును తినుచుండవలెను. నూనెను వదలవలెను. నూనెలేని యవపిండి వంటకములను అదికూడ ఒక పూట మాత్రమే తిని నచో యోగబలము కలుగును. పక్షముల మాసముల ఋతువుల కొలదిగా చిత్ర ప్రదేశములందును గుహలయందును సంచరించవలెను. నీటితో కలిపిన పాలు త్రాగవలెను. ఒక మాసమైనను నిరతోపవాసముచేసి మనశ్శుద్ధి సాధించవలెను. కామక్రోధ శీతోష్ణ వర్షభయ శోక నిద్రలు అను విషయ సుఖములను వేటియందును అభిరుచి లేకపోవుట, సోమరితనము వీటిని జయించవలెను. వైరాగ్యము పొందిన మహాప్రాజ్ఞుడు స్వాధ్యాధ్యయన సంపత్తి సాయమున ఆత్మను ఉన్నతముగా చేసికొని సూక్ష్మముగా ఒనర్చుకొని ప్రకాశవంతముగా చేసికొనును. ఎంత విద్వాంసులకును బ్రహ్మతత్త్వ సిద్ధిని కోరిన ముముక్షువులకును ఈ మార్గము దుర్గమమైనది. ఏ ఒక్కరైన ఈ మార్గమున నడువగలిగిన వారు క్షేమమును తప్పక పొందుదురు. ఘోరమును, సర్పములతో సరీ సృపములతో గుంతలతో నిండినదియు, నీరులేనిదియు, నడువసాధ్యము కానిదియు, ఎన్నో ముండ్లతో నిండినదియు, ఎవరును ఉండనిదియు, అడవులతో నిండినదియు, దొంగలతో నిండిన దియు అగు మార్గమున నడచుచుండియు ఒకానొకడు క్షేమముగానే తన గమ్యమును చేరగలుగును. ఈ యోగసాధన మార్గముననను అరుదుగా ఎవరో ఒక్కరు సిద్ధిపొంద గలుగుదురు. వాడియైన క్షురధారల, మంగలికత్తుల పదునుల, మీదనైన క్షేమముగా నడువవచ్చును కాని మనోనిగ్రహము లేని వారికి మాత్రము ఈ యోగ మార్గము మిగుల దుర్గమమైనది. అట్టివారికి ధారణ సాధ్యముకాదు. వారు సిద్ధిని పొంద జాలరు. కర్ణధారుడు లేని నావపై ఎక్కినవారు సరిగా ఒడ్డుకు చేరజాలరు కదా! సాధకుడు యథావిధిగా యోగ మార్గానుసారము ధారణయందు నిలిపి ఉండి జన్మమరణ దుఃఖములను లౌకిక సుఖములను అతిక్రమించి మోక్ష సుఖమును పొందును. నానా శాస్త్రములచేతను విధింప బడినదియు, అనేక మునులు అనుష్ఠించినదియు, నిశ్చితమును అగు యోగ మార్గము ద్విజాతులకు ప్రశస్తమైనది. దీనిని అనుష్ఠించిన సాధకుడు పరబ్రహ్మ తత్త్వ రూపుడగు బ్రహ్మను ఈశ్వరుని విష్ణుని మహానుభావ తత్త్వమగు ధర్మమును మహానుభావులును బ్రహ్మపుత్రులును అగు సనత్కుమారాదులను నీచమగు మనస్సును అంతకంటె గొప్పది యగు రజస్సును శుద్ధమగు సత్వమును పరా ప్రకృతిని వరుణుని పత్నియగు సిద్ధిదేవి

సమగ్రమగు తేజస్సును మహాధైర్యమును ఆకాశమున అనేక తారలతోకూడి ప్రకాశించు చంద్రుని, విశ్వేదేవులను, నాగులను, పితరులను, సమస్త శైలములను, సర్వ సముద్రములను, సమస్త నదులను, వృక్షములను, సాధ్యులను, యక్షులను, దిక్కులను, గంధర్వులను, సిద్ధులను, సమస్త పురుషులను, స్త్రీలను, పరస్పరము ప్రవేశించి మహామహాత్ముడై శీఘ్రముగానే విముక్తుడగును. ఓవిప్రవరులారా! మహావీర్యుడును మహామతియునగు భగవంతుని విషయమున ప్రసక్తమగు కథలన్నిటిలో ఇది శుభమైనది. ఈ యోగము అనుష్ఠించిన యోగులు ఈ చెప్పిన యోగసిద్ధుల అన్నిటిని పొంది అనుభవించి శీఘ్రముగా నారాయణుని చేరుదురు." (239)

సాంఖ్య విధి

మునులు వ్యాసునితో ఇట్లనిరి :

"ఓ విపేంద్రా! శిష్టసమ్మతమగు యోగమార్గ ప్రక్రియను తాము యుక్తియుక్తముగా శిష్యులగు మాకు హితముగా ప్రతిపాదించితిరి. లోకత్రయము నందును ప్రసిద్ధిపొంది ఉన్న సాంఖ్య జ్ఞానమునకు సంబంధించిన శాస్త్రతత్త్వమును దాని యందు సిద్ధిని పొందగోరినవారు పాటించవలసిన ధర్మము ఉన్నది ఉన్నట్లుగా మాకు ప్రవచింప గోరుచున్నాము" అని అడుగగా వ్యాసులు

"ఓ మునులారా! వినుడు. ఆత్మ తత్త్వమును ఎఱిగినవారును సమర్థులును నగు కపిలాది వృద్ధయతులు తెలిపిన విషయమును తెలిపెదను. వారిలో కొందరు ఉత్తమమగు బుద్ధివైశారద్యము కల మునిసత్తములును కలరు. వారు చెప్పిన వానిలో సుగుణము లెన్నియో కలవు. దోషమొక్కటియు లేదు. అది ఏమనిన వివేకముచే దుర్జయములగు విషయములను వాని యందలి దోషములను ఎరుగవలెను. ఆ విషయములు మనుష్యులు పిశాచులు ఉరగులు గంధర్వులు పితరులు తిర్యక్ప్రాణులు గరుడులు మరుత్తులు మహర్షులు రాజర్షులు అసురులు విశ్వేదేవుడు దేవర్షులు యోగులు బ్రహ్మ-వీరనుభవించు విషయములు వేరువేరు విధములుగా ఉండును. వానియందలి దోషములను వివిధములు. కాలపరిమాణము ఆయువు సుఖముననుభవించవలసిన కాలము విషయాభిలాషవలనను తిర్యగ్జన్మల అందును నరకము అందునుగల దుఃఖములును దోషములును స్వర్గసుఖము నందలి గుణములును దోషములును వేదవాదము జ్ఞానము సాంఖ్య యోగము దశ గుణములు కల సత్వము నవ గుణములుకల రజస్సు అష్ట గుణములుగల తపస్సు సప్త గుణములుకల బుద్ధి షడ్గుణ యుక్తమగు నభస్సు (ఆకాశము) త్రిగుణమగు తమస్సు ఏక గుణమగు

సత్త్వము మోక్షమునకు కొనిపోవు మార్గము. ప్రళయతత్త్వ స్వరూపములు ఎరిగి ఈ చెప్పిన వానియందలి గుణదోషములను గుర్తెరిగి ఆత్మతత్త్వాభ్యాసము చేసిన వారు చెప్పిన యుక్తులతో జ్ఞానమును విజ్ఞానమును (జ్ఞానమనగా విషయమును ఎరుగుట, విజ్ఞానమనగా తెలిసిన దానిని అనుభవములోనికి తెచ్చుకొనుట) సంపాదించి నిఃశ్రేయస మను సర్వ శుభతమమగు మోక్షమును పొందుదురు.

చక్షుస్సు రూపముతో అగ్నితో ఘ్రాణము గంధముతో పృథివితో శ్రోత్రము శబ్దముతో ఆకాశముతో జిహ్వారసముతో జలముతో త్వగింద్రియము స్పర్శతో వాయువుతో నిత్య సంబంధముకలవి. తమస్సునందు మోహము నందు లోభము నిలిచి ఉన్నవి. నడకయందు విష్ణువు బలమునందు ఇంద్రుడు ఉదరమునందు అగ్ని జలము నందు భూదేవి తేజస్సునందు జలము వాయువునందు తేజస్సు ఆకాశమునందు వాయువు మహత్తత్త్వమునందు ఆకాశము మహస్సునందు సత్త్వరజస్తమస్సులు నిలిచి ఉండును. సత్వము ఆత్మయందు, ఆత్మ నారాయణునందు ఆశ్రయించి యుండును. నారాయణుడు మోక్షమునందు నిలిచి యుండును. మోక్షమున కాశ్రయమేదియు లేదు. స్థూల దేహము పదునారు గుణములతో ఏర్పడినది. స్వభావము భావన అనునవి దేహము నాశ్రయించి యుండును. ఆత్మ మాత్రము ఏ పాపములు అంటక తటస్థమయి యుండును. విషయ సుఖాభిలాష కలవాడు చేయు కర్మలను ఇంద్రియములను ఆత్మయందలి ఇంద్రియార్థము లను మోక్షము దుర్లభమను విషయమును శాస్త్ర ప్రమాణమున తెలిసికొనవలెను. ప్రాణాపాన వ్యానోదాన సమాన వాయువులను ప్రాణతత్వోత్పత్తిని ఏడు విధములుగా ఉన్న శీర్షణ్యములగు ప్రాణములను ప్రజాపతులను ఋషులను సృష్టులను సప్తర్షులను రాజర్షులను దేవర్షులను మరుత్తులను సూర్యసమానులగు బ్రహ్మర్షులను ఉత్తమలోక సుఖానుభవము తరువాత అచటినుండి జారి అధోలోకగతి పొందువారిని మహాభూత సంఘ నాశమును శుభమగు వాక్కుల గతులను దశలను పూజార్చనోపాసన మొదలగు పాపకర్ములు పొందెడి వైతరణి యమలోకము లందలి దుఃఖమును వివిధ జన్మల యందు జీవుని అశుభ సంచారమును శోణితము ఉదకము శ్లేష్మ మూత్ర పురీషములు తీవ్ర దుర్గంధము – వీటితో నిండిన మాతృ గర్భమున నివాసము శుక్రము శోణితము మజ్జ స్నాయువు వందల కొలది సిరలు–వీటితో ఏర్పడిన ద్వారములుగల పురమగు దేహమున జీవుని నివాసమును తనకు హితమైనదానిని తామస రాజస సాత్త్విక ప్రాణులు సాధించగల యోగముల వైవిధ్యమును–తమః ప్రధాన యోగ సాధకుల కుత్సితగతి విశేషములను ఆత్మతత్త్వము నెరిగిన సాంఖ్యులు ఉత్తమ విషయములు సాధించుటలో పొందు ఉపద్రవ

ములను గ్రహముల తారలు చంద్రునియొక్క నక్షత్రముల యొక్క పతనములను నక్షత్రముల తారుమారును జంటలు దీనముగా ఎడబాయుటను ఆయా ప్రాణులు పరస్పరము భక్షించుకొను అశుభ కృత్యమును బాల్యము నందలి అజ్ఞానమును స్థూలదేహపు అశుభస్థితిని సత్త్వగుణమును ఆశ్రయించి కూడ ఉండెడి రాగమోహములను వేలమందిలో ఏ ఒక్కడో మాత్రమే ముముక్షువు అగుటను వేదప్రమాణ విజ్ఞానముతో సాధించు మోక్షము దుర్లభము అగుటను లభించని కోరికలపై ఆదరమును అదితీరగానే ఉపేక్షా భావమును విషయ సుఖములలోని దోషములను ప్రాణము పోయిన వారి అశుభ స్థితులను ప్రాణత్యాగము తానే చేయు నిశ్చయించుకొనిన మహానుభావులు తమ శుభమైన దేహములను కూడ భేదించుకొని పోవుటను శుభమైన వంశములయందు తమ సంకల్పముతో జన్మింప గలుగుటను సాత్త్వికులైన ప్రాణులు కూడ దుఃఖ మనుభవించుటను బ్రహ్మఘ్నులు పతితులు పొందెడి దారుణగతిని బ్రాహ్మణులై ఉండియు దురాత్ములై సురాపానము గురుదార గమనము మొదలగు మహా పాపములుచేసి పొందు దుర్గతిని మాతృద్రోహి పొందు దుర్గతిని ఉత్తములు పొందెడి దేవలోక గతిని అశుభ కర్మల గతులను తిర్యక్ ప్రాణులు పొందెడి మూఢ గతులను వేదవాదముల వైవిధ్యమును ఋతువుల తారుమారును సంవత్సర మాస పక్ష దివసముల క్షయమును చంద్రుని వృద్ధి క్షయములను సముద్ర వృద్ధిని ధన క్షయమును మరల అది పెరుగుటను యుగముల సంయోగములను దేహము శిథిల మగుటను దేహము మూలమున ఆత్మ యందు కలుగు దోషములను మలిన దేహమునుండి వెలువడు అశుభ గంధములను ఎరిగి వివేచించి ముముక్షువై మోక్షమునకై యత్నించి దానిని పొందవలెను.

"జీవుడు దేహమును గ్రహించుట వలన కలుగు దోషముల విషయములో మాకు గల సంశయములను బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడవగు ఓ వ్యాస మహామునీ! తీర్చవేడెదము" అనగా వ్యాసులు బ్రాహ్మణులతో ఇట్లు పలికెను :

ఓ మునిసత్తములారా! కపిలుడు ప్రవచించిన సాంఖ్య మార్గము నెరిగిన విద్వాం సులు దైహిక దోషములు కామ క్రోధ భయ నిద్రా శ్వాసములు ఐదనియు అవి అన్ని ప్రాణులకు కలవనియు చెప్పుదురు. క్షమచే క్రోధమును సంకల్పములు విడుచుటచే కామమును సత్త్వగుణము నాశ్రయించి నిద్రను ఎచ్చరికచే భయమును అల్పాహారముచే శ్వాస–ఆయాసమును జయించవలెను. అనేక గుణములనుండి ఉత్తమ గుణమును అనేక దోషములనుండి ప్రధాన దోషములను అనేక యుక్తులనుండి మోక్షసాధకమగు యుక్తులను అనేక వైచిత్ర్యముల నుండి ప్రధానమైన వైచిత్ర్యములను గుర్తించి విష్ణుని అనేక మాయలతో

ఏర్పడిన ఈ లోకము నీటిమీద నురుగుతో సమానమని తెలిసికొని అజ్ఞానముచే నీటి బుడగవలె తిరుగుచు సుఖమువలె కనబడుచు నాశముతో నిండి నాశము తరువాత మహాభయము కలిగించుచు బురదలో దిగిన ఏనుగువలె రజస్తమో గుణము లందు దిగబడి ఉన్నదని గుర్తించి వైరాగ్యము పొందవలెను. మహాప్రాజ్ఞులగు సాంఖ్యతత్త్వము ఎరిగినవారు దారపుత్రాదులపై ప్రీతిలేక పూజ్యమై సర్వవ్యాపియైన సాంఖ్యజ్ఞానముచే రాజస తామస అశుభ సంస్కారములను సత్త్వగుణ ప్రధానమైన పుణ్య సంస్కారములను విషయాభిలాషలను తపస్సు అనెడి కత్తితోను ఆత్మజ్ఞానమను ఖడ్గముతోను ఛేదించి దుఃఖచింతా శోకములనెడి పెద్దగోతిని దాట గలుగుదురు. ఆ గోతిలో వ్యాధులు మృత్యువు వలన మహాఘోర భయమనెడి సర్పములు అజ్ఞానమనెడి తాబేళ్ళు రజోగుణమనెడి చేపలు కలవు. దానిని దాటుటకు ప్రజ్ఞయే నావ. అదియొక సముద్రము. ప్రపంచ విషయములపై ప్రీతి అనెడి బురద ముసలితనము అనెడి దుర్గములు విషయ సుఖములనెడి ద్వీపములు కథలు అనెడి అగాధములు సత్త్వము అనెడి తీరము హర్షములు అనెడి మహావేగములు అనేక అభిరుచులు అనెడి కల్లోలములు నానావిషయములపై ప్రీతి అనెడి మహారత్నములు దుఃఖ సంతాపములు అనెడి వాయువు శోకము అనెడి ముద్దసుడులు. తీక్ష్ణవ్యాధి మహాబాధలు ఎముకల రాశులు అనెడి ఎడురు దెబ్బలు దానము అనెడి ముత్యముల రాసులు రక్తము అనెడి పగడములు నవ్వులు అనెడి అలల ధ్వనులు నానా విధములైన అజ్ఞానములు దుఃఖాశ్రువులు అనెడి ఉప్పు ఈ సముద్రము నందు కలవు. దీనిని సిద్ధులై పూజ్యులైన యతులు జ్ఞాన యోగమను నావతో తరింతురు. వారు దేహత్యాగము తరువాత నిర్మలమగు ఆకాశములో ప్రవేశించగానే అది ఎరిగి సూర్యుడు తనకిరణములతో వారిని పైకికొని పోవును. తపోధనులును యోగ వీర్యవంతులును వైరాగ్యవంతులును సిద్ధులును అగు ఆ యతులను సప్త వాయువులలో శ్రేష్ఠుడును చల్లనై సుఖస్పర్శ గలిగి సుగంధముతో కూడి సూక్ష్మమైన ప్రవాహము అను వాయువు ఆకాశములో అత్యున్నత స్థానమునకు కొనిపోవును. ఆ ఆకాశోన్నత స్థానము వారిని రజోగుణము యొక్క సత్త్వ గుణముయొక్క ఉన్నత స్థితికిని సత్త్వోన్నత స్థితి శుద్ధాత్ముడగు పరమ ప్రభువగు నారాయణుని లోనికిని కొనిపోగా ఆ నారాయణుడు ఈ యతులను తనలో చేర్చుకొని తన రూపమునకు తీసికొని పోవును. ఇట్లు అమరులు అగు ఈ యతులు నారాయణుడను పరమాత్మ తత్త్వమును చేరి ఆ తత్త్వముగానేయై అమృతులగుదురు. వారు మరల జన్మ పరంపరలోనికి రానక్కర లేదు. సుఖదుఃఖాది ద్వంద్వములకు అతీతులై సత్యము ఆర్జవము సర్వభూత దయ కలిగి వర్తించిన ఆ మహాత్ములకు ఆ సాయుజ్యస్థితి పరమోత్తమ గతి".

ఇదివిని మునులు వ్యాసునితో ఇట్లు పలికిరి. "ఉత్తమమగు ఆ భగవత్తత్త్వ రూపమైన ఉత్తమ స్థానమును చేరిన ఆ స్థిర వ్రతులు జన్మ మరణ రూపమైన సంసార ప్రవృత్తిని నారాయణుడు మరల ఆరంభించు వరకు ఆ మోక్షస్థితిలో ఆనందించు చుందురా లేదా? ఈ విషయములో వాస్తవమేమో చెప్ప వేడెదము. ఓ ఋషిసత్తమా! ఈ సంశయము నిన్ను తప్ప ఎవరిని అడుగజాలము. ఏలయన ఈ స్థితి పొందిన ఋషులు అచ్చటనే అనుభూతి యందు ఉండిపోయినచో మరల ఈ లోకమున ప్రవృత్తి లక్షణమైన ధర్మమును దేనిని చూచుచున్నామో దానిని సాధించు వారెవరు ? లేక వారు మరల జీవులై లోక ప్రవృత్తి లోనికి వచ్చినచో మరల దుఃఖము లోనికి వచ్చుటయే గదా? ఈ విధముగా మీరు వివరించిన మోక్ష స్వరూపములో దోషమొకటి కనబడుచున్నది. ఈ సంశయమును తీర్చ ప్రార్థించుచున్నాము".

ఓ మునిశ్రేష్ఠులారా! ఈ ప్రశ్నము యుక్తి యుక్తమేగాని మిగుల క్లిష్టమైనది. ఈ విషయములో మహాత్ములగు కపిలాచార్యుల జ్ఞానమే శ్రేష్ఠమైనది. ఇంద్రియములు దేహమందుండి దానిని ఎరుగును. అవి ఆత్మకు ఉపకరణములు కాని ఆత్మలేనిచో కట్టల వలె గోడలవలె జడములై నశించును. ఇంద్రియములతోకూడ జీవుడు నిద్రించి ఆకాశములో వాయువువలె సూక్ష్మరూపమున సంచరించుచు ఎన్నియో చూచుచు మేల్కాంచిన తరువాత నిద్రకు పూర్వము తన అనుభవములో ఉండిన వాటిని మరల జ్ఞాపకము చేసికొని ఆయా పనులలో మొదటివలె ప్రవృత్తులగును. ఆత్మ నిద్రావస్థలలో ఉన్నప్పుడు మాత్రము ఆ ఇంద్రియములు తామేమియు చేయలేక లయమునొంది పడి ఉండును. కాని ఆత్మ ఆ ఇంద్రియముల సూక్ష్మ తత్త్వమును తీసికొని సత్త్వ రజ స్తమో గుణముల మనోబుద్ధుల పంచభూతముల లక్షణములను వెంటబెట్టుకొని స్వప్న లోకమున సంచరించును. అట్లే ఓ బ్రాహ్మణులారా? ఇచ్చటను పరమాత్ముడగు నారాయణుడు లోక వ్యవహారము నందలి ఆత్మ వంటివాడు ఆయనలో సాయుజ్యము పొందిన ఈ ముక్త యతులు ఈ ఆత్మకు ఉపకరణములైన ఇంద్రియముల సత్త్వరజ స్తమో గుణముల, మనో బుద్ధుల వంటివారు. ఆ పరమాత్మునిలో లయము నొందిన ఈ మహా యతులు మరల నారాయణుని సృష్టి కాలమున నిద్ర మేల్కాంచిన జీవుని అధీనములో అతని ఇంద్రియాదులు మొదటివలె పనిచేసినట్లే వీరును సృష్టి ధర్మములో ప్రవృత్తి పొంది లోక వ్యవహారములో ప్రవర్తిల్ల జేయుదురు. ఇదియే వాస్తవమైన సాంఖ్య తత్త్వము. దీనిలో సమానమైన జ్ఞానతత్త్వము మరియొకటి లేదు. ఈచెప్పిన నారాయణ పరమాత్మ తత్త్వము అక్షరము ధ్రువము సర్వ పూర్వము సనాతన బ్రహ్మతత్త్వము అనాది మధ్య నిధనము

ద్వంద్వ రహితము సర్వకర్త శాశ్వతము కూటస్థము (ఎట్టి స్థితులలో ఏ మార్పులను పొందని అఖండతత్త్వము) ఆ తత్త్వము నుండియే సృష్టి స్థితి లయములు విప్రులు వేదములు ప్రవర్తిల్లును అని శాస్త్ర ప్రవక్తలగు మహర్షులు సర్వ విప్రులు ప్రణవ తత్త్వము ఎరిగిన మహనీయులు చెప్పుచున్నారు. సాంఖ్య, యోగ పరులిద్దరును ఆయన తోడి సాయుజ్యమే కోరి సాధన చేయుదురు. ఏమైనను ఈ ప్రపంచము నందలి భూతములు అగమ్యములు గమ్యములు అని రెండు విధములు. ఈ రెంటిలో గమ్య భూతములు మేలైనవి. (అగమ్యము అనగా తాము పొందు సుఖదుఃఖాది అనుభవములను స్పష్ట వాక్కుతో చెప్పజాలనివి) వేదపురాణ యోగములు ఇతిహాస శాస్త్రము లోక వ్యవహారము వీటియందు కనబడు జ్ఞానమంతయు సాంఖ్య తత్త్వము నుండి వచ్చినదే. పరమాత్ముని ఉత్తమోత్తమ బలము జ్ఞానము మోక్షము తపస్సులు వేదశాస్త్ర విహితములైన ఇతర సూక్ష్మ విషయములు ధర్మము అన్నియు సాంఖ్యము నుండి వచ్చినవే. కనుక ఈ పై చెప్పిన ముక్తజీవాత్మలు ఈఉత్తమ తత్త్వములను తమలో నిలుపుకొని సాయుజ్య మోక్షముతో కృతార్థులైయుండి మరల సృష్టి కాలమున పవిత్రులైన వారి గృహముల యందు జన్మింతురు. మరల ఈదేహమును విడిచినతరువాత మొదటివలె మోక్షమును పొందుదురు. ఇట్టివారికి ఉత్తరోత్తరముగ ఉన్నత గతులేకాని తిర్యక్ జన్మలు నరక నివాసము కలుగవు. ఈ చెప్పిన సాంఖ్యతత్త్వము విశాలము శ్రేష్ఠము విమలము ఉదారమైనది. అనాది మహా సముద్రము వంటిది. కనుక మీరును ఓ మునులారా! సాంఖ్యతత్త్వ పరాయణులై అప్రమేయుడును, మహాత్ముడును అగు నారాయణుని యందు చిత్తము నిలుపుడు. నేను చెప్పిన ఈ పరతత్వ సారాంశ మేమనగా అనాదియగు ఈ ప్రపంచము నారాయణుని నుండియే ప్రభవించినది. అతడే దీనిని సృష్టి కాలములో సృజించును. ప్రళయ కాలము వచ్చినప్పుడు సంహరించును. (240)

క్షరాక్షరతత్త్వ విమర్శము

మునులు వ్యాసునితో ఇట్లనిరి :

అక్షర తత్త్వమును చేరినవారు సంసారమున మరల ఆవృత్తిని పొందరు. క్షర తత్త్వమును చేరినవారు మరల సంసారమున ఆవృత్తులగుదురు అని తెలిపితిరి. ఈ రెండు తత్త్వములను వివేచించి తెలుప ప్రార్థింతుము. వేదతత్త్వజ్ఞులును మహాభాగులు అగు ఋషులును మహాత్ములగు యతులును నీవు జ్ఞానవేత్తలలో శ్రేష్ఠుడవని ప్రశంసించుచున్నారు. ఇట్టి మీ నుండి ఈ విషయమును మేము వినగోరుచున్నాము. ఉత్తమ అమృతమును ఎంత వినియు మేము తృప్తులగుట లేదు.

వ్యాసుడు ఇట్లనెను :

ఈ విషయములో మీకు పురాతనమగు వసిష్ఠ జనక సంవాద రూపమగు ఇతిహాసమును వినిపింతును. ఋషులలో శ్రేష్ఠుడును సూర్య తేజోయుక్తుడును తన సభలో కూర్చున్న వాడు అగు వసిష్ఠుని శ్రేయః ప్రదమగు ఉత్తమ జ్ఞాన విషయమున ప్రశ్నించెను. ఆ వసిష్ఠుడు పరమాత్మ తత్త్వమును బాగుగా నెరిగినవాడు. అధ్యాత్మ విషయమున నిశ్చయాత్మక జ్ఞానము కలవాడు. అట్టి ఋషివర్యుని జనకుడు దోసిలి యొగ్గి నమస్కరించి తన హృదయమునుండి ఉత్పన్నమైనదియు మధురమును చక్కగా ఏర్పరచుకొనబడినదియు అగు పై ప్రశ్నమును అడిగెను;

బ్రహ్మయొక్క పగటి సమయమున పరమాత్ముడగు నారాయణుడు సృష్టిని జరుపును. రాత్రి కాగానే దానిని రుద్ర రూపమున సంహారమొనర్చి నిద్రించును. మరల పగలు కాగానే సృష్టి ఆరంభించును. అణిమ లఘిమ మొదలగు అష్టసిద్ధులకు ఈశ్వరుడు అవ్యయ జ్యోతీ స్వరూపుడు అన్ని వైపులకు అంతట పాణిపాదములు నేత్ర శిరో ముఖములు కర్ణములు కలిగి సాంఖ్యశాస్త్రము నందు బహుధా నామములతో వ్యవహరింపబడుచు, విచిత్రరూపుడు విశ్వాత్ముడు ఏకాక్షరుడు అని శాస్త్రములలో చెప్పబడుచు, ఏకాత్మకమగు త్రైలోక్యమును స్వశక్తితో ధరించుచున్న ఆ పరతత్త్వము బహు రూపములతో విశ్వముగ కనబడుటచే విశ్వాత్ముడనబడుచు, తానే మాయావశమున వికారమును పరిణామమును పొంది, తన్ను తానే ప్రపంచముగా సృజించుకొనుచున్నాడు. అప్పుడతనికి విరించి అనియు మహత్తత్త్వము అనియు ఇత్యాది వ్యవహారము. ఈ తత్త్వమే శాస్త్రములలో బుద్ధితత్త్వము హిరణ్య గర్భుడు అనియు చెప్పబడినది. ప్రజాపతులచేత నమస్కరింపబడు ఆ తత్త్వమును మహాతేజస్సంపన్నమగు అహంకార తత్త్వమనియు అవ్యక్త తత్త్వమునుండి వ్యక్తమైన విద్యా సృష్టియనియు అవిద్యా సృష్టియనియు వివిధములుగ వ్యవహరింతురు. ఏలయన ఏకైక తత్త్వము నుండియే అచరము చరము అవిద్య విద్య భూతసృష్టి వైకృత ప్రపంచము అన్నియు ఏర్పడినవి. శబ్ద స్పర్శ రూప రస గంధములనెడి తన్మాత్రలు పృథివ్యాప్తేజో వాయ్వాకాశము లనెడి పంచభూతములు ఈ పదియు ఒకేమారు వ్యక్తములైనవి. మనస్సుతో కూడ త్వక్చక్షుః శ్రోత్ర జిహ్వాఘ్రాణములనెడి ఐదు జ్ఞానేంద్రియములు వాక్పాణి పాదపాయూపస్థము లనెడి కర్మేంద్రియములు ఐదును జన్మించినవి. ఈ విధముగా చతుర్వింశతి ఇరువది నాలుగు తత్త్వములును ఏర్పడినవి. వీనితోనే ఈ సమస్తమగు ప్రపంచమును, నరకము, యక్షులు, భూతములు, గంధర్వులు, కింనరులు, మహోరగులు, దోమలు, ఈగలు, పురుగులు, కీటకములు, శునకము, శ్వపాకుడు మొదలగు రూపములలో

పృథివి జలాకాశములందుండు స్థిర చర రూపములగు ప్రాణులు జడచేతన పదార్థములు ఏవేవి కలవో అన్నియు ఆ పరమాత్మునియొక్క రూపమే. ఇది ఆ అక్షర, నాశములేని, తత్త్వమునుండి క్షరమగుచున్నది. వ్యక్తమగుచున్నది. కనుక ఇది క్షరము. ఇది మరల ఆ అక్షర తత్త్వమునందు లయము నొందుటచే కూడ ఇది క్షరము-నశించునది అనబడును. ఇచట చతుర్వింశతి తత్త్వములు పంచ భూతములు, పంచతన్మాత్రలు, పంచ జ్ఞానేంద్రియములు, పంచ కర్మేంద్రియములు, చిత్త మనో బుద్ధ్యహంకారములు అనెడి అంతఃకరణ చతుష్టయము ఇవి ఇరువది నాలుగు. మఱియు క్షరతత్త్వము వ్యక్తమయి సృష్టి జరుగు దశలు ఐదు. 1.పరమాత్మ; 2.బుద్ధి తత్త్వాత్మక హిరణ్యగర్భుడు; 3.ఈ హిరణ్యగర్భుని అహంకారము నుండి కలిగిన సూక్ష్మ భూతసృష్టి; 4.భూతముల వైకృతము; 5.భౌతిక లోకముల-లోకములందలి ప్రాణుల సృష్టి. ఈ జగత్తు అంతయు మోహాత్మక మైనది. అమూర్తమగు అవ్యక్తతత్త్వము నుండి వ్యక్తమై మూర్తిని ధరించినది.

ఈ క్షర స్థితికి అతీతమగు అమూర్త అవ్యక్త మూలకూటస్థ తత్త్వము అక్షరము. త్రిగుణాతీతమైనది. వ్యవహారమున సత్త్వగుణ ప్రధానమైనది. ఇంతవరకు చెప్పిన చతుర్వింశతి తత్త్వాత్మక వ్యక్త జగత్తునకు అధిష్ఠాతయగు నిత్యతత్త్వమది. ఈ తత్త్వము అన్ని మూర్త తత్త్వములకు అంతర్యామియై వాని హృదయాకాశమున నుండును. వాటిని ఆయా వ్యాపారముల యందు ప్రవర్తింప జేయును. తనకు మూర్తి, రూపము, లేకయు మూర్త రూపమున, ప్రపంచ రూపమున వ్యక్తమగును. సృష్టి ప్రళయ ధర్మము నొంది సృష్టి ప్రళయ రూపమై ఇంద్రియ గోచరమగును. నిర్గుణుడయ్యు సగుణ రూపము ధరించును. ఇట్లు తత్త్వము వికృతిని, పరిణామమును పొందుచుండియు ప్రకృతి, మూలతత్త్వ రూపమయి వాటి విషయమున ఏ అభిమానమును లేక ధీరుడై యుండును. అజ్ఞానులగు జనులు తన్ను సేవించుకొనుటకు అనువుగా త్రిగుణాత్మక మూర్తులుగా అవతారములెత్తి ఆయాజన్మలు ధరించుచున్న దీ అక్షర తత్త్వము. కాని అతడు జ్ఞాన స్వరూపుడు, తాను బాల్యాది దశలు లేనివాడయ్యు ఆయా రూపములలో నుండి నేను బాలుడను వృద్ధుడను ఇత్యాది అభిమానములను పొందుచున్నాడు. అహంరూపుడు కాకయు అహంకారమును ప్రకటించుచున్నాడు. వ్యవహారమునకై శుక్ల కృష్ణ లోహిత వర్ణములు కలవిగా చెప్పబడు సత్త్వ తమో రజో గుణాశ్రితుడై గోచరించుచున్నాడు. కాని ఈ గుణములు మూడును ప్రాకృత జనులలో ప్రాణులలో వ్యవహారమున గోచరించుచున్నవి. తామస జీవులు నరకమును పొందును. రజోగుణ ప్రధానులు మానుష భావమున ఉందురు. సత్త్వ ప్రధాన జీవులు దేవత్వమును పొందుదురు. కేవలము పాపులు నరకమును పశుపక్ష్యాది

తిర్యక్ జన్మములను పొందుదురు. పుణ్య పాప మిశ్రణమున మానవత్వము కలుగును. కేవల పుణ్యముచే దేవత్వము కలుగును. మోక్షము వీటికన్నిటికి అతీతము. అది కేవల జ్ఞానము చేతనే సాధ్యము. ఇరువది యైదవది అగు అక్షర తత్త్వములో అజ్ఞానము గుణములు మూర్తి మొదలగు దోషములు లేవు. ఆ తత్త్వము కేపల జ్ఞాన రూపమై శుద్ధ జ్ఞాన ముతోనే ప్రవర్తిల్లును. (241)

వసిష్ఠ జనక సంవాదము

వసిష్ఠుడు జనకునితో నిట్లు పలికెను :

ఈ చెప్పిన విధముగా ఆ అక్షరతత్త్వము జ్ఞానరూపుడు అయికూడా, అప్రతిబుద్ధ, అజ్ఞాన సహిత రూపుడై అప్రతి బుద్ధులగు మనవంటివారిని అనువర్తించుచున్నది. దేహము నుండి మఱియొక దేహములో ప్రవేశించుచు, వేలకొలది జన్మలను పొందుచున్నది. వేల కొలది తిర్యగ్యోనులందును దేవతల యందును తపోవంతుడై మహాసద్గుణ యుక్తుడుగా గుణ క్షయముచే మనుష్యుడుగా జన్మించి పుణ్యవశమున స్వర్గమునకు పోవును. మనుష్య లోకమునకు వచ్చును. పాపముచే నరకమునకును పోవును. పట్టుపురుగు తన దేహము నుండి తీసిన దారముతో తన్నే చుట్టుకొన్నట్లు తననుండి నిష్పన్నములైన త్రిగుణములతో తన్నే బంధించుకొని ఆ అక్షరుడు తాను స్వభావముచే ద్వంద్వాతీతుడై యుండియు సుఖ దుఃఖ రూపములగు ద్వంద్వములకు లోబడి శిరోరోగము, నేత్రరోగము, దంతశూలగల గ్రహము, జలోదరము, అతిసారము, గండమాల, విచర్చిక, బొల్లి, కుష్ఠము, అగ్ని, దాహము, అపస్మారము మొదలగు బాధలను పొందుచు దేహము నేనే అనియు దేహము నాదే అనియు మాయావశమున కలిగిన అభిమానముచే ఆ బాధలును తనకే అని అభిమానమును పొందుచున్నాడు.

అభిమానముచే కలుగు ఈ ద్వంద్వ జనిత దుఃఖములతో పాటుగ ఆ దేహాత్మాభి మానవశముననే అహంకార మమకార వశముననే ఆతడు కొన్ని సుకృతములను కూడ ఆచరించుచున్నాడు. అవి ఇట్లు ఉండును. ఒకే వస్త్రము ధరించుట, నాలుగు వస్త్రముల ధరించుట, నేలపై పరుండుట, కప్పవలె పరుండుట, వీరాసనములో కూర్చుండుట, వీరాసనముతోను ఆకాశమునందును శయనించుట, ఇటుకల కుప్పపై బూడిదరాశిపై భూమిపై పండుకొనుట, వీరస్థానమున జలముతో తడిసినచోట కొయ్య-రాతి పలకలపై పరుండుట, కాయలతో పండ్లతో పశువులతో పక్షులతో నిండినచోట ఉద్యానములో కళ్లములో పండుకొనుట పూసలతో వెంట్రుకలతో చేసిన వస్త్రములు వ్యాఘ్ర చర్మము

సింహచర్మము చెట్లబెరడు పట్టములు నారతో పురికొసతో నేసిన పట్టలు మొదలగునవి. చాపలు చాపలవంటి ఇతర వస్తువులు నార వస్త్రములు మొదలైనవి తన అభిరుచి ననుసరించి ధరించుట ఒక రాత్రి వదలి మఱియొక రాత్రియు దినమున కొకే మారును నాలుగు భోజన కాలముల కొకమారు, ఎనిమిది భోజన కాలములకు ఒకసారి, ఆరు భోజన కాలములకు ఒకసారి, ఎనిమిది నాళ్ళకు ఒకసారి, ఆరు నాళ్లకు ఒకసారి భోజనము చేయుట మాసోపవాసము చేయుట మూలములు పండ్లు తిని ఉండుట వాయువును, నూనె పిండివంటలను, పెరుగును గోధుమలతో యవలతో చేసిన వంటలను గోమూత్ర మును తెల్లు పూవులను నాచును ఎండుటాకులను వివిధములగు పండ్లను భుజించి జీవనము గడపుట కృచ్ఛ్రములు చాంద్రాయణములు మొదలగు కఠిన వ్రతములు ఆచరించుట వివిధ వేషములు చిహ్నములు అవి నాలుగు ఆశ్రమములలో వేటికి సంబంధించినవైనను ధర్మాధర్మములలో దేనికి చెందినవైనను వాటికి సన్నిహితమైన ఇతర లక్షణములను వేద విరుద్ధములైన వానిని ధరించుట వివిక్తమగు శిలల నీడలను సెలయేళ్లను ఇసుక తిన్నెలను అడవులను పర్వతగుహలను వివిధ నియమములను తపస్సులను యజ్ఞములను వివిధ యజ్ఞములను ఆశ్రయించుట బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర జాతి ధర్మములలో తోచిన వాటిని అవలంబించుట, దీనులు అంధులు మొదలగు వారికి వివిధ దానములు చేయుట వివిధ గుణములను స్వభావములను అలవాటులను పాటించుట ధర్మార్థ కామములలో తనకు అభిమతమగు పురుషార్థము నందు ప్రవృత్తుడగుట ఇవన్నియు దేహాత్మాభిమానము అహంకార మమకారము అనెడి వానివలన మాయా వశమున కలుగు ప్రవృత్తులే. స్వాహా, స్వధా, వషట్ నమస్కారములు యజన యాజనాధ్యయన అధ్యాపన దాన ప్రతిగ్రహములు జన్మ జరామృత్యువులు హింస శుభాశుభ కర్మలన్నియు ఈ అభిమాన వశమున కలుగునవే. ఇట్లు ఆ అక్షరతత్త్వమే క్షరరూపమున తన్ను తాను వివిధ రూపములలో విభజించుకొనుచు వ్యక్త మూర్త రూపమున కనబడుచున్నది.

పూజ్యురాలగు ప్రకృతి దేవియే భయమును ప్రళయమును కూడ కలిగించును. బ్రహ్మ యొక్క పగలు అనగా సృష్టికాలము అయిన తరువాత శ్రీ మహావిష్ణువు ప్రళయమును జరిపి ఈ త్రిగుణములకును వాటివలన కలుగు సమస్త లక్షణములకును అతీతుడై ఏకైక తత్త్వమగు తాను మాత్రమే ఉండును. సృష్టి జరుగక నిలిచిపోయిన రాత్రి-ప్రళయ కాలమున సూర్యుడు తన కిరణములను వలె కొంతకాలము పాటు ఆయా గుణ ధర్మము లను తన లోపల ఆయన నిగ్రహించి యుంచును. ఇది యంతయు ఆయన ఇట్లు లీలా,

క్రీడార్థమై చేయుచు తన హృదయమునకు ప్రియములైన ఈతన రూప గుణములను తనవి అను అభిమానముతో, మమకారముతో చూచును. ఆయన త్రిగుణాత్మకుడు, త్రిగుణములకు అధిపతి. క్రియా ప్రవృత్తి మార్గమునందు ఆసక్తి కలవాడు. క్రియా ప్రవృత్తులతోను యజ్ఞాది క్రియలతోను సంతతమును కూడియుండువాడు. అందుచే ఈ సృష్టి ప్రళయ రూపమగు ప్రవృత్తియందు ముందునకు సాగుచు ఇది నాది అను మమకారమును లీలార్థమై మాత్రమే వహించును. వాస్తవమున ఆ మహానుభావునకు అహంకార మమకారములు ఏవియు లేవు. ఈ జగమంతయు ప్రకృతి ధర్మముచే కన్ను గానక రజస్తమో గుణ ధర్మములచే అనేక విధములుగా వ్యాప్తమై యున్నది. ఈ ద్వంద్వ ములు సుఖ దుఃఖ శీతోష్ణాదులు నాచే అతీతములై, నానుండి యుత్పన్నములగుచు, నాయందే లయము పొందుచున్నవి. అని ఆయన ఎరుగును. అవి తనచే లెస్సగ సృజింపబడినవే యైనను తాను సామాన్య జీవుడై యున్నపుడు మాయావశమున ఏమియు ఎరుగక పోవుటచే అయ్యో! ఇవి యన్నియు నేను తరించవలెను. దేవలోకమున నేను ఈ ఫలములను అనుభవింపవలెను. ఈ లోకములో నున్నపుడు కర్మ వశమున కలుగు శుభాశుభ ఫలములను అనుభవింపవలసి యున్నది. ఈ విధమగు కర్మములాచరించి సుఖములను సంపాదింపవలెను. ప్రతి జన్మమునందును నాకు సుఖమే కలుగుటకు యత్నించవలెను. ఇహమున నాకు అనంతమగు దుఃఖములు నరకమున యాతనలు ఉండరాదు. ఒకవేళ నరకమునకు పోయినచో మరల మనుష్య జన్మమును తరువాత దేవత్వమును పొందుడు అని ఇట్లు బ్రాహ్మణాది జన్మములు పొందిన ఈ మానవులు ఆయా గుణములతో ఆవరింపబడి భావనచేయుచు అందుకు తగినట్లు కర్మములు ఆచరించుచు నరకమునో మనుష్యత్వ దేవత్వములనో పొందుచు కేవలము మమకార వశమున ఈ జనన మరణ రూప సంసారగతిలో తిరుగుచుందురు.

ఈ విధముగా జీవుడు శుభాశుభ ఫలాత్మకమగు కర్మల నాచరించుచు జనన మరణముల నడుమ అనేక రూపములలో సంచరించుచున్నాడు. కాని ఈ జీవుల ప్రవృత్తుల లోను తిర్యగ్యోని మనుష్యత్వ దేవత్వ ప్రాప్తులలోను ప్రకృతియే హేతువు. అది స్వతంత్ర మైనది. జీవుడు ప్రకృతికి అతీతమైన తత్త్వమునందు ప్రణము లేదు. కర్మఫల సంగము లేదు. ప్రణద్వారములనదగిన జ్ఞాన కర్మేంద్రియములు త్రిగుణ జన్యములైన రాగద్వేషాదులు తోడుకాగానే యీ జీవుడు అహంకార మమకారములు కలిగి తనకు ఇంద్రియములు ప్రణములు, చిహ్నములు, కాలము, సత్తా, మరణములు, సంచరణము క్షేత్రము, సంగము, తత్త్వము, సంసారము నాశము లేకున్నను అజ్ఞాన వశమున తనకివి అన్నియు ఉన్నవని

భావించుచు పెద్దలను సేవించి వివేకమును సంపాదించక, దేవత్వము మొదలు నరక పాతము వరకు గర్భ ప్రకాశము మొదలు మరణము వరకు వివిధ స్థితులకు కారణములగు వేలకొలది సృష్టులలో సంచరించుచున్నాడు. చంద్రునకు పదునారు కలలున్నవని శాస్త్రము చెప్పుచున్నది. వానిలో పద్నునైదింటిని మాత్రము దేవతలు అనుభవింతురు. పదునారవ కలమాత్రము దేవతల అనుభవమునకు అందక నిలిచి యుండుచు తానే దేవతలను అనుభవించుచు మరల మరల చంద్రుడు వృద్ధి క్షయములు పొందుటకు మూలమగు చున్నది. అట్లే శుద్ధమగు ఆత్మ తత్త్వము కూడ అజ్ఞాన వశమున ప్రకృతికిలోబడి ఆయాజన్మ పరంపరలలో వృద్ధిక్షయములను పొందుచుండియు శుద్ధతత్త్వమునకు ఏమియు అంటక నిలుచును కావున ఆ తాత్త్విక స్థితిని వృద్ధజన సేవనముచే వివేకము పొందియు యోగాది సాధనచేసియు భగవదనుగ్రహము పొందినప్పుడు గ్రహించి ముక్తుడగుచున్నాడు. (243)

క్షరాక్షరతత్త్వముల సంబంధమును నిరూపించుట

జనకుడు వసిష్ఠునితో పలికెను

మీరు ప్రతిపాదించిన క్షర అక్షర తత్త్వముల సంబంధము లోకమున స్త్రీ పురుషుల సంబంధము వంటిదని నేననుకొనుచున్నాను. అన్ని ప్రాణులలోను ఋతు కాలమున సంగమించినపుడు స్త్రీ పురుషులు అన్యోన్య గుణములను ఒకచో చేర్చిననే, మఱియొక దేహి దేహధారణము జరుగుచున్నది. పురుషుని నుండి అస్థిస్నాయుమజ్జలును స్త్రీ నుండి త్వక్ మాంస రక్తములును ఏర్పడి దేహమునకు రూపమును ఈయజాలడు. ఇట్లే క్షరతత్వము అగు ప్రకృతియు అక్షరతత్త్వమగు పరతత్త్వరూప పురుషుడును కలియనిదే ఈసృష్టి జరుగదని వేదశాస్త్ర ప్రమాణములు తెలుపుచున్నవని ఇవే నా అభిప్రాయము. మాకు తమనుండి ఈ తత్త్వము తెలియవలెను. తత్త్వజ్ఞానము వలన మోక్షముకలుగును. మేము మోక్షమును కోరువారము. అనామయమును అజేయమును అజరమును నిత్యమును అతీంద్రియమును అనీశ్వరమును అగు పరతత్త్వమును పొందుట మా కోరిక. కనుక యథార్థ తత్త్వమును మాకు తెలుపుము.

వసిష్ఠుడు జనకునితో పలికెను :

ఓ జనకా! నీవు చెప్పినట్లే విషయ నిర్ణయమునందు వేదశాస్త్రములు ప్రమాణములు. నీవు తత్త్వమును గ్రహింపగల జిజ్ఞాసువు. కాని వేదశాస్త్రములను గ్రంథములుగా అధ్యయనము చేసి ధారణ చేసినందువలన ప్రయోజనము లేదు. వాని యందలి విషయమును ఎఱిగి వివేచనతో తత్త్వ నిర్ణయము చేసినవారు మాత్రమే ఆ ప్రమాణ

భూతములగు వేద శాస్త్రము లందలి తాత్త్విక విషయ మిది అని చెప్పగలరు గాని మిగిలిన వారు గ్రంథములను ధారణ చేయుట బరువును మోయుటకు మాత్రమే. నేను తత్త్వమును ఉన్నది ఉన్నట్లుగ చెప్పెదను వినుము. ఈ విషయమున సిద్ధాంతములో యోగులకును సాంఖ్యులకును అభిప్రాయ భేదములేదు. ఈ రెండు దర్శనములును ఒక దానిని మఱియొకటి అనుగమించుచునే - పరస్పర విరోధము లేకుండ విషయమును ప్రతిపాదించుచునే ఉండును. వాటి పరస్పర సమన్వయము నెఱిగినవాడే తత్త్వజ్ఞుడు.

వసిష్ఠుడు ఇంకను ఇట్లు పలికెను :

ద్రవ్యము నుండి ద్రవ్యము, ఇంద్రియము నుండి ఇంద్రియము, దేహము నుండి దేహము, బీజము నుండి బీజము, గుణముల నుండి గుణములు ఉత్పన్నమగును. చతు ర్వింశతి తత్త్వ రూపమగు ప్రకృతికంటె అతీతమగు పంచ వింశతితమ, ఇరువది యైదవ, తత్త్వము బీజము. దానికి ద్రవ్యములు ఇంద్రియములు దేహములు, గుణములు అనునవి లేవు. త్వక్కు మాంసము రక్తము మేధస్సు పిత్తము మజ్జ అస్థి స్నాయువు ఈ ఎనిమిదియు స్త్రీ నుండి ఏర్పడినను పురుషుని నుండి ఏర్పడినను ఇవి అన్నియు ప్రాకృతికములు-ప్రకృతి నుండి కలిగినవి. ఇవి అన్నియు లింగములు. హేతువులు-గుర్తులు : పంచ వింశతి తమ తత్త్వమగు ఆత్మ ఇచ్చట ఉపాధిని గ్రహించియున్నదని మనము వ్యవహారము నకై గుర్తించుటకు ఉపపత్తి మాత్రమే. అనగా పర్వతమునకు ఆవల దూరముగా పొగ కనబడగా అచ్చట ఆ పొగ ఉన్న తప్పక ఉండవలసిన అగ్ని ఉన్నదని ఊహించినట్లే ఆయా పనులను చేయుచున్న దేహములో ఈ ఆత్మతత్త్వము ఉన్నదని ఊహించుటకు అవకాశమును ఇచ్చునది లింగము. అంతేకాని ఈ దేహము, ఇంద్రియములు, ధాతువులు ప్రకృతి జనితములే కాని అది క్షరతత్త్వము యొక్క కాని అక్షర తత్త్వముయొక్క కాని వాస్తవ రూపము కాదు. అంతేకాక ఆ క్షరాక్షరాత్మక మగు ఆత్మతత్త్వము నిర్గుణము. నిరింద్రియము నిర్దేహము. ఐనను మాయాకృతమైన అహంకార మమకార ఆవరణముచే సగుణము సేంద్రియము-సశరీరము అగుచున్నది. ఈ ప్రకృతియు మాయాకృతము. అనగా ఈ దృశ్యమగు ఈ ప్రకృతి యంతయు ఆ ఆత్మతత్త్వము యొక్క వ్యక్త రూపము. ఇవిలేని ఆ తత్త్వము అవ్యక్తము. అవ్యక్తము ప్రబుద్ధము-బుద్ధ్య మానము. వ్యక్తమగు క్షర తత్త్వము అప్రబుద్ధము. అదియే ఈ మాయాకృత ప్రకృతి తత్త్వములు ఇరువది నాలుగింటికి అతీతమగు ఇరువదియైదవ తత్త్వము. ఏకత్వము అక్షరతత్త్వము. నానాత్వము క్షరతత్త్వము. ఇది వాస్తవమగు విషయ ప్రతిపాదనము.

జనకుడు వసిష్ఠుని ఇట్లు ప్రార్థించెను :

ఓ ద్విజసత్తమా! ఏకత్వము అక్షరతత్త్వము-నానాత్వము క్షరతత్త్వము అని తాము చెప్పిన విషయము నిస్సంశయముగా నాకు అవగతము కాలేదు. ప్రబుద్ధము-బుద్ధ మానము-అప్రబుద్ధము అను నిదర్శనము కూడ నాకు అవగతము కాలేదు. అక్షర క్షరముల వివేచించుకొనుటకు తాము తెలిపిన హేతువులు కూడ నా బుద్ధి అస్థిరమగుటచే దానియందు నిలువలేదు. కావున తాము నాయందలి దయతో అక్షరక్షర తత్త్వములను ఏకత్వ నానాత్వములతో దర్శించవలసిన తీరును ద్వంద్వముల స్థితిని అక్షరతత్త్వము ఆ ద్వంద్వములచే నిరుద్ధము, అడ్డగించబడినది, బాధనొందబడినది, కాని స్థితిని విద్య, అవిద్య, వీని స్వరూపమును సాంఖ్య విధానమునను యోగవిధానమునను తత్త్వమును వివేచించు ప్రక్రియలను బుద్ధ అబుద్ధ స్థితుల వివేచనమును చక్కగా తెలుప ప్రార్థించు చున్నాను" అని అడుగగా

వసిష్ఠుడు జనకునితో ఇట్లు పలికెను :

నీవడిగిన ప్రశ్నకు చాల సంతోషము కలిగినది. ఓ మహారాజా! నీవడిగిన వానిలో యోగశాస్త్రానుసారియగు తత్త్వ వివేచన ప్రక్రియను నీకు తెలిపెదను వినుము. ఈ ప్రక్రియలో ధ్యానమే యోగసాధనకు బలమును చేకూర్చును. ధ్యానము కూడ మనస్సు యొక్క ఏకాగ్రత-ప్రాణాయామము అని రెండు విధములు. ఈ రెండిటిలో ప్రాణా యామము సగుణ ధ్యాన ప్రక్రియ. మానస ఏకాగ్రతా రూపమగు ధ్యానము నిర్గుణమైనది. ఈ రెండు విధములగు ధ్యాన ప్రక్రియల దేనిని సాధన చేయదలచినను ఈ చెప్పబోవు నియమములను తప్పక పాటించవలెను. మూత్ర విసర్జనము మల విసర్జనము నియత ములు కావలెను. అందులకై ఆహారమునను నియమము కావలెను. దినమున రెండు మారులు భుజింప రాదు. భగవంతునికి నివేదించిన దానిని తప్పరుడై భుజించవలెను. ఇంద్రియములను ఆయా ఇంద్రియ విషయముల నుండి మరలించి మనస్సు నియమించ వలెను. మౌనమును విచారణా శీలత్వమును పూనవలెను. ఆ ఇంద్రియములు జ్ఞానేంద్రియ ములు కర్మేంద్రియములు మాత్రమే అని లెక్కించినచో పది మాత్రము. వాటితో మనోబుద్ధు లను కూడ చేర్చినచో పండ్రెండు. ఇట్టి ఇంద్రియ నిగ్రహ పూర్వకమగు ధ్యాన ప్రక్రియతో చతుర్వింశతి తత్త్వములకు అతీతమగు తత్త్వమును సాక్షాత్కరించు కొనవలెను. మనస్సును తత్త్వ సాక్షాత్కారమునకై చోదన చేయవలెను. ఆ తత్త్వము అజరము. విశ్వాత్మకము. అదియే జ్ఞేయము-తెలిసికొన-సాక్షాత్కరించు కొనదగినది. ఉన్నత మనస్సు గల సాధకుడు

ఆశ్రయించవలసినది ఈ తత్త్వమునే. మఱి దేనిని కాదు. సర్వ సంగములను విడిచి లఘువు-తేలికగా జీర్ణమగు-ఆహారము తినుచు ఇంద్రియములను జయించి రాత్రియొక్క మొదటి జాములోనో కడపటి జాములోనో మనస్సును తత్త్వముపై నిలుపవలెను. కొయ్య మొద్దు వలె నిశ్చలుడై-అనగా స్థిరమగు చిత్తము కలవాడై-విధివిధానముతో ధ్యానము చేసినవాడు యుక్తుడు-యోగసాధకుడు అని చెప్పబడును. అప్పుడు ఆ సాధకుడు ఏమియు వినడు, వాసన చూడడు, చూడడు; స్పర్శమును అనుభవించడు; మనస్సుతో ఏదియు సంకల్పించడు; ఆలోచింపడు; ఎఱుగడు. అప్పుడే ఈ యుక్తుడు, యోగసాధకుడు, ప్రకృతిని స్వాభావిక స్థితియగు, తత్త్వమును పొందెనని చెప్పబడును. ఆ స్థితిలో ఈ ఆత్మతత్త్వము లోకమునందలి దీపమువలె వత్తి నూనె ప్రమిద మొదలగునవి లేకయు ప్రకాశించును. దానికి ఇంద్రియములు మొదలగు వ్యావహారిక చిహ్నములు ఏవియు లేవు. క్రిందికిని పైకిని అడ్డముగాను అన్ని వైపులకును ప్రసరించగలదు; ఆ తత్త్వ దర్శనము కాగానే సాధకుడు ఆత్మ దర్శనముతో కూడిన వాడయ్యెను అనబడును. అతడే హృదయస్థ డగు అంతరాత్మ. ఆతడే జ్ఞేయుడు, తెలియబడవలసిన వాడు. జ్ఞుడు-అన్నింటిని ఎఱిగిన వాడు. అని నావంటి తత్త్వవేత్తలు చెప్పుదురు. ఆ తత్త్వము పొగలేని అగ్ని వంటిది. కిరణములు ఏ ఆవరణములును లేక వెలుగు సూర్యుని వంటి వాడు. నిర్మలాకాశమున ప్రకాశించు మెఱపు ప్రకాశము వంటివాడు. ఈ తత్త్వమును ధృతిమంతులు-నిశ్చలచిత్తము కల మనీషులు మహాత్ములు బ్రహ్మనిష్ఠులగు బ్రాహ్మణులు తనయందు తన్నే దర్శింతురు. ఈ మహాతత్త్వము తనకు ఏదియు ఉత్పత్తి హేతువు లేనట్టిది. అమృతరూపమైనది. అది అణువులకంటె అణుతరము. మహత్తులకంటె మహత్తరము. అంతట అన్ని భూతముల యందు నిశ్చయముగా నిశ్చలముగా నుండియు కనబడదు-లోకకర్తయగు ఈతడు బుద్ధి అను ద్రవ్యముతో వెలుగు మనోదీపము యొక్క ప్రకాశము సాయమున చూడ సాధ్య మగును. మహా తపస్సునకు ఆవల నుండును. తమో గుణముచే ఆవరింపబడినవాడు కాదు. వేదతత్త్వజ్ఞులగు వారు ఈ తత్త్వమును గూర్చియే "తమసః పరస్తాత్" "తమస్సునకు ఆవల దూరముగా నున్నవాడు" అని చెప్పుచున్నారు. ఇతడు విమలుడు. లింగ రహితుడు-అనగా ఇంద్రియ దేహాది ఉపాధులు లేనివాడయ్యు కలవాడై కనబడుచున్నాడు. ఈ యోగ దర్శనమును అనుష్ఠించినవారు అజరుడు-నాశరహితుడు-అగు పరమాత్ముని దర్శింప గలుగుదురు.

ఇంతవరకును నేను నీకు యోగ దర్శనమును తాత్త్వికముగా తెలిపితిని. ఇక సాంఖ్య, జ్ఞాన, దర్శనమును తెలిపెదను. ఇది పరిసంఖ్యా నిదర్శన రూపమైనది. (ఇదియే సత్యము

కాని అది సత్యము కాదు అని చెప్పుట పరిసంఖ్యానము. సామాన్య మానవులకు వ్యవహారములో కనబడుచున్నందున ఈ లోకము సత్యమే అనిపించును. కాని శాస్త్రములలో మాత్రము ప్రపంచము శాశ్వతమగు సత్యముకాదు. పరమాత్మ తత్త్వమే శాశ్వతమగు సత్యమని చెప్పబడుచున్నది. ఈ రెండిటిలో ఏది గ్రాహ్యము? అని సందేహము కలుగును. అట్టివానికి వివేచనా పూర్వకముగా జగత్తు యొక్క సత్యత్వమును నిర్ధారించునది పరిసంఖ్య అదియే సంఖ్య, సంఖ్యా-నిర్ణయ-ప్రధానమైన దర్శనము సాంఖ్య దర్శనము. ఇది మీమాంసాశాస్త్ర ప్రక్రియ ననుసరించిన వివరణము)

ఆ పరమాత్మ తత్త్వము యొక్క వ్యక్త స్థితికి మూలమగు పరమస్థితియే అవ్యక్త స్థితి-ఇదియే ప్రఖ్యానము వ్యక్తత అనబడును. ఇదియు పరమాత్ముని యొక్క ప్రకృతి-స్వాభావిక స్థితియే. కాని ఉత్కృష్టమైనదియు మొట్టమొదటిదియు కావున 'పరాప్రకృతి' అనబడును. రెండవదశ మహత్త్వము. ఇదియే వేదాంత దర్శనము నందలి బుద్ధి తత్త్వాత్మక మగు హిరణ్యగర్భుడు అనెడి తత్త్వము. మహత్తునుండి అహంకారము వ్యక్తమగుట మూడవ దశ. అహంకారము నుండి పంచ-సూక్ష్మ అపంచీ కృత భూతములు ఏర్పడుట నాలుగవ దశ. మహత్తు, అహంకారము, మనస్సు, పంచ భూతములు అనెడి ఎనిమిదియు అపరా ప్రకృతి అనబడును. వీని విస్తరణములగు షోడశ వికారములు, విశేష పంచకము, పంచేంద్రియములు మొదలగు భౌతిక సృష్టి యంతయు ఐదవదశ. ఇదియే సాంఖ్య తత్త్వమంతయు.

షోడశ కశ్చ వికారః - అనియు గణశ్చషోడశకః- అనియు చెప్పిన విధమున ఐదు జ్ఞానేంద్రియములు ఐదు కర్మేంద్రియములు శబ్ద స్పర్శ రూప రస గంధములు అనెడి తన్మాత్రలు ఐదు మనస్సు మొత్తము పదునారు వికారములు. వీనిలో ఈ ఐదు తన్మాత్రలు స్థూల భూత సృష్టికి మూలము కావున ఐదు విశేషములు వాటిని జీవుడు అనుభవించుటకు సాధనములు కావున ఐదు జ్ఞానేంద్రియములు ముఖ్యములని ఇచట సూచింపబడినదని గ్రహించవలెను.

ఇవి అన్నియు ఏక్రమమున సృష్టింపబడినవో ఆ క్రమమునకు ప్రతిలోమముగా లయము జరుగును. అనగా చివరి చివరిది లయమొంది మొదటి మొదటిది మిగులుచు వచ్చును. ఈలయము అలలు సముద్రములో లయమగుటవంటిది. ఏలయన ఏది ఎచట నుండి జనించునో అది దానియందే లయమొందును. ఇట్లు లయమొందగా కడపటికి మిగిలిన ఆత్మతత్త్వము యోగ సాధనమున తనయందు తన్నుతానుగా చూచును. ఓ

రాజ సత్తమా! అపరాపరా ప్రకృతుల సృష్టి ప్రళయ స్వరూప క్రమము ఇదియే. ప్రళయమునకు తరువాత ఏకత్వము. సృష్టి కాలములో నానాత్వము. దీనికి అంతటికిని అధిష్ఠాత అవ్యక్త కూటస్థ తత్త్వము. పరమాత్ముడు తన్నుతాను నానాత్వమున రూపొందించుకొనగా ఏర్పడిన పాంచ భౌతిక దేహము క్షేత్రము. దానిని మహాన్ ఆత్మా-మాయావశమున ఆశ్రయించి అధిష్ఠాతయై యుండును. ఇది ఇరువది ఐదవ తత్త్వము. ఇతడు క్షేత్రమును ఎరుగును. క్షేత్రం, జానాతి, కావున క్షేత్రజ్ఞుడు. వ్యక్తరూపమగు ఈ దేహము అనుపురమున శయనించుటచే, పురి, శేతే, పురుషుడు అనబడును. ఇదియే క్షేత్ర క్షేత్రజ్ఞ వ్యక్తావ్యక్త పరాఽపరా ప్రకృతి వివేచన క్రమము ఈ క్షేత్రజ్ఞుడే జ్ఞాత - జానాతి - తెలుసుకొనువాడు. ఈ జ్ఞాతయొక్క స్థితిని ఆధారముగా చేసుకొని - జ్ఞాత - జ్ఞానము - జ్ఞేయము అను త్రిపుటి ఏర్పడుచున్నది. ఇచట మరియు సూక్ష్మమగు వివేచనా క్రమము ఇది; క్షేత్రజ్ఞుడుగానున్న అవ్యక్త తత్త్వము వ్యక్తమై నట్లు కనబడుచు జ్ఞాత అగును. వ్యక్తతత్త్వము లకు అతీతమైన ఇరువదియైదవ శుద్ధతత్త్వము జ్ఞేయము తెలియబడవలసినది. దానిని ఎరుగుట వ్యవహారదశలో జ్ఞానము కాని పరమార్థదశలో ఆ అవ్యక్త శుద్ధ తత్త్వము ఒక్కటియే జ్ఞానము. అది ఎఱుగుట అనెడి వ్యాపారమునకు పనికి అతీతము అదిచిత్ జ్ఞాన రూపమైనది.

ఓ జనక మహారాజా! వాస్తవమగు జ్ఞానమనగా ఈ పరాప్రకృతిని సాక్షాత్కరించు కొనుటయే. సగుణము నుండి నిర్గుణమును వేరుపరచి తెలిసికొని, అది తానగుటయే. ఈ స్థితిని పొందినవారికి జనన మరణావృత్తి లేదు. క్షరభావము ఉండదు. కావున క్షరాక్షరములు రెండును లోకవ్యవహారము నందలి స్త్రీ పురుషులవలె పరస్పర ఆశ్రయము లని నీవనుకొనిన భావమునకు కూడ ఇచ్చట అవకాశము లేదు. ఇదియెరుగక వేరుగా తెలిసికొను మందమతులకు జననమరణ పునరావృత్తి తప్పదు. వారు అవ్యక్తతత్త్వమును వ్యక్తతత్త్వమునుగా చూచుటచే దానినే అనువర్తించుచు వ్యక్త స్థితిలో పడియుండక సంసారమున సంచరించక-తప్పదు. వ్యక్త ప్రపంచము నందలి ఏ తత్త్వమును కానట్టి ఇరువది యైదవదగు అవ్యక్త తత్త్వమును ఎరిగినవారికి భయములేదు. (243)

బుద్ధత్వా ప్రతిబుద్ధత్వ ప్రతిపాదనము

వషిష్ఠ మహర్షి జనకునితో ఇట్లు పలికెను :

ఓ నృపసత్తమా! ఇంతవరకును నీకు సాంఖ్య దర్శనమును తెలిపితిని. ఇకమీద విద్యాఽవిద్యల తత్త్వమును క్రమానుసారము తెలిపెదను. ఎఱుగుము. సృష్టి ప్రళయములు

జనన మరణములు ధర్మములుగా నుండి సంసార చక్రమునందు సంచరించువాడు అవ్యక్త తత్త్వమును వివేచించి తెలిసికొన జాలడు. ఒకదాని కంటె మఱియొకటి ఉత్తరోత్తరము విద్యారూపము అయినది. పై దానికంటె ముందఱిది అవిద్యా రూపమయినది. విద్య-అవిద్య అనుభేధము రెండు-స్థూల-స్థూలతర-సూక్ష్మ-సూక్ష్మతర తత్త్వముల నడుమనుండెడి యోగ్యతా భేదముచే చేయు నిర్ణయము. ఇది సాంఖ్య తత్త్వవేత్తలు వివేచించి ప్రతిపాదించిన విషయము. ఎట్లనిన-వరుసగా 1.కర్మేంద్రియములు; 2.జ్ఞానేంద్రియములు; 3.పంచ తన్మాత్రలు-లేదా విషయములు; 4.మనస్సు; 5.పంచ భూతములు; 6.అహంకారము; 7.బుద్ధి; 8.అవ్యక్తము ఇవి వరుసగా ఒకదానికంటె మఱియొకటి విద్యారూప మయినవి. అనగా ఉత్తరోత్తరము సూక్ష్మతరమయినవి. అన్నిటి కంటె విద్యారూపమయినది పంచవింశతితమమగు పరమాత్మతత్త్వము.

ఇక క్షరాక్షరతత్త్వమును తెలిపెదను :

వివేచించగా వ్యక్తము అవ్యక్తము అను రెండును క్షరములే. అవి రెండును అక్షరములే. ఇది కొంత సంశయ జనకముగాను విచిత్రముగాను కనబడినను రెండును క్షరమును అక్షరమును అగుననుటకు హేతువు ఏమో సాంఖ్య దర్శన వివేచనానుసారము ప్రతిపాదింతును. వాస్తవ స్థితిలో రెండును ఆదియు నాశమును లేనివే. రెండును సర్వ శక్తి మంతములగు ఈశ్వర తత్త్వములే. రెండును పరమార్థ తత్త్వములే. ఎట్లన పంచ వింశక తత్త్వము అనబడు పరమార్థ తత్త్వము సృష్టి ప్రళయ జనన మరణ రూపసంసార ప్రవృత్తికై మొదట అవ్యక్తమై క్రమముగా మహదాదిగా భూతభౌతిక సృష్టివరకు తన్నుతానే మాయావశమున పరిణమింప జేసికొని ఇట్టి తనలో సృష్టికాలమున తాను ప్రవేశించుచు ప్రళయ కాలమున ఈ వ్యక్త సంసార రూపమగు తన్నేతనలో లయముచేసికొనుచున్నది. పరమార్థమున ఇవియన్నియు అఖండ-ఏకైక-తత్త్వమే కదా! ఒకే ప్రకృతియే కదా! కనుక వ్యవహారమున మాత్రమే అపరాప్రకృతి-పరాప్రకృతి-క్షరము-అక్షరము-అనుభేదము. వస్తు స్థితిలో రెండును క్షరములే-రెండును అక్షరములే. అనగా అక్షర తత్త్వము తన్నుతాను క్షరరూపమున పరిణమింపజేసికొని తన రూపాంతరమే అగు జడ దేహమున తాను ప్రవేశించి ఉపాధిచే తానును క్షరునివంటివాడై అహమను అభిమానముతో కర్తయై భోక్తయై సుఖియై దుఃఖియై వీటికి భయపడి విరక్తుడై ముముక్షువై జ్ఞాత యగుచున్నాడు. అప్పుడు ఈ భ్రాంతి కల్పిత క్షర తత్త్వమును దృష్టిలో ఉంచుకొనగా అక్షర తత్త్వము జ్ఞేయమగును. ఈ జ్ఞాతయగు క్షర సదృశతత్త్వము ముక్తుడయినపుడు ఈతడు జ్ఞాతయుకాక జ్ఞేయమును కాక త్రిపుటిలోని జ్ఞాధాత్వర్థ రూపమైన జ్ఞానమునుకాక వీటన్నిటికిని అతీతమగు చిద్రూప

జ్ఞానతత్త్వ మగుచున్నాడు. కనుక ఈ వివేచనము ననుసరించి ఏది యవ్యక్తము? ఏది వ్యక్తము? ఏది క్షరము? ఏది అక్షరము? అంతయు క్షరమే. అంతయు అక్షరమే. అంతయు వ్యక్తమే. అంతయు అవ్యక్తమే. అక్షరుడే మాయా వశమున క్షరుడై సగుణుడైనపుడు క్రమముగా సంసార విషయములపై నిర్వేదము చెంది విరక్తుడై సాంఖ్య వివేచనముచే తాను నిర్గుణుడననియు తాను పరాప్రకృతియే యనియు ఎరుగును. అపుడు అపరా ప్రకృతి స్థితిని విడిచి శుద్ధుడగును. అప్పుడు ఇతనికి ఏ దుఃఖములను ఉండవు. కేవలము సుఖ-ఆనంద-శుద్ధ స్వరూపుడగుచున్నాడు. సుఖదుఃఖ మిశ్ర స్వరూపము తొలగుచున్నది. సంసారమున సంచరించవలసిన బంధము దూరమగుచున్నది.

ఇట్లు క్షరస్థితి నుండి అక్షరస్థితికి-మిశ్రస్థితి నుండి శుద్ధతా స్థితికి పోవుటలోని క్రమమునే అప్రతిబుద్ధత్వ దశనుండి ప్రతిబుద్ధత్వ దశకు పోవుట అందురు.

అది ఎట్లనిన :

సుఖదుఃఖ సంమిశ్రమమగు ఈ సంసారమునందుగల దోషములను గుర్తించి విరక్తుడైన జీవుడు ఇట్లనుకొనును : నేను ఇంతకాలమును ఏమిచేసితిని? నీటిలోనున్న చేప ఆ నీరువేరు నేనువేరు అని తెలియక ఆ నీరు తనకొరకే ఉన్నట్లుగా భావించుకొని ఆ నీటిని విడువలేక ఆ మహాజలరాశిలోనే ఒకచోటినుండి మరియొక చోటికి సంచరించుచు దాని నుండి బయటకు వచ్చినచో తనగతి ఏమగునో అని భయపడినట్లే నేనును నన్నీ దృశ్య ప్రపంచము కంటె అతీతమగు భిన్నమగు తత్త్వమునుగా గుర్తెఱుగక ఇంతకాలము సుఖదుఃఖ సంమిశ్రమును జనన మరణ పరంపరా బహుళమును నగు ఈ సంసార ప్రవాహములో కొట్టుకొని పోవుచుంటిని. ఇక్కడ నున్న వారందరును నావలెనే ఉన్నారు. కాని ఈ అవ్యక్త-జ్ఞేయ-అక్షర-తత్త్వము విమలమైనది. నేనును పూర్వము ఇట్టి స్థితిలోనే యుంటిని. ఇంతవరకు అజ్ఞానముచే కలిగిన సంమోహముచే ప్రవృత్తుడనై అజ్ఞుడనుగా ఉంటిని. దీనికి అంతటికిని సంసర్గము-అతిసంసర్గము కారణము. దీనికి వశీభూతుడనై ఇంతకాలమును ఉత్తమ మధ్యమాధమ స్థితులను వాని వ్యత్యాసమును కూడ గుర్తించలేకపోతిని. ఇంక మీదటకూడ నేను ఈ స్థితిలోనే ఇట్లుండజాలను. ఆ స్థిర స్థితికి పోవలెను. ఇంతకాలమును ఈ అపరాప్రకృతితో సహ వాసముచే వంచితుడనై ఇట్లుంటిని. ఇక వంచితుడను కాజాలను. నేను వస్తుతః నిర్వికారుడను. వికారములను పొందితిని. ఇది ఈ అపరా ప్రకృతియొక్క అపరాధము కాదు. నా అపరాధమే. తాత్త్విక స్థితికి పరాఙ్ముఖుడనై ఈ మాయాకల్పిత సుఖములయందు ఆసక్తుడనైతిని. వాస్తవమున

రూపములేని నేను బహురూపుడనై మమకార అహంకార అభిమానములకు వశుడనై యుంటిని. నిర్మముడనగు నేను మమకారవశుడనై ఆయా జన్మలయందు వికృతరూపుడనై తెలివిని కోల్పోయి అహంకారముతో సమత్వమును పొంది దానిని వదలుకొనలేకుంటిని. ఈ అపరా ప్రకృతి తన్ను బహురూపములతో పరిణమింపజేసికొని ఇంకను నన్ను తనలో మునిగి ఉండునట్లు ఆజ్ఞాపించుచున్నది. నేనామె ఆజ్ఞను పాటించను. ఇప్పటికి నా తప్పు తెలిసినది. నేను అహంమమకార రహితుడను. మమకారముకూడ అహంకార జనితము. ఈ రెంటిని విడిచి నిరామయతా స్థితిని పొందుదును. కాని ప్రతిబోధ రహితమగు ఈ అపరా ప్రకృతిని ఆశ్రయించి యున్నంత వరకు నేను ఈ పరమార్థ తత్త్వముతో సామ్యమును పొంది ముక్తుడను కాజాలను. కనుక నేను అందులకై మొదట ఈ అహంతత్త్వముతో సామ్య సహవాసములను విడిచెదను. ఈమెతో కూడి ఉన్నంత వరకు నాకు క్షేమము కలుగదు. అనియిట్లు ప్రతిబుద్ధుడై క్షరత్వ-వ్యక్తత్వ-సగుణత్వ-స్థితులను వదలి అక్షరత్వ-అవ్యక్తత్వ-నిర్గుణత్వ-స్థితికి చేరును.

ఓ జనక మహారాజా! నీకు ఇట్లు క్షరాక్షరతత్త్వ వివేచన ప్రకారమును ప్రతిపాదించితిని. ఇది సంశయ రహితము. విమలము-విశుద్ధము-సూక్ష్మము. పరంపరాగతమగు-సంప్రదాయ సిద్ధమైన-మతియొక అంశము చెప్పెదను. వినుము-సాంఖ్యము యోగము అను రెండు దర్శనములను నీకు తెలిపితినికదా. వానిలో సాంఖ్యమే యోగము. యోగమే సాంఖ్యము. సాంఖ్య దర్శనము శిష్యుల-ముముక్షువుల హితమునుకోరి తత్త్వమును విస్పష్టముగా వివేచించి ప్రతిపాదించును. విద్వాంసులగువారు ఈ శాస్త్రము చాల గొప్పది అని చెప్పుదురు. ఈ శాస్త్రములో ప్రతిపాదించిన విషయమునే యోగ దర్శనమున పునర్భవ పురఃసరముగా-అనగా అనుభవ పూర్వకముగా అందుకొను విధానము అధ్యయనము చేయబడుచున్నది.

ఇంతవరకును సాంఖ్యుల పరమార్థతత్త్వ వివేచన ప్రకారము శాస్త్ర ప్రమాణానుసారము అనువర్ణించితిని. బుద్ధము-అప్రతిబుద్ధము; అక్షరము-క్షరము-ఈ రెండును వీటికి రెంటికి నడుమనున్న బుధ్యమానము అను మూడు తత్త్వములును సాంఖ్య దర్శనమున వివేచించబడును. బుద్ధము-అనగా బోధాత్మకమగు పరమార్థతత్త్వము. అప్రతిబుద్ధమనగా అపరా ప్రకృతికి మూలమగు మాయాతత్త్వము. బుధ్యమాన మనగా ముముక్షుని శ్రవణమననాది విచారణావస్థయును ఆత్మ దర్శనమును కోరి యోగసాధన చేయు దశయును. యోగ దర్శనమునందు బుధ్యమానత్వ బుద్ధత్వ దశలు మాత్రము అనుభవ దశలో ప్రతిపాదింపబడును. (244)

వసిష్ఠ జనక సంవాద ఉప సంహారము

అప్రబుద్ధావస్థలోనుండు జీవుడు అవ్యక్తమును నిర్గుణమునునగు ఇరువది యైదవ తత్త్వమును కూడ సగుణతత్త్వముగా భావించును. ఆ తత్త్వమునందు ఆరోపింపబడు గుణములను సృజించుచు ఉపసంహరించుచు ఉన్నట్లు కల్పన చేసికొనును. ఓ జనకరాజా! ఆ మూలతత్త్వము అజము-జన్మరహితము-ఐనను క్రీడార్థమై వికారములను పొందుచున్నాడు. తన్నుతాను అనేక తత్త్వముల రూపమున కల్పించుకొని నానా రూపములను పొందినవాడు వలె చెప్పబడుచున్నాడు. ఇట్లు వికృతి నొందుచుండియు, ఇట్లని వాస్తవ స్థితిని ఎరుగలేకున్నాడు. అవ్యక్తతత్త్వస్వరూపము ఇదియని తత్త్వ బోధ చేయబడినపుడు జ్ఞాన సాధనదశలో అతడు బుధ్యమానుడు, బోధమును, జ్ఞానమును అందుకొనుచున్నవాడు అని వ్యవహరింపబడుచున్నాడు. కాని ఇట్లు బోధింపబడుచుండియు సగుణమైనదివలె కనబడు ఈ అవ్యక్త తత్త్వమును వాస్తవమున నిర్గుణమైనదానినిగా గుర్తింపలేక పోవుచున్నాడు. ఇరువది యైదవదియగు ఈ అవ్యక్త తత్త్వ స్వరూపమును దాని నిర్గుణత్వమును ఒకానొకప్పుడు ఈతడు తెలిసికొనగలిగిన యెడల ప్రతిబుద్ధుడు అని వ్యవహరింపబడును. బుధ్యమాన దశలో జీవుడు మమకారావృతుడు. అన్ని తత్త్వములకును అతీతమగు ఇరువది ఆరవ తత్త్వము విమలమును బుద్ధమును-జ్ఞానాత్మకమును-అప్రమేయమును. ఇట్టిది అని ఎరుగ శక్యముకానిది-సనాతనము-శాశ్వతమైనది. దానిని గుర్తింపగలిగినప్పుడు సృష్టి ప్రళయ ధర్మయుక్తమగు ఇరువది యైదవ తత్త్వముగా నుండుటను గూడ అతిగతమై అత్యున్నత దశనందుకొనును. అప్పుడీతడు వస్తుతః గుణ రహితమును జడమునునగు ప్రకృతిని సగుణత్వము నొందిన దానినిగా గుర్తెరుగును. తాను కేవల జ్ఞానాత్మకుడై అవ్యక్త తత్త్వమును గూడ వాస్తవ రూపమున దర్శింపగలుగును.

ఓ రాజా ! తత్త్వముల నాశ్రయించిననే కాని నరుడు తత్త్వజ్ఞుడు కాజాలడు. నాయనా! తత్త్వజ్ఞుడు సంసారగతులలో మునుగడు. తత్త్వము లిరువది యైదని విద్వాంసులు చెప్పుచున్నారు. వీని లక్షణమును తెలిసికొన్నచో వీటి మూలతత్త్వమును కూడ చేరగలుగును. ఏలయన-ఇరువది ఆరవది సర్వ మూలతత్త్వము. ఇతడు ఇదియే ఇరువది ఆరవ తత్త్వమని సరిగా గుర్తించినచో జరామరణములు లేక శుద్ధయోగ బలముచే సమతాస్థితిని పొందును. సందేహములేదు. ఐనను అజ్ఞానానికి జ్ఞానబోధ చేయుటకై తత్త్వములు ఇరువదినాల్గే అని ఇరువదియైదే అని ఏకత్వమునుండి నానాత్వము జరిగిన విధము ఇది అని సాంఖ్యదర్శనము. ఎపుడు చేతనతత్త్వము కూడిన ఈ పంచ వింశతితమ

తత్త్వముయొక్క ఏకత్వము బుద్ధియందు స్థిరమై అవగతమై నిలుచునో అపుడు ముముక్షువు సమత్వము పొందును. ఏలయన నిఃసంగుడై యుండియు పరమాత్ముడు మాయాకృతమైన సంగవశమున సంసారములో పరిభ్రమించుచున్నాడు. మాయ దూరమైనపుడు ముక్తినందు చున్నాడు. నిఃసంగరూపుడగు పంచ వింశతి తమ తత్త్వమును ఎరిగిన తరువాత అజుడగు-జన్మరహితుడగు-ఆ ఇరువదియారవ తత్త్వము నెరుగగలుగును. అవ్యక్త తత్త్వము నెరుగుట చేతనే ఈ పరమ విబోధము-జ్ఞానము-కలుగును. చతుర్వింశతి తత్త్వముల నెరుగుట కూడ ఈ ఇరువది ఆరవ తత్త్వము నెరిగి ముక్తిని అందుటకు సాధనమే. ఓ అనఘుడవగు జనకరాజా! నీకు ఇట్లు సాంఖ్య విధానమున బుద్ధ, బుధ్యమాన, అప్రతిబుద్ధుల లక్షణమును తెలిపితిని. ఈ తెలిపిన తత్త్వముల నానాత్వము, ఏకత్వముల సంబంధము చేపకు నీటికిని-మేడికాయకు దానియందలి పురుగులకునుగల సంబంధము వంటిది. జ్ఞానము విజ్ఞానము అని వ్యవహరింపబడు ముక్తి స్వరూపమిదియే. ఈ దేహమున సాక్షితత్త్వముగా నున్న ఇరువది ఐదవ అవ్యక్త తత్త్వము నెరుగనిదే ముక్తికలుగదు. ఈ ఇరుది ఆరవ తత్త్వము పరతత్త్వము-పరమగు ధర్మము కలిగినది; ఏ మాత్రమును అశుద్ధము కాని శుద్ధతత్త్వము; విశుద్ధమగు ధర్మముకలది; జ్ఞానశాలి; జ్ఞానాత్మకుడు; వాస్తవమున ఆలోచించినచో సర్వ ధర్మముల నుండి విముక్తుడు; కాని సంయోగ వియోగ ధర్మములుకల ఈ చతుర్వింశతి తత్త్వాత్మకమగు ఈప్రకృతితో సంబంధము కలుగుటవలన బుద్ధుడైనందున మరల దాని నుండి విడివడినప్పుడు ముక్తి నందెనని వ్యవహరించుట, వాస్తవమున అతనికి బంధము మోక్షములేవు. అట్లతడు విమోక్షిగా-శుచికర్మునితో కలిసి శుచిగా విమలాత్మునితో కలిసి విమలాత్ముడుగా కేవలునితో కలిసి కేవలాత్ముడుగా అగుచున్నాడు. స్వతంత్రునితో కలిసి స్వతంత్రుడై స్వాతంత్ర్యమును పొందుచున్నాడు.

ఓ మహారాజా! ఇంతవరకు నేను నీకిట్లు యథార్థతత్త్వము తెలిపితిని. నీవును విశుద్ధమును ఆద్యమును సనాతనము-శాశ్వతమును-అగు బ్రహ్మ తత్త్వమును అమత్సరు డవై-మనో దోషములేవియు లేనివాడవై ప్రతిగ్రహించితివి. నీవును ఈ పరమ విద్యాను శాసనమును వేదనిష్ఠ-వేదముల యందును శాస్త్రముల యందును ప్రామాణ్యబుద్ధి-కలిగి ప్రబోధము నొందుటకై ప్రణతుడై తెలిసికొనగోరి అడిగిన వానికి మాత్రమే ఈయ వలెను. అసత్యవాది, మోసగాడు, కపటబుద్ధి, అసమర్థుడు, జ్ఞానపరులగు పండితులను నొప్పించువాడు అగువానికి ఈయరాదు-శిష్యులకు జ్ఞానము కలిగించుటకై నీవీ విద్యను శ్రద్ధ కలవాడు సద్గుణవంతుడు పరనిందచేయనివాడు వివేచనతో కూడిన శీలము కలవాడు వేదశాస్త్ర విధియందు ప్రీతికలవాడు వివాదములు చేయనివాడు అనేక శాస్త్రములను

పెద్దల వలన వినినవాడు వినయమును తెలుపు వేషముకలవాడు హేతువాదము చేయని వాడు ఇట్టివానికి మాత్రమే తెలుపవలయును. విశుద్ధమగు పరబ్రహ్మ తత్త్వమును ఈ సద్గుణములు లేనివాని కీయరాదు. ఇచ్చినచో అపాత్ర దానమువలన ప్రవచనము చేసిన గురువునకు కూడ శ్రేయస్సు కలుగదు. వ్రతనియమములు లేనివాడు తాను సమస్త రత్న ములతో ఈ భూమినంతటికి విద్యకు ప్రతిఫలముగా ఇత్తును అనినను, అట్టివానికీ విద్యను బోధించరాదు. ఓ నరేంద్రా! తత్త్వమునెరుగగోరి జితేంద్రియుడై ప్రయతుడైన-ఇంద్రియ నిగ్రహము శుచిత్వము కలిగిన-వానికి మాత్రమే ఇది బోధించవలెను. ఓ జనకా! నీవు పరమ పవిత్రమును అత్యంతము శోక రహితమును అనాది మధ్యమును అగు బ్రహ్మ తత్త్వమును వాస్తవముగ ప్రవచించగా వింటివి. నీకిక సంసార భయములేదు. ఈ తత్త్వము అగాధము, అజరామరము, దోషరహితము, భయరహితము, శుభకరము, పరవాదము అనుపేరుగల ఈ తత్త్వార్థము తెలిసికొని మోహస్వరూపమును గుర్తించి విడువుము.

ఓ రాజా! పూర్వము హిరణ్యగర్భబ్రహ్మ సనాతన పరమాత్మ నుండి ఈ విద్యను గ్రహించెను. మహా తేజస్వియగు ఆ బ్రహ్మనుండి నేను ఆయనను అనుగ్రహింపజేసికొని గ్రహించితిని. నీవడిగినందున నేను నీకిది ప్రతిపాదించితిని. ఇదియు నేను బ్రహ్మ వలన ఎంత ఎట్లు తెలిసికొంటినో అంతయు అట్లే తెలిపితిని కాని ఏ మాత్రము మార్పులు చేర్పులు చేయలేదు.

వ్యాసుడిట్లు మునులతో పలికెను :

ఓ మునిశ్రేష్ఠులారా! వసిష్ఠుడు పంచవింశతితమ తత్త్వసంబంధియగు తత్త్వమును ఇట్లు తెలిపెను. ఈ తత్త్వమును ఎరిగి దాని ద్వారమున షడ్వింశ ఇరువది ఆరవ తత్త్వమును చేరినవారికి జనన మరణ రూప సంసారములో పునరావృత్తి యుండదు. ఇది పరమమగు జ్ఞానము. దీనిని మించిన జ్ఞానము లేదు. ఇది ఎరిగిన వారు అజరామరమగు తత్త్వము చేరుదురు. ఓ ద్విజులారా! నిఃశ్రేయస్కరమగు ఈ పరమ జ్ఞానమును దేవర్షియగు నారదునివలన విని నేను ఉన్నదున్నట్లు మీకు తెలిపితిని. ఏలయన-హిరణ్య గర్భుని నుండి వసిష్ఠుడును అతని నుండి నారదుడును అతనినుండి నేనును వింటిమి. దీనిని వినినందున మీకును సంసారమువలన శోకము కలుగదు. క్షరాక్షర తత్త్వముల భేదాభేదము నెరిగిన వారికి భయముండదు. ఎరుగని మూఢాత్ముడు మాత్రము అనేక జన్మ పరంపరల నొంది మరల మరల ఉపద్రవముల పొందును. జననము, మరణము, దేవలోకము,

నరకలోకము, తిర్యగ్యోనులు, మనుష్యజన్మము, ఇదే క్రమమున పునఃపునరా వృత్తి పొందును. అవ్యక్తాగాధమగు అజ్ఞాన సముద్రమున మునుగును.

ఓ ముని శ్రేష్ఠులారా! నేనిట్లు మిగుల సారతమమగు పరతత్త్వమును మీకు తెలిపితిని. దీనిని తెలిసికొనినవారు పరమ మోక్షమును పొందుదురు. మరల జననమరణ పునరావృత్తి పొందరు. ఓ విప్రులారా! దీనిని నాస్తికుడు అభక్తుడు దుష్టమతి శ్రద్ధారహితుడు అగువానికి తెలుపరాదు. (245)

బ్రహ్మపురాణ ప్రశంస-ఫలశ్రుతి

రోమహర్షణుడు మునులతో ఇట్లు పలికెను :

ఓ బ్రాహ్మణులారా! పూర్వము మహామతియగు వ్యాసమహాముని శాస్త్రమునందు చెప్పబడినవియు ఉచ్చారణమునకు సంబంధించినవియు (వ్యాకరణ భాష్యమునందు చెప్పబడి ఉన్నవి). అగు పదునెనిమిది దోషములు లేనివియు మిగుల సారభూతములును దోషములు లేనివియు శుద్ధములును అనేక శాస్త్ర సముదాయ రూపములును అయిన వాక్యములతో నిండినదియు స్వభావము చేతనే శుద్ధమగు విషయ సమాయోజనముతో కూడినదియు సాధువులగు-వ్యాకరణ విరుద్ధములును శిష్టులకు అసమ్మతములును కాని - శబ్దములతో ఉపశోభితమును పూర్వపక్ష వచనములతో సిద్ధాంత వ్యవస్థాపనముతో కూడినదియు అగు ఈ బ్రహ్మపురాణమును శాస్త్ర న్యాయానుసారముగ నుండునట్లు మృదువగు వాక్కుతో వినిపించి ముగించెను. ఆ ముని శ్రేష్ఠులును వేదములతో సమానమును సర్వవాంఛా ఫలప్రదమును ఆద్యమును అగు బ్రహ్మ పురాణమును విని హర్షమును ప్రీతిని ఆశ్చర్యమును పొందినవారై కృష్ణద్వైపా యన వ్యాసమహామునిని మరలమరల ప్రశంసించిరి.

మునులు వ్యాసుని ప్రశంసించిన విధము :

ఎంత ఆశ్చర్యమిది! ఓ మునిశ్రేష్ఠా! మీరు వేదములతో సమానమును సర్వాభీష్ట ఫలప్రదమును సర్వ పాపహరమును ఉత్తమమును విచిత్ర పదములతో అక్షరములతో కూర్చబడినదియు అగు పురాణమును ప్రవచింపగా మేము వింటిమి. ఓ ప్రభూ! త్రిలోకముల యందును మీకు తెలియనిది ఏదియులేదు. మీరు దేవతలలో బృహస్పతి వంటివారు. ఓ మహాభాగా! తాము సర్వజ్ఞులు. మహా ప్రాజ్ఞులును బ్రహ్మ తత్త్వజ్ఞులలో శ్రేష్ఠులును మహామునియునగు మీకు నమస్కరించుచున్నాము. తాము భారతము నందు

వేదములందు ప్రతిపాదింపబడిన విషయములను అనేకములను ప్రతిపాదించితిరి. ఓ మహామునీ! తాము ప్రతిపాదించిన సర్వగుణములను ఎవరు చెప్పగలరు? షడంగములతో కూడ వేదములను నాల్గింటిని వ్యాకరణములను అధ్యయనముచేసి భారతమును రచించిన జ్ఞానస్వరూపుడగు వ్యాసునకు నమస్కారము. భారతమను తైలముతో నింపబడిన జ్ఞానమయమగు ప్రదీపమును వెలిగించిన వాడవును, విశాలబుద్ధి కలవాడవును వికసించిన పద్మముల తేకులవలె విశాలములగు కన్నులు కలవాడవును అగు ఓ వ్యాసా! నీకు నమస్కారము. అజ్ఞానమను తిమిరముచే గ్రుడ్డివారై కుదృష్టులచే భ్రాంతి నొందింపబడిన వారి నేత్రములను జ్ఞానమను కాటుకతోకూడిన శలాకతో మీరు విప్పారించితిరి" అని వారందరును ఇట్లు పలికి వ్యాసుని పూజించి కృతార్థులై తాము తాము వచ్చిన మార్గముల తమ తమ ఆశ్రమములకు వెళ్ళిరి.

ఓ ముని శ్రేష్ఠులారా! సనాతనమును-శాశ్వతములగు ధర్మములను ప్రతిపాదించు నదియు-సర్వపాప ప్రణాశనమును మహాపుణ్య ప్రదమును అగు ఈ పురాణమును మీకు చెప్పితిని. మీరు అడిగిన ప్రశ్నముల ననుసరించి దానికి అంతటికిని సమాధానమును వ్యాసుని అనుగ్రహమువలన ప్రతిపాదించితిని.

ఇది బ్రహ్మచారులును గృహస్థులును యతులును కూడ శ్రవణము చేయదగినది. పవిత్రము. నరులకు ధనసౌఖ్యప్రదము; పాపనాశనము. బ్రహ్మతత్త్వము నెరుగగోరిన బ్రాహ్మణాది వర్ణములవారందరును శ్రేయోఽభికాంక్షులగువారును ప్రయత్నముతో లెస్సగా దీనిని వినవలెను. అందువలన బ్రాహ్మణుడు విద్యను క్షత్రియుడు రణమున విజయమును వైశ్యుడక్షయ ధనమును శూద్రుడు సుఖమును పొందును. పురుషుడు శుచి మనస్కుడై ఏఏకోరికను అభిధ్యానించుచు ఈపురాణమును వినునో ఆ కోరికనెల్ల పొందును. అందు సందేహము లేదు. ఈ పురాణము విష్ణుని పరమ దైతముగా ప్రతిపాదించునది. సర్వపాప నాశనము. పురుషార్థముల నన్నింటిని సంపాదింపజేయునది. అన్ని శాస్త్రముల కంటె విశిష్ట మయినది. నేను మీకు వినిపించిన వేదసంమితమగు ఈ పురాణము వినినవారికి సర్వ దోషముల వలన కలిగిన పాపరాశియు నశించును. ప్రయాగ పుష్కర కురుక్షేత్రార్బుద క్షేత్రములందు ఉపవసించుట వలన కలుగు పుణ్యము కలుగును. నరుడు సంవత్సరము పాటు అగ్ని హోత్రమును చక్కగ వేల్చుటవలన కలుగు సుమహాపుణ్యము కలుగును. జ్యేష్ఠకు శుక్లైకాదశినాడు మధురలో యమునా జలమున స్నానముచేసి శ్రీకృష్ణుని దర్శించుటచే కలుగు ఫలము కలుగును. కేశవునియందు మనస్సు అర్పించి నిలిపి-సరియగు మనస్సమాధానముతో హరికీర్తనము చేయుటచే కలుగు ఫలము ఈ

పురాణశ్రవణము నందు(ని)హితమై-నిలుపబడి యున్నది. దీని శ్రవణము వలన యజ్ఞక్రియా దర్శనముచే కలుగు ఫలము కలుగును. వేదసదృశమగు ఈ పురాణమును పఠించినను విన్నను అతడు విష్ణులోకమునకు ఏగును. ఏకాదశి ద్వాదశి వంటి పర్వదినములందు శుచియై బ్రాహ్మణులచే ఈ పురాణమును వినిపించిన-వినిపించుకొనిన-వారు విష్ణు లోకమునకు పోవుదురు. ఇది యశమును ఆయువును సుఖమును కీర్తిని బలమును పుష్టిని కలిగించును. ధన్యునిగా చేయును. దుఃస్వప్నముల నశింపజేయును. చక్కని మనస్సమాధానముతో శ్రద్ధతో ఈ శ్రేష్ఠమగు ఆఖ్యానమును వినినవారు సర్వములగు ఈప్సితములను పొందుదురు. రోగార్తుడు రోగము నుండి బద్ధుడు బంధనము నుండి బీతుడు భయము నుండి ఆపన్నుడు ఆపదల నుండి విముక్తుడగును. నరుడు పూర్వజన్మ స్మృతిని విద్యను పుత్రులను మేధను పశువులను ధైర్యమును ధర్మార్థ కామ మోక్షములను ఇంతయే కాదు ప్రయతమగు, శుచియగు, మనస్సుతో ఏకోరికలను సంకల్పించి వినుతో ఆ కోరికలనెల్ల పొందును. అందు సందేహమే లేదు. స్వర్గమోక్షప్రదుడును లోకములకు గురుడును (తల్లి తండ్రి విద్యను ఉపదేశించిన వాడు హితమును ఉపదేశించువాడు ఇట్టివారు గురువులు అనబడుదురు). వరములను ఇచ్చువాడునగు విష్ణునికి నమస్కరించి భక్తియుక్తమగు ఏకచిత్తముతో శుచియై ఈ పురాణమును నిరతమును వినువారు సమస్త పాపములను నశింప జేసికొని ఇహలోకమున సమస్త సుఖములను అనుభవించి స్వర్గమున దివ్యసుఖమును పొంది, కడపట ఈ ప్రకృతి జన్యములగు గుణములనుండి విడుదలపొంది, ముక్తులై మిగుల విమలమగు శ్రీహరి స్థానమును చేరుదురు. అందువలన స్వధర్మ నిరతులును ముక్తిమార్గమును మాత్రమే కోరువారును అగు బ్రాహ్మణ శ్రేష్ఠులును, నియమపరులును, శాశ్వత శ్రేయస్సును కోరువారునగు క్షత్రియ పుంగవులును, విశుద్ధ వంశమున జన్మించిన వైశ్యులును, ధార్మికులగు శూద్రులును, ఉత్తమమును బహుఫలప్రదమును ధర్మార్థమోక్ష ప్రదమునగు ఈ పురాణమును అనుదినమును వినవలయును.

పురుషోత్తములగు మీకందరకును ధర్మమునందు బుద్ధి స్థిరమగు గాక! పరలోకమునకు మీరు ఏగినప్పుడు మీకు బంధువు అది ఒక్కటియే. అర్థ కామములను రెండు పురుషార్థములను మీరు ఎంత జాగరూకులై సేవించినను, అవి మీ పై సత్ఫలమును చూపజాలవు. వాని ఫలములు స్థిరములై ఉండవు.

ధర్మముచే నరుడు రాజ్యమును స్వర్గమును ఆయువును కీర్తిని తపస్సును దానిచే మోక్షమును పొందును. ఇహమునను పరలోకమునను ధర్మము తప్ప మఱింకేదియులేదు అగును. ధర్మమే తల్లి దండ్రులును, మిత్రుడును, రక్షకుడును, మోక్ష ప్రదమును.

ఈ పురాణము రహస్యము, శ్రేష్ఠమును, వేదములతో సమానమును, బుద్ధి దోషము కలవానికిని-విశేషించి నాస్తికునకును-ఇంద్రియ గోచరముకానిది ఏదియు నమ్మ తగినది కాదనువానికిని-దీనిని అందించరాదు.

ఇదం మయోక్తం ప్రవరం పురాణం
పాపాపహం ధర్మవివర్ధనంచ
శ్రుతం భవద్భిః పరమం రహస్యమ్
ఆజ్ఞాపయధ్వం మునయో వ్రజామి

శ్రేష్ఠమును పాపనాశకమును, ధర్మమును వృద్ధి చేయునదియు అగు ఈ పురాణమును నేను ప్రవచించితిని. పరమ రహస్యమగు దీనిని మీరు వింటిరి. అయ్యా! పోయి వచ్చెదను. ఆజ్ఞ ఇండు అని లోమహర్షణుడు సెలవు తీసుకొనెను.

ఆది బ్రాహ్మ పురాణము సమాప్తము